2

# కథ నేపథ్యం

34 మంది కథకుల ఉత్తమ కథలు వాటి నేపథ్యాలు



తానా ప్రచురణలు

# కథ
# నేపథ్యం

రెండవ భాగం

## సంపాదకుల పరిచయం

**ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు** 18 మార్చి 1964లో నెల్లూరు జిల్లా మన్నార్ పోలూరులో జన్మించారు. సీనియర్ జర్నలిస్టు. *బిడ్డలు గల్ల తల్లి, మొగుడూ పెళ్లాల ప్రేమకత, ఒంటేపమాను* మొదలైన పది కథలు రాశారు. జర్నలిస్టుగా *ఈనాడు*లో చేరి, ఆ తర్వాత *ఉదయం, వార్త* పత్రికలలో పనిచేశారు. ప్రస్తుతం *ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఎబిఎన్ ఆంధ్రజ్యోతి* ఛానెల్‌కు రాయలసీమ ప్రాంత బాధ్యులు. గ్రామీణ జర్నలిజం మీద ప్రత్యేక కేంద్రీకరణతో పనిచేస్తున్నారు. ఉత్తమ గ్రామీణ జర్నలిస్టుగా 2007 సం॥లో ప్రముఖ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ ద్వారా పురస్కారం అందుకున్నారు. నివాసం తిరుపతి.

**డాక్టర్ జంపాల చౌదరి** పశ్చిమ గోదావరి జిల్లా చాటపర్రులో జన్మించారు. గుంటూరులో ఎం.బి.బి.ఎస్. చదివిన అనంతరం అమెరికా వెళ్ళి మానసిక వైద్యంలో ఉన్నతవిద్యను అభ్యసించి, ప్రస్తుతం చికాగో మెడికల్ స్కూల్‌లో సైకియాట్రీ ప్రొఫెసర్‌గా, లోవెల్ ఫెడరల్ హెల్త్‌కేర్ సెంటర్‌లో మెంటల్ హెల్త్ సర్వీసెస్‌కి చీఫ్‌గా పనిచేస్తున్నారు. అమెరికాలోని వివిధ తెలుగు సంఘాలలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. ముఖ్యంగా తానా సంస్థలో. ప్రస్తుతం తానా కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు. 2015లో తానా అధ్యక్ష పదవి స్వీకరించబోతున్నారు. ఇంతకు ముందు తానా పాలకమండలి అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. తానా పబ్లికేషన్స్ కమిటీ ఛైర్ పర్సన్. దాదాపు 12 సంవత్సరాలు తానా పత్రికకు ముఖ్య సంపాదకులుగాను, 1995, 1999, 2009 తానా సావనీర్‌లకు సంపాదకులుగాను ఉన్నారు. 2004లో అమెరికాలోని తెలుగు వారి కోసం తెలుగునాడి అనే మాసపత్రికను ప్రారంభించి ఐదు సంవత్సరాల పాటు ముఖ్య సంపాదకులుగా ఉన్నారు. రెండు *దశాబ్దాలు* కథాసంకలనం సంపాదకులు. భార్య అరుణ, పిల్లలు వేమన, నన్నయలతో చికాగో దగ్గర్లోని మండలైన్‌లో నివాసం.

**వాసిరెడ్డి నవీన్** 23 మే 1954న కృష్ణాజిల్లాలో జన్మించారు. 1980 నుంచి 1990 వరకు జనసాహితీ సాంస్కృతిక సమాఖ్య నడుపుతున్న సాహిత్య మాసపత్రిక ప్రజాసాహితికి సంపాదకులుగా ఉన్నారు. 1981లో జనసాహితి ద్వారా వెలువడి, తిరిగి 2008లో డిట్రాయిట్ తెలుగు లిటరరీ అసోసియేషన్ ద్వారా పునర్ముద్రింపబడిన ***తెలంగాణ పోరాట కథలు***, హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ వారి ***తెలుగుకథ 60-85*** కథా సంకలనాలకు సంపాదకులు. 1990 నుంచి కథాసాహితి వెలువరిస్తున్న **కథ** సంకలనాలకు సహ సంపాదకులు. కొన్ని సంవత్సరాల పాటు వివిధ పత్రికల్లో తెలుగు కథల పై వార్షిక సమీక్షలు, కథాసాహిత్యం పై కొన్ని వ్యాసాలు ప్రచురించారు. నివాసం హైదరాబాదు.

# కథ నేపథ్యం

రెండవ భాగం



*

*సంపాదకులు*

**ఆర్.యమ్. ఉమామహేశ్వరరావు**

**జంపాల చౌదరి**

**వాసిరెడ్డి నవీన్**

*



తానా
ప్రచురణలు



Artist: C. Jagadish

# KATHA - NEPATHYAM

*Collection of short stories with notes on background by authors*

***Vol. 2***

***Released***
**on 21st August 2014 at Hyderabad**
**by Beenadevi**
*First Publication: August, 2014*

*Publication Number: 004*

***Writers in this collection***
Ajayprasad, Attada Appalnaidu, Allam Rajaiah, Ari Sitaramaiah, R. Vasundhara Devi, R.M. Uma Maheshwara Rao, Olga, Kanneganti Chandra, Katragadda Dayanand, Kaluva Mallaiah, Kuppili Padma, K. Varalakshmi, Geetanjali, Gorusu Jagadeeshwara Reddy, Ganteda Gouru Naidu, Chilukuri Devaputra, Chandralatha, P. Chandrasekhara Azad, Tummeti Raghottama Reddy, Toleti Jaganmohana Rao, Dasari Amarendra, Peddinti Ashok Kumar, Bammidi Jagadeeshwara Rao, Madhurantakam Narendra, Mohd. Khadeer Babu, Mahendra, Dr. V. Chandrasekhara Rao, Dr. V.R. Raasani, Veluri Venkateshwara Rao, Ramanajeevi, Sannapureddy Venkatarami Reddy, Swamy, C. Ramachandra Rao

*Editors*
**R.M. Umamaheswara Rao**
**Jampala Chowdary**
**Vasireddy Naveen**

*Publication*
**TANA (Telugu Association of North America) Publications**
20374 Buckthorn Court, Mundelein, Illinois, 60060, USA

*Local Address*
AG-2, 'A' Block, Mathrusri Apts.,
Hyderguda, Hyderabad - 500 029.
Ph.: 040-2324 4088

*Cover Masks*
**Nakashi Nageshwar of Cherial**

*Copies available at*
**Visalandhra Book House,** Bank Street, Hyderabad and its Branches in A.P., **Navodaya Publishers,** Eluru Road, Vijayawada, **Navodaya Book House,** Kachiguda, Hyderabad, **Telugu Book Shop,** Kachiguda, Hyderabad, **Prabhava,** Pogathota, Nellore.

*e-book:* **www.kinige.com**

*Composed & Designed at* **Akshara Creators,** Mathrusri Apts., Hyderguda, Hyderabad-500029. India Ph.: 040-2324 4088.

*Printed at* **Charita Impressions.** Azamabad Industrial Area, Hyderabad, India. Ph.: 040-2766 78411

**₹ 350** **$ 25**

## తానా ప్రచురణల గురించి...

*తెలుగు భాష, సంస్కృతులను పోషించి, పరిరక్షించుకోవాలన్న ఆశయంతో **1977**లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం **(తానా)** ఆవిర్భవించింది. గత మూడున్నర దశాబ్దాలుగా ఈ ఆశయసిద్ధికై అమెరికాలోనూ, తెలుగు నేలపైనా అనేక కార్యక్రమాలకు తానా మద్దతునిస్తోంది. ప్రచురణలో లేని, ప్రచురణ కాని ముఖ్యమైన తెలుగు పుస్తకాలను ఉత్తమ ప్రమాణాలతో ప్రచురించి పాఠకులకు అందు బాటులోకి తేవాలన్న ముఖ్య ఉద్దేశంతో తానా ప్రచురణలు ప్రారంభ మయ్యాయి. శ్రీ కొడవళ్ళ హనుమంతరావు వితరణ, శ్రీ 'నవోదయ' రామ్మోహనరావు, శ్రీ వాసిరెడ్డి నవీన్‌ల సహృదయత, శ్రమదానం, తానా కార్యవర్గం, తానా ఫౌండేషన్, మరెందరో హితోభిలాషుల సహ కారంతో ప్రారంభమైన ఈ ప్రయత్నం మరిన్ని మంచి పుస్తకాలను మనకందరికీ అందిస్తుందని మా ఆశ.*

**జంపాల చౌదరి**
**అధ్యక్షుడు**
**తానా ప్రచురణల సంఘం**

## కృతజ్ఞతలు

ఎప్పుడో ఆంధ్రజ్యోతిలో అచ్చయిన కథానేపథ్యాలన్నీ సేకరించి అందించిన గొరుసు జగదీశ్వరరెడ్డికి...

ఈ సంపుటి కోసం అడిగిన వెంటనే తమ కథల నేపథ్యాలను రాసిచ్చిన అజయ్‌ప్రసాద్, అల్లం రాజయ్య, ఆర్. వసుంధరాదేవి, ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు, కన్నెగంటి చంద్ర, కాట్రగడ్డ దయానంద్, గొరుసు జగదీశ్వరరెడ్డి, పెద్దింటి అశోక్‌కుమార్, మహమ్మద్ ఖదీర్‌బాబు, వేలూరి వేంకటేశ్వరరావు, రమణజీవి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, సి. రామచంద్రరావు గార్లకు...

అడిగిన వెంటనే కథల వివరాలను అందించిన కథానిలయానికి...

ముఖచిత్రానికి మాస్కల చిత్రాలు అందించిన నాగేశ్వర్‌కి...

ఈ పుస్తకాన్ని అందంగా డిజైన్ చేసిన అక్షర సీతకి...

అచ్చు వేసిన చరిత ప్రెస్ పరుచూరి సుబ్బయ్యకి...

# నేపథ్యం

ఆంధ్రజ్యోతి ఆదివారం పత్రికలో కథానేపథ్యం శీర్షికతో 17 ఆగస్టు 1997 నుంచి 21 జూన్ 1998 వరకు 34గురు ప్రసిద్ధ కథకులు తమ కథ నొకదాన్ని ఎన్నుకుని ఆ కథ నేపథ్యాన్ని వివరించారు. ఆ నేపథ్యాలను, కథలతో పాటు పుస్తకరూపంలో పదిమందికి చేర్చితే పాఠకులకు ఆసక్తిగాను, ఔత్సాహిక రచయితలకు ప్రేరణగానూ ఉంటుందని మా ఆలోచన. ఈ 34 నేపథ్యాలకూ, ఇంకొందరు ప్రసిద్ధ, వర్ధమాన రచయితల కథల నేపథ్యాలు కూడా చేర్చగలిగితే ఇంకొంత ఉపయుక్తంగాను, మరింత సమగ్రంగానూ ఉంటుందనిపించి, మరికొంతమంది రచయితలని కూడా వారి కథల నేపథ్యాల గురించి వ్రాయమని అభ్యర్థించాము. అన్నీ కలుపుకుంటే పుస్తకం 900 పుటలు దాటటంతో, రెండు భాగాలుగా వెలువరించాము.

మొదటిభాగం జనవరి 3, 2013న విజయవాడ పుస్తక మహోత్సవంలో నవోదయ రామ్మోహనరావుగారు ఆవిష్కరించారు. ఇందులో 25 కథకుల కథలు, నేపథ్యాలు ఉన్నాయి. *కథ-నేపథ్యం* రెండవభాగం ఆగస్టు 21, 2014న హైదరాబాద్‌లో బీనాదేవిగారు ఆవిష్కరించారు. ఈ రెండవభాగంలో 34 కథకుల కథలు, నేపథ్యాలు ఉన్నాయి. మొదటిభాగంలో ప్రచురింపబడ్డ ముందుమాటలే రెండవ భాగంలోనూ పొందుపరచబడ్డాయి.

# కథల పుట్టుక

## జంపాల చౌదరి

చిన్నప్పట్నుంచీ నాకూ కథలంటే ఇష్టం. ఆ రోజుల్లో కథలంటే అనగనగా ఒక రాజు, ఆ రాజుకి ఇద్దరు భార్యలంటూ మొదలయ్యేవి. పెరుగుతున్నకొద్దీ చదువుతున్న, ఇష్ట పడుతున్న కథల తత్వం మారుతూ ఉన్నా, కొన్ని ప్రశ్నలు చిన్నప్పట్నుంచీ మిగిలి పోయాయి.

కథలు ఎలా పుడతాయి? మామూలు కథల పుట్టుకకు, మంచి కథల పుట్టుకకు తేడా ఏమన్నా ఉంటుందా? కొన్ని కథలు, ముఖ్యంగా గాఢంగా ముద్రవేసిన కథలు, ఎక్కడ నుంచి వచ్చాయో, ఎలా వచ్చాయో తెలుసుకోవాలన్న కుతూహలం పాఠకుడిగా, మానసిక శాస్త్ర విద్యార్థిగా తరచు కలుగుతూ ఉంటుంది. రచయితలను కలిసినప్పుడు, చాలా మంది పాఠకుల్లాగే, నేను కూడా వారి కథల గురించి మాట్లాడుతూ, ఆ కథల మూలాల గురించి వారి ముఖతా వినేందుకు ప్రయత్నిస్తూ ఉంటాను.

పదేళ్ళ క్రితం ఒక సాయంకాలం హైదరాబాదు ద్వారకా హోటల్లో రచయిత మిత్రులతో మాట్లాడుతున్నప్పుడు కథకుడు, మిత్రుడు గొరుసు జగదీశ్వరరెడ్డి ఇవే ప్రశ్నలు, ఇదే కుతూహలం ఇంకో రచయిత, మిత్రుడు ఆర్.ఎం. ఉమామహేశ్వరరావుకూ ఉన్నాయని, *ఆంధ్రజ్యోతి* ఆదివారం పత్రికలో చాలామంది రచయితల చేత వారి కథల నేపథ్యాల గురించి వ్రాయించి ప్రచురించారనీ చెప్పారు. ఆ నేపథ్యాలన్నిటినీ సేకరించి, పని గట్టు కుని జిరాక్స్ కాపీలు తీయించి, బైండు చేయించి, ఒక సంక్రాంతి ఉదయం నన్ను వెదుక్కుంటూ వచ్చి ఇచ్చారు జగదీశ్వరరెడ్డి. అరుదైన ఈ ప్రయత్నం పుస్తకరూపంలో పదిమందికీ చేరితే ఔత్సాహిక రచయితలకు ప్రేరణలా ఉంటుందని ఆయన ఆకాంక్ష. ఆ నేపథ్యాలన్నిటినీ చదివిన నాకూ అలానే అనిపించింది. ఇన్నాళ్ళకు ఆ పనిని చేయ గలిగాము.

*ఆంధ్రజ్యోతి*లో ప్రచురించిన కథానేపథ్యాలు మొత్తం ముప్పై నాలుగు. 17 ఆగస్ట్ 1997న మధురాంతకం రాజారాంగారి *సర్కస్ డేరా*తో మొదలుపెట్టి, 21 జూన్ 1998న

మధురాంతకం మహేంద్ర ముసలమ్మ మరణం నేపథ్యంతో అంతమయ్యింది ఆ శీర్షిక. ఈ 34 నేపథ్యాలకూ, ఇంకొందరు ప్రసిద్ధ, వర్ధమాన రచయితల కథల నేపథ్యాలు కూడా చేర్చగలిగితే ఇంకొంత ఉపయుక్తంగాను, మరింత సమగ్రంగానూ ఉంటుందనిపించింది. మరికొంతమంది రచయితలని కూడా వారి కథల నేపథ్యాల గురించి వ్రాయమని అభ్యర్థించాము. అన్నీ కలుపుకుంటే పుస్తకం 900 పుటలు దాటటంతో, రెండు భాగాలుగా వెలువరించాలని నిశ్చయించుకొన్నాము. మొదటి భాగంలో లబ్ధప్రతిష్టులైన ముందు తరం కథకుల కథల్నీ, వాటి నేపథ్యాలనూ పరిచయం చేస్తున్నాము.

ఈ సంపుటంలో నాకు చాలాకాలంగా నచ్చిన కథలు ఎన్నో ఉన్నాయి. వస్తుపరంగా, భాషాపరంగా, శిల్పపరంగా ఈ ఉత్తమ కథలు కాలపరీక్షకు కూడా నిలబడ్డాయి. తెలుగు కథలను అభిమానించేవారందరూ చదవవలసిన కథలు ఈ సంకలనంలో ఉన్నాయి. ఈ కథల పూర్వాపరాలను తెలుసుకోవటం పాఠకుల కుతూహలాన్ని కొంతవరకు తీర్చి ఆనందింపజేస్తే, కథలు వ్రాయటంలో ఆసక్తి ఉన్నవారికి విజ్ఞానదాయకంగానూ, ప్రేరణగాను ఉంటుందని మా భావన.

ఇంతకీ కథలు ఎలా పుడతాయి? ఎలా పెరుగుతాయి? ఏ పరిణామక్రమంలో ఏ అండాలు పలుదశలు దాటి అందమైన సీతాకోకచిలుకలుగా మారి రెక్కలు విప్పుకొని మనముందు వాలతాయి? కథలు నిజాలా, కల్పనలా, లేక నిజానిజాల కలగలుపా? నగిషీలతో అలంకరించి మనముందు అందంగా నిలబెట్టిన బొమ్మ పూర్వ స్వరూపమేమిటో అన్న ప్రశ్నలకు జవాబులు ఈ కథల్లో, వాటి నేపథ్యాలలో వెతుక్కోవచ్చు. ఈ నేపథ్యాలు కొత్త ప్రశ్నలకు, చర్చలకు దారి తీయనూవచ్చు.

కథానిక అంటే మరేమీ కాదు, జీవిత శకలాలను పరిచయం చేయడమేనన్నాడు ఒక భాష్యకారుడు. జీవితం తలుపు తెరిచి ఒకసారి తొంగి చూడటమన్నాడు ఇంకో ప్రసిద్ధ రచయిత. కథానికకు నాలుగు భాగాలు తప్పనిసరి అని కొందరు నియమిస్తే, కథానికకు ఎట్టి నియమాలు, నిర్మాణ నిబంధనలు అవసరం లేదని మరికొందరి అభిప్రాయం.

ఈ సంపుటంలో ఉన్న కథల్లోనూ, వాటి నేపథ్యాలలోనూ కొంత సామాన్యత, ఎంతో వైవిధ్యత ఉన్నాయి. ఎవరి ముద్ర వారికి ఉన్నా, ఈ కథల్లో ఎక్కువ భాగం సంప్రదాయ శిల్పంలో చెప్పినవే. దాదాపుగా అందరు రచయితలూ తమ స్వానుభవాలు లేక తాము విన్న, కన్న విషయాల నుంచే ఈ కథలు పుట్టాయి అని చెప్తున్నారు. అయితే ఆ విత్తనాలు కథలుగా మొలకెత్తిన తీరులో ఎంతో వైవిధ్యం ఉంది.

కథకులు పత్రికా విలేకరులు మాత్రమే కారు, తమను ప్రేరేపించిన సంఘటనను వర్ణించి వదిలి వేయటానికి. కథకులు ఛాయచిత్రకారులూ కాదు, కెమెరా కంటికి కనిపించిన మేరకు మాత్రమే వాస్తవాన్ని కళ్ళ ముందు ఉంచటానికి. ఒకోసారి కల్పన కంటే జీవితమే విభ్రాంతికరమైనా, ఫొటోగ్రాఫుల్లాంటి కథనాల్లో సత్యం ఉన్నా తరచూ జీవం లోపిస్తుంది. కథల్లో కొంత నిజమూ, కొంత కల్పనా ఉండాలని రావిశాస్త్రి చెప్పారని బీనాదేవిగారు తమ కథానేపథ్యంలో పేర్కొన్నారు. ఫొటోగ్రాఫుకు ఫిల్టర్లు వాడటమూ, దృష్టికోణాలు

మార్చటమూ, అసలు కెమెరా పక్కన పారేసి, కుంచె పట్టుకొని కేన్వాస్ మీద తాము చెప్పదలుచుకున్న విషయాన్ని రకరకాల రంగుల పొరల మధ్య స్పష్టంగానో, అస్పష్టంగానో ఆవిష్కరించటమూ ఈ నేపథ్యాలలో తరచూ కనిపిస్తాయి.

కథ వ్రాయమని ప్రేరేపించిన విషయాలు చివరికి కథలో ఎలా చోటు చేసుకుంటాయి అనేది విచిత్రంగానే ఉంటుంది. ఒకోసారి మూల విషయానికీ పూర్తయిన కథకూ సంబంధం వెంటనే కనిపించదు. ఆడెపు లక్ష్మీపతిగారు ముసల్దాని ముల్లె కథ రాయడానికి ప్రేరణగా చెప్పిన విషయం చివరికి కథలో ఒక్క వాక్యంగా మాత్రమే ఇమిడింది. రచయిత చెప్పకపోతే ఆ కథలోని విస్తృత జీవితచిత్రణలో, ఆ వాక్యానికి ఎట్టి ప్రాముఖ్యతా ఉండేది కాదు.

అల్లం శేషగిరిరావుగారి *చీకటి* కథ రాత్రివేళ బాతుల వేటలో కలసిన ఇద్దరు అపరిచిత వ్యక్తుల కలయిక గురించి. ఆ ఇద్దరు వ్యక్తుల భిన్న సంస్కారాలతో పాటు రాత్రిపూట పక్షులవేట గురించి వివరంగా చిత్రిస్తారు ఆ కథలో. అయితే ఈ కథకు మూలంగా ఆయన చెప్పిన విషయానికి, ఈ పిట్టల వేటకూ పెద్ద సంబంధమేమీ లేదు.

కొన్ని కథల్లో కొంత కల్పన ఉన్నా, రచయితలు ఒక అసాధారణ సంఘటననో, సంఘటనల సముదాయాన్నో వాస్తవికంగా చిత్రీకరించటానికి ప్రయత్నం చేస్తుంటారు. ఇక్కడ రచయితను ప్రేరేపించిన విషయమూ, చిత్రించిన విషయమూ దాదాపు ఒకటిగానే ఉంటాయి (ఉదాహరణకు కేతు విశ్వనాథరెడ్డి నమ్ముకున్న నేల, పి.సత్యవతి పెళ్ళి *ప్రయాణం*, శ్రీరమణ *ధనలక్ష్మి*). కాని రచయిత వాస్తవ చిత్రీకరణను పరిమితంగా నియంత్రించటమూ, ఒకోసారి విభిన్న వ్యక్తులనీ, సంఘటనలనీ కలిపి ఒక సమిష్టి చిత్రాన్ని తయారుచేయటమూ కనిపిస్తుంది.

మరికొన్నిచోట్ల, ప్రేరేపించిన విషయాన్ని కొద్దిగా విస్తరించి జీవితం పట్ల, సమాజం పట్ల తమకు ఉన్న దృక్పథాన్ని కథగా నిర్మించటమూ చూస్తాము (ఉదా: కాళీపట్నం రామారావు *జీవధార*).

ఒకోసారి కథ అనేక విషయాల కలగలుపుగా రూపాంతరం చెందుతుంది (మునిపల్లె రాజు *వారాల పిల్లాడు*, వల్లంపాటి వెంకటసుబ్బయ్య రానున్న *శిశిరం*). కొన్ని కథలు దృక్పథాలను, వాదనలను, వైరుధ్యాలను విపులీకరించటానికి వ్రాయబడతాయి (ఉదా: బి.ఎస్.రాములు మెరుగు). నిత్యజీవితంలో ఎదురైన సంఘటనలకు ఒక తాత్త్విక ప్రాతిపదికనో, మానసిక విశ్లేషణనో ఆపాదిస్తూ వ్రాసే కథలు మరికొన్ని (ఆర్.ఎస్. సుదర్శనం అమృతుడు, నవీన్ నిప్పురవ్వలు).

రచయితపై గాఢంగా ముద్రవేసిన ఒక సన్నివేశం పలు దినాలు మేధలో నిద్రాణంగా ఉండి, ఆకారం పోసుకొని, ఎప్పుడో ఒకసారి- తల్లిని నరకయాతన పెట్టి పుడమిపై పడే శిశువులా బయటపడుతుందని అంటారు పెద్దిభొట్ల సుబ్బరామయ్య. అంత సుదీర్ఘమైన సమయం అవసరం లేదు, ఒక వస్తువుపై కథ రాయటాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని స్వల్ప వ్యవధిలో కథ వ్రాయవచ్చని నిరూపిస్తారు బలివాడ కాంతారావు *ముంగిస* కథలో.

రచనాశైలిలో వైవిధ్యాలున్నట్లే, మూల వస్తువును వినియోగించుకోవటంలోనూ, విపులీ కరించటంలోనూ రచయితల రీతులు విభిన్నంగా ఉంటాయి. ఉన్నది ఉన్నట్టుగా చెప్పటమా, నగిషీలు చేసి ఆకారం మార్చటమా, ప్రతీకాత్మకంగానో సూచ్యంగానో వ్రాయ టమా, గోప్యంగా ఉంచటమా అన్న ప్రశ్నలకు ఈ సంపుటంలో పలురకాల సమాధానాలు దొరుకుతాయి. చెప్పదల్చుకున్న వస్తువును ఆకర్షణీయమైన కథగా తయారుచేసే పరుస వేది విద్యంటూ ఏదీ లేదని అర్థమౌతుంది. ఊహాశక్తి, ఉత్సాహము, ప్రతిభ ఉన్న రచయితలు వస్తువును బహురూపాల్లో కథగా మనముందు ఉంచగలరు. ఉత్ప్రేరక విషయం నిత్యజీవితంలో కనిపించే సామాన్య విషయమైనా, అరుదైన సంఘటనైనా దానికి విశ్వజనీనత ఆపాదించి, విశ్వసనీయంగా నిజాయితీగా పాఠకులకు అందించ గలిగితే కథకు శాశ్వతత్వం కలిగే అవకాశం ఉంటుంది.

ఈ కథలూ, నేపథ్యాలూ పాఠకులకు, ఔత్సాహిక, వర్ధమాన రచయితలకు కరదీపికగా ఉపయోగిస్తాయని మా నమ్మకం, ఆకాంక్ష.

*తిరుపతి, 28 డిసెంబర్ 2012*

# కథకీ నేపథ్యానికీ మధ్య...

## ఆర్ ఎం ఉమామహేశ్వరరావు

బిడ్డలుగల్ల తల్లి కథ రాసినపుడు నాకు ఒక సమస్య ఎదురైంది. మా వూళ్ళో, మా బంధువుల ఇంట్లో జరిగిన సంఘటన అది. నేను వూరికి పోయినప్పుడంతా మా అమ్మా, మా అక్కా వూరి సంగతులన్నీ పూసగుచ్చినట్టు చెబుతుంటారు. అట్లా విని, వచ్చి ఉన్న దున్నట్టుగా కథ రాసేశాను. పూర్తయిన కథని చదువుకున్నపుడు మాత్రం ఒళ్ళు జలద రించింది. 'ఈ కథ మా వూళ్ళో ఎవరైనా చదివితే...!?' నా వీపు విమానం మోత మోగు తుంది. ఎందుకొచ్చిన గొడవ? రాసిన కథని చించెయ్యలేను. అలాగని అచ్చుకీ ఇవ్వలేను.

అప్పుడొక బ్రహ్మాండమైన ఐడియా తట్టింది. చకచకా కథలోని పాత్రల పేర్లన్నీ మార్చేశాను. ఇంక ఈ కథ వాళ్ళదే అనుకోడానికేం లేదు. ఇంకేం, పత్రికకు పంపెయ్యచ్చని అను కున్నాను. పంపే ముందు ఎందుకైనా మంచిదని మళ్ళీ ఒకసారి చదివాను. పేర్లు మారాయిగానీ, వాస్తవం తెలిసిన మా వూరి వాళ్ళు ఎవరైనా ఇది ఎవరి కథో సులువుగా కనిపెట్టేయగలరు. పెద్దగా ఉపయోగం లేదు. ఏం చేయాలింక? వాస్తవ సంఘటనలకి కొన్ని కల్పనలు జోడించాను. పాత్రల స్వభావంలో  మార్పులు చేశాను. ఇప్పుడింక, ఏ పాత్ర ఎవరో కనిపెట్టలేరని నా నమ్మకం.

ఆ కథ *ఆంధ్రప్రభ* వారపత్రికలో అచ్చయింది. 'నీకేం నాయినా.. పండక్కో పబ్బానికో వూళ్ళోకొస్తావు. రోజూ మొహాలు మొహాలు చూసుకునేవాళ్ళం, ఎవురు పడతారు యిదంతా' కథకి  మా అమ్మ స్పందన ఇది. కథలో ఒక సైడు పాత్రగా కనిపించిన మా రాంబావ అయితే నేను ఎక్కడ ఎదురుపడ్డా కొరకొరా చూస్తాడు యిప్పటికీ. ఆయన భార్య తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టింది నన్ను చాలామంది దగ్గర. భర్తనొదిలి లేచిపోయిన 'రాజమ్మ'ని చూసినపుడంతా నాకు ఏదో తప్పు చేసిన ఫీలింగే కలుగుతుంది. కథలు వాస్తవికంగానే ఉండాలి కదా! మరి వాస్తవం రాస్తే ఈ గొడవేంటి? వాస్తవ సంఘటనలు రాసేటపుడు ఇంకా ఏం జాగ్రత్తలు తీసుకోవాలి? అసలు జరిగింది జరిగినట్టు రాయచ్చా, రాయ కూడదా? మూడో కథకే ముచ్చమటలు పోశాయి నాకు.

అసలీ ప్రశ్నలన్నీ కథలు రాసే అందరికీ వస్తాయా, కొత్తగా రాస్తున్న నాకేనా? ఇట్లా ఆలోచిస్తుండగానే ఆదివారం ఆంధ్రజ్యోతి సంపాదక బాధ్యతల్లో భాగంగా విపరీతంగా కథలు చదివే అవసరం పడింది. ఒక కథ ఎంపిక చేయడానికి కనీసం పాతిక కథలు చదవాల్సి వచ్చేది. నిష్ణాతులైన కథకులు మొదలు కొత్తగా రాస్తున్న ఎందరి కథలో చదువు తున్నపుడు చాలా మందిలో నన్ను నేను చూసుకున్నాను. రాయడం ఏమోగానీ, కథలు చదవడం నేర్చుకున్నాను. ఏ కథలో ఏం లోపించిందో తెలిసిపోయేది. ఇలా ఉంటే బావుండేది కదా అనిపించేది. కథలోని సంఘటనల్లో, సంఘటనల్లోని పాత్రల తీరులో కొన్ని మార్పులు చేస్తే కథ ఇంకా మెరుగ్గా ఉంటుందని అర్థమయ్యేది.  అలా అనిపించిన కొన్ని కథల గురించి, ఆ రచయితల్లో కొందరితో మాట్లాడేవాడిని. 'నిజం... సరిగ్గా అట్లాగే జరిగింది,' అనేవాళ్ళు. ఓహో... జరిగింది జరిగినట్టు రాస్తే కథై పోదన్నమాట. వాస్తవానికీ, కథకీ మధ్య ఏవో మార్పులు జరగాలి. జోడింపులుండాలి. మరి, గొప్ప కథలుగా పేరున్న కథల వెనుక వాస్తవాలు తెలుసుకుంటే కథలు రాసే కిటుకు తెలిసిపోతుందేమో! ఇట్లా మొదలైంది, కథానేపథ్యాల కోసం నా వెతుకులాట. ఏడాది పాటు చిన్నా, పెద్దా కథకు లందరి వెంటాపడ్డాను. ఉత్తరాలు రాశాను. ఫోన్లు చేశాను. కొందరు రాశారు. కొందరు రాస్తామన్నారు. కొందరు రాయం అన్నారు. కొందరు తప్పించుకున్నారు.

నేపథ్యానికీ కథకీ మధ్య జరిగిన మార్పులేమిటి? ఎందుకు ఆ మార్పులు అవసరం అయ్యాయి? అవి కథకు ఇచ్చిన బలం ఏమిటి? ప్రసిద్ధ కథలకు నేపథ్యాలుగా ఈ ప్రశ్న లకు సమాధానాలు రాబట్టగలిగితే, కథలు రాద్దామని ఉత్సాహపడే వారికి ఇవి పాఠాలుగా ఉపయోగపడుతాయని ఆశపడ్డాను. మధురాంతకం రాజారాం సర్కస్ డేరాతో  కథా నేపథ్యాల ప్రచురణ మొదలైంది. కథా రహస్యం తెలిసిపోతోందనే సంబరం కలిగేది, నేపథ్యం అందుకున్న ప్రతిసారీ. సంబరం అంబరాన్నంటేది కొన్నిసార్లు. నిరాశ మిగిలేది మరికొన్నిసార్లు. అడిగి మరీ రాయించుకున్నాను గనుక అచ్చేయక తప్పలేదు కొన్నింటిని. అడక్కపోయినా రాసి పంపేయడం మొదలుపెట్టారు చాలామంది. మొహమాటానికి పోతే ఇంకేదో అవుతుందనే భయం వేసి, ఇంక ఆపేయడం మంచిదనుకున్నాను.

ముప్పయి నాలుగో నేపథ్యం మహేంద్రది. మధురాంతకం రాజారాంతో  మొదలై  ఆయన కుమారుడు మహేంద్రతో ఆగిపోయింది కథానేపథ్యం. ఆ ఇద్దరూ ఇప్పుడు లేరు. నా ఆలోచనకు అక్షరరూపం ఇచ్చి వెళ్ళిపోయారు. ఈ నేపథ్యాలు పుస్తకరూపంలో వస్తున్న ఈ సందర్భంలో వారిని తలుచుకోకుండా ఉండలేను.


*తిరుపతి, 17 డిసెంబర్ 2012*

# కథలు, నేపథ్యాలు




| | | | | |
|---|---|---|---|---|
| 1. | **ఆమె నీడ** | ... | అజయ్‌ప్రసాద్ | 17, 25 |
| 2. | **భద్రయ్య** | ... | అట్టాడ అప్పల్నాయుడు | 27, 41 |
| 3. | **మనిషి లోపలి విధ్వంసం** | ... | అల్లం రాజయ్య | 45, 58 |
| 4. | **పరివర్తన** | ... | ఆరి సీతారామయ్య | 63, 75 |
| 5. | **గుర్తు** | ... | ఆర్. వసుంధరాదేవి | 77, 81 |
| 6. | **వొంటేపమాను** | ... | ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు | 83, 94 |
| 7. | **అయోని** | ... | ఓల్గా | 99, 105 |
| 8. | **మచ్చ** | ... | కన్నెగంటి చంద్ర | 109, 113 |
| 9. | **గుండ్లకమ్మ తీరాన** | ... | కాట్రగడ్డ దయానంద్ | 115, 126 |
| 10. | **యుద్ధభూమి** | ... | కాలువ మల్లయ్య | 129, 142 |
| 11. | **వనమాల** | ... | కుప్పిలి పద్మ | 147, 154 |
| 12. | **గాజుపళ్లెం** | ... | కె. వరలక్ష్మి | 157, 166 |
| 13. | **గుడ్డివాని చేతికర్ర** | ... | గీతాంజలి | 171, 176 |
| 14. | **వాల్తేరత్త** | ... | గొరుసు జగదీశ్వరరెడ్డి | 179, 191 |
| 15. | **ఏటిపాట** | ... | గంటేడ గౌరునాయుడు | 195, 207 |
| 16. | **మన్నుతిన్న మనిషి** | ... | చిలుకూరి దేవపుత్ర | 211, 221 |
| 17. | **బాలల దినం** | ... | చంద్రలత | 225, 236 |

# కథలు, నేపథ్యాలు




| | | | | |
|---|---|---|---|---|
| 18. | **దుఃఖసాగరం** | ... | పి. చంద్రశేఖర ఆజాద్ | 241, 251 |
| 19. | **హంతకులు** | ... | తుమ్మేటి రఘోత్తమరెడ్డి | 255, 274 |
| 20. | **మ'గోడు'** | ... | తోలేటి జగన్మోహనరావు | 277, 288 |
| 21. | **బ్రతకనేర్వని వాడు** | ... | దాసరి అమరేంద్ర | 293, 305 |
| 22. | **మట్టిగుండె** | ... | పాపినేని శివశంకర్ | 309, 319 |
| 23. | **కాగుబొత్త** | ... | పెద్దింటి అశోక్‌కుమార్ | 325, 335 |
| 24. | **హింసపాదు** | ... | బమ్మిడి జగదీశ్వరరావు | 337, 346 |
| 25. | **నాలుగుకాళ్ల మండపం** | ... | మధురాంతకం నరేంద్ర | 349, 363 |
| 26. | **గెట్ పబ్లిష్డ్** | ... | మహమ్మద్ ఖదీర్‌బాబు | 367, 386 |
| 27. | **ముసలమ్మ మరణం** | ... | మహేంద్ర | 389, 398 |
| 28. | **మోహనా! మోహనా!** | ... | డా॥ వి. చంద్రశేఖరరావు | 403, 454 |
| 29. | **హోమం** | ... | డా॥ వి.ఆర్. రాసాని | 459, 467 |
| 30. | **గోమెజ్ ఎప్పుడొస్తాడో?** | ... | వేలూరి వేంకటేశ్వరరావు | 471, 478 |
| 31. | **చివరి మనిషి** | ... | రమణజీవి | 481, 492 |
| 32. | **చనుబాలు** | ... | సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి | 495, 509 |
| 33. | **సావుకూడు** | ... | స్వామి | 515, 524 |
| 34. | **సామికుంబుడు** | ... | సి. రామచంద్రరావు | 529, 542 |

కథకుడు ఇతివృత్తం ఎన్నుకోవటంలోగాని, దానికి తగిన శిల్పం అమర్చుకోవటంలోగాని పూర్తిగా ఏకాకిగా ఉంటాడు. ఆ కథ రచించటంలో అతను పెట్టుకునే ఆశయం ఒకటే, అతణ్ణి సామాజికుణ్ణి చేస్తుంది. అతను ఒంటరిగా తన గదిలో కూర్చొని కథ రాస్తున్నప్పటికీ అతని మీద కథ చదవబోయే సహృదయుడి ప్రభావం అనుక్షణమూ వుంటుంది. ఈ సహృదయుణ్ణి స్పష్టంగా భావన చెయ్యలేని రచయిత తన ప్రయోజనాన్ని కూడా స్పష్టంగా చూడలేడని నిస్సంకోచంగా చెప్పవచ్చు.

**- కొడవటిగంటి కుటుంబరావు**

# 1

# ఆమె నీడ

## అజయ్‌ప్రసాద్



**అజయ్‌ప్రసాద్** *1972 జూన్ 9న జన్మించారు. వీరి మొదటి కథ మరుభూమి 24 జులై 2005 ఆదివారం ఆంధ్రజ్యోతిలో అచ్చయింది. ఇప్పటివరకూ దాదాపు 35 కథలు రాశారు. ఓ ప్రైవేట్ కంపెనీలో స్టెనోగ్రాఫర్‌గా ఉద్యోగం చేస్తున్నారు.*

చిరునామా

*ప్లాట్ నెం. 24, టీచర్స్ కాలనీ*

*విజయవాడ - 520 008.*

*Ph.: 92477 33602*

*ajayprasanna@yahoo.com*

నాగమ్మ తన గురించి ఏమనుకుంటుందో ఆమె మనసులో ఏమున్నదో శివకు తెలియదు. అతడికి తెలిసిందల్లా గత కొద్ది సంవత్సరాలుగా ఆమెతో గడిపిన రోజులు, పంచుకున్న స్నేహమే.

శివరాత్రి వెళ్లిన తరువాత వచ్చే మొదటి పౌర్ణమి రోజు సింగరకొండ తిరణాలకు ఇంకా నాలుగురోజుల గడువుందనగా-

నాగి గుడిసె ముందు రోట్లో కంది పచ్చడి నూరుతూ ఉంది. ఆమె కొడుకు మూడేళ్ల మణి- పంచలో చాపమీద పడుకుని నిద్రపోతా ఉన్నాడు. దట్టమైన చెట్లతోపు కవతల పదిగజాల దూరంలో- అతడి జేజి ఇంటి ముందు కుక్కి మంచంలో కూర్చుని పక్కన పొన్ను కర్ర పెట్టుకుని కునికిపాట్లు పడుతూ ఉంది. ఆమెకు కళ్లు కనిపించవు. తాత గొడ్లు కాయడాని కెళ్లాడు. మరో మనిషి అలికిడి లేదు. శివ నులకమంచమ్మీద కూర్చుని చుట్టుపక్కల ఎవురన్నా ఉన్నారేమోనని చూసి ఎవరికీ వినపడకుండా ముందుకు వంగి నాగితో చెప్పాడు.

"ఓ నాగే... సింగరకొండ తిరణాల రేత్రికి అద్దంకి కొండకీ గోపాలపురానికీ మద్దె బండరాయి కాడ నీకోసం చూస్తా ఉంటా. చీకటిపడగానే మణిని తీసుకుని ఆడి

కొచ్చేయి. మనం ఆడ నుంచే ఒంగోలు బొస్సెక్కెల్లిపోదాం. నువ్వాడికి రాపోతే ఇక నీ మొకం చూసేది లేదు. ఇదే ఆకరుసారి.''

అతడలా చెప్పగానే నాగి ఉలిక్కిపడి బయంతో గబుక్కున లేచి నుంచుంది. ఆరోజు నాగి అవుననీ అనలేదు, కాదనీ చెప్పలేదు. ఆమె అలా లేచి పందిరిగుంజ పట్టుకుని చాలాసేపు ఆలోచిస్తా నుంచుని చివరికి చిన్నగా తనలో తాను నవ్వుకుంది. ఆ నవ్వు చూసి ఆమె తనతో వస్తుందని శివకు నమ్మకం కుదిరింది. అప్పటిదాకా తనతో వస్తదా రాదా అనుకున్న మనిషి.

ఆరోజు ఆమేమి చెప్పినా అతను వినిపించుకునేట్టుగా లేడు. తను చెప్పాల్సింది చెప్పి లేచి ఇవతలకొచ్చేశాడు. శివుడికి చాలాకాలంగా నాగి ఒక పట్టాన అర్థంకాని చిత్రమైన మనిషిలా ఉండిపోయింది. అతడి మాటల్లోనే చెప్పాలంటే-

'దగ్గరగా ఉన్నట్టు అగుపడుద్ది. దూరంగానే ఉంటది. దూరం నుంచి నవ్వుద్ది. దగ్గరకొచ్చి కసురుకుంటది.'

అప్పటివరకు నాగమ్మ తన గురించి ఏమనుకుంటుందో ఆమె మనసులో ఏముందో శివకు తెలియదు. అతడికి తెలిసిందల్లా నాగమ్మని అక్కడినుంచి దూరంగా తీసుకెళ్లిపోవాలి. తనతో వచ్చేయమని సంవత్సరకాలం నుంచీ అడుగుతూనే ఉన్నాడు. ఆమె వస్తానని చెప్పదూ, రానని అనదు.

'ఓ నాగే నేనంటే ఇష్టమేనా?' అని శివ అడిగితే నవ్వుతూ తలూపుతుంది.

'మరి వూరిడిచి ఎళ్లిపోదామా?' అని అతడంటే- బెదిరినట్టు చూసేది. అప్పుడామె మొహమంతా ఒకరకంగా మారిపోయి ఒళ్లంతా భయంతో బిగుసుకుపోయి అతనెప్పుడూ చూడని మనిషిలా, తెలవని మనిషిలా కనిపించేది.

''శివా- యియ్యన్ని నీకెందుకు. ఊళ్లో ఎవురికైనా తెలిస్తే ఇంకేమైనా ఉందా? నాగుపాము పగ పెంచుకోకు. నాగమల్లి సంగతి తెలవదా. ఏడు సంద్రాలకు అవతలికి పారిపోయినా పట్టుకుని సంపుతాడు. అయినా నీకేం తక్కువ. పెళ్లి చేసుకుని పిల్లాపాపలతో సుకంగా కాపరం చేయాల్సినోడివి. ఒక పిల్లోడి తల్లిని చేసుకోడానికి నీకంత కర్మేంబట్టింది. ఇట్టాంటియన్ని మానుకో,'' అనేది.

నాగమ్మకు అంతకుముందే పెళ్లైంది. అది పెళ్లి కాదు నాగమల్లి ఉంచుకున్న మనిషి అంటారు ఊళ్లో అంతా. నాగమల్లి అసలు పేరు నాగమల్లేశ్వర్రావు. అతడి వయసు నాగికంటే మూడు రెట్లు ఎక్కువ. నాగిది అతడి కడగొట్టు కూతురి కంటే చిన్న వయసు. జేజి నడిగితే పెళ్లా పాడా దొంగసచ్చినోడు ముక్కుపచ్చలారని పిల్లని చెరిచి దాని బతుకట్టా నాశనం చేశాడంటుంది.

అతడలా తనతో వచ్చేయమని ఆమె గతం గురించి తెలిసినకాడి నుంచీ అడుగుతూనే ఉన్నాడు. అతడలా అడిగినప్పుడల్లా నాగి, బెదురుతున్న కళ్లతో, ''అమ్మో ఆయనకు తెలిస్తే ఇంకేమైనా ఉందా. నరికి పోగులెడతాడు,'' అనేది.

''ఎవురాయన?'' అనేవాడు శివ ఆ కళ్లలోకి నవ్వుతూ చూస్తూ...

''ఎవురైతే నీకేం... చేసుకున్నోడే అనుకో...''

''కూతురు వయసుదాన్ని చేసుకున్నోడు ఆడికి బుద్ధి లేకపోతే ఒప్పుకోడానికి నీకేమైంది,'' అనేవాడు.

ఆ మాటనడంతోటే ఆమె మొహమంతా కోపంగా మారిపోయేది. ''ఎవురైతే నీకెందుకు? చేసుకున్నోడో ఉంచుకున్నోడో మా సంగతి నీకెందుకు,'' అనేది విసురుగా. నాగికి కోపం ఎంత

తొందరగా వస్తుందో అంత తొందరగా చల్లారిపోతుంది. నాగి మంచి కలుపుగోలు మనిషి అంటది జేజి. ఎప్పుడు చూసినా మాసిన మట్టిరంగు నేత గళ్లచీర, నడుముకు చుట్టుకున్న కొంగుతో గిరగిరా తిరుగుతూ గలగలా మాట్లాడతానే ఉంటుంది.

అంత తీరైన మనిషి బతుకు అట్టా అయిపోయింది. ఎప్పుడన్నా నాగమల్లి వచ్చినరోజు బైటికొచ్చేది కాదు. అతడు ఇంట్లో ఉన్నప్పుడు ఆ ఇంటి వైపు వెళ్లాలంటేనే అందరూ భయపడే వాళ్లు. నాగమల్లి ఉత్త అనుమానం మనిషి. అయినదానికి కానిదానికి నాగిని కొడుతూ ఉండేవాడు. నాగమల్లి వెళ్లిపోగానే నాగి కాస్తంత ఊపిరి పీల్చుకునేది. శివ బర్రెగొడ్లు కాయడానికెళ్తే పిల్లోడిని సంకలో వేసుకుని వచ్చేది. ఇద్దరూ చెట్లమ్మట, పుట్లమ్మట తిరిగేవాళ్లు. తుమ్మచెట్ల మీద జీరంగులు పట్టేవాళ్లు. కలేక్కాయలు, రేగుపళ్లు తెంపుకుని తినేవాళ్లు. గుళ్లకమ్మలో దిగి ఈత కొట్టేవాళ్లు. దిగుడుబావిలో కూర్చుని గంటలకొద్దీ మాట్లాడుకుంటూ కూర్చునేవాళ్లు. అతడితో చెట్లమ్మట చేలమ్మట తిరుగుతూ నాగి తన బాధలన్నీ మరిచిపోయేది. ఇద్దరిదీ తీగలు పెనేసుకున్నట్టు విడదీయరాని బంధమైపోయింది. ఆమె లేనిదే అతడు లేని బతుకైపోయింది.

"ఓ నాగే- నాకు బేల్దారి పనొచ్చు. దాంతోటి ఎక్కడైనా బతగ్గలను. నాతో వచ్చేయి, నిన్నూ, మణినీ బాగా చూసుకుంటా," అన్నాడు ఓరోజు.

"శివా నీకు దెయ్యమేమైనా పట్టిందా చెప్పు. నన్ను చేసుకుని నువ్వు బావుకునేదేమిటి? మీ జేజి, తాత ఏమనుకుంటారు. మాయదారి ముండ మందుపెట్టి తల్లీతండ్రి లేని పసోడిని వలేసిందంటారు. అసలయినా ఇది తప్పు కాదా."

ఆరోజు మొదలు మణిని తీసుకుని తనతో వచ్చేయమని అడుగుతూనే ఉన్నాడు శివ. ఆమె తన మనసులో మాట చెప్పేదికాదు. అడిగినప్పుడల్లా ఏదో ఒకటి చెప్పి తప్పించుకునేది.

అలా అడుగుతూ శివ చివరికి నాగిని తిరణాలకు రమ్మనీ, ఇదే ఆకరుసారనీ చెప్పి ఆరోజు ఉదయాన్నే అద్దంకి నుంచి సరాసరి సింగరకొండ వెళ్లాడు. తెలిసినోళ్లు ఎవురైనా ఎక్కుతారేమోనని బస్సులో వెనక్కు వెళ్లి కూర్చున్నాడు. అద్దంకి నుంచి సింగరకొండకు రెండు మైళ్లు దూరం. సింగర కొండలో దిగీ దిగగానే బవనాసి చెరువులో మూడు మునకలేసి ఎండ రాకముందే కొండెక్కి దర్శనం చేసుకుని కొబ్బరికాయ కొట్టాడు. ఎండెక్కేకొద్దీ జనం పెరగతానే ఉన్నారు. శివ మెట్లు దిగుతా మద్దెలో నిలబడి అద్దంకి కొండకేసి చూశాడు. కిలోమీటరు దూరంలో చుట్టూరా రాళు ్లరప్పలతో నిలువెత్తు కొండ గంభీరంగా నుంచుని ఉంది. కొండపైన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు కలగలిసి పోయి నిర్మానుష్యంగా ఉంది.

గుడి ముందు కొండ కిందుగా మెట్లు మీద లైను పెరుగుతానే ఉంది. అతడికి దర్శనం తొందరగా అయినందుకు సంతోషంగా ఉంది. అదే ఊపు మీద దబదబ మెట్లు దిగుతూ కొండ దిగిపోయాడు. కొండకు దిగువన మెట్ల దగ్గర పూలు, కొబ్బరికాయలమ్మే దుకాణాల దగ్గర గుడికి పోయే ఆడవాళ్లు, ముసలీముతక పోగవుతూ ఉన్నారు. మొగోళ్లు వచ్చీరాగానే బట్టలిప్పి చెరువులో మునుగుతున్నారు. చెరువొడ్డున తేటగా ఉండే నీళ్లు జనం పెరిగేకొద్దీ బురదరంగుకి మారు తున్నాయి.

చెరువుగట్టుకి కాస్త ఇవతల మట్టిరోడ్డుకు ఇరువైపులా అప్పుడే కొలువుదీరుతున్న బొమ్మల కొట్లు. ఒకపక్క ఎండెక్కుతున్నా లెక్కచేయకుండా జనం ఎత్తిబోసినట్టు తిరణాలకొస్తానే ఉన్నారు. ఎక్కడ చూసినా ఎద్దుల మీద చెరుకుబళ్లు, గాలిలో రెపరెపలాడుతూ తోరణాల్లా కట్టిన రంగు రంగుల కాగితాలు, బొమ్మలు.

గాజులకొట్ల ముందు రంగురంగుల ఓణీలతో నవ్వుతూ తుళ్లిపడే గిర్రుమని తిరుగుతూ వయసుపిల్లలని చూస్తుంటే శివకు నాగిని చూసినట్టుగా ఉంది. ఆయమ్మి బతుకలా కాకుంటే

ఇట్టానే ఉండునేమో అనుకున్నాడు. ఆమె కతంతా తెలివాక మొదట నమ్మలేకపోయాడు. అసలి ట్టాంటియి జరుగుతాయా అనుకున్నాడు. కళ్ల ముందు నిజం కనిపిస్తా ఉంది. ఎండ కొద్దికొద్దిగా పెరిగేకొద్దీ ఆమె గతం తాలూకునీడ మెల్లిమెల్లిగా అతడిని కమ్ముకుంటూ ఉంది.

ఓనాడు సందెవేళ వాకిలి ముందు జేజితో కలిసి మాట్లాడుతున్నాడు. నాగి కూడా అక్కడే ఉంది. మణి అక్కడే నేల మీద కూర్చుని ఆడుకుంటున్నాడు. అప్పుడు వినిపించింది. "నాగీ..." చీకట్లో చెట్ల మధ్య నుంచి పిలుపు. చెట్లవతల నీడలా నుంచున్న నల్లటి ఆకారం. ఎంతసేపటి నుంచి నుంచుని చూస్తున్నాడో తెలీదు. మసకచీకట్లో మెరుస్తున్న చెవిపోగు. తను పోల్చుకో గలిగాడు. అతడు నాగమల్లి.

ఆ పిలుపు వినగానే నాగి ఉలిక్కిపడింది. ఒక్కక్షణంలో ఆమె మొకంలో రంగులు మారాయి. అప్పుడాయమ్మి తనకు పూర్తిగా పరిచయంలేని ఎవురో కొత్త మనిషిలా అగుపడింది. గబుక్కున లేచి పిల్లోడి చేయి పట్టుకుని ఒణుకుతున్న శరీరంతో గబగబా వెళ్లింది.

ఆరోజు నాగమల్లి నాగిని చిరతపులి జింకపిల్ల మెడని ఒడుపుగా నోట కరుచుకుని పోయినట్లు చీకట్లో చెట్ల మధ్య నుంచి గుంజుకుపోయాడు.

ఆ తరువాత చెట్ల మధ్య చీకటిలో పెనుగులాడుతున్న కొమ్మలు. నాగి కేకలు. పరుగెత్తుకుంటూ చెట్ల మధ్యకెళ్లి నుంచుని చూశాడు. నాగి పొడవాటి జుట్టుని నాగమల్లి చేతులకు పాములా చుట్టుకుని ఈడ్చుకపోతున్నాడు. కొనప్రాణంతో కొట్టకపోతున్న జింకపిల్లలా మెలికలు తిరిగిపోతా ఉంది నాగి. ముందుకు ఉరకబోయాడు. ఎటునుంచొచ్చాడో తాత, 'నీకెందుకురా ఆ తగవు,' అంటూ రెక్కలు పట్టుకుని వెనక్కు లాగాడు.

ఆయాల తాతగాని ఆపకపోయుంటే అటో ఇటో తేలిపోయేది- అనుకున్నాడు శివ. ఆ మర్నాడు నాగి వచ్చింది. కళ్లు వాచి ఉన్నాయి. వాడు నిన్ను కొట్టాడా- అడిగాడు తను. లేదని చెప్పింది. కొట్టినా చెప్పదు.

ఆరోజు కందిచేను కాడ నీళ్లులేని కాలవలో ఇద్దరూ కూర్చుని కందికాయలు తెంపుకుని తింటూ, "నీ గతిలాగైందే నాగీ," అని శివ అంటే-

నాగి పచ్చి కందికాయలు నమలతా, "ఏం చెప్పను శివా, అప్పుడు నాది తెలిసీ తెలవని వయసు. సంతలో పశువు నమ్మినట్టు మాయమ్మ వాడికి నన్నమ్మేసింది. డబ్బుకి కక్కుర్తిపడి మా అన్నలు కూడా వాడి మాటలే వింటా ఉన్నారు. అంతాజేసి వాడికి మగపిలకాయలు లేరంట. అందుకే నన్ను చేసుకున్నాడంట. అయ్యన్ని ఉత్తి మాట్లేనని నాకు తెలవదా," అన్నది.

ఆరోజే ఆమెని నాగమల్లి చెర నుంచి తప్పించాలని గట్టిగా అనుకున్నాడు. ఆమెనే ఎటూకాక ఊగిసలాడతా ఉన్నట్లనిపించింది. ఇన్ని రోజులు చెప్పి చెప్పి చివరికి ఇక్కడిదాకా లాక్కొచ్చాడు. ఈ ఒక్కదినం గడిచిపోతే చాలు, ఆమె ధైర్యం చేసి వస్తే అంతే చాలనుకున్నాడు.

చూస్తుండగానే ఎండెక్కింది. కొండ కింద దారి పొడుగునా బొమ్మలకొట్ల ముందు జనం గుమిగూడుతున్నారు. ఎటుచూసినా బుయ్యిమంటున్న కాగితపుబూరల శబ్దం. మనవడిని భుజాన వేసుకుని నడుస్తున్న తాత. చేతిలో చెరుకుముక్కల మోపు.

శివ కాసేపు కొట్ల ముందు నుంచుని బొమ్మలు చూస్తూ, మరికాసేపు నేలీనినట్టున్న జనాన్ని చూస్తా నడుస్తున్నాడు. తడికలతో కొత్తగా కట్టిన బొమ్మల దుకాణాలతో పాతబజారు గుర్తుపట్ట లేకుండా ఉంది. బజారంతా కాగితపు బూరలు, వెదురు పిల్లంగోవుల శబ్దానికి గుయ్యిమంటా

ఉంది. అతడికి కాస్త దూరంలో వెదురు పిల్లంగోవి ఊదుకుంటూ నడుస్తున్న పిల్లోడు- పక్కన ఎండకు నెత్తిన ముసుగు కప్పుకుని నడుస్తున్న ఆడమనిషి. వాళ్లిద్దరినీ తదేకంగా చూస్తూ నడుస్తున్న వాడల్లా ఆగిపోయాడు.

ఆమె... నాగి- అతడి గుండెలు దడదడ కొట్టుకున్నాయి. వాళ్ల దగ్గర కెళ్దామని దబదబ నడుస్తా జనాన్ని తోసుకుంటూ ముందుకెళ్లాడు.

అతడెల్లేసరికి కొట్ల ముందు గుమిగూడిన జనం కాళ్ల మధ్య నుంచి ఆ పిల్లోడు ఎటో మాయమయ్యాడు. ఆమె జాడలేదు. మళ్లీ కనిపిస్తారేమోనని అక్కడే కాసేపు నుంచున్నాడు. వాళ్లని వెతుకుతా అక్కడే రెండుమూడు సార్లు జాతరంతా తిరిగాడు. ఎంతసేపు నుంచున్నా వాళ్లు మళ్లీ అటువైపు రాలేదు. ఎన్నిసార్లు తిరిగినా వాళ్లిద్దరూ మళ్లీ కనపడలేదు.

ఆమె మొకానికి కప్పుకున్న కొంగులోంచి ముక్కుపుడక కనిపిస్తా అచ్చం నాగిలా అనిపించింది. నాగి ముక్కుపుడక పెట్టుకోదు. అతడామెను ఎంత దూరం నుంచైనా, ఎంతమంది మధ్య ఉన్నా గుర్తుపట్టగలడు. ఆమె శరీరం, నడక, చేతుల కదలిక, కట్టుబొట్టు అంతలా అలవాటైన పరిచయం అతడికి.

జేజి చెప్పినట్టు ఆ యమ్మి మంచి కలుపుగోలు మనిషి. పొద్దుగూకులూ నూతికాడి నుంచి రోటికాడికి గిరగిర తిరుగుతూ ఏదో ఒక పని చేస్తానే ఉండే మనిషి. నలుగురి బాగోగులు చూసే మనిషేగాని తన సుకం ఎరగదు. ఎప్పుడడిగినా తిన్నానని చెప్పేదే కాని ఎప్పుడు చూసినా ఇంట్లో బియ్యం ఉండేవి కాదు. తనెన్నిసార్లు ఆ ఇంట్లోకి వెళ్లి చూడలేదు. ఎవురినీ అడిగే రకం కాదు. ఒకరికి చేయి చాచే మనిషి కాదు.

అతడి కళ్ల ముందు గిరగిర తిరగతా ఉన్న రంగులరాట్నం. జనం కాళ్ల కింద నుండి పైకి లేస్తున్న దుమ్ము. మణి కోసరమని కొట్లాడుకునే కోడిపుంజుల బొమ్మ, కాగితపు బూర, కీ ఇస్తే గిరగిర తిరిగే రంగులరాట్నం కొన్నాడు. నాగి కోసం ఆకుపచ్చ పూలచీర తీసుకున్నాడు. తనూ ఒక చెరుకుమోపు తీసుకుందామనుకుని బరువెందుకులే అనుకుని ఆగాడు.

అతడి ఆలోచనలు పలురకాలుగా పోతున్నాయి- ఆ తల్లీబిడ్డలు మరొకసారి అగుపిస్తే బాగుండు. ఆ పిల్లోడు- వెనక నుంచి చూస్తే అచ్చం మణిలానే ఉన్నాడు. ఆమె... అచ్చం నాగిలానే ఉంది. ఒకవేళ నాగేనేమో. ఈసారి దరికెళ్లి చూడకపోతే ఒట్టు అనుకున్నాడు. వాళ్లని వెతుకుతా మరొకసారి తిరణాల ఆ చివరి నుంచి ఈ చివరిదాకా తిరిగాడు. వాళ్లు మళ్లీ కనపడలేదు.

అతడి పక్కనే పులేషంతో పల్టీలు కొడుతున్న పోతురాజు. వెనకే గుయ్యిమని డోలు వాయిస్తున్న ఆడమనిషి. ఆలుమగలు కాబోలు. అందరూ దూరదూరంగా జరుగుతున్నారు. పిల్లలు తల్లుల చాటుకు వెళ్తున్నారు. చూస్తుండగానే పొద్దెక్కతా ఉంది. సూర్యుడు పడమటికి దిగీదిగగానే నీలాకాశంలో గుండ్రని పున్నమిచంద్రుడు పొడిచాడు. ఇంకాసేపాగితే చీకటయ్యే వేళ. నాగి వచ్చే వేళనుకుంటూ అద్దంకి కొండవైపు అడుగులేశాడు. అతడికెదురుగా ఎద్దుల మీద చెరుకుబళ్లు, వాటితోపాటు ట్రాక్టర్ల మీద ప్రభలు వరసకట్టి వస్తానే ఉన్నాయి.

జనాన్ని తొక్కుకుంటూ, తోసుకుంటూ తప్పించుకుంటూ ఎలాగైతేనేం చివరికి శివ అద్దంకి కొండను చేరుకున్నాడు. అద్దంకికొండ సింగరకొండకు అర కిలోమీటరు దూరంలో కూడా ఉండదు. భూమిలోంచి పైకి లేచిన పెద్ద గాలిగోపురంలా, మోకాళ్ల మీద కూర్చుని ఆకాశం వైపు చూస్తున్న రాక్షసుడిలా ఉంటుంది. కొండమీద రాళ్లురప్పలు, ముళ్లపొదలూ తప్పితే జన సంచారం ఉండదు. సింగరకొండ ఎప్పుడూ వచ్చిపోయే భక్తులతో నిత్య పచ్చతోరణాలతో

కళకళలాడుతూ ఉంటే అద్దంకికొండ జనసంచారం లేక పగిలిన కొండశిలలతో దట్టమైన చెట్లతో భయం గొలుపుతూ ఉంటుంది.

కొండ చుట్టూ జనం కోసం వేసిన తాటాకుపందిళ్లను దాటి జాతర జనం కనిపించేట్టుగా పెద్ద బండరాయి మీద కూర్చున్నాడు శివ. ఎన్నడో పై నుంచి కిందకు దొర్లిపడి కొండ పాదాల వద్ద నిలిచిపోయిన పెద్ద శిల అది. ఒకపక్క సింగరకొండ జాతర జనంతో సందడి సందడిగా ఉంటే అద్దంకి కొండ వెన్నెలలో ఒంటరిగా నుంచునుంది. ఆ కొండలాగే అతడూ ఒంటరిగా చీకట్లో ముడుచుకుని కూర్చున్న పిట్టవలె కూర్చున్నాడు. అతడి తలనిండా నాగమ్మ గురించిన ఆలోచనలే. చంకలో పిల్లలనెత్తుకుని నడిచే ప్రతి ఆడమనిషీ అతనికి నాగమ్మలానే కనిపిస్తున్నారు. వాళ్లు దగ్గరదాకా వచ్చి నాగమ్మ కాకపోయేసరికి నిరాశ చెందుతున్నాడు. నిజంగా వస్తదా ఆ యమ్మి అనుకున్నాడు.

ఆమె భయానికి తోడు ఒకనాడు అతడికి మరదలు వరసయ్యే కస్తూరి జేజిని చూట్టానికి కొచ్చింది. ఆ పిల్లతోపాటు తమ్ముడు కూడా. పంచలో సందడికి ఎవరా అనుకుంటూ నాగి గుడిసె నుంచి బైటికి వచ్చింది.

"కస్తూరి- మా శివుడికి కాబోయే పెళ్లాం..." అన్నది జేజి. ఓపక్క తాత తనలో తను నవ్వు కున్నాడు. శివకు మనసు చివుక్కుమంది. కస్తూరిని చిన్నప్పుడెప్పుడో తప్ప మరి చూడలేదు.

కస్తూరిని చూడగానే నాగి కళ్లలో మెరుపు. అవునా అంటూ దబదబ ముందుకొచ్చి కస్తూరిని ఆప్యాయంగా దగ్గరకు తీసుకుంది. పై నుంచి కిందిదాకా పట్టిపట్టి చూసింది. స్నేహంగా రెండు చేతుల్లో చేయి పెట్టింది. అంతలోనే ఎంత ప్రేమ చూపించింది. అదంతా తనకోసమేనా? శివకు అక్కడ ఉండబుద్ధి కాలేదు. దబదబ అడుగులేసుకుంటూ బయటకు నడిచాడు.

"యాడికి బోతాండవురా," దూరం నుంచే అరిచాడు తాత.

"శివయ్యకు సిగ్గేమోలే," పడిపడి నవ్వింది నాగి. కస్తూరి తలొంచుకునే ఉంది.

ఆరోజు కస్తూరిని చూసిన తరువాత నాగి అతడికి మరింత దూరంగా జరగడం మొద లెట్టింది. మనిషిలో అంతకుమునుపు చనువులేదు. కొంతకాలం అతడిని తప్పించుకుని తిరిగింది.

నక్కలు రెండు నోరు తెరుచుకుని కొండ పైకి పోతూ కళ్లకు కనిపించడంతో ఈ లోకంలోకి వచ్చాడు శివ. పైన చూస్తే చుక్కలు, వెన్నెల. కింద చూస్తే దీపాలకాంతిలో తిరణాలంతా వెలుతురు పండగలా ఉంది. అసలాయమ్మి వస్తదా... వచ్చినా తనిక్కడ ఉన్నట్టు అగుపడుద్దా... రమ్మని చెప్పాల్సిన చోటిది కాదేమో. చెరువుకాడి కన్నా గుడికాడి కన్నా రమ్మని చెప్పుండాల్సింది. ఇక్కడికి రమ్మని తను తప్పు చేశానేమో అనుకున్నాడు ఒక్కక్షణం. ఇప్పుడు చేయగలిగిందేమీ లేదు. తనిక్కడ నుంచి కిలోమీటరు దూరం వరకు మనుషుల రాకపోకలు చూడలడు. ఒకేళ ఆయమ్మి గనుక వస్తే తప్పిపోయే అవకాశం లేదు- అని తనకి తాను సర్ది చెప్పుకున్నాడు.

దూరంగా జనం మధ్య వెలుతురు ప్రభ మీద సురాభాండాన్ని భుజానికెత్తుకున్న హరిశ్చంద్రుడు కాదు కాదు వీరదాసుడు స్మశానంలో నుంచుని కటికచీకటిని గురించి ఎత్తుకున్న రాగం గాలిలో అలలు అలలుగా తేలివస్తూ ఉంది.

*... అలంతి పిట్టలన్ గొట్టి వేటాడు*
*పాడు మూకములకు పాడిపంటా...*

అక్కడ చీకటి లేదు. కింద కరెంటు దీపాలతో పైన నక్షత్రాలు, చంద్రుడి వెన్నెలతో భూమి నుంచి ఆకాశానికి వెలుతురు దీపాల తోరణం కట్టినట్లుంది. లోకమంతా వెలుతురులో ఉంటే అతడు మాత్రం చీకటిలో కూర్చుని ఆమెకోసం ఎదురుచూస్తూ ఉన్నాడు.

కాలం గడిచిపోయే కొద్దీ అతడిలో అసహనం పెరుగుతూ ఉంది. 'ఈయమ్మి వస్తదా రాదా,' అని విసుక్కున్నాడు మళ్లీ మనసులో. నడిరాత్రి దగ్గర పడేకొద్దీ అటుఇటు తిరుగాడే జనం ప్రభల దగ్గర గుమిగూడుతున్నారు. పున్నమి వెన్నెలలో వెలుతురుదీపాల కాంతిలో వెలిగిపోతూ ఉంది. చల్లటిగాలి కొండను చుట్టి వస్తూ ఉంది.

పగలంతా తిరిగిన అలసట చేత శివకు ఎప్పుడు కునుకుపట్టిందో తెలీదు. కూర్చునే ఆ పెద్ద బండరాయి మీద వెనక్కు వాలిపోయాడు. అప్పటిదాకా చంకలో పెట్టుకున్న చేతిసంచి పట్టుసడలి ఒకపక్కకు జారిపోయింది. అలసట చేత అతడి కళ్లు మూతబడి అతడు గాఢమైన నిద్రలోకి జారిపోయాడు. అంతా కటికచీకటి. దూరం నుంచి వెదురుపిల్లంగోవి సన్నటి పాటలా వినిపిస్తూ ఉంది.

శివ లేచి కూర్చుని శ్రద్ధగా విన్నాడు. మళ్లీ అదే శబ్దం... లేచి కళ్లు నులుముకుని చికిలించి చూశాడు. అదే పిల్లోడు. పక్కన తల్లిలేదు. మసక వెలుతురులో మొకం సరిగ్గా కనపడలేదు. ఒక్కడే పోతున్నాడు. సందేహం లేదు. మణే. మరి నాగేది? ఓ మణే అని బిగ్గరగా పిలిచాడు. ఆ పిల్లోడు వినిపించుకోకుండా వెదురుపిల్లంగోవి ఊదుకుంటూ రాళ్ల మద్దెకు వెళ్లిపోయాడు. మణీ... మణీ... అని పిలస్తానే శివ చీకట్లో తడుముకుంటూ నల్లటి కొండరాళ్ల మద్దెకెళ్లి నుంచున్నాడు. అక్కడంతా వెలుతురు లేని మసకచీకటి. తను వెతికే పిల్లవాడు అక్కడెక్కడా లేడు. అక్కడ... కొండరాళ్లు కాదు... పాడుబడిన ఇల్లులా ఉంది. గోడమ్మట గుండ్రంగా పైకి మెట్లు. మేడపైన కిటికీ నుంచి కనిపిస్తున్న సన్నటి పసుపురంగు వెలుగు. పై నుంచి శివా అన్న పిలుపు. ఎవరది...? ఆ గొంతు నాగిదిలా ఉంది. మసకచీకటిలో రాళ్లను తడుముకుంటూ ముందుకు కదిలాడు శివ.

"శివా... ఇటు..."

చిమ్మటి చీకటి. పెచ్చులూడిపోయిన గోడలు. గుండ్రంగా మెట్లెక్కుతూ పైకి వెళ్లే గుమ్మానికి ఇవతల నుంచున్నాడు. గది మధ్యలో సన్నటిదీపపు వెలుతురులో చాపమీద కూర్చుని ఉంది నాగి. ఆమె ఒడిలో పదిలంగా పసిగుడ్డు నిద్రస్తూ ఉంది.

"దగ్గరకు రా శివా," నాగి చిరునవ్వుతో పిలిచింది. పసుపురంగు దీపపుకాంతిలో ఆమె చెంపలు మెరుస్తూ ఉన్నాయి.

అలానే చూస్తూ ముందుకు వెళ్లి నుంచుని విప్పార్చుకున్న కళ్లతో ఆమె ఒడిలోకి చూశాడు. అంతే అతని కళ్లకు ఇంక నాగి కనపడలేదు. ఆ ఒడిలో అమాయకమైన పసితనంతో కళ్లు మూసుకుని నిద్రిస్తున్న శిశువు. చీరకొంగు పక్కకు తప్పిస్తే...

అక్కడ... కస్తూరి!

అతడు భయంతో గట్టిగా కేకపెట్టాడు. మగతనిద్రలో అతడి కేక అతనికే వినిపించి మెలకువ వచ్చి దిగ్గున లేచి కూర్చున్నాడు. చల్లటిగాలి వీస్తున్నా ఒళ్లంతా ముచ్చెమటలు. ఎక్కడ ఉన్నాడు తను. పైన ఆకాశమంతా వెన్నెల. మరి తను చూసిన చీకటేది? నాగి రాలేదా? తనకోసం నాగి రాలేదని తెలుసుకునేసరికి అతడి మనసంతా దిగులు ఆవరించింది.

కలలోని సంఘటనలు వెనకటి ముందు, ముందుది వెనక కలగలిసిపోయి అస్పష్టంగా కళ్లకు కనిపించాయి. మళ్లీ ఒకదాని తరువాత మరొకటి గుర్తుకు తెచ్చుకుంటూ... మొదట దానర్థం బోధపడలేదు.

అది... కలా... ఉలిక్కిపడి కళ్లు నులుముకున్నాడు. బాగా తిరిగి తిరిగి అలసిన నిద్రచేత అతడి కళ్లు ఎర్రబారి ఉన్నాయి. పున్నమిచంద్రుడు పడమటికి దిగుతున్నాడు. ఇంకాసేపాగితే

తెల్లారిపోద్ది. రాత్రంతా జాగరణ చేసి ఊళ్లకి తిరుగుముఖం పడుతూ జాతరజనం పలచబడుతూ ఉన్నారు. అక్కడక్కడా మిణుకుమంటున్న దీపాలతో ప్రభలు.

ఆ కల... దానర్థం ఏమిటి? ఎక్కుపెట్టి విడిచిన బాణంలా దబదబ నడుస్తూనే ఆమెను తొలిసారి చూసిందగ్గర నుంచి చివరిసారి వరకు ఆమెతో గడిపిన క్షణాలన్నీ మననం చేసుకుంటూ మంత్రించిన మనిషివలె అద్దంకివైపు నడవసాగాడు. గడిచిన రోజులన్నిటినీ తలుచుకుంటుంటే వాటికీ ఆ కలకూ ఏదో సంబంధం ఉన్నట్లనిపించింది. చీకటి నుంచి వెన్నెల్లోకి నడిచి వస్తున్నట్లుగా క్రమంగా అతడికి ఆ కల అర్థమవసాగింది. మట్టిరోడ్డు మీద తోపుల పక్కన నడుస్తూనే అతడు తనలో తను గొణుక్కున్నాడు.

"కస్తూరిని చేసుకుని తన బతుకు తనని బతకమని చెపతా ఉందా. ఉత్త నా సుఖం కోరే మనిషేనా! మరి తన బతుకేం కాను. అసుమంటి మనిషి దక్కాలంటే ఎన్ని జనమలెత్తాల," అతడి కాళ్ల కింద మట్టిపెళ్లలు నలుగుతూ ఉన్నాయి.

"కస్తూరికి నేను కాకుంటే ఇంకొకరొస్తారు. నాగీ మరి నీ గతేంకాను. అయినా నువ్వు లేకుండా నేనెలా బతకను..."

ఎప్పటికీ అర్థంకాని మనిషనుకున్నాడు తను. రాత్రి వచ్చిన అస్పష్టమైన కల చిన్నగా అర్థ మవుతున్నట్లు, అప్పటిదాకా అర్థంకాని నాగమ్మ స్పష్టమవుతూ ఉంది. ఎప్పటికీ అర్థం కాదనుకునే నాగి తనెప్పటికీ అందుకోలేనంత ఎత్తులో కనిపిస్తూ ఉంది. ఆమెని ఎప్పుడు చూద్దామా అని పరుగులాంటి నడకతో అతడి అడుగులు అద్దంకి పొలిమేరల వైపు ముందుకు పడుతున్నాయి

డొంకరోడ్డు పక్కనే కందిచేలు తమ నీడలను చూసి నవ్వుకుంటూ గాలికి ఊగుతున్నాయి. పరుగులాంటి నడకతో సరాసరి అతడు పొలిమేరలు దాటి తోపులో దట్టమైన చెట్లను తోసు కుంటూ ఆమె గుడిసె వద్దకు వెళ్లి నుంచున్నాడు. అక్కడ నిర్మానుష్యమైన నిశ్శబ్దం తప్ప మరేమీ లేదు. వాకిలంతా ఎండి రాలిపోయిన ఆకులు. ఇంటి తలుపుకు తాళం వేలాడుతూ ఉంది. అక్కడ నాగి లేదు.

"మరి... నాగేది...?"

అతడు ఒణుకుతున్న కాళ్లతో తన ఇంటివైపు నడిచాడు. ఆరుబయట జేజి నులకమంచ మీ్మద కూర్చుని ఉంది. ఎప్పుడు లేచిందో తెలీదు. పక్కన నేలమీద ఈతచాప పరుచుకుని తాత సొమ్మసిల్లి నిద్రపోతూ ఉన్నాడు. చప్పుడికి జేజి కదిలి నేల వంక చూస్తూ, "ఎవురూ," అంది.

శివ తెగించినట్టు తొణక్కుండా నుంచునే, "నాగేదే అగబడట్లా?" అన్నాడు.

"ఇంకెక్కడ నాగిరా- నిన్న రాత్రే ఎల్లిపోయారు. నాగమల్లి వచ్చి తీసుకెళ్లిపోయాడు... ఎల్లే ముందు ఇక్కడికొచ్చింది..." ఇంకా చెప్దామా వద్దా అనుకున్నట్లు కాసేపు ఆగింది. ఏదీ చూడలేని చీకటి కళ్లు నేలకు సారించి ఉన్నాయి.

చూపులేని జేజి అంతా చూసినట్టుగానే ఇంకా గొణుగుతూ ఉంది. ఏదీ ఎరుగనట్టుండే మనిషి అన్నీ తెలిసినట్టే చెప్తూ ఉంది.

"జాలిపడి ఊకే రమ్మంటే ఆడది నీ ఎనకబడి వచ్చేస్తదా... జాలి ఎవురికి కావాలిరా..?"

ఆ మాట వినగానే శివ నిశ్శబ్దంగా ఆమె ముందు నేల మీద కూలబడిపోయాడు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*25 మే 2008*

నేపథ్యం

అసహాయ ప్రేమకథ

# ఆమె నీడ

***ఒకసారి అతడికి ఆమె రాసిన ఉత్తరం చూపించాడు. ఆమెకు 'సాహిత్యం' అన్నది ఒకటి ఉందని తెలియకపోవచ్చు కాని అతడికి ఆమె రాసిన ఉత్తరం నేను చదివిన అత్యుత్తమ సాహిత్యరూపాలలో ఒకటి. అదొక కళాఖండం. అదంతా ఒక దుఃఖం. పదాలైనా, వాక్యాలైనా హృదయం నుంచి రావటమే ముఖ్యం అని ఆ అమాయక పల్లెటూరి యువతి రాసిన ఉత్తరాన్ని చదివే నిర్ధారించుకున్నాను.***

కొందరికి 'చెప్పుకోలేని కథలు' ఉంటాయి. ఇది ఆమె చెప్పుకోలేని కథ. ఈ కథలోని పాత్ర శివ- ప్రకాశం జిల్లా అద్దంకి అనే ఊరిలో నాతోపాటు చదువుకున్న నా బాల్య మిత్రుడు. అతడు నాకు ఎప్పుడూ తనకు ఎదురైన ఒక అనుభవాన్ని చెబుతుండేవాడు. అతడి అనుభవం ముగిసేనాటికి వ్యాపారంలో నష్టపోయి ఉద్యోగ నిమిత్తం అతడు ఊరు విడిచిపెట్టాల్సి వచ్చింది. అప్పటికి నేను హైదరాబాద్, ఉప్పల్‌లోని పారిశ్రామిక వాడలో పనిచేస్తూ, ఉప్పల్‌లోనే ఒక మురికివాడలో గది అద్దెకు తీసుకుని ఉండే వాడిని. ఉద్యోగం కోసం వచ్చిన మిత్రుడు నాతో కలిసి గదిలో చేరాడు. అంతకు ముందే అతడు తనొక 'బయటకు రాలేని సంక్షోభం' లో చిక్కుకుని ఉన్నానని నాకు ఉత్తరం రాసి ఉన్నాడు.

అంతకుముందే అతడు చెప్పిన 'బయటకు రాలేని పరిస్థితులు' నాకు చూచాయగా తెలుసు. ఇంటికి దగ్గరలో ఉన్న ఒక స్త్రీతో స్నేహమో, సహచర్యమో, సంబంధమో ఉందని అర్థమయింది. పూర్తి కథ అప్పటికి తెలియదు. నేనూ అతడిని అడగలేదు. చివరికి అతడు చెప్పినప్పుడు అదొక సాధారణ సంబంధంగానే అనిపించింది. ఆమెకు అప్పటికే పెళ్లైంది అని తెలిసినప్పుడు అది 'తప్పు' అనిపించింది. ఆమె గతం గురించి తెలిశాక అది 'ఒప్పే' అనుకున్నాను. ఇక నాతో ఉన్నంతకాలం అతడు తనకు ఎదురైన అనుభవాన్ని రాత్రింబగళ్ళు నాకు చెబుతూ ఉండేవాడు. ఆమె బాల్యం, అసహాయత, దాచుకునే పేదరికం, అనుభవించే హింస, ముఖ్యంగా

వీటిని తట్టుకుని కూడా నిలిచిన మూర్తిమత్వం నాకు అర్థమయింది. రోజుల తరబడి అతడు చెబుతూ నేను వింటూ... అలా రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. ఇద్దరం ఆమెను అక్కడ నుంచి తప్పించాలని అనేక రాత్రుళ్ళు ఆలోచనలు చేసేవాళ్ళం. అలా చేస్తే పర్యవసానాలేమిటా అని అనేక ఊహాగానాలు చేస్తుండేవాళ్ళం. ఇప్పుడు వెనక్కి తిరిగి ఒకసారి చూస్తే అదంతా ఒక అమాయకత్వంలా కనిపిస్తుంది. అలా చేయలేక పోవడానికి అనేక కారణాలు.

ఆ రోజులలో అతడికి ఆమె నుంచి ఉత్తరాలు వస్తుండేవి. అలా ఒకసారి అతడికి ఆమె రాసిన ఉత్తరం చూపించాడు. ఆమెకు 'సాహిత్యం' అన్నది ఒకటి ఉందని తెలియకపోవచ్చు కాని అతడికి ఆమె రాసిన ఉత్తరం నేను చదివిన అత్యుత్తమ సాహిత్యరూపాలలో ఒకటి. అదొక కళా ఖండం. అదంతా ఒక దుఃఖం. పదాలైనా, వాక్యాలైనా హృదయం నుంచి రావటమే ముఖ్యం అని ఆ అమాయక పల్లెటూరి యువతి రాసిన ఉత్తరాన్ని చదివే నిర్ధారించుకున్నాను.

ఇదంతా నేను కథలు రాయడానికి ముందు జరిగినది. కథలు రాయడం మొదలెట్టాక అతడి అనుభవంతో 'శిలాదృశ్యం' అన్న పేరుతో ఒక నవల రాయడం మొదలుపెట్టాను. కొన్ని కారణాల చేత అది పూర్తికాలేదు. చివరికి గతంలో ఆ మిత్రుడు చెప్పిన అనుభవాలను ఆధారంగా చేసుకుని కథగా మలిచాను.

ఈ కథ ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురించబడినప్పుడు ఈ కథలోని నాగమల్లి అనే పాత్ర దాన్ని చదివితే- అన్న భయం కలిగింది. నన్నేదో చేస్తాడని కాదు కాని ఆమె నిస్సహాయురాలు కదా. అలానే మిత్రుడి కుటుంబసభ్యులు. దుర్మార్గం ఎంతకైనా తెగిస్తుందనే భయం. నా భయాన్ని చూసి, 'ఈ రోజుల్లో కథలు చదివేవాళ్ళు ఎవరూ లేరు. నువ్వేం భయపడాల్సిన పనిలేదు,' అన్నాడు మిత్రుడు. నేను భయపడినట్లేమీ జరగలేదు కాని కథ చదివిన నా అద్దంకి మిత్రులు సంతోషించారు. కథను చదివి అతడి కుటుంబసభ్యులు ఆశ్చర్యపోయారు కాని దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు.

ఎప్పుడన్నా అద్దంకి వెళ్ళినప్పుడు మిత్రుడి ఇంటికి వెళుతూ ఉండటంతో కథలోని పరిసరాలు, వాతావరణం నాకు బాగా పరిచయం. కాని కథలోని నాగమ్మని చూడటం కథ పడిన రెండేళ్ళ తరువాతే. సుమారు రెండేళ్ళ క్రితం అతడితో కలసి అద్దంకి దగ్గర సింగరకొండ జాతరకు వెళ్ళాను. ఊహించని విధంగా, అనుకోకుండా ఆమె కూడా జాతరకు వచ్చింది. అంతమంది జనంలో ఉన్నట్లుండి అతడు ఆమెను గుర్తుపట్టాడు. ఆమె కనిపించినట్లే కనిపించి జనం మధ్య క్షణంలోనే మాయమయింది. ఆమెకోసం పిచ్చివాడిలా వెతికి మళ్ళీ ఒక బొమ్మలకొట్టు దగ్గర చూసి ఆమెకు దగ్గరగా వెళ్లి కొట్టువాడిని, 'ఈ బొమ్మ ఎంత?' అనడుగుతూ ఆమె పక్కనే నుంచున్నాడు. ఆమె అతడి వంకే చూస్తూ ఉంది. వాళ్ళిద్దరినీ అలా చూడటం కూడా ఒక అనుభవమే.

*22 ఫిబ్రవరి 2013*

*'ఆమె నీడ' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

2

# భద్రయ్య

## అట్టాడ అప్పల్నాయుడు



***అట్టాడ అప్పల్నాయుడు** 1953 ఆగస్ట్ 23న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. మొదటి కథ పువ్వుల కొరడా 1988 సృజన మాసపత్రికలో అచ్చయింది. దాదాపు వంద కథలు, నాలుగు నవలలు, కొన్ని వ్యాసాలు అచ్చయ్యాయి. రెండు కథా సంపుటాలు ప్రచురించారు. విప్లవ రచయితల సంఘంలో క్రియాశీల పాత్ర పోషించారు. మొత్తం సాహిత్యాన్ని మూడు సంపుటాలుగా ఇటీవలే ప్రచురించారు. గ్రామీణవికాస బ్యాంక్ నుండి ఉద్యోగవిరమణ చేశారు.*

**చిరునామా**

*102, డోర్ నెం. 54-11-1,*
*ఎమ్.ఎన్.కాజిల్, సంజయ్‌గాంధీ కాలనీ,*
*ఇసకతోట, విశాఖపట్నం-530 017*
*Ph.: 94400 31961*
*attada.a@gmail.com*

మబ్బులు కమ్మిన వాతావరణం. గాలి స్థంభించి ఉక్కబోత! మే నెల ఆఖరి రోజులు ఉదయం ఏడున్నర గంటల వేళ, తెల్లగా నిల్చున్న ఆ భవంతి ప్రహరీగేటు నల్లగా వుంది. పాత సైకిల్ మీద వచ్చిన వ్యక్తి గేటు ముందర సైకిల్ ఆపి, స్టేండ్ వేశాడు. ఆ వ్యక్తి సన్నగా, వాడిన సన్నజాజి తీగలా వున్నాడు. అతని చేతిలో కాగితం రోగిష్టి బిడ్డలా వుంది. గేటు ముందరకొచ్చి, ఆ వ్యక్తి ఆ భవంతి ముందర గదిలోకి తొంగిచూసేడు. ఏమి కన్పించిందో, ఎవరు అలికిడైనారో.

"నమస్కారం సార్..." అన్నాడు.

"గుర్ర్ర్..." మంటూ జాకీ వచ్చింది.

ఆ వ్యక్తి వెనక్కి తగ్గేడు. జాకీ గేటు దగ్గరకొచ్చి, గేట్ కమ్మీల మీద ముందుర కాళ్లను వేసి, ప్రశ్నార్థక చూపుతో నిల్చుంది. ఆ వ్యక్తి ఇంకా వెనక్కు తగ్గి, గుండెల మీది చొక్కా గుండీలను తడుముకున్నాడు. అతని చేతిలోని కాగితం జారిపోయి, రెపరెపలాడ్తూ గేటులోంచి యెగిరి, జాకీ వెనక కాళ్ల మధ్య పడింది. జాకీ, గేటు మీంచి ముందర కాళ్లను దించి, నాలుక సాచి పడిపోయిన కాగితాన్ని అందుకుని పళ్ల మధ్య యిరికించుకుంది. రోగిష్టి

బిడ్డ జాగిలం పాలబడినట్లు కన్పించింది ఆ దృశ్యం. భయం వేసింది ఆ వ్యక్తికి. భయంతో, "నమస్తే..." అన్నాడు.

జాకీ కనికరించి కాగితాన్ని వదిలేసి, మేడమెట్ల మీదకు వెళ్లి కూర్చుని, ఆ వ్యక్తివైపు నిఘా వేసింది. ఆ వ్యక్తికి కాగితాన్ని అందుకోవాలని ఆరాటంగా వుంది. గానీ, ధైర్యం చాలటం లేదు. ఇంతలో, ముందుగదిలో అలికిడయ్యింది.

"నమస్కారం సార్," కాస్త గట్టిగానే, గదిలోపలి వారికి వినబడేట్లుగా నమస్కరించేడు ఆ వ్యక్తి.

"ఎవరూ...?" అంటూ గదిలోంచి వరండాలోకొచ్చేరు అయ్యగారు.

అయ్యగారి చేతిలో సగం కాలిన సిగరెట్ నిట్టూర్పు వొదుల్తోంది. ఉదరం సగభాగాన్నించి బిగించి కట్టబడిన లుంగీ కాళ్లదాకా నలిగి మడతలు పడుతూ మూలుగుతోంది. అపుడే నిదుర లేచేరేమో కళ్లు సగం మత్తులోనే యింకా వున్నాయి.

సిగరెట్ పొగతోపాటు ఆ వ్యక్తి నమస్కారాలని లోనకి స్వీకరించేరు అయ్యగారు. ఆ వ్యక్తి గేటుదీసి, లోనకి అడుగు పెట్టబోయేడు. మెట్ల మీద కూర్చున్న జాకీ, 'గుర్ర్...' మంటూ వచ్చి అభ్యంతరాన్ని తెల్పింది.

ఆ వ్యక్తి భయంతో ఆగిపోయేడు.

"జాకీ... లెట్ హిమ్ కమ్..." అన్నారు అయ్యగారు.

జాకీ ఆ వ్యక్తిని లోనకి రానిచ్చింది.

ఆ వ్యక్తి మరోసారి అయ్యగారికి నమస్కారాలు అందిచ్చి, ఆ తర్వాత జాకీ పడేసిన తన దరఖాస్తు కాగితాన్ని తీసి అందిచ్చేడు.

అయ్యగారు, ఆ దరఖాస్తు అందుకని, పావు నిమిషం కాలంలో పరిశీలించేసి,

"...కుదరదయ్యా..." అని చెప్పి, వరండాలోని వాలుకుర్చీలో కూర్చున్నారు. జాకీ, యింట్లోకి వెళ్లి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పేపరు తీసుకొచ్చి, అయ్యగారికి అందించింది. అయ్యగారు చేతిలో దరఖాస్తు కాగితాన్ని కింద పడేసి, పత్రికను అందుకుని, పత్రికా పఠనంలో మునిగిపోయేరు.

ఆ వ్యక్తికి యేం చేయాలో పాలుబోవడం లేదు. దరఖాస్తు కాగితం యెగిరి మళ్లీ జాకీ నోటికి అందుతుందేమో అన్న ఆందోళన! అయ్యగార్ని అభ్యర్థించాలంటే వారి పత్రికా పఠనానికి భంగం కలుగుద్దేమో!

ఏం చేయాలో పాలుబోక, రెండు చేతులెత్తి జాకీకీ, అయ్యగారికీ నమస్కరిస్తూ కదలకుండా నిల్చున్నాడు ఆ వ్యక్తి.

*

ఆ వ్యక్తిని అందరూ నమస్కారాల భద్రయ్య అంటారు. అసలు పేరు కనకం భద్రయ్య. ఊరు జాతర్లపల్లి. పట్నానికి పదిహేను కిలోమీటర్ల దూరంలోని జాతర్లపల్లిలో నాయుడుగారికి చేరీ భూములున్నాయి. రెండు ట్రాక్టర్లున్నాయి. ఎన్నో జతల పశువులున్నాయి. యెందరో పాలేర్లున్నారు. కళాసీలున్నారు. కళాసీ సీతప్పడి కొడుకు... భద్రయ్య!

భద్రయ్య పదవ తరగతి పరీక్ష రెండుసార్లు రాసేడు. రెండుసార్లూ, ఇంగ్లీషూ, లెక్కల్లో పాస్‌మార్కులు రాలేదు. ఇంగ్లీషు భాషని ఇండియాకి తెచ్చినవారిని తెలుగులో తనకు తెలిసిన అన్నిరకాలుగా తిట్టుకున్నాడు భద్రయ్య. మాయలెక్కల చిక్కులు మరి రావులే నాకు... అని

అనుకున్నాడు. మూడోసారి ప్రయత్నించురా అని తండ్రి అంటే మరి ప్రయత్నించలేదు. చదువు తన వొంటికి పడదనుకున్నాడు.

'అయితే నా యెనకాల రా రమ్మ'ని తండ్రి భద్రయ్యని నాయుడిగారి కాళ్లకాడికి తీసి కెళ్లాడు.

"ఈడు సదువుకీ పనికిరాలేదు, పనీపాటుకీ పనికిరాలేదు. మీరే దారి సూపాల! మీ కాళ్లకాడ పడీసేను. మీ దయ యిక..." అని చెప్పి, భద్రయ్యని అప్పజెప్పీసి, తండ్రి ట్రాక్టర్ పనికి వెళ్లి పోయాడు.

నాయుడుగారి కాళ్ల దగ్గర చాలామంది బతుకుతున్నారు. చదువుకున్నవారూ, చదువుకోని వారూ వున్నారు. అందరికీ పని చూపగలరు నాయుడుగారు.

నాయుడుగారి కొలువులో నమస్కారాలు నేర్చుకున్నాడు భద్రయ్య. బతుకు గురించి యింకెన్నో నేర్చుకోవలసిన వాడికి కొలువులో చేరిన నాలుగు వారాలకే ఆపదొచ్చింది. లోడు మీదున్న ట్రాక్టర్ బోల్తా పడింది. బోల్తాపడిన ట్రాక్టర్ క్రింద భద్రయ్య తండ్రి పడిపోయేడు. పడిపోయిన తండ్రిని పట్నంలోని ఆసుపత్రికి తెచ్చి పడేశారు. తండ్రికి వైద్యం కోసం కాంపౌండర్లకి దక్షిణలు పడేసేవాడు. కసురుకునే డాక్టర్లకూ, కనబడే నర్సులకూ నమస్కారాలు పడేసేవాడు. నమస్కారాలతో ఎదురయే వాడు. నమస్కారాలతో విన్నవించేవాడు. ఆస్పత్రి సిబ్బంది భద్రయ్యను నమస్కారాల భద్రయ్యని జేశారు.

నాలుగు మాసాలు ఆసుపత్రిలో వైద్యమూ తండ్రి నడుముని నిలబెట్టలేకపోయాయి. నమస్కారాలూ నిలబెట్టలేకపోయాయి. నడుము పడిపోయింది. "మరికొన్నాళ్ల దాకా మందులు వాడాలి. వారానికోసారి తీసుకొచ్చి చూపించాలి. ఈ చీటీలో మందులు కొనుక్కుని ఇంటి దగ్గర వాడించు. మీ నాన్నని డిశ్చార్జి చేస్తున్నాం..." అని పంపించేసారు డాక్టర్లు.

వారానికోసారి వైద్యానికి పట్నం తీసుకురావటానికీ, చీటీల ప్రకారం మందులు కొనటానికీ, ఇల్లు గడపటానికీ భద్రయ్య దగ్గర ఆస్తిపాస్తులేమీ లేవు. రెండు రెక్కలూ, ముసలి తల్లి, రెక్కరాని చెల్లి తప్ప.

ఏక్సిడెంట్ గనక ఎక్స్‌గ్రేషియా వస్తాది అడుగన్నారు అందరూ భద్రయ్యతో. భద్రయ్య నమస్కారాల్తో అడిగేడు నాయుడుగార్ని.

"ఆస్పత్రి వైద్యంకీ, ఆ ఏక్సిడెంట్ పోలీసుకేసుకీ యెంతయ్యిందో లెక్కేసినావా యెపుడేనా? మీ అయ్యకి నడుము పట్టీసిందిగానీ నాకు నడుమిరిగిపోయింది. అప్పొజిషనోలి గవర్నమెంట్! అదును కుదిరిందని ఆళ్లనీ, యీళ్లనీ నామీద కొదిలీసేరు. ట్రాక్టర్నేమో... సీజు జేస్సారు. ఆడెవుడో... గనులు అధికారట! అక్రమంగా క్వారీ యెలాగ దవ్విస్తున్నావ్? ఏదీ లైసెన్సు? తే... అన్నాడు! ఆడి కివ్వాల్సింది ఆడికిచ్చేను. పోలీసోలు సరేసరి, సొమ్ముకి సొమ్ము అందుకున్నారు. సాల్లేదాళ్లకి. అమ్మోరు పండుగకని వుంచిన గొర్రిపోతుని తోలుకుపోనారు. ఈలేటి, ఆళ్లేటి? అందరూ వొలిచీసినారు నన్ను! ఆ యిన్సూరెన్సోలు బండి రిపేరుకి క్లెయిమిస్తారటగాని మనుషుల వైద్యం కివ్వరట! ఆస్పత్రోలు... మందుల కర్సు క్రింద వొలిస్సేరు. ఆకరికి, నువ్వొ యెలిపోవొచ్చినావన్నమాట... నన్ను వొలిచీడంకి!" అంటూ నాయుడుగారు విపరీతంగా నొచ్చుకుని, ఒంటిమీది టర్కీటవల్‌ని దులిపి, మంచం దండెమీద వేసి, దాన్ని ఆనించి మంచమ్మీద చేరబడ్డారు!

నాయుడుగారికి చేతులు జోడించి నమస్కరిస్తూ! అలా వుండిపోయేడు భద్రయ్య... జవాబు మాటలు లేక!

*

అయ్యగారి పత్రికాపఠనం అయిపోయింది. ఆమూలాగ్రం చదివి చూశారో, చూసి చదివారో? ఆ తర్వాత చూసేరు భద్రయ్యని.

"... కుదరదయ్యా అన్నానా? మరింకా నిల్చున్నావేం?" ప్రశ్నించేరు అయ్యగారు.

"పిల్లల గలోడ్ని సార్, మరో ఆధారం లేనోడ్ని. తమరు దయచూపాల," చేతులెత్తి నమస్కరిస్తూ భద్రయ్య.

"...ఇంతకుముందు ఒకసారి ఇలాంటి పరిస్థితే వస్తే ఆదుకున్నానా? లేదా?" అడిగేరు అయ్యగారు.

అవును, అపుడూ ఇలాగే ప్రభుత్వం వారు ఉత్తర్వులిస్తే ఈ అయ్యగార్ని శరణు వేడుకున్నాడు భద్రయ్య.

"... చిత్తం ఆదుకున్రు. తమరాదుకోబట్టే నీనూ, నా పిల్లాజెల్లా నిలబడ్డాం. లేపోతే, ఆనాడే మా బతుకు బజారయిపోయున్ను..." ఒప్పుకున్నాడు భద్రయ్య.

"... అప్పుడు సిట్యుయేషన్ వేరయ్యా. ఆఫీసులో సీనియర్ సూపరింటెండెంట్‌ని గనక, మున్సిపల్ కమీషనర్‌గారూ నా మాట విన్నారు. గానీ, యిపుడు నా చేతిలా లేదు. కమీషనర్‌గారి చేతిలో లేదు. మీరు ఓట్లేసి గెలిపించిన కవున్సిలర్లూ, ఛేర్మేన్‌ల చేతిలో వ్యవహారం. మా చేతిలో లేదు..." అని చేతిలో పేపర్ కుర్చీ ప్రక్కన పడేసి, చేతులు దులిపేశారు అయ్యగారు.

భద్రయ్య ఓటేసిన తన చేతుల్ని చూసుకున్నాడు. అయ్యగారు వాలుకుర్చీలోంచి లేచి పచార్లు చేయసాగేరు.

*

ఏదో గుర్తొచ్చినవాడిలా, గభాల్న మంచమ్మీద నుంచి నాయుడుగారు లేచి,

"...భద్రయ్యోరే, వొక పన్చెయ్యిరా, మా బావమర్ది పట్నంలో రియల్ ఎస్టేట్ పెట్టాడు. పట్నంకి ఆనించిన పంటభూముల్ని కొనేసి ఇళ్ల ప్లాట్ లేస్తండు. కోలనీ గడతండు. అతగానికి నైట్ వాచ్‌మేన్ కావాలన్నాడు. నువ్వు అతగానికాడ వాచ్‌మేన్‌గా చేరిపో. రాత్రి అతగాని స్టోర్‌కాడ కాపలా వుంటావు. పగలు మళ్లీ అతగాని బిల్డింగ్ వర్కుకే లేబరుగా యెల్తావు! రెండు పన్లకీ రెండు జీతాలొస్తాయి. నీ అయ్య వొయిద్యానికీ యిబ్బందుండదు..." అని దారి చూపేరు భద్రయ్యకి.

అలా, భద్రయ్య జాతర్లపల్లి వొదిలేసి, పట్నమొచ్చేడు. రెండు పనులు చేసి, రెండు జీతాలు తీసుకునేవాడు. రెండు జీతాలలో ఎక్కువ భాగాన్ని ఆసుపత్రీ, మందుల షాపూ ఆర్పేసేవి.

"యీ వొయసుల మరి యిరిగిన యెముకతకదు. వొయిద్యమొద్దుర్నాయినా డబ్బు దండుగ. నీ రెక్కల కష్టాన్ని... ఆళ్లకి పొయ్యిడమెందుకు? నాకిన్ని గెంజినీళ్లు పొయ్యి, చాల్ను! నీ తల మీద ఇన్ని అక్షింతలేసేదాక ఈ మంచమ్మీద బతికేస్తాను. నాలుగు డబ్బులు మిగలేసి, ముందు ఆ శుభ కార్యం జరిపించుకో..." అనేవాడు తండ్రి. పట్నం వచ్చి, రెండేళ్లయింది. మూడో ఏట నించీ, ఇదే పాట తండ్రి నోట!

ఆ పాటకి తోడు, మరోప్రక్క ఆదిలక్ష్మి వంత అందుకుంది. కొత్తపేట తాపీపని జట్టుతో వచ్చేది ఆదిలక్ష్మి. బిల్డింగ్‌వర్క్‌లో భద్రయ్య చాలాసార్లు ఆదిలక్ష్మితో కలిసి పనిచేశాడు, మాటలు కలిపేడు. మాటకారి ఆదిలక్ష్మి మనసు కలిపింది. ఈళ్లిద్దర్నీ కళ్లతో కనిపెట్టిన కొత్తపేట తాపీమేస్త్రీ రాజప్పడు వీరిద్దరి పెద్దల్ని కలిసి... పెళ్లి ఏర్పాట్లు చూడమన్నాడు.

పెళ్లి అయ్యాక భద్రయ్య, ఆదిలక్ష్మీ ఇద్దరూ తాపీమేస్త్రీ రాజప్పడి జట్టులో పనికి కుదిరేరు. 'రాత్రుళ్ల వాచ్‌మేన్ నౌకరీ మరి వల్లకాదు,' అనేశాడు భద్రయ్య, నాయుడుగారి బామ్మర్దితో. భార్య భర్తలిద్దరూ కూలిజేసి కుటుంబాన్ని పోషించుకు వస్తున్నారు.

మరో ఏడాదికి, తాపీమేస్త్రీ రాజప్పడు బ్యాంక్‌వారి బిల్డింగులు కట్టడానికి వొప్పుకున్నాడు. భద్రయ్యకు ఓ మేనేజర్‌గారితో చనువేర్పడింది. రోజూ నమస్కారాలు పెడుతూ, ఆ మేనేజర్‌గారి ఇంటిపని చేయటమేగాక, సాయంత్రం అయ్యాక, ఆ బాబుగారికి కావలసిన బీరుబాటిళ్లూ, మిక్చర్ పొట్లాలూ తెచ్చేవాడు. భద్రయ్య చేత, ఈ సేవలన్నీ భద్రంగా చేయించుకున్న ఆ మేనేజర్‌గారు భద్రయ్యని బ్యాంకుకి రమ్మన్నారు. ఓరోజు భద్రయ్య వెళ్లాడు. మేనేజర్‌గారు ఏవేవో ఫారాలు చూపించి, సంతకాలు పెట్టమంటే, భద్రయ్య భద్రంగా సంతకాలు పెట్టాడు.

సంతకాలు చేసిన ఆరునెలలకు ఆ మేనేజర్‌గారి బిల్డింగ్ నిర్మాణం పూర్తయ్యింది. గృహ ప్రవేశ ఉత్సవంనాడు, ఆ మేనేజర్‌గారు భద్రయ్యను పిల్చి,

"ఈ అయ్యగారికి దండం పెట్టు..." అన్నారు.

భద్రయ్య దండం పెట్టాడు. ఆనాడు, అలా మొదటిసారిగా దండాలందుకున్న ఆ అయ్య గారే ఈ అయ్యగారు.

ఈ అయ్యగారు అప్పుడు జిల్లా గ్రామీణాభివృద్ధి కార్యాలయం (డి.ఆర్.డి.ఎ)లో ఉండేవారు. దండాలందుకున్న తర్వాత, మరికొన్నింటిని అందుకొని సబ్సిడీ ఇచ్చేరు. సబ్సిడీ పోను, మిగిలిన ధరకు బ్యాంక్ మేనేజర్‌గారు ఋణం ఇచ్చేరు. పాత బస్టాండులో, బడ్డీకొట్టు పెట్టాడు భద్రయ్య. కూలిపని మానేశాడు.

"...దండాలు దండుగయిపోలేదురో! మేనేజర్‌బాబు ఉపకారం చేశాడురో..." అన్నాడు రాజప్పడు మేస్త్రీ బడ్డీకొట్టులో కూర్చున్న భద్రయ్యతో.

"బేంకీ మేనేజరు కేటిబోయింది? ఊరుసొమ్ము రామభజన. డి.ఆర్.డి.య్యేవోరి సబ్సిడీ, గవరమెంటు సొమ్మూ, పేరు మాత్రం బ్యాంకుది..." అన్నాడు ఆశిరయ్య. ఆశిరయ్యకి, ఆ మేనేజర్ గారంటే పడదు.

"...ఊరు సొమ్మో, ఆ బాబు సొమ్మో? ఎవులిదో? నాకేల? నాకు ఉపకారం చేశాడా? లేదా?" అని మరోసారి మొక్కుకున్నాడు భద్రయ్య చేతులెత్తి, అక్కడలేని మేనేజర్‌గారికి!

నవ్వుతూ వెళిపోయేరు రాజప్పడు మేస్త్రీ, ఆశిరయ్యలు.

*

వాలుకుర్చీలోంచి లేచి, వరండాలో పచార్లు చేస్తున్న అయ్యగారి వెనకాలే నడుస్తూ భద్రయ్య,

"ఆనాడు మీరూ, ఆ మేనేజర్‌బాబూ... బడ్డీకొట్టు పెట్టించీ, నా బతుకు మార్చినారు. బస్టాండు జాగాల బడ్డీకొట్టు... మంచి బేరాలు జరిగేయి. నాలుక్కాసులు కళ్లజూసేం. పిల్లలు

కలిగేరు. ఆళ్లకి కాన్వెంట్ సదువులు సెప్పిస్తన్నాం. ఇల్లు తనఖాకి దొరికితే తీసుకున్నాం. తమ దయవల్ల... బతుకుల కుదుటపడినాం...'' ఇంకా ఏమేమో చెప్పబోతున్నాడు భద్రయ్య.

''...మరి కుదరదయ్యా, నన్ను విసిగించకు, వెళ్లు,'' అనేశారు అయ్యగారు, పచార్లు ఆపేసి విసుగ్గా!

శ్లోకాలను మధ్యలోనే ఆపమని దేవుని విగ్రహం ఆదేశిస్తే బిక్కమొహం వేసిన పూజారిలా మాటలు ఆపేసి, చేతులు జోడించి నిల్చుండిపోయేడు భద్రయ్య.

భద్రయ్యకు, ఏంచేయాలో పాలుబోవటంలేదు. గత పది పన్నెండేళ్లుగా నమ్ముకున్న బడ్డీకొట్టు. బ్రతుక్కి హామీగానేగాక, మిగులు సంపాదనతో, పప్పురుబ్బే మిషనూ కొనుక్కొని, దాని ద్వారా కొంత సంపాదన చేస్తున్న తరుణంలో ఈ ఆపదొచ్చింది!

''అప్పోజిషన్ వాళ్లు గవర్నమెంట్‌లోకి వచ్చేరు. వాళ్లకి అనుకూలమైనవన్నీ చేస్తారు. పాత పద్ధతులు మార్చేస్తారు. తప్పదు. నీకేకాదు, అందరికీ ఇది తప్పదు. పొలిటికల్ డెసిషన్... అయిపోయింది...'' అన్నారు అయ్యగారు.

భద్రయ్యకు, ఇదే అర్థంకాదు. ఈ పొలిటికల్ డెసిషన్స్ ఎవరు, ఎందుకు చేస్తారో తెలీదు. రాజకీయమంటే ఓటు వెయ్యడం ఒక్కటే అనుకుంటాడు భద్రయ్య. భద్రయ్య రాజకీయాల గురించి ఆలోచించటం ఇది రెండోసారి!

మొదటిసారి ఎనిమిదేళ్ల కిందట ఇలాగే రాజకీయ మార్పులు జరిగాయి. మారిన రాజకీయ వాతావరణంలో బస్‌రూట్ల జాతీయం జరిగింది. ప్రైవేట్ బస్‌ల రద్దు జరిగింది. కొత్తగా బస్ కాంప్లెక్స్ పట్నంకి తూర్పువైపు పెరుగుతోన్న రియల్ ఎస్టేట్ ఏరియా వైపు నిర్మాణం జరిగింది.

పాత బస్‌స్టాండ్‌కి బస్సులు రావడం మానుకున్నాయి. బస్సులు రాకపోవటతో బడ్డీకొట్ల వ్యాపారాలు పడిపోయేయి. కొన్ని బడ్డీకొట్లు కొత్తగా కట్టిన కాంప్లెక్సుకి మారేయి. గానీ, భద్రయ్య మాత్రం మారలేకపోయేడు.

''... ఇదంతా రాజకీయం! అంతేరా భద్రయ్య. అంతే! బయటికి మాత్రం ఇది చెప్పరు. పట్నానికీ, పాతబస్టాండుకీ మధ్య దూరం ఎక్కువయిపోయిందని, కాంప్లెక్స్ మార్చేరట! ఇన్నేళ్లబట్టీ లేని దూరమిపుడొచ్చిందా? అదంతా, స్టంటు! కొత్త కాంప్లెక్సు ఏరియాల ఆళ్ల పార్టీ మద్దతు దార్లున్నారు. ఆళ్ల యాపారాలున్నాయి. ఆళ్లకోసమే ఈ రాజకీయం! కాకపోతే కాంప్లెక్స్ ఎదురుగా మీల్సు హోటేలు యెవుళ్ది? కడ్తోన్న ఆ సిన్మాహాలు యెవుళ్ది? అక్కడి రియలెస్టేటు భూములెవు ళివి? గెల్సిన పార్టీవోళ్లివి. అందుకే, ఈ మార్పులు జరిగేయి...'' అని చెప్పాడు బడ్డీకొట్ల యజ మానుల సంఘం నాయకుడు బలరాం.

అదిగో, అప్పుడు మొదటిసారిగా రాజకీయాల గురించి ఆలోచించేడు. 'రాజకీయాలకీ మన బతుకులకీ లంకె వుంటాదన్నమాట యెక్కడో వొక్కాడ!' అని అనుకున్నాడు భద్రయ్య. కాని ఏం చేయగలడు?

'పిల్లి పిల్లల్ని తిప్పినట్లు సంసారాన్ని పల్లె నుంచి పట్నానికి, పట్నంలో పాతబస్టాండ్‌కీ మార్చేను. మళ్లీ ఇపుడు కొత్త కాంప్లెక్స్‌కి మరి తిప్పలేను. ఇక్కడే వుండిపోతాను. ఎంతోకొంత బేరం. అయినంత అవనీ,' అని నిర్ణయించి అపుడు పాతబస్టాండ్ దగ్గరే ఉండిపోయేడు భద్రయ్య.

సగానికి సగం బేరాలు తగ్గిపోయేయి. ఇంతకుముందు కూడబెట్టిన డబ్బు ఇపుడు ఖర్చయి పోతోంది. తల్లి జబ్బుకి వైద్యం. చావుకీ, బతుక్కీ మధ్య డబ్బుల చాప పరుస్తోంది. పిల్లలు ఎదిగి

ఖర్చులు ఎదిగేయి. ఇంట్లో ఇబ్బందులు ఎదిగేయి. ఆఖరికి ఆదిలక్ష్మి అతుకుల చీరలు కట్టాల్సి వచ్చేది. అయినా, అలా ఉగ్గబట్టి ఉండిపోయేడు భద్రయ్య... అయిదేళ్లు!

అదృష్టవశాత్తు పాతబస్టాండుకి దగ్గరగా ఎవరో కాన్వెంట్ పెట్టారు. ఆ తర్వాత పట్నం పెరిగిందని టూ టవున్ పోలీసుస్టేషన్ వచ్చింది ఆ ఏరియాకి. వీటి పక్కనే, 'అగ్నిమాపక దళం' స్టేషన్ వచ్చి నిల్చుంది. హమ్మయ్య...! జనం మళ్లీ అలికిడవుతున్నారు. ఆర్టీసీ వారి పుణ్యాన గ్రామణి బస్సులు ఇక్కడే ఆపుతున్నారు. భద్రయ్య బడ్డీకొట్టుకి బేరాలు ఆరోహణాక్రమంలో కొచ్చేయి. ఈ రెండు, మూడేళ్లూ బాగా నెట్టుకొచ్చేడు. మళ్లీ ఇపుడొచ్చింది ఉపద్రవం.

"... అప్పుడు మా చేతిలోని వ్యవహారం. మీకు మేలు చేశాం. ఇపుడు చెయ్యలేం. మా చేతిలో ఏంలేదు. కుదర్దు. నువ్విక వెళ్లు..." అనేసి, ఆఖరుసారిగా చెప్పేసి అయ్యగారు యింట్లోకి వెళి పోయేరు.

భద్రయ్య జోడించిన చేతుల్ని దించి, దిగాలుగా నిల్చున్నాడు. 'గుర్ గుర్ గుర్ర్' మంటూ వెళ్లు వెళ్లు, వెళ్లెళ్లు... అంది జాకీ!

భద్రయ్య కాళ్లీడ్చుకుంటూ, సైకిల్ ఎక్కడు. బడ్డీకొట్టు దగ్గరకొచ్చేడు. అప్పటికి ఎండ ప్రతాపాన్ని చూపిస్తోంది. మున్సిపాల్టీ అధికార్లు, పోలీసులూ వారివారి ప్రతాపాన్ని చూపిస్తున్నారు. బడ్డీకొట్టులకి మోకుతాళ్లు గట్టి కళాసీల చేత బడ్డీలను అక్కడ్నించి తరలించుతున్నారు. అడ్డొచ్చే వారికి లాఠీల్తో తగిలిస్తున్నారు. చుప్పులూ, జంతికలూ, ఉడకబెట్టిన దుంపలూ జంగిడిలో పెట్టి అమ్ముకునే ముసలమ్మ కాకుల్ని తిడుతున్నట్లు పోలీసుల్ని తిడుతూ జంగిడీ వెత్తుకుని అక్కడ్నించి కదిలింది. భద్రయ్య బడ్డీకొట్టుకి మోకులు గట్టేరు కళాసీలు! బతికుండగానే పాడెగట్టీ, ఎక్కించి, స్మశానంకి మోసినట్లు అయ్యింది భద్రయ్యకి. అడ్డుకోవడానికి పరుగెత్తబోతే, ఆపేసి, అక్కడి నుంచి దూరంగా తీసుకుపోయేడు బడ్డీకొట్ల సంఘం నాయకుడు బలరాం! దూరంగా తీసుకుపోయేక, అక్కడవొక, సిమెంట్ బల్లమీద కూర్చోబెట్టి,

"...వొరే భద్రయ్య, ముడ్డి మీద తంతే, మూతిపళ్లు ఎందుకు రాల్తాయి? అనడగివోళ్లు. దెబ్బ తగిలిన సోటే... ఎదికీవాళ్లు. గాని, యిపుడలక్కాదు. దెబ్బ ఎవుళు కొట్టేరో, ఎక్కడ కొట్టేరో తెల్దు. మూతిపళ్లూ రాల్తాయి. మూసుకుపోనూ పోతాయి బతుకుదారులు!" చెప్తున్నాడు బలరాం.

'వేదాంతం మాట్లాడ్తన్నాడు రా... వేదాంతం! పట్నంల సెంటర్ బడ్డీ ఉన్నోడు. బడ్డీకొట్లుకి పెద్దరికం ఉన్నోడు. అన్నీ అమిరినోడు, ఆపదెరగనోడు- ఏదాంతంగాక మరేటి మాట్లాడతాడు?' అని మనసులో గుణుసుకుంటున్నాడు భద్రయ్య. బలరాం, ఇదేమీ గమనించకుండా, అదే ధ్యాసలో-

"...మన్లాటి చిన్నచిన్న బతుకులన్నీటికీ ముప్పు వొస్తంది. పెద్దపెద్ద చేపలు- కాదు కాదు, తిమింగళాలు వస్తన్నాయి. చిన్న చేపలిక బతకవు..." అన్నాడు బలరాం.

భద్రయ్యకి యేమీ అర్థం కాలేదు. తమలాంటి పేదలకి ఇవి రోజులు కావు అంటున్నాడని మాత్రం అర్థమైంది భద్రయ్యకు. అదే ఎందుకిలా రోజులు మారాయి? ఆ ప్రశ్నకే జవాబు లేదు. పల్లెటూర్లో తన తాతల్నాటి భూమి తన తండ్రి కాలానికి చెల్లిపోయింది. తన కాలానికి ఉన్న ఇల్లూ చెల్లగొట్టి, ఊరొదిలి వచ్చేడమైంది. భూమి నుంచి, ఊరు నుంచి, చివరికి ఈనాడు ఉపాధి నుంచి నెట్టేస్తున్న ఆ అదృశ్యశక్తులు... భద్రయ్యకు రేఖామాత్రంగానైనా కన్పించలేదు.

అంతలో ఏదో గుర్తొచ్చినట్లు, అప్పటిదాకా తాను చెప్పిన విషయాలకి భవిష్యత్ సాక్ష్యంగా- రంగురంగుల కరపత్రం ఒకటి జేబులోంచి తీసి చూపేడు బలరాం!

"అతి త్వరలో మీకోసం...! భవానంద కమర్షియల్ కాంప్లెక్స్! ఉప్పు నుంచి, ఉప్మాలో వేసే యాలకులు దాకా, వంట దినుసులు, వాడుక సరుకులు. మీ ఇంటికవసరమైన అన్ని వస్తువుల కోసం- ఇక మీరు బజారు వీధులన్నీ సంచీలు పట్టుకు తిరగక్కరలేదు. భవానంద కమర్షియల్ కాంప్లెక్స్ వస్తుంది మీకోసం. హోల్‌సేల్ ధరలకు, అతి చక్కని ప్యాకేజ్‌లతో మీకు ఇవ్వవలసిన అన్ని సరుకులు ఒక్కచోటనే అందిస్తుంది."

భద్రయ్య అక్షరం అక్షరం చదివేడు. అప్పుడు బలరాం మాటలు మళ్లీ గుర్తొచ్చేయి. చిన్న చేపలు ఇక బతకవు అంటే ఇదన్నమాట! ఇందుకన్నమాట!

"... కిల్లీ, బీడి, సిగరెట్‌లకి గూడా అక్కడే ఓపెన్ స్టాల్స్ పెట్తాడట. అన్నీ, అన్నీ అమ్మిస్తాడట అక్కడ," చెప్పాడు బలరాం.

భద్రయ్యకు, భవానంద కాంప్లెక్స్ తయారైపోయి, తమకి పోటీగా నిలబడినట్లే అన్పించింది.

"... అయితే, ఆ షాపింగ్ కాంప్లెక్స్ పెడితే మన బడ్డీలకి ఈగలు గూడా రావన్నమాట?" అనడిగేడు బలరాంని.

"ఈగలే వొస్తాయి. జనాలు రారు. బేరాలుండవు," చెప్పాడు బలరాం.

"రెడీమేడ్ డ్రెస్సుల్తోటి, రకరకాల కంపెనీల బట్టల్ని హోల్‌సేల్ ధరలకి అమ్ముతానని అద్దాల మేడగట్టి, ఏసీబెట్టి- 'చందనా'వోడు... పట్నంలోని చిన్నచిన్న బట్టల దుకాణాల మీదకి ఈగల్ని తోలీలేదా? అలగన్నమాట..." అని మరింత వివరించేడు బలరాం!

భద్రయ్యకి అప్పటిదాకా బడ్డీకొట్టు బ్రతుకు మీద మినుకుమినుకుమనే ఆశ వుండేది. బలరాం మాటల్తో... అదీ ఆరిపోయి నిరాశగా కూర్చున్న భద్రయ్య రంగుల పత్రాన్ని చూస్తూ, అనుమానంతో బలరాంని,

"...ఈ భవానంద కాంప్లెక్సు... ఎక్కడ పెడతాడు?" అడిగాడు.

"... పాత బస్టాండ్ ఏరియాలోనే..."

"మరీ, అది మున్సిపాల్టీ స్థలం గదా? మున్సిపాల్టీవోళ్లు మన బడ్డీల్నే లేపీమన్నారు గదా, కాంప్లెక్సుకెల గొప్పుకుంటారు?" అని ఆశతో, ఒక అనుమాన బాణాన్ని వొదిలేడు. బలరాం- తత్త్వవేత్తలా నవ్వి, భద్రయ్యను లేపి-

"అదా నీ అనుమానం? అయితే, ఇలారా నాతో..." అని తిన్నగా మున్సిపల్ కార్యాలయానికి తీసుకెళ్లాడు!

మున్సిపల్ కార్యాలయం ప్రహరీగోడ రకరకాల రాజకీయల పార్టీల నినాదాలనూ, గుర్తులనూ మోస్తోంది. ప్రహరీ దాటేక, ముందరి గ్రౌండ్‌లో పాడుబడిన ఒక రోడ్డురోలర్... రామపాదం కోసం ఎదురుచూస్తోంది. ముఖద్వారం ముందర మూడు అశోక చెట్లు- మునీశ్వరుల (ఆఫీసర్‌ల) శాపానికి (ఆగ్రహానికి) గురైన మూఢమతుల్లా (ఉద్యోగుల్లా) దిగాలుగా నిల్చున్నాయి. ముఖద్వారం గోడకి ఎడమవైపు, 'అక్షరక్రాంతి నినాదాలు', కుడివైపు 'ప్రగతికి పంచసూత్రాలు' రంగురంగుల్లో కలెక్టర్‌గారి మేడ మీద బల్బుల్లా మెరుస్తున్నాయి. అనేక గదులూ, అంతస్తుల్తో- అదో మాంత్రికుని గుహలా అన్పించింది భద్రయ్యకు.

లోపల, మున్సిపల్ ఛైర్మన్‌గారి అధ్యక్షతన సమావేశం జరుగుతోంది. అక్కడకు తీసుకెళ్లాడు బలరాం.

‘‘రోడ్లు బాగు చేయించాలి. బజారు పరిశుభ్రం చేయాలి. వీధులు ఇరుగ్గా ఉన్నాయి. విశాలం చేయాలి. వీధుల్లో కరెంటు దీపాలు పెట్టించాలి. స్కూళ్లన్నిటికీ వాటర్ కోసం బోర్‌లు కొట్టాలి.’’

ఇలా, ఏవేవో చేయాలి, చేయాలి అని చేతులెత్తి, డిమాండు చేస్తున్నారు ప్రతిపక్షంలో కూర్చున్నవారు. ‘అవన్నీ చేస్తాం,’ అని చెప్పి, అధికారాన్ని అనుభవించీ ఏవీ చెయ్యకుండా హాత్ ఇచ్చినందుకే ఇపుడు ప్రతిపక్షంలో కూర్చొన్నారు వాళ్లు!

‘‘చేస్తాం, అన్నీ చేస్తాం. మేము చెప్పింది చేసేవాళ్లము. చేస్తామని ప్రజలు నమ్మేరుగనకే అధికారమిచ్చేరు...’’ అధికార పక్షంవాళ్లు జవాబిచ్చేరు ధీమాగా!

‘‘...నమ్మకద్రోహం చేస్తే, ఆ ప్రజలే తమ అడ్రస్‌లు మార్చేస్తారు. గుర్తుంచుకోండి...’’ అని హెచ్చరించారు ఇండిపెండెంట్లు, ఆ వరుసలో కూర్చున్న కమ్యూనిస్టు మెంబర్లు! వీళ్లని అధికారంలో వున్న ఏ పార్టీవారు కూడా పరిగణనలోనికి తీసుకోరు కీలక సమయాల్లో! వీళ్లు గూడా పరిగణన కోసం తాపత్రయపడిపోరు. పూజారిగా వున్నాం గనుక, గంట వాయించక తప్పదన్నట్లుగా అపుడపుడలా హెచ్చరికలు చేస్తుంటారు. అంతకుమించి, అధికార రధంకి ఆటంకం కలిగించరు. అధికార రధం ఆగితే నెడతారు. మళ్లీ రధం కదిలితే తిడతారు వీళ్లు!

మున్సిపల్ ఛైర్మన్‌గారు అందరివైపూ చూసేరు. అందరూ మౌనం వహించేరు. అప్పుడు ఛైర్మన్‌గారు,

‘‘సభ్యులు సూచించిన అన్ని ప్రజాహిత కార్యక్రమాలూ వరుసక్రమంలో చేపడతాం. తప్పకుండా పట్నాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం. అయితే అందరూ గుర్తించాల్సింది మన నిధుల పరిస్థితి! నిధులుంటే కదా... ఏదయినా అభివృద్ధి చేయగలం...’’ అని చెప్పి ఆగేరు.

అధికారపక్ష సభ్యులు నిధుల కోసం తమని చందా యిమ్మంటాడేమో ఛైర్మన్ ముండా కొడుకు అన్న శంకతో, మొహాలు ప్రక్కకి తిప్పేశారు. ప్రతిపక్షంవాళ్లు పన్నులు పెంచొచ్చు, పెట్టుబడులు తేవచ్చు, అప్పులు రావట్టవచ్చు... ఎన్నో వచ్చులను వెలిబుచ్చేరు. ఇండిపెండెంట్లు, కమ్యూనిస్టులు ‘చ్చే చ్చే చ్చో’లు వెలిబుచ్చారు. అన్నీ చచ్చు సలహాలే అన్నట్టుగా, దవడ కండరాల్ని కదిపి దంతాల్లో ఇరుక్కున్న ఆహార పదార్థాన్ని తీరిగ్గా నములుతూ అందరివైపూ ఓసారి చూసి ఛైర్మన్‌గారు,

‘‘... ఇప్పుడు పాలిచ్చే (పాలు ఇచ్చేవారు కాదు, పరిపాలించేవారు) వారికందరికీ... ఎదురయ్యే సమస్యే ఇది. అభివృద్ధి పన్లు చెయ్యాలంటే నిధులు కావాలి. నిధులు కావాలంటే పన్నులు వెయ్యాలి. ఇక్కడే అసలు ప్రమాదం ఉంది. ఇప్పటి రాజకీయవేత్తలు దీన్ని గమనించకపోతే ఎన్నికల్లో ఓట్ల పెట్టె మన తలరాతల్ని తారుమారు చేస్తుంది. (ప్రతిపక్షంలో కూర్చున్నవారు... భుజాలు తడుము కున్నారు, అధికారపక్షంలో కూర్చున్నవారు బల్లలు చరిచేరు.)

‘‘పన్నులు వేయకుండా, వచ్చే నిధుల కోసం రాజకీయవేత్తలు ఆలోచించాలి. పన్నులు వెయ్యాల్సి వచ్చినా కనబడకుండా వెయ్యాలె. ప్రజలకి తెలీకుండా ఉండాల,’’ అని ఆగేరు ఓ క్షణం.

ఆ క్షణకాలం వృధా పోనీయకుండా ఇండిపెండెంట్ల వరసలోంచి ఒకరు-

"ఏనుగుల్ని సబ్సిడీ మీద సప్లయి చేసి, దాణాల ధరలు తారాజువ్వల్ని జేసెయ్యాలా!" అన్నాడు- అది హేళనో, అపహాస్యమో, సూచనో తెలీని రీతిలో.

ఛైర్మన్‌గారు మళ్లీ ప్రారంభించారు.

"పన్నులు వేయకుండా, అభివృద్ధి పన్లు చెయ్యాల! అందుకు నిధులు వచ్చే దార్లు వెదకాల. ఇపుడు, గౌరవసభ్యులు కోరిన అభివృద్ధి చెయ్యాలంటే- నిధుల కోసం అన్వేషించాల! ఈ సందర్భంగానే, మీకు ఒక విషయం చెప్పదలచాను.

"పాత బస్టాండ్ స్థలం... పనికిరాకండా ఉండిపోయింది. చిల్లర దుకాణాలూ, బడ్డీకొట్లూ, పల్లీలమ్మే బళ్లూ... పెట్టేసి నానా గలీజు చేశారు. చూడ్డానికి అసహ్యంగా ఉంటోంది. పోనీ, ఆదాయ మంటే మున్సిపాలిటీకి పైసా రావటం లేదు. ఒకప్రక్క కాన్వెంటు, పోలీస్‌స్టేషన్, మరోప్రక్క ఫైర్‌స్టేషనూ వున్నాయా, వాటిమధ్య ఈ బస్టాండు బజారు... దరిద్రంగా ఉంది."

"అవునవును అక్కడ ప్రకాశంగారి విగ్రహముండేది. దాన్ని కప్పేసి బడ్డీకొట్లొచ్చేశాయి. అక్కడ పార్కు గడితే... పట్నానికి మంచి 'శోభ' తెస్తుంది..." అన్నారు కళాభిమాని కవున్సిలీరు.

"ఆ స్థలంలో గ్రంథాలయం నిర్మించితే... ప్రజలకు యెంతో ఉపకరిస్తుంది..." గ్రంథాల యాభిమాని విన్నపం.

"...అవన్నీ చేయడానికి నిధులేవి? కొత్త ఆలోచనలు వద్దు. ముందు ఉన్నదాన్ని చక్కదిద్దాల! అసలు స్థలాన్ని అమ్మేసి, ఆ ప్రాంతంలో రోడ్లకి, వీధిలైట్లకి, నీటివనరులకి ఖర్చు చేస్తే చాలా మంచిది," అన్నారొక ప్రతిపక్ష సభ్యుడు.

అప్పుడు ఛైర్మన్‌గారు, ఆ సభ్యునివైపు స్నేహపూర్వకంగా చూస్తూ,

"... గౌరవ సభ్యుని సూచన చాలా బాగుంది..." అంటూ, ఇంకా మాట్లాడబోయేరు. ఆ కొస నుంచి, కమ్యూనిస్టు కవున్సిలీరు అడ్డు తగిలేరు.

"...పార్కు స్థలాలు, బజార్లు, బంజర్లూ ఒకొక్కటీ అమ్ముకుంటూ పోయి మరి దేన్ని అభివృద్ధి చేస్తారు? దేశాన్ని అమ్మేసి... మరి మీరింకెవర్ని అభివృద్ధి చేస్తారు? ఎవర్ని..." ఆవేశంతో ప్రశ్నించేరు.

ఛైర్మన్‌గారు, చేయెత్తి శాంతించమని కోరుతూ,

"...దేన్ని అమ్మినా ప్రజలకోసమే తప్ప, మనకోసం కాదు. అయితే మీరు భయపడ్డట్టు మేము అమ్మకం పెట్టలేదు. పాత బస్టాండ్ ఏరియాలోని మున్సిపాల్టీ స్థలాన్ని, వందయేళ్లు లీజుకు ఇద్దామను కుంటున్నాం. అలా లీజుకిచ్చినందుకు, వారు... మనం కోరిన విధంగా పాతబస్టాండ్‌లో గల ప్రకాశం విగ్రహానికి చుట్టూ పదిసెంట్ల స్థలంలో పార్కు కడతారు. బస్టాండ్‌కి ఆనించిన రోడ్డుని కాకి వీధి కొసదాక పోస్తారు. వీధిలైట్లు పెడతారు. నాలుగుచోట్ల బోర్‌పంపులు పెడతారు. ఈ పన్లు చెయ్యడం గాక, నెలనెలా మున్సిపాల్టీకి అద్దె చెల్లిస్తారు. సభ్యులు అంగీకరిస్తే అందుకు సంబంధించిన తీర్మానం చేసి, లీజుని ఆమోదించండి..." అని విజ్ఞప్తి చేశారు.

సభ గుసగుస, గురగుర, మర్మరాల్తో కొంతసేపు గజిబిజి అయ్యింది.

అంతదాకా విన్న భద్రయ్య... అక్కడ నిల్చోలేకపోయాడు. భద్రయ్యని అక్కడనించి తీసు కొచ్చాడు బలరాం.

మున్సిపల్ ఆఫీసు వరండాలోకొచ్చి నిస్సత్తువుగా అక్కడ బెంచీల మీద కూర్చున్నారిద్దరూ. అలా కొంతసేపు ఎవరి ఆలోచనలో వాళ్లు వుండిపోయారు.

సభ ముగిసినట్టుంది. ఒకొక్కరే నాయకులు బయటకు వచ్చి వారివారి వాహనాల మీద ఆసీనులై వెళిపోతున్నారు. ఆఖర్న ఒకాయన వచ్చేడు. దగ్గరగా వచ్చేక, చూసి పోల్చుకున్నాడు భద్రయ్య ఆయన్ని. 'హరిశ్చంద్రుడు' నాటకంలో విశ్వామిత్రుని శిష్యబృందంలో ఒక శిష్యునిగా వేషం వేసినపుడు చూసినవాళ్లం, అతడే హరిశ్చంద్రుడు వేషం వేస్తే చూసిన వెంటనే పోల్చలేం. తటపటాయిస్తాం. భద్రయ్య ఆయన్ని చూస్తూ తటపటాయిస్తుంటే,

"... అతనే, ఛైర్మన్, మున్సిపల్ ఛైర్మన్..." చెప్పాడు బలరాం గుసగుసగా భద్రయ్యకు.

అప్పుడు గుర్తొచ్చి పోల్చుకున్నాడు భద్రయ్య. ఆనందం విరిసింది మొహంలో. సంతోషంతో బలరాంని చూస్తూ,

"మా జాతర్లపల్లి నాయుడుగారి బామ్మర్ది. ఈ బాబు కాడే... నేను తొలీత నైటు వాచ్‌మేన్ని," అని గబగబా చెప్పి, ఆ బాబుగార్ని పలకరించడానికి పరుగెత్తాడు. అప్పటికే ఆ బాబుని మోసు కుంటూ, మారుతీకారు కదిలిపోయింది. భద్రయ్య మీదకు ధూళినీ, పొగనీ ఎగరేసింది.

బలరాం మెల్లగా నడుచుకుంటూ భద్రయ్యను చేరేడు. భద్రయ్య కళ్లు నులుముకుంటు న్నాడు ధూళిరేణువుల వలన. బలరాం ఇళ్లకు వెళిపోదాం అన్నాడు. భద్రయ్యకు ఏం చేయడమో తోచలేదు. బలరాం ఏదేనా దారి చూపుతాడనుకుంటే విషయం విప్పి చూపించేడుగానీ దానికి విరుగుడు దారి చూపలేదు. మరి అతగానికీ తెలీదేమో? సేల్స్‌టేక్సోల్లూ, సివిల్ సప్లయోల్లూ, మున్సిపల్ ఆఫీసోల్లూ- ఏమేనా అల్లరి చేస్తే ఆదుకోడానికి సంగం పెట్టాడు బలరాం. గానీ, ఇలాంటి ఆపదలకి ఏటిజెయ్యాలో అతనికీ వశంకాదు. మౌనంగా, ఎవరిళ్లకు వారు దారి మరలబోతూ-

"... ఇతగాడు రాజకీయాల్లోకి ఎపుడు దిగేడు? రియల్ ఎస్టేట్లూ, కాంట్రాట్లూ, వ్యాపారాలు జేసీవోడు. ఇందలెపుడు దిగేడు?" తనలో తాను ప్రశ్నించుకున్నట్లుగా ప్రశ్నించేడు భద్రయ్య.

"...రాజకీయమూ, వ్యాపారమూ రెండూ నడుపుతండు. ఇపుడు పట్నంల పెద్ద చెయ్యి ఇతగాన్దే. వ్యాపారం కోసం రాజకీయాలూ, రాజకీయాలకి మదుపుల కోసం వ్యాపారాలూ చేసే రోజులివి..." అన్నాడు బలరాం.

భద్రయ్య జవాబుని ఆశించి వేయలేదు ప్రశ్నని. అందుకనే వినలేదు బలరాం మాటల్ని. పరాకుగానే, వస్తానంటూ, వింటిదారి పట్టేడు భద్రయ్య.

భద్రయ్య ఇంట్లో అడుగుపెట్టగానే, భార్య ఆదిలక్ష్మి భద్రయ్యను ఆతృతగా,

"... ఏటయ్యింది ఎల్లిన పని?" అని అడిగింది.

భద్రయ్యకు ఏం జవాబు చెప్పాలో తోచలేదు. లోపల ఏవేవో సమాధానాలున్నాయి. ఇంకేవేవో ప్రశ్నలున్నాయి. అవన్నీ ఒక దగ్గర పరచి, చూసుకోవాలని ఉంది. అపుడు, ఆదిలక్ష్మికి ఆ జవాబు చెప్పగలడు.

భర్త మౌనంగా ఉండడంతో, ఆదిలక్ష్మికి భయం పెరిగింది. ఆతృత ఇంకా ఎక్కువైంది. మళ్లీ ప్రశ్నించబోయింది. అంతలో భద్రయ్యే,

"... నాయుడుగారి బామ్మర్దే మున్సిపల్ ఛేర్మేన్. ఆయన్ని ఓపాలి కలాల!" అన్నాడు.

"... ఇంకెపుడు కలుస్తావ్? బడ్డీకొట్టుని అక్కడ్నించి తీసీసినారు కాదేటి? ఆలీసమైతే, ఆ బడ్డీని ఎందల తోసేత్తారో ఆళ్లు..." అంది ఆదిలక్ష్మి.

"... ఇపుడింక మీటింగయింది. ఆ బాబు ఇంటి కెల్తండు. కసింత అన్నం బెట్టు తినీ సెల్తాను," అన్నాడు భద్రయ్య.

"...వొక పన్జెయ్యగూడదూ? ఈ బాబుని కలసీ బదులు, మనూరెల్లి నాయుడిగారినే కలిస్తేనో? అతగానయితే మనకీ చనువుంది. ఆ ఏరియా మనుషులం గనక అతగానికి ఆ ఇంత అప్మానమేనా ఉంటాది," అని సలహా ఇచ్చింది.

భద్రయ్యకు ఆదిలక్ష్మి సలహా నచ్చింది. చిక్కుల మధ్య సతమతమయ్యే భద్రయ్యకి చిన్నగా ఆశ కన్పించింది... నాయుడుగారి మీద.

భోజనం జేస్సి, బయల్దేరాడు జాతర్లపల్లి.

*

జాతర్లపల్లి జంక్షనులో బస్సు దిగి, ఊర్లోకి నడుస్తుంటే భద్రయ్యకు... గతమంతా కదలాడింది. చిన్ననాడు ఈదులాడిన వంశధార నది గలగలలు, గుండెల్లో ఊసులాడసాగేయి. కూత వేటు దూరాన్నించి విన్పించే బంగాళాఖాతం సముద్రహోరు చెవులకి సోకుతోంది. కాలిబాట... పురాతన మిత్రుడిలా ఊరిలోకి దారి చూపుతూ తీసుకుపోయింది భద్రయ్యను.

నాయుడుబాబు... పెద్దింటి ముందుగదిలో పందిరికోళ్ల మంచమ్మీద చేరబడి ఉన్నాడు. ఎదురుగా ఎవరో కుర్రాడు... ఖరీదైన డ్రెస్సులో, దర్జాగా రాజ్యాన్ని కొనేయగలిగిన కంపెనీ ఓనర్లా ఉన్నాడు. నాయుడుబాబుకి ఏవో లెక్కలు చెప్తున్నాడు. భద్రయ్య దండాలు పెట్టాడు... ద్వారం దగ్గరే నిల్చొని. నాయుడుగారు ప్రశ్నార్థకంగా చూస్తుంటే-

"నీను బాబు, భద్రయ్యని..." అన్నాడు భద్రయ్య.

నాయుడుగారి కళ్లు క్లోజప్‌లోకొచ్చేయి. భద్రయ్య ద్వారందాటి గదిలోకొచ్చి చేతులు జోడించి-

"అప్పుడు, నా తండ్రి తమ ట్రాక్టరు కిందపడి, నడుము జారిపోయి, ఆస్పత్రి పాలయితే, ఆడి వొయిద్యంకి పట్నంకి కాపురం మార్సినపుడు తమరే దారి సూపినారు నాకు. తమరి బామ్మర్దిగార్ని సూపించేరు," అని చెప్పుకొస్తున్నాడు.

నాయుడుగారు ఔనన్నట్లు తలూపుతూ,

"...ఆ తర్వాత నువ్వు పెళ్లీపెటాకులూ జేసుకున్నావటా? వాచ్‌మేన్ పనిమానేసినావట. తాపీమేస్త్రీ వయ్యావట. ఆ తర్వాత బడ్డీకొట్టు పెట్టి బతుకుతున్నావని... ఎవరో సెప్పార్రా," అన్నారు.

"ఔను బావ్ అందరి పున్నేనా, బ్యాంకీ మేనేజరు దయవొల్లా బడ్డీకొట్టు పెట్టాను. పిల్లాజెల్లా కుటమాం బతుక్కొచ్చేం. ఇపుడు బడ్డీకొట్లు యెత్తీయాల అంటన్రు. అనడమేమిటి బడ్డీలన్నీ... లేపేస్తున్నారు," అన్నాడు దీనంగా భద్రయ్య.

"... ఎక్కడ పెట్టావురా నువ్వు బడ్డీ?" అనడిగేరు నాయుడుగారు.

"పాత బస్‌స్టేండుల..." చెప్పాడు భద్రయ్య.

"...అంటే? మనం కమర్షియల్ కాంప్లెక్స్ పెడుతున్న ఏరియాలోనా?" నాయుడుగారినో, భద్రయ్యనో ప్రశ్నించేడు... అప్పటిదాకా యేవో కాగితాలు లెక్కలు చూపుతున్న ఖరీదైన కుర్రవాడు.

భద్రయ్యకు ఏమీ అర్థం కాలేదు.

నాయుడిగారికి అర్థమైంది. భద్రయ్యతో,

"బడ్డీ మరొక్కాడికి మార్చీగూడదా?" అన్నారు.

"... పట్నంల మరెక్కడా చోటులేదు! మంచి బిజినీస్ వున్న సెంటర్‌ల స్థలం దొరకదు. దొరికినా అద్దెలిచ్చుకోలేం," అన్నాడు భద్రయ్య.

"అయితే మరి, ఈ ఊరొచ్చేస్తావా?" అడిగేరు నాయుడుగారు.

"ఈ ఊర్లోగూడా, బడ్డీకొట్లు ఎక్కువే ఉన్నట్లుంది?" అని మళ్లీ ప్రశ్నను మధ్యలోకి విసిరేడు ఖరీదైన కుఱ్ఱాడు.

"ఆఁ! ఎక్కువే. గ్రామీణ బ్యాంకుల ద్వారా... కిరాణాబడ్డీ, కిల్లీబడ్డీ, ఆఖరికి సెలూన్ బడ్డీలూ వొచ్చాయి. బడ్డీలెక్కువా, బేరాలు తక్కువా! ఈళ్లకి తోడు నువ్వొచ్చి... ఈగలు తోలాల," అన్నారు నాయుడుగారు.

"...అదికాదు బాబు, పట్నం మున్సిపల్ ఛేర్మేన్ తమ బామ్మర్దిగారే. ఆ బాబుకి తమరు సెప్తే నా బడ్డీ అక్కడే వుంచీయొచ్చు..." భద్రయ్య.

"అది వీలుకాదు, అక్కడ బడ్డీ ఉంచ వీల్లేదు..." అన్నాడు చాలా దృఢంగా ఖరీదైన కుఱ్ఱాడు. అంతదాకా పట్టించుకోని భద్రయ్య- అప్పుడు చూసేడు ఖరీదైన దుస్తుల్లో వున్న ఆ కుఱ్ఱాడ్ని పరిశీలనగా!

"... మా రెండో అబ్బాయిరా భద్రయ్యా. ఫారిన్‌లో... ఎంబియ్యే చదివేడు. ఈమధ్యే వచ్చేడు. ఏవేవో వ్యాపారాలు ఫారిన్ వోల్తోటి ఏక్కడ నుంచే చేత్తాడట. ఈ కాగితాల్లో ప్లాన్లు చెప్తండు. నాకేటి బోధపడదు. గానొకమాట... తెలివయినోడు. మన్లాగ కాదు. మనది ఇండియా బుఱ్ఱ! ఆడిది ఫారిన్ బుఱ్ఱ. అందికనే, కానీయమని సిగ్నేలిచ్చేసేను, మనకేటి బోయింది? ఎప్పుడికేనా?... ఈ ఆస్తి సూసుకోవాల్సింది ఆళ్లేగదా? పెరగేసుకుంతారా... తరగేసుకుంతారా అన్నది ఆళ్ల తెలివితేటలూ, అదృష్టం బట్టి కదా ఉంతాయి. అయితే వొకటీ... తాత్తండ్రుల కాంచి సేరి భూములు నిలుపు కొచ్చేను. ఆట్ని మాత్రం సెడగొట్టనీను. 'నాయుడోరి సేరీ' అన్నమాట సెరిగి పోగూడదన్నాను," అంటూ ఏవేవో తన కుటుంబ విషయాలు చెప్పుకొస్తున్నారు నాయుడుగారు.

భద్రయ్యతో అలా చెప్పుకొనే గత చనువేమీ లేదు. కానీ నాయుడుగారి ఆశలకు మించి కొడుకులు అందుకొచ్చినందుకు ఆనందం పొంగి... దాన్ని దాచుకోలేక అందరితో చెప్పుకు ఆనంది స్తున్నారాయన.

"భద్రయ్యా... నీ బడ్డీని అమ్మేసి, మా కాంప్లెక్స్‌లో షేర్‌హోల్డర్ ఎంప్లాయీగా చేరిపో. పట్నంలో ఇంటింటికీ మా కాంప్లెక్సు సరుకుల్ని బుకింగ్ చేసుకు రావాలి. వాట్ని డోర్ డెలివరీ చేయాలి. దీనికి తగ్గట్టు నీకు జీతము, కమీషనూ వుంటుంది. అదనంగా మా కంపెనీ షేర్‌హోల్డర్‌వి గనక కంపెనీ లాభాల్లో నీకూ వాటా ఉంటుంది. ఆ పన్చెయ్యి. మన ఊరివాడివి గనక నీకు ఈ అవకాశం యిస్తున్నాను..." అని చెప్పాడు ఆ ఖరీదైన కుఱ్ఱాడు.

భద్రయ్యకు ఏమీ అర్థంకాలేదు. ఆ కుఱ్ఱాడు ఏం చెప్పాడో బోధపడలేదు. బడ్డీకొట్టు మాత్రం యిక వుండదన్నాడని అర్థమైంది. పెట్టుకున్న యీ ఆశా పూసిపోయింది. జోడించిన చేతుల్ని దించేసి దిగాలుగా నిల్చున్నాడు భద్రయ్య.

"...ఆ పన్జెయ్యిరా భద్రయ్య. బాబు కంపెనీల చేరిపో. నీ కడుపుకి లోటు రానీడు..." అన్నారు నాయుడుగారు.

"పదిరోజులు పోతే... మళ్లీ కలువ్. ఏంచేయాలో చెప్తాను..." అన్నారు బాబు.

భద్రయ్య... వస్తానని చెప్పటం కూడా మరచిపోయి, విచారంగా వచ్చేశాడు. వీధిలో ఎవరెవరో పలుకరిస్తే... పరాకుగా పలుకుతూ రోడ్డు దోవలోకి వొచ్చేడు. దోవ మలుపులెన్నో

తిరుగుతోంది. భద్రయ్య ఆ మలుపులన్నీ... తన బతుకూ తిరుగుతోంది గదా అనుకున్నాడు. బస్ రోడ్డు చేరాడు. సరిగ్గా బస్ అపుడే వచ్చింది. ఎక్కేశాడు. సాయంత్రానికి పట్నం చేరిపోయేడు.

బస్ దిగి, ఇంటివైపు నడుస్తుంటే రోడ్డు మీద పెద్ద ఊరేగింపు ఎదురయ్యింది. తనకు నడిచే దారి కష్టమైంది. గోలగోలగా అరుస్తున్నారు. రకరకాల అట్టల్లో నినాదాలున్నాయి. భద్రయ్య... ఏవిటి? ఎందుకీ ఊరేగింపు? అనడిగితే ఎవరూ చెప్పరు. అంతా నినాదాల్లోనే ఉన్నారు.

చెవి వొగ్గి వింటే,

“ప్రైవేటీకరణ వ్యతిరేకించండి...” విన్పించింది. అంటే ఏమిటో అర్థంగాక, భద్రయ్య మరో నినాదం వినబోతుంటే ఊరేగింపు జనంలో బలరాం కన్పించేడు. భద్రయ్య నిల్చుండిపోయేడు. అటువైపే చూస్తూ! బలరాం పిడికిలి బిగించి, అరుస్తున్నాడు. మనిషంతా ఉద్రేకంతో ఊగిపోతున్నాడు.

బలరాంని చూస్తుంటే భద్రయ్యలో చలనం కలిగింది. అతు కళ్లల్లో ఆ వెంటనే ఆవేశం! త్వరత్వరగా వెళ్లి బలరాం ప్రక్కన జేరి... అతని అడుగులో అడుగూ గొంతులో గొంతూ కలిపేడు భద్రయ్య.

*నాగావళి కథలు*
*9 నవంబర్ 1995*

## నేపథ్యం

# సరళీకృత ఆర్థిక విధానాల విశ్వరూపం
# భద్రయ్య

***చాసోగారి జంక్షన్‌లో బడ్డీలాగ కేవలం పట్నంలో మోసకారి ప్రముఖుల కారణంగా ఇవ్వేళ- బడ్డీకొట్లు తొలగించబడినాయి అని- ఇప్పుడు కథ చెప్పకూడదు. చాసోగారి కాలం కంటే ముందుకు పోయింది వ్యవహారం. సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో బార్లా తెరిచిన మార్కెట్ ద్వారాల గుండా- ఈ దేశం నలుమూలలకీ సామ్రాజ్య వాద, బహుళజాతి బడా వ్యాపారం చొరబడిపోయింది రకరకాల రూపాలలో!***

నిజానికి నేను రాసిన తొలి కథ పువ్వుల కొరడా నుంచి ఇప్పటిదాకా, ఏదో సంఘటన, సంభాషణ, సంఘర్షణ లేదా ఓ భావజాలం- నన్ను ప్రభావితం చేస్తేనే- కథ రాయడం జరిగింది. గనక, నేను అన్నివేళలా కథ రాయాలనుకొంటే కొందరిలా రాయలేక పోయాను. అందుకనే, పదిహేనేళ్ళ కాలంలో నలభై కథలకు మించి రాయలేక పోయాను.

కథానేపథ్యం వివరించడానికి ఇటీవలి కాలంలో ప్రచురణ అయిన, ఎక్కువ మంది చదివి ఉండగలిగిన కథను ఎంచుకొంటే ఉపయుక్తంగా ఉంటుందని భావించి భద్రయ్య కథ నేపథ్యాన్ని మీ ముందుంచుతున్నాను.

1995 నవంబర్ తొమ్మిదిన, ప్రసిద్ధ కథారచయిత కారా మాస్టారి డెభ్భయ్యో కటవ జన్మదిన కానుకగా శ్రీకాకుళసాహితి ప్రచురించిన *నాగావళి కథలు* సంకలనం లో భద్రయ్య కథ ఉంది.

నేను- ఎదిగే క్రమంలోనున్న పట్నంలో నివాసముంటున్నాను. ఒకరోజు బజార్లో సరుకులు కొనుక్కొని వస్తుంటే- పాత బస్టాండ్ ఏరియాలోని బడ్డీకొట్లన్నింటినీ- మోకుతాళ్ళు గట్టి ఎవరో కళాసీలు లాగేసి, మోసుకుపోతున్నారు. ఆ బడ్డీకొట్ల యజమానులు ఘోష పెడ్తున్నారు. పోలీసులు వాళ్ళను అదిలిస్తున్నారు. ఒక్కో బడ్డీకొట్టూ- మట్టంతో సహా లేచిపోతోంది! మనిషిని పాడె మీద గట్టి స్మశానానికి మోసుకుపోతు

న్నట్టుగా ఆ దృశ్యం కన్పించింది నాకు. చాన్నాళ్ళు ఆ దృశ్యం మనసులో తిరిగింది. కథ రాయాలనుకొన్నాను. రోజూ పాత బస్టాండ్‌కి వెళ్ళేవాణ్ణి. పట్నంలో మార్కెట్ వీథుల్ని గమనించేవాడ్ని. పట్నం ఒకప్పటికంటే బాగా విస్తరించినట్లుగా తెల్సింది. ఒకప్పటి బస్తీ... ఇప్పుడు నాలుగు వైపులా పెరిగి నగరం స్థాయికి చేరబోతోన్న పట్నం అవుతోందని- పెద్ద పెద్ద ఎ.సి. షోరూములూ, రెసిడెన్షియల్ కాలేజీలూ, రెస్టారెంట్లూ, కమర్షియల్ కాంప్లెక్సులూ, కొత్తకొత్తగా వెలుగులోకొచ్చిన ట్రేడర్లూ, షేర్‌బ్రోకర్లూ, రియలెస్టేట్ సంస్థలూ, ఇతరాలూ చూసేక అర్థమయ్యింది.

'పట్నం డెవలప్‌మెంట్‌కి బడ్డీకొట్లు అవరోధం,' అన్న వాదన బడ్డీలు పీకేయించిన మున్సిపల్ అధికార యంత్రాంగం నుంచి విన్పించింది.

గానీ నాకా సమాధానం మరోవైపు ఆలోచింపజేసింది. మొదటిదశలో- బస్తీగా ఉన్న కాలంలో బడ్డీకొట్లు... బస్తీలోని వ్యాపార అవసరాలకు సరిపోయేవి. బస్తీ ఎదిగి ఎదిగి పెద్ద పట్నంగా మారేక- వ్యాపార అవసరాలూ ఎదిగాయి. బడ్డీలు చాలవు- భవంతులు రావాలి. వచ్చేయి. పాత బస్టాండ్ ఏరియాలో బడ్డీకొట్లు తొలగిపోయి- 'భవానంద కమర్షియల్ కాంప్లెక్స్' వచ్చింది... ఏడాది తిరిగేసరికి!

అప్పుడు కథ రాయగలిగాను. విషయం అర్థమైంది. బస్తీ- పట్నంగా ఎదిగే క్రమాన్ని... గత పదిహేనేళ్ళ పట్నం చరిత్రను తెల్సుకొన్నాను. పట్నంలో ఒకప్పటి పల్లెటూరి భూస్వాముల్లో బాంధవ్యం కలిగిన కొందరు- ప్రముఖ వ్యక్తులుగానూ, వారికి కాంగ్రెస్ రాజకీయాలు ఉండటం- పట్నం ఎదిగే క్రమంలో- వ్యాపారాల్తో, కాంట్రాక్టుల్తో, జూదశాల, పానశాలల నిర్వహణల్తో కొత్తగా కొందరు ప్రముఖులు వెలుగులోకి రావడం, వారికి తెలుగుదేశం పార్టీ రాజకీయాలు ఉండటం... చరిత్ర పరిశీలనలో కన్పించాయి. ఎదుగూబొదుగూ లేని చిన్న వ్యాపార్లకి, కూలీలకి, కళాసీలకి... కమ్యూనిస్టు రాజకీయాలు మిగిలాయి.

ఇక- అప్పుడు చెప్పదల్చుకొన్న విషయం బోధపడింది. చాసోగారి జంక్షన్‌లో బడ్డీలాగ కేవలం పట్నంలో మోసకారి ప్రముఖుల కారణంగా ఇవ్వేళ- బడ్డీకొట్లు తొలగించబడినాయి అని- ఇప్పుడు కథ చెప్పకూడదు. చాసోగారి కాలం కంటే ముందుకు పోయింది వ్యవహారం. సరళీకృత ఆర్థిక విధానాల పేరుతో బార్లా తెరిచిన మార్కెట్ ద్వారాల గుండా- ఈ దేశం నలుమూలలకీ సామ్రాజ్య వాద, బహుళజాతి బడా వ్యాపారం చొరబడిపోయింది రకరకాల రూపాలలో! అవి చివరికి ఈ దేశ సంక్షేమాన్ని అయిదేళ్ళ కోసారి ఓట్ల నినాదంగా మిగిల్చి, పాలకవర్గాల వారినీ అస్వతంత్రుల్ని చేస్తున్నాయి. హైటెక్ రూపంతో కన్పించే అభివృద్ధి నిజానికి అశేష ప్రజానీకానికి గానీ, దేశానికిగానీ చెందడం లేదు. గనుకనే ప్రజలు సరళీకృత ఆర్థిక విధానాలకి వ్యతిరేకిస్తూ ఆందోళనలు నడిపారు. ఈరోజుకీ... వ్యతిరేకిస్తున్నారు. భారీ పెట్టుబడుల ప్రవేశంతో జరుగుతోన్న విధ్వంస దృశ్యాన్ని- బడ్డీకొట్టు వాని బ్రతుకు నుంచి కథగా చెప్పాలి. అప్పుడు ఆ కథ వర్తమానానికి ఉపకరిస్తుంది. అదిగో, ఆ ఆలోచనల్తో తిరిగి, తిరిగి అక్షరరూపానికి దిగేను. అపుడు భద్రయ్యా పుట్టాడు.

సాధారణంగా- బడ్డీకొట్టు యజమాని పదవతరగతి మించని చదువరి అయి ఉంటాడు. ఇతరత్రా ఆస్తిపాస్తులు పెద్దగా ఉండవు. అయితే, నేను భద్రయ్యను పల్లెటూరి నుంచి వలస వచ్చినట్లు రాశాను. ఎందుకంటే, పల్లెటూరిలో తాతలనాటి కొద్దిపాటి భూమి తండ్రి నాటికి కరిగిపోయి- కూలీగా మారిన క్రమంలో- ఆ పల్లె భూస్వామి మాత్రం పట్నం హైటెక్ బిజినెస్‌కి తన కొడుకు ద్వారా ప్రణాళికలు రచిస్తుంటాడు. పల్లెలో భూస్వాములు- నగరాల పెట్టుబడిదార్లతో

చిక్కగా బంధుత్వం కలిగిన దృశ్యాలు నాకెన్నో కన్పించేయి. మార్క్సిస్టులు చేప్పే- 'భూస్వామ్యంతో రాజీపడింది సామ్రాజ్యవాదం,' అన్న వాక్యంకి ఉదాహరణగా భద్రయ్య ఊరికి చెందిన నాయుడు గారికీ, పట్నం ఛైర్మన్‌గారికీ బంధుత్వం చూపించాను. నిజానికిది కల్పన అయినా... అనేక వాస్తవాల సమ్మిశ్రమం ఇది.

భద్రయ్య అనే కథలో హీరోని పల్లె పోషించలేక- పట్నంకి వలస పంపించిందని చెప్పడానికి భద్రయ్య జన్మస్థానం పల్లె అన్నాను. అలాగే భద్రయ్య పాత్ర గుర్తుండే రీతిలో మలిచేందుకు- అతణ్ణి పదవతరగతి ఇంగ్లీషు, లెక్కలు సబ్జెక్టుల్లో పరీక్ష తప్పినవాడిగా రాశాను. సాధారణంగా పల్లెటూరి విద్యార్థులకి ఇంగ్లీషు, లెక్కలు సబ్జెక్టులు పెనుగండాలు. బహుశా ఆ రెంటికీ సరైన టీచర్లు, ట్యూషను ఉండాలి- అవి పల్లె విద్యార్థులకు దొరకవు.

అలాగే, భద్రయ్యను 'నమస్కారాల భద్రయ్య'గా చూపించేను. పట్నం వచ్చి, వాచ్‌మేన్‌గా, తాపీ పనివాడుగా బ్రతుకు ఈడ్చే భద్రయ్య ఒక బ్యాంకు మేనేజరు పుణ్యాన బడ్డీకొట్టు యజమాని అవుతాడు. ఆ సందర్భంలో తాపీమేస్త్రీ రాజప్పడు, "... నమస్కారాలు దండగయిపోలేదురో... ఉపకారం పొందేవు..." (పేజీ-29) భద్రయ్యను చూసి, అతడి నమస్కారాల వల్లనే బడ్డీ సంపాదించే డన్నట్టు మాట్లాడతాడు. భద్రయ్య తండ్రికి నడుం విరిగిపోవటం, పట్నం వలస రావటం, పట్నంలో ఒక పెద్దమనిషి కంపెనీలో వాచ్‌మేన్‌గా ఉండటం- ఆ పెద్దమనిషి రియల్ ఎస్టేట్ యజమాని! ఆయనే తర్వాత రాజకీయాల్లో చేరి, పట్నం మున్సిపల్ ఛైర్మన్ కావటం! అతనికీ, భద్రయ్య స్వగ్రామంలోని నాయుడిగారికీ బావామరుదుల బంధుత్వం ఉండటం- ఇదంతా కథ... పాఠకునికి కేంద్రీకరించిన వస్తువుగా... కన్పించాలని చేసిన కల్పన.

భద్రయ్య పల్లె నుంచి పట్నానికి మారి, చివరికి బడ్డీకొట్టు యజమాని అయ్యేంత దాకా- ఏఏ శ్రమలు పడ్డాడో రాస్తే- భద్రయ్య మీద పాఠకునికి సానుభూతి కలుగుతుంది. అందుకోసం అవన్నీ రాసేను.

ఇక ఆ బడ్డీకొట్టు ద్వారా కొన్ని సంవత్సరాలు- లాభాలు పొంది కుటుంబం హాయిగా గడుస్తుంటే ఆపదొస్తుంది. బస్టాండ్ మారిపోతుంది. పట్నంలో మరోచోట కాంప్లెక్స్ కడతారు. భద్రయ్య బడ్డీకొట్టుకి బేరాలు తగ్గిపోతాయి. కాంప్లెక్స్‌లు రావటం, బస్సుల జాతీయం వగైరాల వలన ఎవరు లబ్ధి పొందారు, ఏ రాజకీయాల మార్పులు జరిగాయి చూపించడానికి- భద్రయ్య బడ్డీకొట్టుకి బేరాలు పోవడం వెనుక కారణాలు చూపించాను. ఆ తర్వాత, పట్నం మెల్లమెల్లగా ఎదగటము, కాన్వెంట్ రావటం, ఎవరో నర్సింగ్‌హోమ్ పెట్టడం, అగ్నిమాపకదళ ఆఫీసు రావటం- పట్నం శాంతిభద్రతల కోసం టూ టౌన్ పోలీస్‌స్టేషన్ రావటం- మళ్ళీ భద్రయ్య బడ్డీకొట్టుకి బేరాలు ఆరోహణా క్రమంలోకి వస్తున్నాయని చూపేను. ఈ ఆరోహణ కొన్నాళ్ళే. ఏ విస్తరణైతే- తన బడ్డీకి మళ్ళీ బేరాలకు అవకాశం ఇచ్చిందో- ఆ విస్తరణను అంతటినీ, అన్ని మూలల నుంచీ నొల్లుకు పోయేందుకు... పంచరంగుల వల విసిరే శక్తులు అప్పటికే అక్కడ చేరిపోయాయి.

"...దేన్ని అమ్మినా ప్రజల కోసమే తప్పా, మనకోసం కాదు. పాత బస్టాండు ఏరియాలోని మున్సిపాలిటీ స్థలాన్ని వందయేళ్ళు లీజుకిద్దామనుకొంటున్నాం- ఆ లీజు వలన వచ్చే ఆదాయంతో పట్నంలో అభివృద్ధి పనులు చేపడతాం..." మున్సిపల్ ఛైర్మన్‌గారు తప్పనిసరి స్థితిలో- బడ్డీకొట్లు తొలగించి, ఆ స్థలాన్ని ఒక పెద్ద వ్యాపారసంస్థకు లీజుకిస్తారు. పెద్ద పెద్ద వ్యాపారసంస్థలు రాల్చే ఎంగిలి మెతుకుల్తో దినదిన సంక్షేమ పథకాలు అమలుచేసే దుర్బల స్థితిలో ఈవేళ పాలకు

లున్నారు. దాన్ని వ్యక్తపరచటానికి బడ్డీకొట్ల స్థలం లీజుకిచ్చి, అక్కడ 'భవానంద కమర్షియల్ కాంప్లెక్స్' నిర్మించి భద్రయ్యలాంటి బడుగు వ్యాపారుల బ్రతుకుల్ని ముంచినట్లు చూపించేను. నిజానికిక- భద్రయ్య బడ్డీకొట్టు ఉండినా లాభంలేదు. భద్రయ్య బడ్డీకొట్టుకి బేరాలు మునుపటిలా రావు!

"... అయితే, ఆ షాపింగ్ కాంప్లెక్స్ కడితే మన బడ్డీకొట్ల కిక ఈగలు గూడా రావన్నమాట?"

"ఈగలే వొస్తాయి. జనాలు రారు. బేరాలుండవు..." (పేజీ-32)

భద్రయ్యలాంటి బ్రతుకులకు భద్రతలేని, సరళీకృత ఆర్థిక విధానాలను వ్యతిరేకించక పోతే... నష్టపోయేది మనమూ, మన దేశమూ?

బడ్డీకొట్టు బ్రతుకుల మీద ఇవ్వేళ్టి రాజకీయ, ఆర్థిక ప్రతిఫలాలు ఎలాగున్నవో చెప్పటానికి 'బడ్డీలు తొలగించే దృశ్యం' వెనుక చరిత్రనంతా తడిమాను.


ఒక ఘటనను కథ రాసే ఆరంభదశ నుంచి, ఇవ్వేళ ఆ ఘటనకు వెనకగల చరిత్రను కథనం చేసే దశకు ఎదిగానని ఈ కథను సమీక్షించిన పెద్దలు నా భుజం తట్టేరు. నిజానికి, ఆ ప్రశంస నాలో పరిశీలనా పద్ధతిని అలవాటు చేసిందిపుడు. నిశిత పరిశీలన, నిబద్ధత... కథకుడికి కావాల్సిన సద్గుణాలు.

*ఆంధ్రజ్యోతి ఆదివారం*
*31 ఆగస్టు 1997*

3

# మనిషి లోపలి విధ్వంసం

## అల్లం రాజయ్య



*__అల్లం రాజయ్య__ 1952 జూన్ 5న కరీంనగర్ జిల్లాలో జన్మించారు. మొదటి కథ హీరో 1975లో జ్యోతి మాసపత్రికలో అచ్చయింది. 98 కథలు, 6 నవలలు ప్రచురించారు. ఇటీవలే వీరి రచనలు సమగ్ర సంపుటాలుగా రావడం మొదలై, అల్లం రాజయ్య రచనలు మొదటి రెండు భాగాలు విడుదలయ్యాయి. మంచిర్యాల సిమెంటు ఫాక్టరీలో ఉద్యోగ విరమణ చేశారు.*

**చిరునామా**

*12-285/1, కిరణ్ సదనమ్,*
*గౌతమినగర్, మంచిర్యాల-504 209*
*ఆదిలాబాద్ జిల్లా*
*Ph.: 99495 70630*

అదొక చిన్న రైల్వేస్టేషన్. ఆ స్టేషన్ భవనాలు నైజాం కాలంలో కట్టినవి. ఈ ఏడు వానాకాలంలో కురిసిన ఎడతెరిపి లేని వర్షాలవల్ల స్టేషన్ భవనం, గోడలు పెచ్చులూడిపోయాయి. భవనం పైనుండి కారిన నీటిధారల మూలంగా గోడల మీద చారికలు ఏర్పడినాయి. రైల్వేస్టేషన్‌కు కుడిఎడమల పాతిన సిమెంట్ పోల్స్, కట్టిన ఫెన్సింగు వైరు అక్కడక్కడ విరిగిపోయాయి. ఆ స్టేషన్‌లోకి వచ్చే ప్రయాణీకులు పోయే ప్రయాణీకులు సాధారణంగా స్టేషన్ ద్వారం నుండి కాక విరిగిన సిమెంట్ పోల్స్ ఫెన్సింగు నుంచే నడుస్తారు.

రైల్వేస్టేషన్ వెనుకవైపు, స్టేషన్ కట్టినప్పుడే కట్టిన క్వార్టర్లలో నాలుగు కూలిపోయి ఉన్నాయి. మిగతా క్వార్టర్లలో రైల్వేగ్యాంగు వాళ్లు తప్ప బుక్కింగు క్లర్కుగాని స్టేషన్ మాస్టరుగాని ఉండటం లేదు. వాళ్ళు దాదాపు అక్కడికి పది కిలోమీటర్ల దూరంలో గల ఓ మాదిరి పట్నం నుంచి రోజూ వస్తారు.

రైల్వేస్టేషన్‌కు దక్షిణాన నీలగిరి చెట్లు పెరిగి ఉన్నాయి. నీలగిరి చెట్ల కింద ఆకులుపడి ఆ స్థలమంతా తెల్లగా మెరుస్తున్నది. స్టేషన్‌కు ఎదురుగా పసిరిక చెట్లు, వేపచెట్లు, తుమ్మచెట్లు పెరిగి ఉన్నాయి. ఆ చెట్ల కింద రైలుపట్టాలకు ఆవలివైపున 'తాటికల్లు' కుండల్లో నురుగు

వస్తుండగా నలుగురు గౌండ్ల వాళ్ళు గిరాకి లేక దిగాలు పడి కూర్చున్నారు. వాళ్ళకు కొంచెం దూరంలో పసుపుపచ్చ ప్లాస్టిక్ ట్రేలో సారా ప్యాకెట్లు పెట్టుకొని పేడి మూతి ఉపేంద్ర కూర్చున్నాడు.

పొద్దున తయారుచేసిన 'మిరపకాయ బజ్జీలు' చల్లారిపోగా షేక్ దావూద్ గొణుగుతున్నాడు.

వేపచెట్టు కింద కాల్చిన మొక్కజొన్నకంకులు పెట్టుకొని ముగ్గురు పల్లెటూరి ఆడవాళ్ళు ఒకరినొకరు తిట్టుకుంటున్నారు. పరికి పండ్లు అమ్మే ముసలవ్వ ఎందుకో విచారంగా కూర్చున్నది.

ఆ చెట్ల కింద దుమ్ములో కూర్చుండలేక, అలాగని ఎంతోసేపు నిలబడలేక ఒక కుటుంబం దిక్కులు చూస్తున్నది.

"అట్ల పోయి రైలెప్పుడు కాలవత్తదో తెలుసక రాపోరాదు!" భార్య భర్త మీద విసుక్కున్నది. భార్య పేరు గంగమ్మ. ఆమె గులాబిరంగు పాలిస్టర్ చీర కట్టుకున్నది. చెవులకు బంగారు జూకాలున్నాయి. కాళ్ళకు పట్ట గొలుసులు, వెండి మట్టెలున్నాయి.

భర్త రాయేశం తన అంగీజేబులో చెయ్యిపెట్టి, భార్యకేసి చూసి వంకర నవ్వు నవ్వాడు. రాయేశం తెల్లటి పాలిస్టర్ కమీజు తొడిగి ధోవతి కట్టుకొన్నాడు. కాళ్ళకు సింగరేణి బొగ్గుగని బూట్లు వేసుకున్నాడు. మెడకు మఫ్లర్, ఎడమచేతికి గడియారమున్నది.

"అమ్మా పరికి పండ్లే!" వారిద్దరి పదేండ్ల కొడుకు అడిగాడు.

"మీ బాపు నడుగుపో" గంగమ్మ పిల్లవాడ్ని కసిరింది.

రాయేశం వంకర నవ్వుకు గంగమ్మ ఎలాంటి అడ్డంకి చెప్పకపోయేసరికి ఉపేంద్రం దగ్గరికి నడిచి, "ఎంతకో బత్త (సారా ప్యాకెటు) పిలడా?" అడిగాడు.

"మీ కాలేరు (కాలరీ) లెంత?" ఉపేంద్రం.

"మా బొగ్గుబాయిల కాడ అమ్మినట్టే అమ్ముతానవా?"

"ఈడ అంతరేటు కమ్ముతె బొక్కలిరువరా?" ఒక గౌండ్లాయన కోపంగా అన్నాడు.

"ఎవలు?" రాయేశం.

"ఇంకెవలు పాముకోరలిరిసినోళ్లే," ఇంకో గౌండ్లాయన.

పాము కోరలిరిసినోల్లెవరో రాయేశం అడుగలేదు. వాళ్లు చెప్పలేదు.

"రెండున్నర," ఉపేంద్రం.

"లావు సస్తనే ఉన్నది. మా వూల్లే సార మావులా పట్టిన కొత్తల నాలుగు రూపాయలన్నరు. లొల్లయినంక గిప్పుడు గిదేధర".

"మీ వూల్లేంది ఈ సుట్టుపక్క అన్ని ఊళ్లల్ల గిదే ధర. ఈసారి మావుల (కంట్రాక్ట్) పట్టినోడు మన్నె పోయిండనుకో".

"మా కాలేరుమీద దోసుకుంటండ్లు - ఆడ బత్తకు అయిదు రూపాయలు," రాయేశం. రెండు సారాప్యాకెట్లు తీసుకొని ఒకటి కట్టుక్కున కొరికి నోట్లో పోసుకొని ఇంకొకటి జేబులో వేసుకున్నాడు. అయిదు రూపాయల నోటు తీసి ఇచ్చాడు.

ఆ వాసన తనకే వచ్చినట్టుగా ఒక అంగన్‌వాడి టీచరమ్మ అటేపు జరిగింది.

ఒక ముసలమ్మ చెవుల గంటీలు ఊగుతుండగా, 'రైలెప్పుడత్తది పిలడా! సిటక్కున సీకటైనంకనా?" అన్నది.

ఆ ముసలమ్మ మనవడు, "ప్యాసెంజర్ రైలు గంటకొట్టేదనుక తెలువదే," బియ్యం సంచి మీద కూర్చుండి జవాబు చెప్పాడు. అతను ప్యాంటు వేసుకొని ఉన్నాడు.

కొంచెం దూరంలో అదివరకే తాగి ఉన్న ఒక బతికి చెడ్డ రైతు ఎవరినో అంతూ పొంతూ లేకుండా తిడుతున్నాడు.

రైలు కిందబడి కాలు ఎప్పుడో తెగిపోయిన కుంటి ముసలి బిచ్చపాయన, "నిన్ను సిలువకు గట్టిరిబిడ్డా నా యేశయ్యా! కీలుకీలున మొలలు గొట్టిరి తండ్రీ యేశయ్యా!" అంటూ యేసుక్రీస్తు

మరణ ఘట్టాన్ని తను 'నిజంగా' చూసినట్లుగానే వర్ణించి పాడుతున్నాడు. ఆ గొంతులో విచిత్రమైన 'వణుకు' అక్కడి వాళ్లకు దుఃఖాన్ని కలిగిస్తోంది. ఆ పాటలోని నాదం వారికి అనుభవంలో ఉన్నట్టే ఉంది. అందరికీ చేయిచాపుతూ కర్రకాలు పొడుచుకుంటూ తిరుగుతున్నాడు.

రైలు టైం కనుక్కోవడానికి బయలుదేరిన రాయేశం ఇరువై అయిదు పైసల బిళ్ళ తీసి కుంటాయన చిప్పలోవేసి, "ఏసయ్యను కాదు గరీబోన్ని," అని పాటకు అర్థం చెప్పి కదలబోయాడు.

ఇంతలోనే పెనుకేక వేస్తూ ఏదో ఎక్స్‌ప్రెస్ రైలు దూసుకపోయింది. రైలు వెళ్లేదాకా ఆగి రాయేశం పట్టాలు దాటాడు. అతని వెనుకనే రాబోయిన కొడుకు భయపడి తల్లి దగ్గరికి పరుగెత్తాడు.

రాయేశం స్టేషన్లోకి అడుగుపెట్టాడు. టికెట్లిచ్చే కిటికీ మూసున్నది. స్టేషన్ మాస్టర్ గదిలోకి తొంగిచూశాడు.

ఒక పాతటేబుల్ ముందు అంతకన్నా పాతగిల్లిన స్టేషన్ మాస్టర్ విచారంగా కూర్చున్నాడు.

ఇంతలోనే స్టేషన్ ద్వారం నుంచీ ఆదరబాదరగా వచ్చిన రైల్వే పోలీసు స్టేషన్‌మాస్టర్ రూం లోకి నడిచాడు. టోపి తీసి ఉఫ్‌మనుకున్నాడు.

"వాని వివరాలు తెలుసుకునేసరికి తాతలు దిగొచ్చిండ్లు సార్," ఆ కష్టమంతా ముఖంలో తొంగి చూస్తుండగా మాట్లాడసాగాడు పోలీసు.

"సార్ వాన్ని వారంరోజుల క్రితం మన రైలుస్టేషన్లో రాత్రి చలికి వణుకుతుంటే పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు పట్టుక పోయిండ్లట. అసలే ఈ ఏరియాల డేంజర్‌గున్నది కదా! మల్ల వీడు పడుసు పోరడాయె. ఏదడిగిన నోరు తెరువకపాయె. పొద్దటినుంచి సాయంత్రందాకా ఎంత తన్నినా ఏం మాట్లాడలేదట. ఆఖరుకు వాని తల్లి గురించి చెప్పిండట. ఎంక్వయిరీల వీళ్ళది కుద్దు రాముల పల్లెనట. తండ్రి బేవార్సుగాడట. భూములమ్ముకొని పెద్దపెల్లిల తిరుగుతున్నడట. వాడు పాతకాపే నట. ఏడాది కరీంనగర్ సబ్‌జైల్ల ఉండచ్చిండట. తల్లి కూలినాలి చేసి వీన్ని పెంచి పెద్దజేసిందట. ఆవార కేసని విడిచి పెట్టిండ్లట," రైల్వే పోలీసు గుక్క తిప్పుకున్నాడు.

"వాడు ఏదైతే మనకేమిటి గని - మన నెత్తిమీదికి తెచ్చాడు. ప్యాసింజర్ వెళ్ళిపోతే ఈ చలిలో రాత్రంతా చావాల్సిందే," స్టేషన్ మాస్టర్.

"సార్ మనము కూడా ఆవారా కేసు కింద పంచనామా చేస్తే?" రైల్వే పోలీసు.

"అసలే రోజులు బాగాలేవు. వెధవపెంట మనమీదికొస్తే! అచ్చా నువ్వు పోయి శవం దగ్గర కావలి వుండు. రంగయ్య టీకి పోయి వస్తాడు! ఈ లోగా నేను వాడి తల్లి, తండ్రి కోసం ట్రై చేస్త," స్టేషన్‌మాస్టర్.

రైల్వే పోలీసు గది బయటకు వచ్చాడు.

"ఏందేంది?" రాయేశం.

"ఏమున్నదివయ్యా! మర్డర్లు, కూనీలు, చావడాలు, చంపడాలు- ఆజ్ కల్ కా దునియా ఖుద్‌మర్ నా కిసీ కో మార్ డాల్‌నా (ఇయ్యల్ల రేపు ప్రపంచంల తను చావడం ఇంకోన్ని చంపడం)."

"దాసుకోవయ్యా! అమ్మమ్మ నీ ఉచ్చ మందులకు గావాలంటె చింతకొమ్మ లెక్కి చిమ్మిచ్చి పోసిందట," రాయేశం.

"పొద్దటి నుంచి చెప్పలేక నోరు పోతంది. అగో క్యాబిన్ దగ్గర ఓ మాదెర్‌చోదుగాడు రైలుకింద తలకాయ బెట్టిండు. పంచనామా చేసి పారేత్తమంటే మా స్టేషన్‌మాస్టర్ ఉచ్చబోసుకుంటుండు- వాని తండ్రి వీనికన్నా ఆవారా ఉన్నడు," చెమట పట్టిన ఖాకీ బట్టలు మాటిమాటికి లూజు చేసుకుంటూ ఉత్తరం వేపు క్యాబిన్ కేసి నడిచాడు.

స్టేషన్ మాస్టర్ పెద్దపల్లికి ఫోన్ చేశాడు

"ఇంతకు ముందు వైర్‌లెస్‌ల ఇక్కడి పోలీస్‌స్టేషన్‌కు కబురు వచ్చింది. వాణ్ణి పోలీసు వాళ్లు వెతికి పట్టుకున్నారు. సింగరేణి రైలులో తీసుకు వస్తున్నారు," ఆవలి కంఠం.

మళ్ళీ తల్లి ఉండే ఊరు ఓదెలకు ఫోన్ చేశాడు. అదృష్టవశాత్తు ఆ ఊరులో రైల్వేస్టేష నున్నది. "వాని తల్లి, బంధువులు ఎడ్ల బండిలో వస్తున్నారు," అక్కడి నుంచి.

స్టేషన్‌మాస్టర్ ఈ కబురు శవం దగ్గర కావలున్న రైల్వేపోలీసులకు తెలుపాలనే ఉద్దేశంతో గది బయటకొచ్చాడు.

"సార్ ప్యాసెంజర్ టైమెంత?" రాయేశం.

"ఉండవయ్య మగడా!" స్టేషన్‌మాస్టర్ దిక్కులు చూస్తూ చిరాకుగా అని గ్యాంగుమన్ కోసం వెతకసాగిండు.

"నేను శవాన్ని సూసత్తసార్! ఏం చెప్పమంటారు?" రాయేశం.

"వాని తండ్రి సింగరేణి రైలులో వస్తున్నడని చెప్పు," స్టేషన్‌మాస్టర్.

రాయేశం చేతులూపుకుంటూ ప్లాట్‌ఫారం మీద నుండి ఉత్తరం వేపు పోవడం చూసి, "రైలచ్చే యేల్లయ్యింది మల్లేడ కాలవడ్తన్నవ్?" రైలుపట్టాల ఆవలి నుంచి రాయేశం భార్య గంగమ్మ కేకేసింది.

ఆ కేకను పట్టించుకోకుండానే రాయేశం చరచరా నడుస్తున్నాడు. రాయేశం బూట్ల కింద ఇసుక కరకరలాడుతోంది. ప్లాట్‌ఫారంకు వందగజాల దూరంలో క్యాబిన్‌కు ప్లాట్‌ఫారంకు మధ్యన పదిమంది మనుషులు కన్పించారు.

అక్కడ నలుగురు చేతి సంచీలు పట్టుకొని విచార వదనాలతో నిలబడి వున్నారు.

రైల్వే పోలీసులిద్దరు అక్కడ శవం వున్నదన్న మాట మరిచిపోయి బీడీలు పీలుస్తూ లోక రివాజు గురించి మాట్లాడుకుంటున్నారు.

ఢిల్లీ వెళ్లే రైల్వేలైను పక్క కంకరరాళ్ళ మీద ఒక మొండెం పడుకోబెట్టి వున్నది. శవం మీద చాలీచాలని తెల్లని గుడ్డ కప్పి వున్నది. పట్టాల మధ్య కండ్లు భయంకరంగా తెరుచుకున్న తల వున్నది. తలకు మొండానికి మధ్య రక్తం మడుగుకట్టి జొబ్బజొబ్బ పెద్ద ఈగలు ముసురుతున్నాయి.

ఇంకా మీసం సరీగ మొలువని లేత ముఖం - ఎత్తు దవడలు - ఎంత అందమైన ముఖం! నెత్తిమీద రక్తంతో తడిసి పిడుచగట్టిన వెంట్రుకలు - మొండెం మీద కప్పిన గుడ్డ సరిపోక పిక్కలు పాదాలు కన్పిస్తున్నాయి. మడిమెలు గిలగిల తన్నుకోవడం వల్ల పగిలున్నాయి. ప్యాంటు చిరిగి వుంది.

రాయేశం నిషా దిగిపోయింది. కడుపులో చెయ్యేసి ఎవరో దేవినట్లనిపించింది. "ఛీ మనిషి జల్మంత పాపకారి జల్మ మరోటి లేదు," అన్నాడు. రాయేశంకు తమ బొగ్గు గనిలో పైకప్పు కూలి చనిపోయిన కార్మికుల శవాలు కండ్ల ముందు మెదిలాయి.

రాయేశం కాళ్ళమీద కూలబడి, "అయ్యో బిడ్డా! కట్టం సుకం సూడాల్సినోడివి ఎంత కర్మాని కెత్తుకున్నవ్," అని బొటబొట కన్నీళ్ళు కార్చాడు.

"ఖర్మమేమున్నది బై - ముచ్చుదొబ్బుకత్తె ఎవడైన గంతే," రంగయ్య అనే రైల్వే పోలీసు.

"ఛల్..." చుట్టు మూగుతున్న మందిని ఇంకో పోలీసు దూరం కొట్టాడు.

"ఏ తల్లి గన్న బిడ్డో!" ఊళ్లో బతుకు గడవక సింగరేణి గనుల్లో పరుగుపందెంలో నౌఖరికోసం పోతున్నవాడన్నాడు.

"కట్టాలలో జెనుకక (భయపడక) సీతమ్మ తీర్గ అగ్గినుంచి బయటి కచ్చినోడే మనిషి," ఒక ముసలయ్య.

"అరె! కష్టాలుంటయి. సుఖాలుంటయి, మనిషి పుటుకే అసొంటిది. ఈ కాలపు పోరగండ్లకు అన్ని ముంగటికి రావాలె," రంగయ్య.

"ఔ బాంచెన్ - నీ తీర్గ అందరికి కొలువు దొరకద్దా," ఒక ముసలమ్మ.

“ఔ బై కొలువు దొరకలే, సచ్చుడేనా?” రంగయ్య వాదంలోకి దిగుతూ.

“సావకుంటే ఏం జేసుడువయ్యా! అడుక్క తినమంటావా? ఊళ్ళమీద బడి దోసుకు తిన మంటావా?” ఎవరో మందిలోనుంచి.

“అయి రెండూ బమ్మకట్టాలే,” యువకుడు.

ఇంకో రైల్వేపోలీసు బీడి విసిరికొడుతూ, ‘ఔ,’ నంటూ ఒప్పుకున్నాడు.

“ఆ దమ్మున్నోడు సావడు. అడ్డమచ్చినోన్ని సంపుతడు,” రంగయ్య తన అనుభవం నుంచి నిగ్గుతీసిన సత్యాన్ని చెప్పి రైల్వేస్టేషన్‌కేసి నడిచాడు.

“ఏ రైలుకు పడ్డడు బిడ్డా?” ముసలవ్వ.

రాయేశం కండ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. తోటి కార్మికులు గనిలో చనిపోయినప్పుడు మిగతా కార్మికుల్లో చెలరేగిన కోపంలాంటి కోపం అతని ముఖంలో చిమ్ముకొచ్చింది. ‘వారంరోజుల క్రితం ఆవారా కేసు క్రింద పోలీసులు పట్టుకుపోయినారట,’ ఇందాక రైల్వేపోలీసు స్టేషన్‌మాస్టర్‌కు చెప్పినమాట జ్ఞాపకం వచ్చింది. కంఠంలో కోపం దుఃఖం మిళితం కాగా, “మనిషి జల్మంత ఈనం జెల్మ లేదు. బంచత్-గీడనియ్యతి గలోన్ని, నోట్లో నాలిక లేనోన్ని బతుకనియ్యరు. అరే కోమలిపోరడు ఇంట్ల నుంచి ఎట్లచ్చిండో? కొట్లాడే అచ్చెనో? మనసు చెంచాల్లమైతేనో? బుద్ధులు గ్యానాలు చెప్పే నాయిన్నే తనకే దోసక దేశాలు బట్టుకపోయిండట. ఆడది ఏం చెలాయించుకత్తది? ఇటుసూత్తే తల్లి కొట్టిపోసుకునుడు. అటు తండ్రి ఏమయ్యిండో సమఝుకాక ఎంతకొట్టి పోసుకున్నడో? పోరడు! అరరె! ఎవల్లన్న మనిషి దగ్గిరికి తీసి కడుపుల ఆయత్తం అడుగుతె బతికిపోవు. ఎంత పని జర్గిపాయె. పోలీసోల్లన్న దగ్గరికి దియ్యకపోయిరి. ఆళ్లు దొరికిందే బరికినట్టు మనసు పుండై పోయినోన్ని మళ్లీ కొట్టిరి. ఇదేమన్న నాయెమూ...?” రాయేశం కోపంగా.

“నీకెందుకువయ్యా తీస్ మార్‌ఖాన్ (ముప్పయిమందిని కొట్టేవాడు)- ఊ అంటే తీసుక పోయి పోలీసుస్టేషన్ల అప్పజెప్పవస్త,” రైల్వేపోలీసు.

“ఏది అప్పజెప్పు సూద్దాం,” జేబులో సారాప్యాకెట్టు తీసి కటుక్కున కొరికి గటగటా తాగి రాయేశం అన్నాడు కోపంగా.

“ఏం చేస్తవ్ బే - అందరి తీర్గ నువ్వుచూడక - లావులావు మాట్లాడ్తన్నవ్. సచ్చినోని బావవా? అన్నవా?” రైల్వేపోలీసు.

“అంతకన్న ఎక్కువ,” రాయేశం పోలీసుమీది కురికాడు. అక్కడ గుమికూడిన వాళ్ళంతా వాళ్ళిద్దరిని విడదీశారు.

దూరం నుంచి ఈ గొడవంతా చూస్తున్న రాయేశం భార్య గంగమ్మ పట్టాలమీదుగా పరుగెత్తి కొచ్చి, శవాన్ని చూసి ఆమెకు నోట మాట రాలేదు.

తిట్టుకుంటూ వచ్చిన గంగమ్మ భర్త చెయ్యి పట్టుకొని తీసుకపోయింది.

రాయేశం బియ్యం బస్తామీద కాసేపు తల పట్టుకొని కూర్చున్నాడు. గనిలో చనిపోయిన శవాల దగ్గర కార్మికులు కోపంగా అరుస్తున్న దృశ్యం. చివ్వున లేచి వెళ్ళి మరో రెండు సారాప్యాకెట్లు తెచ్చుకున్నాడు.

గంగమ్మ తను చూసిన దృశ్యాన్ని అక్కడివాళ్లకు వర్ణించి చెప్పడంలో భర్తను మరిచి పోయింది. అదివరకే చూసి వచ్చినవాళ్లు వివరాలు చెప్పారు. కొత్తగా వచ్చినవాళ్లు శవాన్ని చూడడానికి కదిలారు.

అప్పుడు సాయంత్రం అయిదు గంటలయ్యింది. చలికాలపు పొద్దు క్రుంకడానికి సిద్ధంగా వున్నది. పడమటి ఆకాశం ఎలుగడిపడిన అడివిలాగా వున్నది. ఏడ్చేడ్చి సొమ్మసిల్లిన పసిపిల్ల జేవురించిన ముఖంలా సూర్యుడు. స్టేషన్ ఆవలిప్రక్కన గల ముసలి పచ్చిరిక, వేప, తుమ్మచెట్ల నీడలు ఆ చోటంతా కప్పేశాయి. చలి విషాదంలా కమ్ముకుంటోంది.

ఆ చిన్నస్టేషన్లో జనసంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఆ స్టేషన్లో చేరుతున్న జనమంతా చుట్టుపక్కల పల్లెటూళ్లవాళ్లు - పైగా సింగరేణి బొగ్గుగనుల్లో పనిచేసేవాళ్లు, వాళ్ల తాలూకూ బంధువులు ఎక్కువగా వున్నారు. ఆ స్టేషన్నుంచి ఖాజీపేటకు పోయేవాళ్ల సంఖ్య చాలా తక్కువ. ఆ తక్కువలో కూడా ఈ మధ్య కొత్తగా రైల్వేలైను విద్యుద్దీకరణ, రైల్వే కార్మికులే ఎక్కువమంది వున్నారు.

స్టేషన్‌లోకి వచ్చిన వాళ్ళందరూ శవాన్ని చూసి వచ్చారు. అక్కడ చాలామంది ముఖాలల్లో నిర్లిప్తత చోటు చేసుకున్నది. అటు తెల్లకల్లు (తాటికల్లు), సారా అమ్మకం జోరుగా సాగుతోంది. అందరి మనసుల్లో ఆ శవం ఒక పెనుకల్లోలం లేపుతోంది. మంటను ఎగదోస్తోంది. ఆ మంట మీద ఏదో ఒకటి పోసే ప్రయత్నం.

షేక్ దావూదు మిరపకాయ బజ్జీలు అయిపోయాయి.

చావు-బతుకుల మధ్య తచ్చాడే మాటలు - సుళ్లు తిరిగే మాటలు -

ఒక ముసలి రైల్వే మొఖద్దమ్ అక్కడే పాత క్వార్టర్లో వుండేవాడు, డ్యూటీ దిగి స్నానంచేసి ధోవతి కట్టుకొని వచ్చి స్టేషన్లో తిరుగుతూ, "ఆ పొల్లగాడు పదిదినాల కింద నుంచి గీ స్టేషన్లనే తిరుగుతున్నడు. ఎవలతోని మాట్లాడడు. సకులం దోసుకపోబడ్డోని తీర్గ కూకుండెటోడు. అప్పుడప్పుడు పిచ్చోని తీర్గ ఒర్రుకుంట అటు నుంచి ఇటు, ఇటు నుంచి అటు ప్లాటుఫారం మీద ఉరికెటోడు. సొమ్మసిల్లి పడిపోతే మేం మొన్న బువ్వబెట్టినం- ఆనాడు పొల్లగాని తల్లి, ఎవలో సెప్పుతే అచ్చి తీసుకపోయింది. మల్ల గిదే సూసుడు," తనకు తెలిసిన వివరాలు చెప్పసాగాడు.

ఆ వివరాలు అందరికీ తెలిసినట్టుగానే వున్నవి. అందరూ ఆ పిలగానిలాగే దగ్ధమైన మనసులతో ఎక్కడెక్కడో దిక్కుతోచక పరుగెత్తినవాళ్ళలాగే వున్నారు. అందరి లోలోపల ఏదో తొలుచుకపోతోంది. అదేమిటో కొద్దికొద్దిగా తెలిసినట్టే తెలిసి మళ్ళీ చిక్కుపడుతోంది. పల్లెల కడుపుల్లో ఏదో కల్లోలం మరిగిమరిగి బుసబుస పొంగుతోంది. ఇల్లు, పిల్లలు, భూమి, పంటలు, పెండ్లిల్లు ఎండా వానా అన్నిరకాల మానవబంధాలు, సెంటిమెంట్లు తెగిపోతున్నాయి. అన్నిటికన్నా బలీయ మైన భూమి సంబంధం తెగిపోయి పల్లెలను విడిచి బతుకుతెరువు కోసం చెల్లాచెదరుగ చెదిరి పోయిన వాళ్లు, పిల్లపేగు సంబంధాలు తెగినవాళ్లు అస్తుబిస్తుగా తచ్చాడుతున్నారు.

గొణుగుడు, విచిత్రమైన కొత్తమాటలు చితిమంటల చిటపటల్లా- కూలిపోయిన వేదాంతాలు స్టేషనంతా గగ్గోలుగా అర్థం కాకుండా వున్నది.

మోకాళ్లదాకా నిక్కరేసుకున్న రైల్వే కార్మికుడు వచ్చి, 'ఠనాఠన్,' మంటూ గంట కొట్టాడు. విచిత్రం అతను పండ్లు బిగపట్టి పూనకం వచ్చిన వానిలాగా గంటకొట్టాడు!

రైల్వే బుకింగ్ కిటికీ దగ్గరికి జనం పరుగెత్తారు.

బుక్కింగ్ క్లర్కు అప్పుడే నిదురలేచిన వానిలాగా టికెట్ల కెగబడుతున్న ముఖాలకేసి చూడకుండా టికెట్టు నింపాదిగా ఇస్తున్నాడు.

రాయేశం, "పాసెంజరు ఎంత లేటు మారాజా," అన్నాడు పరాచికమాడే ధోరణిలో

బుక్కింగు క్లర్కు ఈ పరాచికాల కతీతుడులా కన్పిస్తున్నాడు. అతను జవాబు చెప్పలేదు.

"రామగుండం రెండు పెద్దయి, రెండు సిన్నయియ్య," అన్నాడు రాయేశం.

రాయేశం టిక్కెట్లు తీసుకొని బయటకు వచ్చేసరికి- సింగరేణి రైలు వస్తున్నదని స్టేషన్‌లోని వాళ్ళు వేగిరపడుతున్నారు. మరికొద్ది సేపట్లోనే ధనధనలాడుతూ సింగరేణి రైలు వచ్చింది. దిగే వాళ్లు తక్కువ. ఎక్కేవాళ్లు అంతకన్నా తక్కువే. రైలు వెళ్లిపోయింది.

సింగరేణి రైలులో నుంచి ఒక పొడుగాటి నడీడు మనిషి దిగాడు. అతని ముఖం కోలగా వున్నది. పండ్లు కందుపండ్లు (గారపట్టిన) - కమీజు భుజాలమీద చిరిగి ఉన్నది. ధోవతి సన్నపుదేకాని

చాలా పాతది. కాళ్లకు చెప్పులు లేక మోకాళ్ళదాకా దుమ్ము పేరుకున్నది. మడిమెలు ఎండిన వరి మళ్ళలా పగిలున్నాయి. ఎముకలు తేలి ఆరడుగుల అస్తిపంజరం లాగున్నాడు. అతని ముఖం బండబారి వున్నది. కండ్లు - ఆ కండ్లు అక్కడున్నవాళ్లకు తెలియకుండా వున్నాయి. మొత్తానికి అతను విధ్వంసమైన సేనానాయకునిలాగా ఉన్నాడు. అతని చేతిలో మూలలు చిరిగిన పాత క్యాష్ బ్యాగున్నది. కుడిచేతిలో బాగా నలిగిపోయిన రెండు తెలుగు వార్తాపత్రికలున్నాయి. అవి ఏనాటివో, తెలియకుండా మాసి వున్నాయి.

అతని వెంటే నల్లగా బలిష్టంగా ఉన్న రైల్వేపోలీసు దిగాడు. అతను బాగా వంగిపోయి వున్నాడు. అతని ముఖం భూమి పొరల్లో నలిగిన నేల బొగ్గులాగున్నది.

రైల్వేపోలీసు ఆ పొడుగాటి వ్యక్తిని స్టేషన్‌మాస్టర్ రూంలోకి తీసుకపోయాడు.

'బండి కిందపడ్డ పిల్లగాని తండ్రి వచ్చిండనే,' వార్త అతి తొందరలోనే అందరికి తెలిసిపోయింది. అతన్ని చూడడం కోసం స్టేషన్‌మాస్టర్ రూం కేసి చాలామంది నడిచారు.

"వచ్చావా నాయనా?" స్టేషన్‌మాస్టర్ పాత నల్లకోటు తొడుక్కొని బయలుదేరాడు.

పొడుగాటి వ్యక్తి కొడుకును కోల్పోయిన తండ్రిలా లబోదిబోమని రోదించడం లేదు. శవంగా మారిన తన రక్తాన్ని చూసుకోవడానికి పరుగెత్తలేదు. ఆ మొత్తం వ్యవహారం అదివరకే అనుభవించిన వాడిలాగా- 'అంత తొందరేం లేద,'న్నట్లుగా స్టేషన్‌మాస్టర్ టేబుల్ ఎదురుగా గల కుర్చీమీద కూర్చున్నాడు.

కిటికీల్లోంచి దరువాజాల్లో నుంచి చూస్తున్న జనం మొదట విస్తుపోయారు. ఆ తరువాత, 'బండ తీరుగున్నడు', 'మనిషికి గింత సెమట లేదు', 'నెనరులేదు' తలోరకంగా గుసగుసలాడారు.

పొడుగాటి వ్యక్తి తలతిప్పి వెనక్కి చూశాడు. అనేక ముఖాలు సగం సగం కాలిపోయినట్టుగా అతనికి కనిపించాయి. మొత్తం ఆ ప్రాంతమంతా మనుషులు కాలిన కమురువాసన వ్యాపించినట్టుగా అతనికి తోచింది.

"అరె నడువయ్యా రాజారాం," రైల్వేపోలీసు యాతనగా.

"ఎక్కడికీ?" పొడుగాటి వ్యక్తి రాజారాం.

"ఎక్కడికంట వేందయ్యా! నా కొడుకు పెండ్లికచ్చినవా? నిన్ను పెద్దపెల్లంత తిరిగి దొరుకుబట్టేటాల్లకు తాతలు దిగచ్చిరి."

"అయితేం జెయ్యిమంటవు?"

"చనిపోయిన నీ కొడుకును చూసుకోవా?" స్టేషన్‌మాస్టర్.

రాజారాం తన కొడుకు ముఖం స్టేషన్‌మాస్టర్‌దే అన్నట్టుగా అతని ముఖంలోకి చూసి, "చూసేదేమున్నది?" అన్నాడు.

"కాలాంతకపు ముండ కొడుకున్నట్టున్నది." స్టేషన్‌మాస్టర్‌కు మతి పోతోంది. తన సర్వీసులో చావులు చాలా చూశాడు. జంతువులు, మనుషులు- చనిపోయింది మనిషైతే స్టేషనంతా ఏడుపులు పెడబొబ్బలతో నిండిపొయ్యేది. శవాలకేసి పరుగెత్తేవాళ్లు- ఆ ఏడుపులు తగ్గి పంచనామా చేసేసరికి తాతలు దిగొచ్చేవాళ్లు. కాని ఈ మనిషికి ఆ ధ్యాసే లేదు. వీడు మనిషేనా? జంతువా? రాయి కాదు కదా? ఇంతకూ చనిపోయిన పిల్లవాని తండ్రేనా?

స్టేషన్‌మాస్టర్ మీమాంసలో ఉండగానే- రాజారాం ముఖం రుద్దుకున్నాడు.

"అది కాదయ్యా! ఎంతసేపు శవాన్ని ఉంచుతాం. పొద్దున నాలుగున్నరకు చనిపోయాడు. ఇప్పటికే ఖరాబయ్యింది. పంచనామా చెయ్యాలి," స్టేషన్‌మాస్టర్ నచ్చ చెప్పే ధోరణిలో.

"చెయ్యండ్లి," రాజారాం.

"అక్కడికే పోదాం," స్టేషన్ మాస్టర్.

"పోయి?"

"అక్కడ నువ్వు నీ కొడుకును చూసుకొని నవ్వేవు. మేం ఏడుస్తం," అన్నాడు రైల్వేపోలీసు కోపంగా.

రాజారాం లేచి నిలబడి రైల్వేపోలీసు ముఖంలోకి చూశాడు. అక్కడ అతనికి కాలిపోయిన తునికిచెట్టు మొదలు కన్పించింది.

ఈ వాదనలు ఇష్టంలేని వానిలాగా రాజారాం లేచి నిలుచున్నాడు. నిజానికి కొడుకు శవం అతని మనసులో ఎప్పుడో చూసుకున్నాడు. కొడుకు చనిపోవడం ఎప్పటినుంచి ప్రారంభమైంది అన్న చిత్రమైన ఆలోచన కలిగింది. మనుషుల చావు ఒక ఘడియలో జరుగగలదన్న దానికన్నా, సంవత్సరాల తరబడి జరుగుతుందనేది అతని నమ్మకం.

స్టేషన్‌మాస్టర్, రైల్వేపోలీసు రూంలో నుంచి బయటకు నడిచినా కూడా రాజారాం కొడుకు చావు ఎప్పుడు ఎక్కడ ప్రారంభమైనదనేదీ తెలియక అక్కడే నిలుచున్నాడు.

"ఏమయ్యా రాజారాం!" రైల్వేపోలీసు పిలిచాడు. రాజారాం కలలో నడుస్తున్నట్టుగా రూం బయటకు వచ్చాడు. అక్కడి వాళ్లంతా రాజారాంను చుట్టుముట్టారు.

"పాప కర్ముడున్నట్టున్నది," ఎవరో ముసలమ్మ గొణిగింది.

"ఏమయ్యా ముఖం సూత్తే సదువు సాత్రం వచ్చినోని తీర్గున్నవ్ - ఇయ్యల్లటి రేపటి కోమలి పోరగండ్లు మాటంటెబడ్తలేరు. కొడుకును కొట్టినవా? తిట్టినవా?"

"నీకు అఖల్ (బుద్ధి) లేదా?"

ఇలాంటి తిట్లు దీవెనలెన్నెన్నో - పిల్లలను ఎట్ల పెంచుకోవాలో సలహాలు - ఆ తిట్లమీద రాజారాంకు ధ్యాసలేదు. మనుషులందరికి చావడం ఎప్పుడు మొదలయ్యిందోనన్నట్టుగా, చావును జయించిన వాళ్లున్నారా అన్నట్టు చూశాడు.

రాయేశం తలవంచుకొని నడుస్తున్న రాజారాం పక్కకు వచ్చి, "నీకెందరు కొడుకులే?" అన్నాడు తడి గొంతుతో ఆప్యాయంగా.

"ఒక్కడే," రాజారాం.

జనంలో కొందరికి మరీ కోపం పెరిగింది. "ఓరి జెష్టమ్మా! ఒక్క కొడుకును సాది సవరచ్చెన చేసుకోలేంది నువ్వేం మనిషివిరా?" ఒక ముసలయ్య.

"ఛత్తెరి ఏ పాపకర్ముడన్నా గీదునియల కొడుకుల, బిడ్డల సాదుకోని వాడుంటడా?" ఒక నడీడువాడు.

"ఇగో ఈడున్నడు గదా?"

'ఇయ్యల్లరేపు ఎవలరచ్చెన ఆళ్ళసేతుల్లున్నదా? అంత మంచిగనే బతుకుదామనుకుంటరు. కని నొస్టరాసిన రాత- ఆ పిల్లగానికి గీ కొరత రాసిండు బమ్మదేవుడు," మరొక నడీడు మనిషి.

"మన గీతలన్నీ రాసేది మనుషులే," రాయేశం అన్నాడు.

రాజారాం ఏం మాట్లాడకుండా నడుస్తున్నాడు.

అతని వెంట మంది నడిచారు. రైల్వేపోలీసు, స్టేషన్‌మాస్టర్ ముందు నడుస్తున్నారు.

పొద్దుగూకింది. పడమటి దిక్కుకాలి కూలిన గ్రామం దూరంగా కనిపించినట్టుగా నలుపు ఎరుపుల సంగమం.

రాజారాం బోరింగు నీటిపంపు దగ్గర ఆగాడు. ఎవరో బోరింగు కొట్టారు. రాజారాం ముఖం కడుక్కున్నాడు. కొన్ని నీళ్లు తాగాడు. జేబులు వెతుక్కున్నాడు. ఎవరో బీడికట్ట, అగ్గిపెట్టె ఇచ్చారు. ఎవరో సిగరెట్టివ్వబోతే తీసుకోలేదు. బీడికట్ట రాజారాం తిరిగి ఇవ్వబోతే ఇచ్చినాయన వాపసు తీసుకోలేదు.

బీడి బస్సు బస్సు పీలుస్తూ రాజారాం నడుస్తున్నాడు.

అప్పటికే శవం దగ్గర మంది జమైపోయారు.

రాజారాం రైలుపట్టాల దగ్గర పడున్న తన మాంసాన్ని, నెత్తురును చూశాడు.

జనం రాజారాం ముఖాన్ని అక్కడ పడున్న తలకాయను మార్చి మార్చి చూశారు. దాదాపు రెండింటిలో ఒకే పోలికలు, విచిత్రంగా రెండింటిలో ఒకే భావం.

రాజారాం ఒకరాతి బొమ్మలాగా నిలుచున్నాడు.

స్టేషన్‌మాస్టర్ కనుసైగతో రైల్వేపోలీసు మొండెం మీది గుడ్డ తొలిగించాడు.

రాజారాం సత్తువ (బలం) లేని వానిలాగా కాళ్ళవేపు కూలబడ్డాడు.

"అబ్బ ఎంత నెనరు లేని గుండెనయ్యా నీది!" అన్నారెవరో?

రాయి, పాపకర్ముడులాంటి మాటలు ఒకవేపు, అయ్యో కాసేపూసే చెట్టు అని ఇంకొకవేపు.

రాజారాంకు ఈ మాటలేవీ చేరడం లేదు. తన మనసులో అనేక దృశ్యాలు రూపుకట్ట సాగినయ్. కూలిపోయిన గుడిసెలు, పెంకలు కిందికి తోడిన పెంకుటిండ్లు, చెల్లాచెదురుగా పడిన ధాన్యం, తొక్కబడిన కుండా, గుర్గి, ధ్వంసమైన గ్రామం అతని మనసులో రూపుకట్టింది.

ఇప్పుడు రాజారాం ఒక ధ్వంసమైన పల్లెలా వున్నాడు. ఎలుగడిబడి సాంతం కాలిపోయి చల్లారిన అడివిలా వున్నాడు. ఇంకిపోయిన నదిలా, నెర్రెలిచ్చి ఎండిన చెరువులా వున్నాడు. మాటలు తెగిపోయిన మనిషిలా కూర్చున్నాడు.

ధ్వంసమైన పల్లెలో ఇల్లిల్లు తిరిగి చూసిన ఆకలేసిన దుక్కిటెద్దులా రాజారాం ఎప్పుడో మరిచి పోయిన తన బతుకు తాలూకూ శకలాల చుట్టూ తచ్చాడుతున్నాడు. చిత్ర విచిత్రంగా ఆ శకలాలు అతని మనసులో మెదలసాగినయ్. తన కొడుకు చావు తనకు పుట్టకముందెక్కడో ప్రారంభమై నట్లుగా అతనికి తోచింది.

ఒక అంగీ తప్ప లాగులేని పిల్లవాడు తండ్రి వెంట ఉరుకుతున్నాడు. ఒక చేతిలో పార ఇంకో భుజం మీద మోటబొక్కెన గల రైతు నడుస్తున్నాడు. ఎండకు పిల్లవాడి పాదాలు మాడి పొయ్యాయి. తండ్రి తిడుతూ కుడిచంక కెక్కించుకున్నాడు. పిల్లవాడు మక్కకంకులకు వచ్చిన పీసును చూసి, 'నాయినా వీటికి మీసాలెక్కడి నుంచి వత్తయే,' అంటున్నాడు.

ధ్వంసమైన పల్లెలో ఎవరో ఏడుస్తున్నట్లుగా విన్పించింది. ముడతలు పడ్డ ఎర్రతోలు, నీలం రాయి కొనుకపోగు గల తండ్రిని వాకిట్లో పడుకోబెట్టారు. తల్లి శవం మీద పడి ఏడుస్తోంది. కడుపుల నరాలు బయటపడే లాగున దగ్గుతూ- ఏడుకొయ్యలా తలవెంట్రుకలు కలిగిన అన్న- పోలీసు పటేల్ కింద గుమస్తా - బొనుగూపినట్టుగా మాట్లాడే అంతెత్తు వదిన - అన్న తాగి తాగి చనిపోయాడు. కుటుంబం కకావికలు. తను చదువుబడిలో నుంచి నాగలికి మార్పు- తండ్రి చావు మళ్ళీ కన్పిం చింది. తండ్రి, అన్న ఇద్దర్లో ఎవరు ముందు చనిపోయారో జ్ఞాపకం రావడం లేదు.

తను నాగలిని పట్టేనాటికి పదెకరాల భూమి- నుయ్యి కోసం అంజుమాన్ (సహకార సంఘం) అప్పు- అప్పు తీరలేదు. తను వేసిన మిర్చిపంట- ఇంజను (పంపుసెట్టు) కోసం మళ్ళీ కొత్తగా వెలిసిన భూమి  తనఖా బ్యాంకు అప్పు- మిర్చికి కొరుకుడు రోగం- హల్లికిహల్లీ  సున్నకు సున్న- బేంకు వాళ్లు పెద్ద ఎడ్లబండి తీసుకపోవడం - వేలం వేయడం - ఎరుపెక్కిన చెక్కిళ్లతో ఈ గజిబిజి మధ్య ఒక స్త్రీ రూపం కన్పించింది.

తన్నులు గుద్దులు తాగుడు. బిసతప్పిన యంత్రంలా తను తిరిగేనాటికి భార్య కలుపులకు, నాట్లకు కూలికి పోతున్నది. బీదతనపు చావులో నుంచి పిల్లవాన్ని తీసుకొని తల్లిగారింటికి వెళ్ళిపో యింది. అప్పటి నుంచి రాజారాం మళ్ళీ భార్య దగ్గరికి పోలేదు. తాగడం దొరగారి దగ్గర చేత (వ్యవసాయం) చేయించడం. నెల పనిచేస్తే మరో రెన్నెల్లు తిర్గడం - ఎక్కడపడితే అక్కడ - ఊళ్లెకు

పాటలచ్చినయె.... ఊళ్లో గొడవలు ప్రారంభమయ్యే నాటికి తను, 'తునికి ఆకుకల్లం (బీడి ఆకుల కంట్రాక్టు)' పట్టాడు. గొడవ లేకుండా వాళ్ళు ఇయ్యమన్న రేటు (అన్నలు (నక్సలైట్లు) యియ్యిమన్న రేటు) ఇచ్చినందుకు పోలీసులు పట్టుకపొయ్యారు. మరింకేమీ జ్ఞాపకం రాలేదు. ఊళ్ళో ఒక యువకుడికి జమానతుగ పాత ఇంటిని రాయించాడు. తట్టుకోలేక కేసుల సుట్టు తిర్గలేక బేలుజంపు చేసి ఆ పిల్లవాడు పార్టీలో కలిసిపోయిండు. జమానతు డబ్బు కట్టమని తనకు ఆర్నెల్లు జైలు-ఆఖరుకు ఇల్లు జప్తు చేశారు. ఆ తరువాత తనెక్కడ తిర్గింది? ఏమి చేసింది? ఏమి జ్ఞాపకం లేదు.

రైల్వేపోలీసులు మొండాన్ని, తలను ఒక్క దగ్గర చేర్చారు. రైల్వే పోలీసొకాయన పంచనామా రాస్తున్నాడు. ఇంకొకాయన మందిని దూరం కొడుతున్నాడు.

"ఇంటి నుంచి ఎప్పుడెల్లిపోయిండు?" స్టేషన్‌మాస్టర్.

"ఎవలింటి నుంచి?" రాజారాం తేరుకొని.

"నీ ఇంటి నుంచి."

రాజారాం మాట్లాడలేదు. తల మొండెం కలిపిన తన కొడుకును అక్కడ నిల్చున్న మందిని మార్చిమార్చి చూశాడు. వీడు తన కొడుకేనా? నాలుగేండ్ల పిల్లవాడి ముఖం ఎంత ముద్దొచ్చేది? వాడి కడుపులో ఎన్ని ప్రశ్నలుండేవి? వాడి చిన్న కండ్లు ఎంత ఆత్రంగా పిట్టను, జంతువును, చెట్టును చూసేవి? ఇక్కడ వీడి ముఖంలో ఏ ప్రశ్నలేదు. విధ్వంసమై పోయిందెప్పుడో?

"నీకు ఇల్లు లేదా?" స్టేషన్‌మాస్టర్‌కు కోపం వస్తోంది.

"లేదు," రాజారాం జ్ఞాపకాలు కొద్దికొద్దిగా అతుక్కునే సమయంలో ఈ ప్రశ్నలేమిటి అన్నట్టుగా.

"ఎప్పుడు వెళ్ళిపోయిండు?"

"ఎవలు?"

"నీ కొడుకేనయ్యా!"

రాజారాం మాట్లాడలేదు. అతనికి ఇంతకు ముందడిగిన ప్రశ్న జ్ఞాపకమే లేదు.

"నీ కొడుకు ఇంటి నుంచి ఎప్పుడు పోయినాడయ్యా!" స్టేషన్‌మాస్టర్.

జనానికి విసుగొచ్చింది. "మెదడు పని జేత్తలేనట్టున్నది పాపం," ఎవరో మందిలో నుంచి-

"ఓ బత్త సారా ఎత్తే పని చేస్తది," రాజారాం పక్కనున్నతను.

రాయేశం ఉరికి రెండు సారాబత్తాలు తీసుకొచ్చాడు. అవి రెండు ఏమిటన్నట్టుగా కొత్తగా చూసి వద్దన్నాడు... సారా నిషా కన్నా ఏదో మత్తు అతన్ని ఆవహిస్తోంది. మొదట స్టేషన్లో కొచ్చినప్పుడు అతనికి ఏ మత్తులేదు. ఏ జ్ఞాపకము, ఆలోచనలు లేవు. కాని ఇప్పుడేవేవో తిరుగుతున్నాయి.

"నీ కొడుక్కు ఎన్నేండ్లు?" స్టేషన్‌మాస్టర్.

సరిగ్గా రాజారాంకు అప్పుడు శవాన్ని తడిమి చూడాలని కోరిక కలిగింది. అదే సమయంలో స్టేషన్‌మాస్టర్ ప్రశ్న.

"నా కెర్కలే?" రాజారాం గొంతులో కాఠిన్యం.

అప్పుడు స్టేషన్లో నుంచీ ఒక స్త్రీ ఏడుపు విన్పించింది.

ఒక బక్కపలుచటి స్త్రీ గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ శవం కేసి పరుగెత్తుకొచ్చింది. ఆమె వెనుకే కర్ర ఊతంతో ఒక ముసలివాడు. బక్క దుక్కిటెద్దుల్లాంటి ఇద్దరు రైతులు వచ్చారు.

ఆ స్త్రీ రాజారాం కన్న పేదగా అధ్వాన్నంగా ఉన్నది. నడివయసులోనే ముసలిదై పోయి నట్టుగా వున్నది. రెండు పాతచీరెలు కలిపి కుట్టిన రెండు రంగుల చీరె కట్టుకున్నది. అదైనా అక్కడక్కడ చిరిగి వున్నది. వెలిసిపోయిన పాత రయికె తొడుక్కున్నది. ఆ స్త్రీ వెంట్రుకలు విచ్చిపోయి ఉన్నాయి. ముఖంలో ఎముకలు తప్ప గోరెడు మాంసం లేదు.

"ఓరి కొడుకా! ఎంత పని కెత్తుకున్నవ్‌రా కొడుకా! మొన్న మునిమాపు నాబట్టు చేతులతోని బువ్వబెత్తిగాదు కొడుకా! మీ అవ్వచ్చిందిగాదు కొడుకా! ఓరి మల్లయ్య మీ తాతచ్చిండుగాదు కొడుకా! మీ మామలు వచ్చిండ్లు గాదు కొడుకా! గీదిక్కు మల్లె అవ్వకేం జెప్పి పోతివి కొడుకా! నిన్ను గంటి గని నీ రాత కనకపోతి కొడుకా! దేవుడా నీ గుల్లెరాయి పడ దేవుడా! నా బతుకు కుక్కలు సింపిన ఇత్తరి జేత్తివి దేవుడ. కన్నోడు సుకపెట్టకపాయె కొడుక - పాపకారి జల్మనాది కొడుక - కట్టుకున్నోడు సుకపెట్టకపోయె దేవుడా! అడివిల పొద్దుగూకింది గదర కొడుక- ఇగ నేను ఏ ఆశ జూసుకొని బతుకాలె కొడుకా! నన్ను కొంటబోక పోతివి కొడుకా!" ఆ స్త్రీ ఆ శవాన్ని తడుముతూ, మధ్య మధ్య దుమ్మునెత్తి మీద పోసుకుంటూ పిచ్చిదానిలా ఏడుస్తోంది.

అంతవరదాకా గడ్డ కట్టుకుపోయిన మనుషుల బండబారిన గుండెలు జాలువారాయి. అక్కడ నిలుచున్న వాళ్ళందరిలో కళ్లల్లో నీళ్లూరాయి.

"ఎంతైనా కన్నకడుపు కన్నకడుపే - పేగు చింపుకొని పుట్టిన కన్న కొడుకు తన కండ్ల ముంగట మన్నై పోతే ఆడదాని మనసు అవిసిపోతది," ఒక ముసలమ్మ బొలబొల ఏడుస్తూ చెప్పింది.

ఏడుపు అక్కడ తెరలుతెరలుగా చలిలా, చీకటిలా అందరిని చుట్టేసింది. పంచనామా రాసిన రైల్వేపోలీసు ఆ సంగతే మరిచిపోయాడు.

స్టేషన్‌మాస్టర్ కళ్ళద్దాలు తుడుచుకున్నాడు.

రాజారాంకు ఆ ఏడుపు ఎక్కడో విన్పిస్తోంది. ఆ ఏడుస్తున్న స్త్రీ తన భార్యేనా? తను, ఆ స్త్రీ బతుకులో ఒకప్పుడు సగం సగం పంచుకున్నారా? ఆమె తను కలిసి మిరప చెట్లల్లో మొక్కజొన్న పెరడి మంచెమీది సద్ది మూట విప్పుకొని చెరి సగం తిన్నది వాస్తవమేనా? కాదు ఈ స్త్రీ ఆమె కానేకాదు. రాజారాం మనసులో పచ్చటి ముఖం, ఎఱ్ఱటి చెక్కిల్లు ఎప్పుడూ నవ్వే ముఖం గలిగిన స్త్రీ మాత్రమే వున్నది. ఈ స్త్రీ ఒక దయ్యం లాగున్నది.

కఱ్ఱ ఊతంగా నిలుచున్న ముసలయ్య కూలబడి, "ఊకోయే ఎల్లవ్వా! ఏడ్చేడ్సి నీ కను పాపలు కారిపోతయి. ఎవని కొర్త ఆడనుబగించాలె. అందరం బతుకచ్చినమ్మా?" అన్నాడు.

"ఓ నాయినా నీ మనుమనికి ధైర్యం జెప్పు నాయిన, లేపు నాయిన్న," తండ్రి మీద పడి ఏడ్చింది. ఆ ముసలయ్య తన నరాలు దేలిన చేతుల మధ్య బిడ్డను అదుముకున్నాడు. బలహీనమైన ఆ చేతులు వణుకుతున్నాయి.

ఎల్లమ్మ మరో పది నిమిషాలు పరిపరివిధాల వర్ణిస్తూ ఏడ్చి ఏడుపు ఆపింది. అప్పుడు చూసింది కొడుకు కాళ్ల వేపున కూర్చున్న మనిషిని, దయ్యాన్ని చూసినట్టుగా జడుసుకున్నది.

"పో- నా కొడుకును ముట్టకు- నీ పాపకారి చెయ్యి తాకుతె నా కొడుకు ఇష్టమెక్కుతడు. నా బతుకు గంగల గల్పినవ్. నా కొడుకును నువ్వే చంపినవ్," అరిచింది. కొడుకు కాళ్లను తనకేసి జరుపుకున్నది.

రాజారాంను ఎవరో లేపి అటెటో తీసుకపోయారు.

ఎల్లమ్మ మల్లీ కొడుకు మీద పడి, "మీ నాయిన నీ కట్టం సుకం సూడరాలే కొడుకా! నీ సావు సూడచ్చిండు కొడుకా! మల్లయ్య నన్నడిగిన సంగతులన్ని మీ నాయిన నడుగుదువు రారా కొడుకా, నా కొడుకా!"

రైల్వేపోలీసు తేరుకున్నాడు. అతనేదో వేదాంతం చెప్పబోయాడు కాని నోరు పెకలలేదు.

రాజారాంకు ఈ ప్రశ్నలన్నీ సలుపుతున్నాయి. తన కొడుకును తన దగ్గరే ఉంచుకుంటే చావకపోయేటోడా? తనే ఎప్పుడో చచ్చిపోయినంక వాళ్లనెట్లా ఉంచుకుంటాడు? తన చావు ఎప్పుడు ఆరంభమయ్యింది. తను కలల ప్రపంచాన్ని ఎవరు విధ్వంసం చేశారు. ఎప్పుడు చేశారు? తన ఏడుపు ఎక్కడ ఎప్పుడు తెగిపోయింది. తను బండరాయా? తన నరాలు ఒక్కటొక్కటే పుటుక్కు

పుటుక్కున తెంపిందెవరు? చనిపోయిన అన్నా? చదువు ఆపి పెద్ద కుటుంబాన్ని సాదుక వచ్చినప్పుడా? మిరప తోటకు కొరుకుడు రోగం తాకి మాడిపోయినప్పుడా? అప్పు కింద షావుకారి భూమి గుంజుకున్నప్పుడా? అంజుమన్ అప్పులు, తనఖా బ్యాంకు వాళ్ళు వేలం పాడినప్పుడా? సర్వం ఒక్కొక్కటే ఊడ్చుకపోయి రైతు, కూలిగా మారినప్పుడా? కాదు ఈ అన్నీ జాగల్ల తన జీవనాడులు ఒక్కొక్కటే తెగిపోయినయ్.

అన్న చనిపోయినప్పుడు చదువుతున్న ఎనిమిదో తరగతి ఆపి ముసలి తండ్రితో గుంటుకు కొట్టి ఎర్రటెండలో నెత్తురు పేరిన అరిచేతులు చూసుకొని, నాయిన్న చనిపోయి మొత్తం కుటుంబ భారం మీద పడ్డప్పుడు చెరువు కట్టకింది మర్రిచెట్టు కింద కూలబడి వెక్కివెక్కి తను ఇట్లాగే ఏడ్చాడు. ఒక్కొక్క ఎకరం భూమి అమ్మి ఒక్కొక్క అంగం కోసుకుపోతున్నట్టుగా విలవిలలాడాడు. గిజగిజ తన్నుకున్నాడు. మొత్తం భూమి అమ్మకంతో వేళ్ళు పూర్తిగా తెగి కూలిపోయిన చెట్టులా ఎండి పోయాడు. తన ఏడుపు ఆగిపోయింది. నరాలన్ని తెగిపోయినయ్.

ఈ విధ్వంసం ప్రతి పల్లెలో ప్రతి రైతు లోలోపల జరిగింది. రైతులంతా తమ గాయాలు దాచుకొని విధ్వంసాన్ని మింగుకొని తిరుగుతున్నారు. తుపాను గాలిలో ఎండుటాకుల్లా ఎగురు తున్నారు. అంతటా ఇలాంటి మనుషులే.

రైల్వేపోలీసు 'పంచనామా కాయిదం' తీసుకువచ్చాడు. రాజారాం దాని మీద, ఇంగ్లీషులో సంతకం చేశాడు.

శవాన్ని కదిలించారు. జనం కదిలారు. మాటలు, ఓదార్పులు శవాన్ని గుడ్డలో చుట్టుకొని రైల్వేస్టేషన్ బయటకు తీసుకుపోతున్నారు. ముసలి తండ్రి ఆసరగా ఎల్లమ్మ గుండెలు బాదుకుంటూ ఏడుస్తూ శవం వెనుకే వెళ్ళిపోయింది.

రాజారాం ఆ జనంతో పాటే స్టేషన్ బయటకు వచ్చాడు.

బండిలో వరిగడ్డి మెత్తగా పరిచి శవాన్ని పడుకోబెట్టారు. బండిలో కూర్చున్న ఎల్లమ్మ శవం తలను వొళ్ళో పెట్టుకొని పిచ్చిదానిలా ముద్దులాడుతోంది.

స్టేషన్ముందు గల కరెంటు బుగ్గ వెలుతురులో అక్కడ నిలుచున్న మనుషుల నీడలు దయ్యాల గుంపులాగా ఉన్నాయి.

'తను మనుషులను, భూమిని, పంటలను ప్రేమించలేదా? తన భార్యను, కొడుకును, తండ్రిని కుటుంబాన్ని...' రాజారాం లోలోపల ఏదో మత్తులా పాకుతోంది. ఎక్కడో సన్నగా వొణుకు ప్రారంభమైంది.

ఒక్కసారి ఒకే ఒక్కసారి, కడసారి తన కొడుకును ఒళ్ళోకి తీసుకొని ముద్దాడితే! నాలుగేండ్ల పిల్లవాడు భుజం మీద కూర్చుండి ఏదో అడుగుతున్నాడు.

కాని ఎడ్లబండి కదలింది.

"బావా నువ్వు బండెక్కు," బండి నడిపే రాజారాం బావమరిది అడిగిండు.

"అన్నీ కాలి కూలి బూడిదై పోయినంక బావెవ్వడే అన్న! మీ బావెన్నడో సచ్చిపోయిండు నేను ముండబొడ్డిని," అన్నది ఎల్లమ్మ.

బండి కదిలింది. స్టేషన్లో గంట మోగింది. ప్యాసెంజర్ రైలు గంట అది. జనమంతా తేరుకొని బిలబిలమంటూ ఎవరి జాగాలల్లోకి వాళ్లు సర్దుకున్నారు.

ఆ స్టేషన్ ముందు ఎటు పోవాలో తెలియక రాజారాం ఒంటరిగా నిలబడిపోయాడు. అతన్ని పిలిచేవాళ్ళెవరు లేరు.

రాజారాం అడుగులు బండి వెళ్ళిన దిశలోనే పడ్డాయి.

రాజారాం నడుస్తున్నాడు. స్టేషన్ దూరమయ్యింది. బండి గీరెల చప్పుడు చీకట్లో విన్పిస్తోంది. పలుగురాళ్ళు బండి కమ్ముల కింద నలుగుతున్న శబ్దం. చుట్టూ ఆవరించిన చీకటి- చిమ్మెట్ల రొద, పేరు తెలియని రొద ఏదో మోగుతోంది. ఈతచెట్ల కమ్మల మీద మిణుగురులు ఎగురుతున్నాయి. పైన చుక్కల ఆకాశం, దూరంగా చుట్టుప్రక్కల గల ఊళ్ళల్లో వీధి దీపాలు కొరివి దయ్యాల్లాగా... బండి వెళ్ళిపోతున్నది. ఇప్పుడు గీరెల శబ్దం కూడా విన్పించడం లేదు. రాజారాం వెనుకబడిపోయాడు.

రాజారాం కాళ్లు ఆగిపోయాయి. దారిలోనే కూలబడ్డాడు.

"ఓ బావో వత్తన్నవా?" బావమరిది కేక.

రాజారాం జవాబుగా కేక వెయ్యలేదు. అతనికంత శక్తి లేదు.

తను తప్పక వస్తడని బావమరిది అనుకున్నాడా? కొడుకు అంత్యక్రియలకు తను పోతున్నట్టా? నిజంగా ఈరోజు పొద్దున రైలు కింద తలబెట్టి చనిపోయిన ఆ పిల్లవాడికి తను తండ్రేనా? కాలి కూలి బూడిదైన పల్లెల్లో కొడుకెవరు? తండ్రెవరు?

చలి అంతకంతకూ ఎక్కువైంది. దానికితోడు కడుపులో ఆకలి మంట, చలికి దవడలు వణుకుతున్నాయి... ఇప్పుడు అతనికి సారా ప్యాకెట్లు జ్ఞాపకం వచ్చాయి. మెదడు పొరల్లో ఈ తర్కానికి లొంగనిదేదో మెల్లిమెల్లిగా కరుగుతోంది. అది ఆకలికన్నా, చలికన్నా ఎక్కువ సలుపుతోంది. తల పగిలిపోతోంది.

తను ఈ భూమి పుట్టిన కాడికి విన్పించేలాగున ఏడిస్తే ఎంత బాగుండును! కానీ ఏడుపు రాదు. ఆ లెక్కన ఆ బండిమీద పోయిన తల్లే తనకన్నా అదృష్టవంతురాలు.

లేచి నిలుచున్నాడు. అడుగులు తడబడుతున్నాయి. తూలుతూ అటు వెనుకకు స్టేషన్ కేసి కాకుండా ఆ ముందు ఎడ్లబండి పోయిన దారిలో కాకుండా తూర్పుకేసి నడువసాగిండు.. తొవ్వ దారి లేదు. కొంతసేపు చిక్కురు బొక్కురుగా నడిచిన తరువాత ఒక బండ్లబాట కన్పించింది. మరి కొంతదూరం నడిచిన తరువాత ఒక పెద్ద మర్రిచెట్టు వచ్చింది. అది 'పోశమ్మ దేవత' మర్రిచెట్టు. ఆ మర్రిచెట్టు నుండి ఒక దారి రాజారాం పల్లెకు పోతుంది. మరొకదారి పెద్దపల్లి టౌనుకు పోతుంది. మూడోది పంట పొలాల మీదుగా 'రామగిరి' అడవికి పోతుంది. నాలుగోది చెరువుకట్ట మీదుగా పొరుగూరికి పోతుంది.

ఆలోచనలు ఇంకిపోయి మర్రిచెట్టు క్రింద కూలబడిపోయి రెండు చేతులతో ముఖం, తల రుద్దుకుంటూ లోలోపల పూర్తిగా ధ్వంసమై పోయిన రైతుబిడ్డడు రాజారాం ఏడుస్తున్నాడు. వెక్కివెక్కి ఏడుస్తున్నాడు. పూర్తిగా బొట్టుబొట్టుగా కరిగిపోతూ భూమిలోకి ఇంకిపోతూ ఏడుస్తున్నాడు.

రాజారాం నాలుగురోడ్ల కూడలిలో చిక్కటి చీకటిలో, గడ్డకట్టిన చలిలో, ఆకలితో కొడుకును, సర్వస్వాన్ని పోగొట్టుకున్న దుఃఖంతో ఏడుస్తున్నాడు.

రాజారాం లోలోపల జరిగిన విధ్వంసాన్ని పూర్తిగా అర్థం చేసుకుని అతన్ని లేపి, గుండె కదుముకో గలిగిన 'బాటసారులు' నాలుగు బాటల్లో ఏ బాట నుంచి వస్తారో మరి?...

*ఆంధ్రజ్యోతి వారపత్రిక*
*21 ఏప్రల్ 1989*

నేపథ్యం

## ఛిద్రమైన పల్లెబతుకుల నేపథ్యం

# మనిషి లోపలి విధ్వంసం

***ఒకపక్క విధ్వంసం... దాని క్రూర మొరటు స్వభావం...***
***మరోపక్క రక్తసిక్తమైన నిర్మాణం... విధ్వంసంగానీ, నిర్మాణంగానీ,***
***చావుపుట్టుకలుగానీ వ్యక్తిగతమైనవి కావు, వ్యవస్థాగతమైనవి.***
***ఇవి ఏకకాలంలో కొనసాగేవి... జీవితకాలమంతా***
***నిరంతరంగా కొనసాగేవి.***

1984లో మా మేనమామ కారుకూరి బొంద్యాలు వ్యవసాయంలో, జీవితంలో అన్ని రకాలుగా విఫలమై... భార్య చనిపోయి నలుగురు బిడ్డల పెళ్లిళ్లు చేసి- ఏటా కొంత భూమితో పాటు చివరకు ఇల్లు అమ్ముకొని- వేళ్లతో సహా ఊరితో సంబంధం తెగిపోయి ఆత్మహత్య చేసుకోవడానికి బయలుదేరి మంచిర్యాల రైల్వేస్టేషన్ ఎంచుకున్నాడు. రోజూ గోదావరి బ్రిడ్జి దగ్గరికి వెళ్లి ఆత్మహత్య వీలుకాక ఒక బికారిలా స్టేషన్లో గడుపుతున్న సమయంలో, తెలిసినవాళ్లు చెప్పగా నేను వెళ్లి చెల్లాచెదురైన స్థితిలో ఉన్న ఆయన్ను మా ఇంటికి తీసుకవచ్చాను. ఆయన ఆ స్థితిలో నా దగ్గర మూడు నెలలున్నాడు. నా చదువు గురించి నాలుగవ తరగతి నుండి అయిదవ తరగతి దాకా మా మామతో ఉన్నాను. నాతో ఉన్న సమయంలో అప్పటిదాకా కూలిపోయిన తన వ్యవసాయం గురించి, రైతుకూలి ఉద్యమాల గురించి చెప్పాడు.

మా కుటుంబంలో మా నాన్న తరపునగాని, అమ్మ తరపునగాని మొట్టమొదటి చదువు నేర్చిన వ్యక్తి... మాది 40, 50 ఇండ్లుండే మెట్ట వ్యవసాయపు పల్లె. చదువు కోసం మా మామ ఊరు వెన్నంపల్లికి పోయాను. అప్పటికి మా మామకు పదెకరాల భూమి. ఏ లోటులేని సంసారం. వరిపొలం, కూరగాయలు, మిర్చిలాంటి నీటి పారుదల పంటలు కలిగి అన్ని కులాలు, వృత్తులు, దొరలున్న పెద్ద ఊరది. ఆదివాసి పల్లెకు కొద్దిగా ఎక్కువ, మైదాన ప్రాంతపు ఊరుకు తక్కువగా ఉన్న మా పల్లె నుండి భూస్వామిక సంబంధాలు ఒకపక్క, పాత కమ్యునిస్టు పోరాటాల ప్రభావం ఇంకొకపక్క

గల ఆ ఊరు నా బాల్యం మీద చిత్రమైన చెరుగని ముద్ర వేసింది. నాకన్నా పదేండ్లు మాత్రమే పెద్దవాడైన మా మేనమామ అన్ని రకాలుగా నాకు రోల్ మాడల్. పెద్దపల్లికి పదిహేను కిలోమీటర్ల దూరంలో రామగిరి పర్వతం పక్కనే గల వెన్నంపల్లి నా విశ్వవిద్యాలయం. అక్కడి మనుషులు, చెరువులు, కట్ట మీది మర్రిచెట్టు, కంచెలు, అడవి, ఈత, తాటిచెట్లు, లోతైన బావులు, పెద్దపెద్ద మిరప, మక్కజొన్న పెరండ్లు, అలుగులు, బొదర్లు మా మామ సహచర్యంలో నేను గాలించినవే. నా సాహిత్యంలో అత్యధికంగా చిత్రించిన ఊరు వెన్నంపల్లి. అలాంటి వెన్నంపల్లి తరిమేసిన మా మేనమామ... ఒక మహాద్భుతమైన నా కలల ఊరు నా కళ్ల ముందే కాలికూలిన దృశ్యం... ఆ తరువాత అనేకమార్లు ఆ ఊరికి వెళ్లి గాలిస్తే- గాయాలు రేపే శకలాలు...

ఆ తరువాత మా మేనమామ ఆత్మహత్య ప్రయత్నం నుండి బయటపడి ఊరికి పోకుండా అనేక చిల్లరమల్లర పనులుచేసి అజ్ఞాతంగా బతకడానికి ప్రయత్నించాడు. చికెన్ సెంటర్లో మళ్లీ కలిశాడు. 'పసిపిల్లల తలలు నరుకుతున్నట్టుగా ఉంది. నేనిక్కడ ఉండలేను, వెనక్కిపోలేను,' అన్నాడు నాతో. మా పల్లెలో మా అమ్మ నానతో ఉంది. మా వ్యవసాయం చూడమన్నాను. అక్కడికి పోనన్నాడు. తన బిడ్డల దగ్గరికి వెళ్లమన్నాను. అచ్చమైన మనుషుల కోసం వెతికే మామ అక్కడ ఉండలేకపోయాడు. ఆ తరువాత మారుతూ మారుతూ అల్లుండ్ల దగ్గరికి వెళ్లి, వాళ్ల భూముల్లో వీరోచితంగా వ్యవసాయం చేసి, మళ్లీ విఫల ప్రయోగాలు చేసి, జబ్బుపడి, పదేండ్ల క్రితం ఎక్కడికో వెళ్లిపోయాడు. ఇప్పటికీ చావు, బతుకు తెలియదు.

అట్లా విధ్వంసకర గ్రామీణ ఉత్పత్తి విధానం నుండి, ఊరు నుండి బహిష్కరింపబడి- మా మేనమామ విషాద నిష్క్రమణం... ఇట్లాంటి కుటుంబ నేపథ్యంలో నుండి చదువు అనే దారం పట్టుకొని పల్లెలు, పట్నాలు దేశ సరిహద్దులు దాటి, ఒక శాస్త్రవేత్తగా ఎదిగి ఆస్తి కేంద్రంగా సాగే విధ్వంసకర పతాకస్థాయి ఉత్పత్తి విదానం- ప్రపంచ ప్రజల కొల్లగొట్టే అమెరికాలోని లూసియానాలో విచ్ఛిన్నమైన మనుషుల తుపాకి గుండ్లకు ఎరయై హత్యకు గురైన మా అబ్బాయి కిరణ్‌కుమార్... (డిసెంబర్ 2007) మనందరి చుట్టూ ఆవరించియున్న విధ్వంసకర బీభత్స సమాజానికి కొండగుర్తు...

మా మామ జీవితమే కాదు వెన్నంపల్లిలో నేనెరిగిన కారుకూరి రాజయ్య మామ, నర్సయ్య మామ లాంటి అనేకమంది రైతులు, ఇతర దళిత కులాల కూలీల జీవితాలు ఇట్లాగే తెల్లారి పోయాయి. రైతాంగ ఉద్యమాలతో నేను తిరిగిన రాష్ట్రాలలోని పల్లెల్లోని వెనకబడిన దళిత బతుకులు ఇంతకన్నా దారుణంగా కకావికలం కావడం చూసిన.

మా కుటుంబంలో మా మామ జీవితం అనేక ప్రశ్నలతో లోలోపల రగిలే నొప్పి. వ్యవసాయం కాకుండా ఇతరేతర పనులు చేసి బాగుపడ్డ వాళ్లంతా మామను, 'చేతకానివాడు, బతుకుడు తెలువనివోడు, తాగుబోతు,' లాంటి మాటలతో విశ్లేషించారు. నాకు తెలిసి మా మామకు దోపిడి నచ్చదు. అబద్ధం రాదు. అప్పటికి పుస్తకాలు, సృజనలాంటి పత్రికలు, మా రచనలు చదువు తుండేవాడు. 1985 మా మామలాగే ఊరితో అన్ని బంధాలు తెగిపోయి తాడు తెగిన గాలిపటంలాగా తిరుగుతున్న రాజయ్యమామ కొడుకు... యువకుడు- తల్లి దగ్గరే బతుకుతున్న ఒక్కగానొక్క కొడుకు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసింది. పల్లెల్లో ఒకపక్క ఎన్‌కౌంటర్లు, మరోపక్క ఆత్మహత్యలు- పల్లెలన్ని లోలోపల విధ్వంసమవుతున్న దశ.

రకరకాలుగా అల్లకల్లోలంగా ఉన్న నా మానసిక స్థితిలో- ఆ యువకుడి ఆత్మహత్య నన్ను వెంటాడింది. ఢిల్లీకి వెళ్లే రైలుపట్టాల మీద ఎప్పటినుండో ఆ యువకుడి శవం అట్లా పడి

ఉన్నట్టుగానే తోచేది. రైలుపట్టాల కటూయిటూ విస్తరించియున్న ఆ ఊళ్లను మనుషులను తలుచుకుంటూ వందలసార్లు ప్రయాణం చేశాను. ఈ కథకు మూలమైన పాత్రలు, సన్నివేశాలు, సంఘటనలు, కాలం, స్థలం ఇవ్వయితే-

కథ వెనుక లోలోపల అప్పటికి రూపొందుతున్న కథాంశం గురించి చెప్పాలి.

1977 ఎమర్జెన్సీ ఎత్తివేసిన తరువాత కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలల్లో పెద్ద యెత్తున రైతుకూలి సంఘాలేర్పడి విధ్వంసకర, ఊపిరి సలుపనివ్వని దుర్మార్గపూరితమైన, క్రూరమైన భూస్వామిక ఉత్పత్తి విధానానికి వ్యతిరేకంగా, అలాంటి వ్యవస్థను కాపాడే దొరలకు వ్యతిరేకంగా అన్ని గ్రామాల్లో పోరాటాలు ఉవ్వెత్తున లేచాయి. ఒక్క నిప్పురవ్వ దావానలమైంది. 1978 సెప్టెంబర్ 8 జగిత్యాల జైత్రయాత్ర నాటికి దొరలను గ్రామాల నుండి తరిమికొట్టి, 'దున్నేవాడికి భూమి' ప్రాతి పదికన రైతుకూలీ సంఘాలు సంఘటితమయ్యాయి. దొరల గుండాలు లక్షిరాజం, పోశెట్టిలాంటి రైతాంగ కార్యకర్తలను హత్య కావించారు. భూస్వాముల హింస నాపడానికి రైతాంగ ఉద్యమకారులు ప్రతిదాడులు ఆరంభించారు. ఫలితంగా కల్లోలిత ప్రాంతంగా ప్రకటించబడినది. కేసులు, నిర్బంధం మధ్యనే పోరాట విస్తరణ జరిగింది. దొరలు గ్రామాలు ఖాళీచేసి పట్నాలకు పారిపోయారు. వేలాది ఎకరాల భూమి పంపకం జరిగి- గ్రామాలల్లో ప్రజా పంచాయితీలు వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లోని రైతాంగ ఉద్యమాలను, దేశవ్యాపితంగా జరిగిన, జరుగుతున్న రైతాంగ పోరాటాల అవగాహనను అర్థం చేసుకొని ముందుకు పోవాల్సిన దశ దిశ కోసం 1983, మే 22, 23 తేదీలలో వేలాదిమంది రైతులు రైతుకూలీలతో రెండవ రైతుకూలీ సంఘం మహాసభలు కరీంనగర్‌లో జరిగాయి. కర్ణాటక, మహారాష్ట్ర (షేట్‌కారీ సంఘటన) లాంటి రైతు ఉద్యమాలను చూడటం జరిగింది.

1985 నాటికి తెలంగాణ సాయుధపోరాటపు వైఫల్యాలు తెలుసుకొని గ్రామాలల్లో నిర్బంధం రీత్యా అడవిలోకి ఉద్యమాలు విస్తరించాయి. నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతం కావా లంటే- కావాల్సిన మూడు ఆయుధాలు- 1) సరైన రాజకీయ దృక్పథం కలిగిన పార్టీ, 2) ఐక్య సంఘటన, 3) ప్రజా సైన్యం... అనే లక్ష్యంగా ఆచరణలో రైతాంగ కార్యకర్తలు మునిగి ఉన్నారు. ఇలాంటి అన్ని రకాల మలుపులను ఈ ప్రాంతపు అన్ని రకాల సాహిత్యం చిత్రించినట్లుగానే లోగడ నేను అనేక కథలు రాశాను.

ఆదిలాబాద్, కరీంనగర్ అటవీ ప్రాంతాల్లో సాయుధ రైతాంగ దళాలు పెరిగి (కార్మికవర్గంతో కలిపి) మైదాన ప్రాంతంలోని గ్రామీణ ప్రాంతాలు తీవ్రమైన నిర్బంధాన్ని ఎదుర్కొన్నాయి. రైతుకూలీ సంఘాలు కకావికలయ్యాయి. ప్రతి ఊరు పదులసార్లు పోలీసుల దాడితో- ఇండ్లు కూల్చి, ధాన్యం బావుల్లో పోసి, పంటలు నాశనం చేసి విధ్వంసం సృష్టించారు. ఎన్‌కౌంటర్లతో గ్రామాలల్లో అనేక మంది చనిపోయారు. కోర్టులు, జైళ్లు కిటకిటలాడాయి.

ఇలాంటి వీరోచిత, నిర్బంధకాలంలో అనేక చర్చోపచర్చలు, చీలికలు... పాత సాంప్రదాయిక పడికట్టు విప్లవ అభిప్రాయాలు కూలిపోయి- మనదైన అనుభవంతో కొత్త ఆచరణ రూపొందే క్రమంలో అనేక ఆటుపోట్లు... అలవాటైన, అనుభవంలో ఉన్న భూస్వామిక సమాజాన్ని చిత్రించిన నాలాంటి వాడికి ఇన్నిరకాల ఒత్తిడుల అనుభవం వ్యక్తీకరణ కోసం ఆరాటం నన్ను నిలువకుండా చేసింది. ఇలాంటి అనేకానేక సంఘర్షణల్లో యువకుడి ఆత్మహత్య... బహుశా నాలోలోపల నిక్షిప్తమై ఉన్న అనేకానేక గాయాలు... సమస్త వ్యవసాయరంగ సంక్షోభం... అతలాకుతలం చేశాయి.

ఒకపక్క విధ్వంసం... దాని క్రూర మొరటు స్వభావం... మరోపక్క రక్తసిక్తమైన నిర్మాణం... విధ్వంసంగానీ, నిర్మాణంగానీ, చావుపుట్టుకలుగానీ వ్యక్తిగతమైనవి కావు, వ్యవస్థాగతమైనవి. ఇవి ఏకకాలంలో కొనసాగేవి... జీవితకాలమంతా నిరంతరంగా కొనసాగేవి. కథ రాయడం మొదలు పెట్టినా ముందుకు సాగలేదు. విధ్వంసం, నిర్మాణం ఒకే కథలో రాయాలని గింజుకున్నా ఫలితం లేదు. పోరాటాల క్రమం గురించి అనేక కథలు ఇదివరకే వచ్చినాయి గనుక, ఇలాంటి ప్రత్యేక సందర్భంలో... ముఖ్యంగా చర్చోపచర్చలు జరుగుతున్న (భారతదేశంలో విప్లవం) దశలో వైరుధ్యాలు చిత్రిస్తే చాలు అనుకున్నాం. అంటే విధ్వంసాన్ని చిత్రించడమన్నమాట.

అయినా కథ నడువదు. అతి తీవ్రమైన దుఃఖమేదో లోలోపల... పుట్టుకతోటే చావు మొద లౌతుందనే దుర్భర స్థితిని అనుభవిస్తూ... రాయకుండా తప్పించుకుంటూ తిరుగుతూ ఉండేవాడ్ని.

బాగా తిరుగుతూ, చదువుతూ... యనాన్ రైతాంగం మీద మావో రాసిన రిపోర్టు మూడోసారి చదివి- చైనాలో విప్లవ చోదకశక్తులైన రైతాంగం గురించి చర్చించింది. చైనాలో విప్లవ చోదక శక్తులైన రైతాంగం గురించి చర్చించింది. చైనా కమ్యునిస్టు పార్టీ తిరస్కరించింది. మావో బహిష్కృతుడై... దాదాపు ఈ నేపథ్యంలోంచి వచ్చిన లూహన్ చిట్టి నవల 'మిస్టర్ ఆక్యూ.'

దాదాపుగా 70% ప్రజలు ఆధారపడిన సొంతాస్థికి కేంద్ర బిందువైన భారతదేశంలోని గ్రామీణ ఉత్పత్తి విధానం రైతులకు, రైతుకూలీలకు, శ్రామికులను లోలోపల తొలిచేసి దోపిడీదారులకు దార్లు తెరిచి భూస్వామ్యాన్ని బలపరిచేది. బ్రిటిష్ కాలం నుండి స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో అభివృద్ధి పేర చేపట్టిన అన్నిరకాల వ్యవసాయ పద్ధతులు మనుషులను విధ్వంసం చేశాయి. ఇట్లా విధ్వంసమైన రైతులు, రైతుకూలీలు భరించరాని దోపిడీపీడనలల్లో ఉద్యమాలలోకి అనివార్యంగా వస్తున్నారు. కానీ స్థిరంగా నిలబడి, పోరాటాలను ఒక దశ నుండి మరోదశకు ఉన్నతస్థాయిలోకి తీసుకపోవడానికి నిర్మాణపరంగా కలవెలపడుతున్నారు. ఉద్యమాలు కూడా ఈ అర్ధవలస అర్ధ భూస్వామ్య విధ్వంసకర ఉత్పత్తిలోని మౌలిక సంక్లిష్టతలను అధ్యయనం చేసి నిర్మాణంలోకి సమీకరించడం ఒక సవాలుగా నిలిచింది. భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలల్లో నివసించే ఈ విధ్వంసకర ఉత్పత్తి విధానంలోని 70% ప్రజలు పాల్గొనకుండా నిర్మాణంలోకి రాకుండా, నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతము కాదు.

భారతదేశ సంక్లిష్ట సమాజంలో వైరుధ్యాల దశదిశ గురించిన అనేక చర్చలు...

నేనింతవరకు ఎక్కువ రాసిన సాహిత్యం కన్నా భిన్నమైన వస్తువులో... సోవియట్ యూనియన్, చైనా పరిణామాలల్లో, ఇక్కడి ఉద్యమాలల్లో పాతతరం అనివార్యంగా ఆగిపోయి కొత్త తరం తోసుకొచ్చిన సందర్భం- రాజకీయాలల్లో ఒక కొత్తదారి రూపొందే సంకుల సమరంలో- తీవ్రమైన భావోద్వేగాలతో అన్‌రెస్టుతో తిరుగుతున్న క్రమంలో... తీవ్రమైన విషాదం వెన్నాడుతూ ఉండేది. అలాటి స్థితిలో మంచిర్యాల రైల్వేస్టేషన్లో తిరుగుతుండగా- ఒక మిత్రుడు తన వెంట ఢిల్లీకి రమ్మన్నాడు. నాగపూర్‌కు వెళ్లేసరికి మనసు మారి తిరుగు ప్రయాణం ఒంటరిగా... రైల్లో గడ్‌చరోలీ ఆదివాసి ప్రాంతాలల్లో పనిచేసే ఒక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. జనరల్ డబ్బా మిల్ట్రీ వాళ్లు ఆక్రమించుకున్నారు. అనారోగ్యంతో చనిపోయిన అతని భార్య శవం ఒక సీటు మీద, శవం పక్క అతని ఇద్దరు పది సంవత్సరాల లోపు కొడుకులు బిక్కుమంటూ... వాళ్ల పక్క తను... ప్రజలకు రక్షణ కల్పించవల్సిన మిల్ట్రీవాళ్లు ఉన్నట్టుండి ఒకమ్మాయి పట్ల దురుసుగా ప్రవర్తించారు. లోపల పికపికలాడుతున్న జనం ఏమిచేయాలో తోచక చేష్టలుడిగి నిలబడ్డారు. ఇంతలో అంత విషాదంలో

ఉన్న ఉపాధ్యాయుడు పట్టరాని కోపంతో మిల్ట్రీవాళ్ల నడిగాడు. 'మీరు ప్రజల డబ్బుతో, ప్రజలను రక్షించవల్సిన చోట దౌర్జన్యం చేస్తారా?' అని నిలదీశాడు. బోగీలో ఉన్న మొత్తం మిల్ట్రీవాళ్ల మీద తిరగబడ్డారు. 'తప్పయిందని' ఒప్పించేదాక ఆ ఉపాధ్యాయుడు ఊర్కోలేదు. నేనెప్పటికి రాయ జాలని ఆ ఉపాధ్యాయుడు నాకు కొత్త మార్గం చూయించాడు. ఇంటికి వచ్చిన వెంటనే 1985లో మొదలుపెట్టిన కథ 1988లో పూర్తిచేసి, 'మనిషిలోని విధ్వంసం'గా పేరు పెట్టాను. ఒక విస్ఫోటన ప్రేరణగా విస్ఫోటనానికి ముందు స్థితి కథ.

అనేక త్యాగాలతో అప్పటికే అడవిలో పోరాటాలు నిలదొక్కుకుని కొనసాగుతున్న నేపథ్యం లో మైదాన ప్రాంతంలో అతలాకుతలమైన విధ్వంసమైన రాజారాంకు నాలుగుకూడలుల మధ్య పడిపోయిన రాజారాంకు దారేది? ఏ దారిలో గుండా అతని సహచరులు వచ్చి అక్కున చేర్చు కుంటారు? అప్పటి నుండి సాహిత్యంలో విధ్వంసం అనేమాట ఖాయమయ్యింది.

అనేక ప్రశ్నల ఒత్తిడిలో ఆత్మహత్య చేసుకున్న యువకుడు ఎలాంటి ప్రశ్నలు ఎదుర్కొ న్నాడు? ఇప్పటిదాకా మా మేనమామ జాడ తెలియదు. నలుభైయేండ్లుగా సుదీర్ఘంగా కొనసాగుతున్న రైతాంగ పోరాటాలలో మూడు తరాల ప్రజలు అతలాకుతలమౌతూనే ఉన్నారు. అలాంటి ప్రజలను అణచడానికి అన్నిరకాలుగా చంపడానికి ప్రజల సొమ్ముతో ఘనత వహించిన ప్రభుత్వం సైన్యాన్ని పిలుచుకుంటూనే ఉన్నారు. ఇజ్రాయెల్, అమెరికా సైనిక నిపుణులు ట్రైనింగులిస్తూనే ఉన్నారు. దేశ వ్యాపితంగా రాజారాంలాంటి రైతులు ఏటా మూడు లక్షలమంది ఆత్మహత్యలు చేసుకుంటూనే ఉన్నారు. ప్రజలకు పనికిరాని విధ్వంసక పంటలే కాదు విధ్వంసకర వ్యవసాయ ఉత్పత్తి విధానం, మార్కెట్టు... ఖనిజాలు, రాళ్లు, సమస్త వనరులతో సహా పెకలించుకుపోయే మహా ఉత్పాతం ప్రపంచ వ్యాప్తంగా గ్లోబలైజేషన్ పేర చుట్టుముట్టి ఉన్నది. కరీంనగర్-ఆదిలాబాద్ జిల్లాలలోని మైదాన ప్రాంతంలో రైతులు, రైతుకూలీలు ఆరంభించిన పోరాటం అనేక మలుపులు తిరిగి, ఆయుధం పదునెక్కి అడివిలోని ఆదివాసుల భుజాల మీదికి మారింది. దేశవ్యాపితంగా పల్లెలన్నీ వల్లకాడు లయ్యాయి. బౌద్ధం తరువాత ఎలాంటి పోరాటాలను చెలరేగనివ్వని భారతీయ సంక్లిష్ట బ్రాహ్మణీయ సమాజం... లోలోతులు, ఉత్పత్తిలో కులాల నిచ్చెనమెట్లు- దళితులు, స్త్రీలు విముక్తి పోరాటంలోకి.

ప్రపంచమంతటా ఆరంభమైన కుళ్లడం మనదేశంలో ఇక్కడ విస్తరిస్తోంది.

ఇలాంటి విధ్వంసకర సమాజం లోతుపాతు అర్థం చేసుకుని సమష్టి జీవితం కేంద్రంగా మనుషులను పునర్మించే ఉత్పత్తి విధానం దండకారణ్యంలో విప్లవంతో పాటు ఘనతన సర్కార్ ఆరంభించినట్లుగా తెలుస్తోంది.

ఇట్లాంటి వాతావరణంలో విధ్వంసంలో నుండి 70 శాతంగా ఉన్న గ్రామీణ దళిత, బహుజన, మైనార్టీ, స్త్రీలు నూతన ప్రజాస్వామిక విప్లవంలో ఎట్లా నిర్మాణమౌతారు? ఈ విధ్వంసాన్ని, కుళ్లడాన్ని ఎట్లా ఆపుతారు? నిత్యం, నిరంతరం నన్ను నిలువకుండా చేసే ఇలాంటి స్థితి సదా నా వెంటే...

ఇంకా నాలుగురోడ్ల కూడలిలో విధ్వంసమైన రాజారాం... ఢిల్లీకి వెళ్లే రైలుపట్టాల మీద రాజారాం ఒక్కగానొక్క కొడుకు- యువకుడి శవం...


*14 మార్చి 2014*

*'మనిషి లోపలి విధ్వంసం' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

4

# పరివర్తన

## ఆరి సీతారామయ్య




**ఆరి సీతారామయ్య** *1945 సెప్టెంబర్ 1న ప్రకాశం జిల్లా తిమ్మనపాలెంలో జన్మిం చారు. వీరి మొదటి కథ రెండు వారాల సెలవు 1997 జూలై విపుల మాసపత్రిక లో అచ్చయింది. ఇరవై పైగా కథలు రాశారు. గట్టు తెగిన చెరువు కథల సంపుటి ప్రచురించారు. అమెరికాలోని ఓక్‌లాండ్ యూనివర్సిటీలో బయో మెడికల్ సైన్సెస్‌లో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. డిట్రాయిట్ తెలుగు లిటరరీ క్లబ్‌లో క్రియాశీలక కార్యకర్త.*

**చిరునామా**

*1868, హెరాన్ వ్యూ డ్రైవ్,*
*వెస్ట్ బ్లూమ్‌ఫీల్డ్, MI 48324, USA.*
*ari@oakland.edu*


2008 జూన్ 11వ తేదీన అమెరికాలోని ఒక స్థానిక పత్రికలో వచ్చిన వార్త-

"మిచిగన్ పెరోల్ బోర్డ్ వారి ప్రకటన ప్రకారం ఖైదీ 83729463 దీపికారావు మీద అక్టోబర్ 25వ తేదీన విచారణ జరుగుతుంది. హత్యానేరం పై ఓక్‌లాండ్ కోర్టు దీపికారావుకు 2002 ఫిబ్రవరి 18వ తేదీన పదిహేను సంవత్సరాల శిక్ష వేసింది. మిచిగన్ శిక్షాస్మృతి 791.244 ప్రకారం శిక్ష తగ్గించటమా లేదా అన్న నిర్ణయం తీసుకొనే క్రమంలో ఈ విచారణ జరగబోతోంది. రామ్నీ కరెక్షన్ ఫెసిలిటీ కాన్ఫరెన్స్ రూమ్‌లో జరగబోయే ఈ విచారణకు మిచిగన్ పౌరులెవరైనా హాజరు కావచ్చు."

హత్య చేసిన మనిషి నెవర్నీ నేనిదివరకు కలవలేదు. ఎలా వుంటారో? భయంకరంగా ఉంటారేమో? దేశం కాని దేశంలో ఆమెకు భర్తను చంపేటంత కోపం ఎందుకు వచ్చిందో? దీపికారావు గురించి తెలుసుకోవాలనిపించింది. ఇంటర్నెట్‌లో వెతికితే దీపికారావులు చాలా మంది ఉన్నారు కాని, మిచిగన్లో జైల్లో ఉన్నామె గురించి ఎక్కువ గా వివరాలు దొరకలేదు. తెలిసినంతలో డాక్టర్ రావు ఇండియా వెళ్ళి ఈమెను పెళ్ళి చేసుకుని డిట్రాయిట్‌కి తీసుకొచ్చాడు. ఇక్కడకొచ్చిన రెండు నెలల్లోనే

హత్య జరిగింది. కోర్టులో విచారణ జరుగుతున్నప్పుడు ఆమె వైపు మాట్లాడిన ఒకరిద్దరు ఇప్పుడు డిట్రాయిట్‌లో లేరు. ఎక్కడున్నారో తెలియదు. దీపికారావును కలవటం ఎలా వీలవుతుందో తెలుసు కుందామని రామ్నీ కరెక్షన్ ఫెసిలిటీకి ఫోన్ చేస్తే మొదట తెలిసిన విషయం కరెక్షన్ ఫెసిలిటీ అంటే జైలు అని. నేరాలు చేసిన వారిని సరిదిద్దటానికి ఉపయోగపడే వసతిగృహాలన్నమాట. జైల్లో ఆమెను చూడాలంటే అనుమతి ఉండాలన్నారు. అనుమతి కావాలంటే ఆమె నా పేరూ వివరాలూ జైలు వారికి ఇవ్వాలట. వారు నా గురించి విచారణ జరిపి, ఆమోదించి, నన్ను సందర్శకుల జాబితాలో చేర్చితే, అప్పుడు ఆమెను చూడటం వీలవుతుంది. ఈ తతంగం అంతా సవ్యంగా జరిగితే రెండు నెలలు పట్టవచ్చుట. పెరోల్ బోర్డ్ విచారణ ఇంకా దాదాపు నాలుగునెలలుంది కాబట్టి, సరే చూద్దాం అని దీపికారావుగారికి ఉత్తరం రాశాను.

*

ఊరికి రెండు మైళ్ళ దూరంగా ఉంది రామ్నీ కరెక్షన్ ఫెసిలిటీ. చుట్టూ ఆరడుగుల ఎత్తు ఇనుప తీగె కంచె. దానిమీద ముళ్ళ తీగె. విజిటర్స్ లాట్‌లో కారు పార్క్ చేసి లోపలికెళ్ళాను.

రిసెప్షన్ ఏరియా ఒక పెద్ద గది. నిరాడంబరంగా, ఖాళీగా ఉంది. కుడివైపు రిసెప్షన్ డెస్క్. దాని వెనుక గోడ మీద రెండు ఫొటోలున్నాయి. ఒకటి గవర్నర్ జెన్నిఫర్ గ్రాన్‌హోం గారిది. రెండోది మిచిగన్ జైళ్ళ అధికారిణి పెట్రీషియా కారుసోగారిది. రిసెప్షన్ డెస్క్ వెనుక కంప్యూటర్ స్క్రీన్ ముందు కూర్చుని ఏదో నవల చదువుతున్న నల్ల అతని ముందుకెళ్ళి నుంచున్నాను. అతను నన్ను గమనించేటట్లు లేదని, "క్షమించాలి, నేనొక ఖైదీని చూట్టానికొచ్చాను," అన్నాను. "మొదటిసారా?" అన్నాడతను విసుగ్గా తలెత్తి నన్ను చూస్తూ. "అవును," అన్నాను. రెండు కాగితాలను నిర్లక్ష్యంగా నా ముందుకు నెట్టి మళ్ళా తన నవల్లో తలదూర్చాడతను.

ఒక కాగితం మీద నా వివరాలు రాయాలి. పేరూ, చిరునామా, నేను నడుపు కొచ్చిన కారు వివరాలూ, ఖైదీకీ నాకూ ఉన్న సంబంధం... సంబంధం ఏమి రాయాలో తెలియలేదు. బంధువు కాదు. స్నేహితురాలు అని రాయటానికి జంకాను. పైగా హత్య చేసిన మనిషి. రెండో కాగితం చూశాను. అందులో ఆరోజు నాకంటే ముందు ఖైదీలను చూట్టానికి వచ్చిన ముగ్గురి వివరాలు ఉన్నాయి. సంబంధం విషయంలో అందరూ ఔట్రీచ్ అని రాశారు. అంటే ఏమిటో వెంటనే తోచక పోయినా నేనూ ఔట్రీచ్ అనే రాశాను.

రెండు కాగితాలూ అతనికి తిరిగి ఇస్తూ, దీపికారావును చూట్టానికి అనుమతిస్తూ పోస్టులో వచ్చిన ఉత్తరం అతనికి ఇచ్చాను. నా వివరాలు కంప్యూటర్లో చెక్ చేసినట్లున్నాడు. ఒక అనుమతి పత్రం ప్రింట్ చేసి ఇచ్చి, వెళ్ళి విజిటర్స్ ఏరియాలో కూర్చోమన్నాడు.

విజిటర్స్ ఏరియాలో రెండు వరుసల్లో కుర్చీలున్నాయి. ముగ్గురు తెల్ల ఆడవాళ్ళు కూర్చుని ఉన్నారు. నన్ను చూసి సన్నగా నవ్విందొకావిడ. వెళ్ళి ఆమె పక్క నున్న కుర్చీలో కూర్చున్నాను. "నా పేరు మిరియం. ఇదివరకు మిమ్మల్నెప్పుడూ చూడలేదే, ఎవర్ని చూట్టానికొచ్చారూ?" అందావిడ.

"అంటే మీకు ఇక్కడకొచ్చేవారందరూ తెలుసా?" అని అడిగాను.

మరో చిరునవ్వు నవ్వి, "వీళ్ళను చూట్టానికి ఎవరొస్తారు? కుటుంబాలు వీళ్ళను ఎప్పుడో వదిలేశాయి. చీకట్లో దీపం వెలిగించి జీసస్ దగ్గరకు చేర్చటానికి ప్రయత్నం చేసే ఔట్రీచ్ వాళ్ళేగదా వీళ్ళను చూట్టానికొచ్చేది. మీదే చర్చ్?" అనడిగింది ఆవిడ.

"నేను ఊరికే చూట్టానికొచ్చాను. చర్చి సంబంధం కాదు," అన్నాను.

"అలాగా, ఎవర్ని చూట్టానికొచ్చారు," అంది.

"దీపికారావు," అన్నాను.

"మంచి అమ్మాయి. నేను దీపికను చాలాసార్లు కలిశాను. మంచి అమ్మాయి," అంది ఆవిడ.

విజిటర్స్ ఏరియా నుంచి అద్దాల తలుపు వెనుక ఇద్దరు గార్డ్స్ కనిపిస్తున్నారు. ఇద్దరూ నల్లవాళ్ళే. డెస్క్ వెనుక కంప్యూటర్ ముందు కూర్చుని ఉన్న ఆమెతో మాట్లాడుతూ అప్పుడప్పుడూ నవ్వుతూ ఉన్నాడు అతను. నేను గడియారం చూసుకున్నాను. మూడున్నర. అప్పటికే నేనొచ్చి దాదాపు ఒక అరగంట అయింది.

"మనం చాలా ఓర్పుగా ఉండాలి. గవర్మెంట్ ఉద్యోగులు కదా, ఏదీ అంత తొందరగా చెయ్యరు, పైగా మనం ఏమైనా అంటే లేనిపోని ఇబ్బందులు పెడతారు," అంది నా పక్కన కూర్చోనున్న మిరియం.

పదినిముషాల తర్వాత అద్దాల తలుపు తెరిచి, మిరియం పేరు పిల్చాడు గార్డ్. ఆమె నా దగ్గర సెలవు తీసుకోని లోపలికి వెళ్ళింది. అద్దాల వెనుక ఆమెను చెక్ చేశాడు గార్డ్. ఎయిర్ పోర్ట్‌లో సెక్యూరిటీ చెకింగ్ లాగా ఉంది. మెటల్ డిటెక్టర్ గుండా నడవమన్నాడు. కుర్చీలో కూర్చోని బూట్లు తీసెయ్యమన్నాడు. సాక్స్ కూడా తీసేయించాడు. కంప్యూటర్లో ఏదో రాశాడు. మొత్తానికి ఆమెను చెక్ చెయ్యటానికి ఐదు నిముషాలు పట్టింది. తర్వాత గార్డులకు వెనుక వున్న తలుపు తీసి ఆమెను లోపలికి పంపించాడు. దాదాపు నాలుగున్నరకు నా పేరు పిలిచాడు గార్డ్. అనుమతి పత్రం అతనికి ఇచ్చాను. నన్ను చెక్ చేసి సెక్యూరిటీ ప్రాంతానికి వెనుక ఉన్న తలుపు తీసి నన్ను లోపలికి పంపించాడు.

ఆ చిన్నగదిలో తలుపు దగ్గరే ఉన్న బల్లవెనుక ఒక నల్లగార్డ్ కూర్చునుంది. జైల్లో ఉద్యోగులందరూ నల్ల వాళ్ళేలాగుంది. నా అనుమతి పత్రం అమెకు ఇచ్చాను. నా డ్రైవర్స్ లైసెన్స్ తనదగ్గర ఉంచుకుని లోపలికెళ్ళొచ్చని తల ఊపిందావిడ.

విజిటర్స్ రూం విశాలంగా ఉంది. అక్కడక్కడా కుర్చీలున్నాయి. గదికి ఒకవైపు గోడకు రెండు పెద్ద కిటికీలున్నాయి. బాగా వెలుతురొస్తోంది. బయట నాతో మాట్లాడిన మిరియం, మరో ఇద్దరు ఔట్రీచ్ స్త్రీలు వేరు వేరుగా కూర్చుని ఖైదీలతో మాట్లాడుతున్నారు. ఖైదీలు ముగ్గురూ నల్లవాళ్ళే. పాతిక ముప్పైయ్యేళ్ళవాళ్ళు.

ఒంటరిగా కూర్చున్న స్త్రీ దీపికారావు అని ముఖం చూస్తూనే గ్రహించాను. ఆమెకు దాదాపు ముప్పైయ్యైదేళ్ళుండవచ్చు. సన్నగా ఉంది. కళ్ళజోడు. టీ షర్ట్, పాంట్ వేసుకోనుంది. నేను ఊహించిన భయంకర స్వరూపం కాదు. ప్రశాంతంగా, సాధారణంగా కనిపించిందామె.

పరిచయాల తర్వాత ఇద్దరం మౌనంగా కూర్చున్నాము. తనున్న పరిస్థితిలో సాటి తెలుగు వారిని ఎవర్ని చూసినా వెంటనే ఏడుపొస్తుందనిపించింది నాకైతే. కాని ఆమె ముఖంలో ఎలాంటి క్షోభా కనపడలేదు. ఆరు సంవత్సరాల జైలు జీవితం మనిషిని అలా గట్టిగా తయారుచేసిందేమో.

ఆమెను ఏమి అడగాలో, సంభాషణ ఎలా మొదలుపెట్టాలో నేను ముందుగా ఆలోచించలేదు, ఇప్పుడు తోచలేదు. ఇంతలో మిరియం తన క్లయింట్ దగ్గర సెలవు తీసుకుని వెళ్ళిపోతూ మా పక్కగా వెళ్తూ దీపిక వైపు చెయ్యి ఊపింది. దీపిక కూడా ఆమెను గుర్తిస్తూ చిన్నగా నవ్వింది.

"మీతో సంబంధం ఏంటో రాయాల్సిన చోట నేను కూడా ఔట్రీచ్ అని రాశాను," అన్నాను. ఆమె సన్నగా నవ్వింది కాని, ఏమీ అనలేదు. "మిరియం మీతో చాలాసార్లు మాట్లాడిందా?" అని అడిగాను.

"మిరియమే కాదు, అక్కడ కూర్చోనున్న డోరొతీ, పౌలా కూడా చాలాసార్లు మాట్లాడారు, మొదట వచ్చినప్పుడు. ఇప్పుడు అంతగా నాకోసం రావటం లేదు."

"మీరు మతం మార్చుకోరని అనుకుని ఉంటారు. మీకు దేవుడి మీద నమ్మకం ఉందా?"

"నమ్మకం ఉంది. నమ్మినా నమ్మకపోయినా దేవుడితో ఏ చిక్కూ లేదు. ఈ దేవుడి దళారులున్నారే, వీళ్ళతోనే గొడవ."

"అంటే, మతం మార్చుకోకపోతే ఇబ్బంది పెడతారా?"

"లేదులేండి," అని, కొంచెం తటపటాయించి, తర్వాత చెప్పిందామె. ఔట్రీచ్ వాళ్ళు మతం మార్చుకోమని సూటిగా బలవంతం చెయ్యరట. కాని, పరోక్షంగా చేస్తారట. ఇతర ఖైదీల చేత చెప్పిస్తారట. మతం మార్చుకుంటే, ఖైదీలో మంచి పరివర్తన వచ్చిందనీ, శిక్ష తగ్గించవచ్చుననీ పెరోల్ బోర్డ్ వారికి సిఫార్స్ చేస్తారట.

మళ్ళా మా సంభాషణ  ఆగిపోయింది. ఇంతలో సెక్యూరిటీ గార్డ్ దీపిక పేరు పిల్చాడు. ఆమె వెళ్ళి గార్డ్‌తో మాట్లాడొచ్చి కూర్చుంది.

కొంచెం జంకుతూ, "నన్ను చూట్టానికి నెలకొక విజిటర్ వస్తారేమో మహా అయితే, ఇప్పుడు ఇంకొకరెవరో వచ్చారట. ఎవరో తెలియదు. ఇక్కడి నియమాల ప్రకారం ఇద్దరు విజిటర్స్‌ని ఒకేసారి లోపలకు రానివ్వరు," అని ఆగిపోయిందామె. నాకు విషయం అర్థమయింది. వచ్చిందెవరైనా నేను వెళ్తేగాని వారిని లోపలికి రానివ్వరు.

ఫరవాలేదు, మళ్ళా మరోసారి వచ్చి కలుస్తానని చెప్పి నేను వచ్చేశాను.

*

ఆ తర్వాత వెంటనే మళ్ళా ఆవిడను చూట్టానికి వెళ్ళటం కుదర్లేదు. ఈలోగా పెరోల్ బోర్డ్ విచారణ రోజు రానే వచ్చింది.

రామ్నీ కరెక్షన్ ఫెసిలిటీలో 300 నంబర్ గది విశాలంగా ఉంది. తలుపు దగ్గర ఇద్దరు గార్డ్స్ నిలబడి లోపలికి వస్తున్న వారి గుర్తింపు పత్రాలను తనిఖీ చేస్తున్నారు. సెల్ ఫోన్లూ కెమేరాలూ లోపలికి తీసుకుపోవటానికి వీల్లేదనీ వాటిని కార్లలోనే వదిలేసి రమ్మనీ కొందరిని వెనక్కు పంపుతున్నారు. లోపలికి వచ్చినవారు ముందే వచ్చిన వారిలో తెలిసిన ముఖాలకోసం వెతుకుతూన్నారు.

గదిలో ఒకవైపు పది వరుసల్లో దాదాపు వందకు పైగా కుర్చీలు వేసి ఉన్నాయి. కాని, గదిలో మొత్తం ముప్పైమంది కంటే ఎక్కువ లేరు. అందరూ ముందువరసల్లో కూర్చుని ఉన్నారు. వీరికి ఎదురుగా గదిలో అటువైపు ఒక పొడుగాటి బల్ల వెనుక తొమ్మిదిమంది అధికారులు కూర్చుని ఉన్నారు. సభాధ్యక్షుడుగా వ్యవహరిస్తున్న పెరోల్ బోర్డ్ ప్రెసిడెంట్‌తో సహా ఏడుగురు నల్లవారు. అటార్నీ జనరల్‌కు ప్రతినిధిగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ న్యాయవాదీ, పెరోల్ బోర్డ్ సభ్యుల్లో ఒకరూ తెల్లవాళ్ళు. వారికెదురుగా బల్లకు ఇటువైపు ఒక కుర్చీ వేసి ఉంది.

తొమ్మిది గంటలు కాగానే బల్ల మీద అరిచేత్తో రెండు మూడుసార్లు గట్టిగా కొడుతూ, "గుడ్ మోర్నింగ్," అన్నాడు సభాధ్యక్షుడు. సంభాషణలు కట్టేసి అతనివైపు తిరిగారు అందరూ. "గుడ్ మోర్నింగ్, కొంచెం సేపట్లో విచారణ  మొదలవుతుంది. భటులు దీపికారావును ఈ వెనక ద్వారం నుంచి లోపలికి తీసుకొస్తారు. ఆమె ఇక్కడ మా ముందున్న కుర్చీలో కూర్చుంటుంది.

ఆమెను లోపలికి తీసుకొచ్చేటప్పుడు మీరు ఎవ్వరూ ఉన్న చోటు నుంచి కదలకూడదు,'' అని మాతో చెప్పి, ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడాడు.

ఇద్దరు గార్డ్స్ వెనక తలుపు తోసుకుంటూ లోపలికొచ్చారు. వారి వెనుక దీపిక, ఆమె వెనుక మరో ఇద్దరు గార్డ్స్ లోపలికొచ్చారు. దీపిక చేతులకూ కాళ్ళకూ సంకెళ్ళు వేసి ఉన్నాయి. అడుగులో అడుగేసుకుంటూ వస్తున్న దీపిక ఒక్కక్షణం అధికారుల బల్లవైపూ తర్వాత ఇటువైపు కూర్చున్న జనం వైపూ చూసింది. ఆమెను కుర్చీదాక నడిపించి గార్డ్స్ తిరిగి తలుపు దగ్గర నిల్చున్నారు.

సభాధ్యక్షుడు మళ్ళా జనాన్ని ఉద్దేశించి, ''ఇప్పుడు విచారణ మొదలవుతుంది. మొదట ప్రభుత్వ న్యాయవాదీ, తర్వాత పెరోల్ బోర్డ్ సభ్యులూ దీపికారావును ప్రశ్నిస్తారు. ఆ తర్వాత మీరు దీపికారావు శిక్ష తగ్గించటం గురించి అనుకూలంగాగాని వ్యతిరేకంగాగాని మాట్లాడవచ్చు. కాని మిమ్మల్ని మాట్లాడమని అడిగేంతవరకు ఎవ్వరూ మాట్లాడకూడదు. అలా మాట్లాడిన వారిని బయటకు పంపించవలసి వస్తుంది,'' అని హెచ్చరించాడు.

తల వంచుకుని కూర్చున్న దీపిక వైపు చూస్తూ, ''పద్ధతి ప్రకారం నిన్ను కొన్ని ప్రశ్నలడగాలి. నీ పేరు దీపికారావ్, అవునా?'' అన్నాడు. దీపిక తల వూపింది. ''అలా కాదు. దయచేసి నిన్నడిగే ప్రశ్నలన్నిటికీ మాటల్లో సమాధానం చెప్పాలి. నీ పేరు?''

''దీపిక. దీపికారావు.''

''ఆరు సంవత్సరాల క్రితం నువ్వు నీ భర్తను హత్య చేశావన్న నేరం మీద అరెస్టయ్యావు. అవునా?''

''అవును.''

''విచారణలో హత్య చేసింది నువ్వేనని తేలింది. అవునా?''

''అవును.''

''నీకు పదిహేను సంవత్సరాల జైలుశిక్ష పడింది. ఇప్పటికి ఆరున్నర సంవత్సరాలుగా నువ్వు జైల్లో ఉన్నావు. ఇన్నాళ్ళూ నీ ప్రవర్తన చాలా బాగా ఉందని జైలు అధికారుల వాఙ్మూలం. మిచిగన్ పౌరులు కూడా కొందరు నీ సత్ప్రవర్తన గురించి పెరోల్ బోర్డుకు ఉత్తరాలు రాశారు. అందువల్ల నిన్ను గడువుకు ముందే విడుదల చేయటం తగునా కాదా అన్న విషయం మీద విచారణ జరపటానికి ఈరోజు మనం ఇక్కడ సమావేశం అయ్యాము. మొదట అటార్నీ జనరల్‌గారి ప్రతినిధిగా వచ్చిన ప్రభుత్వ న్యాయవాది నిన్ను ప్రశ్నిస్తారు,'' అని అతను పక్కనే కూర్చోని ఉన్న న్యాయవాది వైపు చూశాడు.

న్యాయవాది ఎలాంటి పరిచయ వాక్యాలు లేకుండానే ప్రశ్నలడగటం మొదలుపెట్టాడు.

''మిజ్ రావ్, అమెరికా వచ్చిన రెండు నెలల్లోనే నువ్వు నీ భర్తని చంపేశావు. నీ భర్త నిన్ను కొట్టినట్టుగానీ, శారీరకంగాగానీ మానసికంగాగానీ హింసించినట్లుగానీ ఎలాంటి ఆధారాలు లేవు,'' తన ముందున్న నోట్‌బుక్‌లో పేజీ తిరగేస్తూ, ''హత్య చెయ్యటానికి కారణం మనసు చెదరటం అని మీ లాయర్ వాదించాడు, కాని ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయాడు, అవునా?'' అని తీవ్రమైన స్వరంలో అడిగాడు.

దీపిక మౌనంగా ఉండిపోయింది.

''నువ్వు కావాలనే, ఉద్దేశపూర్వకంగానే భర్తను చంపావు, అవునా?''

ఆమె మాట్లాడలేదు.

''సమాధానం చెప్పాలి. భర్తను కావాలనే చంపావు, అవునా?''

"కాదు," అంది దీపిక, తల వంచుకునే.

"మరెందుకు చంపినట్లు?"

"హింస భరించలేక."

"ఎలాంటి హింస?"

"లైంగిక హింస."

"డాక్టర్ రావ్ నిన్ను లైంగికంగా హింసించాడనటానికి ఎలాంటి ఆధారాలు లేవు. మీ లాయర్ దీనికి సాక్ష్యాధారాలు చూపించలేదు. లైంగిక హింస జరగలేదు. నిజాన్ని నువ్వు ఒప్పుకోక తప్పదు. ఆరు సంవత్సరాల్లో నీలో ఎలాంటి పరివర్తనా రాలేదు. పశ్చాత్తాపం అన్నది నీలో ఏ కోశానా కనిపించటం లేదు. ఇంకా కట్టుకథలు చెప్పటం వల్ల నీకెలాంటి ప్రయోజనం లేదు," కఠినంగా ఆమెవైపు చూశాడు న్యాయవాది.

"వీడియోలు చూపించి అందులో తెల్లమ్మాయిలు చేసినట్లు..." తలెత్తి అతని వైపు చూసి, తల దించుకుని, "...అమ్మాయిలు చేసినట్లు నన్ను చెయ్యమనేవాడు. అలాంటి అసహజమైన పనులు నేను చెయ్యలేకపోయేదాన్ని," మెల్లగా సమాధానం చెప్పింది దీపిక.

"అసహజం అంటే భార్యాభర్తల మధ్య లైంగిక సంబంధంలో ఏది సహజమో ఏది అసహజమో నీకు ఇదివరకే తెలుసా?" విజయం సాధించినట్లు వికసించింది అతని ముఖం.

ఆమె సమాధానం చెప్పలేదు.

"తెలుసా?" స్వరం పెంచి గదిమినట్లు అడిగాడతను.

"అలాంటి పనులు చెయ్యవలసి వస్తుందని నేను ఊహించలేదు."

"ఎలాంటి పనులూ?"

ఆమె సమాధానం చెప్పలేదు.

"ఎలాంటి పనులూ?" ఒక్కొక్క అక్షరం ఒత్తి పలుకుతూ అడిగాడతను.

"నాకు తెలియదు."

"మిజ్ రావ్, నువ్వు ఎంత అమాయకురాలిగా నటించినా ప్రయోజనం లేదు. జైల్లో పడ్డ వెంటనే ఎబోర్షన్ చేయించుకున్నావు. అంటే అమెరికా వచ్చేనాటికే నువ్వు గర్భవతివి. అవునా కాదా?" కళ్ళు పెద్దవి చేస్తూ అడిగాడు ప్రభుత్వ న్యాయవాది.

ఆమె సమాధానం చెప్పలేదు.

"పెళ్ళి కాకముందే నీకు డాక్టర్ రావ్‌తో సంబంధం ఉండిందా?"

తల అడ్డంగా ఊపిందామె.

"సమాధానం మాటల్లో చెప్పాలి. వివాహానికి ముందు నీకు భర్తతో శారీరక సంబంధం ఉండిందా?"

"లేదు."

"మరి అమెరికా వచ్చేటప్పటికి నువ్వు గర్భవతివి అయ్యావంటే నీకు భర్తతో కాక మరొకరితో సంబంధం ఉందనేగా? అవునా కాదా?"

"అవును."

"నీకు నీ ఫస్ట్ కజిన్ అయిన ఒక అబ్బాయితో సంబంధం ఉండింది. అతనివల్లే నువ్వు గర్భవతివయ్యావు. అవునా?"

ఆమె తలవంచుకుంది. కళ్ళు తుడుచుకుని, అలాగే తలవంచుకుని ఉండిపోయింది.

"నీ గర్భానికి కారణం ఫస్ట్ కజిన్తో... నీకంటే చిన్నవాడైన తమ్ముడిలాంటి సత్యం అనే అతనితో... శారీరక సంబంధం. అవునా కాదా?" అడిగాడు అతను, తమ్ముడిలాంటి వాడితో అన్న మాటలను ఒత్తి పలుకుతూ.

"అతను మా చిన్న మామయ్య కొడుకు. మా దేశంలో అతన్ని తమ్ముడు అనం," తల వంచుకునే సమాధానం చెప్పిందామె, స్వరం కొంచెం పెంచుతూ.

"మీ దేశంలో దానికి ఎలాంటి ముద్దు పేరు పెట్టుకున్నా ఈ దేశంలో అది అక్రమ సంబంధమే," అని తన ముందున్న నోట్‌బుక్‌లో ఏదో రాసుకున్నాడు న్యాయవాది.

న్యాయవాది సభాధ్యక్షుడికి సైగ చెయ్యటంతో, అతడు ప్రారంభించాడు.

"మిజ్ రావ్, హత్య చేసినందుకు నువ్వు విచారిస్తున్నావా?"

"అవును, ఆ రాత్రి అదంతా ఎలా జరిగిందో నేను ఇప్పుడు ఊహించలేను. అతని ప్రాణం పోయినందుకు నేనెంతగానో చింతిస్తున్నాను."

"మరి నీ కేస్ ఫైల్‌లో నువ్వు నేరం ఒప్పుకున్నట్లు లేదే. అంటే అప్పుడు నువ్వు చేసింది తప్పు అనిపించలేదా?"

"అప్పుడు నాకు ఏమీ తెలియని పరిస్థితి. నా మనసు సరిగ్గా లేదు."

"ఇప్పుడూ?"

"ఇప్పుడు బాగానే ఉన్నాను. అలాంటి తప్పు ఇక చెయ్యను. అలాంటి పరిస్థితి మళ్ళా వస్తే, అక్కడి నుంచి ఎలాగో పారిపోతాను కాని, ఎవ్వరికీ హాని చెయ్యను."

సభాధ్యక్షుడు తన నోట్‌బుక్‌లో ఏదో రాసుకున్నాడు. సభకు ఒక గంట విరామం ప్రకటిస్తూ, తిరిగి సమావేశం అయినప్పుడు దీపిక శిక్ష తగ్గించటం గురించి సభికులు తమ అభిప్రాయాలను ప్రకటించవచ్చని చెప్పాడు.

పెరోల్ బోర్డ్ వారి విచారణ జరిగింతర్వాత రెండు వారాలకు మళ్ళా దీపికగారిని చూడ టానికి జైలుకి వెళ్ళాను. "శిక్ష తగ్గించి మిమ్మల్ని విడుదల చేస్తారా? విచారణ మీకు అనుకూలంగా జరిగిందనుకుంటున్నారా?" అని అడిగాను.

"విచారణ ఒక నాటకం. విడుదల చెయ్యటానికీ విచారణకూ ఎలాంటి సంబంధం లేదు," అంది ఆమె. "జైలు అధికారులందరూ నా గురించి మంచి మాటలే చెప్పారు. కాని పెరోల్ బోర్డ్ వారు నా ఫైల్ మీద ఊరికే 'ఖైదీలో సరైన పరివర్తన రాలేదు,' అని రాయొచ్చు. దాన్నింక ఎవరూ ఏమీ చెయ్యలేరు."

"అలా రాస్తే వాళ్ళకేంటి ప్రయోజనం? విడుదలచేసే ఉద్దేశం లేకపోతే అనవసరంగా ఇలా విచారణ ఎందుకు జరుపుతారూ?"

"మీకు ఇక్కడి పద్ధతులు తెలియవేమో. జైల్లో ఉన్నవారి మీద రెండు సంవత్సరాల కొకసారి పెరోల్ బోర్డ్ వారు విచారణ జరపాలి. అది మిచిగన్‌లో ఒక రూల్. కాని శిక్ష తగ్గించటమా లేదా అన్నది ముగ్గురి మీద ఆధారపడి ఉంటుంది. మొదట శిక్ష వేసిన జడ్జి. జడ్జి ఒప్పుకోకపోతే అసలు విచారణే రద్దు చేస్తారు. అది మామూలుగా జరగదు. తర్వాత అటార్నీ జనరల్. అటార్నీ జనరల్ వ్యతిరేకిస్తే శిక్ష తగ్గించటం జరగదు. ఆయన ఒప్పుకున్నా చివరి నిర్ణయం పెరోల్ బోర్డ్‌ది," వివరించింది ఆమె.

"మరి మీ శిక్ష తగ్గించరని మీకెందుకనిపిస్తోంది?"

"నాలో తగిన పరివర్తన రాలేదు కదా?" అందామె కొంచెం వెటకారంగా.

దానికి ఎలా సమాధానం చెప్పాలో నాకు అర్థంకాలేదు.

"అటార్నీ జనరల్ ని ఈ దేశంలో ఎన్నుకుంటారు, మీకు తెలుసో లేదో. అంటే నాలుగేళ్ళ కొకసారి ఆయన ఎన్నికల ప్రచారానికి దిగుతాడు. అందరు రాజకీయనాయకుల్లాగానే. ప్రచారానికి డబ్బులు కావాలిగదా? డబ్బులిచ్చిన వారు తిరిగి ఏదో ఆశిస్తారు గదా?"

"అంటే... మీ వ్యతిరేకులు... డాక్టర్ రావుగారి కుటుంబం... అటార్నీ జనరల్‌కి ఎన్నికల్లో సహాయం చేశారంటారా? మిమ్మల్ని విడుదల చెయ్యకుండా చూడమని?"

"అదే నా అనుమానం. శిక్ష తగ్గించటంలో జడ్జికీ, పెరోల్ బోర్డ్ వారికీ లేని అభ్యంతరం ఇతనికెందుకో మీరే చెప్పండి? రామారావు కుటుంబం అంతా బాగా ఉన్నవారు. ఇతనికి ఎలెక్షన్‌లో బాగా సహాయం చేశారని నా అభిప్రాయం. మొన్న నవంబర్లో గెలిచాడు గదా మళ్ళా."

ఆమె మాటల్లో వ్యవస్థ పట్ల నిరసన వ్యక్తమవుతున్నా, ఇందులో ఎంత నిజం ఉందో చెప్పటం కష్టం. అయినా ఎన్నికలున్నంత కాలం అవినీతి తప్పదేమో.

"పరివర్తన మాత్రం జైల్లో ఉన్నవారిలో రావాలంటారు ఈ నీతిమంతులు," అందామె, ఈసడిస్తూ.

ఇంకా పదేళ్ళు జైల్లో ఉండాల్సి వస్తుందంటే, దానికి కారణం అయిన వారిమీద ఎవరికైనా కోపం రాక మానదు. కానీ వ్యవస్థలో ఎన్ని లోపాలున్నా నేరస్తుల్లో పరివర్తన రావాలని ఆశించటంలో తప్పులేదనిపించింది నాకు.

నేను ముభావంగా ఉండటం ఆమె గమనించినట్లుంది. "చూడండి, మీరు పెరోల్ బోర్డ్ విచారణకు వచ్చారు కదా. ప్రభుత్వ న్యాయవాది అడిగిన ప్రశ్నల్లో ఏమైనా న్యాయం ఉందని పించిందా మీకు?" అడిగిందామె.

అతను అడిగిన ప్రశ్నలు సబబుగానే ఉన్నాయనిపించింది నాకైతే.

"ఆరోజు జరగవలసింది పెరోల్ బోర్డ్ విచారణ. శిక్ష పడింతర్వాత ఈ ఆరు సంవత్సరాల్లో నా ప్రవర్తన ఎలా ఉంది? విడుదలచేస్తే నేను ఎవరికైనా హాని కలిగించే అవకాశం ఉందా? నేను మామూలు మనిషిగా తిరిగి సమాజంలో ఇమడగలనా లేదా? ఇవీ వాళ్ళు విచారించాల్సిన విషయాలు. న్యాయవాది అసలు వీటి జోలికే పోలేదు. నా కేసును తిరిగి వాదించాడు. అది ఒకసారి జరిగింది కదా? నాకు శిక్ష వేశారుకదా? మళ్ళా ఆ విషయాలన్నీ తోడి పైకి తీసుకురావటం ఎందుకూ?"

అవును. నేను ఇలా ఆలోచించలేదుగాని, ఇప్పుడు దీపికగారు చెప్తుంటే నిజమేననిపిస్తుంది. ఆరోజు నిజంగా పెరోల్ బోర్డ్ జరపాల్సిన విచారణ జరగలేదు. మొదటిసారిగా నాకు ఆమె మీద సానుభూతి కలిగింది.

"పైగా జైల్లో వేసినంత మాత్రాన మారతారా మనుషులు? బైట ఉన్న వక్రమార్గాలన్నీ ఇక్కడా ఉన్నాయి. వ్యభిచారం, డ్రగ్స్, వయలెన్స్. ఈ వ్యాపారాలన్నీ నడుపుతుందెవరూ? మరెలా వస్తుంది పరివర్తన? ఎవరు తీసుకురావాలి ఆ పరివర్తన?"

మా మాటలు ఎవరన్నా వింటున్నారేమోనని నేను అటూఇటూ చూశాను. విన్నా వారికి మనభాష అర్థం కాదుగదా అని సంతోషించాను.

"వీటన్నిటి మధ్యా మీరు ఆరు సంవత్సరాలెలా గడిపారూ? అయాం సారీ ఫర్ యు."

ఆమె నవ్వింది. "జాగ్రత్తగా ఉంటూ. లైబ్రరీ నుంచి పుస్తకాలు తెప్పించుకుని చదువు కుంటూ, టీవీ చూస్తూ, ఎవ్వరి విషయాల్లో జోక్యం చేసుకోకుండా ఉంటూ. వీలైనంతవరకు ఒంటరిగా ఉంటూ."

అలాంటి పరిస్థితుల్లో తొందరగా జైల్లోంచి బయటపడాలనుకోవటం సహజమే కదా. పెరోల్ బోర్డ్ విచారణ మీద ఆశపెట్టుకుని, అది తనకు అనుకూలంగా జరగలేదనే అనుమానంతో ఆమె బాగా నిరాశపడింది. ఆమెను కొంచెం ఉత్సాహపరచాలన్న ఉద్దేశంతో, "పెరోల్ బోర్డ్ వారు మిమ్మల్ని ప్పుడు విడుదల చేస్తే, మీరు ఇండియాలో మీ తల్లిదండ్రుల దగ్గరకెళ్తారా?" అని అడిగాను.

"అవును. అమ్మ నేను చేసిన పనికి దుఃఖంతో చనిపోయింది. మూడు సంవత్సరాలవుతుంది. నాన్న మాత్రం మిగిలాడు నాకు. నాన్న దగ్గిరకే వెళ్తాను."

"నాన్నగారు మీకు ఉత్తరాలు రాస్తుంటారా?"

"మా నాన్నకు రాయటం రాదు. సత్యం చేత రాయిస్తుంటాడు. వాడికి చదువు రావాలని నాన్నకు పెద్ద కోరిగ్గా ఉండేది. ఆ కోరిక తీరలేదని వాడి మీద ప్రేమ అంతా కోపంగా మారింది. ఊళ్ళో అంతా వాణ్ణి సత్యం అని పిలిస్తే నాన్న మాత్రం సన్నాసి అని పిల్చేవాడు. అత్తయ్య వాడికి ప్రేమగా సత్యనారాయణస్వామి అని పేరు పెట్టుకుంది పాపం," కొంచెం నవ్విందామె.

"మీరు అతన్ని పెళ్ళి చేసుకుంటారా ఇండియా వెళ్ళాక?"

"లేదు లేదు. వాడికి రెండేళ్ళ క్రితమే పెళ్ళయింది. ఒక కొడుకు కూడా."

"అలాగా. మరి ఇండియా వెళ్ళింతర్వాత ఏం చేద్దామనుకుంటున్నారు మీరు?"

"తెలీదండీ. ఎప్పుడు వెళ్తానో ఏమో. ఊళ్ళో పరిస్థితులెలా ఉంటాయో. అక్కడ ఉండటం వీలవుతుందో లేదో. నావల్ల నాన్నకు ఇంకా కష్టమవుతుందేమోనని నా భయం," మొదటిసారిగా ఆమె గొంతులో మెత్తదనం వివిపించింది.

"మీ నాన్నగారేమంటున్నారు?"

"నాన్నేమంటాడూ. నాన్న కాదనలేడు కదా? కూతుర్నికదా ఎంత చెడ్డదాన్నయినా," ఆమె కళ్ళు నిండాయి. "జైల్లో వేసింది నన్నే అయినా, మంచి పరివర్తన వచ్చింది మా నాన్నలో. నాన్న ఎప్పుడూ కొంచెం కఠినంగా ఉండేవాడు అందరితో, నాతో తప్ప. ఇప్పుడు చాలా మెత్తబడ్డాడు. పోగొట్టుకున్న వాళ్ళు మెత్తబడతారంటారు గదా. లోలోపల కుంగిపోతూ ఉంటాడనిపిస్తుంది. ఇప్పుడు ఎవరినీ చిన్నచూపు చూడటం లేదు. సత్యాన్ని కూడా. వాడికి దగ్గరుండి పెళ్ళి చేయించాడు. ఇక నాన్నకు కొడుకైనా అల్లుడైనా వాడే కదా," కిటికీ గుండా చాలా దూరంగా చూస్తూ అందామె.

*

హత్య చేసిన వారికి యావజ్జీవ శిక్ష పడుతుందని ఇదివరకే ఎక్కడో విన్నాను. కాని దీపికగారికి పదిహేను సంవత్సరాలు శిక్ష పడిందంటే ఆమె ఉద్దేశపూర్వకంగా హత్య చెయ్యలేదని జ్యూరీ నమ్మి ఉండాలి. పూర్తిగా ఆత్మరక్షణ ప్రయత్నంలో అతన్ని చంపేసిందని తేలినట్లయితే అసలు శిక్ష పడేదికాదేమో. ఎంతో కొంత అతనిది కూడా తప్పు ఉందని జ్యూరీ నమ్మి ఉంటుంది. అందువల్లే పదిహేనేళ్ళు పడింది. లాయర్ మంచివాడైనట్లయితే ఇంకా తగ్గేదేమో. ఈ పెరోల్ బోర్డూ, అటార్నీ జనరల్, వీళ్ళతో గొడవలు లేకుండా ఈపాటికి ఇంటికి వెళ్ళిపోయి ఉండేది దీపిక. డిసెంబర్‌లో ఆమెను చూడటానికి వెళ్ళినప్పుడు, "మీ లాయర్ బాగా అనుభవం ఉన్నవాడు కాదేమో," అన్నాను.

"అనుభవం ఉంటే చాలదు. అసలు కావాల్సింది డబ్బు. డబ్బుల్లేని వారికి ప్రభుత్వమే ఒక లాయర్నిస్తుందని ఒక నాటకం ఆడతారు ఇక్కడ. ఒక్క కేసుకి ఆ లాయర్‌కి మూడొందల

డాలర్లిస్తారు. గంటకు కాదు, కేసుకి. ఆ లాయర్‌కి గిట్టాలంటే కేసుని ఎంత త్వరగా ముగించటానికి వీలైతే అంత త్వరగా ముగించాలి కదా. అందువల్ల ప్రాసిక్యూటర్తో ఏదో ఒక ఒప్పందానికి వచ్చి జ్యూరీదాకా పోకుండా కేసుని ముగిస్తాడు. నా విషయంలో, ఆ సమయంలో మతి చలించిందని నిరూపించాలంటే ఒక మానసిక విషయాల నిపుణుడి అభిప్రాయం లిఖిత పూర్వకంగా తీసుకోవాలి. అతన్ని కోర్టుకు తీసుకువచ్చి అతని అభిప్రాయం చెప్పించాలి. దానికి కనీసం ఎనిమిది వందల డాలర్ల ఖర్చవుతుంది. ఆ డబ్బులెవరిస్తారు? నా లాయర్ తన జేబులోంచి ఖర్చుపెట్టి ఇవన్నీ చేయిస్తాడా? ఇదీ ఇక్కడ జరిగే న్యాయాన్యాయాల తమాషా.

"పైగా, 'మీ లాయర్ హింస జరిగిందని ఎలాంటి ఆధారాలు చూపించలేకపోయాడు' అన్నాడు ఆరోజు ప్రభుత్వ న్యాయవాది. ఎట్లా చూపిస్తాడు? ప్రభుత్వం తరపున్న లాయరు ఎంతైనా ఖర్చుపెట్టొచ్చు. నా లాయర్‌కేమో మూడొందల డాలర్ల పరిమితి. అందులోంచే అతని జీతం రావాలి, కేసుకి కావాల్సిన ఖర్చులూ రావాలి. ఇదీ వీళ్ళ న్యాయం.

"పెరోల్ బోర్డ్ విచారణ రోజు నా విడుదలకు వ్యతిరేకంగా మాట్లాడుతూ, 'ఆత్మరక్షణనీ, కుటుంబహింస అనీ ఏవేవో కట్టుకథలు చెప్పటానికి ప్రయత్నించాడు దాని లాయర్. అదంతా అబద్ధం అని తేల్చటానికి జడ్జికి రెండురోజులు కూడా పట్టలేదు. కాకపోతే శిక్ష ముప్పైయ్యేళ్ళు వేసుంటే సంతోషించేవాణ్ణి,' అన్నాడు రామారావు తండ్రి... కేసు రెండు రోజుల్లో ముగిసిందంటే దానికి కారణం జడ్జిగారి ప్రతిభాపాటవాలు కాదు. నా లాయర్‌కి ఎలాంటి వనరులూ లేకపోవటం. అప్పటికీ ఉన్నంతలో అతను బాగానే ప్రయత్నం చేశాడు. కాకపోతే విచారణ పొడిగించాలన్నా, నిపుణుల అభిప్రాయాలు కోర్టులో వినిపించాలన్నా డబ్బుల్లేక తొందరగానే ఒక ఒప్పందానికి రావాల్సొచ్చింది.

"అటార్నీ జనరల్‌కి నామీద అంత కోపం ఎందుకంటే నేను ఆ ఒప్పందంలో తప్పంతా నాదేనని ఒప్పుకోకపోవటం. తప్పు చెయ్యలేదని నేనెప్పుడూ అనలేదు. మొట్టమొదటిసారి జడ్జి ముందు నిల్చున్నప్పుడు, 'నేరం చేశానని ఒప్పుకుంటున్నావా లేదా?' అని అడిగాడు జడ్జీ. నేనేమీ సమాధానం చెప్పలేకపోయాను. నావల్ల నేరం జరిగింది. కాని, తప్పంతా నాది కాదు. చనిపోయిన మనిషి చేసిన తప్పును ఎవరు ఒప్పుకోవాలి? ఎవరైనా అతను కూడా తప్పు చేశాడని ఒప్పుకుంటే గాని... ఆరోజైనా, ఈ రోజైనా దోషిని అని ఒప్పుకోవటానికి నేను సిద్ధంగా లేను.

"మీరు పెరోల్ బోర్డ్ హియరింగ్‌కు వచ్చారుగదా. అటువైపు వారు రామారావు గురించి ఎన్నో మంచి మాటలు చెప్పారు. స్థానిక దేవాలయం పూజారిని తీసుకొచ్చి అతని చేత చెప్పించారు... రామారావుకు విపరీతమైన దైవభక్తి అని. అతనితో ఉన్న రెండునెలల్లో నాకైతే దైవభక్తేమీ కనపళ్ళేదు. నన్ను వ్యభిచారిననీ, ఇంకా ఏవేవో అన్నాడు రామారావు తండ్రి. పైగా మా అమ్మను కూడా తిరుగుబోతు మనిషి అన్నాడు ఆ పెద్దమనిషి. అమ్మ పోయి కూడా మూడు సంవత్సరాలవుతుంది. ఆమె గురించి అలా మాట్లాడే మనిషిలో ఎలాంటి పరివర్తన రావాలో ఎవరు చెప్పాలి? పరివర్తన రావాల్సింది నాలోనేనా? జైల్లో ఉన్న వాళ్ళలోనేనా పరివర్తన రావాల్సింది?" ఆమె ముఖం ఎర్రబడింది. నా దగ్గర ఎలాంటి సమాధానాలూ లేక నేను అలాగే వింటూ కూర్చున్నాను.

*

జనవరిలో ఆమెను కలిసినప్పుడు అమెరికాలో ఆమె అనుభవాల గురించి అడిగాను. ఆమె నవ్వింది. "జైలుకి రాకముందు అమెరికా గురించి నాకు అంతగా తెలియదు. బయట

ఉంది రెండు నెల్లేగా! అదీ ఎప్పుడూ ఇంట్లోనే ఉండేదాన్ని. ఇల్లొక ప్రైవేట్ జైలు. కాకపోతే ఇప్పటి నా జైలుగది కంటే విశాలమైంది. మంచి వసతులున్న జైలు. పగలంతా వండుకోవటం, తినటం. టీవీ చూట్టం. సాయంత్రం అతను రావటం, భోజనాల తర్వాత అతనికిష్టమైన వీడియోలు చూట్టం, అందులో అమ్మాయిలు చేసిన పనులన్నీ నన్ను చెయ్యమనటం. ...తప్పు నాదే. కాదన్ను. అదీ చనిపోయిన వాడి గురించి చెడ్డ మాటలు చెప్పటం ఎందుకులెండి. కాని... సెక్సువాలిటీ గురించి అప్పటికి నాకు సరైన జ్ఞానం లేదు. నాకెవ్వరూ ఏమీ చెప్పలేదు. పైగా అతను డాక్టర్. మరీ అంత అడవి మృగంలా ప్రవర్తిస్తాడని నేననుకోలేదు. నాక్కొంచెం జ్ఞానం ఉండి ఉన్నట్లయితే... భర్త అలాగ కూడా ప్రవర్తించవచ్చని ముందుగా తెలిసున్నట్లయితే... ఏమయ్యేదో,'' కిటికీలోంచి దూరంగా చూస్తూ ఆగిపోయిందామె. కళ్ళు తుడుచుకుంటూ, ''సారీ,'' అంది.

దీపికగారి మాటల్లో నాకు పొంతన కనిపించలేదు. పెరోల్ బోర్డ్ విచారణ ఇంకా నాకు కళ్ళకు కట్టినట్టుగా కనిపిస్తుంది.

''దీపికగారూ, మీరేమీ అనుకోకపోతే... ఇది అడగటం అంత సులభం కాదు. మీకు సెక్సువాలిటీ గురించి అప్పటికేమీ తెలీదంటున్నారు. కాని పెరోల్ బోర్డ్ విచారణలో మీకు మీ కజిన్‌తో సంబంధం ఉందని ఒప్పుకున్నారు...'' అని మెల్లగా జ్ఞాపకం చేశాను.

కిటికీలోంచి దూరంగా చూస్తూనే మళ్ళా మాట్లాడింది దీపిక. ''వాడు నాకంటే ఒక సంవత్సరం చిన్నవాడు. మా ఇళ్ళు ఒకే వీధిలో దగ్గరదగ్గరగా ఉండేవి. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ వాడితో క్లోజ్‌గా ఉండేదాన్ని. చిన్నప్పుడు కలిసి ఆడుకున్నాం. కలిసే స్కూలుకు వెళ్ళేవాళ్ళం. కాని వాడికి చదువు రాలేదు. మా నాన్నకు వ్యవసాయంలో తోడుగా ఉండేవాడు. వాళ్ళకు పొలాల్లేవు. ఒకప్పుడు ఉండేవట. నేను కాలేజీలో చదువుతున్న రోజుల్లో సెలవులకు ఊరికి వచ్చినప్పుడల్లా ప్రతిరోజూ వాడిని కలిసేదాన్ని. కాలేజీ విషయాలన్నీ వినేవాడు. ఇంట్లో అమ్మతో ఏదో విషయం మీద తగువుపడినప్పుడల్లా వాడే నన్ను ఓదార్చేవాడు. వాడితో నా సంబంధానికి ఏం పేరో నాకు తెలియదు. వాడి స్పర్శ ఎంతో సుఖంగా ఉండేది. రామారావు తాకినప్పుడు ముళ్ళు గుచ్చుకున్నట్లుండేది,'' రెండు క్షణాలు ఆగిందామె. ''సత్యం నన్నెప్పుడూ తన సుఖం కోసం తాకలేదు. రామారావు నన్నెప్పుడూ నా సుఖం కోసం తాకలేదు. ...ఎప్పుడూ ఏదో అడవిమృగం తాకినట్లుండేది అతని స్పర్శ.''

ఒక్కక్షణం ఆగి నావైపు చూసి మళ్ళా కిటికీ గుండా దూరంగా చూస్తూ మాట్లాడిందామె. ''ఇప్పుడతని విషయం ఎందుకులెండి. నా పెళ్ళి కుదిరిన రోజుల్లో ఒకరోజు మామయ్యగారింటికి వెళ్ళాను. 23 సంవత్సరాలకే పెళ్ళిచేసుకోవటం అంటే నాకు భయం వేసింది. ఇంకా ఇల్లు వదలి వెళ్ళాలనే కోరిక నాకు కలగలేదు. తెలిసిన ప్రాంతం, పరిచయస్తులు, సత్యం- అన్నీ వదిలేసి వెళ్ళాలంటే ఏదో తెలియని భయం. ఆరోజు వాడితో మాట్లాడుతూ ఉంటే... అనుకోకుండానే... సహజంగానే జరిగిపోయింది. ఎంతో సుఖం అనిపించింది. ఊరట కలిగింది. ఆ తర్వాత పెళ్ళికి ముందు రెండుమూడుసార్లు వాడితో కలిశాను. అది తప్పో కాదో తెలియని అమాయకపు రోజులు. ఆ రోజుల్లోనే ఎప్పుడో గర్భం అయి ఉంటుంది. ఏమైనా, ఇది మాత్రం నిజం. సత్యం నన్నెప్పుడూ బలవంతం చెయ్యలేదు. రామారావు నన్ను ప్రతి రాత్రీ బలవంతం చేశాడు. కాని అటార్నీ జనరల్ దృష్టిలో రామారావుకి నామీద అధికారం ఉంది. సత్యానికి లేదు. నేను సత్యంతో చేసింది తప్పు.''

*

తర్వాత మళ్ళా వెంటనే దీపికగార్ని కలవటం వీలుకాలేదు. వాష్టెనా కౌంటీ కమ్యూనిటీ కాలేజీలో చిన్న ఉద్యోగం రావటంతో నేను కొంచెం దూరంగా వెళ్ళిపోవటం జరిగింది. కాని ఆమెకు శిక్ష తగ్గించలేదని ఫిబ్రవరి 11 వ తేదీ స్థానిక పత్రికలో చదివాను.

''ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఖర్చు తగ్గించటానికి మిచిగన్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా కొందరు విదేశీ ఖైదీలను గడువుకు ముందే విడుదల చెయ్యనున్నారు. పెరోల్ బోర్డ్ వారి సిఫార్స్ మీద విడుదల చెయ్యనున్న 11 మంది ఖైదీల పేర్లు గవర్నర్ గ్రాన్‌హోంగారి ఆఫీస్ ప్రకటించింది. వీరిలో నలుగురు మెక్సికన్ పౌరులు, ముగ్గురు కొలంబియా దేశస్తులు, ఇద్దరు గోటమెలాకు చెందినవారూ ఉన్నారు. ఇండియాకు చెందిన ఒక్క ఖైదీని విడుదల చెయ్యటానికి పెరోల్ బోర్డ్ నిరాకరించింది.

''ఒక్కొక్క ఖైదీని జైల్లో ఉంచటానికి ప్రభుత్వం సంవత్సరానికి 30,500 డాలర్లు ఖర్చుపెడుతుంది. ఇప్పుడు చేస్తున్న విడుదలల కారణంగా వచ్చే ఐదు సంవత్సరాల్లో ప్రభుత్వం ఖర్చు దాదాపు మిలియన్ డాలర్ల వరకూ తగ్గుతుందని అంచనా.''

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*16 ఆగస్ట్ 2009*

## నేపథ్యం

ఎక్కడైనా స్త్రీల సమస్యలు ఒక్కటే

# పరివర్తన

***ఎవరి అవినీతిలో వారు కూరుకుపోయి ఉండి తనను మాత్రం పరివర్తన చెందమని నీతులు చెప్పే సమాజం మీదా చట్టం మీదా ఆమెకు పెద్ద గౌరవం ఏర్పడలేదు. తను చేసిన నేరానికి పశ్చాత్తాపం, తన జీవితగతిని నిర్ణయించిన సమాజం పట్ల నిరసనా ఆమె మనసులో కలగలిసిపోయాయి.***

పరివర్తన కథ చదివిన తర్వాతనే, దాని గురించి కొంత ఆలోచించిన తర్వాతనే ఈ కథానేపథ్యం చదవమని నా మనవి.

తప్పు చేసినవారికి శిక్షపడాలనుకోవటం సహజమే. అలాంటి వారిలో మార్పు రావాలనీ, చేసిన తప్పుకు వారు మనసారా పశ్చాత్తాపం ప్రకటించాలనీ, మంచి మనుషులుగా మారాలనీ సాటి సమాజం కోరుతుంది. తప్పు చేసినవారేనా మారాల్సింది? తప్పు చెయ్యటానికి కారకులైనవారి సంగతేంటీ? శిక్షించే వాళ్ళలో తప్పు చేసేవారు లేరా? వారిలో పరివర్తన ఎవరు తీసుకొస్తారూ? మనం ఈ విషయాల గురించి రోజూ ఆలోచించకపోయినా, జైల్లో కూర్చుని ఉన్న మనిషి ఈ విషయాల గురించి లోతుగా ఆలోచించటం సహజం.

చదువుకునే రోజుల్లో దీపిక మాట నెగ్గలేదు. కాలేజీలో ఫలానా చదువు చదివితే మంచి సంబంధాలు రావటం కష్టం అని చెప్పారు తల్లిదండ్రులు. వాళ్ళకు ఇష్టమైన చదువే చదివింది. ఆమెకు ఇష్టమయిన బంధువుల అబ్బాయితో కాకుండా ఒక అమెరికా అబ్బాయికిచ్చి పెళ్ళి చేశారు తలిదండ్రులు. కొత్తగా అమెరికా తీసుకొచ్చిన భర్తతో ఎలా మసలుకోవాలో ఆమెకు అర్థంకాలేదు. పోర్న్ వీడియోల్లో అమ్మాయిలు చేసే పనులు ఆమె చెయ్యలేకపోయింది. చివరకి కోర్టులో కూడా అతను పెట్టిన లైంగికహింస గురించి మాట్లాడలేక ఆ విషయం అసలు బయటకు రానివ్వలేదు. భర్తవైపు వారు పబ్లిక్ ప్రాసెక్యూటర్‌కి ఎన్నికల సందర్భంగా డబ్బిచ్చారో

లేదో ఆమెకు తెలియదు. కాని అదొక అనుమానం. మతం మార్చుకోవటానికి అంగీకరిస్తే మంచి మనిషిగా మారినట్లు సర్టిఫికేట్ దొరికేది. పెరోల్ బోర్డ్ వారు సంతోషించేవారు. కాని అలా చెయ్యటానికి మనసొప్పలేదు. ఎవరి అవినీతిలో వారు కూరుకుపోయి ఉండి తనను మాత్రం పరివర్తన చెందమని నీతులు చెప్పే సమాజం మీదా చట్టం మీదా ఆమెకు పెద్ద గౌరవం ఏర్పడలేదు. తను చేసిన నేరానికి పశ్చాత్తాపం, తన జీవితగతిని నిర్ణయించిన సమాజం పట్ల నిరసనా ఆమె మనసులో కలగలిసిపోయాయి.

ఈ కథ రాయటంలో దీపిక మనసులోని ఘర్షణలను ఎంతవరకు పాఠకులకు చేర్చ గలిగానో నేను చెప్పలేను.

ఆమె మానసిక పరిస్థితిని పాఠకులకు అందేలా రాయటానికి కథ ఎవరి దృకథంలో రాయాలి అని ఆలోచిస్తూ మొదట ఈ కథ ఒక న్యూస్‌పేపర్ కరెస్పాండెంట్ దృక్పథంలో రాశాను. పెరోల్ బోర్డ్ విచారణకు వెళ్ళిన అతను చాలాసార్లు ఆమెను కలిశాడు. ఆ పరిచయం ఆధారంగా ఆమె గురించి కథ రాశాడు. కాని ఆ కథనం ఎందువల్లో సరిగ్గా కుదరలేదు. కొన్నాళ్ళ తర్వాత ఆమెను చాలాసార్లు కలిసిన క్రిస్టియన్ మిషనరీ దృక్పథంతో మళ్ళా కథ రాశాను. కాని జైల్లో ఉన్న వారిని మతం మార్చుకోమని ప్రోత్సహించే వారి మీద నాకు సానుభూతి లేకపోవటం వల్ల కావచ్చు, ఆ ప్రయత్నం కూడా సఫలం కాలేదు. చివరకు నేనే కథకుడిగా ఈ కథను రాశాను. దీపికను నేను జైల్లో చాలాసార్లు కలిశాను. కలిసినప్పుడల్లా ఎక్కువగా సాహిత్యం గురించే మాట్లాడుకునేవాళ్ళం. జైల్లో ఉంటూ ఆమె చాలా కోర్సులు తీసుకుంది. మొదట ఇంగ్లీషు మాట్లాడటం రాని అమ్మాయి ఇంగ్లీషులో కవిత్వం రాసి ఒక పోటీలో మిషిగన్ రాష్ట్రం మొత్తంలో మూడవ బహుమతి సంపా దించింది. కొయ్య సామానులు చెయ్యటం, ఎలెక్ట్రికల్ రిపేర్లు చెయ్యటం నేర్చుకుంది. పెయిం టింగ్ నేర్చుకుంది. తన పెయింటింగులు అమ్మి కొంత డబ్బు సంపాదించింది. వీటన్నిటి కారణంగా దీపిక మీద నాకు గౌరవం ఏర్పడింది. ఆమెతో స్నేహం ఏర్పడింది. అందువల్ల వస్తుగతంగా ఆమె గురించి కథ రాయటం వీలుకాదేమో అని అనుమానిస్తూనే ఈ కథ రాశాను.

ఇండియాలో ఈ కథ చదివినవారు ముఖ్యంగా అడిగిన ప్రశ్న, అమెరికాలో కూడా న్యాయ వ్యవస్థలో లోపాలున్నాయా అని. లోపాలున్నమాట నిజమే. బీదవాళ్ళకు ప్రభుత్వం ఒక లాయర్ని ఇస్తుంది. నిజమే. కాని ఒక్కో కేసుకి వాళ్ళకిచ్చే ఫీజు చాలా తక్కువ. తమ క్లయింట్లకు రాజీ పడమని చెప్తుంటారు వాళ్ళు. నిజంగా న్యాయం జరగాలంటే డబ్బు కావాలి. మరో విషయం. చిన్న చిన్న నేరాలు చేసినవాళ్ళను జైల్లో పెట్టే ప్రభుత్వాలు డబ్బు లేనప్పుడు శిక్ష తగ్గించి వాళ్ళను విడుదల చేస్తుంటారు. జైల్లో పెట్టటం పెట్టకపోవటం కూడా, కనీసం చిన్న చిన్న నేరాల విషయంలో, డబ్బుకు సంబంధించిన విషయమే. కానీ అమెరికాలో జైళ్ళ నిర్వహణలో మంచి విషయాలు కూడా ఉన్నాయి. ముఖ్యంగా చదువు విషయంలో. నేరస్తులు జైల్లో తమ సమయాన్ని లాభదాయకంగా వాడుకోవచ్చు. తమకు ఇష్టమైన కోర్సులు తీసుకోవచ్చు. డిగ్రీలు సంపాదించ వచ్చు. వృత్తివిద్యలు నేర్చుకోవచ్చు. జైలు నుంచి బయటకొచ్చిన తర్వాత జీవితం ఎలా గడపాలో ఆలోచించి దానికి కావలసిన విధంగా ప్రిపేర్ కావొచ్చు. ప్రభుత్వాలు ఆశించే పరివర్తన ఇలాంటిది.

*27 అక్టోబర్ 2012*

*'పరివర్తన' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

5

# గుర్తు

## ఆర్. వసుంధరాదేవి



***ఆర్. వసుంధరాదేవి*** *1931 డిసెంబర్ 17న గుంటూరు జిల్లాలో జన్మించారు. రెండు కథాసంపుటాలు ప్రచురించారు. ఇటీవలే సమగ్ర కథాసంపుటాన్ని ఆర్. వసుంధరాదేవి కథలు పేరుతో ప్రచురించారు. రెండు నవలలు రాశారు. 1978లో గాలిరథం కథాసంపుటానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి పురస్కారం లభించింది. చాలాకాలం మదనపల్లిలో ఉండి ప్రస్తుతం అమెరికాలోని న్యూయార్క్‌లో నివాసం.*

*email: vratakonda@yahoo.com*

మంచి ఖరీదైనది, ఎరుపురంగు వెంకటగిరి జరీచీర, అదే రంగు లిప్‌స్టిక్, గోళ్లరంగూ, కెంపులూ ముత్యాలూ కలిసిన సొమ్ములూ, మాక్స్ ఫాక్టర్ మేకప్... ఆడంబరం లేకుండా ప్రత్యేకంగా కనిపిస్తోంది కళావతి. అప్పటికంటే బహు కొద్దిగా లావైనా, అప్పటి 'బాపూబొమ్మ' రూపం మారలేదు. పదిహేనేళ్ల క్రితం తామిద్దరూ కలిసి చదువుకున్నప్పటి కంటే కొద్దిగా తెల్లబడటం, మొహం కొంచెం కోలగా తీరటం తప్పించి కళావతిలో మార్పు కనిపించ లేదు నళినికి. అప్పటిలాగే ప్రతి చిన్న విషయం గురించి శ్రద్ధ తీసుకుని తనకు ముఖ్యమైన అభిరుచుల్ని అలాగే నిలుపుకున్నదన్నమాట.

విశాఖలో చదువుకొంటున్నప్పుడు కాలేజీకి బస్సు వెళ్లే దోవ చాలా అందంగా ఉండేది. నీలమైన ఆకాశం క్రింద ఈపక్కా ఆపక్కా నల్లటి కొండలు. కొండల మధ్యన ఎగుడుదిగుడుగా మెలికలు తిరుగుతూ పోయే రోడ్డు. చల్లని సముద్రపు ఉప్పుగాలికి ఒళ్లంతా బంకా, తడి. ఎంత దూరం పోయినా అదే అందం. ప్రకృతిలోని ఆనందంలోకి ప్రయాణం అది.

ఈ కొండ మీదొకటీ ఆ కొండ మీదొకటీ బంగళాలుండేవి. కొండ ఒంపుల్లో ఒదిగి, ఎత్తు మీద ఒంటరిగా, విశిష్టంగా, అందంగా, ఆనందంగా. ఒకదాని పేరు డవ్స్

నెస్ట్. ఇంకోదాని పేరు పిజెన్స్ నెస్ట్. బస్సులోని రణగొణధ్వనితో సంబంధం లేకుండా బయటకు చూస్తూ ప్రక్కప్రక్కనే కూర్చునే వాళ్లు తామిద్దరూ సాధారణంగా.

"పెళ్లయ్యాక నేను ఆ డవ్స్‌నెస్ట్‌లో ఉండే మేనేజరుగారి భార్యలా ఉంటాను నళినీ," అన్నది కళావతి ఒకసారి.

ఆ మేనేజరుగారి భార్య చాలా గొప్పగా ఉండేది. అందమైన ఎంబ్రాయిడరీలు, పెయింటింగు చేసేది. ఒకసారి మాకు అందమైన డిన్నర్ ఇచ్చింది. ముచ్చటైన పిల్లలిద్దరున్నారు ఆమెకు.

కళావతి మాటలతో ఈ లోకంలోకి వచ్చింది నళిని.

"ఇంతసేపట్నుంచీ ఇదా నీవు ఆలోచిస్తున్నది! ఎప్పుడూ నీకు ఎలా ఉంటే బాగుంటుందన్న ఆలోచనే," అన్నది నవ్వుతూ కించిత్తు విసుగుతో.

కళావతి ఇదే విషయాన్ని రెండు మూడుసార్లు చెప్పింది తరువాత. తాను ఎలా ఉండాలో, ఎలా కనిపించాలో, ఎలా డ్రెస్ చేసుకుని ఎలా మాట్లాడి ఎలాంటి అభిప్రాయం ఎదుటివాళ్లలో కలిగించాలో కళావతికి స్పష్టంగా తెలుసు. సినిమాకు వెళ్లాలన్నా షికారు వెళ్లాలన్నా రోజూ వెళ్లే కాలేజీకి వెళ్లాలన్నా ఏ విధంగా ముస్తాబు కావాలో నిశ్చయించుకొని ఆ ముస్తాబులోని అన్ని భాగాలూ అనుకున్నట్లుగా పూర్తి చేసుకోవడానికి గంట పట్టేది కళావతికి. నళినికి అలాంటి శ్రద్ధ లేదు. ఫలానా విధంగా కనిపించాలన్న నిర్దిష్టమైన అభిప్రాయం ఉండేది కాదు. అలాంటి ఊహా చిత్రం కలిగి ఉండటం హాస్యాస్పదంగా తోచేది కూడా. అది మనసులోని శూన్యతకు పరిమితత్వానికి చిహ్నం అనిపించేది... కాని చిత్రమేమిటంటే కళావతి కాలగమనంతో మారకుండా విరుగు తరుగులు లేకుండా చెక్కు చెదరకుండా ఉండిపోయింది. కోరుకున్నదాన్ని సాధించగలిగింది. డబ్బు గల భర్తా, ఇద్దరు ముచ్చటగొలిపే పిల్లలూ, కారూ, మేడా, అల్సేషియన్ కుక్కా... చిత్రంలోని భాగాలన్నీ యదార్థాలై నిలిచాయి.

నళిని భర్తకు ట్రాన్స్‌ఫర్ అయి వారంరోజుల క్రితం ఆ పట్టణానికి వచ్చారు. ఒక పెద్ద మేడలో ఒక భాగం అద్దెకు తీసుకున్నారు. మిగతా ఇంట్లో సొంతదారులే ఉంటున్నారు. ఇంటి వెనుక భాగంలో పనిమనిషి పనికోసం కొళాయీ, వెనుక తోటా రెండు భాగాలకూ కలిసి ఉన్నవి. ఆ ఇంట్లో చేరిన మూడోరోజు సాయంత్రం వెనుకభాగంలో నిలుచున్న నళినిని చూచి గుర్తించి ఆనందంతో పలకరించింది కళావతి. ఆమే ఇంటి యజమానురాలు! ఆమెకు ఊసుపోనప్పుడు 'తోడు' కోసరం అద్దెకిచ్చారట ఆ భాగం ఇల్లు. అద్దెకివ్వడం కూడా కళాత్మకంగా ఉండొచ్చు.

పదిహేనేళ్ల క్రితం ఇద్దరూ మంచి స్నేహితులు. సాహిత్యంలోని అభిరుచుల వలన దగ్గరై, చదువుకున్న మూడేళ్లూ కలిసి ఉన్నారు.

ఇన్నేళ్ల తర్వాత కళావతితో పోల్చి చూసుకున్న నళినికి కించిత్తు న్యూనతాభావం కలిగింది. తనకీ కళావతికీ ఎంత భేదం! నాజూకైన తన శరీరం లావై ఆకృతిని కోల్పోయింది. తనకు డబ్బూ కారూ కావలసినవన్నీ ఉన్నాయి. కాని అవి కళావతికిలాగా తనకు తృప్తినివ్వలేకపోతున్నాయి. ఉండీ లేనివైపోతున్నాయి. ప్రతి విషయాన్నీ అల్పమని తోసిపుచ్చే మనసు ఏ పనినీ సరిగా చేయనివ్వదు. ఇల్లు శుభ్రంగా సర్దుతూ 'శుభ్రతలో ఏమున్న'దనుకొంటుంది. వంట చేస్తూనే, 'ఆ, పాడు తిండి!' అనుకొంటుంది. ఫలితంగా ఇల్లు, వంట, రూపము ఏదైనాగాని అనుకుని చక్కగా దిద్దుకోలేని నిస్సత్తువ ఆవరించింది. ప్రాణసములనుకున్న భర్త, పిల్లలూ దగ్గర ఉండీ దూరంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. భార్యగా, తల్లిగా నిర్వర్తించవలసిన బాధ్యతలు ఒక మూసలో కట్టివేసినట్లు ఇరుకున పెడుతున్నాయి. కాలం అంతా గడిచిపోయినట్లు, భవిష్యత్తు అనేది లేనట్లు, తాను చెయ్యవలసిన పని ఏమీ మిగలనట్లు మనసులో శూన్యత నిండిపోయింది. తాను ఏమి సాధించింది? దేన్ని నిలుపుకున్నది? దేన్ని నమ్మింది? ఎటుచూసినా సమాధానం లేని ప్రశ్నలు. కారణం తెలియని నిర్వేదం.

కొమ్మ చివర్న విచ్చిన ఎఱ్ఱ గులాబీపువ్వులాగా అందంగా నిలుచుని ఉన్నది కళావతి.

"నిన్ను గురించి నేను ఎన్నోసార్లు అనుకున్నాను నళినీ... అప్పటిలాగే ఉన్నావో, ఏమైనా మారిపోయావోనని... కొద్దిగా, చాలా కొద్దిగా లావయ్యావు..." కళావతి కళ్లు నళినిని ఆప్యాయంగా తడిమాయి.

నళినికి చికాకు కలిగింది.

"కొద్దిగా ఏమిటీ... చాలా లావయ్యాను," అన్నది.

కళావతి నవ్వింది, చిన్న వెండిగంట మ్రోగినట్లుగా.

ఆ నవ్వుని చూసి నళినికి మరింత చికాకు వేసింది. అంతలోనే తమాయించుకొని, 'కళావతిని చూసి నేను అసూయపడుతున్నానా? ఎందుకు?' అనుకుంది. పదిహేనేళ్ల క్రితం ఎలా ఉన్నదో ఇప్పుడూ అలానే ఉన్నది కళావతి. అప్పుడు కళావతిని చూసి అసూయ చెందకపోగా విసుక్కున్నది. అల్పమైన విషయాలకు అతి ముఖ్యమైనట్లు విలువనిస్తుందనీ, లోతులేని వ్యక్తి అనీ అనుకున్నది. ఇప్పుడు ఆ అల్పమైన విలువలు కూడా తనకు లేనందుకు కలత కలుగుతోంది! ఆ మార్పు కళావతిలో వచ్చింది కాదు. తనలో కలిగినదే! అప్పుడు తనకు నిండుదనాన్నీ, సంతృప్తినీ, విశిష్టతనూ ప్రసాదించిన కారణం ఇప్పుడు లుప్తమై కనుమరుగైపోయిన కారణం... అదేమిటి?

కొంచెంసేపు అలానే నిల్చుండిపోయింది నళిని. మనసు గతంలోకి వెళ్లిపోయింది. క్రమంగా ఆనాటి రూపం ధరించింది... నాన్నగారు, అమ్మ, చెల్లెళ్లు... ముఖ్యంగా నాన్నగారు... తప్పొప్పులకూ, మంచిచెడ్డలకూ అతీతంగా ఒకానొక దివ్యమైన ప్రేమభావంలో, అది ప్రసాదించే ఆనందంలో, అందరూ ఒకటిగా... ఆ తృప్తిలో తనొక విశిష్టమైనదాన్నన్న అహంకారం, మిగతా అన్ని విషయాలూ అల్పమైనవన్న నిరసన... ఏదైనా చెయ్యాలి, సాధించాలన్న అవసరం లేదు. 'నేను' ఉండటమే ఆనందం... లౌకిక జీవితానికి సంబంధించిన విలువలు అన్నీ నిస్సారంగా, పరిమితమైనవిగా, గుర్తింపు అవసరం లేనివిగా తోచాయి. ఆ ఆనందం, ఏకత అనేవి సత్యమూ శాశ్వతమూ అవునా? దానికి మూలం ఏమిటి? అన్న ప్రశ్నలు తోచలేదు. ఏ సందేహానికీ అవసరం కలుగలేదు అప్పుడు...

ఇద్దరూ అలా నిలుచుని ఉండగానే పనిమనిషి వచ్చింది. రెండు స్టీలుగిన్నెలు ఒకే ఆకారంలో ఉన్నవి పట్టుకొచ్చింది. ఒకటి రెండోదాని కంటే కొద్దిగా పెద్దది.

"అమ్మా వీటిలో ఒక గిన్నె మనదీ, ఇంకోటి మూడో ఇంటివాళ్లదీను. అన్నం తీసుకు పోయాను. రెండూ కలిసిపోయినై, గుర్తుల్లేవు. మనదేదో తీసుకోండి," అన్నది.

నళిని రెండు గిన్నెల్ని చూసింది. రెండూ ఒకటిగానే కనిపించాయి. తనదేదో గుర్తించలేక పోయింది.

"మావి పదేళ్ల క్రిందట కొన్న బరువు గిన్నెలు," అంటూ రెంటినీ చేతిలోకి తీసుకుని చూసింది. రెండూ బరువుగానే ఉన్నాయి. కొంచెం ఎక్కువ బరువుగా ఉన్న పెద్దగిన్నెను చేత పట్టుకొని, "ఇదే ఉండొచ్చు," అన్నది.

"నిన్న పనిమనిషి కడుగుతుంటే మీ గిన్నెలు చూశాను నళినీ, ఆ చిన్నది మీది... నీ చేతిలో ఉండేది కాదు," అన్నది కళావతి మెల్లగా, నాజూగ్గా.

"మాది అంత చిన్న గిన్నె కాదే," అన్నది.

"అవును నళినీ," అన్నది కళావతి సుతారంగా.

నళినికి కోపం వచ్చింది. 'నా వస్తువుల సంగతి నాకంటే తనకే ఎక్కువ తెలుసునను కుంటుందేవిటి? నేను బి.ఎ.లో ఫస్ట్ క్లాస్. తాను థర్డ్ క్లాస్,' అనుకుంది. ఎట్లయినా ఏది ఏ గిన్నో కనిపెట్టాలి. తన తెలివితేటల్ని, తన అస్తిత్వాన్ని నిరూపించుకోవాలన్న ప్రయత్నంలో గిన్నెల్ని పరిశీలనగా చూసింది. రెండూ శుభ్రంగా తళతళా మెరుస్తూ కనిపించాయి.

మరింత తీక్షణంగా చూసింది నళిని. రెండూ మరింత తళతళా మెరిశాయి. చూసినకొద్దీ పరిమాణంలోని భేదం కూడా మరుగున పడిపోయి రెండూ విడివిడిగా కాకుండా ఒకటిగా ఒకే మెరుపుతో ధగధగలాడాయి... అంతా అపరిచితమైన, అనంతమైన తళతళ...

నళిని మనసు శూన్యం అయిపోయింది.

తళతళ... మిలమిల... మిలతళ... తళతళ...

ఏ గిన్నె అయితేనేం? అనిపించింది.

"మా గిన్నెలన్నీ ఒక సెట్టులోనివి. ఒకదానిలో ఒకటి సరిగ్గా ఇముడుతాయి," అంటూ రెండు గిన్నెల్నీ లోనికి తీసుకువెళ్లి పరీక్షించింది! చిన్న గిన్నే తనది! కళావతి చెప్పిందే నిజం.

పెద్దగిన్నె తెచ్చి ఇచ్చివేసింది... వాళ్లిద్దరి మొహాల్లోనూ నవ్వు కనిపించింది. 'సొంత గిన్నెను గుర్తించుకోలేని వెర్రితనం చూడు," అన్నట్లుంది ఆ నవ్వు.

కాని నళినికి అదేమీ పట్టలేదు. ఇందాకట్నుండీ మనసును ఆక్రమించుకొన్న ఆలోచన సాగి మళ్లీ ఆరోజు గుర్తుకొచ్చింది... దూరాన ఎక్కడో నాన్నగారు పోయారు. ఆయన ప్రాణ వాయువులు అనంతవాయువులో కలిసిపోతుంటే, అంతటి వాత్సల్యానికి మూలంగా తోచిన ఆ శరీరం అగ్నికాహుతై నశించిపోతుంటే తాను అదేమీ ఎరక్కుండా హాయిగా స్నేహితులతో కాలం గడిపింది. దివ్యంగా భాసించిన ఆ ప్రేమ మండి బూడిదైపోతుంటే తనకెందుకు తెలియలేదు? తెలియకపోవడం ఎలా సంభవం? ఏ కొంచెంగానైనా తెలిసిందేమో, ఏ సూచనైనా అందిందేమోనని ఆనాటి సంఘటనల్ని ఎన్నోసార్లు తరచితరచి చూసుకున్నది.

ఎన్నిసార్లు పరిశీలించినా ఏ గుర్తూ కన్పించలేదు. ఆ ప్రేమభావానికి అస్తిత్వం ఉంటే ఇలా జరగదు కదా! అనుకుంది. క్రమేణా స్వశక్తి మీద, సొంత ఆలోచన మీద నమ్మకం సడిలిపోయింది. తాను చెయ్యవలసినదేదో చెయ్యనట్లు ఈ వైఫల్యానికి తానే కారణమైనట్లు అపరాధ భావన మనసులో తలెత్తింది. జీవితం మీద విరక్తి ఏర్పడ్డది...

వర్తమానంలోకి వచ్చిన నళిని 'పసితనపు భ్రమల్లోంచి ఎదగలేకపోయానేమో,' అనుకుంది.

ఆనాటి దెబ్బతిన్న మానసికావస్థలో అణిగిపోయిన ఆలోచనలు ఇప్పుడు మనసులో ముసురుకొన్నవి... కంటికి కనిపించకుండా పోతున్న గతం ఏమైపోతున్నది? ప్రస్తుతంలో ఉన్న నేను నా గతం నుంచి వేరు ఎట్లాగౌతాను? ఆత్మీయతగా మనసులో నిండిపోయి నా అస్తిత్వానికి మూలంగా నిలిచిన ఆ మహద్భావం వాస్తవం కాదనుకుంటే జీవితాన్ని అర్థం చేసుకోవడం ఎట్లాగ? చలనశీలమైన కాలపరిధిలో వాస్తవానికి నిర్వచనం ఏమిటి?

నాన్నగారి ఉనికి అప్రస్తుతం అంటే?

గతమంతా భ్రమ అంటే!?

అణువులూ, శూన్యాలూ క్షణికాలతో ఏర్పడే దృశ్యమాన ప్రపంచంలో తన ఉనికినే గుర్తించుకోలేక తికమకపడ్డది నళిని.

ఎదురుగా కళావతి నవ్వుతూ నిల్చుంది, నళిని ఏమంటుందోనని చూస్తున్నట్లు...

"ఈసారి గిన్నెలన్నిటి మీదా పేరు వేయించాలి," అన్నది నళిని ముక్తసరిగా...

పేర్లతో ఏర్పడి పేర్లతో నిండిన లోకంలో పేరు లేనిది ఉంటుందా? ఉంటే గుర్తించడం సాధ్యమా? అనుకుంది నళిని.

*భారతి మాసపత్రిక*
*ఆగస్ట్ 1970*

## నేపథ్యం

### ఆదర్శాల అంతరంగ సంఘర్షణ

# గుర్తు

***చలనశీలమైన కాలపరిధిలో వాస్తవానికి నిర్వచనమేమిటో తెలుసుకుంటే సమాధానం వస్తుందని ఆశించింది. 'పరిస్థితుల్లో మార్పు' ఆమె మనస్సుని పరిపరివిధాల అతలాకుతలం చేసింది. జీవితం చెయ్యి జారినట్లయింది. అది ఎందుకు అలా జరుగుతుందో అర్థంకాదు.***

గుర్తు కథ ఆగస్ట్ 1970 భారతి మాసపత్రికలో ప్రచురితమైంది. తర్వాత 'నీడలు' కథా సంపుటంలోను, 'ఆర్. వసుంధరాదేవి కథలు' సంపుటంలోనూ ముద్రింపబడింది. అది ప్రసిద్ధ సాహిత్య మాసపత్రిక భారతిలో వచ్చినప్పుడు ఆచార్య నాయని కృష్ణకుమారి గారు, 'నువ్వెప్పుడూ నీ కథలలో దేనికోసమో వెదుకుతున్నట్లుగా ఉంటావు,' అన్నారు. ఇంటర్ చదువుతున్నప్పట్నుంచి ఆప్తురాలు, నేను గౌరవించిన వ్యక్తి ఆమె. ఆమెది ఆచార్యుల పరిశోధకదృష్టి కదా! నాకైతే తెలియదు-ఎందుకు వ్రాస్తున్నానో. పాఠకుల స్పందన గురించిన ధ్యాసే లేదు.

50-55 ల్లో నేను విశాఖపట్నంలో ఆంధ్ర యూనివర్సిటీలో చదువుతున్నప్పుడు నాకు కళావతిలాంటి మిత్రురాలు ఉండేది. మహారాణీపేట లేడీస్ హాస్టల్నుంచి రెండు మైళ్ళు ప్రతిరోజూ యూనివర్సిటీ బస్సులో వెళ్ళిన అందమైన దోవ, బంగళాలూ, వాటి పేర్లు- ఇవన్నీ నిజం. అప్పట్లో విశాఖపట్నం ఊరు విశాలమైన స్థలాలతో ప్రకృతి సౌందర్యంతో చాలా ఆహ్లాదకరంగా ఉండేది. 'ప్రకృతి సౌందర్యంలోకి ప్రయాణం అది.'

సూక్ష్మంగా చెప్పాలంటే ఈ కథను ఎడిటర్గారు అడిగారని వ్రాసాను. అందు వలన బాహ్యనేపథ్యం కథలో వచ్చినదాని కంటే విశేషంగా లేదు.కథకు బాహ్యప్రేరణ లేకున్నా అంతర్గత నేపథ్యం తప్పకుండా వుంటుంది. ఈ అంతర్గత నేపథ్యం కథగా

బహిర్గతమౌతుంది. ఆ ఘర్షణను సమర్థవంతంగా కథలో వ్యక్తీకరించడమే కథ వ్రాయడం. నాకు కథాస్వరూపం ముందుగా తెలియదు. ముందు ప్లానింగ్ ఉండదు. ఇది నా పద్ధతి.

ఈ కథలో ప్రధానపాత్ర నళిని. ఆమెకు దేశకాలాల కతీతంగా ఆలోచించే ఆదర్శవాద ధోరణి, తనదే ఉన్నతమైన సంస్కారం అని గాఢనమ్మకం ఉన్నవి. సహాధ్యాయిని కళావతి లౌకిక ధోరణిని నిరసనతో చూసేది. తన ఆలోచనల్లోని అసమగ్రత గ్రహింపుకు రాలేదు. తండ్రి మరణించిన దుఃఖం ఎదురైనప్పుడు జీవితాన్ని దుఃఖభాజనం చేసుకున్నది. ఈ కథలో రెండు విషయాల గురించి వ్యక్తి అంతరంగంలో జరిగిన సంఘర్షణ చిత్రితమైంది. ఒకటి మృత్యువు, రెండు లోకరీతిలో ఒదగని ఆదర్శాలు. రెండింటిలో నలిగిన నళిని.

చలనశీలమైన కాలపరిధిలో వాస్తవానికి నిర్వచనమేమిటో తెలుసుకుంటే సమాధానం వస్తుందని ఆశించింది. 'పరిస్థితుల్లో మార్పు' ఆమె మనస్సుని పరిపరివిధాల అతలాకుతలం చేసింది. జీవితం చెయ్యి జారినట్లయింది. అది ఎందుకు అలా జరుగుతుందో అర్థంకాదు.

పదిహేనేళ్ళ తర్వాత కళావతి కన్పించినప్పుడు తన వస్తువులని తానే గుర్తించుకోలేని తన బలహీనత నళినికి కళ్ళెదుట ప్రత్యక్షమౌతుంది. ఆలోచన తిరిగి కొనసాగుతుంది. ప్రపంచ స్వరూపం గురించి పునరాలోచించుకుంటుంది. వైవిధ్యమే ప్రపంచస్థితికి మూలమని, గుర్తింపు మరుగైతే వైవిధ్యభరితమైన ఈ ప్రపంచములో మనుగడ లేదని చూస్తుంది. గిన్నె కోసం వెదికితే గిన్నె గుర్తు దొరకలేదు, తళతళ మిలమిల మాత్రమే కన్పించింది! మానవచేతన పరిధిని బట్టి ప్రపంచము కనిపిస్తున్నదనీ, చూపుని బట్టి సత్యం వున్నదనీ తెలుసుకొని జీవితంతో సమాధానపడిన నళిని వాస్తవ ప్రపంచంలోకి తిరిగి అడుగు పెడుతుంది. సంఘర్షణ జ్ఞానానికి మూలము; అదే మానవుడుగా జన్మించడంలోని పరమార్థం అని సూచిస్తుందీ కథ.

కొన్నాళ్ళ క్రిందట Richard Powers, ఒక పేరొందిన అమెరికన్ నవలారచయిత, Paris Review 175లోఇంటర్వ్యూ సందర్భంగా రచనాప్రక్రియ గురించి చెప్పిన అభిప్రాయాలని ఇంటర్నెట్ లో చదవటం జరిగింది. స్పష్టత కోసం కోట్ చేస్తున్నాను:

1.What strikes me when you talk to writers about the writing process is the incredibly anxious and ongoing battle between the inside and the outside - the struggle to solve being in the world sufficiently to feel what's really going on, and being out of the world sufficiently to be able to protect yourself from what's going on. Then to be able to assemble it in a removed and protected and safe environment. ...You want to see and feel the maelstrom but not be buffeted by it.


2.There are places that empiricism simply can't get to. This is where literature becomes a kind of knowledge that is not only unique but is valuable. It's a way in which literature can go beyond science... for understanding who we are.

కథాశిల్పానికి ప్రాణం అయిన అంతర్గత నేపథ్యాన్ని వివరించే సులువు వున్నదని ఈ చిన్న కథను ఎంచుకున్నాను. మరింత ప్రశంసలు పొందినవి, క్లిష్టమైనవి అయిన కథలు కావాలంటే నా కథాసంకలనం 'ఆర్. వసుందరాదేవి కథలు' సంకలనంలో చూడవచ్చును.

*19 ఫిబ్రవరి 2013*

*'గుర్తు' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

6



**ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు** 1964 మార్చి 18న నెల్లూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ కొడుకు దొరికాడు ఆంధ్రజ్యోతి వారపత్రికలో 1980లో అచ్చయింది. పది కథలు రాశారు. వివిధ పత్రికల్లోను, టి.వి. ఛానెల్స్‌లోను పనిచేసి ప్రస్తుతం ఎ.బి.ఎన్. ఆంధ్రజ్యోతి ఛానెల్‌కు, ఆంధ్రజ్యోతి దినపత్రికకు రాయలసీమ ప్రాంత బాధ్యులు. వీరి వార్తాకథనాలకు ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు లభించింది.

**చిరునామా**

20-3-131/ఎ, శివజ్యోతినగర్,
తిరుపతి - 517 501
Ph.: 99854 25888
umatpt@gmail.com

# వొంటేపమాను

## ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు

ఇంకాసేపటిలో రైలు దిగుతాను.

కోటపోలూరు గెరండాలు దాటుతున్న దడదడ శబ్దం.

కిటికీ అవతలి ప్రపంచం ఇంకా మసగ్గానే ఉంది.

ఊరి వాసన రైలుపెట్టె అంతా పరచుకుంది. మనసు దూదిపింజగా మారే గొప్ప అనుభూతి.

దిగగానే సంచి భుజానికి తగిలించుకుని ఊరి బాట పడతాను. వినాయకుడి గుడి ఎదురుగా కర్రతుమ్మ పొదల్లోంచి యేట్లోకి డొంకదారి. కాళ్ళ కింద మెత్తని తెల్లని ఇసుక... చెప్పుల్లోకి దూరి కరకర శబ్దం. పొగమంచు కమ్మిన నీళ్ళు... ప్యాంటు మోకాళ్ళ పైకి మడిచి... చెప్పులు చేతుల్లోకి తీసుకుని నీళ్ళల్లోకి... వెచ్చని స్పర్శ.

డొంకదారికి పచ్చని తోరణంలా గట్టుమీది పొలంలోంచి యేట్లోకి వాలిన జామ కొమ్మ. ఎగిరి ఒక పిందెను తెంచుకుని కొరుక్కుంటూ నడక. వగరు తీపి కలిసిన వింత రుచి. మధురమైన మనోరంజనం పూలవాసన. అయితావాళ్ళ తోట. గాలికి డబ్బారేకుల గలగల చప్పుడు. మూల తిరుగుడులో జంట మామిడిచెట్లు. చిత్తూరు సాయిబు తోట. కుడిపక్క నెల్లూరు రెడ్డి తోటలోకి బండి బాట. ఇంకొంచెం ముందుకి... చల్లనిగాలి తెమ్మెర పలకరింపు.

వొంటేపమాను.

మాను నీడన విశ్రాంతి. నడక అలసటకు వేపకొమ్మల లాలిపాట. రోడ్డుకు ఆవల పసుప్పచ్చని పూల శనగతోట. తోటలో పుట్ట. పుట్టకు చుట్టిన తెల్లని దారాలు. పసుపూ కుంకాలు... గాజులు. వేపకొమ్మల గాలికి ఆవిరైన చెమట. మళ్ళీ నడక... ఎడమ పక్కన నీళ్ళింజన్ డుగడుగ. పక్కనే నులక మంచం మీద నల్ల గొంగడిలో ముడుచుకున్న బాబన్న... రోడ్డు పక్కన కానుగ పొదలబారు... పొదలకు అల్లుకున్న వెర్రిదొండ తీగలు... పచ్చని పొదల్లో అక్కడక్కడా ఎర్రని దొండపండ్లు... మరికొంత ముందుకు నడిస్తే, సగం కాలిన ఇటుక శూల... చీపురగుంట... నీళ్ళలో ఎగిరెగిరి పడుతున్న పక్కిపిల్లలు, బేడిసెలు... వలలు విప్పుతున్న యానాదులు... మసక వెలుతురులో ముళ్ళపొదల వెనుక తొంగి చూస్తున్న కచ్చేరి బడి.

"అబయా... ఇదేనా రావటం..." చేత చెంబులతో తోటల్లోకి నడుస్తున్న వాళ్ళ పలకరింపులు... ఊళ్ళోకి తొలి స్వాగతం జంగమోళ్ళ ఇల్లు. మగ్గాల టక్కుటక్కు శబ్దాలు... కోనేటిలో విచ్చుకున్న తామరలు... రచ్చబండ... బంకు తెరుస్తూ కోటిరాజ... అమీరు టీ గ్లాసు చప్పుడు... పేడ కళ్ళాపి తడిలో మెరుస్తున్న వాకిళ్ళు... సందు మొగదలలో వీధి లైటు గుడ్డి వెలుతురు... వీధిబావి గిలకల గలగల సంగీతం... పాత పెంకుటిల్లు... వాకిట్లో ముగ్గుకర్రలో ముడుచుకు పడుకున్న కుక్కపిల్ల... వారగా వేసిన తలుపు తోసుకొని లోపలికి... పెళ్ళో సన్నజాజి పాదులో అంట్లగిన్నెలు తోముతూ అమ్మ... అమ్మ ముఖాన మొల్లపువ్వులాంటి నవ్వు...

కల చెదిరింది.

పెట్రోలు... కిరోసిన్ వాసన... కాళంగి యేటి మీద విశాలమైన వంతెన... నల్లటి నున్నటి తారురోడ్డు. రోడ్డు మీద పసుప్పచ్చని చారలు... కట్లపాములాంటి రోడ్డు. రోడ్లు రోడ్లుగా విడిపోయిన పొలాలు... సమాధుల్లా ప్లాట్ల రాళ్ళు... నడిచే నరమానవుల్లేరు. ఆటోల బుర్రుబుర్రులు తప్ప.

ఏదీ...? ఇక్కడే ఉండాలి...? అదిగో తోటలో పుట్ట... పుట్ట ఎదురుగా సరిగ్గా ఇక్కడే... ఈ రోడ్డు వారనే ఉండాలి...?

ఏదీ వొంటేపమాను...?

అయ్యో... ఏదీ... లేదే... ఏమైంది...?

ఎండపూట అలసిన శరీరాలకు చల్లని నీడనిచ్చి సేదదీర్చి పంపే వొంటేపమాను...? చిరుజల్లులకు తడవకుండా నడక జనానికి పచ్చని గొడుగు పట్టే వొంటేపచెట్టు...? మెరుపు మెరిసినా, ఉరుమురిమినా, వడగళ్ళు కురిసినా పచ్చని కొమ్మల రెక్కల కింద పొదుగుకునే మహావృక్షం...? ఎంత రాత్రి అయినా ఎంత చీకటి అయినా నేనున్నానంటూ ధైర్యం చెప్పే వొంటరి వేపచెట్టు...? ఊరికీ పేటకీ మధ్య మైలురాయి. ఒకే ఒక్క వేపమాను...? ఎన్ని తుఫానులొచ్చినా ఎదురు నిలిచి గెలాయించిన మహా మొండిమాను...? కాళంగేరు పొంగి వరదై పొలాలను ముంచి ఊరిని చుట్టుముట్టినపుడు రెండు నిండు ప్రాణాలను తన కొమ్మల ఒడిలో దాచుకొని కాపాడిన అమ్మవంటి చెట్టు... అయ్యో... ఇప్పుడేదీ...? ఇక్కడే కదా ఉండాలి... ఇక్కడే... ఈ రోడ్డు వారనే... ఏదీ...?

లేదు...

వొంటేపమాను లేదు.

ఈ ఆధునిక మహా రహదారి కింద సమాధి అయిపోయింది.

అనకొండలాంటి ఈ రోడ్డు ఆ మహావృక్షాన్ని మింగి మత్తుగా పడుకుని ఉంది.

"అబయా... నడిచొస్తా వుండావేంది. ఇనాయకుడి గుడి కాడ ఆటోలుళ్ళా... దండిగా. సరే, బిన్నా పద... ఇంటికాడ అంతా చూస్తా వుండారు నీ కోసరమే. నేను సావు సామానుకి బోతా ఉండా వొచ్చేస్తా పద," వేగంగా వెళ్తున్న ఆటోలోంచి అరుపు... ట్రైలరు మస్తాన్.

లోపలంతా ఏదో వెలితి... వెలుపలికి రాని దుఃఖం... చిరాకు... కోపం... అసహనం...

జంగమోళ్ళ పూరింటికి అడ్డంగా కొత్తగా వెలిసిన మిద్దె... నీళ్ళు లేని కోనేరు... బురద కంపు... రేకుల షెడ్డులోకి మారిన కోటిరాజ బంకు... అద్దాల్లో అందంగా సబ్బులూ, బిస్కెట్ ప్యాకెట్లూ... అమీరు టీ యంగడి పక్కనే కొత్తగా వెలిసిన కూల్‌డ్రింక్ షాపు... ఆంజనేయులు గుడి సందులో బంగారమ్మమ్మ నాటు పెంకుటిల్లు... వాకిటనిండా జనం... నట్టింట్లో గోడకు ఆనించిన ఉయ్యాల బల్ల... దూలానికి వేలాడుతున్న గొలుసులు... నేల మీద బంగారమ్మమ్మ శవం.

పెదాల మీద వక్కాకు ముద్ద... తల దగ్గర నూనెదీపం... చుట్టూ ఆడవాళ్ళు... లో గొంతుకలో రాగంలా సాగుతున్న ఏడుపులు... గంగనాగోలగా ఏడుపులు... మాటలు... పురమాయింపులు...

నిట్టాడి గుంజకి చేరగిలబడి నిలబడ్డాను. వంట్లోని శక్తి అంతా ఆవిరైపోతున్న అనుభూతి... భుజాన వేలాడుతున్న బ్యాగు భారం క్షణక్షణానికీ పెరుగుతోంది. తెరలు తెరలుగా చీకటి... లోలోపల అలలు అలలుగా దు:ఖం... ఏదో బద్దలై బయటపడితే బావుండుననే కోరిక... పెనుగులాట...

శవం తల దగ్గర నుంచి మా అమ్మ చివుక్కున లేసింది. నా భుజం మీది బ్యాగు తన చేతికి తీసుకునింది. 'పద' అనింది.

అమ్మ చేతిని గట్టిగా పట్టుకున్నాను. ఏదో గొప్ప శక్తి. బయటకు నడిచాను. మొత్త దాటి ఇంట్లోకి అడుగు పెట్టగానే గట్టు తెగిపోయింది. రెప్పల కింద దాగిన ఉప్పెన వెల్లువై విరుచుకు పడింది. అమ్మ వొడి తడిచి ముద్దయింది. ఎక్కిళ్ళు ఎగతన్నుకు వస్తున్నాయి. నా తల వెంట్రుకల్లోకి వేళ్ళు దూర్చి దువ్వుతూ ఉండిపోయింది అమ్మ. ఆ వేళ్ళ కదలిక హాయిగా ఉంది. దు:ఖాన్ని పంచుకునే ఓదార్పు భాష ఏదో ఆ వేళ్ళకు తెలుసు.

*

మంచి ఎండపూట.

వానకి నానినాని మట్టి జారిన ప్రహరీగోడ... గోడ మీద చీకిన వెదురుబుట్టల్లో టేబుల్ రోజా పూలు... శబ్దం రాకుండా బంగారమ్మమ్మ పెళ్ళోకి దూకాను. విరగకాసిన కిచ్చిలి చెట్టు... ఎండకి మెరుస్తున్న తేరిన కాయలు... పుల్లని తియ్యని రుచిని తలచుకుని ఊరుతున్న నోరు...

కాయలు చేతికి అందవు. ఇనుపచీలల్లాంటి కిచ్చిలి ముళ్ళు చెట్టెక్కనివ్వవు. ఎండకి నట్టింట్లో ఉయ్యాలబల్ల మీద పడుకుని, రేడియోలో సంగీతం వింటూ ఊగుతూ తూగుతూ ఉంటుంది బంగారమ్మమ్మ. తెలీకుండా పెళ్ళో నాలుగు కిచ్చిలికాయలు తెంపుకుపోవాలని నా ప్లాను. జరిగేట్టు లేదు. దోటి కావాలి. ఇంట్లో తలుపుమూల కత్తిదోటి ఆనించి ఉంటుంది. పెళు ళ్ళ తలుపు వారగా వేసి ఉంది. అమ్మమ్మకి మెలకువ రాకుండా దోటి బయటకు తేగలిగితే చాలు. అడుగులో అడుగేసుకుంటూ తలుపు దగ్గరకు వెళ్ళాను.

గుండె గభీమనింది. లోపల నుంచి ఏడుపులు... పొగిలి పొగిలి... వెక్కివెక్కి.

బంగారమ్మమ్మ గొంతుకాదు, మగ గొంతు. గుబగుబ కొట్టుకునే గుండెలతో తలుపు సందులోంచి చూశాను. నిట్టాడి గుంజను ఆనుకుని బంగారమ్మమ్మ కూర్చోనుంది. అలికిన నేల మీద బంగారమ్మమ్మ ఒళ్ళో తల పెట్టుకుని కృష్ణారెడ్డి పడుకుని ఉన్నాడు. ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తు

న్నాడు. బంగారమ్మమ్మ ముఖంలో ఏ ఆందోళనా లేదు. నిర్మలంగా ఉంది. నిండు కుండలా ఉంది. కృష్ణారెడ్డి తల వెంట్రుకల్లో వేళ్ళు దూర్చి దువ్వుతూ ఉంది.

నమ్మలేని దృశ్యాన్ని చూసిన అనుభూతి. కృష్ణారెడ్డి ఏడవడమా...? అదీ ఒక ఆడమనిషి ఒళ్లో తలపెట్టుకుని నేలమీద పడుకుని...?

కృష్ణారెడ్డి మా ఊరికంతా పెద్ద. నల్లగా నిగనిగలాడే ఒళ్ళు. ఇంతెత్తు మనిషి. గుబురు మీసాలు. తెల్లపంచె, తెల్ల జుబ్బా, పై గుడ్డ. కృష్ణారెడ్డి వస్తా ఉంటే ఊళ్ళో ఎదురు నడవరు. సాయంత్రపు చల్లగాలికి వాకిళ్ళలో నులకమంచాల మీదకి చేరిన ఆడవాళ్ళు, కృష్ణారెడ్డి ఆ దారిన పోతా ఉంటే లేసి నిలబడతారు. మాట వినని పిలకాయలని, 'ఏం...కృష్ణారెడ్డితో చెప్పాల్నా...' అని భయపెడతారు. యేటమ్మిడ మామిడిచెట్టు కింద కృష్ణారెడ్డి నిలబడుకుని ఉన్నాడంటే తోటల్లో పనులకు దిగినవాళ్ళు తల కూడా పైకెత్తరు. బలిజీది రాగిచెట్టు రచ్చబండ మీద కృష్ణారెడ్డి పద్మాసనం వేసుకుని కూర్చున్నాడంటే ఆ దినం ఎవురికో మూడిందనే అర్థం. రాగిచెట్టు ఎదురుగా కరెంటు స్తంభానికి తప్పు చేసిన వాళ్ళని కట్టేస్తారు. పిడకలు రాజేసి ఇనుపకమ్ములు కాలుస్తారు. వాతలు, చింత బరికెలతో దెబ్బలు కృష్ణారెడ్డి కోర్టులో శిక్షలు. కృష్ణారెడ్డి మా ఊరి మహా రాక్షసుడు.

అట్లాంటి కృష్ణారెడ్డి ఏడవడమా...?

ఊరంతా గడగడ వణికే కృష్ణారెడ్డి... మా బంగారమ్మమ్మ ఒళ్ళో పసిబిడ్డ...?

కృష్ణారెడ్డిని మా బంగారమ్మమ్మ ఇంట్లో చాలాసార్లే చూసాను. ఆయన ఉయ్యాల బల్ల మీద పడుకుని ఊగుతూ ఉంటే, బంగారమ్మమ్మ నేలమీద కూర్చుని కబుర్లు చెప్పేది. ఆమె ఆయనని 'క్రిష్ణా' అని పిలిచేది. ఆయన 'బంగారూ' అనేవాడు. ఊరంతా 'రెడ్డోరా' అని పిలిచే కృష్ణారెడ్డిని మా బంగారమ్మమ్మ పేరుపెట్టి పిలుస్తుంటే నాకెందుకో గర్వంగా ఉండేది.

కృష్ణారెడ్డి ఏడుపు దృశ్యాన్ని చూసినప్పటి నుంచీ నాకు మా బంగారమ్మమ్మ మీద ఆసక్తి పెరిగింది. రహస్యంగా ఆమెను పరిశీలించడం ప్రారంభించాను. బడికి పొయ్యే ముందు, బడి వదిలాక ఖచ్చితంగా బంగారమ్మమ్మ దగ్గరకు వెళ్ళేవాడిని. ఉండేది ఒక్కటే అయినా తినడానికి ఏదో ఒకటి ఆమె ఇంట్లో ఎప్పుడూ ఉంటుంది. ఒకసారి ఒంటేలి గంట కొట్టగానే పరుగున బంగారమ్మమ ఇంటికి వెళ్ళాను, ఏదన్నా చిరుతిండి పెడుతుందని. వాకిట్లో కిర్రుచెప్పుల జత కనిపించింది. అవి కృష్ణారెడ్డివి. మెల్లగా బయటి తిన్నె మీదకి చేరుకుని కిటికీలోంచి లోపలికి చూశాను.

"నువ్వసలు మనిషివేనా... ఆడదాని మింద చెయ్యి చేసుకునేది గొప్పనుకుంటా ఉండావా. నీ పెళ్ళాం తిరగబడి నీ మొహంమీద ఊంచుంటే యాడ బెట్టుకుంటావు తలకాయ... మొలేసు కుంటావా...?" అని వాయించేస్తోంది బంగారమ్మమ్మ. తెల్లటి ఆమె మొహం ఎర్రబారింది. కృష్ణారెడ్డి కేసి ఛీత్కారంగా చూస్తోంది. అతను ఆమె ముందు తల వంచుకుని నిలబడ్డాడు.

"బంగారూ... తప్పే... యేంజేసేది... పైరు ముదిరి పొయ్యుండాది. కోతలు కొయ్యాల. కూలోళ్ళు దొరకడంలా. అడ్వాన్సులిస్తేగానీ బయటూరోళ్ళు కదలరు. నిజిం చెప్తా ఉండా... నా చేతల్లో పది రూపాయిలు గూడా లేదు. నగలు బెడ్తేనేగానీ మార్వాడోళ్ళు దుడ్లీరు. ఆ యమ్మిని అడిగినా... 'మా పినమ్మ కూతురి పెండ్లుండాది. బోసి మెడతోపోతే యెట్టా... యీనంటే యీనూ,' అని తెగేసి చెప్పింది. కోపమొస్తే నేను మనిషిని కాదుగదా... వంగనబెట్టి రెండేట్లు యేసినా..."

కృష్ణారెడ్డి సంజాయిషీ మా బంగారమ్మమ్మని కరిగించింది.

"నా దెగ్గిరికి వొచ్చుండగూడ్దా కృష్ణా," అనింది దయగా.

బొడ్లో నుంచి తాళాల గుత్తి తీసింది. భోషాణం పెట్టి తెరిచింది. కృష్ణారెడ్డి చేతిలో నగలపెట్టి పెట్టింది.

*

"అబయా... లెయ్యి, లేసి ఒక చుక్క కాఫీ తాగుదువుగానీ," అంటూ కాఫీ గ్లాసుతో వచ్చింది మా అక్క.

లేసి మొహం కడుక్కుని వచ్చాను. వంటింటి మొత్త మెట్టు మీద కూర్చుని కాఫీగ్లాసు అందుకున్నాను. ఎదురుగా పీట వాల్చుకుని మా అమ్మ కూర్చునింది. తులసికోట పక్కన గోడకి ఆనుకుని మా అక్క నిలుచుంది. గొంతులోకి చేదుగా తియ్యగా వెచ్చని కాఫీ దిగింది. గుండెల్లోని భారం మాత్రం ఇంకా దిగలేదు.

"నిన్న సందగొడ్లు వచ్చే యేళకాడ బాయిలో దూకేసిందిరా," అమ్మ గొంతులో సన్నని వణుకు.

నా చేతిలోని గ్లాసు వణికింది. కళ్ళలోంచి జలజల నీళ్ళు కారిపోతూనే ఉన్నాయి. ఆపుకోవడం సాధ్యం కావడంలేదు. కాఫీగ్లాసు కింద పెట్టేసి పరుగున పెళ్ళోకి నడిచాను.

"నాయినా... సమాళిచ్చుకోవాల," అనింది మా అమ్మ రుద్దకంఠంతో వెనుక నుంచి.

బంగారమ్మమ్మ నాకు సొంత అమ్మమ్మ కాదు. మా అమ్మకి పెదమ్మ. మా అమ్మ చినప్పుడే వాళ్ళమ్మ చచ్చిపోయింది. బంగారమ్మమ్మ ఉండేది ఒక వీధిలో, మేముండేది ఇంకో వీధిలో. ఆమె మా ఇంటికి ఎప్పుడైనా వచ్చేది. మా నాయనకీ ఆమెకీ పడేది కాదు. పిలకాయలని మాత్రం ఆమె బాగా దగ్గరకు తీసేది. నేనంటే చాలా ప్రేమ. నాకు ఆమె ముక్కే వచ్చిందని చెప్పుకుని మురిసిపోయేది. పండగలకి నాకు గుడ్డలు కుట్టించేది. పుస్తకాలు తీసిచ్చేది. సినిమాలకి తీసుకుపొయ్యేది. తినడానికి బంగారమ్మమ్మ ఏం చేసుకున్నా నాకు భాగం పెట్టేది. సెలవులొస్తే నాకు సంబరం. గుడ్డలు తెచ్చుకుని బంగారమ్మమ్మ ఇంట్లోనే ఉండిపోయేవాణ్ణి.

మా బంగారమ్మమ్మ ఇంటికి కొంతమంది మగవాళ్ళు వచ్చేవాళ్ళు. కృష్ణారెడ్డి, కరణం బలరామయ్య, రంగస్వామి, పూజారితాత ఆమె ఇంట్లో తరచూ కనిపించేవాళ్ళు. ఎక్కువగా ఎండపూట వచ్చేవాళ్ళు. ఒకరున్నపుడు మరొకరు కనిపించేవాళ్ళు కాదు. వాళ్ళంతా ఊళ్ళో పెద్ద మనుషులు.

"అమ్మమ్మా... వీళ్ళంతా ఇక్కడికెందుకు వస్తారు?" అని అడిగాను ఒకసారి.

"వాళ్ళంతా నా సావాసగాళ్ళులే," అని చెప్పింది.

ఊరి పెద్ద మనుషులు మా బంగారమ్మమ్మకి సావాసగాళ్ళయినందుకు నాకు సంతోషంగా, గర్వంగా ఉండేది. అయితే వాళ్ళతో పాటు బండి బక్కయ్య కూడా మా బంగారమ్మమ్మ ఇంటికి వచ్చేవాడు. ఆయన వాళ్ళలా పెద్దమనిషి కాదు. బాడుక్కి బండి కట్టేవాడు. అయినా కృష్ణారెడ్డి పడుకున్నట్టుగానే ఉయ్యాల బల్ల మీద బండి బక్కయ్య కూడా పడుకుని ఉండేవాడు. గోసిపోసి కట్టిన పంచె, నల్లటి ఒళ్ళు. కాళ్ళకి చెప్పులుండవు. ఒంటి మీద చొక్కా ఉండదు. కృష్ణారెడ్డితో మాట్లాడినంత సంతోషంగానే బంగారమ్మమ్మ బండి బక్కయ్యతోనూ నవ్వుతూ మాట్లాడేది. ఆయన రాక నాకు మొదట్లో అంతగా నచ్చేది కాదు. బండి బక్కయ్య మా బంగారమ్మమ్మ ఇంటికి వచ్చే విషయం ఎవ్వరికీ తెలీకపోతే బావుణ్ణనిపించేది. బంగారమ్మమ్మ ఇంట్లో నేను కనిపిస్తే బక్కయ్య చెతుర్లాడేవాడు. ఉయ్యాల బల్ల మీద కూర్చోబెట్టుకుని మాటలు చెప్పేవాడు. బొడ్లోంచి డబ్బులు తీసిచ్చి చుట్ట తేబో అనేవాడు. పన్నీరు సోడా తాగమని నాకు డబ్బులిచ్చేవాడు. మా బంగారమ్మమ్మ ఇంటికి వచ్చే మిగిలిన పెద్దమనుషులెవ్వరూ నన్ను అంతగా పట్టించుకునే వాళ్ళు కాదు. పైగా వాళ్ళొచ్చే వేళకి నేను బంగారమ్మమ్మ ఇంట్లో ఉంటే, 'పొయ్యి చదువుకోబో,' అని పంపేసేవాళ్ళు.

ఒకరోజు మధ్యాహ్నం మా అమ్మ గోడకి పిడకలు తడుతూ ఉంది.

“అమా... నీకు సావాసగాళ్ళెవురూ లేరెందుకు?” అనడిగాను.

ఆమె ఆగి మోచేత్తో ముక్కుమీద వాలిన ఈగని తోలుకుని నావైపు చూసింది.

“బంగారమ్మమ్మకి చానామంది సావాసగాళ్లుండారు గదా ఆ మాదిరిగా నీకెందుకు లేరు... మనింటికి ఎవురూ రారేం...మా?” అన్నాను.

“పో... మూస్కోని,” అని అదిలించింది అమ్మ. ఆమె ముఖంలో వింత నవ్వు ఒకటి మెరిసి మాయమైంది.

ముంచుకొస్తున్న జ్ఞాపకాలు దు:ఖాన్ని పెంచుతున్నాయి.

చేదబావి దాటి మామిడిచెట్టు దగ్గరకు నడిచాను. కాండం నుంచీ పెరిగిన ఒక కొమ్మ లేత ఆకులతో నవనవలాడుతోంది. వేళ్ళతో ఆకులని తడిమాను. ఆ లేత ఆకుల మృదుస్పర్శ ఎందుకో హాయిగా అనిపించింది. వెనక్కి బావి దగ్గరకు వచ్చి తొంగి చూసాను. నీళ్ళు లోపలెక్కడో ఉన్నాయి. బక్కెటతో నీళ్ళు చేది దోసిట్లోకి తీసుకుని మొహం మీద చల్లుకున్నాను. నులి వెచ్చటి నీళ్ళు తగలగానే తేలిక పడ్డట్టనిపించింది.

కాసేపు చెట్ల మధ్యనే తిరిగి వంటింటి దగ్గరకొచ్చాను. అమ్మ పీటమీద అక్కడే కూర్చుని ఉంది. వంటింటి మొత్త మెట్టు మీద అక్క కూర్చుని ఉంది. ప్లాస్టిక్ స్టూలు లాక్కుని కూర్చున్నాను.

“బంగారమ్మమ్మ పెళ్ళెందుకు చేసుకోలేదు మా...?” అని అడిగాను.

“పెళ్ళా... ముద్రేసుకునిళ్ళా...” అనింది అమ్మ.

అవును, బంగారమ్మమ్మ భుజాల మీద కాయలుగాసిన గుర్తులున్నాయి. అవి గుళ్ళో కాల్చివేసిన శంకుచక్రాలన్నమాట.

“ఒంటి మనిషి... ఇన్ని దినాలు దిగులూ బొగులూ లేకుండా ఎట్ల బతికింది మా.”

“ఆ యమ్మకేం... దిగులా, భయమా... ఒంటిస్తంభం మాదిరిగా గదా ఉణ్ణింది.”

“ముద్రేసుకున్నోళ్ళందరూ ఆ మాదిరిగానే ఉండారా... పిల్లాపాపలతో కుటుంబరాలుగానే వుళ్ళా...”

“మా పెదమ్మ గూడా ఆ మారే వుణ్ణుండచ్చునుకో... ఇనే రకమా, పెడద్రం గదా... అయినా ఆ యమ్మకి ఎంత డిమాండని ఆ కాలంలో...” అని నవ్వి కొనసాగించింది.

“మన్నారుసామి దేవళంలో ఇంకన ఆటాపాటా ముగించెయ్యాలని గవుర్మెట్టు ఆడరేసినాక దేవుణ్ణి నమ్ముకున్నోళ్ళంతా చెట్టుకొకరూ పుట్టకొకరూ అయిపాయ. లోకమెరిగినోళ్ళు బాగుపడితిరి. చెడిపోయినోళ్ళు చెడిపోతిరి. బంగారమ్మ మొండి కొయ్య గదా ఈ మాదిరిగానే ఉండిపోయింది”

“అబయా బాగుండావా” అంటూ మా మిద్దింటత్త వచ్చింది. మా అమ్మ కొంచం లేసి పీట మిద్దింటత్తకి ఇచ్చి తను నేలమీద చతికిలబడి కూర్చునింది.

“ఆయమ్మ కతే మాట్లాడుకుంటా ఉండాంకా” అని చెప్పి నావైపు తిరిగింది.

“బంగారమ్మ కోసరం యెందురు తిరిగినారనీ... ఆ దినాల్లో... యెడం కంటితో నన్నా చూసిందా... కార్వేటినగరం జమిందారంతటోడే, ఆయమ్మ ఆట జూసి ఇష్టపడి దివాణంకి రమ్మని పిలిచినాడంట. మేం చిన్నపిలకాయలంలే... వొద్దుసామీ అనేసిందంట”

“అవును చిట్టెమ్మా” అంటూ మా మిద్దింటత్త మొదలుపెట్టింది.

“అబయా... కోటపోలూరు రాజారెడ్డి తెలుసుగదా! ఈ దచ్చినాదిలోనే పెద్ద ఆసామి. అంతటోడే ఎట్ట తిరిగినాడనీ... బంగారమ్మ మొత్తలోకి గూడా అడుగు పెట్టనీలా... ఆ పోలీసు ఇనస్పెట్టర్ అయితే పిచ్చోడు మాదిరేగదా... ‘పెళ్ళి జేసుకుంటా... పువ్వుల్లో బెట్టి జూసుకుంటా...’ అని బంగపడ్డాడా... ఇనిందా...? ఈ యమ్మలో ఏం జూసినాడో, ఏం మెచ్చినాడోగానీ ఎంత పోరకలాడాడనీ... ‘నువ్వు నౌకిరీ జేసేటోడివి. నీకు ఒక ఊరులేదు. ఒక నీళ్ళు లేవు. ఏ దినం ఏ

ఊరికి బొమ్మంటే ఆ ఊరికి మడిచేతులు కట్టుకోని పోవాల్సిందేగదా... నాకేమిటికి కర్మ... నీ వెనకాలబడి తిరిగేదానికి...? నువు బెట్టింది తిని పడుండేదానికి...?' అని ఆ మనిషిని బట్టుకోని యిదిలించేసింది. ఆకిరికి ఆ యినస్పెట్టరు పెళ్ళనేదే చేసుకోకుండానే ఉండిపోయనే... అబయా... అదేం పిచ్చో, అదేం ప్రేమోగానీ ఆయన యే దేశాన ఉణ్ణీ ఈ దినానికీ సమచ్చరం... పోలూరుకొచ్చి బంగారమ్మని చూసిపోవాల్సిందే గదా..." అని మా మిద్దింటత్త ఆగింది.

"అయినా ఇప్పుడు యాడుండాడో... ఈ సంగతి యెవురన్నా చెప్పి పంపినారో లేదో..." అని గొణిగింది.

"బలే ఒళ్ళు పొగురు మనిషిలే కా," అనింది మా అమ్మ.

"అవునుమే.. ఆడదాని మాదిరిగానా బతికింది బంగారమ్మ... మొగోడు మాదిరి గదా బతికింది. 'బంగారా... యెంతకాలం ఈ మాదిరిగా వొంటి కాపరం... ఒక తోడా, నీడా...' అనంటే 'వొకణ్ణి కట్టుకునేది, వోడికి వొండివార్చి పెట్టేది, వాడికి కొంగుబరిచేది. తిట్లూ తన్నులూ తినేది. వాడికి బిడ్డల్ని గని సాకి సంతరించేది. కడంతగాలం పనిమనిషి కన్నా హీనంగా బతకాల... యేమిటికి... యేమి గాచ్చారం... యేమి తక్కవ ఇప్పుడు నాకు...?' అని గెలాయించేసేది గదా," అని గోడకి ఆనుకునింది మా అత్త.

"అది పోనీకా... పెళ్ళీ పెటాకులు లేకపోతే పోనీ... ఇందురు మొగోళ్ళు... పెద్దపెద్దోళ్ళు ఆసి పడి తిరిగినారే, యెవురో వొకర్ని నమ్ముకోని వాళ్ళ యిలాకాగా ఉండిపోయ్యుండచ్చుగదా..." అనింది మా అమ్మ గొంతు తగ్గించి.

"పాయింట్లు తీసిగదా ఆ యమ్మ మాట్లాడేది. 'నేనేమన్నా కుక్కనా వొకరి యెంగిలి మెతుకులు తిని యిస్వాసంగా పడుండేదానికి,' అంటుళ్ళా..."

"ఆ వకీలుతో మాట్లాడి గెలిచేది ఎవురులే," అని నిట్టూర్చింది మా అమ్మ.

కొంతసేపు నిశ్శబ్దం అక్కడ రాజ్యమేలింది.

"చిట్టెమ్మా... నువు మంచనూ, చెడ్డనూ... వొంటి బతుకైనా బంగారమ్మ బతుకే సుకం. నచ్చిన తిండి తింటాది. మెచ్చిన గుడ్డ కట్టుకుంటాది. మనూళ్ళో యిందురు ఆడోళ్ళుండారు. బలిజీదిలో అయిస్కూలు చదివినోళ్ళు గూడా వుళ్ళా... బంగారమ్మ మాదిరిగా గుండెదైర్నం గలిగినోళ్ళు వొక్కరైనా వుండారా...? ఆ మనిషి మాదిరి సొతంతరంగా యే పనన్నా యే దినమన్నా చేసినామా..." అనింది మా అత్త.

"అవునుకా... మొగరాయుడు గదా... మాటొస్తే, నేను మెడ్రాసుకి బోతుండా అని వొంటిగా రైలెక్కేది. జన్రలాస్పత్రికి బొయ్యేది... నాకు ఆడ బాగలేదు, ఈడ బాగలేదు అని జెప్పి చేరిపొయ్యేది. వారం పద్దినాలు అణ్ణే వుండేది. పెద్దపెద్ద డాట్టర్లు గూడా మా పెదమ్మకి బాగా తెలిసినోళ్ళే అయిపాయ. యెంతటోడన్నా యెదురుపణ్ణీ జంకనేది లేదుగదా. దైర్నంగా మాట్లాడేసేది..."

"అవునుమే... కరణం బలరామయ్య ఈ దినం ఈ ఊళ్ళో ప్రాణాలతో ఉండాడంటే బంగారమ్మ పున్నెమే గదా," అనింది మిద్దింటత్త.

కరణం బలరామయ్యని చాలాసార్లు మా బంగారమ్మమ్మ ఇంట్లో నేను చూశాను. బంగారమ్మమ్మది నాటు పెంకుటిల్లు. ముందు రెండు తిన్నెలు. తిన్నెల మీద చేరగిలబడి కూర్చోడానికి వీలుగా దిన్నెలు. ఎండపూట ఒక తిన్నె మీద కరణం బలరామయ్య మరో తిన్నె మీద బంగారమ్మమ్మ విశ్రాంతిగా వాలి కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు.

ఒకసారి ఆయనకి నిండా వొళ్ళు బాగా లేకుండా అయిపోయింది. మెడ్రాసుకి తీసుకుపొయ్యి ఆపరేషన్ చేయించాలని పేటలో డాక్టరు చెప్పాడు. ఆ మాటతో ఆయన జంకిపొయ్యాడు.

'నేను మెడ్రాసుకి రాను. నాకు ఆపరేషన్ వద్దు. నేను బతకను,' అని యేడుపెత్తుకున్నాడు. ఊళ్లో పెద్దమనుషులందురూ ధైర్యం చెప్పారు. వినలేదు. ఇంట్లో వాళ్ళు కూడా ఆశ వదులుకున్నారు. ముఖాన చావుకళ పడిపొయ్యింది. ఈరోజో రేపో అన్నట్టుగా ఉన్నాడు. బంగారమ్మమ్మ ఊళ్ళో లేదు. మెడ్రాసుకో, అనంతపురంకి పోలీస్ ఇన్‌స్పెక్టర్ దగ్గరికో పొయ్యింది. వారం తర్వాత వచ్చింది. కరణం సంగతి తెలియగానే నేరుగా ఆయన ఇంటికి పొయ్యింది. ఆయనతో మాట్లాడింది. బక్కయ్యని పిలిచి బండిగట్టమనింది. ఆయన భార్యని తోడు రమ్మనింది. పేటకిపొయ్యి అక్కడి నుంచి రైల్లో మద్రాసుకి తీసుకుపొయ్యింది. రెండువారాల తర్వాత కరణం నడుచుకుంటూ ఊళ్ళోకి వచ్చాడు. మా అమ్మమ్మ గురించి అప్పుడు ఊళ్ళో గొప్పగా చెప్పుకునేవాళ్ళు.

"చిట్టెమ్మా జెన్రలాస్పత్రిలో రొండువారాలు కరణం బలరామయ్యని కంటికి రెప్పమాదిరిగా గదా బంగారమ్మ చూసుకునింది. అన్నీ పడకలోనే గదా, కడిగీ తోసీ కన్నతల్లి మాదిరేకదా. పెళ్ళాం పక్కన ఉన్నా యేమి సుకం... యెతిమతం అయిపాయ," అని మా మిద్దింటత్త.

"అవునుకా... ఆ యెతిమతం పెళ్ళాంతో ఆయన్న యేం సుకపడ్డాడనీ. బంగారమ్మ ఇల్లేగాన లేకుండా ఉణ్ణుంటే యెప్పుడో ఆ మనిషికీ మైండు చెడి పొయ్యుండేది," అనింది మా అమ్మ.

"కరణాన్ని అడ్డంబెట్టుకోని ఊళ్ళో వాళ్ళంతా మిట్టల మింద పట్టాలు జేసుకున్నారు గదా... ఈ యమ్మంత సేవజేసీ జానెడు నేల గూడా ఆసించలేదు గదమే..." అని మా మిద్దింటత్త.

"బంగారమ్మని నమ్ముకుని బాగుపడ్డోళ్ళేగానీ, ఆ యమ్మ యెవుర్నీ నమ్ముకుని బతకలా... యేనాడూ యెవురి కష్టానికీ ఆసి పడలా... యేదో తనకు కలిగిందే తినింది. వొకరికి పెట్టింది," అనింది మా అమ్మ.

"మన మాదిరిగా బిడ్డలా సంసారమా... ఇష్టమయితే ఒండుకుంటాది. కష్టమయితే నీళ్ళు తాగి పొణుకుంటాది. మొగుడనీ, అత్తనీ, ఆడబిడ్డనీ లేకపాయ... బాదా... బందమా...? బయమా... బిత్తరా...? మనమూ బతకతా వుండాం గూటానికి గట్టిన బరిగొడ్ల మాదిరిగా...?" మా మిద్దింటత్త కళ్ళలో దిగులు.

"ఆకాసంలో యెగిరే పచ్చి మాదిరి గదా బంగారమ్మ బతికింది" అనింది హఠాత్తుగా.

"ఆ మాదిరిగా బతికిన మనిషి అనావసింగా ప్రేణాలు తీసుకునేసినే..." మా అమ్మ కంఠంలో కన్నీళ్ళు ధ్వనించాయి.

"అకా పిలస్తా వుండారు. పేటకి సావు సామానుకి బొయినోళ్ళు గూడా వొచ్చేసినారు. జంగమాయన వాకిట్లో కుచ్చోనుండారు. పదండి, బిన్నా..." అంటా వచ్చి తొందరపెట్టింది చెంగమ్మ.

పల్లె రామయ్య, కుప్పయ్య ఎంట్లు పేనుతున్నారు. మస్తాన్, వెంకటయ్య వెదురు బొంగులతో పాడె కడుతున్నారు. జంగమాయన శంకు ఊదుతూ గంట వాయిస్తున్నాడు. వీధిలో రాళ్ళ పొయ్యి మీద పిండానికి అన్నం ఉడకేస్తున్నారు. గాలి ఉబ్బదీసింది. లోపలా బయటా ఉక్కపోతగా ఉంది. సందు మొగదలలోకి వచ్చి నిలబడ్డాను.

"అబయా... రా... కూకో..." అంటూ పలకరించింది మస్తానమ్మ.

పూరింటి ముందు తాటాకు పందిరి కింద మస్తానమ్మ ఇడ్లీలు కాలుస్తోంది. నులకమంచం వాల్చింది. కూర్చున్నాను.

"వాళ్ళ చేతుల్లో పుండుబడా... బంగారంటి మనిషిని వాళ్ళ యెదాన పెట్టుకున్నారే..." అనింది.

చేతులు తడుపుకుని ఇడ్లీగిన్నెల మీది గుడ్డల్ని తీసి ఇడ్లీలను ఒక గిన్నెలోకి వేసింది.

"ఆ నా బట్టల్ని అని యేమి లాబం... ఊళ్ళో ఈ సవితీలూ అట్నే బడి బతకతా వుణ్ణే..."

మస్తానమ్మ ఉద్దేశిస్తున్నది ఎవర్నో సరిగా అర్థంకాలేదు. ఆమె మాత్రం ఇదేమీ పట్టనట్టుగా గిన్నెల మీద గుడ్డలు పరిచి పిండిపోసి దబరలో ఒకదానిమీద ఒకటి పెట్టి మూతలేసింది. పొయ్యి లోకి మంట ఎగదోసి నావైపుకి తిరిగింది.

"అబయా... వొకీదిలో వొక కులంలో వున్నంత మాత్రాన అందురూ ఒకే మాదిరిగా బతకతా ఉండారా... మంచేదో సెబ్బరేదో తెలుసుకోబళ్ళా...?" అనింది.

"ఏం జరిగింది... కా" అన్నాను నేను.

"ఇంకేం జరగతాది... ఊళ్ళో ఈ సవితులు మానంలేని బతుకు బతకబట్టి గదా అందురికీ అగమానాలు... మనీదిలో మొగ పిలకాయలంతా నిదర లేస్తే పేటకి బొయ్యి పనీపాటా చేసుకోని బతికేటోళ్ళే అయిపాయ. 'మీ ఊళ్ళో అట్టంటనే... మీ ఊళ్ళో ఇట్టంటనే...' అని బజార్లో ఈళ్ళని బట్టుకోని అడగతా ఉంటే ఎంత బైసాట్లు...? కూలో నాలో చేసుకునేదానికి ఒళ్ళు బరువు ఈ రందిబట్టిన ఆడముండలకి... ఈ మాదిరిగా ఒళ్ళమ్ముకోని బతికేదానికి మాత్రం సిగ్గా సెరమూ లేదు."

నాకు కొంత అర్థమైంది.

"ఇది ముందు కాలంగాదు. ఊరమ్మిడ సబ్‌టేసన్ బెట్టిన కాడ్నించీ ఊరు మారిపాయ. యాడాడోళ్ళో వొచ్చి చేరిపోతిరి. అయిసు ఫ్యాక్టరీ అంట... స్టీలు ఫ్యాక్టరీ అంట... ఇంకా యేమేమో మిట్టల మింద బెట్తిరి. ఊరు పెరిగిపాయ. ఒక పెద్దనీ ఒక చిన్ననీ లేదు. రాజికీయాలంట, పార్టీ లంట... ఒకటే యవ్వారాలు... పోలీసులొచ్చేది, ఈళ్ళనీ వాళ్ళనీ ఇరగదన్నేది... ఊళ్ళోకి పోలీసు లొచ్చేది మొదులు పెట్నాక రచ్చలు గూడా పెరిగిపాయినాయి," అని చెప్పింది మస్తానమ్మ.

ఉద్యోగం మీద ఊరొదిలిన నాకు ఊరు మారుతున్న తీరు బాగానే తెలుసు. కొత్త ముఖాలు... కొత్త ఇళ్ళూ... కొత్త సమస్యలు... రోజురోజుకీ ఊరు పరాయిదవుతోంది. ఊరికి వచ్చే ప్రతిసారీ వొంటేప చెట్టు నాకు స్వాంతన ఇచ్చేది. వొంటేప చెట్టు కింద కూర్చుని కబుర్లు చెప్పుకునే మనుషులు ఎప్పుడూ ఉండేవాళ్ళు. చెట్టు కింద కాసేపు ఆగి వాళ్ళతో మాటలు కలిపి వాళ్ళతో కలిసి ఊళ్ళోకి నడవడం హాయిగా ఉండేది.

"అబయ్యా... ఏదో కడుపాత్రమేగానీ... కొవ్వుబట్టి కాదుగదా. వాళ్ళు గూడా ఈ వుర్తిలోకి దిగింది. బూములు బావులుండాయా, నౌకిరీలు చాకిరీలుండాయా యెట్ట బతకాల... అయినా ఆ ఇండ్లల్లో ఆడపిలకాయల్ని గుట్టుగా బతకనిస్తా ఉండారా సోదా పిలకాయలు... ఈదిలోకి లాగతా వుణ్ణే... ఈ నా బట్టలు ఇట్టుంటే, ఆ పోలీసోళ్ళొకరు... వోళ్ళకి దుడ్లుగావాల్సొచ్చినపుడంతా ఈడకొచ్చి వీళ్ళ మింద పడేది. అగుడయిపోతా వుళ్ళా... అదట్టబోనీ... ఆ సవితిలు అన్నింటికీ తెగించినాయి. మానంగా బతికేటోళ్ళ నయినా వాళ్ళ మానాన వాళ్ళని బతకనిస్తా ఉండారా..." అని మస్తానమ్మ ఆగింది. మోకాళ్ళ మీద చేతులు పెట్టుకొని గొంతు కూర్చోనుంది. ఖణఖణ మండుతున్న పొయ్యిలోకి తదేకంగా చూస్తోంది. ఆ ఊదారంగు జ్వాలల ప్రతిఫలనం మస్తానమ్మ ముఖం మీద కదలాడుతోంది. ఒక దీర్ఘ నిట్టూర్పు విడిచి మళ్ళీ ప్రారంభించింది.

"మొన్నటి దినాన కొత్త యస్సై అంట... ఒచ్చీ రాంగానే, జీపునిండా పోలీసోళ్ళని యేసుకో నొచ్చి ఊరిమింద బడ్డాడు. మనీదిలో ఒక్కిల్లూ ఒదల్లా... ఇళ్ళల్లో దూరి నానా గాబరా చేసినారు. బోకులు బాకులు పగలనూకినారు. ఇళ్ళల్లో ఉండే వొయిసు ఆడపిలకాయల్నంతా జుట్లు బట్టుకోని లాక్కపొయ్యి జీపెక్కించినారు. చేతులు బట్టుకుంటే ఇన్నారా... కాళ్ళు బట్టుకుంటే

ఇన్నారా... మొగపిలకాయలంతా పన్లకు బొయ్యుంటిరి... బోగమీది ఆడోళ్ళ మింద దౌర్జిన్నెం జేస్తా వుంటే ఊళ్ళో ఒక్కరైనా ఇదేం గోరం అని అడిగినారా, అడ్డాం బడినారా... బంగారమ్మ మాత్రం నేరుగా పోలీసోళ్ళ దెగ్గిరికొచ్చింది. యేందిదీ... ఈ పని చేసేదానికి మీకు అధార్టీ ఉండాదా... అనడిగింది. అంతేనబయా... 'యెవుర్రా ఇదీ...' అంటూ జీపులో నుండి యస్సై దూకినాడు. బంగారమ్మ జుట్టు బట్టుకోని దబీదబీమని గుద్దినాడు. యాడే... నీ కంపెనీ... పదా... అంటా ఆయమ్మ ఇంటికి లాక్కపొయ్యి కుండా సట్టీ పగలగొట్టి నాసినం బట్టిచ్చినాడు. 'నీ కంపెనీలో చానామంది అమ్మాయిలుండారంట గదే... యాడ దాచిపెట్టినావే...' అంటా కొట్టినాడు. నడిరోడ్లో ఆ యమ్మ కోక లాగేసి గోరంగా మాట్లాడినాడు. ముందు ఆయమ్మ తిరగబడింది. యిదిలిచ్చుకు నింది. మీ అంతు జూస్తా... మిమ్మల్ని కోరట్టు కీడస్తా అనింది. అరిచింది. అగిత్తెం జేసింది. పచ్చి నెతురుదాగే వోళ్ళ మాదిరిగా ఉండారు ఆ నా బట్టలు... ఆడమనిషి అని గూడా జూడకుండా వొక్కమనిషి మిందకి అందురూ మల్లుకుంటిరి.'' ఆ గాయాల జ్ఞాపకాలు మస్తానమ్మని ఇంకా సలుపుతూనే ఉన్నాయి. ఆమె ముఖంలో, ఆమె గొంతులో అవి ధ్వనిస్తున్నాయి.

''ఆ దినం బంగారమ్మతో పాటు అందర్నీ చేతులకి గొలుసులు యేసి కట్టి ఈదల్లో ఈడ్చుకుంటా తీసకపాయినారు. మరసటి దినం కోరట్లో పెట్టినారు. అపరాదం యేసి ఇడిసిపెట్టి నారు. ఆ దినం మనీదిలో ప్రతి ఇంట్లో గూడా పీనిగ లేసినట్టే అయిపాయి. కాలేజీకి బొయ్యి అయిస్కూలుకి బొయ్యి చదువుకుంటా ఉండే ఆడపిలకాయల్నంతా ఆమాదిరిగా ఈదల్లో బెత్తే రేపు మరసటికి ఆ బిడ్డల బతుకేం గావాల. యేం గాచ్చారం ఇది. బోగం కులంలో బుట్టినామని కడంతకాలం ఈ పాపం మొయ్యాల్సిందేనంటావా...?'' అని ఆగ్రహస్వరంతో ప్రశ్నించింది మస్తానమ్మ.

''బంగారమ్మ అందరితోపాటు ఇంటికొచ్చింది. ఒక్క మనిషితో మాట్లాడలా... మొహం నల్లంగ బెట్టుకునింది. నీళ్ళు తాగమంటే తాగదు. నాలుగు మెతుకులు తినమంటే తినదు. కోరట్టుకాడి నుంచి వస్తానే అందురూ ఏడుపులూ శాపనార్థాలుగా ఉంటే ఆయమ్మ మాత్రం మాటాపలుకూ లేదు. మన లోకంలోనే లేదనుకో... మనుసు కష్టపెట్టుకునేసింది. అప్పిటికీ మీయమ్మ యెంతో బతిమాలింది. బంగపడింది. ఇంటికి పోదాం రా అని పిలిచింది. కదల్లేదు. అన్నందెచ్చి పెట్టింది. తినలేదు. ఎండపూట తలుపులేసుకోని ఇంట్లోనే ఉణ్ణింది. కొంచేపు పొణుకోని సమాళిచ్చుకోనీ అనుకున్నాం అందురుం. అంత గుండెదైర్నెం గలిగిన మనిషి. ఊళ్ళో ఎవురికి ఏ కష్టమొచ్చినా ఏ ఆపదొచ్చినా నేనుళ్ళా అంటా బొయ్యే మనిషి... ఇంత పనికి తెగిస్తాదని ఎవురూ అనుకోలా...సందేళకాడ పెళ్ళోకి బొయ్యింది. బాయిలే దూకేసింది.'' ఇడ్లీలు ఉడుకుతున్న ఆవిరి శబ్దం తప్ప అక్కడ ఇంకేమీ వినిపించలేదు. భారమైన మౌనం కొంతసేపు మా ఇద్దరి మధ్యా దు:ఖాన్ని పెంచింది.

''అబయా... ఇన్నేళ్ళుగా ఊళ్ళో ఏనాడన్నా ఒక మాటపడిందా... ఒక తిట్టు తినిందా...? బోగంకులంలో పుట్టినా బంగారంగానే బతికింది. బలిజీది ఆడోళ్ళు కూడా ఇంటికి పిలిచి కోకా రైకా పెట్టినోళ్ళేగానీ ఛీపో అన్నవాళ్ళు లేరు... మాయదారి కాలం... వాళ్ళకి వాంతీ బేదీ తగలా... యెట్టాంటి మనిషిని ఈ గెతి జేసినారు.''

కల...

అరుపులు... కేకలు... పరుగులు... ఇళ్ళలోంచి... తోటల్లోంచి... మగ్గాల్లోంచి... మడుగు ల్లోంచి... జనం... ఆడవాళ్ళు... మగవాళ్ళు... పిల్లలు... పెద్దలు... ఒకటే జనం... ఒకటే పరుగు...

తార్రోడ్డుని చీల్చుకోని వొంటేపచెట్టు మళ్ళీ మొలిచిందంట. చెంగాళమ్మ మహిమ...

ఆశ్చర్యం... అద్భుతం... విచిత్రం...

నీళ్ళెండిన ఉప్పుకయ్యలా నల్లని తార్రోడ్డు మీద పగుళ్ళు... పగుళ్ళ మధ్యలోంచి పొడుచుకొచ్చిన గజమెత్తు వేపమొక్క. ఆకులు... రెమ్మలు... బుల్లికొమ్మలు... జనం... జనం... జనం... భయంతో జనం... భక్తితో జనం... సంతోషంతో జనం... సంబరంగా జనం...

'ఓ యమ్మో... ఈడ జూడు...' ఒక వెర్రి కేక. అంతా అటుకేసి...

నల్ల పత్తిపువ్వులా విచ్చుకుంటున్న తార్రోడ్డు... ఉబ్బెత్తుగా పగిలి విచ్చుకుంటున్న తారు రోడ్డులోంచి మొలుచుకొస్తున్న పచ్చని వేపమొక్క...

'ఇద్దో... ఇక్కడ...', 'అద్దో... అక్కడ...', 'ఎక్కడ...' 'ఇక్కడ...' ఎటు చూసినా పెళపెళా పగిలి విచ్చుకుంటున్న రోడ్డు... సరసరా పైకెదుగుతున్న వేపమొక్కలు... నల్లని రోడ్డును మటుమాయం చేస్తూ పచ్చని మొక్కలు... చిక్కని అడివి... చల్లనిగాలి... నీలాకాశంలో రెక్కలల్లారుస్తూ ఎగిరొచ్చిన నల్ల మబ్బుతునకలు... టప్... టప్... టప్... చినుకులు... వాన... తుంపర... గాలి... కుండపోత...

'తల్లీ... చెంగాళమ్మా... దణ్ణం...'

'కి ల్ల...ల్ల...ల్ల...ల్ల...ల్లా...ల్లా...ల్లా...' కిలారింపులు... మోగుతున్న పలకలు... అరుపులు... కేకలు...

*

అరుపులు... కేకలు... గోల...రచ్చ...

ఇంకా కలలోకి లాగుతున్న నిద్ర... మత్తు... మగత...

"రాజమ్మా... కోనేటి కట్టమింద ఏంది రచ్చగా ఉండాది...?"

"చిట్టెక్కా... తెలీదా... కుంటి రంగయ్య పెళ్ళాం వాణ్ణి ఎగిసెగిసి తంతా ఉండాది. ఊరంతా వేడుక జూస్తా ఉండారనుకో... అమ్మా అయ్యా అంటా నా బట్ట అరస్తా ఉండాడు. అడ్డాంబడి ఒద్దు మే... అని ఒక్కరన్నా అంటే జూడు... ఈ దినానికి పండింది వోడి పాపం. వొకిదంగానా వాడు బాద బెట్టుండేది ఆ యమ్మిని... తన్నని దినముండాదా, తిట్టని తిట్టుండాదా... సీతమ్మోరి మాదిరిగా బరించింది ఇన్ని సమచ్చరాలు... పొద్దన్నే లేసి వాకిట్లో గూకోని, ఆ యమ్మి దొడ్డికి బోతా ఉంటే, 'పోతా ఉండావే పొద్దన్నే మిండగాడి దెగ్గిరికి,' అనన్నాడంట... ఇంకనంతే, చెంబుడు నీళ్ళు వాడి నెత్తిన పోసేసి ఈడ్చీడ్చి తన్నిందంట... పోరా నా కొడకా... నా మానాన నేను బతకతాను... అనేసిందంట."

"యేమ్మే... బంగారమ్మ గాన పూనిందంటమే ఆ యమ్మికి... అంత దైర్నం ఒచ్చింది."

చల్లటి వేపగాలి... టపీమని వేప పండొకటి నుదుటి మీద రాలింది. లేసి నిలుచున్నాను. ఎదురుగా పచ్చని వేపకొమ్మల వెనుక గావురంగు ఆకాశం... ఆహ్లాదంగా ఉంది.

"అబయా... గూట్లో పేస్టుండాది పొళ్ళు దోముకోని రాబో... టీ బెడ్తా..."

"ఇప్పుడే వొద్దులే మా... యేటిదాకా పొయ్యొస్తా..." అని వేపపుల్ల ఒకటి యిరిచి నోట్లో వేసుకుని బయలుదేరాను. బంగారమ్మని దహనం చేసిన చోటికి.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*24 అక్టోబర్ 2004*

నేపథ్యం

మన్నారుసామి సాక్షిగా...

# వొంటేపమాను

***చెంచేలమ్మ ఒంటరి స్త్రీ కాదు, ఒంటరిగా జీవించిన స్త్రీ. నీతి, చట్టం, సంస్కరణల పేరుతో దురన్యాయానికి బలైన ఒక సమూహానికి ప్రతినిధి. స్వతంత్ర జీవితానికి చెంచేలమ్మ ఒక ప్రతీక. ఆమె ఒక స్వేచ్ఛ. ఒక కళ. గీసిన గీతల మధ్య ఇరుకు నడకలు సాధ్యం కాని మహిళ. గూటికి బందీ కాని పిట్ట.***

మా ఊరి ఏటి గట్టున ఇటుకలు తేలిన చిన్న గుడి. చెల్లెమ్మ గుడి. గుడి ముందు రెండు సమాధులు. వానకి కరిగి, వరద రాపిడికి ఒరిగి నిలబడ్డ ఈ రెండు రాళ్ళూ ఇద్దరు అక్క చెల్లెళ్ళ సమాధులు. ఈ అక్క చెల్లెళ్ళు ఎవరో, ఏ కాలంవారో, ఈ గుడి ఎప్పటిదో తెలీదు. చెప్పే వాళ్ళెవరూ మిగిలి లేరు. ఏటికి అవతల కాటన్‌మిల్లు. రాత్రి డ్యూటీలకు వెళ్ళే వాళ్ళూ, వచ్చే వాళ్లూ చెల్లెమ్మ గుడి ముందు క్షణం ఆగి, కుడి చేతిని గుండెలకు ఆనించుకుని దణ్ణం పెట్టుకుని కదులుతారు. చీకటి కమ్ముకున్నాక ఆ దారిలో నడుస్తూ ఉంటే గుండెలు దడదడా కొట్టుకుంటూ ఉంటాయి. తల విరబోసు కున్నట్టుండే వీద్దేవుడి రాగిమాను. పక్కనే కాపేసిన ఎలుంగొడ్డులా అశోకచెట్టు. ధైర్యం కూడగట్టుకుని డొంకలోకి దిగాలి. స్మశానంలోంచి నడక. బాటకి అటూ ఇటూ పీనిగ మిట్టలు, ఎండిన పూలమాలలు, ప్రవాహంలో బయటపడ్డ ఎముకలు. గుండెలు అవిసిపోయి, జంకిపోయే వేళ... 'అబయా.. ఏం భయం లా.. నేనుండా.. పద,' అని ధైర్యం చెబుతుంది చెల్లెమ్మ. మా ఊరికి చెల్లెమ్మ ఒక భరోసా. ఒక ధైర్యం. ఒక దేవత.

మా అమ్మమ్మ పేరు చిన చెల్లెమ్మ. పిలుపులో చెంచేలమ్మగా మారిపోయింది. చెంచేలమ్మ, మా అమ్మకి అమ్మ కాదు, పెద్దమ్మ. మా అమ్మకి అమ్మ పేరు చెంచు రత్న. మహా రాక్షసి, ఆ నోటికి ఎవరూ పోలేరంట. నేను పుట్టకముందే వెళ్ళిపోయింది. మా నాయనమ్మ కూడా అంతే, తొందరపడింది. మా నాయనమ్మ పేరు కమలాక్షి.

బ్రహ్మ రాక్షసి. వాకిట్లో నిలబడి కోక ఎగ్గట్టిందంటే, వీధి వీధంతా ఖాళీ. ఆమె నోటికి జడిసి ఇళ్ళలో దూరి తలుపులేసుకునేవాళ్ళంట. నోరుగల్ల ఇద్దరు అవ్వల్నీ పుట్టక ముందే పోగొట్టు కున్నాను నేను. తాతలు ఎలాగూ లేరు. ఇక మిగిలింది మా చెంచేలమ్మే. మా ఇల్లు పల్లె వీధిలో. చెంచే లమ్మమ్మ ఉండేది మన్నారుసామి గుడి ఉండే బ్రాహ్మణవీధిలో. నాటు పెంకుటిల్లు. వాలుగా ఆనుకోడానికి వీలుగా ఉండే విశాలమైన రెండు తిన్నెలు. నట్టింట్లో ఉయ్యాల బల్ల. నిట్టాడి గుంజ దిమ్మె మీద మందుల సీసాల మధ్యన కర్ణాటక సంగీతం వినిపించే మర్ఫీ రేడియో. పడమటి గోడ మీద తంజావూరు అద్దాలపటంలో గోపికల మధ్యన కృష్ణుడు. ఉత్తరపు దిక్కున చెదలు తినేసిన కొయ్య కిటికీ. కిటికీ కింద పాత భోషాణం పెట్టె. పెట్టె పక్కనే గోడ మీద దేవుడి పటాల కింద చెక్క స్టాండు. స్టాండు మీద వెలుగుతున్న నూనె దీపాలు. ఇంటిని మూడో వంతు విభజిస్తూ ఒక గది. ఆ గదిలో బొగ్గుల కుంపటి. చిన్న ట్రంకుపెట్టె. తాడు మీద వేలాడుతూ విడిచిన గుడ్డలు. అప్పుడే అలికిన పేడ వాసనతో ఇల్లంతా గుబాళిస్తూ ఉండేది. ఇంటి వెనుక పడి మొలిచిన సీతా ఫలం చెట్టు. వగరుగా, జిడ్డుగా సీతాఫలం మొగ్గలు భలే వుండేవి తింటే. పసుపుదేలిన కాయలతో విరగ్గాసిన కిచ్చిలిచెట్టు, జామచెట్టు నిండా పిందెలు, కనకాంబరం మొక్కలు, కాగడా, చంద్రాయి పూలచెట్లు, పాత వెదురుబుట్టల్లో టేబుల్ రోజాలు. ఆ చెట్ల మధ్యన నల్ల బండరాళ్ళ బొడ్డున్న ఒంటి గిలకబావి. మా చెంచేలమ్మమ్మ ఇల్లు, మన్నారుసామి గుడిలాగా చల్లగా ఉండేది. ఒంటేలు గంట కొట్టగానే బడి పిలకాయలంతా సార్నవ్వ అంగడికి పరుగులు తీసేవాళ్ళు. నేనూ, మా అక్కా మాత్రం చెంచేలమ్మ ఇంటికి చేరేవాళ్ళం. పొద్దున మిగిలిన ఉప్మానో, చక్కెర పాకంలో నానేసిన నెల్లికాయలో, కనీసం బెల్లం ముక్కో దొరికేది. అమ్మ మీదో, నాయన మీదో అలిగిన వేళ మాకో చల్లని విడిది ఆ ఇల్లు. తెల్లని ఒళ్ళు, నుదుట పెద్ద బొట్టు, పొడవాటి ముక్కు, ముఖాన చెదరని చిరునవ్వు, హాయిగా ఉండేది ఆమెని చూడగానే. మాకే కాదు, ఎండపూట ఊళ్ళో చాలామందికి చల్లని నీడనిచ్చేది ఆ ఇల్లు. ఊరి పెద్దలతో సమానంగా తిన్నెమీద దర్పంగా కూర్చుని ఆమె మాట్లాడేది. త్యాగరాజ కీర్తనలూ, సుబ్బులక్ష్మీ, పట్టమ్మాళ్, ఇందిరాగాంధీ... ఇలా మాకు తెలీని, అర్థంకాని మాటలేవో దొర్లేవి వాళ్ళ మాటల్లో. ఊరి పెద్దలంతా గౌరవించే మా చెంచేలమ్మ అంటే మా నాయనకి మాత్రం ఎందుకు పడేదికాదో అర్థం అయ్యేది కాదు మాకు. ఉరి పెద్దలతో ఆమె స్నేహం మా నాయనకి నచ్చేది కాదని మాత్రం అర్థం అయ్యేది. ఈ స్నేహాన్ని ఒక అవమానంగా ఆయన భావించేవాడు. ఆమె కనిపించినా, ఆమె మాట వినిపించినా చిరచిరలాడేవాడు. ఎప్పుడైనా తప్పనిసరి అయి మాట్లాడాల్సి వచ్చినా, గోడని చూస్తూ ఆమెతో మాట్లాడేవాడు. ఆమె కూడా మా నాయనని ఎదిరించి మాట్లాడేది కాదు. తల వంచుకుని మారు మాటాడకుండా తప్పుకునేది. మా అమ్మ మాత్రం పెదమ్మతో ప్రేమగానే ఉండేది. అయితే, పెనవేసుకున్నట్టుగా మాత్రం ఉండేది కాదు వాళ్ళ అనుబంధం. మంచి కూర ఏది చేసినా మా అమ్మ కోసం తెచ్చి ఇచ్చేది. మా అమ్మ కూడా అంతే, గిన్నె మా చేతికిచ్చి, 'మీ నాయన చూడకుండా అమ్మమ్మకి ఇచ్చేసి రండి,' అనేది. మా నాయనమ్మ తద్దినం రోజు మాత్రం భోజనానికి ఆమె మా ఇంటికి వచ్చేది. చీటికి మాటికి 'చెన్నపట్నం పోతున్నా' అంటూ బయలుదేరేది. కోర్టు కేసుల గురించి మాట్లాడేది. ఊళ్ళో చాలామందికి అవసరానికి చేబదుళ్ళిచ్చేది. తినాలనుకున్న తిండి తినేది. వినాలనుకున్న పాట వినేది. మాట్లాడలనుకున్న మాట మాట్లాడేది. వెళ్ళాలనుకున్న చోటుకి వెళ్ళేది.

నేను ఇంటర్ చదువుకుంటున్న రోజుల్లో ఒక తుఫాను రాత్రి ఈదురుగాలిలా వచ్చింది మా చెంచేలమ్మమ్మ, 'కడుపు నొప్పి భరించలేకపోతున్నా,' అంటూ. కాలి బూడిదగా మారిన పిడకను

బొడ్డు మీద పెట్టి నీళ్ళు చల్లి సేదతీర్చింది అమ్మ. అప్పటి నుంచీ తరచూ, 'కడుపునొప్పి, మెడ్రాసు పెద్దాసుపత్రికి తీసకుపొండి. ఆపరేషన్ చెయ్యించండి,' అనేది. అప్పటికే రెండుసార్లు ఒంటరిగా మద్రాసు వెళ్ళి ఆపరేషన్‌లు చేయించుకు వచ్చింది. 'కడుపునొప్పీ లేదు, ఏమీలేదు. ఊరికే ఆగిత్తె మంతా చేస్తా ఉంది,' అని మా నాయన విసుక్కునేవాడు. అమ్మ వైద్యంతో ప్రతిసారీ ఆమెకి నెమ్మ దించేది. మాతో కలిసి తిని, కబుర్లు చెప్పి వెళ్ళిపోయేది. ఏడాదిపాటు ఇలాగే గడిచింది. అనారోగ్యం చెంచేలమ్మ మనసుని కమ్మేసింది. విసుగూ, చిరాకూ, కోపం ఆమె ముఖంలో కనిపించడం మొద లయ్యాయి. 'బేదుల కోసం జక్కలోళ్ళ మైనం మాత్రలు తిన్నా. నాకు చారన్నం కలిపియ్యి,' అంటూ ఒక సాయంత్రం వచ్చింది. మా అక్క చారన్నం పిసికిచ్చింది. తాగి బ్రేవ్‌మని తేన్చి, 'ఈ కడుపునొప్పితో ఇంక నా వల్లగాదమ్మే. నేను చచ్చిపోతా. నాకు దుడ్లు ఇయ్యాల్సినోళ్ళ పేర్లు చెబుతా రాసుకో,' అనింది. 'ఏం నోరది..ఎప్పుడూ చావు మాటేనా,' అని మా అక్క తిట్టింది. 'చచ్చేవాళ్ళెప్పుడూ చెప్పి చావరు పో,' అని మా బాచన్న కసురుకున్నాడు. తుపానుగాలికి ఆకులు, రెమ్మలు రాలిపోయిన ఒంటరిచెట్టులా వెళ్ళిపోయింది మా చెంచేలమ్మమ్మ. తెల్లవారకముందే వచ్చి తలుపు తట్టింది. 'ఇదే ఆకరు. ఇంకన బతకను. మే గజమ్మా కాయితం తీసుకో ముందు నేను చెప్పింది రాసుకో,' అని మా అక్కను గద్దించింది. 'ఇతండం..మాటినదు,' అంటా లేచింది మా అక్క. ఇంకో నెలలో మా అక్క పెళ్ళి. మూలన పసుపు అద్దిన పెళ్ళిపత్రికలున్నాయి. ఒక పత్రిక తీసుకుని వెనుకపక్క ఆమె చెప్పిన జాబితా రాసుకుంది మా అక్క. అంతా ముప్పయి, యాభై, వంద తీసుకున్నవాళ్లు. 'మే నేను పొయ్యాక ఇల్లు నీదే,' అనింది. 'అబయా ఈ ఉంగరం నీకు,' అంటా చేతి వేలికున్న ఉంగరం తీయబోయింది. 'నీ ఉంగరమూ వద్దూ, నువ్వూ వద్దు. ముందు ఇంటికి పొయ్యి పొణుకో పో,' అని కయ్యిన లేశాను నేను. విసురుగా ఉంగరం తీసి నా మీదకి విసిరేసి, 'తీసుకుంటావో తీసుకోవో నీ ఇష్టం,' అనేసి విసవిసా వెళ్ళిపోయింది. శెట్టెమ్మ అంగడికాడికి పొయ్యి, ఇవ్వాల్సిన చిల్లర ఇచ్చేసింది. కరణం ఇంటికి పొయ్యింది. 'మునిరామయ్యా మన స్నేహం అయిపొయ్యింది. నేనింక బతకను,' అనింది. ఏడాదిగా మాట్లాడుతున్న మాటలే కదా అని అందరూ విసుక్కున్నారు. వినీ విననట్టుగా ఉండిపొయ్యారు.

కాసేపటికి, 'చెంచేలమ్మ బాయిలో పడిపొయ్యిందమ్మే,' అంటా గుండెలు బాదుకుంటా ఎవరో పరుగెత్తుకు వచ్చారు.

డిగ్రీ సెకండియర్ పరీక్షలు పూర్తయ్యాయి. స్నేహితులు కొందరం కలిసి సిద్దలయ్యకోనకి వెళ్ళాం. మంచి ఎండల కాలం. కాలువలో ఈదులాడాం. చీకటి పడకముందే తిరిగి బయలుదేరాం. అడవిలో కొంత దూరం వచ్చాక చూసుకుంటే, నా వేలికి ఉంగరం లేదు. సత్తులు పడి నలిగిన తెల్లరాయి ఉంగరం. బంగారు ఉంగరం. మా చెంచేలమ్మమ్మ వెళ్ళిపోయే ముందు నా మీదకి విసిరేసిన ఉంగరం. ఎందుకో చాలా వెలితిగా అనిపించింది. పారేసుకున్నాననే బాధ. పోగొట్టుకున్న దుఃఖం. ఈదులాడిన చోట వెతికి చూద్దాం అన్నారు స్నేహితులు. పారే కాలువలో పడిపోయిన ఉంగరం తిరిగి దొరుకుతుందా? వెనక్కి నడిచాం. ఎండ పడమటికి వాలుతోంది. మామిడిచెట్టు దగ్గర లోతైన ప్రాంతంలో ఈత కొట్టిన చోట అందరం మళ్ళీ దిగాం. కళ్ళు తెరిచి నీళ్ళ మీద నుంచి లోపలకి వెతుకుతున్నాను. తళుక్కున చిరు మెరుపు. ఊపిరి బిగబట్టి లోపలకి మునిగాను. తెల్ల బండరాళ్ళ నడుమ ఇరుక్కుని భద్రంగా ఉంది తెల్లరాయి ఉంగరం. గొప్ప ఆనందం. ఎగురు కుంటూ వచ్చేశాం. కాలేజీ తెరిచారు. ఫైనల్ ఇయర్ పుస్తకాలు కొనాలి. డబ్బుల్లేవు. అన్నని అడగ డానికి అహం అడ్డొచ్చింది. ఉన్నదొక్కటే, తెల్లరాయి సత్తు ఉంగరం. మా పెద్దన్నకి ఇచ్చి అమ్మెయ్య

మన్నాను. ఐదారొందలు వచ్చాయి. పుస్తకాలు, జత కొత్త బట్టలు. డిగ్రీ పూర్తయింది. పత్రికల్లో ఉద్యోగం. కవిత్వం, కథలు, పుస్తకాలు, స్నేహితులు, మాటలే మాటలు. కొత్త ప్రపంచంలో త్రిపురనేని శ్రీనివాస్, సౌదా, నామినిల ప్రభావం. వార్తలు, వ్యాసాల్లోంచి కథల్లోకి ప్రయాణం. ఈ ప్రయాణంలో మా ఊరు అపురూపంగా కనిపించేది. ఉద్యోగంలో ఊరికి దూరమయ్యేకొద్దీ ఊరి మీద ప్రేమా పెరిగేది. ఊళ్ళోని ప్రతి చోటూ, ప్రతి మనిషీ పదేపదే గుర్తొచ్చేవాళ్ళు. దూరమైన వాళ్ళూ, దూరమవు తున్న వాళ్ళ కోసం వెతుకులాట మొదలైంది. ఈ వెతుకులాటలో నా తలపుల్లోకి వచ్చిన ప్రతిసారీ నేను తప్పించేసుకు తిరిగిన మనిషి మా చెంచేలమ్మ. నేను తప్పించుకున్న ప్రతిసారీ మరింతగా నన్ను వెంటాడేది ఆమె. ఊరికి వెళ్ళినపుడు ఇంట్లో అరుదుగానే, ఆమె ప్రస్తావన వచ్చినా ఎందుకో లోపలెక్కడో గుచ్చుకున్నట్టుగా ఉండేది. కథలకోసం ఊళ్ళోకి ఆలోచనలు పరుగులు తీసిన ప్రతిసారీ చెంచేలమ్మ పలకరించేది. కథల్లో పాత్రల్ని మలచుకోవడానికి నాకు దగ్గరగా ఉన్న మనుషుల నుంచి వాళ్ళ స్వభావాలనీ, వాళ్ళ ప్రవర్తననీ, వాళ్ళ మాటల్నీ, వాళ్ళ హావభావాలనీ దొంగలించే ప్రతిసారీ కూడా మా చెంచేలమ్మమ్మ నేనూ ఉన్నానంటూ ఎదుట నిలిచేది. దాటి వెళ్ళిపోయినా ఆగదు. ఏ మూల దాక్కున్నా ప్రత్యక్షమవుతుంది. ఈ ఆట ఇక సాగదని తేలిపోయింది. ఇరవైయేళ్ల దోబూచులాట, దొంగాట. 2003లో చెంచేలమ్మ కథ రాయాలని అనుకున్నాను.

ఎందుకు రాయాలి? ఏం రాయాలి? కథలో పీటేసుకు కూర్చోడానికి అమెకున్న అర్హత ఏమిటి?

చెంచేలమ్మ ఒంటరి స్త్రీ కాదు, ఒంటరిగా జీవించిన స్త్రీ. నీతి, చట్టం, సంస్కరణల పేరుతో దురన్యాయానికి బలైన ఒక సమూహానికి ప్రతినిధి. స్వతంత్ర జీవితానికి చెంచేలమ్మ ఒక ప్రతీక. ఆమె ఒక స్వేచ్ఛ. ఒక కళ. గీసిన గీతల మధ్య ఇరుకు నడకలు సాధ్యం కాని మహిళ. గూటికి బందీకాని పిట్ట. చెంచేలమ్మ, ఉమామహేశ్వరరావుని కన్న చిట్టెమ్మకి పెద్దమ్మ మాత్రమే కాదు అని అనుకున్నాక కథ రాయడానికి ధైర్యం వచ్చింది. దారి దొరికింది. ఆ దారిలో ప్రయాణిస్తుంటే, చెంచేలమ్మలు చాలామందే కనిపించారు. పలకరిస్తూ ప్రయాణించాను. ఒక్కొక్కరిదీ ఒక్కో వ్యథ. భిన్నమైన కథలు. కలిపి చూస్తే కనిపించే దారం ఒక్కటే. దారం పట్టుకుంటూ వెళ్తే, మన్నారుస్వామి గుడిలోకి దారితీస్తోంది. అవును, ఈ గుడే మా ఊరు. రైతు, కూలీ, కుమ్మరి, కమ్మరి, మంగలి, చాకలి, చేనేత, మాల, మాదిగ... సకల జనాల సుఖదుఃఖాలకూ ఇక్కడే ఏదో కారణం దొరుకు తోంది. దౌర్జన్యం, అవమానం, కుళ్ళు, కుట్ర, దగా, దుర్మార్గం, అత్యాచారం, అహంకారం..అన్నీ ఒకే పుట్టలో బుసలు కొడుతున్నాయి. చెంచేలమ్మల ముఖాల్లో చిరునవ్వులు చెరిగిపోతున్న పరిణామం కంటి ముందు కనిపిస్తోంది. గజ్జలు ఘల్లుమన్న ఇళ్ళలో వికృత శబ్దాలు వినిపిస్తున్నాయి. ఆకలి, అబద్ధాలు, లౌల్యాలు, లౌక్యాలు... కొత్త కోణాలు పరిచయమవుతున్నాయి. టైలరా, బ్రోకరా, తాగుడా, తన్నుడా... ఎన్ని అవలక్షణాలు? ఎవరిది తప్పు? తాగి తాగి చచ్చిపోయిన చంద్రన్నదా, కొట్లాటకి కాలుదువ్వే టైలరు మస్తానుదా, దొరికిన అప్పులన్నీ చేసి మరి కనిపించని భాస్కర్‌దా, కర్రు కాల్చి వాతలు పెడుతున్నా మళ్ళీ మళ్ళీ దొంగతనాలు చేసి దొరికిపోయే కిష్టన్నదా, చొక్కా విప్పదీసి రైలుపెట్టెలు తుడుచుకుంటూ వెళ్ళిపోయిన భానుగాడు ఏమయ్యాడు? నాతో కలిసి చదువుకున్న నాగరాజూ... నువ్వెక్కడున్నావ్?

గుట్టుగా మా అమ్మమ్మ కథ రాసుకుందామని మొదలుపెడితే, వీళ్ళందరూ ఎదుట నిలబడుతున్నారు. నిలదీస్తున్నారు. దబాయిస్తున్నారు. అప్పుడిక, నన్ను ప్రశ్నిస్తున్న వాళ్ళ అమ్మల్నీ, అక్కల్నీ, చెల్లెళ్ళన్నీ, అవ్వల్నీ... బోలెడంతమంది చెంచేలమ్మలను కలిపి కరిగించి బంగారమ్మగా

పోత పోసుకున్నాను. బంగారమ్మ మరణంతో కథ మొదలవుతుంది. తప్పలేదు. సామాజిక, ఆర్థిక పరిణామాల ప్రభావంతో కుటుంబాల్లో జరిగిన విధ్వంసంలో మరణం ఒక విస్మరించలేని వాస్తవం. మా చెంచేలమ్మమ్మ, బంగారమ్మగా కథాస్థల ప్రవేశం చేసేప్పటికి స్వభావంలో, వేషభాషల్లో, ప్రవర్తనలో కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి. ఉన్న గుణాలు కొన్ని మాయమై కొత్త గుణాలు కొన్ని జత చేరాయి. చెంచేలమ్మ జీవితంలో జరగని సంఘటనలు బంగారమ్మ జీవితంలో జరిగాయి. అయితే, ఇవన్నీ ఊహలూ, కల్పితాలూ కావు. చెంచేలమ్మ జీవితంలో కాకపోయినా మా ఊళ్ళో ఎందరో స్త్రీల జీవితాల్లో యథాతథంగా జరిగినవి. కథావసరం కోసం వీటిని గుదిగుచ్చి బంగా రమ్మకు ఆపాదించవలసి వచ్చింది. ఇక కథ ప్రారంభంలోని రెండు భిన్న దృశ్యాలు, అభివృద్ధి పేరుతో సాగుతున్న విధ్వంసానికి సాక్ష్యాలు. తొలి దృశ్యం- పేటకీ ఊరికీ మధ్య ప్రయాణం. ఇప్పటికీ నాకు తరచూ వచ్చే అందమైన కల ఇది. రెండోది- కడుపు రగిలించే ప్రస్తుత దృశ్యం. సౌందర్య భరితమైన ప్రయాణాన్ని మింగేసిన నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం. ఊరికీ పేటకీ మధ్య ఉండే ఒంటేపమాను కూలిపోయింది, వాస్తవానికి కథలో చూపినట్టుగా రహదారి విస్తరణలో కాదు. తుఫానులో ఒరిగిపోయింది. వేలాది మహావృక్షాలను ఎన్నింటినో నాలుగు లైన్ల జాతీయ రహదారి కూల్చేసింది. ఎన్నో ఊళ్ళ రూపాలను చిదిమేసింది. పచ్చని పొలాలు ప్లాట్లుగా మారిపోయాయి. ఈ విధ్వంసం బయటే కాదు, లోపలా జరిగింది బీభత్సంగా. చెట్లు కూలినట్లుగా కుటుంబాలు కూలిపోయాయి. మనుషులు ఒక్కరొక్కరూ ఒరిగిపోయారు. బంగారమ్మది ఆత్మహత్య ఎన్నటికీ కానేకాదు. మా చెంచేలమ్మమ్మనీ, ఊరినీ కలగలిపి చూసినపుడు విడివిడిగా ఎన్నో విశేషాలు కళ్ళ ముందుకొచ్చాయి. మొదలు పెట్టింది మా అమ్మమ్మ కథే కానీ, పూర్తయింది మాత్రం బంగారమ్మ కథ. బంగారమ్మ, మా ఊళ్ళో రెండు తరాల పరిణామాలకు సాక్ష్యం. ఈ కథ రాసి, చదవమని ఖదీర్‌కి పంపాను. 'ఎక్కడో ఏదో వెలితిగా ఉంది, ఒక సారి నువ్వే చదువు,' అని ఫోన్ చేశాడు. కథాఖరులోని కల, అప్పుడు కలిసింది. బంగారమ్మ మరణంతో కథ ముగియడంలోని వెలితి అది. ఎక్కడో, ఏదో ఆశ తళుక్కుమనాలి. జీవితేచ్ఛ రగులుతునే ఉండాలి. చెల్లెమ్మ భరోసా కావాలి స్మశానం మధ్యలోంచి నడిచే జనానికి. ఆ భరోసా, నిజానికి చెల్లెమ్మది కాదు, జనం లోపల ఉన్నదే. బయటకు రావాలంటే తప్పెట మోగాల్సిందే.

*25 ఏప్రిల్ 2013*

*'ఒంటేపమాను' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

7

# అయోని

## ఓల్గా

నేను నీ కథ యివాళ ఎందుకు రాయటం మొదలు పెట్టానో ఆ కారణమే ఈ కథ. నాకు కథలంటే చాలా యిష్టం. ఆరుబయట ఆకాశం కింద మంచం వేసుకుని, అమ్మమ్మ పక్కలో పడుకుని పరుగెత్తే చందమామను చూస్తూ అమ్మమ్మ చెప్పే కథలు వింటూ నిద్రపోయేదాన్ని.

వర్షపు రాత్రుల్లో మా అమ్మమ్మ గొంతు చిటపట చినుకుల చప్పుడులోంచి వినబడుతుంటే వెచ్చగా దుప్పటి కప్పుకుని, అది చాలక యింకా అమ్మమ్మ డొక్క లోకి దూరిపోయి కథలు వినేదాన్ని. చలికాలపు రాత్రులన్నీ మా అమ్మమ్మ కథల్లో తెల్లవారిపోయేవి. ఎండాకాలపు రాత్రులు ఆ కథలకు చాలేవి కావు. నాకు అక్షరాలు రాయటం, చదవటం వచ్చాక తెలుగు వాచకం నా అంతట నేను చదువుకోగలిగినపుడు నేను మొదటి కథ రాశాను. ఆ కథ నాకిప్పుడు గుర్తులేదు. తర్వాత మా నాన్న ఎంతో ఇష్టంగా తెచ్చి నా చేత చదివించే చందమామ రెండు సంవత్సరాల పాటు చదివాక, నా తొమ్మిదోయేట నేనో కథ రాసి చందమామకు పంపాను. అది ఎన్నాళ్లకీ అచ్చు కాలేదు. ఈ సంగతి ఎవరికీ తెలియదు. మా నాన్నకూ, అమ్మకూ, అమ్మమ్మకూ ఎవరికీ చెప్పలేదు. నా స్నేహితు



*ఓల్గా 1950 నవంబర్ 27న గుంటూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ జైలుగది ఆత్మ కథ 1971, సృజన మాస పత్రికలో అచ్చయింది. 3 కథాసంపుటాలు, 7 నవలలు, 2 వ్యాస సంపుటాలు ప్రచురించారు. స్త్రీవాద కవితా సంకలనం నీలిమేఘాలు, స్త్రీల ఫోటో ఫీచర్ మహిళావరణం పుస్తకాలకు సంపాదకులు. వీరి అనేక కథలు ఇంగ్లీషులోకి, ఇతర భారతీయభాషల్లోకీ, స్వేచ్ఛ నవల ఇంగ్లీషులోకి అనువాదమయ్యాయి.*

**చిరునామా**

*302, వినాయక కౌస్తుభ అపార్ట్‌మెంట్స్,*
*స్ట్రీట్ నెం. 11, ఈస్ట్ మారేడ్‌పల్లి,*
*హైదరాబాద్-500 026*
*Ph.: 98490 38926*
lalitapopuri@gmail.com

రాలు రాధారాణికి కూడా చెప్పలేదు. ఆరేడు నెలలపాటు ఆ కథ అచ్చవుతుందని ఎంతగానో ఎదురుచూశాను. తర్వాత యిక ఆ సంగతి మర్చిపోయాను. ఇప్పుడు... ఆ కథ రాసిన మూడేళ్ల తర్వాత... నాకు మళ్లీ కథ రాయాలనిపించినపుడు ఆ చంద మామ కథ గుర్తొచ్చింది. ఆ కథకూ యిప్పుడు నే రాయబోయే కథకూ ఏమీ సంబంధం లేదు.

ఆ కథ ఎంత మంచి కథ. ఆ కథలో మనుషులు ఎంత మంచివాళ్లు. అందమైన తెల్లని రెక్కలతో తమ మధ్యకు దిగివచ్చిన పక్షి రాజకుమార్తెను ఎంత అపురూపంగా చూసుకున్నారు? ఆమెకు కావల్సినవన్నీ యిచ్చారు. ఆమె ఏ లోకంలో నుండి వచ్చిందో, ఆ లోకం వింతలు విని ఆశ్చర్యపోయారు. ఆ చిన్నారిపాప తెల్లని, నున్నని రెక్కలనూ, అమాయకమైన సంతోషంతో వెలిగే ఆ పక్షిపాప కళ్లనూ, మెత్తని ఆ పాప పాదాలనూ, బుల్లి బుల్లి అరచేతులనూ ఎంతో ఇష్టపడ్డారు. ఆ పాపకు హంసతూలికాతల్పం చేయించారు. పారిజాతం పూలతో దండలు గుచ్చి వేశారు. తియ్యని కర్పూర పాయసాలు వండిపెట్టారు. ఇన్ని చేసినా ఆ పాపకు వాళ్లమ్మానాన్నల మీద దిగులేసింది. తన లోకం వెళ్లిపోతానంది. అప్పుడిక అందరూ యేడుస్తూ ఆ పాపను తన లోకం పంపించారు. తన తెల్లని రెక్కలను చాచుకుని, వాటిని అలా అలా కదిలిస్తూ ఆకాశంలోకి ఎగిరి పోయింది ఆ పిట్టపిల్ల.

అంత మంచి కథ రాశాక ఈ కథ రాయటానికి నాకు సిగ్గుగా ఉంది. బాధగా ఉంది. ఆ కథ నా కల. ఈ కథ నా కథే. తొమ్మిదేళ్ల వయసులో అంత అందమైన కలగన్న నేను... మూడేళ్ల తర్వాత ఎట్లా మారిపోయానో, నా బతుకు పీడకలగా ఎట్లా మారిపోయిందో, నేను అంటే ఇవాళ అర్థం ఏమిటో, అందరికీ చెప్పాలని ఉంది. అట్లా చెప్పటం వల్ల నా చుట్టూ ఉన్నవాళ్లు అర్థం చేసుకునే నేను నిజం కాదనీ- ఈ కథ రాయగలిగిన నేను నిజమైన నేననీ నిరూపించుకోవాలి. అది నా కోరిక. ఆ కోరిక నన్ను ఎంత వేధిస్తున్నదంటే సంవత్సరం నుంచీ నేనీ కథ రాయటం కోసమే బతికున్నాను. ఈ కథ రాసి చచ్చిపోతాను.

ఈ కథలో అవసరమైన పదం నాకు దొరికి వుంటే- తెలిసి వుంటే ఈ కథ సంవత్సరం క్రితమే రాసి ఈపాటికి చచ్చిపోయేదాన్ని. ఎట్లా రాయాలో తెలియని అయోమయంలో ఉన్న నాకు అనుకోకుండా ఆ పదం దొరికింది. నేనూ భాగ్యం అక్కా ఆడుకుని మాటలు చెప్పు కుంటుంటే రేడియోలో, 'మీరిప్పుడు లవకుశ సినిమాలో పాట వింటారు,' అన్నారు. నేను రెండేళ్ల నుంచీ  పాటలు వినటంలేదు. పాటలు చాలా బాగుంటాయి. వాటిల్లో ఏదో మంచితనం ఉ ంటుంది. అందంగా, శుభ్రంగా మనసులోకి తీసుకోగలిగేంత మంచిగా నేను లేనేమో అనే దిగులుతో రెండేళ్ల నుంచీ నేను పాటలు వినటంలేదు. దూరంగా వెళ్తాను. ఇపుడూ వెళ్లబోతుంటే భాగ్యం అక్క ఆపింది. లవకుశ సినిమాలో పాటలు నాకు చాలా యిష్టం. ఆ సినిమా నాలుగైదుసార్లు చూశాను. అపుడా పాటలు కొన్ని పాడేదాన్ని కూడా. ఇపుడు మర్చిపోయాను. *శ్రీరాముని చరితమును తెలిపెదమమ్మా... ఘన శీలవతీ సీత కథ వినుడోయమ్మా...* పాట సాగుతోంది. భాగ్యం అక్క పాట గురించీ సినిమా గురించీ చెబుతోంది. రాముడు రావణుడ్ని చంపాడు. *చేరవచ్చు యిల్లాలిని చూసి శీలపరీక్షను కోరె రఘుపతి...* భాగ్యం అక్క కళ్లనీళ్లు పెట్టుకుంటూ, "బుద్ధిలేని చచ్చినోడు," అని తిట్టింది రాముడ్ని.

*అయోనిజ పైనే అనుమానమా? ధర్మమూర్తి రామచంద్రుని యిల్లాలికా ఈ పరీక్ష....*

"అయోనిజ అంటే ఏమిటో?" అన్నాను నేను.

"అంటే నాకు తెల్సు- సీత అందర్లా పుట్టలేదు. అందుకని అయోనిజ అంటారు. నాగేటి చాల్లో దొరికింది."

"అందరూ ఎలా పుడ్తారు?"

భాగ్యం అక్క పడీపడీ నవ్వింది. ఇలా అంటూ నా పొట్ట మీద చెయ్యి వేసి పిల్లలుపుట్టే మార్గందాకా ఆ చేతిని నడిపింది.

"ఛీ," అన్నాను నేను నమ్మలేక.

"ఛీ ఏంటి? పిల్లలు అట్లానే పుడతారు. కమల నీళ్లాడుతున్నపుడు నే చూశా. దాన్ని యోని అంటారు. సీత అక్కడ్నించి పుట్టలేదు. అందుకని అయోనిజ. మనందరం యోనిజలం. సీత అయోనిజ."

భాగ్యం అక్క మళ్లీ నవ్వింది.

యోని- యోనిజ- అయోనిజ- నాకేంటో అయిపోతోంది. నా తల్లో పెద్దగా నొప్పి లేచింది.

సీత అయోనిజ. నాకట్లా పుట్టటం గురించి ఏమీ తెలియదు. కానీ నేను యిన్నాళ్ల నుంచీ కోరుకుంటున్నది యిపుడు రాయగలను. నేను అయోనిగా పుడితే ఎంత బాగుండేది. ఈ పదం నాకు ఎంత బాగుందో - అయోని. మీకు కోపంగా ఉందా? చీదరగా ఉందా? అసహ్యంగా ఉందా? కానీ మీకు కోపం గురించీ, చీదర గురించీ ఏమీ తెలియదు. తెలిస్తే నా కోరిక తీరాలని దీవిస్తారు. మీరంతా చల్లని తల్లులు కదూ-

ఇక చెబుతాను నా కథ. ఆరోజు- నా మంచి రోజులకు ఆఖరి రోజు. నాకు బాగా గుర్తుంది. మిగిలిన చాలారోజులు మర్చిపోయాను గాని ఆ రోజును పనిగట్టుకుని గుర్తు పెట్టుకున్నాను. ఎక్కడ మర్చిపోతానో అనే భయంతో పదేపదే జ్ఞాపకం తెచ్చుకుంటూ ఉంటాను. ఆరోజు జనవరి నాలుగో తారీఖు. ఆ రోజుతో పరీక్షలైపోయి సంక్రాంతి సెలవులు యిచ్చారు. సంక్రాంతి నెలంతా నేను తెల్లవారుఝామునే లేచేదాన్ని. నాకు ముగ్గులెయ్యటం సరదా. పెద్దపెద్ద ముగ్గులు వేసేదాన్ని. ఆ ముగ్గులో పసుపూ కుంకుమా బంతిపూల రేకులూ చల్లేదాన్ని. అమ్మమ్మ గొబ్బెమ్మల గురించి చెబితే వినటమేగాని నేను గొబ్బెమ్మలు పెట్టలేదు. ఆవుపేడ దొరికేది కాదు. ఆరోజు పాము ముగ్గేశాను. జంటసర్పాలు. ఎంత పొడవున, ఎంత వెడల్పున- ఎన్ని మెలికలు తిరిగి పెనవేసుకున్నాయో ముగ్గంతా వేశాక నాకే భయం వేసింది. వాటికి ప్రాణం వచ్చి నను గనుక చుట్టుకుంటే అనే వూహ వచ్చి భయంపుట్టి యింట్లోకి ఒక్క పరుగు తీశాను. కానీ ఆ పాములు నా ఊహలు పసిగట్టాయా అన్నట్టు ఆ సాయంత్రం నిజంగానే నన్ను పట్టుకున్నాయి.

ఎట్లాంటి పాములవి- నల్లగా పెద్దపెద్ద పడగల్లాంటి తలల్తో విషం చిమ్ముతూ కార్లో వచ్చాయి. నేను కారుపక్క నడిచి వెళ్తున్నాను. చలికాలం కదూ ఆరింటికే చీకటి పడిపోయింది.

నేను పరీక్షలైపోయిన సంతోషంతో, రాధారాణి వాళ్లింట్లో క్యారమ్స్ ఆటలో ఓడినందుకు వుక్రోషంతో, ఆలస్యమైనందుకు అమ్మ తిడుతుందనే భయంతో నడుస్తున్నాను. కారు నల్లని కారు- తళతళ మెరుస్తోంది. నేను ఆ కారు అద్దాల్లో నా నీడ చూసుకుంటూ దాటబోతున్నాను. రెండు పాములు నన్ను చుట్టేసి కార్లోకి లాగేశాయి. నా మీద విషం చిమ్మాయి. నేను చచ్చిపోయాననే అనుకున్నాను.

చచ్చిపోతే ఎంత బాగుండేది. కానీ నేను చచ్చిపోలేదు. ఈ నాగుబాములు నన్నెత్తుకొచ్చాయని తెలిసింది. అదంతా ఒక నరకం. ఆకలి, భయం, చీకటి వీటికున్న భయంకరమైన అర్థాలు

నాకప్పుడే తెలిశాయి. అంతకుముందు ఆకలి వేస్తోందంటే రుచిగా అన్నం తినొచ్చనే ఆనందమే తెలుసు. భయం వేసిందంటే అమ్మ ఒడో, అమ్మమ్మ పొట్టో తెలుసు. చీకటి పడుతోందంటే దీపాలు వెలుగుతాయనీ, చందమామ, చుక్కలతో ఆకాశం నిండిపోతుందన్న సంబరమే తెలుసు. ఆకలి వేస్తే అన్నం దొరక్క, అన్నం కోసం యేడుస్తుంటే చీకటి గదిలో వేస్తే కలిగే భయం- ఎట్లా చెప్పను దాన్ని గురించి. ఆ ఆకలి తీరాలంటే, ఆ చీకటి పోవాలంటే వాళ్లు చెప్పిన పని చేయాలి. ఒక దున్నపోతులాంటి మగాడు నా మీద పడి నా యోనిని చీల్చాడు.

నాకు స్పృహ పోయింది. రక్తం వరదలైంది.

కానీ అన్నం దొరికింది. నేను తింటున్నది అన్నమో రక్తమో తెలియని స్థితి.

ఇక వారానికి మూడురోజులు అదే పని. నాకు నా 'యోని'ని చూస్తే అసహ్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ దానిని చాలా జాగ్రత్తగా దాచేవారు. స్నానం చేసేప్పుడు తప్ప నేనైనా చూడలేను గదా, దానిని గురించి నాకు ఏమీ తెలియదు. ఎవరూ చెప్పలేదు. దానిని నేనైనా సరే ముట్టుకో కూడదనీ, ఎవరినీ ముట్టుకోనివ్వకూడదనీ, చూడనివ్వకూడదనీ అమ్మ, అమ్మమ్మ రకరకాలుగా చెప్పారు. అది 'షేమ్ షేమ్' అని మాత్రం తెలుసు. కానీ నాకు అదంటే యిష్టంగానే ఉండేది. ముఖ్యంగా మగపిల్లలను బట్టల్లేకుండా చూసినపుడు నేను ఆడపిల్లనైనందుకూ, నాకు అట్లా కాళ్ల మధ్యలో వేలాడే అసహ్యమైన తోక లేనందుకూ చాలా నిశ్చింతగా అనిపించేది. పెద్ద ప్రమాదం తప్పినట్లనిపించేది. మగపిల్లల మీద జాలి వేసేది. పాపం జీవితాంతం వాళ్లట్లా ఆ అసహ్యమైన తోక వేళ్లాడుతుండగా బతకాలి గదా అనుకునేదాన్ని. అంతకుమించి నాకు ఈ అవయవాల గురించి ఏమీ తెలియదు. వాటి పేర్లు కూడా తెలియవు. ఒకసారి రాధారాణి తనకు తెలుసుననీ, నాకు చెప్తాననీ అన్నది కానీ ఎందుకో చెప్పలేదు.

ఇక్కడికొచ్చాక నాకు మగవాళ్ల మీద జాలి పోయింది. వాళ్లు ఆ తోకను విషం పూసిన కత్తిగా, ఖడ్గమృగపు కొమ్ముగా మార్చగలరని తెలిశాక మగవాళ్లంటే భయంతో చచ్చిపోతున్నాను.

నాకప్పుడు పదేళ్లు. వారానికి మూడురోజులు మగవాళ్లు వచ్చేవాళ్లు. వాళ్లకి జబ్బులున్నా యట. నన్ను చీలిస్తే వాళ్ల జబ్బు తగ్గుతుందట. వాళ్లు రాగానే నాకు ఏడుపు, భయం. ఏడవ కూడదు. ఏడిస్తే చీకటిగదిలో పడేసి అన్నం పెట్టకుండా మాడుస్తారు. ఏడవకుండా కళ్లు మూసు కుందామంటే ఆ మగవాడు మూసుకోనివ్వడు. చూడమంటాడు. నేను చూస్తుంటాను.

అప్పుడు నేను చిన్నపిల్లను కాదు, మనిషిని కాదు, ప్రాణిని కూడా కాదేమో, ఒక యోనిని. అంతే. అదొక్కటే. ఒక చిన్న కంతను. ఆ కంత కావాలి అక్కడికి వచ్చేవాళ్లకు. వాళ్ల రోగాలను అక్కడ పూడ్చి వెళ్లిపోతారు. నేను, నేను ఎవరు? నేను ఏమిటి? అన్నం కలిపే చేయి నేనా? అన్నం తినే నోరు నేనా? అన్నం చేరగానే నిండే పొట్ట నేనా? ఈ అన్నం నాకు పెట్టే ఆ యోనే నేనా?

అందరూ నన్ను యోనిగానే చూశారు. నాకు అదంటే అసహ్యం కలిగేలా చేశారు. నేనది కాదు, నేను వేరేగా ఉన్నాను. నాతో మాట్లాడండి, నన్ను మనిషిలా చిన్నపిల్లలా చూడండి- వినేవాళ్ళె వరున్నారు? అమ్మమ్మ, అమ్మ, నాన్న ఎక్కడున్నారు?

ఇక్కడ వీళ్లందరికీ నేనంటే ఒక యోనిని...

మగవాళ్లు వస్తున్నారంటే నా గుండె కడుపులోకి జారిపోతుంది. మగగొంతులు కోపంగా అరుస్తున్నా, పెద్దగా నవ్వుతున్నా నా చెవుల్లో ఏవో పేలిపోతున్నట్లుంటాయి. నేను లోలోపలికి

ముడుచుకుపోతాను. ఇంకా ఇంకా నా లోపల ఈ భయం ఎక్కడి నుంచి పుడుతోందో ఆ లోపలికి ముడుక్కుపోవాలని చూస్తాను. కానీ ఎంత ముడుచుకుపోయినా నేను వాళ్లకు కనిపిస్తాను. చిన్నప్పుడు దాగుడుమూతలాటలో ఓరోజు నేను పెరట్లో బాత్‌రూం వెనక వేసి వున్న బొగ్గులబస్తా చాటున దాక్కున్నాను. ఎవరూ కనిపెట్టలేకపోయారు. ఇంకా వస్తారు, ఇంకా వస్తారని ఎంతసేపు ఎదురుచూసినా ఎవరూ రాలేదు. చివరికి నాకే భయంవేసి బైటికొచ్చాను. అప్పుడా ఒంటరితనం భయం వేసిందిగానీ యిప్పుడలా ఎవరికీ కనపడని ప్రదేశం నాకు కనబడితేనా?

ఇక్కడ చాలామంది పెద్దవాళ్లున్నారు. వాళ్లు రాత్రుళ్లు సరదాగా గడుపుతారని అంటారు. భాగ్యం అక్క అంటుంది, "సరదాలేదూ పాడూలేదూ- పొట్ట తిప్పలు."

నా బాధ భాగ్యం అక్కకు తెలుసు.

"పెద్దదానివైతే నీకు అలవాటవుతుందిలే- ఇంత బాధ ఉండదు," అని ఏడుస్తుంది.

సంవత్సరాలు గడిచిపోతున్నాయి. నేను పెరుగుతున్నకొద్దీ నా కోరిక కూడా పెరుగుతోంది ఈ ఒక్క అవయవం లేకుండాపోతే!

భాగ్యం అక్కతో చెబితే నవ్వుతుంది. అది లేకపోతే ప్రపంచమే లేదంది. అంటే బాధతోనే ప్రపంచం ఉందా? హింసతోనే ప్రపంచం ఉందా?

"ఈ బాధ మనలాంటి వాళ్లకేగా- చాలామంది హాయిగా ఉన్నారుగా. తల్లిదండ్రుల దగ్గర హాయిగా పెరిగి పెద్దయ్యే పిల్లలకు ఈ బాధ ఉండదుగా," అంటుంది భాగ్యం అక్క.

ఏమో- ఉండదా? ఏదో ఒక బాధ లేకుండా ఒదుల్తారా అని నాకు అనుమానం. అయినా మిగిలిన అదృష్టవంతుల సంగతి నాకెందుకు. నాకిది ఒద్దు. దీనివల్లనే నన్ను ఎత్తుకొచ్చారు. అసహ్యంగా, మురికికూపంగా, రోగాలపుట్టగా చేశారు. నా శరీరం నిండా జబ్బులు తెచ్చిపెట్టారు. నాకు అప్పుడప్పుడూ బైటకు చూస్తే కనిపించే చిన్నారిపిల్లల్ని చూస్తే కూడా భయం.

వాళ్లలో ఎవరు నాలాగా మారతారో? ఇట్లాంటి నరకాలు ఎన్ని ఉన్నాయో- ఎంతమంది పిల్లలు నాలాగా చచ్చిపోవాలనుకుంటున్నారో- ఇంకెంతమంది చాలా తయారవుతారో? ఇదంతా ఆగాలంటే ఏం చెయ్యాలి?

నాకు మాత్రం వెంటనే అయోనిగా మారాలని ఉంది. నా కోరిక అసహ్యంగా ఉందనీ, మంచిది కాదనీ మీరు అనుకుంటుంటే, ముందు ఈ హింసను ఆపండి. చిన్నిచిన్ని పాపలను వాళ్ల యోనుల కోసం ఎత్తుకొచ్చే నాగుబాముల్ని పొడిచి పొడిచి చంపండి. ఈ వ్యాపారాన్ని ఆపండి. అది చేతగాక నన్ను చూసి అసహ్యించుకుంటారు మీరు. నా కథ చీదరగా ఉందంటారు.

కానీ మీకు తెలుసా? నేను చందమామ కోసం రాసిన కథలో పక్షుల లోకం నుంచి వచ్చిన రెక్కల పాపాయికి యోని వుందా లేదా అన్న సంగతే రాయలేదు. ఆ పాప అయోనిజా? అయోనా? అన్న ప్రశ్నే రాలేదు. ఆ పాపాయి ఎంత అందమైంది! ఆ పాపాయి వచ్చినప్పుడు లోకం ఎంత మంచిగా ఉంది!

అట్లాంటి లోకం ఉంటే యిప్పుడూ నాకీ కోరిక ఉండేది కాదేమో.

ఇప్పుడు నేనా కథ రాస్తే ఆ పాప రెక్కలకు మనుషులు ముళ్లతీగలు చుట్టారని రాస్తానా? ఆ పాప అమాయకమైన కళ్లలో కారంపొడి చల్లారని రాస్తానా? ముద్దబంతిపూవు లాంటి ఆ పిట్టపాప ముక్కుని చిదిమేశారని రాస్తానా? వేడి కన్నీటి నదులు ఆ పాప కళ్లలోంచి పొంగాయని

రాస్తానా? ఆ పాప చివరికి బాధ ఏడుపులు కలగలిసిన ముద్దగా మారిపోయి ఎగరలేక దుమ్ములో బురదలో పడి చచ్చిపోయిందని రాస్తానా?

ఏమో- ఎలా రాస్తానో-

అయినా ఈ అసహ్యమైన కథ తప్ప యిపుడు నేనా అందమైన కథ రాయలేను.

ఈ కథ రాశాను గదా- ఇక చచ్చిపోతాను. చందమామలో నా కథ అచ్చవుతుందేమోనని ఆరేడు నెలలు ఎదురుచూశాను.

ఇపుడీ కథ ఎక్కడా అచ్చవదు గనక ఎదురుచూడాల్సిన పనిలేదు.

వెంటనే చచ్చిపోవచ్చు. చచ్చిపోతున్నాను.

*ఆహ్వానం*
*మే 1994*

*అందరికీ తెలిసిన చిన్నారి శ్వేతకు, గత నెలరోజులుగా హైదరాబాద్‌లో లైంగిక అత్యాచారాలకు గురై చనిపోయిన పాపలకు, ప్రపంచవ్యాప్తంగా ఈ లైంగిక వ్యాపారానికి బలైపోతున్న చిన్నారి పాపలందరికీ రక్తపు కన్నీళ్లతో అంకితం ఈ కథ.*

## నేపథ్యం

చిన్నారిపాపల దుఃఖ సమాహారం

# అయోని

***నీకు ప్రత్యేకంగా ఒక పేరు పెట్టాలని నేను అనుకోలేదు పాపా. ఎందుకంటే నువ్వు ఒక్క పాపవు కాదు. ఈ ప్రపంచంలో నీవున్న పరిస్థితిలోనే ఉన్న లక్షలాది పాపల దుఃఖ సమాహారానివి. నీ పుట్టుక, నీ నేపథ్యం విశ్వమంతా ఆవరించిన ఒక బాధా సముద్రం.***

అయోని కథ చదివి చాలామంది నన్ను నీ పేరేమిటని అడుగుతారు. నాకేం చెప్పాలో తెలియదు. నన్ను సృష్టించిన ఓల్గా నాకు పేరెందుకు పెట్టలేదో నాకు తెలియదు. అసలు నాకో పేరుండేది. నేను పుట్టకముందే అమ్మానాన్నా నా పేరు గురించి చాలా ఆలోచనలు చేశారు. వాళ్ళకు ఏం తోచనపుడల్లా పుట్టబోయేది పాపైతే ఏం పేరుపెడదాం, బాబయితే ఏం పేరు పెడదామని, ఎన్నో పేర్లు చెప్పుకొనేవాళ్ళట. నేను పుట్టాక కూడా ఆ పేరు పెడదామా, ఈ పేరు పెడదామా అనీ, నా పేరు ప్రత్యేకంగా ఉండాలనీ ఏవేవో అనుకొన్నారు. నా పేరు చుట్టూ ఎన్నో కలలు ఉండే ఉంటాయి. కుటుంబంలో చాలా ఇష్టంగా తలుచుకొనే జ్ఞాపకాలేవేవో నా నామ కరణం చుట్టూ జరిగే ఉంటాయి. కానీ నా పేరుతో సహా నేనిప్పుడవన్నీ మర్చి పోయాను. నేను మర్చిపోయినా ఓల్గా మర్చిపోకుండా ఉండొచ్చు కదా. లేదా తను అనుకొన్న ఓ పేరు నాకు ఇవ్వొచ్చుగదా- ఈ కథలో నాకో పేరు ఎందుకు లేదు? ఈ ప్రశ్న ఓల్గానే అడిగాను. చాలాసార్లు అడిగాను. ఆమె సమాధానం చెప్పకుండా నన్ను సంతోషపెట్టే మాటలేవో చెప్పి మరిపించేది. కానీ నేను మరీ పసిపిల్లను కాదుగా. పదకొండేళ్ళదాన్ని. పదకొండేళ్ళ జీవితంలో చేదునంతా మింగినదాన్ని. ఒకసారి గట్టిగా పట్టుకొన్నాను. నాకు పేరెందుకు పెట్టలేదో, ఆ సంగతి, సందర్భం, నన్ను సృష్టించిన సందర్భం నేపథ్యం అన్నీ చెప్పాల్సిందేనని మారాం చేశాను. నేను దేనికైనా మారాం చేసి ఎన్నేళ్ళయిందనీ- నేను ఇక్కడికి, ఈ మురికికూపంలోకి

రాకముందు, నన్ను పరీక్షలు రాసి, స్నేహితురాలితో ఆడుకొని ఇంటికి వెళ్తున్న నన్ను ఆ రాక్షసులు ఎత్తుకొచ్చి ఈ హింసల కొలిమిలో కాల్చక ముందు ఎంత ముద్దుగా మారాం చేసేదాన్నో- ఇప్పుడలా కాకపోయినా నా పేరు కోసం మళ్ళీ మారాం చేశాను. అపుడు ఓల్గా చెప్పిన మాట లేమిటంటే-

"నీకు ప్రత్యేకంగా ఒక పేరు పెట్టాలని నేను అనుకోలేదు పాపా. ఎందుకంటే నువ్వు ఒక్క పాపవు కాదు. ఈ ప్రపంచంలో నీవున్న పరిస్థితిలోనే ఉన్న లక్షలాది పాపల దుఃఖ సమాహారా నివి. నీ పుట్టుక, నీ నేపథ్యం విశ్వమంతా ఆవరించిన ఒక బాధా సముద్రం. లక్షల పసిపాపల కన్నుల అగాధ సంద్రాలు నిశ్చలమై నీ రెండు కళ్ళలోంచీ చూస్తూ వుంటే-

లక్షలాది పాలబుగ్గల పసితనం నీ బుగ్గల మీద జారిన కన్నీళ్ళ చారికల్లో కరడు కడుతుంటే- నవ్వులు విరబూయాల్సిన లేత పెదవులు రక్తపు మడుగులై, నెత్తుటిపూలై పోతుంటే- అమ్మకోసం గారాంగా మారాం చేయాల్సిన గొంతుల్లోంచి ఎన్నటికీ తెగని, ఆగని ఆర్తనాదాల హింసాధ్వని ప్రపంచాన్ని బద్దలు చేస్తుంటే నీ పేరు, నీ వంశం, నీ నేపథ్యం- ఎక్కడని పట్టుకోనమ్మా!

మీ దుఃఖాన్ని చూడలేక, ఆ కోపంతోనే సూర్యుడు ఎర్రగా ఉదయిస్తున్నాడు. మరింత ఎర్రగా అస్తమిస్తున్నాడు. మీకు చల్లదనాన్నిచ్చి సేదతీర్చాలనే చంద్రుడు వెన్నెల కాస్తున్నాడు.

మీ ఈ స్థితికి కారణమైన ఈ పాపిష్టి ప్రపంచాన్ని తుదముట్టించాలనే తుపానులు, భూకంపాలు, విలయాలు సంభవిస్తున్నాయి. కానీ ఈ మనుషులు ప్రకృతిని అదుపు చేస్తున్నారు మిమ్మల్ని చేసినట్టే.

అయినా మీ నేపథ్యాన్ని చెప్పక తప్పదు. చెప్పాలి. అవయవాల్లా తప్ప మనుషులుగా కనపడని మీకు ఒక అస్తిత్వం కల్పించడం కోసం మీ నేపథ్యం తప్పకుండా చెప్పాలి కానీ ఎక్కడ మొదలుపెట్టాలి? అంకెలతో, గణాంక వివరాలతో చెబితే తప్ప నమ్మని వాళ్ళకు వాటితోనే మొదలుపెట్టనా?

పుణ్యభూమి, కర్మభూమి, రాముడు ఏలిన రాజ్యం ఇట్లాంటి పేర్లు అంతు లేకుండా ఉన్న మనదేశంలో వ్యభిచారంలోకి బలవంతంగా నెట్టబడుతున్న బాలికల గురించి చాలా రోజులు మాట్లాడనే లేదు. పిల్లి మన దేశ వాసులకు ఆదర్శం. కానీ మాట్లాడక తప్పని పరిస్థితి వచ్చింది. 1987లో బొంబాయిలో ఇండియన్ హెల్త్ ఆర్గనైజేషన్ సర్వేలో ఈ బాలికల దుర్గతి మొదటిసారి ప్రపంచానికి వెల్లడైంది. అప్పటి నుంచి ఈ విష వ్యాపారానికి బలవుతున్న చిన్నారులు ఎందరు, ఎలాంటివాళ్ళు, ఎందుకిలా అవుతున్నారని విచారించడం మొదలుపెడితే చూపు సరిగ్గా ఆనని భారత ప్రభుత్వం వారి లెక్కల ప్రకారమే 1994వ సంవత్సరానికి 50,000 మంది చిన్నారి పాపలు ఈ వ్యాపారంలో సరుకులుగా ఉన్నారని తెలిసింది.

అదీ అయోని రాసేనాటికి నీ నేపథ్యం.

ఇపుడు అతి వేగంగా పెరుగుతున్న వ్యాపారంలో నీ అక్కచెల్లెళ్ళు నాలుగురెట్లయ్యారు. ఈ వ్యాపారంలో పురోగమిస్తున్నది మన దేశం ఒక్కటే కాదు. మూడవ ప్రపంచ దేశాలన్నింటిలోనూ ఆడపిల్లలు ఇలా అల్లాడిపోతూనే ఉన్నారు. చాలా చిన్న దేశమైన ఫిలిప్పైన్స్‌లో ఇరవైవేల మంది పాపలు, థాయ్‌లాండ్‌లో రెండు లక్షల మంది, వియత్నాంలో కూడా వేలసంఖ్యలో ఈ వృత్తిలోకి బలవంతంగా నెట్టబడుతున్నారు. చైనా కూడా దీనికి మినహాయింపు కాదు. కాంబోడియాలో

ఇంటర్నెట్‌లో సెక్స్‌గైడ్ ప్రకటనల్లో ఒక ప్రకటన, 'మూడు డాలర్లకు ఆరేళ్ళ పిల్ల దొరుకుతుంది.' ఇదమ్మా అయోని కథా నేపథ్యం.

అంకెలను చూసి అమ్మో అనుకొనేవాళ్ళు ఆ పిల్లలు గురవుతున్న శారీరక, మానసిక హింసలను చూస్తే ఏమనుకొంటారు? 'అమ్మో', 'అయ్యో', 'అరే పాపం' ఈ పదాలు తప్ప మరో స్పందన లేని మా చేతకానితనాల మీద మీరంతా ఉమ్మెయ్యాలమ్మా! బెంగాల్ నుంచి కిడ్నాప్ చేసి తెచ్చి అమృతసర్‌లో అమ్మేసిన ఓ పదకొండేళ్ళ పాప మాటలకు అయోని కథలో నీ మాటలకూ తేడా ఏముంది? "వాళ్ళు నన్ను బలవంతంగా ఎత్తుకొచ్చారు. ఈ దేశం ఏంటో, ఇక్కడ భాష కూడా నాకు తెలియదు. ఆకలేస్తుంటే అన్నం పెట్టకుండా, కత్తి చూపించి చంపేస్తామని బెదిరించి నా చేత ఈ పని చేయిస్తున్నారు."

ఆ పిల్లలను కొట్టి, ఆకలితో మాడ్చి, రేప్ చేసి లొంగదీస్తారు. చీకటి గదుల్లో వేసి తాళం పెడతారు. బోనుల్లో జంతువుల్లా కట్టేస్తారు. అటకల మీద రోజుల తరబడి దాచి మానవ మృగాలకు ఆహారంగా పడేస్తారు. రోజూ ఎనిమిది నుంచి పదిమంది దాకా కస్టమర్స్ వస్తారని పదేళ్ళ పాప చెబుతుంటే విని, నోట్సు రాసుకొని ఆ నేపథ్యంతో కథలు, కవితలు, వ్యాసాలు రాయానికి మేం కూడా అంతో ఇంతో రాక్షసులమే అయ్యుండాలి పాపా!

నిజం పాపా! మీ గురించీ, మీ నేపథ్యాల గురించీ మర్చిపోతే తప్ప, దాన్ని మా అంతరాత్మల అడుగునెక్కడో దిమ్మిశ కొట్టేస్తే తప్ప ఇట్లా బతకటం ఎట్లా సాధ్యమవుతుంది? ఒక్క జర్మనీ దేశం నుంచే 5,000 మంది జర్మన్లు ప్రతి ఏటా చిన్నపిల్లల వేట కోసం మూడవ ప్రపంచదేశాల మీదికి విహారం పేరుతో వస్తారు. అమెరికా, ఇంగ్లాండు, ఫ్రాన్సు, ప్రతి దేశం నుంచీ ఈ బీద దేశాల ఆకలి పాపల బక్కచిక్కిన శరీరాల కోసం వస్తుంటారు. అరబ్బు దేశాలకూ, పాశ్చాత్య దేశాలకూ ఈ గిజగిజలాడే చిన్నపిల్లల్ని కబేళాలకు తరలించే మేకపిల్లల్లా పంపుతూనే ఉంటారు.

ఈమధ్య ఎక్కువైన 'ఎయిడ్స్' ప్రమాదంతో చిన్నపిల్లల కోసం డిమాండ్ పెరిగింది. ఎవరూ తాకని, ఏ జబ్బులూ లేని చిన్నపిల్లలకు అన్ని జబ్బులూ అంటించాలనే తహతహ పెరిగింది. చిన్నపిల్లలకు ఈ ప్రమాదకరమైన జబ్బులు అంటించి నిర్దాక్షిణ్యంగా వదిలేస్తున్నారు. మూడవ ప్రపంచదేశాలలో పెరిగిపోతున్న బీదరికం మీ స్థితికి మొదటి కారణం. దరిద్రంలో మగ్గుతున్న కొందరు తల్లిదండ్రులు పిల్లల్ని పోషించలేక ఒది లెయ్యడం, అమ్మెయ్యటం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో తమ లైంగిక వాంఛల్ని తీర్చుకోటానికి ఉపయోగపడే వస్తువులుగా చిన్నపిల్లలే కావాలనే డిమాండ్ చాలా వేగంగా పెరిగిపోతోంది. దానితో పిల్లల్ని ఎత్తుకుపోయి అమ్మెయ్యటం, మోసం చేసి ఎత్తుకుపోవటం ఎక్కువవుతోంది. మూడవ ప్రపంచ దేశాలలో టూరిజం పెరుగుతోంది. టూరిజం పెరిగిన కొద్దీ చిన్నపిల్లల మీద దాడులు కూడా పెరుగుతున్నాయి. టూరిజం పెరిగితే వందల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యం ఆర్జించుకోవచ్చని తప్ప పసిపిల్లలు ఈ టూరిజానికి బలవుతున్నారనీ, దానిని ఆపాలనీ అనుకోని ప్రభుత్వాల వల్ల పసిపాపల పరిస్థితి రోజురోజుకి భయం గొలిపేలా తయారవుతోంది.

ఇది తల్లీ నీ కథానేపథ్యం.

ఈ శతాబ్దం మీ మీదుగా నడిచిపోతోందమ్మా. కొత్త శతాబ్దపు రథచక్రాలు మీ శరీరాన్ని నజ్జునజ్జు చేయడానికి సిద్ధమవుతున్నాయి.

మీలాంటి పాపలను తల్చుకొంటే మాకు కొత్త శతాబ్దంలోకి వెళ్ళబోతున్నామన్న ఆనందం ఏ కోశానా లేదు. ఏం మిగుల్చుకొన్నామనీ?

బీదరికం, నిరుద్యోగం, హింస ఇవి తప్ప ఏం మిగిలాయి? హింసను చూసి ఆనందించటాన్ని మనుషులకు నేర్పటానికి ఆధునిక మీడియా విజయవంతంగా పనిచేస్తోంది. ఆధునిక విజ్ఞానమంతా మానవ నాగరికతను అమానవీకరించటానికే ఉపయోగపడుతోంది. ఇవాళ లక్షల సంఖ్యలో బాలికలను వేశ్యావృత్తిలోకి దించుతున్న మానవజాతిని చూసి గర్వపడటానికి ఏమీ లేదు. తలెత్తటానికేమీ లేదు. మానవవిలువలలో సున్నితమైన పార్శ్వాలన్నీ మాడి మసవుతున్నాయి. మానవజాతి సిగ్గూ, శరం ఒదిలేసి నగ్నంగా, జీవచ్ఛవంలా తిరుగుతోందని మీ స్థితి చూసి నిర్ధారించవచ్చు పాపా! స్వేచ్ఛా విపణిలో కొత్త ఆర్థిక విధానాలతో సరుకులే, లాభాలే, డబ్బే ఏకైక విషయంగా మిగిలిన ఈ రోజుల్లో చిన్నపిల్లల లేత శరీరాలు, వారి అమాయకపు చూపులు, చిరునవ్వులు అమ్మకపు సరుకులవటంలో ఆశ్చర్యం లేదేమో!

ఆ పసిమొగ్గలను మల్లెమొగ్గల్లా గంపల్లో కుక్కి మార్కెట్‌లో మూర రెండ్రూపాయలకు అమ్ముతున్న సామాజిక నేపథ్యంలో నీకు పేరు పెట్టటానికి నాకు మెదడు పనిచేయలేదమ్మా! నీ నేపథ్యమే నీ పేరు.

నీ కథ రాయటానికి నాకు రెండు గంటలు పట్టింది. కానీ అచ్చులో రావటానికి చాలా కాలమే పట్టింది. నువ్వు ఎనిమిదేళ్ళ వయసులో చందమామ పత్రికకు కథ రాసి పంపితే అది అచ్చుకాలేదు గుర్తుందా- అట్లాగే నీ గురించి రాసిన కథ కూడా అచ్చు కాకుండా మిగిలిపోతుందేమో అనిపించింది. చాలా సాహసులకు కూడా ఈ కథ ప్రచురించటం రిస్కు అనిపించింది. అపుడు ఒక స్త్రీయే నీ కథ ప్రచురించి (ఆహ్వానం పత్రిక) నలుగురికీ తెలియజేసే సాహసం చేసింది.

నీ కథ నేనెందుకు రాశాను?

నీలాంటి పాపల సంగతి అందరికీ తెలియజేయాలని. ఈ విషయం అసలు జరగనట్లు, దీని గురించి మాట్లాడకుండా, పట్టించుకోకుండా ఉండడం కాకుండా అందరూ ఆలోచించాలనీ రాశాను. చిన్నపిల్లల హక్కుల మాట దేవుడెరుగు. వాళ్ళకు బాల్యం ఆట పాటలు, ప్రేమ, స్నేహం ఇవ్వలేకపోతే పోనీండి. చదువు, పోషకాహారం, ఆరోగ్యం మొదలైన హక్కులు కల్పించలేకపోతే పోనీండి. వాళ్ళను సరుకుల్లా, పశువుల్లా అమ్ముతుంటే చూస్తూ ఊరుకోకూడదనీ, దాన్నలా పెరగనీయకూడదనీ చెప్పటం కోసం అయోని కథ రాశాను.

*26 ఏప్రిల్ 1998*

8

# మచ్చ

## కన్నెగంటి చంద్ర



*కన్నెగంటి చంద్ర 1960 మార్చి 1న గుంటూరు జిల్లాలో సొపాడులో జన్మించారు. వరంగల్ ఆర్.ఇ.సి. లో ఇంజనీరింగ్ విద్య నభ్యసించి, అనంతరం అమెరికాలోని యూని వర్సిటీ ఆఫ్ అయోవాలో ఎం.ఎస్. చేసి, అప్పట్నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజ నీర్‌గా పని చేస్తున్నారు. కవితల సంపుటి వాన వెలిసిన సాయంత్రం, మూడో ముద్రణ కథాసంపుటి ప్రచురించారు. కొంతకాలం తానా పత్రిక సంపాదకులు. టెక్సస్‌లోని డాలస్‌లో నివాసం.*

ckanneganti@gmail.com

"ఏమిటి మా అమ్మాయి సమస్య?" తల్లి అడిగింది.

"సమస్య మీ అమ్మాయిది మాత్రమే కాదు, మీ అందరిదీ. తనక్కావలసిందల్లా తను ప్రత్యేకంగా ఉండటం. అలా ఎందుకు ఉండనివ్వరు? మీ సమస్య ఏమిటో తనకి అర్థంకాదు. ఇంతకు ముందు మొహాన పచ్చబొట్టు వేయించుకుందట గదా?"

"మొహాన ఏమిటి వికారంగా. కోప్పడి తీయించాము. అది తప్పా?" తండ్రి అడిగాడు.

"తనకు మొహాన ఒక మచ్చ కావాలనుకుంటే పెట్టుకోనివ్వచ్చు గదా? మీ మాటే నెగ్గాలనే పట్టుదల మీకెందుకు?"

"కానీ ఆ మొహం కోసం ఎంత డబ్బు పోశాం? తను అందరిలా అంత అందంగా లేదని బాధపడుతుందనే కదా? పిల్లలకి ఏ లోటూ ఉండకూడదనే కదా ఏ తల్లిదండ్రులైనా కోరుకొనేది? ఎందుకలా తనను తాను హింసించుకొని మమ్మల్ని వేధిస్తుంది?"

"మీ సంతోషమే మీ అమ్మాయికి సంతోషం కావాలంటే ఎలా? ఎక్కడో రాజీ పడాలి. మీ అమ్మాయిని అందంగా చూడాలనుకుంటున్నారా, ఆనందంగానా? ఒక మచ్చను కనీసం కొంతకాలం ఉండనీయండి. తర్వాత మీరు చెప్పినట్టు విని మచ్చ తీయించుకోవడానికి ఒప్పుకోవచ్చు కదా?" ఇద్దరినీ మార్చిమార్చి చూస్తూ చెప్పాడు.

"పోనీ ఆపని చేసి చూద్దాం! మాటిమాటికీ ఎమర్జెన్సీ వార్డుల చుట్టూ, డాక్టర్ల చుట్టూ తిరగడమైనా తప్పుతుంది," భర్త వంక చూస్తూ చెప్పింది తల్లి.

*

ఆగినట్టున్న నెత్తురు అడ్డుగా పెట్టిన దూది తీయగానే కారడం మొదలెట్టింది. కంటతడి లేదు. గోడకున్న ఫోటోలో కదులు తున్న ఆకుల్ని చూస్తుంది.

"ఇంత లోతుగా ఎలా తెగింది?" డాక్టరు గాయాన్ని శుభ్ర పరుస్తూ అడిగింది.

"పొరపాటున తెగింది," తల్లి చెప్పింది నెత్తుటి వంకే చూస్తూ.

"మచ్చ మాసిపోతుందా? పూర్తిగా మాసిపోవడానికి ఎన్నాళ్ళు పడుతుంది?" తండ్రి అడిగాడు గాయం వంకే చూస్తూ.

"గాయం మానడానికి ఎన్నాళ్ళు పడుతుంది అని అడుగుతారు మామూలుగా," డాక్టర్ ఆయన వంక చూసి చెప్పి తలతిప్పి తన పని చేసుకుపోతూ అంది, "మరింత నెత్తురు కారకుండా చేయడమే ఇక్కడ ఎమర్జెన్సీలో మా పని. మచ్చ మాసిపోవడానికి మీ ఫామిలీ డాక్టర్‌తో ఫాలోఅప్ కండి."

*

వెయిటింగ్ రూమ్‌లో తన వంతు కోసం ఎదురుచూస్తుంది. పక్కనే తల్లి. ఇంకా చాలా మంది తల్లులూ, తండ్రులూ, పిల్లలూ.

"నువ్వు నాకు తెలుసు," పక్కనున్న అమ్మాయి అంది.

తలతిప్పి చూస్తే చెప్పింది.

"అశోక్‌నగర్లో మీరు మా పైనే ఉండేవాళ్ళు. అయిదేళ్ళవుతుంది. గుర్తున్నానా, ఇద్దరం కలిసి ఆడుకునేవాళ్ళం?" ఆ అమ్మాయి నవ్వుతూ అడిగింది.

తల్లి తలతిప్పి చూసి తిరిగి టీవీ చూస్తూంది.

"అవును. కానీ... మరి... నువ్వు ఇలా అయిపోయావేమిటి?"

"గుర్తుందా నన్నెప్పుడూ ఎగతాళి చేసేదానివి? చప్పిడిముక్కనీ, చిన్నకళ్ళనీ? నేనెప్పుడూ నీ అంత అందంగా కావాలనుకునేదాన్ని. అప్పట్నుంచీ గొడవ పెడితే ఈమధ్యే ఒప్పుకున్నారు డాడీ. ఇప్పుడు బాగా చవకా, తేలికా అయ్యింది కదా! ఒక్కోటీ మార్చు కుంటూ, ముందు ముక్కూ, తర్వాత వరుసగా దవడలూ, నుదురూ, పెదాలూ, పళ్ళూ, కళ్ళూ, చెవులూ, ఒంటి రంగూ... ఇప్పుడు అచ్చం నేను కూడా డిజైనర్ బేబీలానే ఉన్నా కదూ!" ముఖాన్ని తడుముకుంటూ చెప్పింది ఆ అమ్మాయి.

కొద్దిసేపు తేరిపార చూసి చెప్పింది, "అవును అందుకే గుర్తుపట్టలేదు. మరి ఇక్కడి కెందుకు..."

"మొదట్లో బాగానే ఉండేది. నీలా ఏడిపించిన వాళ్ళకి చూపించుకుని వాళ్ళు లోలోపల కుళ్ళుకుంటుంటే నవ్వుకునేదాన్ని. తర్వాత నాది కాని ఎవరిదో మొహం తగిలించుకున్న భావన. ఏదో పరకాయ ప్రవేశం చేసినట్టు ఇప్పుడు ఎలాగోలా బయట పడాలనిపిస్తుంది. ఐ మిస్ మై సెల్ఫ్ సత్యా!"

ఏదో అనబోయి ఆ అమ్మాయి కళ్ళనీళ్ళు తుడుచుకుంటుంటే ఆగింది.

"నన్ను ఎవరూ గుర్తుపట్టరు. ఇదుగో నా ఫోటో పర్స్‌లో పెట్టుకు తిరుగుతుంటాను," తీసి చూపించింది.

చూసి, ఆ అమ్మాయి కేసి, ఫోటోకేసి మార్చి మార్చి చూసింది. "నువ్వు నాకు తెలియదు. నేనూ నీకు తెలియదు. మేము అశోక్‌నగర్‌లో ఉన్న మాట నిజమే కాని నా పేరు సత్య కాదు."

వాళ్ళమ్మ సర్ది చెప్పింది. "ఏ డీబీని చూసినా ఆ సత్యే అనుకుంటుంది."

“కనీసం నీకు నీ ఫోటో అయినా ఉంది,” చెపుతూండగానే నర్స్ వచ్చి పిలిచింది.

*

తెర మీద దృశ్యాలు మారుతున్నాయి నెమ్మదిగా. ఒక పసిపాప యువతిగా, ఇంకో పసిబిడ్డ యువకుడిగా ఎదుగుతున్నారు.

“జాగ్రత్తగా గమనించండి. ఈ పిల్లల్ని మించి అందంగా ఉన్న ఎవరినైనా చూశారా ఎప్పుడైనా, ఎక్కడైనా?”

జవాబు చెప్పకుండా కళ్ళప్పగించి చూస్తున్న వారిద్దరి వంకా చూస్తూ చెపుతూంది అలవాటయిన మాటల్ని. “ఎవరూ వంక పెట్టలేని, తల తిప్పుకోలేని పరమోత్తమ సౌందర్యం. పర్ఫెక్ట్ బ్యూటీ. ఇది మామూలు సౌందర్యం కాదు. ఎంతోమంది శాస్త్రవేత్తలు ఎన్నో రోజులు శ్రమించి, ఎంతో సమాచారం సేకరించి, పరిశీలించి, పరిశోధించి చివరికి తేల్చి చెప్పిన ముఖ కవళికలతో, కొలతలతో చేయబడిన మూస ఇది. ప్రపంచంలో ఏ జాతిలోనూ ఇంతకు మించిన సౌందర్యం లేదన్నది ఇప్పుడు అందరూ ఒప్పుకొంటున్న నిజం. ఇది మేకప్ వేసిన మొహం కాదు. ఈ మొహానికి మేకప్ అవసరమే లేదు.”

వాళ్ళు తనవైపు చూసిందాకా ఆగి మళ్ళీ మొదలెట్టింది. “జీన్ మోడిఫికేషన్ అద్భుతాన్ని దీనికి జోడిస్తే మీ పాపా ఇంత అందంగా పుడుతుంది. ఎదిగేప్పుడు ప్రతి వయసులో ఖచ్చితంగా మీరు ఇంతకుముందు చూసినట్టే, అంత అందంగానే ఉంటుందని మా హామీ. రేపు మీ పాప తన చుట్టూ ఉన్న ఇంత అందమైనవాళ్ళని చూసి తనూ అలా లేనందుకు కృంగిపోకుండా ఇప్పుడే జాగ్రత్త పడండి.”

“కానీ మా పోలికలు లేకుండా పుడితే మా బిడ్డ అనిపించదు కదా?”

“మీ తెలివితేటలతో సంబంధం లేకుండా మీకంటే మీ పిల్లలు తెలివిగా పుట్టా లనుకోవడం లేదా? ఇదీ అలాగే! అదీకాక పిల్లల రూపాన్ని మాత్రమే మార్చడం మేము చేసే పని. చట్టప్రకారం వాళ్ళ బుద్ధికి చెందిన ఏ జీన్‌నూ ఏ మాత్రమూ మార్చకూడదు. వాళ్ళ స్వభావాలూ, మనస్తత్వాలూ, నడవడికా, తెలివితేటలూ అన్నీ మీవే వస్తాయి. పైగా మీలాగా మెడ ఓరగా పెట్టి కళ్ళు చికిలించడమో, లేక మీలా నుదురు ముడివేయడమో లాంటి అలవాట్లు ఎటూ వస్తాయి.”

ఆలోచనల నిశ్శబ్దం.

“బలవంతమేమీ లేదు. నిజమే, ఫీజ్ కొంచెం ఎక్కువే. కానీ ఇంత గొప్ప అవకాశం అందుబాటులో ఉన్నప్పుడు ఎవరు వదులుకుంటారు? తాహతు గలవాళ్ళు ఇప్పటికే ఇద్దరేసి పిల్లలకి ఆర్డర్స్ ఇచ్చారు.”

“ఆ ప్రొసీజర్ అదీ...”

“మామూలే. మీ స్పెర్మ్, ఎగ్ తీసుకొంటాం. ఇన్‌విట్రో ఫర్టిలైజేషన్ కాగానే జీన్ మోడి ఫికేషన్ జరుగుతుంది. మీరు కనాలనుకుంటే సరే, లేదా సరొగేట్ తల్లులైనా సిద్ధంగా ఉన్నారు. తేలిక వాయిదాల పద్ధతి మీద ఋణసాయం మేమే చేస్తాము. అప్పు ఇక్కడ తీసుకుంటే పిల్లలకి ఐడీ చిప్ ఉచితం కూడా.”

“డిస్కౌంటేమయినా ఇవ్వరా?”

నవ్వుతూ చెప్పింది, “లేదు, మీ బిడ్డ భవిష్యత్తుని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి.”

*

“మచ్చ ఊరికే మాసిపోతుంది. బెంగపడక్కర్లేదు. కానీ ఇది మూడోసారి కదా? రెండుసార్లు వాతలు, ఒకసారి చాకు. మీరేమీ చేయకపోతే ఎట్లా?” డాక్టర్ చెంప మీద మానుపడుతున్న గాయాన్ని దగ్గర నుంచి చూస్తూ అడిగాడు.

“నెత్తీ నోరూ బాదుకుని చెపుతూనే ఉన్నాం దానికి. ఇంకా ఏం చేయమంటారు? ఇక్కడికి రావడానికి ఎంత గొడవ చేసిందో ఈరోజు! ఎందుకిలా చేస్తుంది? దీనిలా ఇందరున్నారు, అందరూ ఇలా చేస్తున్నారా?” జీరపోతున్న గొంతుతో తల్లి అడిగింది.

“టీనేజ్ ట్రబుల్స్... ఇలాటి కేసులు చాలానే వస్తుంటాయి మాకు. ఇంతకు ముందు చెప్పాగదా ఒకసారి సైకాలజిస్ట్ దగ్గరికి వెళ్ళమని. ఇంకా నిర్లక్ష్యం చేయొద్దు.”

“ఏమైనా ఉంటే ఇది మాకు చెప్పొచ్చుగదా? మేం శత్రువులమా?” తల్లి చెమర్చిన కళ్ళను పక్కకి తిప్పుకుంటే తండ్రి చెప్పాడు, “ఈసారి వెళతాం తప్పకుండా! ఆయన పేరు చెప్పండి మళ్ళీ.”

ఇదేమీ వినకుండా మచ్చను తడుముకుంటూ, కిటికీ అద్దంలో కనపడీ కనపడని తన ప్రతిబింబాన్ని కళ్ళప్పగించి చూసుకుంటూ ఉంది.

*

చెంప మీదుగా కట్టుతో కూచుని ఉంది.

“ఏమైంది మళ్ళీ?” సైకాలజిస్ట్ అడిగాడు.

“మీరు చెప్పినట్టే చేశాం. అప్పుడు పెట్టుకున్న చాకుగాటు అలాగే ఉండనిచ్చాం,” తండ్రి చెప్పాడు.

“మంచి నిర్ణయమే అది. మరి ఇప్పుడేమైంది?”

“మొన్న మళ్ళీ కోసుకుంది,” తల్లి కళ్ళనీళ్ళు నింపుకుంటూ చెప్పింది.

అతను తేరుకుని, “మీరు కాస్త బయటకు వెళ్ళండి,” అని చెప్తే వెళ్ళారు. దగ్గరగా వెళ్ళి అడిగాడు, “మనం దీని గురించి మాట్లాడుకున్నాము గదా? నీక్కావలసింది కేవలం ఒక్క మచ్చ అని చెప్పావు గుర్తుందా? మళ్ళీ ఇదంతా ఏమిటి?”

బదుల్లేదు.

అలాగే జవాబు కోసం నిలుచుని చూస్తుంటే పక్కచూపులు చూస్తూ చెప్పింది. “ఇప్పుడు వాళ్ళంతా నాలాగా చాకుతో గాటు పెట్టుకుని మచ్చ చేసుకున్నారు. నాకు రెండు మచ్చలు కావాలి.”

*

తెర మీద దృశ్యాలు మారుతున్నాయి నెమ్మదిగా. ఒక సగంలో బొమ్మ స్థిరంగా ఉండి, రెండో సగంలో అదే బొమ్మ కొద్ది తేడాలతో మారుతూ ఉంది.

“ఎడం వైపున్నది మా మొదటి వర్షన్ మూస. పర్ఫెక్ట్ బ్యూటీ. చాలా విజయ వంతమైంది కానీ కొన్ని కాంప్లికేషన్స్ వచ్చిన మాట వాస్తవం. సెకండ్ వర్షన్ ఈజ్ బెటర్ దేన్ పర్ఫెక్ట్. ఈ వెర్షన్‌లోనూ అదే మూస వాడినప్పటికీ కొద్ది మార్పులూ చేర్పులూ ఉండేలా జాగ్రత్త తీసుకుంటాము. ఏ ఒక్క బేబీ మరోలా ఉండదని మా హామీ. దేని ప్రత్యేకత దానిదే.”

“మార్పు అంటే?”

“చిన్న లోటు. ముక్కు కొద్దిగా పొట్టిగా, లేక పొడుగ్గా, పెదాలు కొద్దిగా సన్నగా, కళ్ళు కొంచెం చిన్నగా... ఆ ఛాయిస్ మీదే.”

“ఇంత డబ్బు పెడుతున్నప్పుడు మళ్ళీ ఆ కొద్ది లోటూ ఎందుకు? అందరికీ ఎటూ కొంచెం తేడాగా ఉన్న బేబీని డిజైన్ చేస్తున్నప్పుడు ఆ పర్ఫెక్ట్ బేబీని మాకోసం చేయొచ్చు గదా? ఎంత డబ్బయినా ఫర్వాలేదు.”

*ఈమాట అంతర్జాల పత్రిక*
*మార్చి 2008*

## నేపథ్యం

సౌందర్యాన్వేషణ ఆత్మహింస

# మచ్చ

***దేన్నయినా మరొకరు చేశారంటే గుడ్డిగా దాన్ని అనుకరించడమూ, మళ్ళీ అందులో పోటీ పడటమూ మామూలే. ఇదొక వైరుధ్యం- మనం అందరిలా ఉండాలనుకుంటాం, మళ్ళీ అందరిలా కాకుండా ప్రత్యేకంగా ఉండాలని తపన పడతాం. ఇక మిగతా అందరూ ఆ ప్రత్యేకత కోసం ఎగబడటం. ఇదొక ఎడతెగని జాలిగొలిపే, బాధ కలిగించే వ్యవహారం.***

ఈ కథకు బీజం ప్లాస్టిక్ సర్జరీ ప్రకటనల్లో మార్చుకున్న మొహాలు చూసినప్పుడు కలిగిన ఆలోచన. తమ మొహాల్నీ, శరీరాలనీ శస్త్రచికిత్సతో సవరించుకున్న వాళ్ళంతా చెప్పేది తమలో పెంపొందిన ఆత్మవిశ్వాసాన్ని గురించి. అయితే అద్దంలో తమ మొహాలు చూసుకున్నప్పుడు వాళ్ళకి తమ అసలు మొహాలు గుర్తుకు రావా? వాటిపై బెంగవేయదా? ఎవరో అపరిచిత వ్యక్తి దేహంలోకి ప్రవేశించినట్లు వింతగా ఉండదా? ఇంకా నేను నేనేనా?

అప్పుడప్పుడూ చదువుతూ వచ్చిన వార్తాకథనాల మూలాన దానికి మరిన్ని ఆలోచనలు తోడయ్యాయి. మనం దేన్ని అందంగా పరిగణిస్తాం? అందానికి నిర్వచనం కాలం, జాతీ, సంస్కృతులను బట్టి మారుతూ ఉంది. కానీ ఇప్పుడు రకరకాల మాధ్యమాల వల్ల సౌందర్యానికి ప్రమాణాలు సార్వజనీకరణమవుతున్నాయి, మన ఇష్టాయిష్టాలతో పనిలేకుండా. ఇప్పుడు అందమంటే కనీసం తెల్లగా, సన్నగా, పొడుగ్గా ఉండాలన్న విషయం అందరికీ తెలుసు. భవిష్యత్తులో మన మొహాలు ఎలా వుంటే అందంగా ఉంటాయన్నది కూడా మనమీద రుద్దబడుతుందా? అసలు పరిపూర్ణమైన సౌందర్యమనేది ఉందా? జన్యుకణ పరిశోధనలు మనం కోరుకున్న రీతిలో పిల్లల్ని కనగలిగే సదుపాయం కలగజేస్తే ఏమవుతుంది?

ఒకవైపు సౌందర్యాన్ని సాధించడానికి పడే పాట్లలో ఆత్మహింస ఎక్కువవుతూ ఉంది. పైపై పూతలూ, మెరుగులూ వదిలేసినా రెండంగుళాల పొడవు కోసం అంత

హానికరంగా పైకి కనపడని ఎత్తు మడమల చెప్పుల నుంచి కాలి ఎముకలు కోసి నెలల తరబడి సాగదీసే ప్రక్రియ దాకా భరిస్తూనే ఉన్నారు. విఫలమైన శస్త్రచికిత్సల వికృత ఫలితాలకు చెందిన వార్తలూ చూస్తూనే ఉన్నాము. మనం అందంగా కనపడాలని ఎందుకనుకుంటాం, అంత విపరీత కష్టనష్టాలకు ఓరుస్తూ కూడా? అందానికి అంత విలువ ఎందుకిస్తున్నాం? పరిపూర్ణమైన సౌందర్యం సాధ్యపడితే, అది సిద్ధిస్తే సంతృప్తి కలుగుతుందా?

దేన్నయినా మరొకరు చేశారంటే గుడ్డిగా దాన్ని అనుకరించడమూ, మళ్ళీ అందులో పోటీ పడటమూ మామూలే. ఇదొక వైరుధ్యం- మనం అందరిలా ఉండాలనుకుంటాం, మళ్ళీ అందరిలా కాకుండా ప్రత్యేకంగా ఉండాలని తపన పడతాం. ఇక మిగతా అందరూ ఆ ప్రత్యేకత కోసం ఎగబడటం. ఇదొక ఎడతెగని జాలిగొలిపే, బాధ కలిగించే వ్యవహారం. అందం అనేది ప్రత్యేకంగా గుర్తించబడటానికున్న దారుల్లో ఒకటేనా? ఏకైక వ్యక్తులమని ప్రదర్శించుకోవడానికి ఇంత కష్టపడవలసిన పనేమిటి? ముందే సృష్టిలో ప్రతి వ్యక్తీ ఏకైక వ్యక్తే కదా!

ఇన్ని గజిబిజి ఆలోచనల నుంచి కొన్ని దృశ్యాలు మాత్రం మనసులో పొడగట్టాయి. కొన్ని విషాదపూరితమైన మొహాలు. ఇది మొదలూ, మధ్యభాగమూ, తుదీ ఉండే సాంప్రదాయకమైన కథ కాలేదని తెలిసిపోయింది. ఇది ప్రత్యేకించి ఏ ఒక్కరి కథా కాబోదనీ, తీసుకున్న విషయానికి అదే న్యాయమనీ అనిపించింది. చెదిరిన మనసుల్లా చెల్లాచెదురయిన ముక్కల్లోంచి కథ రూపు కడుతుందన్న నమ్మకం చివరి పేరా మాత్రం రాస్తుండగా తోచింది. మనకేది కావాలో, ఏది తృప్తి నిస్తుందో మనకు తెలియదు.

ఫలితం - ఏంలేదు. ఆ పిల్లల బాధ తగ్గించేందుకు ఏమీ చేయలేకపోయానన్న విచారం. అంతే.

*24 అక్టోబర్ 2012*

*'మచ్చ' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

9



*కాట్రగడ్డ దయానంద్ 1965 అక్టోబర్ 14న ప్రకాశం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ లాటరీ 1982లో ప్రజాసాహితి మాసపత్రికలో అచ్చయింది. రెండు కథా సంపుటాలు, ఒక కవితా సంపుటి ప్రచురించారు. పోస్టల్ శాఖలో ఉద్యోగం.*

**చిరునామా**

*302, పచ్చల టవర్స్*
*కరెంట్ ఆఫీసు ఎదురుగా,*
*పలకలూరు రోడ్, గుజ్జనగుండ్ల*
*గుంటూరు-522 006*
*Ph.: 94902 18383*
dayanandkatragadda@gmail.com

# గుండ్లకమ్మ తీరాన

## కాట్రగడ్డ దయానంద్

సముద్రపు పోటు తగిలినట్టుంది- ఎండ పెరిగే కొద్దీ గుండ్లకమ్మలో నీటి మట్టం కొద్దికొద్దిగా పెరుగుతోంది. దరిన ఉన్న ఇసుక మెల్లిమెల్లిగా నీటి అలల నురగతో తడుస్తూ కరిగి నీళ్ళ కిందికి చేరిపోతూ వుంది. అక్కడక్కడా అప్పుడప్పుడూ ఒక మాదిరైన చేపలు గాల్లో మూకుమ్మడిగా పల్టీలు కొడుతూ ఉప్పునీళ్ళల్లో సయ్యాటలాడుతున్నాయి.

వెంకటేశ్వర్లు చేతికర్ర చివరను రెండు పిడికిళ్ళతో బిగించి గడ్డం కింద ఆనించుకుని రెండో చివరను ఇసుక నేలకు తాటించి గుండ్లకమ్మ ఒడ్డున నిలబడే కలగంటున్నాడు. అతడికి నిరంతరం వచ్చే కల-

నిద్రలోనూ మెలకువలోనూ, పగలూ రాత్రీ- ఎప్పుడు పిలిస్తే అప్పుడు పలికే కల- ఏళ్ళ తరబడి అతడ్ని వెంటాడుతున్న ఒక మధురస్వప్నం- రాళ్ళూ రప్పలేరి, కంపా ముల్లూ తీసి ఒక సారవంతమైన భూమిని వ్యవసాయానికి సిద్ధం చేసిన మెట్టప్రాంతపు మొరటు మనిషి ఒంటరిగా అలా గుండ్లకమ్మ ఒడ్డున నీళ్ళ ముందు నిలబడి వాటిని ఆవాహన చేస్తున్నప్పుడు వేధిస్తున్న అపురూపమైన స్వప్నం- ఆకుపచ్చని స్వప్నం.

గుండ్లకమ్మ నుంచి కాలువలు కాలువలై పొలాల్లోకి గలగలమని దూకే జల- మట్టిని ముద్దిడి సలిబిండి ముద్దని చేసి, పచ్చపచ్చని చెట్లపాదుల్ని మొలిపించి, సన్నటి తీగెల చేతుల్తో అలా ఆకాశాన్ని భూమితో ఆలింగనం చేయించి, రాశులు రాశులుగా రకరకాల పరిమాణంలో కూరగాయల్ని సృష్టించి, సమస్త ప్రపంచం అబ్బురపడేట్లు సమస్త ఆకాశం మబ్బులతోకల్ని విద్యుత్తీగెలు చేసి 'ఓహో' అని మెరిసి బిగ్గరగా కేకేసేట్లు ఒక మహిమగల మనిషి రెండు చేతుల్ని పూర్తిగా విస్తరించి వాటేసుకున్నా పట్టుకోలేనంత గుమ్మడికాయలు, అలా ఆకాశమ్మీంచి భూమ్మీదకి రహదారుల్లా సాగిన పొట్లకాయలు- ఒక అద్భుతం, ఒక ఆశ్చర్యం, గుండ్లకమ్మ తీరమంతటా కూరగాయలన్నీ బండ్లయి సాగిపోతున్న రహదారులు- గుండ్లకమ్మ తన నీళ్ళ చేతుల్తో పొలాల మీదికి చల్లిన ఒక మంత్రవ్యూహం- అతడి అనాది స్వప్నం!

కనబడని జలం జీవొకటి బుడుంగున పెద్ద శబ్దం చేస్తూ నీళ్ళల్లో కదిలి పోయింది. వర్తమానంలోకి వచ్చేడు వెంకటేశ్వర్లు. నీళ్ళల్లో శబ్దం వచ్చిన వైపు చూసేడు. తళతళమని మెరిసే నీళ్ళు తప్ప మరేమీ కనబడలేదు. నీళ్ళల్లో మునిగి మోరలు మాత్రం పైకెత్తి కళ్ళు మూసుకుని నెమరేస్తూ ఆనందాన్ని అనుభవిస్తున్న బఱ్ఱెగొడ్ల వైపు దృష్టి సారించేడు. కాపుగారి చిన్న జీతగాడు యాకోబు దున్నకుఱ్ర తోక పట్టుకొని గుండ్లకమ్మను ఈదుతున్నాడు. పడ్డదూడలు రెండు గుండ్ల కమ్మను దాటి అవతలి ఒడ్డునున్న సవక తోటలవైపు పని ఉన్నట్లుగా బయల్దేరేయి. కల పూర్తిగా కరిగిపోయింది.

"ఈటమ్మ! ఈటికెప్పుడూ తిండియావేరా! ఒరేయ్ యాకోబూ, కాస్త ఆ పడ్డ దూడల్ని ఏట్లోకి మళ్ళగొట్టరా," అరుస్తూ చెప్పేడు వెంకటేశ్వర్లు. దున్నకుఱ్ర తోక వదిలి పెట్టకుండా మాటలు వినవచ్చిన వైపు చూసి తనకేమీ పట్టనట్లు నీళ్ళల్లోనే ఉండిపోయేడు యాకోబు.

"ఒరే నాయనా! నిన్నేరా! కాస్త వాటిని అదిలిచ్చిపెట్టరా," బతిమిలాడేడు వెంకటేశ్వర్లు. యాకోబు దున్నపోతు తోకను వదిలి ఈదుకుంటూ వెళ్ళి నాలుకతో రిచ్చగొడుతూ అవతలి గట్టుకి చేరేడు.

ఎండ తీక్షణమయ్యేకొద్దీ చేలల్లో ఎండు దుబ్బుల్ని కొరుకుతున్న పశువులు గుండ్లకమ్మ దారిపట్టేయి. పశువులన్నీ గుండ్లకమ్మలో చేరినాక ఒడ్డున విస్తరించి ఉన్న జపాన్ తుమ్మచెట్ల కిందకు చేరి పై కండువాల్ని పరిచి కూర్చున్నారు గొడ్లను కాయడానికి వచ్చినవాళ్ళు.

ఆడామగా మొత్తం పది పన్నెండుమంది. కాపుగారి జీతగాడు యాకోబు తప్ప మిగతా అందరూ సొంత పొలాలున్నవాళ్ళే. కాపుగారికి అరవై డెబ్భై ఎకరాల పొలముంటే మిగతా వాళ్ళంతా ఎకరా నుంచి నాలుగైదెకరాల లోపువాళ్ళే. గుండ్లకమ్మ ఒడ్డున భూమి ఉన్నవాళ్ళు మాత్రమే అక్కడకు పశువుల్ని తోలుకొస్తుంటారు. అదొక కనబడని కట్టుబాటు. అందరూ బఱ్ఱెగొడ్లను మేపుకుంటూ నడిజాముకల్లా అక్కడకు చేరి గొడ్లను నదిలోకి తోలి తెచ్చుకున్న ముద్ద తిని కాస్సేపు చెట్ల కింద నడుం వాల్చి మళ్ళీ పొద్దు కాస్త వాలగానే బఱ్ఱెగొడ్లను మేపుకుంటూ ఇంటిదారి పడతారు. గుండ్లకమ్మ ఒడ్డు పొడుగూతా కూతవేటు దూరాలలో గుంపులు గుంపులుగా జనం ఎండ పూట నీడ చూసుకుంటారు.

"ఏం మామా! నీడకు రావా ఏంది? మనవడు గుర్తొచ్చినాడా ఎట్ట! ఆలోచిస్తా అట్టనే ఎండలో నుంచున్నావ్!" కోడలు వరసైన కమల వెంకటేశ్వర్లుని కేకేసింది. వెంకటేశ్వర్లు ఒక చేత్తో కింద పెట్టిన అన్నం టిఫిన్నీ, మరోచేత్తో మంచినీళ్ళ సీసా తాడును పట్టుకుని కఱ్ఱకు ముందూ

వెనకా తగిలించి కావడిలా భుజమ్మీద పెట్టుకుని తనూ జపాన్‌చెట్టు నీడకు చేరేడు. అంతమంది ఎప్పుడొచ్చి చేరారో గమనించనేలేదు వెంకటేశ్వర్లు. అతడి చిన్నాయిన కొడుకు రంగయ్య, ఆయన ఇద్దరు కొడుకులు, దగ్గర బంధువులైన మరో ముగ్గురు ఆడవాళ్ళు, మగవాళ్ళు మాదిగ రోశయ్య, కాపుగారి జీతగాడు యాకోబు చెట్ల కింద దూరదూరంగా కూర్చుని ఉన్నారు. వెంకటేశ్వర్లు కఱ్ఱను కిందకు దించి నేల మీద ఉంచి పై కండువాను కింద కువ్వలా వేసి దాని మీద కూర్చుని మోకాళ్ళు మడిచి అరికాళ్ళు నేలకు తాటించేడు.

"అవునే కోడలా! నాకొక్కడైతే వాడికొక్క నలుసు! గుర్తు రాకుండా ఎట్టుంటాడు? ఏడో తరగతి పరీక్షలు రాసేడు. ఎండాకాలం సెలవులకొస్తాను. పొలం తీసకపోయి తాటిముంజలు కొట్టిస్తావా! అంటా రాత్రి ఫోన్ చేసేడే పిల్లా," అన్నాడు వెంకటేశ్వర్లు.

"తాటి చెట్లెక్కడంలో మొనగాడివి కదా! నీకేం నాయనా! ఎన్ని గెలలైనా కొట్టి మనవడికి పెట్టుకోవు!" ఒకామె నిష్ఠూరమాడింది.

"తాటిచెట్టేంది! దానెమ్మ చెట్టునైనా చిటికెలో ఎక్కేస్తానే కోడలా! ఏదీ, ఎవుడినైనా నాతో పందెం పెట్టుకోమను," కమలతో కళ్ళెగరేస్తూ అన్నాడు వెంకటేశ్వర్లు.

"సాల్లే! ఎచ్చులకేం తక్కువలేవు. ఏదీ! నాలుగ్గెలలు దించు చూద్దాం," ఇంటి దగ్గర ముంజల కోసం మొహం వాచిపోయిన పిల్లల్ని గుర్తుకు తెచ్చుకుని రెచ్చగొడ్తున్నట్లుగా అంది కమల.

"ఆహాఁ! అట్టనా," అని నవ్వి, "కోడలు పిల్లా, నీ వయసెంతోగాని, నలభైయుంటయ్యా. నువ్వప్పటికి పుట్టలేదనుకుంటా! ఇదే కరణంగారి చేనుని కౌలుకు చేస్తన్నా! అంతకుముందు మా తాతలు, మా అయ్య కరణంగారి దగ్గర జీతానికుండే వాళ్ళు. వాళ్ళు సాగు చేసినయ్యే ఈ భూములన్నీ. కరణం కుటుంబాలు పట్నాలు పట్టిపోతే ఆ భూమినే నేను కౌలుకు తీసుకున్నా. నాకు నీళ్ళన్నా, వానన్నా, మొయిలన్నా, మెరుపులన్నా ఎంత సంబరమో! వాన కురిస్తే చాలు పొలాన్ని వదలబుద్ధయ్యేది కాదు. మిగతా వాళ్ళంతా వాన కురిస్తే పొలం దిక్కు చూసేవాళ్ళు కాదు. నేనొక్కడ్నే ఒంటరిగా ఈ గుండ్లకమ్మ ఒడ్డున బఱ్ఱెగొడ్లను కాస్తూ గట్టిపడిన ఇసుకలో మెత్తగా నడుస్తూ, వెనక్కి తిరిగి వచ్చిన అడుగుల్ని చూసుకుంటూ ఆనందంతో తిరిగేవాడ్ని. ఒక్కో చినుకు ఆకాశంలోంచి జారి గుండ్లకమ్మ నీళ్ళల్లో పడగానే గుండ్లకమ్మ పడే జలదరింతను వానలో నుంచుని చూస్తా ఉంటే కోడలా! ఒళ్ళంతా కైపెక్కినట్టే ఉండేది. ఆ వొయస్సట్టాంటిదిలే! ఒక మాలేమైందని," అంటూ అందర్నీ చూసేడు.

దూరంగా కూర్చున్న రోశయ్య యూరియా గోతం పోగులు తీసి తాడు పేనుతూ వెంక టేశ్వర్లు వైపు చూసి నవ్వేడు. రంగయ్య నేల మీద వేలితో దేన్నో దేవులాడుతున్నాడు. మిగతా వాళ్ళందరూ వెంకటేశ్వర్లు వైపు చూస్తున్నారు.

"అయ్యోవ్! బూతు పురాణాలైతే విప్పొద్దులే," కమల మొహమాటపడింది.

"అదిగాదులే పిల్లా! వాన గురించి కదా చెబుతున్నా. ఒకరోజు పొద్దున్నే మొదులైంది వాన. గొడ్లను వానలోనే తోలుకొచ్చా. వానకు దడిచి అంతా ఇళ్ళల్లోనే ముడుక్కున్నారు వెచ్చగా. నేనొక్కడ్నే ఇక్కడకు చేరా. వాన పెద్దదైంది. తిరగడానికి వీలుగాలా. గొడ్లను కొష్టంలో కట్టేసి మంచం వాల్చుకున్నా. ఈదురుగాలి మొదులైంది. తెచ్చుకున్న అన్నం రెండు పూటలకు సర్దుకున్నా. రాత్రికి గాలిజోరు పెరిగింది. పెద్ద గాలోన. పెరుగుతుందేగాని తగ్గల. బఱ్ఱెగొడ్లని విప్పేసి కట్టు

మట్లోంచి తోలేశా. వాటి జీవానికి అయ్యి జారుకున్నై. ఒకేపున ఆకలి జోరు, మరోవైపున సముద్రం హోరు. ఊళ్ళో నుంచి ఎవురన్నా అన్నం తెస్తారేమోనని ఎదుర్చూశా. ఎవుడికి గుండెలు సాలతాయి? ఏం జెయ్యమంటా! కొష్టం పందిరికి వేళ్ళాడే కాకరపిందెలు, సొరపిందెలు, నేతిబీర పిందెలూ ఒకటనేముంది, ఏది చిక్కితే అది తిన్నా! అంతమటుకు బాగుంది. రెండోరోజు సాయంత్రానికి గుండ్లకమ్మకు ఎల్లవ మొదలైందిరా! ఇంక చూడు నా సామిరంగా! ఉండే కొందీ ఎల్లవ పెరుగు తుందేగాని తగ్గటంలా. భుజాలకాడికొచ్చింది ఎల్లవ. ఇట్ట కాదనుకుని ఒక్క ఊపున తాటిచెట్టెక్కి కూర్చున్నా. చుట్టూ మన్నూ మిన్నూ ఏకమైనట్టు నీళ్ళు. చెట్టును వాటేసుకుని నేను. అంత ఎల్లవ లోనూ నాకేం భయమెయ్యలేదుగాని కోడలా! ఆకలికి మాత్రం తట్టుకోలేక తాటిచెట్టు చివరకు వెళ్ళా. కమ్మటి వాసన. తాటిపళ్ళు మగ్గినాయిగాని నా అదృష్టం బాగుండి ఇంకా రాలిపడలా! ఒక చేత్తో చెట్టుని ఒడుపుగా పట్టుకొని మరోచేత్తో పండుని ఒడితిప్పి గెల నుంచి లాగి అట్టనే చీకేశా. అట్ట రెండురోజులు చెట్టు మీదనే ఉన్నా! కింద ఎల్లవలో కొట్టుకుపోయే పాములు ఆసరా దొరికిందనుకుని తాటిచెట్టుకు చుట్టుకుని మెల్లిగా పాకి పైకొచ్చి నన్ను చూసి భయపడి మళ్ళీ బుడుంగున నీళ్ళల్లో పడేయి పాపం. ఆకరికి మీ నాయినే, కాస్త ఎల్లవ తగ్గుముఖం పట్టినాక నడుముకి సద్ది కట్టుకుని రోశయ్యని తోడు తీసుకొని ఈదుకుంటా వచ్చేడు. నీకిచ్చిన చేను ఆయన కరణం దగ్గర కౌలుకు చేస్తున్నాడు. రోశయ్య చిన్న కరణం దగ్గర జీతానికున్నాడు. సచ్చి ఏడున్నాడో మీ నాయన- నేనంటే ఎంత ఇదో! ముగ్గురం రక్తాక్షి సంవత్సరంలోనే పుట్టామంట. నేనూ, రోశయ్యా, మీ నాయినా,'' తన సాహసాన్ని వివరించేడు వెంకటేశ్వర్లు.

''చెప్పిన పురాణం ఎన్నిసార్లు చెబుతావులే. రోశయ్య బాబుకాడ కొడవలుంది. లేచి నాలుగు గెలలు తాటికాయలు కొట్టు. పిల్లలు ముఖం వాచి ఉన్నారు,'' అంది కమల మొహమాటం వదిలేసి.

''మామా! గాలోనలో తాటిచెట్టెక్కి రెండ్రోజులుండటం గురించి చెప్పేవుగాని ఎండ్రకాయ బొక్కలోని ఈతముల్లు గుచ్చుకుని అల్లాడటం గురించి ఎప్పుడూ చెప్పవేం మామా!'' అడిగేడు అల్లుడు వరసైన అతను.

''నోర్మూసుకోరా ముండనాయాల! అన్నీ రుచీపచీ లేని యవ్వారాలు,'' అంటూ కసురు కున్నాడు రంగయ్య.

''అది మాంఛి వయసులో ఉన్నప్పుడు కతలే అబ్బాయ్. మాకప్పుడు పెళ్ళిల్లు అంత తొందరగా అయ్యేవా ఏంది? వెంకటేశ్వర్లుకు సంబంధాలు చూస్తుంటే అప్పుడు మేనగోడలు పుట్టిం దని తెల్సి ఇక చూడటం ఆపేరు. అప్పుడు పెళ్ళిల్లు అట్టా జరిగేయి,'' రోశయ్య నోరు విప్పేడు.

అందరూ నవ్వుకున్నారు. బూతు పురాణాలు విప్పడంలో అఖండుడు రోశయ్య.

''అన్నాలు తిన్నాక నువ్వు మోసుకెళ్ళగలిగినన్ని గెలలు కొట్టి ముంజలు తీసిస్తాలేవే! పిల్లలకు పెట్టుకుందువుగాని,'' అని భరోసా ఇచ్చేడు వెంకటేశ్వర్లు.

అందరూ వెళ్ళి గుండ్లకమ్మలో కాళ్ళూ చేతులూ మొహాలూ కడుక్కుని వచ్చేరు. జపాన్ తుమ్మచెట్ల కింద వెంకటేశ్వర్లు, రంగయ్య, అతడి కొడుకులు, ముగ్గురు ఆడవాళ్ళు ఒక దగ్గర, రోశయ్య, రోశయ్య తమ్ముడి కొడుకు, యాకోబూ వాళ్ళకు కాస్త ఎడంగా కూర్చుని టిఫిన్ క్యారి యర్లు విప్పేరు. వీళ్ళకు కాస్త దూరంగా రెండు జెముడు కాకులు గాల్లో నుంచి సర్రున దూసుకొచ్చి

రోజూలానే తారట్లాడటం మొదలుపెట్టేయి. వాళ్ళు అన్నాలు తిని గుండ్లకమ్మలో చేతులు కడుక్కొని వచ్చి బత్తెగొడ్లను ఒకసారి తేరిపార చూసి చెట్ల కిందకు వచ్చి పై కండువాలు పరుచుకుని నడుములు వాల్చారు.

సరిగ్గా అప్పుడు నాలుగైదు మోటారు సైకిళ్ళు, ఒక టాటాసుమో సర్రున దూసుకుంటూ డొంకదారిలో నుండి వచ్చి గుండ్లకమ్మ ఒడ్డున దారి ఆగిపోయిన దగ్గర ఆగేయి. మొత్తం పది, పన్నెండు మంది పాంట్లు చొక్కాల వాళ్ళు టకటకా వచ్చినంత వేగంగానే కిందకు దిగేరు. వాళ్ళల్లో ఊళ్ళోవాళ్ళు ఇద్దరు ముగ్గురున్నారు. ఎండలో నుంచునే వాళ్ళు తెల్లటి ఎర్రటి రంగు కలగలిసి దుమ్ము లేస్తున్న పొలాల వైపు, ఆ పొలాలకు దక్షిణాన తూర్పు, పడమరలుగా ఒరుసుకుని నిశ్చలంగా యోగిలా నిలబడ్డ గుండ్లకమ్మ వైపు తేరిపార చూసేరు. వాళ్ళల్లో ఇద్దరు గుండ్లకమ్మలో దిగి ఒక చేత్తో నీళ్ళు ఒడిసి పట్టుకుని నోట్లో పోసుకుని తుపుక్కున ఊసేరు. వాళ్ళల్లో ఒకడు ఏదో కొత్త విషయం కనుక్కున్నట్లు, ''ఉప్పునీళ్ళేనన్నా,'' అన్నాడు బిగ్గరగా.

నిశ్చలంగా ఉన్న గుండ్లకమ్మలో చిన్న అలజడి. వచ్చినవాళ్ళను తేరిపార చూసేరు. వాళ్ళల్లో విఎర్వో ఆదిశేషయ్యను, అతడి మద్దతుగాళ్ళను చూసిన వెంకటేశ్వర్లు, రంగయ్య వాళ్ళ దగ్గరకు వచ్చేరు.

ఆదిశేషయ్య పలకరింపుగా నవ్వి, ''బాపట్లోళ్ళన్నా! మన చేలు రొయ్యలగుంటలకు పనికొస్తాయేమోనని చూట్టానికొచ్చేరు,'' అన్నాడు.

''అట్టాగా! నేనింకా నిన్ను చూచి గుండ్లకమ్మ మీద చెక్‌డ్యాం ఏదన్నా కుదుర్చుకొని వచ్చినావు గామాల, మన కష్టాలన్నీ తీరినాయిలే అని సంబరపడిపోయానే శేషయ్యా!'' అని నిరాశగా అడిగినాడు వెంకటేశ్వర్లు.

''నీకెప్పుడూ అదే రంధి గదా మామా!'' అని నవ్వి, ''ఇంకా గవుర్నమెంటు నుంచి శాంక్షన్ రాలేదులే,'' అన్నాడు.

''ఎన్ని ఎకరాలు కొంటారంటా,'' అడిగేడు రంగయ్య. టాటాసుమోలోంచి దిగిన కళ్ళద్దాల మనిషి కళ్ళు చిట్లించి తనక్కావలసిందేదో రంగయ్యలో ఉన్నట్లు కనిపెట్టేడు.

''ఎన్ననేముంది, ఉలిచిరేవు దాకా ఉప్పునీళ్ళొస్తాయిగా. ఎంత దొరికితే అంత. రెండు, మూడొందలెకరాలు.''

''అంత దొరకద్దూ,'' రంగయ్య కొడుకు అందుకున్నాడు.

డబ్బు పెడితే అదే దొరుకుతుందిలే అన్నట్లు కళ్ళెగరేసేడు చలువ కళ్ళద్దాల వాడు. వాడు వాళ్ళందరికీ నాయకుడిలా ఉన్నాడు. తెల్లటి ఖద్దరు చొక్కా, తెల్లటి శరీరం, వేళ్ళనిండా ఉంగరాలు, రింగుల జుట్టు- రాజకీయనాయకుడి వేషం.

వాళ్ళు కాస్సేపు అటూ యిటూ తిరిగి రెండు మూడుచోట్ల మట్టిని తీసుకుని మూట గట్టుకుని మళ్ళీ బండెక్కి వచ్చినంత వేగంగానే దుమ్ము రేపుకుంటూ ఊళ్ళోకి వెళ్ళిపోయారు.

మళ్ళీ అందరూ చెట్ల కిందకు చేరేరు.

''ఏంది ఎంకమామా, వీళ్ళేందో ఉపద్రవం తెచ్చేట్టున్నారే,'' అన్నాడు రోశయ్య వెంకటేశ్వర్లుతో. అందరూ ఎవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు.

''మనం అమ్మితే గదంటలే ఏదైనా,'' అన్నాడు వెంకటేశ్వర్లు.

''ఎకరం ఎంత పడుద్దో,'' రంగయ్య కొడుకు బయటపడ్డాడు.

"ఏం అమ్ముతావా ఏంది, రొయ్యల గుంటలకి," రోశయ్య ఆదుర్దాగా అడిగేడు.

"మంచి రేటొస్తే అమ్ముకోక ఎందుకన్నా! ఊరికేమన్నా దగ్గరా దాపా? రేటొస్తే ఊరెమ్మట మాగాడైనా కొనుక్కోవచ్చు. లేకపోతే వడ్డీలు కట్టే కాడికి అప్పులైనా తీర్చు కోవచ్చు. ఇన్నాళ్ళ నుంచి చూస్తన్నాం కదా! ప్రతి ఎలక్షనుకీ మా ఎంకటేశ్వర్లు పెదనాన గుండ్లకమ్మ మీద చెక్‌డ్యాం కోసమని పోరాడతానే ఉన్నాడు గదా! ప్రతి ఒక్కడూ గెలిచిందాకా అదేమాట చెబుతాడు. గెలిచాక దాని ఊసే లేకపాయె. డ్యాం కడితే పొలాలు మాగాడులవుతై, ఊరికి ఎండాకాలం నీళ్ళ బాధ తీరుద్దను కుంటే మాటలు చెప్పేవాళ్ళేగాని, చేతల్లో చూపించేవాళ్ళే లేకపోతిరి. వచ్చినకాడికి లాగి పడెయ్యక ఇంకెందుకంట," అన్నాడు రంగయ్య కొడుకు మళ్ళీ.

అక్కడున్న వాళ్ళందరూ అమ్మాలా, వద్దా అనే చర్చలో పడ్డారు. వెంకటేశ్వర్లు ఆలోచనలో పడ్డాడు. గుండ్లకమ్మ వైపు చూస్తూ, చూస్తూనే తనదైన కలలోకి వెళ్ళి పోయాడు.

ఎప్పుడూ వచ్చే కలే. అద్భుతమైన ఆకుపచ్చని కల.

వెంకటేశ్వర్లు నడివయసులో ఉన్నప్పుడు, బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తున్న దగ్గరి బంధువు కొడుకు పెళ్ళికి ఉత్తరాది వెళ్ళవలసి వచ్చింది. ఆ ప్రాంతంలో ఉత్తరాది నుంచి పిల్ల కుదరటం అదే ప్రారంభం. ఎప్పుడూ ఆ ప్రాంతం నుంచి తెనాలి ప్రాంతం వెళ్ళినవాళ్ళు కాదు వాళ్ళు. తెనాలిలో బస్సు దిగి గుంటూరు వైపు వెళ్ళే బస్సు ఎక్కేరు అందరూ. కిటికీ పక్క సీట్లో కూర్చున్నాడు వెంకటేశ్వర్లు. నారాకోడూర్లో గామాల బస్సు ఆగిన దగ్గర చూసేడు లారీలకు లారీలు కూరగాయలు కూలీలు ఎక్కించడం- వెంకటేశ్వర్లు అబ్బురపడ్డాడు. ఊరు దాటాక పొలాల్ని పరీక్షగా చూసేడు. గలగల పారే కాల్వల్నీ, మినుకుమినుకుమని మెరిసే నీళ్ళనీ సంబరంగా చూసేడు. నల్లరేగడి మట్టిని మమకారంగా చూసేడు. పొలాల్లో పచ్చగా పరుచుకున్న కూరగాయల పందిళ్ళను, వాటికి వేలాడుతున్న కాయల్ని విస్తుపోయి చూసేడు. తిరుగు ప్రయాణంలో ఒంటేలుకు పోసుకునే వంకతో నారాకోడూర్లో బస్సు దిగి కాస్సేపు అటూ యిటూ నడిచి ఎంతో తన్మయత్వం చెందేడు. ఒక మెట్ట ప్రాంతపు మొరటు మనిషి హఠాత్తుగా అన్ని నీళ్ళను పొలాల్లో పారించటం చూసి ఎంత సంబరపడతాడో అంత సంబరపడ్డాడు వెంకటేశ్వర్లు.

అప్పటి నుంచి అతడికి తెనాలి గుంటూరు ప్రయాణమే గుర్తుకొచ్చేది. పచ్చటి పందిళ్ళ కింద గలగల పారే కాలువలు, బంగారం పండే పొలాలు.

తాను కూడా గుండ్లకమ్మ నుంచి నీళ్ళు కాలవలు చేసి, పొలంలో పాదులు చేసి నీళ్ళను పారించి పందిళ్ళు వేసి రాశులు రాశులుగా కూరగాయలు పండిస్తున్నట్లు కలగనేవాడు. ఆ కల తీరడానికి అతడు ఎంతోమందిని కలిసేడు. ఎలక్షన్లు వచ్చినప్పుడల్లా రైతులందర్నీ ఒకటి చేసి గుండ్లకమ్మ మీద వంతెన కట్టి నీళ్ళిస్తానన్న అడ్డమైన వాడికీ ఓటేయించేడు. ఎందరెందరికో అర్జీలు రాయించేడు.

"ఏందన్నా మాట్లాడకపోతివి. అందరూ పొలాల్ని అమ్మాలా, వద్దా అంటుంటే నువ్వేమో బెల్లం కొట్టిన రాయిలా నీ లోకంలో నువ్వుంటివి," వెంకటేశ్వర్లు తొడను చేత్తో తట్టి అన్నాడు రంగయ్య.

"మాట్లాడ్డానికేముందిలే! అవసరాలున్నోల్లు అమ్ముకుంటారు. పొలం కావాలనుకున్నోల్లు ఉంచుకుంటారు. ఎవరిష్టం వాళ్ళది," అన్నాడు వెంకటేశ్వర్లు.

వెంకటేశ్వర్లు నిష్టూరం అమ్మాలనుకుంటున్న వాళ్ళకు కష్టమనిపించింది. రోశయ్యలాంటి వాళ్ళకు ఆ మాటలకు బలం వచ్చింది.

"ఎందుకు బాబా అంత నిష్టూరం. నేనేం తప్పన్నానని. రేటొస్తే అమ్ముకోక ఎందుకన్నాను. అంతేగా," అన్నాడు రంగయ్య కొడుకు.

"రేటు సమస్య కాదుగాని, రొయ్యల ఎవారమంతా లక్షల కోట్ల వ్యాపారం. నువ్వూ నేనూ చేసేది కాదది. చేసినా ఎల్లకాలం నెగ్గుకొచ్చేది కాదు. ఇక రేటు సంగతా! వాళ్ళెంతైనా పెట్టగలరు. ఉన్న కాస్త ఈడనే ఉన్న నా బోటోడి గతేంది చెప్పు. నిదర లేస్తే ఈ గుళ్ళకమ్మ తప్ప నిలవ నీడ లేదు మాకు. ఈ కాస్తా అమ్ముకుని మేమేం కావాల. ఈ బఱ్ఱెగొడ్లేం కావాల చెప్పు," అన్నాడు రోశయ్య బాధగా.

"అదికూడా కాదు రోశయ్యా! దుక్కి దున్ని ఎవసాయం చేసి పంటలు తియ్యాల్సిన మనం భూమిని చేపల చెరువులకనీ, రొయ్యలగుంటలకనీ తెగ నమ్ముకుంటే ఎట్ట! గుండ్లకమ్మ ఆ పక్కనున్న పాలెంలో ఏం జరుగుతుందో మనం వింటం లేదా! ఊరెమ్మటి పొలాలన్నీ రేట్లొచ్చి నాయని రొయ్యల చెరువులకు అమ్మితిరి. కొన్నోడు ఊరుకుంటాడా? ఉప్పునీళ్ళతో రొయ్యల్ని పండిస్తే ఏమైంది? ఊరి చెరువుల్లో గాని, బావుల్లోగాని తాగడానికి మంచినీళ్ళ చుక్క మిగల్లా. ఉప్పు కసెమైనయ్యి నీళ్ళు. ఇయ్యాల నీళ్ళ కోసం ఎంత అవస్త పడతన్నారో చూస్తన్నాంగా! బెజవాడ నుంచో, నెల్లూరు నుంచో వచ్చి సాగుభూములన్నిటినీ ఉప్పునీళ్ళ చెరువులు చేస్తిరి. రొయ్యల్ని అమెరికోల్లు, జపానోల్లు లక్షలకు లక్షలు పోసి కొంటారంట. చెరువులోల్లది ఏం పోయింది? ఒంగోల్లో నీళ్ళ డబ్బాలు కొనుక్కొని తెచ్చుకుంటున్నారు. నీళ్ల అవస్తలు పడలేక జనమంతా ఒకటై కలక్టరు చుట్టూ తిరిగేరు. ఆయనేం చేస్తాడు. అందరూ ఒకటై గొడవలు చేస్తే ఊళ్ళోకి పోలీసోల్లు వస్తే వాళ్ళను కూడా కదల్నీయకుండా నిలదీస్తిరి. పొలాలు అమ్ముకున్న తర్వాత వాళ్ళిష్టమొచ్చినట్టు చేసుకుంటారుగాని మీ ఇష్టమా అని తీర్మానాలు చేస్తిరి. ఒకపక్కన తాగడానికి నీళ్ళు లేక, మరోపక్క గొడ్లకు పచ్చి మేతా, తిరగడానికి చోటూ లేక ఒక రేత్రి అందరూ పోయి నీళ్ళు పెట్టిన చెరువు కట్టలు తెగ్గొడితే ఏమైంది? చెరువులోల్లు ఊరుకున్నారా? బెజవాడ నుంచి లారీలల్లో మనుషుల్ని తీసకొచ్చి ఊరి జనాల్ని కొట్టిస్తిరి. ఇయ్యాల పాలెంలో ఎవురన్నా ఏదన్నా మాట్లాడాలన్నా బొడ్లో కత్తులు, చైన్లు పెట్టుకుని తిరుగుతున్న కొత్త మనుషులకు భయపడుతున్నారు ఊరి జనం. పొలాలమ్ముకుంటే మన గతీ అదేరా!" వెంకటేశ్వర్లు తన మనసులోని మాటను చెప్పేడు.

రంగయ్య, రోశయ్య సాలోచనగా తలలూపేరు.

నీళ్ళల్లో నుంచి గొడ్లు బయటకొచ్చి ఎండుదుబ్బుల్ని కొరకడం మొదలుపెట్టి చాలా సేపైంది. అందరూ లేచి పై కండువాలు విదిలించి భుజాన వేసుకునో, తలకు చుట్టుకునో టిఫిన్ క్యారేజీలు, మంచినీళ్ళ సీసాలు అందుకుని బఱ్ఱెగొడ్ల వెనకే కదిలేరు. ఆ రోజంతా ఆ పొలాన పశువులు గాసే వాళ్ళందరూ ఇదే విషయాన్ని చర్చించుకుంటున్నారు.

❋

వెంకటేశ్వర్లు బఱ్ఱెగొడ్లను ఇంటికి తోలుకుని వచ్చేసరికి ఒంగోలు నుంచి కొడుకు, మనవడు వచ్చి ఉన్నారు. బఱ్ఱెగొడ్లను కట్టుమట్లో కట్టేసేసరికి మనవడు ఆ మసక చీకట్లోనే దూడల దగ్గర

చేరి వాటి మెడ నిమురుతున్నాడు. దూడ నెమరేస్తూ మధ్యమధ్యలో వాడి చేతిని నాకుతోంది. భార్య ధనమ్మ పొయ్యి ముందుకు చేరి వంటకు కుస్తీ పడుతోంది.

"ఏయ్యా! పరీక్షలెట్ట రాశా," మనవడ్ని అడిగేడు వెంకటేశ్వర్లు.

"బాగానే రాశా తాతయ్యా. పొదుగూకిందాకా పొలానున్నావే! భయమెయ్యలా," అడిగాడు మనవడు.

"రోజూ తిరిగే తావులే కదయ్యా! భయమెందుకంట. అట్ట భయపడితే ఎట్ట తిరుగుతాం. అయినా రాత్రులు నువ్వు మాత్రం ప్రైవేటుకు పోయి రావటంలా," అన్నాడు వెంకటేశ్వర్లు.

"మాకంటే కరెంటు లైట్లుంటాయిగా. మీకేముంది, ఊళ్ళొకొచ్చిందాకా చీకటేగా," అన్నాడు మళ్ళీ.

"అలవాటైపోయింది లేయ్యా!" అని కొడుకు వైపు తిరిగి, "అమ్మాయి రాలేదంటరా! ఎన్నాళ్లు సెలవు పెట్టేవు."

"సెలవా, పాడా! వాడూరికే గోల చేస్తంటే వదిలిపెట్టి వెడదామని వచ్చేను."

"పిల్లోడి గోల, మాగోల తప్పితే వాడ్ని తీసుకొద్దామని మీకు లేదన్నమాట! ఏం మడుసులురా!" నిష్టూరమాడింది ధనమ్మ. కొడుకు, కోడలు పట్ల ఆమెలో ఏదో అసంతృప్తి.

"నానా! ఏయ్యేవో ఆదిశేషయ్య వచ్చెళ్ళేడు. పొలాలు కొంటామని బాపట్లోల్లు వచ్చేరంటగా. మాట్లాడాలంట. అన్నాలు తిన్నాక మంద బయటకు రమ్మన్నాడు," కొడుకు రమణ చెప్పేడు.

"అప్పుడే ఇంటిక్కూడా వచ్చెళ్ళేడన్నమాట. కొనేవాళ్ళ కంటే వీడికే తొందరెక్కువగుంది. ఏమాత్రం గిట్టుబాటవుద్దో వాడి కమీషన్," అని ఆగి, "వాడి కమీషన్ కోసం వాడు తిరుగుతాడు. ఊరు ఏమైతే వాడికేం," అన్నాడు కొడుకుతో.

"ఏంది నానా! అట్టంటావ్. పాతిక, ముప్పై వేలన్నా గిట్టుబాటవుద్దన్నాడు ఆదిశేషయ్య. నాలుగెకరాలు- నాలుగు పాతికలు లక్ష పైనే వస్తాయిగా. మెట్టపొలాలకు ఎప్పుడన్నా అంత రేటు విన్నామా! అమ్మి పారేసి మీరూ మా కాడకొచ్చి ఉంటే పోలా!" చాలా తేలిగ్గా అన్నాడు రమణ.

ధనమ్మ పొయ్యి మీద నుంచి తల తిప్పి కొడుకువైపు చురచురా చూసి అంది.

"నీ పెళ్ళానికి అత్తింటికి రావడానికే అంత నామోషీ అయితే, మేమొచ్చి మీ ఇంట్లో పడితే ఇంకెంత పరువుతక్కువో గదరా! ఒప్పుకునిద్దా."

ఆ మాటకు రమణ మొహం మాడిపోయింది. "గమ్మునుండు. పసోడింటాడు," కసిరేడు వెంకటేశ్వర్లు.

"తాతయ్యా! పొలమమ్మితే నాన్న మోటారుసైకిలు కొంటాడంట. ఇందాక చెప్పేడు," రమణ గుండెల్లో బాంబు పేల్చేడు కొడుకు. వెంకటేశ్వర్లు ఏమీ మాట్లాడలేదు. స్నానం చేసి మనవడితో కూర్చుని ఒక ముద్ద తిని బయట మంచం వేసుకుని పడుకున్నాడు. మనవడొచ్చి తాత పక్కలో పడుకుని ఆయన గుండెల మీద చెయ్యేసేడు.

"తాతయ్యా! కతల పురాణమొకటి చెప్పవా," అడిగేడు మనవడు. ఈలోగా బయట నుంచొచ్చిన రమణ, "నీకోసం అందరూ ఎదురుచూస్తున్నారు నాన్నా! నువ్వేంది ఇంకా పడుకున్నావ్," అన్నాడు.

“అనగనగా...” అంటూ కొడుకు మాటలు విననట్టే మనవడికి ఒకానొక నీళ్ళ కథ చెప్పడం మొదలుపెట్టేడు వెంకటేశ్వర్లు. కొడుకు విసురుగా వచ్చి ఇంకో మంచమ్మీద కూలబడ్డాడు.

ఆ రాత్రి మంద బయట పొలాల బేరాలు సాగేయి. ఎకరా పొలం ముప్పై వేల లెక్కన ఆదిశేషయ్య కుదిర్చేడు. దాదాపు వందెకరాలు- వెంకటేశ్వర్లు, రోశయ్య లాంటి నలుగురైదుగురు అమ్మడానికి ఒప్పుకోలేదు. మిగతా వాళ్ళందరూ మంచి రేటని, అవకాశం పోతే రాదని ఆ రాత్రే అడ్వాన్సులు తీసుకున్నారు. మరో వారంరోజుల్లోనే మిగతా డబ్బులిచ్చి రిజిష్టర్లు కూడా చేయించు కున్నారు. మరో పదిరోజుల్లో పెద్దపెద్ద ప్రొక్లెయిన్లూ, జేసీబీలు గుండ్లకమ్మ ఉత్తరం ఒడ్డును చుట్టుముట్టేయి. ధనధనలాడిస్తూ, భూమంతటినీ కుళ్ళబొడుస్తూ పొలాల చుట్టూ పెద్దపెద్ద చెరువు కట్టలు లేచేయి.

ఒకరోజు రాత్రి రమణ హడావుడిగా వచ్చేడు. పడుకున్న తండ్రిని లేపి, “నాన్నా! మన చేను చుట్టూ వాళ్ళు చెరువులు చేస్తిరిగా! రొయ్యల చెరువులకు పెట్టేది ఉప్పు నీళ్ళంట. చెరువుల్నించి ఊకవ వచ్చి మన చేను కూడా పూర్తిగా తడిసిపోయిద్దంట. నేలంతా ఉప్పరిసి పంటలు పండ వంట. ఏం చేద్దాం నాన్నా,” అన్నాడు. వెంకటేశ్వర్లు మౌనంగా కొడుకు మాటల లోతుల్ని వెదుకు తున్నాడు.

“చేసేదేముందిరా! కొత్తగా రొయ్యల చెరువుల్ని తవ్వగూడదని ఉందంటగా. ఎమ్మార్వోకి కాగితం పెట్టాలనుకుంటున్నారు మీ నానా, రోశయ్యా,” అంది ధనమ్మ కొడుకుతో పొయ్యిలోకి పుల్లల్ని ఎగదోస్తూ.

“అయ్యన్నీ మనకెందుకే. రోశయ్యొకడు తోడు దొరికేడు ఈయనకి. లేనిపోయి నయ్యన్నీ కొని తెస్తాడు. లక్షలు పోసి కొన్నోడు గమ్మునూరుకుంటాడా! ఎమ్మార్వోనైనా కొని పారేస్తాడు. పొలాలు కొన్నోడు ఎంపీకి చుట్టమంట. ఆదిశేషయ్య చెప్పేడు. పొద్దున నా దగ్గరకొచ్చి మన నాలుగెకరాలకు లక్షన్నర ఇప్పిస్తానన్నాడు. నానతో మాట్లాడి సరేనంటే రేపే రిజిష్టరుకు ఏర్పాటు చేస్తానన్నాడు. పైపెచ్చు ఈయనంటే వాళ్ళకు కోపంగా ఉందంట,” చెప్పేడు రమణ.

అప్పుడు నోరిప్పేడు వెంకటేశ్వర్లు.

“ఒరే అయ్యా! ఏళ్ళ తరబడి మన కంచంలోకి కూడుబెట్టిన చేనురా అది. ఆ చేను మన సొంతం కావడానికి ఎన్ని తరాలు, ఎంత కాలం బ్రాహ్మలకి ఊడిగం చేసామో, దాసోహమయ్యేమో మీకేం తెలుసుద్దిరా. ఏళ్ళ తరబడి మా తాత, మా నాయన బ్రామ్మల దగ్గర జీతాల కుండి, ఆ తర్వాత మగతాలకు చేసి ఆకరుకు రేటు కట్టుకుని ఆ మట్టిని మన పరం చేసుకున్నామయ్యా. ఇయ్యాల వాళ్ళు ఎకరాల కెకరాలు కొనేస్తున్నారుగాని కష్టం చెయ్యనోడి చేతిలో భూమాత ఎన్నాళ్ళు నిల్సుద్దిరా. నేనూ, మీ యమ్మా ఆ పొలాన్నే నమ్ముకుని బతుకుతున్నాం. నువ్వు నెల జీతగాడివి కద! ఇయ్యాల నీకు దాని అవుసరం తెలీదు. నా మనవడ్ని భూమి లేనోడ్ని చెయ్యటం నాకిష్టం లేదయ్యా. నువ్వెన్నయినా చెప్పు. నేను కడతేరిందాకా ఆ భూమిని నిలుపుకోవాలనే చూస్తా నయ్యా. ఈ విషయంలో నన్నింక బలవంతం పెట్టొద్దయ్యా!” అన్నాడు వెంకటేశ్వర్లు.

పొయ్యి భగభగా మండుతోంది. అన్నం తుకతుకా ఉడుకుతోంది. కొత్త బియ్యం గామాల గెంజిపట్టి చిక్కగా వుంది.

“ఎట్టనో మీ సావు మీరు సావండి. చెబితే ఇనే రకాలైతేగా. మీకు తోడు వెట్టోడు ఆ రోశయ్యొకడు దొరికేడు,” విసురుగా అన్నమైనా తినకుండానే దెయ్యాల బండికి వెళ్ళిపోయేడు కొడుకు.

ధనమ్మ మనసు చివుక్కుమంది.

తెల్లారి నిద్రలేచి సద్దికూడైనా తినకుండానే రోశయ్యను తీసుకుని నాగులుప్పలపాడు వెళ్ళి ఎమ్మార్వోను కలిసేడు వెంకటేశ్వర్లు. బాపట్లోల్లు తవ్విన రొయ్యలచెరువుల గుండా తన నాలుగెకరాల పొలము, రోశయ్య రెండెకరాల పొలము సేద్యానికి పనికిరాకుండా పోతుందని చెప్పేడు. అర్జీ రాసిమ్మన్నాడు ఎమ్మార్వో. రాసిచ్చేరిద్దరూ.

నాలుగురోజుల్లో వచ్చి విచారిస్తానన్నాడు ఎమ్మార్వో. అర్జీ ఇచ్చిన మరుసటి రోజు నుంచి ఊళ్ళో పొలాలు అమ్ముకున్న వాళ్ళందరూ రోశయ్యను, వెంకటేశ్వర్లునూ విచిత్రంగా చూడటం మొదలుపెట్టేరు. మతిహీనుల్ని, పనికిరానివాళ్ళను చూసినట్టు హేళనగా చూస్తున్నారు. చాటుగా నవ్వుకుంటున్నారు. అర్జీ ఇచ్చిన నాలుగోరోజున గుండ్లకమ్మ ఒడ్డున మేత మేస్తున్న రోశయ్య పడ్డదూడ నడుం జారింది. దాని వీపు మీద బారుగా ఇనుపచువ్వతో బాదిన చార. వారంరోజులకు వియ్యేవో ఆదిశేషయ్యను తీసుకుని విచారణకు వచ్చేడు ఎమ్మార్వో. పొలమంతా తిరిగి చూసేడు. చెరువుకట్టలన్నీ ఎక్కి చూసేడు. అప్పటికే చెరువుల్లో నీళ్ళు పెట్టేరు. చుట్టూ చెరువుల దెబ్బకు వెంకటేశ్వర్లు పొలము, రోశయ్య పొలము చిత్తడి చిత్తడిగా తయారయ్యాయి. ఎమ్మార్వో న్యాయం చేస్తాడనుకున్నారు వాళ్ళు. నాలుగైదు రోజులైనా ఏ కబురూ లేకపోతే ఒకరోజు పొద్దున్నే రోశయ్య, వెంకటేశ్వర్లు ఎమ్మార్వోని కలిసేరు. ఎమ్మార్వో చెప్పిన మాటలకు విస్తుపోవడం వీళ్ళ వంతైంది.

వాళ్ళు చెరువులకు పెట్టింది ఉప్పునీళ్ళు కాదనీ, మంచినీళ్ళనీ, దాని వలన పక్క పొలాలకు ఇబ్బంది ఏదీ లేదని అన్నాడు ఎమ్మార్వో. వెంకటేశ్వర్లు చాలాసేపు వాదించేడు. ఒకసారి వచ్చి మళ్ళీ చూడమన్నాడు. ఇక చూడటానికేమీ లేదని కసురుకున్నాడు ఎమ్మార్వో.

ఎమ్మార్వోను కలిసి వచ్చేక వెంకటేశ్వర్లుకు ఏమీ దరీ దారీ తోచలేదు. ధనమ్మ మాట్లాడుతున్నా ఏదీ తలకెక్కడం లేదు. తనలో తాను ఆలోచిస్తూ బఱ్ఱెగొడ్లను విప్పి గుండ్లకమ్మ వైపు అదిలించేడు.

పొలం దగ్గర పడేకొద్దీ వెంకటేశ్వర్లుకు ఏదో అనుమానం తోచింది. కళ్ళు చిట్లించుకుని చూసేడు. తన పొలంలో తూర్పువైపున రెండు తరాల్నుంచి ఠీవిగా నిలబడి ఉండాల్సిన కొష్టం కనబడలేదు. అది పూర్తిగా సతికలబడి నేలను బల్లిలా కరుచుకుపోయింది. బావిపక్కన ఉండాల్సిన మామిడి, సపోటా చెట్లు రెండూ ముక్కలు ముక్కలుగా నరకబడి చిందరవందరగా పడున్నాయి. చెరువులు తవ్విన ఇనుపరాక్షసి ఆ ప్రాంతమంతా స్వైర విహారం చేసిన గుర్తులు మిగిలేయి.

దూరంగా ట్రాక్టరింజనుతో గుండ్లకమ్మ నుంచి చెరువుల్లోకి నీళ్ళను పంపు చేస్తున్న సవ్వడి.

వెంకటేశ్వర్లు చుట్టూ ముసిరిన నీడలు.

చాచి కొట్టిన చెంపదెబ్బ- బాధతో అరవనైనా లేదు వెంకటేశ్వర్లు.

గుండె పగిలిన వెంకటేశ్వర్లు అలాగే నిలబడ్డాడు.

అతడి చుట్టూ ఒక స్వప్నవలయం-

మళ్ళీ మరో దెబ్బ- కాళ్ళ మీదా, చేతుల మీదా, పొట్ట మీదా దెబ్బ మీద దెబ్బ.

రక్తసిక్తమైన కాళ్ళూ చేతులూ.

అతడు నీడల్ని గమనించడమే లేదు. రక్తసిక్తమైన చేతుల్ని గుండ్లకమ్మవైపు సాచి బిగ్గరగా, "అమ్మా," అంటూ కేకేసేడు.

అతడి చుట్టూ కరిగిపోతూ కరిగిపోతూ ఒక స్వప్నం-

చుట్టూ ఎటు చూసినా కాలవలు, నీళ్ళు, పచ్చటి పొలాలు, రాశులు రాశులుగా కూర గాయలు- అన్నీ కరిగిపోతూ, కరిగిపోతూ, దూరమవుతూ- ముప్ఫై ఏళ్ళ నుంచి వెంకటేశ్వర్లు కన్న కల- అబద్ధమైన కల.

ఏదో సన్నటి వస్తువు ముంజేతిని చీరేసింది.

వెంకటేశ్వర్లు అలాగే నిర్భయంగా నిటారుగా నిలబడి గుండ్లకమ్మవైపు మళ్ళీ రెండు చేతులు చాచి, ''అమ్మా!'' అంటూ మళ్ళీ కేకేసేడు. గుండ్లకమ్మ ప్రతిధ్వనించింది.

ఎవరి తోడు కోసమో, ఎవరి ధైర్యపు వచనాల కోసమో ఎదుర్చూస్తున్నట్లు అతడు.

దూరాన్నుంచి రోశయ్య చేతికర్రను ఒడిసి పట్టుకుని పరుగెత్తుకొస్తున్నాడు. ''ఒరే! లంజా కొడుకుల్లారా! ఎంత పని చేసేర్రా,'' అంటూ బిగ్గరగా కేకేసేడు. ముసిరిన నీడలు చెరువుల చాటుకు తప్పుకున్నాయి. రోశయ్య నెత్తురోడుతున్న వెంకటేశ్వర్లు శరీరాన్ని భుజానికెత్తుకుని ఊరివైపు నడుస్తున్నాడు.

ఇవేవీ తెలీని పశువులు మాత్రం దొరకని గడ్డి కోసం దేవులాడుతున్నాయి.

*ప్రజాసాహితి రజతోత్సవ సంచిక*
*అక్టోబర్ 2002*

నేపథ్యం

రైతుల వెత

# గుండ్లకమ్మ తీరాన

***సాహిత్యం బలహీనుల పక్షమని నమ్మేవాళ్లకు ఎనభైల తర్వాత రైతు కథావస్తువయ్యాడు. మనుషుల్నే కాదు, పశుపక్ష్యాదుల్ని సైతం బతికించే రైతు ఇవాళ తెలుగుగడ్డ మీద కష్టాలతో కడగండ్లతో ఆత్మహత్యలతో జీవనం సాగిస్తున్నాడు. బతుకు మీద భరోసా ఇచ్చేవాడి కోసం దేవులాడుతున్నాడు. ఇదొక సామాజిక వ్రణం.***

కొస్త నా గురించి, ఇంకాస్త మా ఊరి గురించి, మరికాస్త మా ప్రాంతం గురించి చెబితే అది నా కథల నేపథ్యం. *గుండ్లకమ్మ తీరాన* కథానేపథ్యం నా వ్యక్తిగత విషయాలూ, ప్రాంతీయ విషయాలూ కలగలిసి ఒకానొక సామాజిక స్థితికి సంబంధించినవి.

ఒకప్పటి గుంటూరు జిల్లా, ఇవ్వాళ్టి ప్రకాశం జిల్లాలో ఒంగోలుకు రెండు కిలోమీటర్ల తూర్పున కొప్పోలులో 1965లో పుట్టాను. అప్పటికి మా నాన్న మధ్య తరగతి రైతు. నేను కళ్లు తెరిచేనాటికి, నా బుర్రలో జ్ఞాపకాల విత్తులు మొలకెత్తే నాటికి శిథిలమై కాగితాలు ఊడిపోయేట్లుండే భగవద్గీతను రెండు చేతుల్తో అపురూపంగా పట్టుకుని భూతద్దాల కళ్లతో చూస్తూ చదువుకునేవాడు మా తాత. ఆయన పెదాల మీద ఎప్పుడూ బ్రహ్మంగారి తత్వాలు తారట్లాడుతుండేవి. వ్యవసాయంగానీ, ఇల్లుగానీ పట్టనట్లు ఏదో ధ్యానంలో ఉండేవాడు.

మా నాన్నేమో ఎప్పుడూ ఏదో పనిమీద నిరంతరం హడావుడిగా ఉండేవాడు. పగలసలు కనిపించేవాడు కాదు. రాత్రులు పొద్దుపోయాక ఇంటికి చేరేవాడు. బాల్యమంతా రోగాలు, రొష్టులతో అర్భకంగా ఉండేవాడిని. బాగాలేనప్పుడల్లా రాత్రులు నన్ను గుండెల మీద అపురూపంగా పడుకోబెట్టుకుని భారతంలోని కథల్ని ఘట్టాలు ఘట్టాలుగా వినిపించేవాడు మా నాన్న. భీష్ముడి ఔదార్యం, ద్రోణుడి కపటత్వం, ఏకలవ్యుడి వీరత్వం, కర్ణుడి దాతృత్వం... ఒక్కో పాత్రని ఆయన

అద్భుతంగా తీర్చిదిద్దేవాడు. బహుశా కథ చెప్పడంలోని ఒడుపును మా నాన్న నాకందించాడేమోనని అనిపిస్తూ ఉంటుంది.

ఆయన చుట్టూ ఎప్పుడూ రకరకాల జనం తిరిగేవాళ్లు. ఒక కులం కాదు, ఒక వృత్తి కాదు. పొలంపనుల్లోనూ, ఇంటిపనుల్లోనూ మాదిగ రోశయ్య, అతడి భార్య చేదోడువాదోడుగా ఉంటూ ఎంతో సన్నిహితంగా మెలిగేవాళ్లు. కమ్మరి, కుమ్మరి వృత్తులవాళ్లు ఆయనకు ఆత్మీయ స్నేహితులు.

నాకు ఊహ తెలిసేనాటికి మా నాన్న పంట పండించడంలో అఖండుడు. రాశులరాశుల ధనియాల కళ్లాన్ని మా కళ్లల్లో మెరిపించినవాడు. అద్భుతమైన బంగారురంగు పుగాకును బ్యార్నీల నుంచి దింపించి చెక్కులు తొక్కించినవాడు. ఎర్రెర్రటి మిరపపండ్లనీ, మిలమిల మెరిసే పచ్చజొన్నల్నీ అద్భుతంగా పండించినవాడు.

నిజానికి కోస్తాప్రాంతం అనగానే బయటవాళ్లకు డెల్టాప్రాంతం గుర్తుకొస్తుంది. కోస్తాలో భాగమైనప్పటికీ ఎండాకాలంలో ఒంగోలు ప్రాంతంలో నీళ్లకరువు. అంతా మెట్టప్రాంతం, బెట్ట ప్రాంతం. వానలు కురిస్తేనే పుడమితల్లి పులకరించేది. ఆకాశం మెరిస్తేనే భూమాత అన్నదాతను కరుణించేది. రైతు జీవితం ఇక్కడ దుర్భరం. వ్యవసాయం జూదంతో సమానం.

ఇక్కడ రైతు పంట ఎంత అద్భుతంగా పండించినా ఆ సంవత్సరం పంటకు ధరుండదు. మరో సంవత్సరం పంట కొన్నవాడు అజాఅయిపూ ఉండడు. ఒక సంవత్సరం కుండపోతగా రోజుల తరబడి వానలు, మరో ఏడాది వానకోసం ఎదురుచూపులు... గాలీవానా బీభత్సం, కరువుకాటకాలు పిలిస్తే పలుకుతుంటాయి.

అయిదుగురు తోబుట్టువుల బాగోగులూ, చదువుసంధ్యలూ, పెళ్లిళ్లూ, పేరంటాళ్లూ, చావులూ, దినాలూ...

నాకు పదేళ్ల వయస్సు వచ్చేసరికి అప్పులూ ఆస్తులూ పెనవేసుకుపోయి ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉండేవాడు మా నాన్న. రాత్రింపగళ్లు ఎప్పుడూ ఏదో ధ్యాసతో రేడియోలో రకరకాల గొంతుల్ని మార్చుతూ ఉండేవాడు. ఆయనకు ఏం కావాలో, ఏం వినాలనుకుంటున్నాడో బహుశా ఆయనకే తెలీనట్లు నిర్వేదంగా ఉండేవాడు.

ఇదట్లా ఉంచితే మా మామయ్య అమ్మనబోలులో పెద్ద రైతే. అయినా ఆయనకు చదువు సంధ్యలు లేవు. పొలం తప్ప మరోదారి ఎరుగని పుణ్యపురుషుడు. మట్టి తప్ప మరో మర్మం ఎరుగని మహానుభావుడు. నిరంతరం కష్టజీవి. మా పెళ్లినాడు పసుపుకుంకాల కింద కూతురికి నాలుగెకరాల పొలం ఇచ్చేడు. ఆ పొలంగట్టు మీంచి కన్ను సాగదీసి చూస్తే గుండ్లకమ్మ పరుగులు కనబడతాయి. తూర్పు నుంచి ఉప్పునీళ్లు, పడమర నుంచి వచ్చే మంచినీళ్లు కలగల్సిపోయి సముద్రంలోకి ఉరుకులు పరుగులతో పరుగెత్తిపోయే గుండ్లకమ్మ సొగసులు కనులవిందు చేస్తాయి. గుండ్లకమ్మ మా పొలాల్ని ఒరుసుకుని పరుగెత్తుతున్నా చుక్కనీరు పొలాలకు అందదు. అవసరమైతే ఒడ్డుల్ని కూల్చేసి పొలాల్ని సైతం తనలో కలుపుకునేది. అక్కడ నీళ్లకు కట్టవేసి నిల్వ చేసే కాటన్ మహాశయులు లేరు. మట్టి దాహార్తిని తీర్చే భగీరథులు లేరు.

మొన్నమొన్నటిదాకా రైతుల కష్టాలన్నీ ఆ పొలాల్లోనే ఉండేవి. పశువుల్ని మేపుకుంటూ, వ్యవసాయం చేస్తూ నిరంతరం అక్కడే గడిపేవాళ్లు. గుండ్లకమ్మ దరినున్న పొలాలంటే రైతులకు అమిత ప్రేమ. పొద్దంతా పశువుల్ని మేపటం, నడిజామున ఒక ముద్ద తిని కంపచెట్ల కింద సేద తీరటం...

మా మామయ్య ఎప్పుడూ గుండ్లకమ్మలో ఈదులాడినట్లుగానే కలల్లో తేలిపోతూ గొప్ప పంట తీసినట్లు తపనపడేవాడు. ఎప్పటికైనా గుండ్లకమ్మలోంచి నీళ్లు మళ్లించి రాశులు రాశులు

కూరగాయల్ని పండిస్తానని అందరితో అనేవాడు. ఆకల తీరకుండానే అర్ధాంతరంగా అనారోగ్యంతో వెళ్లిపోయాడు.

ఆ పొలంలో మా నాన్న పదేళ్ల వ్యవసాయం చేసేడు. పూనా నుంచి సుబాబుల్ విత్తులు తెప్పించి యాసిడ్‌లో నానేసి అద్భుతంగా చెట్లను పెంచేడు. ఒక మహత్తర వనాన్ని సృష్టించేడు.

తొంభైలనాటికి గుండ్లకమ్మ ఒడ్డంతా అటు ఉలిచిరేవు నుంచి ఇటు సముద్ర ముఖద్వారం చింతాయపాలెం దాకా ఒక అలజడికి గురైంది. గొప్ప కుదుపుతో వణికింది. మట్టి స్వభావమే మారింది.

పండే పండే పంటపొలాలు చేతులు మారేయి. నిర్వేదంతో, నిస్తేజంతో బతికే రైతులు కాస్త రేటు ఆశ చూపగానే అప్పులు తీర్చడం కోసమో, బిడ్డల పెండిండ్ల కోసమో ఉత్తరాది వాళ్లకు భూములమ్మేశారు. జిల్లా రాజకీయాల్నీ, గ్రానైటు గనుల్నీ డబ్బున్న డెల్టాప్రాంతం వాళ్లు శాసిస్తున్నట్లుగానే చిన్నచిన్న కమతాలన్నీ కలగల్సి వందల ఎకరాలు కార్పొరేట్ వాళ్ల చేతుల్లోకి వెళ్లాయి. ప్రొక్లయిన్లు దిగేయి, పెద్దపెద్ద చెరువుకట్టలు లేచేయి. గుండ్లకమ్మలోని నీళ్లు నీళ్ల యంత్రాలకు దారిమళ్లేయి. పొలాలన్నీ చెరువులై, చెరువుల్లోని రొయ్యలకు ప్రాణవాయువునిచ్చేయి. చెరువుల దాపునున్న రైతుల పొలలన్నీ ఉప్పునీల్ల ఈకవతో ఉప్పురిసి మొక్క మొలవని దుస్థితి ఏర్పడింది. తాటివనాలు సైతం మలమల మాడి ఎండిపోయాయి. ఇదీ నేపథ్యం...

సాహిత్యం బలహీనుల పక్షమని నమ్మేవాళ్లకు ఎనభైల తర్వాత రైతు కథావస్తువయ్యాడు. మనుషుల్నే కాదు, పశుపక్ష్యాదుల్ని సైతం బతికించే రైతు ఇవాళ తెలుగుగడ్డ మీద కష్టాలతో కడ గండ్లతో ఆత్మహత్యలతో జీవనం సాగిస్తున్నాడు. బతుకు మీద భరోసా ఇచ్చేవాడి కోసం దేవు లాడుతున్నాడు. ఇదొక సామాజిక వ్రణం. దీనికి శస్త్రచికిత్స చేసేవాడి కోసం ఎదుర్చూస్తున్నాడు రైతు.

*గుండ్లకమ్మ తీరాన* కథ మా కథ, మా ఊరి కథ, మా ప్రాంతం కథ... ఎవరికోసమో, దేని కోసమో దేవులాడుతున్న రైతుల కథ.

*20 మార్చి 2013*

*'గుండ్లకమ్మ తీరాన' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

10

# యుద్ధభూమి

## కాలువ మల్లయ్య

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. అక్కడక్కడున్న చెట్ల కొమ్మల మీది నుంచి పక్షుల కిచకిచ ధ్వనులు వినబడుతున్నాయి. అల్లాహో అక్బర్ మేల్కొలుపు ధ్వనులాగిపోయాయి. స్థూలకాయులు మార్నింగ్‌వాక్ కోసం సిద్ధమవుతున్నారు. గంట క్రితమే లేచి కాలకృత్యాలన్నీ తీర్చుకున్నాడు మనోహర్. డ్రెస్ చేసుకొని కుర్చీలో కూర్చొని మిత్రునికొర కెదురుచూస్తున్నాడు.

గడప దాటి లోపలకొచ్చి మనోహర్ కెదురుగా కుర్చీల్లో కూర్చుంటూ, "రణరంగము కానిచోటు భూస్థలమంతా వెదికినా దొరుకదు," అన్నాడతడు. ఆ మహాకవే ఇప్పుడు బతికుండుంటే, ఎన్‌కౌంటర్ కానిచోటు ఏ గ్రామంలో వెదికినా దొరుకదు. ఉత్తర తెలంగాణ నేల సమస్తం యువకిశోరాల రుధిరధారలతో రక్తసిక్తం అని ఎలుగెత్తి చాటేవాడు," అన్నాడు తిరుమల్.

తిరుమల్, మనోహర్ ప్రాణస్నేహితులు. కాలేజీ రోజుల్లో క్లాస్‌మేట్సే కాకుండా గత పదిహేనేళ్లుగా ఒకే చోట ఉద్యోగం చేస్తున్నారు. ఒకే కాలనీలో ఉంటున్నారు. వాళ్లు ఒకరితో ఒకరు తమ అభిప్రాయాలను దాపరికం లేకుండా వెల్లడించుకుంటారు.



*కాలువ మల్లయ్య 1953 జనవరి 12న కరీంనగర్ జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ వెలి సృజన మాసపత్రికలో 1983లో అచ్చయ్యింది. 900 కథలు రాశారు. 7 కథాసంపుటాలు, 18 నవలలు ప్రచురించారు. వివిధ పత్రికలలో కాలమ్స్ నిర్వహించారు. ఎఫ్‌సిఐలో పనిచేసి, అనంతరం రెండు సంవత్సరాలు అధికారభాషా సంఘం సభ్యులుగా ఉన్నారు. ప్రస్తుతం తెలుగు అకాడెమిలో లాంగ్వేజ్ ఎక్స్‌పర్ట్‌గా ఉన్నారు. బతుకు పుస్తకం నవలకు ఆటా బహుమతి లభించింది.*

**చిరునామా**
44/214, హుడా కాంప్లెక్స్,
క్రాంతిహారిక అపార్ట్‌మెంట్స్, కొత్తపేట,
సరూర్‌నగర్, హైదరాబాద్-500 035
Ph: 98493 77578
mallaiah.kaluva@gmail.com

మిత్రుని దిక్కు ప్రశంసాపూర్వకంగా చూశాడు మనోహర్. చాలాకాలంగా వ్యక్తిగతమైన సామాజికపరమైన అంశాల మధ్య సమన్వయం కోసం సంఘర్షణ పడుతున్నాడు మనోహర్.

"పాలకుర్తి సంఘటన గూర్చేనా నువ్వనేది? నా కళ్లారా చూశానా దృశ్యాన్ని. చలించి పోయాను. ఎన్‌కౌంటర్లు మనకిప్పుడు అతి మామూలు విషయాలయ్యాయి. పోలీసుల బూట్ల చప్పుళ్లు, బాంబు పేలుళ్లు, వేధింపులు, బంద్‌లు మనకు చాలా మామూలే. తెలంగాణ ప్రాంత మంతా ముఖ్యంగా ఉత్తర తెలంగాణ దాదాపు ఇరవై ఏళ్లుగా మండుతున్న అగ్నిగోళంలాగే ఉంది. ఈ అగ్నిగుండంలో బతుకులు దినదినగండమన్నట్లుగా ఉన్నాయి. పాము ముంగిసాటలా ఉంది పరిస్థితి," అన్నాడు మనోహర్.

తెలంగాణ నేలంతా ఇప్పుడు ఉద్యమభూమిగానే ఉంది. అయితే రజాకార్ల కాలంలో నల్లగొండ దిక్కు ఉధృతి ఉంటే ఇప్పటి ఉద్యమాలు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉ ధృతంగా ఉన్నాయి," అన్నాడు మనోహర్.

"అప్పటి పోరాటానికీ ఇప్పటి పోరాటాలకూ కొన్ని తేడాలున్నాయి. అప్పుడూ భూమి సమస్య చుట్టే పోరాటాలు తిరిగినా రజాకార్ల నుండి విముక్తి పొందడమే ప్రధానాంశమయిందనిపిస్తుంది. అందుకేనేమో రజాకార్లు పోయింతర్వాత పోరాటమాగిపోయింది. ఇప్పుడు జరుగుతున్న పోరాటాలు మాత్రం భూమి సమస్యే ఇరుసుగా జరుగుతున్నాయి."

"అదేంలేదు తిరుమల్. అప్పుడూ భూమి పంపకం జరిగింది. పోరాటం ఎందుకు విర మించారన్న దానిపై రకరకాల అభిప్రాయాలున్నాయి. రజాకార్ల నుండి నక్సలైట్ పోరాటాల వరకు గల పరిస్థితుల్ని తెలంగాణ ప్రజలు వీరోచితంగానే ఎదుర్కొంటున్నారు. తెలంగాణ ప్రజల్ని చూస్తుంటే నాకెంతో ఆశ్చర్యం వేస్తుంటుంది. అయ్య బాంచెననుకుంటున్న అమాయకులే భారత దేశానికి భూపోరాటం వారసత్వాన్నందించారు. ఆ తర్వాత మళ్లీ దొరల అణచివేతను సహించారు. బానిస బతుకులు బతికారు. ఇప్పుడు మళ్లీ విజృంభించి పోరాటాలు చేస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ నేలంతా అట్టుడికినట్టుడుకుతోంది."

"ఇదో మహాయజ్ఞంలాంటిది. ఇందులో బలిదానాలు తప్పవు. నేలతల్లి విముక్తి కోసం రక్తతర్పణమూ తప్పదు. సరేగాని మనోహర్ భూపోరాటాలంటే అంత ప్రేమున్నవాడివి పూర్తిగా భూమి లేనివాడివైపోతుండటం వింతగా ఉంది కదూ? నాకైతే చాలా బాధగా ఉంది..."

టీ తాగడం పూర్తిచేసి కప్పులను టీపాయ్ మీదుంచారిద్దరు. వంటింటి దర్వాజా నానుకొని వాళ్ల మాటలు వింటోంది శారద. మిత్రుని మాటల్తో మనోహర్ ముఖంలో రంగులు మారాయి. కడుపులోంచి దుఃఖం ఎగజిమ్ముకొస్తున్నట్టుంది. వస్తున్న ఉద్వేగాన్నాపుకుంటానికతడు చేస్తున్న ప్రయత్నం ఫలించలేదు. కళ్ల వెంట నీళ్లు కారాయి.

లేవబోతున్నవాడల్లా కూర్చున్నాడు తిరుమల్. "మనోహర్... డోంట్ బి ఎక్సైటెడ్... ఏదో మాటవరుసకన్నాను. కాని ఇప్పుడు మనలాంటివాళ్లు భూములుంచుకునే పరిస్థితులున్నాయా? ఎవరైతే నాగలిపట్టి దున్నుతున్నారో వాళ్లకు తప్ప భూముల వల్ల మనకు లాభంలేదు."

"నాకు భూమినుంచుకోవాలనే ఉంది. కాని అమ్మక తప్పడంలేదు. అందుక్కారణాలు నీకు తెలియనివి కావు. అయినా నాకున్న భూమెంత?" అంటూ శారద దిక్కు చూశాడు మనోహర్.

"అన్నయ్యా! పెళ్లయినప్పట్నించీ ఇదే ఘర్షణ. ఈయన మనస్తత్వమేంటో నాకర్థం కాదు. ఒక్కోసారి నాకు ఉరి పెట్టుకొని చావాలనిపిస్తుంటుంది. పిల్లలేమో చిన్నవాళ్లయిరి," అంది శారద.

"చెల్లెమ్మా! నిజానికి మీ సంసారంలో పెద్దగా సమస్యలుండకూడదు. లేవు కూడా. అయినా మీరు ఘర్షణ పడుతూనే ఉంటారు. అతనికున్న కొన్ని భావాల వల్ల నీ కుటుంబానికేదో నష్టం జరుగుతుందని నువ్వనుకుంటున్నావు. నీవల్ల తాను చేయదలచుకున్నవేవో చేయలేకపోతున్నానని మనోహర్ భావిస్తుంటాడు. మీరిద్దరూ ఒకర్నొకరు అర్థం చేసుకోవడం లేదు. మనోహర్‌కు కొన్ని ఆదర్శాలున్నాయి. చుట్టూ జరుగుతున్న పోరాటాల పట్ల సానుభూతుంది. అయితే తానే విధం గానూ వాటికి ఉపయోగపడడు. కాని అప్పుడప్పుడు తనలో తాను  ఘర్షణననుభవిస్తుంటాడు. ఉద్యోగం వల్ల లభించిన స్థితి, సంసారం, పిల్లలు అనే సగటు మనిషి ఆలోచనలే అతనిపై ఆధిపత్యం వహిస్తుంటాయి. అంతమాత్రానికే మీ సంసారానికేదో నష్టం జరుగుతున్నట్టు నువ్వను కుంటున్నావు. ఆందోళన చెందుతావు. కుటుంబానికే పరిమితమైన నీ ఆలోచనల నర్థం చేసుకోక నిన్నతడు అన్నిటికీ కారణం చేస్తాడు."

తమ మనస్తత్వాలను మరోసారి విడమరిచి చెప్పిన తిరుమల్ దిక్కు ఏం మాట్లాడకుండా చూస్తున్నారు మనోహర్, శారద.

"చెల్లెమ్మా! మనముంటున్నది పోరాటాల నేల. ఇక్కడెంతో సంఘర్షణుంది. సంక్షోభ ముంది. మాలాంటివారెటూ తేల్చుకోలేని పరిస్థితులున్నాయి. యుద్ధం జరుగుతున్న సమయంలో కొన్ని అవస్థలు తప్పవు. చదువుకున్నదానివైన నువ్వు ఇవన్నీ అర్థం చేసుకోవాలి. నీకున్న చదువును, అవగాహనను నీ సంసారంలో కలతలు రాకుండా ఉండడానికైనా ఉపయోగించుకోవాలి. నిజానికి మీరిద్దరు ఒకర్నొకరు అమితంగా ప్రేమించుకుంటున్నారు. ఈ విషయం మీకే తెలియకపోవచ్చు. అలా కాకుంటే ఘర్షణ పడుతూనే ఇన్నేళ్లు కలిసి ఉండడం సాధ్యంకాదు. మీరొక్కసారి కోపంలో అనుకుంటున్నట్టు ఒకరికొకరు శత్రువులు కారు. పైగా మీరొకర్ని విడిచి మరొకరుండలేరు కూడా."

తిరుమల్ మాటల గూర్చి తమలో తామే తర్జనభర్జన చేసుకుంటున్నారు వాళ్లు. కొద్దిక్షణా లాగి, "అన్నయ్యా! మీరిద్దరూ ఊరెళ్లాలన్న విషయాన్ని మరిచిపోయినట్టున్నారు," అంది శారద.

"నేనేం మరిచిపోలేదు చెల్లెమ్మా. స్కూటర్ మీద ఎంతసేపట్లో పోతాం. ఎక్కువకెక్కువ రెండు గంటలు. మధ్య ఆగుతూ పోతే రెండున్నర గంటలు. పోయే ముందు అన్ని కోణాల్లోంచి ఆలోచించుకోవాలి కదా. మనోహర్! ఈ భూమి అమ్మడు కార్యక్రమం పూర్తయితే ఊళ్లో నీకంటూ ఏముండదన్నమాటే కదా?" అన్నాడు తిరుమల్.

"అవును... నేను పుట్టి పెరిగినూళ్లో నాకు సూదిమొన మోపేంత భూమి కూడా ఉండదు. నేను నూటికి నూరుపాళ్లూ భూమిలేని వాణ్ణవుతాను," ఏడ్పు మిళితమైన నవ్వుతో అన్నాడు మనోహర్.

అతన్ని చూసి శారద, తిరుమల్ ఇద్దరూ నోళ్లు తెరిచారు.

"నేల మీదంత మమకారమున్నవాడివి అమ్మకుంటే బాగుండేది కదా!"

మనోహరేం మాట్లాడలేదు.

"అన్నయ్యా ఈయనకేం జరుగుతోందో నాకర్థం కావడంలేదు. నేను పుట్టినూళ్లో నాకేం లేకుండా అయిపోతుంది. నేనెవరికీ కానివాడినయ్యాను, నన్నూరు తరిమేస్తుంది, అంటూ బాధ పడుతుంటాడు. ఈయన మనస్తత్వమే నాకర్థంకాదు. ఒక్కోసారి ఆలోచిస్తే ఈయనకు పిచ్చి లేస్తుందేమోననిపిస్తుంది," అంది శారద.

"నీకా భయమక్కర్లేదు చెల్లెమ్మా! మనోహర్‌కేమీ కాదు. అతడు తన ఊరును బాగా ప్రేమించాడు. భూమినీ ప్రేమించాడు. స్వయంకృతమో, పరిస్థితులో తన వాళ్ల స్వార్థమో కారణ మేదైనా తాను ప్రేమించిన భూమికి దూరమవుతున్నాడు మనోహర్. అయినా ఊరిపై ప్రేమను,

భూమిపై మమకారాన్ని, తనకన్యాయం జరిగినా తనవాళ్లపై అనురాగాన్ని వదులుకోలేక పోతున్నాడు. మొదట్నుంచీ ఏవేవో ఆదర్శ సమాజపుటూహల్లో బతికేవాడు మనోహర్. అట్లని అన్నిట్నీ తెంచుకొని బయటపడే ధైర్యమూ లేదు. చుట్టూ జరిగే పోరాటాలతో పాలు పంచుకునే ధైర్యం లేదు. వాటి ఫలితాలను కాదనే మనస్తత్వమూ కాదు. అందుకే ఈ తంటా అంతా!

తిరుమల్‌కు సమస్యల్లోకి ఎక్స్‌రే కళ్లతో ప్రవేశించడం తెలుసని మనోహర్‌కు తెలుసు. తనను గూర్చి విడమర్చి చెబుతున్న మిత్రుణ్ణి ఆశ్చర్యంగా చూస్తున్నాడు మనోహర్.

"మనోహర్! భూమిపై ప్రేముండి కూడా దాన్నమ్మడానికెన్నో కారణాలున్నా నీలో ప్రవేశించిన వ్యాపారధోరణి మరో బలమైన కారణం కాదంటావా? ఆ భూముంటే పంటకోసం పెట్టుబడి పెట్టాలి. పంట పండితే పండొచ్చు లేకుంటే లేదు. పండినా నీ భాగం నీకు సరిగా అందదు. ఒకవేళ అందినా ఆ పంట విలువ నువ్వు భూమమ్మితే వచ్చే డబ్బు పై వచ్చే వడ్డీ కంటే తక్కువ. ఆ భూమమ్మి డబ్బు ఏ బ్యాంకులో డిపాజిట్ చేసినా భవిష్యత్తులో నీ పిల్లలకు ఉపయోగపడు తుంది. మనలాంటి వాళ్ల ఆలోచనలిలా సాగుతాయి. అదే రైతున్నాడనుకో, ఆ భూమిలో పెద్దగా పంట రాకున్నా భూమిని వదులుకోవడాని కిష్టపడడు. భూమి నమ్మడం అవమానంగా భావిస్తాడు. అవునా?"

తనలో అంతర్లీనంగా ఉన్న ఆలోచనలను బయటపెట్టిన తిరుమల్‌కేం చెప్పాలో తోచలేదు మనోహర్‌కు. అంగీకారసూచకంగా తలూపాడు.

"పోదాం పద. మనం ఊళ్లోకెళ్లేసరికి ఊరివాళ్ళెళ్లిపోతే బాగుండదు," అని లేచి నిల్చున్నాడు మనోహర్.

"మనం వస్తామని చెప్పాం కదా! ఏం వెళ్లరులే," తిరుమల్ లేచి నిల్చుంటూ అన్నాడు.

"చెల్లెమ్మా! తర్వాత మమ్మల్ని అనొద్దు. ఈరోజుతో మీకా ఊళ్లో ఏం లేకుండా అయిపో తుంది."

"పోతే పోనియ్యండన్నయ్యా! అక్కడ భూముండి కూడా చారెడు విత్తులెప్పుడూ తెచ్చు కున్నది లేదు," అంది శారద.

"నీదేంబోతుంది? పోతేగీతే నాదే పోతుంది," అని బయటకొచ్చాడు మనోహర్. ఏదో అనబోయిన శారద నాపాడు తిరుమల్. మనోహర్ వెనుకే బయటకొచ్చాడు. ఇద్దరూ తలలకు తెల్ల టవల్ కట్టుకున్నారు.

నెత్తుటిముద్దలా ఉన్న సూర్యుడు తూర్పుకొండల్లోంచి బయటకు తొంగి చూస్తున్నాడు. నెమ్మదిగా పైకి కదుల్తున్న సూర్యబింబంలోంచి అరుణకిరణాలు తెలుపును సంతరించుకుంటు న్నాయి.

స్కూటర్ బయటకు తీశాడు మనోహర్.

"నువ్వో మూడీఫెలోవి. స్కూటర్ నేనే నడుపుతాను," అని తన చేతుల్లోకి తీసుకున్నాడు తిరుమల్. కిక్కొట్టి స్టార్ట్ చేశాడు. వెనుక మనోహర్ కూర్చున్నాడు. స్కూటర్ నడుస్తోంది.

మనోహర్‌లో ఎన్నో ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

"చాలామందికి వ్యక్తిగత సమస్యలుంటాయి. కుటుంబంలో సమస్యలుంటాయి. ముఖ్యం గా భార్యాభర్తల మధ్య అభిప్రాయాల్లో వ్యత్యాసమున్నపుడు ఇవి తప్పవు. అయితే

నీలాంటి కొంతైనా అభివృద్ధికర, సామాజికమైన ఆలోచనలున్నవాడు సాధ్యమైనంతవరకు వ్యక్తిగత సమస్యలను తగ్గించుకోవాలి. ఇంతకీ మీ మధ్య సమస్యలెందుకొస్తున్నాయి?'' అడిగాడో రోజు తిరుమల్.

''మన మీద ప్రేమలేని వాళ్లను మనమెందుకు భరించాలి? ఉన్న కాస్త భూమిని నీ వాళ్లు నాశనం చేస్తుంటే మీరెందుకు చూస్తూ ఊర్కుంటారు? మనకూ పిల్లలున్నారు కదా? రేపు వాళ్లకేం సంపాదిస్తామనుకుంటున్నారు? అంటుంది శారద. మా కుటుంబ విషయాలొచ్చినప్పుడల్లా ఘర్షణ తప్పడంలేదు,'' అన్నాడు మనోహర్.

తన కుటుంబం గూర్చి అన్ని విషయాలు తెలుసు తిరుమల్‌కు.

''మీ తల్లిదండ్రులు జీవితకాలమంతా వ్యవసాయం చేస్తూనే బతుకుతున్నారు. వాళ్లెన్నో కష్టనష్టాలను ఆటుపోట్ల నెదుర్కొన్నారు. నిన్ను చదివించారు. నీకుద్యోగమైంది. మీ చెల్లెలి ఆర్థిక పరిస్థితి హీనంగా లేకున్నా ఆమెది వ్యవసాయ కుటుంబమే. నువ్వు ఉద్యోగం చేస్తూ హాయిగా బతుకుతున్నట్టు, నీ చెల్లెవాళ్లు వ్యవసాయం చేస్తూ కష్టపడుతున్నట్టు వాళ్లు భావిస్తున్నారు. తాము పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు చెప్పించిన కొడుకును చేతికొచ్చింతర్వాత ఎక్కడనుంచో వచ్చిన కోడలు తన్నుకుపోయిందన్న భావం వాళ్లలో క్రమక్రమంగా బలపడింది. ఈనగాచిన చేనును నక్కలపాలు చేసినట్టు బాధపడ్తున్నారు వాళ్లు. దానికితోడు నీ భార్య కొంత నాగరికంగా కనబడటం, నీ చెల్లెలు మొరటుగా ఉంటూ కష్టపడుతున్నట్లు కనబడటంవల్ల వాళ్లె ద్వేషం మరింత ఎక్కువైంది. ఉద్యోగరీత్యా మీరు ఊరికి దూరంగా ఉండడం వల్ల దగ్గరున్న మీ చెల్లెవాళ్లు వాళ్లకు మరింత దగ్గర కావడానికి అవకాశం లభించింది. వాళ్లను నిర్లక్ష్యం చేస్తున్నట్లనిపించే మీ ప్రవర్తన మరో కారణం. ఇవన్నీ నువ్వు తెలుసుకునేసరికే చాలావరకు చేయి దాటిపోయి మీ మధ్య దూరం పెరిగింది.

''ఇవన్నీ సరిచేయాలంటే నువ్వు చాలా శ్రమించాలి. నువ్వు నీతో, నీ భార్యతో, నీ తల్లిదండ్రు లతో దాదాపు యుద్ధంలాంటిదే చేయాలి. నీ భార్యను తరచుగా ఊరికి తీసుకెళ్లాలి. వాళ్లనిక్కడకు తెచ్చుకోవాలి. వాళ్లతో మమేకం కావాలి. మీరు వాళ్లకు దూరమవుతున్నారన్న భావాన్ని తొలగించాలి. చేతనైతే ప్రయత్నించు. లేదా భూమిలో మిగిలినవరకే చాలని ఊర్కో,'' అన్నాడు తిరుమల్.

తనవల్ల ఇవన్నీ సాధ్యమవుతాయా? తనను తాను ప్రశ్నించుకున్నాడు. కొంత ప్రయత్నించాడు. దబాయించి ఇద్దర్నీ సరిచేసే శక్తి తనలో లేదని తేలిపోయింది. తనకు తెలియకుండానే భూమినమ్మి చెల్లెలికి డబ్బిచ్చిన విషయాన్నీ కనుక్కోలేకపోయాడు చాలాకాలం వరకు.

ఆ విషయంలో భార్యతో ఘర్షణ పడటం మానుకున్నాడు.

''తిరుమల్ తన కుటుంబం, పిల్లలు, ఇంతవరకే పరిమితం కావాలంటుంది శారద. మనకేం ఆస్తిపాస్తులు లేవు కాబట్టి ఉద్యోగంతో వచ్చే డబ్బే కాకుండా మరికొంతైనా సంపాదించాలంటుంది. ఏం చేయాలో నాకర్థం కావడంలేదు,'' అన్నాడు ఓసారి మిత్రునితో.

తిరుమల్ ఇవన్నీ మామూలే అన్నట్టు చూశాడు.

''నేనామెను సమర్థించడంలేదు. అందరూ ఇలాగే ఉండాలని, ఉంటారనీ అనడంలేదు. కాని శారదలాంటి వాళ్లుంటున్న పరిస్థితుల్లో ఆమె అలా అనడంలో నాకేం తప్పు కనబడటం లేదు. మనమెంత కాదన్నా స్త్రీ పైన కుటుంబభారం పడుతూనే ఉంటుంది. కొన్ని కుటుంబాల్లో నైతే భర్త దురలవాట్లకు బానిసైనా కుటుంబా న్నార్థికంగా ఆదుకునే స్త్రీలున్నారు. కాని చాలామంది

స్త్రీలను ఇంటికే పరిమితం చేస్తున్నారు పురుషులు. సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనే పురుషుల విషయంలోనూ ఇదే జరుగుతోంది. విప్లవోద్యమాల్లో పాల్గొన్నా పురుషులకు చనిపోయినా, బతికినా పేరైనా మిగులుతుంది. మరి ఆ కుటుంబాల్లోని స్త్రీల సంగతేంటి? ఆమె ఎన్ని కష్టాల నెదుర్కోవాల్సి వస్తుంది? ఎన్ని వేదన లనుభవించాలి? అయినా ఆమెకు లభించేదేంటి? ఆమెకే మాత్రం గుర్తింపు లభించడంలేదు. భర్త పనులు కూడా ఆమెకు పరాయిపనులే అవుతున్నాయి. ప్రగతిశీల ఆలోచనా దృక్పథమున్న చాలామంది మేధావులు కూడా తమ భార్యలను ఇండ్లలోంచి కదలనీయరు. పోనీ నువ్వే పనైనా నీ భార్యనడిగి చేశావా?'' అన్నాడు తిరుమల్.

``లేదు...'' అన్నాడు తాను.

``నువ్వు పాల్గొంటున్న కార్యక్రమాలతో, చేస్తున్న పనులతో ఆమెకు సంబంధం లేనప్పుడు ఆమె మాత్రం నీ అభిప్రాయాలతో ఎందుకేకీభవించాలి? మంచో చెడో ఆమెతో చర్చించి వీలైతే ఆమె కూడా పాల్గొనేట్టు చేసినప్పుడు ఇలాంటి సమస్యలు రావు. కాని అలా జరగడంలేదు.''

``అన్నిట్లో ఆడవాళ్లెలా పాల్గొంటారు?''

``ఎందుకు పాల్గొనగూడదు? ఏ పనైనా మన భాగస్వామికి నిషేధితమైనదయితే మనకు మాత్రమెందుకు పాల్గొనగలిగేది కావాలి? స్త్రీలతో సంబంధం లేకుండా పనులు చేయడం వల్ల స్త్రీలు కుటుంబానికి పరిమితమై ఆలోచించే అవకాశముంది. ఆ పనులు వాళ్లకు కూడా సంబంధించినవే అని వాళ్లనుకుంటే మనకు వాళ్ల నుంచి మద్దతు లభిస్తుంది. ఇదిద్దరికీ వర్తిస్తుంది.''

``నేను రమ్మన్నా రాదామె. నన్ను కూడా తనలాగే కుటుంబానికే పరిమితమై ఉండాలంటుంది.''

``అందుకని నీకామె శత్రువుగా కనబడుతుంది. నువ్వామెను మొదట్నుంచీ నీ పనుల్లో పాల్గొనేట్టు చేసి ఉండవు. నువ్వేం చేస్తున్నావో కూడా చెప్పుండవు. అలా చేసుంటే కనీసం నీ పనులకామె అడ్డం వచ్చుండేది కాదు. ఆమెలాంటి వాళ్లుంటున్న వాతావరణం వాళ్లనంతకంటే ఎక్కువగా ఆలోచించనీయదు. వెర్రితలలు వేస్తున్న కన్స్యూమరిజం ఆమె ఆలోచనలను సోఫా సెట్లకు, పట్టుచీరలకే పరిమితం చేస్తుంది. పోగా నీకంటూ స్పష్టమైన అభిప్రాయాలుంటే నువ్వేదో విధంగా సమాజానికుపయోగపడతావు. నిన్నూ చాలామందికిలాగే మధ్యతరగతి భయాలు వెంటాడుతున్నాయి. నీలాంటి వాళ్లెంతోమంది సామాజిక సమస్యల పట్ల స్పందన, సానుభూతున్నా ఏ విధంగానూ ఉపయోగపడటంలేదు. ఒక విధంగా ఆలోచిస్తే నీకంటే నీ భార్యే నయమేమో ననిపిస్తుంది. ఎందుకంటే ఆమెకు ఖచ్చితంగా తన సంసారం, తన కుటుంబం బాగోగులే కావాలి.''

చివరి వాక్యాలు సరైనవి కావేమోననిపించినా తిరుమల్ మాట్లో ఎన్నో నగ్నసత్యాలున్నాయనిపించింది తనకు.

ఆ తర్వాత తానే ఆమె మనసెరిగి ప్రవర్తించడం మొదలుపెట్టాడు. ఉద్యమాల పట్ల తనకు అపారమైన సానుభూతున్నా జరుగుతున్న మారణహోమాలు భయం కల్గిస్తున్నాయి. ఎదుగుతున్న పిల్లలు, పెరుగుతున్న ఖర్చులు, చాలీచాలని ఆదాయం, ఎదుగూబొదుగూ లేని ఉద్యోగం, తనను మరింత వివశుడ్ని చేస్తున్నాయి. బతుకుభయాన్ని కల్గిస్తున్నాయి. తాను మధ్యతరగతి ఆలోచనల్లోకి కూరుకుపోతున్నట్టు, అశక్తుడవుతున్నట్టు తనలో తానే రోదిస్తున్నాడు. అలాంటి సమయంలో తండ్రి మరణించాడు. తాను మరింత కృంగిపోయాడు. ఉన్న భూమికోసం

యుద్ధం లాంటిదే చేయాల్సి వచ్చింది. అప్పటివరకూ చాలావరకు భూమి అమ్ముడుపోయింది. ఉన్నదాంట్లో తనకొచ్చిన రెండెకరాలు ఇప్పుడమ్ముడు పోతోంది.

స్కూటర్ పెద్దపల్లి దిక్కు పరుగులు తీస్తోంది. ఆలోచనల్లో పడి మౌనంగా ఉన్న మనోహర్ నుద్దేశించి, "ఏంటి మనోహర్... ఏదో తీవ్రాలోచనలో ఉన్నట్టున్నావు," అన్నాడు తిరుమల్.

రాజీవ్ రహదారి రోడ్డు నిర్మాణమింకా పూర్తికాలేదు. ఉదయం చల్లగాలి వీస్తున్నా ఆలోచనల భారంతో మనోహర్ మనసు వేడెక్కుతోంది. తిరుమల్ మాటలతో మనోహర్ ఆలోచనల సుడిగుండమాగిపోయింది.

"ఏంలేదు, మనసంటే ఆలోచనల పుట్టే కదా! ఒకప్పుడు మన జిల్లావాళ్లకు పరిశ్రమలంటేనే తెలియదు, కోరుట్ల దిక్కు బీడీ పరిశ్రమ తప్ప. గోదావరిఖనిలో బొగ్గుగనులు, తర్వాత పవర్‌హౌస్, సిమెంటు ఫ్యాక్టరీ, ఎఫ్.సి.ఐ., ఎన్.టి.పి.సి., ఆక్సిజన్ ఫ్యాక్టరీలాంటివెన్నో వచ్చాయి. పారిశ్రామికాభివృద్ధి జరిగింది. కార్మికవర్గం ఏర్పడింది.

ఈమధ్యకాలంలోనే పోరాటాలు ఉధృతమయ్యాయి. మనం పయనిస్తున్న ఈ నేలలోని ప్రతి అంగుళమూ రక్తంతో పునీతమైందే. ఏ ఒక్క ఊళ్లోనూ ఈఇరవై ఇరవై ఐదేళ్లలో యువకులు బలికాకుండా లేరనుకుంటాను. మరి వాళ్ల రక్తతర్పణానికి ఫలితం? ఈ పోరాటాల ఉద్దేశంపై నాకు సదభిప్రాయమే ఉన్నా జరుగుతున్న హింస, మానవహోమాలు మాత్రం నాకు భయం కల్గిస్తున్నాయి," అన్నాడు మనోహర్.

ఆ రోడ్డెప్పుడూ సందడిగానే ఉంటుంది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించడానికి అతి జాగ్రత్తగా స్కూటర్ నడుపుతున్నాడు తిరుమల్.

"మనోహర్! బలిదానాలెప్పుడూ వృధా కావు. పోరాట ఫలితాలను మనం గమనిస్తూనే ఉన్నాం. ఇరవై ఏళ్ల క్రితం మన గ్రామాల్లో దొరల ముందు చెప్పులు తొడుక్కొని నడిచిన వాళ్లున్నారా? దొర కనబడితే చెప్పులు, రుమాలు చేతిలో పట్టుకొని వంగి వంగి నమస్కరిస్తూ పోయేవాళ్లే కదా. వెట్టి అతి మామూలు విషయం. శ్రామికజన స్త్రీల శీలానికి రక్షణుండేదా? కొన్నూళ్లలోనైతే పెద్దమనిషయిన అమ్మాయి మొదట్లో దొర గడీకే పోవాల్సుండేది. కూలిరేట్లు ఇష్టమున్నట్టే ఉండేవి. ఇప్పుడు దొరలు చాలామంది ఊళ్లొదిలిపోయారు. ఉన్నవాళ్లూ దొరలమని పిలిపించుకోవడానికి భయపడుతున్నారు. పరిస్థితుల్లో వచ్చిన మార్పులన్నీ ఉద్యమాల ఫలితాలు కావా? కనీసం మార్పులను వేగవంతం చేయడానికైనా ఉద్యమాలు దోహదం చేశాయి కదా..."

"ఖచ్చితంగా. ఒకప్పుడు మన ప్రాంతంలో హరిజనుల స్థితి ఎంత హీనంగా ఉండేది. ఇపుడు వాళ్లలో ఆత్మవిశ్వాసం పెరిగింది. కొన్ని గ్రామాల్లోనైతే హరిజన యువకులే ఆధిపత్యం చేస్తున్నారు," అన్నాడు మనోహర్.

"ఆ మాట నిజమే కానీ, కొన్ని గ్రామాల్లో ఇంకా అస్పృశ్యత ఉందిట. ఎన్నో ఉద్యమాలకు ఆలవాలమైన జగిత్యాల పల్లెల్లోనూ హరిజనుల బట్టలను తడిపివేస్తే తప్ప చాకలివాళ్లు బట్ట లుతకరుట," అన్నాడు తిరుమల్.

"అందుకే కులసమస్యను పరిష్కరించందే మిగతా సమస్యలు పరిష్కారం కావన్న వాదం గూర్చి ఆలోచించాల్సిన అవసరముంది. కేవలం ఆర్థికపోరాటాలు అన్ని సమస్యలకూ పరిష్కారం కాకపోవచ్చు."

'అవన్నీ పెద్ద విషయాలు. పెద్దపల్లి వచ్చింది. బస్టాండు దగ్గరున్న చెట్టు కింది బండి హోటల్లో చక్కని వడ, ఇడ్లీ దొరుకుతుంది. టిఫిన్ దట్టంగా పట్టించిపోతే బాగుంటుంది. ఊళ్లో భోజన మాలస్యమైనా ఫర్వాలేదు."

"అలాగే కానిద్దాం..."

బస్టాండు బయట చెట్టు కింద స్కూటరాపాడు తిరుమల్. బెంచీ మీద కూర్చున్నారిద్దరూ.

"రాజయ్యా! ఇడ్లీ జబర్దస్తీగుండాలి, వడ నోట్లేసుకుంటే కరిగిపోవాలి," అన్నాడు హోటల్ యజమాని నుద్దేశించి తిరుమల్.

"మస్తుగుంటది సార్. ఈ నడుమ కనపడుతలేరేంది?"

"స్కూటర్ పైన ఇట్నుంచి పోతే నా టిఫిన్ ఇక్కడే. నీ చేతి రుచికి అలవాటుపడ్డాను. ఈ నడుమ బస్సు మీద పోవడమవుతోంది."

"బావా...! అటు చూడు, పోచమ్మకు జాతర చేస్తున్నారు. వేపమండలతో స్త్రీలెలా ఎగురుతున్నారో చూడు. ఇన్ని ఉద్యమాలున్నా ఇవి పోలేదు," అన్నాడు మనోహర్.

"మనోహర్, తెలంగాణ జిల్లాల్లో ఓ ప్రత్యేక పరిస్థితుంది. ఓ దిక్కు పోరాటాలు... మరో దిక్కు ఇలాంటి ఆరాధనలు సమాంతరంగానే సాగుతున్నాయి. నిజానికి శ్రామికవర్గం మొదట్నుంచీ ఓ ప్రత్యేక సంస్కృతిని కాపాడుకుంటూ వస్తుంది. వీళ్ల పాటలూ వేరే ఉన్నాయి. వీళ్లతో మమేకం సాధించడానికే గద్దర్‌లాంటి వాళ్లు వీళ్ల బాణీలను తీసుకొని బ్రహ్మాండమైన పాటలు రాశారు. అవి ప్రజల్లో తెచ్చిన చైతన్యం తక్కువేం కాదు."

"నిజమే తిరుమల్, ఇప్పుడు సమ్మక్క, సారలమ్మ జాతరలు గ్రామగ్రామానికీ జరుగుతున్నాయి. మా ఊళ్లో మొన్ననే ప్రతిష్టాపన చేశారు."

"తమ కోసం వీరోచిత పోరాటాలు చేసినవాల్లను దైవాలుగా ఆరాధించడం శ్రామిక కులాల్లో మామూలే. తెలంగాణ పోరాటంలో అమరులైన వాళ్ల గురించి బుడిగె జంగాలు, శారదకాళ్లు కథలు చెప్పడం మన గ్రామాల్లో ఉంది."

టిఫిన్ తింటూ మాట్లాడుకుంటున్నారు వాళ్లు.

"తల్లులు కొడుకులకు బూరెలు చేసి పెడితే కొడుకులు చీర కొనివ్వాలని, మరదళ్లకు వదినలు చీరలు కట్టివ్వాలని, శర్కరకుడకలు పోస్తే అన్నదమ్ములు ఆడిబిడ్డలకు బట్టలు పెట్టాలని రకరకాల నమ్మకాలు మన గ్రామాల్లో ప్రచారంలో ఉన్నాయి. యాంత్రిక జీవితానికలవాటు పడుతూ ఒకరికొకరు దూరమయి బతుకకుండా ఆ జీవితాల్లో కొంతైనా సంబంధాలను పెంపొందించడాని కివన్నీ కల్పిస్తారేమోననిపిస్తుంది."

చెబుతున్న మనోహర్ గుండె బరువెక్కింది. పరిస్థితులేవైనా, తనకు దూరం జరుగుతున్న తనవాళ్లు జ్ఞాపకం వచ్చారు.

టిఫిన్, కాఫీ తాగడం ముగించి లేచారు వాళ్లు. మనోహర్ రాజయ్యకు డబ్బులిచ్చాడు. బారెడు పొద్దెక్కింది. చద్దిగిన్నెల్లో అన్నం పెట్టుకొని గిన్నెలు చేతుల్లో పట్టుకొని నిల్చున్నారు స్త్రీలు. ఆరోజు కూలి కోసం చెట్టు కిందికి చేరుతున్నారు.

"ఇక్కడే ఓ పోలీసధికారిని చంపడం వల్ల నెలరోజుల పాటు ఊళ్లన్నీ బెగ్గం పాడయ్యాయి. మూతి మీద మీసమున్న ఏ యువకుడూ ఊళ్లలో ఉండకుండా పారిపోయారు," కిక్ కొడుతూ అన్నాడు తిరుమల్.

"అవును, తెలంగాణ నేలంతా నాకు కురుక్షేత్రంగానే కనబడుతుంది. కురుక్షేత్ర సంగ్రామం రాజ్యం కొరకైతే, ఈ సంగ్రామం భూమి కోసం. మనం ఊరు దాటేంతవరకు మాట్లాడకుండా ఉంటే మంచిది," అన్నాడు మనోహర్.

స్కూటర్ నడుస్తోంది. పెద్దగా పొద్దెక్కకున్నా ఎండ చురుక్కుమంటోంది. రోడ్డు కిరువైపులా చూస్తున్నాడు మనోహర్. వరిపొలాలు పొట్టకొచ్చున్నాయి. మొక్కజొన్న చేలు కోత కొస్తున్నాయి.

మనోహర్‌లో రకరకాల ఆలోచనలు సుళ్లు తిరుగుతున్నాయి.

"చుట్టూ భీకర పోరాటాలు జరుగుతున్నాయి. అయినా తనలాంటి వాళ్లెంతోమంది వాటిని పట్టించుకోకుండా ఎలా ఉండగలుగుతున్నారు? తాను శ్రామిక సంస్కృతిని ప్రేమిస్తున్నాడు. అయినా ఆ సంస్కృతి నింట్లోంచి తరిమి వేస్తున్నారెంతోమంది. మధ్యతరగతి విలువలు, సంస్కృతి ఊబిలో కూరుకుపోతున్నాయి. కలర్ టీవీలు, ఫ్రిజ్‌లు ఇతర సౌఖ్యాల కలవాటుపడుతున్నారు. ఈ విషయంలో తనలాంటివాళ్లు స్త్రీలను నేరస్తులను చేస్తున్నారు. వాటిపై మోజు లేకుంటే అవన్నీ ఇంట్లోకి వచ్చే అవకాశముందా?

తానెలా బతకాలనుకున్నాడు? కాని తన ప్రయాణమెటు సాగుతోంది? తాము పల్లెకు, భూమికి దూరమవుతూ ఏ దిశగా ప్రయాణం చేస్తున్నట్టు? తనకుద్యోగం ఉండటం వల్ల ఓ మోస్తరుగా బతుకుతున్నాడు. కాని తన పాలివాళ్లు మట్టిలో మట్టై బతుకుతున్నారు. వాళ్ల పిల్లలింకా చీమిడిముక్కులతో, చిరిగిన నిక్కర్లతోనే ఉంటున్నారు. అయినా తాను వాళ్ల గురించెందుకు పట్టించుకోవడం లేదు? ఉద్యమాల వల్ల అసమానతలు తొలగి వాళ్లు కోరుకుంటున్న ఆదర్శ సమాజం రావడం సాధ్యమవుతుందా?

"మళ్లీ నీ లోకంలోకి వెళ్లిపోయావా?"

తిరుమల్ మాటలతో ఉలిక్కిపడ్డాడు మనోహర్. కొద్ది క్షణాలాగి, "మనం సుల్తానాబాద్ వరకొచ్చాం," అన్నాడు.

"ఈ ఊళ్లన్నీ నీకు చిన్నప్పట్నుంచీ తెలుసు. ఈ ఊరికి దగ్గర్లోనే ఉంది గట్టెపల్లి అనే ఊరు. ఆ ఊర్నుంచి మురళీధర్‌రావనే వ్యక్తి రజాకార్ల కెదురు నిలిచి పోరాడాడు. అతని కాళ్ల నుంచి రెండు తుపాకీగుండ్లు దూసుకెళ్లాయి. అతడు మొన్నమొన్ననే చనిపోయాడు."

"అవును... పెద్దపల్లి నుండి ఠాకూర్ శ్యాంసుందర్‌సింగ్ పాల్గొని మరణించాడు. ఈ ఊరికి మూడూళ్లవతల ధూలికటనే గ్రామముంది. పురావస్తు పరిశోధనా శాఖ వారక్కడ శాతవాహనుల కాలంనాటి శిల్పాలు, నాణాలు, మట్టిపాత్రలు కనుగొన్నారు. అక్కడి రాజుల కోట ఉండేదంటారు. ఆ ఊరు పక్కనే మా ఊరు.

"ఒకప్పుడివి చారిత్రక ప్రదేశాలే కావచ్చు. కానీ, ఈ చుట్టుపక్కల ప్రాంతాల్లో దొరతనం విశృంఖల విహారం చేసింది. నాకు తెలిసీ ఓ వృద్ధుడు దొర కొడుకు సవారీబండి కిందబడి చని పోతే అడిగినవాడే లేడొకప్పుడు.'

"అవును. ఆ అయ్యబాంచెను, అవ్వ బాంచెనుగాళ్లే ఇప్పుడు వీరోచితంగా పోరాడు తున్నారు. పోరాటాల వల్ల శ్రామికజనాల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది."

"మరి ఊళ్లన్నీ చెడిపోతున్నాయంటారు కొందరు."

"అలా అనడం మామూలే. నాకైతే తెలంగాణలోని ఏ ఊరుకెళ్లినా వీరభూమే కనబడ్తుం టుంది. అయితే రక్తపాతం మాత్రం భయం కల్పిస్తుంటుంది."

"యుద్ధానికి పోవడమిష్టమే కాని కత్తి చూస్తే కండ్లు తిరుగుతున్నాయన్నట్టున్నాయి నీ మాటలు. అదిగో మీ ఊరి పొలిమేరల్లోకి వచ్చేస్తున్నాం. పొద్దు బాగానే ఎక్కింది. అందరూ దొరుకుతారో లేదో," అన్నాడు తిరుమల్.

ఊరి పేరు విన్నా, ఊరి పొలిమేరల్లోకి ప్రవేశించినా భావోద్వేగానికి గురవుతుంటాడు మనోహర్.

చిన్నతనంలో తానాడుకున్న ప్రదేశాలు... ఎక్కిన చెట్లు, గుట్టలు, ఆడిపాడిన నేల, ఈత కొట్టిన చెరువు, తిరిగిన పొలాలు, చేలు అన్నీ జ్ఞాపకం వచ్చి మనోహర్ హృదయం బరువెక్కింది. అందులోని కొన్ని ప్రదేశాలను చూస్తుంటే మనోహర్‌కు చెప్పలేని ఆనందం కలుగుతుంది. ఈరోజు తర్వాత తానా ఊరికి రావడం మరీ అరుదైపోతుందన్న నిజం అతనికి దుఃఖం కల్గిస్తోంది. తననే కాదన్న తల్లి కోసం అప్పుడప్పుడు రావల్సి వచ్చినా భూమితో సంబంధం తెగిపోతుందన్న బాధ అతనికి భరింపరానిదిగా ఉంది. తనలాంటి వాళ్లెంతోమంది ఊరికి, భూమికి దూరమవుతున్న విషయాలు జ్ఞాపకం వచ్చి అతని కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

"ఊరి పొలిమేరల్లో పయనిస్తున్నామన్న ఆనందంతో నోరు పెగలడం లేదా? మాట్లాడటం లేదేంది మనోహర్?'' అన్నాడు తిరుమల్.

చదువుకుంటున్న రోజుల్లో మోటగొడుతూ, ఎడ్లు మేపటానికి పోయి, నాగలి దున్నుతూ పాడుకున్న పాటలు, ఆ ఊరి మట్టితో పెనవేసుకున్న అనుబంధాలు కల్ల ముందు కదిలి అతన్ని మాట్లాడనీయడం లేదు.

"ఆఁ... ఆఁ...'' అన్నాడు మనోహర్. కొద్ది క్షణాలాగి, "అదుగో అలా కనబడ్తోంది చూడు మా శ్రమదానంతోనే కట్టాం. అక్కడే పక్కన చెరువుకట్ట. ఆ గట్టు మీద మేం రోజూ ఆడుకునే వాళ్లం. బతుకమ్మ పండుగ రోజు ఇప్పటికి కూడా ఊరివాళ్లంతా అక్కడున్న మైదానంలోనే ఆడుకుంటారు. ఆ చెరువు కాకతీయుల కాలంలో కట్టిందంటారు. ఆ చెరువే మా ఊరికి ప్రాణా ధారం. చెరువు గట్టు మీదనే రామప్పాలయముంది. అదీ కాకతీయుల కట్టడమే,'' అన్నాడు.

మరికొద్ది నిమిషాల్లోనే స్కూటర్ మనోహర్ చిన్నాన్న ఇంటి ముందాగింది. "వచ్చింద్రా బిడ్డ. పొద్దుపోవట్టె. మీరు రారేమో అనుకున్న. ఇంకొంచెంసేపయితే ఎవ్వలు దొరుకకపోదురు,'' అన్నాడు మనోహన్ పినతండ్రి వెంకటయ్య.

"ఏరోజైనా నేను వస్తానని రానిదున్నదా? అంత దూరం నుంచి రావాలంటే ఎంత స్కూటర యినా సమయం తీసుకోదా,'' అన్నాడు మనోహర్.

వాకిట్లో వాల్చున్న మంచాల్లో చద్దర్లు పరిచాడు వెంకటయ్య. ఓ మంచంలో కూర్చున్నా రిద్దరూ.

మనోహర్ తల్లి వచ్చి పందిరిగుంజ కానుకుని నిల్చుంది.

"మంచిగున్నవా అమ్మ,'' అన్నాడు తిరుమల్ ఆమెనుద్దేశించి.

"ఏం మంచిగుండుడు బిడ్డ. తొందరగ చావస్తే బాగుండు,'' నిష్ఠూరంగా అందామె.

ఆమె ముఖంలో ఏమాత్రం పశ్చాత్తాపం కనబడలేదు తిరుమల్‌కు. కాని తన ఇంటికి రాకుండా మరిది ఇంటికొచ్చిన కొడుకు మీద కోపం, కడుపుకోత వేదన కనబడిందామె ముఖంలో. కాని కొడుక్కు ఊళ్లో ఇల్లు లేకుండా చేయడం తప్పన్న భావం ఆమెలో తిరుమల్ కసలే కనబడ లేదు.

ఇదివరకోసారి ఆమెతో అదేమాటంటే ఆమె అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి తిరుమల్‌కు.

"నా కోడలుకు మా గాలే తగులుద్దాయె. ఆయన మంచంలో పడుంటెనా బిడ్డే అన్నివిధాల అరుసుకుంది. ఎత్తి పోసింది. దానికి ఇల్లు లేదు. నన్ను గూడ అదే సాది పారేత్తది. కొడుక్కు నౌకరుంది. పట్నంలో ఇల్లుంది. అందుకే బిడ్డకు ఇల్లునిచ్చినమేంది? ఇస్తేం తప్పు?'' అందామె.

మరి భూమెందుకిచ్చినవన్నదానికి,

"కొడుకేమన్నా భూమి దున్నుతడా? వ్యవసాయం చేస్తడా? అందుకే కొంత భూమి గూడిచ్చినం బిడ్డకు? ఇస్తే తప్పా? వానికి గూడ రెండెకరాల భూమచ్చింది గద. అదేం జేసు కుంటడు? అమ్ముడపోవుడే కద," అంది.

తనకు ఇల్లు కాకుండా చేశారన్న కసితో ఉన్న భూమినీ అమ్మి ఊరుకు మరింత దూరమవు తున్న మనోహర్ దిక్కు చూశాడు తిరుమల్. తల వంచుకొని మంచంలో కూర్చున్నాడతను.

తిరుమల్ మాత్రం మనోహర్ తల్లినే చూస్తున్నాడు. అతనికామె ముఖంలో ఇన్నేళ్లు పడ్డ తపన, బండగా మారిన హృదయం కనబడుతున్నాయి.

వెంకటయ్య భూమిని కొన్న వ్యక్తిని, ముగ్గురు పెద్దమనుషులను వెంటబెట్టుకొని వచ్చాడు. పెద్దమనుషులు ఖాళీగా ఉన్న మంచంలో కూర్చున్నారు.

కొంరయ్య, అతని తండ్రి అంజయ్య గుంజ కానుకొని నిల్చున్నారు. "చిన్నమ్మ అన్నం జేస్తది బిడ్డ. ఇక్కన్నే తినుండ్రి," అన్నాడు వెంకటయ్య.

తలూపాడు మనోహర్.

అతని తల్లి కొడుకు దిక్కు చూసింది. ఆమె ముఖం చూడలేక జరిగిన సంఘటనలనంత తొందరగా మర్చిపోలేక తల వంచుకున్నాడు మనోహర్.

"ఉన్న బూమమ్ముకపోయి ఊరుకు, తల్లికి దూరంగా పో బిడ్డ. పైసలన్నీ పట్టుకపోయి ఊరి మొకం చూడకు," అందామె.

"ఊరి మొకం చూడొద్దని నువ్వే శాసించినవు గాదమ్మ. నా కింట్లో స్థానం లేకుండ జేసింది మీరే కద. నన్నూర్నుంచి దూరం జేస్తున్నది మీరె కద," అన్నాడు మనోహర్ బాధగా.

"మనోహర్ ఇప్పుడవన్నీ ఎందుకు? చెర్ల నీల్లు పోయి చెరువెనుక పడ్డ తర్వాత విచారిస్తే మొస్తది," అన్నాడు తిరుమల్.

అంబటివేళ సమయం దాటింది. ఎండ చురచురమంటోంది. వ్యవసాయప్పనులున్న వాళ్లంతా వెళ్లిపోయారు. కుక్క బావి దగ్గరున్న గోలెంలోని నీళ్లను గతుకుతోంది. కోళ్లు తడిగా ఉన్నచోట పొక్కిలి చేసి పొదుగుతున్నాయి.

"మనోహర్! పైసలన్నీ ముట్టినట్టేనా?" అన్నాడు రాజిరెడ్డి.

"ఇంకో పదివేలివ్వాలి," అన్నాడు మనోహర్.

కొంరయ్య పదివేల రూపాయలు తీసి రాజిరెడ్డికిచ్చాడు. వాట్ని మనోహర్ చేతిలో ఉంచాడు రాజిరెడ్డి.

విక్రయపత్రం రాతకోతలన్నీ అయిపోయేసరికి మరో అరగంట సమయం పట్టింది. కెనాల్ కింద పోయిన భూమి గూర్చి, ఇతర విషయాల గూర్చి కాగితాలపై రాసి సంతకాలు పెట్టారు.

"తొందరగా భోజనాలు చేసి సుల్తానాబాద్ రిజిస్ట్రేషనాఫీసుకు పొండ్రి. రిజిస్ట్రేషన్ చేసు కుంటే పనయిపోతుంది. ఓ గంట పనంతే," అన్నాడు మాజీ పట్వారి.

"అందుకే కదా మేమొచ్చింది? మేం స్కూటర్ మీద పోతాం. మీరు బస్సుకొస్తారో, స్కూటర్ మీదొస్తారో రండి," అని లేచాడు తిరుమల్.

భోజనాలకని వెంకటయ్య, మనోహర్ లేచి నిల్చున్నారు.

ఇంతలో నలుగురు యువకులొచ్చారక్కడికి. అందులో ఇద్దరా ఊరివాళ్లు కారు.

"మేం భూమినసలే అమ్మనివ్వం," అన్నాడో యువకుడు.

మనోహర్ గుండె మీద రాయి పడ్డట్టయింది. వాళ్లెవరో ఊహించాడు మనోహర్.

తానెవరి ఉద్దేశ్యాన్నైతే సిద్ధాంతపరంగానైనా నమ్ముతున్నాడో వాళ్ల నుంచే ఇప్పుడీ సమస్య రావడం మనోహర్‌కు ఆందోళనకరంగా ఉంది. తానిప్పుడెవరి పక్షాన నిలవాలి? తానా భూమిని ఇదివరకే అమ్మి పైసలు తీసుకున్నా వాళ్లు తలుచుకుంటే అవన్నీ కక్కిస్తారని మనోహర్‌కు తెలుసు.

"ఎందుకమ్మనివ్వరు?" వెంకటయ్య అడిగాడు.

"మేం భూములమ్మవద్దని చెప్పాం కదా!"

"నేను మీరనుకున్నట్టు బాగా భూమున్నవాడినో, ధనవంతుడినో కాదు. నాకుందే ఈ రెండెకరాలు. అదీ అమ్మవద్దంటె ఎలా?"

"నీకుద్యోగముంది కదా!"

"ఉంది నిజమే. కానది తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటిది. సరే, ఈ భూమిని వదిలి పెడతాను. నా పిల్లల భవిష్యత్తును గూర్చి గ్యారంటీ ఇస్తారా?"

"మేమెందుకిస్తాం గ్యారంటీ! అయినా మీకెలాంటి గ్యారంటీ కావాలి? ఈ డబ్బును మీరేం చేస్తారు? ఎక్కడో ఫిక్సుడు చేస్తారు? దాన్ని మీ పిల్లల చదువుకో, పెళ్లికో ఉపయోగిస్తారు. ఈ డబ్బుతో మీ పిల్లలకు గ్యారంటీ లభిస్తుందా?"

వాళ్ల ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి నసిగాడు మనోహర్.

"నౌకరీ చేసి నేనేం కూడబెట్టింది లేదు. తండ్రి ఆస్తులను మోసుకపోయిందీ లేదు. ఇది నా తండ్రి నుంచి వారసత్వంగా వస్తున్న ఏకైక ఆస్తి. ఈ అరవైవేల రూపాయలకీ కాలంలో ఎంత విలువుందో మీకు తెలియందేం కాదు.

"నాకూ ఉద్యమాలంటే సానుభూతుంది. పరిస్థితులు వికటించి ఈ భూమి నమ్ముకున్నాను, కాని ఏదో బావుకుందామని కాదు. పైగా అమ్ముతున్న నేను, కొంటున్న కొంరయ్య ఇద్దరూ మీరు నిర్ణయించిన ఆస్తి భూమి పరిధిలోకి వచ్చేవాళ్లమే. అయినా భూమి నమ్మనియ్యమంటే అమ్మ నియ్యకుండి. డబ్బులిదివరకే తీసుకున్నాను. అందులో కొంత ఖర్చయింది కూడా. తల తాకట్టు పెట్టయినా అవి తెచ్చి పారేస్తాను. ఆ భూమ్మీద నేనొక్క పైసా ఆదాయం పొందింది లేదు. అదలాగే ఉండడం మీకిష్టమా? నాలాంటి ఉట్టికీ, స్వర్గానికీ అందనివాళ్లను కూడా వేధించడం మీ సిద్ధాంతమా?" నిష్టూరంగా అన్నాడు మనోహర్.

యువకులు పక్కకు వెళ్లి తమలో తామేదో మాట్లాడుకున్నారు.

"మరి మీ తల్లి పోషణ విషయం?" అడిగాడొకతను కొద్దిసేపాగి.

"నేనామెను పోషించననడంలేదు. నాతో రమ్మంటే ఆమె రానంటుంది. అందుకే ఆమె ఇష్టప్రకారమే ఇల్లు, కొంత భూమిని ఆమెను పోషించాలన్న షరతుపై మా చెల్లెలికిచ్చాం. ఇప్పటికైనా నా తల్లి నాతో వస్తానంటే కాదనడం లేదు. ఇక్కడే ఉన్నా ఆమె ఖర్చు భరిస్తాను. ఇల్లు నాకిప్పించండి," అన్నాడు మనోహర్.

"అవ్వా! నీ కొడుకు చెప్పింది నిజమేనా? నువ్వెక్కడుండదలుచుకున్నావు?"

"నిజమే. నేనిక్కన్నే, నా బిడ్డతోనే ఉంట."

తర్వాత కొంతసేపు తర్జనభర్జనలయ్యాయి. వాళ్ల సిద్ధాంతాల గూర్చి చెప్పారు యువకులు. తమ భావాలను, పోరాటాల పట్ల తమ స్పందనను చెప్పారు తిరుమల్, మనోహర్. ఆ యువకులు వెళ్లిపోయారు.

"అబ్బ పెద్ద గండం గడిచింది," అన్నాడు వెంకటయ్య.

వాళ్లంతా భోజనాలు ముగించి సుల్తానాబాద్‌లో ఉన్న రిజిస్ట్రేషనాఫీసు దగ్గరికి చేరేసరికి మధ్యాహ్నం రెండు గంటలయింది.

త్వరత్వరగా కాగితాలవీ రాశాడు.

వాటిపై సంతకం పెడుతున్న మనోహర్ కళ్ల వెంట నీళ్లు కారాయి. తిరుమల్‌ను పట్టుకొని గొడగొడా ఏడ్చాడు మనోహర్.

"నేనిప్పుడు పూర్తిగా భూమిలేనివాణ్ణయ్యాను. నాకెక్కడా ఓ ఇంచు భూమి కూడా లేదు. నన్ను ఊరు తరిమేసింది. నావాళ్లే తరిమేశారు," అని ఏడ్చే మనోహర్ నోదార్చడానికెన్నో చెప్పాడు తిరుమల్. కొంరయ్య, రాజిరెడ్డి, మాజీ పట్వారి అక్కడున్నవాళ్లంతా మనోహర్ దిక్కు నోళ్లు తెరిచి చూస్తున్నారు.

ఆ తర్వాత హోటల్లో అందరికీ టిఫిన్లవీ తినిపించాడు కొంరయ్య.

"తిరుమల్... భూమి లేకుండా అవుతున్నందుకు నాకు దుఃఖంగానే ఉంది. భూమిని ప్రేమిస్తున్నాను కాబట్టి ఇది సహజమే కాని, నేనా భూమిలో పనిచేసింది తక్కువే. నాకంటెక్కువ ఆ భూమితో అనుబంధమున్న వ్యక్తి కొంరయ్య. కొంరయ్య ఒకప్పుడు మా పాలేరు. అతడా భూమిలో చాలా ఏండ్లు పనిచేశాడు. అలాంటి కొంరయ్యకా భూమి స్వంతమవుతున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది. భూమి తాను చేరాల్సిన భూమిపుత్రుల చేతుల్లోకి పోవడం కంటే కావాల్సిందేముంది. చాలామంది స్వయంగా వ్యవసాయం చేయలేనివాళ్లు ఇంతకాలం పాలేర్లతో చేయిస్తూ బతికిన వాళ్లిప్పుడు భూములమ్ముతున్నారు. ఆ భూములు స్వంతంగా వ్యవసాయం చేసుకునే వాళ్ల చేతుల్లోకి పోతున్నాయి.ఇది మంచి పరిణామం కాదా? ఇదంతా మన ప్రాంతంలో జరుగుతున్న యుద్ధాల పరోక్ష ఫలితమనే నా ఉద్దేశ్యం. ఇది మన యుద్ధభూమిలోని ప్రస్తుత పరిస్థితి. అందుకే నాకీ భూమి ధర్మక్షేత్రంగా కనబడుతోంది," అని స్కూటర్ స్టార్ట్‌చేసే ముందన్నాడు మనోహర్.

ఓ దిక్కు భూమి పోయినందుకేడుస్తూనే ఆ భూమి భూమిని స్వయంగా దున్నుకునే ఆ భూమిలో పనిచేసే వాడి చేతిలోకి పోయిందని సంతోషిస్తున్న మనోహర్ మాటల గూర్చే ఆలోచిస్తూ వెనుక కూర్చున్నాడు తిరుమల్.

గూట్లో పడుకోబోతున్న సూర్యుడు అరుణకిరణాలను లోకంపైకి విసురుతున్నాడు.

*విపుల మాసపత్రిక*
*ఏప్రిల్ 1997*

భూమిని పోగొట్టుకున్న వ్యథ

# యుద్ధభూమి

***దొరల అధికారాలు సరే... కాని దొరసానుల బతుకులను చూస్తుంటే ఆ బతుకుల్లో ఏదో విషాదముందనిపించేది. పొద్దులేని వెలితి ఉందని పించేది... నాలుగు గోడలకే పరిమితమైన వాళ్ళ బతుకులను చూస్తే జాలేసేది. వాళ్ళ బతుకుల కంటే శ్రమ చేసుకొంటూ బతికే స్త్రీల బ్రతుకులే నయమనిపించేది... శ్రామిక స్త్రీలకున్న ఆత్మగౌరవం, స్వేచ్ఛ కూడా వాళ్ళకు లేవనిపించేవి...***

సాహిత్యం జీవిత వృక్షానికి పూసే పువ్వు అన్నాడు కొడవటిగంటి కుటుంబరావు. సాహిత్యం జీవితంలోంచి రావాలి. జీవితానుభవాల్లోంచి రావాలి... ఆవేదన, ఆక్రోశం, స్పందనలోంచి వచ్చిన సాహిత్యమే కాలగమనంలో నిలుస్తుంది. వాల్మీకి శోకమే శ్లోకమై రామాయణ మహాకావ్యమైంది. దాయాదుల మధ్య భూపోరాటమే మహా భారత గ్రంథమైంది. ఇతర భాషా కథలు చదివి రాస్తే అది కథవుతుందేమో కాని తెలుగుకథ కాదు. సాహిత్యం జీవితంలోంచే రావాలని, తెలుగు ప్రజల జీవితాన్ని చిత్రించేదే తెలుగు కథవుతుందని నమ్ముతూ రాస్తున్నవాడిని...

మా నాన్నకున్న కొద్దిపాటి అక్షరజ్ఞానం వల్ల చదువు విలువ తెలుసుకొని చదివించి ఉండకపోతే నేనూ నా 'పాలి' వాళ్ళలా మట్టిలో మట్టయి బతుకుతుండే వాడినే. నా చెమట చుక్కలను నాగేటిచాళ్ళకి ధారబోయాల్సిన వాడినే... నాకు లభించిన ఉద్యోగంతో నేనో తీరుగా బతుకుతున్నా, నా 'పాలి' వాళ్ళంతా మట్టికే అంకితమై బతుకుతున్నారు... నా ఊరివాళ్ళు, నా చుట్టుప్రక్కల ఊళ్ళవాళ్ళు, నా ప్రాంతం వాళ్ళంతా జీవన్మరణ పోరాటాల్లో మునిగి తేలుతూనే ఉన్నారు. అనేకానేక సమస్యల్లో కొట్టుమిట్టాడుతూనే ఉన్నారు. మరి వాళ్ళ సమస్యలకు పరిష్కారా లేమిటి...? వాళ్ళ మంచి బతుకులకు మార్గాలేంటి? ఇవీ నన్ను నిరంతరం వేధించే ప్రశ్నలు... వాటికి జవాబులే నేను రాసే కొన్ని కథలు.

మునుపట్లా ఏం లేదు... అంతా బాగానే ఉంది... అంటూ ఆత్మవంచన చేసుకొంటూ బతికేవాళ్ళకు చెప్పేదొకటే... గ్రామాల్లోకి, బతుకుమూలాల్లోకి వెళ్ళి సునిశితంగా పరిశీలించమని... పెచ్చులూడిపోతున్న గోడలు, వాకిళ్ళలో కూర్చొని ఎక్కడో బతుకుతున్న కొడుకుల కోసం ఎదురుచూస్తున్న ముసలి తల్లిదండ్రులు, గలుమల దగ్గర పడిగాపులు గాసే స్త్రీలు... మట్టిగొట్టుకు పోతున్న బతుకులు... నశిస్తున్న వృత్తులు... ప్రత్యామ్నాయం లేని బతుకులు... తల్లడమల్లడవు తున్న జనాలు... బతుకు తండ్లాట... ద్వేషాలు... కోపాలు... ప్రేమలు... ఎన్నో దర్శనమిస్తుంటాయి... ఊరు మీదెంత ప్రేమున్నా ఊరొదిలి పోవాల్సి వస్తున్న సంఘటనలు... మూలకు పడుతున్న వ్యవసాయాలు... ఇంకా ఎన్నో కనబడుతూనే ఉంటాయి...

మరో దిక్కు పాపకూపాల్లాంటి దొరల గడీలు... అవి ఫెళఫెళా కూలిపోతున్న ధ్వనులు... పతనమవుతున్న భూస్వామ్యవ్యవస్థ... అందులో ఉన్న కాస్త మంచీ దాంతోపాటు పతనం కావడం... మారుతున్న విలువలు... రూపాయి చేస్తున్న విశృంఖల విహారం... కృత్రిమ నాగరికత విలయ తాండవం... డబ్బుకోసం కన్నవాళ్ళ నాగరికత నాశనాన్ని కూడా కోరుకొనే నీచ సంస్కృతి... ఇవన్నిటినీ చూస్తూ ఆవేదనతో, ఆక్రోశంతో, ఆనందంతో అక్షరరూపమివ్వకుండా ఎలా ఉండటం...?

ఒకప్పుడు మా ఊళ్ళో తెల్లవారుజామున పక్షుల కిలకిలా రావాలు నన్ను నిద్రలేపేవి. మా ఊరి బయటున్న చెరువు దగ్గరికెళితే చెరువు నిండా జిలుమలు ఈదుతూ కనిపించేవి... సాయంత్రాల్లో కొంగలు బారులుబారులుగా ఆకాశంలో ఎగురుతుండేవి... సాయంత్రాల్లో పశు వుల గిట్టల చప్పుడు నా చెవుల కెంతో ఆనందాన్నిచ్చేది... గిట్టలతో లేచిన దుమ్ములో స్నానమాడు తుంటే ఎంతో ఆనందంగా ఉండేది...? మరిప్పుడు కోడి కూతలు వినబడటం లేదు... కొంగల బార్లు కనబడటం లేదు... బాతుల ఈతలు అగు పడటం లేదు... మరి ఏమయ్యాయి ఇవన్నీ...? ఊళ్ళలోకేం ప్రవేశించింది...? విలువలెందుకు దుర్మార్గంలా ధ్వంసమవుతున్నాయి...? ఇందు కొరకెవర్ని నిందించాలి...? ఇవన్నిటినీ కథలుగా మలిస్తే...?

మనం బస్సుల్లో ప్రయాణం చేస్తుంటాం... ఎవర్ని కదిపినా ఎన్నో వేదనలు... బాధలు... సంతోషాలు... లోతులకెళ్ళి పరిశీలిస్తే ఎన్నెన్నో దొరుకుతాయి. రైలు ప్రయాణం చేస్తుంటాం... పిప్పరమెంట్లు, అల్లంమురబ్బాలు, అరటిపళ్ళు అమ్ముతూ తిరిగే పసివాళ్ళెంతోమంది కనబడ తారు. వాళ్ళ నిస్సహాయ బతుకుల్లోంచెన్నో కథావస్తువులు దొరికితే అల్లంమురబ్బాను కరకరా నమిలి మింగుతున్న వాళ్ళను చూస్తూ ఆ పని చేయడానికి సంకోచించే మధ్యతరగతి జీవులెంతో మంది... ఉద్యోగంతో వచ్చిన హోదా, మధ్యతరగతి బేషజాలతో కూలినాలి అట్టడుగు జనాల్లో హాయిగా తినలేని నిస్సహాయత కొట్టుమిట్టాడే కుహనా మేధావులు... మధ్యతరగతిలోని క్రియా రాహిత్యం, దేనికీ స్పందించకుండా జీవచ్ఛవాలై బతుకుతున్న సగటు జీవులు... మరోదిక్కు మధ్య తరగతికి ఎగబ్రాకడానికి ప్రయత్నిస్తున్న జనాలు... ఇలా ఈ సమాజంలోంచే, జీవితంలోంచే పుంఖాను పుంఖాలుగా వస్తువులు దొరుకుతాయి మనకు.

తెలంగాణ గ్రామాల్లో దేవదాసి వ్యవస్థను, వెట్టి బతుకుల్ని నా చిన్నతనం నుండే చూస్తున్నాను. నాకు కొంతమంది దొరల కుటుంబాలతో విద్యార్థిదశ నుండే పరిచయాలుండేవి... దొరల అధికారాలు సరే... కాని దొరసానుల బతుకులను చూస్తుంటే ఆ బతుకుల్లో ఏదో విషాద ముందనిపించేది. పూడ్చలేని వెలితుందనిపించేది... నాలుగు గోడలకే పరిమితమైన వాళ్ళ బతుకు లను చూస్తే జాలేసేది. వాళ్ళ బతుకుల కంటే శ్రమ చేసుకొంటూ బతికే స్త్రీల బ్రతుకులే నయమని పించేది... శ్రామిక స్త్రీలకున్న ఆత్మగౌరవం, స్వేచ్ఛ కూడా వాళ్ళకు లేవనిపించేవి... వాళ్ళేం

పోగొట్టుకుంటున్నారో నాకప్పుడు తెలిసేది కాదు కాని కలం పట్టిన తరువాత ఆ జీవితాలను మననం చేసుకొంటే అన్నీ అర్థమయ్యాయి... అందుకే తెలంగాణ దొరసానుల మీద నాలుగైదు కథలు రాశాను. నేను పుట్టి పెరిగిన మట్టి రుణం తీర్చుకోవడానికి స్థలకాలాల చైతన్యంతో ప్రాంతీయ ముద్రగల కతలు చాలానే రాస్తున్నాను.

తెలంగాణ నుంచి వచ్చే కథల్లో ఉద్యమాల ప్రసక్తి, ప్రభావముంటుందంటారు కొందరు. మరి మొదట్నుంచి ఉద్యమభూమిగా ఉన్న నేల మీద జీవిస్తున్న రచయితలు ఉద్యమాల నేమాత్రం పట్టించుకోకుండా రాయడం సాధ్యమవుతుందా? రాయలసీమ వాళ్ళు నీటికరువు గూర్చే ఎక్కువ రాస్తారెందుకన్నట్టే ఉంటుందా ప్రశ్న.

యుద్ధభూమి కథానేపథ్యాన్ని చెప్పాలంటే కొంతైనా తెలంగాణ నేపథ్యాన్ని, నా కథా నేపథ్యాన్ని చెప్పాలనే ఇదంతా చెప్పడం జరిగింది. ఈ కథ రచనా కాలం 1996 సంవత్సరమే అయినా ప్రచురణ 1997 ఏప్రిల్ విపుల సంచికలో జరిగినా... ఈ కథావస్తువు మాత్రం నాలో అంతకుముందు నాలుగైదేళ్ళుగా సుళ్ళు తిరుగుతూనే ఉంది. అయితే మా నాన్న మరణించిన తరువాత మాకు ఊళ్ళో ఉన్న కాస్త భూమి అమ్ముకోవాల్సి వచ్చిన సమయంలో నాలో పెల్లుబుకిన దుఃఖానికి అంతే లేదు. రోజురోజుకూ మానవ సంబంధాలు లుప్తమవుతూ అనివార్యంగానో, ఉద్దేశపూర్వ కంగానో ఊరుకు దూరమవుతున్న విషాదం, ఉద్యమాల ఫలితాలు నాలో చెలరేగుతున్న అంత ర్మథనం నాతో ఈ కతను రాయించింది.

తెలంగాణ మొదట్నుంచీ యుద్ధభూమిగానే ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం దొరలు, రజాకార్ల పాశవిక పాలన నెదిరిస్తూ తిరుగుబాటు చేశారు... అవ్వ బాంచెనయ్య, అయ్య బాంచెనన్న జనమే వీరకిశోరాలై పోరాడారు. భారతదేశానికే భూపోరాటాల వారసత్వాన్నం దించారు. ఆ జనాలే మళ్ళీ దొరల దౌర్జన్యాలకు తలలు వంచారు. అణిగిమణిగి ఉన్న జనమే మళ్ళీ విజృంభించి దొరలు తోకలు ముడిచేట్టు చేశారు... చేస్తున్నారు... గ్రామాలన్నీ యుద్ధభూములుగా అట్టుడికి నట్టున్నా భూస్వామ్యవ్యవస్థ పతనం కళ్ళకు కనబడుతూనే ఉంది. నిరంతరం పోరాటంలో మునిగి తేలు తున్న జనాల గూర్చి స్థలకాలాల చైతన్యంతో రాయడం ధ్యేయంగా పెట్టుకున్నాను. ఇలాంటి కథలు నాతోపాటు ఒకరిద్దరు రాస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలోంచి వచ్చిన కథలే *ఆంబోతు, చిందొర్సాని, ఈ భూమి నాది, అన్న, భద్రత, దొరగారి భార్య, దొరగారి గడి, బండెనుక బండి గట్టి*... ఇంకా అనేక కథలు.

అయితే యుద్ధభూమి కథకు పోరాట నేపథ్యమున్నా ఇందులోని పాత్రలు నేరుగా పోరాటాల్లో పాల్గొనేవారు కాదు... పోరాట ప్రత్యక్ష, పరోక్ష ఫలితాలను తెలిపే కథ ఇది... పాతికేళ్ళ క్రితం తెలంగాణలో పోరాటాలు ప్రారంభమైనప్పుడు లేని మధ్యతరగతి ఇప్పుడు వచ్చింది... మధ్యతరగతి ఎదుగుతున్నకొద్దీ వాళ్ళు పోరాటాలకు ఎడంగా జరగడం జరుగుతుంది... అయితే మధ్యతరగతిగా ఎదిగిన వర్గాల వారికి ఉద్యమాలపై సానుభూతున్నా ఏమీ చేయలేని నిస్సహా యత, అయినా వాళ్ళలో జరిగే అంతర్మథనం ఈ కథకు నేపథ్యం... వ్యవసాయ కుటుంబాల్లోంచి వచ్చి చదువుకొని మధ్యతరగతికెదిగి ఆ ఆలోచనల్లోనే కూరుకుపోతున్న వాళ్ళు కొందరైతే తమను తాము అంతర్మథనానికి గురిచేసుకొనే వాళ్ళు కొందరు. భూమిపుత్రుల కుటుంబంలోచే వచ్చి భూమికి దూరమైపోతున్న వాళ్ళ ఆవేదన, భూమిపై ఎంత ప్రేమున్నా గ్రామాల్లోని పరిస్థితులు స్వయంగా వ్యవసాయం చేసుకొనేవాడికి భూముండేట్టు కావడం, మధ్యతరగతి ఉద్యోగజీవుల దృష్టికోణంలోంచి చూస్తే వ్యవసాయాలు లాభసాటిగా లేకపోవడం, వాళ్ళలో ప్రవేశించిన వ్యాపార మనస్తత్వం... ఇవన్నీ నాలో ఆ కథను రాయడానికి దోహదం చేశాయి.

యుద్ధభూమి లాంటి నేలలో భూమికీ, రైతుకూ ఉన్న సంబంధం, చదువులు ఉద్యోగాల మాయలో భూమికి దూరం కావడం, అది క్రమక్రమంగా స్వయంగా దున్నుకొనే వాళ్ళ చేతుల్లోకి పోయే క్రమం ఈ కథలో చెప్పడం జరిగింది. ఇందులోని ప్రధానపాత్ర నేనే... భూపోరాటాల నేపథ్యంగా ఏవిధంగా భూములు రైతు బిడ్డల చేతుల్లోకి పోతున్నాయో పోవాల్సిన అవసరముందో తెలిపే కథ యుద్ధభూమి. ఈ కథకు తెలంగాణ ఉద్యమ నేపథ్యంలోని సమకాలీన సమాజం, భూమికోసం, భుక్తికోసం సాగుతున్న నేలలో ఎటూ తేల్చుకోలేని మధ్యతరగతి జీవుల అంతర్మథనం నేపథ్యం.

కథావస్తువు మాతృగడ్డపై మమకారం... స్వల్పంగా భూమున్నవాళ్ళను కూడా అన్నలు భూములమ్ముకోనివ్వడం లేదన్న అపోహను తొలగించడానికై అన్నల ప్రవేశాన్ని చూపడమైందీ కథలో. పోరాటాల గూర్చి మధ్యతరగతి జీవుల దృష్టి కోణాన్ని చిత్రించాలన్న తపన ఈ కథ రావడానికి మరో కారణం. జీవితంలోంచి, అనుభవాల్లోంచి వచ్చిన కథలే మంచి కథలవుతాయన డానికి ఈ కథో మంచి ఉదాహరణ.

తామేదో చేయాలనుకొంటుంటే ఆడవాళ్ళు అడ్డు తగులుతున్నారని ఆడవాళ్ళను నేరస్తు లను చేసే మేధావులు, అభ్యుదయవాదులూ మనకున్నారు. తాము కూడా కన్స్యూమరిజం ప్రవాహంలో కొట్టుకుపోతూ భార్యలపై నేరాన్ని మోపే మగవాళ్ళ నిజస్వరూపాన్ని బయట పెట్ట డానికి, ఆలోచింపచేయడం కోసం కూడా ఈ కథ రాయడం జరిగింది. తాము చేస్తున్న పనుల విషయంలో, పాల్గొంటున్న సభల విషయంలో స్త్రీలకేమాత్రం భాగస్వామ్యం కల్పించ కుండా, వాళ్ళు పెరుగుతున్న, జీవిస్తున్న పరిస్థితులను గణనలోకి తీసుకోకుండా భార్యలను నేరస్తులను చేస్తూ మాట్లాడే పురుషులకు కనువిప్పు కల్పించడం కూడా ఈ కథ ఉద్దేశం. ప్రగతిశీల భావాలు కలవాళ్ళు కూడా భార్యలను గడప దాటనీయరు. అలాంటివాళ్ళు తమను తాము తెలుసుకొనేట్టు చేయాలని నాలో చాలాకాలంగా జరుగుతున్న సంఘర్షణకు ప్రతిరూపమే ఈ కథ... కొందరికి గృహం వరకే పరిమితమై ఆలోచించే భార్యలు శత్రువులుగా కనబడతారు. మనముంటున్న సమాజంలో మధ్యతరగతి కెదిగిన మేధావులు, స్త్రీలను తమ భావాల కనుకూలంగా మార్చు కోవడమో, తామే వాళ్ళ భావాల కనుకూలంగా మారడమో, ఇద్దరూ కలిసి అడ్జెస్ట్ చేసుకొని బతక డమో తప్పదు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా తమ పనులు నిర్భయంగా చేసేవాళ్ళతో పంచాయితీ లేదు. కాని బతుకులో అన్ని సుఖాలూ కావాలి. భావాలు మాత్రం కార్మికవర్గ పక్షపాతం గలవి. ఏమన్నా అంటే కుటుంబానికే పరిమితమైన భార్యలను కారణం చేసి నేరస్తులను చేయడం... ఇలాంటివాళ్ళలో ఆలోచన రేకెత్తించాలని, స్త్రీల పక్షపాతం వహించి రాయాలని చాలాకాలంగా అనుకొంటున్న ఆలోచనలకు అక్షర రూపమే యుద్ధభూమి కథ.

కురుక్షేత్రంగా మారిన తెలంగాణ నేల పాతికేళ్ళుగా యుద్ధభూమే... ఈ సమాజంలో ఏదో భద్రతుందని భ్రమపడుతూ ఆత్మవంచన చేసుకొంటున్న మధ్యతరగతి జీవుల అంతర్మథనాన్ని ఆవిష్కరించే కథ... ఇందులోని ముఖ్యపాత్ర మనోహర్‌కు ఈ నేల ధర్మక్షేత్రంగా కనబడుతుంది. ఓ దిక్కు ఉన్న కాస్త భూమి పోయినందు కేడుస్తూనే ఆ భూమిని స్వంతంగా దున్నుకునే భూమి పుత్రుడి చేతిలోకి పోతున్నందుకు ఆనందిస్తాడు మనోహర్... అతడా భూమి నమ్మింది పరిస్థితులు వికటించడం వల్లనే కావచ్చు... అతనిలో ప్రవేశించిన లాభాపేక్ష వల్లనే కావచ్చు... అలా అనుకో వడం ఆత్మవంచనే కావచ్చు. కాని అతడలా భూమి చేరాల్సిన వాళ్ళకే చేరుతుందని సంతోష పడటంలో నిజాయితీ ఉంది. ప్రజాపోరాటాల పట్ల సానుభూతుంది. పోరాట ఉద్దేశాలు మంచివే

అయినా హింసా ప్రవృత్తి పట్ల ఆవేదనుంది. అలా ఉండకుంటే బాగుండునన్న వేదనుంది. ఎటూ తేల్చుకోలేని  నిస్సహాయతుంది.

నాలో చాలకాలంగా జరుగుతున్న అంతర్మథనానికీ, సంఘర్షణకూ, ఎటూ తేల్చుకోలేని పరిస్థితులకు అక్షర రూపమివ్వడానికి నన్ను నేను ఆవిష్కరించుకోవడానికి ఈ కథ రాశాను. ఇందులోని మనోహర్ పాత్రలెంతో మందున్నారు మనలో.

ఈ కథ రాయడానికి నన్ను ప్రభావితం చేసిన సంఘటన నా భూమిపై నేను పుట్టి పెరిగిన మట్టిపై నాకున్న విపరీతమైన అభిమానం. కారణాలేవైనా ఉన్న కొద్దిపాటి భూమి కూడా లేకుండా పోయిన యదార్థ సంఘటన... ఆ భూమిని అమ్ముతున్నప్పుడు ఆ కథలో చెప్పినట్టుగా నా కళ్ళ వెంట పటపటా నీళ్ళుకారిన మాట నిజమే... ఆ భూమితో నాకు కొంత సంబంధమున్నా దాంతో విడదీయరాని సంబంధం పెనవేసుకోనున్న కొమరయ్య చేతుల్లోకి ఏదో విధంగా ఆ భూమి పోవడం నాకు మనస్ఫూర్తిగానే సంతోషం కలిగించిన సంఘటనే... అది అమ్మడానికి కారణా లెన్నున్నా, దాని మీద పంటేం రావడం లేదన్న వ్యాపార దృక్పథం కొంతున్నా, అది అమ్మడం అతని మీద ప్రేమతో లేకున్నా- రావాల్సిన ధర కంటే తక్కువకు అమ్మడం అది దున్నుకొనే వాడి చేతిలోకి పోతుందన్న ఆనందంతోనే... ఈ భూమి నమ్మడంలో, అలా ఆలోచించడంలో ఆత్మ వంచన లేదు. ఆత్మక్షోభుంది... ఆవేదనుంది... ఆందోళనుంది... మధ్యతరగతి మనస్తత్వపు నిజాయితీ  ఉంది...

ఈ కథకున్న సామాజిక నేపథ్యం ఉత్తర తెలంగాణాలో నిర్విరామంగా సాగుతున్న పోరాటాలు... మూలపడుతున్న కొన్ని వ్యవసాయాలు... కొంతమందికైనా భూమిలేని వారికి భూమి చెందుతున్న పరిస్థితులు... ఉధృతమవుతున్న వలసలు... భూమితో సంబంధమున్న వాళ్ళే ఊళ్ళో ఉండాల్సి వస్తున్న పరిస్థితులు... ఉద్యమాల పరోక్ష ఫలితాలు.

ఇది ప్రగతిశీల భావాలున్న మధ్యతరగతి జీవుల అంతరంగాల నావిష్కరించే కథ... స్త్రీల పట్ల సానుభూతిని పెంచే కథ... ఆత్మవంచన చేసుకొంటూ బతికే కొందరికైనా కనువిప్పు కలిగించే కథ... ఇది నా హృదయపు లోతుల్లోంచి వచ్చిన, నేను మెచ్చిన నా మంచి కథ... భూమితో సంబంధమున్న కుటుంబాల్లోంచి వచ్చిన వాళ్ళు భూమికి దూరంగా జరుగుతున్న సగటు జీవుల ఆవేదనను ఆవిష్కరించిన కథ. ఆలోచింపజేసే కథ.

*24 ఆగస్టు 1997*

11



*కుప్పిలి పద్మ మొదటి కథ మానసికం 1989లో ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయ్యింది. దాదాపు 70 కథలు రాశారు. మూడు కథా సంపుటాలు, ఐదు నవలలు, రెండు మ్యూజింగ్స్ పుస్తకాలు ప్రచురించారు. అప్పుడప్పుడు కవిత్వం రాస్తుంటారు.*

**చిరునామా**
201, విజయలక్ష్మి అపార్ట్‌మెంట్స్
మెథడిస్ట్ కాలనీ, బేగంపేట
హైదరాబాద్-500 016
Ph.: 98663 16174
kuppilipadma@yahoo.com

# వనమాల

## కుప్పిలి పద్మ

చంబల్ లోయల్లో వెన్నెల జలపాతం.

పరిగెడుతున్న రైలు. వెన్నెల్లో తడుస్తోంది జీవితం. అంతా పూల వెన్నెల. తేనె వెన్నెల.

"ఇక్కడేం చేస్తున్నావు"

వెనక నుంచి ప్రశ్నలాంటి పిలుపు. కంపార్ట్‌మెంట్ డోర్ దగ్గర నిలబడి వున్న మృదుల తలతిప్పి చూసింది. బెర్త్ మీదికి జరిగి తనవేపే చూస్తున్నాడు సౌరభ్. అతని పల్కరింపుకి సమాధానంగా చిరునవ్వు నవ్వి మళ్లీ తన ప్రపంచంలో లీనమైంది మృదుల.

రైలు పరుగిడుతోంది. రివ్వున వీస్తోంది గాలి. ఆ గాలికి స్వాగతం పలుకుతోంది మృదుల. ఒత్తయిన జలపాతంలాంటి ఆమె కురులు గాలికి అలలు అలలుగా కదులుతున్నాయి. ఆమె ధరించిన తెల్లని పైజమా కుర్తా-వెన్నెల వెలుగుల్లో మెరుస్తున్నాయి. ఆమె కంపార్ట్‌మెంట్‌లోకి దిగివొచ్చిన చందమామలా ఉంది.

గాలిని చీలుస్తో వెళ్తున్న రైలు శబ్దం మినహా మరే చప్పుడు విన్పించడంలేదు. చంబల్‌లోయల్లో మహా నిశ్శబ్దం. నిశ్శబ్దంగా వెన్నెల ఆకాశం నుంచి నేలమీదకి పాదం మోపుతోంది. ఆ నిశ్శబ్దాన్ని అనుభవిస్తున్న మృదులని చూస్తుంటే కాసింత వింత అన్పించింది సౌరభ్‌కి. మళ్ళీ ఆమెని ప్రశ్నించి అమె అనుభూతిని భగ్నం చేయదల్చుకోలేదతను.

ఉండుండి రైలు కూతవేస్తోంది. అప్పుడప్పుడూ వేగం మందగిస్తోంది. ఎందుకనో రైలువేగం తగ్గినప్పుడల్లా సౌరభ్‌కి అసహనం అనిపిస్తోంది. రైలు చంబల్ లోయల్ని ఎంత తొందరగా దాటి పోతుందా అని అతను ఎదురుచూస్తున్నాడు. ఒక జీవితకాలం పాటు ఆ వెన్నెల్లో, ఆ లోయల్లోంచి ప్రయాణించాలని ఉంది మృదులకి. ఆమె కళ్ళు వెన్నెలని రెప్పల కిందకి పొదువుకుంటున్నాయి.

సౌరభ్ కళ్ళు మాత్రం కంగారుగా ఉన్నాయి. అతని రెప్పల కింద భయం గూడు కడుతోంది. ఆ భయానికి తగ్గట్టే ఈసారి రైలు వేగం మరింత మందగించింది. అతను విండో దగ్గరికి జరిగి ఏదైనా స్టేషన్ వచ్చిందేమోనని వెతికాడు. కనుచూపుమేరంతా లోయలు. ట్రాక్‌పై వెళుతున్న రైలు పక్కనే మరో రైలు పట్టాలు. పట్టాకి నడుమ ఖాళీ స్థలంలో మొక్కలు. తెల్లపూలు విరబూసిన చెట్లు.

క్రమేపీ రైలు వేగం చిన్నపిల్లాడి నడకలా మారింది. ఆ ఒక్కక్షణం చాలు మృదులకి. కొండలోయల్లోకి జారిపడే జలపాతంలా ఆమె కంపార్ట్‌మెంట్ నుంచి నేలమీదికి దూకింది. సౌరభ్ తుళ్ళిపడ్డాడు. తను చూస్తున్నది వాస్తవమోకాదో అతనికి అంతుపట్టలేదు. అతనిలోని రక్తమంతా ముఖంలోకి పొంగి క్షణంలో చల్లారిపోయింది. ఆందోళనతో డోర్ దగ్గరికి పరిగెత్తాడు.

మృదుల కుందేలు పిల్లలా ఎగిరెగిరి పూలు కోస్తుంది.

"మృదులా... మృదు... ఏయ్... ఆర్ యూ మ్యాడ్... కమాన్..." రొప్పుతూ అరుస్తున్నాడు.

'రైలు కూతపెట్టి కదలబోతుంటే పూలకొమ్మల గుచ్ఛంతో ఛెంగున రైల్లోకి ఎగిరింది. ఆమెవైపు కోపంగా చూసి కూపెలోకి వెళ్ళిపోయాడు. ఆమె లోపలికి వచ్చింది.

బెర్త్ మీద పడుకున్నాడు. పూలగుచ్ఛాన్ని అతని కళ్ళమీద ఊపింది. పూలరేకుల మీది మంచుబిందువులు అతని కనెప్పలని ముద్దాడాయి. కళ్ళకి చేయి అడ్డు పెట్టుకున్నాడు.

"కోపం వచ్చిందా?" నవ్వుతూ అడిగింది.

అప్పటికి అతను ఆందోళన నుంచి కాస్త తేరుకున్నాడు.

కళ్ళమీద నుంచి చేయి తీస్తూ, "అర్ధరాత్రి అలా డోర్ బార్లా తీసి నిలబడటమేంటి? అలా రైలు దిగిపోవటమేంటి? అసలా అటెండర్ యెక్కడ? పేరుకి ఫస్ట్‌క్లాస్. ఒక్కరూ కనిపించరేం," అసహసంగా అన్నాడు.

"ఏయ్, ఏయ్ కూల్‌డవున్ . బి.పి హఠాత్తుగా పెరక్కూడదు ఈ వయస్సులో," చిలిపిగా అంది.

"బి.పి. యూ... నాకేం పెరగలేదు. ఏదో రాత్రివేళ రైలు వెళ్ళిపోతే... ఎలా... కాస్త ఆందోళన... అంతే," అన్నాడు.

"బి.పి. పెరగలేదా... స్వెటర్ వేసుకున్నా ఆ చమటలేంటి," అంది.

"నీకంతా నవ్వులాటగా ఉంది. ఏమనుకున్నావ్ అవి? చంబల్ లోయలు తెలుసా," అన్నాడు.

"అయితే."

"అరే చంబల్ లోయలంటే తెలియదా ఏంటి."

"అంటే నువ్వేం అనుకుంటున్నావో చెప్పు," అంది కిటికి పక్కన కుర్చుంటూ.

ఆమె ఒడిలో తలపెట్టుకొని పడుకొంటూ, "చంబల్ లోయల్లో దొంగలుంటారు. బంది పోట్లు తెలియదా? నిన్ను యెత్తుకపోతే," చిన్నపిల్లలకి చెపుతున్నట్లు చెప్పాడు.

"నిజమే సుమా. ఆ వెన్నెల ఓ బందిపోటు. ఎక్కడికైనా ఎత్తుకుపోగలదు. ఇక ఆ లోయల రస్టిక్‌బ్యూటీ పెద్ద దొంగ. నీ నుంచి నన్ను అవి లాక్కుపోతాయని నీ బెంగకదూ! నే వెళ్ళిపోవాలను కుంటే నువ్వు ఆపగలవా," అంది.

"మరి నేనూ," బేలగా అడిగాడు.

"నీకు రావాలనిపిస్తే రా," అతని చెవి వెనక పూలకాడతో గీతలు గీస్తూ అంది.

"నువ్వు వెళ్లే వైపు నాకు ఆసక్తి లేకపోతే."

"మానై."

"అలా నేను నాకు నచ్చినదారిలో వెళ్ళిపోతే? ఆ దారి నీకు నచ్చకపోతే?"

"ఆ దారి నచ్చకపోయినా ఆ దారిలో నడిచే నువ్వు నచ్చితే వస్తాను," అంది.

"ఏం నచ్చటమో. నీతో ఎక్కడికైనా వెళ్ళాలంటే భయమేస్తుంది. ఎడారో, అరణ్యమో, సముద్రమో- ముందు వెనక చూడవ్. అలా వాటిల్లోకి వెళ్ళిపోతావేంటి? నీకు భయమేయదా," అన్నాడు.

"భయమా? నాకా... నేనెక్కడ పెరిగాననుకున్నావ్... ఎలా పెరిగాననుకున్నావ్," అంటూ వెన్నెల లోయల్ని చూస్తూ పట్టుచీర నేసినంత నిదానంగా గతాన్ని చెప్పటం మొదలుపెట్టింది.

"నీకు తెలుసు కదా మా నాన్నగారు ఫారెస్ట్ ఆఫీసరని. మా చిన్నతనంలో ఆయన విశాఖ దగ్గర అరకులో పనిచేసేవారు. మేమున్న పల్లె పేరు పూలబంద. నవంబర్ వచ్చిందంటే పసుపుపచ్చ, ఎరుపు, తెలుపురంగు పూలతో, ఆకుల్తో అడివంతా సీతాకోకచిలకలా ఉండేది. మా అమ్మానాన్నల స్నేహితుల పిల్లలు, నేనూ, అన్నయ్య, అక్క ఓ పది పదిహేనుమంది పిల్లలం తయారయ్యేవాళ్ళం. రెండు జీవులపై అడవిలోకి ప్రయాణం. పచ్చికపై గుంపులు గుంపులుగా సీతాకోకచిలుకలు. ఆ గుంపంతా ఒకే రంగులో ఉండేది. ఎవరైనా వచ్చినా. ఏదైనా వెహికిల్ వచ్చినా చాలా బద్ధకంగా ఎగిరి అలా దారి ఇచ్చేవి. ఓచోట ఊదావి గుంపుగా ఉండేవి. మరోచోట నల్లనివి. వాటిపై డిజైన్స్, ఆ రంగులు భలే ఉండేవి. అడవిలో అలా అలా లోపలికి వెళ్ళేవాళ్ళం. పావురాలు, చిలకలు, పాలపిట్టలు, పిచ్చుకలు, కాకులు, గద్దలు, గువ్వలు ఇలాంటి వాటిని మనం గుర్తుపట్టగలం కదా. అక్కడేమో చాలారకాల పక్షులు కనిపించేవి. ఆరంజ్ రంగుపై లేతాకుపచ్చ చుక్కలున్న పిట్టలు. బూడిదరంగు పక్షులు. యిలా రంగురంగులవి. వాటి పేర్లు తెలియవు. ఇండియన్ బర్డ్ వాచింగ్ పుస్తకం తెరచి ఆ పిట్టల పేర్లు కనిపెట్టాలని తెగ తాపత్రయపడేవాళ్ళం. ఇంతలో ఆ పిట్టలు ఎగిరిపోతుండేవి. పేర్లు తెలియని ఆ పక్షులకి మేమే నామకరణం చేసేవాళ్ళం. చీకటి పడటాన్ని చూడటానికి ఎత్తయిన ప్రదేశానికి చేరుకునేవాళ్ళం. నల్లని మంచుతెర సుతారంగా హిమాలయాల్ని కప్పుకున్నట్టుండేది. రాత్రివేళ పెద్దవి చిన్నవి పాములు చాలానే కనిపించేవి. అన్నయ్యకి, అక్కకి పాముల్ని చూడటం సరదా. పాము చాలా సొగసుగా ఉంటుందనేవాళ్ళు. వాళ్ళ కళ్ళెప్పుడూ పాముల్ని వెతుకుతుండేవి. నేనూ వెతికేదాన్ని. కాని ఇష్టంతో కాదు, భయంతో. అడివిలో జంతువులని చూడటానికి ప్రయాణాలు," అని ఇంకా ఆమె చెప్పబోతుంటే అతను ఆమె మాటలకి అడ్డువచ్చాడు.

"జంతువులని చూడటానికి ప్రయాణాలా? జూకి పోదామంటే ఆసక్తి చూపించేదానివి కాదుగా," కంప్లెనింగ్‌గా అడిగాడు.

"ఎవరిని ఎప్పుడు యెక్కడ చూడాలో అక్కడే చూడాలి. వీరుణ్ని యుద్ధభూమిలో, పులిని అడవిలో! పులిని చూడాలని బోల్డన్ని ప్రయత్నాలు చేశాం. పులిని చూడాలనే నా ఉబలాటం చూసి నాన్నగారు పులి తిరిగే ప్రదేశాలు తిప్పారు. ఎక్కడా కనిపించలేదు. నన్ను సంతోషపెట్టడానికి పులిని చూసిన సాంబాని చూపించారు. ఆ ఊరి పేరు నందిగురువు. సాంబ ఊర్లో ఉండడు. ఊరవతల అతనికి కొద్దిగా పొలం ఉంది. ఆ పొలంలో చిన్నపాక. సాంబ ఒక్కడే ఉంటాడు. పులి గురించి సాంబతో మాట్లాడాను. మా మాటలు పొల్లుపోకుండా చెప్పనా," అడిగింది.

"ఊఁ."

"కాని ఇది పూర్తిగా సాంబా భాషలో ఉండదు," అంది.

"పులిని చూసావా? ఎక్కడా?" అడిగానతన్ని.

"ఇక్కడే," అన్నాడు సాంబ.

"నీ ఇంటి ముందే."

"ఆ..."

"నిన్నేం చేయలేదా."

"నన్నా? నన్నేం చేయదు."

"ఎందుకని."

"నన్నేం చెయ్యొద్దని అడిగానుగా పులిని."

"చెయ్యొద్దని అడిగావా పులిని? ఎలా? పులికి నీ మాటలు అర్థం అవుతాయా."

"పులి మమ్మల్నేటి చేయదు. ఏసేపు ఊర్లోవాళ్ళని ఎత్తుకుపోతుంది. ఎత్తుకుపోవద్దన్నా. ఎత్తుకుపోతుంది. వాళ్ళ మాటలు పులికి అర్థంకావు కదా!"

"పులికి మీ భాష అర్థం అవుతుందా? నీకెలా తెలుసు."

"ఆ పులికి మా భాష అర్థమవుతుందండి. ఓసారి పులి వచ్చింది. నా దగ్గర ఏమున్నాయి... ఈ బక్కచిక్కన ఆవు, రెండు మేకలు, నాలుగు కోళ్ళు తప్పా. అదే ఆ ఊర్లోకి పోతే చాలా మేకలుంటాయి. ఆవులుంటాయ్ అన్నానండి. అంతే, పులి ఏసేపు వాళ్ళ ఊరు వెళ్ళిపోయింది. ఏసేపు చాలా బ్రతిమిలాడాడంట. అయినా వినిపించుకోలేదు. ఆవుని ఎత్తుకుపోయిందండి," అన్నాడు సాంబ.

"పులిని చూసి మాట్లాడిన సాంబ నాకు చందమామలో బేతాళకథల్లోని వీరుడిలా తోచాడు," అందామె.

సౌరభ్ పకపకా నవ్వాడు.

"పులికి మానవభాష అర్థం అవటం ఏంటి. ఆ సాంబ చెప్పటం. నీకు అతను వీరుడిలా తోచటం. ప్చ్! గొప్ప చందమామ కథ చెప్పావ్," సౌరభ్ తలని అడ్డంగా తిప్పుతూ అన్నాడు.

"అక్కడ విషయాలు వింతగానే తోచొచ్చు. బట్ ఇవి నిజాలు. ఆదివాసులకి కాఫీ ప్లాన్ టేషన్ని, మిరియాల తీగెల్ని పరిచయం చేసింది నాన్నగారే. నే థింసా నృత్యం నేర్చుకుందక్కడే. జీలుగ చెట్టు అని ఎవరన్నా అంటే మా అన్నయ్యకి ఎంత కోపమో. 'జీలుగ చెట్టేంటి? జీలుగ తల్లి' అంటూ చెట్టుకి నమస్కరించేవాడు. వాడికి కల్లు అంటే చాలిష్టం. అప్పుడే కల్లు తాగటం ఏమిటని అక్క మందలించేది. 'నాకంటే నువ్వు పెద్దదానివేగా, నువ్వెప్పుడైనా కల్లు తాగావా... అబ్బే, మీరు తాగరు. తాగకుండా తాగొద్దని సలహాలివ్వకు," అనేవాడు. ఆదివాసులు ఆకుల్తో గొడుగు చేస్తారు. రెయిన్‌కోటులా ఉంటుంది. ఆ గొడుగుని నగరంలో ఏదైనా హేండీక్రాఫ్ట్ షోరూంలో పెడితే వందో రెండొందలో ధర పలుకుతుంది. వీళ్ళని అది ఎంతకి అమ్ముతావంటే ఐదో పదో అంటారు. అసలు ఆదివాసుల జీ..." చెపుతున్న మృదుల ఆగింది.

సౌరభ్ వైపు అనుమానంగా చూసింది. మూసుకొన్న రెప్పల కింద కనుగుడ్డు నిశ్చలంగా వుంది. బరువైన వూపిరి సవ్వడి.

'దొంగ, నిద్రపోయాడు,' అనుకుంటూ అతని తలని బెర్త్‌పై పెట్టింది. పై బెర్త్‌కి వెళ్ళింది.

అరకు జ్ఞాపకాలు నెమరేసుకుంటూ పడుకుంది. తెల్లవారి మృదుల మేల్కొనేసరికి ఎనిమిదయింది. అప్పటికే సౌరభ్ నిద్రలేచాడు. ఫ్రెష్‌గా రెడీ అయి పేపర్ చదువుకుంటున్నాడు.

"గుడ్ మార్నింగ్," అంది మృదుల.

"మార్నింగ్. త్వరగా బ్రష్ చేసుకురా. బ్రేక్‌ఫాస్ట్ ఆర్డర్ చేశాను," అన్నాడు.

మృదుల రెడీ అయి వచ్చేసరికి బ్రేక్‌ఫాస్ట్ వచ్చింది. ఇద్దరూ తిన్నారు.

"ఏంటి రాత్రి నే మాట్లాడుతూనే ఉన్నాను. నువ్వేమో దర్జాగా అలా నిద్రపోయావేంటి," అంది.

"నిద్రొచ్చింది," అన్నాడు.

"పెద్ద గొప్ప. అదే కంప్యూటర్ ముందు కూర్చుంటే రాత్రిళ్ళు రాత్రిళ్ళు నిద్రరాదే," అంది.

"అలా ఉన్నాయి నీ అడవి కథలు," అన్నాడు.

"జోలపాటలాగా," అడిగింది.

"సరేకాని మీ ఇంట్లో వాళ్ళు పెళ్ళికి ఒప్పుకుంటారంటావా," అడిగాడు.

"మమ్మీ! సౌరభ్ అనే కుర్రాడు ఉన్నాడు. కంప్యూటర్ ఇంజనీర్. నన్ను పెళ్ళి చేసుకుంటానంటున్నాడు. నాక్కూడా ఆ పిల్లాడు బానేవున్నాడనిపించింది. నీకు, డాడీకి పరిచయం చెయ్యాలనుకుంటున్నాను. ఇంటికి పట్టుకురానా... అని ఫోన్ చేసి అడిగాను కదా. రమ్మన్నారుగా. ఒప్పుకోకపోవటానికి ఏముంది..." అంది.

విశాఖ చేరేవరకు కబుర్లతో గడిపేశారు. వీళ్ళిద్దరిని రిసీవ్ చేసుకోటానికి స్టేషన్‌కి సర్వారాయుడుగారు, శకుంతల వచ్చారు.

"జర్నీ బాగా జరిగిందా," సర్వారాయుడుగారు అడిగారు.

"ఊఁ చంబల్ లోయల దగ్గర ట్రైన్ దిగిపోయింది," కంప్లేనింగ్‌గా అన్నాడు సౌరభ్.

"తిరిగి ఎక్కిందిగా. ఓసారి రాజస్థాన్ వెళ్ళాం. ఎడారిలోకి ఒంటెల మీదా వెళ్ళింది. తెల్లార్లు రాలేదు. రాత్రివేళ చలి ఎలా ఉంటుందో చూడాలనిపించిందంట ఈ మొండిపిల్లకి. మాల ఎప్పుడూ అలాంటి పనులు చేసేది కాదు. మృదూకి చదువుపై ఆసక్తి తక్కువే. మాల బాగా చదివేది. ఇప్పుడు లండన్‌లో పిల్లలకి పాఠాలు చెపుతోంది. యూ నో సౌరభ్, తను ఒంటరిగా అక్కడికి వెళ్ళింది. అన్ని అరేంజ్‌మెంట్స్ తనే చేసుకుంది. ఐ యామ్ వెరి ప్రౌడాఫ్ హర్. నిరంజన్ నా పెద్ద అల్లుడు. బాంబేలో ఉంటున్నాడు. పిల్లలు అతని దగ్గరే ఉన్నారు. సంవత్సరానికొకసారి మాల వెకేషన్‌కి వస్తుంది. వాళ్ళతో గడుపుతుంది. ఐడియల్ ఫ్యామిలి. మా అబ్బాయి ఐ.ఏ.ఎస్.కి సెలక్ట్ అయ్యాడు. ట్రైనింగ్‌కి వెళ్ళాడు. అదే ట్రైనింగ్‌కి హారతి వచ్చింది. వాళ్ళిద్దరూ ఇష్టపడ్డారు. పెళ్ళి చేశాం. ఇద్దరికి ఒకేచోట పోస్టింగ్ రావటం లేదు. ఎవరికి వీలైతే వాళ్ళు ఒకరి దగ్గరికి మరొకరు వెళుతుంటారు. మేం ఎప్పుడూ మా పిల్లల ఇష్టాలని కాదనలేదు. మృదుకి లెక్చరర్, డాక్టర్, ఇంజనీర్- ఇలాంటి ఉద్యోగాలపై ఆసక్తి లేదు. డిగ్రి తర్వాత అదిగో ఆ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ చదువుతానందీ చదివింది. జాబ్ అవకాశాలు ఎలా ఉన్నా తనిష్టం అనుకున్నాం. మీ గురించి రాసింది. మీ ఇద్దరి ఇష్టాన్ని ఎందుక్కాదనాలి," అన్నారు సర్వారాయుడు.

"మృదూ విషయం మా ఇంట్లో అభ్యంతరం లేదు. మా అక్క ఢిల్లీలోనే జె.ఎన్.యులో పొలిటికల్ సైన్స్ పాఠాలు చెపుతుంది. బావగారు సెంట్రల్ గవర్నమెంట్‌లో ఉద్యోగం. ఆయనకి ట్రాన్స్‌ఫర్స్ అవుతుంటాయి. అక్క మాత్రం ఢిల్లీలోనే ఉంటుంది. అన్నయ్య, వదిన డాక్టర్స్. ఢిల్లీలోనే ఉంటారు. మా పేరెంట్స్‌కి మృదులంటే ఇష్టమే. మృదుల ఆసక్తులు వేరు. కెరీర్ మీద పెద్ద ఆసక్తి లేదు. అయినా తనెందుకో నచ్చింది. ఇంకా ఎంత దూరం," అడిగాడు సౌరభ్.

"కొద్ది దూరమే," అన్నారు శకుంతల.

అంతా కబుర్లు చెప్పుకుంటూ ఇల్లు చేరారు.

మృదుల, సౌరభ్ అరకువ్యాలి వచ్చి వారంరోజులు అయింది. మొదటి రెండ్రోజులు మృదులతో చుట్టుపక్కలంతా తిరిగాడు.

"బాప్‌రే నేనింక తిరగలేను. ఢిల్లీ పోదాం. బోర్ కొడుతుంది," అన్నాడు మూడోరోజు సౌరభ్.

"అప్పుడేనా... సరే నువ్వు ఇంట్లోనే ఉండు. సినిమాలు చూసుకో," అంది మృదుల.

ఆ కొండ, ఈ పల్లె అని తిరుగుతూనే ఉంది. వచ్చినప్పటి ఉత్సాహం ఆమె కళ్ళల్లో తగ్గుతూనే వుంది. మృదుల ఏవో ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతున్నట్టు ఇంట్లో అంతా గుర్తుపట్టారు. కాని ఎవ్వరూ ఆమెని విషయం ఏంటని కదపలేదు.

మరో రెండ్రోజుల్లో ప్రయాణం. ఆరోజు రాత్రి భోజనాల బల్ల దగ్గర మృదుల సౌరభ్ పెళ్ళి విషయాలు మాట్లాడటం మొదలుపెట్టారు సర్వారాయుడు.

మృదుల ఆయన మాటలని మొదట్లోనే కట్ చేస్తూ, "నే ఢిల్లీ వెళ్ళాలనుకోవటంలేదు," అంది.

"ఏం?" అడిగాయన.

"నేనిక్కడే ఉండాలనుకుంటున్నాను," అందామె.

"ఇక్కడా... ఇక్కడేం చేస్తావ్," అడిగాడు సౌరభ్.

మృదుల వెంటనే మాట్లాడలేదు.

అన్నంలో కూర కలుపుకుంటున్న సౌరభ్ ఆగి ఆమెవైపు చూస్తు, "విషయం సరిగ్గా చెప్పు," అన్నాడు.

"వారంగా అడవిలో చాలా ఊర్లు తిరిగాను. డముకు దగ్గర వేస్తున్న రోడ్డు చూస్తే మతిపోయింది. అంత పెద్ద రోడ్డు ఎందుకు వేస్తున్నారు... ఎన్ని చెట్టు కొట్టేశారు. ఊర్లు ఊర్లు ఖాళీ చేయించేశారు. ఆ డెడ్ విలేజెస్‌ని చూస్తుంటే దిగులేసింది. ఆ రోడ్డు ఆదివాసుల కోసం కాదు. ఆదివాసుల అభివృద్ధి అంటూ అడవిని నరుక్కుంటూ పోవటం ఏంటి... ఇక్కడ ఇప్పటికే ఈ విషయాల మీద కలసి పనిచేస్తున్న వాళ్లున్నారు. వాళ్ళతో కలిసి పని చేయటమో లేదా వేరుగా చేయటమో! అసలేం చెయ్యాలో ఇప్పటికి ఇంకా నిర్ణయించుకోలేదు. కాని ఇక్కడే ఉండాలని అనుకుంటున్నాను," అంది.

ఎవ్వరూ ఎదుటి వ్యక్తుల వైపు చూడటం లేదు. చూపంతా పళ్ళాలపైనే కేంద్రీకరించి తింటున్నారు.

ఈ పరిస్థితిని చక్కదిద్దాల్సిన బాధ్యత తన మీదే పూర్తిగా ఉందేమోనని సర్వారాయుడు, "ఆదివాసుల కోసం బోల్డన్ని పనులు చేస్తున్నారు తెలుసా. చాలా స్కూల్స్ వచ్చాయి. అయినా నువ్వేం చేస్తావ్. నువ్వు ఇక్కడ అడవిని రక్షించుకోవాలని ఉండిపోయావ్ అనుకో, సౌరభ్ సంగతేంటి... అతనక్కడా... నువ్విక్కడా," అన్నారు సర్వారాయుడు.

మృదుల సౌరభ్ వైపు చూసింది.

అతను సర్వారాయుడుగారి వైపు చూస్తున్నాడు.

"ఏం సౌరభ్, మాట్లాడవేం," అడిగింది.

"ఏం మాట్లాడాలి... నువ్వింత మీనింగ్‌లెస్‌గా ప్రవర్తిస్తుంటే నాకేం అర్థంకావటం లేదు. ఇక్కడేం వుంది. అడవి. ఆ మనుష్యులు ఇష్టం అన్నావ్. వచ్చాం. ఇలా అప్పుడప్పుడు రావొచ్చు. కాని ఇక్కడే ఉండిపోతానంటావేంటి? ఇంత పెద్ద అడవిలో ఓ భాగంలో రోడ్డు కోసం చెట్లు కొడితే మొత్తం అడివి అంతా మాయమైపోతున్నట్టు బాధపడతావేంటి," అన్నాడు సౌరభ్.

"అరే మృదూ! నీకేమైనా పిచ్చా. ఇక్కడుండి ఏంచేస్తావ్... నీ కెరియర్ అంతా పాడవదూ... నేను నా ఉద్యోగాన్ని ఇక్కడ మొదలుపెట్టాను. బోల్డన్ని ఏజన్సీ ప్రాంతాల్లో పనిచేశాను. రిటైర్ అయ్యేముందు తిరిగి లక్కీగా ఇక్కడికి వచ్చాను. నాకు బోల్డంత అటాచ్‌మెంట్ ఉంది ఈ ప్రాంతంతో. అటువంటిది నాకే ఈ రోడ్డు, మైనింగ్ వల్ల అడివి నాశనం అయిపోతుందనిపించటం

లేదు. ఆదివాసులకీ అన్యాయం జరుగుతుందనిపించటంలేదు. నువ్వింత ఎమోషనల్‌గా ఇలాంటి నిర్ణయం తీసుకోవటం ఏం బాగోలేదు. హాయిగా పెళ్ళి చేసుకోబోతున్నావ్. నువ్విక్కడా సౌరభ్ అక్కడా నో... నో... నో... వో వారంరోజుల్లో ఇదంతా మర్చిపోతావ్. ఏమ్మా! ఇష్టమయినచోట రైలు దిగిపోవటం అనుకుంటున్నావా- నీకు చెయ్యాలనిపించగానే అడివిని పరిరక్షించే వాళ్ళం అనుకునే గ్రూప్స్‌లో చేరిపోవటం... నో...నువ్వు ఢిల్లీ వెళ్ళిపో," మందలింపుగా అన్నారాయన.

"అరే డాడీ, చిన్నప్పుడంతా బర్డ్‌వాచింగ్, ఎకో టూరిజం, చెట్లు కొట్టకూడదని- చాలా విషయాలు చెప్పేవారు. సిటీస్‌లో ఉన్నప్పుడు ఇంటికో చెట్టు అంటూ చెట్లు నాటించారు. అక్క ఇంగ్లాండ్ వెళ్ళాలనుకుంటే అప్పుడు బావ ఇక్కడ ఒక్కడే ఉండాలి కదా అనే ఆలోచన రాలేదు. అభ్యంతరమూ మీకు రాలేదు. కానీ నేనిక్కడ ఉంటానంటే మీకు సౌరభ్ ఎలా అనే ప్రశ్న వచ్చింది. ఇకపోతే సౌరభ్, మీ ఇళ్లల్లో వాళ్లు జాబ్స్ కోసం వేరేవేరే ప్రాంతాల్లో పనిచేస్తున్నారు కదా. అలా వాళ్లు ఎలా ఉంటారనే అనుమానం నువ్వు వ్యక్తపర్చలేదు. నాలుగు నెలల క్రితం నాకు బాంబేలో పెద్ద కంపెనీలో ఉద్యోగం వస్తే వెళ్ళమని ఎంకరేజ్ చేసావ్. అప్పుడు మనిద్దరం వేరే వేరే ప్రదేశాల్లో పనిచెయ్యాల్సి వస్తుందనే బాధని వ్యక్తపర్చలేదు. ఇప్పుడేమో బోల్డన్ని అభ్యంతరాలు చెపుతున్నావ్. ఎందుకంటే నేనిప్పుడు ఎంచుకున్న దారిలో అడ్డంకులే తప్ప ఇంక్రిమెంట్స్ ఉండవ్. ప్రమోషన్స్ ఉండవ్. బోనస్‌లుండవ్. అంతేనా," చిన్నగా నవ్వుతూ అడిగింది.

సౌరభ్ అసహనంగా చూస్తూ, "మీ డాడీ చెపుతున్నారుగా. ఇక్కడ అడివికి వచ్చిన ముప్పు ఏంలేదని," అన్నాడు.

"డాడీ! మీరు ఓ గవర్నమెంట్ ఆఫీసరు. పైగా సిన్సియర్ ఆఫీసర్. వీళ్ల అభివృద్ధి అంటూ చాలా పనులు చేశారు. నిజం చెప్పండి వాటివల్ల వీళ్లు లాభపడింది ఎంత... నిజానికి ఈ రోడ్లు మైనింగ్- వీటివల్ల ఆదివాసులకు అన్యాయం ఏం జరగటంలేదా? ఈ మొత్తం ఇష్యూలో లాభపడింది ఎవరు? అసలు ఇది ఇక్కడితో ఆగుతుందంటారా...."

"అరే మృదులా. మీ డాడీ అడివిని కెరీర్ ఇంట్రస్ట్‌తో చూశారు. నువ్వేమో జీవితంగా తీసుకోవాలనుకుంటున్నావ్. మీ ఇద్దరూ ఎంత వాదించుకున్నా ఏదో ఒక పాయింట్ దగ్గర కాంప్రమైజ్ కాగలరా! ఎందుకొచ్చిన వాదన," అంటూ శకుంతలగారు సౌరభ్ వైపు తిరిగి, "మీరిద్దరు ఒకర్ని ఒకరు ఇష్టపడ్డారు. పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. నీకు మృదుల సంగతి తెలుసుకదా. తను చెయ్యాలనుకున్నది చేయటానికి వెనుకాడదని. తను ఈ అడవి కోసం దిగులు పడుతుంది. ఏదైనా చెయ్యాలనుకుంటుంది. తననీ పని చెయ్యొద్దని ఎందుకు కట్టడి చెయ్యాలి. తను అనుకున్నది మొదలుపెట్టనివ్వండి. నచ్చితే కంటిన్యూ చేస్తుంది. లేదా మానేస్తుంది. ఇప్పటికిప్పుడు నువ్వు అసహనంగా అయిపోవటం వల్ల విషయాలు తేలవ్ కదా... బాగా ఆలోచించుకోండి ఇద్దరు," అన్నారు. తర్వాత మృదుల నుద్దేశించి, "ఈ అడవిలో చెట్టుని కొట్టిన ప్రతిసారీ మన ఇంట్లో పనిచేసే రాములమ్మ గిలగిలలాడేది. ఆమె బాధ చూస్తే నాకు నా మేనత్త గుర్తొచ్చేది. రెండ్రోజుల తన పాప పోయినప్పుడు అత్త అలానే విలవిలలాడింది. నీలాంటి వాళ్ళంతా కలిస్తే నేలకూలుతున్న చెట్లలో కొన్నన్నా మిగుల్తాయేమో," మెరిసే కళ్ళతో అన్నారామె.

అన్నం తిన్న చేతిని సింక్ దగ్గర కడుక్కొంటున్న మృదుల మెల్లగా తల్లి దగ్గరికి వచ్చింది. ఆ తడిచేతిని తల్లి పైటచెంగుతో తుడుచుకుంటూ వంగి ఆమె బుగ్గపై ముద్దు పెట్టింది.

*భూమిక మాసపత్రిక*
*డిసెంబర్ 1996*

నేపథ్యం

## ప్రకృతి విధ్వంసాన్ని ఆపాలనే తపన

# వనమాల

***భద్రత కావాలి, తనకూ తన సంతానానికి, సంతానపు సంతానానికి సుఖమైన జీవితం కావాలి. ఆస్తిహక్కులాంటి వారసత్వపు భద్రత. తన రక్తం పంచుకొన్నవారు మాత్రం హాయిగా ఉంటే చాలనుకొనే భద్రత ప్రపంచాన్నంతా ప్రేమించలేక కుటుంబాన్ని మాత్రమే ప్రేమించే భద్రత. స్వేచ్ఛకు స్వార్థపు సరిహద్దు అదే.***

దేన్నైనా దాని సహజత్వం నుంచి వేరుచేసి ధ్వంసం చేయటం ఒక పురుషాహంకారం. లక్షల పువ్వుల సరాగాల నుంచి పోగుపడ్డ తేనెతుట్టను చెదరగొట్టి నాలుగు చుక్కలు పిండుకొని తన ధైర్యానికి తానే మురిసిపోతుంది మగతనం. ప్రాణవాయువుల్ని నిరాకరించి, గ్యాస్‌మాస్క్‌ల భద్రతలో తల దాచుకొని భూతల్లి ఒంటి మీద పచ్చదనపు పుట్టుమచ్చ ఎక్కడన్నా కనిపిస్తే భయంతో వణికిపోతాడు ప్రపంచ విజేత.

అన్వేషణ నుంచి సౌందర్యం వేరుపడ్డప్పుడే అతని పతనం ఆరంభం అయింది.

స్త్రీ ప్రకృతి, పురుషుడు వికృతి- ఈ విషయం చెప్పడానికే నేను వనమాల కథ రాశాను. లాభాల వేటలో సాగే మగ అన్వేషణకి, తనలోని సౌందర్యతృష్ణని చల్లార్చే చెలిమెల కోసం చేసే ఆడ వెతుకులాటలకి తేడా ఎంత ఉందో చెప్పాలనే ఆ కథ రాశాను.

బొమ్మని తనే పగలగొట్టుకొని నిస్సహాయంగా ఏడ్చే పసిబిడ్డలా కనిపిస్తాడు మగవాడు ఒక్కోసారి. అతను చేసే విధ్వంసం పర్యవసానాలు అతనికే తెలియవు. అలాగని అతను అమాయకుడు కాడు. అధికారం అతని బలహీనత. విశ్వాన్ని గుప్పిట్లో పెట్టుకోవాలని అతని తపన. ప్రకృతి శక్తులను చీల్చి చెండాడి పెరట్లో కట్టేసుకోవాలని అతని అత్యాశ. అతని భస్మాసుర మూర్ఖత్వాన్ని, అవధులు లేని ఆత్మవిశ్వాసాన్ని చూస్తే మా ఆడవాళ్ళకు ఎంత కోపమో, అంత జాలి. గాలి, నీరు,

ఆకాశమూ 'భూతాలు' కదా! అవి ఒక పట్టాన లొంగవు. యాంత్రిక అధికారానికి లొంగని శక్తులంటే చెప్పలేనంత భయం ఉంటుంది. కాంక్రీటు అరణ్యాల మధ్య, కర్ఫ్యూలు కత్తిపోట్ల మధ్య, స్టాక్ మార్కెట్ ప్రమాద సూచికల మధ్య లేని భయం అతన్ని చంబల్‌లోయలో ఆవరిస్తుంది. చంబల్ లోయ! ఒక అద్భుతమైన ఎర్రమట్టి దిబ్బల గుబురు అరణ్యాల జేగురు రంగు సౌందర్యం, నిర్మానుష్యమైన సౌందర్యం. అంతేకాదు బందిపోటు గుర్రాల డెక్కల చప్పుడుతో అలరారే సౌందర్యం. చాలదా ఇది ఓ నాగరిక ధీరుడికి, అందలాలు ఎక్కాలనుకొనే భీరుడికి వెన్నులో చలి పుట్టటానికి. 'సౌరభ్'కి పాపం భయమేసింది, 'మృదుల' రైల్లోంచి దిగి చంబల్ పరిమళాలని ఆనందంగా ఆఘ్రాణిస్తుంటే.

భయం, ప్రాణభయం. సౌందర్యం తెలియనితనం నుంచి భయం. స్త్రీకి రక్షణ ఇవ్వలేనన్న భయం. ఇవ్వాలన్న బాధ్యత నుంచి వచ్చిన భయం.

చంబల్‌లోయ కాదు అరకులోయలో కూడా తరువాత సౌరభ్‌కి భయమే వేసింది. మృదుల అక్కడ ఆదివాసుల మధ్య పని చేయాలని అనుకొన్నప్పుడు, కెరియర్ నిచ్చెనలని కాలదన్ని, సుఖానికి, సంతృప్తికి అలవాటు పడని అర్థాలని చెపుతుంటే కలిగే భయం. ఓ చిన్న పరస్పర జీవితం నుంచి ఓ ఆరుబయలు సహజీవనంలోకి వెళ్ళాలన్న కోరిక మీద భయం.

*

స్వేచ్ఛ! విశాల హృదయులైన తల్లిదండ్రులు ఇచ్చే స్వేచ్ఛ, భార్యలకు భర్తలు ఇచ్చే స్వేచ్ఛ, ప్రేయసులకు ప్రేమికులు ఇచ్చే స్వేచ్ఛ, అర్థసత్యాల స్వేచ్ఛ. వీటన్నింటి గురించి చెప్పాలని కూడా వనమాల రాశాను. మృదుల తండ్రి మంచి తండ్రి. ఆడపిల్లల చదువు ఇష్టాలను, పెళ్ళి ఇష్టాలను గౌరవించిన తండ్రి. తను ఇచ్చిన స్వేచ్ఛతో ఎదిగిన పిల్లల్ని చూసి మురిసే తండ్రి. కాస్త హద్దుల్ని విశాలం చేసి పొడువైన పలుపుతాడు ఇచ్చిన తండ్రి. నాకో వరుణ్ణి ఎంచుకొన్నానంటే సరే నీ ఇష్టం అనే తండ్రి. నాకో ఆదర్శం నచ్చింది, దానికోసం అరణ్యవాసం చేస్తానంటే ఒప్పు కొంటాడా? భద్రత కావాలి, తనకూ తన సంతానానికి, సంతానపు సంతానానికి సుఖమైన జీవితం కావాలి. ఆస్తిహక్కులాంటి వారసత్వపు భద్రత. తన రక్తం పంచుకొన్నవారు మాత్రం హాయిగా ఉంటే చాలనుకొనే భద్రత ప్రపంచాన్నంతా ప్రేమించలేక కుటుంబాన్ని మాత్రమే ప్రేమించే భద్రత. స్వేచ్ఛకు స్వార్థపు సరిహద్దు అదే.

ఆదివాసుల మధ్య పనిచేస్తానంటే నీ జీవిత భాగస్వామి ఇష్టానికి లోబడమంటాడు. అడవికి ప్రకృతికి జరుగుతున్న అన్యాయం ఏమీ లేదంటాడు. అడవి గుండెల్ని చీల్చివేసే రోడ్డు అతని(కీ) అభివృద్ధి. మహా నగరాల్లో ఉద్యోగ సోపానాల్లో భార్యాభర్తలు పరస్పరం ఇచ్చుకొనే అవకాశవాద స్వేచ్ఛ అతని అభివృద్ధి.

మృదులలాగే మృదుల తల్లి, 'అభివృద్ధి నిరోధకురాలు.' కూతురి ఇష్టాన్ని ఓ ఆడ వెతుకు లాట నుంచి అర్థం చేసుకొన్న తల్లి. ఆమెను లిబరల్ అనలేం. ఎందుకంటే తల్లులెప్పుడూ కఠినులుగా లేరు గనుక.

*

పై విషయాలన్నీ మనసులో తిరుగుతూనే ఉన్నాయి. కథలో ఏం రాయాలో ఆ తండ్రి తల్లి, సౌరభ్, మృదుల అంతా నాలో ఇంకిపోయారు. కానీ ఈ విషయాలను ఏ నేపథ్య వాతా వరణంలో రాయాలన్నదే తేలని విషయం. ఇంతలో అరకువ్యాలి వెళ్ళాను. నాకా పరిసరాలతో

చిన్ననాటి నుంచి పరిచయం ఉంది. సుసంపన్నమైన ఆ లోయల కొండల పచ్చదనమంటే నాకెంత మోహమో. అయితే కొన్నేళ్ళుగా అరకువ్యాలి వెళ్ళలేదు. కొండల్లోంచి లోయల్లోంచి జీప్‌లో వెళు తూ వెళుతూ జలజలా పారే గెడ్డల, రివ్వున ఎగిరే పిట్టల, వాలిపోయి సోలిపోయిన సీతాకోక చిలుకల పలకరింపులకి పరవశించిపోతుంటే హఠాత్తుగా ఓ పెద్ద రోడ్డు మనసుని కరకరలాడిస్తూ రోడ్డు వేస్తున్నారని పేపర్లలో, పుస్తకాలలో చదవటం జరిగింది. ఆ రోడ్డు ఎలాంటిదో కళ్ళతో చూసినప్పుడు కానీ 'అభివృద్ధి' ఎలా ఉంటుందో తెలియలేదు.

*

ఈ సమస్యని తీసుకొని కథ రాయాలనిపించింది. పాత్రల గురించి, సన్నివేశాల గురించి ఆలోచిస్తున్నప్పుడు ఒక ప్రశ్న నన్ను పలకరించింది. నాకు మాత్రం అసలు ఈ అడవులు, పర్యా వరణం, ప్రకృతి ఎందుకు ఇష్టమైన అంశాలు అయ్యాయని? ఓజోన్ పొర చిల్లులు పడుతుందనో, పర్యావరణ విధ్వంసంలో సామ్రాజ్యవాద అంశ ఉందనో, అడవుల గురించి, ఆదివాసుల గురించి మాట్లాడటం ఫ్యాషన్ అయిందనో నాక్కూడా ఇవి ఆసక్తమవుతున్నాయేమోనని ఆలోచించాను. అవి ఏవీకాదనీ, సహజత్వం మీద, ప్రకృతి మీద నాకున్న ప్రేమకు, నా స్త్రీత్వానికి సంబంధం ఉందనిపించింది. కారణాలు ఏమైనా కానీ స్త్రీల స్వభావం పరిరక్షణకు, సామరస్యానికి, సౌందర్యా నికి ప్రాధాన్యం ఇస్తుందని, పురుషుల స్వభావం అందుకు భిన్నంగా విధ్వంసాన్ని, ఘర్షణని, వికృతిని ఆశ్రయిస్తుందని తోచింది. ప్రకృతి విధ్వంసాన్ని, స్త్రీ పురుష సంబంధాలలోని దుర్మార్గంతో అన్వయించి కథ రాయాలని అప్పుడనుకొన్నాను. లాభాన్వేషణ, సుఖమయ జీవితం కోసం ఆరాటం ఒకవైపు, సౌందర్యాన్వేషణ, సంతృప్తికరమైన జీవనం కోసం తపన మరోవైపు ఉన్నాయనీ, అవి రెండూ మానవ సంబంధాలతో ఘర్షణ పడుతున్నాయనీ, ఆ భిన్న స్వభావాలు పురుష, స్త్రీ స్వభావాలుగా రూపం తీసుకొన్నాయనీ నమ్మి స్టోరీలైన్‌ను రూపొందించుకొన్నాను. తండ్రి పాత్ర, భర్త కాబోయే స్నేహితుని పాత్ర- మృదుల, ఆమె తల్లి పాత్రలు రెండు శిబిరాలలో ఉండి రెండు భిన్న ప్రయోజనాలను, స్వభావాలను ప్రతిఫలించేట్టు సన్నివేశాలని ఎంచుకొన్నాను.

*

చివరిగా ఓ మాట-

ఏ సమస్యని ఈ కథకి నేపథ్యంగా తీసుకొన్నానో, దాని పరిష్కారం కోసం పోరాడుతున్న సామాజిక కార్యకర్తలున్నారు. నిరంతరం సాగే ఘర్షణలో ఒకరోజు ఈ కార్యకర్తలు గెలిచినట్టే కనిపిస్తే మర్నాడే ఓడిపోయినట్టుగా అనిపిస్తోంది. నేను రాసింది కథే అయినా ఈ గెలుపోటములని గమనిస్తుంటే ఓరోజు ఆనందం ఆవరిస్తే మరొకరోజు నిరుత్సాహం అలుముకొంటుంది.

జీవితంలో ఏ రంగంలో అయినా పోరాటం సాగించే వారికి పరిచితమైన పరిస్థితే కదా ఇది.

*9 నవంబర్ 1997*

12

# గాజుపళ్లెం

## కె. వరలక్ష్మి



*కె. వరలక్ష్మి 1948 అక్టోబర్ 24న తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటలో జన్మించారు. వీరి మొదటి కథ రిక్షా జ్యోతి మాసపత్రికలో 1985లో అచ్చు య్యింది. 140కి పైగా కథలు రాశారు. నాలుగు కథా సంపుటాలు, ఒక కవితాసంపుటి, నాలుగు నవలికలు ప్రచురించారు. 120 పైగా కథలు, 50 వ్యాసాలు, దాదాపు 20 రేడియో నాటికలు రచించారు.*

చిరునామా
శ్రీ రవీంద్ర నిలయం, శ్రీరామ్‌నగర్
జగ్గంపేట-533 435
Ph.: 98664 67062

“రెండు బుల్లి చేతులు వింటిని ఎక్కుపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయి ఎప్పట్నుంచో. హమ్మయ్య! ఆ చేతుల ప్రయత్నం ఫలించింది. బాణాన్ని వింటికి సంధించి... లాగి... లాగి... వదిలేశాయ్. అబ్బా...!”

మూడంకెవేసి ముణగదీసుకు పడుకున్న గంగ కడుపులోని బిడ్డ కదలికకి ఉలిక్కిపడి కలలోంచి మెలకువలోకొచ్చింది. సూదుల్లా గుచ్చుతున్న కంకరగుట్ట మీద భారంగా వెల్లకిలా తిరిగింది. ఎర్రని అగ్నిపూల గుత్తుల మధ్య నుంచి ఎండ నిప్పుకణికల్లా కళ్లలోకి దూకింది. చటుక్కున మోచేతిని కళ్లమీద కప్పుకుంది. ఏదో అనుమానం వచ్చి మోచెయ్యి సందు నుంచి స్టేషను గేటు కవతల ఫెన్సింగు కానుకుని పోర్టరు గన్నిగాడు బీడీ తాగుతూ ఆకలి కళ్లతో గంగని తినేసేలా చూస్తున్నాడు.

‘ఛీ ఎదవా,’ అని తిట్టుకుని అటు తిరిగిపోయింది గంగ. ఆమెకి వాడి చూపులేం కొత్త కాదు. ‘ఎప్పుడూ అదే యావ ఎదవ సచ్చినోడికి,’ అనుకుంది. ఒకట్రెండుసార్లు ప్రయత్నించి ఆమెచేత తలమొయ్యా చివాట్లు తిని కేవలం చూపుల్తోనే తృప్తి పడుతున్నాడు ప్రస్తుతం గన్నిగాడు.

పొద్దుట్నుంచి టీ నీళ్లైనా పడని ఖాళీ కడుపులో బిడ్డ ఆకలికి కాబోలు ఉంగలు తిరుగుతోంది. చీర పొత్తిళ్లలో

చెయి దూర్చి కడుపునోసారి తడుముకుంది గంగ. చేతి మీద చాచి తన్నిన బిడ్డ కాలుని అందుకోవాలని విఫల ప్రయత్నం చేసింది. కొంతసేపు ఇటు పట్టుకోబోతే అటు, అటు పట్టుకోబోతే ఇటు కదులుతున్న బిడ్డతో ఆడింది.

కొంతసేపటికి విసుగొచ్చి ఆట మానేసింది.

సన్నని మంటలాగా ఆకలి మొదలయింది కడుపులోన లేవడానిక్కూడా ఓపికలేనంత నిస్సత్తువగా ఉంది. ఆకల్తోబాటు గంగని పశ్చాత్తాపం కూడా కొంచెం కొంచెంగా తినడానికి సిద్ధమైంది.

అసలా బోడిదాన్తో తగువు పడకుండా ఉండాల్సింది. వాగివాగీ దాని నోరే నెప్పెట్టి రెండు చేతులా మూసుకునేది. తగువుపడి మాత్రం తను సాధించిందేం వుంది?

చెయ్యి వెనక్కి చాచి తలకిందున్న గుడ్డల మూట మధ్యలో పదిలంగా పాత కోకలు చుట్టి పెట్టిన గాజుపళ్లాన్నోసారి తడిమి చూసుకుంది. ఆ బోడిది విసిరిన విసురుకు గాజుపళ్లెం భళ్లుమనేదే, సమయానికి సరిగ్గా తను పట్టుకునుండకపోతే. అప్పటికీ అంచు మీద చిన్న పెచ్చూడి పోయింది. తన ప్రాణం గిలగిలా కొట్టుకుంది. అసలా బోడిదానికి తనని ఆళ్ల కూడా తీసుకెళ్లడం ఇష్టంలేకే కొంత నాటకమాడింది.

నెమ్మదిగా లేచి చెట్టుకు చేరబడి కూర్చుంది గంగ. ఒళ్లంతా పచ్చిముద్దలాగుంది. చేతులు ముందుకు చాపి చూసుకుంది. అది గోళ్లతో గీరిన చారలు రక్తాలు పేరుకుపోయినై. దుబ్బులాగున్న తన జుట్టుని చేతికి చుట్టుకుని వంగదీసి వీపు మీద గుద్దిన గుద్దులకి తన ప్రాణం కడెక్కి పోయినట్టైంది. రోగిష్టిదాన్లా ఎప్పుడూ మూలుగుతా వుండే బోడిదాని చేతుల్లో అంత బలం ఎక్కణ్ణుంచొచ్చిందో!

పొద్దునే జరిగిన గొడవ గుర్తుకొచ్చిన గంగకి ఏడుపొచ్చింది. బోడెమ్మ నలుగురు పిల్లల్నీ అటిద్దర్నీ ఇటిద్దర్నీ వేసుకుని గాఢనిద్దట్లో ఉన్న గంగ, చెవులు హోరెత్తిపోయే కేకలు ఏడుపుల మధ్య తుళ్లిపడి లేచి కూర్చుంది. తూర్పింకా తెల్లబడలేదు. గోదావరి స్టేషన్లోకి ఏదో బండొచ్చి ఆగినట్టుంది, స్టేషనంతా సందడిగా ఉంది. గుడిసెల్లోని జనం అటు ఇటూ పరుగులెడుతూ గిన్నెలూ తపేలాలూ మూటలు కట్టుకుంటున్నారు. గుడ్డి సూరయ్యతాత తడుంకుని తడుంకుని పొయ్యిలో సగం కాలి ఆరిన కట్టెపుల్లల్ని కాలకుండా మిగిలిన రెండు పుల్లల్తోనూ కలిపి కడుతున్నాడు. అటుపక్క స్టేషన్లోంచీ ఇటుపక్క కళాకేంద్రం ఆవరణలోంచీ లైట్లు పట్టపగల్లా వెలుతుర్ని కురిపిస్తున్నాయి. బండి దిగిన జనం బద్ధకంగా స్టేషన్లోంచి బైటికొస్తున్నారు.

ఏం జరుగుతూందో కొంతసేపటి వరకూ గంగకి అర్థంకాలేదు.

గుడిసెల పైన ఆచ్ఛాదనగా వేసుకున్న ఆకుల్నీ, గోనెపట్టాల్నీ ఆదరాబాదరా విప్పి పోగులు పెట్టుకుంటున్నారు కొందరు. కుండల్నీ, గిన్నెల్నీ గోనెసంచుల్లో వేసి మూటలు కడుతున్నారు మరికొందరు.

"ఏయే గుడిసే...నం...! కళ్లంపడతాలేదేటి? రాజాగోరల్లే తొంగున్నావ్. నెగునెగు, నెగిసి గుడ్డా గుడుసూ అన్నీ మూటలు గట్టు, తెల్లారిందంటే మున్సపాల్టీ మొగుళ్లొచ్చేత్తారు. ఇయ్ కూడా దక్కకుండా తరివేత్తారు."

బోడెమ్మ గుడిసెలో పడుకునే అరుస్తోంది.

గంగ చివుక్కున లేచి నిలబడింది. ఆ వూపులో ఎడం మక్కె పట్టేసినట్టయ్యింది. అసలే నిద్ర చాలని బద్ధకం. ఒళ్లు మండుకుపోయింది.

"గుడిసెలోంచి కాళ్లు సగం బైటికి సాపి గుమ్మానికడ్డంగా తొంగున్నావు. నేనేటి సేసేది? ముందు నువ్వు నెగిసి బైటికి రా."

మున్సిపాల్టీ వాళ్లు ముందురోజు సాయంకాలం వచ్చి అందరి పేర్లూ రాసుకుని వెళ్లారు. సారంగధరుడి మెట్ట దగ్గర, క్వారీల పక్కన అందరికీ గుడిసెలేసుకోడానికి స్థలాలిస్తారట. పుష్కరా

లకు ఊరిని అందంగా కన్పించేలా చెయ్యాలని మున్సిపాల్టీ వారి తాపత్రయం. పట్నం ఒంటిమీది 'గాయాల్లాంటి' మురికిగుంటల్ని ఓపక్క తాత్కాలికంగా పూడ్చుకొస్తున్నారు. ఆపైన 'కురుపుల్లాంటి' ఆక్రమిత పూరి గుడిసెల్ని (ఈ పైత్యం పత్రికా విలేఖర్లది) సమూలంగా పెకలించెయ్యదల్చు కున్నారు. అలా పెకలించేసేక ఓ చోటంటూ చూపించకపోతే అణిచేసిన సెగగడ్డల్లాగా మరోచోట అవి తెల్లారేసరికి ప్రత్యక్షమైపోతాయని వారికి అనుభవపూర్వకంగా తెలీడం వలన ప్రత్యామ్నాయంగా ఊరికి దూరంగా గుట్టల మధ్య ఒక్కొక్క కుటుంబానికీ నాలుగడుగుల స్థలాన్ని కేటాయించారు.

'మనిషి చస్తేనే ఆరడుగుల నేల కావాలే, నాలుగడుగుల జాగాలో గుంపులు గుంపులుగా పిల్లాజెల్లల్తో ఎలాగ బతకాల్రా నాకొడకల్లార,' అని ఎవరూ అడగలేదు. అడగరు, ఎందుకంటే పేరుకి ఓ గుడిసంటూ ఉంటుందేకాని, వాళ్లల్లో ఎవరూ రోజంతా గుడిసెలో వున్న పాపాన పోరు. ఆడామగా అంతా కూలీనాలీ చేసుకోడానికి పోతూ ముసలాళ్లనీ, అంగవైకల్యం వున్నవాళ్లనీ, అయిదేళ్లు దాటని పసివాళ్లనీ, ఖాళీడబ్బాలిచ్చి ఏ రైల్వేస్టేషన్లోనో, ఏ గుడి ముంగిటో, ఏ మసీదు వాకిట్లోనో కూర్చోబెట్టి పోతారు. రాత్రికంతా గుడిసె దగ్గరికి వస్తూ వస్తూ తమ సంపాదనలోంచి దార్లో దొరికిందేదో కొనుక్కు తినేసి కడుపు నింపుకుంటారు. ఏ చేపలపులుసు తినాలనిపించినప్పుడో తప్ప అక్కడి పొయ్యిలు రాజుకోవు.

వయసులో ఉన్న పెళ్లికాని మగకుర్రాళ్లు ఏ ప్లాట్‌ఫారం మీదో తెల్లారేదాకా ఓ కునుకు తీసేస్తారు. తోడున్న జంటలు మాత్రం కాళ్లు లోపలికి తీసుకుంటే తలలూ, తలలు ముడుచుకుంటే కాళ్లూ బైటికొచ్చే ఆ గుడిసెల్లో ముడుచుకుపోయి కాపురాలు చేసేస్తుంటారు. తలుపూ ద్వారం లేని ఆ గుడిసెల్లో తమ కదలికలు అందరికీ బట్టబయలేనన్న విషయం తెలిసి కూడా ఏ దుప్పటి ముసుగులోనో బహిరంగంగా రహస్యాన్ని కాపాడుకుంటూ ఉంటారు.

ప్రస్తుతం అక్కడి వాళ్లంతా కొత్తచోటికి చేరబోయే ఉత్సాహంలో ఉన్నారు. ఇప్పుడెళ్లబోయే స్థలాన్ని గవుర్మెంటు తమకి నికరంగా పట్టాలు రాసిచ్చేస్తాదని రాత్రి కథలు కథలుగా చెప్పేసు కున్నారు. అంత దూరం నడవలేని ముసలాళ్లు మాత్రం, "మీకేం పిచ్చేటల్లా, మనవేం ఆళ్ల సుట్టా లవా బందుగులవా, మనకాడ ఒక్క పైసా ఉచ్చుకోకుండా ఉత్తినే మనకి తలాలు రాసిచ్చెయ్య టానికి? అదీగాకుండా పుష్కరాల్లో గోదారమ్మకీ, ఊరికీ దూరంగా పోయి మనం చేసేదటంట? నాలుగు డబ్బులొచ్చీ ఏళకి ఇయ్యేం పొయ్యీకాలం బుద్ధులొచ్చాయిరా మీకు? ఆళ్లిచ్చే తలాన్ని నెత్తినెట్టుకుపోతారేటి ఎవులైనా? అయినా మనకి ఏరోజుకారోజు పొట్టలోకి కూడుండాలగానీ, ఇల్లూ వాకిళ్లూ మనవేం చేసుకుంటాం. ఇయ్యాలిక్కడుంటాం, రేపెక్కడుంటావో ఆ పరమాత్ముడికే ఎరిక. అందుకని ఆళ్లు సూపిచ్చే మోసేతి మీద తేనెసుక్కని నమ్ముకుని అరసేతిలోది అవతల పారేసుకో కండి. టేసనుకి ఈ పక్క నుంచి పొమ్మంటే ఆ పక్కకెళ్లి గుడిసేసుకోవాల. ఆపక్కనించి పొమ్మంటే మళ్లీ ఈ పక్కకొచ్చెయ్యాల," అని హితువుల చెప్పేరు.

గేటుకి చేరబడి బీడీ కాల్చుకుంటున్న స్వీపరు ఏసోబు మాత్రం ఆరిపోయిన బీడీముక్కని తుపుక్కున ఉమ్మేసి, "ఓరి ఎదవల్లారా! రాజమండ్రికి ఇదేవన్నా ఉత్తుత్తి సోకనుకుంతన్నారేటి? పుస్కరాల సోకు. కళ్లు జిగేల్మనిపోవాలని మునిసిపాలాపీసులో అయ్యగార్లు సెప్పుకుంతంటే ఇన్నాను. తెల్లారే తలికల్లా మీరిక్కణ్ణించి కదలకపోయారో- ఇంకంతే, మీకు గోనిసంచులూ గుడ్డ ముక్కలూ కూడా దక్కవు. నామాటినుకోని మంచిగా ఎలిపోండి. పుస్కరాలైపోయిన మర్నాటికెలాగా మీరిక్కడికి రాకా తప్పదు, ఆ బాబులందరూ సూసీ సూణ్ణట్టూరుకోకా తప్పదు," అన్నాడు.

ఆ మాటలకి అందరూ కట్టుబడిపోయేరు.

మురిక్కాలవల్నీ జల్లెడ పట్టే మాలచ్మి మాత్రం ఏవెరగనట్టు ఏసోబు పక్కకెళ్లి నుంచుని బొడ్లోనించి మడతలుపడి మాసిపోయిన రూపాయి కాయితం ఒకదాన్ని తీసి వాడి చెయ్యందుకుని రహస్యంగా వాడి గుప్పిట్లో కుక్కింది. "ఓరేసోబూ, నా కొడకా! పుస్కరాలెల్లిన మర్నాడు తెల్లారీ పొలికల్లా నేనూ, నా కుర్రోళ్లూ ఇక్కడుంటాం. ఈ సోటు మాత్రం ఎవురూ అక్కరమించెయ్యకుండా సూసిపెట్టు నాయన్నాయనా, సచ్చి నీ కడుపునుడతాను," అని బతిమాలింది.

ఏసోబు కుదరదని కొంచెంసేపు బెట్టు చేసి, మరో రూపాయి చిల్లర డబ్బులుచ్చుకుని 'సరే'నని అభయమిచ్చేడు.

బోడెమ్మ కాళ్లు ముందుకు జరుపుతూ గుడిసెలోంచి బైటపడింది. ఇంకా నిద్రలో వున్న నలుగురు పిల్లల్నీ నాలుగంటించి లేపి కూర్చోబెట్టింది.

బోడెమ్మ బైటికొచ్చిన కంతలోంచి గంగ లోపలికి దూరింది. ఒక పాతకోక పరిచి, వున్న నాలుగు గిన్నెలూ, చట్టిలూ సర్దడం మొదలుపెట్టింది. ఈలోపల బోడెమ్మ గుడిసె పైన వేసిన గోనెముక్కలు రెండూ లాగి పక్కన పడేసి, మూడువేపులా నిలబెట్టిన తడికముక్కల్ని జాగ్రత్తగా పెకలించమని ప్లిలలకి పురమాయించింది. పిల్లలు ఆ తడకల్ని గుంజడం మొదలుపెట్టారు. అదిగో అక్కడే అనుకోకుండా గొడవ మొదలైంది.

తడకకి చేరబెట్టిన గాజుపళ్లెం తడక గుంజడంతో ముందుకు పడిపోయింది. పడీపడ్డమే అంచుమీద అంగుళం మేర పగులిచ్చింది. ఆ గాజుపళ్లెం గంగకి ప్రాణం. తన పుట్టింటి నుంచి తెచ్చుకున్న ఏకైక సామగ్రి అదే. దాన్ని జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తోంది. ఆ పళ్లానికి అంచు పగిలిపోగానే గంగకి గుండెలో ఎవరో కత్తి దింపినట్టైంది.

ఉక్రోషం పట్టలేక తడక గుంజుతున్న పేరిగాణ్ణి పట్టుకుని వీపు మీద ఛెళ్లుమని ఒక్కటేసింది. అది చూసి బోడెమ్మకి ఉడుకెత్తిపోయింది.

"ఓసి నీ సేతులడిపోనూ, రంకునా సైతి! నీకేం పొయ్యీకాలవొచ్చిందే ఆణ్ణంత దెబ్బ కొట్టీసేవూ," అంది కాళికావతారం ఎత్తేసి.

"కొడతానా సంపేత్తానా ఎదవని. సచ్చినోడు నా గాజుపళ్లేన్ని..."

గంగని మాట పూర్తిచెయ్యనీకుండా బోడమ్మ అందుకుంది.

"ఓలబ్బో గాజుపర్లెం. అమ్మగారింటి కాణ్ణుంచి అట్టుకొచ్చీసింది అరణం. నాకు మండు కొచ్చిందంటే నేలకేసి కొట్టీసి నాలుగుసెక్కలు సేసీగల్ను జాగర్త," గాజుపళ్లాన్ని గంగ మీదికి విసిరేసింది బోడమ్మ.

"ఏదీ, సెయ్‌నంజా, నాలుక్కాదు రెండు ముక్కలు సెయ్ సూద్దాం. నీ బుర్ర కూడా రొండు స్కెలైపోద్ద దెబ్బకీ," ఆ పక్కనే పడున్న కట్టెపేడునోదాన్ని చేతలోకి తీసుకుంది గంగ.

గంగ చేతిలో కట్టెపేడు చూడగానే బోడెమ్మ వీధెగిరి పోయేటట్టు రాగం లంకించుకుంది. "ఓలమ్మో! ఈ దొంగలం... ఈ దొమ్మరిసాని, నా మొగుణ్ణి వల్లో ఏసుకుని నా కాపరంలో నిప్పు లేసింది. నా మొగుణ్ణి పొట్ట నెట్టేసుకుంది గాకుండా ఇంక నన్ను సంపెయ్యడానికి తయారైందిరా బాబో," కూర్చుని నెత్తిన రెండు చేతులూ పెట్టుకుని రాగాల్తీసి రాగాల్తీసి మొగుణ్ణి తల్చుకుని ఏడుపు మొదలుపెట్టింది. అది చూసి బిత్తరపోయిన గంగ కట్టెని కింద పడేసింది.

కట్టైనైతే పడేసింది కానీ, పొంగుకొస్తున్న ఉక్రోషాన్ని ఆపుకోలేకపోయింది.

"పోపోయే రోగిష్టినంజా! నువ్వు పనికిరాని డొక్కు నంజవనే కదా ఆడు నన్ను తెచ్చు కున్నాడు," అంది బోడెమ్మని ఎక్కడ కొట్టాలో అక్కడ కొట్టేనని మురిసిపోతూ.

ఆమె మురిపెం ఎంతసేపు నిలవలేదు. బోడెమ్మ దెబ్బతిన్న పులిలాగ క్షణంలో ఎగిరి దూకి గంగ జుట్టు పట్టేసుకుంది. ఆ జుట్టును చేతికి మెలిపెట్టుకుని వంచి, వీపుమీద గుభీగుభీమని

గుద్దింది. గంగకెంతసేపూ రెండు చేతులూ అడ్డం పెట్టుకుని తన గర్భం మీద దెబ్బ పడకుండా కాపాడుకోడానికే సరిపోయింది. కొట్టికొట్టి బోడమ్మా, దెబ్బలు తినితిని గంగా సొమ్మసిల్లిపోయేరు.

తెల్లారి ఆరుగంటల వేళకంతా అందరూ మూటల్తో సిద్ధమైపోయేరు.

ఎలాగో ఓపిక చేసుకుని గంగ కూడా తన గుడ్డల్లో గాజుపళ్లెం జాగ్రత్తగా పెట్టి మూట కట్టుకుంది.

ఆనెం కళాకేంద్రం గోడ పొడవునా గుడిసెలు పీకేసిన ఆనవాళ్లు తప్ప మరేం మిగల్లేదు.

కేన్‌తో టీలమ్ముకునే కుర్రాడొస్తే అందరూ టీనీళ్లు కడుపులో పోసుకున్నారు. తనూ టీ తాగుదామని గంగ మొల్లో వెతుక్కుంటే బొడ్లో దోపుకున్న అర్ధరూపాయి బిళ్ల కనపళ్లేదు. చెట్టు వెనక్కెళ్లి గబగబా చీరకుచ్చిళ్లన్నీ పీకేసి చూసుకుంది. ఉహూ, ఇందాకటి కొట్లాటలో ఎక్కడో పడిపోయినట్టుంది. ఆశ చావక చాలాసేపు వెతుక్కుంది గంగ. దొరకలేదు. పోనీ ఎవరైనా 'ఈ టీనీల్లు తాగు' అంటారేమోనని చూసింది. ఎవరూ అనలేదు. టీ కుర్రోడు అరువివ్వనన్నాడు. "ఇక్కణ్ణుంచి ఎల్లిపోతన్నారు కదా," అన్నాడు.

ఆ మాట విని బోడెమ్మ గయ్యిమని లేచింది మళ్లీ.

"అదెక్కడి కొత్తాది నా సవితి? దానికెవుడూ బొట్టెట్టి భూములియ్యలేదు. నా మొగుడికి నేను నీతైన పెళ్లాని కాబట్టి గవుర్మెంటోడు నాకూ, నా బిడ్డలకీ ఇచ్చేడు. ఇలాంటి అడ్డవైన గుంట ముండలకీ ఇచ్చెయ్యటానికి ఆడేం తెలివిలేనోడు కాడు."

"నీ టీ నీల్లు తాగాపోతే నేనేం సచ్చిపోన్లే, ఎల్లెల్లు," అని అనవసరంగా టీ కుర్రాణ్ణి కసురుకుని అటుతిరిగి కూర్చుంది గంగ. ఏడుగంటల కంతా మున్సిపాల్టీ వాళ్ల మనిషొచ్చి అందరూ ఎక్కడికెళ్లాలో చెప్పేసిపోయాడు. వరసగా పేర్లు చదివేటప్పుడు ఆ లిస్టులో బోడెమ్మ పేరుందిగాని, గంగ పేరు లేదు.

నాలుగైదు రోజుల క్రితం అందరూ పేర్లిస్తా వుంటే బోడెమ్మా, పిల్లలూ ఎక్కడుంటే తనూ అక్కడే కదా అనే ధీమాతో గంగ తన పేరివ్వలేదు.

ఆ, ఇయ్యన్నీ మామూలే, ఇలాంటి గొడవలు ఎన్నిసార్లు జరగలేదు! ఈ బోడిదాని కసలే ఒళ్లొంగదు. నేను లేకపోతే దీనికి తిండి పెట్టేవోళ్లెవరు అనుకుంది ధీమాగా.

నెలరోజుల క్రితం అతిసారం వచ్చి రాజియ్య పోయినప్పట్నుంచీ గంగే ఆ కుటుంబానికి మొగదిక్కులా నిలబడింది. నలుగురు పిల్లల్నీ వెంటేసుకుని బజార్లోకి పోయి పచారీ దుకాణాలకి మూటలూ, గంపలూ మోసి రోజుకి అయిదార్రూపాయలు సంపాదించుకొస్తోంది. నూకలు కొనుక్కొచ్చి, ఏ వేళైనా పొయ్యి రాజేసి గంగ వండి పొయ్యాల్సిందే.

బోడెమ్మ మాత్రం ముణగదీసుకు పడుకుని కదలదు. ఇక్కడి పూచికపుల్ల తీసి అక్కడ పెట్టదు. 'ఏవం'టే రోగం అంటుంది.

'వేళకి లేచి గిన్నెడన్నం ముప్పొద్దులా తినేదానికి ఏం మాయరోగవో,' అనుకుంటుంది గంగ.

బెట్టు చేస్తూ అటు తిరిగి కూర్చున్న గంగ నొదిలేసి వెళ్లిపోయేరంతా. ఆశ చావని గంగ వాళ్లు కనుమరుగయ్యే వరకూ చూస్తూనే ఉంది. తను పెంచిన ఆఖరోడైనా వెనక్కొచ్చి, 'చిన్నమ్మా, నువ్ రాయే,' అంటాడేమోనని. అలా జరగలేదు. అప్పుడు పొంగుకొచ్చేయి గంగకి గోదావరన్ని కన్నీళ్లు. ఒక్కసారి ఆకాశంలోకి మబ్బులు కమ్ముకొచ్చేయి. సన్నగా చినుకులు ప్రారంభమయ్యేయి.

భారంగా లేచి, మూట చంక నేసుకుని ఒక్క నిముషం ఆలోచించింది గంగ. అటు స్టేషన్లోకి పోదామా, ఇటు కళాకేంద్రం ఆవరణలోకి పోదామా అని. తను నుంచున్న గోడ వెనకే ఉన్న కళాకేంద్రమే దగ్గరగా తోచింది. అదీగాక స్టేషన్లో గన్నిగాడి పోరొకటి.

చుట్టూ తిరిగి గేట్లోంచి తిరిగొచ్చి కళాకేంద్రం మెట్లన్నీ ఎక్కేసరికి అలుపొచ్చింది గంగకి. ఆయాసపడుతూ స్తంభానికి చేరబడి కూర్చుండిపోయింది.

మొట్టమొదటిసారి రాజమండ్రి రావడం గుర్తుకొచ్చింది.

చిల్లు గిన్నెలకి మాట్లెయ్యడానికి తమ ఊరొచ్చిన నలభై ఏళ్ల రాజియ్య నెల్లాళ్లపాటు తమ గుడిసెలోనే వున్నాడు. చుట్టూ అడివి, కొండలూ. రోజూ కొంత కొంత మేరకి కొండల్ని పగలకొడుతూ రాళ్లు కొట్టే జనం. ఆ గుడిసెల్లో ఉండే జనాలకి కాస్త గంజి కాచుకుని తాగడం, మళ్లీ రాళ్లు కొట్టే పన్లో మునిగిపోవడం తప్ప మరో వ్యాపకం వుండేది కాదు. ఊహ తెలిసినప్పట్నుంచీ అదే ప్రపంచంగా పదహారేళ్లు ఒంటి మీదికి తెచ్చుకున్న గంగకి రాత్రి తన తండ్రితో బాటు కల్లుముంత ఖాళీ చేసి చిలవలు పలవలుగా రాజియ్య చెప్పే రాజమండ్రి కబుర్లు కడుపు నింపేసేవి.

గోదావరి ఒడ్డునే గుళ్లూ గోపురాలూ, గోదావరి మీద బ్రిడ్జీలూ, కడతా కడతా ఉన్న మూడో బ్రిడ్జి స్తంభాలు, సినిమాహాళ్లూ, కాపీ ఒటేళ్లూ- ఒకటేంటి, రాజమండ్రి అంటే స్వర్గం అన్పించేది గంగకి. నెల గడిచేసరికి కల్లుముంతల స్నేహం ముదిరి, పదహారేళ్ల గంగని తనకి కట్టబెట్టమని రాజియ్య అడిగిన వెంటనే తల ఊపేసేడు గంగ తండ్రి. గంగ తల్లి గంగని చాటుకి పిల్చి చివాట్లేసింది. "ఆడి వయసెక్కడ, నీ వయసెక్కడ? నీ బాబాయంత వయసోడాడు. ఆణ్ణి కట్టుకుని నువ్వేం సుకపడతావే పిచ్చిమొకవా, ఆణ్ణి సేసుకోనని సెప్పు."

కాని, గంగకి తల్లి మాటలు చెవికెక్కలేదు. ముందు ఆ రాళ్ల ప్రపంచం నించి బైటపడితే చాలనుకుంది. ఈ ఛాన్స్ వదిలేసుకుంటే అక్కడే రాళ్లు కొట్టే ఏ ఎర్రోడికో తనని కట్టబెట్టేస్తారు. మరో ప్రపంచం అనేది చూడకుండానే ఈ రాళ్ల మధ్యనే తన బతుకు వెళ్లమారిపోతాది.రాజియ్య చేత మెళ్లో పసుపుకొమ్ము కట్టించుకుని ఆడి వెంట వచ్చేసింది. కాణీకట్నం అడగలేదు సరికదా, అత్తగారికో జనతాచీర, మావగారికో జనతా పంచె కొనిపెట్టిన రాజియ్య దేవుళ్లాగ కనిపించేడు వాళ్లకి. ఆ రాత్రి కల్లుముంతల పార్టీ చేశాక, అక్కడున్నోళ్లందరికీ దేవుళ్లాగే కనిపించేడు. పుట్టింటి వాళ్లు గంగకి ఒక కొత్త కోకైనా కొనలేకపోయారు.

రాళ్లు కొట్టిన డబ్బులు దాచుకుని అటుగా వచ్చిన కావిడి సామాన్ల వాడి దగ్గర చిన్నప్పుడెప్పుడో ముచ్చటపడి కొనుక్కున్న బాతులూ, లతలూ ముద్రించి ఉన్న అన్నం కంచమంత గాజు పళ్లాన్ని మాత్రం గంగ పదిలంగా తన వెంట తెచ్చుకుంది. మొదటిసారిగా రైలు బండెక్కించిన రాజియ్య గంగ కళ్లకి ఆడు చెప్పిన సినిమాకథల్లోని హీరోలా కన్పించేడు.

ఇప్పట్లాగే ఆరోజు సన్నటి చినుకులు పడుతున్నాయ్. గోదావరి స్టేషన్లో దిగి ఏదో ప్రపంచంలో తేలిపోతూ గాలిలో నడిచొచ్చిన గంగకి నేలమీద బోర్లా పడిపోడానికి ఎంతోసేపు పట్టలేదు.

గుడిసె గుమ్మం దగ్గరే ఎంగిలి గిన్నెలు, కడుక్కుంటున్న బోడెమ్మ రాజియ్యని చూస్తూనే తిట్లకి లంకించుకుంది. "ఇన్నాళ్లూ ఎక్కడికి పోయా? ఎదవ సచ్చినోడా, ఇక్కడ తిండీ నీళ్లూ లేకుండా మేం సచ్చినా నీకేం ఫరవాలేదన్నమాట!" అంటూ,

"ఇదెవత్తీ నీ ఎనకాల? మెళ్లో కొత్త పసుపుతాడుంది. అమ్మో అమ్మో నా గొంతుక్కో సేసేడల్లో. ఈ ఆడంగిరేకు లెదవ ఇంకెవత్తో రంగసాన్ని ఎంటబెట్టుకొచ్చేసేడల్లో," అంటూ గుడిసె లెగిరిపోయేటట్టు రాగాలెట్టింది. "ఆడికి సిగ్గు లేకపోతే నీకూ నేదేంటే? ఆడి వయసెక్కడ, నీ వయసెక్కడ?" అంటూ గంగని బుగ్గల్లో పొడిచింది. అప్పుడర్థమైంది గంగకి రాజియ్యకిదివరకే పెళ్లాం పిల్లలూ ఉన్నారనీ, రాజియ్య హీరో కాదనీ, పెళ్లాం ముందు పిల్లి అనీ. ఏం చెయ్యాలో తోచని గంగ కొంగు బొడ్లో దోపుకుని బోడెమ్మ చేతిలోని ఎంగిలి గిన్నెలందుకుంది. కాస్సేపట్లోనే గుడిసెంతా అలికి ముగ్గేసి అద్దంలా తయారుచేసింది. సాయంకాలం పెద్ద పిల్లలు ముగ్గురికీ స్టేషను కుళాయి దగ్గర రుద్దీ స్నానాలు చేయించింది. చిరుగుల లాగూలకి కుట్లు వేసి తొడిగింది. చంటోడికి తాటాకుల

మంట మీద వేణ్ణీళ్లు మరిగించి పోసి, శుభ్రమైన పాత గుడ్డల్లో పడుకోబెట్టింది. వంటంతా కానిచ్చి, అలిగి పడుకున్న బోడెమ్మకి పాదాలు ఒత్తింది.

ఇన్ని చేసినా, వారం రోజులకిగాని బోడెమ్మ కోపం చల్లారలేదు.

ఆ తర్వాత బోడెమ్మ మహారాణీ, గంగ దాసీపిల్లా అయ్యారు.

రాజియ్యకి బోడెమ్మ ఎదుట నోరెత్తే ధైర్యమే కాదు, కన్నెత్తే ధైర్యం కూడా లేదు.

ఎప్పుడైనా బోడెమ్మ ఏ సినిమా కెళ్లినప్పుడో తప్ప రాజియ్య గంగని తాకేవాడు కూడా కాదు. ఒకట్రెండుసార్లు గోదావరవతల ఊళ్లకి మాట్లెయ్యడానికి వెళ్తూ వండి పెట్టడానికి గంగని తన కూడా పంపమని రాజియ్య బోడెమ్మని అడిగేడు. ఒంటికాలి మీద లేచిన బోడెమ్మ నోటికి ఝడిసి ఆ తర్వాత ఆ ఊసెత్తడం మానేసేడు.

గంగకి మాత్రం ఆ చుట్టుగుడిసె స్వర్గంగానూ, గోదారి నీళ్లు అమృతంగానూ అన్పించేవి. పనంతా చేసేసి, బజార్లో రెండ్రూపాయలు చేతిలో పడగానే మేట్నీ సినిమాకెళ్లిపోయేది. చిరంజీవి ఆమె కలల రాకుమారుడు. కళాకేంద్రంలో తరచుగా జరిగే కార్యక్రమాల్లో ఏ నాట్యమో, నాటకమో ఉంటే సీనారేకు డబ్బా మీదికెక్కి గోడ మీది నుంచి, బోడెమ్మ తిట్టేవరకూ చూస్తూనే ఉండేది. గంగకి బతుకులో కష్టం అనే పదానికర్థం తెలీదు. ఆమె కళ్లకి లోకం ఎప్పుడూ రంగుల్లోనే కన్పిస్తూ ఉండేది.

రాజియ్య వెంట వచ్చిన నాలుగేళ్లకి నెల తప్పిందని తెల్సినపుడు సంతోషించిన వాళ్లెవ్వరూ లేకపోయారు. చిత్రంగా గంగకి ఇన్నాళ్లకి తల్లి గుర్తుకొచ్చింది. ఏమైనా సరే తల్లి కాబోయే వేళకి తన తల్లి దగ్గరుండాలని అనుకుంది. ఆ మాటే రాజియ్యతో అంటే, "నీకేమైనా పిచ్చేటే, అంత దూరవెల్లాలంటే సార్జీలకి ఎంతుండాలో తెస్సా?" అన్నాడు. "ఆ అడవిలో ఏటుంటాది? ఇక్కడే మంచి ఆడ డాకటేరు కాడ పురుడు పోయిత్తాను."

అది జరిగే పని కాదని గంగకెప్పుడో అర్థమైంది. రాజియ్య సంపాదించిన కొద్దో గొప్పో తాగుడుకే ఖర్చైపోతోంది. గంగ రెక్కలు ముక్కలు చేసుకుని ఆ కుటుంబాన్ని పోషించాల్సి వస్తోంది. వేణ్ణీళ్లకి చన్నీళ్లుగా ఉంటాయని ముక్కుపచ్చలారని కుర్రాళ్లకి కూడా పావలో అర్థో సంపాదించడం నేర్పింది. గంగకి ఏడోనెల వచ్చేక రాజియ్య అర్థాంతరంగా కన్ను మూసేడు. అప్పుడు కూడా గంగ బెంబేలెత్తిపోలేదు. చుట్టూ మనుషులంటే చాలు, ఆమె రెక్కలే ఆమెకి ధైర్యం. బోడెమ్మకీ, పిల్లలకీ గంగే ధైర్యం చెప్పింది. ఆ గుడిసెల్లోని నలుగురూ శవాన్ని మోసుకుపోయేక పది గుడిసెల్లోంచీ పది గుప్పిళ్ల బియ్యం అడిగి తెచ్చి అన్నం వండి ఆ తల్లీ పిల్లల చేత తినిపించింది.

అలాంటి గంగకీరోజు ఈ ఒంటరితనం బెంబేలెత్తిస్తోంది. నాలుగేళ్ల నించి ఇక్కడే బతికినా, ఊరేంటో పరాయిదిగా అన్పిస్తోంది. తెలిసున్న ముఖం ఒక్కటీ లేనట్టు అన్పిస్తోంది.

క్రమంగా చినుకులు పెద్దవై వాన జోరందుకుంది.

కళాకేంద్రం ముందు వెంకటేశ్వరాలయం కడుతున్న కూలీలంతా వరండాలలోకి పరుగెత్తుకొచ్చిపడ్డారు. అలా మొదలైన వాన సాయంకాలం వరకూ ఎడతెరిపి లేకుండా కురుస్తూనే ఉంది.

వాళ్లందర్నీ చూస్తే గంగకి ఏదో ఆశ కలిగింది. మేస్త్రీ దగ్గరకెళ్లి రేపట్నుంచి తనకి కూడా పని ఇప్పించమని అడిగింది.

మేస్త్రీ ఆమెని ఎగాదిగా చూసి, "నువ్వు చేస పని కాదులే ఇది, ఎల్లెల్లు," అన్నాడు. "అయినా పొద్దున్న రేడియోలో సెప్పేరు, ఈ వాన ఇప్పుడప్పుడే తెరిపియ్యదంట."

ఆ వానలో తడుస్తూనే క్రమంగా అందరూ వెళ్లిపోయేరు. గంగ మళ్లీ ఒంటరిగా మిగిలి పోయింది.

నిన్న బజార్లోనూ ఇదే వరుస. తను బరువులు మొయ్యలేకపోతూందని, త్వరగా నడక లేకపోతూందని షావుకారు కేకలు పెట్టాడు. "మా ప్రేణం తియ్యకపోతే ఆ బరువేదో దింపుకున్నాక రారాదూ," అన్నాడు తన కడుపు కేసి చూస్తూ.

'ఆ సచ్చినోడలా వాగితే మాత్రం నాకిది బరువెలా అవుతాది? నా బిడ్డ. నా రగతంలో రతం. ఇక మీద ఈడే కదా నాకు తోడూ నీడా,' అనుకుంది ఆప్యాయంగా కడుపు వేపు చూసు కుంటూ. 'ఆడికి అన్నం తినే వయసొచ్చేక గాజుపళ్లెంలోనే అన్నం తినిపించాలి,' అనుకుంది గర్వంగా. అందర్లాగా ఆడు సత్తుగిన్నెల్లో తినడు.

టైమెంతైందో గాని మబ్బులు దట్టంగా మూసేసి పొద్దు గూకినట్టే ఉంది. కడుపులో కదిలి కదిలి ఇక ఓపిక లేనట్టు ఆగిపోయింది బిడ్డ. పొత్తి కడుపు బిగబట్టుకుపోయినట్లుంది. ఆకలికి శోషచ్చినట్టైపోతోంది. గంగని తన కడుపులో ఆకలి కన్నా బిడ్డ కడుపులో ఆకలి ఎక్కువ బాధిస్తోంది. ఏ వేడిగంజో పోసి బిడ్డని లేపాలి. కడుపులో బిడ్డ కదలకపోతే ప్రమాదం అని బుచ్చిది చెప్పిన మాట గుర్తొచ్చి వణికిపోయింది.

ఎవర్నైనా అడిగితే గుప్పెడన్నం పెడతారేమో అన్పించింది. కాని, దరిదాపుల్లో ఎక్కడా ఇళ్లే లేవు.

పగలంతా పడుకున్న అప్సరా లాడ్జి గదులు రాత్రికి లైట్లతో సింగారించుకుంటున్నాయి. ఆ పక్క హోటల్లోంచి వస్తున్న కమ్మని పోపుల పరిమళానికి గంగకి నోట్లో నీళ్లూరిపోతున్నాయి.

ఇంకా పొద్దుగూకితే వాచ్‌మెన్ అక్కడుండనియ్యడని గంగకి తెలుసు. హోరున కురుస్తున్న ఆ వర్షంలో మూటని పదిలంగా గుండెకి హత్తుకుని మెట్లు దిగింది గంగ. కళాకేంద్రం ముందుండే తోపుడుబళ్ల దుకాణాల జాడే లేదు. ఎటు పోవాలో దిక్కుతోచక తడుస్తూ గేటు ముందు ఆగిపో యింది. పాత పోలీస్‌క్వార్టర్స్ వైపు వెళ్లి కాస్త గంజి అడుక్కుందామని నిశ్చయించుకుంది. అగ్నిపూల చెట్ల కిందికొచ్చాక కాలు కదలక అలా నిలబడిపోయింది.

వీధుల్లో ఎక్కడా జనసంచారం లేదు. నిన్న ఈ సమయానికి అక్కడ జననివాసాలుండేవి అంటే ఎవరూ నమ్మలేరు. అప్పుడే పశువుల సంత ముగిసినట్లుంది. ఆ ప్రాంతమంతా వదిలేసిన చింకి పాతలూ, పగిలిన కుండపెంకులూ, పెంటపోగుల్తో వానకి తడిసి పరమరొచ్చుగా ఉంది. గుడ్డితాత ఇటిక పొయ్యి మాత్రం నదిలో సగం మునిగి ధ్యానంలో ఉన్న యోగిలా ఉంది.

గంగ మనసు మార్చుకుని కుడిపక్కకి తిరిగి స్టేషన్లోకి నడిచింది. అడుగు తీసి అడుగేస్తుంటే కుడి డొక్కలో కలుక్కుమంటోంది. అది ఆకలినొప్పని ఆమెకి తెలుసు. పస్తులుండడం ఆమెకి కొత్తేమీ కాదు. కాని, ఈరోజు ఈ ఆకలి దుర్భరంగా ఉంది. బిడ్డ కదలని స్పృహ ఆమె గుండెని నొక్కేస్తోంది. కొత్తగా కట్టిన స్టేషను ఆవరణలోకి అడుగు పెడుతూనే ఒక నిర్ణయానికి వచ్చి, ఆమె కళ్లు గన్నిగాడి కోసం వెతికాయి. ఈ చివరి నుంచి ఆ చివరి దాకా కాళ్లీడ్చుకుంటూ తిరిగింది గంగ. 'ఒకవేళ అవతల ప్లాట్‌ఫాం మీదున్నాడేమో,' అనుకుంది. బ్రిడ్జి ఎక్కి దిగే ధైర్యం చెయ్యలేక పోయింది.

ఏదో బందొస్తున్నట్టుంది. స్టేషన్లో అలజడి పెరిగింది.

ఆ జనం మధ్య పిచ్చిదాన్లా తిరుగుతోంది గంగ. మధ్య మధ్య క్రీనీడలో నిలబడి కడుపు తడిని చూసుకుంటోంది. ఊహు, బిడ్డలో చలనం లేదు. ఆమె అమ్మ మనసు తల్లడిల్లిపోతోంది. ఇంకా నేల మీద పడని, రూపం కూడా తెలీని బిడ్డ కోసం ఆమె హృదయం ఒకటే కొట్టుకుంటోంది. ఇప్పుడింక వాణ్ణి బతికించుకోవడానికి ఏం చెయ్యడానికైనా సిద్ధమే!

టీ తాగే డబ్బులైనా దొరుకుతాయేమోనని ప్రయాణీకులు ఒకళ్లిద్దరు దగ్గర చెయ్యి చాప బోయింది. అలవాటు లేని పని. ఆమె చెయ్యి వెనక్కి వచ్చేస్తోంది. బండొచ్చే తొందర్లో ఎవరూ గంగని పట్టించుకోవడం లేదు.

ఒకళ్లిద్దరు పోర్టర్లని గన్నిగాడి కోసం అడిగి చూసింది. పొద్దుపోయేక ఆణ్ణెవరూ చూళ్లే దన్నారు. అన్నోరంగాడైతే, 'ఏంటీ సంగతి,' అని కన్నుకొట్టి వెకిలిగా నవ్వేడు. దిక్కుతోచక గుడ్డ నీళ్లు కుక్కుకుంటూ క్రీనీడలో అలాగే చతికిలబడిపోయింది. వాన కొంత తెరిపిచ్చింది. 'తొమ్మిదో పదో అయ్యుంటాది,' అనుకుంది గంగ. పాత బ్రిడ్జి మీంచి రోకలిబండలాగా పొక్కుంటా వచ్చిన బండి కీచుమని గోల పెడుతూ స్టేషన్లో ఆగింది. ఆగిన బండిలోంచి రెండు సూట్‌కేసులు నెత్తిన పెట్టుకుని దిగేడు గన్నిగాడు. 'ఇంటికెళ్లి కూడు తిని వస్తన్నాడన్నమాట,' అనుకుంది. సత్తు కంచంలో తెల్లగా మల్లెపూలలాగా విచ్చుకున్న అన్నం కళ్ల ముందు కదిలింది గంగకి. ఆకలి రెట్టింపయింది.

బండెళ్లిపోయేక స్థిమితంగా గంగ కూచున్న చీకటిస్తంభం దగ్గరికొచ్చేడు గన్నిగాడు. "సందేల నించి నన్నడుగుతున్నావంట, ఏంటి సంగతి." అన్నాడు కళ్లు చికిలించి చూస్తూ. వెలుగులో నిలబడి ఉన్న వాడి కళ్లు ఎర్రజీరల్తో చిరతపులి కళ్లలా మెరుస్తున్నాయి. వాడు తాగి ఉన్నాడని అర్థమైంది గంగకి.

"ఏటి సెప్పవేటి," అన్నాడు వాడు విసుగ్గా. పొద్దున్న గంగ చూసిన ఛీత్కారపు చూపింకా మర్చిపోలేదు వాడు.

వీలైనంత అణకువని గొంతులోకి తెచ్చుకుని జాలిగా అంది గంగ- "ఏంలేదూ... ఆకలి... ఆకలేత్తా ఉంది. ఒక బన్నూ, కాసిన్ని టీ నీళ్లూ కొనిపెడతావేమోనని...' గంగ పరిస్థితి అర్థమైంది గన్నిగాడికి. ఆకలెలాంటిదో వాడికి బాగా తెలుసు.

"సరే, కొని పెడతాననుకో, నాకేటి లాబం?" అడిగేడు కసిగా.

గంగ ఒక్క నిమిషం మౌనంగా ఉంది. తర్వాత తెగించిన దానిలా అంది, "నీకేం కావాలో తీసుకో..." ఆమె స్వరం కీచుగా జీరబోయింది.

"అవితే నాతో రా," ఎగిరి గంతేసినంత హుషారుగా అన్నాడు గన్నిగాడు.

లేచి వాడి వెనకే నడిచింది గంగ. ఇంకా తవ్వుతూ తవ్వుతూ ఉన్న అండర్‌గ్రౌండు గుయ్యారంలోకి వాడు దారి తియ్యడం చూసి ఆగిపోయింది.

"ఉప్పుడు కాదు... ముందు నాకు తిండి కావాల."

గన్నిగాడు వెనక్కి తిరిగి నోట్లో బీడీ తుపుక్కున ఉమ్మేసేడు.

"అదేం కుదర్దు. ముందు నా అవసరం తీరేకే నీ ఆకలి తీరతాది," నిర్ణయించుకో అన్నట్లు నిర్లక్ష్యంగా చూసేడు. వాడి గొంతులోని పట్టుదల అర్థమైంది గంగకి.

నిస్సహాయంగా కదిలింది. మోకాళ్ల లోతున్న వాననీళ్లలోంచి చీకట్లోకి నడిచి నాలుగేళ్లుగా పెంచుకున్న కసితో ఒక్కసారిగా పులిలా మీదికి లంఘించిన గన్నిగాడి బరువుకి మొదలు నరికిన చెట్టులా వెల్లకిలా పడిపోయింది గంగ.

వెన్నులో ఫెటిల్లుమని ఏదో చిట్టినట్లైంది.

పదిలంగా గుండెలకి హత్తుకున్న గాజుపళ్లెం విరిగి వెయ్యి ముక్కలైంది.

*ఆంధ్రజ్యోతి వారపత్రిక*
*28 డిసెంబర్ 1992*

## నేపథ్యం

అపురూపమైన జ్ఞాపకం

# గాజుపళ్లెం

***చిత్రంగా చిన్నచిన్న సెంటిమెంట్లు కూడా స్త్రీల జీవితాల్లో ముఖ్యపాత్ర వహిస్తుంటాయి. అమ్మ ఇచ్చిన పచ్చడి రాచ్చిప్పనో, అమ్మమ్మ ఇచ్చిన రాగిపాత్రనో అపురూపంగా జీవితాంతం కాపాడుకొన్నవాళ్ళు నాకు తెలుసు. అనుకోకుండా అవి పోతే కృంగి కృశించిపోయి, అలా పోగొట్టిన వాళ్ళను వేధించుకు తిన్నవాళ్ళను నేను చూశాను.***

Woman wants bread not the ballot అన్నమాటే చెల్లుతోందింకా మన పల్లెల్లో. కారణం lack of education. స్త్రీల సమస్యల్ని స్త్రీలే వ్రాయాలా? అలాంటి నియమం ఏం లేదు. కానీ, ఎవరి సమస్యలు వాళ్ళకే సరిగ్గా అర్థమౌతాయని నేననుకొంటాను. ముల్లు గుచ్చుకున్న వాడి బాధ ఎదుట ఉండి సానుభూతి కనబరచేవాడికి పూర్తిగా అనుభూతం కాదుకదా! అలా సానుభూతితో గొప్ప కథలు వ్రాసిన రచయితలందరికీ నా అభివందనలు.

ఏ వర్గంలోనైనా స్త్రీలు పీడితులే. భర్తల నుంచో, బంధువర్గం నుంచో, సమాజం నుంచో స్త్రీలు ఎదుర్కొంటున్న పీడన వారికే పూర్తిగా అనుభూతిలోకొస్తుంది. అట్టడుగు వర్గాల స్త్రీలు పై మూడు వర్గాల నుంచే కాక పై తరగతి, మధ్యతరగతి, చివరికి తమతోటి వర్గాల స్త్రీల నుంచి కూడా పీడన నెదుర్కోవాల్సి వస్తుంది. *గాజు పళ్ళెం* కథ అలాంటి బడుగువర్గాల స్త్రీలకు చెందినది.

'రంజని' పోటీకి కథ వ్రాయాలని నేను కాగితాలు, కలం పట్టుకొని కూర్చున్నప్పుడు బాల్యం నుంచి నన్ను ఇన్‌స్పైర్ చేసిన స్త్రీలెందరో నా కళ్ళ ముందు కదల సాగారు. బిడ్డ (మా తండ్రి) భూమి మీద పడిన మూడు నెలలకే భర్తను పోగొట్టుకొన్న మా నాయనమ్మ మొదటిది. కాయకష్టం చేసి కొడుకును పెంచింది. పదిహేనేళ్ళ వయసు నుంచీ పసిబిడ్డను పొదువుకొని పూరిపాకలో ఎన్నెన్ని నిద్రలేని దీర్ఘరాత్రుల్ని గడిపిందో కథలు కథలుగా చెప్తూ ఉండేది. వార్థక్యంలో కూడా అంత అందంగా

అన్పించే నాయనమ్మ వయసులో ఇంకెంత బావుండేదో, ఆ సౌందర్యం ఆమెనెన్ని ఇబ్బందులు పెట్టిందో నేనూహించుకొనేదాన్ని.

మా వీధిలో- మూడో పెళ్ళి ముసలాణ్ణి పెళ్ళాడి పూజలు, పునస్కారాల్తో కాలం గడిపే బుచ్చి రాజత్త, తాగుబోతు మొగుణ్ణి ఇంట్లోంచి వెళ్ళగొట్టి గయ్యాళి అనే బిరుదును మోసే నాగత్త, వయసు ముదిరినా బిడ్డలు కలగక రోళ్ళకూ రోకళ్ళకూ పూజలు చేస్తూ, ఎప్పుడూ పసుపులో మునిగి తేలే అచ్చమ్మత్త, రాత్రి తాగొచ్చిన మొగుడి చేత తన్నులు తినేసి, పగలు నవ్వుతూ తుళ్లుతూ తిరిగే సత్యవతి పిన్ని, మొగుడితో సమంగా తనూ తాగేసి వీధంతా వీరంగం చేసే వీర ముష్టి భద్రమ్మ, బాల్యంలోనే వితంతువైనా తెల్లారేసరికి దట్టంగా పౌడరు రాసుకొని, మంచిచీర కట్టుకొని నిరంతరం వీధరుగు మీద కూర్చునే సుబ్బలక్ష్మక్క, అత్తగారూ, కట్టుకొన్నవాడూ బైటికి రానీక గడప లోపల్నుంచి గడియకోసారి వీధిలోకి తొంగిచూసే రాజ్యం పిన్ని, ఒక్కగానొక్క కొడుకూ నాటకాలంటూ ఊళ్ళు పట్టిపోతే గుడిసెలో ఒక్కత్తీ గంజి కాసుకొని తాగే బుల్లచ్చి మామ్మ- ఇంకా నా బాల్యం చుట్టూ అల్లుకొన్న ఎందరెందరో కళ్ళల్లో మెదిలేరు. వీళ్ళెవరూ నాకు బంధువులు కారు. కానీ ప్రతిరోజు పలకరించి, పలవరించే ఆత్మబంధువులు. నేనే కథ వ్రాయబోయినా వాళ్ళంతా నా భావనలోకొచ్చి నిలుస్తారు.

నా బాల్యంలో నేనెరిగిన ఎందరెందరో స్త్రీల జీవితాలు నన్నింకా కుదుపుతూనే ఉన్నాయి. అలా నేనెరిగిన ఓ స్త్రీ జీవితమే *గాజుపళ్ళెం* కథకు మూలం. రంజని అవార్డు పొంది, నాకు గుర్తింపు తెచ్చిపెట్టిన ఆ కథ నాకిష్టమైన నా కథల్లో ఒకటి.

కథలోని పాత్రల గురించి ప్రస్తావించే ముందు నేను పెరిగిన వాతావరణాన్ని కూడా మననం చేసుకోవాల్సి ఉంది.

ఆనాటికి మా కులవృత్తి మేకల్ని పెంచడమే అయినా మా బంధువర్గం ఎవరూ అనుసరించ లేదెందుకోమరి! మా తండ్రి జ్ఞాతుల నుంచి దూరంగా వచ్చేసి, చిన్నగా ప్రారంభించిన సైకిళ్ళు, పెట్రోమాక్స్ లైట్ల వ్యాపారం కలిసొచ్చి నాకు ఊహ తెలిసేనాటికి మా ఇల్లు పాడిపంటల్తో కళకళ లాడుతూ ఉండేది.

తూర్పు గోదావరి జిల్లా అటవీముఖ ద్వారంలోని జగ్గంపేట నేను పుట్టి పెరిగిన ఊరు. ఇప్పుడైతే రకరకాల పరిశ్రమల్తో, టైల్స్ ఫేక్టరీల్తో ఓ మాదిరి టౌన్‌గా మారింది కాని, నా బాల్యం నాటికి చిన్న పల్లెటూరది. నా పదిహేనవ ఏట పెళ్ళై అత్తవారింటికి రాజమండ్రి వెళ్ళినా మావారి ఉద్యోగరీత్యా తిరిగి ఈ ఊరికే రావాల్సి వచ్చింది. ఉబుసు పోకకు కొంతా, ఆర్థికావసరాల వలన కొంతా ప్రారంభించిన స్కూలు వృద్ధి కావడంతో ఇక్కడే స్థిరపడడం జరిగింది. అలా ఈ ఊరితో నా అనుబంధం పెనవేసుకొంది.

నా బాల్యంలో- మధ్యాహ్నం భోజనాలు ముగిసేక మా వీధి స్త్రీలంతా పిచ్చాపాటీ కబుర్ల కోసం మా ఇంటికొచ్చేవారు. నేను మా అమ్మను అంటిపెట్టుకొని కూర్చుని వాళ్ళ కబుర్లన్నీ వింటుండేదాన్ని. అలా వాళ్ళందరి జీవితాల్లోని ఎన్నెన్నో సంఘటనల్ని వినడం జరిగింది. నాలో సాహిత్యాభిలాష వేళ్ళూనుకోడానికి కారణం వాళ్ళేనని చెప్పాలి. మధ్యాహ్నం స్కూల్ టైమ్ అయ్యే లోపల నాచేత కథల పుస్తకాలో, లక్ష్మమ్మ కథలాంటి ద్విపద కావ్యాలో చదివించుకొని వింటుండే వాళ్ళు. నేను మరో అడుగు ముందుకేసి ఎలిమెంటరీ స్టడీస్ ముగిసేలోగా శరత్‌నీ, రవీంద్రుడినీ దొరికినన్ని పుస్తకాలు చదివేశాను.

ఆ రోజుల్లో ఈ ఊరు కులాల పేర్లతో విభజింపబడి ఉండేది. మా తండ్రి కట్టిన కొత్త ఇల్లు ఊరికి చివర మాలపల్లె ఎదుట మెరక మీద ఉండేది. మా ఇంటికీ, మాలపల్లెకీ మధ్య

పుంత దారొకటి ఉండేది. వర్షాకాలంలో కొండల మీద కురిసిన వాననీరంతా ఈ పుంతదారి గుండా ప్రవహించి పూరిళ్ళన్నిట్నీ ముంచుకొంటూ పోయేది. వాటితోపాటు పల్లపు పొలాలలోని పంట లన్నిట్నీ తన వెంట తీసుకుపోయేది. మా తండ్రి కొన్న భూమి పల్లపుభూమి కావడంతో వ్యవసాయం ప్రారంభించిన కొద్దికాలంలోనే ఆర్థికంగా దెబ్బ తినడం జరిగింది. ఆ సంగతలా ఉంచితే వర్షాల సమయంలో మాలపల్లె వాళ్ళంతా గిన్నెలూ, గుడ్డలూ మూటకట్టుకొని మెరకగా ఉన్న మా ఇంటివైపు వచ్చి, నీరు తీసిపోయాక తిరిగి వెళ్ళేవాళ్ళు. ప్రభుత్వం దళితుల కోసం ప్రత్యేకంగా ఇళ్ళని కేటాయించి ఇచ్చేవరకు అదలాగే కొనసాగింది. ఇప్పుడైతే బోర్‌వెల్స్ వచ్చాయి కాని, సముద్ర తీరానికి నలభై మైళ్ళ దూరంలో ఉన్న ఆ ఊరి భూముల్లో మూడొంతులు వర్షాధార భూములే ఆనాడు. ఎప్పుడు చూసినా అతివృష్టి లేదా అనావృష్టి. అందుకనే కాబోలు కొద్దో గొప్పో భూములున్న రైతులు కూడా ఏదో ఒక వ్యాపారాన్ని నమ్ముకొని ఉండేవారు. పాదరసం, పాదరసాన్ని నింపే గాజు కుప్పెలూ, వివిధ వనమూలికలూ, చింతపండులాంటి అడవుల్లో లభించే దినుసులూ ఇక్కడి ముఖ్య వ్యాపార వస్తువులు. మా ఇంటి చుట్టుపట్ల ఎన్నో ఇళ్ళల్లో ఇంటిల్లిపాదీ ఆయుర్వేదం మందుల తయారీలో నిమగ్నమై ఉండేవారు. ఆ మందుల మూటల్ని భుజాన వేసుకొని మగవాళ్ళు దూరదూర ప్రాంతాలకు అమ్మడానికి వెళ్ళి నెలల తరువాత తిరిగొచ్చేవాళు ళ్ళ. ఈ లోపల కుటుంబం మంచిచెడ్డలన్నీ ఆడవాళ్ళు చూసుకోవాల్సిందే.

ఈ ఊరు నేషనల్ హైవేలో ఉండడం వలన కొంతా, ఇక్కడి నుంచే అటవీ ప్రాంత ప్రారంభం కావడం వలన కొంతా వ్యాపారాన్ని నమ్ముకొన్నవాళ్ళు అధిక భాగం ఆర్థికంగా బాగు పడ్డారు. ఈ వ్యాపార సంస్కృతి ప్రభావమే ఈ ప్రాంతాలలో స్త్రీ కూడా విలాసవస్తువుల్లో ఒకటిగా భావింపబడడం.

నా చుట్టుపక్కల స్త్రీలెందరో సవతి పోరును పళ్ళ బిగువన భరించడం, లేదా ఉంపుడు కత్తెలుగా వచ్చి ఊడిగాలు చేయడం నాకు తెలుసు.

చిత్రంగా చిన్నచిన్న సెంటిమెంట్లు కూడా స్త్రీల జీవితాల్లో ముఖ్యపాత్ర వహిస్తుంటాయి. అమ్మ ఇచ్చిన పచ్చడి రాచ్చిప్పనో, అమ్మమ్మ ఇచ్చిన రాగిపాత్రనో అపురూపంగా జీవితాంతం కాపాడుకొన్నవాళ్ళు నాకు తెలుసు. అనుకోకుండా అవి పోతే కృంగి కృశించిపోయి, అలా పోగొట్టిన వాళ్ళను వేధించుకు తిన్నవాళ్ళను నేను చూశాను. కష్టంలో, దుఃఖంలో ఎదుటి స్త్రీని అక్కున చేర్చుకొని ఆదరించే స్త్రీలే విరోధం వచ్చినపుడు ఒంటరిని చేసి స్త్రీకి స్త్రీయే శత్రువన్నట్టు ప్రవర్తించడం నేనెరుగుదును.

మాలపల్లెలోని ఎందరెందరో తగవులు, కుటుంబకలహాలు తీర్చమని మా తండ్రి దగ్గరికి రావడం నుంచి, బాల్యంలో వాళ్ళే నన్నెక్కువ ముద్దుచేయడం, వాళ్ళ ఇళ్ళకు తీసుకువెళ్ళడం నుంచి నేనెందరి బడుగు జీవితాల గాథలనో వినడం, చూడడం జరిగింది. ఇక మా నాన్నమ్మ వెంట మా పాత ఇల్లున్న గొల్లపేటకు వెళ్తే నాకు రెండు తరాల ముందు నాటి కథలూ కబుర్లూ వినే అవకాశం కలిగేది. నేను స్కూలు ప్రారంభించేక ఎందరో తల్లులు తమ గోడును నా ముందు వెళ్ళబోసుకోగా విన్నాను. అలా విన్న, చూసిన కథే *గాజుపళ్ళెం* కథ.

ఏ కథైనా కొంత కల్పన లేకపోతే రాణించదు. ఈ కథావస్తువు ఎప్పట్నుంచో రాయాలని మనసులో ఉన్నా ఎలా మొదలుపెట్టాలో స్ఫురించేది కాదు. 1991లో కాబోలు రాజమండ్రి గౌతమి గ్రంథాలయంలో ఎవరిదో పుస్తకావిష్కరణ జరిగింది. స్మైల్, శివారెడ్డి, ఆశారాజు మొదలైన కవిమిత్రులంతా వచ్చారు. మర్నాడు ఉదయం పదిగంటలకు దామెర్ల ఆర్ట్ గేలరీలో కవి సమ్మే

ళనం జరుగుతుందని, ఆసక్తి ఉన్నవాళ్ళందరినీ రమ్మని సభలో ఎనౌన్స్ చేశారు. ఆర్ట్ గేలరీ ఎక్కడుందని అడిగితే, 'ఆనెం కళాకేంద్రం దగ్గర,' అన్నారెవరో. మర్నాడు ఉదయం నేనూ, మా గీతా కళాకేంద్రం చేరుకొని ఫ్రంట్ గేట్లో వెయిట్ చేయడం మొదలుపెట్టాం. కవిమిత్రులెవరూ కనిపించలేదు కానీ మనసును పట్టి ఊపిన ఓ దృశ్యం కంటపడింది. అక్కడున్న తురాయిపూల చెట్టుకింద ఇరవైయేళ్ళలోపు బక్కచిక్కిన అమ్మాయి ఒకత్తె కటిక నేల మీద, తలకింద చేయి పెట్టుకొని గాఢంగా నిద్రపోతోంది. పారాడే పిల్లాడొకడు అప్పటివరకు పాలు తాగినట్టున్నాడు. ఆచ్ఛాదనలేని ఎద నలాగే వదిలేసి, సొట్టలు పడిన సత్తుగిన్నెను నేలకేసి కొడుతూ ఎండలో ఆడుకొంటున్నాడు. ఆ సత్తుగిన్నె చప్పుడు ఆమె నిద్రను ఏమాత్రం భంగం చేయడంలేదు.

ఇంతలో, ఆర్ట్ గేలరీ కళాకేంద్రానికి వెనుకవైపు ఉందని ఎవరో చెప్పారు. కళా కేంద్రానికీ, ఇప్పుడు కొత్తగా కట్టిన గోదావరి స్టేషన్ ఫెన్సింగ్‌కీ మధ్య చిన్న రోడ్డొకటుంది. ఆ రోడ్లో నెమ్మదిగా నడుచుకొంటూ ఆర్ట్ గేలరీ వైపు బయలుదేరాం. ఆ రోడ్డుకటూ ఇటూ అగ్నిపూల చెట్ల కింద అసంఖ్యాకంగా తడికల్తో, గోనెపట్టాల్తో కట్టిన గుడిసెలుండేవి. ఇప్పుడు చూస్తే తీసేసిన గుడిసెల ఆనవాళ్ళు తప్ప మరేం లేవు. ఎవర్నో అడిగితే చెప్పారు- 'పుష్కరాలొస్తున్నాయి కదా, అందుకే గుడిసెల వాళ్ళందరినీ లేపేసి క్వారీలవైపు పంపేసే'రని. కవి సమ్మేళనం ముగిసేలోపల ఆ రెండు సంఘటనల అన్వయంతో నా మనసులో కథ మొత్తం రూపుదిద్దుకొంది. *గాజుపళ్ళెం* కథ కళా కేంద్రానికీ, గోదావరి స్టేషన్‌కీ మధ్య నడుస్తుంది. మధ్యాహ్నం ఎండలో మొదలైన కథ రాత్రి చీకట్లో ముగుస్తుంది.

*గాజుపళ్ళెం* కథ టూకీగా ఇది- ఓ చెట్టుకింద కంకరగుట్ట మీద నెలలు నిండిన గంగ పడుకొని నిద్రపోతూ ఉంటుంది. రెండు బుల్లి చేతులు వింటిని ఎక్కుపెట్టడానికి ప్రయత్నిస్తున్నాయి ఎప్పట్నుంచో. హమ్మయ్య, ఆ చేతుల ప్రయత్నం ఫలించింది. బాణాన్ని వింటికి సంధించి లాగి... లాగి... వదిలేశాయ్. "అబ్బా..." అంటూ కథ ప్రారంభమౌతుంది. బిడ్డల్ని కన్న స్త్రీలందరికీ బిడ్డ కడుపులో కదులుతున్నప్పుడు ఇలాగో, దానికి దగ్గరగా మరోలాగో కలలు రావడం అనుభూతిలోకొచ్చి ఉంటుంది.

గంగకి మెలకువొచ్చి చూసేసరికి స్టేషన్ ఫెన్సింగ్ నానుకొని పోర్టరు గన్నిగాడు బీడీ తాగుతూ, ఆకలి కళ్ళతో గంగని తినేసేలా చూస్తుంటాడు. అప్పటికి ఆకలి ఉధృతంగా లేదు కాబట్టి, 'ఛీ ఎదవా,' అని తిట్టుకొని అటు తిరిగిపోతుంది- గతంలో కెళ్తే పదహారేళ్ళ గంగ ఊహ తెలిసినప్పట్నుంచీ అడవినీ, అడవిలోని కొండల్ని కొట్టి రాళ్ళ గుట్టలుగా మార్చే జనాన్ని చూస్తూ పెరుగుతుంది. ఊరూరా తిరిగి పాత గిన్నెలకి మాట్లు వేసే నలభైయేళ్ళ రాజయ్య పట్నం గురించి, అక్కడి విలాసాల గురించి చెబుతుంటే లోకం మరిచిపోయి కలల్లో తేలిపోతుంది. గంగ తండ్రికీ, రాజయ్యకీ కల్లుముంతల స్నేహం ముదిరి, రాజయ్య అడగగానే గంగనిచ్చి చెయ్యడానికి ఒప్పుకొంటాడు. తల్లి మందలించినా, పట్నం చూడాలనే ఉబలాటంలో ఉన్న గంగ ఇష్టపడి తాళి కట్టించుకొని రాజయ్య వెంట రాజమండ్రి వస్తుంది. తను ఎంతో ఇష్టపడి కొనుక్కొన్న గాజుపళ్ళెం వెంట తెచ్చుకొంటుంది. గుడిసె గుమ్మంలో అడుగుపెట్టకముందే అర్థమౌతుంది రాజయ్య కీవరకే పెళ్ళాం, పిల్లలూ ఉన్నారని, రాజయ్య పెళ్ళాం ఎదుట పిల్లి అని. వెనక్కి వెళ్ళలేక, ఏం చెయ్యాలో తోచక రాజయ్య పెళ్ళాం బోడెమ్మకీ, పిల్లలకీ చాకిరీ చేస్తూ వాళ్ళతో కలిసిపోతుంది. బజార్లో బరువులు మోసే పని చేస్తూ ఆ కుటుంబాన్ని పోషిస్తుంటుంది. రాజయ్యతో వచ్చిన నాలుగేళ్ళకి గంగ గర్భవతవుతుంది. అనుకోకుండా తాగుబోతు రాజయ్య అనారోగ్యంతో మరణిస్తాడు.

గంగకి బతుకులో కష్టం అనే పదానికి అర్థం తెలీదు. గోదావరి పుష్కరాల సందర్భంగా తీసేసిన గుడిసెల స్థానంలో ఇళ్ళస్థలాల పట్టాలిస్తున్నారని తెలిసి అందరూ వెళ్ళిపోయే తొందర్లో ఉంటారు. బోడెమ్మ కొడుకు తడక గుంజబోతే *గాజుపళ్ళెం* అంచు పగులుతుంది. ఆ కోపంతో వాడిని రెండు వాయిస్తుంది గంగ. పెద్ద గొడవ జరిగి, గంగను ఒక్కదాన్నీ వదిలేసి అందరూ వెళ్ళిపోతారు.

అంతవరకు ఎంతో ధైర్యంగా జీవితాన్నెదుర్కొన్న గంగ ఒంటరితనం భరించలేక డీలా పడిపోతుంది. కడుపులోని బిడ్డ ఆకలికి లుంగలు చుట్టుకుపోతుంటే పని దొరకక, యాచన చేతకాక గన్నిగాడికి లోబడిపోతుంది. వాడు నెట్టిన నెట్టుకి గాజుపళ్ళెం పగిలి ముక్కలవుతుంది.

అప్పట్లో ఓ దినపత్రికలో 'పుష్కరాల సందర్భంగా రాజమండ్రి ఒంటిమీది కురుపుల్లాంటి ఆక్రమిత పూరి గుడిసెల్ని సమూలంగా పెకలించెయ్యదల్చుకొన్నారు,' అన్న వార్త వచ్చింది. ఆ వాక్యాన్ని యథాతథంగా నేనీ కథలో వాడాను. పూరి గుడిసెల్ని కురుపులనడం నాకు న్యాయంగా తోచలేదు.

అమాయకపు ఆడపిల్లలు పునాది లేకనే గాలిలో సౌధాలు నిర్మించుకొని, అవి కూలిపోతే కుప్పకూలిపోవడం చూస్తున్నాం. అలాకాక, జీవితాన్ని ధైర్యంగా ఎదుర్కోవాలనుకొన్న గంగలాంటి వాళ్ళని పరిస్థితులు ఎలా నిస్సహాయత వైపు నెట్టుకెళ్తున్నాయో చెప్పాలనుకొన్నాను *గాజుపళ్ళెం* కథలో.

ఈ కథ చదివి, అభిమానులు, మిత్రులు రాసిన ఉత్తరాల నుంచి చెప్పదల్చుకొన్న విషయాన్ని సంతృప్తికరంగా చెప్పానని నమ్ముతున్నాను.

ఈ కథ 1992లో రంజని అవార్డు పొంది, 28.2.1992 ఆంధ్రజ్యోతి వీక్లీలో *ఈవారం కథ*గా వచ్చింది. ఎ.జి. ఆఫీసువారి మంచి కథల సంకలనంలో వచ్చింది. నా కథల సంపుటి *జీవనరాగం*లో ముద్రింపబడింది. తూర్పు గోదావరి జిల్లా రచయితల సంకలనంలో కూడా వచ్చింది.

*18 జనవరి 1998*

13

# గుడ్డివాని చేతికర్ర

## గీతాంజలి



*గీతాంజలి* 1964 సెప్టెంబర్ 27న హైదరాబాద్‌లో జన్మించారు. మూడు కథా సంపుటాలు, రెండు నవలలు ప్రచురించారు. వివిధ సామాజిక ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. మానసిక చికిత్సా నిపుణులు.


**చిరునామా**

127, శ్రీశ్రీ అవెన్యూ, గుర్రంగూడ
విలేజ్, రాగన్నగూడ, సాగర్ రోడ్
రంగారెడ్డి జిల్లా - 501 510
Ph: 98497 70409
bharathi_1964@yahoo.co.in


"నాకెప్పుడూ ఏదో భయం భయంగా ఉంటుందండీ. నేనో లోయలో పడిపోతున్నట్లుగా కలలొచ్చి నిద్రలో భయంతో లేచిపోతానండీ. ఆ సమయంలో ఒళ్లంతా చెమటలూ, గుండెదడా పెరిగిపోతాయండీ డాక్టరు గారూ... మీరు ఇలాంటి భయాలు పోగొడతారట కదా?" వెంకటేశ్వరరావు అడుగుతున్నాడు ఆందోళన నిండిన మొఖంతో.

డాక్టర్ సూర్యకుమారి అతని మొఖాన్ని పరిశీలనగా చూసింది. మొఖమంతా చెమటతో నిండి ఉంది. సూర్యాస్తమయం తర్వాత దిక్కుతోచక వాడిపోయిన సూర్యకాంతి పువ్వులా ఉంది అతని మొఖం. ముఖవర్ఛస్సూ, కనుముక్కు తీరూ అంతా బాగానే ఉంది. చక్కని పలువరుసతో నవ్వితే సంగీతం నవ్వుగా విడిపోయినట్లే ఉంటుంది. కానీ కళ్ల స్థానంలో అతుక్కుపోయిన కనురెప్పలు మాత్రం వర్షానికి తడిసి నేలకు అంటుకుపోయిన పొడవాటి తుమ్మ ఆకుల్లా ఉన్నాయి. అతను పుట్టుగ్రుడ్డి! డా. సూర్యకుమారి ఆరేళ్ల కూతురు అంజలి సంగీతం మాస్టారు. కమ్మని తెలుగుభాషని సంగీతంగా, పాటలుగా ఎలా పాడాలో నేర్పే గురువు!

డా. సూర్యకుమారి వాళ్లు మలక్‌పేట క్వార్టర్స్‌కొచ్చి దాదాపు ఆరునెల్లు అవుతోంది. ఎక్కడ చూసినా పచ్చని వృక్షాలతో ఒక వనంలా ఉంటుంది కాలనీ అంతా! ప్రశాంతంగానూ ఉంటుంది. డా. సూర్యకుమారి మానసిక వైద్యురాలు. మెల్లగా ప్రాక్టీసు పికప్ అవుతోంది. ఈ కాలనీకొచ్చిన కొత్తల్లో డా. సూర్యకుమారికి ఆశ్చర్యాన్ని కలిగించేవి కొన్ని దృశ్యాలు. డా. సూర్యకుమారి ఇంటి ముందు నుంచి వెళ్లే రోడ్డు సరాసరి రోడ్డుపైని క్రాస్‌రోడ్స్‌లోకి కలుస్తుంది. ప్రతి ఐదు నిమిషాలకి ఒకసారి ఆ రోడ్డు మీద నుంచి గుడ్డి మనుషులు కర్ర సాయంతో... నల్ల కళ్లద్దాలు పెట్టుకుని నడిచి వెళ్లేవారు. సాయంత్రం అయితే చాలు వీళ్ల దర్శనం ఎక్కువయ్యేది. జాగ్రత్తగా కర్ర సాయంతో మెల్లగా ఆచితూచి తన సమస్త ఇంద్రియజ్ఞానాన్ని కర్రలో నింపినట్లుగా భద్రంగా దాన్ని ఎత్తి నేలకు మెల్లగా తాటిస్తూ అడుగులు వేస్తూ వెళ్తూ ఉండేవారు. కాలనీలో చాలామంది గుడ్డి వాళ్లుండడం డా. సూర్యకుమారికి ఆందోళన కలిగించింది. కొన్ని రోజులైనాక తెలిసిందామెకి, కాలనీ పక్కనే ఒక స్టేజీ దూరాన చెవిటి, గుడ్డివాళ్ల స్కూలు ఉందని. డా. సూర్యకుమారి ఇంటి పక్కనే వెంకటేశ్వర రావు వాళ్ల క్వార్టరు ఉండేది. పక్కనే కాబట్టి రోజూ వాళ్ల ఇంటికి సంగీతం నేర్చుకోవడానికి పంప వలసి రావడంతో డా. సూర్యకుమారికి ఆ ఇంటి విషయాలు ఎక్కువగా తెలియడం జరిగింది.

వెంకటేశ్వరరావు గవర్నమెంటు స్కూల్లో సంగీతం మాస్టారు. ముప్ఫయి రెండేళ్లుంటాయి. భార్య చక్కగా ఉంటుంది. డా. సూర్యకుమారికి తెలిసిన సమాచారాన్ని బట్టి మింగ మెతుకు లేని కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి. పెరట్లో బాత్రూం దగ్గర బ్రష్‌పై పేస్ట్ వేసి, దగ్గరే నిల్చుం టుంది తోమేంత వరకూ! చేతుల్లో నీళ్లు పోస్తుంది నోరు, ముఖం కడుక్కోవడానికి. ముఖం కడు క్కున్నాక టవలందించి, ఇంటి చావిడిలోకి తీస్కెళ్లి ఈజీ ఛెయిర్‌లో కూర్చోబెట్టి, చేతిలో రేడియో పెట్టి లోనికెళ్లి వేడివేడి టీ చేసి తీస్కొచ్చి ఇస్తుంది. లోపల వంట చేస్తూనే మళ్లీ అతన్ని బాత్రూం వైపుకి తీస్కెళుతుంది, స్నానానికి! దాదాపు తనే స్నానం చేయిస్తుందేమో అనిపిస్తుంది. భోజనం తనే చేస్తాడేమో! కారియర్ ఉన్న బాగ్ అతని భుజానికి ఉంటుంది. ఇంటికి తాళం వేసి అతని మడిచిన మోచేతిని తన మోచేతికి బిగించి మెల్లగా భర్తని తీస్కుని తమ ఇంటి ముందు నుంచి మెయిన్‌రోడ్ వైపుగా సాగిపోతుంది. భద్రంగా రోడ్డు దాటించి బస్సెక్కించి వస్తుంది. మళ్లీ మూడు గంటలకు బస్టాప్‌కు వెళ్లి భర్తను తీసుకొస్తుంది, చిన్నపిల్లల్ని తల్లి స్కూలు నుంచి తెచ్చి నట్టుగా. వెంకటేశ్వరరావు భార్య ముఖంలో ఎప్పుడూ ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు నీడలు కన్పిం చేవి. గుండెల్లోని దిగులంతా కళ్లల్లో ఘనీభవించి దీనంగా, కాంతిహీనంగా కన్పించేవి. ఆమె కళ్లు చాలా పెద్దవి. కానీ ఎవరో కళ్లకాంతినీ, అసలు చూపునే దొంగలించినట్లుగా ఉండేవి. ఆమె చూపులు నీరసంగా సీసపుగోళం నుంచి చూస్తున్నట్లుగా- గుడ్డి చూపుల్లా అన్పించేవి. ఆమె చూపు లెప్పుడూ నిర్జీవంగా అంధకార ప్రపంచంలో కాంతి కోసం వెతుకుతున్నట్లుగా అన్పించేవి.

ఆశ్చర్యంగా అందుకు భిన్నంగా వెంకటేశ్వరరావు ఎప్పుడూ అత్యంత హుషారుగా, చలాకీగా, ఏవో లల్లాయి పదాలు, సంగీతపు శృతులు, కూనిరాగాలు పాడుతూ వాటికి అనుగుణంగా తల ఊపుతూ, వేళ్లతో చిటికెలు వేస్తూ కాళ్లపై, ఛాతీపై చిన్నగా వేళ్లతో చరుస్తూ నిత్యం ఒక ఉత్తేజకర మైన జీవితాన్ని గడుపుతున్నట్లుగా ఉంటాడు. అతని మూసుకున్న కనురెప్పల్లోని చూపులు అతని నోటి నుంచి సంగీతంగా మారి బాహ్య ప్రపంచానికి దృష్టిగా మారిందా అన్పించేది. ఎప్పుడూ పిల్లలతో ఏవో జోకులు వేస్తూ, సరదాగా, అసలు గుడ్డితనం

వలన ఇసుమంత బాధ కూడా లేనట్లుగా అన్పించేది అతన్ని చూస్తే. అతని అణువణువులో ఆత్మవిశ్వాసం పొటై ప్రవహిస్తున్నట్లుగా అన్పించేది.

అతని భార్యని చూస్తే మాత్రం అతని చేతికర్రకీ ఆమెకీ ఆట్టే తేడా కన్పించేది కాదు. చెరువు గట్టున సంధ్యవేళ నీరసించిన రెల్లుకర్రలా సన్నగా, పీలగా ఉంటుంది ఆమె.

ఒక్కోసారి అంజలితో వెళ్ళి తనూ కూర్చునేది. ఒక్క అరగంటేగా అని. పైగా తనకి సంగీతం నేర్చుకోవాలన్న తృష్ణ చిన్నప్పుడు తీరనే లేదు. ఆ సమయంలో ఆమె అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది. తన్ని చూసి నీరసంగా, నిశ్శబ్దంగా నవ్వేది. ఆమెని చూస్తే బలవంతంగా నోరు నొక్కేసి మూగదాన్ని చేసినట్లుగా అన్పించేది. ఆమె కళ్ళ నుంచి అటువంటి భాషే ప్రవహించేది మూగగా.

"ఇదిగో... ఒసేయ్, నిన్నే... రాణీ! డాక్టరుగారికి ఓ కప్పు వేడి వేడి టీ పట్టుకురా," అనేవాడు. ఆమె తెచ్చిచ్చేది. అదే ధోరణిలో, 'ఒసేయ్'లు, 'నిన్నే'లు, 'నీ మొఖం మండా'లు అనుకుంటూ ముక్కుపొడుంలూ, నీళ్ల అవీ పత్రమ్మని హుకుంలు అధికార ధోరణిలో జారీ చేసేవాడు. ఆమె క్షణాల్లో తెచ్చేది. అసలామె అతని ఆజ్ఞలు శిరసావహించడానికి సిద్ధంగా ఉండే పరిచారికలా ఉండేది. ఒక్కోసారి పదినిమిషాల ముందే వెళ్లేవారు తనూ అంజలి. 'నీ ముఖం తగలెయ్య నీకసలు ఏమైనా తెలిసేడిస్తేగా, మా అమ్మ ఉండేది అన్నీ చిటికెలో చేసిచ్చేది. నువ్వూ ఉన్నావు, చేతకాని దద్దమ్మలా ఉంటం తప్పితే ఏమీరాదు. డిగ్రీ పాసవుతే చాలునా? ఒక్క మాట మాట్లాడవేమే! నోటికే మొచ్చిందీ,' అంటూనో, "ఏదీ నా కర్ర,' అనో, 'ఏదీ నా సంగీతప్పెట్టె,' అనో దబాయిస్తూ కన్పించేవాడు. మధ్యమధ్యలో, 'డాక్టరుగారూ మీ దగ్గరకు రావాలండీ,' అనేవాడు.

ఈరోజు తన వద్దకు వచ్చాడు. తననేవో భయాలు వెంటాడుతున్నాయనీ, తనకు చికిత్స కావాలనీ చెప్పాడు.

"మీ దగ్గర తప్పక తగ్గుతుందన్న నమ్మకం ఉందండీ," వెంకటేశ్వరరావు అంటుంటే డా. సూర్యకుమారి ఆలోచనల్లోంచి తేరుకుంది.

ఆ తర్వాత రోజు నుంచి అతనికి కావల్సిన సైకో-అనాలిసిస్ చికిత్స రిలాక్సేషన్ థెరపీ ఇవ్వడం జరిగింది. పదిహేను రోజుల్లో బాగయిపోయాడు. అన్ని భయాలు, టెన్షన్స్ పోయి మరింత ఉత్సాహంగా కన్పించసాగాడు.

*

ఒకరోజు పేషెంట్స్ వెళ్లిపోయాక భోజనం చేసి పేపరు తీస్కుని తీరిగ్గా చదువుతోంది డా. సూర్యకుమారి. ఇంతలో కాలింగ్‌బెల్ మోగింది. తలుపు తీస్తే ఎదురుగా వెంకటేశ్వరరావు భార్య రాణి. బిడియపడుతూ గుమ్మంలో నిల్చుండిపోయిన రాణిని లోపలికి ఆహ్వానించి కూర్చోమంది. మెల్లగా కూర్చుంటూ, ఉన్నట్లుండి చేతుల్తో ముఖం కప్పుకుని ఏడవసాగింది. సూర్యకుమారి కంగారుపడింది. "ఏమైంది? ఎందుకు ఏడుపు రాణీ. చెప్పు, ఏడ్వకు!" ఓదార్చింది. మంచినీళ్లు త్రాగించింది. సేదతీరాక-

"ఇక నా వల్ల కాదండీ," అంది రాణి.

"ఏమైంది చెప్పు. అసలు నీ బాధ ఏంటీ?" స్నేహంగా అడిగింది డా. సూర్యకుమారి.

చెప్పసాగింది. చెప్పేకొద్దీ ఆమె దుఃఖం ఎక్కువ కాసాగింది. వినేకొద్దీ సూర్యకుమారి ఆశ్చర్యమూ ఎక్కువయింది.

వాళ్ల పెళ్లయి రెండేళ్లయింది. బీదరికం వలన రాణిని వెంకటేశ్వరరావుకు కట్టబెట్టారు. విచిత్రం ఏమంటే రాణి సంగీతంలో డిగ్రీ చేసింది. చక్కగా పాడగలదు. సంగీతంలో దిట్ట. ఇద్దరూ

సంగీతజ్ఞానం ఉన్నవాళ్లేనని ఎలాగోలా బతకచ్చని సరిపుచ్చారు. తనూ సంగీతం క్లాసులు నడపాలనీ, తన ప్రతిభను చాటుకోవాలనీ, సంగీత ప్రదర్శనలు ఇవ్వాలనీ, స్వతంత్రంగా, ఆర్థిక స్వాతంత్ర్యంతో బతకాలనీ కలలు కంది. కానీ, వెంకటేశ్వరరావు అవన్నీ కల్లలు చేశాడు. ఆమెను ఏమీ చేయనివ్వడు. 'నాకంటే నీకు బాగా వచ్చా? నాకంటే బాగా పాడగలవా,' అంటూ ఎద్దేవా చేస్తాడు నిత్యం. 'నిన్ను చేస్కుంది నాకింత వంట చేసి పెడ్తావనీ. వీధులకెక్కి సంగీతకచేరీలు, గానసభలూ నిర్వహించడానికి కాదు. నన్ను చూస్కో చాలు,' అని నియంత్రించి ఆమెను ఇంటి నాలుగ్గోడల మధ్య బందీ చేశాడు. రెండు సంవత్సరాల క్రితం గవర్నమెంటు ఉద్యోగమూ వచ్చింది.

ప్రతిదానికీ, 'నీ ముఖం నీకేం తెల్సు?', 'నువ్వారుకో', 'వంటింట్లోకి తగలడు', 'లోనకు తగలడు', 'మూగిమొద్దా' అని నీచపరుస్తాడట.

ఆమె ఏడ్చీ ఏడ్చీ ఇక ఏడుపు రానట్లుగా ఆగిపోయింది. చెప్పీ చెప్పీ చాలా చెప్పాల్సినట్లుగా కానీ చెప్పలేకపోతున్నట్లుగా అలసిపోయినట్లుగా ఆగిపోయింది.

ఒక గ్రుడ్డివాడి కంటే కూడా ప్రతిభావంతురాలైన ఆమె కేవలం ఒక స్త్రీ కావడం మూలంగా ఆమె ప్రతిభ నాశనం కావడం బాధ కలిగించింది. నిరంతరం, ప్రతి క్షణం ఆమెపై ఆధారపడుతూ కూడా ఆమెనే ప్రతి క్షణం ఎద్దేవా చేసే అహంకారం అతనికి ఎక్కడ్నించి వచ్చింది? ఈ పురుషాహంకారం, భార్యల శక్తిసామర్థ్యాలను, సృజనాత్మకతను భరించలేనితనం దాదాపు చాలామంది పురుషుల్లో ఉంటుంది. కానీ, అవసరరీత్యా పూర్తిగా భార్యపై ఆధారపడుతూ, బయట ప్రపంచానికి, తనకీ ఏకైక వారధిగా తన నేత్రాల్లాగా మారి ప్రపంచాన్ని వీక్షించేలా చేస్తున్న రాణిపై కూడా ఆ ఆధిపత్యాన్ని చెలాయించడం ఎక్కడ్నించి నేర్చుకున్నాడు? సహజంగా ఆపాదించబడ్డ పురుషాహంకారం ఒకటైతే, తన శారీరక లోపాన్ని ఆమె ఎక్కడ న్యూనత పరుస్తుందో, అవమానపరుస్తుందో అన్న అంతర్గత భయాలు కలిగించే అభద్రతాభావం సృష్టించిన మానసిక వైకల్యమా? గుడ్డితనం వలన అంతర్గతంగా ఏవో భయాలకు లోనవుతూ కూడా ఆ భయాలను అధిగమించడానికి వాటిని దాచుకుంటూ, భార్యని అణచివేస్తూ, న్యూనతపరుస్తూ ఆమెని మానసికంగా కృంగదీస్తూ, ఆఖరికి... ఆఖరికి అన్ని అవయవాలూ సరిగ్గానే ఉన్నా, మానసికంగా ఆరోగ్యంగా ప్రతిభావంతురాలైనా- చివరాఖరికి గ్రుడ్డివాడినైనా తనమీదే ఆధారపడాల్సిందేనన్నట్లు లొంగదీయడం- కుంటి వేటగాడి చేతిలోని బాణం పురుషాహంకారం అయితే, నిస్సహాయంగా, చిక్కిపోయిన జింకపిల్లా రాణి? ఇదంతా అతని అంతరంగంలో జరిగిన ఒక మానసిక కుట్ర. మనసు అనివార్యంగా ఏర్పర్చుకున్న ఒక రక్షణ చర్య అన్పించింది డా. సూర్యకుమారికి. సమస్య చాలా క్లిష్టంగా, ఆమె పరిస్థితి దయనీయంగా అన్పించింది. ఇన్ని రోజులూ ఉత్సాహంగా వెంకటేశ్వరరావు పాడుతున్న పాటలన్నీ గొంతు నొక్కిన రాణి పాటలేనా? రాణి హృదయాక్రోశం, ఆక్రందనలేనా అతని సంగీతం? రాణి ఇలా మూగపోవాల్సిందేనా? వీల్లేదు! పాడాలి- రాణి పాడాలి. రోజూ చెట్లపై కోయిలలు కూస్తుంటే మోరెత్తి గాజుకళ్లతో రాణి చెట్లవైపే ఎందుకు చూసేదో అర్థం అవుతోంది. చెవిటితనంతో, అవిటితనంతో కొంతమంది తమ అక్కాచెల్లెళ్లతో మీ మొఖం మీకేం తెల్సు? మీరు మొద్దులు- అని సుపీరియారిటీ కాంప్లెక్స్‌తో అసూయాద్వేషాలతో, తమలోని ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌లని అధిగమించాలని శాడిస్ట్‌గా ప్రవర్తించేవాళ్లు తనకు తెల్సు. ఏ శారీరక లోపాలు లేకపోయినా తమ అక్కాచెల్లెళ్లను మానసికంగా కృంగదీసి వాళ్ల ప్రతిభాపాటవాలను నాశనం చేసేవారు తనకు చాలా

మంది తెల్సు. కొన్నేళ్లు పోతే రాణి ఈమాత్రం కూడా మాట్లాడదు, నవ్వదు. కనీసం పైకి విన్పించేట్లు ఏడ్వదు కూడా. నో... వీల్లేదు. రాణి పాడాలి!

"రాణీ... నువ్వు సంగీతం క్లాసులు చెప్పుకో."

డా. సూర్యకుమారి మాటలకు భయంతో కళ్లు పెద్దవి చేస్తూ, "అమ్మో, ఇంకేమన్నా ఉన్నదా డాక్టరుగారూ... ఆయన చేతిలోని కర్రే కొరడా అవుతుంది. ఒకసారి ఒక స్టూడెంటుకు పాట పాడ్డంలో సహాయం చేసినందుకు నా ఒళ్లంతా తట్లు తేలిందండీ, ఆయన దెబ్బలకు. నన్ను కూనిరాగాలు కూడా తీసుకోనివ్వడండి. నీ మొఖానికి కూనిరాగాలు కూడానా! నోర్మూసుకో అంటాడండీ. నా ప్రాప్తమింతే..." అంటూ గోడ గడియారం వైపు చూసి, "అమ్మో మూడైందండీ. ఆయన వస్తాడండీ... బస్టాపుకు వెళ్లాలి... వెళ్తానండీ," అంటూ వడివడిగా వెళ్లిపోయింది. వెళ్లేప్పుడు ఆమె కాలి మువ్వలు మాత్రం సంగీతం పాడాయి.

*

మరుసటిరోజు ఏదో ఫోన్‌కాల్ చేద్దామని ఆటో దిగి పైసలిచ్చి ఫోన్‌బూత్ వైపుకి వెళ్తోంది డా. సూర్యకుమారి. అక్కడ వెంకటేశ్వరరావు, రాణిల జంట కనబడ్డది. చీరకొంగు భుజం చుట్టూ చేతుల చుట్టూ కప్పుకుని ఒదిగి నిల్చొని ఉంది రాణి. వెంకటేశ్వరరావు 765... అంటూ చకచకా నెంబరు చెబితే ఆపరేటరు కలిపిచ్చాడు. "గ్యాస్ అయిపోయిందండీ. మా నంబర్ బుక్ చేస్కోండి," అని నెంబరు చెప్పాడు. ఇంకో కాల్ చేసి, ఒక సాంస్కృతిక సమాఖ్యకు తన ప్రోగ్రాం ఫిక్స్ చేస్తున్నాడు అత్యంత ఉత్సాహంగా.

పైసలిచ్చి వెనుతిరిగాడు. రాణి అక్కడ తను ఉన్నదని చెప్పింది. "నమస్కారం డాక్టరు గారూ! ఫోన్‌కొచ్చారా? నేనూ దానికేనండీ... మా రాణి ఒక పల్లెటూరి మొద్దండీ. చాలా వీకూ... పూరూనండి. ఒక ఫోన్‌లో మాట్లాడి గ్యాస్ బుక్ చేయడం కూడా రాదండీ... ఉంటానండీ... పదవే," అంటూ వెళ్లిపోతున్నాడు, రాణి మోచేతిలో తన మోచేతిని బిగించి ఆమె కంటే అతనే రెండు అడుగులు ముందుకు వేస్తూ... ఉత్సాహంగా ఏదో మాట్లాడుతూ...

రాణి నీరసంగా గాజుకళ్లతో వెలుగును వెతుకుతూ ఒక గుడ్డిదానిలాగే... అతన్ని అనుసరి స్తోంది. ఆమెను చూస్తుంటే ఒక మనిషిలాగ కాకుండా గుడ్డివాడి చేతిలో కర్రలాగా మాత్రమే కనిపిం చింది. స్త్రీని గుడ్డివాడి కంటే కూడా మానసికంగా, శారీరకంగా బలహీనురాలినీ, వ్యర్థ రాలినీ చేసిన ఈ పితృస్వామ్యవ్యవస్థని ఏవగించుకుంటూ డా. సూర్యకుమారి ఫోన్ చేయడం కూడా మర్చిపోయింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*1 జూన్ 1997*

పురుషాహంకార ప్రతీక

# గుడ్డివాని చేతికర్ర

***పొద్దున్నే తొమ్మిది గంటలకే మెల్లగా కర్రల సాయంతో నల్ల కళ్లద్దాలతో బయలుదేరుతారు భార్యల సాయంతో, కొడుకుల సాయంతో, కూతుర్ల సాయంతో. ఆ గుడ్డివాళ్ళని తమ చేతుల్లోకి వాళ్ళ మోచేతుల్ని బిగించి భద్రంగా బాధ్యతగా చిన్న చంటిబిడ్డల్లా తీస్కెళ్ళి బస్సెక్కించి మళ్ళీ ఇంటికి తీసుకొచ్చే భార్యల్ని చూస్తే గోధూళి వేళ బర్రెల్ని, మేకల్ని తోలుకొచ్చే పశువుల కాపర్లుగా తోచేది.***

గుడ్డివాని చేతికర్ర కథ రాయడానికి నాకున్న నేపథ్యం సుదీర్ఘమైనది. నేను గడిపిన ఇరవై అయిదేళ్ళ జీవితం ఈ కథకు నేపథ్యాన్ని సమకూర్చింది. బాల్యంలో, యౌవనా రంభంలో అమ్మా నాన్నల మధ్య సంబంధాలు క్షణక్షణం బ్రద్దలవుతూ మళ్ళీ ఎపుడు అతుక్కున్నాయో తెలియనంత వేగంగా అతుక్కొని మరుక్షణం మళ్ళీ విరిగిపోయే అనిశ్చితం, అస్థిరం అన్పించే దాంపత్య సంబంధాల మధ్య గడిచిన జీవితం నాది. పొద్దున్నే నవ్వుతూ పొద్దుగూకుతూనే భళ్ళున ఏడ్చే అమ్మ నిస్సహాయత... మగవాడంటే హిట్లర్‌ని ఆదర్శంగా తీసుకొని తీరాలన్న రూలున్నట్టు ఇంట్లో అందరి శ్వాసని కూడా శాసించే నాన్న కఠినత్వం... క్రమశిక్షణ పేరుతో బాల్యాన్ని చాకిరేవులో బండపై బాది బాది, నీళ్ళు పిండేసినట్టు నిర్వీర్యం అయిన వైనం. అన్నయ్య చెవిటితనంతో ఆత్మన్యూనతకి లోనై అన్నీ బాగున్న తననే బుద్ధిలేనిదాన్ని, తెలివిలేనిదాన్ని, పిచ్చి ముండని చేసి మానసికంగా తననొక అవిటిదాన్ని చేసేసి- తను న్యూనతాభావం నుంచి అధిగమించే ప్రయత్నించటం... విజయం సాధించడం- అమ్మానాన్న కూడా నీకేం తెలీదు... అన్నని చూసి నేర్చుకొమ్మని ఒట్టి వెర్రిబాగులదాన్నని తనని అన్నతో పోల్చి ఓ పదిమెట్ల కిందనే నిల్చోబెట్టడం... తను ఆ ముద్రలని మౌనంగానే అంగీ కరిస్తూ నిస్సహాయంగా తనకు తెలియకుండానే ఆత్మన్యూనతాభావాల్లోకి నెట్టి వేయ బడిన వైనం అన్నీ బాగున్నా తగినంత తెలివితేటలు సృజనాత్మక రచనా సామర్థ్యం ఉన్నా రచనారంగంలో విజయాలు సాధిస్తున్నా నీడలా వెన్నంటే వివక్ష, బలవంతంగా

రుద్ధబడిన ఆత్మ న్యూనతా పట్టి పీడించిన వైనం... అప్పట్లో ఈ వివక్షకు మూలం ఏమిటో అర్థం అయ్యేది కాదు. గుండెల్ని మెలిపెట్టే క్షోభ. బాధ మాత్రం మిగిలిపోయేది.

తర్వాత్తర్వాత చదువుల కోసం ఆ ఇంటి నుంచి, ఆ వాతావరణం నుంచి బయటపడి హాస్టల్లో ఉండవల్సి వచ్చింది. హాస్టల్లో స్నేహితులతో కల్సి ప్రపంచాన్ని కొత్తగా అర్థం చేసుకోవడం, పుస్తకాలు ఆ ఇమోషనల్ రిక్వైర్‌మెంట్స్‌ని తీర్చగలిగే సాహిత్యం- ఇవన్నీ కొంచెం కొంచెం సంవత్స రాలుగా నాలో పేరుకుపోయిన ఆత్మన్యూనత నుంచి బయటపడేలాగ చేశాయి.

కథకు నా వ్యక్తిగత నేపథ్యం ఇలా ఉండగా, నా దగ్గరికొచ్చే స్త్రీల కేసులు చాలా విచిత్రంగా, ఆశ్చర్యకరంగానూ, బాధాకరంగానూ వుంటుంటాయి. అన్ని కేసుల్లోనూ స్త్రీలుగా ఎదుర్కొంటున్న వివక్ష, అణచివేతే ప్రధాన కారణంగా కన్పిస్తుంది. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివి కెమిస్ట్రీ లెక్చరర్‌గా స్థిరపడాలనుకుని పెళ్ళయినాక గృహిణిగా మగ్గిపోతూ తన జీవిత ఆకాంక్షలు తీరక అబ్సెసివ్ కంపల్సివ్ న్యూరోసిస్‌కి గురైన స్వరూప, నీకేం తెలీదు... నువ్వు నోర్మూసుకో... లోపలికి తగలడు. వెధవ మొహం నువ్వూనూ... మొద్దు... అంటూ సంవత్సరాలుగా భర్త అణిచివేస్తే తీవ్రమైన డిప్రెషన్‌కి గురైన వెంకటరమణమ్మ, ఆడపిల్లల్ని పెళ్ళే జీవిత పరమావధిగా పెంచి, చదువు చెప్పించక చివరికి వృద్ధాప్యంలో పెళ్ళిళ్ళు చెయ్యలేని రోగగ్రస్తుడైన తండ్రిని చూస్తూ దీనికంతటికి కారణం దేవుడేనని అనుక్షణం దేవుడ్ని తిట్టే సరోజ, 20 ఏళ్ళ వరకు తండ్రి చాటు పిల్లగా ఆ తర్వాత పదేళ్ళు భర్తచాటు స్త్రీగా బతికి స్వంత వ్యక్తిత్వం సంతరించుకోలేక అకస్మాత్తుగా భర్త మరణంతో ఉద్యోగంలో చేరాల్సి వచ్చిన శాంతకు కొత్తవాళ్ళుంటే గుండెల్లో భయం, గుబులు... మాటలు రాక చేష్టలుడిగిపోయే శాంత... వీళ్ళంతా కుటుంబాల్లో పాతుకుపోయిన పితృస్వామ్య భావజాలానికి బలైపోయినవాళ్ళే.

ఇలా నా వ్యక్తిగత అనుభవాలు, నా పేషంట్ల అనుభవాలు ఈ కథకి పటిష్టమైన నేపథ్యాన్ని సృష్టించాయి. అయితే కథకి ఓ రూపం రావడానికి మాత్రం మా పాప సంగీతం మాష్టారు పుట్టుగుడ్డి అయిన వెంకటేశ్వరరావు. మేము నివసించే కాలనీలో రోడ్ల మీద భార్యల చేతుల్ని, తమ బిడ్డల చేతుల్ని పట్టుకుని చేతికర్రలని నేలకి తాటిస్తూ... లేక ఓ ముగ్గురు నల్గురు గుడ్డివాళ్ళే కల్సి ఆత్మవిశ్వాసంతో నడిచిపోతూ కన్పించేవాళ్ళు. మా కాలనీకి దగ్గరలోనే సర్కారువారి గుడ్డివాళ్ళ స్కూలు వుంది. అందులో మాష్టార్లుగా పనిచేసే అనేకమంది మా కాలనీలో నివసిస్తారు. వాళ్ళని నిశితంగా పరిశీలించడం నా నిత్య జీవితంలో ఓ కార్యక్రమం అయింది.

పొద్దున్నే తొమ్మిది గంటలకే మెల్లగా కర్రల సాయంతో నల్ల కళ్లద్దాలతో బయలుదేరుతారు భార్యల సాయంతో, కొడుకుల సాయంతో, కూతుర్ల సాయంతో. ఆ గుడ్డివాళ్ళని తమ చేతుల్లోకి వాళ్ళ మోచేతుల్ని బిగించి భద్రంగా బాధ్యతగా చిన్న చంటిబిడ్డల్లా తీస్కెళ్ళి బస్సెక్కించి మళ్ళీ ఇంటికి తీసుకొచ్చే భార్యల్ని చూస్తే గోధూళి వేళ బర్రెల్ని, మేకల్ని తోలుకొచ్చే పశువుల కాపర్లుగా తోచేది. ఆ గుడ్డివాళ్ళ భార్యల కళ్ళల్లో బాధ్యతకు మించి ఒక నిర్లిప్తత కన్పించేది. ఓసారి ఫోన్ బూత్‌లో ఎంతో ధీమాగా గ్యాస్ బుక్ చేస్తున్న గుడ్డిమనిషి, పక్కనే నీర్సంగా ఒక న్యూనతాభావాన్ని కళ్ళల్లో నింపుకుని చూస్తున్న అతని భార్య కన్పించారు. చీరకొంగు భుజం చుట్టూ కప్పుకుని ఒదిగి నించుని ఉంది. ఆయన చకచకా నంబరు చెబితే ఆపరేటర్ కలిపి ఇచ్చాడు. ఎంతో ఆత్మ విశ్వాసంతో గ్యాస్ బుక్‌చేసి డబ్బులిచ్చి, 'పదవే' అంటూ భార్య మోచేతిలో తన మోచేతిని బిగించి ఆమె కంటే అతనే రెండు అడుగులు ముందుకు వేస్తూ నడుస్తున్నాడు. ఆమె ఒక గుడ్డిదానిలా

అతన్ని అనుసరిస్తోంది. ఆమెని చూస్తుంటే ఒక మనిషిలా కాకుండా గుడ్డివాని చేతిలో కర్రలాగా మాత్రమే కన్పించింది. ఈ సంఘటన చాలా ఏళ్ళుగా నాలో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలకి ఓ కథారూపం ఇవ్వడానికి ప్రేరణ ఇచ్చింది. అదే *గుడ్డివాని చేతికర్రగా* రూపుదాల్చింది.

ఈ కథలో వెంకటేశ్వరరావు పుట్టుగ్రుడ్డి. సంగీతంలో నిష్ణాతుడు. ఓ గుడ్డివాళ్ల స్కూల్లో సంగీతం మాష్టారు. అతని భార్య రాణి. రాణి సంగీతంలో డిగ్రీ పాసైంది. ఇద్దరూ సంగీత విద్వాంసులు. అరమరికలు లేకుండా జీవితాన్ని గడుపుతారని భావించి రాణికి వెంకటేశ్వరరావుతో వివాహం జరిపిస్తారు. కాని జరిగింది వేరు. రాణిని తీవ్రంగా అణిచివేసి తను మాత్రం ఇనుమడించిన ఆత్మవిశ్వాసంతో బతుకుతాడు. రాణి తనలాగే సంగీతంలో ప్రావీణ్యం కలిగినదైనా అతని అణిచివేత వల్ల సంగీతం కాదుకదా కూనిరాగాలు తీయడం కూడా మర్చిపోతుంది. ఆమెకీ అతని చేతికర్రకీ ఆట్టే తేడా ఉండదు.

ఈ కథ ద్వారా నేను చెప్పదల్చుకున్నవి ముఖ్యంగా రెండు విషయాలు.

ఒకటి గుడ్డితనము, చెవిటితనము, అంగవైకల్యము స్త్రీని అణిచివేయడంలో వివక్షని చూపించడంలో ఏ విధంగానూ అడ్డురావని. ఈ శారీరక లోపాలు గల పురుషుల్లో పురుషాహంకారానికి ఏ లోటు ఉండదని. వాళ్ళు భార్యల్ని, చెల్లెళ్ళని, అణిచివెయ్యడంలో అంగవైకల్యం లేని పురుషుల కంటే ఏ రకంగాను తక్కువ కాదని. అతను పురుషుడిగానే ఆధిక్యతని హోదాని వెలగబెడతాడు. స్త్రీల మీద పెత్తనం చెలాయిస్తాడు. ఈ రకంగా పితృస్వామ్యపు కుట్రని బహిర్గతం చేయడం ఈ కథ మొదటి లక్ష్యం.

రెండోది అంగవైకల్యం, శారీరక లోపాలున్న వ్యక్తులు తమలోని ఆత్మన్యూనతని అధిగమించే క్రమంలో ఏ లోపాలు లేని తమ కుటుంబసభ్యులనో, భార్యలనో అణిచివేసి బయట ప్రపంచంలో తాము ఎదుర్కొంటున్న వివక్షకు ప్రతిచర్యగా ఇంట్లో తమ తోటివాళ్ళని బలి చెయ్యడం... అలా వాళ్ళు ఓ సాడిస్టిక్ సాటిస్‌ఫాక్షన్‌ని పొందడం. ఇదో మానసిక కుట్ర. ఈ కుట్రని, వాళ్ళ ఆ రకమైన ప్రవర్తన వెనుక మూలాన్ని వెలికి తియ్యడం ఈ కథకున్న రెండో లక్ష్యం.

ఈ రెండు లక్ష్యాలను సాధించడంలో నేను సఫలీకృతం అయ్యానో లేదో పాఠకులు తేల్చాలి.

*3 మే 1998*

14

# వాల్తేరత్త

## గొరుసు జగదీశ్వరరెడ్డి



*గొరుసు జగదీశ్వరరెడ్డి 1960 జులై 5న జన్మించారు. వీరి మొదటి కథ ప్రేమశిక్ష 1993లో మయూరి వార పత్రికలో అచ్చయ్యింది. 30కి పైగా కథలు రాసిన వీరు గజ ఈతరాలు కథాసంపుటాన్ని ప్రచురించారు. ఆంధ్రజ్యోతి ఆదివారం సంచికలో సబ్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.*

**చిరునామా**

*363, ప్లాట్ నెం. 302,*
*భారతి నిలయం, ప్రగతి నగర్*
*కుకట్‌పల్లి, హైదరాబాద్-500 072*
*Ph.: 99854 06253*
*gorusu@gmail.com*

విజయనగరం దగ్గర్లోని కోరుకొండ సైనిక్ స్కూల్‌లో మా రెండో వాడికి సీట్ రావడంతో పాతికేళ్ళ తర్వాత మళ్ళీ ఇలా విశాఖపట్నం మీదుగా వెళ్ళబోతున్నందుకు గొప్ప థ్రిల్‌గా వుంది.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు బయల్దేరే ముందు కూడా అమ్మానాన్నలిద్దరు వంతపాడినట్లు, “రమణా... ఎట్లాగూ అంత దూరం వెళ్తున్నావు. తిరుగు ప్రయాణంలో నైనా విశాఖపట్నంలో దిగి వరాలత్త ఇంటికి వెళ్ళిరా,” అంటూ మరీమరీ చెబుతూ, ఆ ఇంటి గుర్తులు కొన్ని చెప్పారు.

వాళ్ళు చెప్పిన గుర్తులే కాకుండా, నాకు మరికొన్ని గుర్తున్నాయి. నాకు ఊహ తెలిసిన దగ్గర్నుండి... మేం హైద్రాబాద్ వచ్చేవరకూ, కనీసం పన్నెండు సంవత్సరాలయినా ఆ పరిసరాల్లో పెరిగుంటాను - ఆ ఇల్లూ, వీధి ఇంకా కళ్ళకు కట్టినట్టు ఉన్నాయి. మద్దిలిపాలెంలోని రామాలయం, ఆ కోవెల పక్కనే కూరగాయలు మొదలు కొని మాంసం, చేపలు, పెండలం దుంపలు, రకరకాల తినుబండారాల్ని అమ్మే మార్కెట్టు, దాన్ని దాటి కాస్త ముందుకు వెళితే పెద్ద చేదబావి ఆ బావి చుట్టూ ఆడ వాళ్ళు పెద్ద, పెద్ద ఇత్తడి బిందెల్లోకి నీళ్ళు తోడుతున్న దృశ్యం... అక్కడికి కనుచూపు మేరలో పెంకుటిల్లు. అదే

వరాలత్త ఇల్లు. అందులోని ఒక భాగంలో మేం అద్దెకు వుండేవాళ్ళం. పోనీ! అంతగా వరాలత్త ఇంటిని గుర్తించలేకపోయినా, ఆ వీధిలో ఎవర్నడిగినా ఇట్టే చూపిస్తారు. వరాలత్తని ఎరగని వారెవరు? మద్దిలిపాలెంలోనే గాక, ఆ చుట్టుపక్కల నక్కవాని పాలెం, రేసవాని పాలెం, పీతలవాని పాలెం, సీతమ్మధార, ఇసకతోట జనాలకు వరాలత్త బాగా తెలుసు. ఇంకా నాకు తెలియని వీధుల్లోని వారికి... వరాలత్త పేరు 'నోటెడ్'. అందుకు గల ఒకే కారణం వరాలత్త చేసే 'వడ్డీ వ్యాపారం'.

వరాలత్త వడ్డీ వ్యాపారం చేస్తే మటుకు ఇన్ని వీధుల్లోని వాళ్ళకు తెలియాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నకి సవాలక్ష కారణాలు లేకపోవచ్చును గానీ, 'డబ్బు' అవసరం వున్న మనిషి అప్పు వాసనని పసిగట్టినట్లు అంచెలంచెలుగా అలా పాకుతూ వరాలత్త వాకిట్లోకి చేరేవాడు.

వరాలత్త ఇంటి చుట్టూ ప్రహారీ గోడ, లోపల కొబ్బరి, జామ, మునగ, చెట్లున్నట్టు గుర్తు... ఎంచేతంటే.. ఆ చెట్లకాయల్ని వీధిలోని జనాలకు అమ్మేది వరాలత్త. అప్పుడు నాన్న ఆంధ్రా యూనివర్శిటీలో ఉద్యోగం చేసేవాడు.

వరాలత్త నేపథ్యంలోకి మరికాస్త వెళ్తే. ఆమెతో పాటూ ఆ ఇంట్లో మరో రెండు జీవాలుండేవి. వరాలత్త మొగుడు నూకరాజు, పుత్రరత్నం సింహాచలం.

నూకరాజు యూనివర్శిటీలోనే అటెండర్‌గా చేసేవాడు. ఆ విధంగా... నాన్నకి వాళింట్లో ఖాళీగా మేం వున్న పోర్షన్‌ను చూపించాడట.

రోజు వారీగా తాగటం అతగాడి హాబీ. తాగినప్పుడు నిప్పుకోడిలా నిటారుగా వుండి, పల్లె పదాల్ని వల్లెవేస్తూ, చిందులేసే నూకరాజు తాగనప్పుడు వానకు తడిసిన కోడిపెట్టెలా ముడుచుకుపోయి, వణికిపోయినట్లు, భయంగా, బేలగా వుంటాడు. వరాలత్తకి నోరు పెద్దదని, గయ్యాళనీ, రాకాసనీ, చమత్కారనీ, జగడాల మారనీ, మందరనీ, కైకనీ... అబ్బో! రకరకాల పేర్లు పెట్టి వరాలత్త చాటుగా చెవులు కొరుక్కునే  వాళ్ళు జనం. వడ్డీ వ్యాపారం చేయటం వలన కాబోలు మనిషి ధీమాగా, కాస్త కరుకుగా, ఎదుటి మనిషిని సవాల్ చేస్తున్నట్లుగా వుండేది. నూకరాజు కన్నా అంగుళం పొడువు ఎక్కువగా వుండి, ఎత్తుకు తగ్గ లావుతో, గుండ్రని పసుపు రాసుకున్న ముఖంతో నుదుట రూపాయి కాసంత ఎర్రనిబొట్టుతో దివిటిలా వెలుగుతున్నట్లుండేది నా కళ్ళకి.

నిజానికి వరాలత్త నాకు అత్త వరసవదు. మా అమ్మా నాన్నల్ని అన్నయ్యా, వదినా అని పిలవటంతో నేనూ అత్త వరసపెట్టి పిలిచేవాణ్ణి. వరాలత్తకి రాయటం, చదవటం తెలుసును. తనకు చదువు ఎలా వచ్చిందో చెప్పినప్పుడు గొప్ప అనుభూతికి లోనయ్యేది.

"మా సిన్నప్పుడు భీముడిపట్నం ధగ్గిర్నుండీ ఉప్పుగల్లీలోని ఉండీవోరిమి. మా నాన్న జవానుగా వుజ్జోగం సేసీ వోడక్కడ... అల్లక్కడ ఉప్పు పండించీవోరు. సీమదొరలు, దొరసాన్లు వొచ్చీ వోరక్కడికి. పంతుల్నెట్టి మాకు సదుమతే సెప్పించీవోరు. అదేటో.. ఈ మాయదారి సదుమతే గొప్ప బయ్యిం. పంతుల్ని సూడగానే జడిసిపోయి మాయమ్మ సోళ్ళు, గంట్లో పోసుకునీ గాదెల్లో దాగుండీదాన్ని. అయితేటి! సదుం వచ్చీదాక వుచ్చోయించీసీవోడు పంతులు. అదిగలాగొచ్చిన గునింతాల సదుం నాను ఒడ్డీయాపారం సేయనందకి పనికొచ్చినాది..."

వరాలత్త కొడుకు సింహాచలం రమారమి నా ఈడు వాడే. నక్కవాని పాలెం స్కూల్‌లో చదివేవాడు. నేనప్పుడు డైరీ ఫారానికి, 'జూ'కీ మధ్య నున్న విశాఖ వేలీలో చదవేవాణ్ణి. అయితే, ఒకే ఇంట్లో ఉండటం వలన కాబోలు మేం బాగా స్నేహంగా వుండేవాళ్ళం. వరాలత్తకి ఆ ఊళ్ళో చాలా బంధువర్గం ఉంది. మద్దిలిపాలెంలోనే కాస్త దూరంలో వరాలత్త అన్నయ్య, ఇద్దరు తమ్ముళ్ళూ ఉండేవారు. వరాలత్తకి తండ్రి లేడు. కానీ తల్లి మాత్రం చిన్నకొడుకు దగ్గరుండి,

తక్కిన ఇద్దరు కొడుకులు ఇచ్చే నెల భత్యం డబ్బుల్ని జాగ్రత్తగా తెచ్చి వరాలత్త చేతిలో పెట్టి వడ్డీకి తిప్పమనేది. ఆ వయసులో ముసలమ్మకు వడ్డీయావ వుండటం ఆశ్చర్యం కల్గించేది.

"మా ఇంట్లోని దొబ్బి తినీసి, డబ్బులొట్టికెళ్లి కూతురుకిత్తాది ముసిల్కండి," వరాలత్త చిన్న మరదలు కయ్యిమని అరిచేది అప్పుడప్పుడు.

నేనెక్కువగా సింహాచలంతో ఆడుకోవటం వలన, వాళ్లింట్లోనే ఎక్కువ సమయం గడపటంతో, వరాలత్త దినచర్య పరిశీలించేవాణ్ణి. తెల్లవారింది మొదలు, రాత్రి నిద్రపోయే దాకా, ఎవరో ఒకరు వచ్చి, వరాలత్తని బతిమాలి అప్పు పుట్టించుకు వెళ్ళేవారు.

వరాలత్త దగ్గర డబ్బుల్ని తీసుకోవాలంటే, తప్పనిసరిగా ఏ వస్తువో తాకట్టు పెట్టాల్సిందే. నోట్లు రాయించుకొని డబ్బుల్ని ఇవ్వటం చాలా అరుదు.

ఎక్కువగా నగల్ని తీసుకువచ్చేవారు... లేదంటే అప్పటికప్పుడు ఒంటిపై నున్న నగల్ని వొలిచి ఇచ్చేసేవారు. జడబిళ్ళ మొదలు.., పాపిట బిళ్ళలు, చెవి దుద్దులు, బుట్టలు, ముక్కు పుడకలు, కాడలు, బులాకీలు, మెడలోని గొలుసులు, పుస్తుల తాడు, బంగారమో, వెండో.. తప్పనిసరి.

నగల్ని తేలేని వాళ్లు చేతి వాచీలు, రేడియోలు, టేపు రికార్డర్లు, బిందెలు, ఇత్తడి చెంబులు, డేగిషాలు లాంటి రాగి వస్తువులు తెచ్చేవారు.

ఇలాంటి సామానుతో వరాలత్త ఇంట్లోని మచ్చు కిక్కిరిసిపోయేది. వస్తువు ఖరీదు కన్నా అసలుకి వడ్డీ ఎక్కువయిపోవటంతో చాలమంది వస్తువుల్ని వదిలేసేవారు. అలా ఇంట్లో ఇత్తడి, రాగి వస్తువులు పేరుకుపోయి వుండేవి.

ఏ వస్తువును తీసుకున్నా వెంటనే తెల్లని కాగితం ముక్కపై తాకట్టు పెట్టిన వాళ్ళ ఇంటి పేరుతో సహా, తీసుకున్న తేదీని రాసి అతికించడమో, దారంతో ఆ వస్తువుకు కట్టడమో చేసేది. ఇక వీటన్నింటి వివరాల్ని చిత్రగుప్తుడి చిట్టాలాంటి తెల్ల కాగితాల పుస్తకంలో రాసేది. బంగారు నగల్ని పెద్ద ఇత్తడి మరచెంబులో వేసి, మూత బిగించి, దాన్ని ఇంట్లో వున్న రంగంపెట్టెలో దాచేది. వరాలత్త నగను బట్టి వచ్చిన వాళ్ల అవసరాన్ని తెలుసుకొని వడ్డీ రేటు మార్చేది.

ఎవరొచ్చి డబ్బులడిగినా, 'నా దగ్గర నేవు,' అంటూనే వాళ్ళతో బ్రతిమాలించుకొని మరీ ఇచ్చేది. 'డబ్బు' దేనికవసరమో....జనం చెబుతుంటే ఆశ్చర్యం కల్గేది.

"వరాలప్పా... పలాస నుండి మా యీరకోడూ, యీరగత్తే వచ్చేరు. మాయమ్మి పురుడయి వోరం అవ్వింది కదా, ఆళ్లకి మనవన్ని సూన్నందకి వుప్పుడు తీరుబాటయ్యింది వచ్చినోరికి మరేద సెయ్యాల, ఇంట్లోని దమ్మిడీ నేదమ్మా, నీ మీదొట్టు!...మీ అన్నయ్య కరగపూరెల్లాడు. కోడ్ని కోసి, గార్లొండెట్టనేకపోతే సిన్నతనం కాదేటప్పా, కమ్మ కట్టీరూ... రెండొందలుంటే సూడుమీ."

అది! అలాంటి చిన్నాచితకా అవసరాల కోసం నగల్ని తాకట్టు పెట్టేవారు. వరాలత్త ఎంత ఖచ్చితంగా డబ్బులిచ్చేదో, అంత ఖచ్చితంగా వడ్డీ, అసలు వసూలు చేసేది. నెల మొదటివారంలో చాలా బిజీగా వుండేది. మొదటి తారీఖున మాత్రం ఎన్ని పనులున్నా గబగబ చేసుకొని, యూనివర్శిటీకి వెళ్ళేది. మొగుడికి వచ్చే జీతంకోసం ఆ రోజంతా అక్కడే వుండిపోయేది. వరాలత్త వెళ్ళ లేదంటే.. ఆ జీతం డబ్బుల్లో సగం తాగేసి, ఏ జంక్షన్ దగ్గరో దొర్లుతాడు. 'పలాన దగ్గర మీ ఆయన రోడ్డుకి అడ్డంగా తాగేసి పడిపోయా,'డని చెబితే మొగున్ని తిట్టుకుంటూ ఇంటికి ఈడ్చుకు వచ్చేది. పరామర్శించడానికి వాళ్ళమ్మ వస్తే, వరాలత్తకి కోపం నషాలానికి ఎక్కి, ముసలమ్మని సంచి దులిపినట్లు దులిపేది.

"ఈ తాగు ముచ్చోడ్ని నాక్కట్టబెట్టి నాబతుకులోని నిప్పులోసేవు నాయార్లా, ఈ తాగుబోతు సచ్చినోడుతో కాపరం సేయలేనమ్మో, ఇనేవరిసిటీలోని వుజ్జోగు వున్నాదని సూసినావు గాని, ఆడు తాగుబోతెదవో, ముండల ముఠాకోరో, జూదగుండోడో ఏదీ సూడకుంట నా నోట్లోని బుగ్గోసినావే రంకు ముండా." పెద్ద పెద్ద కేకల్తో కలకత్తా కాళయ్యేది వరాలత్త.

కోపంలో ఎన్ని తిట్టినా, తల్లంటే చాలా ప్రేమ వరాలత్తకి. తల్లిని ఏ కోడలయినా తిట్టిందని తెలిస్తే, కొంగు నడుముకు బిగించి, గొడవ పెట్టుకోడానికి వెళ్ళేది.

ముసలమ్మ ఏ వేళప్పుడు వచ్చినా, ఇంట్లో వున్నదేదో తినడానికి పెట్టేది. మొగుడి జీతం అందిన మర్రోజు నుండీ, ఊరి మీదికి వడ్డీ వసూళ్ల కోసం బయల్దేరేది.

"పూర్ణా మార్కెటులోని పళ్ళమ్మీ దాలియమ్మ ఆర్నెళ్లబట్టి వడ్డీ కట్నందకి రానేదు. ఇయ్యాల దాని కొప్పొట్టుకు నాక్కురానా"

"కాల్టెక్సునోని కనకారావు వడ్డీ కట్టకంటన్నాడు. ఆడి కాల్రొట్టుకునాగీనేకపోతే నాను ఒరాలమ్మనే కాదూ..." అంటూ,

"అమ్మా, సిప్పియాడు సిన్నారావు అసలూ, వడ్డీ ఇత్తానన్నాడు. ఎళ్ళీసొత్తాను" వాళ్ళమ్మని ఇంటికి కాపలా వుంచి,

"ఒలమ్మా, సావులు మదుం సన్నాసమ్మ వడ్డీ కట్నందకి వత్తానన్నాదే. పూరాగా మూడొందల పాతిక. జాగర్తగా లెక్కెట్టు సుమీ" ఆవిడకి వసూళ్ళ పని పురమాయిస్తూ, వెళ్లి, సాయంత్రానికి తిరిగి, తిరిగి అలిసిపోయి వచ్చేది వరాలత్త. ఆశీలు మెట్టమేకల కబేళ దగ్గరున్న సారాకొట్టును దర్శించుకొని, ఏ రాత్రికో తూలుతూ వచ్చేవాడు నూకరాజు. మేమంతా నిద్రకు ఉపక్రమించే వేళప్పుడు.

*హరి హరి నారాయణా,*
*ఆది నారాయణా....*
*కరుణించి మమ్మేలు....*
*కమల లోచనుడా....*

గొంతెత్తి పాడుతూ, తప్పటడుగులు వేస్తూ వచ్చే నూకరాజుకి తోడుగా వీధిలోని కుక్కలన్ని వంత పాడినట్టు చుట్టూ చేరి మొరిగేవి.

వడ్డీ వ్యాపారంతో వరాలత్త, తాగుడులో నూకరాజూ తలమునకలవడం తప్ప సింహాచలం ఏం చదువుతున్నాడో పట్టేది కాదు.

వరాలత్తకి మొగుడయినా, కొడుకయినా 'డబ్బు' తర్వాతే! ఒక్కక్షణం తీరిక లేనట్లు ఇంటి పనుల్లో, వడ్డీ పనుల్లో విశ్రాంతి లేకుండా ఉండే వరాలత్తని చూస్తే, ఒక్కోసారి జాలివేసేది. సరిగ్గా సింహాచలం స్కూల్ నుండి వచ్చేసరికి ఇంటి దగ్గర కాపలాగా ఉండే వాళ్ళ అమ్మమ్మ కన్పించేది.

'తిన్నందుకొచ్చావా' అంటూ ముసలమ్మని వెక్కిరించేవాడు సింహాచలం. "ఏట్రా ఇరగబడి పోతన్నావూ... నాను నా కూతురింట్లోని తిన్నందకొచ్చానేట్రా, నీ మావయ్యలు నాక్కూడెట్టకంటా తగిలీసినారంతావా, సచ్చినోడా, నీ అయ్య బేవార్సీ. ఆడు తిరవైనోడయితే నా కూతురికిన్ని పాట్లేటిరా, నీడ పట్టు నుండి సంసారం సేసును. ఆ బాబుకి తగ్గ గండడివి," ముసలమ్మ పెద్ద నోటితో సింహాచలంతో తగువేసుకుని, గొడవను పొడిగించేది. ఇంటి వసారాలోని మెట్లపైన కూర్చొని, మా అమ్మకు ఫిర్యాదులు చేసేది. "సూడుమీ, సిన్నా పెద్దానేకంట ఎనాగ పెల్లిబడిపోతన్నాడో, సిగురు లమ్డీకొడుకు, సీమ్మిరపకాయంత నేడు. నా మీదకి తిరగబడగతన్నాడు..."

మనవడితో తగువాడి, అలిసిపోయేది ముసలమ్మ. ఆ తర్వాత మా అమ్మ నుద్దేశించి "సాయిత్రమ్మా, పొయ్యిలోని బుగ్గేసినావేటి? సిన్నగ్గినిప్పొట్రమ్మీ, సుట్ట కాల్చుకుంతాను," అంటూ, ఆ పని నాకు చెప్పేది. పొయ్యిలోంచి కాలుతున్న కర్రని తెచ్చి ముసలమ్మకి ఇవ్వడమూ, పొడుగాటి సుట్టను పెదాల మధ్య బిగించి, నిప్పుతో వెలిగించుకొని, గుప్పుగుప్పుమని పొగ వదిలి పక్కనున్న పొదుల్లోకి తుపుక్కుమని ఉమ్మి, చుట్టని తిరగేసి, కాల్తున్న వైపు నోట్లో పెట్టేసి, అడ్డపొగ పీలుస్తూ నా వైపు చూసి కళ్ళతో నవ్వేది.

ముసలమ్మని చిత్రంగా చూడటం నాకలవాటు. ఆమె ముక్కుకి రెండువైపులా కాడలు వుండి, మధ్య దూలానికున్న కన్నంలోంచి, పై పెదవి వరకూ జారినట్లుండే బులాకీ చూస్తే, ఏనుగు దంతాల మధ్య వేలాడే తొండం గుర్తొచ్చేది. జాకెట్టు వేసుకునేది కాదు. శుభ్రంగా చీరను చుట్టుకొని, తల వెంట్రుకల్ని ఆముదంతో తడిపేసి, కుడి చెవికి దగ్గరగా కొప్పును కట్టేది. మోచేతుల వరకూ ముగ్గులపచ్చని పొడిపించుకున్నట్లుగా ఆ ముడతలిడిన చర్మంలో కన్పించేవి. తలపోటని మందార ఆకుల్ని, ఉసిరిపప్పును, దంచుకొని వెంట్రుకలకి పట్టించేది. గంధం అరగదీసి నుదుటికి పూసు కునేది. 'ఒళ్ళు సలుపులమ్మా' అంటూ పాలుగారే పిచ్చి చెట్ల ఆకులు తుంచి, ఆ పాలను ఒళ్ళంతా రాసుకునేది. తాపీగా చుట్ట కాలుస్తూ, మా అమ్మతో కబుర్లలోకి దిగేది.

"సాయిత్రమ్మా, వుప్పుడేటో ఎంత సంపాదిత్తన్నా ఒవులికీ సాలకంటన్నాది. నా పెనిమిటి మిలటరీలోని ఉండీ తప్పుడు పదకండు రూపాయిల జీతం తెచ్చీవోడు. నా నలుగురు పిల్లల్ని ఎలాగ సూసీదాన్నో! గంటన్నవూ, సల్ది గెంజి, పిండొడిం... శాన, జరుగుబాటయిపోయాది. వుప్పుడు మాయదారి కాలవొచ్చి పడిపోనాది, మావు వుప్పుగల్లీలో వుండీ తప్పుడు కానీకి, అర్ధణాకీ... సేట నిండా సందువాలూ, ఇంతేసి రొయ్యలూ వొచ్చీవి. సీమ దొరలు రాజ్జియేలీ తప్పుడు డబ్బ తక్కవ గానీ, తిన్నందకి కొదవుండీది కాదమ్మా..." అలా తన ఫ్లాష్‌బ్లాక్‌లోకి వెళ్ళిపోయి వినేవాళ్ళ బుర్ర తినేసేది. మనకు స్వాతంత్ర్యం రాకముందు కథల్ని, బ్రిటీష్ వాళ్ళ పాలనలోని సంగతుల్ని సినిమా రీళ్ళలా తిప్పేది.

సెలవురోజు వచ్చిందంటే నేనూ సింహాచలం ఆడుకుంటూ అలా... ఇసకతోటకూ వెంకోజీ పాలేనికీ మధ్యనున్న జీడి మామిడి, జామతోటల్లోకి వెళ్ళిపోయేవాళ్లం. ఆ తోటలకు రెల్లివాళ్ళు కాపలా ఉండేవారు. వాళ్ల కన్నుగప్పి కాయల్ని దొంగిలించడం మా పని. మమ్మల్ని వాళ్ళు గమనించ కుండా వుండటంకోసం నేలకు చాలా దగ్గరగా వంగి ఉండే జీడిమామిడి కొమ్మల కిందగా దూరి, పాకుతూ కాయల్ని తెంపేవాళ్లం. పొరపాటున వాళ్లు మమ్మల్ని గమనిస్తే లేడి పిల్లల్లా దౌడుతీస్తూ బీచ్‌వైపు పరిగెత్తేవాళ్లం. సన్నటి సరివిడి కర్రల్ని పట్టుకొని మా వెనక పరిగెత్తుకొస్తూ... వాళ్ళ రెల్లి భాషలో-

*అరెరెరే..... బారిజెల్లి బారిజెల్లి దరుగుంద్రే*
*గొచ్చిరి కాయలు తిరుగురె సిండి పిల్లుసురే*

అంటూ అరిచేవాళ్ళు 'కాయల్ని కోసుకెళ్తున్నారు, పట్టుకోండని' దాని అర్థమట. అదీ సింహాచలమే చెప్పేడు. ఇంకా వాళ్ళ రెల్లిభాషలో చాలా బూతులు తిట్టేవారని, అవి నాతో చెప్పటం తనకిష్టం లేదనేవాడు. వాళ్ళ భాష నాకు తెలీకపోవటంతో నాకవి తిట్లలా అన్పించేవి కావు.

జీడిపండ్లని తినేసి, జీడిపిక్కల్ని జేబుల్లోదాచి, జామకాయల్ని కొరుకుతూ సముద్రం ఒడ్డుకు చేరేవాళ్ళం. సముద్ర ఘోషని వింటూ, ఎండకు తళతళ మెరిసే సన్నటి ఇసుకలో కాళ్లు కాల్తున్నా అలాగే నడుస్తూ, తెల్లని పాలనురగలు కక్కుతూ మాకన్నా ఎత్తుగా వచ్చే కెరటాల్ని చూస్తూ,

ఒడ్డునున్న కన్నాల్లోకి పీతల్ని పోనీకుండా, ఆ రంధ్రాలు కప్పెడుతూ, గవ్వలూ, శంకులూ, అందమైన రాళ్ళు ఏరుతూ...చీకూ, చింతాలేని రోజులవి.

అలా బీచ్‌లో నడుస్తూ జాలారిపేట దగ్గరికి వచ్చేసరికి, జాలర్లు తల్లీ, పిల్లా అంతా కలిసి సముద్రంలోంచి ఒడ్డుకు చేరబోతున్న పడవల్ని కలిసికట్టుగా లాగి, వలలో పడిన చేపల్ని ఇసకలో కుప్పలుగా పోసేవారు.

సూర్యకిరణాలు తెల్లని పొలుసుపైన పడి, చేపలన్నీ వెండి బిళ్ళల్లా ధగధగ మెరిసేవి. సిగ్గు బిళ్ళలూ, నల్లపూసలు తప్పించి ఒంటిమీద నూలుపోగయినా లేని మా ఈడు జాలర్ల ఆడ, మగపిల్లల్ని చూసి గొప్ప సిగ్గేసి, మా తెరచిన నోళ్ళమీద అరచేతితో చప్పుడు రాకుండా బాదుకుంటూ నవ్వుకునేవాళ్ళం. జాలారిపేట నుండి ముందుకు వెళ్తుంటే, విశాలమైన ఆ నల్లటి సముద్రంలో దూరంగా పెద్ద, ఓడలు లంగరు వేసి కన్పించేవి. అవి కదలక మెదలక వుండటం ఏమిటో అప్పుడు అర్థం అయ్యేది కాదు. చీకటి పడే సమయానికి ఎదురుగా వున్న యారాడ కొండపైని లైట్‌హౌస్ విశాఖ నగరకన్యను కాపలాకాసే ఒంటికన్ను రాక్షసుడిలా తిరుగుతూ కన్పించేది.

సాయంత్రం వరకూ, తిరిగి, అలిసి, రామకృష్ణ బీచ్ మీదుగా, మహారాణి పేట నుండి కె.జి.హెచ్. 'అప్పెక్కి' ఎ.వి.ఎన్. కాలేజీ 'డౌన్' దిగి కొత్తరోడ్ వచ్చి, మా దగ్గరున్న చిల్లర డబ్బుల్తో సిటీబస్ ఎక్కి మద్దిలపాలెంలో దిగేవాళ్లం.

విశాఖలో ఎక్కువగా తాటి చెట్లు, కొబ్బరిచెట్లు ఉండటం, సింహాచలంతో వాటిని ఎలా ఎక్కాలో, ఎక్కి ఎలా ఆ కాయల్ని దొర్లించాలో నేర్చుకున్నాను. తాటికాయల్ని కొట్టి చూపుడు వేలితో బొటనవేలితో ముంజని ఎలా తీయాలో తినాలో సింహాచలమే నేర్పేడు.

తోటల్లోంచి దొంగిలించి తెచ్చిన జీడికాయల్ని దొంగచాటుగా కర్రల్ని ఏరి, నిప్పు రాజేసి అందులో వేసేవాళ్లం. అవి రసం కక్కుతూ, పట్‌పట్ అని శబ్దం చేస్తూ ఎగిరేవి. నల్లగా కాలిన జీడిపిక్కల్ని ఎలా నిలువుగా కొట్టాలో, ఎంత నేర్పుగా ముక్కలవకుండా జీడిపప్పుని తీయాలో సింహాచలమే చెప్పేవాడు.

పూర్ణామార్కెట్‌కి వెళ్ళినప్పుడు కూడా ఇలాగే పనసపిక్కల్ని దాచి, తెచ్చి కాల్చుకు తినేవాళ్ళం.

అప్పుడప్పుడూ సింహాచలం కొండకి అమ్మ, నాన్నల్తో వెళ్ళేవాణ్ణి.

కొండపై నుండి కన్పించే ప్రకృతి రమణీయత ఇంకా నా మనసులో మెదులుతూనే వుంది. కొండనిండా పెద్ద, పెద్ద సంపెంగ వృక్షాలు. తర్వాత నాకు ఎక్కడ సంపెంగలు కన్పించినా సింహాచలమే గుర్తొచ్చేది.

వరాలత్తతో కలిసి అనకాపల్లి నూకాలమ్మ జాతరకీ, విజయనగరం పైడితల్లమ్మ జాతరకీ వెళ్ళేవాణ్ణి. విశాఖలో ఉన్నప్పుడు వరాలత్తతో చేపలు కొనడానికి వెళ్ళటం గొప్ప సరదాగా వుండేది. మా అమ్మతో వెళ్తే, వాళ్ళు చెప్పిన రేటుకే కొనేది. వరాలత్త అలా కాదు. గీచిగీచి బేరం ఆడుతూ, వాళ్ళ మాటల్లో మాట కలుపుతూ, వాళ్ళకి కోపం తెప్పించేది.

చాలామంది జాలార్లు వరాలత్తకి బాగా తెలుసును.

"గురమ్మా, ఈ వాలుగ ఎంతకిస్తావూ, ఈ వొంజరం ఎలాగ? ఈ కానాకడతలేటి ఇలాగ్గుండయిపోనాయి. పీతలేటమ్మా... వోసనేస్తన్నాయి?" వరాలత్త ప్రశ్నలకు మండిపడేవారు. ముఖాలు చిట్లించుకొని కొరకొర చూసేవాళ్ళు. రెండు చేతుల్లో చేపని పట్టుకొని కత్తిపీటలపై బలం చూపిస్తూ, గొంతుక్కూర్చున్న వాళ్ళ తీరూ నవ్వు తెప్పించేది.

‘ఓలమ్మా... వడ్డీల వరాలప్పా, కొన్నావుశాన, ఎల్లోలమ్మా, బేరవాడనందకొచ్చినాది సవతకారి తల్లి’’ ప్రతి అక్షరాన్ని విడదీసి, రాగం తీస్తూ వరాలత్త చేతిలోని చేపల్ని విసురుగా లాక్కుని తాటి బుట్టల్లో వేసుకునేవారు. దూరంగా వున్నప్పుడు మనకేసి చూస్తూ, ‘‘రా బాబూ, రాయోలమ్మ, సందువాలు కొన్నందకిరా బాబూ, జెల్లిసూడుమీ... ఏక్సాసుగెనాగున్నాదో... ఎగస్టా ముక్కేత్తాను రా బాబూ’’ అంటూ ఇంగ్లీషు పదాలు వల్లిస్తూ పిలిచి, బేరం చెడిపోతే, తిట్లకు దిగుతారు. చేపల బజారు సరదాగా అన్పించేది.

వరాలత్త వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా వుంది. దాంతో పాటు చీటీలు వేయాలనే ఆలోచన కూడా వచ్చినట్లు అన్పించింది. తన అన్నతమ్ముళ్ళతో ఎక్కువగా మాట్లాడేది కాదు వరాలత్త. వాళ్ళు ముగ్గురూ తనకన్నా బాగా డబ్బు వున్న వాళ్ళన్న ఆత్మన్యూనత. వాళ్ళ కన్నా ఎక్కువగా డబ్బు సంపాదించి, దర్జాగా బతకాలన్న వరాలత్త ఆలోచన పెనుభూతంలా మారబోతున్నట్లనిపించేది.

తనకున్న బంగారాన్ని తీసుకెళ్ళు బ్యాంకుల్లో ఉంచి, దానిపైన తక్కువ వడ్డీకి డబ్బు తెచ్చి, బయట వడ్డీలకు తిప్పేది.

చిట్టీలు వేసే కార్యక్రమంలో... తనే ఏజంట్. ముందుగా మొదటి నెల, పాట లేకుండానే చీటీ ఎత్తి, మళ్ళీ ప్రతినెలా తన వంతు కమీషన్ తీసుకునేది.

ముందుగా చిన్న చీటీలు వేస్తూ పదిమందితో మొదలెట్టి, అరవైమందిని తయారుచేసింది. పదివేల చీటీ నుండి... లక్ష వరకూ ఉన్నట్లు గుర్తు. చీటీల్లో తన ముగ్గురన్న దమ్ముల్ని కలుపుకుంది. ఒక పక్క వడ్డీ వ్యాపారం, మరో పక్క చీటీలు... ఇంటికి ఎప్పుడూ వచ్చీపోయే జనం. ‘‘డబ్బు’’ అనే మాట ఆ ఇంట్లో రామ జపమైపోయింది. ఊరి పైకి వెళ్ళి వడ్డీ వసూలు చేయడానికి వీలు దొరికేది కాదు. సింహాచలాన్ని వడ్డీ వసూళ్ళకి పంపడం మొదలెట్టింది వరాలత్త. బడి ఎగ్గొట్టి వడ్డీ వసూళ్ళ కోసం తిరుగుతున్న సింహాచలాన్ని గురించి మా అమ్మ బెంగపడేది. నాన్నతో ఒకసారి విషయాన్ని కదిపింది.

‘‘సింహాచలం స్కూల్ మానేసి ఇలా వెళ్తే, వాడి భవిష్యత్ మాటేమిటని’ అడిగింది. ‘అదంతా వాళ్ళ స్వంత విషయం. మనం జోక్యం కల్పించుకోరా,’దని చెప్పేడు నాన్న.

తల్లి పురమాయించే పనుల్లో వాడు వడ్డీలు చెల్లించే వాళ్ళ ఇళ్ళకు ఉదయమే వెళ్ళి పోయేవాడు. తెచ్చిన డబ్బుల్ని లెక్కకట్టి ఒప్పచెప్పేవాడు మొదట్లో.

ఆ తర్వాత వరాలత్త పని చెప్పకపోయినా, బడి ఎగ్గొట్టేసి ఊరి మీద తిరిగే వాడు. సింహా చలం లీలామహల్లో కన్పించాడనీ, నవరంగ్ సినిమాహాలు ముందు తిరుగుతున్నాడని నాకూ, వాడికీ తెలిసిన మిత్రులు చెప్పటంతో.... వాడిపైన ఏదో అనుమానం పొడసూపింది.

సరిగ్గా స్కూల్ వదిలే సమయానికి పుస్తకాల్తో ప్రత్యక్షమయ్యేవాడు.

ఒకరోజు రాత్రి మేం అన్నాలు తింటున్నప్పుడు వరాలత్త ఇంట్లోంచి ఏదో గొడవ విని పించడంతో ఎంగిలి చేతుల్తోనే అలా పరిగెత్తాము. వరాలత్త కర్ర తీసుకొని సింహాచలాన్ని బాదు తోంది. సింహాచలం మూలకు ఒదిగిపోయి తలదిండు అడ్డు పెట్టుకొని, దెబ్బల్ని తప్పించుకుంటూ ఏడుస్తున్నాడు.

మా అమ్మ గబగబా వెళ్ళి, వరాలత్త చేతిలోన కర్ర లాక్కుంది. శివమెత్తినట్లు గట్టిగా అరుస్తూ... సింహాచలం పైకి వెళ్తోంది. అమ్మ అడ్డుగా వెళ్ళి-‘‘ఏం జరిగింది? ఎందుకలా గొడ్డును బాదినట్లు బాదుతున్నావ్,’’ అంది. ‘‘నీకు తెల్దు సావిత్రొదినా...ఈ గుంట లమ్డీకొడుకు ఏటిసేసాడో సూడుమీ.... ఇనేవర్సిటీలోని సీపరు పద్దాలు దగ్గిర వడ్డీ డబ్బులు రెండొందలు వసూలుసేసి,

నాకు అది ఈనేదని సెప్పాడు. తీరామోసి నాను ఇయ్యాలటుకాసెల్నాను. 'మీ అయ్య నిన్నని వడ్డీ డబ్బులిచ్చానాడేటి వరాలప్పా' అంది పద్దాలు కన్పించి. 'ఆ డబ్బులేయరా' అంతే బస్సులోని పోనాయంతన్నాడు. ఆ ముక్కనిన్నని సెప్పనేదు. యీడి మాట ఎనాగనమ్మిదమ్మా... నా తాగుబోతు మొగుడితో పడతన్నాను సాల్దా. యీడు తయారాతన్నాడు నన్ను ముంచీడాన్కి"

"ఏదో తెలీక చేసేడు... వాడిని వడ్డీల వసూళ్ళకి పంపకు. బుద్ధిగా స్కూల్‌కి పంపు" అంటూ వరాలత్తని కాస్త మందలించబోయింది అమ్మ.

సింహాచలం నావైపు చూసి సిగ్గుపడినట్లు మొహాన్ని గోడకేసి తిప్పుకున్నాడు. మళ్ళీ ఒకరోజు ఉదయమే మేం నిద్ర లేవకముందే సింహాచలం పెడబొబ్బలు పెడ్తున్నాడు. వరాలత్త కొబ్బరి చీపురుతో వాణ్ణి వాయిస్తోంది.

"ఒరేయ్, నాను నీ నుంచి సచ్చీదా? బతికీదా? నాను పాపారావు గోడికి ఏటి సెప్పీదిరా," నూకరాజు అడ్డుకోబోయాడు కానీ, అతన్ని ఒకపక్కకి లాగేసింది వరాలత్త.

అమ్మ, నాన్న ఇద్దరూ వరాలత్తని శాంతపరచాలని చూశారు.

"ఏటన్నియ్యా.. ఈ పోరంబోకు సచ్చినోడితో నాకు ఉరయిపోనాది. కంచరపాలెం పాపా రావు నా దగ్గిర వోచీ ఎట్టాడు. నిన్నని ఆడొచ్చి 'అసలు, వడ్డీ తెచ్చేను వోచీ ఇచ్చీమన్నాడు. మచ్చు మీదని ఇత్తడి గలాసులో నెట్టినాను... ఏదీ! అగుపించనేదు. ఇల్లంతా ఎతికీసినాను. దొరకనేదు. ఈ బేవార్సోడ్ని అడిగితే... నాకు తెలీకంట మొన్ననెప్పుడో సేతికి ఎట్టుకెళ్ళాడంత.. బడిలో నుండి ఇంటికొచ్చీతప్పుడు దారిలోని పడిపోనాదని సెపతన్నాడు... దాన్ని ఒవుడికి దొబ్బెట్టీసినాడో.... నేనా పాపారావుకి ఏటి సెప్పదన్నియ్యా... నిన్నని దొరకనేదంటే యియ్యాలొత్తానని ఎల్నాడు..." అమ్మ, నాన్నకి కూడా ఏం సమాధానం చెప్పాలో పాలుపోలేదు. సింహాచలం ఏడుపు ఆపేసి ఎన్ని దెబ్బలు తినడానికైనా సిద్ధమన్నట్లు చూస్తున్నాడు. మొండిగా వున్న వాడిని చూస్తే... ఎందుకో భయమేసింది నాకు.

రోజులు గడుస్తున్నాయి. వరాలత్తకు రాబడి పెరుగుతోంది. చీటీల వలన మంచి లాభాలు వస్తున్నాయి. ఒకటో తారీఖున చీటీపాటల్లో మునిగి తేలేది. వచ్చిన వాళ్ళందరి మధ్యా లీడర్‌లా వ్యవహరించే వరాలత్త తీరు చాలా హుందాగా కన్పించేది.

చదువు లేకపోయినా, డిగ్రీలు చదవకపోయినా వరాలత్తకున్న లౌక్యం, దానికి తోడు ధైర్యం ఆమెను ముందుకు నడిపిస్తున్నాయనిపించేది.

ఆ పెంకుటిల్లు తీసి, పెద్దగా రెండతస్తుల డాబా కట్టాలని కలలు కనేది వరాలత్త. ఆమెకు వచ్చే రాబడిని బట్టి చూస్తే... ఆ పని త్వరలో చేసి తీరుతుందని అన్పించేది నాకు.

అలా కాలం గడుస్తోన్న క్రమంలో... నాన్నకి ప్రమోషన్ పైన హైద్రాబాద్‌కి బదిలీ అవటం జరిగింది. నాకు ఊహ తెలిసిన దగ్గర్నుండి పెరిగిన విశాఖపట్నం వదిలి వెళ్ళాలంటే ఏడుపొచ్చింది. రోజూ కన్పించే సింహాచలం, వరాలత్త, చుట్టలు కాల్చే ముసలమ్మ విశాఖ బీచి, కొండలు, పండిన అనాసలు.. సంపెంగలు. రెల్లివాళ్ళ తిట్లు, యారాడకొండా, జీడితోటలు, తాటితోపులూ, చేపల మార్కెట్టూ.... వరాలత్త పెంకుటిల్లూ... వీటన్నిటిని వదిలిన రోజు మనసంతా మబ్బు పట్టినట్లుగా... చాలా దిగులేసింది.

వరాలత్త కూడా మేం వెళ్తున్నామని తెలియగానే కాస్త చిన్నబోయింది. "రమణా... మళ్ళీ ఒప్పుడొత్తావు. నాక్కూతురునేకపోయింది గానీ, వుంటే నీక్కట్టబెట్టీసి, ఇల్లరికం వుంచీసుకొని నా వొడ్డీ యాపారవంతా అప్పచెప్పీద్దును నీకు," అంది.

మేం ఇల్లు ఖాళీచేసి రైల్వేస్టేషన్‌కు వచ్చినప్పుడు మాతోపాటే వరాలత్తా, సింహాచలం వచ్చేరు. రైలు కదిలే వరకూ మా దగ్గరే వున్నారు. రైలు కదలబోతున్నప్పుడు అమ్మ, వరాలత్త కళ్ళొత్తుకున్నారు. వరాలత్త కనుమరుగైన దాకా కిటికీలోంచి చూస్తూ, చేయి ఊపేను. చివరగా నాకు కన్పించినవి స్టేషన్‌లో రాసిన 'వాల్తేరు' అక్షరాలు.

హైద్రాబాద్‌కు వచ్చేసినా తర్వాత చాల్రోజుల వరకూ వరాలత్తని వాల్తేరత్తగా సంభోదించు కుంటూ, వాళ్ళతో గడిపిన జీవితాన్ని, ముచ్చట్లనీ... ఎన్నాళ్ళో నెమరువేసుకున్నాం.

*

కోరుకొండ సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్ల పని ముగించుకొని, విశాఖ బయల్దేరాను. పాతికేళ్ల క్రితం వాల్తేరుకి ఇప్పటి విశాఖకీ చాలా తేడా కన్పించింది. ఎల్లమ్మ తోట జంక్షన్ కాస్తా జగదాంబ సెంటర్‌గా మారింది. మేం చిన్నతనంలో ఆడుకున్న వెంకోజీపాలేనికీ, ఇసకతోటకీ మధ్యనున్న జీడిమావిడి తోట మాయమై ఎమ్.వి.పి. కోలనీగా వెలసింది. గాజువాక దగ్గర్లోని గంట్యాడ మొదలు... బాలచెరువు, నెల్లిముక్కు, గంగవరం వరకు వ్యాపించి వుండిన అందమైన పల్లెలు, పొలాలూ మట్టిలో కలిసిపోయి, స్టీల్ ప్లాంట్ అవతరించింది.

విశాఖ జల సముద్రం పెరిగినట్లు లేదు కానీ, విశాఖ జనసముద్రం ఈ పాతికేళ్ళలో పదివంతులు పెరిగినట్లుంది.

అలా... ముందురోజు విశాఖ అంతా కలదిరిగి, మర్రోజు ఆటో తీసుకొని వరాలత్త ఇంటికి బయల్దేరాను. ఆటోని రామాలయం దగ్గరే ఆపించి, నడుస్తూ ముందుకు వెళ్తున్నాను. గతం కళ్ల ముందు గిరికీలు కొడుతోంది. అనిర్వచనీయమైన ఆనందం. నా నరనరాల్లోకి వ్యాపిస్తోన్న తెప్పరిల్లే వీలుకాని భావోద్వేగం.

అదే చేద బావి. నీళ్ళని తోడేవాళ్ళు ఎవరూ లేరు. బావిలోకి తొంగి చూసేను. బావిలో నీటి చుక్కలేదు. ఎండిపోయిన అడుగు కనిపిస్తోంది. అక్కడ్నుంచే వరాలత్త ఇంటి కోసం చుట్టూ చూసాను. ఆశ్చర్యం! పెంకుటిల్లు మాటేలేదు. అన్నీ డాబాలే కన్పించేయి. వరాలత్త ఇల్లనుకొన్న స్థానంలో మూడంతస్తుల అందమైన మేడ కన్పించింది. దాన్ని చూడగానే గొప్ప సంతోషం కల్గింది.

నన్ను వరాలత్త గుర్తిస్తుందా? నన్ను నేను ఎలా పరిచయం చేసుకోవాలి? అందమైన డాబా.... అనుకున్న లక్ష్యాన్ని సాధించిన వరాలత్త వడ్డీలతో, చీటీలతో లక్షల్ని గడించి వుంటుంది. ఆ ఠీవి, దర్పం మరింత వన్నె తిరిగి వుంటాయి. సింహాచలం ఈ వయసులో ఎలా వుంటాడు? ఉద్యోగం లాంటిది చేయాల్సిన కర్మ లేకుండా వరాలత్త అన్నీ సమకూర్చి వుంటుంది. నూకరాజు సారా మానేసి, విస్కీల్లో తేలిపోతూ ఉంటాడు కాబోలు.

రకరకాల ఆలోచనల హోరు. తడబడే అడుగులతో ఉద్వేగభరితంతో వరాలత్త డాబా ఇంటి ముందుకు వచ్చి నిల్చున్నాను.

గేట్ దగ్గరున్న కాలింగ్‌బెల్ స్విచ్ పైన చూపుడు వేలితో నొక్కేను. తెల్లటి జూలుతో వున్న కుక్క 'భౌ' మంటూ పరిగెత్తుకొచ్చింది. ఆ వెనుక నుండి ఒక ఆడమనిషి. బహుశా సింహాచలం భార్యేమో....

"ఎవరండి...."

"వరాలమ్మగారి ఇల్లు ఇదే కదండీ," లోపల్నుండి వరాలత్త వస్తుందేమోనని చూసేను. "ఆ పేరు గల వారెవరూ ఈ ఇంట్లో లేరండి..." అంటూ నన్ను అనుమానంగా చూడటం గమనించి తత్తరపాటుతో-

‘‘పాతికేళ్ళ క్రితం ఇక్కడో పెంకుటిల్లు ఉండేదండీ....’’ నసిగినట్లన్నాను. ‘‘మేం ఈ ఇంట్లో అద్దెకుంటున్నాం. ఈ ఇంటి గలవాళ్లు డాబాగార్డెన్స్‌లో వుంటారు. మీరు చెప్పిన వాళ్ళ తాలూకు కావచ్చు. అదిగో ఆ ముందుని కన్పించే మునగచెట్టు కేసి తిన్నగా వెళ్ళండి. అక్కడున్న కమ్మరింట్లో ముసలమ్మ వుంటుంది. వరాలమ్మ ఆవిడేననుకుంటాను...’’ అదిరిపడినట్లు అటుకేసి చూసేను.

ఆమె చెప్పే మాటలు చేదుగా విన్పించేయి. మనసంతా వికారమై పోయింది. నమ్మలేని నిజంలా తోచింది.

మారు మాట్లాడకుండా..... మునగ చెట్టున్న వైపు అడుగులు వేసేను. వరాలత్త ఈ పాకలో ఎందుకుందో, ఉండాల్సిన కర్మ ఏమిటో అర్థంకాలేదు. ఒంటిరాట తాటి కమ్మరిల్లు, ద్వారం కూడా తెలీకుండా కిందనున్న చూరు... నా అడుగుల చప్పుడికి, ‘‘ఎవరదీ?’’ అన్న మాటలు విన్పించేయి లోపల్నుండి.

ఒక్కసారిగా ఒళ్ళు జలదరించింది. ఆ మాటతీరు, కంఠ స్వరం వరాలత్తదే! నిలబడి ఉన్న నేను కాస్త వంగి పాక చూరు కిందగా చూసేను. చూరు కిందున్న నులక మంచం పైనుండి లేచి బయటికి వచ్చింది వరాలత్త.

వరాలత్తని చూడగానే నా మతిపోయింది.

‘‘ఎవరు బాబూ.... ఒవులింటికొచ్చినావూ.....’’ ఆ ప్రశ్నకు సమాధానం కూడా చెప్పే స్థితిలో లేనట్లు వరాలత్తను ఆపాదమస్తకం ఆశ్చర్యపోతూ చూస్తున్నాను.

గుండెలోంచి తన్నుకొచ్చిన ఒక దుఃఖపు అల నా కళ్ళను కప్పేసింది. చందమామలా గుండ్రంగా వుండి, పసుపు రాసుకున్న ఆ ముఖంలో రూపాయి బిళ్ళంతా ఎర్రనిబొట్టు.... నిండయిన విగ్రహం.... ఏదీ? నూకరాజు చనిపోయాడా?

చిక్కి శల్యమయిన శరీరం. ముగ్గుబట్టలా తెల్లబడిపోయిన తల, లోతైన కనుగుడ్లు ఎముకలు తేలిన దవడలు, ఒళ్ళంతా ముడతల్తో వంగిన నడుము.

నాలోంచి నేను తేరుకోలేని స్థితిలో....

‘‘ఎవరు బాబూ...? అంది వరాలత్త.

‘‘నేను వరాలత్తా... రమణని’’ నా మాట దుఃఖంతో పూడుకుపోయింది.

‘‘ఏ రవణా..?’’ భృకుటి ముడుస్తూ, నా కళ్ళలోకి చూసింది.

‘‘నా చిన్నతనంలో మీ ఇంట్లో అద్దెకు ఉండేవాళ్ళం, సింహాచలం నేనూ ఆడుకునేవాళ్ళం. అమ్మ- సావిత్రమ్మ. నాన్న యూనివర్శిటిలో ఉద్యోగం చేసేవాడూ...’’

ఒక్కసారిగా కంపించినట్టుగా, వణుకుతున్న చేతులతో నా రెండు భుజాలని పట్టి ఊపుతూ-

‘‘రవణబాబూ... యీ వొరాలత్త గేపకమున్నాదేటి?’’ వరాలత్త కళ్ళు తటాకాలయ్యాయి. దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. పెద్దగా ఏడుస్తూ నా ఒళ్ళు తడుముతోంది. నా అరచేతిని వరాలత్త వీపుపై వుంచి, ఆమెను అలా కాస్సేపు వదిలేసాను. దుఃఖం నుండి తేరుకొని నా చెయ్యి పట్టుకొని ఇంట్లోకి తీసుకెళ్ళి నులకమంచం పైన కూర్చోబెట్టింది. ఇంటిని పరిశీలనగా చూసేను.

నేను కూర్చున్న నులకమంచం, నా చిన్నతనంలో నే చూసిన రంగంపెట్టె, మూలగా పొయ్యి, నాలుగయిదు పాత్రలు, దండెం పైన రెండు చీరలు, మరికొద్ది సామాను- అంతకన్నా ఎక్కువగా ఏమీ లేవు. చితికిపోయిన వరాలత్త బతుకు నేపథ్యం గురించి ఆతృతతో అడిగాను.

‘‘బోల్డు జరిగిపోనాయి రవణబాబూ.... నా బతుకు యీదికుక్కల పాలయిపోనాది. నా నోట్లోని బుగ్గోసీసినారు మంద. నా కడుపు కాలిపోనాది నాయనా... నా సిమ్మాసిలం నాక్కాకంట ఎలిపోనాడు రవణబాబూ...’’ ఒక్కక్షణం ఆగింది వరాలత్త.

నాకు ఏం జరిగిందో అర్థంకావటం లేదు. సింహాచలం ఏమయ్యాడో తెలీదు. పెళ్ళి చేసుకొని వేరుగా కాపరం పెట్టి, వరాలత్తని చూడకుండా వున్నాడా?...

కొద్దిసేపు మౌనంగా ఉండి మొదలెట్టింది.

“రవణబాబూ... తవరీ వూరొగ్గేసి ఎలిపోనాక.... ఏటి జరిగినాదంతే ఏటి సెప్మంతావు నాయనా.. సీటీల మీద సీటీలేసినారు... జనం. వడ్డీ యాపారవూ జరుగుబాటుగే సాగినాది. నా సిమ్మసెలవు నన్నొగ్గేసి ఎలిపోనాడు రవణబాబూ.. నా రంగంపెట్టిలోని మర సెంబులో దాసిని తాకట్టు సొమ్మొట్టుకు పారిపోన్డు.... ఊరి జనవంతా నా మీద కెళిపొచ్చినారు...

“నా కన్నోరు, కట్టుకున్నోడూ... అంతా నన్నే తిట్టేరు. నానుండే నా సిమ్మాసెలవు పారిపోనాడన్నారు. నాను సేసిన తప్పేటి? ఆడ్ని వడ్డీలు వసూలు చేయనందకి పంపి, డబ్బు రుసి సూపినానని నన్ను కాకుల్లా పొడిసీసినారు. నా సిమ్మాసెలాన్ని ఎంత ఎతికించినా నాబం నేకపోనాది. వడ్డీ లీయిటుం, సీటీలేయిటుం తప్పో, ఒప్పో నాకు తెల్దు.

“నా మొగుడు తాగుబోతోడై... తెచ్చిందంతా తాగుడికి తగలేసేసి.... తీరమోసి సారాకి నన్నే డబ్బులడిగేవోడు. మాకేటున్నాయి బూవా! పుట్రా! డబ్బా! దస్కవా! ఏటీనేదు. మాయమ్మ సచ్చి ఏసొరగానున్నాదో గానీ అదిచ్చిని పసుకుంకాల జాగావులో నాను వడ్డీ యాపారంలో గడించి, పెంకుటిల్లు ఏసాను. దాని సలవ్వల్లే గెంజి తాగినాం. పెళ్ళాం సంపాదన కాసించీ మొగుడూ... మగోడేనా బాబూ... నానూ అందర్నాగ దర్జాగా బతకాలనుకున్నాను. బతకనందకి ఈ పాపిట్టి యాపారం సేయికూడదని తెలిసినా.... తప్పనేదు. నా మొగుడు సంపాదిత్తే... నాకీ కరమ్మేటి రమణ బాబూ, నా సిమ్మసెలం నాకాడే వుండునూ, ఆడెలిపోనాక, ఏడాదికి తాగితాగి... నా పెనిమిటీ సచ్చిపోనాడు.

“ఆనక, నా మీద పడ్డాది బాబూ పిడుగు నాటి దెబ్బ. మరి కోలుకోనేక పోన్ను. నా దగ్గిర సీటీలేసి న్నంజి.... నన్ను దగా సేస్సి రెండు నచ్చుల సీటీ పాడీసుకుని పారిపోనాది మొగుడూ, పిల్లా అంతా మాయవయిపోన్రు. నాను ఎనాగై పోనానో బాబూ... సిమ్మాసెలం ఎత్తికెళ్ళిపోయి న్నగలన్నీ సేయించి ఊరోళ్ళందరికి ఇచ్చీసరికి నాకాడ ఏటీ మిగల్నేదు.

“ఆ రెండు నచ్చిలు ఎత్తుకెళ్ళిని నంజి ఎక్కడున్నాదో.... తెలీకంటయిపోనాది. శికాకుళమెళ్ళి పతి ఏయించినాము. అది డబ్బొట్టుకొని దేశం దాటీసిందన్నారు మరికనేటి సేసి ఏట్నాబం? ఏడిత్తే వత్తాదా?

“సీటీనోన ఆకారుగా నా తమ్ముడుండిపోనాడు. ఆ నంజి ఎల్పోగానే ఒవులూ సీటీలు కట్నందకి రానేదు. ఇచ్చీవోరికీ ఏనాగివ్వాలో తెలీనేదు... ఊరిజనం దిగిపోనారు.... ఇల్లు తనకా ఎట్టయినా ఇత్తానన్నాను. ‘ఊరు మొగుల్లికి ఇల్లిచ్చేత్తే... మరి నా సంగతేటప్పా’ అన్నాడు నా తమ్ముడు. ఆడికి గూడమొయ్యా డబ్బున్నా, ఆపదనోనున్నాదప్ప.... దాన్ని యిబ్బందుల్లో ఎట్టీడం ఎందుకన్నేదు రమణబాబూ..... అప్పనని సూడకంటా నంజా, నమిడీ అనీసి బూతులాడీసినాడు. పోలీసుటేసిన్లో నన్నెట్టిత్తానన్నాడు... ఏటి బాబూ.... డబ్బు దగ్గిర అప్పేటి? సెల్లేటి? నన్నా ఇంట్నోంచి బయటకీడ్సీసినాడు. నా సావానంతా ఇసిరేసినాడు... ఆడ్నెప్పుడు ఎర్నమ్మోత్తుకు పోతాదోగానీ... అనాగ రాలిపోనాడు బాబూ... అడ్డొచ్చి నాదని మాయమ్మని తన్నీసినాడు... నాయిల్లు తన పేర రాసీసుకున్నాడు. నా నొంటరిదాన్ని, ఏటి సెయగల్ను బాబూ... నానుండే మంచవట్టేసింది మాయమ్మ. ‘నా కూతురు బతుకు బుగ్గయిపోనాదని’ కునుకునేక కునుకునేక ఏకంగొక్కపాలే మంచంనోనే కునికీసింది బాబూ... మాయమ్మ సచ్చిపోనాక దిక్కుతోచకంట ఒంటరి పచ్చినయిపోనాను.”

వరాలత్త నాతో మాట్లాడుతుండగానే ఎవరో ఆడమనిషి చెవి దుద్దులు తెచ్చి, డబ్బు కావాలని అడగటమూ, వరాలత్త రంగంపెట్టి తెరిచి, డబ్బు తీసి ఇవ్వటమూ జరిగిపోయాయి.

ఆశ్చర్యపోతూ నోరు తెరిచాను. తనిలా చితికిపోవటానికి కారణభూతమైన వడ్డీ వ్యాపారాన్ని ఇంకా వదల్లేకపోవటం....! నా ఆలోచనల్ని పసిగట్టినట్లు, "రవణబాబూ, నాను బతకనందకి ఏ ఆదరువు నేకపోతే ఎనాగ? నా కాడకి వడ్డీలకి వచ్చీ జనం పూరాగా తగ్గిపోనారు. వొయిజాగు యీదీదినోనీ పయినాన్సు కంపినీలు, చిట్టుపండులూ.... పుట్టగొడుగుల్లా నెగిసిపోనాయి. అయినా నాకాడ పెట్టుబడీనేదు. ఏయమ్మో నామీ్మదయున్నమ్మ అప్పుడప్పుడొత్తాది... నాకు తెలీకడగతాను బాబూ, పెళ్ళాన్ని, పిల్లల్ని సూడకంట పేకాటకీ, తాగుడుకీ, ముండలకీ జీతవంతా కరుస్సేస్సి, ఇంట్లోకి దమ్మిడీ ఇయికంట ఏడిపిత్తే.... కడుపుని కాసుకున్న దానికి, పిల్లలు పస్తులుంతే పేనం ఎంతుసూరుమంతాదో నీకెరికినేదా బాబూ..... దయిరుం లేనిదాయి సత్తాది, నాలాటి దాయి ఏ వడ్డీ యాపారవో, కూరగాయిలు కొట్టో, కిల్లీ కొట్టో.... మరేటో, మరేటో, సివార్ని పడుసుకోనైనా పిల్లలకి కూడెడతాది. ఏటంతావు బాబూ.... నా మొగుడు తాగనందకి ఆపీసునోని నోన్లు తీస్సి, బయట్ని అప్పులు మీదప్పులు సేసాడనీ నాకానక తెలిసింది. అప్పిచ్చినోరు వల్లకుంతారా బాబూ.... ఆడికొచ్చీ పించినీనంతా జమ కట్టించు కుంతన్నారు. వుప్పుడు నాగ్గెంజోసీవోరేరి? రేపుట్నాడు నా సిమ్మాసెలం వచ్చీసి, ఓలమ్మా, నాకేటి దాసినావే? నాకేటి సంపాదించినావే?' అనంతే నానేటి సెప్పీది బాబూ, ఆడికోసవనే కూడేత్తన్నాను... ఇదిగో రవణబాబూ, నా సిమ్మాసెలం బేగొచ్చియాలని అనకాపల్లి నూకాలమ్మ తల్లికీ, యిజీనగరం పైడితల్లమ్మకీ, మా వూరి కనకమాలచ్చింకీ, బెజోడ కనకదుర్గమ్మకీ ముడుపుల్ని కట్టేను. నా సిమ్మాసెలం నన్నొగ్గీసెల్లిందగ్గిర్నుండీ యీనాగే ముడుపులు కడతన్నానుగానీ, అయమ్మోర్లికి నామీ్మదయినేదు. నానేనూతిలోనో పడిపోయి పేనాలొగ్గీద్దును. కానీ, రేపో, ఎల్లుటో నా సిమ్మాసెలం వొత్తాడని పానాలుగ్గ బట్టుకోనున్నాను. నాన్నేకపోతే ఆడు వొంటరయిపోడేటి బాబూ....

"నానెంత వడ్డీ యాపారం సేసినా నానూ మడిసిజలమే ఎత్తాను. ఆడపుట్టకే పుట్టి పాలిచ్చే పెంచాను. నా పేగు తీసి వొవులికి అరదమవుతాది బాబూ... నా సిమ్మాసెలం ఒచ్చేత్తాడొచ్చేత్తాడని నా మనసంతాది బాబూ. ఆడెక్కడున్నాడో గానీ... ఆడి పేగోసన అప్పుడప్పుడు నా ముక్కుకి తగలతాది బాబూ..." ఇక వినలేకపోయాను. వరాలత్త మాటలు వింటుంటే దుఃఖం తెరలు తెరలుగా కమ్ముకొస్తుంది. ఎక్కువసేపు ఉండలేననిపించింది ఆ వాతావరణంలో, అయినా ఆమె దుఃఖంలోంచి తెప్పరిల్లే వరకు ఉండి, మెల్లిగా లేచి నిల్చున్నాను. వరాలత్త దగ్గర సెలవు తీసుకున్నాను. తలెత్తి వరాలత్త కళ్ళల్లోకి చూడకుండా గబగబా అడుగులు వేస్తూ, రామాలయం వైపు నడిచాను.

రైల్లో ప్రయాణిస్తున్నా.... కళ్ళ ముందు ఆ అభాగ్యురాలే- విశాఖపట్నం నుండి ఒక చేదు అనుభవాన్ని హైదరాబాద్‌కు మోసుకుపోవాలనిపించక, ఆనాటి వాల్తేరు వరాలత్తనే నెమరు వేసుకుంటూ కళ్ళు మూసుకున్నాను.... మనోనేత్రంలో మాత్రం నేటి వరాలత్త వాస్తవరూపం కదలాడుతూ నన్ను భయపెడుతోంది.

సింహాచలం బతికి ఉన్నాడో! లేడో! చివరికి వస్తాడో! రాడో! తెలీదు కానీ.... ఆ తల్లి పేగు మాత్రం కడదాకా కొడుకు కోసం దిక్కులు పిక్కటిల్లేలా అరుస్తూనే ఉంటుందేమో!

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*5 నవంబరు 2000*

నేపథ్యం

## తల్లిపేగు ఆర్తనాదం
# వాల్తేరత్త

***ఎందరో బతుక్కి వడ్డీ వ్యాపారం ఆసరా అవుతున్నా, దానివల్ల నష్టపోయినవాళ్లూ ఉన్నారు. చీటీలు పాడేసుకున్నాక పారిపోయేవాళ్లు,, ఆ డబ్బులు కట్టడానికి నగా, నట్రా, ఇల్లు, పొల్లు అమ్ముకున్నవాళ్లను కూడా చూశాను. డబ్బు మూలంగా సొంతవాళ్లతో పేచీలు, తిట్లు, గొడవలూ, కొట్టుకోవడాలూ చూశాను.***

ఈ కథ రాసేనాటికి 'విశాఖపట్నం' అంటే నాకు విపరీతమైన ఇష్టం, ప్రేమ, పిచ్చి, మైకం, మోజు ... ఇన్ని మాటలెందుగ్గాని, ఆ ఊరి యాసలో కాస్తా మొరటుగా చెప్పాలంటే 'సెడ్డ రోకు'! చలంగారి లాంటి మహానుభావుడినే కుదిపి కుదిపి వెర్రివాణ్ణి చేసిన సౌందర్యం దానిది. నేనేపాటి? అది విరజిమ్మే కాంతిరేఖ తాకిడికే కాలి బూడిదయ్యే శలభాన్ని.

ఇంతగా విశాఖ నిన్నెందుకు ఆవహించిందని మీరడిగితే ఏం చెప్పాలి?

అమ్మ కడుపులోంచి బాహ్య ప్రపంచంలోకి రాగానే విశాఖ మట్టిని ముద్దాడినందుకా? మా బంధుజనం పటాలం ఆ ఊరి నిండా ఉన్నందుకా? ఆకాశానికెగబాకిన యారాడకొండా? దిగంతాలకు పాకిన సముద్రమా? భీమ్లీ నరసింహస్వామా? సింహాచలం సంపెంగలా? సిమ్మాద్రి అప్పన్నా? కనకమాలచ్చిమా? సొర్రపిట్టు రుచా? పూర్ణా మార్కెట్టా? ఎల్లమ్మతోటా? చావుల మదుంవా? షిప్పియార్డా? కాల్టెక్సా? ఆంధ్రా యూనివర్సిటీయా? శాంతి ఆశ్రమమా? గవర్నర్ బంగ్లా? ఆశీలుమెట్ట జంక్షనా? సెంట్రల్ జైలా? ఎర్రమట్టి దిబ్బలా? సీతమ్మధారా? కెజీహెచ్చా? కలెక్టరాఫీసా? భీమ్లీ డచ్చీ స్తూపాలా? ముడసర్లోవ అందాలా? అరకు రైలు ప్రయాణమా? రిషికొండా? తొట్లకొండా? భీమ్లీ బీచ్ రోడ్డా? కైలాసగిరా? రావిశాస్త్రి, శ్రీశ్రీలు దోగాడిన నేలా? ఏదని చెప్పాలి? ఎవరని చెప్పాలి? పెగ్గు పెగ్గుకీ నిషా అంచెలంచెలుగా నషాళానికెక్కినట్టు... ఆ ఊరికి వెళ్లిన ప్రతిసారీ ఒక్కక్కటీగా నన్ను ఆవహించి పిచ్చివాణ్ణి చేసిన విశాఖ

అది. అమ్మో! అది అందమా? కళ్లు చిట్లిపోయి, గుండె పిట్లిపోయే సౌందర్యం. దాన్ని భరించాలంటే మనిషన్నవాడికి మనసుండకూడదు. ఉన్నా దానికి విశ్వమంత కళాపోసనుండాలి? నక్షత్ర మండలానికి రెట్టింపు కళ్లుండాలి! కొండంత గుండె నిబ్బరం కావాలి!!

*

ఉమా (ఆర్.ఎం.) హైద్రాబాద్ 'ఆంధ్రజ్యోతి ఆదివారం' సంచికకు ఇన్‌ఛార్జ్‌గా పనిచేసే రోజుల్లో బతిమాలి, బామాలి, తిట్టి, గిల్లి, కసిరి, కొట్టేంత పనిచేసి కొందరితో కథలు రాయించినట్టే నా చేత కూడా 'జలగలవార్డు', 'గజ ఈతరాలు' లాంటి రెండు, మూడు కథలు రాయించి, హఠాత్తుగా బదిలీ చేయించుకుని (1999-2000 ప్రాంతాల్లో) తిరుపతి వెళ్లిపోయాడు. తర్వాత మిత్రుడు పారుపల్లి శ్రీధర్ ఆ పోస్టులో (తాత్కాలికంగా) ఉండగా నన్నో కథ రాసిమ్మని అడగడంతో అప్పటికే నాలో సంవత్సరాలుగా నలుగుతున్న 'వాల్తేరత్త' కథకి శ్రీకారం చుట్టాల్సి వచ్చింది. ఈ కథానేపథ్యం చెప్పాలంటే కనీసం నాలుగు దశాబ్దాల కాలాన్ని నేను వెనక్కి తిప్పాలి. డాగులు పడి, మసకబారిన నా బాల్యపు అద్దాన్ని తళతళ మెరిసేలా రుద్దాలి.

*

నాకు ఊహ తెలిసింది పాలమూరు జిల్లాలో. నాన్న ఉద్యోగరీత్యా మహబూబ్‌నగర్ టౌన్‌లో ఉండేవాళ్లం. అప్పటికి ప్రతి మనిషికి ఒక స్వంత ఊరనేది ఒకటుంటుందనే విషయం కూడా తెలీదు. నా ఎనిమిదేళ్ల వయసప్పుడు వేసవి సెలవులకి (1967-68ల్లో) తొలిసారి అమ్మ, అన్నయ్యలతో కలిసి ఇప్పట్లా 8 గంటల్లో కాదు, దాదాపు రెండు రోజులు ప్రయాణం చేసి విశాఖపట్నం వెళ్లాను. అక్కడకి వెళ్లాకే తెలిసింది, మా అమ్మానాన్నలకూ స్వంత ఊరనేది ఒకటుందని, అదే విశాఖపట్నం అని. అక్కడి మా బంధువర్గాన్ని చూసి అదిరిపోయాను. అమ్మమ్మ, తాత, పెద్దమ్మ, పిన్నులు, అత్తలు, మేనమామలు, చిన్నాన్నలు, పెదనాన్నలు, బావలు, బామ్మరుదులు, మరదళ్లు, వదినలు... వాళ్ల పిల్లలూ, జల్లలూ అబ్బో... అప్పటికే వందమంది దాకా ఉంది పటాలం. ఒక పిన్ని మద్దిలిపాలెంలో ఉంటే, ఒక మామయ్య రేసవానిపాలెంలో, పెద్దమ్మ భీమ్లీలో, మిగతా మరికొందరు ఇసకతోట పరిసర ప్రాంతాల్లోనేఉండేవారు. నాన్న తరపువాళ్లంతా తగరపువలస దగ్గర్లో ఉన్న అమనాంలో. ఎవరి కుటుంబం వాళ్లదే. అమ్మమ్మ తాతలు మా చిన్న మేనమామ ఇంట్లో ఉండేవారు. ఆ పక్కనే ఉన్న మరో ఇంట్లో మా అమ్మ చిన్న చెల్లెలు ఎల్లయ్యమ్మ తన ఆరుమంది సంతానంతో ఉండేది. చినాన్న పోర్టు ఉద్యోగి. మిగతా బంధువుల్లో ఎవరెవరు ఏ ఏ వరస అవుతారో మొదట్లో అంతా గందరగోళంగా ఉండేది. తాత ఇంటికి కూతవేటు దూరంలో ఉండే పొలంలో (ప్రస్తుతం కృష్ణా కాలేజీ ఏరియా) కౌలు చేస్తూ గంట్లూ, సోళ్లూ, చిలగడదుంపలూ పండించేవాడు.

ఒకటి రెండుసార్లు వేసవి సెలవుల్లో విశాఖపట్నం వెళ్లి రావడంతో వాళ్లంతా నాకేమవుతారో కొద్దికొద్దిగా బోధపడింది. విశాఖపట్నం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉండే పల్లెల్లో మరికొంతమంది బంధువులు కూడా ఉన్నారని తెలిసింది. ఎప్పుడు విశాఖపట్నం వెళ్లినా మా పెద్దమ్మ వాళ్ల ఇంటికి (భీమ్లీ) మాత్రం తప్పకుండా వెళ్లేవాళ్లం. భీమ్లీ ద్వీపకల్పంలా ... మా పెద్దమ్మ వాళ్ల ఇంటి నుండి చూస్తే మూడు వైపులా సముద్రమే కనిపించేది. రాక్షసుడి ఉఛ్వాస నిశ్వాసల్లా దాని హోరు మాత్రం క్షణం ఆగకుండా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉండేది. అప్పటికి సాహిత్యం గురించి నాకు ఓనమాలు కూడా తెలీకపోయినా, భీమ్లీలో ప్రముఖ రచయిత్రి ద్వివేదుల విశాలాక్షిగారి ఇల్లు కెరటాలని

తాకుతూ ఉండేదని, వాళ్లింటి పనిమనిషి మా పెద్దమ్మ ఇంటి పక్కనుండే పాకలోనే ఉండేదని చెప్పుకునేవారు. 'రచయిత్రి అంటే ఏంటని' అడిగేవాణ్ణి మా పెద్దమ్మ కూతుళ్లని. 'కథ(లాస్త్రా)రా ... 'రెండు కుటుంబాల కథ' సినిమా చూశావా? ఆ కథ ('వారధి' నవల) విశాలాక్షిగారు రాసిందే, పైగా ఆవిడ షావుకారు జానకిగారికి వియ్యపురాలని చెప్పేవారు. ఆ వయసులో ఆ మాటలు నాకెంతపూర్తి అర్థమయ్యేవో ఏమోగానీ ఒహో అని తలూపేవాణ్ణి.

ఇక ఈ కథలోని వరాలమ్మకి ప్రేరణ మాత్రం మా ఎల్లయ్యమ్మ పిన్నే. చిన్నాన్న తను సంపా దించిన జీతం డబ్బులన్నీ పేకాటలో పెట్టేసేవాడు. తప్పని పరిస్థితుల్లో సంసారాన్ని తన భుజ స్కంధాలపై వేసుకుని ఒకవైపు బడ్డీకొట్టు నడుపుతూ, మరోవైపు వడ్డీలకు తిప్పుతూ నెట్టుకొచ్చేది పిన్ని.

విశాఖలో ఉన్న ఆ వేసవి రెండు నెలల్లో పిన్నిని బాగా గమనించేవాడిని. ఇంట్లో పెద్ద పెద్ద ట్రంకు పెట్టెలుండేవి. వాటినిండా కుదవబెట్టిన సామానుండేది. వాచీలు, రేడియోలు, ఇత్తడి గిన్నెలు, బిందెలతోపాటు చెవికమ్మలు, ముక్కుపుడకలు, పుస్తెలతాళ్లు, పట్టగొలుసులు, గాజులు, ఉంగరా ల్లాంటి నగలైతే సర్వసాధారణం. ఆమె దగ్గర చిత్రగుప్తుడి చిట్టాలాంటి పెద్ద రిజిస్టరు. ఎవరెవరికి ఎంతెంత డబ్బులు ఇచ్చింది? ఎంత వడ్డీ? వాళ్లు కుదవపెట్టిన వస్తువు లెక్కలన్నీ రాసేది అందులో. వాళ్లిచ్చిన వస్తువుకు పూర్తి వివరాలు రాసిన ఒక 'టాగ్' కట్టేది. ప్రతిరోజూ సూర్యోదయం కాకముందే ఒకరో ఇద్దరో ఇంటిముందు నిద్రకళ్లతో ఏదో ఒక వస్తువుతో పాటు డబ్బు కోసం రెడీగా నిల్చుని ఉండేవారు. ఎక్కువగా 'రెల్లి' వాళ్లు. కూరగాయలు, పళ్లూ, రకరకాల చిల్లర వ్యాపారాలు చేసేవారు కాబట్టి తరచూ డబ్బు అవసరం ఉండేది వాళ్లకి. పిన్నికి తోడుగా మా అమ్మమ్మ సపోర్టు. ఒక్కోసారి జమిలిగా వడ్డీ వ్యాపారం చేసేవారు. పిన్ని వాళ్ల పెద్దబ్బాయిని వడ్డీ వసూళ్లకు పంపేది. వసూలు చేసిన డబ్బులతో వాడు సినిమాలు, షికార్లు చేసేవాడు. ఒక్కోసారి కుదవ పెట్టిన నగోనట్రో కాజేసి, అమ్మేసి, ఆ డబ్బుతో రాజమండ్రి పారిపోయి జల్సా చేసి వచ్చేవాడు.

మరో పిన్ని మద్దిలిపాలెంలో ఉండేది కాబట్టి ఈ కథలోని పరిసరాలకు ఆమె ఇంటిని వాడుకున్నాను. ఆ చిన్నాన్న మాత్రం తాగడంలో 'దేవదాసు'కు బ్రదరే. కథలో సౌలభ్యం కోసం పేకాట చిన్నాన్నని తాగుబోతుగా మార్చేశాను. నా పాత్రని బంధుత్వం లేకుండా అవుట్ సైడర్‌గా, ఇంట్లో అద్దెకున్న వారి అబ్బాయి రమణగా, వరాలమ్మ రోజువారి దినచర్యను గమనిస్తున్నట్టు కథను అల్లుకున్నాను.

నా ఎనిమిదేళ్ల వయసు నుండి దాదాపు 20 ఏళ్లపాటు విశాఖ వెళ్లినప్పుడల్లా పరిసరాల్లో, అక్కడి మనుషుల్లో వచ్చిన మార్పుని, ముఖ్యంగా విశాఖ యాసని గమనించేవాణ్ణి. నేను తొలిసారి వెళ్లినప్పుడు ఊరు మొత్తానికి పదిలోపు సినిమాహాళ్లు మాత్రమే ఉండేవి. ప్రభాత్, రామకృష్ణ, సరస్వతి, లీలామహల్, అలంకార్, పూర్ణ, నవరంగ్, దసపల్లా వారి చిత్రాలయ లాంటివి. ఆ తర్వాత 'జగదాంబ'తో పాటు ఎన్నో హాళ్లు వెలిశాయి. ఇసకతోట పక్కనే ఇప్పుడున్న ఎం.వి.పి. కోలనీ అప్పట్లో జీడి, జామ తోటలతో రెల్లి వాళ్ల పరిరక్షణలో ఉండేది. ఇల్లెక్కితే పెదవాల్తేరు మీదుగా సముద్రం కనిపించేది. బీచ్‌కు వెళ్లాలంటే శివాజీపాలెం తాటిపెండలం ఇరుకు దారిలోంచి బిక్కుబిక్కుమంటూ భయంభయంగా వెళ్లేవాళ్లం. అంత నిర్మానుష్యంగా ఉండే నిర్జన ప్రదేశం మార్గం అది.

భీమ్లీలో ఉన్నప్పుడంతా పెద్దమ్మకు తోడుగా చేపల మార్కెట్‌కు వెళ్లేవాడిని. రంగురంగుల పీతలు... రకరకాల చేపలు... ఇసకతోటలో కూడా సాయంత్రం అవగానే విధిగా చేపల మార్కెట్టుకి ఆడవాళ్లంతా వెళ్లడం, వాళ్లని నేను ఫాలో అవడం. చేపలమ్మే (ఆడ) బెస్తవాళ్ల హావభావాల్ని పరిశీలించడంలో గొప్ప సరదా ఉండేది. మాటలోని యాస, అందులోనూ సాగతీత, వాళ్ల 'మ్యాన రిజం' నిజంగా హైలైట్. చేపల్లో అన్ని రకాలుంటాయిని కూడా అప్పుడే తెలిసింది.

మా పిన్ని వాళ్ల పిల్లలతో పాటు జామ, జీడి తోటల్లో కాయల దొంగతనానికి వెళ్లడం, జీడి పిక్కలు ఏరుకుని రావడం, వాటిని కాల్చడం, రెల్లివాళ్లతో తిట్లు తినడం... ఆ బాల్యాన్ని కూడా కథలో వాడుకున్నాను. విశాఖ అనగానే సింహాచలం సంపెంగల పరిమళం... వాటికి భిన్నంగా ఉండే చేపల నీచువాసన. ఎర్రటి మట్టిదిబ్బలు... అనంత జలరాశి నీలవర్ణం... లంగరేసిన పెద్ద పెద్ద ఓడలు, పచ్చదనంతో మెరిసే పెద్ద పెద్ద కొండలు... అలా ఒకటీ ఒకటీ నా మస్కిష్కంలో నిక్షిప్తమైపోయేవి. పిన్ని వడ్డీవ్యాపారాన్ని కేంద్రంగా కథ అల్లుకుని, విశాఖ సౌందర్యాన్ని నాకు చేతనైనంతలో కథలో నిబిడీకృతం చేశాను.

కాలక్రమంలో మా పిన్ని వడ్డీ వ్యాపారం చేసి, చీటీలు వేసి తన ఆరుగురి పిల్లల్ని ప్రయోజకుల్ని చేసింది. అందరికీ పెళ్లిళ్లు చేసింది. మునిమనవల్ని కూడా ఎత్తుకుంటోంది. ఆమె బతుక్కే కాదు, ఎందరో బతుక్కి వడ్డీ వ్యాపారం ఆసరా అవుతున్నా, దానివల్ల నష్టపోయినవాళ్లూ ఉన్నారు. చీటీలు పాడేసుకున్నాక పారిపోయేవాళ్లు, ఆ డబ్బులు కట్టడానికి నగా, నట్రా, ఇల్లు, పొల్లు అమ్ముకున్నవాళ్లను కూడా చూశాను. డబ్బు మూలంగా సొంతవాళ్లతో పేచీలు, తిట్లు, గొడవలూ, కొట్టుకోవడాలూ చూశాను. ముఖ్యంగా మొగుళ్ల బాధ్యతారాహిత్యం కుటుంబాన్ని ఎలా అతలాకుతలం చేస్తుందో చెప్పే ప్రయత్నంతో పాటు, వడ్డీ, చీటీల వ్యాపారంలో చితికిపోయిన జీవితాలు, పాతికేళ్ల కాలంలో మారుతూ వచ్చిన విశాఖను కథాపరిధిలోకి తీసుకుని అల్లిన కథ వాల్తేరత్త. చివర్లో వరాలత్త కొడుకు నగలు తీసుకుని పారిపోయినట్టు ... వాడికోసం తల్లిగా ఆమె నిరీక్షణ, వాడొస్తాడనే తపన మాతృప్రేమకు పరాకాష్టగా, కథకు కొంత నాటకీయత కూడా అద్దాలి కాబట్టి సృష్టించుకోక తప్పలేదు.

*

నాన్న మహబూబ్‌నగర్‌లో (అమ్రాబాద్) రిటైర్డ్ అయ్యాక, భూమి గుండ్రంగా ఉందని నిరూపిస్తూ తిరిగి విశాఖ వెళ్లి అమ్మమ్మవాళ్లు మా అమ్మకు పసుపుకుంకుమ కింద ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకున్నారు. ఎప్పుడో యాభైల తొలినాట నిజాం పాలన పోలీసుశాఖలో ఉద్యోగిగా చేరిన నాన్న, తెలంగాణ ప్రాంతంలోనే పూర్తి జీవితాన్ని గడిపి, మా అన్నదమ్ములిద్దరికీ ఒక దారి చూపించి, అవసానంలో వానప్రస్థానం వెదుక్కుంటూ విశాఖ చేరిపోయారు. కట్టుకున్న ఇంట్లో పట్టుమని పదేళ్లయినా తృప్తిగా జీవించకుండా కాటికి తరలి, కాష్టమై కడలిలో కరిగి, ధూళై గాలిలో కలిసి కనుమరుగయ్యాడు నాన్న. ఆయన్ని వెతుక్కుంటూ అమ్మకూడా మరో మూడేళ్లకు...

ఒకప్పుడు తన సౌందర్యంతో నన్ను పిచ్చెక్కించి మత్తెక్కించి మరులుగొలిపిన విశాఖంటే ఇప్పుడు ఆనాటి మోజూ లేదు, ఏలాంటి రోకూ లేదు!!

*14 సెప్టెంబర్ 2013*

*'వాల్తేరత్త' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

15

# ఏటిపాట

## గంటేడ గౌరునాయుడు




*గంటేడ గౌరునాయుడు 1954 ఆగస్టు 7న విజయనగరం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ శారద పెళ్లి 1984లో కథాంజలి మాసపత్రికలో అచ్చయ్యింది. రెండు కథాసంపుటాలు, రెండు దీర్ఘకవితలు, ఒక కవితా సంపుటం, ఆంధ్రప్రభలో నిర్వహించిన కాలమ్ కళింగోర ప్రచురించారు. ఉపాధ్యాయవృత్తి.*

చిరునామా

ఎస్.ఎన్.పి. కాలనీ,
రామాలయం దగ్గర, బెలగాం,
పార్వతీపురం-535 501
Ph: 94414 15182
langulya@gmail.com


మసక మసక చీకటి రంగు వెలసిన నల్లదుప్పటిలా లోకం మీద కమ్ముకుంటోంది. ఆగి ఆగి వీస్తున్న గాలి తెరలు సానుభూతి వచనాలై చెట్ల ఆకుల సందుల్లో అక్కడక్కడా నిలిచి ఉన్న వర్షపునీటిని కన్నీటి చుక్కలుగా జారుస్తున్నాయి. శవస్నానంతో గడపంతా తడిసినట్లు నేల బురద బురదగా ఉంది.

బురదలో అడుగులు భారంగా వేస్తూ మసక చీకట్లను మసకబారిన కళ్లతో చీలుస్తూ చిరిగిన పాత చీరతో మాటిమాటికీ కళ్లు ఒత్తుకుంటోంది సూరమ్మ. సన్నగా రాగాలు పెడుతూ ఏడుస్తోంది. ఆ ఏడుపు ఎవరికైనా వినిపిస్తుందేమోనని భయపడుతున్నట్లుందామె. ఆమె శోకభారాన్ని తానూ వహించి భోరున ఏడుస్తున్నట్లు హోరుతో ఉధృతంగా ప్రవహిస్తోంది నాగావళి.

ఆమె ముఖం ఏటి బురదనీరులాగా నల్లరంగుకు తిరిగింది. ఆమె ఏటి ఒడ్డునే నడుస్తోంది. బురదలో జారి పడుతోంది. పడి లేస్తోంది. అయినా వడిగా అడుగులు వేస్తోంది. ఆమె చూపులు ఏటి కెరటాల మీదుగా సాగుతూ తీరాన్ని తాకుతూ దేనినో వెతుకుతున్నాయి.

చీకటి చిక్కబడుతోంది. గాలి విసురు ఎక్కువైంది. ఉండి ఉండీ చినుకులు సూదుల్లా తాకుతున్నాయి.

ఆమె హఠాత్తుగా ఆగింది.

ఆమె చూపులు ఓచోట నిలిచేయి.

ఒడ్డును ఆనుకుని పల్చని ఇసుకమేట. ఆ ఇసుకమేట మీద నల్లగా యేదో ఆకారం.

ఆమె కాళ్లు తడబడ్డాయి.

నేలమీద కాలు ఆనక బురదలో జారిపడింది. గుండె వేగంగా కొట్టుకుంది. మెల్లగా లేచి ఒడ్డునున్న ఓ తుప్పను ఆసరా చేసుకుని ఇసుకమేట మీదికి దిగజారింది. వర్షానికి బాగా నానిన నేలలోంచి వేళ్లతో సహా ఉండిన తుప్పతో పాటు ఇసుక పర మీద దభాలున పడిపోయింది. ఆమె ఒళ్లంతా ముళ్లతో గీరుకుపోయి నెత్తురు చిమ్మింది. కొత్త ఇసుకమేటలో ఆమె కాళ్లు మోకాలి లోతున దిగబడిపోతుంటే అతి కష్టంమీద ఆ ఆకారాన్ని చేరుకుంది సూరమ్మ. మసకబారిన కళ్లతో నీళ్లు నిండిన ఆ చీకట్లో ఆమెకు సరిగా ఆనలేదు. కన్నీరు తుడుచుకుని గుండె నిబ్బరం చేసుకుని చూసింది.

అది ఆమె వెతుకుతున్నది కాదు. అది చచ్చిన ఆవు కళేబరం. సగానికి ఇసుకమేట వేసి నీటిలో నాని ఉబ్బి దుర్వాసన వేస్తోంది.

నిరాశతో వెనుదిరగబోయిన ఆమె కాళ్లకు గుడ్డపీలిక చుట్టుకున్నట్లై కాళ్లు వెనక్కు లాక్కుంటే బరువుగా ఏదో కదిలింది. ఒక్కసారి దుర్గంధం రేగింది. ఏటినీటిలో నాని ఉబ్బి భయం గొల్పేదిగా ఉండి నీటిపై తేలిందో శవం. మానవ కళేబరం.

ఆ శవం ఆమె భర్త పైడయ్యది. 'పాటుకుడు పైడయ్య.'

ఆమెకు కళ్లు తిరిగినట్లైంది. భరింపరాని దుర్గంధానికి వాంతి చేసుకుని నిలుచున్న పాటున ఇసుకమేటపై పడిపోయింది. ఏటినీటి మీదుగా తేలివచ్చే చల్లగాలికి తొందరగానే తేరుకుంది.

ఆమెకు ఒక్కపెట్టున దుఃఖం ముంచుకొచ్చింది. భయాన్ని, అసహ్యాన్ని బయటకు నెట్టింది. భోరున ఏడ్చింది. గుండెలవిసేలా ఏడ్చింది. శక్తి సన్నగిల్లేదాకా ఏడుస్తూనే ఉంది.

ఏటి ఒడ్డునున్న మామిడితోటలోంచి గుడ్లగూబ అరుపు సూరమ్మ రోదనకు వికృతంగా శృతి కలుపుతోంది. మబ్బుతెరల్ని పక్కకు తొలగించి చీకటిని చిల్లులు చేస్తూ చుక్కలు సానుభూతి చూపుతున్నట్టు మినుకు మినుకు మంటున్నాయి. గాలి ఓదారుస్తున్నట్లుగా ఆమె తల నిమిరి సాగిపోతుంది.

ఆమె గతచరిత్రను గానం చేస్తున్నట్లు ఏటికెరటాల హోరు... హోరు... హోరు...

*అతి వేగమున నీవు పతివున్న కడకు*
*పోయి యే గతియైన నా ప్రాణనాధుని*
*మరలించి తెస్తివా మరువనీ మేలు.*
*నాథుడు లేనిదే నగలింకేలనో తల్లీ*
*పురుషుడూ లేనిదే పూలు నాకేలమ్మా*
*సరసుడు లేనిదే సంపదలూ యేల*
*యీ పాడు యవ్వనము నాకేలనోయమ్మా*
*సఖులారా మీరేల సకలంబు యేల...*

వీధి మధ్య రేకుడబ్బా దీపం ఎర్రని వెలుగులు పంచుతోంది. అరుగులు, గడపలు జనంతో నిండిపోయేయి.

దీపం చుట్టూ వలయాకారంగా ఉన్న ఖాళీస్థలంలో ఆడవేషంలో మెరిసిపోతున్నాడు పైడయ్య. దీపం వెలుతుర్లో మేకప్ చేసుకున్న ముఖం మెరుస్తోంది. పొడవాటి పూలజడ, మెడ నిండా రంగు కాగితాలతో చేసిన ఆభరణాలు. ఆ వేషంలో అచ్చం ఆడపిల్లలా ఉన్నాడు పైడయ్య.

సన్నని రాగం... రాగానికి తగ్గ అభినయం.

చేతులు తిప్పడంలోనూ లయబద్ధంగా అడుగులు వేయడంలోనూ ఏదో అందం... చిత్రమైన ఆకర్షణ...

పైడయ్య పాడుతూ అడుగుల వేస్తుంటే ఆ పాటకు జముకు వాయిద్యంతో వంత పాడుతూ సహకరిస్తున్నారు మరో ఇద్దరు.

''శశిరేఖా పరిణయం' పదం పాడుతున్నాడు పైడయ్య. పిట్టకథలతో చమత్కారాలతో 'పంట చేలగట్ల మీద పల్లెపడుచు పరుగులా' సాగిపోతోంది పాట.

కొందరు ఆవలిస్తూ ఆశ్చర్యంగా వింటుంటే మరికొందరు చుట్టలు అడ్డపాగవేసి తన్మయత్వంతో వింటున్నారు. పైన ఆకాశంలో వెన్నెల రాగం ఆలపిస్తున్న చందమామ చుట్టూ చుక్కల్లా అమ్మలక్కలు. ఎర్రని దీపం వెలుతురూ... పల్చని వెన్నెల వెలుగూ... నీలినీడల మధ్య తీర్చిదిద్దిన బొమ్మలకొలువులా ఉంది ఆ వీధి.

ఓ రెండు కళ్లు తదేకంగా పైడయ్యనే చూస్తున్నాయి రెప్పవేయడం మరచి.

'అలిగి వెళ్లిపోయిన అభిమన్యు కుమారుణ్ణి పిలవడానికి శశిరేఖ చిలుకను పంపిస్తుంది,' అంతవరకూ సాగింది పాట.

''అమ్మల్లారా మిగతాది రేపు పాడతాను,'' అని పాట ఆపేడు పైడయ్య.

''శశిరేఖ పెళ్లైపోయిందాక పాడిత్తు... అది పిల్లలకోడి ఇంక నెత్తి మీదే ఉంది,'' ఆకాశంలోని చుక్కల్ని చూస్తూ పైడయ్యను కళ్లార్పకుండా చూస్తున్నావిడ అంది, ఎక్కువ రాత్రేం కాలేదన్నట్టు.

ఆమె సూరమ్మ.

సూరమ్మకు పాతికేళ్లుంటాయి. ఎర్రగా... బొద్దుగా గుమ్మడిపండులా ఉంటుంది. నుదుట రూపాయి బిళ్లంత బొట్టు. ముక్కుకు అడ్డుగమ్మి, చెవులకు ఎత్తు గొలుసులు. జాకెట్టు లేని భుజాల మీంచి వేసిన ఎర్రకోక కుడిపైట. పోతపోసిన పల్లె అందం సూరమ్మది.

నాయిడోళ్ల మూడో కోడలు సూరమ్మ. మూడేళ్ల ఆడపిల్లకు తల్లి సూరమ్మ. అందరూ సూరమ్మ మాటనే సమర్థించేరు. ఇంకా పాడమని బలవంతం చేసేరు.

పైడయ్య సూరమ్మ వేపు ఓసారి చూసి నవ్వి, పాట అందుకున్నాడు. తొలికోడి కూసింది. ఊరి మధ్య టీ దుకాణంలో పొయ్యి వెలిగింది. అప్పుడు పాడయ్య పాట ఆగింది. ఏదుం బియ్యం పట్టని గంపతో కదిలేడు పైడయ్య.

''బుగతమ్మా ఇందండమ్మా కోక,'' గడపలో స్తంభానికి ఆనుకుని నిలబడి పిలిచేడు పైడయ్య.

సూరమ్మ ఇంట్లోంచి గబగబ వచ్చి, '''ఏంది... నాను కోక ఇచ్చీమన్నాను? మంచోడివి కోక నువ్వే తీసుకో, రోజూ ఎవల్నడుగుతావు.''

పైడయ్య క్షణం తటపటాయించి ఏదో అనబోయేటంతలో సూరమ్మే అంది.

"ఏదీ ఆ దువ్వందొర పాడిమి... సన్నవిడిగ నీ రాగం బాగుంతాది సుమీ."

"తల్లీ ఆ పాట నీకెంతిష్టమోగాని... ఎన్నిసార్లు పాడించుకుంతావు," అని జముకు శృతి చేసి పాటందుకున్నాడు.

...
పెద్దోలను కొటేడా దువ్వందొరా
ఆడు పేదోల్లకు పంచేడా దువ్వందోరా
పగులల్ల పెద్దమనిషి దువ్వందోరా
ఆడు పొద్దుపోతే కన్నగాడు దువ్వందోరా...
...

సాయంత్రం గాలికి రేగిన వరి నారుమడి అలల్లా సాగిపోతున్న పాట వింటూ తన్మయ త్వంతో స్తంభాన్నానుకుని నిలబడిపోయింది సూరమ్మ పాట అయిపోయేదాకా.

"వత్తానమ్మా," లేచేడు పైడయ్య.

అప్పటికే పిల్లలు వాడి చుట్టూ మూగిపోయేరు.

"ఉండుండు కసింత సల్లంది తినిద్దివుగాని."

ఇంట్లోకెళ్లి కంచుగిన్నె నిండా చిక్కని మజ్జిగ పోసి అన్నం తెచ్చి పైడయ్య తనతో తెచ్చుకున్న తపేళాలో వేసింది. ఊరగాయ, వేపిన మజ్జిగ మిరపకాయలు ఆకులో వేసి వాడి చేతిలో పెట్టింది. చేతులు కడుక్కోడానికి నీళ్లిచ్చింది.

"ఇంకెన్ని రోజులుంతావు," అడిగింది సూరమ్మ పైడయ్య ముఖంలోకి చూస్తూ...

"నాల్రోజులుండి ఎలిపోతాను," తింటూనే చెప్పేడు.

"రోజూ పెందిల మా ఇంటికి రా సల్లంది తినిద్దువుగానీ."

"అలాగేనమ్మా... దరమతల్లివి."

తినడం పూర్తయ్యాక తపేళా కడుక్కుని, "వత్తానమ్మా," అని వెళ్లిపోయాడు పైడయ్య. సూరమ్మ నవ్వుకుంటూ ఇంట్లోకెళ్లిపోయింది అత్త పిలుపుతో.

పైడయ్య పాట పాడినన్నాళ్లు అందరికంటే ముందు హాజరై పాట పూర్తయ్యాక అందరి కంటే వెనక వెళ్లేది సూరమ్మ.

పైడయ్యది చామనఛాయ. బలమైనవాడు. ఉంగరాల జుత్తు గలవాడు. మామూలుగా ఉన్నప్పుడు, ఏదో పని చేస్తున్నప్పుడు 'ఈల' పాట పాడుతుంటాడు. పాట పడ్డానికి ఏ ఊరైనా వెళ్లేటప్పుడు పంచె కట్టి లాల్చీ వేస్తాడు. ఎప్పుడూ హుషారుగా ఉంటాడు.

ఆరోజు-

పైడయ్య ఏటికి స్నానానికి వెళ్లాడు. ఆ వెనకే నీళ్లకుండతో సూరమ్మ బయల్దేరింది.

"పైడయ్య ఎప్పుడు బయలెత్తన్నావేటి?"

"రేపనకల."

"ఈ ఊరిల ఉండిపోరాదా. ఎక్కడైనా ఒకటేగదా. కష్టపాటోడికి ఎక్కడైతేటి?"

"మరి నాల్రోజులుంతే నా పాట ఎవ్వలింతారు. పాడిన పాటే పాడురా పాసిపళ్ల దాసరీ... అన్నట్టుగైపోద్ది. నాలాటోడు ఎప్పుడూ ఒక దగ్గట ఉండిపోగూడదు ఇలువుండదు."

"నీ కిలువు నేపోడమేటి... బంగారానికి పాసేటి సెప్మీ." పైడయ్య మాట్లాడలేదు.

సూరమ్మ చుట్టూ చూసింది. మనుషుల అలికిడి లేదు. దూరంగా పొలాల్లో పశువులు మేపుతున్న కుఱ్ఱాళ్లు, 'సిరతాబిళ్ల' ఆట ఆడుకుంటున్నారు. పశువులు అక్కడక్కడా చెదిరి పచ్చగడ్డి పరకలు మేస్తున్నాయి.

వేసవి ఎఱ్ఱని ఎండ పాదాలను చురుక్కుమనిపిస్తున్నా సూరమ్మ పైడయ్యతో కబుర్లు చెబుతూ నడుస్తోంది.

"అంబల్లేలప్పుడు నీలకి బైలెల్నావేటివిల్లా..." అన్నాడు పైడయ్య, సూరమ్మ ముఖంలోకి చూస్తూ.

"నీలకని కాదు. నువ్వు ఏటికాసి బైలెల్డం సూచి వచ్చాను. అన్నీ ఇడదీసి సెప్పాలా? అన్నోటు కతల్సెప్పుతావు..." సూరమ్మ తడారిన గొంతుతో అంది.

పైడయ్య నాలుక పిడచగట్టుకుపోయింది. గుండె వేగంగా కొట్టుకుంది. కాళ్లలో సన్నగా ఒణుకు- అయినా పెదాలపై నవ్వు పులుముకుని సూరమ్మ వేపు అల్లరిగా చూసేడు. సూరమ్మ ఎఱ్ఱని బుగ్గలు మరింత ఎరుపెక్కేయి.

ఇద్దరూ నీలాటిరేవులో దిగేరు.

ప్రక్కనే గుబురుగా పెరిగిన రెల్లు పొదలవేపు చూసి కళ్లతో నవ్వింది సూరమ్మ.

నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది ఏరు. ఎగువ రేవులో ఎవరో పోతులు కడుగుతున్నారు. ఏటి నడుమ ఇసుకపఱ్ఱ మీద కొంగ ఒకటి ఒంటికాలి మీద నిలుచుంది. నీటిబాతులు రెండు నీళ్లలో మునిగి తేలుతూ రెక్కలు టపటపా కొట్టుకుంటూ సరాగాలాడుతున్నాయి. అవతలి ఒడ్డున చాకళ్లు పాటలు పాడుతూ బల్ల మీద వేస్తున్న తడిబట్టల దరువులు... గాల్లో తేలి మంద్రంగా వినిపిస్తున్నాయి.

"రమ్మీ... ఓ సెయ్యి సాయింపట్టిమీ..." పిలిచింది సూరమ్మ.

తడిబట్టలోని సూరమ్మను తడబాటులేకుండా చూసేడీసారి పైడయ్య. చూసి కుండలోని నీళ్లు ఆమె ముఖాన చిలకరించి... బుగ్గన చిటికేసి ఆమె మీదికి నీళ్లకుండ ఎత్తి సాయం చేసేడు.

సూరమ్మ వెళ్లాక ఆనందం పట్టలేక మొలలోతు నీళ్లలో మరీమరీ మునగేడు. చిన్నపిల్లాడిలా గంతులేసేడు. అప్పుడోసారి మీదికి చూసి, 'ఎంతేలై పోయిందోస్,' అనుకుని ఒడ్డెక్కేడు.

పైడయ్య ఆ ఊళ్లో పాటుకుడు పైడయ్యగా అందరికీ... చనువైపోయేడు. తన్నెవరు పిలిచినా, 'పాటుకుడో,' అనే పిలుస్తారు.

రోజుకో వీధిలో రాత్రుళ్లు పాట పాడేడు. బాలనాగమ్మ, సన్యాసమ్మ కథ, ధర్మాంగద చరిత్ర, పాము పాట, సీతమ్మవారి వనవాసం, శశిరేఖా పరిణయం, ఊర్మిళ నిద్ర, లక్ష్మణస్వామి నవ్వు... ఇలా ఎవరే పాట పాడమంటే ఆ పాట పాడేడు. ఉన్నన్నాళ్లూ రోజుకో ఇంటి దగ్గర భోజనం చేసేడు. అందరికీ అభిమానపాత్రుడయ్యేడు. మరీ ముఖ్యంగా ఆడవాళ్లకి.

ఆరోజు చివరిగా ఊరి నడుమ రామ్మందిరం దగ్గర పాట. పెట్రోమాక్సు లైటు పెట్టేరు. ఆ పాట అక్కడ చేయడానికి ఎవరెవరెవరు కారణమైనా ముఖ్య కారకురాలు సూరమ్మ. అయితే ఆ రాత్రి పాటకు సూరమ్మ హాజరు కాలేదు.

పైడయ్య మహా ఉత్సాహంగా పాడేడు. తొలికోడి కూసేదాకా పాడేడు. కొందరు డబ్బులు చదివించేరు. చదివింపులు వచ్చిన ప్రతిసారీ... 'వీరిని ఆ దేవుడు సల్లగ సూడాల,' అని ప్రార్థించేడు. పాట పూర్తయ్యాక అందరికీ దండం పెట్టేడు.

"అయ్యలారా... అమ్మలారా... నా పాట ఇన్నారు. తప్పో ఒప్పో నాకొచ్చింది పాడేను. బాగుం దన్నారు. బతకి బాగుంతే మరొకపాలి వొచ్చి పాడతాను... ఈ తెల్లారే ఎలిపోతన్నాను... శలవిప్పిం చండి," అంటూ అందరి దగ్గర సెలవు తీసుకున్నాడు.

ఊళ్లో టీ దుకాణాల్లో పొయ్యిలు మండేయి. రైతులు, పాలేర్లు నాగళ్లు కోటేర్లేసి ఎడ్లను అదిలిస్తూ పొలాలవేపు సాగిపోతున్నారు. చాకలి సిమ్మడం మాసిన బట్టలు దండడానికి బయలు దేరాడు.

లేగదూడలు పొదుగులు కుమ్ముతో ఆవులు పాలు చేపుతున్నాయి. పైడయ్య ఇద్దరు కావిడి మనుషులతో పడమర దిక్కుగా సాగిపోయేడు.

క్రమంగా చీకటి పలచబడి వెలుగు కమ్ముకుంది. కమ్ముకున్న వెలుగులాగే ఓ వార్త ఊరంతా కమ్ముకుంది. గుసగుసగా సాగిన వార్త రవరవా రాజుకుంది. ఆ ఉదయం నీలాటిరేవు దగ్గర మహిళలు ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు.

"రాతిరి నుంచి సూరమ్మ అలికిర్నేదట."

"సూరమ్మ ఎవల్తోటో ఎలిపోయిందంతన్రు."

"ఎవుల్తోటేటీ ఆ పాటుకుడు పైడయ్యతోటే."

"వల్లకోరా... ఆ అంటరానోడితోటె ఎలిపోద్దా. నాన్నమ్మను," ఒకావిడ అపనమ్మకం.

"ఆ నీకేం తెలుసును ఆలిద్దరి సంగతి. రోజూ నాను కనిపెడతన్నానుగానా," మరొకావిడ.

"అల్లామద్దిని అంబల్లేలప్పుడు ఆలిద్దరే ఏటికెల్డం నాను కల్లార సూసినాను," ఒక అడ్డపాగావిడ నేనే రుజువన్నట్టు చెప్పింది.

"ఆ పాటుకుడు కనపడితే సాలు... పయ్యాడు కొంగు కానీది కాదు."

"ఇదోటోలమ్మ ఇడ్డూరం. దొరక్క దొరక్క సూరమ్మకి ఆ జాత్తక్కువోడే దొరికినాడా," ఒకమ్మ బుగ్గలు నొక్కుకుంది.

"సేసిందే సెండాలప్పని... ఇంక జాతేటి నీతేటి?"

"దాని కళ్లకావరం మండ... దానికొక కూతురున్నాది, ఆ పిల్లని సూత్తే ఉసూరుమంతంది థూ...! జలమెత్తగానే సరా..." ఓ నడివయసావిడ అసహ్యించుకుంది.

"పెద్దింటి దాయిగావాల బుద్దొండొద్దా?"

"ఆ, ఆ... పెద్దమడి గట్టుకే బొంగలెక్కువ."

"ఆ సూరమ్మకేం పోయికాలం పట్టుకుందో... బంగారునాటి కాపరంలో నిప్పులు పోసుకుని ఆ కానోడి జంట కట్టింది."

"అంతే, కలికాలం. బెమ్మంగారు సెప్పినట్టిగే ఔతుంది," ఓ ముసలమ్మ అడ్డపాగ వేసిన చుట్ట తీసి గొణుక్కుంది.

ఈ విషయం ముందే తెలిసిన ఒకావిడ అందుకుంది.

"సూరమ్మ ఈ నీత్తక్కువ పని ఎందుకు సేసిందోగాని అక్కడా తాగవలసింది ఈ ఏటినీరే గదా... రేవే మారింది అంతే."

అందరూ అనుకున్నది కరట్టే.

సూరమ్మ లేచిపోయింది.

*

"బియ్యం నేవు," సాయంత్రం ఇల్లు చేరిన కోళ్లను కోళ్లగూడులో మూస్తూ, అంది సూరమ్మ.

ఇంటిప్రక్కనున్న కాగుచెట్టును ఆనుకుని దొడ్లో కుక్కపిల్లతో ఆడుకుంటున్న కొడుకును చూస్తూ ఏదో ఆలోచిస్తున్న పైడయ్యకు ఆ మాట వినిపించలేదేమో ఆమెవేపు చూడలేదు.

"ఔనో ఇటింతన్నావా పొయ్యి మీద ఎసర మరిగిపోతుంది. బియ్యం నేవు," మళ్లీ చెప్పింది.

"ఆ...ఆ... ఇదిగోద... ఎల్తన్నాను. ఆ మేస్త్రుబావు దగ్గరికెల్లి ఈపూటకి బత్తెం అడిగి తెత్తాను," అని క్షణం ఆగేడు... ఆగి మళ్లీ అన్నాడు. "జముకు మూలబెట్టేపోవలసిందే నా పాట పాతబడి పోయింది. గడపకి గంట నిలబడి పాడినా ఏ యమ్మా సేరడు బియ్యం ఎయ్యదు. అదిగా టీవీ, రేడియో, సినిమాలు వచ్చి నా పొట్ట కొట్టేసినాయి," అని అక్కణ్ణించి కదలబోతున్న పైడయ్యతో-

"ఇదా నువ్వా సంగంల సేరి మేస్త్రుబావు సెప్పిన పాటలు పాడ్డం కొందరికిట్టం లేనట్టు గుంది. మనకవన్నీ ఎందుకు మానిత్తు," అంది సూరమ్మ.

"ఇదేటిది... ఎవులికైనా ఇష్టం నేపోడానికి నానేటి సేసినాను. పాట పాడుకోడం తప్పైతే బతకడమూ తప్పే. ఆ బావు మంచి మంచి పాటలు రాసి సెప్తున్నాడు. నాను పాడతన్నాను."

"అదా... ఒద్దన్న పనికే ఓలాయించుతావు గదా... మొన్నామద్దిని నాయుడుబావు ఏట న్నాడో ఎరుగుదువా? ఈ సంగపోల్లందర్నీ ఏదో ఒకరోజు పోలీసులు సితగ్గొట్టిత్తార్లే అన్నాడు," అని ఆగిపోయింది. ఆ తరువాత నాయుడన్న మాటల్ని చెప్పలేకపోయింది.

"మామేటి తప్పు సేత్తన్నామా... నేరం సేత్తన్నామా పోలీసులు కొట్టడానికి... నీకన్నీ బయమే," అని వీధిలోకి వెళ్లిపోయేడు పైడయ్య.

పైడయ్య వెళ్లిన వేపే చూస్తూ నిలబడిపోయింది సూరమ్మ. నాయుడోళ్ల కళ్లం పక్కన పొయ్యిలోకి పుల్లేరుతుంటే నాయుడన్న మాటలు గుర్తుకొచ్చేయి. అతగాడి చేష్టలు కళ్ల ముందు కదిలేయి.

"ఇదం సెడి ఈటీవోడికెల్తే సచ్చీదాక సాపలమోతే అని పెద్దలు ఒట్నే అన్లేదు. నాయుడోళ్ల కోడలివి నాయిడియైన బతుకొగ్గేసి ఈ తిప్పలన్నీ ఎందుకు సెప్మీ... సూడు సూరమ్మా, ఆడి వరసేం బాగులేదు. సంగాలు, ఆ పాటలు ఆడికేల... నా దగ్గర రైతరకముండమను. మీకే ఇబ్బంది నేకుంట నేను సూత్తాను," అని దగ్గరగా వచ్చేడు... వచ్చి, "నువ్వు పిల్లల్తల్లిలాగ లేవు సుమీ," అంటూ నడుమ్మీద చెయ్యేసేడు. అప్పుడతడి చూపులు, 'మా కులంలకి కళంకం తెచ్చేవుగదే,' అన్నట్టు కసిగా ఉన్నాయి.

సూరమ్మ భయంతో దూరంగా జరిగింది.

సరిగ్గా అప్పుడే పశువులు తోలుకుని వచ్చిన రైతులను చూసి నాయుడు వెళ్లిపోయేడు. గండం గట్టెక్కిందని పరుగు పరుగున ఇల్లు చేరింది సూరమ్మ.

అప్పుడప్పుడూ నాయుడోల్ల రైతు ఆ ఒగుడు బుగ్గలోడు అప్పలసోంగాడు ఏదో ఒక ఆశ చూపుతూనే ఉన్నాడు.

"లేచొచ్చినోళ్లందరూ నీతిమాల్నోలు అనుకుంతన్నావేట్రా బుగ్గలోడా," అని దులిపేసింది వాడిని.

అయినా భయం ఆమెను వదల్లేదు.

*

“ఆలోసించు నేను చెప్పింది బాగుంతే... అదైనా నీకు సచ్చితేనే సుమా... ధాన్యం కావాలంటే ధాన్యం... డబ్బులు కావాలంటే డబ్బులు... అడుగు. ఎల్లుండి ఇటకీ పున్నంకీ పన్లోకెలిపోరా నీకు బలుత్ బంది సేత్తన్నానుకుంతన్నావేటి? నాకు నమ్మకమైన మనిసి కావాలి. అంతేగానీ నాకు మనుసులు కరువా,” కత్తవా బొరిగి రామ్మందిరం అరుగుకు చేరవేసి తాను అరుగుమీద కూర్చుంటూ అన్నాడు నాయుడు.

పైడయ్య అరుగు ప్రక్కనే నిలబడి బుర్ర గోక్కుంటూ నేలచూపులు చూస్తున్నాడు.

“ఒరే నాయుడుబావు దగ్గిర రైతకరకమంతే ఇంకా ఆలోసించడమేట్రా. ఇరవై పుట్లు దాన్నిం మూడు పూటల తిండి... ఒప్పుకోవోస్...” నచ్చజెప్పేడు ప్రక్కనే ఉన్న మరో రైతు.

“బాపూ ఇంటికెల్లి మా దానికీ సెప్పి...” నసిగేడు.

“ఓరలగేన్రా... ఇప్పుడే ఎలిపోరమ్మంతన్నానా... ఎల్లు ఇద్దరూ ఆలోసించుకున్న తరవాతే సెప్పు.”

పైడయ్య సూరమ్మతో చెప్పేడు. సూరమ్మ ఒద్దంది. “ఇద్దరూ కట్టబడి బతుకుదుం సేచ్చగ,” అంది.

“పనున్నప్పుడు పరవానేదుగానీ ఏ పనీ దొరకని ఎండాకాలంల ఏటైపోవాల,” అన్నాడు పైడయ్య.

“ఆ ఇడ్డూరం గుడ్డెట్టినట్టి మాట్లాడతావేటి. పాలేరుతనం లేనోల్లందరూ బతకడం మానెత్తన్నారు?”

“ఆ నువ్వలగే అంతావు. యిన్నాల్లాగ ఆ మేష్టుబావూ నేడు ఆ బావుకీ ట్రాన్సఫరైపోయింది. ఎందుకీ బాధంతా పనున్నప్పుడు పొందిపోయి, పని లేనప్పుడు పల్లీసిబెట్టడం ఏల. ఆడ్నీ ఈడ్నీ బతిమాల్డమేల? పాలేరుంతే నిరుపూసీ గెంజికీ... సుట్టకీ గేరంటీ...” అని పాలేరుగా ఉండడానికే తీర్మానించుకున్నాడు పైడయ్య.

పైడయ్య నాయుడి పెద్ద రైతు అయ్యేడు. పైడయ్య నాయుడిబావుకి నమ్మకస్తుడై పోయేడు.

సూరమ్మ తెల్లారి లేచి నాయుడి కల్లానికెల్లి పేడ తీసి పెంట మీద పోసి పశువులసాల శుభ్రం చేస్తుంది.

సూరమ్మలో మునుపటి ఉత్సాహం లేదు... తను ఒక్కర్తీ ఇంట్లో ఉన్నప్పుడు ఇంటి వాసానికి వేలాడే దుమ్ము కొట్టుకుపోయిన జముకును చూస్తూ కొడుకును గుండెల కదుముకుని ఏడుస్తుంది. తనకు ఇష్టమైన జముకు మూలబడిపోయినందుకో... తన బతుకు పేడసాలకు పరిమితమైపోయి నందుకో తెలీదుగానీ రోజూ ఏదో సమయంలో కన్నీటితో గుండె బరువు దించుకుంటోంది.

చీకటిపడ్డాక అలబొద్దు గెంజి పట్టుకొని ఇంటికొస్తున్న పైడయ్యకు మాష్టారు ఎదురయ్యేరు. మాష్టార్ని చూడగానే ఎందుకో తప్పు చేసినట్టు తల వంచుకుని, “ఎప్పుడొచ్చినవ్ బావ్,” అని పలకరించేడు.

“పైడయ్య నాయుడి పెద్ద రైతువయ్యేవట. కథాపాటకంటే నాయుడి మాట నీకు బాగా వంటబట్టేసినట్టుంది,” అన్నారు మాష్టారు నవ్వుతూ. ఆ నవ్వు వెనుకనున్న వేదన ముల్లులా గుచ్చుకుంది పైడియ్యకు.

"బావూ నా బతుకు నాను బతకాల గదా. ఏ పనీ సెయ్యకప్పోతే ఎలాగా... మీరు ఉండి వోలంటే నాకే ఆలోశనా నేకపోయింది. అయినా పాటనీ, జముకునీ వదిలెత్తానా... మీ దయుండాల గానీ," అన్నాడు వినయంగా.

"సరేగానీ ఈ రాత్రికి సంగం మీటింగుంది రాగలవా?"

"అలాగేని బావ్."

"మీ బుగత కోప్పడతాడేమో," నవ్వుతూ మాష్టారన్న ఈ మాట పైడయ్యను ఆలోచింప జేసింది.

"కోంబడితే కోంబడనీ... వత్తాను... వత్తే తప్పేంటీ," అన్నాడు స్థిరంగా పైడయ్య నానేం తప్పు చెయ్యలేదు కదా అన్న తృప్తితో.

"నీతో పాటు చాకలి గుంపడు, మంగలి అప్పాజీ... వీలైతే నీ తోటి పాలేరు అప్పలస్వామినీ తీసుకురా..."

"ఏటి బావ్ ఆలెందుకు... ఏదైనా ఇసేసముందేటి," అనడిగేడు సందేహంగా పైడయ్య.

"రాత్రి వస్తావు కదా, అక్కడ వివరంగా చెప్తాను."

"అలాగేని బావ్."

మాష్టారు ఊళ్లోకి, పైడయ్య హరిజనవాడవేపు కదిలిపోయేరు.

*

"బావో... బుగత బావో... కొంప ములిగిపోయింది బావో," పరిగెత్తుకుంటూ అల్లంత దూరం నుంచీ అరుచుకుంటూ వచ్చేడు ఒగుడు బుగ్గలోడు.

అరుగు మీద కూర్చుని పళ్లు తోముకుంటున్న నాయుడు నింపాదిగా చూసి, "ఏట్రలాగ పారొత్తన్నావు కొంపలంటుకున్నట్టు," అన్నాడు.

"కొంపలంటుకోడమేటి బావూ... అవతల ఉపెద్రం ముంచుకొత్తుంటే," వాడు పరుగెత్తి రావటం వల్ల జాపోసి పోతున్నాడు.

"ఏటైందో చెప్పాస్," కసిరేడు నాయుడు.

"బావూ ఆజన్ని గుడ్డిలు పొలాలు కొండేదోలందరు కలిసి దున్నెత్తన్రు."

"ఆ..." కోపంగా లేచాడు నాయుడు.

"అదీగాక ఇటు ఏటి బావడ కాసి మన పైడిగాడు, సాకలి గుంపడు, మంగలప్పోజీ... కొత్తగ వరకట్టిన మళ్లు దున్నెత్తన్రు..." ఇదంతా ఆ సంగపోలు..."

"ఏటీ... నాయుడికి నోట మాట రాలేదు. మొహం ఎర్రకందమూలం దుంపలా మారిపోయింది. ముఖం కడుక్కోకుండానే తలుపు మూలనున్న కత్తవ బోరిగి తీసేడు.

నాయుడు పరుగెత్తేడు- నాయుడి మనుషులు పరుగెత్తేరు. ఊరు ఊరంతా పరుగెత్తింది.

జన్ని పొలం దున్నుతున్న గిరిజనుల వేపు నాయుడి కొడుకు తన మనుషులతో వెళ్లేడు.

ఏటిబాడిద పొలాల వేపు నాయుడు దౌడు తీసేడు.

ఊరంతా ఒకటే గోల.

ఏం ప్రళయం జరిగిపోతుందోననే భయం.

కర్రలు కలిసేయి.

కత్తులు కదిలేయి.

నాయుడి ముఖం చూడగానే గుంపడు, అప్పోజీ, "తప్పయిపోయింది బావో," అంటూ నాయుడి కాళ్లమీద పడిపోయేరు. "బావూ దీనికంతటికీ కర్త అడిగో ఆ పైడిగాడే," అని పాటుకుడు పైడయ్య వైపు చూపించేరు.

నాయుడు పైడయ్య దగ్గరకు వెళ్లేడు.

పైడయ్య పని అయిపోయింది అనుకున్నారు అందరూ.

పైడయ్య చేతిలో కఱ్ఱ బిగుసుకుంది.

అక్కడ గాలి స్తంభించింది. ఊరంతా అల్లకల్లోలంగా ఉంది.

ఏడ్పులు... కేకలు...

గుసగుసలు... భయం... ఉత్సుకత... ఉత్కంఠ.

జన్ని పొలంలో జరిగిన దెబ్బలాటలో నలుగురు గిరిజనులు మరణించారు. పదిమంది రైతులు గాయపడ్డారు.

మరో ముగ్గురు కొనూపిరితో ఉన్నారు.

మగవాళ్లంతా పిట్టొక చెట్టుకు ఎగిరిపోయినట్టు భయంతో పరుగులు తీసేరు. పసిపిల్లలు, ఆడవాళ్లు, మంచం దిగలేని ముసలాళ్లు మాత్రం మిగిలేరు ఊళ్లో.

సాయంత్రమయేసరికి ఊరు పోలీసులతో నిండిపోయింది.

*

తొలకరించింది. తొలి చినుకుల స్పర్శతో నేల పులకరించింది. మట్టి వాసనల్ని వెదజల్లింది.

పక్కలో బాబును వేసుకొని నిదరపట్టక ఆలోచిస్తున్న సూరమ్మకు తలుపు చప్పుడైనట్టు అనిపించడంతో లేచి తలుపు తీసింది.

ఎదురుగా పక్కింటి సిమాలుగాడు.

"సూరమ్మొదినా... మనోలందర్ని జైల్నుంచి ఇడుదల సేస్సినారట. పెందిల వత్తారని మేస్ట్రు బావు కవురుబెట్టేడు. నీకు సెప్పదుమని వచ్చేను. మరే భయం లేదు... తొంగో..." అని వెళ్లి పోయాడు.

సూరమ్మ మనసు బిగించి మీటిన జముకుతీగలా ఆనందంతో ఒణికింది. మంచమ్మీదికి చేరిన సూరమ్మకు కంటి మీద కునుకు రాలేదు. ఏవేవో ఆలోచనలు... ఇంటి పైకప్పుకేసి చూస్తున్న సూరమ్మకు వాసానికి వేలాడుతున్న జముకు కనిపించింది. పైడయ్య పాడిన పాటలు మదిలో మెదెలేయి. 'కుసలాయకం', 'లక్ష్మణసామి మూర్ఛ' లాంటి పాటలు పాడే పైడయ్య... మేస్ట్రు బావు మాటతో సంగంలో సేరి స్వంతంగా పాటలు కట్టి పాడేడు. మాష్టారు పైడయ్యని ఎంతో మెచ్చుకునేవారు. 'పైడయ్య నువ్వు మంచి కవివి సుమీ,' అని పొగుడుతుంటే... తనెంతో పొంగి పోయింది.

*బుగతోడు ఆ జెవుడు... పాలేరు యీడెవుడు*
*తల్లి బూదేవి కాడ గొప్పోడు కాదెవుడు..."*

ఎంత బాగా పాడీవోడు... ఆలోచనలతో ఎప్పుడో కోడికూసే వేళకు కునుకుపట్టింది సూరమ్మకు. నిద్ర లేచేసరికి బాగా పొద్దెక్కింది. గడప తుడుస్తుంటే ఎదురింటి సోములుతాత కేకేసేడు.

"ఔను సూరమ్మా... రాత్రి ఎంతేల కొచ్చినాడేటి పైడయ్య. ఇంకా తొంగోని నెగనేదా..."

"రాతిరి రానేత్తాతా. ఇప్పుడొత్తాడని... సిమాలు సెప్పేడు."

"అదేటే... ఆజన్ని సెందయ్య, నూకయ్య, ఆ కొండీదోలందరూ ఎలిపొచ్చినారు," అని అన్నాడు.

ఆ మాటతో కొండీదికి పరుగెత్తింది సూరమ్మ... "మాము ఎవకుల బయలెల్లాంగానీ ఆడు రాత్రే ఎలిపొచ్చినాడు. మేమంతా చెప్పినా ఇనకుంట... ఐతేటైనాడంతావు..." అన్నాడు జని సెంద్రయ్య. సూరమ్మ గుండె గుభేలుమంది. 'రాత్రి బయలెల్నోడు ఇప్పుడిగీరానేదేటి సెప్పీ...' అనుకుంది. ఆరోజు ఇంటికి చేరలేదు పైడయ్య... ఆ మరునాడు రాలేదు. కానీ ఓ గాలివార్త గుప్పుమంది. ఆ గాలికబురల్లా నిజమే అయింది.

"పైడయ్య శవం దిగవూరు రెల్లు బాడవ కాడ టిక్కుంది. ఉబ్బిపోయి కంపు కొడతంది," చెప్పేరెవరో.

హరిజనవాడలో కొంతసేపు అలజడి రేగింది.

ఊరుఊరంతా దిగ్భ్రాంతి చెందింది... అది ఎలా జరిగిందో ఎవరికి తోచినట్లు వారూ హించుకున్నారు.

"ఇప్పుడు ఇంటిల ఐనాక మంటిల. ఫ్చ్! ఏం బతుకు," ఓ ముసలాడు కన్నీటిబిందువు విడిచాడు.

"పెద్దింటిదాన్ని తెచ్చినా... పువ్వునాగ సూసుకున్నాడు. ఆడికి ముచ్చుదేవత ఇలగ దాపరించింది," ఓ ముసలమ్మ బాధపడింది.

"బాగా పాటలు పాడీవోడు కదరా..." ఓ పిల్లాడు మరో పిల్లాడితో అన్నాడు.

"ఏట్లబడి సచ్చిపోవటానికి ఆడేటి ఈతరానోడా," అన్నాడు ఒకడు ఎవరు ఆ పని చేసుంటారో ఊహిస్తూ.

ఎవరి అభిప్రాయాలు వాళ్లు వ్యక్తం చేస్తున్నారు.

పొద్దుపోతోంది.

సూరమ్మ దిగ్గున లేచింది... లేచి పరుగు తీసింది.

ఏడుస్తూ వెంటబడ్డ పిల్లాడిని ఎవరో ఎత్తుకున్నారు.

సూరమ్మ భోరున ఏడుస్తూ పరుగు తీస్తోంది. ఆమెను ఎవరూ ఆపడానికి ప్రయత్నించలేదు. అదేం చిత్రమో ఆమె వెనక ఎవరూ వెళ్లలేదు.

"పెద్దింటోల కోడలు ఈడి పాలబడి ఇలగైపోయింది. హా... రాత ఎవలు తప్పించగలరు," కుక్కి నులకమంచంలో దగ్గుతూ కూర్చున్న ఓ ముసలాడు నిట్టూర్చేడు.

ఉండీ ఉండీ చినుకులు రాలుతూనే ఉన్నాయి.

గుడ్లగూబ అరుపు ఆగిపోయింది.

సూరమ్మ ఏడుపు ఆగింది.

ఏటి ఒడ్డున తోటలో పక్షులు కిలకిల లాడుతున్నాయి.

చీకటి పలచబడుతోంది.

ఒడ్డున ఎవరివో మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఒరే కర్ర పట్టుకోని శవాన్ని కసింత లోతుకి తోసిత్తే అదే కొట్టికెలిపోద్ది. మనకెందుకు లేనిపోని పెంట... ఆ పోలీసుల్తో ఆ బాదెవలు పడతారు."

సూరమ్మ మెల్లగా లేచి మరోవైపు తప్పుకుంది. చేతులు జోడించి రెండు నీడల్లాంటి ఆకారాలు కర్రలతో శవాన్ని నీటిలో లోతుకు నెట్టేయి.

దుర్గంధం మరోసారి గాల్లో వ్యాపించింది.

సూరమ్మ పెదాల మీద పైడయ్య కట్టిన పాట లీలగా కదిలింది.

*ఉన్నోడిదొక జాతి*
*లేనోడిదొక జాతి*
*మనుసులందరికీ నేడు*
*నేల మీద ఒక నీతి*
*బూమి నాదంతాడు*
*బూకరించుకుంతాడు*
*బుగ్గలు పెంచుతాడు*
*బూసోమి బుగతోడు*
*పాలేరు ఈ దేవుడు*
*తల్లి బూదేవి కాడ*
*గొప్పోడు కాదెవుడు*

ఏటి అలల చప్పుడు జముకు వాద్యంలా పాటకు శృతి కలుపుతూ విషాద సంగీతాన్ని వినిపిస్తోంది.

*కథావేదిక వార్షిక సంచిక*
*ఏప్రిల్ 1992*

పోరాట పాట

# ఏటిపాట

***తన చెమటతో తడిసిన నేలలోంచి పొడుచుకువచ్చిన వరివెన్ను తనకెందుకు పరాయిదైపోతున్నది? అసలా నేల తనది కాకుండా అయిపోతున్నదెందుకు? ఏటి ఒడ్డునే ఉన్నా పంట మీద ఏమాత్రమూ ఆశ పెంచుకోలేని దుస్థితి ఎందుకు నెలకొంది? వ్యాపారం ఇక్కడి రైతు మీదనే ఎందుకు పడగవిప్పింది?***

కథకి నేపథ్యం చెప్పడం అంటే ఆ కథ పుట్టిన నేల గురించి చెప్పడమే. నాగావళి తీరప్రాంత జనజీవితాన్ని వ్యాఖ్యానించడమే నా కథల నేపథ్యం. అందరికిలాగే నాకూ నేను రాసిన కొద్ది కథల్లోనూ (అన్నీ ఇష్టమైనవే అయినా) నేను బాగా ఇష్టపడినదీ... తాదాత్మ్యత చెందినదీ... అలాగే నాకు గుర్తింపు తెచ్చినదీ ఏటిపాట.

ఈ కథా నేపథ్యం చెప్పే ముందు నా చిన్నతనం... నేను పుట్టిన నా నేల గురించి కొంత చెప్పాలి. 'నాగావళి'... గలగలా సాగిపోయే పురాతన జ్ఞానప్రవాహం. ఆ నది ఒడ్డునే మా ఊరు దళాయిపేట. అల్లంత దూరం నుంచి నిక్కరు జారేసు కొంటూ ఒడ్డు నుండి ఏట్లోకి దబ్బున దూకి ఈదులాడే జ్ఞాపకం ఇప్పటికీ పరిమళంలా మనసును గిలిగింతలు పెడుతూనే ఉంటుంది.

ఏటి ఒడ్డున నిలబడి అలల సంగీతంతో పాటు, సంధ్యారాగంలో గంతులేసే రెల్లుపూల ధావళ్యం, నీడల్లా కదలాడే సొమ్మల గుంటలు, పశువుల మందలు... వాళ్ళ పాటలు... అరుపులు... కంటి చూరుకు వేలాడే అద్భుత దృశ్యం.

ఏటి ఒడ్డునే ఉన్న మా పొలంలో అమ్మ, చెల్లెళ్ళు, వదినెలు, మరదళ్ళు పాడే ఉడుపుల పాటలు ఇప్పటికీ మనసును పులకింపజేసే అద్భుత సంగీతం.

నా జారుతున్న నిక్కరు ఎగేసుకొంటూ ఉడుపుమడిలో నాన్న దుక్కి దున్ను తుంటే మేడి పట్టుకోవడానికి చేసే ప్రయత్నం... ''మేడి పొడవు లేవు నీకెందుకురా దుక్కి... పో,'' అని అన్నా... ఏడుస్తూ వెంటపడటం... అలా వెంటపడి 'వొల్ల చెక్క'

కిందపడి బురదలో కూరుకుపోతే అంతా వచ్చి లేవదీయడం నేనెప్పటికీ మరువలేను. నాగావళి మీంచి మా పొలం మీదుగా వీచే గాలిలో అలలు అలలుగా ఎప్పుడూ ఏదో ఒక పల్లెపదం నా చెవుల్లో పడుతూనే ఉండేది. ఆనాటి నా బాల్యం రోజుల్లోనే పాటుకుడు పైడయ్య మా ఊరొచ్చాడు. పైడయ్య జముకుపాటే ఆనాటి మా ఊరికి ఏకైక సాంస్కృతిక కార్యక్రమం. ప్రతిరోజూ ఏదో ఒక వీథిలో పైడయ్య పాట ఉండేది. ఆ పాట వింటుంటే నన్నేదో ఆవహించినట్టు అయ్యేవాణ్ణి... అలాగ నాకు పాటన్నా... పైడయ్య అన్నా అభిమానం ఏర్పడింది.

అయితే ఇంతకుముందే చెప్పాల్సింది మా నాన్నగారి గురించి.

మా నాన్నగారు మంచి గాయకులు. కమ్యూనిస్టు బుర్రకథలు చెప్పేవారు. మా ఇంట్లో ఎప్పుడూ సందడే... రాత్రులు హార్మోనియం మీద రాగాలు పాటలు... ఆ పాటలు నా పెదాల మీద నర్తించేవి.

పాట సంగతి ఇలా ఉంటే మరి కథలు? శీతాకాలం... కట్టెపుల్లలు మంట చేస్తూ కుంపటి చుట్టూ కూర్చుంటే మా నాయనమ్మ, మా పెదనాన్నా చెప్పే దెయ్యాల కథలు... హాస్య కథలు మహా ఇష్టంగా వినేవాళ్ళం.

మా ప్రక్క గ్రామమైన బిత్రపాడు నుండి వచ్చే తమ్మయ్య తాత చెప్పే కథల కోసం నేనే కాదు, మా వీధి వీధంతా ఎదురు చూసేవాళ్ళం. మా ఇంటి గడప అరుగులు నిండిపోయేవి. నవ్వుల జల్లుల్లో తెల్లారిపోయేది.

కథలకి సంబంధించి మరో ముఖ్యమైన వ్యక్తి గురువు సత్యం. అందరూ 'గురువు సత్యం' అని పిలిచే సత్యంనాయుడిది మా ఊరే. కథ చెప్పడలో అతనికో ప్రత్యేకత ఉంది. అతను పండితుడు. ఎప్పుడూ దేశాటనలోనే గడిపేవాడు. ఏ ఆరునెలలకో ఒకసారి వచ్చేవాడు. అంతే కథకు వేదిక సిద్ధమయ్యేది. ఒకరు భోజనం... ఒకరు టీ, చుట్టలు, మరొకరు పడక ఏర్పాట్లు, రామ్మందిరమో... కళ్ళమో... ఆ సరసాలు... కథావేదికగా మారిపోయేది. ధాటీగా ఊకొట్టే వ్యక్తి ఒకరు ఎదురుగా కూర్చుంటే కథ ఆరంభమయ్యేది. "అంగవంగ కళింగ నేపాల భూపాల..." అంటూ ఆరంభమైన కథ... రాజకుమారులు, గుర్రాలు... రథాలు... యుద్ధాలు... రాచరికపుటెత్తులు... జనం బాధలు... దెయ్యాలతో ఇలా ఒక అద్భుతలోకంలోకి జారిపోయేవాళ్ళం. అలా అతనున్నన్నాళ్ళూ కథ సాగేది. ఆశువుగా అతనలా కథను కల్పించి ధాటీగా చెప్పుకెళ్తుంటే మాకందరికీ ఆశ్చర్యమే... అలా పెరిగిన ఆసక్తితో నా తోటిపిల్లలకి కల్పించి కథ చెప్పడానికి తయారైపోవడం నాకింకా గుర్తే. ఇదిగిలాటి పాట, కథల వాతావరణంలో పెరిగేను నేను.

కొంత ఎదిగాక ఇంటర్ తప్పి చదువు ఆగి వ్యవసాయంలో పడి దుక్కి, గడ్డికోత, కావిడి మోత ఇలా మట్టితోనూ... ఏటితోనూ... పెనవేసుకుపోయిన అనుబంధం. నాగావళి ఒడ్డున నాలుగుదిక్కులా నాలుగు మామిడి తోటలు పచ్చని పందిళ్ళుగా స్వాగతం పలుకుతున్నట్టుండేవి. ఉదయం మజ్జిగన్నంలోకి పచ్చిమిరపకాయలు ఎంచుకోడానికి మిరపతోట లుండేవి. ఆ మిరప తోటల్లోనే కార్తీకంలో విరగబూసే బంతి మొక్కలుండేవి. అవి ఇప్పుడు గోదావరి రైతుల అరటితోటలుగా మారిపోయాయి. మా నాన్న పెదనాన్నలే కాదు, నేనూ ములుకోలపట్టి ఎడ్లను అదిలిస్తూ మేడి పట్టి దున్నిన భూములెన్నో మావి కావు ఇప్పుడు.

ఎన్నో ఆనందాలకీ... ఎంతో సందడికీ నిలయంగా ఉండే మా ఊరిప్పుడు విషాదం మూటగట్టినట్టుంటుంది.

తన చెమటతో తడిసిన నేలలోంచి పొడుచుకువచ్చిన వరివెన్ను తనకెందుకు పరాయిదై పోతున్నది? అసలా నేల తనది కాకుండా అయిపోతున్నదెందుకు? ఏటి ఒడ్డునే ఉన్నా పంట

మీద ఏమాత్రమూ ఆశ పెంచుకోలేని దుస్థితి ఎందుకు నెలకొంది? వ్యాపారం ఇక్కడి రైతు మీదనే ఎందుకు పడగవిప్పింది?

ఎదుగుతున్న నా మీద ఎక్కుపెట్టిన ప్రశ్నలుగా నిలిచాయవి.

నా చదువు ఆగిపోయిన నాటికే శ్రీకాకుళ రైతాంగ పోరాటమూ అణిగిపోయింది. ఆ పోరాట గాథలు... ఎవరో పాడే నాటి పోరాట గీతాలు మనసును కదిలించేవి. అప్పుడే భూషణం మాష్టారి కొండగాలి సాహిత్యమంటే ఏమిటో తెలియజెప్పింది. ఆ తరువాత మిత్రుడు అప్పల్నాయుడు కథలు కదిలించేయి. పోడు-పోరు కథాసంకలనం అప్పల్నాయుడిచ్చేక నాలో స్పర్థ లాటిదేదో పొడసూపింది... అదే నేను సీరియస్‌గా కథ రాయడానికి దోహదం చేసింది. అప్పటికే నాలుగైదు కథలు (కథాంజలి-మద్రాసు) వచ్చి ఉన్నా... పోడు-పోరు కథలు చదివాకే రాసిన 1989లో ఆంధ్రజ్యోతిలో వచ్చిన విముక్తి నా తొలికథగా భావిస్తాను. ఆ కథే నన్ను శ్రీ కాళీపట్నం రామారావు మాష్టారికి పరిచయం చేసింది. మాష్టారి పరిచయం నన్ను ఆలోచనలో పడవేసింది. సరిగ్గా అదే సమయంలో మా చుట్టుపక్కల గ్రామాల్లో భూపోరాటాలు... మా గ్రామాల పరిస్థితి... ఇక్కడి రైతుల దుస్థితి... ఇవన్నీ... కథారచనకు ఒక అవసరంగా భావించేలా చేశాయి. ఆ ఆలోచనలోంచి వచ్చిన కథే ఏటిపాట.

ఎప్పుడో నాలో ముద్ర వేసుకొన్న పాటకుడు పైడయ్య మీద కథ రాయాలని ఉండేది. హరిజనుడైన పైడయ్య... నాయుడోళ్ళ కోడల్ని లేవదీసుకు వచ్చి మా ఊళ్ళో కాపురం పెట్టాడు. అదే కథగా చెప్పాలంటే సాధారణమైన ప్రేమకథ అవుతుంది. పైడయ్య జానపద గాయకుడు కావడం ఒక విశేషమైనా అందువల్ల కథకి గొప్పతనమేదీ వచ్చి పడిపోదు. ఈ కథకి మరేదో జతచేయాలి.

గ్రామాలకు పెద్దలుగా అధికార్లుగా ఉంటూ బంజరుభూముల్ని, ఏటి బాడవల్ని, దేవాలయం భూముల్ని ఆక్రమించుకొని ఎదురులేకుండా చెలాయించే పరిస్థితిని కథలో చెప్పాలని మరో ఆలోచన.

ఈ రెండు విషయాల్ని కథగా చెప్తే మంచి కథ అవుతుందనిపించింది. ఇదే సమయంలో మా ఊరికి దగ్గర్లోనే కస్పాగదబ వలస భూపోరాటంలో ఐదుగురు గిరిజనుల మరణం ఒక సంచలనం. తరువాత కొద్దికాలానికి పాటకుడు పైడయ్య తాగిన మైకంలో గెడ్డలో పడి మరణించడం ఒక విషాదం.

పైడయ్య భార్య సూరమ్మ భర్త శవం కోసం ఏడుస్తూ ఒంటరిగా వెళ్ళడం... ఆ దృశ్యం కళ్ళ ముందే కదలాడేది. ఎన్నాళ్ళుగానో మనసులో మెదులుతున్నది కథగా కాగితం మీదికొచ్చింది.

సూరమ్మ భర్త శవాన్ని వెదుకుతూ ఏటి ఒడ్డున పరుగుపెట్టడంతో కథ ప్రారంభమౌతుంది.

పైడయ్య వాస్తవానికి ఒక జానపద గాయకుడు. అతనికి ఎటువంటి ఉద్యమాల్తోనూ సంబంధం లేదు. కథ కోసం జానపద గాయకుడికి ఉద్యమస్పృహ కలిగించడం జరిగింది.

కొన్ని వాస్తవ సంఘటనలకు కల్పన జోడించి ఒక జానపద గాయకుడు ఉద్యమ భాగస్వామిగా మారితే...? అదే కథగా మలిచాను. నా బాల్యంలో ఎంతో ఆదరణకు నోచుకొన్న జానపద కళలు క్రమంగా క్షీణించడాన్ని కథలో చెప్పాను. పాట పొట్ట నింపుకోడానికే కాదు పోరాటానికి ఊపిరి అవుతుందని చెప్పాలనుకొన్నాను. పెట్టుబడిదారీవ్యవస్థ స్వరూపాన్ని... దాని దాడిని... పెరుగుతున్న సాంస్కృతిక కాలుష్యాన్ని ఆ దారిలో విచ్ఛిన్నమౌతున్న మానవ సంబంధాల్ని... ఉద్యమం ఉనికిని తెలియజేయడానికి ప్రయత్నించాను.

జముకు మూలపెట్టి నాయుడి దగ్గర పాలేరుగా చేరతాడు పైడయ్య. నాయుడికి అనుకూలంగా చెమట చిందించిన పైడయ్య నాయుడు అక్రమంగా స్వాధీనం చేసుకొన్న భూముల మీదికి వెళ్ళేసరికి శత్రువైపోయాడు. పాటపాడి పొట్ట నింపుకొని ఆ పాటతో నలుగురికీ ఆనందం పంచినంత వరకు పైడయ్య అందరికీ కావాల్సినవాడే. అదే పాటను ఆయుధంగా మలుచుకొని పోరాటబాటలో నడిచేసరికి కలిగినోళ్ళ కంటిలో ముల్లై పోయాడు.

ఒక జానపద గాయకుడితో లేచిపోయిన వివాహిత స్త్రీ కథను ఉద్యమస్పృహను జోడించి, జానపద కళల క్షీణదశను, భూస్వాముల... నాయుళ్ళ దోపిడీ స్వభావాన్ని, ఉద్యమమార్గంలో ఎదురైన అణచివేతనీ చెప్పడానికి చేసే ప్రయత్నంలో వేరు వేరు వాస్తవ సంఘటనల్ని ఒకచోట చేర్చి కల్పించిన కథ *ఏటిపాట*.

ఈ కథలో నేను చెప్పదల్చుకొన్నదేదీ నేనుగా కాక ఆయా పాత్రల ద్వారా సన్నివేశాలుగా చెప్పడం జరిగింది. రచయితగా నేనెక్కడా కనిపించకూడదనుకొన్నాను. కథలో కీలకమైన మలుపు తిప్పే పాత్ర ఒకటుంది. అది మాష్టారు. ఆ పాత్ర ఒక్క దగ్గర మాత్రమే కన్పిస్తుంది. కానీ పైడయ్య జానపద గీతాలు పాడే దశ నుండి ఉద్యమ గీతాలు ఆలపించడమే కాకుండా... సొంతంగా పాటలు కట్టి పాడే స్థాయికి ఎదగడానికి కారణమైన మాష్టారు పాత్ర కనిపించకుండా కథని నడపడమే మంచిదనుకొన్నాను.

భర్త శవం కోసం బయలుదేరిన సూరమ్మతో కథను ఆరంభించి... ఫ్లాష్‌బాక్‌లో కథని చెప్పడం పాత పద్ధతే అయినా... ఈ కథని అలాగ చెప్పడంలోనే ఆకట్టుకోగలననిపించి వెనక్కు వెళ్ళి వర్తమానంలోకి నడుపుకొచ్చాను.

కొన్ని సంవత్సరాలుగా గూడు కట్టుకొన్న నా ఆలోచనలకు రూపం ఈ కథ. నా పాటల్ని పాడిన పైడయ్య నాలో రేపిన అలజడికి అక్షరరూపం ఈ కథ.

అభాగ్య రైతుల ఆక్రోశం, నాగావళి తీరం అంతటా పరుచుకొన్న రైతుల ఆవేదనే ఈ కథ...

నిప్పు ఆరిపోదనీ... ఎక్కడో ఓచోట అది రాజుతూనే ఉంటుందని చెప్పడమే ఈ కథ.

ఈ కథ పేరు గురించి కూడా ఓ మాట చెప్పాలి. కథ రాసి దాని సంగతి (కథ రాసేక కొన్నాళ్ళు దానివేపు చూడొద్దంటారు శ్రీ కా.రా. మాష్టారు) మరిచిపోయిన దశలో కథావేదిక వార్షిక సంచికకు కథ పంపించమని రాసేరు శ్రీ వుప్పల నరసింహంగారు. అప్పటికీ కథ సిద్ధంగా ఉన్నందున పంపించేను. పేరు సరైనది అప్పటికీ అనుకోక పోవడంతో... *జముకులోడి కథ* అనే పేరుతో అనుకొంటాను పంపించాను. వుప్పల నరసింహంగారే *ఏటిపాట* అనే పేరుతో కథావేదిక వార్షిక సంచిక (1992)లో ప్రచురించారు. తరువాత *కథ-92*లోనూ వచ్చిందీ కథ.

నేలపడిన విత్తనం ఎప్పుడో ఒకప్పుడు చినుకు రాలి మొలకెత్తక మానదు.

ఇదిగిదీ నా కథా నేపథ్యం.

*7 డిసెంబర్ 1997*

16

# మన్నుతిన్న మనిషి

## చిలుకూరి దేవపుత్ర

సంగటి తిందువురా!" అంటూ అసహనంగా మొగుణ్ణి పిలిచింది ఓబులమ్మ.


రామచంద్రుడు పరధ్యానంగా కొట్టం బయట ఉన్న అరుగుమీద కూచుని శూన్యంలోకి చూస్తున్నాడే కానీ, పెండ్లాం మాటలు వినిపించుకోలేదు. చుట్టుపక్కల గుడిసెల్లోని వాళ్లంతా అప్పటికే సంగటో, సారికో ఇంత తిని వీధిదీపాల వెలుతురులో కూచుని సవాళ్లు (కబుర్లు) చేసు కుంటున్నారు. చిన్నపిల్లలేమో అంటేసుకునే ఆటలు ఆడుకుంటూ గోలగోలగా కేరింతలు కొడుతూ ఉన్నారు.

"సంగటి సల్లారిపోతాంది బిరీన తిందువురా!" అంటూ మొగుడి భుజాన్ని కుదిపింది అసహనంగానే.

ఉలిక్కిపడ్డట్టు పెండ్లాం వేపు చూసి, "అప్పుడే జేత్తివా వంట! ఇపుడేగదే ఎసరు బెడితివి పొయ్యిమింద!" అంటూ లేచాడు రామచంద్రుడు.

ఓబుళమ్మ మొగుడి మాటలకి సమాధానం ఇవ్వకుండానే కొట్టంలోకి వెళ్లిపోయింది.

రామచంద్రుడు లేచాడే కానీ కదల్లేదు. పెద్ద ఇత్తడి చెంబుతో నీళ్లు తెచ్చి రామచంద్రుడికి అందించింది ఓబుళమ్మ.



*చిలుకూరి దేవపుత్ర 1952 ఏప్రిల్ 24న అనంతపురం జిల్లాలో జన్మించారు. వీరి తొలి కథ మానవత్వం 1978లో ప్రజా సాహితి మాసపత్రికలో అచ్చయ్యింది. నాలుగు కథాసంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. పంచమం నవలకి ఆటా పురస్కారం లభించింది. రెవెన్యూ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేశారు.*

**చిరునామా**
201, చందనప్రియ టవర్స్
రైల్వేస్టేషన్ దగ్గర, అనంతపురం-515 001
Ph: 85004 36856

రామచంద్రుడు కాళ్లూ, మొహం కడుక్కున్నానని పించుకుని భుజం పైన ఉన్న గళ్ల తువ్వాలుతో మొహం మీద ఉన్న తడిని అద్దుకుంటూ ఇంట్లోకి దారితీశాడు.

“రమేసుగాడూ, సురేసుగాడూ ఏరి? పిలువూ ఆ నాయాళ్లనీ...” అన్నాడు భోజనం ముందు కూచుంటూ.

“వాళ్లు తినేసి అప్పుడే ఆడుకొనేకి పోయినారు.”

గుడ్డిదీపపు వెలుతురులో కంచం వేపు తేరిపార జూశాడు. గుమ్మడికాయంతటి రాగిముద్ద కంచంలో ముప్పాతిక భాగాన్ని ఆక్రమించగా పచ్చడి అనే పదార్థం కంచంలో ఓ వారన ఒదిగి ఉంది. దాన్ని చూపుడువేలితో అద్దుకుని నాలికకు రాసుకుని చప్పరించాడు. పుల్లగా అనిపించి మొహమంతా అదోమాదిరిపెట్టి, “ఏందే! ఈపూట గూడా చింతతొక్కేనా?” అన్నాడు నిర్లిప్తంగా.

“ఊఁ... నువ్వు రోజూ సంపాయించుకొత్తా ఉండావుగదా నూర్లు నూర్లు దుడ్లు; అంతా దాసిపెట్టి పీనాసితనంతో చింతతొక్కు నూరిపెడ్తాండా!” అని ఖయ్‌మంటూ అరిచింది ఓబుళమ్మ.

“ఇప్పుడు నేనేమంటినే, అంత లావుగొంతుతో అరత్తా ఉండావు. ఈపూట గూడా చింత తొక్కేనా అంటి... అదిగూడా తప్పేనా? నీతో యా మాట మాట్లాడినా కస్టంగా ఉందే యాల వచ్చిన సిక్కు!” అనేసి, రాగిముద్దను పెద్దపెద్ద పిడచలుగా కట్టుకుని గుళుక్కున మింగనారంభించాడు రామచంద్రుడు.

“ఊనుమడి, నాతో అంతా సిక్కేమడి! పెతి మాటకీ నా నోరు కట్టిపడేసేది నేర్చుకుండావు. ఎవురన్నా ఇంటే నేనే గయ్యాలిదాన్నని అనుకోవల్ల; నువ్వు మాత్తరం మంచోడు కావల్ల... మాట్లనీ మెత్తిమెత్తిగా మాట్లాడేదే మడీ, సేసేదంతా జేసేదే,” అంది స్థాయి తగ్గకుండా ఓబుళమ్మ. మొగుడి వైపు కొరకొర చూస్తూ ఉంది కనుబొమ్మలు ముడివేసి.

“నేనేం జేస్తినే పనికిమాలినదానా!” నోట్లో ముద్ద పెట్టుకొని ముద్దముద్దగా మాటాడుతూ నవ్వుమొహం పెట్టాడు.

“అవును మడి, నేను పనికిమాలినదాన్ని, గాబట్టే ఊరుగాని ఊరు వచ్చి ఈడబడి సచ్చిండేది. ఈ పొద్దుటికి ఆర్నెల్లు పొద్దాయె మనం ఈ బళ్లారికి వచ్చి; నా మాట ఏంది సాగనిచ్చినావు? మన ఊర్లో ఉండే పదెకరాలు అమ్మేసి రాయే... ఈడ ఇంత ఇంటి జాగా కొనుక్కొని సిన్నగుడిసె బడా యేసుకుందామి అంటే నీ సెవులకి ఎక్కుతాదా యేమన్నా... ఊహుఁ ఎక్కదే... యాల ఎక్కుతాది? ఇట్ల కూలీనాలీ జేసుకొని తెచ్చుకున్న కూలిదుడ్లలోనే నూరు రూపాయల కొట్టం బాడుగకి ఇచ్చుకుంటూ ఉంటే ఆయిగా ఉంటాది నీకి,” అంటూనే కళ్లలో నీళ్లు పెట్టుకుంది ఓబుళమ్మ.

“పొద్దన్నించీ ఈ కూతలు ఇనలేకే బయట కూకోని ఉన్నింది. మళ్లా మొదలుబెత్తివా? ఏ మాట మాట్లాడినా ఆకిరీకి పదెకరాల సేనికాడికే వత్తుంది నీ యవ్వారమంతా. మా నాయిన సంగతి నీకి తెల్సుగదా! ఆ యప్ప బతికి ఉండగా భూమిని అమ్మనిస్తాడేమే?”

“నీ శాతగాని మాటలు మాట్లాడొద్దు. నువ్వు దయిర్నెంజేసి ఆ భూమి అమ్ముతానని కుండ పగలగొట్టినట్లు జెప్పెయ్యిమడి మీ నాయనగాదు, మీ జేజినాయన కూడా తప్పుగుంటాడు. తండ్రి ముందరికిపోతానే ‘పిల్లీ’ అంటే ‘మ్యావ్’ అంటావ్. ఏంటికి తాటిసెట్టంత జంపు ఉండావు. ఆ భూమి ఏమన్నా పండుతాందా, ఎండుతాందా అని జేసెల్లేదా? తొండా బిక్కిలు గుడ్లు పెట్టే భూములూ భూములే మీ నాయనకి. ఎవురికన్నా ఉందా పాపం అట్లా భూమి... మన పెండ్లయిన అయిదేండ్లలో యా ఏడన్నా పది పల్లాలు సెనిక్కాయ మొగం జూసినామా? మూట్లు

మూట్లు సెనిగిత్తనాలు దాంట్లో పోసి వచ్చేదే, ఆకాసం దిక్కు చూసుకుంటా ఉండేదే. అదే బాగా పండిందంటే ఇంత దూరం ఈ ఊరుగాని ఊరులో ఉండే గాచారం ఏంబట్టే? అదిగూడా ఆలోసించేది లేదు.''

''ఏయ్! ఏమే కొంచెం నోరు కట్టేసుకో. మా నాయిన వయిసులో పెద్దోడు అనేది లేకుండా ఇట్టమొచ్చినట్టల్లా మాట్లాడ్తా ఉండావు,'' అన్నాడు రామచంద్రుడు.

అతని గొంతులో కఠినత్వం స్పష్టంగా వినిపించింది ఓబుళమ్మకు.

''ఆఁ... పెద్దోడు పెద్దోడు... వయసులో పెద్దోడు అనే ఇన్నాళ్లూ ఇట్ల ఉండేది. ఏంటికి... వయసంట వయసు. రాతికీ రప్పకీ వయసుంటుంది.'' ఓబుళమ్మ అట్లా అంటున్నట్టే రామ చంద్రుడు అన్నం తింటున్నవాడల్లా గబిక్కున లేచి వచ్చి కోపంతో రెండు పిడిగుద్దులు వీపు మీద గుద్దాడు ఓబుళమ్మని.

ఓబుళమ్మ ఊహించని పరిణామం జరిగేటప్పటికి ఏడుపు ముంచుకొచ్చేసింది. కీచు కంఠంతో ఏడవడం మొదలుపెట్టింది.

''మామ అనే గవురం గూడా లేకుండా ఇట్టమొచ్చినట్ల మాట్లాడ్తావా? ఇంతసేపూ ఏందోలే అనుకుంటా ఉంటే... నోటికి అడ్డూ ఆపూ లేకుండా...'' అంటూనే తన కోపానికి బలం ఉండేం దుకు తను తింటూ విడిచిన ఎంగిలి కంచాన్ని ఎడమకాలితో ఎగిచ్చి తన్నాడు. ఆ కంచం గిరికీలు కొట్టుకుంటూ గోడకు తగిలి ఠంగుమని శబ్దం చేస్తూ బోర్లా పడిపోయింది.

ఎంగిలిచేయి కడిగేసుకొని వచ్చి బయట అరుగుమీద కూచున్నాడు. లోపల్నుంచి ఓబుళమ్మ ఏడుపు శబ్దం సన్నగా వినిపిస్తోంది.

''ఏమప్పా రామచంద్రా!'' అన్న పిలుపు విని తలతిప్పి చూశాడు.

దాదాపు నలభై అయిదేళ్ల మనిషి నవ్వుతూ వచ్చాడు. అతను బక్కపలుచగా ఉన్నాడు. తెల్లటి పంచె, చొక్కా వేసుకొని ఉన్నాడు. అక్కడక్కడ నెరసిన మీసాలు లావుగా ఉండి అతికించి నట్లున్నాయి.

''ఏం నారాయణప్పన్నా! ఆరామా? కూకో,'' అంటూ భుజం మీదున్న తువ్వాలుతో తన పక్కనున్న స్థలంలో దుమ్ము దులిపాడు.

''రేపు రావల్లప్పా నువ్వు! కౌలుబజారులో ఇంటికి పునాది యెయ్యల్ల గదా!'' అన్నాడు నారాయణప్ప అరుగుమీద కూచుంటూ.

ఇంట్లోంచి ఓబుళమ్మ ఏడుపు వినిపించడం లేదు. 'అమ్మయ్య! మేలే, మానం గాపాడింది,' అనుకున్నాడు రామచంద్రుడు.

నారాయణప్ప ఇళ్లు కట్టే మేస్త్రీ. పదేళ్ల క్రితం అనంతపురం జిల్లాలోని కాలువపల్లి నుంచి బతుకుదెరువు కోసం పొట్ట జేత పట్టుకుని బళ్లారి చేరుకున్నాడు. రాళ్లగంపలు మోసే కూలీగా జీవితం ప్రారంభించాడు. అనతికాలంలోనే మేస్త్రీగా మారాడు. ఈనాడు బళ్లారిలో బాగా పేరున్న మేస్త్రీలలో అతనూ ఒకడు. ఇప్పుడు అతని చేతి కింద అరడజను మంది బేల్దారులు (తాపీ పని వాళ్లు) ఉన్నారు. ఏడేళ్ల క్రితం ప్రభుత్వంవారు ఇచ్చిన ఇంటిస్థలంలో చిన్న పూరిగుడిసె ఉండేది. అది ఈనాడు పెద్ద మేడగా రూపాంతరం చెందింది. ఆ మేడలో రెండు గోద్రేజ్ బీరువాలూ, సోఫా సెట్టూ, రంగుల టీవీ మొదలుకొని ఎన్నో విలువయిన సామానులున్నాయి. బళ్లారిలోనే నంగనకల్లు రోడ్డుకు ఇరవై సెంట్ల ఇంటి స్థలం సంపాదించాడు. అది ఈరోజున మూడు లక్షల విలువ చేస్తుంది. ఇవన్నీ తెలుసు రామచంద్రుడికి.

''రేపు కొంచెం మా ఇంటిపనే ఉందన్నా! రేపులే మర్నాడు రమ్మంటే వస్తా సూడీ!'' అన్నాడు రామచంద్రుడు.

"సర్లేప్పా! అట్లేగానీలే. ఉంకెవరినన్నా రమ్మంటాను... ఎంతప్పా రామచంద్రా ఈ కొట్టానికి బాడిగ?" అన్నాడు రామచంద్రుడు.

"నూర్రూపాయ లన్నా!"

""సూడప్పా! కొట్టానికి నూర్రూపాయిలు బాడిగంటే ఇంగేమన్నా ఉందా? మీకి భూమి ఉందనింటివి గదా! దాన్ని అమ్మేసి యాడన్నా ఇంత ఇంటి జాగా కొనుక్కోని సుమారుపాటి ఇల్లు కట్టుగోవచ్చు కదా! ఇప్పట్లో చేను ఉండేదాని కంటే ఇల్లు ఉండేది ఎంత మేలనుకుండావు. ఏ గుంటూరు, విజయవాడల పక్కయితే పది ఎకరాలు ఉంటే షావుకార్ల కింద లెక్క! వాళ్లకి నీటి సౌకర్యం అట్లే ఉందీ, వాళ్లు పంటలూ అట్లే పండిస్తారప్పా! మన దిక్కు ఇరవై అయిదెకరాలు ఉండే రైతుకి కూడా ఏడాది పొడుగునా కూటికి జరిగేది కష్టం. మన చేన్లు పండేవా? ఏమన్నానా? మా కాలువపల్లెలో మా సిన్నాయన వాళ్లకి ఇరవై ఎకరాల పొలముంది. వాళ్లకి ఈ పొద్దుటికీ రెండుపూట్లా తిండికి జరిగేది ఎక్కువ! నేను జూడీ ఎకరం పొలంలేదు, గిలంలేదు- నా ముందర వాళ్లేం పనిమింద బడ్తారు. ఇప్పట్లో మన ఊర్లదిక్కు భూమి పండిచ్చేదంటే యాడన్నా జూదం ఆడినట్లే. లేదంటే కోడిపందెంలో దుడ్లు కాయడమేనప్పా రామచంద్రా! ముంగారు వానలు వస్తానే అప్పోసప్పోజేసి సెనిగిత్తనాలు కొండబోయి భూమిలో యేసి వస్తారా! ఇంగ వానలు సరింగా వచ్చినాయంటే పంట చేతికొచ్చి రైతు మిగుల్తాడు. లేదంటే అప్పులోళ్ల కొడుకయిపోతాడంతే! వానలు మీద ఆధారపడే పంటలన్నీ ఇంతేనప్పా... నా మాట ఇనూ, నీ భూమిని అమ్మేసి రా. ఏందప్పా ఈయప్ప ఇట్ల జెప్తా ఉండాడని అనుకోవద్దు రామచంద్రా!" అనంటూనే, "వస్తానప్పా!" అని చెప్పేసి వెళ్లిపోయాడు నారాయణప్ప.

*

వీధి వీధంతా నిర్మానుష్యంగా ఉంది.

వీధిదీపాలు నిర్మలంగా వెలుగుతున్నాయి.

అరుగు మీద ఈతచాప వేసుకుని పడుకుని ఉన్నాడు రామచంద్రుడు. కుడివేపు ఎడంవేపు పొరలి పొరలి పడుకుంటున్నాడేగానీ నిద్రరావడం లేదు. పెండ్లాన్ని కొట్టినందుకు చాలా పశ్చాత్తాప పడుతున్నాడు. పెళ్లయిననాటి నుంచీ ఓబుళమ్మ మీద చేయి చేసుకొని ఎరగడు. అటువంటిది ఈరోజు ఆవేశంతో బాగా బలంగా గుద్దాడు. తనంటే ఎంతో ప్రేమ చూపే ఓబుళమ్మని తను కొట్టాడు. ఆమె అలా మాటాడుతోందంటే దానికి కారణం పరిస్థితులే! తాము ఇద్దరూ కలిసి ఇళ్లు కట్టే పనికిపోతే వచ్చే కూలిదుడ్లతో ఇల్లు గడవడమే కష్టం. అట్లాది సొంత ఊర్లో ఉన్న తండ్రికి నెలసరి భత్యం పంపిస్తూ, కొట్టం బాడుగ నూరు రూపాయలు చెల్లించాలంటే ఎంత ఇబ్బంది! చిన్నపిల్లలు రమేసుగాడూ, సురేసుగాడూ చినిగిన నిక్కర్లతో ఉన్నా, వాళ్లకి కొత్త నిక్కర్లు తెచ్చేదానికి దుడ్లు లేవు. ఇంక ఓబుళమ్మకి సరేసరి, ఉన్న మూడు చీరల్లోనూ చిరుగులు లేని చీర ఒక్కటీ లేదు.

ఉన్నట్టుండి తండ్రి మీద కోపం ముంచుకొచ్చేసింది రామచంద్రుడికి. తన తండ్రి వల్లే తమకి ఇన్ని కష్టాలు వచ్చాయి. తమతోపాటు ఈ ఊర్లోనే ఉండమంటే ఉండడు. ముసిలోనికి బూమిపిచ్చి. నిజమే! బాగా పండని భూమి మింద అంతోటి మమకారం యాలో తనకైతే అర్థమే కాదు. ఈ ముసిలోడు చావన్నా చావడు. అట్ల చస్తే ఒక్కసారి బోరున ఏడ్చేసి గుంతలో పెట్టేస్తే సరిపోతుంది. ఛీ! ఛీ! ముసిలోన్ని తలుచుకుంటూ ఉంటే చంపి పారేస్తానేమో అన్నంత కోపం వస్తోంది!

ఇక తను ఊరుకోడు. ఆరు నూరయినా, నూరు ఆరయినా భూమిని అమ్మి తీరతాడు ముసిలోడు ఎంత మొత్తుకున్నా సరే!

తను ఈ నిర్ణయానికి వచ్చిందే తడవుగా అప్రయత్నంగా లేచి కూచున్నాడు. తన పెండ్లానికి ఈ మాట చెబితే ఎంత సంతోషిస్తుందో! అలా అనుకుంటూనే గుడిసె తలుపు తోసుకుని లోపల కెళ్లాడు. బుడ్డీదీపపు వెలుతురులో ఓసారి కలయజూశాడు. పిల్లలు ఇద్దరూ ఆదమరచి నిద్రపోతూ ఉన్నారు. వాళ్లకి కొంచెం ఎడంగా కాళ్లు ముడుచుకుని మూటలా పడుకుని ఉంది ఓబుళమ్మ. మెల్లగా అడుగులు వేస్తూ ఆమెను సమీపించి మోకాళ్ల మీద కూచున్నాడు.

''ఏయ్!... ఏయ్!... ఏమే... నిన్నే!'' అంటూ పిల్చాడు.

ఓబుళమ్మ అటువైపుకి తిరిగి పడుకుంది. ఆమె నిద్రపోవడం లేదన్నది స్పష్టమైందతనికి.

''ఏయ్! నిన్నేనే...'' అంటూ ఆమె భుజం మీద చెయ్యి వేశాడు.

అంతే అతని చేతిని విసురుగా తోసేసింది ఓబుళమ్మ. ''అబ్బా! అంత కోపముంటే ఎట్లే ఆడదానికి?... కొంచెం నా మాట ఇనబ్బా!''

''ఏమీ... మళ్లా కొట్టడానికి వత్తివా? కొట్టూ అదవ సిక్కినదాన్ని ఉండానుగదా కొట్టూ,'' అంది చురచురా చూస్తూ ఏడుపు గొంతుతో.

''నేనేం కొట్టేదానికి రాలా. మా నాయినని ఇట్టమొచ్చినట్ల అంటే కోపం బట్టలేక కొడితి. ఇంగెప్పుడూ కొట్టను లేయే! పెమనంగా... సత్తెపెమానంగా నన్ను నమ్ము!'' అంటూ ఆమె కుడి చేతిని బలవంతంగా తన చేతిలోకి తీసుకుని ప్రమాణం చేశాడు రామచంద్రుడు.

ఆమె బాధ తగ్గుముఖం పట్టినట్టు గమనించాడు. ''నీ మాటే ఇంటానే. ఆ బూమిని అమ్మేత్తాను. ముసిలోడు ఎంతన్నా మొత్తుకోనీలే. ఆ ఆస్తుండి మనమేం సుఖపడుతూ ఉండాం,'' అంటూ ఆమె పక్కలోనే పడుకుని లాలనగా ఆమెను కౌగలించుకున్నాడు రామచంద్రుడు.

''అయితే మడి తడవేలా? రేపే పోదామి,'' అంది ఓబుళమ్మ అతని కౌగిట్లో ఒదిగిపోతూ.

''సరేలే... రేపే...'' అంటూనే ఆమె నుదుటిని ముద్దాడాడు.

*

మధ్యాన్నమయింది.

సూర్యుడు నిప్పులు చెరుగుతూనే ఉన్నాడు.

''ఏరా, ఇదేనా రావడమూ? మంచి ఎండ పొద్దున ఎల్లబారి వచ్చినారే! రాండి రాండి!'' అంటూ నవ్వుతూ కొడుకునీ, కోడల్నీ, మనవళ్లనీ తృప్తిగా చూశాడు చెన్నప్ప. ''వరే వరే ఎంత పెద్దగయినార్రా బుడతలిద్దరూ... రమేసూ, సురేసూ రాండ్రా!'' అంటూ ఇద్దర్నీ ఆనందంగా ఎత్తుకుని ముద్దులు కురిపించాడు చెన్నప్ప.

పాత ట్రంకుపెట్టెని భుజం మీద నుంచి గుడిసె ముందు ఉంచాడు రామచంద్రుడు. ''ఎట్లుంది నాయనా, నీకీ, పెయిలో బాగుందా? ఎంత సన్నగా అయిపోయినావో సూడి!'' అన్నాడు.

''నేను సరేలేరా నువ్వు జూడీ, కంప అయినట్లు అయిపోయినావు. ఆ పాపా పిల్లలూ అందరూ సన్నగయిపోయినారు.''

''చాన్నాళ్ల తర్వాత సూత్తే అట్లేలే మామా అనిపిచ్చేది!'' అంది ఓబుళమ్మ.

''పాపా నరసక్కా!'' అంటూ కేకేశాడు చెన్నప్ప పక్కింటిపిల్లని. అతను వేసుకొన్న చిరుగుల బట్ట బనియనూ, మాసిపోయి ఉన్న తెల్లని పంచే, తెల్లగా పెరిగిన గడ్డంలో కూడా అతని మొహం సంతోషంతో వెలిగిపోతోంది.

“ఏం తాత?” అంటూ ఓ పదమూడేళ్ల పిల్ల వెలిసిపోయిన ఆకుపచ్చ లంగా, జాకెట్టు వేసుకుని, రేగిపోయిన జుట్టుతో వచ్చింది. ఆ పిల్ల బంధువులమ్మాయే. వరసకి చెన్నప్పకి మనవ రాలు అవుతుందంతే, అయితే చెన్నప్ప మంచితనం వల్ల అతనికి వంటావార్పూ చేయడంలో సాయపడుతూ ఉంటుంది.

“మీ సిన్నాయనా, పిన్నమ్మా, పిల్లలూ వచ్చినారమ్మా. రెండు బియ్యపుగింజలు పొయి మీద పెట్టమ్మా. ఎయ్యాలకాడ తిన్నారో, ఏమో పాపూ. ఆకిలితో ఉంటారు. ముందు వాళ్ల కాళ్లకి నీళ్లియ్యి, తల్లీ!” అంటూ నరసక్కకి పని పురమాయించాడు చెన్నప్ప.

ముద్దుగా నవ్వి, సిగ్గుపడుతూ, గుడిసెలోకి దూరిపోయింది ఆ పిల్ల వంట చేయడానికి.

ఓ గంట తర్వాత అందరూ భోంచేశారు.

అప్పటికి పొద్దు కొంచెం వాటారింది.

ఇంటి ముందున్న అరుగుపక్కనే వేపచెట్టు గుబురుగా ఉండడం వల్ల ఎంత ఎండ పొద్దయినా చల్లగానే ఉంటుంది అక్కడ. తండ్రి పక్కనే కూచున్నాడు రామచంద్రుడు. భూమిని అమ్మేయమని చెప్పడం సాహసంగానే అనిపిస్తోందతనికి. ఎట్లా చెప్పడం? అసలు మొదలుపెట్టడ మెట్లా?

చెన్నప్ప బీడీ తాగుతూనే ఉన్నాడు.

వాకిట్లో ఓబుళమ్మ కొంగు పరుచుకుని పడుకుని మొగుడివేపే చూస్తూ ఉంది. రామ చంద్రుడు ఉన్నట్లుండి ఆమెవేపు చూశాడు. ‘ఊఁ మొదలుపెట్టూ,’ అన్నట్లు సైగ చేసింది ఓబుళమ్మ. ‘కొంచెం ఉండు,’ అంటూ కళ్లతోనే పెండ్లానికి సమాధానమిచ్చాడు రామచంద్రుడు.

ఓసారి దగ్గి, “సెనక్కాయ ఈసారి ఏమన్నా అయ్యేటట్లుందా నాయనా?” అన్నాడు ఎట్లా మొదలుపెట్టాలో తికమకపడుతూ.

“ఏందయితుందిరా! ఈపాటికి రెండు వానలు వచ్చింటే దానికతే ఏరే ఉండే. వాన రాక అగ్గి తెగులు తగుల్కొని సేనంతా మలమల మాడకపాయె. ఈసారి పంట అంతే. ఈ పొద్దు రేపట్లో వాన వచ్చినా ఇత్తనానికి తిరిగేదే కష్టము. మన ఒక్క సేనికేనా అట్లయ్యిండేది? ఊరందరి సేన్ల కతా అంతే! ఒక్క మనూరేమీ- అంతలక్కా ఇట్లే ఉందంట. పొద్దున యంగటసామి జెప్పె... హిందూపురము, కదిరీ- అక్కడల్లా ఆయప్ప పోయిండెలే కొడుక్కి పిల్లని చూసేకి... అంతా ఇదే ఏడుపేనంట!... అదిసరేగానీ రాముడూ! ఎట్లుందిరా మీకి బళ్లారిలో... బేల్దారి పని ఏమన్నా నేర్చుకుంటుండావా?”

“ఊఁ నేర్చుకుంటా ఉండా,” అన్నాడు రామచంద్రుడు మెల్లిగా.

“దినరోజూ మీమిందేరా నా యదారంతా! పంటలు ఇట్ల అగ్గిబడిపోబట్టే గదా నా పిల్లలు దేశంగాని దేశంలో కూలీనాలీ చేసేకి పొయ్యిండేది అని కడుపులో సంగటమయిపోతుందప్పా!” అంటున్న చెన్నప్ప గొంతు మాటలు రానంత పూడుకుపోయింది.

తండ్రి తమ విషయంలో అంత బాధపడుతూ ఉంటే ఆయన్ని నొప్పి పెట్టే భూమి అమ్మకం విషయం వెంటనే ఎట్లా మొదలుపెట్టడం అని గబుక్కున లేచి, “అట్ల దిగువ గేర్లోకిపోయి నరసిములీ్ని, మల్లేసునీ, తిప్పన్న మామనీ మాట్లాడిచ్చి వత్తా నాయినా!” అనేసి వెళ్లిపోయాడు రామచంద్రుడు.

అందాకా ఏం జరుగుతుందా అని ఎదురుచూసిన ఓబుళమ్మకు మొగుడి మీద విపరీతంగా కోపం వచ్చేసింది. 'థూ! ఏం మనిషీ- సరిగా మాట్లాడే సమయానికి ఎల్లిపాయె... తండ్రి ముందర మాట్లాడల్లంటే దొమ్మకాయలు లేవు. నా మిందకయితే ఒంటికాలి మింద వత్తాడు,' అంటూ గొణుక్కుంది మనసులోనే.

*

రాత్రి బువ్వలు తాగే వేళయింది.

గుడిసె పక్కనే ఉన్న వీధిదీపం వెలుతురు వెన్నెలలా అరుగుమింద పరుచుకుని ఉంది.

అన్నం తింటూ ఉన్నట్లే ఒక నూరుసార్లు లోలోపలే తండ్రితో భూమి విషయం ఎట్లా మాట్లాడాలో కూడబలుక్కున్నాడు రామచంద్రుడు.

అరుగుమీద చెన్నప్ప మనుమలతో ముచ్చటగా మాట్లాడుతూ, అప్పుడప్పుడు వాళ్ల మాటలకి గట్టిగా నవ్వుతూ ఉన్నాడు.

రామచంద్రుడు అన్నం తిని బయటికి వస్తూనే చెన్నప్ప అన్నాడు, "ఒరే రాముడూ! ఈ నాయాండ్లు బలే అసాధ్దులురో! జాగరత్తగా జూసుకోవల్ల. లేకుంటే నిన్నీ, నీ పెండ్లాన్నీ బళ్లారి సంతలో మూడు బొట్లకి అమ్మేసి వత్తారు. వానాలి వానెక్క ఏం తెలివితేటలు ఉండాయిరా?" మురిపెంగా మనుమల్ని చూస్తున్నాడు చెన్నప్ప.

రామచంద్రుడు పళ్లికిలించాడు. అతని ధ్యాసంతా తను అందాకా కూడబలుక్కున్న విషయం మీదనే ఉంది.

"రెడ్లోళ్లు భూములన్నీ అమ్మేసినారంటనే!" అన్నాడు రామచంద్రుడు నాందీ ప్రస్తావనగా.

"యా రెడ్డోళ్లు రా?" అన్నాడు చెన్నప్ప మనుమల మురిపెంలోంచి తేరుకోకుండానే.

"తిమ్మారెడ్డి వాళ్లు యకరా ఇరవై వేల లెక్కన ముప్పయి ఎకరాలూ అమ్మేసినారంట ఉరవకొండోళ్లోకి."

"ఆఁ... ఆఁ... అవున్లే, తిమ్మారెడ్డి ఈడ ఉండేదంతా అమ్మేసి, అనంతపురంలో ఇండ్ల స్థలాల యాపారం జేస్తా ఉండాడులే. వాళ్లంతా పెద్దోళ్లురా! వాళ్లకి ఉన్న ఊర్లూ, కన్నతల్లీ ఇవన్నీ ఏమీ ఉండవు. యాడ పచ్చగా, వెచ్చగా ఉంటే ఆడుంటారు. అయితే అనంతపురమాయే, లేదంటే యా అయిద్రాబాదో, ఢిల్లో- యాటికైనా సరే పోతారు- కాలి మీద కాలు ఏస్కోని బతుకుతారు," అన్నాడు చెన్నప్ప- బనియను జేబులోంచి బీడీకట్ట, అగ్గిపెట్టెను తీస్తూ.

"మనం మాత్రం ఈడే ఉంటాం. కరువొచ్చినా, కాటకమొచ్చినా, సేన్లు పండినా, ఎండినా ఈడే బడి ఉండల్లని యా దేవుడు జెప్పినాడు నాయినా! వాళ్లనుకొనేదేంటికి? మన గాచారం అంట్లుంది గాబట్టే ఈడే పడుండాము."

చెన్నప్ప బీడీకట్టలోంచి ఒక బీడిని ఏరుకుని దాని మొదల్ని వేళ్లతో నములుతూ అన్నాడు- "ఒరే తిక్కనాకొడకా! ఎవరో ఊరిడిసేసీ, ఉండేది అమ్ముకోని పోతేపోనీలేరా," అంటూ బీడి అంటించుకుని, మళ్లీ అన్నాడు చెన్నప్ప- "వాళ్లాకట్ల మనమెందుకు పోతాంరా ఎర్రినాగన్నా! కన్న తల్లట్లా ఊరూ, కన్నతల్లికంటే ఎక్కువయిన బూమమ్మని ఇడిసి ఎట్లబోతాంరా!"

"ఇట్లా నమ్మకాలు పెట్టుకొనే మడి, మనమిట్ల బతుకుతూ ఉండేది. ఇప్పటికయినా మించిపోయిండేది ఏమీలేదు నాయినా! మన బూమిని అమ్మేద్దామి. ఆ వచ్చిన దుడ్లతో బళ్లారిలో ఇంత జాగా కొనుక్కోని కొట్టాం ఏసుకొందామి. మనందరం తల్లుల పిల్లలం ఒకచోటే ఉన్నెట్లుం టాది," అంటూ తన మదిలో ఉన్నదంతా చెప్పేశాడు రామచంద్రుడు.

"తిక్క లంజకొడాకా నీకి ఎన్నిసార్లు జెప్పినానురా భూమి అమ్మే సుద్దే నా యదుట ఎత్తొద్దు అని," అన్నాడు చెన్నప్ప.

తండ్రి మాటల్లో కోపం పాలు ఎక్కువగానే ఉన్నట్లు తోచింది రామచంద్రుడికి. అయినా తనూ తగ్గదలుచుకోలేదు. "నీకి బూమిపిచ్చి పట్టుకునింది. బూమి పండి పండే మడి మనం ఈ గతికి వచ్చిండేది. బాయి తొగియ్యాలన్ని పదయిదువేలు అప్పు జేత్తివి. దాంట్లో బండ బడిపాయె. బోరు ఏపియ్యాల్లని పదివేల రూపాయలు కర్సు పెడితివి. నీళ్లూ పడలే, నిప్పులూ పడలే... అప్పులు అన్నీ నెత్తిమిందికొచ్చె... ఏమంటే ఆ రెండేండ్లూ వానదేవుడు కండ్లు తెరిసె గాబట్టి సెనిక్కాయ పండి ఆ అప్పులు తీరిపాయె. లేకుంటేనా, ఆ అప్పులకీ, వడ్డీలకీ నేనూ నా పిల్లలూ తీర్చినా తిరుతుండేనా- అంత అప్పు!"

"ఇప్పుడేమిరా బలే మాట్లాడుతుండావే! బళ్లారి నించీ బూమి అమ్మేకే వస్తివేమప్పా!" అంటూ బిగ్గరగా మాట్లాడాడు చెన్నప్ప. అతని కోపం నషాళానికి ఎక్కుతోంది. అంతవరకూ తాత ఒడిని ఉన్న పిల్లలిద్దరూ బెదిరిపోయి చకచక అరుగు దిగేసి వాకిట్లో కూచున్న తల్లి దగ్గరకు చేరారు.

"ఏంటికి నీకి అంత కోపమొస్తాది బూమి అమ్మేసుద్ది ఎత్తితే?" కాస్త కోపంగానే అన్నాడు రామచంద్రుడు.

"ఏంటికి రాదురా? అది నా పానంరా! దాన్ని అమ్మేది అంటే తల్లిని అమ్మినట్లేరా... ఎంతసేపూ దానిమింద ఎంత కర్సు పెట్టిందే జెప్తా ఉండానే! అదే లేకుంటే నువ్వు యాడుండావు? అదే జెప్పు! మా తాతా, మా తండ్రీ, నేనూ నువ్వూ ఇదే ఊర్లో గవురవంగా బతికినామంటే దాని సలవేరా! ఎట్లా నా కొడుకువి పుట్నావురా నా కడుపున. రోంతన్నా కిరీ (కృతజ్ఞత) లేని మనిషివి! అందుకే ఇట్లా మాట్లాడ్తా ఉండేది. మీ అమ్మ గీన బతికి ఉంటే పని శాతగాదని అమ్మేసే దొంగ లంజికొడుకువిరా నువ్వు!" అన్నాడు చెన్నప్ప అదోరకంగా మొగంపెట్టి.

"ఏమో నాకదంతా తెల్దు. బూమి అమ్మేయల్ల, నువ్వు మాతో రావల్ల. అంతే!" కొడుకు మాటల్లో నిర్లక్ష్యం కనిపించింది చెన్నప్పకు.

"నేను వచ్చేది కాదురా... బూమినీ అమ్మేల్లేదు... ఏం జేసుగుంటావో సేసుకో పో సుద్దామి. నువ్వు నాకి నెలనెల ఇంత బత్తెం పంపిస్తా ఉండావని గదా ఇన్ని మాటలు మాట్లడ్తా ఉండేది. ఇంగనించి నీవు పంపియ్యొద్దు," అంటూ ఆవేశంగా మాట్లాడి మరో బీడి అంటించుకొని గుప్‌గుప్‌న లాగాడు చెన్నప్ప.

"నువ్వట్ల మాట్లాడితే మడి నాకు మండేది!" అన్నాడు విసురుగా రామచంద్రుడు.

"ఏమి యాల మండుతాదిరా దొంగలంజకొడకా! ఏం నీ అబ్బ గంట అంతా ఇచ్చి పోగొట్టు కుండావు... నువ్వు ఎన్నన్నా అను నేను మాత్తరం బూమి అమ్మేది లేదు!"

తండ్రీ కొడుకుల కొట్లాట తారస్థాయికి చేరుకోవడంతో చుట్టుపక్కల ఇళ్లవాళ్లు అందరూ గుమిగూడారు.

"ఒరే రామచంద్రిగా ఇపుడు యాలరా ఆ బూమి అమ్మేసుద్దీ!" అన్నాడొక ముసలాయన గుంపులోంచి వణుకుతున్న గొంతుతో.

"ఆఁ... మీరంతా ఇట్ల అనబట్టే ఈ ముసిలోడు బూమి అమ్మమంటే మోటుకేసి కూకుం డాడు," అన్నాడు రామచంద్రుడు పెద్ద గొంతుతో.

"వాడు చూడరా! మాట్లాడేది తండ్రి అనే గవురం గూడా లేకుండా," అన్నాడు చెన్నప్ప వణికిపోతూ.

"బూమి అమ్మమంటే నీకేల మామా ఇంత కోపమూ?" అంది ఓబుళ్లమ్మ.

"ఏమ్మో? ఇదంతా నీ పనేనా తల్లీ! వాడు పుట్టి బుద్ధెరిగినప్పణ్ణించి యా పొద్దేగానీ నాకి ఎదురుతిరిగి మాట్లాడి ఎరుగడు. అట్లానా కొడుకు ఈ పొద్దు వాని నోటికొచ్చినట్టల్లా కూస్తా ఉండాడు. నీయట్లా కోడండ్లు ఇంటికొకరు ఉంటే సాలు తల్లీ! ఒక కొంపకు మూడు వాకిండ్లు తెరుసుగుంటాయి!" అన్నాడు కసిగా చెన్నప్ప. కోడలు సంసారానికి వచ్చినప్పటి నుంచీ పల్లెత్తు మాట అనని చెన్నప్ప!

"కొడుకు అదవతనాన్ని జూసుకొని నువ్విట్ల మాట్లాడ్త ఉండావు. బూమి బూమి అను కొంటా మమ్మల్ని నిలువునా ముంచుతుండావు," అంది ఓబుళమ్మ మరింత కసిగా.

"ఏమ్మా! నువ్వు ఆడదానివే, మామని అట్ల మాట్లాడొచ్చా?" అన్నది ఓ ముసలి ముత్తైదువు.

"నీకి తెల్దులే అత్తా మా ఇంటి సంగతి... మా మామని సుకపెట్టేదానికి బూమి అమ్మమంటే ఆ యప్ప ఎట్ల మాట్లాడ్తా ఉండాడో సూడి..." అంది ఓబుళమ్మ.

"మీ మామకి ఇష్టంలేని పనిచేసి సుకపెట్టకుంటే నేమి?" అంటూ ప్రశ్నించింది ముసిలి ముత్తైదువు.

ఓబుళమ్మకి అరికాలి నుంచి మండింది. "అసలు మా ఇంట్లో సుద్దులోకి మీరు తల దూర్సద్దంగ్రీ! నాయం జెప్పమ్మా అని అడిగితిమా?" అంటూ కసిరినట్టు మాటాడింది.

"అమ్మా తల్లీ! యాడన్నా పోండమ్మా మాకేల ఉండేకి," అంటూ నొచ్చుకుంటూ ముసిలి ముత్తైదువు అక్కడి నుంచి తప్పుకుంది.

"బూమి ఎట్ల అమ్మవో నేనూ జూస్తా... లేదా నా బాగానికి వచ్చేది నాకిచ్చెయ్యి... అంతే మడి!" అన్నాడు రామచంద్రుడు తెగదెంపులు చేసుకుంటున్నట్టు.

ఆ మాటలు వింటూనే వినరాని విషయం విన్నట్టు కొడుకువేపు చూశాడు చెన్నప్ప. అతని కళ్లల్లో గిర్రున నీళ్లు తిరిగాయి. తనకున్న ఒక్కగానొక్క కొడుకేనా ఈ మాట అన్నది? పిల్లప్పన్నుంచి కిందికేస్తే మన్నవుతుందని బుజాల మీద ఎత్తుకొని తిరిగిన తన కొడుకేనా ఈ మాటలు అంటున్నది! తను తింటే మన్ను అయిపోతుందనీ, వీడు తింటే బంగారమౌతుందనీ పెట్టి సాకీ సంతరిచ్చిన కొడుకేనా ఈ మాటలంటున్నది!

"ఒరేయ్ రాముడూ! నీ బాగం, నా బాగం ఏందిరా! అంతా నీది కాదేంరా! నాకేమన్నా నలుగురు కొడుకులు ఉండారేంరా బాగాలు పంచి ఇచ్చేదానికి? నాతో బాగం పంచుగొనేకి నువ్వు నాకీ అన్నదమ్ముడేంరా రేయ్! అంతా నువ్వే తీసుకొప్పా! నాకేమి వల్ల! దాన్ని అమ్ము కుంటావో, పాడుజేసుకుంటావో నాకేల? నాకుంటే జానెడు పొట్ట యా ఊళ్ల ఇంత అడక్క తింటే నిండదు! నీ ఇట్టిపెకారమే కానియ్యిరా!" అంటూ ఏడుపు గొంతుతో అనేసి అరుగు దిగి అక్కడి నుంచి ఒలుకుతున్న కన్నీటితో చరచరా వెళ్లిపోతున్నాడు చెన్నప్ప.

ఇలా జరుగుతుందని ఊహించని రామచంద్రుడూ, ఓబుళమ్మా నిశ్చేష్టులయి చూస్తూ ఉండిపోయారు.

కాసేపు నిశ్శబ్దం ఆవరించింది.

"అమ్మా! తాతా ఎల్లిపోతూ ఉండాడే!" అన్నాడు సురేసు ఏడుపు గొంతుతో.

ఓబుళమ్మ మాట్లాడలేదు.

"యాటికి పోతాడులేరా రామచంద్రా! ముసిలోడు కదా! కోపమెక్కువ. కోపం సల్లారినంక తిరిగి వత్తాడు," అన్నాడు ఓ నడి వయస్కుడు.

"వస్తాడులే రాకెక్కడికి పోతాడు," అంటున్నారు కొందరు.

*

తెల్లవారుతూ ఉంది.

రాత్రంతా నిద్రపోలేదు రామచంద్రుడు. తండ్రి గురించే దిగులుపడ్డాడు. తను దుబారాగా మాట్లాడకుండా ఉండాల్సింది అనుకుంటూ ఎన్నిసార్లు పశ్చాత్తాపపడ్డాడో!

ఓబుళమ్మలో కూడా పశ్చాత్తాపం కనిపిస్తోంది. యాటికి పోయినాడో సూసిరమ్మని రాత్రికి రాత్రే ఊర్లో తెలిసిన వాళ్ల ఇళ్లన్నీ వెతికించింది రామచంద్రుడి చేత. ఆ గేర్లో (వీధిలో) అందర్నీ అడిగి తెలుసుకుంది. తనను ఎప్పుడూ 'అమ్మా! పాపా!' అంటూ ఎంతో ఇష్టంగా పిలిచే మామనేనా తను అంత నిష్ఠూరంగా మాటాడింది అనుకుంటూ కుమిలిపోతూ ఉంది.

కరకరా పొద్దు పొడిచింది.

'ఒరే రాముడూ!' అని తండ్రి ముద్దుగా దూరం నించి కేక పెట్టినట్టు వినిపించి పిచ్చిగా చుట్టూ చూశాడు. ఎవరూ లేరు. జీవితంలో తన తండ్రినింక ఏమీ అనడు. తండ్రి కనిపించగానే అతని కాళ్లమీద పడి భోరున ఏడువాలని ఉంది రామచంద్రుడికి. ఇంక ఎన్నడూ బూమిని అమ్మే యమని తను చస్తే అనడుగాక అనడు.

"ఓ అన్నా! రామచంద్రన్నా!" అటూ రంగయ్య వచ్చాడు వగరుస్తూ. "మీ నాయిన సచ్చి పోయినాడన్నా! అద్దో మీ సేన్లో," అంటూ చూపించాడు. రెండు చేనుల అవతల ఉన్న తన చేలో ఓ తెల్లటి బట్టలున్న ఆకారం అడ్డంగా పడి ఉంది.

పిడుగుపాటు విన్నట్టు కంపించిపోయి ఉరుకుల పరుగుల మీద తన చేను చేరుకున్నాడు రామచంద్రుడు.

వాడిపోయిన వేరుశెనగ చేనులో తల్లి యెద మీద ఆదమరచి నిద్రిస్తున్న పసివాడిలా నిర్విచారంగా నిర్మలంగా ఉంది చెన్నప్ప శవం.

*ఆంధ్రప్రభ వారపత్రిక*
*1 మే 1991*

నేపథ్యం

భూమి మీద మమకారం

# మన్నుతిన్న మనిషి

***కొత్త తరం వాళ్ళలో మాత్రం భూమిని అమ్మేసి జీవన విధానంలో వచ్చిన మార్పుకి అనుగుణంగా బతకాలన్న తాపత్రయం కనబడుతుంది. పాతతరం వాళ్ళకి భూమిని మించిన సెంటిమెంటు మరొకటి ఉండదు. అక్కడ పుడుతుంది రెండు తరాల వాళ్ళకీ సంఘర్షణ.***

నేను రాసినవి ఎక్కువ భాగం మధ్యతరగతికి సంబంధించిన కథలే. రాసిన కథలే నన్ను మంచి రచయితగా పాఠకులకు గుర్తుండేలా చేశాయి. వీటిలో మరీ ముఖ్యంగా మన్ను తిన్న మనిషి కథ! కథకులందరికీ ఉన్నట్టే నాకూ ఇష్టమైన కథల జాబితా ఉంది. అందులో మన్నుతిన్న మనిషి మొదటిది. అందుకే దాని నేపథ్యం రాయాలని పూనుకొంటున్నాను.

ఈ కథ ఒక చిన్న సంఘటన్నో, ఒక సమస్యనో ఆధారంగా చేసుకొని అల్లిన కథ కాదు. నిజానికి కథ రాసేనాటికి (1989) ముందు నాలుగైదు ఏళ్ళ నుంచీ కథా వస్తువు నా బుర్రలో నానుతూ ఉంది. అందుకు సంబంధించిన కొంత వివరణ అవసరంగా భావిస్తూ ఇక్కడ కొంత సమాచారాన్ని అందిస్తాను.

మన్ను తిన్న మనిషి కథ చదవని వారి కోసం, చదివినా మరోమారు కథనంతా గుర్తుకు వచ్చేలా నాలుగు మాటల్లో సంక్షిప్తంగా కథ చెబుతాను.

కరువు రావడంతో అనంతపురం జిల్లాలోని ఓ పల్లె నుంచి రామచంద్రుడూ, అతని భార్య ఓబుళమ్మా వాళ్ళ పిల్లలతో సహా బళ్ళారి చేరుకొని కూలీపనులు చేస్తూ జీవిస్తుంటారు. రామచంద్రుడి తండ్రి చెన్నప్ప మాత్రం పల్లెనూ, తన పండని పొలాన్నీ విడిచి రాడు. వచ్చిన కూలిడబ్బుల్లోనే కొట్టం బాడుగ, వాళ్ళ తిండితిప్పలు, పల్లెలో ఉన్న తండ్రికి భత్యం ఖర్చు జరగాలి. పల్లెలో ఉన్న భూమిని అమ్మేసి బళ్ళారిలోనే కొట్టం వేసుకొని బతుకదామంటుంది ఓబుళమ్మ. తన తండ్రి ఒప్పుకోడని తెలిసినా,

పెళ్ళాం పోరు పడలేక పల్లె చేరుకొంటాడు కుటుంబంతో సహా. తండ్రి వాళ్ళని చూసి ఎంతో సంబర పడిపోతాడు. భూమిని అమ్మే విషయం తండ్రితో ఎట్లా మొదలుపెట్టాలో తెలీక, వెనకా ముందూ ఆడుతూ ఉంటాడు. చివరికి పెళ్ళాం ప్రోద్బలంతో అసలు విషయాన్ని ఆ రాత్రికి బయట పెట్టేస్తాడు. తండ్రి మండిపడతాడు. పెద్దపెట్టున కొట్లాటకు దిగుతాడు. మాటామాటా పెరిగాక రామచంద్రుడు ఆవేశంలో, 'నా భాగానికి వచ్చేది నాకిచ్చేయ్యి,' అంటాడు. దాంతో దెబ్బతింటాడు తండ్రి. 'భాగం పంచుకొనేందికి నువ్వేం నా అన్నదమ్ముడేంరా!' అంటూ అక్కడి నుండి వెళ్ళి పోతాడు. కోపం తగ్గాక తండ్రి తిరిగి వస్తాడులే అనుకొంటాడు. ఎంతకీ రాని తండ్రి కోసం నిద్రపో కుండా రాత్రంతా అన్నిచోట్లా వెదకుతాడు. తెల్లవారుతూనే తమ చేల్లో వాడిపోయిన వేరుసెనగ పైరులో తల్లి యెద మీద ఆదమరచి నిద్రిస్తున్న పసివాడిలా ఉన్న తండ్రి శవం కనిపిస్తుంది రామచంద్రుడికి... ఇదీ కథ.

*

ఆంధ్రదేశంలోని అన్ని జిల్లాల్లోకి రాయలసీమ జిల్లాల్లో వాతావరణం ప్రత్యేకంగా ఉంటుంది. రాయలసీమ జిల్లాల్లో అనంతపురం జిల్లా వాతావరణం మరీ ప్రత్యేకంగా ఉంటుంది. ఇక్కడ కరువే ఓ పెద్ద సమస్య. అన్నిచోట్లా పిలిస్తే పలుకుతుంది కరువు, అయితే అనంతపురం జిల్లాలో పిలవకనే పలుకుతుంది అనుకోవడం పరిపాటి. ఇక్కడ కొండలూ, కోనలూ, చెట్లూ కరువు ప్రభావం వల్ల ఏదో వెలితిగా కనిపిస్తూ ఉంటాయి. తుంగభద్ర నదీజలాలు జిల్లాలో కొంతమేరకు పారినా సగటు రైతు జీవన విధానంలో మార్పు చోటు చేసుకోలేదు. ఎక్కువభాగం మెట్ట వ్యవసాయమే. భూమిలో వేరుసెనగ వేసిన రైతు వర్షం ఎప్పుడొస్తుందా అని ఎదురుచూడ్డం, వర్షం వచ్చిందా అంతో ఇంతో మిగుల్చుకొంటాడు. లేదంటే మళ్ళీ సంవత్సరం అప్పు చేసి వేరు సెనగ విత్తనాలు తెచ్చి భూమిలో వేసేవరకు నిద్రపట్టదు. మళ్ళీ మామూలే ఎదురుచూడ్డం వాన కోసం. ఇది నిజంగా జూదంలాంటిదే. ప్రభుత్వం కూడా ఈ విషయమై పట్టించుకొన్న పాపానపోదు.

అసలు ఆశ్చర్యపడాల్సిన విషయమేమిటంటే ఇక్కడ 20 ఎకరాలున్న ఆసామి కూడా ఏడాది పొడుగునా తన కుటుంబానికి ముప్పూటలా ఇంత తిండి పెట్టలేకపోవడం. ఈ విషయం చెబితే సర్కారు జిల్లాల వారు ముక్కు మీద వేలు వేసుకోగలరు. నీటి వసతి సమృద్ధిగా ఉన్న సర్కారు జిల్లాలవారికి వ్యాపార పంటలు పండించడంలో తెలిసినన్ని మెలకువలు ఇతర ప్రాంతాల వారికి తెలియవు. అందుకే అక్కడ ఎకరం, ఎకరమున్నర ఉన్నవాళ్ళు ఇక్కడ పాతిక ఎకరాలు ఉన్నవాళ్ళ కంటే ఎంతో హాయిగా జీవిస్తూ ఉంటారు.

అనంతపురం జిల్లాలో మరీ ముఖ్యంగా కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న ప్రాంతాలలో ఉన్న రైతులు కరువు వచ్చిందంటే అటు బెంగుళూరుకో, ఇటు బళ్ళారికో వలసపోతారు పెళ్ళాంబిడ్డలతో. కొంతమంది గత యాభై అరవై ఏళ్ళుగా అక్కడే కూలీనాలీ చేసుకొంటూ ఉండిపోయిన వాళ్ళూ ఉన్నారు. ఇదిక్కడ చాలా సర్వసాధారణమైన విషయం. అయితే ఇట్లా కూలీలుగా వెళ్ళేది, బేల్దారుగా మారేది అంతా వయసులో ఉన్నవాళ్ళు, మధ్య వయస్కులే ఎక్కువ. ముసలీముతకా అందరూ పల్లెలో ఇళ్ళ దగ్గరే ఉండడం కద్దు! ఈ ముసలివాళ్ళకి భూమి మీద ఎనలేని మమకారం! ఎక్కడ లేని ప్రాణం! ఆ పండని భూముల్ని అమ్మేద్దామని కొడుకో, కోడలో అన్నారో ఇంక అంతే! ఒంటి కాలి మీద యుద్ధానికి దిగుతారు.

ఇదంతా ఒకవైపు జరుగుతూ ఉండటం నేను ఈ ప్రాంతంలో గమనించిన విషయం. ఇంక ఇందులో కథకు అసలు ప్రాణప్రదమైన విషయం మరొకటి ఏమిటంటే మా అవ్వ (అంటే మా నాయనమ్మ!)

మా అవ్వకు భూమి మీద చెప్పలేనంత మమకారం. అంత మమకారానికి వెనక కొంత కథ ఉంది. ఆమెకు 18 సంవత్సరాల వయస్సులోనే ఇద్దరు బిడ్డల తల్లి. అంత చిన్న వయసులోనే మా తాత చనిపోయాడు. ఆమె వాటాకి రావాల్సిన 20 ఎకరాల పొలాన్ని మా పెద్ద తాత (ఆమె బావగారు) పంచి ఇవ్వలేదు. కూలీనాలీ చేసైనా తన పిల్లలిద్దర్నీ చదివించాలనుకొంది. మా నాన్ననీ, మా మేనత్తనీ హిందూపురం, కదిరి బోర్డింగుల్లో చదివించింది. మా నాన్నకి మైనారిటీ తీరేవరకూ ఆమె చేయని కూలీపని లేదు, పడని కష్టంలేదు. మా నాన్నకి మైనారిటీ తీరగానే తన వాటా భూమిని తన స్వాధీనంలోకి తెచ్చుకొన్నాక మా అవ్వ దాని మీద ఎక్కడలేని మమకారాన్ని పెంచు కొంది. తను పడ్డ కష్టాలన్నిటినీ ఒక్కటొక్కటే మాతో రాత్రిళ్ళు వెన్నెట్లో మాకు అన్నాలు తినిపిస్తూ, చెప్పేస్తూ నవ్వేసేది. తన భూమిని తిరిగి సంపాదించుకోవడం ఎట్లానో చెబుతోంటే ఒక చక్రవర్తి పోగొట్టుకొన్న తన సామ్రాజ్యాన్ని తిరిగి గెలుచుకొన్న దానికంటే మిన్నగా అనిపించేది మాకు. ఆమె వర్ణించి, వర్ణించి చెబుతోంటే మా ఒళ్ళు గగుర్పొడిచేది! మా నాన్న సర్వేయరు ఉద్యోగంలో చేరి కర్నూలు జిల్లాకు వెళ్ళిపోయాడు. అంతకుముందే మా అత్త పెళ్ళి చేసుకొని వెళ్ళిపోయింది. ఇక ఆమెకు భూమే అంతా. చిన్న ఆవులమందతో, అడవిలాంటి చేనులో ఇల్లు కట్టుకొని, ఏ దిక్కు లేకున్నా ఒంటరిగా ఉండిపోయింది. మా ఇంటిల్లిపాదీ ఎప్పుడైనా సెలవుల్లో మా ఊరు వెళ్తే మా సంతోషాల్లో, ఉల్లాసాల్లో ఆవిడ తన ఆనందం వెతుక్కొనేది. మా నాన్న ఎప్పుడైనా, 'ఎందుకుమా! ఈ వయసులో నీకీ కష్టం. మాతోపాటు వచ్చి ఉండు,' అని అన్నప్పుడు, 'వల్లప్పో నేనురాను. నాకి ఈడే బాగ, ఆడికొచ్చి నేనేడ ఉండేది? అయ్యెల్లేదు,' అంటూ తిరస్కరించేది అవ్వ. ఏరోజైనా, 'తోట అమ్మేద్దాము,' అని మా నాన్న అన్నాడా, ఇంక ఆరోజు మూడో ప్రపంచ యుద్ధమే మా ముంగిట్లో ఉంటుందంతే!

మా నాన్న చీనీతోట (నారింజతోట)కుగానూ, బావికి ఆయిల్ ఇంజనుకుగానూ భూమి తనఖా బ్యాంకులో అప్పు చేశాడు. చీనీపంట చేతికి అందక, అంతా దొంగలపాలు అవుతుండ టంతో, చీనీ తోటని నరికించేశాడు. దాంతో అప్పు మిగిలిపోయింది. దాన్ని తీర్చేందుకు విధిలేని పరిస్థితుల్లో కొంత భూమిని అమ్మాల్సి వచ్చింది. అప్పుడు మా అవ్వ పడ్డ బాధ మాటల్లో చెప్పలేనిది.

నాకు అప్పుడు తెలిసింది భూమి మీద పాత తరంవాళ్ళకున్న మమకారం. కొత్త తరం వాళ్ళలో మాత్రం భూమిని అమ్మేసి జీవన విధానంలో వచ్చిన మార్పుకి అనుగుణంగా బతకాలన్న తాపత్రయం కనబడుతుంది. పాతతరం వాళ్ళకి భూమిని మించిన సెంటిమెంటు మరొకటి ఉండదు. అక్కడ పుడుతుంది రెండు తరాల వాళ్ళకీ సంఘర్షణ.

ఇదంతా కథలో కనిపించాలి. కథ చదివాక పాఠకుడికి నేను ఏది చెప్పదల్చుకొన్నానో అది ఫీలవ్వాలి. అందుకే కథలో మా అవ్వ తరం వాళ్ళకున్న భూమిపై మమకారాన్ని చూపదల్చు కొన్నాను. తర్వాతి తరంవాళ్ళ వాళ్ళ ఆలోచనల్ని చెప్పదలుచుకున్నాను. ఏ తరం వాళ్ళకి వాళ్ళది సరిగ్గానే అనిపిస్తుంది మరి!

కథ రాయాలనుకొన్నాగానీ, చరిత్ర రాయడంలేదు కాబట్టి, మా అవ్వ పాత్రనీ ఆమె జీవన విధానాన్నీ సంపూర్ణంగా తీసుకోలేదు. అందుకే ఆమె స్థానంలో చెన్నప్ప పాత్రని ప్రవేశపెట్టాను. (ఇక్కడో మాట- మా అవ్వ జీవితాన్ని కథగా రాయాలన్న ఆలోచన ఒకటి లేకపోలేదు. అయితే, ఆ ఉద్దేశంతోనే అవ్వ పాత్రని చెన్నప్ప పాత్రగా చేయలేదు.)

ఇంక కథలో వచ్చే ప్రధాన పాత్రలు రామచంద్రుడు, ఓబుళమ్మలు. ఈ రెంటినీ కథ కోసం కథనాన్ని దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తగా మలుచుకొంటూ పోయాను. నేను ఇంతకుముందే చెప్పాను అనంతపురం జిల్లా నుండి కర్ణాటక రాష్ట్రంలోని బళ్ళారి, బెంగుళూరుకు వలసపోయే

రైతుల గురించి. వాళ్ళకి ప్రతినిధులుగా ఈ పాత్రలు ఉండేలా చేశాను. కథ మొదలు కావడమే బళ్ళారిలో మొదలవుతుంది. అందుకు కారణమొకటే. నాకు అనంతపురం తర్వాత బాగా తెలిసిన పట్నం బళ్ళారే! ఎందుచేతనంటే అది మా అత్తగారి ఊరు కాబట్టి.

ఈ కథలో అంత ప్రధాన పాత్ర కాకపోయినా కొంత ప్రాధాన్యత ఉన్న పాత్ర నారాయణప్ప. ఇది మాత్రం నిజంగా ఉన్న పాత్రే. అసలు పేరుతో పనిలేదు కాబట్టి ఇక్కడ ప్రస్తావించడం అనవసరమే! అనంతపురం చుట్టుపక్కల ఉన్న ఒక పల్లె నుంచి కూలీగా జీవితాన్ని ప్రారంభించి అతి తక్కువకాలంలోనే బాగా కష్టించి ఇళ్ళ నిర్మాణంలో ఉన్న మెలకువలన్నీ తెలుసుకొని మంచి పేరు మోసిన మేస్త్రీగా మారిన ఒక మనిషిని నారాయణప్పగా మలిచాను.

నారాయణప్పను గురించి కథలో, "ఈనాడు బళ్ళారిలో బాగా పేరున్న మేస్త్రీలలో అతనూ ఒకడు. ఇప్పుడతని చేతి కింద అరడజను మంది బేల్దారులు (తాపీ పనివాళ్ళు) ఉన్నారు. ఏడేళ్ళ కింద ప్రభుత్వం వారు ఇచ్చిన ఇంటి స్థలంలో చిన్న పూరిగుడిసె ఉండేది. అది ఈనాడు పెద్ద మేడగా రూపాంతరం చెందింది. ఆ మేడలో రెండు గోద్రేజ్ బీరువాలూ, సోఫాసెట్టు, రంగుల టీవీ మొదలుకొని ఎన్నో విలువైన సామానులున్నాయి. బళ్ళారిలోనే సంగనకల్లు రోడ్డుకు ఇరవై సెంట్ల ఇంటి స్థలం సంపాదించాడు. అది ఈరోజున మూడు లక్షల విలువ చేస్తుంది," అంటూ చెప్పడానికి కారణం- అతను కథలో ముఖ్యమైన మలుపుకు అవసరమయ్యే విషయాన్ని రామ చంద్రుడికి తెలియజేయడానికి కారకుడు కావాలనే!

ఈ జిల్లాలోని భూమిని గురించి నారాయణప్ప మాట్లాడుతూ, "ఇప్పట్లో మన ఊర్ల దిక్కు భూమి పండిచ్చేరంటే యాదన్నా జూదం ఆడినట్లే, లేదంటే కోడిపందెంలో దుడ్లు కాయడమే నప్ప రామచంద్రా! ముంగారు వానలు వస్తానే అప్పోసప్పో జేసి సెనిగిత్తనాలు కొండబోయి భూమిలో యేసి వస్తారా! ఇంగ వానలు సరింగా వచ్చినాయంటే పంట చేతికొచ్చి రైతు మిగుల్తాడు. లేదంటే పంటలన్నీ ఇంతేనప్పా!..." అదీ- అతని అనుభవంలోకి వచ్చిన విషయం. ఈ విషయాలు చెప్పించడానికి ఆ పాత్రని వాడుకొన్నాను. మళ్ళీ ఎక్కడా కథలో కనిపించడు నారాయణప్ప- ఆ అవసరం కూడా రాదు.

కథ వస్తువుని బట్టీ, ఎన్నుకొన్న శిల్పాన్ని బట్టీ ఏ ఊరులో కథను నడిపించాలా అన్నది కథకుడు నిర్ణయించుకొంటాడు. వస్తువు దృష్ట్యా కథను ప్రథమ పురుషలోనే నడిపించాను. ఇలాంటి కథల్ని రాసేటపుడు రచయిత సాక్షీమాత్రుడుగా ఉంటేనే తరాల అంతరాల్ని నిష్పాక్షికంగా పాఠకుల ముందు ఉంచగలడు అన్నది నా అభిప్రాయం.

ఈ కథ పేరు విషయం కూడా కొంత చెప్పుకోవాలి. కథ రాస్తూనే నేను పెట్టిన పేరు బూమమ్మ (పుడమితల్లి). మిత్రులు శ్రీ సింగమనేని నారాయణ కథ రాతప్రతిని చదివి మన్ను తిన్న మనిషి అని పెడితే బావుంటుందని సూచించారు. చాలా బాగుందనిపించింది. ఆ పేరే పెట్టాను.

*28 సెప్టెంబర్ 1997*

17

# బాలల దినం

## చంద్రలత




*చంద్రలత 1969 ఫిబ్రవరి 10న మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ మనోతేజ వనిత మాస పత్రికలో 1993లో ప్రచురితమయింది. 50 పైగా కథలు రాశారు. రెండు కథా సంపుటాలు, నాలుగు నవలలు ప్రచురించారు. రేగడివిత్తులు నవలకు 1997 లో తానా పురస్కారం లభించింది. నెల్లూరులో పిల్లల పాఠశాలను నిర్వహిస్తున్నారు.*

**చిరునామా**
ప్రభవ, పొగతోట,
నెల్లూరు - 524 001
Ph.: 98491 44605
chandrapydi@gmail.com


అలారం మోగగానే టక్కున లేచి, గడియారం వంక చూసింది శిరీష.

కమాండర్ చూపు తనవైపు పడగానే అటెన్షన్‌లోకి వచ్చిన సైనికునిలా నిటారుగా నిలుచుని వున్నాయి గడియారంలోని ముళ్లు.

'అమ్మో, అప్పుడే సిక్స్ అయిందే!' అనుకొంటూ, బెడ్ మీద నుంచి గబుక్కున దూకి, కప్పుకున్న దుప్పటిని ఉండలా చుట్టి, అల్మేరాలో కుక్కి బాత్‌రూమ్‌లోకి పరుగు తీసింది శిరీష.

'గీతా టీచర్ సిక్స్‌థర్టీకంతా స్కూలుకి వచ్చేయమంది. నేను వెళ్లడం లేటవుతుందో! ఏమో?' గొణుక్కుంటూ గీజర్ ఆన్‌చేసి రూమ్‌లోకి వచ్చింది.

అల్మేరాలోంచి స్కూల్‌బ్యాగును బయటకు తీసి దాంట్లోని పుస్తకాలు టేబుల్‌పైకి విసిరేసింది. తెల్ల స్పోర్ట్సు డ్రెస్‌ని, తెల్ల రిబ్బన్స్‌ని బ్యాగులో పెట్టుకొంది. అవి కన్పించకుండా పైన రెండు పుస్తకాలు సర్దింది.

ఫ్రిజ్‌లోంచి ఇన్సులిన్ బాటిల్ తెచ్చి టేబుల్ మీద పెట్టింది.

బరబరా డ్రాయర్‌లాగి సిరంజిని, మిగిలిన సరంజామాని బయటకు తీసింది.

సిరంజి లోడ్ చేసుకొని, ఎడమతొడలోకి ఇంజెక్ట్ చేసుకొంది. ఖాళీ సిరంజిని డస్ట్‌బిన్‌లో పడేసి, ఓసారి దూదితో ఇంజెక్షన్ చేసుకొన్న దగ్గర అదిమి, దూదిని కూడా సిరంజి పక్కకి విసిరేసింది.

ఎదురుగా వున్న డ్రెస్‌ని ఓదాన్ని తీసుకొని స్నానానికి వెళ్లింది.

మొక్కల దగ్గర నుండి అప్పుడే లోపలికి వచ్చిన సుధ, శిరీష రూమ్‌లోంచి పొద్దున్నే స్నానం చేస్తున్న శబ్దం వినిపిస్తుండడంతో, ఆశ్చర్యంతో శిరీష రూమ్‌లోకి వచ్చింది. 'ఏమిటో విశేషం! ఇవ్వాళ శిరీష లేపకుండానే లేచిందే!' అనుకొంటూ.

బెడ్‌షీట్ సరిచేసి, స్కూల్‌బ్యాగు తీసి టేబుల్ మీద పెడదామని చేతిలోకి తీసుకొంది.

ఇంతలో దఢాల్న బాత్‌రూమ్ తలుపు తీసుకొని, పరిగెత్తుతున్నట్లు బయటకు వచ్చింది శిరీష.

"ఏమిటి శిరీ! ఇంత హడావుడి? ఎప్పుడూ లేనిది ఇంత ఎర్లీగా రెడీ అవుతున్నావు?" అడిగింది సుధ.

తన బ్యాగ్ లోపల వున్న వైట్‌డ్రెస్‌ని సుధ చూసిందేమోనని, సుధ చేతిలోని బ్యాగును ఒక్క ఉదుటున లాక్కొని టేబుల్ మీద పడేసింది శిరీష.

శిరీష తన కంగారును కవర్ చేస్తూ టక్కున అంది.

"అబ్బే, ఏంలేదు మమ్మీ, ప్రతిమా వాళ్లింటికి వెళదామని!"

"ఇంత పొద్దుటే ఎందుకురా? నిదానంగా వెళ్లొచ్చుగా!" అంది సుధ, గబగబ జడలు విప్పుకొంటున్న శిరీషను ఆశ్చర్యంగా చూస్తూ.

"ప్రతిమా వాళ్ల ట్యూషన్‌మాస్టరు ఇంపార్టెంట్ క్వొశ్చెన్ ఎక్స్‌ప్లెయిన్ చేస్తారంట మమ్మీ! ఆయన ఆరు నుంచి ఏడుగంటల వరకే కదా ఉంటారు. కొంచెం తొందరగా పోనీ వేసేయి మమ్మీ," అంటూ దువ్వెన సుధ చేతికిచ్చి ఆమెను కూడా హడావుడి పెడుతూ అంది శిరీష.

డస్ట్‌బిన్‌లో వున్న సిరంజిని చూసి, "అప్పుడే ఇంజెక్షన్ చేసుకొన్నావా? అయితే టిఫిన్ తిని వెళ్లు శిరీ," పోనీకి రబ్బర్‌బ్యాండ్ వేస్తూ అంది సుధ.

"లేదు మమ్మీ, లేటవుతుంది. నేను ప్రతిమా వాళ్లింట్లోనే టిఫిన్ చేస్తాలే మమ్మీ. ఎలాగూ ఆంటీ వెళ్లగానే ఏదో ఒకటి తినమని ఇస్తుంది. అందుకనే ఇంజెక్షన్ కూడా చేసేసుకొన్నాను," వైట్ కాన్వాస్ షూస్‌ని మంచం కింద నుంచి బయటకు లాగి, వాటికి ఇన్‌స్టంట్ షైన్ పాలిష్ వేస్తూ అంది శిరీష.

"కాన్వాస్ షూస్ ఎందుకు? సమ్స్ వేసుకొని వెళ్లకపోయావా!" సుధ శిరీష వంక చూస్తూ అంది.

"ఏంటి మమ్మీ, నువ్వు అన్నిటికీ ఏదో ఒకటి అంటావు! ఇప్పుడు ఇవి వేసుకొంటే ఏం? సమ్స్ ఈ డ్రెస్‌కి మ్యాచ్ అవ్వవు. ఊరికే గొడవ చేయకు మమ్మీ!" లేని కోపం తెచ్చి పెట్టుకొని విసుక్కొంటూ అంది శిరీష.

"సరే నీ ఇష్టం. కనీసం పాలయినా తాగి వెళ్లు," అంటూ వంటింట్లోకి వెళ్లి పాలు తెచ్చిచ్చి వెళ్లింది సుధ.

బొట్టుబిళ్ల కోసం హడావుడిగా డ్రాలో వెతుకుతూ, శిరీష పాలు ఓ గుక్క తాగి, గ్లాసు టేబుల్ మీద పెట్టింది.

పంచదార లేని పాలు రోజూ తాగుతూనే వున్నా, ఈరోజెందుకో వెగటుగా అన్పించాయి.

పాలు వాష్‌బేసిన్‌లో పోసి, ట్యాప్ తిప్పేసింది.

ఖాళీగ్లాసు తెచ్చి టేబుల్ మీద పెట్టి, ముఖానికి బొట్టుబిళ్ల అతికించుకుంది. బ్యాగు భుజానికి తగిలించుకొని బయటకు పరుగు తీసింది.

"శిరీ, నువ్వు టిఫిన్ చేయలేదని ఆంటీకి ఫోన్ చేసి చెప్పనా?" సుధ వెనుక నుంచి పిలుస్తూ అంది.

"వద్దులే మమ్మీ, నేనే అడిగి తింటాను. బై మమ్మీ!"

గేటు తీసుకొని గబగబ నడుస్తూ వెళ్లింది శిరీష.

పరుగులు పెడుతున్న శిరీషను ఆశ్చర్యంగా చూస్తూ నిల్చుంది సుధ కాసేపు.

'బ్లడ్‌లో షుగర్ తగ్గిపోతే హైపోగ్లైసిమియా వస్తుందన్నారు డాక్టరుగారు. శిరీషేమో ఇంజెక్షన్ తీసుకొని టిఫిన్ చేయకుండా వెళ్తోంది. రాత్రి కూడా సరిగ్గా తిన్లేదు... అయినా నా కంగారు కానీ ప్రతిమ వాళ్ల మమ్మీకి శిరీష సంగతి తెలుసుగా! ఏదో ఒకటి తినమని చెపుతుందిలే!' తనను తాను సమాధానపరుచుకొని లోపలికి వెళ్లింది సుధ. అయినా ఓసారి ప్రతిమ వాళ్లింటికి ఫోన్ చేద్దామని రిసీవర్ ఎత్తింది సుధ. డయల్ టోన్ రావట్లేదు. ఫోన్ డెడ్ అయినట్లుంది.

కానీ అప్పటికే, ప్రతిమ వాళ్లింటికి వెళతానన్న శిరీష అడుగులు స్కూలువైపు మళ్లాయి.

"హాయ్ శిరీష! ఏవిటే ఇంత లేటు?" అంది బిందు, శిరీష స్కూలు గేటులోంచి లోపలికి అడుగు పెట్టగానే.

"హాయ్! మన ఫ్రెండ్సంతా ఏరీ?" చుట్టూ చూస్తూ అడిగింది శిరీష.

"గీతా టీచర్ అందరినీ రెడీ చేసింది. నువ్వే మిగిలిపోయావు. కాసేపు చూసి మేం స్టేడియంకి వెళ్లిపోయేవాళ్లం తెలుసా!" అంది బిందు శిరీషని గీత టీచర్ వాళ్లున్న దగ్గరికి తీసుకు వెళ్తూ.

"ఏంచేయాలే! నిద్ర లేచేసరికి లేటయిపోయింది. నడిచి వచ్చేసరికి ఇంకాస్త! ఇదే ఫస్ట్ టైం కదా నేను ఇలాంటి ప్రోగ్రామ్స్‌కి రావడం. ముందు ఎలా ప్రిపేర్ అవుతారో నాకు తెలియదుగా. నావలన ప్రోగ్రాంకి లేటయిపోతుందేమో? టీచర్ కోపంగా లేరుకదా! అయినా, నువ్వేమిటి గేటు దగ్గరే వున్నావు?" శిరీష బిందుని గబగబ అడిగింది.

"నీకోసమే! గీత టీచర్ పంపించింది. నువ్వు మరీ అంత లేటవ్వలేదులే. బస్సు ఇంకా రాలేదు. ఎప్పుడో తయారయి కూర్చున్న మా అందరికీ బోర్ కొడుతోంది. అందుకే, టీచర్ నీకోసం వెళ్లమనగానే, గభాల్న బయటకు వచ్చేశాను. అలా ఓ రౌండ్ కొట్టచ్చు కదా అని. సరేకానీ! మీ మమ్మీని ఎట్లా మానేజ్ చేశావు? నీవు స్పోర్ట్సుడ్రెస్ తెచ్చుకొంటుంటే ఆంటీ చూడలేదా?" కుతూహలంగా అడిగింది బిందు.

"ఏముంది? ప్రతిమ వాళ్లింటికి వెళ్తున్నానని చెప్పాను. తనే పోనీ వేసి మరీ పంపింది, తెలుసా?" పోనీని ముందుకు వేసుకొంటూ అంది శిరీష.

"మరి ఊరికినే ఆంటీ గొడవ చేస్తుందని భయపడ్డావుగా?" అంది.

"ఆ... మమ్మీకి తెలిస్తే ఎప్పటికి నన్ను పార్టిసిపేట్ చేయనిచ్చేదే కాదు," అయిష్టంగా ముఖం పెట్టి అంది శిరీష.

బిందూ తమ క్లాసు వాళ్లున్న రూంలోకి దారితీసింది.

"వైట్‌డ్రెస్, రిబ్బన్స్ తెచ్చుకొన్నావా శిరీషా?" గీత టీచర్ శిరీష రూమ్‌లోకి అడుగు పెట్టీ పెట్టగానే అడిగింది.

శిరీష తలూపి, గభాల్న బ్యాగులోంచి వాటిని చేతిలోకి తీసుకొంది.

"క్విక్ శిరీష! నీదే ఆలస్యం! వెళ్లి తొందరగా డ్రెస్ మార్చుకో!" అంది గీత టీచర్.

బెంచీలను పక్కపక్కన నిలబెట్టి ఏర్పాటుచేసిన డ్రెస్సింగ్‌రూమ్‌లోకి వెళ్లి శిరీష డ్రెస్ మార్చుకొని వచ్చింది.

గీత శిరీష పోనీని విప్పి, కొద్దిగా దువ్వింది. తెల్లరిబ్బన్‌ని చెవిపక్కన చిన్నపువ్వు వచ్చేలా కట్టింది గీత టీచర్. తన దగ్గర వున్న మేకప్ సామాగ్రితో శిరీష ముఖానికి కొద్దిగా మెరుగులు దిద్దింది.

లైట్‌గా లిప్‌స్టిక్ వేసింది.

వాళ్ల స్కూలు పేరున్న పెద్ద శాటిన్ బ్యాడ్జ్‌ని షర్టుకి పిన్ చేసింది. జుట్టును మరోసారి దువ్వి, బొట్టును సరిచేసింది.

బిందును, శిరీషను రూమ్‌లో మూలగా పెట్టి వున్న పూలబుట్టల దగ్గరికి తీసుకెళ్లింది.

"మీరిద్దరూ ఈ ఎర్రగులాబి గుత్తులను చెరోటి పట్టుకోండి. మినిష్టరుగారు మీ దగ్గరికి రాగానే ఇచ్చి నమస్కారం పెట్టాలి. వీటిని జాగ్రత్తగా పట్టుకోండి. ముళ్లు ముదురుగా వున్నాయి, గుచ్చుకోగలవు!" అంటూ వారి చేతికి పూలగుత్తులను అందించింది గీత.

వాళ్లిద్దరూ వాటిని జాగ్రత్తగా అందుకొన్నారు, ఏదో అపురూపమైన వస్తువును అందుకొన్నట్లు.

గదిలో వున్న మిగిలిన అమ్మాయిలను పిలిచింది గీత.

"అరవిందా, మీరంతా ఇలా రండి. మీరందరూ ఈ బుట్ట తలా ఒకటి తీసుకోండి. ఈ బుట్టలో వున్న ఎర్రగులాబి పూరేకులను మినిష్టరుగారు నడిచే దారిలో చల్లుతూ వుండాలి. అర్థమయిందా?"

"అలాగే టీచర్," అంటూ అందరూ తలలూపారు.

"మీరందరూ ఒకే దగ్గర వుండండి. నాకు చెప్పకుండా ఎక్కడికీ వెళ్లొద్దు," అంటూ చెప్పి గీత బయటకు వెళ్లిపోయింది.

"అబ్బా! ఈ బుట్ట బరువుగా వుంది కదూ దివ్యా," అంది అరవింద.

"నీ తలకాయ్! పూలబుట్ట బరువుండడం ఏమిటి? అయినా ఇప్పట్నించి మోయడం ఎందుకులే! కిందపెట్టి వెళ్లేటప్పుడు తీసుకెళ్దాంలే!" అంది దివ్య తన చేతిలోని బుట్టను కింద పెడుతూ.

"అలాగే! అయితే పహిల్వాన్ బేబీ, నా బుట్టను కూడా స్టేడియంకి నువ్వే మోసుకురా!" అంది అరవింద విసురుగా తన బుట్టను దివ్య చేతికిస్తూ.

"జీ హుజూర్!" అంది కీర్తి, వీళ్లిద్దరి ఎదురుగా మోకాళ్ల మీద వంగి నాటకీయంగా కుడిచేతిని, తలని కొద్దిగా వంచి.

అందరూ నవ్వడంతో వాతావరణం తేలిక అయింది.

"శిరీషా! మీ మమ్మీకి తెలిస్తే నిన్ను ఇక్కడ్నించి లాక్కెళ్తుంది కదా?" అంది శీతల్ శిరీష వైపు తిరిగి.

"మమ్మీకి ఎలా తెలుస్తుంది?" కనుబొమలు ఎగరేస్తూ అంది శిరీష.

"ఆంటీ ప్రతిమకి ఫోన్ చేస్తే...?" సందేహంగా అంది బిందు.

"అపశకున పక్షి," తన రెండు బొటనవేళ్లను నుదుటికి అటూ ఇటూ ఆన్చి, మిగిలిన వేళ్లను రెక్కల్లా ఆడిస్తూ... వెక్కిరిస్తూ అంది కీర్తి.

అందరూ నవ్వుతూ వున్నా, శిరీష మాత్రం సందేహంతో ముఖం ముడుచుకుంది.

"లాస్ట్‌టైమ్ నువ్వు డాన్స్‌లో పేరిచ్చినప్పుడు కూడా ఆంటీ నిన్ను మాన్పించింది కదా శిరీషా?" శీతల్ అంది.

"మనముందే శిరీష మాటలన్నీ! వాళ్ల మమ్మీని చూసిందా... మ్యావ్... మ్యావ్..." వెక్కిరిస్తూ అంది కీర్తి.

ఉక్రోషంతో శిరీష ముఖం ఎర్రబడింది.

"ఎందుకబ్బా ఊరికినే శిరీషని టీజ్ చేస్తారు? వాళ్ల మమ్మీ వద్దు అంది అంటే ఏదో రీజన్ వుండే వుంటుంది. అయినా శిరీషా! నీకు వంట్లో బావుండదుగా?" అప్పటిదాకా మౌనంగా వున్న సైరా అంది.

"ఆ... అలా అని చెప్పే మా మమ్మీ నన్ను ఏ ప్రోగ్రాంలోకి రానివ్వదు. నాకు ఏమీ ప్రాబ్లెం లేదన్నా విన్పించుకోదు. ఇప్పుడు డాక్టరంకుల్ ఇంజెక్షన్ వేసుకోవడం నేర్పాక హాయిగా వుంది. అంతకుముందయితే దానికి కూడా రోజూ ఓ సీన్ పెట్టేది. మీ అందరితో కలిసి ఇలాంటి ప్రోగ్రామ్స్‌లో ఎంజాయ్ చేస్తే ఎంత బాగుంటుంది! అయినా మినిష్టర్‌కి బొకే ఇచ్చే ఛాన్స్ అందరికీ వస్తుందా? మా మమ్మీకి ఏం తెలీదు," చేతుల్ని గాలిలోకి విసురుతూ గబగబా అంది శిరీష.

"అవునవును... పోయినసారి చిల్డ్రన్స్ డే రోజు నేను బొకే ఇస్తే మినిష్టరు నా భుజం మీద తట్టారు తెలుసా! మా అన్నయ్య ఫోటో కూడా తీశాడు," అందర్నీ గర్వంగా చూస్తూ అంది శీతల్.

"మరే! ఆ తరువాత ఓ ఆర్నెల్లు నీ ఫోజు చూడలేక... మేం చచ్చాం!" కీర్తి టక్కున అంది.

అందరూ కిసుక్కున నవ్వారు.

శీతల్ ముఖం చిన్నబుచ్చుకొని మూతి ముప్పై వంకర్లు తిప్పింది.

"అమ్మాయిలూ! బస్సు వచ్చింది. లైన్‌గా పదండి," గీత టీచర్ తలుపు దగ్గరికి వచ్చి లోపలికి చూస్తూ అరిచింది.

శిరీష వాళ్లంతా వాళ్ల సరంజామాతో గబగబ బస్సెక్కారు.

బస్సంతా కోలాహలంగా వుంది.

గైడ్స్ మెడలలోని స్కార్ఫ్‌లను, యన్.సి.సి. స్టూడెంట్ల క్యాప్‌ల పైన, బెల్టుల పైన వున్న ఇత్తడి బిళ్లల తళతళలను, వారి యూనిఫామ్‌ల ఫెళఫెళలను ఆశ్చర్యంగా గమనిస్తూ కూర్చున్నారు శిరీష బృందం.

"మనం కూడా వాళ్లతో జాయినవుతే బావుంటుంది కదా?" అరవింద మెల్లిగా అంది అందర్నీ చూస్తూ.

"అవును, రోజూ పెరేడ్ అయ్యాక వాళ్లకి కేక్స్ పెడతారంట. అప్పుడప్పుడు క్యాంపులకి తీసుకెళ్తారంట. భలే ఎంజాయ్ చేస్తారంట తెలుసా?" దివ్య అంది.

"నీకెలా తెలుసు?" బిందు ఆసక్తిగా అడిగింది.

"మా అన్నయ్య చెప్పాడు. యన్.సి.సి.లో వున్నాడుగా! మనం కూడా ఓ రెండు మూడు సంవత్సరాలయితే చేరవచ్చుట!" అంది దివ్య.

"అయితే, నేను తప్పకుండా చేర్తాను," శీతల్ దృఢంగా అంది.

"ఏం తల్లీ, ఈసారి చీఫ్ మినిష్టర్‌తోనో, గవర్నరుతోనో ఓ ఫోటో దిగి మాకు అప్పుడప్పుడు ఫ్లాష్‌బ్యాక్‌లో ఓ ఝలక్ చూపిస్తూ వుండొచ్చనా? ఇక మమ్మల్ని వాడే రక్షించాలి!" చేతులు రెండూ పైకెత్తి తమాషాగా అంది కీర్తి.

"అదేంకాదులేవే! కేక్స్ సంగతి తెలిసిందిగా! అందుకే అయి వుంటుంది. అంతేకదూ

శీతల్?'' సైరా శీతల్ వైపు చూస్తూ అంది.

అందరూ ఫక్కుమన్నారు.

''గల్స్! కీప్‌క్వైట్!'' గీత టీచర్ గదిమింది.

ఇంతలో బస్సు స్టేడియంలోకి ప్రవేశించింది.

పిల్లలు ఎవరి ఇన్‌ఛార్జి టీచర్‌తో వాళ్లు కిందకు దిగిపోయారు.

విశాలమైన స్టేడియం దగ్గరికి వచ్చి ఆగడంతో కోలాహలం పెరుగుతోంది. రకరకాల దుస్తులతో, మేకప్‌లతో వున్న పిల్లలు బిలబిలలాడుతూ ఆ మైదానంలో అటూ ఇటూ తిరుగుతున్నారు. వారి టీచర్ల అరుపులతో, వాలంటీర్ల విజిళ్లతో సందడి మరింత పెరుగుతోంది.

గీత టీచర్ ముందే సున్నంతో గీసి వున్న లైన్లపై వీళ్లను నిలబెట్టింది.

శిరీషకి ఎదురుగా దారికి అటువైపున నిల్చుంది బిందు.

వీరికి కొద్దిగా ముందుగా మిగిలినవారు దారికి అటూ ఇటూ నిల్చున్నారు.

గీత టీచర్ మరోసారి వారికి ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చి వారికి వెనగ్గా నిల్చుంది. మిగిలిన టీచర్లు కూడా ఒక్కొక్కరే గీత దగ్గరికి వస్తున్నారు.

''హలో గీతా! ఏమిటీ ఈసారి మీ ప్రోగ్రాం ఇదేనా?'' మామూలు వైట్ స్కర్ట్‌లలో వున్న శిరీష వాళ్లను చూపిస్తూ అందో కళ్లజోడావిడ.

''హలో! ఆ... ఇంతకంటే ఎక్కువెందుకులే అని. ఇది కూడా మా హెచ్.ఎమ్. ఆర్డరు వేసిందని ప్లాన్ చేశాను,'' చిన్నగా అంది గీత.

''అయితే మాత్రం మరీ ఇంత సింపుల్ ప్రోగ్రామా? మీ హెచ్.యమ్. అంతగా పట్టించుకోనట్లుగా వుందే! మా హెచ్.యమ్. ఇవ్వాళ పొద్దున కూడా స్వయంగా రిహార్సల్స్ చేయించింది. పిల్లలతో కలిసి అందరం అయిదుగంటలకల్లా స్టేడియంకి వచ్చేశాం తెలుసా?'' కళ్లజోడావిడ మిగిలిన టీచర్లని కనుచివర్ల నుండి గమనిస్తూ అంది.

''ఇంతకీ ఏం ప్రోగ్రాం ఏమిటి మీది?'' ఆసక్తిగా అడిగింది గీత.

''అదుగో అక్కడ వున్నారే నెహ్రూలా, గాంధీలా, భారతమాతలా, తామరపూలలా, తుమ్మెదల్లా పిల్లలు! వాళ్లతోనే మా ప్రోగ్రాం! ఏం చేయబోతున్నామో మీరే స్వయంగా చూడండి,'' అంది ఆవిడ అందరి ఆసక్తిని మరింత పెంచుతూ.

''ఏమిటీ? మరీ అంత చిన్నపిల్లలతోనా? కె.జి. పిల్లల్లాగా వున్నారే! ఈ ఎండలో ఎంతసేపని వుండగలరు? మధ్యలో ఏడ్చి వెళ్లిపోతే?'' గీత వారినే చూస్తూ అంది.

''నా ట్రైనింగ్ తీసుకొన్న పిల్లలు ఏడుపులు అనేది వుండదు. ఏడుపులు, తుడుపులు, పనిష్మెంట్లు అన్నీ రిహార్సల్స్‌లోనే అయిపోతాయి. ఇక ఎండ సంగతంటావా? స్కూలు ఇక్కడికి దగ్గరేగా! ఓ నెలరోజుల్నించి రోజూ మధ్యాహ్నం తీసుకొచ్చి ప్రాక్టీసు ఇక్కడే చేయించేదాన్ని. ఎంతైనా ఇది మా స్కూలు ప్రిస్టేజి విషయం కదా!'' ఆవిడ తన కళ్లజోడును చేతిలోకి తీసుకొని కర్చీఫ్‌తో అద్దాలను తుడుస్తూ అంది.

''అయితే మాత్రం! మరీ అంత చిన్నపిల్లలతో మండుటెండలో ప్రాక్టీసా? వాళ్ల పేరెంట్స్‌కి ఈ విషయం తెలుసా?'' గీత అడిగింది.

''ఆ... పేరెంట్స్‌ది ఏముందోయ్? మేమెంత చెపితే అంతేగా! వాళ్లకు వాళ్ల పిల్లలు

స్టేడియంలో మినిష్టరుగారి ముందు ప్రోగ్రాం ఇస్తున్నారని తెలుస్తుంది. కానీ ఈ ప్రాక్టీసు గొడవలేం తెలుస్తాయి? వారికి ఓ ఫోటో పంపిస్తే సరి! అందరికీ గొప్పగా చూపించుకొంటూ వుంటారు. పైపెచ్చు, ప్రతి ప్రోగ్రాం కాస్ట్యూమ్సుకనీ, మేకప్‌కనీ వారి దగ్గర నుండే డబ్బులు వసూలు చేయిస్తుంది మా హెచ్.యమ్. నీకో విషయం తెలుసా?'' ఆవిడ కళ్లజోడును మళ్లీ పెట్టుకొంటూ అంది.

''ఏమిటి?'' గీత కుతూహలంగా అడిగింది.

''మా హెచ్.యమ్. ఈ ప్రోగ్రాంని ఓ అడ్వర్‌టైజ్‌మెంట్‌లా వాడుకొంటుంది తెలుసా! పోయినసారి మా బటర్‌ఫ్లై డాన్స్‌కి ఫస్ట్ ప్రైజ్ వచ్చింది కదా! వరుసగా ఓ నెలరోజులు న్యూస్ పేపర్లలో ఫోటోలతో సహా ఊదరగొట్టించింది. నాకూ ఓ ఇంక్రిమెంటు ఇచ్చిందిలే. కాని స్కూలు డొనేషన్ ఓ అయిదువందలు పెంచింది. పేరెంట్స్ కూడా అలాగే ఎగబడుతున్నారు, మా స్కూలు సాంస్కృతిక కార్యక్రమాల్ని బాగా ప్రోత్సహిస్తుందంటూ! ఏం చేస్తాం? అంతా వ్యాపారమైపోయింది,'' నిట్టూర్చిందావిడ.

గీత ఏం మాట్లాడకుండా వింటూ వుండిపోయింది.

''స్కూలు యానివర్సరీలు కూడా అంతే! ఈమధ్య మన ఊళ్లో స్కూల్ యూనివర్సరీలు ఎంత గ్రాండ్‌గా చేస్తున్నారో గమనించావా గీతా?'' అడిగింది ఆవిడ.

''అవునవును! దాదాపు అన్ని స్కూల్స్‌లో పాపులర్ సినిమా యాక్టర్లను పిలుస్తున్నారు. అర్ధరాత్రి ఒంటిగంట దాకా ప్రోగ్రామ్స్ పెట్టి హడావుడి చేస్తున్నారు. ఈ సినిమా యాక్టర్లు పిల్లలకు స్ఫూర్తికానీ, ఆదర్శం కానీ ఎలా అవుతారో నాకర్థంకాదు. మీరు చెపుతున్నట్లుగా, పిల్లల కళాభి రుచిని కొద్దిమంది స్వార్థపరులు వ్యాపారంగా మార్చుతున్నట్లే కదా!'' ఆలోచిస్తూ అంది గీత.

''ఖచ్చితంగా! ఇందులో సందేహం దేనికి? అదుగో మా మేడం వస్తున్నట్లున్నారు. ప్రోగ్రాం అయ్యాక మళ్లీ కలుస్తాను గీతా, బై...'' అంటూ ఆవిడ తమ స్కూలు పిల్లలు వున్నవైపు వడివడిగా వెళ్లిపోయింది.

''బిందూ! టైం ఎంతయింది?'' శిరీష అడిగింది.

''ఎనిమిదిన్నర,'' అంది బిందు.

''నాకు బాగా ఆకలిగా వుందే! గీత టీచర్‌కి చెప్పి ఏదైనా తిని వద్దామా?'' శిరీష అడిగింది.

''మినిష్టర్ రాకముందు ఇక్కడ్నించి కదిలామా! టీచర్ చంపేస్తుంది. అదుగో హెచ్.యెమ్. కూడా మనవైపే వస్తోంది,'' కనుచివరల నుండి హెచ్.యమ్.ని చూస్తూ అంది బిందు.

''అదికాదే! నాకెందుకో పిచ్చిపిచ్చిగా వుందే! వళ్లంతా చెమట్లు పట్టినట్లు అన్పిస్తోంది!'' మెల్లిగా అంది శిరీష.

''ఆ మరే! మాకందరికేమో చలేస్తోంది,'' పక్కనే వున్న కీర్తి అంది, తల పైకెత్తి, కళ్లకు చెయ్యి అడ్డం పెట్టుకొని సూర్యుణ్ణి చూస్తూ. అందరూ నవ్వడంతో శిరీష మౌనంగా స్కర్టు జేబు లోంచి కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకుంది.

ఇంతలో హెచ్.యమ్. వీరి దగ్గరికి వచ్చింది.

''పిల్లలకి అస్సలు డిసిప్లిన్ లేకుండాపోతోంది. ఏమిటా నవ్వులు? కాస్సేపు కదలకుండా నిల్చోలేరా?'' అంటూ విరుచుకుపడింది హెచ్.యమ్.

"అసలు టీచర్లకి డిసిప్లిన్ వుంటేగా పిల్లలకి వుండడానికి! మీ మాటల్లో మీరు మునిగిపోతే ఎలా? మీరు కంట్రోలు చేయలేకపోతే వీరికి వేరే టీచర్‌ని ఇన్‌ఛార్జిగా ఇచ్చేవాళ్లంగా! మిగిలిన స్కూలు పిల్లల్ని చూడండి, ఎంత కామ్‌గా వున్నారో! ఐ డోంట్ లైక్ ఆల్ దిస్ టు రిపీట్ ఎగైన్!" గీత టీచర్ని ఆయాసపడుతూ అరిచింది హెచ్.యమ్.

గిరుక్కున వెనక్కుతిరిగి, చేతిలో వున్న కూలింగ్ గ్లాసెస్ గభాల్న ముఖానికి తగిలించుకొని విసవిసా నడుస్తూ, మిగిలిన స్కూల్స్ హెచ్.యెమ్స్ వున్న దగ్గరికి వెళ్లిపోయింది.

గీత టీచర్ పిల్లలందరినీ ఓసారి సీరియస్‌గా చూసింది.

అప్పటికే బిత్తరపోయిన పిల్లలు మౌనంగా తల దించుకొన్నారు.

గీత టీచర్‌తో ఏదో చెప్పబోయిన శిరీష కూడా నోరు విప్పలేకపోయింది.

హెచ్.యమ్. కనుమరుగవడంతో గీత మళ్లీ తన ఫ్రెండ్స్ దగ్గరికి వెళ్లి నిలబడింది.

ఓపక్కగా నిల్చున్న హైస్కూలు పిల్లల దగ్గర ఏదో కోలాహలం విన్పించడంతో అందరి దృష్టి అటు పడింది.

అప్పటిదాకా అక్కడే నిల్చుని వున్న తెలుగు టీచర్ కాంతమ్మగారు చెమట్లు అద్దుకొంటూ, ఉస్సురంటూ గీత వాళ్ల దగ్గరికి వచ్చింది.

కాంతమ్మగారు వాళ్లతో మెల్లిగా చెపుతోంది, "ఆ అమ్మాయి ఎవరో పీరియడ్స్ మొదటి రోజట! వాళ్లు అయిదున్నరకే స్టేడియంకి వచ్చారట! గంటలు తరబడి నిల్చోవడంతో కాళ్లు పీకాయట! కళ్లు తిరగడంతో కిందపడిపోయేసరికి హడావుడి చేసి, ఇంటికి పంపించారు. పాపం బ్లీడింగ్ బాగా అయినట్లుంది! చిన్నపిల్ల కదా, కంగారుపడి ఏడుస్తోంది."

"అందుకే, ఈ హైస్కూలు పిల్లలతో ప్రోగ్రాం పెట్టుకోకూడదు బాబూ!" అంతా విని హిందీ టీచర్ అంది.

"ఆ అమ్మాయి తప్పేం వుందండీ! రెండు, మూడుగంటల క్రితం అవ్వాల్సిన కార్యక్రమం ఇంకా మొదలవ్వనేలేదు. ఇక పూర్తయ్యేసరికి ఏ టైమవుతుందో? అయినా మాడ్రన్ స్కూలు వాళ్లను చూశారా? ఎంత చిన్నపిల్లల్ని తీసుకొచ్చారో!" గీత వాళ్లను చూపిస్తూ అంది.

"ఏమిటో, ఎందుకు చేస్తున్నామో అర్థం కాకుండా వున్నాయి ఈ కార్యక్రమాలు. ఆ మినిష్టరుగారు ఇంకో గంటలో అయినా వస్తే బావుణ్ణు," వాచ్ వంక చూస్తూ అంది కాంతమ్మగారు.

"ఆఁ పోయినసారి చిల్డ్రన్స్ డేనాడు ఆయన ఒంటిగంటకు వచ్చారు కదా! ఈరోజు పద కొండుగంటలకంతా వస్తాడంటారా? అప్పుడే పది దాటుతోంది," అనుమానంగా అడిగింది హిందీ టీచర్.

"నాకూ అదే డౌట్ వచ్చింది. అందులోనూ మన వూరివాడయ్యే! అందర్నీ ఆమాత్రమైన వెయిట్ చేయించకపోతే ఎలా?" కాంతమ్మగారు నిరసనగా అంది.

"మీకు మినిష్టర్ తెలుసా ఏమిటి?" గీత ఆసక్తిగా అడిగింది.

"ఆ... టెన్త్‌క్లాసు తప్పినప్పుడు నా దగ్గర ప్రైవేటు చెప్పించుకొనేవాడు. చివరికి మాతృభాషలో కూడా పాసుమార్కుల కోసం దేబిరించిన పెద్దమనిషి, ఇప్పుడు విద్యాశాఖను ఏలుతున్నాడు!" ఆవిడ ముఖానికి పట్టిన చెమట్లను తుడుచుకొంటూ అంది.

"నమస్కారం కాంతమ్మగారు, మీరందరూ ఇక్కడే వున్నారా?" అంటూ వారిని సమీపించాడు శ్రీనాథ్.

"బాగున్నారా మేష్టారూ! ఇప్పుడు ఏ స్కూలులో వున్నారు?" గీత పలకరించింది.

"ఊళ్లో స్కూళ్లన్నీ... దాదాపు అయిపోయాయండి. ఇక మీ స్కూలే మిగిలింది. మీ హెచ్.యమ్. నన్ను మీ స్కూల్లో ఏమైనా చేర్చుకొంటారంటారా?" నవ్వుతూ అడిగాడు.

"ఏమిటీ? కాంతమ్మగారు ఏదో బాధపడుతున్నట్లున్నారు!"

"ఏముందీ! మినిష్టరు ఇంకా రాలేదని అనుకొంటున్నాం!" హిందీ టీచర్ అంది.

"పూర్వకాలంలో రాజులు వందిమాగధులను పోషించి, వారి పొగడ్తలతో తమ అహాన్ని తృప్తిపరచుకొనేవారుట! అధికారదర్పం కోసం, అహంకార ప్రదర్శన కోసం కాసులు గుమ్మరించి అడుగులకు మడుగులు వత్తించుకొనేవారుట! మరి ఇప్పటి మకుటంలేని మహారాజుల కోసం చేస్తున్న స్వాగత సన్నాహాలు, ఆడంబర సంబరాలు చూస్తుంటే మనం నిరసించిన రాజరిక సంస్కృతిని మరో రూపంలో పోషిస్తున్నట్లుగా లేదూ?" అందర్నీ పరీక్షగా చూస్తూ అన్నాడు శ్రీనాథ్.

అందరూ అవునన్నట్లుగా తలలూపారు.

"అంతేకాదు, ఎప్పుడు మన సంస్కృతిని ప్రదర్శించాలన్నా స్కూలు ఎగ్గొట్టిచ్చి, పిల్లలకి లంబాడి వేషాలు వేయించి ఆడించి చూపుతున్నాం. తరుచూ ఇలా చేస్తూపోతే వాళ్లకి పాఠాల మీద శ్రద్ధ ఎలా వుంటుంది?" అన్నాడు శ్రీనాథ్.

"క్లాస్ అటెండ్ కాకపోయినా అటెండెన్స్ వుంటుంది కదా మాష్టారు. ఇక పరీక్షల ముందు ఇంపార్టెంట్ క్వొశ్చెన్లతో ఇంటెన్సివ్ కోచింగ్ ఎలాగూ వుంటుంది. ఏమైనా ఇంతమందిని ఇబ్బంది పెట్టే, ఈ కార్యక్రమాల్లో మార్పు రాదంటారా మాష్టారూ?" గీత అడిగింది.

"ఇంతమంది పిల్లలు వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, ఆ కొద్దిమంది పెద్దల అహాన్ని తృప్తిపరచడానికి నియంత్రించబడితే, మీలాంటి టీచర్లు ఒక వృత్తిని గౌరవించడం అంటే అతని అడుగుల కింద పూలరేకులు పరచడం అనే సంస్కృతికి ప్రాణం పోస్తుంటే, ఇలాంటి కార్యక్రమాన్ని స్కూలు పెద్దలు వ్యాపార దృక్పథంతో పోషిస్తుంటే, మార్పు ఎలా వస్తుందంటావు గీతా?" శ్రీనాథ్ వెల్లువలా వున్న పిల్లల్ని చూస్తూ సూటిగా అడిగాడు.

గీత ఆలోచనలో పడి, మౌనంగా మాష్టారి మాటల్ని వింటోంది.

"అంతదాకా ఎందుకు? ఈరోజు వీళ్లనిలా నిలువుకాళ్ల మీద నిలబెట్టి, తలను, కడుపును మాడుస్తూ, వారి స్వేచ్ఛకు క్రమశిక్షణ పేరుతో పరిధులు నిర్ణయించి, మనం సంతోషంతో... సంబరంతో... బాలల దినోత్సవం జరుపుకోవడం హాస్యాస్పదంగా లేదూ? నా మట్టుకు నాకయితే ఈ కార్యక్రమాలు అందమైన పేరు పెట్టి, ఈ చిన్నారుల చేత చేయించే వెట్టిచాకిరిగా అన్పిస్తాయి," అందర్నీ గమనిస్తూ అన్నాడు శ్రీనాథ్.

"ఆ... అయినా ఏం బాలలదినోత్సవాల్లెండి. ఈ పిల్లల్ని చూస్తుంటే కడుపు తరుక్కు పోతోంది. తాగడానికి మంచినీళ్లు లేవు. టాయిలెట్ సౌకర్యం లేదు. ఏ క్షణాన ఊడిపడతాడో తెలియని మినిష్టర్ కోసం పడిగాపులు! పిల్లల ముఖాలు చూడండి ఎలా వాడిపోయాయో! మీరన్న ట్లుగా పిల్లల కోసం ప్రత్యేకంగా శ్రద్ధ వహించాల్సిన రోజున, వారి స్వేచ్ఛను మన మూర్ఖత్వంతో పెట్టే తద్దినంలా వుందండీ ఈరోజు పరిస్థితి!" ముఖాలు వేలాడేసిన పిల్లల్ని చూస్తూ అంది కాంతమ్మ.

"అదేంటండీ! మరీ అలా అనేస్తున్నారు? పిల్లలు ఏవో ఓ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనకపోతే ఎలా?" హిందీ టీచర్ అడిగింది.

"స్కూల్లోని సాంస్కృతిక కార్యక్రమాలంటే పిల్లల్లో నిక్షిప్తమై వున్న కల్పనాచాతుర్యాన్ని వెలికితీయగలిగేలా వుండాలి. వారి సృజనాత్మకతకు రూపం ఇచ్చి ప్రదర్శించగలిగేలా వుండాలి.

వారి అల్లిబిల్లి ఆలోచనలకు నిర్దిష్టత చేకూర్చగలిగేలా వుండాలి. వారిలో నిద్రాణంగా వున్న భావ రమణీయతకు నవచైతన్యం ఇవ్వగలిగేలా వుండాలి. మనం టీచర్లుగా వారితో గడిపే సమయం ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ వారి వ్యక్తిత్వం రూపుదిద్దుకోవడానికి ఉపయోగపడుతున్నప్పుడు, మనం చిత్తశుద్ధితో శ్రద్ధ వహించాల్సి వుంటుంది,'' అన్నాడు శ్రీనాథ్.

``ఆ... అవ్వన్నీ సాధ్యమయ్యేవి కాదులే మాష్టారూ! నిజానికి ప్రతి స్టూడెంట్‌ని మనం జాగ్రత్తగా గమనించి, గుర్తించి, వారిని ప్రోత్సహించాలంటే మనకు రోజుకి ఇరవై నాలుగ్గంటలూ సరిపోవు,'' హిందీ టీచర్ మధ్యలో కల్పించుకుంటూ అంది.

``అదీ నిజమే! అయినా మన ప్రయత్నం మనం చేయాలిగా!'' శ్రీనాథ్ అన్నాడు.

``ఆ... సమ్‌థింగ్ ఈజ్ బెటర్ దాన్ నథింగ్,'' గీత అందించింది.

``నా సర్వీసులో అలాంటి టీచర్లు అరుదు. ఏ టీచర్ అయినా పరీక్షల దృష్టితో పాఠాలు వల్లించడం తగ్గించి, ప్రాపంచిక విషయాల గూర్చి శ్రద్ధ తీసుకోవడం మొదలెట్టారంటే స్కూలు నుంచి బయటకు నడవాల్సిందే!'' అప్పటిదాకా అందరి మాటలు వింటోన్న కాంతమ్మగారు అంది.

``అంటే... నాలాగానా?'' శ్రీనాథ్ నవ్వుతూ అడిగాడు.

టీచర్లంతా కబుర్లలో మునగడం గమనించి, శిరీష బిందుతో అంది.

``బిందూ, నేనింటికి వెళ్లిపోతానే. పొద్దున ఇంజెక్షన్ తీసుకొని టిఫిన్ చేయకుండా వచ్చాను. మమ్మీ ఎంత చెప్పినా విన్లేదు! ప్లీజ్ కొంచెం నువ్వు గీత టీచర్‌కి చెప్పవే!''

``అమ్మో! నేను చెప్పను. కావాలంటే నువ్వే అడుగు,'' బిందు చేతిని గుండె మీద వేసు కొంటూ అంది.

``ప్లీజ్ బిందూ... ఈ ఒక్కసారికీనే...'' శిరీష బతిమిలాడుతూ మళ్లీ అంది.

``ష్... హెచ్.యమ్. ఇటే వస్తుంది. నువ్వే పర్మిషన్ అడిగి వెళ్లిపోరాదే?'' అంది బిందు, హెచ్.యమ్. వస్తున్నవైపు చూస్తూ.

``హెచ్.యమ్. వీరినోసారి చూసి టీచర్ల దగ్గర కెళ్లి వారి కబుర్ల ప్రవాహంలో కలిసిపో యింది. ఆవిడ చూపు మాత్రం పిల్లల వైపే వుంది.

శిరీష, గీత టీచర్ తనవైపు చూస్తుందేమోనని గమనిస్తూ నిల్చుంది.

ఆవిడ ఎంతసేపటికి వెనక్కు తిరగలేదు.

శిరీష చెవుల్లో స్టేడియంలోని కోలాహలం ప్రతిధ్వనిస్తోంది.

ఇంతలో మైక్‌లో అనౌన్స్‌మెంట్ రావడంతో ఎక్కడి వాళ్లక్కడికి వెళ్లారు.

అంతటి కలకలం అకస్మాత్తుగా నిశ్శబ్దమైంది.

అందరూ వారివారి స్థలాలలో నిల్చుని రాబోయే అతిథుల కోసం గేటువైపే చూస్తున్నారు.

అయినా, ఇప్పటికీ శిరీష చెవులలో ఇందాకటి శబ్దాలే ప్రతిధ్వనిస్తున్నాయి.

కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.

శిరీష పంటి బిగువున కళ్లు తెరిచి చుట్టూ చూసింది.

కాళ్లు తేలిపోతున్నట్లయింది.

చెవులలోని ప్రతిధ్వని శబ్దాలు నెమ్మదిగా మాయమయ్యాయి.

బిందుని పిలుద్దామని ప్రయత్నించింది. పిలుపు శిరీష గొంతు దాటి రాలేదు.

బిందు శిరీష వైపు చూడలేదు.

ఆ మండుటెండలో శిరీష వంటిని చల్లబరుస్తున్నట్లుగా చెమట్లు ధారాపాతంగా కారుతున్నాయి. శిరీష ఎదురుగా వున్న బిందు చందమామ కథల్లో మాంత్రికుడు మంత్రం వేసిన రాకుమారిలా హఠాత్తుగా మాయమైంది.

కాళ్లు నిలదొక్కుకొని, కళ్లు చికిలించి చూడడానికి ప్రయత్నించింది శిరీష.

ఆధారం కోసం చేతిలోని గులాబీల గుత్తిని గట్టిగా పట్టుకొంది.

ఇంతలో రయ్‌మంటూ కార్లు స్టేడియంలోకి ప్రవేశించాయి. టీచర్లు గబగబ ఎదురెళ్లారు. దారి అంతా గులాబీరేకులతో నిండిపోతోంది! బిందు చేతిలోని పూలగుత్తిని పొదివి పట్టుకొని, వస్తున్న వారివైపే కుతూహలంగా చూస్తోంది.

శిరీష కడుపులో ఒక్కసారిగా దేవినట్లయింది.

క్రమశిక్షణ పేరుతో అంతసేపు కదలకుండా నిలబెట్టబడ్డ పిల్లల్ని గమనిస్తోన్న పైన ఆకాశం, కింది ఇసుక కోపంతో మండిపడుతున్నట్లున్నాయి.

శిరీష మోకాళ్లు... నడుము... భుజాలు... తల ఒకదాని తరువాత ఒకటి ఆ మండుతోన్న ఇసుకపైకి చేరాయి.

చెమట్లు కారుతోన్న శిరీష తల ఇసుకను చల్లబరుస్తూ పక్కకి వాలింది. అప్పటికే వడలిన ఎఱ్ఱగులాబీల రేకులు శిరీష తలవేపున చెల్లాచెదురుగా పడ్డాయి. గట్టిగా బిగించి వున్న గుప్పెట లోకి ముదురు గులాబిముళ్లు నిర్దాక్షిణ్యంగా గుచ్చుకుపోయి, ఎఱ్ఱటి నెత్తుటి చుక్క ఇసుకలోకి ఇంకిపోతోంది.

బిందు గబుక్కున శిరీష వైపు తిరిగింది. చేతిలోని గులాబీగుత్తిని విసిరేసి, ఒక్క ఉదుటున శిరీష దగ్గరికి చేరింది.

తరలి వస్తున్న మంత్రిగారు ఆ గులాబిగుత్తి మీదుగానే మెత్తగా నడుస్తూ స్టేజీని చేరారు.

స్టేడియం పైన ఆకాశంలోకి శాంతి పావురాలు ఎగిరాయి.

మైక్‌లో చిన్ని కంఠాలు ఒక్కసారిగా గొంతెత్తాయి.

"చిరంజీవి మన నెహ్రూ... చరితార్థుడు మన నెహ్రూ..."

"చిరంజీవి మన..."

"శిరీషా!" అన్న పిలుపు శిరీష భుజాల్ని పట్టి కుదుపుతున్న గీత టీచర్ హృదయంలోంచి దూసుకు వచ్చింది.

*విపుల మాసపత్రిక*
*డిసెంబర్ 1993*

## పిల్లలను విస్మరించిన

# బాలల దినం

***ఆ కాలంలో డికెన్స్ ఎత్తి చూపించిన 'యుటిలిటేరియన్' ప్రపంచంలోనే మనం ఉన్నాం. మన పిల్లల్ని శాస్త్రం చదివిస్తూ అశాస్త్రీయవాదులుగా తయారుచేస్తున్నాం. వ్యాపార ప్రపంచ దృష్టితో మూసల్లా నమూనాల్లా తయారుచేస్తున్నాం. పిల్లల గురించి ఆలోచించాల్సిన అత్యవసర పరిస్థితి ఒకటి ఉందని మీరు భావిస్తే- అది ఈ క్షణమే.***

నేను పరిచయం చేస్తున్న కథ *బాలల దినం.* ఈ కథ వెనుక కథ ఏమిటంటే- నేను బడికి వెళ్ళే రోజుల్లో నాకూ నా స్నేహితులకూ ఎదురైన ఓ అనుభవం. ఈ అనుభవం మాకే కాదు, అటు ఇటుగా బడికి వెళ్ళిన... వెళ్ళే... పిల్లలందరికీ అనుభవమే. ఇంత మందికీ ఒకేలాంటి అనుభవం సాధ్యమేనంటారా? సాధ్యమే.

మనకు తెలియకుండానే కొన్ని మర్యాదలుగా మొదలయ్యి సంప్రదాయాలుగా పరిణమించి మన మీద సవారి చేస్తాయి. కొంతకాలానికి అలా చేయకపోతే ఎలా అని భావించే స్థితిలో మనం పడిపోతాం. అలాంటి ఓ సంప్రదాయమే మంత్రిగారి స్వాగతానికి పిల్లలను నియంత్రించడం.

ఈ కథకు నాయిక 11 ఏళ్ళ శిరీష. పిల్లలకు పువ్వుల పేర్లు పెట్టడం సహజంగా ఉంటుందనీ- అందునా శిరీష పుష్పం అతి సున్నితమైనది కనుక అతి సున్నితమైన మనస్సుతో పాటు శరీరాన్ని కలిగి ఉన్న శిరీషకు సరిపోతుందనీ- ఆ పేరు పెట్టాను.

కథ ఎలా మొదలవుతుందంటే-

"అలారం మోగగానే టక్కున లేచి, గడియారం వంక చూసింది శిరీష. కమాండర్ చూపు తనవైపు పడగానే అటెన్షన్‌లోకి వచ్చిన సైనికునిలా నిటారుగా నిలుచుని ఉన్నాయి గడియారం ముళ్ళు."

ఈ వాక్యాలు చదవగానే మీకో అవగాహన వచ్చి ఉండాలి. మితిమీరిన క్రమశిక్షణ ఈ కథలో ఓ ప్రధానాంశం.

కథా సమయం బాలల దినోత్సవం. ఆరోజు చాచా నెహ్రూ పుట్టినరోజు.

కథాస్థలం ఏ ఊరైనా కావచ్చు. శిరీష వాళ్ళ ఊరు అనుకొందాం.

ఆరోజున మనం దేశవ్యాప్తంగా పిల్లల పండుగ జరుపుకొంటాం. అలాగే మన శిరీష వాళ్ళ ఊళ్ళోనూ జరుపుకొంటున్నారు. వాళ్ళ ఊరి స్టేడియంలో ఊళ్ళోని స్కూలు పిల్లలందరూ జమకూడారు. వారి వారి టీచర్ల పర్యవేక్షణలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించబోతున్నారు. మరి ఇంతటి కార్యక్రమానికి ముఖ్య అతిథి ఉండాలి కదా- ఉన్నారు. ఆ జిల్లాకే చెందిన విద్యాశాఖ మంత్రి. ఆ పూట వచ్చిన టీచర్లలో ఆయనకు పాఠాలు చెప్పిన కాంతమ్మగారూ ఉన్నారు.

ఇక, శిరీష వాళ్ళ టీచరు గీత. గీత ఈసారి చాలా సాదాసీదా కార్యక్రమం నిర్వహిస్తోంది. మంత్రిగారు నడుస్తొంటే ఆయన దారిలో పూలరేకులు పరచడం. పోతే, శిరీష, బిందు మంత్రిగారికి పూలగుత్తులు ఇవ్వబోతున్నారు.

ఇందులో కథ ఏముంది? అందరూ ఎరిగిన విషయమే. ఎప్పుడూ జరిగే తంతే.

ఈ విషయాన్ని కథకు ఎంచుకొన్నప్పుడు సరిగ్గా ఇలాగే అనుకొన్నాను.

నేనొక పిల్లల ఆసుపత్రిలో పనిచేస్తున్నాను. మా దగ్గరికి వచ్చే ఎందరో పిల్లలలో ప్రత్యేకమైన పిల్లలు కొందరుంటారు. వారు తమ పట్ల, తమ అనారోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధను చూపించడం, ఆదుర్దాను ప్రకటించడం ఇష్టపడరు. ముఖ్యంగా కొన్ని దీర్ఘకాలిక సమస్యలతో ఆస్తమా, డయాబెటిస్, ఎలర్జీ లాంటివి వచ్చిన పిల్లల తల్లిదండ్రులు ఆ పిల్లలను అనుక్షణం తమ పర్యవేక్షణలో ఉంచుతారు. బోలెడన్ని నియంత్రణలు విధిస్తారు. పిల్లలకు జబ్బు తిరగ బెడుతుందేమోనని వారికి బెంగ. అక్కడే ఘర్షణ!

సరిగ్గా అలాంటి ఓ సందర్భంలో నా కథ మొదలవుతుంది.

శిరీష అమ్మాయి, సుధ అమ్మ.

శిరీష డయాబెటిస్ పేషెంట్. ప్రతిరోజూ ఇన్సులిన్ ఇంజెక్షన్ చేసుకోవాలి. ఆహార నియమాలు పాటించాలి. ఇవన్నీ అమ్మకు తెలుసు. అందుకే అమ్మాయిని కంటికి రెప్పలా జాగ్రత్తగా చూసుకుంటోంది. అమ్మ అతి శ్రద్ధలోంచే ఆమెకు తెలియకుండా అనుమానమై, అపోహలుగా పెరిగి- శిరీష ప్రతి కదలికనూ నియంత్రిస్తోంది. బడిలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలకు శిరీషను పంపకపోవడానికి కారణం ఇదే. సరిగ్గా అదే శిరీషకు నచ్చదు. శిరీష తన స్నేహితులందరూ ఏం చేస్తారో తనూ అదే చేయాలనుకొంటుంది. శిరీష మాటల్లో చెప్పాలంటే-

"ఆ... అలా అని చెప్పే మా మమ్మీ నన్ను ఏ ప్రోగ్రాంలోకి రానివ్వదు. నాకు ఏ ప్రాబ్లెం లేదన్నా వినిపించుకోదు. మీ అందరితో కలిసి ఇలాంటి ప్రోగ్రామ్స్‌లో ఎంజాయ్ చేస్తే ఎంత బాగుంటుంది! అయినా మినిష్టర్‌కి బొకే ఇచ్చే ఛాన్స్ అందరికీ వస్తుందా? మా మమ్మీకి ఏం తెలీదు," అందుకే తన స్నేహితులతోపాటు తనూ వెళ్ళాలన్న తపనతో తల్లికి తెలియకుండా స్టేడియంకు బయలుదేరింది. అదీ ఎలాగు- అబద్ధం చెప్పి. ఇన్సులిన్ ఇంజక్షన్ చేసుకొంది అలవాటు ప్రకారం. ఎక్కడ లేట్ అవుతుందోనన్న కంగారు కొంత- తల్లికి తెలిస్తే వెళ్ళనివ్వదేమోనన్న ఆందోళనతో కొంత- లేని చిరాకు తెచ్చి పెట్టుకొని- హడావిడిగా ఏమీ తినకుండా బయలుదేరింది.

మరి ఆ తల్లి ఎలా ఊరుకొంటుంది? పాలయినా తాగి వెళ్ళమని బతిమిలాడింది. పంచదార లేని ఆ పాలు రోజూ తాగుతూనే ఉన్నా, ఆ పూట ఎందుకో వెగటుగా అన్పించాయి శిరీషకు. తల్లికి తెలియకుండా పారబోసి, తల్లి విషయమేమిటో తెలుసుకోక ముందే స్కూలుకెళ్ళిపోయింది. ప్రతిమ వాళ్ళింటికని చెప్పి పరుగులు పెడుతోన్న శిరీషను ఆశ్చర్యంగా చూస్తూ నిల్చుంది సుధ కాసేపు.

'బ్లడ్‌లో షుగర్ తగ్గిపోతే హైపోగ్లైసిమియా వస్తుందన్నారు డాక్టరుగారు. శిరీషేమో ఇంజెక్షన్ చేసుకొని టిఫిన్ చేయకుండా వెళ్తోంది. రాత్రి కూడా సరిగ్గా తినలేదు... అయినా నా కంగారు కానీ ప్రతిమ వాళ్ళ మమ్మీకి శిరీష సంగతి తెలుసుగా! ఏదో ఒకటి తినమని చెబుతుందిలే!' సుధ తనను తాను సమాధానపరచుకొంటుంది.

ఇక శిరీష బడికి వెళ్తుంది. పిల్లలంతా సరదాగా తయారయి కోలాహలంగా స్టేడియంకి వెళ్ళారు. ఉదయం ఆరున్నర ఏడింటికి. శిరీష ఓ గులాబీపూల గుత్తితో నిర్దేశించిన స్థలంలో నిలబడింది. చూస్తూ ఉండగానే ఎనిమిదిన్నర అయింది. మంత్రిగారు రాలేదు. శిరీషకు చెమట్లు పడుతున్నాయి. ఆకలి వేస్తోంది. స్నేహితులకు చెబితే ఆటలు పట్టించారు.

టీచర్లంతా ఓ పక్కచేరి కబుర్లలో మునిగారు. హెచ్.ఎం.లంతా మరోపక్క. పిల్లలు మాత్రం వారికి నిర్దేశించిన స్థలాలలో నిల్చునే ఉన్నారు. పిల్లలు వేళాకోళాలు ఆడుకుంటూంటే-

"పిల్లలకి అస్సలు డిసిప్లిన్ లేకుండా పోతోంది. ఏమిటా నవ్వులు? కాస్సేపు కదలకుండా నిల్చోలేరా?" అంటూ విరుచుకుపడింది హెచ్.ఎం. ఆవిడ అదే వేగంతో గీతా టీచర్నీ కోప్పడింది. "అస్సలు టీచర్లకు డిసిప్లిన్ ఉంటేగా పిల్లలకు ఉండడానికి! మీ మాటల్లో మీరు మునిగిపోతే ఎలా?"

అంతే, గీత కళ్ళతోనే అందర్నీ గదమాయించింది. గీత టీచర్‌తో ఏదో చెప్పబోయిన శిరీష కూడా నోరు విప్పలేకపోయింది.

పది దాటింది. మంత్రిగారు రాలేదు. టీచర్లు, హెచ్.ఎం.లు యధాతథం. పిల్లలు కదల కుండా, ఎప్పటిలాగే నిలువుకాళ్ళ మీద.

గంట, రెండు గంటలు. మంత్రిగారు రాలేదు. శిరీష మెల్లగా బిందుతో అంది. "బిందూ, నేనింటికి వెళ్ళిపోతానే. పొద్దున ఇంజెక్షన్ వేసుకొని టిఫిన్ చేయకుండా వచ్చాను. మమ్మీ ఎంత చెప్పినా వినలేదు! ప్లీజ్ కొంచెం నువ్వు గీత టీచర్‌కి చెప్పవే!"

"అమ్మో! నేను చెప్పను..." బిందు చేతిని గుండె మీద వేసుకొంటూ అంది.

"ప్లీజ్ బిందూ... ఈ ఒక్కసారికీనే..." శిరీష బతిమిలాడింది.

"ష్... హెచ్.ఎం. ఇటే వస్తోంది. నువ్వే పర్మిషన్ అడిగి వెళ్ళిపోరాదే?" శిరీష ధైర్యం కూడగట్టుకొనే లోపలే మంత్రిగారు వస్తున్నట్లు అనౌన్స్‌మెంట్. అందరి దృష్టి అటువైపే బిందుతో సహా.

శిరీషకు కళ్ళు  బైర్లు కమ్ముతున్నాయి. పంటి బిగువున కళ్ళు తెరిచి చుట్టూ చూసింది. కాళ్ళు తేలిపోతున్నట్లయింది. చెవులలోని ప్రతిధ్వని శబ్దాలు నెమ్మదిగా మాయమయ్యాయి. బిందుని పిలుద్దామని ప్రయత్నించింది. పిలుపు శిరీష గొంతు దాటి రాలేదు. ఆ మండుటెండలో శిరీష వంటిని చల్లబరుస్తున్నట్లుగా చెమట్లు ధారాపాతంగా కారుతున్నాయి. శిరీష ఎదురుగా ఉన్న బిందు చందమామ కథల్లో మాంత్రికుడు మంత్రం వేసిన రాకుమారిలా హఠాత్తుగా మాయమైంది. కానీ శిరీషను ఎవరూ పట్టించుకోలేదు. మంత్రిగారు కోలాహలంగా తరలి వస్తున్నారు.

ఇంతకీ ఈ వ్యవహారమంతా ఎలా ఉందండీ? ఈ కథలోని శ్రీనాథ్ మాష్టారి మాటల్లోనే చెప్తాను.

"పూర్వకాలంలో రాజులు వందిమాగధులను పోషించి వారి పొగడ్తలతో తమ అహాన్ని తృప్తి పరచుకొనేవారట! అధికార దర్పం కోసం అహంకార ప్రదర్శన కోసం కాసులు గుమ్మరించి

అడుగులకు మడుగులు వత్తించుకొనేవారట! మరి ఇప్పటి మకుటం లేని మహరాజుల కోసం చేస్తోన్న స్వాగత సన్నాహాలు, ఆడంబర సంబరాలు చూస్తుంటే, మనం నిరసించిన రాజరిక సంస్కృతినే మరో రూపంలో పోషిస్తున్నట్లుగా లేదూ?"

ఉంది. అనుమానం ఏముందీ? మరి వీటిల్లో మార్పెలా వస్తుంది? అదే అడిగిన గీతతో శ్రీనాథ్ అంటాడు- "ఇంతమంది పిల్లలు వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, ఆ కొద్దిమంది అహాన్ని తృప్తిపరచడానికి నియంత్రించబడితే, మీలాంటి టీచర్లు ఒక వ్యక్తిని గౌరవించడం అంటే అతని అడుగుల కింద పూలరేకులు పరచడం అనే సంస్కృతికి ప్రాణం పోస్తుంటే, ఇలాంటి కార్యక్రమాన్ని స్కూలు పెద్దలు వ్యాపార దృక్పథంతో పోషిస్తుంటే, మార్పు ఎలా వస్తుందంటావు గీతా?"

మార్పు రావాలి. అదే రచయితగా నేను కోరుకొనేది. శ్రీనాథ్‌కు ఈ కార్యక్రమాలు, 'అందమైన పేరుపెట్టి, ఈ చిన్నారుల చేత చేయించే వెట్టిచాకిరీగా' అన్పిస్తే, ముఖాలు వేలాడేసిన పిల్లలను చూస్తూ కాంతమ్మగారంటున్నారు, "పిల్లల కోసం ప్రత్యేకంగా శ్రద్ధ వహించాల్సిన రోజున, వారి స్వేచ్ఛకు మన మూర్ఖత్వంతో పెట్టే తద్దినంలా ఉందండీ ఈరోజు పరిస్థితి."

అందుకే బాలల దినోత్సవాన్ని గురించి రాస్తూ కథ పేరు బాలల దినం అని పెట్టాను.

ఇంత చర్చ చేసిన టీచర్లు కూడా చివరి వరకూ పిల్లలను పట్టించుకోకపోవడంలోనే ఉంది సెటైర్ అంతా.

పిల్లల కోసం ఒకరోజును ప్రత్యేకించాం. బావుంది. మరి ఆరోజున పిల్లల కోసం మనం ఏం చేస్తున్నాం? ఇప్పటికి అలాంటి 50 రోజులు గడిచిపోయాయి. పిల్లలకు ఏమైనా పనికి వచ్చాయా? లేనేలేదు. ఆ రోజున అప్పటివరకూ పిల్లల బాగోగుల గురించి బేరీజు వేసి, వచ్చే ఏడాదికి ప్రణాళికలు వేయాలి. వేగతరమైపోతున్న జీవనశైలిలో పిల్లల ప్రపంచాన్ని స్వేచ్ఛగా ఉంచాల్సిన బాధ్యత మనకున్నది. వారిలో సహజ ప్రకటితాలైన ఆలోచననూ, అనుభూతికి సక్రమంగా ఎదిగే ఆరోగ్యకర వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత మనకున్నది. ప్రపంచంలోని ఇతర దేశాల పిల్లల నుంచి మన పిల్లలు నేర్చుకోవాల్సిన అంశాలేమైనా ఉన్నాయేమో పరిశీలించాల్సి ఉంది. కనీసావసరాలు తీరని లక్షలాది పిల్లల కడగండ్లపై దృష్టి నిలపాల్సి ఉంది. ఎన్నో ఎన్నెన్నో చేయాల్సి ఉంది. అయితే, ఇవన్నీ చేయడానికి చిత్తశుద్ధి కావాల్సి ఉంది. నిజాయితీ కావాల్సి ఉంది. పిల్లలకు ప్రత్యేకంగా ఓరోజును కేటాయించినా ఇవేవీ చేయలేకపోవడంతో అవి బాలల దినాలుగా మిగిలిపోతున్నాయి. ఆలోచించండి.

ఆ కాలంలో డికెన్స్ ఎత్తి చూపించిన 'యుటిలిటేరియన్' ప్రపంచంలోనే మనం ఉన్నాం. మన పిల్లల్ని శాస్త్రం చదివిస్తూ అశాస్త్రీయవాదులుగా తయారుచేస్తున్నాం. వ్యాపార ప్రపంచ దృష్టితో మూసల్లా నమూనాల్లా తయారుచేస్తున్నాం. "పిల్లల గురించి ఆలోచించాల్సిన అత్యవసర పరిస్థితి ఒకటి ఉందని మీరు భావిస్తే- అది ఈ క్షణమే. ఎందుకంటే... పిల్లల గురించిన నిర్ణయాలు తీసుకోవడంలో ఓ క్షణం ఆలస్యం చేసినా- ఒక తరం ఆలస్యం అవుతుంది కనుక," అని వ్రాశాను. "పిల్లలు మాయమైన వేళలో..." "పిల్లల్ని పిల్లలుగానే ఎదగనీయండి. పిల్లల గురించి ఆలోచించండి. ప్రేమతో ఆలోచించండి. మీకు వెయ్యి సమస్యలు ఉండొచ్చు. వాటికి పిల్లల్ని ఎర కానీయకండి. ఒక చిన్ననాటి అసంతృప్తిలోంచే హిట్లర్ తలెత్తాడు. ప్రపంచాన్నే విషాదంలో ముంచే అలాంటి పిల్లల కథ పునరావృతమవకుండా జాగ్రత్త పడాల్సింది నేడే!"

అన్నట్లు, మన మంత్రిగారు మాత్రం ఆడంబరంగా హడావిడిగా విచ్చేశారు. వచ్చేశారా, అంతేకాదు... 'తరలి వస్తోన్న మంత్రిగారు ఆ గులాబి గుత్తి మీదుగానే మెత్తగా నడుస్తూ స్టేజీని చేరారు.'

ఆ గులాబిగుత్తి శిరీష చేతిలోని గులాబి గుత్తి! చాచాజీకి ప్రియమైన ఎర్రగులాబీల గుత్తి! అరరే... ఇంతకీ శిరీషకు ఏమయింది? ఆ విషయం మీదే కొందరికి అసంతృప్తి ఉంది. అది వారి అభిప్రాయాల సమస్య. వారి అంచనాల సమస్య. కథ ముగింపుది కాదు. గీతా టీచర్ దృష్టిలో పడిన శిరీషకు ఏం అవుతుంది? ఏమీ అవదు. ఒక డెక్స్ట్రోన్ సెలైన్ పెడితే మర్నాడు బడికి వస్తుంది. ఎటొచ్చీ, ఇంత కథకు మూలమైన ఆ సంప్రదాయ రుగ్మతకు మాత్రం చికిత్స ఇంకా జరగలేదు. అప్పటికి నేనింకా 'చంద్ర' పేరుతో వ్రాస్తున్నాను. బాలల దినం నేను వ్రాసిన మూడవ కథ. ప్రచురింపబడిన వాటిలో మూడవది కాదు. 1992 నవంబరు 14 తరువాత వ్రాశాను. 1993 డిసెంబర్ విపుల సంచికలో వచ్చింది.

*8 మార్చి 1998*

18

# దుఃఖసాగరం

## పి. చంద్రశేఖర అజాద్



*పి. చంద్రశేఖర అజాద్ 1955 మే 24న గుంటూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ శూన్యంలో సుందరసౌధం జయశ్రీ మాసపత్రికలో అచ్చయ్యింది. దాదాపు 450 కథలు, 58 నవలలు, 20 నవలికలు రాశారు. రెండు కథా సంపుటాలు ప్రచురించారు. కొన్ని సినిమాలకు వందలాది టీవీ ఎపిసోడ్లకు రచయిత. వివిధ కథ, నవలల పోటీలలో అనేక సార్లు బహుమతులు పొందారు.*

**చిరునామా**

*909, సప్పైర్ బ్లాక్, మై హోమ్ జ్యూయల్*
*మదీనాగూడ, మియాపూర్*
*హైదరాబాద్ - 500 049*
*Ph: 92465 73575*
*chazadp@rediffmail.com*

చాలా సన్నగా అదేదో రాగంలానే ఆరంభం...

ఎప్పుడు ఎలా మొదలైందో తెలియదు... శృతి పెరిగి పెరిగి... అమాంతం తలుపులన్నింటినీ భళ్లున తెరుచుకుని వస్తే-

ఆ పిల్లవాడు... నల్లగా ఉన్నవాడు-

ఆకాశం కేసి చూస్తూ గొంతు ఎక్కుపెట్టిన వాడు ఏడుస్తున్నవాడు.

వాడి ముందు ఇసుకగుట్టలు... కంకరగుట్ట... ఎదురుగా సగం కట్టిన భవం...

అతనికి ఆ క్షణం ఆ దుఃఖం సంగీతంలా ఉందా? లేదు! లేదు!!

క్షణం క్రితం ఆ శబ్దాలేమిటో అర్థంకాక గుండెలు చేతపట్టుకుని పరిగెత్తుకొచ్చాడు. నిజమే, శబ్దం అంటే అంత భయం పుట్టింది. శబ్దం ఇప్పుడు ఉత్తేజం కాదు. శబ్దం మరికొంత కాలం విధ్వంసమేనా!

వాడు ఏడుస్తున్నాడు. ఆ లేత కంఠంలో శబ్దం రకరకాల వొంపులు తిరుగుతూ వివిధ రాగాలనాశ్రయించి మెల్లగా, మెలమెల్లగా గొంతులోకి నిక్షిప్తం అయిపోతోంది.

వర్షంలా ఉందా ఏడుపు... ఓ జల్లు పడి మట్టి వాసనను నాసికలకందించి తమాషా చూసే మేఘపు ముక్కలా ఆ పసివాడు అటూ ఇటూ చూస్తున్నాడు.

కళ్ల వెంట కారిన నీటిబిందువులు జలజలా రాలి రాస్తాల్లో ఎండిపోయి ఉంటాయి. వాడ్ని జూమ్‌లెన్స్‌లో చూడాలని అతని కోరిక. ఇప్పుడు సాధ్యం కాదు. తను అటూ ఇటూ చూస్తున్నాడు.

చాలాకాలం క్రితం, చిన్నతనంలో ఏడ్చి ఏడ్చి కారుతున్న నీటిబొట్లు పెదవులను తాకినప్పుడు ఒక్కసారిగా నిశ్శబ్దం.

ఇవేమిటిలా? ఉప్పగా!

తిరిగి ఏడవాలని గుర్తుకు వచ్చేలోగా ఎన్నెన్ని ఆలోచనలో- అయినా ఈసారి దుఃఖ గానంలో బలం లేదు. అలవోకతనం ఉంది. మారాం ఉంది. కోరికలున్నాయి. ఏడ్చినంతనే అవి రాగలవా అనే సందేహం. రావాలనే పట్టుదల.

ఇప్పుడంత స్వేచ్ఛగా, అంత రాగయుక్తంగా ఏడవాలంటే కుదురుతుందా?

బాల్యం గొప్ప వరం- ఏడుపు బాల్యానికి వరం. చాక్లెట్లకీ, ఊరెళ్లటానికీ, సినిమాలకూ, కొత్త బట్టలకూ ఏడవటంలో ఎంత సౌకర్యం... ఎంత పట్టుదల... ఎంత ఉడుకుమోత్తనం? అన్నీ అదృశ్యం అయిపోయాయి. ఏడవటం చేతకాక, ఏడుపుని అసహ్యించుకుంటూ, నవ్వును పులుముకుని, అతికించుకుని, అరువు తెచ్చుకుని జీవనయాత్ర సాగించే తమకు...

అదిగో వాడే తన లేత స్వరం సంధించి బాల్యంలోకి విసిరికొట్టాడు.

ఇంతకూ ఆ పసివాడు ఎందుకు ఏడుస్తున్నట్టు మట్టి తిననీయనందుకా? ఆకలితోనా? అమ్మకోసమా? బొమ్మ కోసమా? ఎందుకెందుకు?

గది తలుపుల దగ్గర తిరిగి శబ్దం.

అతని శ్రీమతి నడిచి వచ్చింది.

"ఏమిటక్కడ నిలబడ్డారు, రండి."

"కొంచెంసేపు ఇక్కడే ఉంటాను."

"సినిమా రాబోతోంది."

'ఎందుకా సినిమా? జీవితానికి దూరంగా విసిరేస్తుంది. వాడు చూడు, నన్ను తనలోనికి ఆవాహనం చేసుకుంటున్నాడు,' మనసు బదులిచ్చింది.

"మాట్లాడరేం?"

"నువ్వు చూడు నాకిక్కడ బాగుంది."

"ఏమిటంత బాగుండటం. ఈరోజు కొత్తగా ఉందా?"

"అదిగో ఆ పిల్లవాడ్ని చూడు, తను ఏడుస్తున్నాడు."

"ఏడవటం మీకు బాగుంటుందా?"

"అవును. వాడు చాలా అందంగా ఏడుస్తున్నాడు."

"మీది మరీ విచిత్రం. అయినా వాడు ఎందుకు ఏడుస్తున్నాడో కనుక్కోకుండా ఇక్కడ నిలబడి చూడటం ఎందుకు?"

"మరలా ఏడుస్తాడేమోనని."

"అంటే వాడు ఏడవటమే మీకు కావాలన్నమాట. అలా అయితే నాలుగు తగిలించండి. వాడే ఏడుస్తాడు."

“అప్పుడు ఆ ఏడుపులో బాధ ఉంటుంది.”

“ఏడుపు అంటేనే బాధ కదా!”

“కాదు. ఏడుపంటే బాల్యం. ఏడుపు అంటే జ్ఞాపకం... ఏడుపు అంటే జీవితం...”

“నేను వెళుతున్నా... నాకయితే మిమ్మల్ని నాలుగు తగిలించి ఏడుస్తుంటే చూడాలని ఉంది.”

“వెళ్లు. సినిమా మొదలవుతుంది.”

నిశ్శబ్దం...

ఆమె వెళ్లిపోయింది.

వాడు ఎంతకూ ఆరంభించడు!

చీకట్లు ముసురుతున్నాయి. అతను అలానే నిలుచున్నాడు.

అతని కళ్లముందు రంగురంగుల దృశ్యాలు... అతని నవ్వులు... ఏడుపులు... అమాయకత్వాలు... అతని పెదవులు విచ్చుకుంటున్నాయి. గొంతులో ఏదో రాగం మౌనంగా సుడులు తిరుగుతోంది.

చీకటి దట్టంగా మొలిచింది. దూరంగా లైట్లు వెలిగాయి. ఆకాశంలో చుక్కలు మెరిసాయి.

చల్లటి గాలి మేనును తాకుతోంది. ఆ పిల్లవాడు అతనికి కనిపించటం లేదు.

ఆ పసిబిడ్డ అతనికి వినిపించటం లేదు.

“ఈ పూటకి రారా?” వెనుక నుండి పిలుపు.

“వస్తాను.”

“ఇంకా ఎందుకు? రండి. పురుగూ పుట్రా ఉంటాయి.”

అతను వెనక్కి తిరిగాడు.

చెవులు మాత్రం శబ్దాల కోసం వేచి ఉన్నాయి. ఎందుకీ సాయంకాలం ఏడ్చి తననిలా బాల్యంలోకి విసరటం- ఎందుకని అంత త్వరగా మానేయటం... ఒక్కసారి వెనక్కి తిరిగి తన కోసం నడవవచ్చునే! ఆ గానానికే మురిసిపోయారా వాళ్లు... అంతే అయి ఉంటుంది.

లోపలికి వచ్చాడు. అప్పుడు మొదలైంది రాగం. పక్క ఇంట్లోంచి.

అతను ముఖం చిట్లించుకున్నాడు.

“ఎందుకలా... ఇప్పుడూ పసివాడేగా ఏడుస్తున్నది.”

“అందరూ పసిబిడ్డలే. అందరి ఏడుపులూ ఒకటి కాదు.”

“దూరపు ఏడుపులు అందంగానే ఉంటాయి,” అతను వాదించదలుచుకోలేదు.

ఆ ఏడుపు అలా ఒక్కసారిగా తారాస్థాయిని అందుకుని అంతలోనే ఆగిపోయింది. అందుకే తనకు అది ఆహ్లాదం కలిగించదు. బాల్యంలోకి విసరదు. ఎందుకు ప్రారంభ మౌతుందో తెలియదు. ఎక్కడ ముగుస్తుందో తెలియదు... గంటలు గడిచాయి. అతని హృదయం మీద ఆమె వాలిపోయింది.

“నాకు ఏడవాలని ఉంది.”

సరిగ్గా అదే సమయంలో మరోసారి పెళిల్లున బద్దలయింది.

“ఛా...” అన్నాడతను.

ఆమె నవ్వింది.

"వాడంటే మీకు ఎందుకు అంత ఇది."

"వాడు ఏడుపుని దుర్వినియోగం చేస్తున్నాడు కనుక."

"అది అంత విలువైనదా?"

"అవును. మనిషికి ఓ వరం అది."

కాలం ఆగదు-

ఆమె పక్కకు తిరిగి పడుకుంది. గాలికి ఆమె ముఖం మీద వెంట్రుకలు పడి అందాన్నిస్తున్నాయి. అతను నిద్రపోలేదు. శబ్దం... పంకా వేగంగా తిరుగుతున్న శబ్దం... లేచి బయటికి వస్తే శబ్దమే. కీచురాళ్లు... ఏవో తెలియని జంతువులు పాకటం... అరవటం, రోదించటమూనా...! రాత్రి కరుగుతూనే ఉంది. రాత్రి కరుగుతూనే ఉంది. అతను వెళ్లి మంచం మీద తలదిండు సరి చేసుకుని పడుకున్నాడు. కళ్లు మూతలు పడ్డాయి. అయినా ఆలోచనలు... నిద్ర వచ్చీ రానట్లుగా...

ఎవరో దూరంగా... జుట్టంతా విరబోసుకుని వికటాట్టహాసం చేస్తున్నారు. ఒకరు కాదు, ఇద్దరు కాదు, గుంపు... గుంపులు... సమూహాలు... వారి నడుమ భయం భయంగా... ఓ పసిపిల్ల కాదు... ఏడుపు వినిపించటంలా... వెక్కిళ్లు వస్తున్నాయి. చీకటి... దూరంగా కాగడాల వెలుగు, చప్పుడు... అలా వెళ్లి వెళ్లి ఎవరో రోదిస్తున్నారు.

అది అడవి... ఎటు చూసినా వృక్షాలు... ఎందుకో అక్కడ నుండి రోదన. చెట్లు తెగి పడుతున్నాయి. ఆకాశంలోకి ఎదిగిన ఆ చెట్లు నిట్టనిలువుగా కూలిపోతున్నాయి.

ఎవరో ఏడుస్తున్నారు.

ఒకరు కాదు... ఇద్దరు కాదు...

గుంపులు... గుంపులు, గుంపులుగా ఏడుస్తున్నారు.

ఆడా... మగా... పిల్లా పెద్దా ఏడుస్తున్నారు. ఆపితే బాగుండును. దూరంగా పారిపోతే బాగుండును. ఈ అశక్తత తొలిగిపోతే బాగుండును. ఈ శబ్దాలు ఆగిపోతే బాగుండును.

ఆమె నవ్వింది. గలగలమంటూ మొదలైన ఆ నవ్వు ఉధృతంగా మారుతోంది.

"ఎందుకంత భయం... ఏడుపులో అందం ఉంది కదా."

"నిజమే. కానీ వీళ్లంతా భయాల్తో, బాధల్తో ఏడుస్తున్నారు. చావు కబళిస్తుందని ఏడుస్తున్నారు. నీకు తెలుసా? ఈ ప్రపంచమంతా నిద్రలో ఉంది. అందుకే ఈ శబ్దాలు ఇంతగా భయపెట్టడం."

"అంటే?"

"ఉదయమంతా వేగం... ముసుగులు... దొంగ నవ్వులు... దొంగ మర్యాదలు... రాత్రి అలా కుదరదు. ఎవడికివాడు మైమరచి నిద్రిస్తున్నానుకుంటాడు. మెదడు చేసే శబ్దం గురించి పట్టించుకోడు. ఏదీ నిజం కాదు. మనిషి నిద్ర నిజం కాదు. నవ్వు నిజం కాదు. ఇదిగో ఈ రాత్రుల ఏడుపులే నిజం."

అతను పక్కకు తిరిగాడు. శబ్దం, శబ్దం. శక్తులన్నింటినీ కూడదీసుకుంటే దూరంగా కుక్క ఏడుస్తోంది. పక్కకు తిరిగితే తనే దిండు తడువుతుంది. ఆమెకు స్పృహ ఉందా? లేదు. కానీ కళ్ల వెంట నీళ్లు... ఉదయం లేచి మరిచిపోతుంది. నువ్వు దుఃఖించావంటే నవ్వుతుంది కూడాను.

లేచి వెళ్లాడు. పిల్లల ముఖాలలో నవ్వు... అంతలోనే ఒక్కసారిగా మార్పు. ఏడుపు, మూలుగు, చీకటి ఏడుస్తూనా... వెన్నెలా ఏడుస్తూనేనా? అతను తిరిగి పడుకున్నాడు. కనురెప్పల మాటున దాగి ఉన్న నీళ్లు ఏమైపోయాయో తెలియదు. ఎప్పుడు దాడి చేయగలవో తెలియదు. వెచ్చటి ఊపిరి... తిరిగి కన్నీళ్లూ వెచ్చగా... శబ్దం... పంకా రోదిస్తుందా... సముద్రం రోదిస్తుందా? ప్రకృతిలో ప్రతిదీ రోదిస్తూనే ఉంటుందా? ఈ రాత్రులు అమృతాలు కురుస్తాయంటారు. దేవతలు విహరిస్తారంటారు. అదంతా నిజం కాదా? ఇదేమిటి వింత ప్రపంచం. రాత్రంతా కరిగి కరిగి ఒక్కసారిగా వెలుగు... తాను మాత్రం నిద్ర లేవనేలేదు. ఆమె అతనిని తట్టి లేపుతోంది.

"ఏమిటీ రోజు ఇంతసేపు. లేవండి, తెల్లారి చాలాసేపయింది."

"నాకు శతాబ్దాలు నిద్రపోవాలని ఉంది."

నివ్వెరపోయింది.

"శతాబ్దాలు అన్నీ మనవా?"

"ఎందుకుకావు. మనందరం మనుషులమే కదా."

"కానీ..."

"ఏ శతాబ్దం మనుషులు ఆ శతాబ్దంతోనే అంతం కావాలా?"

"అలా అని కాదు. ఈరోజుది రేపు ఉండటం లేదు. అందుకే శతాబ్దాలు నిద్రిస్తానంటుంటే... మిమ్మల్ని రేపటి శతాబ్దపు మనుషులు అస్తిత్వంలో ఉండనిస్తారా?"

"అంటే వారికి సంస్కృతి వద్దా? నిన్నటిదేమీ వద్దా?"

"వారికి సంస్కృతి కావాలి. కానీ వారిది, ఆ కాలంనాటిది."

"అదంతా నిన్నటిదని గుర్తించరా? నిన్నటి మానవత్వం గురించి వారికి అవసరం ఉండదా?"

"ఏమో... వాళ్లకీ నిన్నటి ధ్వంసమే ఆదర్శం కాబోలు."

"అలానా... లేస్తున్నాను. ఇంతకు రాత్రి ఎందుకంతగా ఏడ్చినట్లో?"

"నేనా... మీరంతే. మీ సంతోషమే ప్రపంచపు సంతోషం. మీ దుఃఖమే ప్రపంచపు దుఃఖం."

"అలా అనకు. నేను హాయిగా ఏడవలేకపోతున్నా... నాకిప్పుడు ఏడుపు కావాలి. నేను నా కోసమూ, నీ కోసమూ, అందరి కోసమూ ఏడవగలగాలి."

"నిన్నటి నుండి మీరు ఇలా..."

"నిజమే, వాడు ఆ పిల్లవాడు గుర్తుచేశాడు. ఈ ప్రపంచం కోల్పోతుందేమిటో తెలుసా?"

"ఓజోన్ పొరనా?"

"కాదు."

"ప్రకృతినా?"

"కాదు."

"ఆనందాన్నా? అనుభూతుల్నా? దేన్ని?"

"దుఃఖాన్ని. అవును దుఃఖాన్నే. సహజ సజీవ స్రవంతి దుఃఖాన్నే. మనిషి నుండి మనిషి ఆశించే కన్నీటిని శతాబ్దాలుగా మనతోపాటు పయనించిన దుఃఖాన్ని. ఈ మనుషులు ఏడవటం మరిచిపోయారు. కళ్లు తెరుచుకుని చూస్తున్నారు. వారిని ఎవరెవరో మంత్రంతో బంధించారు. ఇదంతా బతుకు కోసమే అనుకుంటున్నారు. ఇది జీవితం కాదని నేనంటే వారు నమ్మటం లేదు."

"అవును, వారికి దుఃఖం లేనిది కావాలి."

"అందుకేనా నువ్వు అన్ని చెత్తలనూ భరిస్తోంది."

"కావచ్చు."

"దుఃఖం లేనిది కావాలంటే మార్గం దుఃఖమే. నువ్వు నీకోసం దుఃఖించు. ఈ సంస్కృతి ఇలా తగలడుతున్నందుకు, ఈ జీవితం ఇలా నిస్సారమైనందుకు, మనం మరబొమ్మలమయి నందుకు, మన భాగస్వామ్యం లేకుండా, మన అంగీకారంతో పని లేకుండా ఈ ప్రపంచాన్ని ముక్కలుగా పంచుకొంటున్న వారిని చూసి దుఃఖించు."

"ఏమో! దుఃఖించటం అనేది పిరికివారి లక్షణం. ఏడుస్తూ కూర్చుంటే ఏది ఆగుతుంది? కన్నీళ్లు ఆగవే?"

"చాలా పొరపాటు పడుతున్నావ్. దుఃఖం ఓ ఆయుధం. బాల్యంలో ఏడుపే ఓ శక్తి. ఒక్కసారి మనసారా ఏడ్చి చూడు. నీవింకా అలా కూర్చోవటం సాధ్యం అవుతుందా? సృష్టి ఏర్పడింది... బాధ నుండి, దుఃఖం నుండి మనం సృష్టినే మరిచిపోతున్నాం.

"సరే ముందు లేవండి. నాకు చాలా పనులున్నాయి. మీకూ చాలా పనులున్నాయి."

"ఉండనీ."

"అవి ఆగవు."

"పోనీ."

"పోతే ఎలా? జీవితం ఇది."

"అంటే ఏమిటి?"

"ఎవరికి తెలుసు కనుక."

"తెలుసుకుందాం."

"అంత తీరిక ఏది... ముందు మనం."

"జీవితం చాలా చిన్నదని తెలుసుకునే లోగానే మనం ఇంక మిగలం."

"పోనీయండి. ఇంకెవరైనా తెలుసుకుంటారు."

"వాళ్లని మాత్రం జీవితం తెలుసుకోనిస్తుందా?"

"ఇంతకూ ఏమంటారు?"

"ఇదంతా ఏమిటి?"

"నన్ను కాదు అడగాల్సింది... తత్వవేత్తలున్నారు."

"నువ్వు కాదా?"

"నేను మనిషిని."

"అందుకే నువ్వంటే గౌరవం నాకు. తత్వవేత్తలు ఏడవరు తెలుసా?"

"నిజమా, ఎందుకని?"

"వారు ఎదిగారు. దుఃఖానికి వారు అతీతులు."

"అదృష్టవంతులు."

"జీవితం వారినేమి చేయదు. వారే జీవితాన్ని శాసిస్తారు."

"మరెలా? అడవులకి వెళ్తారా?"

"ఎక్కడున్నాయి అవి?"

"అడవులే లేవా? ఎక్కడా లేవా?"

"లేవు. ఒకప్పుడు అడవుల్లో పాటలుండేవి. ఇప్పుడు అడవులన్నింటా దుఃఖమేగా."

"దుఃఖం మీకు ఇష్టమేగా."

"ముందే చెప్పాను. భయం, బాధ లేని ఏడ్పు నాకు ఇష్టం. నేను వాటి దుఃఖం వింటానికి వెళ్లలేను."

"పోనీ వాటి కోసం మీరు దుఃఖించండి."

"అందుకు అడవుల దగ్గరకు వెళ్లను. అడవి కూడా నిన్నటి జ్ఞాపకం. దుఃఖమూ అంతే, అందమూ అంతే. ఈ ప్రపంచంలో ఒకనాడు రాజ్యం చేసేది అరాచకమూ... వికటాట్టహాసమూ మాత్రమే."

"ఇది ఎంతకూ తేలని సమస్య."

"నిజమే. అంగీకరిస్తున్నా."

"మరింక లేవండి. ముఖం చల్లటి నీళ్లతో కడుక్కోండి. ప్రపంచమంతా ప్రశాంతంగానే అనిపిస్తుంది."

అతను లేచాడు.

తిరిగి గోడ దగ్గరకు వెళ్లి చూశాడు. తను కనిపిస్తాడేమోననే ఆశ. ఆ పిల్లవాడు కనిపించనే లేదు.

అలా ఎంతసేపు ఉండేవాడో తిరిగి ఆమె హెచ్చరించింది. వెనక్కి తిరిగాడు.

పగలు ఆవిరైంది...

అతను ఎక్కడ నుండో వచ్చాడు. అతని కాళ్లు తిరిగి గోడ దగ్గరకు దారి తీశాయి. తను చూస్తున్నాడు.

ఆమె కూడా!

ఆమెలో ఏదో ఉద్వేగం, పెదవులు వణుకుతున్నాయి. గుండె లోతుల నుండి ఏదో గాఢంగా వివరించాలనుకొని విఫలం అవుతున్నదామె.

వెచ్చటి నిట్టూర్పు తాకగా అతను వెనక్కి తిరిగాడు.

ఆమెను చూశాడు.

"ఏమైంది?"

ఆమె తల దించుకుంది.

"నాతోనూ చెప్పకూడనిదా?"

ఆమె తలెత్తింది.

"మీలో ఇంత ఘర్షణను లేవనెత్తిన ఆ పిల్లవాడి గురించి కనుక్కున్నాను."

"అలానా! ఏమిటంట? ఎందుకని వాడు ఏడవటం లేదు."

"బహుశా ఇంకా ఎక్కువకాలం తను ఏడవలేడేమో."

"అంటే?"

"జబ్బు తనని కబళిస్తోంది."

"అంటే..."

"మరి కొద్దిరోజులే ఈ ప్రపంచాన్ని తను చూసేది."

"అందుకేనా ఏడవటం."

"బహుశా బాధతో."

"అంటే తనకి ఈ నిష్క్రమణ గురించి తెలియదు కదూ."

"అవును."

చీకటి దట్టంగా-

ఆకాశంలో చుక్కలు లేవు. అతనిలో ఆనందం లేదు. వంటరిగా తనువు తల్పం మీద...

అతని పక్కన ఆమె... ఆ ముఖంలో వేదన...

"రాత్రి కరగదు. ఈ రాత్రి కరగకూడదు. కాలం ఇక్కడ స్తంభించాలి. అప్పుడు వాడు చిరంజీవి అవుతాడు."

"మరణం తప్పదు. ఈరోజయినా రేపయినా," ఆమె.

అతను తలూపాడు.

"మీకు చాలా దుఃఖం వస్తుంది కదూ."

"రావటం లేదు."

"చాలా చిత్రమైన మనుషులు."

"ఎందుకని?"

"ఆ మాటలు తెలియగానే నాకు బాధ కలిగింది. కళ్ల వెంట నీళ్లు వచ్చాయి."

"కానీ నాకు సంతోషంగా ఉంది."

"ఇప్పుడు కాలం స్తంభించాలన్నారు."

"అవును అదో కోణం."

"ఎన్ని కోణాలుంటాయి జీవితానికి."

"అనంతంగా. తాము తెలుసుకుందే జీవితం అనుకుంటారు. కొంతమంది తమ అనుభవాలకు జీవితాన్ని కుదిస్తారు."

"మీరు చేస్తున్నది అది కాదా?"

"కావచ్చు."

"ఇంతకూ మీకెందుకా సంతోషం."

"ఇంత బాధ్యతారహితమైన సమాజం నుండి వాడు నిష్క్రమిస్తున్నందుకు, ఈ ఆందోళనల నుండి విముక్తి అవుతున్నందుకు."

"అంటే దుఃఖం మాయా?"

"ఏదీ మాయకాదు. అంతా వాస్తవమే. అన్నీ భ్రమలే."

"మీరు నాకు అర్థంకారు."

"అందరూ అంతే. ఎవరికి ఎవరూ పూర్తిగా అర్థంకారు."

నిశ్శబ్దం.

"ఇంతకూ ఈ ప్రపంచపు భవిష్యత్తు ఏమిటి?"

"అది తెలిస్తే ఇదంతా ఎందుకు?"

"సరే పడుకుందాం."

"నాకు ఈ రాత్రి నిద్రరాదు."

"ఆరోగ్యం పాడవుతుంది."

"అవనీ."

"మేమంతా మీ మీదే ఆధారపడ్డాం."

"అందుకే ఇలా ఉంది. ఎవరి మీద వారు ఆధారపడండి. ఎవరి కోసం వారు జీవించండి. బహుశా జీవితపు సారాంశం ఇదేనేమో."

"ఇదంతా ఆ పిల్లవాడి దుఃఖం నుండేగా."

"కాదు... అవును... మనందరి దుఃఖం ఇది. మనందరి అశ్రువులివి. వాడు గుర్తుచేశాడు. వాడు నిష్క్రమిస్తున్నాడు. నాకేం కావాలో నాకు తెలియదు. అసలేం తెలీకపోయినా ఈ బాధ ఉండదు. కొంచెం తెలుస్తోంది. మరికొంత అగమ్యగోచరంగా ఉంది. ఎవరూ అర్థంకారు. ఎవరూ తెలియకుండానూ ఉండరు.

"దుఃఖం ఆనందం... అదే విషాదం... ఎందుకీ రోగాలు... ఎందుకీ ధ్వంసాలు... ఎందుకీ దరిద్రాలు... ఎక్కడికి వెళ్లాలని- ఏం సాధించాలని- డబ్బు జీవితం కాదు. సంగీతం కాదు. కళలు కాదు. అన్నీ అన్నీ. కానీ వీళ్లంతా ఏ ఒక్కదాన్నో అంతా అనుకుంటున్నారు. అదే శాశ్వతం అనుకుంటున్నారు. అందుకే అన్నీ కోల్పోతున్నారు. ఆనందాన్ని, విషాదాన్ని, తన్మయత్వాన్ని- అన్నింటినీ.

"ఏం కావాలో తెలియదు. దాహం... దప్పిక తీరదు. దాహం. అందరూ అంతే. నేను ఒక్కసారి గొంతెత్తి ఏడుస్తా. నన్ను అనుమతించు."

"మీరా?" ఆమెలో ఆందోళన.

"అవును."

"వద్దు... వద్దు... నేను భరించలేను," ఆమె కంఠం వణికింది.

"ఒక్కసారి... ఒకే ఒక్కసారి... అనుమతించు."

"నా ప్రాణం... పోయినా నేను అంగీకరించను. మీరు నవ్వాలి."

"అయ్యో! దుఃఖం నాకు వరం. ఇంతవరకూ జరిగిన తప్పులన్నింటికీ పశ్చాత్తాపంతో ఏడవనీ. ఇంతవరకు జరిగిన మంచికి తన్మయత్వంతో ఏడవనీ... రేపటి చెడుకు నిస్సహాయంగా ఏడవనీ. రేపటి మంచికి ఉద్వేగంతో ఏడవనీ. నన్ను బతికించు. నేను మరికొన్ని దశాబ్దాలు అన్వేషణలో గడపాలంటే సంవత్సరాలుగా మరిచిపోయిన ఏడుపుని గుర్తుకు తెచ్చుకొని, హాయిగా, జోరుగా, గుండెలు ద్రవించేలా ఏడవనీ. నన్ను అనుమతించు నా నేస్తం. దుఃఖానికి స్వాగతం పలుకు."

ఆమె తన్మయత్వంతో చూస్తోంది.

"మీతోపాటు నేనూ, మీ గొంతుతో పాటు నాది."

ఆ నిశ్శబ్దంలో... వారిద్దరి కళ్లలో తడి...

మెల్లగా వెక్కిళ్లు...

అదే సమయంలో... ఆ గుడిసెలో పడుకున్న పిల్లవాడు ఉలిక్కిపడి లేచాడు...

వాడు గొంతెత్తాడు.

బయట కుక్కపిల్ల ఏడుస్తోంది.

పక్క నుండి ఒక్కసారిగా ఆ పిల్లవాడు ఏడుస్తున్నాడు.

చెట్లు ఏడుస్తున్నాయి.
ప్రపంచం... ప్రపంచమంతా...
అశ్రువులు... అశ్రువులు...
తిరిగి తిరిగి జననం... సృష్టి మరలా మరలా నిర్మాణం...
అది అలా సాగి సాగి ఎప్పుడు ఆగిపోయిందో తెలియదు.
చాలా సన్నగా అదేదో రాగంలా-
ప్రకృతిలో... నిశ్శబ్దంలో లీనం అవుతున్నట్లుగా ఉంది. ఉంటుంది.
తిరిగి శబ్దమూ తప్పదు!

*ఆంధ్రప్రభ వారపత్రిక*
*3 మే 1995*

## నేపథ్యం

సంతోషమూ దుఃఖమూ పతాకస్థాయికి చేరుకొంటే

# దుఃఖసాగరం

***దుఃఖం అనుభూతి కూడా. చిన్నతనంలో ఎంత హాయిగానో ఏడవగల మనుషులు క్రమంగా సహజమైన దుఃఖానికి దూరం అవుతున్నారు. దుఃఖం అనేది ఓ సాగరం అయితే అది అందించే సంపద ఎంతో. ప్రేమనీ, స్త్రీనీ, చైతన్యాన్నీ, ఆనందాన్నీ ఇంకా అనేక అంశాల్నీ సముద్రంతో పోల్చారు కవులు, రచయితలు.***

కథ రాయటానికి వస్తువులు చాలా చిత్రంగా లభిస్తుంటాయి. ఒక్కోసారి సీరియస్‌గా కథ రాయాలని కూర్చున్నప్పుడు ఎంత ఘర్షణ అనుభవించినా కలం కదలదు. నాలుగైదు వాక్యాలు రాసినా ఏమాత్రం సంతృప్తి కలిగించవు. మరో సందర్భంలో అదో ప్రవాహలా కథ సాగుతుంది. ఒకే సిటింగ్‌లో పూర్తవుతుంది కూడా. చదువుకున్నాక ఇదంతా రాసింది మనమేనా అనిపించిన సందర్భాల్ని ప్రతి రచయితా, రచయిత్రి ఎదుర్కొని ఉంటారని నా నమ్మకం.

కొన్ని పాత్రలూ, ఓ నిర్దిష్టమైన ప్రణాళిక ఈ రకమైన కథలు రాయటం ఓ రకం. ఇంకో రకం కథల్లో అప్పటి మూడ్ ప్రధానంగా ఉంటుంది. చైతన్యస్రవంతి పద్ధతిలో రచన సాగుతుంది. పరస్పర వైరుధ్యంగల భావాలు, ప్రతీకలు, విశ్లేషణ, ఆత్మవిమర్శ, ప్రశ్నలు, జవాబులు వెతుక్కోవటం అన్నీ ఆ చిన్నికథలో చోటు చేసుకొంటాయి. ఓ పట్టాన అందరినీ ఇలాంటి రచనలు ఆకర్షించవు. కొంతమందికి అర్థం కావు. అలాగే ఈ తరహా కథల్ని అంచనా వేసేటప్పుడు ఎవరి ధోరణులు వారివి. ఆ విశ్లేషణలు రచయితల్ని దిగ్భ్రాంతికి గురిచేసే విధంగా కూడా ఉంటాయి.

ఓ గాఢమైన అనుభూతి, ఓ జ్ఞాపకం, ఓ వాసన కథలు పుట్టడానికి కారణం కావచ్చు. ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురించిన నా *దుఃఖసాగరం* కథకు నేపథ్యం ఓ పిల్లవాడి ఏడుపు. ఓ సాయంకాలం మరికొద్ది క్షణాల్లో దూరదర్శన్‌లో సినిమా ప్రసారం చేస్తారనగా చెవుల్ని తాకిందో రాగం. ఉదయం పత్రికలు రాష్ట్రంలోను,

దేశంలోను వివిధ ప్రాంతాల్లో బ్రద్దలైన బాంబుల వార్తల్నీ, కాల్పుల శబ్దాల్నీ మోసుకొచ్చాయి. అలాంటి సమయంలో తలుపులు తెరుచుకొని దొడ్లోకి వెళ్తే- ఎదురుగా నిర్మాణంలో ఉన్న డాబా ముందు బలహీనంగా కనిపిస్తున్న పిల్లవాడు ఏడవడం కనిపించింది. ఆ ఏడుపు వంపులు తిరుగుతూ, ఆగుతూ తిరిగి మొదలవటం- ఆ పిల్లవాడు ఆకాశంకేసీ, ఎగురుతున్న పిట్టలబారుకేసి చూసి అంతలోనే తను ఏడుస్తున్న విషయం గుర్తుకొచ్చి పక్కనున్న తమ గుడిసెకేసి చూస్తూ దుఃఖరాగాన్ని ఆలపించటం చూశాక బంగారు బాల్యం గుర్తొచ్చింది.

దుఃఖం అనుభూతి కూడా. చిన్నతనంలో ఎంత హాయిగానో ఏడవగల మనుషులు క్రమం గా సహజమైన దుఃఖానికి దూరం అవుతున్నారు. దుఃఖం అనేది ఓ సాగరం అయితే అది అందించే సంపద ఎంతో. ప్రేమనీ, స్త్రీనీ, చైతన్యాన్నీ, ఆనందాన్నీ ఇంకా అనేక అంశాల్నీ సముద్రంతో పోల్చారు కవులు, రచయితలు. అందుకే మరోసారి దుఃఖాన్ని సాగరంతో పోల్చి చెప్పటం.

సాగరపు లోతులు తెలుసుకోవటం కష్టం అంటారు. ఆధునిక సాంకేతికత 'లోతు'ను తెలుసుకోగలిగినా, ఇతర డైమన్షన్స్ గుర్తించి తెలుసుకోవాల్సిన రహస్యాలు ఎన్నో ఉన్నాయి. గర్భంలో అనంతమైన సంపద దాచుకొని ఉపరితలంపై చెత్తాచెదారపు తెట్టల్ని తేల్చటం సముద్రపు చమత్కారం. దుఃఖమూ అంతేనా!

'నవ్వుతూ బతకాలిరా తమ్ముడూ నవ్వుతూ చావాలిరా,' అన్నాడో కవి. అదో కోణం. చాలామందికి దుఃఖం అంటే భయం. అది నిషేదించదగిన అంశం. కాని దుఃఖపు లోతులకు వెళ్తున్నకొద్దీ ఎన్నెన్నో విషయాలు అర్థమవుతాయి.

ఈ కథానాయకుడి భావనా ప్రపంచం దుఃఖంతో ఆరంభమై, బాల్యం మీదుగా పాకి, ధ్వంసమౌతున్న ప్రకృతిని, జీవితపు వత్తిడినీ, విఫలమౌతున్న ఉద్యమాల్నీ, తిరిగి తిరిగి ఊపిరి పోసుకొంటున్న చైతన్యాన్నీ, అమానవీయ విలువల్ని తాకుతూ నిశ్శబ్దంలో కరిగి, తిరిగి 'శబ్దం' కోసం ఎదురుచూస్తూ తప్పకుండా శబ్దాన్ని వినగలమనే ఆకాంక్షతో ముగుస్తుంది.

కథలో పాత్రలు ఆ పిల్లవాడు, ఆ కథానాయకుడు, అతని భార్య, పక్కింటి పిల్లవాడు. వాడూ పిల్లవాడే. ఎందుకు ఏడుస్తాడో తెలియదు. ఆ ఏడుపు ఒక్కక్షణం ఎంత తీవ్రంగా బ్రద్దలవు తుందో అంత అర్థంతరంగా ఆగిపోతుంది.

బాల్యంలో కన్నీళ్ళు ఉప్పగా ఉంటాయనీ, ఏడ్చి కొన్ని కోర్కెలు సాధించుకోవచ్చనీ, ఒక్కో సారి ఏడుపు బాధకూ, దెబ్బలకూ కారణం కావచ్చనీ తెలుసుకొన్న విషయాలు పెద్దయ్యాక గుర్తుకు వచ్చినపుడు అంత స్వేచ్ఛగా, రాగయుక్తంగా ఏడవగలగటం ఈ వయసులో సాధ్యం అవుతుందా? అనుకొన్నప్పుడు ఓ గాఢమైన నిశ్వాసం వెలువడుతుంది ఎవరికైనా.

కథానాయకుడి అంతరంగం స్వేచ్ఛా విహంగం అయింది. ఏడుపంటే బాల్యం. ఏడుపంటే జ్ఞాపకం. ఏడుపంటే జీవితం అన్నాడు భార్యతో. ఇంతకూ ఆ పిల్లవాడు ఎందుకు ఏడుస్తున్నాడో కారణం తెలుసుకోండి అంది. భావుకుడికి ఆ క్షణం అది అనవసరం. మళ్ళీ ఆ పిల్లవాడి ఏడుపు కోసం నిరీక్షణ. కాలం కరిగిపోయింది. లోపలకొస్తే పక్కింటి పిల్లవాడి రాగం. ముఖం చిట్లించు కొన్నాడు. వాడు ఏడుపుని దుర్వినియోగం చేస్తున్నాడు అన్నాడు. 'అదంత విలువైనదా,' అందామె. అవునన్నాడు. రాత్రి అందరూ నిద్రపోతున్నారు. అతనికి నిద్ర పట్టదు. కళ్ళు మూతలు పడుతుంటే- కల. మనుషులు సమూహాలు సమూహాలుగా అడవుల్లోకి పరిగెత్తుకెళ్ళి రోదిస్తున్నారు. చెట్లు కూలుతున్నాయి. అవన్నీ ఆగిపోతే బాగుండుననుకొంటుంటే ఆమె నవ్వింది.

"ఎందుకంత భయం. ఏడుపులో అందం ఉంది కదా," ఆమె.

“నిజమే వీళ్ళంతా భయాల్లో బాధల్లో ఏడుస్తున్నారు. చావు కబళిస్తుందనీ, ఆకలీ, దాహం తీరవేమోనని ఏడుస్తున్నారు,” అతను.

అతను పక్కకు చూస్తే భార్యాపిల్లలూ, ప్రకృతీ రోదిస్తున్నట్లుగా, ఎప్పుడో తెల్లవారుఝాము నిద్రపట్టింది. ఆమె లేపింది. కొన్ని శతాబ్దాలు నిద్రపోవాలనుంది అన్నాడు. ‘శతాబ్దాలు అన్నీ మనవా,’ అంది. ‘ఎందుకు కాదు. మనందరం మనుషులం కదా,’ అన్నాడు. ‘ఈరోజుది రేపు ఉండటం లేదు. అలాంటప్పుడు రేపటి శతాబ్దపు మనుషులు మిమ్మల్ని అస్థిత్వంలో ఉండనిస్తారా? వారికి నిన్నటి విధ్వంసమే ఆదర్శం కాబోలు... ఇదంతా ఆ పిల్లవాడి ఏడుపుతోనే కదా,” అందామె. వారు మాట్లాడుకొంటున్నారు.

“ఈ ప్రపంచం కోల్పోతున్నదేమిటో తెలుసా?” అతను.

“ఓజోన్ పొరనా,” ఆమె.

“కాదు.”

“ప్రకృతినా?”

“కాదు.”

“ఆనందాన్నా... అనుభూతుల్నా... దేన్నీ...”

“దుఃఖాన్ని. సహజ సజీవ స్రవంతి దుఃఖాన్ని. మనిషి నుండి మనిషి ఆశించే కన్నీటిని. శతాబ్దాలుగా మనతో పయనించిన దుఃఖాన్ని. ఈ మనుషులు ఏడవటం మరిచిపోయారు. కళ్ళు తెరుచుకొని చూస్తున్నారు. వారిని ఎవరెవరో మంత్రంతో బంధించారు. ఇది జీవితం కాదంటే నమ్మటం లేదు.”

“అవును. వారికి దుఃఖం లేనిది కావాలి,” ఆమె.

“అందుకు మార్గం దుఃఖమే. నువ్వు నీ కోసం దుఃఖించు. ఈ సంస్కృతి ఇలా తగలబడుతున్నందుకు. జీవితం ఇలా నిస్సారమైనందుకు. మనం మరబొమ్మలమైనందుకు దుఃఖించు,” అన్నాడు.

“అది పిరికివారి లక్షణం,” ఆమె.

“పొరపాటు. దుఃఖం ఓ ఆయుధం. మనసారా ఏడ్చి చూస్తే తెలుస్తుంది. ఇంకేమాత్రం ఊరికే కూర్చోవటం సాధ్యం కాదు.”

అలా వారి సంభాషణల్లో ఎన్నెన్నో ప్రశ్నల అన్వేషణ. సమాధానం అంత సులభంగా దొరకదని గ్రహించాక తిరిగి పిల్లవాడి ఏడుపు కోసం గోడ దగ్గరకు వెళ్ళాడు. వాడు కనిపించనే లేదు. పగలు ఆవిరైంది. రాత్రి గోడ దగ్గర నిలబడితే ఆమె మెల్లగా చెప్పింది.

“జబ్బు ఆ పిల్లవాడ్ని కబళిస్తోంది. ఇంక ఎక్కువకాలం వాడు ఏడవలేకపోవచ్చు.”

చీకటి దట్టంగా- ఆకాశంలో చుక్కలు లేవు. అతని తనువు తల్పం మీద, “ఈ రాత్రి కరగకూడదు. కాలం ఇక్కడ స్తంభించాలి. అప్పుడు వాడు చిరంజీవి అవుతాడు,” అతను.

“మరణం తప్పదు ఈరోజైనా, రేపైనా,” ఆమె.

అతను తలూపాడు.

“మీకు చాలా దుఃఖం వస్తుంది కదూ,” ఆమె.

“రావటం లేదు.”

“ఇప్పుడు కాలం స్తంభించాలన్నారు,” ఆమె ఆశ్చర్యంగా.

అతను, “అదో కోణం.”

“ఇంతకూ మీకెందుకా సంతోషం,” ఆమె.

“ఇంత బాధ్యతారహితమైన సమాజం నుండి వాడు నిష్క్రమిస్తున్నందుకు. ఆందోళన నుండి విముక్తి అయినందుకు.”

“మీరు అర్థం కారు,” అంది.

“అవును, దుఃఖం మాయ కాదు. ఏదీ మాయ కాదు. అన్నీ వాస్తవాలే. అన్నీ భ్రమలే,” అంటాడతను.

“దుఃఖం ఆనందం- అదే విషాదం. డబ్బు జీవితం కాదు. అధికారం జీవితం కాదు. సాహిత్యం కాదు. సంగీతం కాదు. అన్నీ... అన్నీ... కానీ వీళ్ళంతా ఏ ఒక్కదాన్నో అంతా అనుకొంటున్నారు. అదే శాశ్వతం అనుకొంటున్నారు. అందుకే ఆనందాన్నీ, విషాదాన్నీ, తన్మయత్వాన్నీ కోల్పోతున్నారు. ఒక్కసారి గొంతెత్తి ఏడుస్తా. నన్ను అనుమతించు.”

“వద్దు, నేను భరించలేను,” ఆమె.

“అయ్యో! దుఃఖం నాకు వరం. ఇంతవరకూ జరిగిన తప్పులన్నింటినీ పశ్చాత్తాపంతో ఏడవనీ. ఇంతవరకు జరిగిన మంచి తన్మయత్వంతో ఏడవనీ. రేపటి చెడుకి నిస్సహాయంగా ఏడవనీ. రేపటి మంచికి ఉద్వేగంతో ఏడవనీ. నన్ను బతికించు. మరికొన్ని దశాబ్దాలు అన్వేషణలో గడపాలంటే, సంవత్సరాలుగా మరిచిపోయిన ఏడుపుని గుర్తుకు తెచ్చుకొని హాయిగా, జోరుగా, గుండెలు ద్రవించేలా ఏడవనీ. నన్ను అనుమతించు నా నేస్తం. దుఃఖానికి స్వాగతం పలుకు.”

అతనితో ఆమె గుడిసెలో పడుకొన్న పిల్లవాడు- బయట కుక్కపిల్ల- చెట్లు- ప్రపంచమంతా దుఃఖంలో భాగం అయింది.

ఆ దుఃఖం అలా సాగి సన్నగా- అదేదో రాగంలా. ప్రకృతిలో, నిశ్శబ్దంలో లీనం అవుతున్నట్లుగా- తిరిగి శబ్దించేదాకా!

ఈ కథ తిరిగి చదువుకొన్నాక అనిపించింది.

సంతోషమా-దుఃఖమా మరే ఇతర రసమైనా పతాకస్థాయికి చేరుకొన్నాక వాటి నడుమ గీతలు చెరిగిపోతాయి.

నదులు సముద్రంలో కలిసినట్టు అన్నీ మానవత్వంలో ఐక్యం కావాల్సిందే. ఏదో ఒకనాడు ముందుగానే చెప్పినట్లు ఇది రచయిత మథనం. ఏకీభవించే వారికి ఈ కథలో ఏదో కనిపిస్తుంది. లేనివారికి ఇదో గోల! అయితే ఒకటి మాత్రం నిజం. ఈ రూపంలో కాకపోయినా ప్రతి రచయితా, రచయిత్రీ కనీసం ఒక్క రచనలోనైనా తమ గోడు వెళ్ళబోసుకొంటారు. ఎందుకంటే దుఃఖమే కాదు, కథ సైతం ఓ సాగరమే! ఇదే అంశాన్ని ఇంకో రూపంలో హృదయానికి హత్తుకొనేలానూ చెప్పవచ్చు. ఆ రూపాన్ని నిర్ణయించుకోవడంలో రచయితకు తెలియకుండా కూడా మిగతా అంశాలు చోటు చేసుకోవచ్చుననిపిస్తుంటుంది ఇప్పుడు!

*30 నవంబర్ 1997*

19

# హంతకులు

## తుమ్మేటి రఘోత్తమరెడ్డి



***తుమ్మేటి రఘోత్తమరెడ్డి** 1959 డిసెంబర్ 1న వరంగల్ జిల్లాలో జన్మించారు. మొదటి కథ ధిక్కారం మే 1981లో సృజనలో అచ్చయింది. నల్లవజ్రం నవలికతో సహా ఇరవై మూడు కథలు రాశారు. తుమ్మేటి రఘోత్తమరెడ్డి కథలు పేరుతో సమగ్ర కథల సంపుటి వెలువడింది. సింగరేణి బొగ్గుగనుల్లో పని చేసి, స్వచ్ఛంద పదవీ విరమణ చేశారు.*

**చిరునామా**

*4-45/2, నాల్గవ వీధి,*
*బాబానగర్, నారపల్లె గ్రామం,*
*ఘట్‌కేసర్ మండలం,*
*రంగారెడ్డి జిల్లా-500 088*
*Ph.: 93331 84107*

"మనిషి ఉన్నదో పోయిందో!" వణికే కాళ్లతో బస్టాండులో బస్సు దిగాడు నారాయణ. ప్రయాణమంతా మెదట్లో రక్తనాళాలు చిట్లిపోతాయో ఏమోనన్నంత టెన్షన్! అనేక ఆలోచనలు-జ్ఞాపకాలు. శారద చావు-బతుకుల విషయాలు నారాయణ లోపలి ఒత్తిడులను తీవ్రం చేస్తున్నాయి. ఆవరించే నిస్సత్తువను దూరం కొట్టుకుంటూ తడబడే నడకతో బస్టాండు బయటకు నడిచాడు- అప్పటికి ఫ్యాక్టరీ పొగగొట్టాల మధ్య అస్తమిస్తున్న సూర్యుడు.

సాధారణంగా ఎప్పుడూ బురబురలాడుతూ ప్రయా ణీకుల పైపైకి వచ్చే ఆటోరిక్షాల జాడే లేదు. దూరంగా రోడ్డు మీద మాత్రం రెండు ఆటోలు ఆగి వున్నాయి. అవి కనిపించనంతగా వాటి చుట్టూ ప్రయాణీకులు ఎగబడ్డారు. నారాయణ మరో పదడుగులు ముందుకు వేశాడు. 'ఆటోలకేమైందీ రోజు- ఒక్క ఆటో లేదు,' అనుకున్నాడు. ప్రయాణీకులంతా ఆటోల సంగతి తెలిసినవాళ్లలాగే ఎవరి దారిన వాళ్లు అడ్డదార్లబడి టౌన్లోకి పోతున్నారు. కాసేపు నారాయణకు ఏం చేయాలో తోచలేదు. ఉదయం నిద్ర లేచింది మొదలు ఇంట్లోను, తను పనిచేసే ఫ్యాక్టరీలోను జరిగిన

అనేక సంఘటనల వల్ల భరించజాలనంత టెన్షన్! ఇట్లా దిక్కుతోచని స్థితికి ఆయన ఉదయం నుంచి ఎన్నిమార్లు గుర య్యాడో తెలియదు. ఈ గొడవలు చాలవని మధ్యాహ్నం శారద ఆత్మహత్యా ప్రయత్నం గురించిన వార్త!

నారాయణకు ఎటూ తోచక నిలబడిపోయాడు. పెనుగాలి దుమారానికి సూచికగా రోడ్డు పై సుడి చుట్టుకు వస్తున్న గాలి. బుర్ర మొద్దుబారిపోయింది. తాను ఎక్కడి నుంచి వస్తున్నాడో ఎక్కడికి పోవాలో క్షణమాత్రం అర్థంకాలేదు. శారద వాళ్ల ఇంటికా? హాస్పిటల్‌కా? ఇల్లెక్కడో తెలి యదు. శారద భర్త నర్సయ్యకు ఈమధ్యనే క్వార్టరు ఇచ్చారట. ఇంతకు పూర్వం ఉన్న కిరాయి షెడ్లు తెలుసు. ఈ క్వార్టరు ఎక్కడుందో తెలియదు. తనకు మధ్యాహ్నం ఫోన్ చేసిన సురేశ్ గాభరాలో తను ఎక్కడికి రావాలో చెప్పలేదు. అంతకంటే గాబరాలో తను అడగలేదు.

'చావు బతుకుల మధ్య ఉందన్నాడు. అంటే హాస్పిటల్లోనే అయిుండాలి!' అనుకున్నాడు నారాయణ.

పరుగెడుతున్నట్టుగా ఎటువాళ్లు అటు పోతున్న మందికేసి చూస్తుండిపోయిండు. ఎవరినో పోతున్నాయన్ను ఆపి, ''ఆటోలు నడుస్తలెవ్వా?'' అని అడిగిండు. ఆయన మారు మాటాడకుండానే పోయిండు. అంతా ఎవరో తరుముతున్నట్టుగా చెల్లాచెదురు అయిపోతున్నట్లుగా ఉంది. ఏదో ముంచుకు రాబోతోంది అన్నట్టుగా, ఆ ముంచుకు వచ్చే దాంట్లోంచి తప్పుకోవడం ఎలాగో తెలిసిన వాళ్లలాగ ఎటు వాళ్లు అటు సరసరా పోతున్నారు. మనుషులే కాదు మెయిన్‌రోడ్డు మీద వాహనాలు అదే హడావిడిగా పోతున్నవి. రోడ్డు పక్క క్రిస్టియన్ స్మశానంలో ఎవరో నింపాదిగా శవాన్ని పూడ్చి పెడుతున్నారు. రక్తసిక్త రణరంగ భూమిలా ధూళిధూసరితమై పశ్చిమాకాశం... ఆ పొద్దుగూకే వేళలో పోలీసు జీపు ఒకటి మైకు పట్టుకొని వస్తోంది. 'పట్టణంలో 144 సెక్షన్ విధిస్తున్నట్టూ... మనుషులు గుమికూడరాదని,' వగైరా వగైరా పోలీసు స్పీడుతో అథార్టీతో ప్రకటిస్తున్నారు. ఆ జీపును చూసి, దాని వేగాన్ని చూసి బెదిరిపోయారు. చుట్టూ మూగి వున్న ప్రయాణీకుల్లోంచి ఒక ఆటో డ్రైవరు ఆటోరిక్షాని దూరం పరుగెత్తించి రోడ్డు పక్కన ఆపాడు. గాలి రోడ్డుపైని బొగ్గు దుమ్మును ఎత్తి పోస్తోంది.

క్షణకాలం నారాయణకు శారద చావుబతుకుల విషయం మరుపుకొచ్చింది. 'పోలీసులూ- ఈ హడావుడి- ఏమైనా జరిగిందా? ఎవరైనా...?' నారాయణ మనసులోని ఆందోళన మరింత తీవ్రమైంది.

దూరంగా పారిపోయి ఆగిన ఆటోరిక్షాను నారాయణ పరుగెత్తుకుపోయి, ''ఏరియా హాస్పిటల్‌కు వస్తావా?'' అంటూ కూర్చున్నాడు. ఆటోవాలా ''ఎంగేజా,'' అంటూనే ఆటోని పరుగెత్తిం చాడు. ప్రపంచబ్యాంకు రుణంతో వేసిన ఆ రోడ్డు మీద ఎదురుగా ఒక పచ్చలారీ సిమెంటు ఫ్యాక్టరీకి బొగ్గులోడుతో ఆఘమేఘాల మీద వస్తున్నట్టుగా వస్తూ ఆటో పక్క నించి దూసుకుపోయింది. దానికితోడు సుడి చుట్టుకు వస్తున్న గాలి.

''గాడిదకొడుకులు ఆగుతలేరు,'' లోపలి కోపమో బయటి కోపమో తెలియనివ్వకుండా ఆటో డ్రైవర్.

''ఆటోలు ఎందుకు నడుస్తలెవ్వయ్యా?'' తన లోపలి ఆందోళనని అణుచుకోజూస్తూ నారాయణ అడిగిండు. ఆటో డ్రైవర్ అసహనంగా కదిలిండు. ఇక్కడెవరూ ఏదీ చెప్పరు. ఒకవేళ చెప్పినా అంతా ఉల్టానే- సీదా ఎవరూ చెప్పరు. అట్లా అలవాటు కావాల్సి వచ్చింది. నిట్టూర్చాడు

నారాయణ.

ఆటోడ్రైవరు ఏమనుకున్నాడో ఏమో నారాయణ గొంతులోని ఆర్తికి కరిగినట్టుంది. "బంద్-ఇయ్యాల," అన్నాడు. "తల్లీకూతుళ్లిద్దరూ ఆత్మహత్య చేసుకున్నరు," అన్నాడు తిరిగి తనే!

"ఆత్మహత్యలా?" నారాయణ.

"ఔ! పోలీసు స్టేషండ్ల నుంచి ఇంటికి పోయినంక- వెంటనే."

నారాయణకు విషయమేదో చూచాయగా అర్థమైనట్టుంది. మరేమీ అడగలేదు. అతనేమీ చెప్పలేదు.

ఆటో బొగ్గుగనుల జనరల్ మేనేజర్ కార్యాలయం దాటింది. దారిలో అక్కడక్కడ కూడలుల మధ్య పోలీసు పికెట్లు ఏర్పాటుచేశారు. కార్మికులు కొందరు హడావిడిగా ఇండ్ల వైపు వస్తున్నారు. కొందరు నింపాదిగా బజారుకు పోతున్నారు. గాలి పిచ్చిపట్టినట్టు దుమ్మెత్తి పోస్తోంది. భీతి గొలిపే సైరన్‌కూత గాలిలో సుడులు తిరుగుతూ ఏదో గని మీద నుంచి. నారాయణ మనసులో మళ్లా శారద మెదిలింది. పదేండ్లో ఆపైన్నో! అనేకమార్లు ఆమె చేతి వంటలు భోంచేశాడు., తను- తనతో పాటు మిత్రులు. విసుగు పడకుండా దివారాత్రులు వండి వేళకు వడ్డించేది. తామంతా పగలూ రాత్రులూ లోపల సమావేశాలు జరుపుకొంటుంటే ఇంటి బయట కావలాగా ఉండేది. ఎన్నడూ తమకు ఏ ఇబ్బంది కలుగనీయలేదు. తనకు ఈ ఇబ్బందులున్నాయని చెప్పుకోనూ లేదు. కాని లోపల జరిగే ఆ చర్చలన్నిట్లో తనూ లీనమయ్యేది- ఆ చర్చల సారాంశంతో తనకు మమేకత్వం ఉన్నట్టుగానే ప్రవర్తించేది.

"బాబూ కొంచెం తొందరగ పోనియ్యవా?" నారాయణ గొంతులోని ఆందోళనని చూసి ఏమనుకున్నాడో- ఆటో వేగాన్ని పెంచిండు.

బజారులో మంది పలుచ పలుచగున్నారు. బంద్ వల్ల మూసేసిన దుకాణాల ముందు కొందరు కార్మికులు ధిక్కార చూపులతో అటూ ఇటూ తిరుగుతున్నారు. చౌరస్తాలో పోలీసులు రణరంగంలోలా మోహరించి వున్నారు. బొగ్గుగనుల కాలరీపై క్రమక్రమంగా చీకటి అలుము కుంటోంది. గాలి దుమ్ముకు తోడుగా అన్నట్టు...

నారాయణ, మనసులోని శారద చావుబతుకుల భావనలాగే బయట మిణుకుమిణుకు మంటూ కరంటు బుగ్గలు వెలుగసాగాయి.

హాస్పిటల్ ముందు ఆటో ఆగింది. రోడ్డుపై పోలీసు సంచారం హెచ్చుగా ఉంది. రోడ్డుకు ఎడమవైపు రామాలయం ఆవరణలో వేసిన పందిళ్ల కింద పెద్ద సింహాసనంలో కూర్చున్నారెవరో 'స్వాములవారు'. పెద్ద పెద్ద కరంటు బుగ్గలు. పట్టుచీరలతో చాలామంది ఆడవాళ్లు- పట్టుచీరలతో పాటు పందిళ్లూ గాలికి అటూ ఇటూ ఊగుతున్నవి.

ఆటోవాలాకి డబ్బులిచ్చి హాస్పిటల్ ఆవరణలోకి నడిచాడు. ఎడమవైపు శవాల గది ముందు కొంతమంది గుమిగూడారు. ఎవరో స్త్రీ పేగులు తెగిపోతుండగా శోకిస్తోంది. మరొకామె దుఃఖా వేశంలో పోలీసులను తిడుతోంది. మరెవ్వరో మొగమనిషి ఆమెను ఊకుంచే ప్రయత్నం చేస్తున్నాడు.

ఆ దృశ్యం చూసి నారాయణ ఒక్కసారిగా కుంగిపోయాడు. 'అంతా ముగిసిపోయిందా' అనుకుంటూ పరుగులాంటి నడకతో అటుపోబోయాడు. ఎవరో చప్పట్లు చరుస్తూ, 'నారన్నా,' అని పిలిచారు. నారాయణ ఆగి వెనక్కు చూశాడు. హాస్పిటల్ ద్వారంలోంచి బయటకు వస్తూ

సురేశ్. శారద ఇంట్లోనే పరిచయం అయిన సురేశ్. గనుల్లో టెక్నిషియన్‌గా పనిచేస్తున్నాడు.

గనుల వైపు నుంచి అంబులెన్స్ ఒకటి వేగంగా వచ్చి హాస్పిటల్ ఆవరణలో ఆగింది. ఏదో గనిలో గాయపడ్డ కార్మికున్ని చేతులపై పట్టుకుని హఱ్రిబఱ్రిగా లోపలికి తీసుకుపోతున్నారు కొందరు కార్మికులు.

"ఏమైంది?" సురేశ్ భుజం చుట్టూ చేయి వేస్తూ నారాయణ.

"ఈ రాత్రి గడిస్తేగాని ఏమీ చెప్పలేమంటున్నారు డాక్టర్సు," పాలిపోయిన మొఖంతో సురేశ్. నారాయణ కొద్దిగా స్థిమితపడ్డాడు.

"మధ్యాహ్నం నీ ఫోన్ అందేసరికి అక్కడ మా ఫ్యాక్టరీలో పెద్ద అల్లకల్లోలం జరుగుతోంది. నిన్న రాత్రి పర్సనల్ మేనేజర్ని ఎవరో హత్య చేశారు. పోలీసులు-జాగిలాలు- విచారణలు-అరెస్టులు. ఆ గొడవల్లోంచి బయటపడి వచ్చేసరికి ఇదిగో ఈ సమయం అయింది," తను ఆలస్యంగా రావడానికి గల కారణాన్ని చెప్పేడు నారాయణ.

"మధ్యాహ్నం నుంచి నీకోసం నాలుగైదుసార్లు బయటకొచ్చి చూస్తున్న!" హాస్పిటల్ లోపలికి దారితీస్తూ సురేశ్.

నడుస్తున్న నారాయణ ఆగి వెనక్కు తిరిగి మార్చురి గదివైపు చూయిస్తూ, "మరి అక్కడే మైంది- నేను పరేశాన్ అయిన," అన్నాడు.

డెట్టాలూ- మందుల కలగలుపు వాసన వేస్తోన్న పొడవైన హాస్పిటల్ వరండాలోంచి లోపలికి నడుస్తుంటే ఆ గుమిగూడిన మంది గురించి సురేశ్ చెబుతున్నాడు.

"ఒక్క గొడవని కాదు! ఈరోజు అంతా సుడిగాలి పోతున్నట్టుగానే ఒక కార్మికుని కొడుకు- మాదిగ- ఒక మాలోల్ల పిల్లా ప్రేమించుకున్నారు. మొన్న ఆ పిల్లా పిలగాడు ఎటో పారిపోయింఁడు. పిల్ల తండ్రి పోలీసు రిపోర్టు చేసిండు. అతడూ గని కార్మికుడే. పిలగాని తండ్రి గని ప్రమాదంలో చనిపోయిండు.

"పిలగాని ఇంట్ల తల్లి, చెల్లి ఇద్దరుంటారు. పోలీసులు వాళ్లిద్దరిని పట్టుకొచ్చి లోపలే సింఁడు. లోపల ఏం జరిగిందో తెలవది. దళిత సంఘం వాళ్లు- ట్రేడ్ యూనియన్ నాయకులు అందరు కలిసి ఒత్తిడి తీసుకు వస్తే తల్లీబిడ్డను ఒదిలేసింఁడు. మరి ఏం అన్పించిందో తెలువది. తెల్లారేసరికి తల్లీబిడ్డలు ఉరేసుకున్నరు. ఊపిర్లున్నాయని రాత్రే హాస్పిటల్‌కు వేసుకొచ్చింఁడట. ఎప్పుడో ప్రాణాలు పోయినయని డాక్టర్లు చెప్పింఁడు. వాళ్ల ఆత్మహత్యలకు పోలీసు ప్రవర్తనే కారణమని దళితులను అడుగడుగునా అగ్రవర్ణ అహంకారంతో అవమానిస్తున్నడు సర్కిలని, దళిత నాయకులు- 'వాళ్ల ఆటలు సాగనందుకే నాపై ఈ దుష్ప్రచారం' సర్కిల్- పొద్దుట్నుంచి టౌన్ అట్టుడికినట్టు ఉడుకు తోంది. శవ పరీక్షలు చెయ్యాలని, పోలీసులను శిక్షించాలని మృతుల కుటుంబానికి నష్టపరిహార మని అంతదాకా శవాలను కదులనిచ్చేది లేదని- అధికార గణమంతా చేరుకుంటున్నారిక్కడికి. అసలు ఈ దళిత సంఘాల వెనుక తీవ్రవాదులున్నారని పోలీసులు- రేపు గద్దర్ రాబోతున్నడట! ఈ బందోబస్తు అంతా ఇందు గురించే!" సురేశ్.

"గద్దరా?" అన్నడు నారాయణ. అందాకా చెప్పిన విషయాలు నారాయణ సరిగా విననే లేదు. ఎమర్జన్సీ వార్డు సమీపిస్తున్నకొద్దీ నారాయణకు ఏదో కమ్మివేస్తోంది.

ఎమర్జన్సీ వార్డు ముందు- వరండా పిట్టగోడలపై చాలామంది నిలుచుని, కూర్చుని వున్నారు. డాక్టర్సు, నర్సులు, వార్డ్‌బాయ్‌లు ఆదరాబాదరాగ అటు ఇటూ తిరుగుతున్నారు. ఆ మందిలో చాలామందిని నారాయణ ఎరుగును. వారంతా శారద కుటుంబానికి తెలిసినవారు,

పక్కిండ్లవారు, బంధువులు- విషణ్ణ వదనాలతో కనిపిస్తున్నారు. సురేశ్‌తో బాటు వస్తున్న నారాయణను కొందరు గుర్తించారు. చాలామంది కార్మికులు వారి భార్యలు, లోపలికి వెళ్లడానికి దారి ఇచ్చారు. అద్దాల తలుపు తీసుకుని లోపలికిపోయారు.

నారాయణ తనని తాను అదుపులో పెట్టుకొన ప్రయత్నిస్తూ శారద శవంలాగా పడుకున్న బెడ్డును సమీపించాడు. అతికష్టం మీద సాగే ఉచ్ఛ్వాస నిశ్వాసలు తప్ప మనిషిలో ఏ చలనం లేదు. స్వార్థం కనిపించని పల్లెటూరు నవ్వు మొఖం జీవకళారహితమై- ఒకప్పుడు ఎంత దృఢంగా ఆరోగ్యంగా ఉండేది. నారాయణ కళ్లలో నీళ్లు తిరిగాయి. ఒక్కక్షణం కాళ్లు పట్టు తప్పిపోతాయని పించింది. స్వకీయమైన తన లోపలి దుఃఖానికి మరేదో తోడైనట్టుంది. సురేశ్ భుజంపై చేయి ఆనించాడు. కళ్లు బైర్లుకమ్మాయి.

"పొద్దటి నుంచి కడుపుల ఉన్నదంతా వాంతి అయేలా చాలా ప్రయత్నం చేశారు. నిద్ర మాత్రలు చాలా పెద్ద మొత్తంలోనే వేసుకున్నదని- ఆలస్యం జరిగిపోయిందని డాక్టర్సు అంటు న్నారు," సురేశ్.

నారాయణ కన్నీళ్లు బుగ్గలపై జారాయి. శారద నుదురుపై చేయివేసి స్పృశించాలను కున్నాడు. చేయి ముందుకు కదలలేదు. మించిపోయింది. నిష్ప్రయోజనం అనుకున్నాడు. ఒక తీవ్రమైన అశక్తతేదో నారాయణని చుట్టుముట్టింది.

మొదట్నుంచీ శారద కేసును శ్రద్ధగా చూస్తున్న డాక్టరమ్మ ఒకామె దుఃఖంతో జేవురించిన ముఖంతో శారద నాడి పరీక్ష చేస్తోంది. పక్కనే వంగిన నర్సు ఒకామె, "శారద ఎప్పుడు హాస్పిటల్‌కు వచ్చినా వట్టి చేతులతో రాకపోయేది. బాగున్నప్పుడు మల్లెపూలు దండ తెచ్చి మాకు మనిషికింత తెంపి ఇచ్చేది," అంటోంది.

"ఆ యమ్మ హాస్పిటల్‌కు వచ్చిందంటె మన ఆత్మబంధువు వచ్చినట్టుండేది," వైజాగ్ నుంచి బతుకుతెరువు కోసం వచ్చి హాస్పిటల్లో స్వీపర్‌గా స్థిరపడ్డ ఒకామె అంటోంది. ఆమె శారద వాంతి చేసుకున్న ద్రవాన్ని బేసిన్లో బయటకు తీసుకుపోతూ- ఆమె పేరు మరిడమ్మ.

భర్తతో గొడవలు పడిపడి- వేగలేక కోర్టులో విడాకులు పుచ్చుకుని ప్రస్తుతం ఒంటరిగా వుంటున్న నర్సు ఒకామె మాత్రం ఇవన్నీ ఇదివరకే అనుభవించి బయటపడ్డదానిలా మౌనంగా కేస్ షీట్లో రీడింగ్స్ రాస్తోంది.

"ఈయమ్మ! ఇట్లెందుకు చేసిందో తెలువది," తిరిగి లోపలికిపోతూ స్వీపర్ మరిడమ్మ. ఎట్లా అర్థం చేసుకోవాలో ఆమెకు తెలియలేదు.

స్వీపర్ మరిడెమ్మ వేసుకున్నట్టుగానే నారాయణ తన మనసులో ఆరోజు మధ్యాహ్నం నుంచి పదేపదే వేసుకున్న ప్రశ్న- ఇట్లెందుకు జరిగింది?

సూపరింటెండెంట్ వస్తున్నట్టుగా- అందర్నీ బయటకు వెళ్లాల్సిందిగా ధుమధుమలాడే నర్సు ఒకామె లోపలికి వస్తూనే విసుగ్గా చెప్పి అందరి మీదా చిరాకు పడింది.

మామూలు ఎత్తు- లావుగా వున్న హాస్పిటల్ సూపరింటెండెంట్ ఒక కాలు కుంటుతూ లోపలికి వచ్చింది. ఆమెతోబాటు ఒక పలుచని ఫిజీషియన్- సాధారణంగా హాస్పిటల్లో ఊపిరి సలుపని పని ఒత్తిడి వుంటుంది. ఎక్కడెక్కడి నుంచో రూపొందే అసంతృప్తులన్నీ సాధారణంగా హాస్పిటల్ వద్ద హింసాత్మకంగా వ్యక్తమవుతుంటాయి. వైద్యం సరిగా చెయ్యడం లేదని చేసేది సకాలంలో చేయడం లేదని, మందుల కోసమనీ, అంబులెన్స్ సౌకర్యం కోసమని, గనులపై

నుంచి వచ్చే ఎడతెరిపిలేని ఆక్సిడెంట్ కేసులు- అటువంటి ఉద్రిక్త సమయాలు ఒకోసారి హాస్పిటల్ అద్దాలు పగులగొట్టడం- డాక్టర్లపై చేయి చేసుకోవడంగా ముగియడం- డాక్టర్లు సమ్మెలోకి దిగడం- వారిని ఒప్పించడం- యాజమాన్యంతో వేగడం- ఇవన్నీ రోజూ సూపరింటెండెంటుకు మామూలు విషయాలు. ఆరోజు మరీ! ఒకవైపు మార్చురీలో తల్లీకూతుళ్ల శవాలు- వాటిని తియ్య నియ్యకుండా గొడవ- అధికార్ల విచారణలు- ఆక్సిడెంటు కేసులు- రోజువారీ ఒత్తిడులకు తోడు ఈ అదనపు ఒత్తిడుల మధ్య ఆ రాత్రి నుంచి ఆమె శారద బెడ్డు వద్దకు చాలాసార్లే వచ్చి పోయింది. అన్నిటికీ అలవాటుపడ్డ దానిలా పైకి కనిపిస్తున్నా ఆమెలో లోపలేదో అలజడి రేగుతున్నట్లే ఉంది.

సురేశ్, నారాయణ బయటకు కదిలారు. వరండాలో ఒక బెంచీ పై శారద భర్త నర్సయ్య కూర్చున్నాడు. ఈ పరిణామం ఎరిగున్న వాడి వలెనే నారాయణకు తోచాడు- ఆ మందిలోంచి నారాయణను చూసిన నర్సయ్య కళ్లలో అప్రయత్నపు అయిష్టతేదో పాకినట్టు అన్పించింది. నారాయణ కూడా నర్సయ్య వైపు కదలలేదు. ఈ దూరం ఎప్పట్నుంచి...

నర్సయ్య ఇటీవల 'ఓవర్‌మ్యాన్' ప్రమోషన్ పొందాడు. అధికారి కావడం వల్లా, మరి కొంత అభిమానంతోనూ చాలామంది కార్మికులు వచ్చారు. ఆయన చుట్టూ చేరి వున్నారు. బయటి పెనుగాలుల జోరుకు దుమ్ము ధూళి ఎండుటాకులు లోపలిదాకా వచ్చి పడుతున్నవి.

"పొద్దుటి నుంచి మేనేజరు మూడుసార్లు అచ్చిపోయిండట హాస్పిటల్‌కు- ట్రీట్ మెంటుల లోపం జరుగకూడదని. డాక్టర్లు అందరు తెలుసునట," ఎవరో కార్మికుడు మరో కార్మికునితో.

"రాడు మరి! ఎవరైనా మంచి మనిషిని ఇడిసిపెడుతారా? నర్సయ్య సారుకు ట్రాన్స్‌ఫరైతే- 'ఈనె నా బాయికే (గనికి) ఉండాల్నె'ని మన మేనేజరు, జనరల్ మేనేజరుతోని మాట్లాడి వుంచుకున్నడు. నర్సయ్య సారు వర్కర్లను మంచిగ మేనేజ్ చేస్తడని. ఇగ గిసొంటప్పుడు చూసుకోరు," ఎవరో బడబడ అంటున్నారు. నర్సయ్య దయకు పాత్రుడైన కార్మికుడు.

సురేశ్, నారాయణను ఆ గుంపును దాటించి ముందుకు తీసుకుపోయిండు. కార్మి కులు చాలామంది చుట్టూ మూగారు. నర్సయ్యతోబాటు పనిచేసే ఇద్దరు లావాటి ఓవర్‌మ్యాన్లు నర్సయ్యకు ఇరువైపులా కూర్చున్నారు. మంది అనుకుంటున్నవాటికి, అనుకోకుండా మనసులోనే సందేహిస్తూ వుంచుకుంటున్న ప్రశ్నలకు అన్నిటికి కలగలిపి చెబుతున్నాడా అన్నట్టు నర్సయ్య ఆ మంది నుద్దేశించి మాట్లాడుతున్నడు. అచ్చం ఆయన వర్కర్లని డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నప్పటిలాగే. కార్మికులు బహు శ్రద్ధగా నర్సయ్య చెప్పే విషయాలు వింటున్నారు. గత రెండు నెల్లుగా అందరికి చెప్పిచెప్పి ఉండటం వల్ల కాబోలు ఆయనట్లా ధారాళంగా మాట్లాడ గలుగుతున్నాడు.

గత కొంతకాలంగా శారద మానసిక పరిస్థితి ఎట్లా మారుతూ వచ్చిందో- ఏమేమి అసంబద్ధ చేష్టలు చేసిందో తానెన్ని హాస్పిటల్ల చుట్టు తిరిగిండో- ఎన్ని రకాల డాక్టర్లకు చూయించిండో- ఎన్ని వేలు ఖర్చు అయాయో? అందుకు దాఖలాగా డాక్టర్లు రిపోర్టులు- వారు రాసిన మందుల కాయితాల పెద్ద కట్టనొకదాన్ని లేచి నిలబడి ప్యాంటు జేబులోంచి తీసి చూపిస్తున్నాడు. ఈ కాయితాలకు సాక్ష్యమా అన్నట్టుగా నర్సయ్య మామ- శారద తండ్రి ఎద్దులాగ కన్నీరు వడుపుతూ అక్కడే నర్సయ్య చెంత తలాడిస్తూ దుఃఖంతో కూర్చున్నాడు. ఎవరో ఆ కాయితాల కట్టని ఆ మసక వెలుగులో అటు తిప్పి ఇటు తిప్పి ధృవీకరించుకున్నట్లుగా తలూపి చూసి మరొకరికి

ఇచ్చాడు- గాలికి కరెంటు పోయినట్టుంది. ఎమర్జెన్సీ ల్యాంపులు వెలిగించారు.

తన భార్యను రక్షించుకోవడానికి తను పడ్డ పాట్లన్ని చెబుతూ ఆమె మంచితనం గురించీ, ఆమె ఇరువై సంవత్సరాలుగా తనతో చేసిన అన్యోన్య కాపురం గురించీ ఒక్కొక్కటిగా వర్ణించి చెబుతుంటే నర్సయ్య దుఃఖమంతా ఇదివరకే అయిపోయిందా! అనుకున్నాడు నారాయణ. గుంపు లోపలిదాకా పోదామని అప్రయత్నంగానే కదిలాడు. కాని కార్మికులెవ్వరూ కదలలేదు. తాను నర్సయ్య దగ్గరిదాకా పోవాల్సింది ఇంకా వుందా అన్పించింది. గురగులాడే గొంతులతో ఓదారు స్తున్నారు కొందరు. నర్సయ్య పై సానుభూతి చూపిస్తున్నారు మరికొందరు. అట్ల రంధి పడకూడ దంటూ కొందరు అధికార కంఠస్వరాలతో దమాయిస్తున్నారు.

నారాయణ గుంపుకు బయటే నిలబడిపోయాడు. తనకు చిరపరిచితమైన గొంతు. ఆ గొంతు ఏమైనా మారిందా! నర్సయ్యకు కొంచెం బొర్ర దిగినట్టుంది. పూర్వం గని పనికి తోడుగా అత్తవారింటికి పోయినప్పుడల్లా అక్కడ వ్యవసాయపు పనులు చేసేవాడు. మనిషి దృఢంగా ఉండేవాడు. ఇప్పుడు మనిషి బాగా ఒళ్లు చేసిండు. స్వరంలో కూడా ఏదో మార్పు వచ్చింది. పదిహేను సంవత్సరాలకు పైగా నర్సయ్య తనకు తెలుసు. తన మిత్రుడు, సహచరుడు. సమ్మెలు- అరెస్టులు-చిత్రహింసలు-కాల్పులు మధ్య సాగిన కార్మికోద్యమ నిర్మాణంలో నర్సయ్య పాత్ర తక్కువదేమీ కాదు.

హాస్పిటల్లోని రోగులను చూడటానికి వారికి పాలు పండ్లు ఇవ్వడానికి రోగుల సంబం ధీకులు- బయటి గాలిదుమారంలాగే తోసుకు వస్తున్నారు. ఆపలేని వాచ్‌మన్ చేతులెత్తేసిండు. సుమారు పదిహేను సంవత్సరాల క్రితం తానొకరోజు నర్సయ్య ఇంటికి మొదటిమారుగా రావాల్సి వచ్చింది. అది తప్పనిసరి పోవాల్సిన పిలుపు. కార్మికులు స్వయంగా వేసుకున్న గుడిసె ప్రాంతంలో ఒక రేకుల షెడ్డు ముందు ఇద్దరు పిల్లలకు తిండి తినిపిస్తున్న ఒకావిడ తనను సాదరపూర్వకంగా ఆహ్వానం వంటిదా ఆదరణ. నవ్వు మొఖంతో సాధారణంగా పల్లెటూరు వారి కుండే మంచి ఆరోగ్యంతో. అది మొదటిమారు తను శారదను చూడటం. చామనచాయ- మామూలు ఎత్తు.

ఆ రాత్రంతా లోపలి గదిలో కార్మికోద్యమ స్థితిగతుల గురించి చర్చలు సాగుతూనే వున్నాయి. ముందు గదిలో ఆమె కాపలా. వేళకు భోజనం- రుచికరమైన కూరలు- మధ్య మధ్య చాయ్‌లు- అన్నీ సమయానికి మనకు ఏది ఎప్పుడు కావాలో అప్పుడు- శ్రద్ధగా అమర్చి పెట్టింది. శుచికి, శుభ్రతకూ నిదర్శనంగా కన్పించే ఆ చిన్న గదులు- అవన్నీ అప్పుడే గమనించాడు నారాయణ. అది మొదలు నారాయణ ఆ ఇంటికి పోవడం- శారద నవ్వుమొఖంతో తప్ప తామె వరితో ఏనాడూ అధికంగా మాట్లాడలేదు. వేళకు అన్నీ అమర్చడం- ఇంటిపనులు- పిల్లల సంరక్షణ- ఇంటి చుట్టూ వున్న చేరెడు నేలను వృధా పోనీయకుండా కూరగాయ మొక్కలో, పూలమొక్కలో వేసేది. వాటి పోషణలో గడిపేది. ఆ మొక్కలను ప్రశంసించినప్పుడెల్లా శారద ముఖం వెలిగేది. పగలు కుట్టుపని కూడా చేసేది. నర్సయ్యకూ శారదకూ ఏ గొడవలూ లేని కాపురం. తనకు నర్సయ్య చాలా సన్నిహితం అప్పుడు. అయితే అదిప్పుడు గతమే అయింది.

నర్సయ్య అప్పటికి గనిలో బదిలి ఫిల్లర్ (నెత్తి పై బొగ్గు మోసే పని). అతనిది కరీంనగర్ దగ్గర్లోని ఒక గ్రామం. కొద్దిగా భూమి ఉండేది. తండ్రి తాగుబోతు కిందే లెక్క. వ్యవసాయం దిగనాసిల్లసాగింది. నర్సయ్య పట్టుదలగా చదువు కొనసాగిస్తున్న రోజులు. బియ్యే మధ్యలో వుండగానే శారద పెళ్లి సంబంధం వచ్చింది. ఇల్లరికం రమ్మని- నర్సయ్య బాగా ఆలోచించాడు-

ఇక్కడ అయిదుగురు తమ్ములు- పంచుకుంటే మనిషికి అరెకరం రాదు- అక్కడికి పోతే కనీసం ఆరెకరాలు మంచి భూమి- కాని అక్కడికి పోతే అక్కడ ఆరుగురు ఆడపిల్లల కుటుంబం- తను పోవాల్సిందో మూడో అమ్మాయికి భర్తగా- పెళ్లిళ్లు చేయాల్సిన మరో ముగ్గురు మరదళ్లున్నా- ఇంకా కష్టపడి పనిచేయగల స్థితిలో వున్న అత్తామామలు- ఎంతైనా తను వున్న స్థితి కంటె మెరుగైన స్థితే అనుకున్నాడు నర్సయ్య. 'ఇల్లరికమా' అని చాలామంది హీనంగా మాట్లాడబోయినా- పోవడానికే నిర్ణయించుకున్నాడు. అత్తవారింట్లో రెండు సంవత్సరాలు బాగానే వ్యవసాయం చేసిండు నర్సయ్య. ఆరుగాలం కష్టపడే అత్తమామలు- భార్య శారద- ముగ్గురు మరదల్లే కాదు మరికొందరు కూలీలు- మొత్తం మీద భవిష్యత్తు బాగానే వుంటుందని నర్సయ్య అనుకుంటున్న రోజుల్లోనే బొగ్గు గనుల్లోకి కేజువల్ వర్కర్‌గా రమ్మని పిలుపు వచ్చింది. మరో ఇరవై సంవత్సరాల దాకా అత్తమామలు వ్యవసాయం చెయ్యగలరనీ, తను గని పనికి పోవడం మరింత వ్యవసాయానికి కలిసి రాగలదనీ, ఆలోచించి- 'బాగనిపిస్తే చేస్త, లేకుంటే వాపసు వస్త,' అని చెప్పి బొగ్గు గనుల్లోకి వచ్చి చేరాడు. ఇప్పుడున్నట్టు అప్పుడు ఉద్యోగ నియామకాల్లో లంచాలు లేవు. ఇంతగా, కాలక్రమంలో గ్రామాల మీది నిర్బంధపు నీలినీడలు బొగ్గుగనుల మీదికి పాకుతున్న కాలం. అందులో భాగంగానే కొత్త డైరెక్టరొకాయన- నీతి నిజాయితీలకు మారుపేరని- వచ్చాడు. వెనుక పోలీసులతోబాటే గనుల మీద విస్తృతంగా తిరిగాడు. ఇందాకా అట్లా ఎవరూ నేరుగా కార్మికుల మధ్యకు దూసుకురాలేదు. అప్పడదో వింత. 'నేనడిగిన ఉత్పత్తిని తీసి నాకివ్వండి, మీరు కోరిన కోరికలు నెరవేరుస్తాను నేను,' అంటూ మాట్లాడాడు. సమ్మెలు జరుగకుండా యూనియన్లతో ఒప్పందం చేసుకున్నాడు. క్రమక్రమంగా మరో రెండేళ్లలో- యాజమాన్యం, యూనియన్లు, పోలీసులు కలిసి ముప్పేటదాడిగా కార్మికులను పిడికిట్లో బిగించుకు వచ్చినట్టు మూసుకు వచ్చారు. ఆ అణచివేతలోంచి, దానివల్ల కలిగిన డిప్రెషన్‌లోంచి బయటపడేందు కోసం ఉత్పత్తి తీసిపడేశారు కార్మికులు. అదో అద్భుతం. కోరిన కోరికలు తీర్చలేదు యాజమాన్యం- ఫలితంగా గనుల మీదే ఎన్‌కౌంటర్లు సాగాయి. పత్రికలవాళ్లు, పౌరహక్కులవాళు ్ల అవి బూటకమన్నారు. అదిగో అటువంటి ఉక్కు పిడికిలిని బద్దలు కొట్టిన 'వంగుతట్ట' కార్మికుల 17 రోజుల సమ్మెలో నర్సయ్య కీలకమైన వ్యక్తి. నర్సయ్య తదితరులు అనేక ప్రయత్నాలు సాగించిన మీదట హైద్రాబాద్ నుంచి బుర్ర మీసాల సోషలిస్టు ఎమ్మెల్యే ఒకాయన వచ్చాడు. ఏకంగా ఒక కొత్త యూనియన్నే స్థాపించాడు. గనుల మీదే కాదు ఆ ప్రాంతమంతటా నిర్బంధం తాండవిస్తున్న రోజుల్లో ఆయన సోషలిస్టు ఉపన్యాసాలు కార్మికులను ఉత్సాహపరిచాయి. వంగి వీపుల మీద తట్ట మోయాల్సి వస్తున్న అరవైమంది కార్మికులు తాము ఒక్కరమే ఎల్లకాలం వీపుల మీద తట్టలు మోయలేమని రొటేషన్ పద్ధతి పాటించాలని తట్టలూ, షవల్సూ కింద పడేశారు. అది చాలా మామూలు కోరిక. కాని అది తీర్చడానికి కూడా యాజమాన్యం సిద్ధంగా లేదు, అది తీరిస్తే అక్కడితో ఆగదని.

ఆ అరవైమంది కార్మికుల్లో నర్సయ్య ఒకడు, సమ్మెకు కారకులని నర్సయ్యతో పాటు మరో ఇద్దరు కార్మికులను యాజమాన్యం అరెస్టు చేయించింది. దాంతో అనేక అసంతృప్తుల వల్లా ఆ అరవైమంది కార్మికులకు తోడై మొత్తం నలభైవేల మంది సమ్మెలోకి దిగారు. 'తీవ్రవాదుల'ను సపోర్టు చేస్తున్నట్టుగా సాగే సోషలిస్టు ఎమ్మెల్యేల ఉగ్రూతలూగించే ఉపన్యాసాలు- ధర్నాలు- రాస్తారోకోలు- బంద్‌లు అదో పెను సంచలనమే అయింది. ఉత్తర తెలంగాణ యావత్తు ప్రజానీకానికి సంబంధించిన అంశంగా మారింది. ఆ సమ్మె బొగ్గు కొరతనే

అనేక పరిశ్రమలు మూతపడ్డాయి. చివరికి ప్రభుత్వ జోక్యంతో యాజమాన్యం చర్చలకు దిగి వచ్చింది. అధికార్లూ, లేబర్ కమీషనర్లు అందరితోపాటు ఆ సోషలిస్టు ఎమ్మెల్యే కార్మికుల తరపున నర్సయ్యనే ముందుంచుకుని చర్చలు సాగించాడు. ఆ చర్చల్లో నర్సయ్య చొరవ, వాదన చూసి అధికార్లు ఎక్కువ మాట్లాడలేకపోయారు.

ఆ తరువాత కాలంలో నర్సయ్య ఇంటి మీద పోలీసు నిఘా వుందని ఆ ఇంటికి రాకపోకలు తగ్గాయి. సమావేశ స్థలాలు మారాయి. క్రమక్రమంగా నారాయణకు ఆ ఇంటితో సంబంధాలు దూరమయ్యాయి. తనకూ పనులు పెరిగాయి- మారాయి. మరోవైపు తన వ్యక్తిగత జీవితంలోని ఒత్తిడుల మధ్య తన్ను తాను నిలబెట్టుకోవడానికి యమయాతనలు పడాల్సి వచ్చింది. శారద మనసులో మెదిలేది. నర్సయ్య కంటే ఆత్మీయురాలువలె తోచేది. ఎవరో ఆమధ్య కలిసి నర్సయ్య ఓవర్‌మ్యాన్‌గా ప్రమోషన్ పొందాడని చెప్పారు. ఆ మార్పుల స్వభావం ఏమిటో పట్టించుకోలేనంత ఒత్తిడి మధ్య తను... చివరిసారిగా నర్సయ్య ఇంటికి తాను ఎప్పుడు పోయింది గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేసిండు నారాయణ. ఎపుడో అంటించుకున్న సిగరెట్టు వేలికొసలకు అంటుకునేదాకా ఆ సంగతే గుర్తుకు రాలేదు. ఎవరో అంటున్నారు, 'వర్షం వచ్చేటట్టుంది,' అని, మరెవరో 'అకాల వర్షాలు-కాలచక్రం కిందుమీదవుతుంది,' అంటున్నారు.

అట్లా నర్సయ్య గురించి ఆలోచిస్తూ నారాయణ వరండా గోడకు ఎప్పుడు చేరగిలబడ్డాడో- ఎప్పుడు సిగరెట్టు అంటించుకున్నాడో- అది పూర్తిగాక కాలేదాకా మనిషి మన ధ్యాసలోనే లేనట్టు వుండిపోయాడు. సురేశ్ ఎవరితోనో ఆందోళన నిండిన స్వరంతో మాట్లాడుతున్నాడు- రోగులను చూడ్డానికి వచ్చిన కొందరు శారద బెడ్డుదాకా పోయి చూసి వస్తున్నారు. వాళ్లలో వాళ్లు మాట్లాడు కుంటున్నారు. ఎట్లా జరిగిందోననే ఆరాలు తీస్తున్నారు. అడిగి తెలుసుకో యత్నిస్తున్నారు.

'భర్త మంచోడేనట! తిట్టింది లేదట- కొట్టింది లేదట,' ఒకామె. 'అట్లాంటోడు కాకపోతే ఈమె ఇట్లెందుకైతది,' మరెవరో సందేహంగ. 'వచ్చినోళ్లందరూ అదేమాట అంటున్నారమ్మా! భర్తది ఏ తప్పు లేదని- ఆమె అంతకంటె మంచిదని- ఆమె తల్లే చెప్తోంది. మంది చెప్తే నమ్మకపోదు,' భర్తల చేత నరకయాతనలు అనుభవించే స్త్రీలు గత్యంతరం లేక చివరికి ఆత్మహత్యలు చేసుకోవ డాన్ని తమ జీవితకాలమంతా ఎరుగుతూ వస్తున్న విషయం. కాని అది ఎవరికీ పాలుపోని ఆత్మ హత్యా యత్నం. దీన్ని ఎట్లా వ్యాఖ్యానించుకోవాలో అనేకమందికి తోచడం లేదు- భూమి పై గల సమస్త చరాచర ప్రకృతిని లిప్తపాటు కనిపింపజేస్తూ ఫోటో ఫ్లాష్‌లాఎక్కడో బయట మెరుపు.

వరండాలో లైట్లు వెలుగుతూ ఆరిపోతున్నవి గాలి దుమారానికి. వెలుగు-చీకటి కలిసి అతుక్కుపోయినట్లుగానే నారాయణ మనసులో అనేక ఆలోచనలు- అందులోంచి బయట పడ్డం కోసం లేచిపోయి నర్సయ్యను పరామర్శించుదామనుకున్నాడు. అడుగులు ముందుకు పడలేదు. అక్కడకు పోయి ఆయన్తో మాట్లాడేది ఏముందనిపించింది. నర్సయ్య చుట్టూ మరింతమంది కార్మికులు మూగారు. తను నర్సయ్య వద్దకు పోజాలనంత మంది. ఎవరో గనిమీది అధికారులు వచ్చినట్టుంది కాబోలు నర్సయ్య తిరిగి చెప్పడం ఆరంభించాడు. నర్సయ్య గొంతులో ఆ రిలాక్సేషన్ ఎలా వచ్చింది? ఈ స్థితికి సిద్ధపడే వున్నాడా నర్సయ్య. లేకపోతే అంత నిబ్బరం ఎట్లా వుంటుంది? నారాయణ ఎన్నో విధాల ఆలోచించి చూస్తున్నాడు. నర్సయ్య తమందరితో ఎప్పుడు తెగిపోయిండు? ఎందుకిలా జరిగింది?

మందిలోంచి ఎవరో కార్మికుడు గట్టిగా చెబుతున్నాడు. బయట తల్లీకూతుళ్ల శవాల దగ్గర పోలీసుల్ని ఖాతరు చెయ్యకుండా మంది జమ అవుతున్నారని, పోలీసులు అడ్డుకుంటున్నారని, మేనేజర్లు వాళ్లు వస్తుంటే తానందులో చొరబడి లోపలికి రాగలిగానని బయట కాల్పులు జరగొచ్చని పరిస్థితి బాగాలేదని-

శారద కండిషన్ గురించి చర్చించుకుంటూ గని మేనేజరూ హాస్పిటల్ సూపరింటెండెంటు కలిసి ఆఫీసు గదుల వైపు పోతున్నాడు.

'శారద ఆత్మహత్య యత్నం గురించి పోలీసులకు తెలుపడం మంచిదంటున్నదట సూపర్నెంటు,'' అని ఎవరో జీరగొంతుతో అంటున్నారు.

''ఎందుకట,'' మరెవరో ఆందోళనగా.

''ఎందుకంటే ఎవరి జాగ్రత్తలో వాళ్లు,'' మరొకరు.

''బతికేది నమ్మకం లేదా?'' అట్లా అడిగినాయనకు ఎవరూ జవాబు ఇవ్వలేదు. అదేదో నిశ్శబ్దంగా జరిగిపోయే వ్యవహారం సుమా అన్నట్టుగా.

ఎవరో టీ తీసుకొచ్చి నర్సయ్యకిచ్చారు. పెద్ద బలవంతం లేకుండానే ఆయన చేత టీ తాగించగలిగారు.

ధోవతి-కమీజుతో ఇంకా పల్లెటూరు పటేలు మాదిరిగానే కన్పించే బక్క పలుచని యూనియన్ లీడరు రాజిరెడ్డి- 'పోలీసుల వైపు నుంచి వచ్చే ఇబ్బందులు ఏమీ ఉండబోవ'ని భరోసా ఇస్తున్నాడు నర్సయ్య నుద్దేశించి- జరుగుతున్నదానికే కాదు జరగబోయే దానికి కూడా అందరూ సిద్ధపడ్డారా అన్పించింది నారాయణకు. శారద బెడ్డు దగ్గర డాక్టర్ల సందడి ఎక్కువైంది. వాళ్ల ముఖాల్లో ఆఖరుగా సాగించే పళ్లబిగువు ప్రయత్నాలేవో. 'రక్తంలో బాగా విషం కలిసిపోయిందట,' ఎవరో పెదవి విరుస్తూ అంటున్నారు.

వార్డు ముందూ లోపలా చాలామంది కార్మికులు వచ్చి చేరారు. కార్మికులు కొందరు తడిసిన బట్టలతోనూ- చెమట కంపుకొట్టే బూట్లతోనూ వచ్చి చేరారు. గుంపులు గుంపులుగా నిలబడి కొందరు. అటూ ఇటూ నిలబడలేక తిరుగుతున్న మరికొందరు. పైన మేఘాలను కుదురుకోనీయకుండా తరిమివేస్తున్న గాలి.

''గొడ్డలితోని పెండ్లాం నెత్తిని రొండు వక్కలుగా నరికింది చూసిన- మొగుడు తిట్టే తిట్లకు కొట్టే దెబ్బలకు తాళలేక ఏ నుయ్యో గొయ్యో చూసుకున్నోళ్లను చూసిన- కట్నం తెమ్మనో మరోటి తెమ్మనో గ్యాసునూనె పోసి అంటిస్తే సచ్చిపోయినోళ్లను చూసిన- పెండ్లాం, పోరగాండ్లు వుండంగ మొగుడు వేరు కాపురం బెడితే తట్టుకోలేక ఉరి పోసుకున్న ఆడోళ్లను చూసిన- కని ఈ తల్లి ఇట్లెందుకు చేసుకున్నదో నాకు సమజయితలేదు,'' వివరాలు అన్నీ తెలుసుకుని ఎట్లా అర్థం చేసుకోవాలో తెలియని 'ఆయా' ఒకామె పెద్ద గొంతుతో వాపోతోంది. ఆ హాస్పిటల్ కట్టిన పాతికేళ్లుగా అందులో ఆయాగా పనిచేస్తోంది. ఆమె తన సర్వీసులో రోజుకో స్త్రీ హత్య చేయబడటమో లేక ఆత్మహత్యచేసుకోవటమో చూస్తూ వస్తోంది. సాధారణంగా కాపురాల పేర భర్తలు పెట్టే రణ రంగ హింసల మధ్య ఆ స్త్రీల జీవితాలు అట్లా ముగుస్తాయని ఆమె అనుభవం. తాను చూసిన బలవంతపు చావుల్లో శారద ఆత్మహత్యాయత్నాన్ని ఏ తీరున అర్థం చేసుకోవడమో దీనికి బాధ్యులెవ్వరో తెలియటం లేదు.

వార్డులోంచి నారాయణ వద్దకు వచ్చిన సురేశ్, "నమ్మకం తగ్గిపోతోంది. పోలీసు రిపోర్టు పంపాలంటున్నది సూపరెంటెంట్. వాంతి చేసుకున్న ద్రవాన్ని పారబొయ్యవద్దన్నది- నాడి పడిపోతోంది. ఆక్సిజన్ ఎక్కిస్తున్నారు." సురేశ్ మొఖం పూర్తిగా వాలిపోయింది.

నారాయణ లోపల ఏదో కరగసాగింది. అక్కడ్నించి తప్పుకోవడం కోసమా అన్నట్టు అప్రయత్నంగానే వరండాలోంచి బయటకు నడిచాడు. అనేకమంది ఒకే ఒక మానసిక స్థితికి గురైనట్టు ఆ వరండా పొడుగునా, హాస్పిటల్ ముందు కళవళపడుతున్నట్టుగా వున్నారు. శవాల నుంచే గది నుంచి హాస్పిటల్ ప్రధాన ద్వారం దాకా ఎట్లా చేరారోగాని అనేకమంది- చెప్పలేని ఉద్రిక్తతలేవో అందరినీ చుట్టు ముట్టినట్టు అసహనంగా అటు ఇటు కదులుతున్నారు. ఆ మందిలో వివిధ దళిత సంఘాల నాయకులు- ట్రేడ్ యూనియన్ నాయకులూ అటు ఇటు తిరుగుతున్నారు. ఉరుములు మెరుపులతో ఆకాశం తల్లడం మల్లడం అవుతోంది. పెనుగాలి కెరటాలు మబ్బుల్ని నిలవనీయడం లేదు. అక్కడొకామె ఏడ్పు గొంతుతో చెబుతోంది.

"నిన్న రాత్రి పోలీసు స్టేషండ్ల నుంచి తల్లిబిడ్డలను ఇడిపిచ్చుక వచ్చింద్రు. ఇంటిదాక లీడర్లందరు అచ్చి ఇంట్ల దిగబెట్టి మీకేం బయం అక్కరలేదని- పోయిన పిల్లా పిలగాని గురించి కూడా మేం చూసుకుంటమని మీ ఎంబడి మేమున్నామని చెప్పి పోయింద్రు.

"రాత్రి పదిగంటల దాకా ఆ వాడకట్టోళ్లు అందరు వచ్చి చూసిపోయింద్రు. అందరు పోయినంక తల్లిబిడ్డలిద్దరు తలుపేసుకున్నరు. పండుకుంటరు కదాని మేమనుకున్నం. మాకు కూడా కన్నంటుకున్నది. ఎవరో మా ఇంటి తలుపు తడుతాంటె తెలివైంది. మేం లేసి సూత్తె ఆమె అక్కవాళ్లు బెల్లంపల్లిల వుంటరు- ఎంతకూ తలుపు తీసుడులేదట- అనుమానమచ్చి మా ఆయన మరో ఇద్దరు కలిసి తలుపు ఊడబీకి చూస్తే ఏమున్నది ఫ్యానుకు ఊగులాడుతున్నరు. బతుకుతదో ఏమోనని జెపజెప హాస్పిటల్‌కు ఏసుకచ్చినం. కని నడుమనే పానం బోయింది. చూసేది చూసు కుంట వుండంగనే చేతుల్లది చేతుల్లనే పానం బోయింది," ఇంకా ఆ చావుల నీడలు ఆమె కండ్లలో కదులుతున్నట్లుగా కళ్లలో బెదురు.

తల్లి కూతుళ్ల శవాలను తీయించడం కోసం పోలీసులు చేసే ప్రయత్నాలు సాగడం లేదు. నాయకులకూ పోలీసులకూ వాగ్వివాదాలు సాగుతున్నాయి. గాడాంధకారపు గాలి దుమారంలో ఎక్కి వస్తున్న కారుమబ్బులతో పైన భీతి గొలుపుతున్న అనంతాకాశం.

"ముటముటాన మనుషులను మాయం చేస్తున్నరు. మీ వంశాలు నిర్వంశాలైపోతా యిరా," అంటూ పోలీసులపై దుమ్మెత్తిపోయ ప్రయత్నిస్తోంది. ఆ జంట శవాల దగ్గరి బంధువై వుంటుంది. ఆవరణలో ఆకాశంలో కంటా పెరిగిన యూకలిప్టస్ చెఎట్లు ఊగిపోతున్నవి గాలికి.

మూగిన మందిలోంచి నిరసన స్వరాలు తీవ్రమవుతున్నవి. హాస్పిటల్ బయట కార్మికులు పోలీసులను ధిక్కరించీ చేరుతున్నారు. హాస్పిటల్ లోపలికి రాలేనివాళ్లు- ఉండీ ఉండీ నినాదాలు చేస్తున్నారు బయట. "ఆత్మహత్యలన్నీ హత్యలే. పోలీసు జులం నశించాలి," లాంటి నినాదాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. తిట్లు, ధిక్కార చేష్టలు మితిమీరబోతున్నవి. మండల రెవెన్యూ అధికారిని లోపలికి రానివ్వడం లేదట. అటు కొందరు పోలీసులు బయటకు పోయారు.

పత్రికల మధ్య పోటీ వల్లా, వాళ్లలో వాళ్లకుండే అనేక గొడవల వల్లా జర్నలిస్టులు సమా చార సేకరణ కోసం తెలిసిన వాళ్లనల్లా అడుగుతున్నారు. జర్నలిస్టులతో మాట్లాడే సందర్భంలో నాయకుల ఆవేశాలు పెరుగుతున్నవి... తల్లడిల్లుతున్న ఆకాశంలో కత్తి మెరుపులు- ఎక్కడో ఉరుము.

శవపరీక్షలు చేయించాలని, దోషులైన పోలీసులను శిక్షించాలని, చనిపోయినవారికి నష్ట పరిహారం ఇవ్వాలని, ఆ షరతుల మీది నుంచి దిగేది లేదని చెబుతున్న నాయకులు. ధగధగ మెరిసే వాళ్ల చేతి ఉంగరాలు, నలగని వాళ్ల బట్టలు... ఉద్రిక్తత క్రమంగా పెరుగుతోంది.

తన లోపలి ఉద్రిక్తత కంటె బయట మహా ఉద్రిక్తంగా వుందనుకున్నాడు నారాయణ. ఇందులోంచి తప్పుకొని మరెటైనా పోగలనా అన్నట్టు చూశాడు. వీళ్లందరినీ ఒదిలేసి తానెక్కడికి పోగలడు- ఇల్లు- ఫ్యాక్టరీ- అసంబద్ధ కాపురం- ఈ గుడుగుడు గుంచం బతుకులోంచి ఎక్కడా నిలువకుండా తిరిగే మీటింగులు- మందిలోనూ నిలబడలేక, ఒంటరిగా మనలేక- ఎటు పోగలడు తాను...

తను నర్సయ్య కుటుంబంలోకి వచ్చినప్పుడల్లా వారి అన్యోన్య దాంపత్యం చూస్తున్నప్పు డల్లా తనకు తన కాపురం యాదికొచ్చేది. నిత్యం జరిగే సంసారపు గొడవల్లో తనో తన భార్యో చావడమో లేక చంపుకోవడమో జరుగుతుందనుకునేవాడు. కానీ నర్సయ్య కాపురం ఒకపక్క ఒరిగిపోతోంది. 'ఇది అనూహ్యంగా జరిగినట్టు కన్పిస్తున్నా అకారణమైందేనా?' ఎందుకో దుఃఖంతో బాటు తీవ్రమైన కోపం కలిగింది నర్సయ్య మీద నారాయణకు. బయట ఉండలేక నారాయణ తిరిగి హాస్పిటల్ లోపలికి నడిచాడు.

వార్డులో గుమిగూడిన మందిని బయటకు తోలారు నర్సులు. అద్దాల కిటికీల్లోంచి చూస్తుంటే లోపల శారద మంచం చుట్టూ మూగిన డాక్టర్లు. బయట నిలబడ్డ వారందరిలో కట్ట కడపటి దుఃఖోద్విగ్నతలేవో చుట్టుముడుతున్నవి. ఏనాటి నుంచో రూపొందుతున్న ఈ చావు అందరికీ ముందే తెలిసినట్టుంది. అందుకు అందరు సిద్ధపడ్డట్టే కనిపిస్తున్నారు! లేక నర్సయ్య చెప్పి చెప్పి వీళ్లనట్లా సిద్ధం చేశాడా? బంధువులు, స్నేహితులు- అందరు సిద్ధపడ్డట్టుగానే కనిపిస్తు న్నారు. 'బహుశః తనొక్కడే తెలుసుకోలేకపోయాడేమో.' మరుక్షణంలో నేరభావన కలిగింది. తాను ఎవరి చావులను పట్టించుకోలేదు. తన చావుబతుకుల నుంచి తనను తాను నిలబెట్టుకోవడం కోసం- నిలువకుండా మందిలో తిరిగిండు.

లావుగా వున్న పక్కింటావిడ కళ్లు తుడుచుకుంటూ చుట్టూ చేరిన ఆడవాళ్లతో శారద విషయం చెబుతోంది.

"ఈమధ్యనే కొత్తగ వచ్చిండ్రు మా పక్క క్వార్టర్లకు. రాంగనే ఆ అన్నయ్య మమ్ములను పరిచయం చేసుకుని- వదినమ్మ గురించి చెప్పిండు. ఆమె మనసు బాగాలేదనీ, పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తోందని, తాను లేని సమయాలలో కాస్త కనిపెట్టి చూస్తుండమని చెప్పిండు. వారం రోజులు అన్నయ్య డ్యూటీకి కూడా పోలేదు. మా ఆయనతోటే బాయి మీదికి (గని) లీవు రాసి పంపిండు. అక్కడెక్కన్నో పెద్దపల్లి పక్కన మంత్రగాడున్నడంటె నమ్మకం లేకపోయినా ఆడికి కూడా పోయి వచ్చిండ్రు. ఇంకెన్ని రోజులుంటవు ఇంటికాడ- డ్యూటీకి పొమ్మని అనవట్టింది అన్నయ్యను.

"డ్యూటీదేముంది తరువాత చేసుకోవచ్చని నేనన్న- కని రాత్రి అన్నయ్యను బలవంతంగా లేపి తోలిందట డ్యూటీకి. వదినమ్మ తల్లి ఇంట్లనే వున్నది."

"ఎంతకని కనిపెడుతరవ్వా," అని ఒకామె.

"తల్లికి మధ్య రాత్రి తెలివచ్చి సూత్తెమున్నది పిలుస్తె సప్పుడు లేదట. ఆ అమ్మ వెంటనే బయటకచ్చి మమ్ములను లేపింది. మేంబోయి సూత్తెమున్నది నిద్రమాత్రలు బాగా మింగి నట్టున్నది. మనిషి పూర్తిగ మత్తులకు పోయింది. మా ఆయన బయటకురికి ఆటోరిక్ష తెచ్చి

అండ్లేసుకుని అదే రాత్రి హాస్పిటల్ కచ్చినం. ఆ అన్నయ్య కోసం అదే రాత్రి బాయిమీదికి ఫోన్ చేసి పిలిపిచ్చింద్రు. తెల్లారేసరికి అందరు అందింద్రు,'' అంటూ చెప్పుకొచ్చి ఆగింది. ఆమె గొంతులో గాబరా తగ్గలేదింకా.

శారద, నర్సయ్యలు ఇటీవల ఈ క్వార్టర్లోకి రాకపూర్వం వున్న కిరాయి షెడ్ల యజమానీ, కార్మికుడూ అయిన ఒకాయన భార్యతో సహా వచ్చిండు. ఆయన పైదంతా విన్నమీదట మరికొంచెం జోడించినట్టు చెప్పసాగిండు.

''ఆమెకు రెన్నెళ్ల కిందనే కూడింది. వాళ్ల తల్లిగారింటికాడ వున్న భూములన్ని అమ్మ చెప్పిండు నర్సయ్య సారు. తన ఊళ్లో భూమి కొనుక్కుటనని. అక్కన్నైతె లేబరు మంచిగ దొరుకుతరని, శ్రీరాం సాగర్ కాల్వ నీరు వస్తుందని, పొలం పక్క నుంచే పెద్ద రోడ్డు పోతుందని, అన్నిటికంటె కరీంనగర్‌కు దగ్గర్ల వుంటదని- మేం గూడ సరెనన్నం.

''గక్కన్నే పుట్టింది ముసలం. తల్లిగారింట్ల అక్క చెల్లెండ్ల నడుమ- అంతదాకా ఎంతో మంచిగ కలిసిమెలిసి వున్న అక్కచెల్లెండ్ల మధ్య మాటలు బందైనాయి. ఆఖరుకు తండ్రి కూడా, 'నాది నాకు చూయించినంకనే మీరు మీది అమ్ముకపొండ్రి,' అన్నడట. ఆ మాట మీదనే శారదవ్వ మనసు పూర్తిగ విరిగిపోయింది. ఇగగాన్నుంచే ఆమెకు రోగం కుదురుకున్నది.'' తనకు తోచిన పద్ధతిలో ఆయన కారణాన్ని వెదకబోయాడు.

''భూములను లేపిండు- కని భార్యను కానలె!'' ఎవరో నిష్ఠుర వ్యాఖ్యానం చేసింద్రు.

''ఎంత పసిపిల్ల మనసో ఆమెది. మనిషికి నీది-నాది అనేది వుండకపోయేది. ఓసారి ఎర్రటి ఎండల వట్టి కాళ్లతోని ఇంటికి ఆడుబిడ్డ వచ్చింది. తన మొగనితోని గొడవపడి వచ్చినామెను నాలుగు రోజులుంచుకుని మళ్ల వాళ్లింట్ల పడగొట్టి తన కాళ్లకున్న కొత్త చెప్పులు ఆమెకిచ్చి ఈమె ఎండల సడిపచ్చింది. అసోంటి తల్లి,'' మరెవరో శారదను బాగా ఎరిగినావిడలా వుంది.

''ఈ కాలం అట్ల ఏ వదిన వున్నది?'' ఇంకొకరు.

''మంచోళ్లకే కష్టాలు,'' మరొకరు.

''మంచి క్వార్టరు దొరికింది. గ్యాసుపొయ్యి కొన్నరు. డైనింగు టేబులు, స్కూటరు, కొనని వస్తువ లేదు బామ్మర్ది! ఏం భాగ్యం! చెల్లి సుఖపడే టైముకు ఇట్ల చేసుకున్నది,'' ఆడుబిడ్డ మొగుడున్నట్టుంది, ఆయనెక్కడో తాగే వచ్చినట్టుంది. ఏదో నేరస్తుడి గొంతులా ఆయనది.

''తాను ఇల్లం బోయినా కూడ- అటు అయిదుగురు తమ్ముల బతుకుతెరువు చూసిండు. అత్తగారింట్ల ముగ్గురు మరదండ్లకు అన్నివిధాల పెట్టి పెండ్లిళ్లు చేసి సాగనంపిండు. ఆయన 'ఇల్లుట'మచ్చే కాలానికి మామకు అయిదారెకరాలుండె జమీన్. పది ఎకరాల దాక డెవలప్ చేసిండు- ఇద్దరు కొడుకులు కూడా ఎదిగినట్టే. పిల్ల ఎందుకు ఇట్ల చేసుకున్నదో తెలువది,'' మరొకామె చెప్పి చెప్పి గాఢంగా నిట్టూర్చింది.

''సుఖంగ తిని వుండలేక.'' ఊగులాడే కండలు- దిగేసుకున్నట్టు వున్న నగలు- కోడళ్లతో పోరు సలిపే ఒకామె పెదవి విరుస్తూ పోయింది- ఆమె భర్త గని కార్మికుడు. వాలెంటరీ రిటైర్ మెంట్ తీసుకుని కొడుక్కు ఉద్యోగం పెట్టించిండు- తదనుగుణంగానే ఇంట్లో కోడలు అధికారం చూపడం ఆరంభించింది.

''నువ్వు లక్ష చెప్పు. ఆడిదాందో జాతి, మొగోందో జాతి. అవెక్కడ కలుస్తయ్ పో,'' పాతికేళ్ల క్రితం మొగున్ని ఒదిలేసి బజారులో కూరగాయల వ్యాపారం చేసుకుంటూ కాలక్రమంలో మరో

ఇద్దరు కార్మికులతో సంబంధం పెట్టుకుని ఒదిలేసి ప్రస్తుతం ఒంటరిగానే వుండే ఓదెమ్మ గట్టిగా అంటూ పోయింది. ఆ మాటల్లోని ఫోర్సు చూసి ఎవరూ ఏమి అనలేదు.

"శారద ధైర్యస్తురాలు కనుక ఇట్లా చేసుకుంది. మనం పిరికివాళ్లం," ఏదో పూనకం పూనిన దాని తీరుగ నడుస్తూ వెంటవచ్చే మరో డాక్టరమ్మతోనో లేక తనలో తానే అనుకుంటున్నట్లు గానో అంటూ పోతోంది చిక్కిపోయిన డాక్టరమ్మ. ఆ ఇద్దరు డాక్టరమ్మలవి ఒకప్పుడు ప్రేమ వివాహాలు.

వార్డు లోపలికి పోయిన శారద తల్లి, ఆడుబిడ్డ, ఇతర దగ్గరి బంధువులు ఒక్కసారిగా గొల్లుమన్నారు. శారద శవం పైబడి రోదిస్తున్నారు. కట్టలు తెగిన పెనుప్రవాహం లాగున ఆ రోదన అక్కడున్న వారందరిని చుట్టుముడుతోంది. ఆక్సిజన్ సిలిండర్- సెలైన్ బాటిల్స్ అన్నీ తీసేస్తు న్నారు. శారద మొఖం పైన ఎవరో గుడ్డ కప్పారు. భూమిని చీల్చుకుపోతున్నట్టుగా ఎక్కడో దూరంగా భీకర శబ్దంతో పిడుగు.

అనేక జ్ఞాపకాలను, తన బిడ్డతో తనకున్న సంబంధాన్ని వర్ణిస్తూ వలపోస్తోంది శారద తల్లి. కడుపుల పేగులు తెగిపోయేలా రోదిస్తున్న ఆ తల్లి దుఃఖం ముంచెత్తుతోంది. వింటున్న వారందరి హృదయాలు ఇదీ అని చెప్పరాని ఏదో దిగులుతో నిండాయి. ఇదమిత్థంగా తమకే తెలియని మృత్యువేదో తమలో లోపలికి పాకుతూ- వస్తున్నట్టు ఇక దాన్నుంచి తప్పించుకోవడం ఇష్టం లేనట్టు అక్కడ గుమిగూడసాగారు. దుఃఖం తప్ప మరేమీ లేని స్థితిలో ఆమె ఉంది.

నారాయణ శారద శవం వద్దకు పోవాలనుకున్నాడు. కాని తనకు అర్హత లేదనుకున్నాడు. తన నిస్సహాయత్వం పట్ల తనకే రోత కలిగింది. ఎన్ని చావులు సంభవిస్తున్నవి నిత్యం- తెలిసిన వారివి, తెలియనివారివి. తానెన్నడూ పట్టించుకోలేదు. శారద ఇపుడే హఠాత్తుగా చనిపోయిందా? లోలోపల ఆమె ఎంతకాలం నుంచి చనిపోతూ వస్తోంది? ఈ మృత్యువును రూపొందించిందెవరు? ఇన్ని తెలుసుననుకున్న తనకు ఈ విషయం తెలియలేదు. తనకు అన్నం పంచింది. తన పట్ల ఆదరణ చూపింది. తన గురించి తను ఎన్నడూ ఏమీ చెప్పుకోలేదు. తానేనాడు ఆమెను పట్టించు కోనూ లేదు. తన నిష్క్రియాపరత్వం మీద తనకే ఏవగింపు కలిగి ఆ మందిలో మరి నిలబడలేక దూరం పోయాడు.

సురేశ్‌తోబాటు మరొకాయన వచ్చాడు. ఆయన ప్రభాకర్. నర్సయ్యతో చిరకాలం పని చేస్తున్న మిత్రుడు. నారాయణకు సన్నిహితుడే! పాలిపోయిన మొఖంతో- ఏదో నేరం చేసి తల దించుకున్న వాడిలా వచ్చి నారాయణతో పేలవమైన కరస్పర్శ కావించాడు. అప్పుడు ఆ ఇద్దరి చేతులూ వణుకుతూనే వున్నాయి.

"ఇప్పుడే వస్తున్నారా?" ఆ పరమ విషాదకర స్థితిని ఏదోవిధంగా దూరం చేసుకో ప్రయత్నిస్తూ నారాయణ ప్రభాకర్‌ను అడిగాడు.

ప్రభాకర్ ముఖం చిత్రమైన ఉద్వేగంతో, కోపంతో, దుఃఖంతో సమ్మిళితమై వుంది. అతను మాట్లాడలేదు. అతను గనిలో షాట్ ఫైరర్!

'మనిషేమీ మారలేదు- అదే షాట్ ఫైరర్- పదేండ్లుగా- మరోవైపు అధికార పరమపద సోపానంలో పైకి ఎగబాకిన నర్సయ్య.' ప్రభాకర్ గురించి తనలో తానే నారాయణ.

ఆ ఆలోచనని అర్థం చేసుకున్నట్టుగా, ''నర్సయ్య ఓవర్‌మ్యాన్ అయ్యాడు. అన్న పోగూడదనుకున్నాడు,'' కాసేపు ఆగిన సురేశ్, ''అన్న పోనిదే మంచిదైంది. అదంతా లంచగొండి వ్యవహారం,'' అంటూ పూర్తిచేశాడు.

ఆ మాటలకంటె మించినవేవో ప్రభాకర్‌ను ఒత్తిడి చేస్తున్నట్టున్నాయి. నారాయణ చేయి పట్టి వరండా చివరిదాకా పోయి పిట్టగోడపై కూర్చుని నారయాణకు ఒక సిగరెట్టు ఇచ్చి తనో సిగరెట్టు అంటించుకున్నాడు. గాఢంగా రెండు దమ్ములు గుంజి- హాస్పిటల్ బయట మందికేసి చూస్తున్నట్టుగా చూస్తూ- గత స్మృతులను మనసులోకి తెచ్చుకుంటు చెప్పనారంభించిండు. ఆయనను నిట్టనిలువునా విషాదమేదో అలుముకుంది- ఆయన ఎప్పటి నుంచో ఒత్తిడికి గురౌతున్నవాడిలా.

''మొదటి నుంచీ నర్సయ్య నాపట్ల అందరికంటే అధికంగా ఆపేక్ష కనబరిచేవాడు- కాని నేను అటువంటి ఆపేక్షను, ఆదరణను నర్సయ్య పట్ల చూపించలేకపోయాను. నేను కఠినంగా వుంటున్నట్టో లేక తప్పుగా వుంటున్నట్టో అన్పించేది నాకు. కారణం ఏమిటో అప్పట్లో అర్థమయ్యేది కాదు. అయినా నర్సయ్య నా వద్దకు వచ్చేవాడు,'' చెబుతూ ఎందుకో ఆగిండు ప్రభాకర్.

''ఒకమారు వచ్చి- మనం ఇంతమందిమున్నము. ఎవడి వద్దనో 'చిట్టి' వెయ్యడం ఎందుకు? నేను జమ చేస్తాను అంటే సరే కానిమ్మన్నాం. ఆ చిట్టి డబ్బులు ఇవ్వడం కోసం ఆ ఇంటికి పోవాల్సి వచ్చేది,'' ఆగిండు ప్రభాకర్.

ప్రభాకర్ గొంతు మామూలుగా ప్రారంభమై బాధేదో కలగలిసి ఆ కంఠం స్థాయి హెచ్చుతుండగా-

''రెండు నెల్ల కింద నర్సయ్య చెప్పిండు. శారద మానసిక స్థితి బాగాలేదని. ఆస్తిపాస్తులు అమ్మచెప్పేసరికి కుటుంబంలో కలతలు రేగాయని, అది తట్టుకోలేకపోతోందనీ- అట్లా చెప్పుకొచ్చిండు. నన్నోమారు వచ్చి మాట్లాడి చూడమన్నడు. నా అశక్తతలేవో నాకు తెలుసు. బహుశా నా అశక్తతల్నుంచి నన్ను నేను బయటపడేసుకోవడం కోసం కూడా కావచ్చు- ఓ మారు నర్సయ్య ఇంటికి ఒక సాయంత్రం పూట పోయాను.

''పాలిపోయిన శరీరంతో శారద వచ్చి నా పాదాలపై చేతులు జోడించింది. నోట మాట రాలేదు. నాలో లోపల నేను అదిమి పెట్టుకున్నదేదో కంపించసాగింది.

''సంవత్సరాల తరబడి పరిచయం వున్నా- సమస్థం అర్థమవుతున్నా ఆమెతో ఎక్కువ మాట్లాడలేదు. ఆమె కూడా లోలోపల సుళ్లు తిరిగిందే తప్ప నాతో ఎక్కువ మాట్లాడలేదు.

''ఒళ్లంతా వణుకుతుండగా అలాగే నా పాదాల వద్ద కూర్చున్నది.

''ఆ ఇంటికి సంవత్సరాల తరబడి వచ్చిపోయిన మనుషుల ప్రభావానికి పరోక్షంగా శారద ఎలా పరిణమించిందో- శారద శరీరం, మనసును చూస్తుంటే అర్థమవుతూనే వున్నవి. అవి విస్ఫోటనానికి సిద్ధంగా వున్నట్టు తెలుస్తూనే వున్నది.

''కన్నీళ్లతో తన స్థితి గురించి చెప్పుకొచ్చింది. తనని పిచ్చిదాన్ని చేసి నర్సయ్యకు తోడు వచ్చేపోయేవాళ్లు అనేకం చెబుతున్నారని, కాని అవన్నీ తనకు తెలియనివా అని, తనకు పిచ్చి లేదని- నిరంతరం తన శరీరం వణుకుతోందని- అట్లా వణికే చేతులను చూయించింది.

''బతుకుపై విరక్తి కలుగకుండా వుండటం కోసం ఆ చేతులతో ఆమె ఎన్ని ప్రయత్నాలు చేసిందీ, నిరంతరం అనేక పనుల్లో ఎందుకు మునిగితేలిందో...

"నాది నాకే నమ్మకం లేని అనేక మాటలు- బతుకు గురించీ, దానిపైన పట్టు సడలకుండా చూసుకోవడం గురించీ, బంధువుల గురించీ, ఆస్తి సంబంధాల గురించీ, నాకు సరిగా పంచరాని స్నేహాల గురించీ- నేనే పూనకం పూనిన మనిషిలా మాట్లాడాను. అది శారద స్థితో నా స్థితో తెలియకుండా.

"అటువంటి వాటన్నిటి గురించి తను తరచి తరచి తలపోసినట్టుగానే కనిపించింది... కపటంలేని మనుషుల ఆత్మీయ సంబంధాల గురించి తనకూ నాకూ ఎన్నడో కలిసినట్టుగానే వుంది- బహుశా మనందరిలాగే తనూ...

"శారద అప్పటికీ మనందరితో మనందరిలో వున్నట్టుగానే...

"లేచి వెళ్లి చాయ చేసి తెచ్చి అందించింది.

"మాట్లాడి మాట్లాడి నన్నెవరో తరుముతున్నట్టుగా అక్కడి నుంచి వచ్చేశాను. అటువంటి సందర్భాల నెదుర్కోవటం నాకు కొత్త.

"బహుశ నేనామె మరణాన్ని వేగిరపరిచానేమో!" ప్రభాకర్ మొఖంలో దుఃఖమో నెత్తురో పొంగింది. తనను తాను నిగ్రహించుకోవడానికి ప్రయత్నిస్తూ కాసేపు ఆగి తిరిగి చెప్పసాగిండు.

"మరోమారు పోదామనుకున్నాను. నాకెందుకో పోయే శక్తి లేదనిపించింది. అట్లని పోకుండా ఉండలేని సంఘర్షణాస్థితి.

"నర్సయ్య కూడా మళ్లీ ఆ విషయం తేలేదు నాతో- నన్ను తప్పించుకు తిరుగుతున్నాడేమోననిపించేది. ఆగిపోయిన ఇసుకమేటకూ పారే ప్రవాహానికీ మధ్యన ఘర్షణ.

"మాటలతో అయ్యేది ఏముందని అనుకునేవాన్ని. నర్సయ్య శారదను తిప్పవలసిన చోట్లకు కాకుండా తిరుగరాని జాగాలల్లకు తిప్పి చూసిండు. అవన్నీ నిత్యం డ్యూటీలో చెప్పుకచ్చేవాడు. అట్లా శారదను ఎక్కడెక్కడ అతను మూసిపెడుతున్నడో అర్థమయ్యేది నాకు.

"మనసు కలవని భర్తతో చిరకాల హింసలు పడిపడి నాకు తెలిసేలోగానే చేయిదాటి పోయిన మా అక్క యాదికొచ్చేది. ఉండబట్టలేక నెల తర్వాత నేనే పోయాను. నర్సయ్య వద్దంటాడా? చూద్దాం అనుకున్నాను. దేనికైనా సిద్ధమేననుకున్నాను.

"ఈసారి ఆమె చాలా ముభావంగా వున్నట్టు కన్పించింది. నర్సయ్యతో ఏవో అయిష్టంగానే అప్రస్తుత విషయాలు మాట్లాడి మాట్లాడి లేచి వస్తుంటే సాగనంపడానికి గేటుదాకా వచ్చింది శారద.

"ఎప్పటినుంచో చెప్పడానికి కూడదీసుకుంటున్న మనిషిలా ఆమె పూర్తిగా పాలిపోయి వుంది.

"ఆ మధ్యాహ్నం వేళ- గేటు కావల తను- ఈవల నేను. చుట్టూ నిశ్చలంగా నిలుచున్న నీలగిరి చెట్లు- పైన మబ్బులు కమ్ముక వస్తున్న నీలాకాశం.

"నన్ను బతుకుమని చెప్పద్దు మీరు- అంది. బొటబొట కన్నీరు ఆమె పాదాలపై పడుతోంది- నిలువెల్లా వణకుతోంది. ఆమె నన్ను చుట్టుముడుతున్న వణుకు.

"ఆ కన్నీటి బిందువులను తప్ప నేను శారద మొఖం చూడలేకపోయాను.

"'ఏదో చెప్పదలచిందని గాబరాగ వచ్చి వెనుక నిలబడ్డ నర్సయ్య, 'పిస్సదాన ఏడ్సుడెందుకే?' అని అంటున్నాడు. తన వైఫల్యాలను విజయాలుగా మార్చుకొన జూసిన కంఠంతో.

"నాకు అసహ్యం, కోపం, దుఃఖం. ఆస్తి సంబంధాల కావల మనుష్యుల మధ్య గాఢంగా రూపు దిద్దుకునే ప్రేమ.

"తుఫాను గాలుల మధ్య అల్లల్లాడిపోయే తీగలాగా వొణికే కంఠంతో అంది. 'రాత్రి ఆయన దగ్గర పడుకున్నా, అక్కడ పండుకోలేక పోతున్న. లేచిపోయి మా అమ్మ దగ్గర పడుకున్నా, అక్కడ పండుకోలేకపోతున్న. నేనెంత మనసుకు తెచ్చుకున్నా నా పానం అవిశిపోతోంది. ఇక నావల్ల కాదు- నేను బతకలేను,' అన్నది ఆత్రుతగా, నర్సయ్యను ఏమాత్రం లక్ష్యపెట్టకుండా.

"ఆ మాటలు వినబడనంత దూరంలో నర్సయ్య వున్నా ఆయనకేదో అర్థమవుతున్నట్టుగా ఆయన మొఖం పాలిపోసాగింది. యుద్ధభూమిలో అవతలి పక్షంలో నిల్చున్నట్టుగా నర్సయ్య అడుగు ముందుకు వేయలేదు.

"నాలో లోపల నాకు అన్నీ అర్థమవుతూనే వున్నవి. చావుకూ బతుక్కూ మధ్య ఊగిస లాడే అనేక స్థితుల మధ్య అసంబద్ధ దాంపత్యాల వికృత పరాకాష్ఠ స్థితులు- రోజులోనే అనేక మార్లు లోలోపల సంభవించే చావు పుటుకలు. వందలు వేల సంవత్సరాలుగా మనుషులు ముక్కలు ముక్కలుగా ఎట్లా తెగిపోయారో, స్త్రీలు పురుషులుగా- కులమతాలుగా- వీటన్నిటా సృజనశీలురు పరాన్నభుక్కులు- అనుభవ చైతన్య సౌందర్యాల తేడాలు- దృక్పథాలు కలువని మనుషులు- ఆగిపోయేవారికి, సాగిపోయేవారికి- ముడుచుకుపోయే వారికి, పైపైకి విస్తరించే వారికి అనాదిగా ఎడతెగని ఘర్షణ- నాలో లోపలివేవో ఆవిరులైపోతున్న స్థితి.

"ఆమెను దగ్గరకు తీసుకుని- 'ఇంతమందిమి మనందరము ఉన్నామమ్మా,' అని చెబుదామనిపించింది. కాని ఆ పని చెయ్యలేకపోయాను.

"మనిషి చెయ్యవల్సిన, చెయ్యగల పని అది. నాకు చెయ్యరాలేదు. తీవ్రమైన యుద్ధం మధ్యలో శిలావిగ్రహం మాదిరిగా ఉండిపోయాను. ఏవో ఓదార్పు మాటలు గొనుగుతూ అక్కడ నిలబడలేక వచ్చేశాను."

చెబుతున్న ప్రభాకర్ కళ్లు జలాలైనాయి.

శారద కట్ట కడపటి ఆక్రందనలేవో ఇంకా ప్రభాకర్ చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నవి.

నారాయణకు ఆ స్థితులు సంపూర్ణంగా అర్థమవుతూనే వున్నవి. శారదతో, ప్రభాకర్‌తో తను సంపూర్ణంగా మమేకమై వున్నట్టుగా తోచింది. శారద చెప్పిన చివరి మాటలు నారాయణ మనసులో గింగురుమంటున్నవి. ఆ మాటల్లోని సారాంశమేదో తన లోపలిదాన్ని అధికం చేస్తున్నట్టుంది.

ప్రభాకర్ ముఖంలో తీవ్రమైన ఉద్వేగ్నత. మాట్లాడకుండా సిగరెట్టు గట్టిగా పీల్చిండు. సిగరెట్టు చివర నిప్పు రగులుకుంటుండగా దాన్ని నేలకేసి విసిరి కాలి చెప్పుతో నలుపసాగిండు, తన అశక్తత పట్ల తనే కోపగించుకుంటున్నట్టుగా.

నారాయణ ప్రభాకర్ చేయి తీసుకున్నాడు. హఠాత్తుగా లైట్లు వెలిగాయి.

అందరు కలిసి తిరిగి వరండా చివరి నుంచి వార్డు దగ్గరికి నడిచారు. బయట తల్లీ కూతుళ్ల శవాలుంచిన మార్చురీ ముందు వందలాదిగా మంది వచ్చి చేరారు. విస్ఫోటనానికి సిద్ధమైన అగ్నిపర్వతం మాదిరి ఒక మహా మానవదేహంలాగ వున్నారు. అక్కడి నుంచి వాళ్లను ఖాళీ చేయించే నిష్ఫల ప్రయత్నాల్లో పోలీసులు- నాయకులు పోలీసులతో చేస్తున్న వాద వివాదాలు

తీవ్రస్థాయిలో నడుస్తూనే వున్నవి. నినాదాలు- తొక్కిసలాటలు- సర్కిల్ ఇన్స్పెక్టరు చుట్టు గుమిగూడిన జర్నలిస్టులు- ఉరుములు మెరుపులు- అంతకంతకూ ఉద్రిక్తమవుతున్న ఆకాశం.

ఎవరి పద్ధతిలో వాళ్లు యుద్ధరంగాన మోహరించి కదులుతున్నారు. ఈ 144 సెక్షన్స్, ఈ గాలిదుమారాలు తమనేమీ చేయజాలవన్నట్టుగా-

“ఎస్పీ, ఏఎస్పీ కాళేశ్వరం వైపు పోయారనీ, వాళ్లు వచ్చాక మాత్రమే మీకు కావల్సిన సమాచారం చెప్తారనీ సర్కిల్ రంగారావు అసహనంగా చెబుతున్నాడు. ‘వెలమ దర్పం’ ఎవరో జర్నలిస్టు గొణుగుతున్నాడు.

జర్నలిస్టులు, సర్కిల్ను గుచ్చిగుచ్చి అడుగుతూనే వున్నారు. ఎదురుగా రామాలయం ఆవరణలో కంపెని ఇచ్చిన పూవులు, పరదాలతో వేసిన పెద్ద పెద్ద పందిళ్లు- గాలికి అటు ఇటు ఊగుతున్నవి. పట్టపగలులా వెలుగుతున్న లైట్లు- ధగధగలాడే కాషాయం రంగు దుస్తులలో- పసుపుపచ్చగా మెరుస్తున్న ఎడమభుజంతో- చిరుగడ్డం చిరునవ్వులతో అభయహస్త ముద్రలో దర్శనమిస్తున్న యువ ‘స్వాములవారు’- భక్తి పారవశ్యంలో జోగుతున్నట్టున్న కొందరు భక్తులు- గాలిదుమారానికి జడిసిపోతున్నారు మరికొందరు భక్తులు.

‘స్వాములవారి’ పర్యటనాఏర్పాట్లు చూసే స్థానిక రైసుమిల్లుల యజమాని గోవిందరావు రక్షరాళ్లు పొదిగిన ఉంగరాలు మెరుస్తుండగా కాళ్లు వచ్చిన బియ్యంబస్తా మాదిరి గునగున నడిచి వచ్చి సర్కిల్‌కు ఆ గొడవల మధ్యనే సన్నిహితుడులా నమస్కరించి, ‘రేపు సాయంత్రం మనింట్లోనే స్వామివారి పాదపూజ,’ అంటున్నాడు. ఈ మేరకు ఇంట్లో వారికి కూడా చెప్పి వస్తున్నానని అంటున్నాడు. భార్య ప్రసక్తి వచ్చినందుకో, మరెందుకో సర్కిల్ ముఖం మరింత జేవురించింది. ‘కులాభిమానం’ కసిగా అన్నాడొక జర్నలిస్టు- ‘ధనాభిమానం అను,’ అని మరో జర్నలిస్టు సవరిస్తున్నాడు.

రోడ్డు మీద మంది గుమిగూడకుంట అలసటతో విసుగుతో లాఠీలు తిప్పుతూ పోలీసులు- గడబిడలే కాని చినుకురాలని ఆకాశం.

పెట్రోమాక్స్ లైట్లు వెలుగులో- ఎర్రగా మిరుమిట్లు గొలిపే చమ్కీ దుస్తులు, భూన భోంతరాలు ప్రతిధ్వనించేలా కంఠనరాలు తెగిపోయేలాగున ఊదుతూ దంచుతున్న బ్యాండ్ మేళపు వాయిద్యాల హోరు. ఆ హోరులో తప్పతాగి జోగుతున్నట్టుగా డాన్స్ చేస్తున్న జులపాల జుట్ల యువకులు- పూలదండలు అలంకరించిన కారు- ముఖాలపైని దండల్ని తోసుకుంటూ మురిసిపోతూ కూర్చున్న పెండ్లికూతురూ, పెండ్లి కొడుకు. ఈ 144 సెక్షన్‌తో తమకేమీ సంబంధం లేనట్టుగా సాగిపోతున్న పెండ్లి ఊరేగింపు- పెండ్లి బృందం మీదికి లాఠీ ఎత్తాలో కూడదోనని చిత్ర పోయి చూస్తున్న పోలీసులు- అంతా రణరంగం మధ్యన ఎవరి ప్రయత్నాలు వారు చేసుకుంటు న్నట్టుగా- ఎటుదటే జరుగుతోంది.

మందిలోంచి ఎవరో ఊబ చెత్త నాయకుడు పిట్టగోడపైకి ఎవరో లేపి నిలబెడితే నిలుచుని తన వజ్రపుటుంగరం ఆ చీకట్లో తళుకులీనులుండగా- దళితులపై అగ్రవర్ణాలు తరతరాలుగా అమానుషంగా సాగించే దౌర్జన్యాల గురించీ, అందులో భాగంగానే పోలీసుల పాత్ర గురించీ, గొంతు ఉబ్బుతుండగ భీకరంగా మాట్లాడుతున్నాడు.

దోషులైన పోలీసులను శిక్షించాలని ఎవరో కంఠ నరాలు తెగిపోయేలా అరిచాడు- భూమిని భస్మీపటలం చేస్తున్నట్టుగా సమీపంలోనే ఎక్కడో పిడుగు.

లోపల శారద శవ పంచనామా- తదనంతరం అంతిమ సంస్కారం కోసం చేస్తున్న ప్రయత్నాలు.

మన అయిష్టతలను భరించి బతుకడానికి- మనకు చిన్నదో చితకదో ప్రపంచం దొరికింది- కాస్తో కూస్తో మనుషుల ఆదరణ దొరికింది- వాళ్ల నులివెచ్చని కరస్పర్శలు దొరికాయి- అస్పృశ్యమైన, అంట వీలుకాని అటువంటి జీవితాన్ని మనం అటువంటి ఆదరణలతో- అలాంటి కరస్పర్శలు ఇచ్చిన ప్రేరణలతో ముట్టుకోగలుగుతున్నాం.

కాని మరో ప్రపంచంలో, మందితో బాంధవ్యాన్ని తెంపేయబడ్డ వాళ్లకూ...

మరో ప్రపంచం లేనివాళ్లకూ...

మరో ప్రపంచం వుందని కూడా తెలియనే తెలియని వాళ్లకూ...

'మంచివాడు', 'బాగుపడ్డవాడు' అందరూ పోలీసులే! చెప్పలేని నారాయణ గొంతు పూడుకపోయింది. పొడవైన హాస్పిటల్ వరండాలో ఆ మాటలు ప్రతిధ్వనించాయి.

"ఈ సంకుల సమరంలో- ప్రవాహంలో బలాబలాలు మారుతున్నాయి. మనుషులూ మారుతున్నారు- ఈ సందిగ్ధతల్ని ఈ ఉద్రిక్తతల్ని చూడు ఈ హాస్పిటల్లో- బయట గొంతుల్లో- మనం మన శారదకు అంతిమ వీడ్కోలు చెప్పుదాం," అంటున్న నారాయణ.

వాళ్లు ముగ్గురూ శారద దగ్గరికి నడిచారు. అనేకానేక ఉద్రిక్తతలతో చిట్టిపోబోయేలా వున్న మనుషులపై పటపటమని లాఠీదెబ్బలు- హాహాకారాలు- తిట్లు- అరుపులు- మనిషి లోపలి బయటి సమస్త ఉద్రిక్తతలేవో ఒక్క పెట్టున విస్ఫోటనం చెందబోతున్నట్టుగా, దిక్కులు పిక్కటిల్లేలా వందలు వేలుగా నినదిస్తున్న కంఠస్వరాలు-

పైన ఆకాశంలో ఎడతెగని మేఘఘర్జనలు- చినుకు రాలదు- ఉధృతం తగ్గని గాలి- మొదలంటా ఊగిపోతున్న వృక్షాలూ- ఉరుములు మెరుపులతో సకల ఉద్రిక్తతలతో- ఆపలేని ఆగ్రహంతో భీకరంగా ఊగిపోతున్న సమస్త ప్రకృతి.

మనుషుల లోపల బయట మానవస్పర్శకు సంబంధించిన నులివెచ్చని వేడి ఏదో రగులుకుంటోంది. హాస్పిటల్లోని ఆ తల్లీకూతుళ్ల- శారద శవాల సాక్షిగా...

*ఆహ్వానం మాసపత్రిక, 1997*

నేపథ్యం

## విషాదాలకు ముగింపు పలికే
# హంతకులు

***రహస్య విప్లవ కార్మిక సంఘం కార్యకలాపాల వల్ల చాలామంది నాయకులుగా ఎదిగారు. అందులో కొందరు పోలీసులచే హత్య చేయబడ్డారు. మరికొందరు నిర్బంధాన్ని తట్టుకోలేక లొంగిపోయారు. చాలామంది మాత్రం గుర్తింపు యూనియన్లలోకి, వాటి అనుబంధ రాజకీయ పార్టీల్లోకి పోయారు. కొందరు బొగ్గుగనుల యాజమాన్యంలోకి కూడా పరీక్షల్లో లంచాలిచ్చి, అధికారులుగా ఎగబాకారు.***

1985-86 మధ్య 'నా పాత స్నేహితుడు' అనే కథ రాసిన. అది నా మొదటి కథ. 1981లో కథారచన ఆరంభించి, 1985 వరకు దాదాపు డజన్ కథల దాకా రాసి వున్నాను. 'పాత స్నేహితుడు' కథతో నేను మాత్రమే రాయగలిగిన కథ, రాయడం ప్రారంభమైంది. 1990లోగాని సృజనలో అచ్చు కాలేదు ఆ కథ!

పాత స్నేహితుడు కథతో ప్రారంభించి, వేటగాడి చూపులు, శతృవు, జాడ, పనిపిల్ల (1994) దాకా అయిదు కథలు రాసిన.

ఒకవైపు జీవితం అనుభవంలోకి వస్తున్నకొద్దీ, చుట్టూ మనుషుల జీవితాల్లో వస్తున్న పరిణామాల్ని గమనిస్తున్నకొద్దీ, వాటిని విశ్లేషించుకుంటూ, ఆ విశ్లేషణల్ని కొన్ని దశలుగా భావించుకుంటూ, అయిదు కథల్ని రాయడం జరిగింది. దాదాపు ఆ అయిదు కథల్లోని చర్చనీయాంశం, భార్యాభర్తల సంబంధాల్లో కలిగే ఘర్షణలకు కారణాలు ఏమిటి అనేది శోధించే ప్రయత్నం. నా అనుభవంలోకి జీవితం ఏ విధంగా వస్తూ వుందో, బయటి జీవితాల్లోని మార్పుల్ని ఎట్లా గమనిస్తున్నారో- ఆ విధంగానే క్రమానుగతంగా ఆ అయిదు కథలూ రాసిన.

ఆ వరుసలోనే ఆరో కథ- దాదాపు ఆ వరుసలో అంతిమ కథ వంటిదేదో రాసే స్థితుల్లోకి నేను ప్రవేశించాను.

మానవ సంబంధాల్లో ఘర్షణలుంటాయి. వాటికి రకరకాల కారణాలు వుంటాయి. ప్రధానమైనవి భావజాలపరమైనవి. అయితే ఈ ఘర్షణలు అనేక దశల గుండా సాగుతూ వుంటాయి. కొన్ని దశల్లో ఈ ఘర్షణలు హింసాత్మక సంఘటనలుగా వ్యక్తం అవుతాయి. దూరంగా వున్నవారికీ, అనుభవమూ అవగాహనా లేనివారికీ అవి హఠాత్తుగా జరిగినట్టు కనిపిస్తాయి. కాని 'ఘటన' దీర్ఘకాలంలో రూపొందుతుంది. సన్నిహితులకూ ఆలోచనాశీలురకూ ఆ ఘటన రూపొందే క్రమం తెలుస్తూనే వుంటుంది. అటువంటి ఘటనలు జరగకుండా, చేయగలిగిన ప్రయత్నాలు కొందరు చేస్తారు- చేయలేనివాళ్లు విచారిస్తారు.

కాలరీ కుటుంబాల్లో స్త్రీల ఆత్మహత్యలు నన్ను ఆలోచింపజేశాయి. నేను పుట్టి పెరిగిన గ్రామీణ జీవితంలో అటువంటి ఆత్మహత్యలు దాదాపు లేవు. గ్రామంలో భార్యభర్తల కార్యక్షేత్రం ఒక్కటే- వ్యవసాయం లేదా రకరకాల వృత్తులు. దేంట్లోనైనా భార్యభర్తలు ఇద్దరూ పాల్గొనేవారు. అది నిరంతరం కలిసిమెలిసి వుండే సంబంధం. వ్యసాయరంగ సంక్షోభం, వృత్తుల విధ్వంసమూ, భూస్వాముల పెత్తనం- విప్లవోద్యమం మీద పెరిగిన నిర్బంధం- దరిమిలా అంతకుముందూ, తరువాత తెలంగాణా జిల్లాల్లోని పలు గ్రామాల్నుంచి రైతాంగం సింగరేణి బొగ్గుగనుల్లోకి వలస వచ్చారు.

బొగ్గు గనుల్లో పని ఎలాంటిదో భార్యలకు తెలియదు. ఆ పని, మనిషిలో తెచ్చే మార్పులు తెలుస్తుంటాయి కాని, ఆ మార్పుల పర్యవసానాలను అనుభవించవలసి వస్తుంది కాని, ఆ పని కళ్లకు కనబడేది కాదు. ఎక్కడో భూగర్భంలో కార్యక్షేత్రం మరి! వేలాదిమంది బొగ్గు గని కార్మికుల భార్యల పరిస్థితి అది. దానికితోడు ఆలోచనారీతుల్లోని తేడాలు- వెరసి దాంపత్య సంబంధాల్లో హింసా విషాదాలు ప్రారంభం. అటువంటి విషాదాలకు ముగింపు ఆత్మహత్య లేదా హత్య! విడాకులకు ప్రయత్నించడం చాలా తక్కువ- ఆస్తి పీటముడులు వగైరా అందరెరిగిన కారణాలు.

అటువంటి ఒక ఆత్మహత్యను కేంద్రంగా తీసుకుని 'హంతకులు' కథ రాయవలసి వచ్చింది.

1980లో నేను బొగ్గుగనుల్లో కార్మికుడిగా చేరేనాటికి కార్మికుల పరిస్థితులు పరమ అధ్వాన్నం! దుర్భరం! వెట్టిచాకిరి- హక్కులు అమలు నిరాకరణ- అరకొర వసతులు- అగౌరవమూ- అధికారమదం- దానికితోడు యూనియన్లు, వాళ్లలో వాళ్లకు గొడవలు- యాజమాన్యం, యూనియన్లు కార్మికుల అణచివేతలో రెండూ ముందుండి తమ మనుగడ సాగించేవే!

ఆ దుర్భర పరిస్థితుల్లోంచి బయటపడడానికి కార్మికవర్గానికి ఒక కొత్తదారి దొరికింది ఆరోజుల్లో! అప్పటి పీపుల్స్‌వార్ పార్టీ అనుబంధ కార్మిక సంఘం- 'సింగరేణి కార్మికసమాఖ్య'. అది లీగల్‌గా పనిచేసింది కొద్ది సంవత్సరాలే అయినా, అజ్ఞాతంగా నడిచింది చాలా సంవత్సరాలు. రహస్య విప్లవ కార్మిక సంఘాలతో పనిచేసిన ఒక గని కార్మికుడి భార్య ఆత్మహత్య నేపథ్యంగా 'హంతకులు' కథ సాగుతుంది.

ఆత్మహత్య రూపొందడానికి కారణాలు ఏమిటి? అవి ఎక్కడ నుంచి ప్రారంభమైనవి? నాలో శోధన మొదలైంది. అటువంటి కుటుంబాలు నాకు తెలుసు. మా పెద్ద బాపు ఒకాయన, మా సొంత అక్కయ్య- మా కుటుంబంలోనే రెండు తరాల్లో ఇద్దరి ఆత్మహత్యలు. కాలనీ ప్రాంతాల్లో జరిగే స్త్రీల హత్యలూ, ఆత్మహత్యలు పత్రికల్లో వచ్చేవన్నీ శ్రద్ధగా చదివేవాడ్ని.

రహస్య విప్లవ కార్మిక సంఘం కార్యకలాపాల వల్ల చాలామంది నాయకులుగా ఎదిగారు. అందులో కొందరు పోలీసులచే హత్య చేయబడ్డారు. మరికొందరు నిర్బంధాన్ని తట్టుకోలేక లొంగి పోయారు. చాలామంది మాత్రం గుర్తింపు యూనియన్లలోకి, వాటి అనుబంధ రాజకీయ పార్టీల్లోకి పోయారు. కొందరు బొగ్గుగనుల యాజమాన్యంలోకి కూడా పరీక్షల్లో లంచాలిచ్చి, అధికారులుగా ఎగబాకారు.

సి.కా.స ప్రత్యక్ష-పరోక్ష పోరటాల వల్ల సింగరేణిలో పరిస్థితులు అప్పటికి మెరుగయ్యాయి. హక్కుల అమలు ప్రారంభమైంది. వెట్టిచాకిరి తగ్గింది. వసతుల మెరుగుపై దృష్టి పెట్టారు. అన్నింటి కంటే ముఖ్యమైంది అధికారమదం తగ్గింది. మరోవైపు నిర్బంధం పెరిగింది. 'మిలిటెంట్లు'గా పనిచేసిన చాలామంది కార్మికులకు ఇక అంత తీవ్రంగా పోరాడవలసిన అవసరం కనిపించలేదు. అందుకు రకరకాల దారులు చూసుకున్నారు, వేసుకున్నారు.

అట్లా అధికారంలోకి ఎగబాకిన ఒక మాజీ మిలిటెంట్- ప్రస్తుత అధికారి భార్య ఉరి వేసుకుని చనిపోతుంది. అది కథ! హంతకులు కథ!

'హంతకులు' కథని 1995లో రాసినా, ఫెయిర్ కాపీ రాయడానికి మరో యాడాది పట్టింది. 1997లో 'ఆహ్వానం' అనే- విజయవాడ నుంచి ఎస్.ఎస్. లక్ష్మిగారి సంపాదకత్వంలో వచ్చేది- మాసపత్రికలో అచ్చు అయింది. దరిమిలా '1997-తెలుగుకథ' తెలుగు యూనివర్సిటీ వారి సంకలనంలో కూడా అచ్చు అయింది. స్థూలంగా అదీ 'హంతకులు' నేపథ్యం!

*23 ఏప్రిల్ 2013*

*'హంతకులు' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

20

# మ'గోడు'

## తోలేటి జగన్మోహనరావు




*తోలేటి జగన్మోహనరావు* *1945 డిసెంబర్ 2న జన్మించారు. వీరి మొదటి కథ మనుషులు చేసిన దేవుళ్ళారా 1977లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయింది. మూడు కథా సంపుటాలు, రెండు వ్యాస సంపుటాలు ప్రచురించారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ చేశారు.*

చిరునామా

*1005, ఫార్చ్యూన్ హైట్స్, మదీనాగూడ,*
*హైదరాబాద్-500 049*
*Ph.: 99082 36747*
*toletyjr@gmail.com*


మొన్ననే నాకు యాభై నిండి యాభై ఒకటి వచ్చింది. వాలుకుర్చీలో వాలి చెయి జారిపోయిన జీవితం గురించి దిగులుపడే వయసు వచ్చింది. నాకు గతమే తప్ప భవిష్యత్తులేదు. ఈమధ్య ఖాళీగా ఉన్నప్పుడల్లా గతం నెమరువేస్తూ, 'అప్పుడు అలా కాకుండా ఇలా చేసి ఉంటే, ఇప్పుడు నా జీవితం ఇలా కాకుండా మరోలా ఉండేదేమో,' అంటూ గతంలో నేను చేసిన పొరపాట్లు, పెడచెవిన పెట్టిన పెద్దల సలహాలు గుర్తుకు తెచ్చుకుని బాధపడడడం అలవాటయింది.

ఈరోజు ఉదయం రేడియోలో, 'మాయా సంసారం తమ్ముడు,' పాట వస్తుంటే, మా తెలుగు మాష్టారు రామనాథంగారు గుర్తుకు వచ్చారు. ఆయన మాకు బంధువులు కూడా. మా అమ్మకి వరసకి అన్నగారు- అంటే నాకు మేనమామ అవుతారు. ఆయన ముప్పయ్యొనిమిదేళ్ల క్రితం ఓ ప్రత్యేక పరిస్థితిలో, ప్రత్యేక విధానంలో, జీవితాంతం గుర్తుండిపోయేలా ఓ పాఠం చెప్పారు. ఆయన చెప్పిన తీరునుబట్టి ఆ పాఠం బుర్రకి బాగా అంటింది. కానీ, అది అర్థం చేసుకోవడానికి మాత్రం మరో పదిహేనేళ్లు పట్టింది.

నేను ఎనిమిదో తరగతిలో ఉన్నప్పుడు మా క్లాసులో సుబ్బలక్ష్మి అనే అమ్మాయి ఉండేది. అప్పుడు క్లాసంతా కలిపి ఆరేడుమంది కంటే ఆడపిల్లలు ఉండేవారు కారు. వాళ్లంతా మొదటి వరుసలో ఒక బెంచీ మీద కూర్చునేవారు. మొదటివరుసలో మగపిల్లల బెంచీలో ఆఖరి సీటు నాది. ఆడపిల్లల బెంచీలో మొదటి సీటు సుబ్బలక్ష్మిది. అలా పక్కపక్కన రెండు మూడునెలలు కూర్చున్న తర్వాత నా మనసు కొంచెం అలజడికి గురయింది. మరో రెండు నెలలు నా మనసులో మాట మనసులోనే ఉండనిచ్చాను కానీ, ఇంక ఆగలేకపోయాను.

శేఖర్‌ని, పండుని స్కూలు గ్రౌండ్‌లో ఓ మూలకు తీసుకెళ్లి రహస్యంగా విషయం చెప్పాను. 'దాన్నే ప్రేమ అంటారు,' అన్నాడు పండు ఉత్సాహంగా. 'ఇప్పుడేం చెయ్యమంటారు నన్ను,' అని సలహా అడిగాను. 'వెళ్లి సుబ్బలక్ష్మితో, నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని చెప్పెయ్యి,' అన్నాడు శేఖర్. 'నాకు భయం- అది అసలే రౌడీటైపు,' అన్నాను. 'అయితే, ఏడు- పిరికిసన్నాసులు సుఖ పడ్లేరు,' చిరాగ్గా అని వెళ్లిపోయాడు శేఖర్. పండు, 'ఓ లవ్‌లెటర్ రాయి,' అని సలహా ఇచ్చాడు.

ఓ రోజంతా కష్టపడి, 'నా హృదయ సామ్రాజ్యలక్ష్మి-సుబ్బలక్ష్మి,' అని రాసి పండుకి చూపించాను.

"లవ్‌లెటరు తెలుగులో కంటే ఇంగ్లీషులో రాస్తే బావుంటుంది. మనకి ఇంగ్లీషొచ్చు అని చెప్పుకోవచ్చు- అదో గొప్పకూడా. ఆడపిల్లలు ఇంగ్లీషులో మాట్లాడినా, ఇంగ్లీషులో లవ్‌లెటర్లు రాసినా చాలా ఇంప్రెసయిపోతారు," అన్నాడు పండు అనుభవజ్ఞుడిలా.

ఇద్దరం రెండు రోజులు బుర్రలు బద్దలు కొట్టుకుని, ఒక నోటు పుస్తకం అంతా పాడుచేసి, రెండు వాక్యాల ప్రేమలేఖ తయారుచేశాం. "ఐ లవ్ యూ, విల్ యూ మ్యారీ మీ?"

"మీ అన్నయ్యకు చూపించు. ఇందులో గ్రామర్, స్పెల్లింగ్ మిస్టేక్సు ఏవన్నా ఉన్నాయేమో. మనం సుబ్బలక్ష్మికి లోకువైపోతాం," అన్నాను.

"వద్దు, మా అన్నయ్య నన్ను తంతాడు. పైగా ఈ ఉత్తరం సుబ్బలక్ష్మికి కాకుండా మీ నాన్నకు చేరే ప్రమాదం కూడా ఉంది. ఆ దిబ్బమొహానికి..."

"సుబ్బలక్ష్మిది దిబ్బమొహం కాదు," అన్నాను కొంచెం బాధగా.

"ఏదో మొహంలే. దానికి మనకంటే ఇంగ్లీషు ఏవొచ్చు? ఫరవాలేదు ఇచ్చెయ్యి," అన్నాడు పండు.

అలా నేను నా మొదటి/ఆఖరి ప్రేమలేఖ రాశాను, ఎనిమిదో తరగతి చదువుతుండగా.

ఇంక ఆ లెటరు సుబ్బలక్ష్మికి అందివ్వాలి.

ఈ స్పెషల్ అకేషన్‌కి మా అన్నయ్యని వాడి కొత్త ప్యాంటు ఒకరోజుకి అప్పు అడిగాను. అరగంటసేపు బతిమాలగా, బతిమాలగా ఓ రోజంతా నా చేత నానా చాకిరీ చేయించి, చివరకు వాడి కొత్త ప్యాంటు ఇచ్చాడు. తెల్లషర్టు, తెల్ల ప్యాంటులో టక్ చేసి స్టయిలుగా స్కూలుకి వెళ్లాను.

"ఏవిట్రోయ్, అక్కినేని నాగేశ్వరరావులా తయారయ్యావు ఈవేళ," అన్నాడు శేఖర్ నేను క్లాసులో అడుగు పెట్టగానే.

అంతా సుబ్బలక్ష్మితో సహా నన్ను పరిశీలనగా చూశారు. సుబ్బలక్ష్మిని అలా ఇంప్రెస్ చేసి, కొంచెం గ్రౌండు ప్రిపేర్ చేసి, "నీ తెలుగు నోట్సు ఒకసారియ్యి," అన్నాను.

"ఎందుకు?" అంది సుబ్బలక్ష్మి.

"నిన్న స్కూలుకి రాలేదుగా, నీ నోట్సు చూసి రాసుకుందామని," అన్నాను.

"నీ కోతి ఫ్రెండ్సుని అడగొచ్చు కదా," అంది అది పొగరుగా. అంటే శేఖర్, పండు అని దాని ఉద్దేశం.

"వాళ్లు నిన్న రాలేదు కదా."

"మిగతా మగపిల్లల్ని అడగొచ్చు కదా."

ఆడదానితో మాట్లాడడం ఎంత కష్టమో మొట్టమొదటిసారి నాకు అనుభవమయింది.

"వాళ్లెవరూ సరిగా రాయరు."

"మిగిలిన ఆడపిల్లల్ని అడగొచ్చు కదా."

"నువ్వు నాకు దగ్గర అని," అన్నాను. మా ఇద్దరివీ పక్కపక్క బెంచీలు కదా! మన ద్వంద్వార్థం దానికి అర్థమైందో లేదో కానీ, ఒక్కసారి పరిశీలనగా చూసి మాట్లాడకుండా నోటు బుక్కు ఇచ్చింది.

నేను ఓ పది నిమిషాలు ఏదో కాపీ చేస్తున్నట్లు నటించి, నా ఉత్తరం అందులో పెట్టి ఇచ్చేశాను. అది మాట్లాడకుండా తీసుకుంది. ఉత్తరం పెట్టడం చూసిందో లేదో కానీ, ఇంక నాకేసి తిరగకుండా బోర్డు కేసే చేస్తూ కూర్చుంది.

లెక్కల క్లాసయింది. ఇంగ్లీషు క్లాసయింది. ఇంటర్వెల్లయింది. సుబ్బలక్ష్మి దగ్గర నుంచి జవాబు లేదు. నాకంతా సస్పెన్సుగా ఉంది. ఇంటర్వెల్ తర్వాత మూడు గంటలకి రామనాథం మాష్టారు క్లాసుకు వచ్చారు. నవ్వుతూ నాకేసి తిరిగి, "ఒరే నాగేశ్వర్రావూ నువ్వోసారి నుంచోరా," అన్నారు.

పక్కన కోతి కిచకిచలాడినట్లు సుబ్బలక్ష్మి నవ్వు వినిపించింది. 'ఎందుకు దీనికింత కులకాసంగా ఉంది,' అనుకుంటూ లేచి నిలబడ్డాను.

రామనాథంగారు నాపక్కకొచ్చి నిలబడ్డారు. "నేనింతవరకూ గమనించలేదురా. చాలా పెద్దవాడివైపోయావురోయ్. ప్యాంట్లు కూడా వేసేస్తున్నావు. అన్నయ్య ప్యాంటేనా?" క్లాసంతా గొల్లుమంది.

"అమ్మో- నూనూగు మీసాల నూత్నయౌవనం వచ్చేసింది. అందుకే మా అల్లుడు పెళ్లికి మహా తొందరపడిపోతున్నాడు. ఇంక వీడికి పెళ్లి చేసేయాల్సిందే! అన్నారు బుగ్గలు పట్టుకుని లాగుతూ.

క్లాసంతా మళ్లీ గొల్లుమంది. పక్కబెంచీ మీద కోతుల కిచకిచలు ఎక్కువయ్యాయి. 'పిల్లికి చెలగాటం, ఎలక్కి ప్రాణసంకటం' అంటారే అలా ఉంది నా పరిస్థితి. నేను నవ్వాలో, ఏడ్వాలో తెలియక ఓ వెర్రినవ్వు నవ్వాను. 'ఈ దిబ్బలక్ష్మి నా పవిత్ర ప్రేమలేఖ ఈయనకి అందించలేదు కదా,' అని డౌటు కూడా వచ్చింది.

"ఒరే నాగేశ్వర్రావూ! భర్త అంటే అర్థం తెలుసురా," అన్నారు బుగ్గలొదిలేసి. బుగ్గలొది లెయ్యగానే ప్రమాదం తప్పిందనుకుని, "భర్త అంటే- మొగుడు," అన్నాను ధైర్యంగా.

"మొగుడంటే?"

"మొగుడంటే... మొగాడు," అన్నాను.

"తెలుగు తెలిసి చావదు, మళ్లా ఇంగ్లీషాహటి."

నేను తెలుగులోనో, సంస్కృతంలోనో ప్రేమలేఖ రాస్తే ఆయనకి అంత కోపం వచ్చేది కాదేమో. ఇంగ్లీషులో రాయడం తెలుగు పండితులకి అవమానం అనిపించినట్లుంది. ఆయన మరీ రెచ్చిపోయారు. ఎడంచేత్తో నా చెవి పట్టుకుని మెలేస్తూ, 'భర్త అంటే... భరించేవాడని అర్థంరా వెధవా,' అంటూ ఒత్తుకి ఒక మొట్టికాయ చొప్పున నాలుగు మొట్టికాయలు మొట్టి అర్థం వివరించారు.

ఎందుకో తెలియదుగానీ, నా చిన్నప్పుడు తెలుగు మాష్టార్లు, లెక్కల మాష్టార్లు మొట్టి కాయల్లో స్పెషలైజు చేసేవారు. రామనాథంగారు కుడిచేతి వేళ్లు మడిచి, మధ్యవేలు ఇనుపకొక్కెం

లా చేసి, కొంచెం కిందికి దింపి, టింగు టింగుమని బుర్ర రామకీర్తన పాడిస్తూ, ఎడంచేత్తో జుట్టు పట్టుకుని గుంజుతూ క్లాసంతా తిప్పి, "భర్త అంటే ఏవిటి?" అని మళ్లీ అడిగారు ప్రదక్షిణం పూర్తయ్యాక.

"భరించేవాడు," అన్నాను ఏడుపు ఆపుకుంటూ.

"దేన్ని భరించేవాడు అని అర్థం? (మొట్టికాయ)... పెళ్లాన్ని (మొట్టికాయ)... పిల్లల్ని (మొట్టికాయ)... సంసారాన్ని (మొట్టికాయ)... సంసారం ఎలాంటిది? (మొట్టికాయ)" ఆయన అన్యాయంగా ప్రశ్నలకీ, సమాధానాలకీ కూడా మొట్టేస్తున్నారు. 'సంసారం సాగరం (మొట్టికాయ)... దుఃఖభాజనం (మొట్టికాయ)... హాయిగా చదువుకోకుండా పెళ్లి కావాలట్రా పెళ్లి..." అంటూ మొట్టికాయల మహాలక్ష్మితో ఆరోజు మహా వైభవంగా నా పెళ్లి చేసేశారు.

అరగంట తర్వాత స్టాఫ్‌రూంలోకి పిల్చి, "గట్టిగా కొట్టేనేవిట్రా అల్లుడూ," అంటూ తల నిమిరి, "బుద్ధిగా చదువుకోరా నాయనా! మంచి చదువులు చదువుకుని, మంచి ఉద్యోగాల్లోకి వెళ్లి నువ్వు హాయిగా ఉండాలి. ఈ ఊబిలోకి దిగకురా నాయనా! నూరేళ్ల జీవితం పాడుచేసుకోకు. మీ అత్తతో నేనెలా వేగుతున్నానో చూశావు కదరా," అన్నారు ఆయన కళ్లనీళ్లతో.

రామనాథంగారిల్లు మా ఇంటికి రెండిళ్లవతలే. 'వెధవల్లారా- లేవండ్రోయ్,' అనే సుప్రభాతంతో కోడి కుయ్యక ముందే మొదలయ్యేది మా అత్తయ్య దినచర్య. ఆవిడకి శుచీ, శుభ్రత ఎక్కువ. స్నానాలు, పూజలు చేసి చేసి, పనిమనిషి తోవిన అంట్లు మళ్లీ తోవి తోవి, కట్టెలపొయ్యి అలికి అలికి, నీళ్లూ నిప్పులూ కడిగి కడిగి, ఆవిడ ఉదయం వంట పూర్తి చేసేటప్పటికి మధ్యాహ్నం రెండయ్యేది. రాత్రి భోజనాలయ్యేసరికి పదకొండు గంటలయ్యేది.

ఆవిడకి ఆచారం ఎక్కువ. రామనాథంగారు ఇంట్లోకి స్నానం చేసి రావాలి. ఉదయం స్నానం, మధ్యాహ్నం భోజనానికి వచ్చినప్పుడు స్నానం, సాయంత్రం స్కూలు నుంచొచ్చాక స్నానం, ఇంటికి ఎవరేనా తక్కువ కులంవాళ్లు వస్తే వాళ్లతో మాట్లాడితే స్నానం- ఆయన బడిలో లేకపోతే, ఇంటి ఎదురుగా కాలువలో మునకలేస్తూ కనిపించేవారు. పొరపాటున స్నానం చేయకుండా ఓ అడుగు లోపలికి వేశారో బకెట్టు నీళ్లు తీసుకొచ్చి ధన్‌మని పోసేసేది.

'నీ మొహం మండా, పిల్లల పేపర్లున్నాయే,' అని ఆయన తిడుతున్నా వినిపించుకునేది కాదు. ఆయన్ని అలా ఇరవైనాలుగు గంటలూ వేపించుకు తింటేకాని ఆవిడకి రోజు గడిచేది కాదు.

అలాంటి రామనాథంగారు ఓ రాత్రి గుండెపోటు వచ్చి ఆవిడకి మాటైనా చెప్పకుండా స్వర్గస్తులైపోయారు. వీధిలో చాపమీద రామనాథంగారిని చూసిన వాళ్లంతా ఆశ్చర్యపోయారు. ఆయన మొహం ఎంతో సంతోషంతో వెలిగిపోతున్నట్లుంది. 'ఇప్పుడేం చేస్తావే సోమిదేవమ్మా,' అని పెళ్లాంతో మౌనంగా పరాచికాలాడుతూ, పెళ్లికొడుకు పల్లకీ ఎక్కి వెడుతున్నంత సంతోషంగా ఆయన ఏడుకట్ల సవారీ ఎక్కి వెళ్లిపోయారు.

"ఇప్పుడేం చేతును దేవుడోయ్? నన్నిలా అర్ధంతరంగా వదిలేసి వెళ్లిపోతే నేనెలా బతికేది దేవుడోయ్," అని సోమిదేవమ్మగారు నిజంగానే గుండెలు పగిలేలా ఏడ్చింది.

రామనాథంగారు స్థితిపరులే. పదెకరాల మాగాణీ, కొబ్బరితోట, పాడీ, పంట- వాళ్లకు దేనికీ లోటు లేదు.

అయినా, ఆయన లేని లోటు ఎవరు తీర్చగలరు? ఆయన పోయిన తర్వాత ఆవిడ జీవితానికి అర్థం లేకుండాపోయింది. ఆవిడ గాలివానకి అరటిచెట్టు కూలిపోయినట్లు కూలిపోయింది. మర్నాటి నుంచి ఆవిడ గొంతు ఎవరికీ వినిపించలేదు. ఏడ్చి ఏడ్చి గొంతు పోయిందనుకున్నారు అందరూ. తర్వాత గొంతుక మరి రానేలేదు.

అరుగు మీద కూర్చుని, వచ్చేపోయే వాళ్లందరినీ కూచోబెట్టి, 'ఆ దేవుడు నన్నొదిలి వెళ్లిపోయి చాలా అన్యాయం చేశాడు,' అని సంజ్ఞలు చేసి చెబుతూ కళ్లనీళ్లెట్టుకునేది. ఆయన ఎడబాటు భరించలేక మరో మూడు నెలల తర్వాత ఆవిడా వెళ్లిపోయింది.

ఆవిడ మహా నిష్ఠపరురాలు, మహా పతివ్రత- అల్లాంటావిడ తప్పకుండా స్వర్గానికే పోతుందని నా నమ్మకం. అంచేత నేను గుడికి వెళ్లినప్పుడల్లా, 'దేవుడా- మా మావయ్యగారు అమాయకులు- ఉత్తములు- ఆయన్ను అన్యాయం చెయ్యకు. ఆయన్ను నరకానికి పంపి రక్షించు తండ్రీ,' అని ప్రార్థిస్తుండేవాడిని.

*

"ఏం చేస్తున్నారు," అంటూ అరిచింది మా ఆవిడ వంటింట్లోంచి. నేను గతంలోంచి వర్తమానంలోకి వచ్చిపడ్డాను.

రామనాథంగారు 'భర్త' అంటే అర్థం చెప్పారు కానీ, 'భార్య' అంటే అర్థం చెప్పలేదు. ఆయన్ని అడుగుదామన్న కుతూహలం ఉన్నా, కొంత సిగ్గువల్లా, కొంత మళ్లీ మొట్టికాయలు తినవలసి వస్తుందేమోనన్న భయం వల్లా అడగడానికి సాహసించలేదు. ఆ మాటకి అర్థం చెప్పకుండానే ఆయన వెళ్లిపోయారు. నా అంతట నేనే ఆ మాటకి అనేక అర్థాలు చెప్పుకుంటున్నాను.

నా సమాధానం కోసం ఎదురుచూడకుండా, "గేస్‌వాడికి చెప్పారా," అంటూ సుడిగాలిలా ముందుగదిలోకి వచ్చింది మా ఆవిడ.

"చెప్పాను. పదిరోజుల్లో వస్తుందన్నాడు."

"వాడల్లాగే అంటాడు. మన తర్వాత చెప్పిన వాళ్లందరికీ వాడు సిలిండర్లు ఇచ్చేస్తున్నాడు. ఇలా పడకకుర్చీలో పడుకుంటే గేస్ రాదు. వెళ్లి వాడికి పదో, పరకోపడేసి, నయానో భయానో తీసుకురావాలి. సర్లెండి- అసలు మన మొహం చూస్తేనే..." సుడిగాలి మళ్లీ వంటింట్లోకి వెళ్లిపోయింది.

దైవజ్ఞులు శుభముహూర్తం అని నిర్ణయించిన క్షణాన మా ఆవిడ మెళ్లో తాళి కట్టాను నేను. నేను దాని మెళ్లో కట్టిన మంగళసూత్రవే అందరికీ కనిపిస్తుంది కానీ, మాయలఫకీరులా అది నా మెడకు తగిలించిన గుదిబండ నాకు మాత్రమే కనిపిస్తుంది.

'నీ పెళ్లానికేంరా బంగారం,' అన్నారు పెద్దలు మాత్రం అక్షింతలు వేస్తూ. మా ఆవిడ పేరు బంగారం. అందుకని ఆ శాడిస్టులు అలా చమత్కరించారనుకుంటాను అది గుర్తుకు వచ్చి నప్పుడల్లా.

నేను పెళ్లి చేసుకుంటున్నానని తెలియగానే శేఖర్ పరిగెట్టుకొచ్చాడు. నన్ను చూసి కన్నీళ్లాగలేదు వాడికి. "ఒరే నాగేశ్వర్రావ్! నువ్వు పెళ్లి చేసుకుని ఆత్మహత్య చేసుకుంటున్నావురోయ్. ఇంక నీ సుఖం నీకుండదు, నీ జీవితం నీకుండదు, నీకు నువ్వుండవు. ఫుట్‌బాల్ ఛాంపియన్ని అని రొమ్ము విరుచుకు తిరిగేవాడివి. ఇంకిప్పుడు నిన్ను అందరూ ఫుట్‌బాల్ తన్నినట్లు తంతారురోయ్. అయ్యో నాగేశ్వర్రావ్! హీరో నాగేశ్వర్రావులా ఉండేవాడివి, రెండో రీలులోనే హార్టెటాకొచ్చి బకెట్టు తన్నేసే గుమ్మడి వెంకటేశ్వర్రావు రోలుకి ఒప్పుకున్నావేవిట్రోయ్," అంటూ గొల్లుమన్నాడు నన్ను కౌగలించుకుని.

నా దురదృష్టవేవిటంటే, నాకు జీవితం నేర్పే పాఠాలన్నీ చాలా మెల్లిగా అర్థమవుతాయి. శుభవా అని నేను పెళ్లి చేసుకుంటుంటే వాడెందుకేడుస్తున్నాడో అర్థంకాలేదు నాకు. అర్థవయ్యేటప్పటికి ఎప్పటిలానే ఆలస్యమైపోయింది.

వంటింట్లోంచి మళ్లీ చిటపటలు వినిపించాయి.

“పిల్చావా,” అన్నాను నేను ఉలిక్కిపడి.

“మిమ్మల్నెందుకు పిలవడం? మగ మహారాజులు. వంటింట్లో అడుగుపెడతారా? మావిడి కాయ పప్పులో పోపు తగలేస్తున్నాను,” అంది బంగారం చిటపటలాడుతూ.

ఓటి కుండకి మోతెక్కువని- కష్టపడేది నేను, ఆపసోపాలు పడేది బంగారం. నేను పొద్దుటే ఎనిమిది గంటలకి ఆదరాబాదరాగా ఏదో తిని వెళ్లిపోతాను. రెండు గంటల బస్సు ప్రయాణం- పది నుంచి అయిదున్నర దాకా ఆఫీసు- తిరిగి రెండు గంటల బస్సు ప్రయాణం- రాత్రి కొంప చేరేటప్పటికి ఎనిమిది దాటుతుంది. రోజుకు పన్నెండు గంటలు అవస్థపడి, సెలవు రోజుల్లో కొంచెం విశ్రాంతి తీసుకుందామంటే ఒకటే నస- ‘మీరు పనిచేసేది పన్నెండుగంటలే. నాది ఇరవై నాలుగ్గంటల చాకిరీ. వంటింట్లో మసిగుడ్డలా అయిపోయింది నా బతుకు,’ అంటూ మొదలు పెడుతుంది.

పరిమిత కుటుంబం ఎడ్వర్టయిజ్‌మెంటులా మేమిద్దరం, మాకిద్దరు- మొత్తం నలుగురు. గేస్ ఉంది. వంటింట్లో కుళాయి, సింకు ఉన్నాయి. కుక్కరు, మిక్సీ, వాషింగ్ మెషినులాంటి ఉపకరణాలున్నాయి. అంట్లు తోవడానికి పనిమనిషుంది. నలుగురికి వండి పెట్టడానికి తనేదో మహా కష్టపడిపోతున్నట్లు మాట్లాడుతుంది. సెలవు రోజుల్లో మరోసారి కాఫీ అడిగితే, ‘జీతం బత్తెం లేని నౌకరుందిగా గంట గంటకి కాఫీ అందించడానికి,’ అంటుంది.

*

పల్లకీ మోసే నాకంటే పల్లకీలోకూర్చున్న బంగారం గోల ఎక్కువైపోతోంది. తనేదో స్వేచ్ఛ కోల్పోయి, నాకూ, వంటింటికీ బానిసైపోతున్నానని ఒకటే బాధపడిపోతుంది. ‘ఒళ్లొంచి పని చెయ్యడం అలవాటులేక,’ అందామనిపిస్తుంది. అంటే పెద్ద నోరేసుకు పడిపోతుంది నా మీద. ఆడవాళ్ల నోటిపవరు అనుభవమే కనుక బంగారంతో వాదన పెట్టుకోకుండా, ఇల్లుకంటే వీధి పదిలం అనుకుని లేచాను.

“ఊరంతా బలాదూరు తిరిగి సాయంకాలం రాకండి. వచ్చేప్పుడు అరిటాకులు, కొబ్బరి కాయలు తీసుకురండి. రేపు ఆబ్దీకానికి ఆ బ్రాహ్మడు రెండింటికి తగలడతాడేమో? కొంచెం పెంద్రాళే చావమని చెప్పండి,” అంటూ మళ్లీ దండకం ప్రారంభిస్తుంటే నేను జోళ్లు తొడుక్కుని బయటికి నడిచాను.

గేస్‌వాడు, రేషన్‌వాడు, గాడిదగుడ్డుగాడు- అందరికీ అన్నీ చెప్పి, ‘ఆలస్యం చెయ్యకురా నాయనా!’ అని నారాయణ శాస్త్రులుగారబ్బాయి గడ్డం పట్టుకుని బతిమాలి, అరటి ఆకులకట్ట, కొబ్బరికాయలు కొని ఎల్జీ ఇంగువ సంచీలో పడేసి, ఎండలో మోసుకొస్తుంటే రామనాథంగారు మళ్లా గుర్తుకొచ్చారు. ‘బుర్ర మీద బుద్ధొచ్చేదాకా శతావధానం చెయ్యకుండా పాతిక మొట్టికాయ లతో పాఠం ఆపేసి, అర్థంతరంగా అలా వదిలేశారేమిటి మహాశయా,’ అనుకుంటూ పరధ్యానంగా రోడ్డు మధ్యన నడుస్తుంటే, ఓ కారు విసురుగా వచ్చి పక్కన ఆగింది. నేను ఉలిక్కిపడి గంతేశాను.

“ఏయ్ మిస్టర్! బతకాలని లేదా,” అన్నాడు కారులో ఉన్న వ్యక్తి నల్ల కళ్లద్దాల్లోంచి చూస్తూ.

నేను సారీ చెప్పబోతుండగా, “ఒరేయ్ నాగేశ్వర్రావ్, నువ్వా?” అన్నాడు శేఖర్ కారులోంచి దిగుతూ.

శేఖర్‌ది నా వయసేకాని పెద్ద వయస్సున్నవాడిలా కనిపించడం లేదు. ముప్పయ్యయిదు, నలభై ఏళ్లవాడిలా ఆరోగ్యంగా, ఆనందంగా, హుషారుగా, కాలేజీలో శేఖర్ ఎలా ఉండేవాడో అలాగే ఉన్నాడు. వాడితో నన్ను నేను పోల్చి చూసుకున్నాను. వాడు వాడి కొత్త మారుతీకారులో తళతళలాడుతుంటే నేను నా ఎల్జీ ఇంగువ సంచిలా వెలవెలబోతున్నాను.

"ఏవిటి- తెల్లప్యాంటు, తెల్ల షర్టు, మడత నలగనీయకుండా ఉండే అక్కినేని నాగేశ్వర్రావు ఇలా అయిపోయాడేవిటీ? ఈ మాసిన గడ్డమేవిటీ? ఈ అవతారమేవిటీ?'' అన్నాడు నన్ను చూసి.

"అక్కినేని నాగేశ్వర్రావు ముసిలాడైపోయాడు,'' అన్నాను దిగులుగా.

"నీ తలకాయ- నీ వయసెంతో నా వయసూ అంతే. పద కారెక్కు,'' అన్నాడు శేఖర్.

"ఎక్కడికి?''

"మా ఇంటికి. కాని, ముందు రెడీమేడ్ బట్టల దుకాణానికి. నిన్నీ వేషంలో చూడలేకపోతున్నాను,'' అంటూ నన్ను రెడీమేడ్ బట్టల దుకాణానికి తీసుకెళ్లి, నాకిష్టమైన తెల్ల ప్యాంటు, తెల్ల షర్టు కొన్నాడు. "ఆ చెప్పులు అవతల పడెయ్యి,'' అంటూ బాటాషాపుకి తీసుకెళ్లి ఎంబాసిడర్ బూట్లు కొన్నాడు. అవన్నీ కారులో పడేసి, వాడింటికి తీసుకెళ్లాడు.

వాడి ఫ్లాట్ చాలా బావుంది. హాల్లో ఎర్ర తివాచీ- సోఫాసెట్లు- పైన కప్పు నుంచి వేలాడుతున్న దీపాలగుత్తి. వాడి గది ఏ.సి గది. ఆడియో, వీడియో, ఫోను- అధునాతన జీవితం వాడిది. వాణ్ణి చూస్తే కొంచెం అసూయ కలిగింది.

"మీ ఆవిడ ఇంట్లో లేదా?'' అన్నాను, వాడు ఫ్రిజ్ తీసి ఇచ్చిన కోకాకోలా అందుకుంటూ.

"లేదు,'' అన్నాడు.

"అంటే...''

"పాలకోసం గేదెని పెంచడమంతటి బుద్ధితక్కువ పని లేదన్నారు పెద్దలు. వివరించి చెప్పాలా,'' అన్నాడు నవ్వుతూ.

పాలసంగతి దేవుడెరుగు, మా గేదెని, దూడల్ని పోషించడానికి నానా గడ్డి కరుస్తున్నాను నేను. శేఖర్‌లా పెళ్లి చేసుకోకుండా ఉంటే, బంగారమ్మ మొగుడిలా కాకుండా నేను నేనులా నా కోసం బతికితే, ఇంత ఆనందకరమైన జీవితం అనుభవించేవాణ్ణి కదా అన్న ఆలోచన కలిగింది. వివాహం పేరుతో ఆడది మగవాడి స్వేచ్ఛని హరించి, బానిసని చేసి, వాడి శ్రమశక్తిని దోచి, నిర్వీర్యుణ్ణి చేసి, ఎలా జీవచ్ఛవంలా మారుస్తోందో బాగా అనుభవమైన నాకు ఈ కుటుంబ వ్యవస్థ అంటే అసహ్యం కలిగింది. అసలు వివాహం లేకుండా, కుటుంబబాధ్యతలు లేకుండా, పువ్వు నుంచి పువ్వుకు ఎగిరే తుమ్మెదలా, స్వేచ్ఛగా మగవాడు విహరించగలిగితే ఎంత అద్భుతంగా ఉంటుంది?

"అందరూ నీలాంటి వాళ్లుంటే సమాజం ఎంత గొప్పగా ఉంటుంది,'' అన్నాను వాణ్ణి అభినందిస్తూ.

"సమాజం సంగతి సమాజంలో ఉన్నవాళ్లు ఏడుస్తారు కాని ముందు గడ్డం గీసుకుని, స్నానం చేసి, మునుపటి నాగేశ్వర్రావులా తయారయి రా! నే భరించలేకుండా ఉన్నాను,'' అన్నాడు శేఖర్.

శుభ్రంగా షేవ్ చేసుకుని, షాంపూతో స్నానం చేసి, తెల్ల షర్టు, తెల్ల ప్యాంటులో టక్‌చేసి అద్దం ముందు నిలబడి చూసుకుంటే పదేళ్లు వయసు తగ్గినట్లనిపించింది. శరీరానికి, మనసుకు కూడా మంచి హుషారు వచ్చింది.

"నిన్ను చూస్తుంటే పొద్దుట ఈ ఇంట్లో అడుగుపెట్టిన ఏడుపుగొట్టు మొహం ఇదనా అనిపిస్తోంది,'' అన్నాడు శేఖర్ ఆశ్చర్యంగా.

"నాకూ అలాగే అనిపిస్తోంది,'' అన్నాను నేను ఉత్సాహంగా.

శేఖర్ డ్రింక్స్ ఇచ్చాడు. హోటల్నించి భోజనం తెప్పించాడు. ఆరొందల పైన బిల్లయింది. నాలాంటి వాడికి ఆ స్వేచ్ఛాజీవితం ఒక తియ్యటి కల.

భోజనాలైన తర్వాత సిగరెట్టుపెట్టె తీసి, తనో సిగరెట్టు వెలిగించి, నాకోటి ఇచ్చాడు. గోల్డు ఫ్లేక్ కింగ్ సైజు సిగరెట్టు. శరీరం బీడీ లెవెల్‌కి దిగజారిపోయిన నాగేశ్వర్రావుగాడు ఇటువంటి సిగరెట్టు కాల్చి ఎన్నేళ్లయింది?

సిగరెట్టు తాగుతూ, "ఒరే నీకు గుర్తుందా- జయసింహ సినిమా చూసొచ్చి తాటికమ్మలతో, కొబ్బరిమట్టలతో స్టంటు చేస్తూ చచ్చేట్టు కొట్టుకున్నాం," అన్నాను బాల్యం గుర్తుచేస్తూ.

"అవును- జయం మనదేలో ఎన్.టి.ఆర్. గుఱ్రమెక్కినట్టు నువ్వు కూడా గుఱ్రవెక్కుతానని సరదాపడితే..." అంటూ ఆ విషయం గుర్తుచేశాడు శేఖర్ నవ్వుతూ.

నా ఈడు పిల్లల గేంగుకి నేనే లీడరుగా ఉండేవాణ్ణి. అట్లతద్దికి తెల్లవారకట్ల ఓ గాడిదని పట్టుకొచ్చారు మావాళ్లు. దాని మెడలో తాడు కట్టి, జయం మనదేలో ఎన్.టి.ఆర్.లా దాని మీద ఎక్కి కూర్చుని, 'పదండి సైనికులారా,' అన్నాను నా చేతిలో కఱ్ఱ కత్తిలా పైకెత్తి- పండుగాడి మీదకు యుద్ధానికి.

వాడు ఇంకో గాడిదెక్కి శత్రు సైన్యాన్ని నడిపిస్తున్నాడు.

నేను నా కత్తి అలా ఊపగానే, 'జై' అంటూ నా సేన పండుగాడి సైన్యం మీద కురికింది. ఆ గోలకి గాడిద కంగారుపడి పరిగెట్టింది. నేను బేలన్సు తప్పి గాడిద మీంచి కిందపడిపోయాను. దెబ్బ తగిలితే తగిలింది కాని, ఎన్.టి. రామారావుగారు రథవెక్కి ఆంధ్రదేశాన్ని జయించినప్పుడు కూడా అంత థ్రిల్ అనుభవించి ఉండరు.

చిన్ననాటి ముచ్చట్లు గుర్తుకు తెచ్చుకుని నవ్వుకున్నాం.

"ఒరే నువ్వు పాటలు బాగా పాడేవాడివి. ఏదీ ఓ పాట లాగించు. మర్చిపోయాను, అప్పట్నుంచీ పాడడం మానేశావు కదా." శేఖర్ నిట్టూర్చాడు. "ఈ సమాజం మగాణ్ణి ఎన్ని విధాలుగా హింసిస్తోంది? మగాణ్ణి మగాడిగా, స్వేచ్ఛగా వికసించనియ్యకుండా, శారీరకంగా, మానసికంగా అణచివేసి బానిసగా ఉంచడానికి ఎంత కుట్ర? నీ మనసు నీది కాదు, నీ శరీరం నీది కాదు, నీ కళ్లు నీవి కావు, నీ గొంతు నీది కాదు," అన్నాడు.

వసంతకాలం వస్తే కోయిల పాడడం, సినిమా చూసొస్తే నాగేశ్వర్రావుగాడు పాడడం సహజవని తెలియని ఈ సమాజం నాలోని కళాకారుణ్ణి ఎంత నిర్దయగా, నిరంకుశంగా హత్య చేసింది? మగవాడు వీధి గుమ్మంలో నిలబడి గొంతెత్తి పాడడం తప్పని తెలియని వయసు. 'చిలకమ్మ చిలకవే బంగారు చిలకవే- పంచవన్నెల రామచిలుకా,' అని పాట మొదలెట్టేసరికి ఎదురింటివారు, ఇరుగింటివారు, పొరుగింటివారు- అంతా పోగయ్యారు.

"మా అమ్మాయి అంజలీదేవి అంతటి అందగత్తే- ఒప్పుకుంటాను." పైన కిటికీలోంచి చూస్తున్న వాళ్లమ్మాయిని చూపిస్తూ మా నాన్నతో అన్నాడు ఎదురింటాయన. "కానీ, మీవాడు ఎన్.టి. రామారావు ననుకుంటున్నాడా- కస్తూరి శివరావులా మొహం వీడూను," అని నన్ను ఛడామడా దులిపేశాడు.

"మీ అమ్మాయి అంజలీదేవిలా ఉంటుందో లేదో నాకు తెలియదు కానీ, మా అమ్మాయి అచ్చు సావిత్రిలా ఉంటుంది- అరుగు మీద నిలబడ్డ దాన్ని చూసే పాడేడు ఈ వెధవ," అన్నాడు పొరుగింటాయన.

"జయం మనదేలో హీరోయిన్ అంజలీదేవి- సావిత్రి కాదు. ఇదేవన్నా మాయాబజార్ సినిమా పాట అనుకుంటున్నారా- రమణారెడ్డిలా మొహం మీరూను," అన్నాడు ఎదురింటాయన, పొరుగింటాయన కేసి తిరిగి.

ఎదురింటాయనా, పొరుగింటాయనా తనకి ఛాన్సు ఇవ్వకుండా వాళ్లిద్దరే ద్వంద్వ యుద్ధం చెయ్యడం ఇరుగింటాయనకి బాధ కలిగించింది కాబోలు, 'నేనూ ఉన్నాను ఇక్కడ,' అన్నట్లు

అంజలీదేవి తండ్రిగారి భుజం మీద తట్టి, ఆయన వెనక్కు తిరిగాకా, "అందర్నీ అంటున్నారు కానీ, మీ మొహం అద్దంలో ఎప్పుడేనా చూసుకున్నారా- జానీవాకర్లా మొహం మీరూను," అన్నాడు హుషారుగా రంగంలోకి దిగుతూ.

"అబ్బో- మీరే హిందీ సినిమాలు చూస్తారు- మాకు హిందీ తెలియదనుకోకండి- మేరా జూతా హై జపానీ మాకూ వచ్చు- బెజవాడెళ్లి టెన్ కమేండ్‌మెంట్సు చూసొచ్చినవాణ్ణి- మీరు నాకేం చెప్పక్కర్లేదు- ఛార్లీచాప్లిన్‌లా మొహం మీరూనూ," అంటూ ఎదురింటాయన, పొరుగింటాయన్ని వదిలేసి, ఇరుగింటాయన మీద విరుచుకుపడ్డాడు.

ఆ తర్వాత ఎవరు, ఎవరితో, ఎందుకు దెబ్బలాడుతున్నారో తెలియకుండా అందరూ అందరి మీదా అరుస్తూ పెద్దగా దెబ్బలాడుకోసాగారు.

నన్ను మర్చిపోయి అందరూ అలా బిజీ అయిపోతే, మా నాన్న నన్ను లోపలికి తీసుకెళ్లి- "ఒరే నాగేశ్వర్రావ్! ముల్లు ఆకుమీద పడ్డా, ఆకు ముల్లు మీద పడ్డా, 'వెధవ ముల్లు' అని ముల్లునే అంటారు కానీ ఆకునేవి అన్రా అది లోకం తీరు- అంచేత మగాడే జాగ్రత్తగా తలొంచుకు పోవాలి," అని మరో గొప్ప జీవితసూత్రాన్ని ఆవిష్కరించి, "నువ్వు మళ్లీ పాడితే నామీదొట్టే," అని ఒట్టు పెట్టాడు. ఆరోజు నుంచి నా కంఠం మూగపోయింది.

"నీ గొంతు నొక్కేసి తనేం కోల్పోయిందో ఈ లోకానికి తెలియదు," అన్నాడు పండు ఓదారుస్తూ.

"ఏం కోల్పోయింది?"

"ఓ మాధవపెద్ది సత్యాన్ని... ఓ మహ్మద్‌రఫీని... ఓ ఘంటసాలని," అన్నాడు పండు.

"అవును- పండు ఎక్కడున్నాడు- నీకేవన్నా తెల్సా," అనడిగాను శేఖర్‌ని, పండు గుర్తుకొచ్చి.

"ఆ వెధవ పేరు నా దగ్గరెత్తకు. ఓ ఆడదాని కోసం, అదే జీవితవన్నట్లు, 'నన్ను పెళ్లి చేసుకో అంటూ ఆత్మాభిమానం వదిలేసి, కాళ్లావేళ్లా పడే సన్నాసి నా స్నేహితుడు కాడు. ఆడంటే నాకు అసహ్యం," అన్నాడు శేఖర్ చిరాగ్గా.

కాలేజీ రోజుల్లో పండుకి బి. సరోజాదేవి అంటే పిచ్చి. పెళ్లికానుక సినిమా ఇరవై ఎనిమిది సార్లు చూశాడు. విశాల, బి. సరోజాదేవిలా ఉంటుందనేవాడు. ఆ అమ్మాయి కాలేజీకి వెడుతుంటే సైకిలు బెల్లు కొట్టి, *కన్నులతో పలకరించు వలపులు...* అని పాడేవాడు. ఓరోజు విశాల కనిపించక పోతే, *నిను చూడని దినము నాకొక యుగము...* అనేవాడు. పెళ్లి చేసుకుంటే విశాలనే చేసుకుంటా ననీ, లేకపోతే సన్యసిస్తానని అనేవాడు. కాలేజీ తర్వాత వాడేవైపోయాడో తెలియలేదు- ఇప్పుడెక్క డున్నాడో ఏవిటో?

కబుర్లలో కాలం తెలియకుండానే గడచిపోయింది. సాయంత్రం అయిదైంది. ఇంటి దగ్గర మా దయ్యం కారాలు, మిరియాలు నూరుకొంటుంది. "ఇంక వెళ్లొస్తా," అంటూ లేచి నిలబడి జేబులో చెయ్యి పెడితే రెండు రూపాయల బిళ్లలు తగిలాయి. వచ్చేటప్పుడు శేఖర్ కారులో తీసుకొచ్చాడు. వెళ్లేటప్పుడు బస్సులో వెళ్లాలి గదా!

"ఒరే శేఖర్!" అన్నాను దీనంగా, ఇబ్బందిగా కదులుతూ, "ఓ పది రూపాయలిస్తావా?"

శేఖర్ కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఓ వంద రూపాయల నోటు తీసి నా జేబులో పెడుతూ, "పెళ్లయిన మగాడి బతుకు ఎలా ఉంటుందో నాకు తెలియదనుకోకు బ్రదర్! 'ఉరికంబవెక్కు తున్నావురా వెధవా,' అని అప్పుడే వార్నింగిచ్చాను. గుర్తుందా. విన్నావు కాదు. పెళ్లి పెళ్లంటూ మీకోసం మీరే అందమైన పంజరం కట్టుకుని మురిసిపోయే మూర్ఖులు మీరు. మీ పెళ్లాంపిల్లల కోసం గానుగెద్దుల్లా బతుకుతారు. మీ సుఖం మీకు తెలియదు. స్వేచ్ఛ అన్నా, వెలుగన్నా భయం

మీకు. బంధాలు తెంచుకు బయటపడలేరు. మీరు వెన్నెముకలు లేనివాళ్లు. మీరంటే నాకు సానుభూతి లేదు. గెటౌట్,'' అన్నాడు కళ్లు తుడుచుకుంటూ.

శేఖర్ అలా అన్నది కోపంతో కాదనీ, నాలాంటి సోదర మగ అభాగ్యుల మీద జాలితో అని తెలుసు నాకు.

ఖైదీ జైలుకి చేరే వేళయింది. నేను నా ఎల్జీ ఇంగువ సంచి అందుకుని లేచాను. సంచి చేతికి రాగానే నా వయసు హఠాత్తుగా పెరిగినట్లయి, నీరసం ముంచుకొచ్చింది. అలాగే నీరసంగా వీధిలోకి నడిచాను. నడుస్తూ ఆలోచించసాగాను- నేను జీవిస్తున్న జీవితం నిజంగా జీవితమేనా? అసలు ఇది జీవితవేనా? నేను నేనుగా, స్వేచ్ఛగా- బంగారం మొగుడిలా, పిల్లపిశాచాల తండ్రిగా, ఎల్జీ ఇంగువ సంచిలా కాకుండా- ఒరిజినల్ నాగేశ్వర్రావులా బతకలేనా? ఎందుకు బతకలేను? బతుకుతాను. ఈ జీవితం నాది. నా ఇష్టం వచ్చినట్లు స్వేచ్ఛగా, హాయిగా బతుకుతాను- బంగారం- గో టు హెల్... టా... టా...

'యాహూ' అంటూ అరిటాకుల కట్ట పైకెగరేశాను. నా పక్కన నడుస్తున్నాయన కొంచెం కంగారుపడి చూశాడు. కొబ్బరికాయలు రోడ్డు మీద పడేసి ఫుట్‌బాల్ తన్నినట్లు అటూ ఇటూ తన్నేను. నా ఫుట్‌బాల్ ఒకటి కొంచెం ముందు నడుస్తున్న భార్యాభర్తలకు తగిలి వాళ్లు వెనక్కు తిరిగారు. అతను నాకేసి తిరిగి ఏదో అనబోతూంటే, "అతని వాలకం ఏదోలాగుంది- మీదపడి కరుస్తాడేమో- వెధవ సంత- మనకెందుకొచ్చింది,'' అంటూ మొగుణ్ణి చెయ్యి పట్టుకుని బరబర ఈడ్చుకుపోయింది ఆవిడ.

రోడ్డు మీద నడుస్తున్నవాళ్లు ఆగిపోయి నాకేసే చూడసాగారు. వాళ్లందరూ వీడికి పిచ్చెక్కలేదు కదా అనుకుంటున్నారు. నాకు తెలుసు, నేనెవరినీ లెక్కచెయ్యను. ఆటో పిలిచాను.

"ఎక్కడికి సార్,'' అన్నాడు ఆటోవాడు.

"సినిమాకి,'' అన్నాను ఎక్కి కూచుంటూ.

"ఏ సినిమాకి?''

"ఏ సినిమా అయినా ఫరవాలేదు,'' అన్నాను.

ఆటోవాడికి కూడా అనుమానం వచ్చి ఉంటుంది. అదోలా చూశాడు.

వాడు ఏదో హాలు దగ్గర దింపి వెళ్లిపోయాడు. నేను సినిమా చూశాను. ఏ సినిమా చూశానో నాకు గుర్తులేదు. అది ముఖ్యం కాదు- నేను సినిమాకి వెళ్లాలనుకున్నప్పుడు మరొకరి ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా వెళ్లగలిగాను. సినిమా మధ్యలో బయటకు వచ్చేశాను. గోల్డుఫ్లేక్ కింగ్ సైజు సిగరెట్టు పేకెట్టు కొని, సిగరెట్టు మీద సిగరెట్టు ఊదుతూ, ఆడుతూ, పాడుతూ, తుళ్లుతూ రోడ్డు మీద నడవడం మొదలుపెట్టాను. రాత్రి తొమ్మిదింటికి రోడ్డు మీద అలా నడుస్తున్న నన్ను చూసిన వాళ్లంతా తాగేననుకుంటారు. స్వేచ్ఛ నిషా తలకెక్కిందని వాళ్లకేం తెల్సు?

బీచి దగ్గరికి వచ్చేటప్పటికి నా మనసు, జేబు తేలికైపోయాయి. అక్కడ కాళ్లు ఆగిపోయాయి. ఎన్ని మధురస్మృతులతో ముడిపడింది ఈ బీచి? నేను ఇసుకను కాళ్లతో అటూ ఇటూ తన్నుతూ నడవడం మొదలుపెట్టాను.

'నా బ్రతుకే ఒక నాటకము- కానిక కన్నది కైవల్యము' - కాషాయవస్త్రాలు ధరించిన స్వామీజీ ఒకరు ఓ బండ మీద కూర్చుని, గొంతెత్తి పాటలో లీనమై పాడుతున్నారు.

ఈయన జీవితం ఎంత నిశ్చింతగా ఉంటుంది? ఏ బాదరబందీ లేదు. స్వామీజీ దగ్గర సన్యాసం తీసుకుంటే? ఆయన్ను చూస్తే నా విముక్తికి మార్గం కనిపించింది.

"జై సద్గురు," అంటూ ఆయన పాదాల దగ్గర సన్యాసం తీసుకుంటే? ఆయన్ను చూస్తే నా విముక్తికి మార్గం కనిపించింది.

"ఎవరు నాయనా నువ్వు? ఏం కావాలి?" అన్నారు స్వామీజీ నన్ను లేవదీసి.

దబ్బపండులాంటి శరీరం స్వామీజీది. మసక వెన్నెల్లో ఆయన ముఖకవళికలు అస్పష్టంగా కనిపిస్తున్నాయి. చంద్రుణ్ణి మబ్బులు కమ్మేసినట్లు ఆయన ముఖమండలాన్ని మూడొంతులు గడ్డాలూ, మీసాలు మింగేసినా, ఎందుకో నాకు ఆ మొహం పరిచితమే అనిపించింది.

నా కథంతా వివరించాను.

"ఇల్లు ఇర్కటం... ఆలి మర్కటం," అన్నారు స్వామీజీ నిట్టూర్చి.

ఆయన ఏమంటున్నారో నాకు అర్థంకాలేదు. "నాకు మనశ్శాంతి కావాలి స్వామీ," అన్నాను.

"మనిషికో దేహం... మనసుకో దాహం," అన్నారు స్వామీజీ మళ్లా నిట్టూర్చి.

స్వామీజీ అల్పాక్షరాలలో అనల్పార్థాన్ని ఇమడ్చగల జ్ఞానసముద్రులే కావచ్చు కాని, నాకొక్క ముక్క అర్థంకాలేదు.

"అర్థం సెలవియ్యండి," అన్నాను వినయంగా.

"గొప్ప గొప్ప మాటలకు అంతరార్థాలు వెతకాలి కానీ, అర్థాలు అడక్కూడదు నాయనా," అన్నాడు స్వామీజీ మందలిస్తున్నట్లు.

"అజ్ఞానిని స్వామీ!"

"మాకు తెల్సు వత్సా," అని విషాదంగా నవ్వారు స్వామీజీ. ఆ నవ్వు కూడా ఎక్కడో చూసినట్లనిపించింది.

"స్వామీజీ మీరేమీ అనుకోకపోతే ఓ మాట అడగనా," అన్నాను.

"అడుగు నాయనా."

"మిమ్మల్నెక్కడో చూసినట్లుగా ఉంది," అన్నాను, గుర్తుకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ.

స్వామీజీ చిరునవ్వుతో నాకేసి చూశారు. "చూసినట్లుగా ఉండటం కాదు చూశావు వత్సా," అన్నారు ఆప్యాయంగా.

ఈసారి స్వామీజీ గొంతు కూడా ఎక్కడో విన్నట్లనిపించింది. "ఎక్కడ స్వామీ," అన్నాను బుర్ర గోక్కుంటూ.

"నీకు పండరీనాథ్ అని ఓ మిత్రుడుండేవాడు కదా నాయనా..."

"మీరు... నువ్వు... పండువా," అన్నాను పండుని కౌగలించుకుంటూ. చివరికి అన్నంతపనీ చేశాడన్నమాట. ఒక్కో మగజీవుడు ముక్తికి ఒక్కో మార్గం వెతుక్కుంటున్నాడు కాబోలు.

"పండూ... బి. సరోజాదేవి..." స్వామీజీ మొహం వివర్ణమైంది. నేను నిట్టూర్చాను. "మీ ఇద్దరికీ ఈడూ జోడూ బాగుంటుంది అనుకునేవాళ్లం- సన్నగా, సంపెంగలా ఎంత అందంగా ఉండేది. అందానికి వన్నె తెచ్చినట్లు అణకువ, నెమ్మదస్తురాలు- మొగుడెవరో కాని, అదృష్ట వంతుడు," అన్నాను.

కళ్లలో తిరుగుతున్న నీళ్లు బలవంతంగా ఆపుకుంటూ, గద్గద కంఠంతో అన్నారు స్వామి పండరీనాథ్, "ఆ అదృష్టవంతుణ్ణి నేనే వత్సా!"

*ఇండియా టుడే*
*జూన్-జులై 1995*

## నేపథ్యం

ఒక మగవాద కథ

# మ'గోడు'

***కొందరు అభ్యుదయవాదులు, నాలుగు గోడల మధ్యనున్న స్త్రీ నేడు బయటికి వచ్చి తన సమస్యల గురించి రాస్తున్నప్పుడు హర్షించాలనీ, ఏవో చిన్నచిన్న అభిప్రాయభేదాలున్నా, వారిని పబ్లిగ్గా విమర్శించ కూడదనీ అంటున్నారు కాని, అసలు ఈ స్త్రీవాదంలోనే ఒక అరాచకత్వం ఉందనీ, వర్గవైరుధ్యాలకు ప్రత్యామ్నాయంగా సెక్సు వైరుధ్యాలని నిలపడంలోనే ఒక ద్రోహం ఉందని గుర్తించినట్టు కనిపించదు.***

నేను రాసిన కథ మ'గోడు', ఇండియా టుడే జూన్ 21-5, జులై 1995 సంచికలో ప్రచురింపబడింది. ఈ కథ నా మిత్రుల తీవ్ర విమర్శకు గురైంది. స్త్రీవాదాన్ని అపహాస్యంచేస్తూ ఆ కథని నేను వేళాకోళంగా 'మగవాద కథ' అనడంతో స్త్రీవాదానికి పోటీగా నేను 'మగవాదం' నిలబెడుతున్నట్టు కొందరు భావించారు. మిత్రుడు వాసిరెడ్డి నవీన్ ఈ కథ చదవక్కర్లేదనే అభిప్రాయానికొచ్చినట్టు చెప్పారు. ఇది విజ్ఞత లేని కథగా వర్ణించారు కొందరు. ఈ కథ మిత్రులకే కాదు- మా ఇంట్లో మా ఆవిడకీ, అమ్మాయికీ, అబ్బాయికీ- ఎవరికీ నచ్చలేదు. వాళ్ళు ఈ కథ ఏ పత్రికకీ పంపించ డానికి వీల్లేదని అడ్డుపడ్డారు. ఎవరూ ప్రచురించరు అనుకొంటూనే ఇండియా టుడేకి పంపిస్తే వారు వెంటనే ఆ కథ ప్రచురించారు. నేను ఈ కథని సరదాగా, 'నలుగురికీ (నలుగురికి మాత్రమే) నచ్చిన కథ,' అంటాను. చివరకు ఈ సంఖ్య ఓ పదిదాకా పెరిగి, 'పదిమందికీ నచ్చిన కథ' అయింది.

ఈ కథ నేనెందుకు రాసేనో వివరించే ముందు క్లుప్తంగా కథ గురించి చెబుతాను.

ఇది ముగ్గురు మగవాళ్ళ కథ. అయిదు పదులు నిండిన మన హీరోగారు, ఓరోజు ఉదయం తీరిగ్గా పడకకుర్చీలో వాలి, తన చిన్నతనం గుర్తుకు తెచ్చు

కొంటారు. చిన్నప్పుడు స్కూల్లో ఎనిమిదో క్లాసులో అతను ఓ ప్రేమలేఖ రాయగా, గయ్యాళి పెళ్ళాంతో దుర్భర జీవితం గడుపుతున్న తెలుగు మాష్టారు, 'వెధవా! చక్కగా చదువుకొని, హాయిగా ఉద్యోగం చేసుకు బ్రతకక ప్రేమా, పెళ్ళీ అంటూ ఆ ఊబిలోకి దిగుతావేంరా,' అని మొట్టికాయలతో పాఠం చెప్పాడు. వయసొచ్చిన తర్వాత పెళ్ళి చేసుకోబోతుంటే, స్నేహితుడు అడ్డుపడి, 'పెళ్ళి చేసుకొని నీ స్వేచ్ఛ కోల్పోతున్నావురోయ్- ఫుట్‌బాల్ ఛాంపియన్ని అని రొమ్ములు విరుచుకు తిరిగేవాడివి. నిన్ను ఇప్పుడు అందరూ ఫుట్‌బాల్ తన్నినట్టు తంతారురోయ్!'' అని కళ్ళనీళ్ళు పెట్టుకొని (స్త్రీవాదుల కథల్లో స్వేచ్ఛాపథంలో నడుస్తున్న స్త్రీ పెళ్ళి చేసుకోబోతున్న స్నేహితురాల్ని హెచ్చరించినట్టు) హెచ్చరించినా వినడు. ఎవడి మాటా వినకుండా పెళ్ళి చేసుకొని, 'కష్టాల ఊబిలో' దిగబడిపోయి, జీవితం వృధా అయిపోయిందని విచారిస్తుంటే, పెళ్ళి చేసుకోవద్దని సలహా ఇచ్చిన స్నేహితుడు ఎదురవుతాడు. పెళ్ళీ పెటాకులూ, పిల్లా మేకా ఏవీ లేకుండా, మనసైనప్పుడు మనసైన స్త్రీని అనుభవిస్తూ, స్త్రీవాదులు ఉవ్విళ్ళూరించేట్లు వర్ణించే 'స్వేచ్ఛా జీవితం' అనుభవి స్తున్నాడు అతను. అతనితో పోల్చి చేసుకొని, 'నేనూ పెళ్ళి చేసుకోకుండా ఉంటే హాయిగా ఉండే వాడిని కదా,' అని (స్త్రీవాదుల కథల్లో హీరోయిన్లా) చింతిస్తాడు. వాళ్ళ కబుర్లలో మూడో స్నేహితుడి ప్రసక్తి వస్తుంది. ఇతను ఒక అమ్మాయిని ప్రేమించి ఆ అమ్మాయితో పెళ్ళి కాకపోతే సన్యసిస్తా నంటుండేవాడు. కబుర్లయ్యాక ఎల్జీ ఇంగువ సంచి, అరిటాకుల కట్టా తీసుకొని ఇంటికి తిరిగి వెడుతుంటే మన హీరోగారికి 'జ్ఞానోదయం' అవుతుంది. 'నేను బంగారమ్మ మొగుడిలా, పిల్ల పిశాచాల తండ్రిగా నా జీవితం నాశనం చేసుకోను. ఈ జీవితం నాది. నా బ్రతుకు నేను స్వేచ్ఛగా బ్రతుకుతాను,' అని (స్త్రీవాదుల హీరోయిన్ లాగానే) అనుకొంటాడు. స్వేచ్ఛ నిషా తలకెక్కి, తూలుతూ, పాతరోజులు గుర్తుకు తెచ్చుకొంటూ హుషారుగా బీచికి దారితీస్తాడు. అక్కడ తత్త్వాలు పాడుకొంటున్న స్వామీజీని తన రెండో స్నేహితుడుగా గుర్తిస్తాడు. విశాలని పెళ్ళి చేసుకోలేక వీడు చివరికి సన్యాసి అయిపోయాడన్నమాట అని బాధపడి, ఆ అమ్మాయి అందం, తెలివితేటలు, అన్నీ గుర్తుకు తెచ్చుకొని, 'విశాలని పెళ్ళి చేసుకొన్న అదృష్టవంతుడెవరో,' అంటాడు. స్వామీజీ కళ్ళల్లో నీళ్ళు చిమ్ముతాయి. గద్గద కంఠంతో, 'ఆ అదృష్టవంతుడిని నేనే వత్సా,' అంటాడు.

స్త్రీవాదులు డిమాండు చేసే బాధ్యతారహితమైన 'స్వేచ్ఛ' మీద సెటైర్-సంసారంలో మగవాడి గోడు, మ'గోడు'. ఈ కథకు గల సామాజిక, రాజకీయ నేపథ్యాన్ని వివరించాలంటే ముందు స్త్రీవాదం గురించి చెప్పాల్సిన అవసరం ఉంది.

స్త్రీవాదం అనగానే ఏది స్త్రీవాదం అన్న సమస్య వస్తోంది. స్త్రీవాదులు ఒక్కొక్కరు ఒక్కొక్క గొంతుకతో మాట్లాడుతున్నట్టనిపిస్తుంది. స్త్రీవాదం అంటే స్త్రీపురుష సమానత్వం కోరే స్త్రీ చైతన్యీకరణ వాదం అంటారు కొందరు. సమానత్వం కాదు స్త్రీవాదం కోరేది. కుటుంబాన్ని ధ్వంసం చేసి, కుటుంబాన్నుంచి స్త్రీని విముక్తి చేయాలంటారు కొందరు. కుటుంబ విచ్ఛిన్నం కావాలని ఎవరంటున్నారని డబాయిస్తారు ఒకరు. పైటలు తగలేసి, భాష మార్చి స్త్రీ విముక్తికి బాటలు వెయ్యాలంటూ ఒకరు గుర్రానికి ముందు బండి కట్టి చావబాదుతుంటే, ఇంకొందరు లైంగిక స్వేచ్ఛ స్త్రీ విముక్తికి దారన్నట్లు లైంగిక స్వేచ్ఛ ప్రచారం చేస్తారు. కొందరు గడుసుగా రకరకాల స్థాయిలలో ప్రశ్నలు లేవనెత్తుతున్నప్పుడు ఫెమినిస్టు రాజకీయాలు కూడా ఖచ్చితంగా ఇవీ అని చెప్పే అవకాశం లేదు అని తమ అవగాహనా లేమిని బాధ్యతారహితంగా సమర్థించుకో జూస్తారు.

గందరగోళంలో తిరుగుతూ గందరగోళం సృష్టించడం తప్ప వీరికి స్పష్టమైన సైద్ధాంతిక దృక్పథమేమీ ఉన్నట్టు కనిపించదు.

స్త్రీవాదం అంటే ఎవరికి తోచినది వారు చెబుతున్నప్పుడు, నేను కూడా ఏ స్త్రీవాదాన్ని అపహాస్యం చేస్తూ ఈ కథ రాశానో చెప్పకపోతే నేను స్త్రీ జాతికి విరోధిగా చిత్రించబడే ప్రమాద ముంది.

నేడు ఉన్న అసమసంబంధాలు పోయి, స్త్రీకి కుటుంబంలో, సమాజంలో పురుషుడితో పాటు సమానత్వం కావాలి. కాని ఇది స్త్రీ ఒక్కర్తే ఎవరి సహకారం లేకుండా సాధించలేదు. స్త్రీలతోపాటు పురుషులూ కృషి చెయ్యాలి. స్త్రీలు, పురుషులు రెండు శత్రువర్గాలు కాదు. స్త్రీ విద్యా వంతురాలు, ఆర్థికంగా స్వతంత్రురాలు అవడం స్త్రీ పురోగమానికి పునాది. నేడు స్త్రీ వెనుకబడి ఉండటానికి ప్రధాన కారణం మగవాడు కాదు- నేడు నెలకొని ఉన్న సామాజిక రాజకీయార్థిక వ్యవస్థ. బాణాన్ని ఎక్కు పెట్టాల్సింది మగవాడి మీద కాదు- వ్యవస్థ మీద. ఈ రకమైన అవగాహనతో మహిళాభ్యుదయానికి (దాన్ని నేను స్త్రీ విముక్తి అనను) కృషిచేస్తున్న వారితో నాకు అభిప్రాయ భేదాలేమీ లేవు. వీరిలో కొందరు స్త్రీవాదుల భాష మాట్లాడుతూ, వారితో గుర్తింపు కోసం పోటీపడు తున్నట్లు కనిపిస్తుంది కాని, వీరిని స్త్రీ చైతన్యం కోసం కృషిచేస్తున్న వారిగానే గుర్తిస్తాను కాని స్త్రీవాదులనను.

వీరుకాక స్త్రీవాదం పేరిట ఒక అశాస్త్రీయ, అరాచకవాదాన్ని ప్రచారం చేసే స్త్రీవాదులున్నారు. వీళ్ళకి ఈ వ్యవస్థ డబ్బున్న మగవాళ్ళ వ్యవస్థలా కనిపిస్తుంది. వీళ్ళకి మగాడు ప్రధాన శత్రువు. వర్గ పోరాటానికి ప్రత్యామ్నాయంగా స్త్రీ పురుష సంఘర్షణ మన ముందుంచుతారు. కుటుంబం ఉన్నంతవరకు స్త్రీకి స్వేచ్ఛ లేదంటూ, కుటుంబం ధ్వంసం చేసి ఇల్లు పీకి పందిరేస్తానంటారు. వివాహవ్యవస్థ స్త్రీని అణచి ఉంచడానికి చేసే కుట్రగా వర్ణించి, వివాహేతర లైంగిక సంబంధాలు అనుభవించిన స్త్రీ ధైర్యంగా, హుందాగా ఉన్నట్టు, ఆ శృంగారానుభవం జీవిత సమతుల్యతను సాధించినట్టు చిత్రిస్తూ, లైంగిక స్వేచ్ఛను ప్రచారం చేస్తారు. వీళ్ళు జండర్, వర్గం అంటూ నేల విడిచి సాము చేస్తూ, మాటలపై స్వారీచేసి కోటలు దాటుతారు. ఏవన్నా అంటే సైమన్ ది బోయర్, లూసీ ఐరిగారే అంటూ మొదలుపెడతారు కాని వీళ్ళు ఇక్కడ ఏం చెయ్య దల్చుకొన్నారో చెప్పరు. స్త్రీల సమస్యల మూలాల్లోకి పోకుండా, కంద దురదకీ, కత్తిపీట పదునుకీ మగాడినే నిందిస్తూ సంచలనాత్మక రచనలు చేస్తూ గుర్తింపు కోసం తాపత్రయపడే కెరీరిస్టులు వీళ్ళు.

వీళ్ళనే నేను స్త్రీవాదులుగా గుర్తించేది. వీళ్ళ వాదాన్నే స్త్రీవాదంగా భావించి విమర్శించేది.

కొందరు అభ్యుదయవాదులు, నాలుగు గోడల మధ్యనున్న స్త్రీ నేడు బయటికి వచ్చి తన సమస్యల గురించి రాస్తున్నప్పుడు హర్షించాలనీ, ఏవో చిన్నచిన్న అభిప్రాయభేదాలున్నా, వారిని పబ్లిగ్గా విమర్శించకూడదనీ అంటున్నారు కాని, అసలు ఈ స్త్రీవాదంలోనే ఒక అరాచకత్వం ఉందనీ, వర్గవైరుధ్యాలకు ప్రత్యామ్నాయంగా సెక్సు వైరుధ్యాలని నిలపడంలోనే ఒక ద్రోహం ఉందని గుర్తించినట్టు కనిపించదు.

టైమ్స్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ ఎడిషన్) డిసెంబరు 10, 1996న ఒక వార్త మొదటి పేజీలో ప్రముఖంగా ప్రచురింపబడింది. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలితగారి ఆస్తిపాస్తుల వివరాలు- 28 కేజీల బంగారు నగలు (700 జతల బంగారుగాజులు, అమూల్యమైన వజ్రాలు పొదగబడ్డ నగలు, వజ్రాల దుద్దులు, నెక్లెసులు, వడ్డాణాలు, వగైరాలతోపాటు ఒక

బంగారు డిన్నర్ ప్లేటు), 800 కేజీల వెండి వస్తువులు, తొంభై లక్షల రూపాయలు విలువచేసే 10,500 చీరలు (అందులో 750 విలువైన పట్టుచీరలు), రెండు లక్షల ఇరవై అయిదువేలు విలువ చేసే మేచింగ్ చెప్పుల జతలు 750, 91 రిస్టువాచీలు, 44 ఎయిర్ కండిషనర్లు, పంథొమ్మిది కార్లు, ఏభైలక్షల విలువ చేసే ఫర్నిచరు- ఇవికాక ఇరవై అయిదుకోట్లు పెట్టి కొన్న ఆస్తిపాస్తులకు సంబంధించిన పత్రాలు (వాటి మార్కెట్ విలువ ఈనాడు ఎంత ఉంటుందో అంచనా వెయ్యాలిట), స్థలం విలువ కాక ఆవిడ భవనాల విలువ పదిహేను కోట్లు- అయిదవ అంతస్తులో మినీ సినిమా థియేటర్, ఆవిడకి తమిళనాడులోను, హైదరాబాద్‌లోను ఉన్న ఆస్తుల విలువ దాదాపు వంద కోట్లుండవచ్చని అంచనా.

ఇది నాణేనికి ఒకవైపు-

అదే సంచికలో, అదే పేజీలో, ఎనిమిదవ కాలంలో మరొక వార్త వచ్చింది. కర్ణాటకలో మాండ్య జిల్లా, మురుకునహళ్ళి గ్రామంలో తాయమ్మ అనే స్త్రీ తన స్థలంలోంచి రోడ్డు వేసే విషయమై గ్రామపెద్దలతో సహకరించ నిరాకరించింది. మాజీ గ్రామ పంచాయితీ ప్రెసిడెంటు కొడుకు సురేష్ ఆమె చేనిలో తన పశువుల్ని మేప ప్రయత్నించగా, ఆమె అడ్డుపడింది. ఘర్షణ జరిగింది. గ్రామపెద్దలు పంచాయితీ జరిపి, వెయ్యిన్నొక రూపాయలు జరిమానా విధించడమే కాకుండా, తాయమ్మని వివస్త్రను చెయ్యాలని ఆదేశించగా, ముగ్గురు స్త్రీలు పలుగురి ఎదుట తాయమ్మ బట్టలూడదీసి గుంజకు కట్టేశారు.

ఈ అవమానం భరించలేక తాయమ్మ మర్నాడు ఆత్మహత్య చేసుకొంది.

ఇది నాణేనికి రెండో వైపు...

ఇద్దరూ స్త్రీలే.

స్త్రీవాదుల దృష్టిలో జయలలిత, తాయమ్మ- ఇద్దరూ ఈ డబ్బున్న మగవాళ్ళ వ్యవస్థలో అణచివేతకు గురవుతున్న స్త్రీలే. ఒకరు ఈ పైశాచిక పితృస్వామ్య వ్యవస్థలో మణుగుల బంగారం కింద అణగిపోతున్నవారు- కార్లకు, బార్లకు బందీలు, స్వేచ్ఛ తెలియని విహంగాలు, ధనికవర్గపు దరిద్రాలు. మరొకరు పొద్దస్తమానూ పనిచేస్తే వచ్చిన ఆడకూలీ డబ్బులతో (గమనించండి: ఆడకూలీ డబ్బులే- మగకూలీలు కుటుంబంలో పీడకులే) పిల్లలకింత గంజి పోద్దామంటే తాగిన మొగుడి తన్నులకు, ఆగని బిడ్డల ఏడుపుకు భరించలేక విషం పెట్టిన పవిత్ర మాతృదేవతల వర్గానికి చెందినవారు. అణచివేయబడుతున్న తాయమ్మలు, జయలలితలు తోబుట్టువుల్లా చేయి చేయీ కలిపి ఈ పురుషస్వామ్య వ్యవస్థను వేళ్ళతో సహా పెకిలించేసేందుకు తాయమ్మలు, జయమ్మలు ఒకటి అవుతారా అని ఎవరైనా సందేహజీవులు ప్రశ్నిస్తే, వారు చాలా తేలికగా ఇచ్చే సమాధానం ఏమిటంటే-

జయలలితలు పురుష రాజకీయాలనే రాజకీయాలని నమ్మి, ఆ రాజకీయ విలువల్నీ, పద్ధతుల్నీ పట్టుకొని పైకి వచ్చారట. వాళ్ళు స్త్రీలుగా రాజకీయాల్లోకి రాలేరుట. స్త్రీలు తమ రాజకీయాల్ని కొత్తగా నిర్మించుకొని కొత్త పద్ధతిలో స్త్రీల రాజకీయపార్టీ పెడితే దేశాన్ని బాగు చెయ్యగలరుట. స్త్రీలు బాగున్నారుట. ప్రజాస్వామికంగా ఉన్నారుట.

వర్గ రాజకీయాలకి తిలోదకాలిచ్చిన సెక్సు రాజకీయాల నిజస్వరూపం ఇది. స్త్రీల దృష్టితో ప్రపంచాన్ని పరిశీలించే ఒంటికంటి చూపు స్త్రీవాదులకి కనుపించే చిత్రం ఇది. తమ సిద్ధాంతంలోనూ, ఆచరణలోనూ జండర్, వర్గం సమాన ప్రాధాన్యత కలిగి ఉంటాయని చెప్పే సోషలిస్టు ఫెమినిస్టుల దివాళాకోరు రాజకీయాల నగ్న స్వరూపం ఇది.

అయినా అభ్యుదయవాదులమని చెప్పుకొనేవారు వర్గపోరాటాల గురించి మాట్లాడే విప్లవ మేధావులు, ఈ వర్గ విద్రోహకర వాదాన్ని నెత్తిన మోసుకు తిరగడం నాకు చాలా ఆశ్చర్యాన్ని, ఆవేదనని కలిగించింది. ఈ రాజకీయ నేపథ్యమే నా కథకు ప్రేరణ అయింది.

స్త్రీ సమస్యలకి క్విక్-ఫిక్స్ సొల్యూషన్సు ఏవీ లేవు. అలాంటి పరిష్కారాలు ఆశించే స్త్రీలకు చాలా నిరుత్సాహం కలిగించే కఠోర వాస్తవం ఏవిటంటే సమాజంలో అన్ని వర్గాల తర్వాత చిట్టచివరన విముక్తి పొందేది స్త్రీలే. నిజమైన స్త్రీ విముక్తి ఇల్లు, వంటిల్లు, పిల్ల పెంపకంలాంటి గృహ సమస్యలన్నింటినీ పరిష్కరించగల అత్యున్నత సమాజం ఉద్భవించినప్పుడే సాధ్యమవు తుంది. ఆ సమాజ స్వరూప, స్వభావాలు మన ఊహకు అందనివి. అది ఇప్పట్లో సాధ్యమయేది కాదు- శతాబ్దాలు పట్టవచ్చు. ఆ దిశగా ఓపిగ్గా కృషి చెయ్యకుండా, ఇన్‌స్టంట్ పరిష్కారాలు సూచిస్తూ అరిచేతుల్లో స్వర్గం చూపించేవారు స్త్రీజాతికి ద్రోహులే.

అలా అరిచేతుల్లో స్వర్గం చూపించే భావన 'స్వేచ్ఛ.' ఈ జీవితం నా స్వంతం. నా స్వేచ్ఛ మీద పరిమితులు విధించే అధికారం కుటుంబానికి కాని, సమాజానికి కాని లేదు అంటూ, 'వ్యక్తి స్వేచ్ఛ' వాదాన్ని ప్రచారం చేస్తున్నారు స్త్రీవాదులు. అటువంటి స్వేచ్ఛ పురుషుడు కోరితే ఎలా ఉంటుందో చూపించిన కథ *మ'గోడు.'*

సెటైర్ రాయడంలో ఓ టెక్నిక్ ఉంది- రచయిత దేనిని అపహాస్యం చెయ్యాలనుకొంటు న్నాడో, అదే వాదనని దానికి వ్యతిరేక కోణం నుంచి వినిపించి, ఆ వాదనలోని అసంబద్ధతను ఎత్తి చూపడం. ఈ కథలో పాత్రలు నావి కావు. ఈ భాష నాది కాదు. ఈ వాదన నాది కాదు. స్వేచ్ఛ నా సిద్ధాంతం కాదు. ఈ వాదనని నేను అలాంటి పాత్రలే తీసుకొని మగాడివైపు నుంచి వినిపిం చాను. ఇదంతా స్త్రీవాదులు చెబుతున్నదే. దీనిలో అశ్లీలత కనిపిస్తే అది స్త్రీవాదంలో ఉన్నదే. ఇది 'వెధవ కథ' అని అందరూ దీవిస్తే- క్షమించాలి- ఆ దీవెనలు కూడా స్త్రీవాదులకే.

స్త్రీవాద వివాదాలలో పక్షాలు తీసుకొన్నవారు ఎలా స్పందించినా ఈ నేపథ్యంలో పరి చయం లేని సామాన్య పాఠకులు, కథలో మగ గొంతుకలో వినిపించిన 'స్వేచ్ఛావాదం'లోని అసంబద్ధతను గుర్తించి అసహ్యించుకోవడం వలన ఎవరికీ నచ్చని కథ అయి నాకు బాగా నచ్చిన నా కథగా మిగిలిపోయింది *మ'గోడు.'*

*21 డిసెంబర్ 1997*

# 21

## బ్రతకనేర్వని వాడు

### దాసరి అమరేంద్ర



**దాసరి అమరేంద్ర** 1953 మార్చి 14న పశ్చిమ గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటికథ చెదరకూడని స్వప్నాలు ఆంధ్రప్రభలో 1992లో అచ్చయ్యింది. శేఫాలిక కథాసంపుటి, రెండు యాత్రా రచనలు ప్రచురించారు. ఇవికాక ఇతర సామాజిక, సాహిత్యవ్యాసాలతో పాటు అప్పుడప్పుడు కవిత్వం కూడా రాస్తుంటారు. బిఇఎల్‌లో ఉద్యోగ విరమణ చేశారు.


**చిరునామా**

ఎ-301, శివం అపార్ట్‌మెంట్స్,
ప్లాట్ నెం. 14, సెక్టర్-12, ద్వారక,
న్యూఢిల్లీ - 110 078
Ph: 98189 82614
damarendra53@gmail.com


మాధవుడికి వేపకాయంత వెర్రుంది. అది నిమ్మకాయంతేమోనని కొన్ని మార్లూ, అబ్బే! అదేం కాదు... ఆవగింజంతే అని మరిన్నిసార్లూ అని పించినా- సగటున దాని పరిమాణం వేపకాయ.

ఇద్దరం ఒకే ఊరివాళ్లం. ఒకే సంవత్సరంలో పుట్టాం. దూరపు చుట్టాలం. దగ్గరి స్నేహితులం. కలిసి తిరిగాం, కలిసి పెరిగాం, కలిసి బళ్లోకెళ్లాం. ఒకే పంట కాలువలో ఈతలు నేర్చుకున్నాం. చేపలు పట్టాం. ఒకే పాకబడిలో అయిద్దాకా చదివాం. అప్పుడే పక్క ఊళ్లో వెలసిన హైస్కూల్లో కలిసి చేరాం. ఎస్సెల్సీ దాకా కలిసి గడిపాం. ఏదో అంటారే, 'ఒకే కంచం, ఒకే మంచం,' అని- ఆ బాపతు స్నేహం మాది.

చిన్నప్పట్నుంచి వాడి అలవాట్లూ, అభిరుచులూ, అమాయకత్వం, బ్రతకలేనితనం చూసి నేనెంతో ఇదవుతూ ఉండేవాడిని. భయపడుతూ ఉండే వాడిని. బెంగపడుతూ ఉండేవాడిని. ఈ దరిద్రప్రపంచంలో వీడు ఎలా నెగ్గుకు వస్తాడా అని మథనపడుతూ ఉండేవాడిని.

మావి మధ్యతరగతి పల్లె కుటుంబాలు. వ్యవసాయం మా ముఖ్య వృత్తి. కానీ సాగుకు సరిపడా భూములు లేని సగటు బ్రతుకులు మావి. ధనానికి

గాకపోయినా కులానికి గొప్ప వాళ్లమవడం వల్లా, మా తాతలు తాగిన నేతుల మూతుల వాసనల వల్లా- బీదవాళ్ల కోవకు చెందవలసి వచ్చినా- పళ్ల బిగువున మధ్యతరగతిగా నెట్టుకొచ్చే సంప్రదాయం మాది. ముత్తాతల నాటి పుష్కల భూసంపద మా తండ్రుల తరానికొచ్చేసరికి చిన్నచిన్న ముక్కలై- కాళ్లకు కప్పుకుంటే తలకూ, తలకు కప్పుకుంటే కాళ్లకూ సరిపడని గొంగళిలా మారగా- అనుదినపు టార్థికపుటిబ్బందులలో తలమునకలయ్యే తండ్రుల కొడుకులం మేము!

చిన్నప్పటి నుంచి మా మాధవుడో కొరకరాని కొయ్య. 'మన కులమేమిటీ, వాళ్ల కుల మేమిటీ,' అనే పెద్దల మాటలను పెడచెవినబెట్టి మాలపల్లి పిల్లలతో బహిరంగంగా సావాసం చేసేవాడు. పదేళ్ల వయసులో పొలంపని రోజుల్లో నేను బుద్ధిగా స్కూలుకెగనామం పెట్టి మా నాన్నకు సాయపడుతుంటే- వాడుససేమిరా స్కూలు మాననవేవాడు. పోనీ మట్టి పిసకడమంటే చిరాకా అంటే అదేంగాదు. స్కూలుకెళ్లే ముందూ, వచ్చిన తర్వాతా పేడ కళ్లెత్తడం దగ్గర్నించి పిడకలు చేయడం దాకా- అన్ని పనులూ ఎంతో చక్కగా చేసేవాడు. అయినా వాడిదదో ధోరణి. ఎవరి మాటా వినేరకం గాదు. ఎవరి మాటో అయితే పర్లేదుగానీ అమ్మానాన్నల మాట వినకపోతే ఎలా? అక్కడికీ వాళ్ల నాన్న అడపాదడపా గొడ్డును బాదినట్లు బాదేవాడు. అయినా అంకెకు రాకపోవడంతో విసుగొచ్చి వాడిని అచ్చుబోసి బడి మీదకు వదిలేసి చేతులు దులుపుకున్నాడు. ఎవరి మాటా వినని పిల్లాడు బాగుపడేదెలా? ఆఁ చెప్పడం మర్చిపోయాను. మావాడికి మా వీధిబడి శంకరం మాస్టారంటే మాత్రం ఎంతో గురి!

నా జీవితగమ్యం హైస్కూలు రోజుల్లోనే ఎంతో స్పష్టంగా నిర్ణయించేసుకున్నా, మాకున్న భూమి మాకెలానూ  చాలదు. వ్యవసాయం మీద ఆధారపడటమంటే కుక్కతోక పట్టుకుని గోదారీదడమే. అంచేత బుద్ధిగా ఎస్సెల్సీ ముగించి, ఎలాగోలా కష్టపడి డిగ్రీ అయిందనిపించి, పట్నం చెక్కేసి ఏ తాలూకాఫీసులోనో సర్కారు గుమాస్తాగా నాలుగురాళ్లు గడించి, ముందు తరాలకు అందించి వాళ్లు నాలాగా ఇబ్బందులు పడకుండా బతికేలా చేయడం నా జీవిత లక్ష్యం.

మా మాధవుడి లక్ష్యం నాకర్థమయ్యేది గాదు. పసితనంలోనే పండుగడ్డపు మాటలు మాట్లాడే వాడు! చదువుకొంటాడట. శంకరం మాస్టారంతటి వాడవుతాడట. పదిమందికీ పనికొచ్చేలా బతుకు తాడట. భూమాతను వదులుకోడట. ఉన్న ఊరితో తన మమతానుబంధాలు తెంచుకోడట. డబ్బు సంపాదన తన ధ్యేయంగాదట. పేరూ, కీర్తీ అన్నా తనకు మోజు లేదట- వాడి ధోరణిలో ఎన్ని వైరుధ్యాలో! వాడి ధ్యేయాలు ఎంత లోపభూయిష్టమో! పొలాల గట్ల మీదా, పంట కాలువల ఒడ్డునా రోజూ స్కూలుకు నడిచి వెళ్తూ గంటల తరబడి ఇవే మాట్లాడుకునేవాళ్లం. దేశానికి సొతంత్రం వచ్చిన రోజులవి. పేపర్నిండా ఇలాంటి ఆదర్శాలే కనిపించేవి. అవి చదివే కాబోలు మావాడికా ధోరణి. పనికిరాని ఆదర్శవాదంలోంచి బతుకు లోతులను తరచే భూమార్గం వైపు వాడి ఆలోచనలను మళ్లించాలని వాడి శ్రేయోభిలాషిగా అనునిత్యం ప్రయత్నించేవాడిని. ఈ నలభై అయిదేళ్లుగా ప్రయత్నిస్తూనే ఉన్నాను. కానీ నా ప్రయత్నం బూడిదలో పోసిన పన్నీరయింది!

హైస్కూలు ముగించాం. నే బొటాబొటీగా గట్టెక్కాను. వాడు స్కూలు ఫస్టొచ్చాడు- జిల్లాకే ననుకుంటాను. కలెక్టరుగారు బహుమతి పంపినట్టు గుర్తు. ఇద్దరం ఇంట్లో అందరినీ కష్టపెట్టి ఎలాగోలా డబ్బులు కూడబెట్టి వెళ్లి బెజవాడ ఎస్సారార్‌లో చేరాం. నాది ఆర్ట్స్ గ్రూపు. వాడిది సైన్సు. నలభై ఏళ్లనాడు కాలేజీల్లో ఇప్పుడున్నంత పోటీలేదు కాబట్టి నా అత్తెసరు మార్కులు నాకు అడ్డం కాలేదు!

ఏదో పల్లెటూరివాళ్లం- అణిగిమణిగి ఉండొద్దూ! మావాడికా స్పృహే లేదు! క్లాసు లీడరుగా ఉండమన్నారు. ఉండేశాడు. సెకండియర్లో యూనియన్ సెక్రటరీ అన్నారు. అయ్యాడు. రాజ కీయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఎలక్షన్లు, నాటకాలు, డిబేట్లు, రాత్రిపూట వయోజన విద్య-

యమావాడు దున్నేశాడు. వాడు కాలు మోపని రంగమే లేదు. ఉండమన్నారుగదా అని ఉ ట్టెక్కె య్యడమే? ఇంకా నయం- నాలుగేళ్లు ముందు పుడితే 'తెలంగాణా'లోనూ, పాతికేళ్లు ముందు పుడితే 'వందేమాతరం'లోనూ తప్పక చేరేవాడే!

❖

మా పల్లెటూరి ఆనవాయితీ ప్రకారం మా ఇద్దరికీ సెకండియర్లో పెళ్లయింది. డిగ్రీ అందే లోగానే నాకో కొడుకూ వాడికో కూతురూ పుట్టేశారు. ఎవరదృష్టం వారిది మరి! అసలు వాడు పెళ్లొద్దో అని ఎంత గోల పెట్టేశాడో! అన్నీ విపరీతమే కదా! ఏదో సామెజ్జెప్పినట్టు పిలిచి పిల్లనిస్తా మంటే ఇలాంటి వెధవాయే వద్దు పొమ్మన్నాడట. దాదాపు మెడలు వంచి చేశారు వాడికి. ఇంకా చదువుతాడట. కనీసం మరో పదేళ్లు దాకా పెళ్లి చేసుకోడట. మతిలేని మాటలు! డిగ్రీని మించిన చదువేముంది? అసలు మా ఊళ్లో డిగ్రీ మాత్రం చదివిన వాళ్లెంతమందీ? ఇదేగదూ ఉట్టికెక్క లేనమ్మ స్వర్గానికెళతానంటమంటే? అయినా కోడెవయసు ముచ్చటను నడివయస్సుకు నెడతా ననడం వెర్రిగాదూ?

అంతకన్నా అందరి మతి పోగొట్టే మరో ఘనకార్యం చేశాడు మావాడు. డిగ్రీలో ఫస్టుక్లాసు తెచ్చుకున్న తర్వాత బుద్ధిగా ఏ పోస్టల్‌శాఖలోనో బాంకులోనో రాజాలాంటి ఉద్యోగం సంపాదించి జీవితంలో స్థిరపడి, పెళ్లాం పిల్లలను సుఖపెట్టవచ్చు కదా- ఊహూఁ! అలా చేస్తే మావాడి గొప్పదన మేముందీ? ఇంజనీరింగు చేస్తానని ఊరేగాడు! 'అది మనలాంటి సన్నకారు మనుషులకుకాదు- ఏ జమీందార్లో చదవాల్సిన చదువు' అని చెవిలో ఇల్లుగట్టుకుని పోరాను. ఆఖరికి మా శంకరం మాస్టారు కూడా ఉద్యోగంలో చేరి పెళ్లాంపిల్లల బాగోగులు చూసుకోమనే సలహా ఇచ్చారు. అయినా అందరి మాటలనూ పెడచెవిన పెట్టాడు. ఊరికే అన్నారా- 'పోగాలము దాపురించిన వారు కనరు వినరు మూర్కొనరు' అని!

❖

తన చపలచిత్తానికి నిదర్శనంగా మేమంతా అనుకున్నట్లే అనుకోకుండా ఓ శుభోదయాన మావాడు అదృశ్యమయ్యాడు. బెజవాడలో జీటీ ఎక్కుతుంటే చూశామన్నారు కొంతమంది. హరిద్వార్ దగ్గర సన్యాసుల గుంపులో కనిపించాడన్నారు ఉత్తర భారత యాత్రలు చేసి తిరిగొచ్చిన మా ఊరి శ్రేష్టిగారు. నైజాందేశపు హైదరాబాదులో రిక్షా లాగుతున్నాడన్నారు కొందరు. మైసూరు రాజావారి దివాణంలో ఏదో ఉన్నతపదవి వెలగబెడుతున్నాడన్నారు మరికొందరు. మొత్తానికి మావాడి గురించిన కథలూ, గాథలూ చిలవలు పలవలై వ్యాపించాయి. మూడు నాలుగు నెలలు పత్తాలేదు. ఉన్నాడో ఊడాడో తెలియలేదు. మా జానకమ్మ కడుపు చెరువు చేసుకుని గుండె లవిసేలా ఏడుపు! చంటిపిల్ల ఆలనాపాలనా చూసే దిక్కులేదు! అసలు వాడు మనిషేనా? ఏదో స్కూలు పిల్లలు ఇంటి మీద అలిగి దేశం పట్టుకుపోయారంటే అర్థముంది- పెళ్లాం పిల్లలున్న వీడికిదేం వెధవబుద్ధి? అసలా మనిషికి జాలీ, దయా, కరుణా, ధర్మం- ఉన్నాయా అని?

ఎంత అర్థంతరంగా అదృశ్యమయ్యాడో అంతే హఠాత్తుగా ఓ దసరానాడు ఊడిపడ్డాడు. 'ఏవిట్రా సంగతి?' అంటే చిద్విలాసంగా చిరునవ్వు- కాదు వెర్రినవ్వు! చెబితే ఇంట్లోనూ, ఊళ్లోనూ ఎలానూ ఒప్పుకోవడం లేదు గాబట్టి చెప్పకుండానే ఉడాయించాడట. రాజస్తాన్‌లో- ఏదో పళానీనో పిళానీనో- బిర్లాగారి ఇంజనీరింగ్ కాలేజీ ఉందట. అక్కడ మూడేళ్ల డిగ్రీ కోర్సులో చేరాడట. స్కాలర్షిప్పు కూడా వచ్చిందట. కానీ ఖర్చుండదట. కానీ పెళ్లాం పిల్లల మాటేవిటీ? వాళ్ల పోషణా బాగోగులూ ఎవరు చూస్తారూ? అడిగితే మాట్లాడడు. రెట్టిస్తే, 'నువ్వున్నావు గదరా సుబ్బులూ,'

అనేశాడు! అది అతి అమాయకత్వమా- గడుసుదనమా? నవ్వాలో, ఏడవాలో తెలియలేదు. దసరా సెలవలయిపోగానే ఒక్కటే టింగురంగామంటూ పిళానీ చెక్కేశాడు.

నావరకూ నేను అదృష్టవంతుడ్ననే చెప్పుకోవాలి. అత్తెసరు మార్కుల బియ్యేనే అయినా ఉత్తర దక్షిణాల పత్రితో రాజధాని ప్రభువుల పూజచేయగా, ఆ పుణ్యఫలాన సివిల్ సప్లయిస్‌లో ఉద్యోగం దొరికేసింది. 'తంతే బూరెల గంప'లో అంటారే- అలా అన్నమాట! బూరెల గంప బదులు బియ్యం, పంచదార బస్తాలు! చేపకు ఈతలాగా నాలుగు రోజుల్లో 'వ్యాపారపు' మెలకువలు ఆకళించుకున్నా. ఇహ పట్టిందల్లా బంగారమే! నా అదృష్టం శ్రుతి మించుతుందేమోనని గాబోలు- భగవంతుడు రెండోసారి ఆడపిల్లనిచ్చాడు. అయినా దేవుడ్ని నిందించనవసరం లేదు.

ఒకరకంగా చెప్పాలంటే నా సంపాదనకు ఓ లక్ష్యం అంటూ ఏర్పడిందీ ఆడపిల్ల వల్ల. బంగారమూ, కట్నపు డబ్బులూ, నివాసస్థలమూ, ఇళ్లూ- ఇలా ఓ క్రమం ఏర్పడింది. 'పై సంపాదనను పన్నుల వాళ్ల కాకిగోల నుండి కాపాడుకోవడం ఎలా,' అన్న చింత వినా జీవితం మూడు పూవులు ఆరు కాయలుగా మారిపోయింది. రెండేళ్లలో ప్రపంచం మీద అథారిటీ వచ్చేసింది. భాగ్యనగరంలోని హెడ్డాఫీసులో పాతుకుపోయి ఇల్లూ వాహనంలాంటి హంగులు ఏర్పాటు చేసుకుని, పూర్తిగా సంసార జీవితంలో స్థిరపడిపోయాను. నిజం చెప్పాలంటే నాకిహ మా పల్లెటూరికెళ్లాల్సిన అవసరమే లేదు. అయినా పూర్వ పరిచయాలూ- ఏదో మమత- ఆర్నెల్లకోసారి మా ఊరి వైపు లాగుతూ ఉండేవి.

వెళ్లినప్పుడల్లా మా జానకి బాగోగులు విచారించడం ఓ తప్పనిసరి పనయింది. చెప్పొద్దూ- మాధవుడంటే నాకు అమితమైన ప్రేమ. జానకంటే జాలి. తలిదండ్రులూ, అత్తమామలూ పోషించ లేరు గాబట్టి ఊళ్లోనే ఉన్న కాస్తంత డబ్బున్న ఓ దూరపు చుట్టపు ఒంటరి ముసలమ్మ పంచన తన ఇద్దరు పిల్లలతో చేరి కాలం వెళ్లదీస్తోంది మా జానకి. రెండో పిల్ల కూడా ఆడపిల్లే! దురదృష్టం! పిల్లలు చూడటానికి శుభ్రంగా, ముద్దుగా ఉన్నా మెళ్లోగానీ, చెవులకుగానీ, చేతులకుగానీ వీసమెత్తు బంగారం లేదు. లక్ష్మీదేవుళ్లలా కళకళలాడాల్సిన ఆడపిల్లలు బోసిపోయి ఉన్నారు. మా అమ్మాయితో పోల్చి చూస్తే గుండె తరుక్కుపోయింది. ఫస్టుక్లాసు బిఎస్సీ తండ్రికి పుట్టిన కూతుళ్లిలా పరాయి పంచన అనాథల్లా బోసి మెడలతో బతకాల్సిన దురవస్థ ఎందుకూ? ఇంత చిన్న విషయం మా వెర్రాడి బుర్రకెక్కదేం? వాడికన్నా తెలివితేటల్లోనూ, చదువుసంధ్యల్లోనూ, శక్తిసామర్థ్యాలలోనూ ఎన్నో రెట్లు తక్కువవాడినైన నేను ఇంత చులాగ్గా జీవితంలో స్థిరపడిపోగా వాడు రాజస్థాన్ ఎడారుల్లోనూ, పెళ్లాంపిల్లలు పరాయికొంపల్లోనూ కాలం గడపవలసిన అవసరం ఏమిటీ? ప్రారబ్ధం! ఎవరి కర్మకు ఎవరు బాధ్యులూ?!

పిల్లలు ఆరోగ్యంగా, కళగానే ఉన్నారు. వాడక్కడేదో పార్ట్‌టైమ్ ఉద్యోగం చేస్తున్నాడట. స్కాలర్షిప్పు డబ్బుల్లో కొంత వెనకేస్తున్నాడట. నెలనెలా ఇంతని జానక్కి పంపుతున్నాడట. తిండి తిప్పలకు లోటు లేకుండా గడిపేయగలుగుతున్నారట. కొద్దోగొప్పో సంపాయిస్తున్నాను గాబట్టీ, 'నువ్వున్నావు గదరా సుబ్బులూ!' అని వాడు సెంటిమెంటోటి పెట్టాడుగాబట్టీ వెళ్లిన ప్రతిసారీ ఎంతో కొంత సాయం చేద్దామని ప్రయత్నించేవాడిని. జానకి మాత్రం తక్కువ తిన్నదా? 'వద్దన్నయ్యా! అవసరం లేదు. అవసరమయినప్పుడు అడిగి తీసుకునే సొతంత్రముంది గదా,' అని ప్రతిసారీ తిరగ్గొట్టేసేది. ఎంతో కష్టం మీద పిల్లలకు గౌనులూ బొమ్మలూ మాత్రం పుచ్చుకునేది. అంతకన్నా సాయపడలేకపోతున్నందుకు నొచ్చుకోవడం వినా చేయగలిగిందేమీ లేకపోయింది.

యథాప్రకారం మరోసారి మావాడు బాంబు పేల్చాడు. వాడి ఫైనలియర్లో జరిగిందిది. వాయుసేనలో చేరిపోయాడు! కాలేజీకి సెలక్షను టీము వచ్చిందట. పదిమందిని ఇంటర్వ్యూ

చేసి ఇద్దర్ని ఎన్నుకొన్నారట. అందులో వీడొకడు. ఫైనలియరంతా ఉద్యోగంలో ఉన్నట్లు పరిగణించి జీతం కూడా ఇస్తారట. బావుంది. ఆర్థికపు ఒడిదొడుకులకు స్వస్తి అన్నమాట. కానీ ఇంత చదువూ చదువుకుని, ఇంజనీరింగ్ డిగ్రీ అందుకోబోతూ ఆ దిక్కూదివాణం లేని పటాలంలో చేరడ మెందుకూ? ఏదో గతిలేని వాళ్లు చేరారంటే అర్థముంది... వీడికేం లోటూ? బ్రిలియంట్ స్టూడెంటు గదా- వీడు 'ఊఁ!' అంటే ఏ టాటా బిర్లాలో ఎగరేసుకుపోరూ? ఊహుఁ! అలా అయితే మావాడి గొప్పదనమేముందీ? వాడి ఆశయాలకు సైన్యమే సరైనదట. టాటా బిర్లాలను సేవించి డబ్బులు సంపాదించటం కన్నా, తనను తీర్చిదిద్దిన దేశమాత సేవలో నిమగ్న మవడమే తనకిష్టమైన పనట. ఎవరు చెప్పగలరీ మొండివాడికి? రేపే యుద్ధంలోనో కాలో కన్నో పోతే దేశమాత కాదుగదా కట్టుకున్న పెళ్లాం పిల్లలు కూడా వీడి మొహం చూడరు. వయసొచ్చీ ఏం లాభం? లోకజ్ఞానం లేకపోతే ఎలా?

అనుకున్నట్టే అరవై రెండులో యుద్ధం వచ్చిపడింది. అనుకోని ఆ అవాంతరం వల్ల దేశం అట్టుడికిపోయింది. 'హిందీ-చీనీ భాయిభాయి' అన్న పీతకళ్ల వెధవలు వెన్నుపోటు పొడవడం వల్ల కలిగిన ఆవేదనా, తన కళ్ల ముందే తన నమ్మకాలు ఛిన్నాభిన్నమవుతున్నా తప్పనిసరిగా పూనుకుని దేశప్రజల నుద్దేశించి నెహ్రూగారు చేసే ప్రసంగాల వల్ల కలిగే ఉద్వేగమూ, మా అభిమాన హీరో ఎన్టీ రామారావు నడుంకట్టి 'నేషనల్ డిఫెన్స్ ఫండు' కోసం ఆంధ్రదేశంలో జరిపిన జైత్రయాత్ర వల్ల కలిగిన ఉత్తేజమూ- ఇవన్నీ ఒక పెట్టు; అటుపక్క మా మాధవుడు విమానదళంలో ఏ చిక్కుల్లో ఇరుక్కుపోయాడోనన్న బెంగ మరో పెట్టు. మా పల్లెటూళ్లో ఉన్న జానకి ఎలా ఫీలయిందో తెలియదుగానీ, హైదరాబాదులో నాకుమాత్రం కొన్నికొన్ని రాత్రుళ్లు దిగులు వల్ల నిద్రపట్టేది కాదు. చైనావాళ్లు మావాడిని బంధించినట్టూ, దేశరక్షణ పథకాల వివరాలు చెప్పమని చిత్రహింసలు పెడుతున్నట్లూ కలలొచ్చేవి. సినిమాల మహత్యమా?!

ఏదేమైనాగానీ మావాడు యుద్ధంలో ఏదో ఘనకార్యం చేశాడు. ఏదో చక్రం- పరమవీర చక్రమా?- ఇచ్చారు గవర్నమెంటువాళ్లు. అంత చిన్న వయసులో ఆ పతకం గెలుచుకున్న మొట్ట మొదటివాడట మా మాధవుడు? పేపర్లో వచ్చింది, రేడియోలో చెప్పారు. నా మనసు గంతులేసింది. మా ఊరు ఊరంతా ఉప్పొంగి పొంగింది. ఆంధ్రదేశమంతా జేజేలు పలికారు. హైదరాబాదులో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఓ ప్రత్యేకసభ పెట్టి సన్మానించారు.

నాలుగేళ్ల తర్వాత అదే మొదటిసారి వాడిని చూడటం. లావెక్కాడు. హుందాగా ఉన్నాడు. నార్తిండియా నీళ్లు పడ్డట్టున్నాయి- దబ్బపండులా ఉన్నాడు. అంబాలాలో పోస్టింగట. అంతా సౌకర్యంగా ఉందట. ఏదో దేశం కోసం తనకు చేతనయింది తాను చేశానన్న సంతృప్తే తప్ప ఘనకార్యం చేశానన్న భావం కలగడంలేదట! ఇలా సన్మానాలూ, సంబరాల మధ్య కూర్చోవాలంటే సిగ్గేస్తోందట! మరొకళ్లిలా అని ఉంటే 'పోవోయ్! వెధవ బడాయి కబుర్లూ నువ్వూనూ,' అని దులపరించేవాడినేగానీ మరి మాధవుడి ధోరణే అది గదా! పిచ్చిమాలోకం- కీర్తికాంత వచ్చి పడితే సాదరంగా చేరదీయడం చేతగానివాడు! అనుకోని అవకాశాలను అంది పుచ్చుకొని పాపులారిటీని సొమ్ము చేసుకోవడం తెలియనివాడు!

అన్నట్టు సొమ్మంటే గుర్తొచ్చింది. అప్పటికి వాడికి మరో ఆడపిల్ల. ముగ్గురన్నమాట. అంత మంచివాడు- మరి పాపం వాడికిదేం దురదృష్టమో తెలియదు! ఆడపిల్ల మీద ఆడపిల్ల... వరుసగా ముగ్గురు! 'ఏవిరా! ఏవన్నా వెనకేస్తున్నావా?' అనడిగా. మెహర్‌బాబా మూడోతమ్ముడిలా ఓ వేదాంతపు చిరునవ్వు నవ్వి, 'నువ్వింకా మారలేదురా సుబ్బారావూ?' అన్నాడు. గుడ్డొచ్చి పిల్లని వెక్కిరించడ మంటారు- ఇదేగాబోలు! ఒళ్లు మండింది. మారాల్సింది వాడా నేనా? అయినా తమా యించుకుని చిలక్కి చెప్పినట్టు చెప్పాను- "ఒరే వెధవా! ముగ్గురాడపిల్లల తండ్రివి. ఒక్క ఆడపిల్లకే

నేను బెంబేలు పడిపోతున్నాను. ఇప్పట్నుంచే కట్నం వెనకేస్తున్నా. నువ్వు జాగ్రత్త పడకపోతే పిల్లలు ఉసూరుమని పోతారు. నగలూ గట్రా చేయించు. వచ్చిందంతా మీ మిలటరీవాళ్లలాగా విలాసాలకూ వినోదాలకూ తగలేయకుండా ఎంతో కొంత వెనకెయ్యి. ఓ ఇల్లు కట్టుకో. షేర్లు కొను. ఇళ్లస్థలాల వ్యాపారం చెయ్యి. డబ్బులు సంపాదించాలంటే సవాలక్ష ఉపాయాలున్నాయి. ఏదో ఒకటి పట్టుకుని ఎంతో కొంత వెనకెయ్యకపోతే జీవితంలో ఓడిపోతావు. ఆ తర్వాత ఊరికే పశ్చాత్తాపపడి లాభంలేదు.''

నా తపన వాడికర్థమయినట్టుంది. కళ్లలో తడి, గొంతులో ఆర్తి, మాటల్లో మనసు- అయినా ధోరణిలో మార్పు లేదు? సంపాదించి వెనకేయడం వాడి స్వభావానికి విరుద్ధమట. కట్నాలూ, పెళ్లిళ్లూ గురించి ఆలోచించడట. పిల్లల్ని చదివించి వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడమే తన ధ్యేయమట. షేర్లూ స్థలాలూ లాంటి జూదాల జోలికి పోడట. కాపిటలిస్టు వ్యవస్థకు దర్పణాలయిన షేర్లంటే వెగటట!

నా బొంద! నా పిండాకూడు! ఎంత పాత చింతకాయపచ్చడి ఆలోచనలు?! లోకం జెట్ స్పీడులో దూసుకుపోతోంటే వీడింకా గబ్బిలంలా ఆ పాత భావాలకు బానిస అయిపోవడమేమిటీ? ప్రారబ్ధం! నా అంతటివాడు వీడు. ఏం చెప్పగలనూ? ఎలా చెప్పగలనూ? అదే మా పిల్లాడయితే లాగి లెంపకాయ లాగించేవాడిని. వీడి బూజుపట్టిన భావాలకు జానకీ, ముగ్గురాడపిల్లలూ బలయి పోరుగదా! ఆందోళనతో మనసు వికలమయింది. అయినా చేసేదేముందీ?!

*

దాదాపు పదేళ్లు మా మధ్య ప్రత్యక్ష సంబంధాలు లేకుండా పోయాయి.

వాడు ఉద్యోగరీత్యా అస్సాం, ఒరిస్సా, రాజస్థాన్, పంజాబ్, పఠాన్‌కోట్, చండీఘడ్ లాంటి ప్రదేశాలు తిరిగాడు. ఉన్న ముగ్గురికి తోడు మరో ఆడపిల్లట- సీత, ఊర్మిళ, మాండవి, శృతకీర్తుల్లా! టకటకా ప్రమోషన్లు కొట్టేసి రికార్డ్ టైములో వింగ్ కమాండరయిపోయాడట. వాడు కనీసం ఏడాదికైనా ఓసారి కుటుంబసమేతంగా వచ్చి మా కుగ్రామంలో, ఆ పూరింట్లో, ఓ పదీ పదిహేను రోజులు గడిపి వెళ్తూ ఉండేవాడు. నాకేమో హైదరాబాదు పనులతో తీరికే ఉండదు! నా వ్యాపకాలు పుంఖాను పుంఖాలుగా పెరిగాయి. ఆస్తి పెరిగింది, అవస్థలు పెరిగాయి. మనశ్శాంతి తరిగింది. ఉద్యోగం నామ్‌కే వాస్తే అయింది. పెట్రోలు బంకు, గ్యాసు ఏజెన్సీ, రియల్ ఎస్టేటు, బీనామీ కాంట్రాక్టులు, ఇంకా చెప్పరాని వ్యాపారాలు- ఓ చిన్నసైజు బంగారుపిచికనే అయిపోయాను. మంత్రుల పరి చయాలూ, అధికార్ల స్నేహాలూ, వందిమాగధుల ఇచ్చకాలూ- క్షణం తీరికలేని జీవితమయి పోయింది.

హఠాత్తుగా ఓ శుభోదయాన ఊడిపడ్డాడు. వాడికి బెంగుళూర్లో పోస్టింగట. ఒక్కరాత్రి ప్రయాణమే గదా అని చూసిపోడానికి వచ్చాడట. ఆరోజు పనులన్నీ పక్కనబెట్టి వాడితో కలిసి తిరిగాను. కారు తీద్దామంటే ఒప్పుకోడు. స్కూటరు చాలన్నాడు. నాకేమో ఎవరైనా చూస్తారన్న సిగ్గు! ఎక్కడెక్కడికో తీసుకెళ్లాడు. ఎప్పటెప్పటి స్నేహితులనో పలకరించి వచ్చాం. అంతా మా చిన్ననాటి క్లాస్‌మేట్లే అయినా వాళ్లసలీ భాగ్యనగరంలో ఉన్నారన్న సంగతే నాకు తెలియదు. మరి ఎక్కడెక్కడో ఉండి వచ్చిన వీడికి ఎలా తెలిసిందో? అడిగితే 'మనసుంటే మార్గముండదా' అన్న వేదాంతపు భాషణ! కానీ ఒక్కమాట. వాడు రాజకీయాల్లో ఓ వెలుగు వెలుగుతున్న మా మంత్రి కోటేశ్వరరావును కలిసినా, ప్రతిభ ఉండీ అవకాశం కలిసిరాక రైల్వేలో క్లాసు ఫోరుగా మగ్గుతోన్న నారాయణను కలిసినా- అస్సలు తేడా లేకుండా ప్రవర్తించాడు. ఇద్దరినీ ఒకేరకపు ఆప్యాయతతో,

ఆత్మీయతతో దగ్గరకు తీసుకున్నాడు. చెప్పొద్దూ- అలా వాడితో రోజంతా తిరిగితే మరోసారి చిన్నతనంలోకి వెళ్లిపోయిన భావన కలిగింది. మనసు తేలికయి హృదయం ఏదో చెప్పలేని ఆనందంతో నిండి పోయింది.

వెళ్తూ వెళ్తూ చెప్పాడు- పెద్దమ్మాయి ఎమ్మెస్సీ అవగొట్టి ఎక్కడో జూనియర్ లెక్చరర్‌గా చేస్తోందట. రెండో పాప ఇంటరుట. మూడూ, నాలుగూ పదీ, ఎనిమిదట. పెద్దమ్మాయికేదో సంబంధముందని తెలిసి ఆ వివరాలు కనుక్కుందామని వచ్చాడట. వచ్చే ఆదివారంనాడు కుర్రాడు పెళ్లిచూపులకి ఇంటికి రాబోతున్నాడట. నాకూ  వ్యాపారరీత్యా బెంగుళూరులో పని ఉండటంతో ఆ సమయానికి నేనూ వస్తానన్నా! నా అంచనాలను పూర్వపక్షం చేస్తూ వీడు పూనుకుని అలా సంబంధాల కోసం తిరగడం ఎంతో సంతోషం కలిగించింది. ఎంతైనా ఆడపిల్లల తండ్రి గదా!!

*

"చూడండీ! ఒక్క విషయం స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. కట్నం ప్రసక్తి లేని పెళ్లనేది నా భావాలకు సంబంధించిన విషయం. దానికి నా కులంతో సంబంధం లేదు. మీరు కట్నాన్ని కులానికి ముడిపెట్టి 'కుర్రాడు చవగ్గా దొరుకుతున్నాడు... ఇబ్బందులు ఉంటే మాత్రమేమీ చవక బేరమే గదా,' లాంటి లాజిక్కుల దృష్ట్యా దీనికి మొగ్గితే మాత్రం నేనెంతో నిరాశ పొందుతాను. మీరూ నాలానే పెళ్లిలో కట్నం ప్రసక్తి ఉండరాదని పూర్తిగా నమ్మి ఈ విషయంలో నిర్ణయం తీసుకోగలిగితే సంతోషిస్తాను."

నాకు ముళ్లమీద కూర్చున్నట్టుంది. కుర్రాడు చురుకే. నలుపైనా కళగల మొహమే. పొట్టయినా స్ఫురద్రూపే. కానీ హరిజనుడట- సగం. వాళ్ల నాన్న మావాళ్లే అయినా అమ్మ మాల పిల్లట. తల్లి రెక్కల చాటున పెరిగాడు. కాకినాడలో ఇంజనీరింగు చేసి ప్రస్తుతం ఢిల్లీలో ఏదో సర్కారువారి కంపెనీలో ఆఫీసరు. అసలతగాడు పెళ్లిచూపులకు ఒంటరిగా వచ్చేయటం, కుండ బద్దలు కొట్టి మాట్లాడేయటం- నాకెందుకో నచ్చలేదు. పెళ్లంటే ఎంత ఆలోచించాలీ! పెద్దమ్మాయి కిలా కులం తక్కువయితే మిగిలిన ముగ్గురాడపిల్లల సంగతేమిటీ? అసలింత చిన్న విషయం పట్టించుకోకుండా మాధవుడు విషయాన్ని పెళ్లిచూపులదాకా ఎందుకు రానిచ్చినట్లూ! అయినా ఆ కుర్రాడిది అనవసరపు కంఠశోష. 'చవక బేరం' అనేంత తెలివిగా ఆలోచిస్తే మా మాధవుడీ పాటికెంతగానో బాగుపడి ఉండేవాడు గాదూ?

జానకి మొహంలో మిశ్రమ భావాలు. 'చూస్తే అబ్బాయిలో వంక పెట్టడానికేం లేదు. కానీ చూస్తూ చూస్తూ తక్కువ కులమా?' అని గాబోలు తన మథన. నా అభిప్రాయమడిగాడు మాధవుడు. "మరో మాట ఆలోచించకుండా మర్యాదగా సాగనంపు. మనిషి మంచయినంత మాత్రాన చాలదు. పెళ్లంటే ఆషామాషీ కాదు. సంప్రదాయం, సంస్కృతి, కుటుంబపు బాగోగులు- ఎన్నో చూడాలి. సంబంధం వదులుకో!" నిజాయితీగా సలహా ఇచ్చాను.

వాడు మరి మామూలు మానవుడు కాదుగదా- మాధవుడు. మాటల సందర్భంలో ఆ కుర్రాడు తనతోపాటు ఓ ఎయిర్‌ఫోర్స్ స్క్వాడ్రన్ లీడరు బొంబాయిలో ఎమ్టెక్ చేశాడనీ, అతగాడు కూడా బెంగుళూరు పోస్టింగ్‌లోనే ప్రస్తుతమున్నాడనీ అన్నాడు. ఆ ఆధారం అంది పుచ్చుకుని మావాడు ఆ స్క్వాడ్రన్ లీడరు ఇంటికి వెళ్లి గంటన్నర తర్వాత తిరిగొచ్చాడు.

"కుర్రాడు నిప్పు. చాకు. గంటన్నర మాటల్లో మా స్క్వాడ్రన్ లీడరు కుర్రాడిలో వంద సుగుణాలు ఏకరువుపెట్టాడు గానీ ఒక్క లోపమైనా ఎత్తి చూపలేకపోయాడు. నేను ప్రత్యేకించి అడిగినా లోపమెన్నడం సాధ్యం గావడంలేదన్నాడు. ఇహ నాకు సందేహం లేదు. అమ్మాయి 'ఊఁ' అంటే చాలు- ఈ సంబంధం ఖాయం," తాంబూలాలిచ్చేశాను తన్నుకు చావండి ధోరణిలో ప్రకటించేశాడు.

పిచ్చిపిల్ల దానికేం తెలుసూ? నాన్న మాటకు తలూపింది. మిగిలిన ముగ్గుర్నీ జానకినీ చూసి నా గుండె తరుక్కుపోయింది. చేయగలిగిందేముందీ?

*

వాడు బెంగుళూరులోనూ నేను హైదరాబాదులోనూ ఉండటం, నాకు బెంగుళూరులో వ్యాపారపు లావాదేవీలు వాడికి హైదరాబాదులో బంధుత్వపు సంబంధాలూ ఉండటంతో మా మధ్య రాకపోకలు పెరిగాయి. దాదాపు రెండు నెలలకోసారి వాళ్లింటికి వెళ్లడం, పిల్లలతో ఆ సాయంత్రం గడపటం ఆనవాయితీ అయిపోయింది. పెద్దమ్మాయి ఢిల్లీలో స్థిరపడిపోయింది. మొదట్లో కులం తక్కువ సంబంధం గురించి బంధువర్గాల్లో గుసగుసలు సాగినా, అవి బెంగుళూరూ ఢిల్లీలలో ఉన్నవాళ్లనేమీ ఇబ్బంది పెట్టలేకపోయాయి.

రెండో అమ్మాయి పర్సనల్ మానేజ్‌మెంట్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసి బెంగుళూరు హెచ్చెమ్టీలో పర్సనలాఫీసరుగా చేరిపోయింది. పెళ్లీడు దాటిపోతోంది. జానకమ్మకు సహజంగానే బెంగ. మాధవుడికి అంతే సహజంగా నిర్వికారం. డాబూ, దర్పం, కారూ, కుక్కా, మీసాలూ, పైపూ అంటే సంపాదించాడుగానీ లోకజ్ఞానం, డబ్బా నిండు సున్నా! ఏదో పెద్దమ్మాయికి లక్కు తన్నుకొచ్చిం దన్నంత మాత్రాన అన్నిసార్లూ అలా జరిగిపోతుందా? పూనుకోకపోతే ఎలా? గట్టిగా అడిగితే, "నువ్వే ఏదన్నా సంబంధం చూడరా! పిల్లాడు మంచాడయితే చాలు. నా అంతట నేను 'ఇదిగో ఇలా మా అమ్మాయుంది. చేసుకునే నాథుడు కావాలి,' అని కూరగాయలమ్మినట్లు సంత ఎలా పెట్టనూ," అంటాడు. చెప్పొగదా, ఊరందరిదీ ఒక దారయితే ఉలిపికట్టెది పెడదారి! ఏం? లోకంలో అందరు తండ్రులూ కూతుళ్ల కోసం సంబంధాలు వెతకడం లేదూ? వీడేమన్నా తలగొట్టి మొలేశాడా? అసలు వీడ్నర్థం చేసుకోడానికి ఓ జీవితకాలం చాలదు! వెదక్కుండానే సంబంధాలు దొరికిపోడానికదేమన్నా సత్యకాలమా? అసలేమిటో వాడికా ధీమా?

మా అమ్మాయిని డిగ్రీ అవగానే మణిపాల్లో ఇంజనీరింగు చేసి ఎమ్మెస్ కోసం అమెరికా వెళ్లే ప్రయత్నాల్లో ఉన్న, స్తోమతున్న ఓ కుర్రాడికి- పాతిక లక్షలూ, వంద తులాలూ, మూడు గదుల ఫ్లాటూతో పాటు అందించేశాను. నా బాధ్యత తీరిపోయింది. పెళ్లికి మాధవుడు సకుటుంబంగా వచ్చాడు. వాడి కుటుంబమూ మా కుటుంబమూ కలుసుకోవడమిదే మొదటిసారి. స్నేహ సౌభ్రా తృత్వాలు వెల్లివిరిశాయి. పొంగి పొరలాయి. కానీ ఆడవాళ్లు ఒక్కొక్కళ్లూ కనీసం లక్ష రూపాయల నగలతో లక్ష్మీదేవి తోబుట్టువుల్లా వెలిగిపోతున్న పెళ్లి పందిట్లో మా జానకమ్మ ముగ్గురు కూతుళ్లూ బోసిమెడలతో వెలవెలబోవడం చూసి నాకే ప్రాణం చివుక్కుమంది. మావాడికి మాత్రం చీమైనా కుట్టలేదు. కానీ ఒక్కమాట- వాళ్లు బోసిగా ఉన్నా విలక్షణంగా ఉన్నమాట నిజం. ఎవరో అననే అన్నారు వీళ్లను చూసి- 'అంతా లక్ష్మీదేవులే అయితే ఎలా? సరస్వతులకు కూడా ఇక్కడ చోటుం డద్దూ?'

నా తాపత్రయంకొద్దీ ఆ సరస్వతులను చూసి ముచ్చటపడుతున్న ఒకరిద్దరు పెళ్లి కొడుకుల తండ్రులను కదిపాను. కులాంతర సాహసం గురించీ, కట్నమిచ్చుకోలేనితనం గురించీ విని ఉన్నారేమో- విషయం దాటేశారు.

*

నాలుగు నెలల తర్వాత మరోసారి బెంగుళూరు వెళ్లాను.

అంతా ఉన్నారు. అయినా ఇల్లంతా స్తబ్ధంగా ఉంది. ఏదో విషయంలో తర్జనభర్జనలు పడుతున్నారనిపించింది. అందరి మొహాల్లో ఆందోళన కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.

మావాడు మాత్రం నిర్వికారంగా ఓ పదిహేడేళ్ల కుర్రాడి చేతికి కట్టు కడుతున్నాడు. నూనె పడి భయంకరంగా కాలింది. ఆ కుర్రాడు వీళ్లతోబాటే ఉంటున్నాడట. మాధవుడి దగ్గర పదిహేనేళ్ల క్రితం పనిచేసి ప్రస్తుతం గల్ఫ్‌కెళ్లిన ఓ తెలుగు ఎయిర్‌ఫోర్స్ సిపాయి కొడుకట. 'మేం దేశం కాని దేశంలో ఉండి అబ్బాయిని హాస్టల్లో ఉంచి చదివించడం వల్ల వాడి ఆలనాపాలనా చూసే వాళ్లు లేక కుర్రాడు పెడదార్లు పడుతున్నాడు. మీరే ఓ దారి చూపించాలి,' అని అడగగా మావాడా కుర్రాడిని హాస్టల్లోంచి తీసుకొచ్చి ఇంట్లో పెట్టుకుని పాలిటెక్నిక్‌లో చేర్పించాడట. తనకుమాలిన ధర్మం గాదూ? పోనీ మరోసాటి ఆఫీసరు కొడుకంటే అనుకోవచ్చు- ఓ సిపాయి కొడుకుని ఎందుకిలా నెత్తిన పెట్టుకోవాలీ? మిగిలి ఉన్న ముగ్గురు కుంపట్ల బరువు చాలదూ? మావాడి పనులు ఇలానే ఉంటాయి మరి!

ఆ సంగతి వదిలి అసలు విషయానికొచ్చాను. వివరాలడిగాను.

అతని పేరు గోపాలమీననట. రెండో అమ్మాయి కొలీగట. మలయాళీ కుర్రాడు. ఇష్టపడ్డాడు. తిన్నగా ఇంటికొచ్చి అడిగి వెళ్లాడట! (ఎంత ధైర్యం)

బండి కులాంతరం దగ్గరే ఆగలేదన్నమాట. భాషాంతరం, రాష్ట్రాంతరం మార్గాలు పట్టి పోతోందన్నమాట. ఇంకా నయం- మతాంతరం, దేశాంతరం అవలేదు. అక్కడికదే సంతోషం.

కుర్రాడిదేమంత ఉన్న కుటుంబం కాదు. అతనికి కుటుంబబాధ్యతలు ఉన్నాయి. రిటైరైన తల్లిదండ్రులు, పెళ్లి కావలసిన చెల్లెలు, చదువుకుంటున్న తమ్ముడు- ఉండాల్సిన బాదరబందీ అంతా ఉంది. ఆ గందరగోళపు మలయాళీ మాయాజలంలో మా అమ్మాయి ఇమడగలదా? అనుమానమే!

ఈ ఆలోచనలూ, అనుమానాలూ, బాధలూ- నాకే! మావాడు మళ్లీ మెహర్‌బాబా అవతార మెత్తి చిరునవ్వుతో పెళ్లి జరిపించేశాడు. 'అమ్మాయీ అబ్బాయీ ఒకరినొకరు తెలుసుకుని ఇష్ట పడితే భాషా, రాష్ట్రం, కులం, స్తోమత లాంటి అడ్డంకులను లెక్క చేయడం అనవసరం,' అన్న థీరీతో అందరి మెడలూ వంచి పెళ్లి జరిపించాడు. పెళ్లిలో చిరునవ్వులేగానీ సిరినవ్వులు లేనేలేవు. మరి మలయాళీ ఆర్ట్‌ఫిలింలోలాగా, కమ్యూనిస్టు వ్యవహారంలాగా, తూతూ మంత్రంలా పెళ్లి పేలవంగా జరిగిపోయింది. కానీ ఎందుకో మనసుకు తోచింది- అమ్మాయి జీవితంలో సుఖపడ గలదని!

*

ఈ మలయాళపెళ్లి మా ఊళ్లో గగ్గోలు పుట్టించలేదుగానీ రచ్చబండ చర్చనీయాంశమైంది. ఆశ్చర్యమేమిటంటే- అంత చిన్న ఊళ్లో కూడా మావాడి చర్యను సమర్థించే పక్షం తయారయింది. కాస్తంత అనుభవజ్ఞులూ విజ్ఞులూ వాడి దుస్సాహసానికి విచారం వ్యక్తపరచినా, కుర్రకారూ సన్నకారూ మాత్రం మారుతున్న ప్రపంచంతోపాటు మనమూ మారాలనీ, అందుకు దారి చూపిస్తున్న మాధవరావును అందరూ ఆదర్శంగా తీసుకోవాలనీ వాదించడం మొదలుపెట్టారు. పిల్లకాకులకేం తెలుసు ఉండేలుదెబ్బ? అయినా కబుర్లు చెప్పడానికేం? ఎన్నైనా చెప్పొచ్చు. రేపీ మలయాళ గందరగోళం వల్ల రెండో అమ్మాయి జీవితంలోగానీ, మాధవుని జీవితంలోగానీ తుఫానులు చెలరేగితే అనుభవించేదెవరూ? బాధపడేదెవరూ?

మూడో అమ్మాయీ, నాలుగో పాపా చాకుల్లాంటివాళ్లు. బ్రిలియంట్ స్టూడెంట్లు. చదువులు, ఆటలు, డిబేట్లు, క్విజ్‌లు అన్నింటా వాళ్లే ఫస్టు. ఇద్దరికీ అవలీలగా బెంగుళూరులో మెడిసిన్ సీటొచ్చేసింది. అదే సమయంలో మావాడికి మళ్లీ జోధ్‌పూర్ బదిలీ అయింది- ప్రమోషనుతో! పిల్లలిద్దర్నీ హాస్టల్లో పెట్టేసి శుభ్రంగా జానకితో కలిసి వెళ్లిపోయి కొత్త కాపురం పెట్టేయమని సలహా

ఇచ్చాను. విన్లేదు. నెలరోజులు తీవ్రంగా ఆలోచించి వలంటరీ రిటైర్మెంటు పుచ్చేసుకున్నాడు. “బంగారంలాంటి ఉద్యోగమెందుకు వదులుకుంటావురా? నీకు ఎంతో భవిష్యత్తుంది. నువ్వే వాయుసేనాధ్యక్షుడివో అయితే చూసి సంబరపడదామని మాలాంటి వాళ్లం అనుకుంటుంటే నీకిదేం ఆలోచనా?” అని ఎంతో నచ్చచెప్పాను. వినలేదు. వాడి భవిష్యత్తు కన్నా పిల్లల భవిష్యత్తు ముఖ్యమట! వాళ్లను దగ్గరుండి తీర్చిదిద్ది డాక్టరమ్మలను చేయడంలో ఉన్న సంతృప్తి తాను ఎయిర్ ఛీఫ్ అవడంలో ఉండదట! ఇదీ ధోరణి! ప్రాణం ఉసూరుమంది.

వలంటరీ రిటైర్మెంటు పుణ్యమా అని వాడికో నాలుగు లక్షలు చేతికొచ్చాయి. శుభ్రంగా ఏ వ్యాపారంలోనయినా పెట్టి ఆ వచ్చే రాబడితోనూ, గవర్నమెంటు వారిచ్చే పింఛనుతోనూ హాయిగా కాలు మీద కాలు వేసుకుని కడుపులో చల్ల కదలకుండా గడపమని హితవు చెప్పాను. మావాడికి సుఖపడే యోగం లేదు. ఆ డబ్బుతో బెంగుళూరు శివార్లలో ఎందుకూ పనికిరాని బీడుభూమిని ఎవరో పొలమని తెలివిగా అంటగడితే కొనేశాడు. కూరగాయలు పండిస్తాడట. కొబ్బరితోట పెడతాడట. పుట్టగొడుగులు పుట్టిస్తాడట. పాలూ, పాడీ, గడ్డీ, గాదం- ఇదీ వాడి ధోరణి. మేవుం పల్లెటూరొదిలి పాతికేళ్లు- ఇంకా కాయకష్టం చేయగలడా? అసలు ఇంత బ్రతుకూ బతికి మళ్లీ ఆ పేడ పిసకడమేం ఖర్మ? ‘ఆకాశంబున నుండి...’ అని భర్తృహరి వాపోయిందిదిగో ఇలాంటి వివేకభ్రష్టులను చూసే గాదూ!

నా రొటీన్ ట్రిప్పులో మరోసారి బెంగుళూరు వెళ్లాను. కష్టపడి వెదికి వెదికి గంటన్నర ప్రయాణం తర్వాత సిటీ సెంటరుకు పాతిక్కిలోమీటర్ల దూరంలో ఉన్న మాధవుడి పొలం చేరా. మావాడి అవతారం చూస్తే నవ్వొచ్చింది. దిగులనిపించింది. నీరుకావి పంచె మోకాళ్ల పైకి ఎగ గట్టాడు. చొక్కాలేదు. చేతిలో పార, ఒళ్లంతా బురద. నిఖార్సయిన పల్లెటూరి బైతులా ఉన్నాడు. ఇంజనీరనిగానీ, వాయుసేన మాజీ ఆఫీసరనిగాని తెలియనివాళ్లు ఊహించనైనా ఊహించలేరు. వాడి పక్కన వాడిలాంటి సజ్జే ఓ అరడజను మంది. ఇద్దరు కూలీవాళ్లట. మరో ఇద్దరు మా ఊరి వాళ్లేనట. ఊళ్లో ఉండి గాలికి తిరుగుతూ పనీ పాటలకూ, చదువుసంధ్యలకూ లొంగకపోతే వాళ్ల తల్లిదండ్రులు వాళ్లను వంచి మంచివాళ్లను చేయమని వీడి కప్పజెప్పారట! వీళ్లంతాగాక ఓ మధ్యవయసు దంపతులు. తాగీ తిరిగీ, ఎక్కడపడితే అక్కడ అప్పులు చేసీ- ఇహ ఊళ్లో నిలబడలేని స్థితిలో ఉన్న అతగాణ్ణి మా మాధవుడు పట్టి బెంగుళూరు లాక్కొచ్చాడట. వాళ్లకు మళ్లీ ఇద్దరు పిల్లలు. అంతా కలగాపులగంగా, కోలాహలంగా, గందరగోళంగా ఉంది. పైపై మట్టి పనులు చేస్తూ ఆఖరి ఇద్దరు డాక్టరు పిల్లలు. వీళ్లందరికీ టీ లందిస్తూ మా జానకమ్మ- ఏదో చిన్నపిల్లల బొమ్మలాటలా అనిపించింది. ‘వేపగింజ వెలగపండయిందా’ అనిపించకపోలేదు.

ఆరోజు ఆదివారం. మావాడికి పనిరోజయినా లోకానికి శలవే గదా! సిటీలో ఉన్న ఎయిర్ ఫోర్స్ టెక్నికల్ కాలేజీలో ఆఫీసర్లుగా ట్రైనింగవుతున్న నలుగురు ఇంజనీర్ల బృందం బిలబిలా వచ్చి పడింది. ఇద్దరు తెలుగు కుర్రాళ్లు, ఒక ఒరియా పిల్లాడు, మరో బెంగాలీ ముస్లిం. వాళ్లంతా మావాడి సహోద్యోగుల సంతానమట. చూస్తుంటే వాళ్లందరికీ వీడే లోకల్ గార్డియన్ అనిపించాడు. ప్రతి ఆదివారం వాళ్లిక్కడే గడుపుతారట. బావుంది సంత! ఎదిగిన ఆడపిల్లలున్న ఇంటికి కోడె వయసు కుర్రకారు వారం వారం వచ్చిపోవడం ఏమంత సమంజసం? మావాడికి కనీస జ్ఞానం లేకపోతే ఎలా? కానీ ఒక్కమాట ఒప్పుకొని తీరాలి- అంత గందరగోళంలోనూ... అంత కోలాహలం లోనూ... ఏదో వింత ఆకర్షణ ఉంది. సంతృప్తి ఉంది. ప్రశాంతి ఉంది. రోజంతా అక్కడి వాతా వరణమూ, మావాడి తెలివిలేనితనమూ, పిల్లలూ జానకీ ఆ అడవిలో పడుతున్న కష్టాలూ చిరాకూ విసుగూ కలిగించినా, సాయంత్రం సిటీ సెంటర్లోని హోటలుకు వస్తే ఈ సిటీ సెంటరే ఓ జనా

రణ్యంలా అనిపించింది. మావాడి పొలం జ్ఞాపకాలు మనసును ఏదో తెలియని ఆనందంతో నింపాయి. బహుశా అక్కడి పచ్చదనమూ, ప్రకృతి సౌందర్యమూ కారణమేమో!

*

ఎప్పుడూ- గత పాతికేళ్లుగా ఎప్పుడూ జరగని పని జరిగింది.

మా జానకమ్మ బెంగుళూరు నుంచి ఫోను చేసింది.

ఇష్టాలయినా కష్టాలయినా మాధవుడి అభీష్టం ప్రకారం ఎంతో సహనంతో పాతికేళ్లుగా నడుచుకుపోయిన జానకమ్మ భర్త ప్రవర్తనకు నొచ్చి, దారీతెన్నూ తెలియక, నా సహాయాన్ని ఆశిస్తూ ఫోను చేసింది.

హుటాహుటిన బెంగుళూరుకు చేరా. చేరేసరికి ఉదయం పది దాటింది.

ఇంట్లో వాళ్లిద్దరే ఉన్నారు. పిల్లలు కాలేజీకి వెళ్లారు. పనులవాళ్లు పనుల్లో మునిగి ఉన్నారు. తన అలవాటుకు భిన్నంగా మాధవుడు ఇంట్లో ఉన్నాడు. వాతావరణం టెన్షన్‌తో నిండినా, టేపు రికార్డరులోని అన్నమాచార్య కీర్తనల లాలిత్యం నా దృష్టిని దాటిపోలేదు.

తిన్నగా పాయింటుకొచ్చేశా.

"చూడబ్బాయ్! వర్ణాంతరం, భాషాంతరం, రాష్ట్రాంతరం- అంటే సహించాం. తప్పలేదు. కానీ మరీ మతాంతరం ఎలా సహించమంటావ్? నీకేం నీకివన్నీ పట్టవు. యోగీశ్వరుడివి. కానీ నాకూ జానకికీ అది ఇష్టం లేదు. అసలా సాయిబుల కుర్రాడు వారం వారం వచ్చిపోతున్నాడంటేనే మనసు కీడును శంకించింది. తరతరాల మన అలవాట్లూ సంప్రదాయం కాదనుకొని చూస్తూ చూస్తూ పిల్లను తురకాడికి కట్టబెట్టటానికి మనసెలా ఒప్పుతోందీ?"

"మనం కట్టబెట్టేదేవిట్రా? అదేం మాటా? అమ్మాయి పెద్దదయింది. డాక్టరీ ముగించి హౌస్ సర్జన్సీ అంటే మనకే కాస్తంత మంచీ చెడూ నేర్పగల వయసన్నమాట అబ్బాయీ అమ్మాయీ ఇష్టపడ్డారు. ఒకరంటే ఒకరికి గౌరవముంది. అభిమానముంది. అవి చాలు! వాళ్ల జీవితాలను తీర్చి దిద్దటానికి. అబ్బాయి మంచాడు. చిన్నప్పటి నుంచీ తెలిసినవాడు. అమ్మాయి పోనీ గుడ్డిదా? ఎవరో ముక్కూమొహం తెలియని వాడిని ప్రేమించానని వస్తే కంగారు పడటంలో అర్థముంది గానీ, ఇలా మనకు బాగా తెలిసిన బుద్ధిమంతుడ్ని ఇష్టపడితే స్నేహితుల్లా సంతోషించి ఆశీర్వదించాల్సింది పోయి మీరిలా కొంపలు మునిగినట్టు ఆందోళన పడటమెందుకో నాకర్థం కావటంలేదు," నిమ్మకు నీరెత్తినట్టు ఆదర్శ సిద్ధాంతాలు వల్లించాడు.

నేనూ, జానకీ ఎంతగానో బోధించాం. బ్రతిమాలాం. భయపెట్టాం. బెదిరించాం.

కానీ మొండివాడు రాజు కన్నా బలవంతుడు కదా!

నాకు విరక్తి పుట్టింది. పెళ్లి గుళ్లో అయిందో ఖాజీగారే చేశారో! మాధవుడి కూతురు మెహరున్నీసా అయిందో అల్లుడే మస్తాన్రావయ్యాడో- ఇద్దరూ కలిసి ఇండియాలో ఉన్నారో పాకిస్తాన్ పోయారో- ఏ గంగలో దూకారో ఏమీ పట్టించుకోలేదు. మనసు విరిగింది. రాకపోకలు తగ్గించాను.

అయినా మమతలు వసివాడవు. చిన్నప్పటి స్నేహం చిరకాలం కొనసాగి తీరుతుంది కాబోలు- జ్ఞాపకాలు వదలవు! రెండేళ్లు దూరంగా ఉన్న మీదట కాళ్లు అప్రయత్నంగా మాధవుడి పొలం వైపు లాక్కుపోయాయి.

ఈసారి వాతావరణంలో కించిత్తు మార్పు కనిపించింది. మాధవరావూ జానకమ్మా ఊరొదిలి వెళ్లే సన్నాహాల్లో ఉన్నారనిపించింది. నిజమే! వాళ్లు బెంగుళూరు వదిలేస్తున్నారు!

పెద్దమ్మాయి ఢిల్లీలో స్థిరపడింది. అతగాడితో పాటు తనూ అక్కడే ఢిల్లీ అడ్మినిస్ట్రేషన్లో తగిన ఉద్యోగం సంపాదించిందట.

రెండో అమ్మాయి తన మలయాళం మొగుడితో బెంగుళూరులో పాతుకుపోయే ప్రయత్నాల్లో ఉంది. ఇద్దరూ కలిసి ప్యాక్టరీ నుంచి లోన్లు తీసుకుని ప్లాటు కొనుక్కున్నారట. ఇక మూడో అమ్మాయి- డాక్టరు- మెడిసినయిన తరువాత తనూ వాయుసేనలో చేరేసి ప్రస్తుతం వాళ్లాయనతో పాటు జోధ్‌పూర్లో టింగురంగా అంటూ ఉద్యోగం చేసుకుంటోందంట. ఆ పిల్లగానీ, ఆ పిల్లాడుగానీ మతంగానీ పేరుగానీ మార్చుకోనేలేదట! ఎవరి మతం వాళ్లదే అయితే మరి పెళ్లి ప్రాముఖ్యమేమిటో?

పొలం పనులు జోరుగా సాగుతున్నాయి. నాలుగు గేదెలు, కొబ్బరిచెట్లు కాపుకొచ్చాయి. మావాడితో పాటు పుట్టగొడుగుల పెంపకం మొదలెట్టిన అనేకమంది నష్టాల వల్ల దుకాణాలు కట్టేసినా మావాడి పరిశ్రమ లాభనష్టాలు లేకుండా నేలబారుగా సాగిపోతోంది. 'పెట్టుబడి మీద వడ్డీ నష్టం గదరా,' అంటే, 'అయితేనేం? అది ఓ పిల్లలున్న కుటుంబానికీ, దారి మళ్లిన ఇద్దరు కుర్రాళ్లకీ జీవనాధారమయింది. నాకదే చాలు!' అన్నాడు.

కానీ నాలుగేళ్ల నిరుద్యోగం వల్ల ఖర్చులు ఆదాయాన్ని మించిపోయి అప్పుల్లో పడ్డాడు. పొలంలో సగం తెగనమ్మి అప్పులు తీర్చి మిగిలిన డబ్బులతో మా ఊళ్లో చేపల చెరువులు నడపాలని నిశ్చయించుకున్నాడట. మిగిలిన సగం పొలం పనిచేస్తున్న వాళ్లకి వదిలేసి వెళ్తాడట!

మరి ఆఖరమ్మాయో!

అదీ సెటిలయింది. తన మెడిసినయిపోయి హౌసర్జెన్సీ చేస్తోంది. మా ఊళ్లోనే సంబంధం దొరికిందట. కుర్రాడికి తల్లీతండ్రీ లేరు. తాడూ బొంగరం లేవు. గ్రాడ్యుయేటు. ఉద్యోగం లేదు. 'అవకాశం లేక అణిగి ఉన్నాడుగానీ, బయటకు తీసి మెరుగుపెడితే ఆణిముత్యమే,' అంటాడు మాధవుడు. ఆ సంగతెలా ఉన్నా కుర్రాడిదీ మా కులమే కాబట్టి జీవితంలో నెగ్గుకు రాగలడని నా నమ్మకం. మాలాంటి పెద్దవాళ్లం మా కులపు కుర్రాడికి ఆమాత్రం సాయం చేయలేమా! కానీ డాక్టరు చదివిన పిల్లకు బియ్యే సంబంధమా? అయినా అంతకుమించిన సంబంధం మాధవుడెలా తేగలడూ?

అవునూ... ఏకబిగిన ఈ సోదంతా ఎందుకు చెప్పుకొచ్చినట్లూ?!

మీలాంటి తెలిసినవాళ్లు మా మాధవుడి జీవితం చూసి ఓ గుణపాఠం నేర్చుకోవాలన్న తపనతో...

ఏమాత్రం అవకాశమున్నా మనుషులు నిచ్చెనలెక్కేసి అమెరికా చెక్కేసే ఈ రోజుల్లో మావాడు బంగారంలాంటి అవకాశాలను వదులుకొని మట్టి పిసికి, చేపలు పట్టడానికి కుగ్రామం పోతున్నాడు. మామూలు మనుషులు సైతం తెలివిగా లకారాలు వెనకేస్తున్న ఈరోజుల్లో మావాడు జీవితమంతా వెచ్చించినా ఒక్క రూపాయి నిలవనియ్యలేకపోయాడు. శుభ్రంగా చదువుకుని పైకొచ్చిన కూతుళ్లకు ఘనంగా ఉన్న ఇంటి కులపు కుర్రాళ్లని కట్టబెట్టాల్సింది పోయి ఇంకో కులం వాడినీ, ఇంకో రాష్ట్రం వాడినీ, ఇంకో మతం వాడినీ, మరో నిరుద్యోగినీ కట్టబెట్టాడు. కనీసం కట్టుకున్నదానినైనా చివరిరోజుల్లో సుఖపెట్టాల్సిందిపోయి మళ్లీ మతిపోయే పల్లెటూళ్లలోకి లాక్కుపోతున్నాడు.

బతకడానికి తెలివి ఉండనక్కర్లేదు. వేపకాయంత వెర్రి బుర్రలో లేకుంటే అదే చాలు!

కానీ ఓ నిజం చెప్పనా?! మావాడిని చూస్తుంటే 'ఆకాశంబున నుండి...' అన్న భర్తృహరితో పాటు, 'ఇంతింతై వటుడింతై...' అన్న పోతన కూడా ఎంచేతో గుర్తొస్తున్నాడు.

ఎందుకో ఎంత ఆలోచించినా అర్థం కాదు!

*ఆంధ్రప్రభ వారపత్రిక*
*25 ఆగస్టు 1993*

నేపథ్యం

## అసామాన్య సామాన్యుడు
# బ్రతకనేర్వని వాడు

***మెటీరియలిస్టిక్ విజయాలు జీవితానికి భద్రతనిస్తాయన్న అపోహ సర్వత్రా వ్యాపించి ఉంది. అది నిజం కాదు. నిజానికి అలాంటి విజయాలు అభద్రతాభావానికి బతుకు భయానికి దారితీస్తాయి. మెటీరియలిస్టిక్ విజయాల బ్రతుకు పులి మీద స్వారీ అవుతుంది.***

బ్రతక నేర్చినతనం మన సమాజంలో ఘనంగా చెల్లుబాటు అయ్యే లక్షణం. పదిమందీ అభిమానించి అనుకరించాలని తాపత్రయపడే లక్షణం. అలాంటి సమాజం లో ఉంటూనే బ్రతకనేర్వని తనంలోని అందాలనూ, ఆనందాలనూ నాకు చవి చూపిం చాడు ఒక మాధవుడు. దిమ్మిస గొట్టిన దారుల్లో సాగకుండా- అవసరమయితే దుర్గమ మార్గాలను అనుసరించడానికి జంకకుండా- ధనం, కీర్తి, అధికారం అన్నవాటి కోసం ఆరాటపడకుండా జీవించడంలో ఉన్న విశిష్టతను నా కళ్ళ ముందు బొమ్మకట్టి నిలిపిన వ్యక్తి ఆ మాధవుడు.

కథ- కాల్పనిక సాహిత్యం- అనగానే కల్పనకూ ఊహలకు ప్రముఖస్థానం ఉంటుంది అన్నది సామాన్య అభిప్రాయం. కానీ లోతుగా ఆలోచిస్తే ఈ కాల్పనిక సాహిత్యంలో ముఖ్యంగా చిత్తశుద్ధితో సృష్టించబడే కాల్పనిక సాహిత్యంలో కల్పనకన్నా వాస్తవాలకు, నిజజీవిత అనుభవాలకూ, మన చుట్టూ జరిగే సామాజిక సంఘటన లకూ ఎక్కువ స్థానముంటుందన్న విషయం స్పష్టమవుతుంది. చాలాచాలా కథలు బయోగ్రాఫికల్‌గానో, ఆటోబయోగ్రాఫికల్‌గానో రూపొందడం యాదృచ్ఛికం కానే కాదు. నా బ్రతక నేర్చినవాడు కథ కూడా నాకు తెలిసిన ఆ మాధవుని జీవనలీల. ఒక అసామాన్య సామాన్యుని కథ.

ఆ మాధవుడిది పల్లెటూరి నేపథ్యం. అతనిదో మధ్యతరగతి రైతు కుటుంబం. అతను పుట్టింది కట్నాలు కానుకలు లాంటి ఫ్యూడల్ సంప్రదాయశక్తులు బలంగా పని చేస్తున్న ఓ ప్రముఖ కులంలో. చదువు గురించి అంతగా పట్టించుకోని కాలం. కానీ తన దైన 'విజన్'తో ఎక్కడెక్కడికో వెళ్ళి ఎన్నెన్నో ఇబ్బందులు పడి ఇంజనీరింగ్ పాసై ఎయిర్ ఫోర్స్‌లో ఆఫీసరవుతాడు. నలుగురు ఆడపిల్లలు పుడితే వాళ్ళందర్నీ చక్కగా పెంచి పెద్దచేసి విద్యాబుద్ధులు చెప్పించి ప్రపంచానికి పనికొచ్చే వ్యక్తులుగా తీర్చిదిద్ది సమాజానికి కానుకగా అర్పిస్తాడు మాధవుడు. ధనసంపాదనా వ్యామోహం పెట్టుకోకుండా పరిసరాలనూ, మనుషుల్ని ప్రేమించడం పైకి తేవడం ఆయన సహజ నైజం. ఆ నలుగురు పిల్లలూ చదువుకొని మంచి ఉద్యోగాలు చేసుకోవడంకోసం వాళ్ళ చదువులూ అభివృద్ధి కోసం తన ఎయిర్‌ఫోర్స్ కెరీర్‌ను పక్కన పెట్టవలసి వస్తే మాధవుడు సంకోచించకుండా వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవడం, చదువులు ముగిసిన పిల్లలు ఎవరి రెక్కలు వాళ్ళు సమకూర్చు కొని, ఎవరితోడు వాళ్ళు సంపాదించుకొని వెళ్ళిపోగా తిరిగి తన గ్రామంలో మట్టి పిసకడానికి మాధవుడు తిరిగి వెళ్ళడం, ఈ వైనమే *బ్రతకనేర్వనివాడు* కథ.

మెటీరియలిస్టిక్ విజయాలు జీవితానికి భద్రతనిస్తాయన్న అపోహ సర్వత్రా వ్యాపించి ఉంది. అది నిజం కాదు. నిజానికి అలాంటి విజయాలు అభద్రతాభావానికి బతుకు భయానికి దారితీస్తాయి. మెటీరియలిస్టిక్ విజయాల బ్రతుకు పులి మీద స్వారీ అవుతుంది. అలాగాకుండా జీవితాన్ని సరైన కోణంలోంచి దర్శించి మనుషులలోను, పరిసరాలలోను, ప్రకృతిలోనూ తాదాత్మ్యం చెందుతూ స్పష్టమైన సరళమైన జీవన సమతుల్యం సాధించిన వ్యక్తికి జీవితం ఏనాడూ భయం కలిగించదు. అలాంటి వ్యక్తికి రేపు అంటే ఆసక్తి, ఆశా ఉంటాయే తప్ప బతుకు భయమన్న మాట అతని దగ్గరకు చేరదు. అడపాదడపా అతని అమాయకత్వం అతనికి ఇబ్బందులు తెచ్చిపెట్టినా జీవిత సమయంలో విజయం ఆ వ్యక్తిదే. అసలీ సమాజంలో మనుషులు అవతలి మనిషి భౌతిక విజయాలకన్నా మానసిక ఉన్నతిని చూసే ఎక్కువగా భయపడడం, అసూయ పడడం కద్దు. అలాంటివాళ్ళ జీవన విజయం సామాన్యుల స్థూలదృష్టికి అందకపోవచ్చునేమోగానీ దాన్ని విజయంగా గుర్తించని వాళ్ళు కూడా ఆ మనిషిని గౌరవించడం కద్దు.

అదుగో అలాంటి మనిషిని పదీ పన్నెండేళ్ళు అతి దగ్గరగా చూశాను. ప్రభావితు డ్నయ్యాను. ఎన్నో నేర్చుకున్నాను. ఆ నా అనుభవాలనూ, అనుభూతులనూ అందరికీ చెప్పాలనిపించింది. *బ్రతక నేర్వనివాడు* కథ పుట్టింది.

ఆ మనిషిలోని- ఈ కథలోని- మరో విశేషం ఆడపిల్లల పెళ్ళిళ్ళ విషయంలో అతని ప్రవర్తనారీతి. ఎంతో తెలిసినవాళ్ళు సైతం, ప్రగతిశీలులు సైతం ఆడపిల్ల అనగానే ఆ పిల్లకు పెళ్ళిచేసి పంపడమే తమ అంతిమలక్ష్యంగా భావిస్తుంటారు. కట్నాల కులాలలో అయితే ఆ పిల్ల పెళ్ళి కోసం పుట్టిందగ్గర్నించీ డబ్బు, నగలూ సమకూర్చుకోవడం మొదలెడతారు. ఆ పిల్ల చదువుల సరస్వతే అయినా పెళ్ళికి చదువుకూ పోటీ ఏర్పడినపుడు సుబ్బరంగా చదువు ఆపేసి పెళ్ళి చేసేసి పంపేస్తూ ఉంటారు. అలాంటిది అలాంటి కులంలో పుట్టి ఒకరికి నలుగురు ఆడపిల్లలు పుట్టుకొచ్చినా అదో బెదరవలసిన సంగతిగా భావించకుండా తనదైన ఓ నిర్దుష్ట మార్గాన్ని రూపొందించుకొని ఆ మార్గంలోనే చివరిదాకా సాగి వాళ్ళ పెళ్ళిళ్ళనేది ఓ సమస్యగా భావించకుండా వాళ్ళ వ్యక్తిత్వ రూపకల్పనే తన లక్ష్యంగా పెట్టుకొని ఆ నలుగురు కూతుళ్ళనూ పెంచి పెద్దచేసిన వ్యక్తి మాధవుడు. ఇలాంటి స్థితప్రజ్ఞత మామూలు వాళ్ళకు అసాధ్యం. ఆ మాధవుని భావ స్పష్టతకు అనుగుణంగానే ఆ నలుగరు ఆడపిల్లలూ మంచి చదువులు చదివి

ఉద్యోగాల్లో స్థిరపడడవే కాకుండా కట్నం ప్రసక్తిలేని పెళ్లిళ్లు కూడా చేసుకోగలిగారు. ఈ పరిణామాన్ని అతి సన్నిహితంగా గమనించిన నాకు అదో అద్భుత నిశ్శబ్ద సాంఘిక విప్లవం అనిపించింది. ఆ విప్లవాన్ని సజావుగా రికార్డు చెయ్యాలనిపించింది. మొదలుపెట్టినపుడు కథను నలుగురు పిల్లల పెళ్ళిళ్ళు ఎలా అయ్యాయో ఆ వివరాలకే పరిమితం చేద్దామనుకున్నాను. కానీ మొదలెట్టిన తర్వాత కథ నన్ను దాటుకొని పోయి తనంతట తానే విస్తరించుకొంటూ సాగి మాధవుని జీవితగాథగా రూపొందింది!

మనలో చాలామందికి ప్రగతీ సంస్కరణా విప్లవం అంటే నమ్మకం, ఆసక్తి, ఇష్టం. కానీ ఆ ఇష్టాలూ ఆసక్తులూ 'ఎదుటివారికి చెప్పే నీతులు'గా పరిణమించడమూ మనం చూస్తూంటాం. ఎన్ని కబుర్లు చెప్పినా తన కుటుంబం దగ్గరికొచ్చేసరికి ఆదర్శ వాదులు సైతం బ్రతకనేర్చిన తనాన్ని ప్రదర్శించడాన్ని గమనిస్తూ ఉంటాం. 'కట్నం తప్పు' అని నమ్మినవాళ్ళే తమ స్వంత కొడుకుల దగ్గరకొచ్చేసరికి మెత్తబడి కట్నం కాన్సెప్టును రేషనలైజ్ చెయ్యడం నాకు తెలుసు. కులాలూ మతాలూ వద్దు అనే మహామహా వామపక్షులే తమతమ కూతుళ్ళు కులం తక్కువ వాళ్ళను చేసుకొంటామంటే అభ్యంతర పెట్టడమూ, దిగులు పడటమూ నాకు తెలుసు. అది మానవ సహజం గాబోలు. కానీ మాధవుడు అసహజ మానవుడు. కులమత భాషా విభేదాలకు అతీతుడు. తన కూతుళ్ళ పెళ్ళిళ్ళ విషయంలో వరుడు హరిజనుడైనా అతనికి పట్టలేదు. మలయాళీ అయినా అభ్యంతర పెట్టలేదు. అమ్మాయి అబ్బాయి కలిసిపోగలరా లేదా అన్నదే అతని ముఖ్య ప్రాతిపదిక. ఇలాంటి భావస్పష్టత అపూర్వం. 'మా ఇంటికొస్తే మాకేం తెస్తావ్, మీ ఇంటికొస్తే మాకేం ఇస్తావ్,' బాపతు కుహనా సంస్కరణవాదుల లోకంలో మాధవునిలాంటి నిర్మల మనస్తత్వం అపురూపంగా అనిపించింది. అక్షరాల్లో పెట్టాలనిపించింది.

నేను గత పాతిక ముప్పై ఏళ్ళుగా ఎన్నో వందల వేల కథలు చదివినా... పెయింటింగ్‌లు చూసినంత మాత్రాన చిత్రకళ రానట్టుగానే మాధవుని కథను రాయడానికి కూర్చున్నప్పుడు కథలు రాయడంలోని ఓనమాలు రావు. అయినా ఆ జీవనగాథలోని బలం నాకు నమ్మకం ఇచ్చింది. రాశాను. కథను తిన్నగా చెప్పడం వల్ల పటుత్వం ఉండదనిపించింది. మాధవుడ్ని సరైన మార్గంలో పెట్టాలని ప్రయత్నించే హితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులూ నాకు పరిచయమే. వాళ్ళవాళ్ళ ఆలోచనా రీతి, భావధోరణీ నాకు సుపరిచితమే. వాళ్ళందర్నీ కలగలిపి ఓ పాత్రను సృష్టించాను. చిన్నప్పట్నించీ మాధవుడ్ని బాగా ఎరిగిన స్నేహితుడి పాత్ర అది. ఆ స్నేహితుడ్ని మెటీరియలిస్టిక్ విజేతగా చిత్రించాను. అంత పెద్ద విజేతా చివర్లో మాధవుడ్ని చూసి, 'ఇంతింతై వటుడింతై...' అన్న భావన పొందిన వైనం చిత్రించాను. ఇదే నేను కథకు కల్పించి పొందుపరిచిన శిల్పం. మిగిలిన అన్ని అక్షరాలు, అన్ని సంఘటనలూ, అన్ని పాత్రలూ- సజీవం. నిజమైనవి. కొన్ని రచనలకు ఇది కేవలం కల్పితం... అంటూ హామీ ఉంటుంది. ఈ కథకు నేను 'ఇది కేవలం వాస్తవం' అన్న టిప్పణి పొందుపరిచానేమో!


కథాశిల్పం గురించి, కథాస్వరూపం గురించి స్పష్టమైన అవగాహన లేని నేను మాధవుని జీవితాన్ని అలా చెప్పుకొంటూపోయాను. రాతప్రతిలో పదహారు పేజీలు అయింది. సీనియర్ సాహితీ మిత్రుడు శ్రీపతికి చూపించాను. ఆయన విశ్లేషించి కథలో శిల్పపరమైన దోషాలున్నాయి, ఇదిగో ఈ మార్పులు చేసి తిరిగి రాయండి, పుష్టిగా సౌష్టవంగా వస్తుంది అని సలహా ఇచ్చారు. ఆ సలహా నాకు నచ్చింది. అయినా అలా చేయడం వల్ల కథకు జీవనాడి అయిన వాస్తవం పాలు తగ్గి కల్పన పాలు పెరుగుతుంది కాబట్టి ఆయా మార్పులు చేయలేదు. కథలో ఒక్క

మాధవుని పాత్ర తప్ప మిగిలిన పాత్రలన్నీ సవ్యంగా విచ్చుకోలేదని తెలుసు. అయినా కథను మార్చలేదు.

'కథ నిడివి ఆరు పేజీలు' అని సంపాదక నియంతలు అప్పటికే శాసించడం మొదలెట్టారు. ఆ ధోరణి చూసి కథను ఓ ఆరునెలలు భద్రంగా అట్టేపెట్టుకొన్నాను. 1993 ఆరంభంలో నను కొంటాను ప్రభ వీక్లీ వాళ్ళు ప్రకటన ఇచ్చారు. 'మాకు నిడివితో సంబంధం లేదు. మంచి కథ అయితే ఎంత పొడవున్నా వేస్తాం,' అని. టెంప్ట్ అయ్యాను. దుస్సాహసమేమోనని భయపడుతూనే ఆ కథాప్రభ శీర్షికకు పంపాను. ఊరూపేరూ లేని కొత్తమనిషి అని అయినా అనుకోకుండా ప్రభ వాళ్ళు ఆగస్టు 1993లో ప్రచురించారు. కథకు మంచి స్పందన వచ్చింది. హితులూ, సన్నిహితులూ, పాఠకులు, సహ రచయితలు ఎంతోమంది కథను గమనించి వెన్నుతట్టారు. ఆ ప్రోత్సాహం ఈ నాలుగేళ్ళలోనూ నేను మరో పాతిక కథలు రాయడానికి పునాది అయింది. మరిన్ని జీవితాలను, మరిన్ని వాస్తవాలను, మరిన్ని రాళ్లలోని రత్నాలనూ వెలికితీసి పదిమంది ముందూ నిలపాలనే తపన ఓ వ్యసనంగా మారుతోంది. నా జీవితానికి చోదకశక్తిలా పరిణమిస్తోంది. ప్రపంచమంటే ప్రేమను పెంచుతోంది. ఈ జీవితం మనకిచ్చిన అద్భుత పదాల్లో సాహిత్యం ఒకటి అన్న స్పృహను నానాటికీ పెంచుతోంది.

*17 మే 1998*

22



*పాపినేని శివశంకర్* *1953 నవంబర్ 6న గుంటూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ కలుపుమొక్క 1977లో ప్రజాతంత్రలో వచ్చింది. రెండు కథా సంపుటాలు, నాలుగు కవితా సంకలనాలు, పరిశోధనా గ్రంథం సాహిత్యం-కొన్ని మౌలికభావనలు, వ్యాససంపుటి నిశాంత ప్రచురించారు. కథాసాహితికి, విస్మృత కథ, కవితా! ఓ కవితా!, రైతు కవిత, వార్షిక కవితా సంకలనాలకు సహ సంపాదకులు. కాలేజీ ప్రిన్సిపల్‌గా పదవీ విరమణ చేశారు.*


**చిరునామా**

*4-5-29/60, 3వ లైను, విద్యానగర్*

*గుంటూరు-522 007*

*Ph.: 89780 12323*

*sspapineni@gmail.com*


# మట్టిగుండె

## పాపినేని శివశంకర్

కదిలే హృదయమున్నవాడు కన్నతల్లిని మరిచిపోడు. మా ఊరు నా కన్నతల్లి. నాకు హృదయముందో లేదో పన్నెండేళ్ళపాటు మరిచిపోయాను. నగరం పునాదుల కింద కాంక్రీట్ అరణ్యంలో నన్ను నేను పారేసుకున్నాను. అయినా మా ఊరితో నా సంబంధం తెగిపోలేదు. ఆరోజు నగరం రణగొణధ్వనుల మధ్య ధూళిమేఘాల మధ్య శ్రీమతి అంది.

“రెండేళ్ళ నుంచీ మన పొలం కౌలు రావటం లేదుగదా? మీకు చీమకుట్టినట్ట యినా లేదేమిటండీ?” అని. ఒక్కసారిగా మా తాతతండ్రులు సంపాదించిన పొలం, పచ్చని ఊరు గుర్తుకొచ్చాయి. అప్పుడు బయల్దేరాను. ఏభై మైళ్ళ దూరంలో ఉన్న మా ఊరును కలుసుకోడానికి.

రెండు బస్సులు మారి కాలి నడకన మా ఊరు పోదామనుకుంటుండగానే మూలపాడు బస్సు కనిపించింది. అప్పటిదాకా మా ఊరికి రోడ్డుపడ్డ సంగతి నాకు తెలీదు. ఒకప్పుడు కాలినడకతో వాగులూ, వంకలూ, డొంకలూ దాటుతూ రోడ్డు చేరి పట్నం పోయేవాళ్ళం. కంకరరోడ్డు. బస్సు ఆగినప్పుడల్లా ఎర్రటిదుమ్ము మబ్బులా

కమ్మేస్తోంది. గతుకులూ, కుదుపుల మధ్య, మొలక పైర్ల పొలాల మధ్యగా గంటసేపటికి బస్సు మా ఊరు చేరింది.

రచ్చబండ దగ్గర నలుగురైదుగురు పెద్దవాళ్ళు గుర్తుపట్టి పలకరించారు. వాళ్ళకి నా ఉద్యోగం సంగతులూ, కుటుంబం సంగతులూ చెప్పి బుచ్చిరామయ్య ఇంటికి వెళ్ళాను నేరుగా. ఇల్లు మారిపోయింది. రెండు భాగాలైంది. ఎదురుగా గుమ్మంలో ఎవరో యువతి బియ్యం ఏరుతోంది.

"మావయ్య లేడా?" వెనకటి వరస గుర్తు తెచ్చుకుంటూ అడిగాను.

"లేడు," అంటూ ఆమె నావంక ఎగాదిగా చూసింది. మరుక్షణం గుర్తుపట్టి నవ్వింది. నేను అప్పుడే పోల్చుకున్నాను, బుచ్చిరామయ్య కూతురు సీత అని.

"నిలబడ్డావేం? లోపలికి రా," అంటూ గబగబా మంచం వాల్చింది. లోనికి వెళ్లి కాస్త శుభ్రంగా ఉన్న దుప్పటి తెచ్చి వేసింది. కాళ్ళకి నీళ్ళిచ్చింది. అప్పటిదాకా నేనాశ్చర్యం నుంచి తేరుకోలేదు. ఒకప్పుడు సీత నా భార్య కావాల్సింది. మళ్ళీ ఇలా హఠాత్తుగా కనిపిస్తుందనుకోలేదు. ఆ అందమంతా ఏమైపోయింది? అంత కళావిహీనంగా మొహానబొట్టు కూడా లేకుండా ఎందుకుంది? నేను కాళ్ళు కడుక్కుని బెరుగ్గా మంచం మీద కూర్చున్నాను.

"మావయ్యెక్కడి కెళ్ళాడు?"

"ఇప్పుడే పొలమెళ్ళాడు. వస్తాళ్ళే, బాగున్నావా? ఎంతమంది పిల్లలు?"

చెప్పాను. ఇంకేవో సంగతులడుగుతోంది. నెమ్మదిగా జవాబులిస్తున్నాను. మధ్యలో లోపలికి వెళ్ళి పొయ్యి రాజేసి వచ్చింది.

ఏవో ప్రశ్నలు మనస్సును దొలుస్తున్నాయి. ఒక్కటీ అడగలేకపోయాను. గ్లాసుతో కాఫీ తెచ్చింది. చేతులు గరుకుదేరి ఉన్నాయి.

"మేమెప్పుడైనా గుర్తొస్తామా? బాగా మారిపోయావు?" అంది మాటల మధ్య.

నవ్వాను. నిజానికి సీతను దాదాపు మరిచిపోయాను. నేను పట్నం వెళ్ళాక ఎవరితోనో ఆమె పెళ్ళి జరిగిందని తెలిసింది. పెళ్ళికి వెళ్ళలేకపోయాను. మాటల మధ్య ఎదురింటి ముసలమ్మ వచ్చింది. కళ్ళ మీద చెయ్యి పెట్టుకుని పరీక్షగా చూసింది.

"సుబ్బయ్య కొడుకువి గాదంటారా నువ్వు?" నేననవునన్ లోపే సీత అందుకుని, "ఎందుకయిందే? బాగా చూడు. ఎవరో పట్నం పిల్లాడు," అంది నవ్వుతూ.

"పోవే కంతిరిముండా! ఇంకా అంత గుడ్డిదాన్ని కాలేదులే. ఏదో నాయనా, మీ అయ్యుండగా చూసిందాన్ని. మీ అమ్మ కూడా పోయిందంటగా? ఆరోజులే యేరు. ఇప్పుడే వుంది? వూరంతా మారిపోయె. రొండ్రోజులుంటావా?"

"ఊహు, వెళ్ళిపోవాలి."

ముసలమ్మ వెళ్ళిపోయింది. సీత లోపలికి వెళ్ళి వంటపని మొదలెట్టింది. సన్నగా పొగ కమ్మేస్తోంది. బయట ఎండ. బస్సులో ఒళ్ళు హూనమై బాగా అలసిపోయా నేమో మాగన్నుగా నిద్ర పట్టింది. కలతనిద్రలో ఏదో కల... ఎవరో పదేళ్ళ కుర్రాడు వేపచెట్టు కింద గోళీలాడుతున్నాడు, తోటిపిల్లల్తో. ఇంతలో ఒక ఎనిమిదేళ్ళ పిల్ల వచ్చి గోళీలు లాక్కుని పరిగెత్తింది. కుర్రాడు వెంటబడ్డాడు. పిల్ల పరిగెత్తి పరిగెత్తి ఒకింట్లో దూరి, "చూడత్తా!" అంటూ ఎవర్నో వాటేసుకుంది. తను బలవంతంగా గోళీలు లాక్కుని ఆ పిల్లని రెండు దెబ్బలేశాడు. ఆ పెద్దామె పిల్లని ఒళ్లోకి లాక్కుని

తనని రెండు మొట్టికాయలేసింది. తను తల తడుముకుంటుండగా ఎవరో తల కింద దిండు పెడుతున్నారు. మెలకువ. ఎదురుగా సీత. లేచి కూర్చున్నాను.

భోజనం చేస్తుండగా బుచ్చిరామయ్య వచ్చాడు. నన్ను చూసి ఎంతో ఆశ్చర్య పోయాడు.

"ఏమిట్రో? కబురూ కాకరకాయా లేకుండా వూడిపడ్డావే? పిల్లా పాపా బాగుండారా?" అనడిగాడు.

సీత తండ్రికి వడ్డించింది. భోజనాల మధ్య ఇంటి సంగతులన్నీ చెప్పుకొచ్చాడు.

"మీ అత్త పోయిన సంగతి తెలుసుగా? దీని కామధ్య కూనవరం సంబంధంజేశా. కుర్రాడు బుద్ధిమంతుడే. అయితేనేం, దేవుడు తప్ప జూశాడు. బస్సు ప్రెమాదంలో పోయాడు. పిల్లల్లేరు. ఇంకా అత్తారింట్లో దేనికని యిక్కడికి దీసుకొచ్చా. ఏంటో, దీని కర్మిట్టా అయిపోయింది."

అప్పుడర్థమైంది సీత మొహాన బొట్టు లేకపోవటానికి కారణం. తలెత్తి సీత వంక చూశాను. తలొంచుకుంది. ఆమె మొహంలో వున్నది విచారమో, నిర్లిప్తతో తెలియటం లేదు. నేనే సీతని పెళ్ళాడి ఉంటే? ఆమె బ్రతుకు మరోవిధంగా ఉండేది. చిన్నప్పటి నుంచీ పెద్దవాళ్ళు మా ఇద్దరికీ వరస గలిపి మాట్లాడేవాళ్ళు. తనంటే సీత కెంతో ఇష్టంగా వుండేది. తనకీ అంతే. అయితే పై చదువులకి వెళ్ళినప్పటి నుంచి ఇద్దరి మధ్యా చనువు తగ్గింది.

చితికిపోయిన బుచ్చిరామయ్య కూతుర్ని ఉద్యోగస్థుడు కాబోయే తనకి ముడి పెట్టడానికి అమ్మానాన్నా ఒప్పుకోలేదు. తనూ పట్టుబట్టలేదు. అప్పుడు తన ఆలోచన లన్నీ ఎక్కడెక్కడో మబ్బుల్లో ఉండేవి.

తనకి పెళ్ళయినప్పుడు సీత మూడ్రోజులు భోజనం ముట్టుకోలేదని విన్నాడు. ఆమెని పెళ్ళి చేసుకోనందువల్ల నేను కోల్పోయిందేమిటి? పొందిందేమిటి? ఎందుకో నేను తప్పు చేసిన భావం కలుగుతోంది. సీత భర్త బ్రతికి ఉంటే నాకీ విచారం ఉండక పోను. ఆలోచనలు మళ్ళించి అడిగాను.

"కిష్టాయ్ కనిపించడేం?"

బుచ్చిరామయ్య నవ్వాడు.

"వాడా? ఇదుగో ఇదొచ్చిన దగ్గర్నుంచి ఆడబిడ్డకీ దీనికి సరిపట్టంలేదు. యేరే కాపరం బెట్టాడు. ఆ గోడ అందుకే," అంటూ ఇంటి మధ్య గోడ చూపించాడు. నా కేమనటానికీ తోచలేదు. ఒక్కడే కొడుకైనా కలిసుండే ప్రాప్తం లేకపోయింది.

"కాసేపు పడుకో. ఆనిక్కి పొలం ఎల్లొద్దాం," అని కొట్టంకేసి వెళ్ళాడు.

నేను పడుకోలేదు. ఏమీ తోచకుండా ఉంది. సీతతో మాట్లాడదామన్నా లోపలేదో పట్టేసినట్టుంది. సీత ఎక్కడివో పాత పత్రికలు, అట్టలు చిరిగిపోయినవి పట్టుకొచ్చింది. వాటిని తిరగేస్తూ వుండిపోయాను. చూస్తుండగానే పొద్దు వాటారింది.

*

సాయంత్రం పొలం కేసి బయల్దేరాం. దార్లో నేను పుట్టి పెరిగిన ఇంటిక్కూడా వెళ్ళాం. అదెప్పుడో వేరే వాళ్ళకి అమ్మేసినా నా చిన్నతనమంతా గడిచిన ఇంటిని మరిచిపోయేదెలా? వాళ్ళే మనుకున్నా సరేనని ఇల్లంతా తిరిగాను. పెద్ద ఆవరణలో నాలుగ్గదుల పెంకుటిల్లు. మళ్ళీ బాగుచేయించినట్టున్నారు. ఇంటి ముందుండే పెద్ద పొన్నచెట్టు మాత్రం కనిపించటంలేదు. ఆ

వాసన నాకెంతో ఇష్టం. చిన్నప్పుడు నేనూ, సీతా చలికాలం ఆ చెట్టు కిందే పూలేరుతూ వాటిని తుంపి ఊదుతూ గడిపేవాళ్ళం. పూలగుత్తుల కోసం చెట్టెక్కి పడ్డ సంగతి నాకింకా గుర్తుంది. ఇంటి నుంచి వస్తుంటే మా అమ్మనీ, నాన్ననీ అక్కడే విడిచిపెట్టి వస్తున్నట్టే అనిపించింది.

మా పొలం నాలుగెకరాలూ ఊరికి దక్షిణంగా ఉంది. రెండేసి ఎకరాల చొప్పున రెండు చేలు. చేలల్లోకి పోవటానికి డొంకదారి ఉండాలి. ఆ దారినే బయల్దేరాం. కానీ ఎక్కడా డొంక కనిపించలేదు. ఇదేమిటని అడిగాను.

“ఇంకా డొంకలెక్కడ మిగిలాయబ్బాయ్? అటూ ఇటూ పొలాలే గందా? ఏటా కాస్త కాస్త కలుపుకుంటా వస్తున్నారు. ఇక మిగిలింది ఈ కాస్త దారే. ఈ దారంటే అరకలు పొలం బోవాలి. పొయ్యేటప్పుడల్లా పక్క పొలాల్ని తొక్కకా తప్పదు. తగాదాలూ తప్పవు. సివరికి బంజర్లు గూడా మిగల్లేదు. ఆళ్ళూ యీళ్ళూ కలిపేసుకున్నారు,” అన్నాడు బుచ్చిరామయ్య.

“ఎందుకని?”

“కాస్త నేల గలుపుకుంటే కలిసొస్తదని.”

చుట్టూ పొలాల్లో మొలకపైర్లు, మినుము, పెసర, నువ్వు వానల్లేక వాడిపోయున్నాయి. దూరంగా తాటితోపులు, కొండబారులు ఎగిరిపోతున్న పికిలి పిట్టలు. అక్కడక్కడా పొలాల నుంచి తిరిగొస్తున్న మనుషులు. నేను మరో లోకంలోకి వచ్చిపడ్డాననిపించింది. గాలి రాని ఇరుకు భవనాల నుంచి, విషం చిమ్మే గాలి నుంచి, చెవులు దిబ్బిళ్ళేసే రొదల నుంచి- పన్నెండేళ్ళ తరువాత పొలాల్లోకి వచ్చాను. విశాలమైన ఆకాశం కిందికి, నిర్మలమైన గాల్లోకి, నల్లరేగడి పునాది మీదికి వచ్చాను. జీవితం విశాలమైనట్టుంది. ఆఫీసు, ఫైళ్ళు, ఇల్లు, సిటీబస్సు, మళ్ళీ ఆఫీసు తప్ప బ్రతుకులో మరేమీ లేకపోవటం ఎంత విషాదం! ఉద్యోగం గాలి కొదిలి మళ్ళీ ఈ నాగటి చాళ్ళలోకి, పొలం బురదలోకి, నిజమైన శ్రమలోకి రాగలిగితే ఎంత బావుండును? కానీ ఎలా సాధ్యం? బొడ్డు తాడు తెగిపోయిన బిడ్డ తిరిగి తల్లి గర్భం చేరేదెట్లా?

బుచ్చిరామయ్య చూపించిందాకా మా పొలాన్ని నేను గుర్తించలేకపోయాను. ఎప్పుడో చూసిన పొలం. రెండెకరాల్లో మినుము పెట్టాడు. బాగానే మొలిచినా వానలేక ఇవ్వాళో రేపో ఎండిపోయేట్టుంది. దూరంగా మరో పొలం. అదీ అలాగే ఉంది. వాగులో కూడా నీళ్ళు లేవు. ఇక పొలం గొడవల గురించి ఆయన చెబుతుంటే నేను మౌనంగా వింటూ ఉండిపోయాను.

“కాడిగట్టు చేను లక్ష్మయ్యది. గట్టురాయి కాడ ఎప్పుడూ తగాదే. రాయి గజం యివతల కుండాలంటాడు. ఎట్టా కుదురుద్ది? మీ తాతల కాలంలో యేసిన రాళ్ళు. ఇప్పుడు మారుద్దామంటే ఎవుడొప్పుకుంటాడు? చూశావుగా? గట్టు కూడా ఎట్టా పగల దున్నాడో? ఎగస్పార్టీవాళ్ళే. అదీ సంగతి,” అన్నాడు బుచ్చిరామయ్య కండువా దులిపేసుకుంటూ.

నేను మాట్లాళ్ళేదు. చేను వంకే చూస్తుండిపోయాను. ఆ పొలం నాది. నా తాత ముత్తాతల నుంచి సంక్రమించింది. అందులో కాలుపెట్టి ఎన్నేళ్ళయిందో? నేను దుక్కిదున్నని, వెదబెట్టని, కలుపుతియ్యని, కోత కొయ్యని ఆ పొలం నాదే! అందులో ఇన్నేళ్ళ నుంచీ కష్టపడే బుచ్చిరామయ్యది కాదు. కాకపోబట్టే రెండేళ్ళ కౌలు బాకీ వసూలు కోసం ఇంత దూరం వచ్చాను. అయినా ఆ పొలం నేనెలా వదులుకోగలను? భార్యాపిల్లల కేం జవాబు చెప్పగలను? జీతంరాళ్ళకి తోడు ఆ నాలుగెకరా లుండబట్టే పళ్ళ బిగువున కుటుంబాన్ని లాక్కు రాగలుగుతున్నాను. తెగిపోయీ తెగిపోని నేల సంబంధం.

"పోదాం పా, సీకటి బడింది," అన్నాడు బుచ్చిరామయ్య. ఇంటికి మళ్ళాం. కనుచీకట్లో చిన్నచిన్న గోతుల్లో తొట్రుపడుతుంటే "బద్రం బద్రం" అని వెనకే హెచ్చరిస్తున్నాడు.

ఇంటికి చేరినప్పుడే ఊరికింకా కరెంటు రాలేదన్న సంగతి గ్రహించాను. గడపలో లాంత రుంది. ఇంతకాలంగా ఊరికి కరెంటు లేకపోవటమేమిటి?

ఊళ్ళో పార్టీల వల్లే రాలేదనీ, ఒకళ్ళు ప్రయత్నం చేస్తుంటే మరొకళ్ళు చెడగొడుతున్నారనీ చెప్పాడు బుచ్చిరామయ్య. అప్పుడే విన్నాను, ఊళ్ళో పార్టీల సంగతి. ఆ విషయం అడుగుదామను కుంటుండగానే సీత వచ్చి స్నానానికి నీళ్ళు తోడానని చెప్పింది. వేన్నీళ్ళు పోసుకోలేకపోయాను. పట్నం వెళ్ళాక చన్నీళ్ళ స్నానమే అలవాటైపోయింది. రోజూ వేన్నీళ్ళు కావాలంటే ఎంత ఖర్చు మరి?

భోజనాలయ్యాయి. సీత ఆరుబయట పక్కలు వేసింది. బుచ్చిరామయ్య కాసేపట్లోనే గురక ప్రారంభించాడు. నేనూ పడుకున్నాను. కుక్కి నులక మంచం. పైన మిలమిల మెరిసే ఆకాశం. కొట్టంలో పశువుల తొక్కిడి వాసనతో కలగలిసి వీస్తున్న చల్లటిగాలి... ఎప్పుడు నిద్రపట్టిందో నాకే తెలీదు. అర్ధరాత్రి ఎవరో లేపినప్పుడు మాత్రమే లేచాను.

సన్నగా చినుకులు పడుతున్నాయి.

సీత హడావుడిగా మంచాలు లోపల వేసింది. మళ్ళీ నిద్రపట్టే సమయానికి కప్పు నుంచి సన్నటి ధార మంచం మీద పడసాగింది. గబుక్కున లేచి కూర్చున్నాను.

"ఇల్లు కప్పించలేదు," అంది సీత నొచ్చుకుంటూ.

"ఫర్వాలేదులే," అన్నాను.

సీతా, నేనూ కలిసి మంచం మరో పక్కకి పట్టాం.

తను కిందనే చాప వేసుకు పడుకుంది. దిండివ్వబోయాను.

"వద్దొద్దు. నువ్వేసుకో," అంది.

ఇక ఆ రాత్రి నాకు సరిగ్గా నిద్రపట్టలేదు. ఇంటి దగ్గర పిల్లలెట్లా ఉన్నారో అనే ఆలోచన వచ్చింది. బయట వాన ఆగిపోయింది.

తెల్లారింది. నిజానికి ఇంటి నుంచి బయల్దేరినప్పుడు రెండో రోజుకల్లా వచ్చెయ్యమని శ్రీమతి చెప్పింది. కాని ఇంకా కౌలు డబ్బు అడగనేలేదు. ఊళ్ళో తెలిసినవాళ్ళనీ కలుసుకోలేదు.

నా ఆలోచన గ్రహించినట్టు బుచ్చిరామయ్య అన్నాడు, "ఊరికి రేపెల్లువుగానీ లే," అని.

నేనిక తర్కించలేదు. కాఫీ తాగి కోటయ్యగారింటికి బయల్దేరాను.

కోటయ్య ప్రెసిడెంటు. వీధిలో ఎక్కడా కొత్త ఇళ్ళు కట్టినట్టుగానీ, పాత ఇళ్ళు బాగు చేయించినట్టుగానీ కనిపించలేదు. ఊరంతా మరింత పాతబడినట్టే కనిపించింది. మనుషులు మాత్రం ఎక్కడో మారిపోయినట్టు తోస్తోంది. వీధిలో ఆడుకునే పిల్లలెవరూ నన్ను గుర్తుపట్టలేదు. కొత్తతరం పెరుగుతోంది. హఠాత్తుగా దార్లో సీను కనిపించాడు. నన్ను చూసి నవ్వబోయి ఆగి పోయాడు. నేను పలకరించేలోపే పక్క సందులోకి మళ్ళీ విసవిసా వెళ్ళిపోయాడు. నాకేం బోధ పడలేదు.

వాడు నా చిన్నప్పటి స్నేహితుడు. అప్పుడు మేం ఆడిన ఆటలూ, తిరిగిన తిరుగుళ్ళూ ఇన్నీ అన్నీ గావు. అలాంటి వాడెందుకు మొహం చాటు చేశాడు? నాకు బాధేసింది. మొదటిసారిగా ఏదో కొత్త ఊళ్ళోకి అడుగు పెట్టినట్టనిపించింది.

నేను వెళ్ళేసరికి కోటయ్య మంచం మీద పడుకుని ఉన్నాడు. నన్ను చూసి లేచి కూర్చున్నాడు.

"ఏం పెదనాన్నా! ఒంట్లో బాగోలేదా ఏమిటి? గుర్తుపట్టావా?" అని ప్రశ్నించాను.

"ఆ ఆ కూకో, ఏం బాగుండటంలే. మా తరం అయిపోయింది. పిలుపు రావటమే ఆలిస్సెం," అన్నాడు.

ఒకప్పుడు మా ఊరికి పెద్దతల ఆయన. ఊళ్ళో వ్యవహారాలన్నీ ఆయన చేతిమీదే నడిచేవి. ఆయన ఉంటే పొలం మీద, లేకపోతే వీధి అరుగు మీద. ఎప్పుడూ పదిమంది చుట్టూ చేరి ఉండేవాళ్ళు.

"రామారావేడీ?"

"ఆడా? పట్నమెళ్ళాడు. కోర్టు కేసు."

"కేసేమిటి?"

"ఎందుకడుగుతావులే. ఖూనీ కేసు. ఊళ్ళో రాజకీయాలు నీకింకా తెలిసినట్టు లేదు. నీ చిన్నప్పుడు ఊళ్ళో పార్టీలనే మాటిన్నావా? ఇప్పుడు రొండు పార్టీలు. మన కులమంతా ఒక పార్టీ. పడమటి వీథంతా ఒకటి. యెలక్షన్లు రావటమే ఆలిస్సెం. తన్నులాటలూ, పొడుసుకోవటాలూ, ఏవీ లేకపోతే కాడిగట్టు తగాదాలు. అబ్బాయ్! వూరు నడిమద్దెకి చీలిపోయింది."

ఇంత తొందరగా మా ఊరెట్టా మారిపోయిందో నాకర్థంగాలేదు. నేనెప్పుడూ మా ఊళ్ళో పార్టీలు చూళ్ళేదు. ఎలక్షన్లూ లేవు. కులకక్షలూ లేవు. నలుగురూ కలిసి ఎవరో ఒకర్ని ప్రెసిడెంట్ అనుకునేవాళ్ళు. మళ్ళీ ఆయనే అందుకున్నాడు.

"మొన్న ఎన్నికల రోజు కొట్లాట జరిగింది. సుబ్బయ్య పార్టీవాళ్ళు కొంతమందిని ఓట్లెయ్యకుండా బలవంతాన ఆపారట. దానిమీద మా రావుడు జనాన్ని పోగేసి వాళ్ళ మీదకెళ్ళాడు. పదిమందికి బరిసెపోట్లు తగిలినయ్యి. ఎంకయ్య కొడుకు సచ్చిపొయ్యాడు. కేసుబెట్టారు. పోలీసులొచ్చి ఈణ్ణి పట్టుకుపొయ్యారు. కనాకష్టం మీద యిడిపించాం. డబ్బు జల్లినా కేసు మాఫీ అయ్యేట్టు లేదు. ఈడి మూలాన ఇంట్లో కూడూ నీళ్ళూ లేవు. ఒరే సిన్నోడా! వానల్లేకో, వరదల్లేకో, మహమ్మారి వచ్చే పోలేరమ్మకి బలులు జేశాంగాని మనుషులు నరుక్కోవటం యిప్పుడే సూస్తున్నాన్రా. వూళ్ళో నెత్తురు వారబోత్తన్నారు," అని పై పంచెతో మొహం తుడుచుకున్నాడు.

నాకప్పుడర్థమైంది. సీను నన్నెందుకు పలకరించలేదో. వాడు నా చుట్టాలకి వ్యతిరేక వర్గంలో ఉన్నాడు.

"మరి మీరంతా ఏం జేస్తున్నారు పెదనాన్నా?"

"ఏవీ సెయ్యలేకనే యిట్టా వున్నాం. పెద్దోళ్ళ మాటినే వాడెవుడు? మావాడు నా మాటింటన్నాడా, వూళ్ళో వాళ్ళినటానికి? తరం మారిపోయింది. జనం తన్నుకుపోవటానికి ఎలక్షన్లూ, పార్టీలూ వొచ్చినయ్యి. తాగి పోవటానికి సారా దుకాణాలొచ్చినయ్యి. సినిమాలూ, సీట్లాటలూ వొచ్చినయ్యి. మనుషులికి బుద్ధే రాలేదు.

"నీకు చెప్పేపాటివాణ్ణి గాదుగానీ పెదనానా, నీలాంటి పెద్ద తలకాయలు మన కెందుకని వదిలేస్తే ఊరు దారికొచ్చేదెక్కడ? ఊళ్ళో కరెంటు లేదు. లైబ్రరీ లేదు. సరైన రోడ్డులేదు. నలుగురు పెద్దాళ్ళూ పూనుకుంటే కొంతలో కొంత మేలు జరుగుతుంది గదా!" అన్నాను.

ఆయన పెద్దగా నవ్వాడు. "ఒరే యెర్రినాగన్నా! వూళ్ళో జనం యిదే సరైన దారనుకుంటుంటే యింక దారికి దెచ్చేదేంది? మా హయాంలో నాలాంటోడు ఏది సెబితే అది వూరంతకీ యేదవాక్కు. రొండు రొళ్ళు పదంటే పదే. అన్నేయం జేసినా, అరాచకం జేసినా యెపుడో వూరి కొక్కడే ఉండే వాడు. ఇప్పుడేవైందీ? ఎవుడికి వాడు రాజు. రైతు మాట కూలీ యినడు. తండ్రి మాట కొడుకూ యినడు. అంతా అరాజకమే."

తన తరంలో మనిషినీ మనిషినీ కలిపి ఉంచిన సూత్రమేమిటో, అదెందుకు తెగిపోయిందో ఆయనెరగడు. ఆ సూత్రం తిరిగి సంధించటమెలాగో నేనెరగను.

"అద్సరేగానీ నువ్వు..." అంటూ ఏదో అడగబోయినపుడు అలాగే ఆగిపోయిడు.

వీధి గుమ్మంలోంచి ఓ నడికారు మనిషి రొప్పుతూ వచ్చిపడ్డాడు.

"ఓ మావో! మన కాపయ్య వామికెవురో నిప్పుబెట్టారు. వూరి మీన బడుద్దోయేమో! నువ్వు రావాల. మనోళ్ళంతా కడవలు దీసుకెళ్ళారు," అని చెప్పి, ఒక్క మాటలో నన్నూ పలకరించి, ఒక్క పరుగులో గడపదాటాడు.

నేను నిశ్చేష్టుణ్ణయ్యాను. పెద్దాయన తేరుకుని, "చూశావుగా సిన్నోడా? పద, యీ వైనమూ చూద్దువుగాని," అని పై పంచ నడుంకి చుట్టి ఉన్నపళంగా బయల్దేరాడు. నేనూ అనుసరించాను.

ఊరి కానుకుని పడమటివైపు కొన్ని వాములున్నాయి. కామయ్యగారి పెద్ద వామి భగభగా మండుతోంది. ఏ కిరసనాయిలో పోస్తే తప్ప రాత్రి చినుకులకి దమ్ముకున్న వామి అంత తేలిగ్గా తగలబడదు. గాలి బాగా తోలుతోంది. ఊరి జనంలో సగం మంది అక్కడే ఉన్నారు. చేంతాళ్లూ, కడవలూ, బిందెలూ, బావుల్లోంచి నీళ్ళు తేవటాలూ, అరుపులూ అంతా గందరగోళంగా ఉంది. పెద్దాయన వాళ్లనీ వీళ్లనీ పురమాయిస్తున్నాడు. బుచ్చిరామయ్య కూడా వాళ్లలో ఉన్నాడు. మంట వేడికి ఎవరూ వామి దగ్గరికి చేరలేక దూరం నుంచే నీళ్ళు విసురుతున్నారు. చివరికి లాభం లేక పక్క వాములకి నిప్పంటకుండా వాటి మీద కడవల్తో నీళ్లు చల్లుతున్నారు. చూస్తుండగానే కాపయ్య వామి దగ్ధమైపోయింది. అంతెత్తున బూడిద మిగిలింది. మసి తుప్పలు తుప్పలుగా గాలి కెగురు తోంది. మసి వాసనా, తడిసిన చెత్త వాసనా కలిసి ఏదో విచిత్రమైన వాసన వస్తోంది. వామి దగ్గర కాపయ్య తల పట్టుక్కూర్చున్నాడు. జనం చుట్టూరా గుంపులు గుంపులుగా చేరారు. వామికి నిప్పు బెట్టిందెవరో దెబ్బకి దెబ్బెట్లా తీయాలో ఆలోచనలు మొదలయ్యాయి. నాకక్కడ ఉండబుద్ధి కాలేదు. ఈ మనుషులు నావాళ్ళు కాదు. ఆ నిప్పు ఆరేది కాదు.

నేను మళ్ళీ బుచ్చిరామయ్య ఇంటికి వెళ్ళేటప్పటికి సీత భోంచెయ్యకుండా ఎదురు చూస్తోంది.

"ఇంతసేపెక్కడికి పొయ్యావు?" అడిగింది.

వామికి నిప్పు బెట్టిన సంగతి చెప్పాను. ఆమె మొహంలో ఆశ్చర్యం లేదు.

"ఇది మామూలే మనూళ్ళో. నీకే కొత్త," అంది నిర్లిప్తంగా.

నేను మరేం మాట్లాడకుండా భోంచేశాను.

సాయంకాలం ఊళ్ళో మరికొంతమందిని కలుసుకుందామని ముందనుకున్నాను గానీ మనస్కరించలేదు. ఈ కక్షల్లో బయటికెళ్ళి ఎవర్ని పలకరించేది? ఏవో పత్రికలు చూస్తూ గడిపాను.

చీకటి పడింతర్వాత బుచ్చిరామయ్య ఇంటికి వచ్చాడు. అలిసిపోయినట్టుంది మొహం. నాతో పెద్దగా మాట్లాడలేదు. బహుశా నేను డబ్బు కోసం వచ్చినందుకు చిన్నతనంగా ఉందేమో.

రాత్రి భోజనాలకి కూర్చున్నాం. ఎక్కణ్ణుంచో జున్నుపాలు పట్టుకొచ్చింది సీత.

"ఎక్కడివి? గేదె ఈనిందా?" అనడిగాను.

"కాదు. శేషమ్మత్త ఇంట్లో తీసుకొచ్చా, నీకిష్టమని," అంటూ మరీ మరీ వడ్డించింది.

భోజనాలైన తరువాత గోరింటాకు పట్టుకొచ్చింది.

"ఏదీ చెయ్యి చాపు."

నేను మొహమాటపడ్డాను. ఎప్పుడో చిన్నతనంలో మేమిద్దరం గోరింటాకు కోసం పోటీపడే వాళ్ళం. తెల్లారగానే చేతులు కడుక్కుని ఎవరి చెయ్యి ఎక్కువగా పండిందో పరీక్షించుకునేవాళ్ళం. ఒకసారి నాకంటే తనకెక్కువ పండిందని కక్షతో సీత చెయ్యి కొరికేశాను. కొన్ని జ్ఞాపకాలకి మరణం ఉండదు.

"నాకొద్దులే. ఇంకా గోరింటాకేమిటి?" అన్నాను.

"కానీ కానీ. నువ్వు కాదంటే అది నొచ్చుకుంటది," అన్నాడు బుచ్చిరామయ్య పొగాకు కాడ సవరదీస్తూ.

నా చెయ్యి లాగి లాంతరు వెలుగులో గోరింటాకు పెట్టింది సీత. ఇంటిపనితో గట్టిపడ్డ సీత చేతిలో నా చెయ్యి. వింత కొత్త స్పర్శ.

మర్నాడుదయమే నేను బయల్దేరాలి. వచ్చిన సంగతి ఇప్పుడైనా ప్రస్తావిస్తే మంచిదను కున్నాను. కానీ చూస్తూ డబ్బు సంగతి అడగలేకపోయాను. పొలంచాకిరీ చేసి చేసి కాయబారిన బుచ్చిరామయ్య నల్లటి మొహం, దరిద్రం ఓడే ఇల్లు, పాత దుస్తుల్లో కాంతిహీనంగా ఉన్న సీత. ఇదంతా అద్దం మీద పెసరగింజలా కనిపిస్తూనే ఉంది. మరోవంక కంటి ముందు పెరిగిపోయే కుటుంబం ఖర్చులు, పిల్లల చదువులు. డబ్బడగటంలో ఏదో తప్పిదం చేస్తున్నట్టు ఒకవైపు. తప్పదు.

"పొలాలెట్లా పండుతున్నాయి మావయ్యా. ఏమన్నా రాబడి ఉందా?" సంభాషణ ప్రారం భించాను. మంచం మీద కూర్చుని చెయ్యి ఆరబెట్టుకుంటూ.

బుచ్చిరామయ్య నిశ్శబ్దంగా చుట్ట వెలిగించాడు. "ఏం జెప్పమంటావబ్బాయ్? ఏయేటి కాయేడు చేతి కందింది నోటి కందటం లేదు. శాకిరి దప్ప మిగిలేది కనబట్టంలా. ముందటేడే చేలు కాస్త బాగా పండినయ్యి. ఏం లాభం? కింటాలు పత్తికి నాలుగొందలు రేటొత్తే రైతుకి మిగిలేదేంది? కౌలే గట్టాలో, బాంకు బాకీయే తీరవాలో తెలీదు. కల్తీ యిత్తనాలు గొంటాం. కల్తీ ఎరువులూ, కల్తీ మందులూ ఏస్తాం. మందులేసినా పురుగు సావదు. పంట పండినా రేటు రాదు. అప్పుడుదాకా మార్కెట్లో మంచి రేటుంటది. పంట చేతికి రాగానే తగ్గిపోద్ది. ఏమిటో సిత్రం ఎక్కడా ఎపుడూ పండించనిదానికి రేటుంటది. మరపటేడు ఇదిగాదని ఆ పైర్లేస్తాం. దానికి మళ్ళీ రేటుండదు. ఎవుర్నడగాలి? మా కర్మని తిట్టుకుంటా మళ్ళీ పెట్టుబడి కోసం అప్పుకు పరిగెత్తుతాం. పోయినేడు బాగా పండుద్దనుకుంటే తుపానొచ్చి మొత్తం నాశనమైంది. ఇయ్యేడు సూస్తన్నావుగా, వానల్లేవు."

బుచ్చిరామయ్య ఎక్కడో చూస్తూ మాట్లాడుతున్నాడు. ఆయన మాటల్లో అబద్ధం లేదని తెలుస్తోంది. రైతు పంట దిక్కుమాలిన ధరలకి అమ్ముడుబోయి ఏ పట్నాల్లో మేడలుగా, మిల్లులు గా, హోటళ్ళుగా, అవినీతిగా ఎలా అంచెలంచెలుగా మారుతుందో పల్లెల్లో పుట్టి పట్నంలో బతుకు

తున్నవాణ్ణి నాకు కొంతైనా తెలుసు. కానీ ఎవరికి తెలియాలో వాళ్ళకే తమకి జరిగే అన్యాయం తెలీకపోవటం చిత్రం. బుచ్చిరామయ్య మళ్ళీ అందుకున్నాడు.

"అబ్బాయ్! నేనెరిగినంతలో మనూళ్ళో పొలం మీద సంపాయించి మేడలు గట్టిన రైతు లేడు. పొలం పుట్రా అమ్ముకుని దేశాల పాలైనవాళ్ళు, ఇదుగో ఇంతమందుండారు. అప్పుల్లేని రైతు లేడు. ఇయ్యాల యీ యింటి మీద పదేల బాకీ ఉంది, నీకియ్యాల్సిన కౌలుగాక. నేలన్నమ్ము కున్నాళ్ళం మా బతుకులింతే."

ఆయన నా బాకీ చెల్లించలేడనే విషయం కన్నా ఆయన కుటుంబం పరిస్థితే నన్నెక్కువ బాధించింది. సాయంత్రం ఎవరో ఇంటికి రావటం, సీత అతన్ని పక్కకి పిలిచి చిన్నగా మాట్లాడటం గుర్తొచ్చింది. అతను కోమటి దానయ్య కొడుకు. బహుశా ఏదో బాకీ కోసం వచ్చుండాలని ఇప్పుడని పించింది. ఇక్కడికి రాబోయే ముందు ఇలాంటి పరిస్థితిని గూర్చి నేనాలోచించలేదు.

"ఈ గొడవలకేంలే. పొద్దుబోయింది పడుకో," అన్నాడాయన మళ్ళీ.

నేను మర్నాడుదయమే వెళతానని చెప్పాను. ఆయనేం మాట్లాడలేదు. అప్పటి దాకా మా మాటలు వింటున్న సీత ఏదో అనబోయి మానేసింది.

బుచ్చిరామయ్యని డబ్బడగరాదని నిర్ణయించుకున్నాను. ఆ రాత్రి చాలాసేపటి దాకా నిద్ర పట్టలేదు. నా ఆలోచనలన్నీ ఊరి చుట్టూ తిరుగుతున్నాయి. ఊళ్ళోని పెద్ద కుటుంబాలు చితికి పోయాయి. లేదా పట్నాలకి తరలిపోయాయి. నేలని వదల్లేని కుటుంబాలే ఉట్టికీ, స్వర్గానికీ కాకుండా వేలాడుతున్నాయి.

ఎప్పుడో కలత నిద్ర. మళ్ళీ కల. అదే పదేళ్ళ కుర్రాడు. ఎవరో అమ్మాయితో కలిసి పొన్న పూలేరుతూ... గొడ్ల వెంబడి బీళ్లకి వెళ్తూ... బజార్లో చెడుగుడాడుతూ... ఇంతలో ఎక్కడివో రెండు ఆబోతులు కుమ్ములాడుకుంటూ తనవైపు వస్తున్నాయి. తను పరిగెత్తి పరిగెత్తి పరిగెత్తి అమ్మ ఒళ్లో దూరి... అమ్మ తన తల నిమురుతూ... చటుక్కున మెలకువ. గుడ్డి వెన్నెల్లో సీత నా తల నిమురు తోంది. నేను లేవటం చూసి చటుక్కున చెయ్యి లాక్కుంది.

"సీతా! ఏమిటిది?" అన్నాను కంగారుగా.

"ఏం లేదు... ఏంలేదు," అంటూ తల తిప్పుకుంది. ఆమె కళ్ల వెంట నీళ్లు గుడ్డి వెలుతుర్లో మెరుస్తున్నాయి. సీతని వదులుకొని నేను కోల్పోయిందేమిటో అప్పుడు తెలిసింది.

"ఊరి కెళ్లగానే నన్ను మరిచిపోతావా?" అనడిగింది.

"ఊహూ. నిన్ను మరిచిపోతే నా ఊరిని మరిచిపోయినట్టే."

సీత నిశ్శబ్దంగా నవ్వి నేనూహించలేనంత వేగంగా నుదుటి మీద ముద్దు పెట్టి వెళ్ళి పోయింది. ఈ ముద్దు నాలోని పదేళ్ళ కుర్రాడికని తెలుసు నాకు.

మర్నాడు పొద్దున్నే నేను బయల్దేరాను. బుచ్చిరామయ్య ఎక్కడికో వెళ్లొచ్చి కొంత డబ్బు నా చేతిలో పెట్టాడు.

"ఉన్నప్పుడే ఇద్దువుగాని. తొందరేం లేదు. ఉంచులే," అని తిరిగివ్వబోయాను.

ఆయన తీసుకోలేదు. నవ్వాడు.

"ఆ నమ్మకం సాల్లే. తీసుకెళ్ళు. మా యిబ్బందులెప్పుడూ వుండేవే. అమ్మాయి నడిగానని చెప్పు. పిల్లల్ని బాగా సదివించు," అన్నాడు.

అయినా డబ్బు తీసుకోవటానికి సందేహించాను.

"తీసుకో, తీసుకో. మీ యావిడ కో నగైనా కొనిపెట్టు," అంది సీత నవ్వుతూ.

నేను వీడ్కోలు చెప్పి కదిలాను. బస్సెక్కుతూ వెనక్కి తిరిగి చూస్తే నా ఊరంతా ఏదో అదృశ్య విషాదంలో మునిగి ఉన్నట్టనిపించింది. ఎలీనేషన్-రిలేషన్-ఎలీనేషన్.

నా ఊరు నాశనమైందని, నా స్వప్నం భగ్నమైందని ఎవర్నడిగేది? అక్కడి మనుషులనా? వాళ్ళ నాడించే దారుణశక్తులనా? వాటి నెదుర్కొనే బలం మళ్ళీ నా ఊరి కెప్పుడొస్తుంది? ఎప్పుడైనా అది అక్కణ్ణుంచే రావాలి. నేను కన్నతల్లికి దూరమైనవాణ్ణి. ఒక లేగదూడ ఊబిలో చిక్కుకున్నప్పుడు గట్టు మీద మనిషికి కలిగే బాధే నాది. నేనే ఊబిలోనూ లేను. లేగదూడనూ కాను. అయినా నా గుండె నక్కడే నేను కోల్పోయిన ఊళ్ళోనే విడిచిపెట్టి వచ్చా. సీత చేతి స్పర్శ, మా ఊరి నేల స్పర్శ నన్నెప్పటికీ వదలదు.

*ఆంధ్రప్రభ వారపత్రిక*<br>
*23 డిసెంబర్ 1987*<br>
*రచన, 1 ఆగస్టు 1987*

*ఊరితో విడదీయరానిబంధం*

# మట్టిగుండె

***రచయిత ఒక్కోసారి వస్తువు కోసం దూరతీరాల్లో వెతుకుతుంటాడు. కాలి కింద నేలని కనుక్కోవటమే కష్టం. ఎంత మంది కవులూ, కథకులూ గ్రామాల నుంచి రాలేదు? వాటిని తమ రచనల్లో ప్రస్తావించిన వాళ్ళెందరు?***

కథ, కవిత్వం రెండు కళ్ళలాంటివి నాకు. అవి నాలోకి నేను చూసుకోటానికి, ప్రపంచంలోకి చూట్టానికి సాయపడ్డాయి. నా అనుభూతులు, ఆవేశాలు, ఆలోచనలు సాహిత్యంతో ముడిపడి ఉన్నాయి. ఇవాళ నా నుంచి సాహిత్యాన్ని విడదీస్తే అక్కడొక అసంతృప్త మానవుడు కన్పిస్తాడు. సాహిత్యరచన నాకు కేవలం ఒక వ్యాపకం కాదు. ఒక రకంగా అది నా జీవిత సమస్య, జీవిత ప్రక్షాళన, purification. ఒక కథో కవితో నేను రాస్తున్నానంటే అది నా అంతరాంతరాల్ని బాధించి, శోధించి, నా సంస్కారాన్నీ, జ్ఞానాన్నీ, పరీక్షించి, నా అల్పత్వాన్ని క్షమిస్తూ ఉదాత్తంగా రూపొందుతుంది. నాకన్నా నేను కల్పించిన సాహిత్యం ఉన్నతమైంది. ఇంకో రకంగా చెప్పాలంటే నా సాహిత్యం కన్నా నేను చిన్నవాణ్ణి. ఈ ప్రపంచం ఎట్లా ఉందని నేననుకొన్నానో దాన్ని కథల్లో కవితల్లో చిత్రించటానికి ప్రయత్నించాను. ఎట్లా ఉండాలనుకొన్నానో దాన్ని ఊహించటానికి ప్రయత్నించాను. ఉన్న దాన్నుంచి ఉండాల్సిన దానికి నేను చేసిన ప్రయాణమే నా సాహిత్యం.

ఊహ తెలిసినప్పట్నుంచీ నాకు చొరవ తక్కువే. జన సముద్రంలో నిస్సం కోచంగా ఈదెయ్యటం నాకు చేతయ్యేది కాదు. అంతర్ముఖత్వం ఎక్కువ. అట్లాంటి నా బలహీనతల్నీ, జ్ఞానలోపాల్నీ తీర్చింది సాహిత్యం. అది నాలోని స్వార్థచింతనని

తగ్గించి, మానవీయతని పెంపొందించింది. నిజమైన సాహిత్యకారుడు చెడ్డవాడు కాలేడని నా నమ్మకం. సాహిత్యకారుల్లో వ్యాపారదృష్టి, కెరీరిస్టు ధోరణి కనబడితే సహించలేను. నేను చేసిన కొద్దిపాటి సృజన వల్ల చాలామంది సాహితీమిత్రుల్ని పొందగలిగాను. ఆ విధంగా చూస్తే సాహిత్యం ద్వారా నేను లోకానికి ఇచ్చినదాని కన్నా పొందిందే ఎక్కువ.

ప్రాథమికంగా నేను కవినా, లేక కథా రచయితనా అంటే వెంటనే జవాబు చెప్పలేను. (విమర్శ రాసినా అది నా స్వభావ సహజమైంది కాదు.) నాలో కవి సహజమైన భావోద్వేగాలు ఎక్కువ. నా కథల్లో కొంత కవితాలక్షణం ఉందంటాడు శివారెడ్డి. నా కవిత్వంలో కథారచన నుంచి పరిశ్రమించిన కథనశైలి ఉందంటాడు చేరా. అట్లా ఉండటం దోషం కాదనుకొంటాను. ఒక్కోసారి ఒక పేజీ వచనం చెయ్యలేని పని ఒక్క కవితాత్మక వాక్యం చెయ్యగలుగుతుంది. 'కదిలే హృదయ మున్నవాడు కన్నతల్లిని మర్చిపోలేడు. మా ఊరు నా కన్నతల్లి. నాకు హృదయముందో లేదో పన్నెం డేళ్ళపాటు మర్చిపోయాను. నగరం పునాదుల కింద కాంక్రీట్ అరణ్యంలో నన్ను నేను పారేసు కొన్నాను,' అని మొదలవుతుంది మట్టిగుండె కథ. ఇది వచనంలో కవిత్వమే. లేదూ కవిత్వంలో వచనం. కవిత్వానికీ వచనానికీ శత్రువైరుధ్యమేమీ లేదు. చలం ఓ పువ్వు పూసింది, రావిశాస్త్రి వెన్నెల కథారూపంలో కవిత్వాలే. సందర్భశుద్ధి ఉంటే ఏ లక్షణమైనా గుణమే అవుతుంది. అయితే సహజంగా ఒక ప్రక్రియకి వస్తే గుణం మరో ప్రక్రియలో చొప్పించేటప్పుడు మితిమీరకుండా జాగ్రత్తపడాలి. అదట్లా ఉంచితే నేను కవిత్వం రాసినంత విరివిగా కథలు రాయలేదు. నా మట్టుకు నాకు కవిత్వం కన్నా కథ రాయటమే కష్టం. విమర్శ ఇంకా కష్టం.

కథారచనలో నా తొలి, మలి ప్రేరణల సంగతి ముందుగా చెపుతాను. చిన్నతనంలో అమ్మ పాడే బాలనాగమ్మ కథల్లాంటివి, ఊళ్ళో ఆంజనేయస్వామి గుడి మండపంలో బుర్రకథలు, కుర్రకారు నాటకాలు, చందమామ కథలు, తుళ్ళూరు లైబ్రరీ సాహిత్యం నా ఊహాశక్తికి రెక్కలు తొడిగాయి. కౌమారదశలో రవీంద్రనాథ టాగూర్ ప్రభావం అమితంగా ఉండేది. హోమ్ కమింగ్, కాబూలీవాలా, నయంజోర్ బాబులు, పోస్టాఫీస్ మొదలైన కథలు నా మనస్సును పట్టేశాయి. టాగూర్ కథల్లోని సుకుమార, గంభీర పాత్రలు, మానవీయ స్పర్శ, కరుణరసం- ఇవన్నీ నాలో తెలీని ముద్రలు వేసి ఉంటాయి. నేను కల్పించిన పాత్రల్లోను ఆ లక్షణాలు తొంగి చూశాయి. ముఖ్యంగా- ఇప్పుడు తిరిగి చూసుకొంటే ఒక్క నెగెటివ్ స్త్రీ పాత్రని కూడా నేను కల్పించలేదు. మా అమ్మ కష్టాలు, ఊళ్ళో ఇతర స్త్రీల వ్యథలు నా దృక్పథాన్ని మలిచి ఉండాలి. అందుకే నా కథల్లో స్త్రీ పాత్రలంటే నాకు ప్రేమా, గౌరవం.

ఎవరైనా గొప్ప చదువరి కానిదే గొప్ప రచయిత కాలేడు. ఏదైనా లోకానికి చెప్పదల్చుకొన్న వాడు ఎంతైనా నేర్చుకోవాలి. తెలుగులో ప్రసిద్ధ రచయితలందర్నీ శ్రద్ధగా చదివాను. ఒక్కొ క్కళ్లు ఒక్కొక్కందుకు నచ్చుతారు. శైలికి చలం, ఒడుపుకి శ్రీపాద, సహజ జీవనచిత్రణకి మా గోఖలే, చేవాడితనానికి చాసో, విశ్లేషణకి కొడవటిగంటి, ఆర్ద్రతకి తిలక్- ఇట్లా గొప్ప రచయిత లంతా మనకి ఏదో ఒకటి నేర్పుతూనే ఉంటారు. ఇక శరత్, ప్రేమ్‌చంద్, కిషన్‌చందర్, విభూతి భూషణ బందోపాధ్యాయ, గోపీనాథ్- ఇట్లాంటి మహా రచయితలంతా మన కండగా ఉండనే ఉన్నారు. ఈ సందర్భంగా రష్యన్ రచయితల ప్రభావాన్ని నేను తల్చుకోక తప్పదు. ముఖ్యంగా అక్టోబర్ విప్లవానికి ముందున్నవాళ్ళు- పుష్కిన్, గొగోల్, షెడ్రిన్, తుర్గెనెవ్, చెహోవ్, దొస్తొయెవ్‌స్కీ, టాల్‌స్టాయ్, గోర్కీ- ఈ రచయితలందర్నుంచి నేను కొన్ని మెళకువలు తెలుసుకొన్నాను. అందర్లోకీ గొగోల్, దొస్తొయెవ్‌స్కీ నాకు చాలా ఇష్టం. ప్రపంచ సాహిత్యంలో మొపాసా, జోలా, బాల్జాక్,

ఓహెన్రీ, మామ్, హెమింగ్వే లాంటి మరికొందర్ని చదివాను. అయితే నా అభిప్రాయం ఏమిటంటే కథారచయితలు ఏదైనా చదవకపోతే కొంత కోల్పోతారు. రష్యన్ సాహిత్యాన్ని అధ్యయనం చెయ్యక పోతే చాలా కోల్పోతారు.

రచయిత ఒక్కోసారి వస్తువు కోసం దూరతీరాల్లో వెతుకుతుంటాడు. కాలి కింద నేలని కనుక్కోవటమే కష్టం. ఎంత మంది కవులూ, కథకులూ గ్రామాల నుంచి రాలేదు? వాటిని తమ రచనల్లో ప్రస్తావించిన వాళ్ళెందరు? ఈ విషయంలో కథా రచయితలు చాలా నయం. రానురాను నా దృక్పథమూ బాగా మారింది. "ఎక్కడ పొలాలు కన్నీళ్ళకి పదునవుతున్నాయో అక్కడే నా కవిత మొలుస్తుంది. మట్టిలో పుట్టినవాణ్ణి నేనే ఇప్పుడు నేలగోడు విన్పించాల్సింది," (బెట్ట) అని ఒక కవితలో రాశాను. కథల్లోను నా పునాదిని అన్వేషించటం మొదలుపెట్టాను. ఆ అన్వేషణలోంచి బయటపడిందే *మట్టిగుండె*.

*మట్టిగుండె* కథ పరాయితనం అనే సమస్య మీద (the problem of alienation) అల్ల బడింది. మనిషి శక్తిసామర్థ్యాలు ఆత్మవిరుద్ధంగా వేరే దేనికో ఉపయోగపడతాయి. అతని ఆచరణ ఫలితం అతనికి చెందదు. తనకే నచ్చని జీవిత విధానం అతన్ని శాసిస్తుంది. ఆ విధంగా అతను తన సహజ సారాంశానికి దూరమవుతాడు. ఇతరులకి దూరమవుతాడు. అదే పరాయితనం. ఆధునిక సంక్లిష్ట మానవజీవితాన్ని పరిశీలించటంలో పరాయితనం అనేది ఒక తాత్త్వికభావనగా (philosophical concept) ఉపయోగపడుతుంది.

కథలో నాయకుడు పల్లెటూరికి పరాయివాడవుతాడు. (అతనికి పేరు పెట్టలేదు నేను.) అతని చిన్నతనమంతా మూలపాడుతో ముడిపడి ఉంది. గోలీలాటలు, గొడ్లమ్మట బీళ్ళల్లో తిరగటాలు, పంటపొలాలు, పనిపాట్లు, ఇంటి ముందు పొన్నచెట్టు పూల నేరుకోవటం, సీత, సీను మొదలైన వాళ్ళతో స్నేహాలు- ఇవన్నీ అతని బాల్యస్మృతులు. అతని బాల్యం ఆ ఊళ్ళోని సమస్త విషయాల్లో విడదీయరాని సంబంధం కలిగి ఉంటుంది. ఊరు అతని కన్నతల్లి. అటువంటి సహజమైన జీవితానికి ఉద్యోగ కారణంగా దూరమవుతాడు. కన్నతల్లిని కొంతకాలం మర్చిపోతాడు. ఊళ్ళో తనకున్న నాలుగెకరాల పొలం బుచ్చిరామయ్యకు కౌలుకిస్తాడు. రెండేళ్ళుగా కౌలు అందకపోవటంతో శ్రీమతి బలవంతాన డబ్బుకోసం ఏభై మైళ్ళ దూరంలో ఉన్న సొంత ఊరికి వెళతాడు.

బుచ్చిరామయ్య ఇంట్లో తన చిన్ననాటి స్నేహితురాలు సీత కన్పిస్తుంది. చదువు కల్పించిన అంతరం వల్ల ఒకప్పుడు ఆమెను పెళ్ళి చేసుకోలేదు తను. సీత మరొకర్ని పెళ్ళాడి, భర్త మరణంతో పుట్టింటికి చేరుతుంది. అనుకోకుండా సీత కనబడడంతో వెనుకటి జ్ఞాపకాలన్నీ కదలబారతాయి. ఆ సాయంత్రం ఒకప్పటి తమ సొంత ఇంటిని చూసొస్తాడు. బుచ్చిరామయ్యతో కలిసి పొలం కల్లే వెళ్తాడు. దూరంగా కొండలబారు, తాటితోపులు, మొలక పైర్లు, ఇంకో లోకంలోకి వచ్చిపడ్డట్టని పిస్తుంది. "విషం చిమ్మే గాలి నుంచి, చెవులు దిబ్బిళ్ళేసే రొదల నుంచి, పన్నెండేళ్ళ తర్వాత పొలా ల్లోకి వచ్చాను. విశాలమైన ఆకాశం కిందకి, నిర్మలమైన గాల్లోకి, నల్లరేగడి పునాది మీదకి వచ్చాను. జీవితం విశాలమైనట్టుంది. ఆఫీసు, ఫైళ్ళు, ఇల్లు, సిటీబస్సు, మళ్ళీ ఆఫీసు తప్ప బ్రతుకులో మరేమీ లేకపోవటం ఎంత విషాదం! ఉద్యోగం గాలికొదిలి మళ్ళీ ఈ నాగలి చాళ్ళలోకి, పొలం బురదలోకి, నిజమైన శ్రమలోకి రాగలిగితే ఎంత బాగుండును? కాని ఎలా సాధ్యం? బొడ్డుతాడు తెగిపోయిన బిడ్డ తిరిగి తల్లి గర్భం చేరేదెట్లా?" ఇదీ అతని ఆలోచన. అక్కడి నేల తోనూ, మనుషుల తోను తెగిపోయీ తెగిపోని సంబంధం అతణ్ణి బాధిస్తుంది. తాను కోల్పోయిన దాని గురించిన స్పృహ ఉన్నప్పుడు, దాన్ని తిరిగి పొందలేనప్పుడు మనిషి తనకు తానే పరాయివాడుగా అనిపిస్తాడు.

తెల్లారి ప్రెసిడెంట్ కోటయ్య ఇంటికి వెళ్తాడు. ఊళ్ళో ఒకప్పుడు లేని రాజకీయ కక్షలు, కార్పణ్యాలు ఏర్పడ్డట్టు తెలుస్తుంది. "తరం మారిపోయింది. జనం తన్నుకు చావటానికి ఎలక్షన్లు, పార్టీలు వచ్చినాయి. తాగి చావటానికి సారా దుకాణాలొచ్చినాయి. సినిమాలు, సీట్లాటలూ వచ్చినాయి. మనుషులకి బుద్ధే రాలేదు," అంటాడు కోటయ్య నిర్వేదంగా. తను అక్కడికి వచ్చేటప్పుడు బజార్లో ఎదురైన బాల్య స్నేహితుడు సీను ఎందుకు మొహం తప్పించాడో అప్పుడర్థమవుతుంది. అతను తన బంధువులకి ఎగస్పార్టీ. అంతలో ఊళ్ళో ఎవరిదో వామికి ఎవరో నిప్పు పెట్టినట్టు వింటాడు. కోటయ్యతో కలిసి వెళ్ళి ఆ దృశ్యం చూస్తాడు. అక్కడి మనుషుల ఆవేశకావేషాలు చూస్తూ అక్కడ ఉండ బుద్ధి పుట్టదు. 'ఈ మనుషులు నా వాళ్ళు కాదు. ఆ నిప్పు ఆరేది కాదు,' అనుకొంటాడు.

సాయంత్రం తనకిష్టమని ఎక్కణ్ణుంచో జున్నుపాలు తెస్తుంది సీత. లాంతరు వెలుతుర్లో తన చెయ్యి లాగి గోరింటాకు పెడుతుంది. చిన్నప్పుడు తనూ సీతా గోరింటాకు పెట్టుకోవడంలో పోటీపడడం మొదలైన సంగతులు గుర్తొస్తాయి. కొన్ని జ్ఞాపకాలకు మరణం ఉండదు.

బుచ్చిరామయ్యని కౌలు డబ్బు అడగాలని ఉన్నా అతని పరిస్థితి చూసి అడగలేకపోతాడు. పొలం సంగతి వచ్చినప్పుడు బుచ్చిరామయ్య రైతుల బాధలు ఏకరువుపెడతాడు. ఊళ్ళో అప్పుల్లేని రైతు లేడనీ, పొలంపుట్రా అమ్ముకొని దేశంపాలైన వాళ్ళు చాలామంది ఉన్నారని చెబుతాడు. తనకియ్యాల్సిన కౌలుగాక ఇంటి మీద పదివేల బాకీ ఉందని తెలుస్తుంది. అతను తన బాకీ చెల్లించలేడనే విషయం కన్నా అతని కుటుంబ పరిస్థితే తనకెక్కువ బాధిస్తుంది. తెల్లారే ఊరికి వెళ్ళాలనుకొంటాడు.

ఆ రాత్రి ఎంతకీ నిద్రపట్టదు. ఆలోచనలన్నీ ఊరు చుట్టూ తిరుగుతుంటాయి. చితికిపోయిన కుటుంబాలు, వలసపోయిన వాళ్ళు, నేలని వదల్లేక కష్టపడేవాళ్ళు- అంతా కళ్ళ ముందు కనబడుతోంది. కలత నిద్రలో బాల్యస్మృతులు తెరలు తెరలుగా వస్తాయి. కళ్ళు తెరిచి చూస్తే తన తల నిమురుతూ సీత కన్పిస్తుంది. ఆమె కళ్ళ వెంట నీళ్ళు. "ఊరి కెళ్ళగానే నన్ను మర్చిపోతావా?" అనడుగుతుంది. "నిన్ను మర్చిపోతే నా ఊరిని మర్చిపోయినట్టే," అంటాడు. ఊహించని విధంగా సీత తన నుదుటి మీద ముద్దుపెట్టి వెళ్ళిపోతుంది.

పొద్దున్నే తను బయలుదేరుతుండగా బుచ్చిరామయ్య ఎక్కడో చేబదులు తెచ్చి కౌలు డబ్బు కొంత చేతిలో పెడతాడు. తనకిష్టంలేక తిరిగి ఇవ్వబోతే బుచ్చిరామయ్య, సీత బలవంతం చేస్తారు. బస్సెక్కి తిరిగి చూసినప్పుడు తన ఊరంతా అదృశ్య విషాదంతో మునిగి ఉన్నట్టు తోస్తుంది. తన గ్రామ స్వప్నం ఎక్కడో భగ్నమైంది. ఎప్పుడైనా అక్కణ్ణుంచే ఒక మార్పు రావాలని కోరుకొంటాడు. "నేను కన్నతల్లికి దూరమైన వాణ్ణి. ఒక లేగదూడ ఊబిలో చిక్కుకొన్నప్పుడు గట్టు మీద మనిషికి కలిగే బాధే నాది. నేనా ఊబిలోనూ లేను. లేగదూడనూ కాను. అయినా నా గుండె నక్కడే, నేను కోల్పోయిన ఊళ్ళోనే విడిచిపెట్టి వచ్చా. సీత చేతిస్పర్శ, మా ఊరి నేల స్పర్శ నన్నెప్పటికీ వదలదు."

కథ చాటున రచయిత దాక్కొనుంటాడు. అతన్ని కనుక్కోగలిగితే కథామూలం చేత జిక్కినట్టే. అయితే తెలివైన రచయిత తన అనుభవాలనైనా, పరాయి అనుభవాలనైనా వస్తుగతంగా (objectively) చిత్రించగలుగుతాడు. అందులో రచయిత ఆత్మీయత పసిగట్టడం కష్టం. ఒక్కోసారి కొన్ని బాహ్యాంతర ఆధారాల్ని బట్టి అది రచయిత స్వీయానుభవమో, పరానుభవమో చెప్పగలం. రెండింటి మిశ్రమంగా కూడా కథలుండొచ్చు. పరానుభవ చిత్రణ కంటే స్వీయానుభవ చిత్రణలో గాఢతకి అవకాశం ఎక్కువ.

మట్టిగుండె వెనకున్నది పూర్తిగా నా జీవితానుభవమే. గుంటూరు జిల్లాలో నెక్కల్లు మా ఊరు. మెట్టపైర్ల పల్లెటూరు. నా జీవిత మూలాలు ఆ ఊరితో ముడిపడి ఉన్నాయి. ఎంతోమంది చిన్నప్పటి సావాసగాళ్ళు పెసర, వేరుశెనగ, మిరపపొలం పనుల సందడి, పొగాకు బేరన్ల సందడి, నాటకాలు, బుర్రకథల సందడి... ఎన్నో జ్ఞాపకాలు. తుళ్ళూరు, గుంటూరుల్లో చదువుల కోసం, ఆపైన ఉద్యోగం కోసం ఊరికి దూరమై పేగుముడి తెంచుకొన్నాను. క్రమంగా మారుతున్న ఊరు. ఊళ్ళో మారుతున్న తరం. ఒక ఎడం, పరాయితనం. ఊళ్ళో ఉండలేను. ఊరు గురించి ఆ మనుషుల గురించి ఆలోచించకుండా ఉండలేను. కథలో సీత, సీను నా బాల్య స్నేహితులకి మరో రూపాలే.

మధ్యతరగతి రైతు కుటుంబంలో పుట్టి పెరిగినవాణ్ణి. పద్దెనిమిదెకరాల మెట్ట పొలం, నల్లనేల. రెండు జతల ఎడ్లు, మూడు గేదెల పాడి. ఇద్దరు జీతగాళ్ళు. జొన్న, పెసర, మినుము, మిరప, పత్తి, పొగాకు- రకరకాల పైర్లు. వానే ఆధారం. పండినేడు పండగ. ఒడిదుడుకుల వ్యవసాయం. ఐదుమైళ్ళ దూరంలో కృష్ణానది పారుతున్నా పొగాకు పంట కోసం మా భూముల్ని మాగాణి కానివ్వని రాజకీయాలు. అదునులో వానలు పడకా, లేదా ఎక్కువై పంట సరిగా పండని ఋతువులే ఎక్కువ. అన్నీ అనుకూలంగా ఉండి గోతాలు, గాదెలు నిండినా నిలకడలేని ధరలు నిలువునా ముంచుతాయి. పొగాకు, పత్తి పంటల్ని కొనుగోలు చేసే దళారులు మా కళ్ళముందే కోటీశ్వరులయ్యారు. ఊళ్ళో రైతులు, కూలీలు ఇంకా ఇంకా దిగనాసిల్లిపోయారు. ఏభైఏళ్ళుగా నేలను నమ్ముకొని ఆరుగాలం చెమటోడ్చినా ఏమీ కూడబెట్టలేకపోయిన మా నాన్న ఈ దేశంలో రైతుకు జరిగిన ద్రోహానికి నిదర్శనంగా కన్పిస్తాడు. మార్క్సిజం చదివిందాకా ఇక్కడ రైతు, కూలీల దోపిడి, వెనకున్న రాజ్య కుతంత్రం, పెట్టుబడిదారీ దుర్మార్గం బోధపడలేదు. ''సంపద సృష్టికర్త సంపన్నుడు కాకపోవటం తరతరాల మోసం,'' అన్నాను ఋతుపవనం అనే కవితలో. కథలో సన్నకారు రైతు బుచ్చిరామయ్య ఇట్లా అంటాడు. ''ఏం చెప్పమంటావబ్బాయ్! ఏ యేటికాయేడు సేతికందింది నోటికందటం లేదు. శాకిరి దప్ప మిగిలేది కనబట్టంలా. ముందటేడే చేలు కాస్త బాగా పండినయ్యి. ఏం లాభం? కింటాలు పత్తికి నాలుగొందలు రేటొత్తే రైతుకి మిగిలేదేంటి? కౌలేగట్టాలో, బాంకు బాకీయే తీరవాలో తెలీదు. కల్తీ ఇత్తనాలు గొంటాం. కల్తీ ఎరువులూ, కల్తీ మందులూ ఏస్తాం. మందు లేసినా పురుగు సావదు. పంట పండినా రేటు రాదు. అప్పుడుదాకా మార్కెట్లో మంచి రేటుంటది. పంట చేతికి రాంగానే తగ్గిపోద్ది. ఏంటో సిత్రం. ఎక్కడా ఎవుడూ పండించని దానికి రేటుంటది. మరుసటేడు ఇది గాదని ఆ పైరేస్తాం. దానికి మళ్ళీ రేటుండదు. ఎవుర్నడగాలి? మా కర్మని తిట్టుకుంటా మళ్ళీ పెట్టుబడి కోసం, అప్పుకు పరుగెత్తుతాం. పోయినేడు బాగా పండుద్దనుకొంటే తుపానొచ్చి మొత్తం నాశనమైంది. ఇయ్యేడు, సూస్తన్నావుగా వానల్లేవు....'' బుచ్చిరామయ్య ఎక్కడో చూస్తూ మాట్లాడుతున్నాడు. ఆయన మాటల్లో అబద్ధం లేదని తెలుస్తూనే ఉంది. రైతు పంట దిక్కుమాలిని ధరలకి అమ్ముడుబోయి ఏ పట్నాల్లో మేడలుగా, మిల్లులుగా, హోటళ్ళుగా, అవినీతిగా ఎలా అంచెలంచెలుగా మారుతుందో పల్లెల్లో పుట్టి, పట్నంలో పెరుగుతున్నవాణ్ణి నాకు కొంతైనా తెలుసు. ఎవరికి తెలియాలో వాళ్ళకే తమకి జరిగే అన్యాయం తెలీకపోవటం చిత్రం. రైతు జీవితం మీద నాకున్న అవగాహన, ప్రేమే ఇట్లా నా చేత రాయించాయి.

కథానిర్మాణంలో నా శైలి నాది. రాయటానికి ముందే అన్ని పాత్రల్లో, సన్నివేశాల్తో, మలుపుల్తో ప్లాట్ మొత్తం నా మనస్సులో సిద్ధంగా ఉండదు. కథలో చెప్పదల్చుకొన్న విషయం మాత్రం స్పష్టంగా ఉంటుంది. స్థూలంగా కొన్ని పాత్రల గురించి అనుకొంటాను. వాటి మనస్తత్త్వం నిర్ధారించు

కొంటాను. వాటి ఆచరణని తగిన సన్నివేశాల్ని ఊహిస్తాను. సన్నివేశాలు సాధారణంగా కన్పిస్తూనే అసాధారణంగా ఉండాలి. కథ ఎట్లా మొదలుపెట్టాలో ఆలోచిస్తాను. ముగింపు ఏ రకంగా ఉండాలో కొంతవరకు ఊహిస్తాను. ఇదంతా అస్థిపంజరమే. దానికి రక్తమాంసాలు, హృదయం కథ రాసే వరసలోనే ఏర్పడతాయి. రాసేటప్పుడు ఎంతో ఆలోచిస్తాను. సందేహాలొస్తే ఆగిపోతాను. అందుకే ఏ కథ రాయటానికైనా వారం పదిరోజులు పడుతుంది. కొత్త పాత్రలు, సన్నివేశాలు ప్రవేశిస్తాయి. మట్టిగుండెలో సీత పాత్ర ముందుగా అనుకొన్నది కాదు. పల్లెటూరి మమకారానికి ప్రతీకగా అసంకల్పితంగా ప్రవేశించింది. ఇప్పుడు తిరిగి చూస్తే ఆ పాత్ర లేకపోతే కథ వెలితిగా ఉందనిపిస్తుంది. అట్లా కథ దాని దారి అది చూసుకొంటుంది. నాలో భావ కాఠిన్యం (రిజిడిటీ) లేదు కనుక నా అభిప్రాయాల్లో, సిద్ధాంతాల్లో కథ నడవడిని శాసించను. కథ కూడా సజీవ ప్రాణే. స్వేచ్ఛని అడ్డుకోను. రాసింతర్వాత తిరిగి చూసుకొంటా. మరీ అవసరమనుకొంటే నిర్మితికి భంగం లేకుండా ఒకటి రెండు మార్పులేవన్నా చేస్తాను.

పాత్రల స్వభావాన్ని నేను వ్యాఖ్యానించను. అవి తమ మాటల ద్వారా, చేతల ద్వారా స్వయం వక్తలు కావాలి. సంభాషణలు లోతుగా, క్లుప్తంగా, కచ్చితంగా రాయటానికి ప్రయత్నిస్తాను. ఇప్పుడిప్పుడు భాషలో ఇంకా సహజత్వం, సరళత్వం ఉండాలనుకొంటున్నా. ఈ మార్పు చింతల తోపు కథలో చూడొచ్చు. ఇక కథలో ఏ వర్ణనైనా రెండు మూడు వాక్యాల్లో ముగియాల్సిందే. అనవసర మైన ఒక్క వాక్యం కూడా కథలో ఉండదు.

కథారచనలో నేనేమీ అద్భుతాలు సాధించలేదు. *పారిపోయిన కల, తుప్పు! తుప్పు!* వంటి కథల్లో సర్రియలిస్ట్, అబ్సర్డ్ టెక్నిక్‌లతో ప్రయోగాలు చేశాను. మౌలికంగా నాది విమర్శనాత్మక వాస్తవికతా విధానం. రచయితగా నడిచింది కాస్త దూరమే. ఎక్కాల్సిన మెట్లు ఎన్నో ఉన్నాయి. రచనలో తాత్త్విక స్థాయి నా లక్ష్యం. దాన్ని కవిత్వంలో సాధించినంత కథలో సాధించలేకపోయా. అలల్ని ముట్టుకోటం కాదు, అంతస్సును తాకాలి. ఏ వస్తువుతోనైనా జీవిత మూలాల్ని అన్వే షించాలి.

సాహిత్యం నా ఆత్మోన్నతికి నే నెన్నుకొన్న సాధనం.

*5 ఏప్రిల్ 1998*

23

# కాగుబొత్త

## పెద్దింటి అశోక్‌కుమార్




*__పెద్దింటి అశోక్‌కుమార్__ 1966 ఏప్రిల్ 19న కరీంనగర్ జిల్లాలో పుట్టారు. వీరి మొదటి కథ ఆశ-నిరాశ-ఆశ 1999లో ఆంధ్రప్రభలో అచ్చయింది. అప్పటి నుంచి దాదాపు వంద కథల వరకూ రాశారు. ఐదు కథా సంపుటాలు, రెండు నవలలు, ఒక వ్యాససంపుటి ప్రచురించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. వీరి కథలు కొన్ని ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. వివిధ కథల పోటీల్లో వీరి కథలకు బహుమతులు లభించాయి.*

**చిరునామా**

*4-4-90/1, రెడ్డివాడ, సిరిసిల్ల*
*కరీంనగర్ జిల్లా-505 301*
*Ph: 94416 72428*
*akpeddinti@gmail.com*


“గెటవుట్ ఫ్రం హియర్... ముసలాడికి తెలివి లేదు. నిన్ను నా పక్కనుంచాడు. మట్టివాసన భరించలేకున్నాను. ఒళ్లు కప్పుకోవడం కూడా తెలియదు. నీ పేరేంటి?” చిన్నగా ఊపిరి పీల్చుకుంటూ అడిగింది గోద్రేజ్ ఫ్రిజ్. రాత్రనగా పోయిన కరెంటు రావడం దాని నరాల్లో జీవం నింపింది.

“నేను కాగుబొత్తను... నన్ను రంజన్ అని కూడా పిలుస్తరు,” బెరుకుగా చెబుతూ చుట్టూ చూసింది కాగు బొత్త. చుట్టూ ఖరీదైన వాతావరణం... కొత్తగా వింతగా తను ఒదిగిపోలేని జాగా అని రాగానే తెలిసిపోయింది దానికి.

వింతగా వికృతంగా రక్తాన్ని అడ్డుకున్నట్టున్న కాగు వైపు అసహ్యంగా చూసింది ఫ్రిజ్.

“బాబూ... మనది ఏ కంపెనేంటీ...?” ఎగతాళిగా అన్నది.

కాగుబొత్తకు అర్థం కాలేదు. ఏమిటన్నట్టు చూసింది. ఫ్రిజ్ వెక్కిరిస్తున్నట్టుగా నవ్వుతూ, “ఎక్కడి నుండి వచ్చావు?” అన్నది.

కాగుబొత్తకు రోషం వచ్చింది. “మన్ను నుంచి... మన్ను నుంచి ఎదిగిన మానవ మనుగడ నుంచి... పచ్చి కూరల నుండి వండుకు తినే కాలం దాకా కరిగిన వందల

సంవత్సరాల్లోంచి... తరానికీ తరానికీ పెరిగిన చేతివాటపు నైపుణ్యం నుంచి... కుమ్మరి లింగం వాముల నుంచి...'' మాటలు పూర్తికాలేదు, అందుకుంది ఫ్రిజ్.

"అదికాదు బుజ్జీ... కంపెనీ ఎక్కడుందంటన్న. ఐ.ఎస్.ఐ. మార్క్ ఉన్నదా?''

"గా కంపెనీలు, మార్క్‌లు నాకుండవు. మనిషి రక్తాన్ని, చెమటను అద్దుకుని పుట్టాను. మనిషి మనసులోని భావనలతో మమేకమై దోస్తీ చేశాను. పుట్టిన్నుండి సచ్చేదాకా మనిషి అవసరా లలో పుట్టి అవసరంగా పెరిగాను,'' ధీమాగా చెప్పింది కాగుబొత్త.

"అయితే అనవసరంగా ఇక్కడ ఎందుకున్నట్టు? ఏం చేస్తావు నువ్వు?'' కోపంగా అడిగింది ఫ్రిజ్.

"ఎండాకాలమైతే నీళ్లను సల్లగజేస్త. వానాకాలం ఏదన్నా ఇత్తు ఈదునం పోసి మూతపెడితే పురుగు పట్టకుంట దాచిపెడత,'' అడిగిన తీరుకు కొద్దిగా నొచ్చుకున్నా నెమ్మదిగానే చెప్పింది కాగు. తన యజమాని గుర్తొచ్చి కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

మూతి మూడు వంకర్లు తిప్పి పకపకా నవ్వింది ఫ్రిజ్. "అదేంటే ఏడుస్తున్నావు? కంపెనీ లాకౌట్ అయిందా...'' వెక్కిరిస్తున్నట్టుగా.

"కంపెనీ కాదు. బతుకే లాకౌట్ అయింది. అయ్యకూ కొడుక్కూ ఉంటుంది చూడూ... పేగుబంధం... అదీ లాకౌట్. మల్లా అతుక్కోదు! ఒక తరంవారు మరో తరానికి అందించే పనితనం ఉంటుంది చూడూ నైపుణ్యం... అదీ లాకౌట్. ఒక తరంతోనే ఆగిపోయింది.''

"ఆగాగు. ఏదో నస మొదలెట్టావు. నీకో కంపెనీ లేదు. కాయదం లేదు. అమ్మినవారు లేరు. కొన్నవారు లేరు. కార్మికుల్లేరు. కథల్లేవు. ట్రేడ్‌మార్క్ లేదు. ఐ.ఎస్.ఐ. ముద్రలేదు...'' అంటూ తన కథను చెప్పింది ఫ్రిజ్.

వింతగా, కొత్తగా, భయం భయంగా ఫ్రిజ్ చరిత్రనంతా విన్నది కాగు. ఎందుకోగాని వణుకు పుట్టింది. ఫ్రిజ్ మీద కోపం వచ్చింది. తన కష్టాలకు కారణమెవరో తెలిసిపోయింది.

బాధగానే పెదవి విప్పింది కాగు.

"నాకు కంపెనీ లేకపోవచ్చు. కన్నీటి తడి ఉంది. కార్మికులు లేకపోవచ్చు. కష్టం ఉన్నది. ఆకలి ఉన్నది. నేనెన్నడూ నా యజమానికి లాభాలు తెచ్చిపెట్టలేదు. పొద్దుమాపు పొట్టకు తప్ప. ఇప్పుడు అది కూడా లేదు. కష్టాలను కన్నీటిని మిగిల్చి వచ్చాను.

చెప్పింది రెండు ముక్కలే అయినా ఒక్క ముక్క అర్థంకాలేదు ఫ్రిజ్‌కు. టైంపాస్ కొరకు అన్నట్టుగా కాగును తన కథ చెప్పమంది. కాసింతైనా బరువు తగ్గుతుందని కాగు తన కథను చెప్పడం మొదలెట్టింది.

అప్పటికి అర్ధరాత్రి దాటింది. కడుపులోని పదార్థాలను చల్లబరుస్తూ వింటుంది ఫ్రిజ్. ఖాళీ కడుపుతో కథను మొదలెట్టింది కాగు.

*

ముసిముసి మబ్బులు. మబ్బుల మీద రెక్కలు జాపిన కొంగలు తోరునాలు గడుతున్నాయి. కోడి గొంతు పొద్దు పొడుపును నిద్ర లేపుతున్నది. తూరుపుకొండల సందున మొగులు ఎద్దు పుండ యింది. ఎక్కడో గుడి మీద మైకు పాట. బజారు వెంట బర్ల జంగిడి సందడి.

ఆగమాగాన నిద్ర లేచిన లింగం గోశిని సదురుకుంటూ బాయి దగ్గరికి నడిచాడు. గూట్లో ఉన్న మంజిన్ పొడితో పండ్లు తోమినట్టు చేసి నోట్లో నీళ్లు పోసి పుకిలిచ్చి ఊంచాడు. పీక్కపోయిన మొహం నిండా తెల్లటిగడ్డం, పొడుగ్గా సాగిన మెడలు వంగిన నడుము. బక్కగా ఉంటాడు లింగం. బనీను ఇడిచి మూలకు ఇసిరికొట్టి చెంబుతో బుడబుడ నీళ్లను కుమ్మరించుకున్నాడు.

గొట్టంతో పొయ్యిని రాజేత్తున్న ఎల్లవ్వ తలెత్తి చూసి కోపంగా, "గట్లేంది... కొంకులు తడువలేదు. గోసీబట్ట నానలేదు. ఉనుక మీది రోకలి లెక్క ఉరుకులాడుతున్నవి. నాటి నుంచి ఈ ఉరుకులాట ఉంటే బంగ్ల కడుతుంటిమి. పెయ్యంత తడుపుకో... గాశారం సాలది," అన్నది.

ఆమెవైపు చూడనైనా చూడకుండా ధోతిని మార్చుకుని నొష్టికింత కుంకుమ అద్దుకున్నాడు లింగం. దిగూట్లె నుంచి ఊదుబత్తీల పుడాను అగ్గిపెట్టెను అందుకుని బయటకు నడిచాడు.

అతడి వెంట కుంకుమబరిడీతో గులుక్కుంటూ బయటకు వచ్చింది ఎల్లవ్వ, "నీ ఉరుకు లాటనే చెప్పరాదు. ఉరుకులాట ఉత్తచాట," అనుకుంటూ.

ఆమె మాటలేవీ పట్టించుకోకుండా సారెచక్రం దగ్గరికెళ్లాడు లింగం. అరుగుకు ఆనించిన సారె చక్రం బండి పయ్యలా కొత్తగా ఉన్నది. కళ్లల్లో ఏదో మెరుపు. గతాన్ని తవ్వుతున్న జ్ఞాపకాలు. ఆప్యాయతగా చక్రాన్ని తడిమాడు. పొడిగా, చల్లగా, గరుకుగా తగిలింది. మట్టిలో కలిసిన గొర్రె బూరు తగిలి పాణమున్న మనిషి చేతినే పట్టుకున్నట్టుగా అనిపించింది. ఆ తాకిడి, ఆ అనుభూతి, పోగొట్టుకున్న బతుకుతెరువును యాదికి తెస్తున్నట్టుగా ఉన్నది. అలాగే సారె చక్రాన్ని తడుముతూ నిలబడ్డాడు లింగం.

"ఏమాయె- ఇంకేదో మసులవడితివి. దుర్మూర్తం జొత్తది. జెట్టనగానీ... బీరీపోతే పని నడువది. ఉన్న జాగలుండక ఒగయాల్లందెత్తివి," గుబ్బిగడ్డకు పసుపు, కుంకుమ బొట్లు పెడుతూ భర్తను తొందరపెట్టింది ఎల్లవ్వ.

ఉల్కిపడి అక్కడి నుండి కదిలి ఆగమాగాన కందెన నింపిన పావును అందుకోబోయాడు లింగం. పావు చేతిలోంచి పిసికి కింద పడింది. ఒక్కక్షణం భయంగా ఎల్లవ్వవైపు చూశాడు. అప్పటికే తలెత్తి భర్తను చూసింది ఎల్లవ్వ.

"నీ పునుకుడు చేతులిరుగ. తొల్త తొల్త తోలుగుడ్డు వెట్టినట్టు పావును ఒలుకబోసినవా...? అందుకే నీకు నమ్మకంతో పని చెయ్యిమన..." వదురుతుంది కోపంగా.

మారు మాటాడకుండా లింగం గుబ్బిగడ్డ దగ్గరికొచ్చాడు. కాలువెట్ట సందులేనట్టు వాకలి అంగడిగా ఉంది. ఒకవైపు నానబెట్టిన మట్టిగుంత, మరోవైపు బూడిది పోసి తొక్కిన మన్ను. దర్వాజ దాకా ఎండబెట్టిన మట్టిపెల్లలు, ఈత మొద్దులు, వాయి పొరుక, ఉనుక, బూడిదకుప్పలు.

అప్పటికే దారిన వెల్లే ఇద్దరు ముగ్గురు వ్యక్తులు జమయ్యారు. సారెను, కుమ్మరిమన్నును, లింగంను మార్చి మార్చి చూస్తూ, "అగో... కుమ్మరోల్ల తాత సారె బలిచ్చిండు. ఏంటిది తాతా... కుండలు జేత్తవా..?? అనుడు చాతనైతదా?" అని అడుగుతున్నారు.

"ఎట్లనన్న తాండ్లాడాలెనోయ్... పొట్టతిప్పలుకు జేరిపోతులాట. నీ లెక్క పెండ్లాంను సూసుకుంట కూసుంటే నడుత్తదా..." అంటూ సారె ముల్లుమీద, గుబ్బిగడ్డ బొద్దిలో కందెవేసి సారె చక్రం పట్టుకుని, "జరంత ఆసర పట్టుండ్రోయ్ సారెను దించుదాం," అన్నాడు లింగం.

తలో చెయ్యి వేశారు. బొద్దిలో దిగిన సారెచక్రం ముల్లు మీద గిరగిర తిరిగింది. ఎల్లవ్వ సారె మీద పసుపు కుంకుమ బొట్లు పెట్టింది. లింగం ఊదుబత్తీలను ముట్టిచ్చి మట్టిముద్దలో చెక్కి సారెను కళ్లకు అద్దుకున్నాడు. సారెకోలను అందుకుని గుంతలో ఆనించి గిరగిరా తిప్పాడు.

కొడుకు పుట్టుకతోనే మూలకుపడ్డ సారె అది. ఆనాటి నుండి బయటకు రాలేదు. వారం రోజుల కిందట బయటకు తీసి పొరుకను అల్లి ఎంటితాల్లను చుట్టి మట్టిని దట్టించి ఎండబెడితే బలంగా నిగనిగా మెరుస్తుంది. చాలా ఏండ్ల తర్వాత ఇంటి ముందు తిరుగుతున్న సారెచక్రం కొత్త సందడిని తెచ్చింది.

లింగం కళ్లల్లో చెప్పలేని ఆనందం. కేరింతలు కొడుతున్న చిన్న పిల్లగాడిలా చక్రాన్ని బలం కొద్దీ గిరగిరా తిప్పుతున్నాడు. దారి వెంట పోయేవారంతా గుమిగూడి సారె చక్రాన్ని, లింగంను చిత్రంగా, ఉత్సాహంగా చూస్తున్నారు.

కొందరైతే ఆ దృశ్యాన్ని కొత్తగా చూస్తున్నారు. అప్పుడప్పుడూ కల్లు లొట్లకొరకో పెండ్లి కుండల కొరకో అరకొరగా తిరిగే సారెలు కూడా ఆగిపోయి చాలారోజులయింది. అందరూ మరిచిపోయిన యాల్లన మళ్లీ తిరుగుడు మొదలెట్టిన లింగం సారె సంగతి వాములోని పొగ లెక్కన ఊరంతా వ్యాపిస్తున్నది.

సారెను తిప్పినకొద్దీ మురిపెంగా ఉంది లింగంకు. మనసు ఉత్సాహంతో దరువులేస్తుంది. గిర్రగిర్ర కోలతో తిప్పుతున్నాడు. ముల్లు పాతదే అయినా పాలరాయి బొద్ది కొత్తది. కిర్రుకిర్రు మంటుంది. ఎప్పుడో యాది మరిచిపోయిన చేతివాటం. అందునా చేతగాని ముసలితనం. సారె వేగం ఎక్కువైనాక చేతులు పతుకులాడుతున్నాయి. అది గమనించినట్టుంది ఎల్లవ్వ.

"మెల్లగ, పైలంగ తిప్పు. సాలిగిపడ్డవనుకో... మూతిపండ్లు ఒక్కటుండయి. కాళ్లు కొలకుల కిరుగుతయి," వచ్చినవాళ్లకు కుంకుమబొట్టును పెడుతూ అన్నది.

"ఇప్పుడు ఆయనకేం చాతనైతది? వంగుడు లేసుడు వట్టిగైతదా? ఇప్పటికే తాత వంగి పోయిన కట్టెలెక్కున్నడు," సారెను చూస్తూ అన్నాడు ఒక వ్యక్తి.

"ఇది అమ్మ చెప్పిన ఇగురమే! తాత గుర్రమోలె ఉన్నడని ఈ పనిని ఒదిచ్చింది. ఇప్పుడు తాతకు నడుము టింగుమంటుంది," ఎల్లవ్వను చూస్తూ అన్నాడు ఒక పిల్లగాడు.

ఎల్లవ్వకు ఆ మాటలు సురుక్కుమన్నయి. ఆమెకు ముందే తెలుసు. ఇప్పుడు సారె గీరను బలిచ్చుడంటే మంది నోర్లల్ల నానుడేనని. అందరూ ముసలోడి గోసి బలిచ్చిందని తననే అంటారని కూడా తెలుసు. బొట్టు పెట్టుడు ఆపి ఆ పిల్లగాని దిక్కు చూసింది.

"ఔ... మంచిగంటివయి. నీ బక్క మొడ్డల మన్నువడ. నాకు ఇంటి ముందుకు ట్రాక్టరు నిండ మన్ను వచ్చేదాక తెల్వది. సత్తెపీరిలకాడి బోడగుట్ట మీద సమ్మక్క సారక్క దేవుండ్లను నిలి పిండ్రు గదా! పెద్ద జాతర జేత్తరట. అక్కడ తాగబోదామంటే నీళ్లకు తావులేదాయె. కామరెడ్డి నుంచి ఇరువై ముప్పయి రంజన్లు తెత్తమన్నరట. ఆ పైసలల్ల ఇరువై పెద్ద కాగుల్ని చేసిత్తనని తాత గుత్త పట్టుకునెనట. ట్రాక్టరోళ్లకు మన్ను జెప్పెనట. కైకిలి వెట్టిచ్చి కట్టెలు కొట్టిచ్చెనట. పాత సారె ఇవతలికి తీసేదాక నాకు ఎరుకనే లేదు. నీకు మానం లేక నన్నే అనవడితివి," నవ్వుకుంటూనే అయినా అందరూ వినాలని సూటిగా అన్నది.

పిల్లగాడు మనిషి మర్మం తెలిసినోడు. గోడ మీది పిల్లి. ఎల్లవ్వ మాటల్ని గమనించి, "ఏ... నేను వట్టిగ... గమ్మతికంటున్ననమ్మా... అబ్బో... తాత సంగతి నాకు తెల్వదా! మంకుడుగాడు, నీ మాటల్ని సూర్లజెక్కుతడు. ఒకటి చెప్పుతడు ఒకటి చేస్తడు," నవ్వుతూ మాట మార్చాడు.

ఇవన్నీ వింటున్నాడు లింగం. ఏవీ మనసుకెక్కడం లేదు. మనసులో ఏదో బెరుకు. అది భయంగా మారుతుంది. ఆ భయం కాళ్లను వనికిస్తుంది. పని పాతదే! కాని కొత్తగా ఉంది. అన్నింటిని మించి కాగులు అందుతయా లేదా అన్న భయం! అనుకున్నట్టు కుదురుతయా లేదా అన్న భయం! వాన వస్తదేమోనన్న భయం! ఒకదాన్ని మించి మరొకటి కలవరపెడుతున్నాయి.

ఈడు ముదిరిన పిల్లగాన్ని ఇస్కూల్లో పంతులు ముందు కూసోబెట్టి పరీక్ష రాయిస్తున్నట్టుగా ఉన్నది. వేగానికి తగ్గట్టుగా సారెకోల తిరుగక బొద్దిలోంచి తప్పుకుని గెటగెటమన్నది. సారె వంగి వంగి తిరిగింది.

"కుమ్మరోనివా... కరిద్దోనివిరా... సారెగుంతల కట్టెవెట్టరాదు. ఏం జేసుకు బతుకుతవు. గట్ల గెటగెటమంటదా...' చిన్నప్పటి తండ్రి మాటలు బొచ్చెల మెరిసినయి. తన్నుకుంట గుద్దుకుంట పని నేర్పిన రోజులు యాదికచ్చినయి. తాను పని నేర్చుకుని తండ్రికి ఆసరగా నిలవడ్డడు. ఈ పని తన కొడుక్కు నేర్పకముందే సారె దూరమయింది. కొడుక్కు నేర్పిన పని తన పొట్టనే కొట్టింది. కట్టాలన్నీ యాదికచ్చినయి. కళ్లల్లో సన్నటి నీటిపొర.

సారెగుంతను కోలతో అందుకుని వేగంగా తింపిండు లింగం. చూస్తున్నవాళ్లు చూసినంత సేపు చూస్తూ బరువుగా కదులుతున్నారు. కొత్తవారు సంబూరంగా వచ్చి చేరుతున్నారు. ఎల్లవ్వ ఇంట్లకూ బయటకు తిరుగుతనే ఉంది. అడిగినా అడక్కపోయినా అందరికీ ఈ అంగడి తాతనే పెట్టుకున్నాడని చెబుతనే ఉంది. తేపతేపకు సారె దగ్గరికెళ్లి చేతనైతదా లేదా అని చూస్తుంది. సదిరిందే సదురుతుంది. వదిరిందే వదరుతుంది. వద్దని పనిని ఆపలేకపోతుంది. అలాగని చెప్పలేకపోతుంది. ఇంట్లకు పోతుంది. ఇవతలికత్తుంది. అందరూ ఏమనుకుంటున్నారో వింటుంది. ఆగమాగమై తిరుగుతుంది. మనసులోనే ఖర్చూ లాభం లెక్కగడుతుంది.

లింగం మాత్రం కాల్లు పంగటిచ్చి తిరుగుతున్న సారె ముందు దీక్షగా నిలబడ్డాడు బూడిద పోసి తొక్కి ముద్దజేసిన మన్ను పక్కనే ఉన్నది. దాన్ని సారె పైకి ఎక్కించాడు. కాగురూపం మనసులో మెదిలింది. అది వేళ్లలో పురుడు పోసుకుంటుంది. మట్టి మీద వేళ్లు చురుకుగా కదులుతున్నాయి. చేపపిల్ల నీళ్లలో ఈదినట్టు కొత్త నైపుణ్యమేదో వేళ్లలో పుట్టుకొస్తుంది. మట్టిని తాకిన వేళ్లు మెదడు లోని పొరలను తొలుస్తున్నాయి. నిలువు తయారవుతున్నది. మన్ను మీద నీళ్లు చల్లి మూతికట్టులో పడ్డాడు లింగం. చేతులు వణుకుతున్నాయి. మూతి కుదరడం లేదు.

అటీటు తిరిగి సారె దగ్గరికే వచ్చి నిలబడింది ఎల్లవ్వ. అప్పటికి సారె దగ్గరున్నవాళ్లు వెళ్లి పోయారు. వచ్చిపోయేవారు దూరం నుంచే నిలబడి చూస్తూ వెళుతున్నారు.

"ఔ... వాళ్లు ఖాయంగానే చెప్పింద్రంటవా...? అన్ని చేసినంక యాల్లకు వద్దంటరంటవా...? అది పదిమందిల పని. ఒకలు ఔనంటే ఇంకొకలు కాదంటరు," భర్తవైపు అనుమానంగా చూస్తూ అడిగింది.

మూతి కుదరక తండ్లాడుతున్నాడు లింగం. ఎల్లవ్వ మాటల్ని పట్టించుకోలేదు. విసుగ్గా రెట్టించి అడగడంతో బదులు చెప్పాడు.

"గట్లెందుకంటరే... మన బామను పంతులే చెప్పిండు. అందులో అబద్దముంటదా...? అంత అనుమానముంటే నువ్వే పొయ్యి అడుగు. బయానా ఇస్తనన్నడుగనీ నేనేవద్దన్న. అన్నీ ఒక్కసారే ఇయ్యిమన్న," పనిలో మునిగిపోతూ.

నమ్మాలో నమ్మకూడదో తేల్చుకోలేక అయోమయంగా భర్తవైపు చూసింది ఎల్లవ్వ. ఇంట్లోకి వెళ్లి రోకలిబండతో తిరిగి వచ్చింది. మట్టిపెల్ల మీద రోకలిబండ గరిడెసాములా తిరుగుతుంది. రెండు మూడు దెబ్బలకే ఎగపోత పుట్టింది. ఆగి దమ్మును తీసుకుంటూ అడిగింది.

"ఔ... మరి ఒక్కొక్కదానికి ఎంత ఇస్తనన్నరు. కైకిలన్నా గిట్టుతదా లేదో.ండు అను కుంటున్నాడు.

ఎరంవడ్లు, వడ్లకట్టలు, కూరాడుకుండలు, ఐరేండ్లు, బోనాలు, బల్దకడువలు, ఎసులలు, కంచులు, గలవలు, కలికుండలు, ఒత్తుకుండలు, పేర్పులు, గోలాలు, గొబ్బలు, లొట్లు, గురుగులు... మనిషి పుట్టింది మొదలు సచ్చేవరకు తీరొక్క పనిముట్టును సారె మీదనే మలిచి ఇండ్లకు చేరవేసిన రోజులు, మట్టితో సారెకు, సారెతో కుమ్మరికి, కుమ్మరితో ఊరికి ఉండే

సంబంధాలు... మట్టితో మనిషికి ఉన్న అవసరాలు... వాటి చుట్టూ తిరిగిన సారె గీరల నైపుణ్యం గుర్తుకొచ్చింది.

నిలువు కుదరడంలేదు. నడుము గుంజుతుంది. లేచి కొద్దిసేపు నిలబడి మళ్లీ పనిలో మునిగిపోయాడు. అసలు కుదురుతాయా లేదా అన్న కొత్త భయం మొదలయింది లింగంకు.

తను ఏడుస్తున్నా కూడా లింగం నోరు విప్పకపోవడంతో ఎల్లవ్వకు కోపం వచ్చింది. రోకలిని ఆపి కోపంగా, "ఏంటిది... మూగదయ్యమోలె 'ఊ' అనవు 'ఆ' అనవు," అన్నది అదిలిస్తున్నట్టుగా.

అప్పటికీ నోరు విప్పలేదు లింగం. అతడి బాధ అతడికుంది. మట్టికి మనిషికి మధ్య పుట్టి, అవసరాలతో పెరిగి, తరతరానికి నాణ్యతను నైపుణ్యతను పెంచుకుని, మట్టి నుండి తొట్టి చేసి అవసరాలు తీర్చిన సారెచక్రం, ఎక్కడ ఎందుకు ఆగిపోయిందో తెలుస్తూనే ఉంది. మట్టి నుండి మనిషి ఎంత దూరం పోయిండో తెలుస్తనే ఉన్నది. అయినా బాధ అదికాదు! మట్టి రూపం మనసులో మెదలగానే వేళ్ల సందుల్లో పురుడు పోసుకునే ఈ కళ తనతోనే సమాధి అవుతుందనే బాధ.

'ఏ కులకషివాడైనా పనిముట్లకు ఇంకొకరి చేతికిందికి పోవాలె. అదే నేనైతే నా సారెను నేనే చేసుకుంట. ఒకలకు చెయ్యి చాపెటోన్నిగాదు,' చేతినిండా పని ఉన్నప్పుడు మీసాలు మెలివేసి చెప్పే మాటలు గుర్తొచ్చినయి.

"ఔ... ఏంబుట్టింది నీకు. దయ్యం పట్టిందా! సప్పుడు జెయ్యవు," గట్టిగా గద్దించింది ఎల్లవ్వ. లింగం ఈ లోకంలోకి వచ్చాడు. నిలువు కుదిరింది. కొద్దిగా ధైర్యం వచ్చింది.

"ఏం సప్పుడు జెయ్యన్నే... మనం ఏరు వడ్డప్పుడు ఎట్లుండె. కూసుందామంటే తీరకపోవు. నాలుగు పుట్ల ఎరం. పందుము వడ్లకట్టలు..." మాటలు పూర్తిగాక ముందే అందుకుంది ఎల్లవ్వ.

"ఆహా... నువ్వింకా కుండలు గురుగుల కాలంలనే ఉన్నవు. అది అచ్చిపిట్ట ఎత్తుకపోయింది. ఇప్పుడు నడువబోయే సంగతి చూడు. నలుగురిని కూడగొట్టి అడిగిపియ్యి. ఏదన్నా ఇచ్చే టట్టు మాట్లాడుమను. పసలుకు పుట్టెడు వడ్లు వొత్తననె... అదీ లేకపాయె. వెయ్యి రూపాయలిత్తననె... ఇదీ లేకపాయె," యాష్ట పడుతున్నట్టుగా అన్నది.

నిలువును ముల్లుతో కోసి అరచేతిలో పట్టుకుని అందునా అనద్దా అని కొద్ది తడవు ఆలోచించి నిలువును ఎండలో పెడుతూ అన్నాడు లింగం.

"వాడు మాత్రం యాడి నుండి తెస్తడే... పొక్కగాని పాములెక్క తిరుగుతున్నడు. ఏ పని చేసినా లాసేగావట్టె. ఏదీ ముడి పడుతలేదాయె. నాలుగురోజులాగుదాం."

వెంటనే అందుకుంది ఎల్లవ్వ. "అగో సూడు పాము పగేంది...? తోక చుట్టమేంది...? ఎవలన్న ఇంటె నవ్వుతరు. నువ్వొకటి నేనొకటా... సుతులెందుకంటే గతుల కొరకు అన్నట్టు తవ్వెడు కైకిలి చేసి అయ్యవ్వను సాదినోళ్లు లేరా? ఇల్లిత్తే అదీ అమ్ముకునె. ఎకురం భూమి ఇత్తే ఇదీ అమ్ముకునే! నాలుగు దొయ్యలు మనవి మనకుంటే వానికి ఎవలు ఆశ పడుదురు?"

మౌనంగా సారెవద్దకు వెళ్లి మట్టి మీద నీళ్లు చల్లి కోలను అందుకున్నాడు లింగం. ఎల్లవ్వ ఇంట్లోకి వెళ్లి పొయ్యిమీద ఎసరు పెట్టి వచ్చింది. భర్త తననే తప్పు పట్టడంతో ఆమె కోపం గంభీర మౌనంగా మారిపోయింది. మళ్లీ కొడుకు ముచ్చటనే తీసింది రోకలి అందుకుంటూ.

"అన్నీ నడుమంత్రపు ఏశాలేనాయె. ఏదో వయిలు కేసిట్ల దుకాణమని పెట్టె. అదీ కొద్ది రోజులేనాయె. ఆటోలో కూసుండి పీకె వలికెటిది తెచ్చెనోమో అదీ కొద్ది రోజులేనాయె. ఏ పనిని పొందుపడి చెయ్యకపాయె. ఇప్పుడు పిరుజో గిరుజో అంటరు పెద్ద పెట్టెలెక్కుంది. కొక్కకోల సీసలు తెచ్చి అమ్ముతున్నడట. ఇదెన్ని రోజులో? వాడు ఏశమేసిన దానికల్లా అయ్యోపాపమని

కూసుంటే మనబతుకెట్ల? సావుదాలకు గంజి గూడా పొయ్యడా? నీకు అడుగబుద్ధి గాకపోతె చెప్పు. నేను అడిగిపిత్త," కచ్చితంగా అన్నది.

ఆలోచనల్లో పడ్డాడు లింగం. కొడుకు ఏ పనీ పొందుపడి చెయ్యడని ఎల్లవ్వ అనుకుం టుంది. అందులో లాభం లేకపోతె మానెయ్యక మరేం చేస్తాడని లింగం అనుకుంటాడు. కొడుకు ఆత్మగల్ల కొడుకే. ఆగాయి బుగాయి తిరిగేటోడు గాదు. మరి ఎక్కడ కాట కలిసిండు!

ఇల్లు నిండా వడ్లతో చేతినిండా పనితో కులకషిపి తన కండ్ల ముందే పెరిగి విరిగింది. బతుకుదెరువు క్రమంలో తాను వృత్తిని వదిలి 'బాబా బ్రాస్‌బ్యాండ్' మేళంలో కలిశాడు. అప్పుడు కొడుక్కు ఐదారేండ్ల వయసు. వాడు బుద్ధి నేర్చేనాటికి ఇంట్లో బీప్లేట్ పీకనే కనిపించింది. కుమ్మరి లింగంకు బదులు బీప్లేట్ లింగం అనే పేరు వినిపించింది.

మట్టిముద్ద మీద కలిగిన వేళ్ల నైపుణ్యం పీకె మీద పనికొచ్చింది. ఏ పాటైనా రెండు మూడు సార్లు వినగానే నోటికి వచ్చేది. దాన్ని పీకె మీద సాధన చేసేవాడు. చదువుకొంటూనే అప్పుడప్పుడు గజ్జెలు ఊపడానికి వచ్చేవాడు కొడుకు. పెద్దవాడయ్యాక వీడియో కేసెట్లు, నవలలు అద్దెకిచ్చే దుకాణం తెరిచాడు. అది తొందరలోనే మూతపడింది.

చదువబ్బని కొడుకు పీకె ఊదటం కంటే తేలికని కేసియో ప్లే చేయడం నేర్చుకున్నాడు. వెంట రెండు డ్రమ్ములు ఒక ఆటో ఉంటే సరి. డజను మంది ఉన్న బాబా బ్రాస్‌బ్యాండ్ కంటే నలుగురితో నడిచే క్యాసియో ట్రూప్ తక్కువ రేటులో వచ్చేది. అదొక వింతలా కూడా ఉండేది. గొంతుతో ఊదడం లేదుకాబట్టి భరత్ తీసేప్పుడు ఎన్ని పాటలైనా ప్లే చేసేవాడు. తొందరలోనే బాబా బ్యాండ్ మూతపడింది. లింగం బీ ప్లేట్ పీకె శిలువెక్కింది. ట్రంపెట్, శాక్స్, హారన్ పీకెలు మాయమయ్యాయి.

చేతుల పనిని కొడుకు అందుకున్నాడని సంబురపడ్డాడు లింగం. కానీ ఆ పని కొడుకు చేతుల్లో ఎక్కువ రోజులు నిలువలేదు. చూస్తుండగానే ఐదారు కేసియోలు వచ్చాయి. గిరాకీ పడి పోయింది. రక్తమాంసాలను ఊపిరిగా చేసి ఊదాలె కాబట్టి బీ ప్లేట్ పీకె ఐదారేండ్లు తన చేతుల్లోనే ఉంది. కాని నాలుగు సెల్స్‌తో నడిచే కేసియో నాలుగేండ్లలో నలుగురి చేతులు మారింది.

బతుకుదెరువు తండ్లాటలో వేరు కాపురం, దొయ్యలు అమ్మడం అన్నీ జరిగిపోయాయి. కొడుకు బతుకులోని మార్పును గమనిస్తున్న లింగంకు ఏది అడగాలన్నా నోరు రావడంలేదు. కనీసం ఈ కూల్‌డ్రింకులు అమ్మకంలోనైనా బాగుపడితే అదే చాలనుకుంటున్నాడు.

సారెచక్రం కాలుకు సర్రున కొట్టింది. 'అవ్వా,' అన్నాడు లింగం వెనక్కి విరుచుకపడుతూ. రోకలిబండను వదిలి సారె వద్దకు ఉరికింది ఎల్లవ్వ. కాలును పిడికిడితో పట్టుకుని లేచి కూసున్నాడు లింగం. వేళ్ల సందుల్లోంచి చిక్కటి రక్తం కారి, మట్టిపెల్లల మీద ఇంకిపోతుంది.

"నీ పనింట్ల పీనిగెల్ల. ఏం పని మొదలుబెడితివి. యాడ తలిగింది?" భయం భయంగా చేతిని గుంజేసింది ఎల్లవ్వ.

కాలిబొక్క తెల్లగా కనిపించింది. తోలు ఒర్సుకపోయింది. రక్తం ధారలు కట్టింది. మట్టిలో కలిసి నల్లగా మారుతుంది. అది చూసి ఎల్లవ్వ ఒక్కసారిగా వణికిపోయింది. "ఇగ నేనేం చెయ్యాలె... ఇది వట్టిగ తక్కువైతదా..." అంటూ ఇంట్లోకి పోయింది. పసుపు తెచ్చి గాయానికి అద్ది కాసు సున్నం దంచి కట్టు కట్టింది.

వద్దన్నా వినకుండా నిలువులు చేసే పనిలో మునిగిపోయాడు లింగం. నొప్పి కాలు మీద నిలబడటం కష్టంగా ఉంది. ఒంటికాలు మీదనైతే నిలబడరావటంలేదు. నొప్పిని పండ్ల మధ్య

బిగబట్టి ఓర్చుకుంటూ సారె పై అనుతున్నాడు లింగం. వంగి పైకి లేచేప్పుడు నరాలు జివ్వు మంటున్నాయి.

భర్త గిలగిల కొట్టుకోవడం చూస్తనే ఉంది ఎల్లవ్వ. పని బందు పెట్టాలనిపిస్తుంది. కానీ ఏడాది గాసం, చిల్లర అప్పులు తీరతాయనడంతో దుగపడి చెప్పలేకపోతుంది. ఇంతవరకూ ఎలాగో నాలుగు రోజులు కష్టపడితే సరి అనుకుంది. ఇప్పుడు ఆలోచన మారి, చెయ్యగలమా లేదా అని భర్తను అంచనా వేస్తుంది.

పగలి యాల్లయింది మూడు నిలువులు దిగినాయి. అన్నం తిని మళ్లీ పనిలో దిగారు. కాలు సలుపుతుంది. నొప్పి ఎక్కువవుతుంది. నొప్పి లేనట్టే మొండిగా సారెపై అనుతున్నాడు లింగం. పచ్చి బిగిలను ఎండ నుండి నీడకు మార్చి రాయిని మోటు సల్పను అందుకుంది ఎల్లవ్వ. లోపల మసిని పోస్తూ గుండురాయిని పెట్టి అదుముతూ సల్పతో కొట్టడం మొదలెట్టింది. ఆమె చేతిలో కాగు బొంగరంలా తిరుగుతుంది.

నిలువులన్నీ దిగేనాటికి వారం దాటింది. లింగంకు జరం పుట్టింది. నున్న గుంతలయ్యే సరికి ఎల్లవ్వ నడుము కొంకశీలిపోయింది. మంచంలోంచి లెవ్వలేదు. కాగులు నెర్రెలు వారకుండా గట్టింపు చేసి ఎండ నీడలకు మారుస్తూ సంటిపిల్లను పోదను చేసినట్టుగా చేశాడు లింగం. వాము పేర్చేనాటికి ఇద్దరూ మంచం పట్టారు. దేకినట్టుగా నడుస్తూ వెళ్లి వామును అంటించాడు. వారి గోస చుట్టుపక్కల వాళ్లకు కన్నీరును తెప్పించింది.

ఎన్నో ఏండ్ల తర్వాత మొదటిసారిగా ఇండ్ల మధ్య కుమ్మరి వాము మంటలు లేచాయి. ఆ ఊరి గాలితో వాము పొగ కలిసిపోయింది. వాము చుట్టూ లేచిన కొత్త ఇండ్లల్లో పొగ నిండింది. వారికి అది కొత్త. ఇదేం పొగ అని విచిత్రపడ్డరు. విసుక్కుంటూ తలుపులేసుకున్నారు. ఇక రోజు గిట్లయితే మనం పోగు వోసినట్టేనని తిట్టుకున్నారు. కాలుతున్న మట్టివాసన కమ్మగా, కొత్తగా దట్టమైన పొగతో కలిసి పైకి లేచింది.

చీకట్లో నాలుకలు చాపిన మంటలతో కుమ్మరి వాము తన ఉనికిని చెప్పుకుంటుంది.

వాముపొగ సుడులు తిరుగుతూ ఆర్తిగా అన్ని మూలలను తడుముతూ మనిషి మనిషినీ పలకరిస్తూ సూరు పొక్కల్లోంచి, కిటికీల్లోంచి ఊరంతా కలియతిరిగి పైకి లేచింది.

లింగం అక్కడే వాము దగ్గరనే అలసిసొలసి నిద్రపోయాడు. ఎల్లవ్వ ఇంట్లో పడుకుంది. కంటి మీద కునుకు రావడంలేదు. కండ్లపొంటి నీళ్లు కారుతున్నాయి. "ఇందరు ఇన్నిరకాల మాట్లాడిత్తన్నరు. రోజూ ఇంటి ముందటి నుండే పోతున్నడుగనీ, 'నాయినా, జరమచ్చినాదే? అవ్వా, ఎట్లున్నవే?' అని కొడుకు మాట్లాడిస్తలేడని ఆమె మనసు వాములా రగులుకుంటుంది. 'వాడు పెడితే ఎంత, పెట్టకపోతే ఎంత! యాడాదికి ఒక్కసారి గిట్లనే వాము చేసి కాగులు కాల్చుకుంటే ఎవ్వలకు ఎదురు సూడకుంట బతుకచ్చు. అట్లనో ఇట్లనో గడ్డకు వడ్డము,' అనుకుంటుంది పుట్టెడు జరంతో కూడా.

ఇద్దరూ మనుసుల్లో మనుసులై తిరిగేనాటికి వాము కాలి కూలింది. ఐదువందల దాకా మందులకు ఖర్చయినయి. అయినా మొహంలో చెప్పలేని ధీమా! ఎక్కడికక్కడ లెక్కలేసుకున్నారు.

పైస పైసా కూడబెట్టిన గల్ల గురిగిని పలుగగొట్టి పైసలేరుకున్నట్టు వామును పలుగజీరి, కాగుల్ని పైకి తీశారు. రెండు పలిగిపోగా ముప్ఫయి రెండు కాగులు మిగిలినయి. ఆఖరునాడు పడుకుంటూ లేసుకుంటూ చేసిన కుండల్ని ఇంటికొకటి పంచింది ఎల్లవ్వ.

కాగులన్నింటినీ ఏరి వరుసగా బోర్లించాక లక్షల ఆస్తి తమకు దక్కినంత తృప్తి కలిగింది. ఒకటి రెండుసార్లు ప్రేమగా తడిమి చూసుకున్నడు లింగం. అప్పటికి జాతర దగ్గర పడింది. కార్య క్రమాలు జోరును అందుకున్నాయి. అన్నింటినీ జాతరకు ఇత్తే బాగుండునన్న ఆలోచన వచ్చింది

ఎల్లవ్వకు. పైగా పంతులంటే గురి. తండ్రి ఉన్నప్పటి మేనతు. ఇప్పుడు బంగ్ల కట్టిండుగని అప్పుడేముండె? మాతో ఉన్నోడేనాయె. ఈంత సాయం జెయ్యడా అనుకుంది.

"ఇగో మనం ఒక పని చెయ్యాలె. ముందుగల్ల రెండు కాగుల్ని పంతులుకు ఒకటి సర్పంచ్‌కు ఒకటి వట్టిగ పంపుదాం. తెల్లారినంక పోయి పంతులును కలువు. బతిలాడితే ముప్పయికి ముప్పయి కొంటడు," సలహా చెప్పింది ఎల్లవ్వ. అలాగే చేశాడు లింగం.

మరునాడు లెక్క మాట్లాడుకోవడానికి పంతులు ఇంటికి వెళ్లాడు లింగం. వచ్చిపోయె జనంతో ఇల్లంతా సందడిగా ఉంది. జాతరకు సంబంధించిన పనుల రూపకల్పన అక్కడే జరుగుతుంది.

లింగం కాళ్లు కడప వద్దనే ఆగిపోయాయి. అతడి చేతుల్లో తయారైన కాగు మాత్రం ఎవరూ వెళ్లనంత లోపలి ఇంట్లోకి వెళ్లి గర్వంగా నిలబడి లింగంనే చూస్తుంది. చిన్నగా నవ్వుకుని అక్కడే అరుగు మీద కూర్చున్నాడు లింగం.

పంతులుదీ తనదీ ఒక్క ఈడే. తను ఊళ్లోకి ఇల్లరికం వచ్చినప్పుడే పంతులు బతకడానికి వచ్చాడు. అప్పట్లో తన మామనే పంతుల్ని చేరదీశాడని ఇప్పటికీ పంతులే చెబుతుంటాడు. సెల్‌ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతూ అటువైపు వచ్చాడు పంతులు. లింగంను చూస్తూనే పలకరించి నవ్వాడు.

"ఏంరా లింగం... బాగున్నవా? ఇంతకుముందే యాది జేసుంటిని. మీ కుమ్మరోల్లంతా కల్సి దేవునికి ఒడి బియ్యం తేవాలెరా... తొమ్మిది సోలల బియ్యం కుడుక కనుము నూటపదార్లు అంతే. కొత్త దేవుడు ఏది మొక్కతే అది ఐతది," అన్నాడు. దూది నిమ్మపండులాంటి పొట్ట ఆయాసంతో ఎగపోస్తున్నాడు. దిగి వచ్చిన దేవుడిలా కనిపించాడు లింగంకు.

చేతులెత్తి దండం పెడుతూ, "అదెంత భాగ్యం పంతులూ? మీరు చెప్పినంక తేమా?" అంటూ కాగుల ముచ్చట ఏదైనా చెబుతాడేమోనని చూశాడు లింగం. పంతులు ఆ ముచ్చట ఎత్తకపోయేసరికి తనే తీశాడు.

"అరే... ఆ ముచ్చట నీకు మొన్ననే చెబుతామనుకుని మర్చిపోయిన. ఈ జాతర చెయ్యవట్టి ఆగమాగముంది. కాగులు కొంటే నాలుగైదు వెయిలు కావాలె. దాంట్ల నీళ్లు తెచ్చి నింపుడుకు ట్రాక్టర్ కిరాయి గావాలె. మొత్తం ఏడనిమిది వెయిల ఖర్చు. అయితమాయె పెడుదామనుకున్నాం. మొన్ననే నీ కొడుకు వచ్చి అక్కడ నీళ్ల పాకెట్లు అమ్ముకుంటనన్నడు. అమ్ముకున్నందుకు మాకే రెండు వెయిలు ఇస్తనన్నడు. ఇదే నయముందని కమిటీ మెంబర్లు ఒప్పుకున్నారు. సర్పంచ్ కూడా సరేనన్నడు..." ఎవరో పిలిస్తే వెళ్లిపోయాడు పంతులు.

లింగంకు కాల్లు చేతులు సల్లవడ్డయి. సల్ల చెమటలు పుట్టినయి. చలి జ్వరం వచ్చిన వాడిలా వణికిపోయాడు. ఎలా చేరుకున్నాడో కాని పతుకులాడినట్టుగా కొడుకు దగ్గరికి చేరుకున్నాడు. ఇంటినిండా నీల్ల పాకెట్లే! ఫ్రిజిలో పెట్టి చల్లబరుస్తున్నాడు. ఇద్దరు ముగ్గురు వ్యక్తులు పాకెట్లను ప్యాక్ చేస్తున్నారు. తండ్రిని చూసి మొహం చిట్లించాడు. కొడుకు దయగలవాడే. సైర మీద మెదిలినోడే. ఎందుకో ఆగమయిండు.

"కమిటీకి రెండు వెయిలిచ్చిన. పది వెయిల మాలు తెచ్చిన. వెయ్యి ఖర్చయినయి. కోడలు మీది పుస్తెలతాడు అమ్మిన. ఇప్పుడు నువ్వు అమ్ముమంటే అమ్ముత. వద్దంటే తీసుకుపోయి వాగుల పారేత్త," యాష్టగా అన్నాడు కొడుకు.

లింగంకు మొదటిసారిగా కొడుకు మీద కోపం వచ్చింది. అదీ కొద్దిసేపే! బతుకుదెరువు పాకులాటలో కొడుకెవరు తండ్రెవరు అనుకున్నాడు. పంతులు మీదా సర్పంచ్ మీదా కోపమొచ్చింది.

ఒక్కసారిగా నూరేళ్ల ముసలితనం పైబడినట్టయింది. బిత్తిరి చూపులు చూస్తూ సొలుక్కుంటూ సొలుక్కుంటూ ఇంటికి వచ్చి మంచంలో వాలిపోయాడు.

విషయం తెలుసుకుని కొడుకును ఆడిపోసుకుంది ఎల్లవ్వ. ఆమె గుండె దడ రెట్టింపయింది. తను కూడా మంచంలో ఒరిగిపోయింది. వదురుతనే ఉంది.

"వాన్నిగాదు, నీళ్లను ముల్లెగట్టి అమ్ముతున్న కంపినోన్ని అనాలె. దేవుని గుడి దగ్గర దానం చెయ్యాల్సిన నీల్లు అమ్ముకుంటార్రా? థూ...!" లింగం కూడా వదురుడు మొదలెట్టాడు. ఇద్దరికీ చలిజ్వరం అందుకుంది. ఈ విషయం తెలిసి మన్నుజారగొట్టినోళ్లు, కట్టెలు కొట్టినోల్లు పైసల కొరకు ఇంటికి వచ్చారు.

మరునాడె తన గుర్తుగా ఉంచుకొమ్మని ఇంటికొకటి పంచాడు లింగం. పంచిన ప్రతీ ఒక్కరికి 'కాగుబొత్త కథ'ను వివరంగా చెప్పి, మనవలకీ, మనవరాండ్లకీ చెప్పమన్నాడు.

*

కథ చెప్పడం ఆపి ఫ్రిజ్ వైపు దీనంగా చూసింది కాగుబొత్త. దాని కళ్లనిండా కన్నీళ్లు. లింగం రూపం మనసులో మెదిలింది. చివరగా మిగిలిన తానొక్కతైనా ఇంటిలోనే ఉంటాననుకుంది. లింగం బాగలేడని చూడడానికి వచ్చిన పట్నం మనిషికి కథంతా వినిపించి తనను అప్పగించాడు లింగం.

ఎందుకోగాని ఫ్రిజ్ గంభీరంగా వింటుంది. కిటికీలోంచి ఎండ చురుక్కుమంటుంది. అంతవరకూ ఇంట్ల అలికిడి లేదు. ఒక్కరొక్కరే నిద్ర లేస్తున్నారు. మొదట నిద్ర లేచిన పిల్లలు కాగుబొత్తను విచిత్రంగా చూస్తూ కేరింతలు కొడుతున్నారు.

"అదీ నా కథ. లాభాలు లేకపోయినా ఫరవాలేదు. కనీసం నా యజమానికి బుక్కెడు కూడును పెట్టలేకపోయాననే నా బాధంతా..." కాగుబొత్త చెబుతుంది.

గుర్రుమని శబ్దం చేస్తూ ఫ్రిజ్ మౌనంగా ఉండిపోయింది.

"ఏయ్... దీన్ని ఇక్కడెవరు పెట్టారే..." కేకతో రెండూ ఉలిక్కిపడ్డాయి.

ఇంటి యజమానిలాగున్నాడు. నిద్రకళ్లతో కాగును కోపంగా చూస్తూ అరిచాడు. కాగుకు భయమేసింది.

"నిన్న మామయ్య ఊరి నుండి తెచ్చాడు," లోపలి నుండి యజమానురాలి గొంతు.

"ఆ... తెచ్చాడులే... ఈ బంగారాన్ని... హాల్లో దిష్టిబొమ్మలా ఎందుకు...? స్టోర్‌రూంలో పడేయ్!" ఆర్డర్ ఇచ్చాడు. పిల్లలు గిచ్చుతూ, కొడుతూ, లోపలికి తొంగి చూస్తూ అల్లరి చేస్తున్నారు. క్షణాల మీద పనిమనుషులు ప్రత్యక్షమై లేవనెత్తారు. కాగు కన్నీళ్లు కారుస్తూ ఫ్రిజ్ వైపు దీనంగా చూసింది. ఫ్రిజ్ గుండె కరిగింది.

కాగును దుమ్ముపట్టిన స్టోర్‌రూంలోకి మారుస్తూ పనిమనుషులు లింగంను గుర్తు చేసుకుంటున్నారు. "పాపం... వాని రెక్కలు బొక్కలు ఇయ్యల్ల అయిమన్నయి. ఒక్కనాడురికేం లేకపాయె... కడుపు నిండ తిన్నది లేదు. కంటినిండ పన్నది లేదు... ఇయ్యాల్టితో పేరు మాసిపాయె..."

వింటున్న కాగుబొత్త గుండె జల్లుమంది. అంతే! దుఃఖం ఆగలేదు. పక్కున... పట్టన పగిలింది.

*ప్రస్థానం మాసపత్రిక*
*అక్టోబర్ 2002*

## నేపథ్యం

### కనుమరుగవుతున్న కులవృత్తుల వ్యథ

# కాగుబొత్త

***ఎప్పుడైతే ఊరికి తిరిగి వచ్చానో అప్పుడు మొదలయింది తండ్లాట. వెళ్లేటప్పుడు ఓ సుభిక్ష మైన నిండు పాలకుండలాంటి ఊరిలోంచి వెళ్లి అడుగుపెట్టినప్పుడు మాత్రం విధ్వంసమవుతున్న యుద్ధభూమిలాంటి ఊరిలోకి అడుగుపెట్టాను. పచ్చని పల్లెను చూసిన కళ్లతో విధ్వంసపు దృశ్యాన్ని చూశాక తట్టుకోలేక 2002లో రాసిన కథ ఇది.***

ఈ కథ ఇలా కాకపోయినా జరిగింది. ఆ జీవితాన్ని అక్షరక్రమం చేసే క్రమంలో ముందు వెనక కొంత జత చేయాల్సి వచ్చిందంతే. నాగరికతకు చాలారోజులు చాలా దూరంగా ఉంది మా ఊరు. ఆర్థిక సరళీకరణ మొదలైన చాలారోజుల వరకు దాని తాలూకు నీడ కూడా పడలేదు. 1990 తర్వాత కూడా ఊరిలో కులవృత్తులు, వాటి తాలూకు సంస్కృతి వర్థిల్లింది. 1970లో శ్రీకాకుళ ద్వారాల గుండా సిరిసిల్లకు వచ్చిన నక్సల్బరీ ఉద్యమం రైతుకూలీ పోరాటాలకు మళ్లీ ప్రాణం పోసింది. 1980 తర్వాత సిరిసిల్ల ప్రాంతంలోని చాలా గ్రామాలు భూస్వామ్య పాలన నుంచి విముక్తి పొందాయి. ఎంత తొందరగా దొరలు భూస్వాముల పాలన నుంచి విముక్తి పొందాయో అంత తొందరగా బహుళజాతి కంపెనీల కబంధహస్తాల్లోకి పోయాయి. కాని మా ఊరు వేరు. చాలారోజుల వరకు స్వేచ్ఛగా స్వచ్ఛందంగా ఉంది. విధ్వంసపు బీజాలు 2000 సంవత్సరం తర్వాతనే మొలకెత్తాయి. వాగు ఎండింది. చెరువు ఎండింది. పంట ఎండింది. రైతుల కడుపు మండింది. ఎంత ఆలస్యంగా విధ్వంసం విస్తరించిందో అంతకంటే వేగంగా అన్ని ఊర్లకంటే ముందుగా పతనం చెందింది.

వేరువేరు కారణాల వల్ల ఓ దశాబ్దకాలం నేను ఊరికి దూరంగా ఉన్నాను. అప్పటివరకు ఒకటి అర తప్ప కథలు రాయలేదు, చదవను కూడా చదవలేదు. చదివినా అవి ప్రేమకథలే. సాహిత్యంతో అంతగా సంబంధంలేదు. అకడమిక్ సంబంధం అంతే!

ఎప్పుడైతే ఊరికి తిరిగి వచ్చానో అప్పుడు మొదలయింది తండ్లాట. వెళ్లేటప్పుడు ఓ సుభిక్ష మైన నిండు పాలకుండలాంటి ఊరిలోంచి వెళ్లి అడుగుపెట్టినప్పుడు మాత్రం విధ్వంసమవుతున్న యుద్ధభూమిలాంటి ఊరిలోకి అడుగుపెట్టాను. పచ్చని పల్లెను చూసిన కళ్లతో విధ్వంసపు దృశ్యాన్ని చూశాక తట్టుకోలేక 2002లో రాసిన కథ ఇది.

మా ఇంటికి దగ్గర్లోనే కుమ్మరి ఇండ్లు. ఒక వాడకువాడ వాళ్లదే. కుమ్మరివాములు కాల్చి నప్పుడు పొగతో మా ఇండ్లు మొత్తం నిండిపోయేవి. కుండ గురిగి ఏది అవసరం పడినా ఇలా వెళ్లి అలా తెచ్చుకునేవాళ్లం. బాలయ్య నా క్లాస్‌మేట్. నాతోనే చదువుకునేవాడు. నేను కరీంనగర్‌లో ఉన్నప్పుడు అప్పుడప్పుడూ కలిసేవాడు. 10వ తరగతి పూర్తి కాగానే చదువు మాన్పించి కులవృత్తి నేర్పించాలని చూశాడు వాళ్ల నాన్న. బాలయ్యకు పని వంటపట్టలేదు. ఒకటి రెండుసార్లు మా బాపు కలుగజేసుకుని వాళ్ల నాన్నతో, 'ఒరే తమ్మీ... పోరడు హుషారున్నడురా. ఏదన్న పని దొరుకుతది. మంచిగ సదివిపించు,' అంటే వాళ్ల నాన్న, 'అన్నా... ఏ పనెందుకు... ఏ కొలువెందుకే కులవృత్తికి మించిలేదు గువ్వలచెన్నా... పది కుండలు ఆనితే నెలరోజుల గాసం,' అన్నాడు. బాలయ్యకు కులవృత్తి అబ్బలేదు కాని బతుకుదెరువు కోసం ఏయే పనులు చేయవచ్చో తెలిసి వచ్చింది. వాళ్ల నాయిన మాత్రం మంచి పనోడు. మా ఊరి దొరలు పటేండ్లు మెచ్చిన పనోడు. కుండను అచ్చం బొంగరంలా చేసేవాడు. లొట్లు చేస్తే సరిగ్గా కొలతకు సరిపోయేవి. అతడు ఏం చదువుకోకపోయినా కండ్లతోనే వ్యాసార్థము చుట్టుకొలతలను లెక్కగట్టి గూనలు, ఎసులలు, పటుకలు, కాగులు తయారుచేసేవాడు. కొంతలో కొంత ఉన్నతంగా బతుకుతున్నవాళ్లే. ఒకనాడు సిరిసిల్లలో కనిపించాడు. 'బాపూ బాగున్నవా,' అని అడిగితే, ''ఏం బాగోరా... సావు రాక పడుసుకుంది,' అన్నాడు. హాయిగా ఉన్నంతలో సంతోషంగా బతికే మనిషి ఇలా అంటాడేందీ అనుకున్నాను. ఒకనాడు బాలయ్య కనిపించాడు. అన్నా తమ్మీ అనుకునేవాళ్లం. ఆర్కెస్ట్రా నేర్చుకుంటున్నానన్నాడు. 'అదేందిరా... కుండలు గూనలు చేస్తలెవ్వా,' అంటే, 'అవి ఎన్నడో కాకి ఎత్తుకపోయింది,' అన్నాడు. వీడు ఇలాగే అంటాడులే అని ఊరుకున్నాను. ఊరిలోకి వచ్చాక అసలు కథ అర్థమయింది. సారె మూలకు పడింది. బాలయ్య బతుకుదెరువు కొరకు తిరుగు తున్నాడు. తండ్రి కొడుకులు మాట్లాడుకోవడం లేదు.

ఒకనాడు పొద్దున లేస్తూనే మా బాపు, 'ఇయ్యల్ల సంఘంల కుమ్మరోల్ల పంచాది,' అన్నాడు. ఏం జరిగిందని అడిగితే, 'జాతరకు తండ్రి కాగులు ఇస్తనన్నడు. కొడుకేమో నీళ్లు అమ్ముతనన్నడు. వాని తండ్లాట వానిది. వీని తండ్లాట వీనిది. వాగు ఒడ్డున ఉన్న గుడి దగ్గర నీళ్లు అమ్మే కాలమస్తదని నేను అనుకోలేదు,' అన్నాడు. ఈ సంఘటనలన్నీ అల్లుకుంటే పుట్టిన కథనే కాగుబొత్త. రొటీన్‌గా కాకుండా ఈ కథలో ఓ కొత్త శిల్పం ప్రవేశపెట్టాలనుకున్నాను. అందుకే కాగు తన కథను చెప్పుకుంటే ఫ్రిజ్ కూడా తన కథను చెప్పుకున్నట్టు కథను రాశాను. అంటే ఒకటి కొత్త తరానికి మరొకటి పాత తరానికి ప్రతీకలు. ఇక్కడ తండ్రి తరం కొడుకు తరం. రెండు తరాల మార్పులను, సంధికాలంలో వచ్చిన సంఘర్షణను చూపగలిగాను.

నేను కథ రాసేనాటికి, అది అచ్చయిన నాటికి తండ్రి బతికే ఉన్నాడు. నేను మాత్రం కాగు పగిలినట్టు చెప్పి తండ్రి మరణించాడని చెప్పకనే చెప్పాను. తర్వాత నాలుగేండ్లకు తండ్రి మరణం అలాగే జరిగింది. ఒకనాడు కుమ్మరి ఎల్లవ్వ భయం భయంగా మా ఇంటికి వచ్చి మా అమ్మతో, 'ఏమయితదో అక్కా... ఎన్నడూ లేనిది కాగుబొత్త వట్టిగనే ఇచ్చుకపోయింది నిండు ఇంట్ల,' అన్నది. అప్పటికప్పుడు అమ్మ ఏదో ధైర్యం చెప్పి పంపినా వారం తిరక్కముందే ఆ ఇంట్లో శవం లేచింది. అప్పుడనిపించింది నాకు, 'తనకు తెలియకుండానే రచయిత ఒక కాలజ్ఞాని,' అని.

*18 జనవరి 2014*

*'కాగుబొత్త' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

24

# హింసపాదు

## బమ్మిడి జగదీశ్వరరావు



*బమ్మిడి జగదీశ్వరరావు 1969 జనవరి 7న శ్రీకాకుళం జిల్లాలో జన్మించారు. మొదటి కథ అసలైన దైవభక్తి 1985లో బాలరంజనిలో అచ్చుయింది. మూడు కథాసంపుటాలు వెలువరించారు. ఏడు పిల్లల కథల పుస్తకాలు ప్రచురించారు. ఇవికాక వ్యాసాలు, కవితలు కూడా రాశారు. ఫ్రీలాన్సర్‌గా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు.*

*Ph.: 94906 96911*

*bajara.bammidi@gmail.com*

ఒడుపుగా 'ఫట్' మని ఉలి మీద తగిలిన సుత్తి దెబ్బకు కపాలం పైకప్పు సగభాగం తెరచుకుంది..

...చేస్తున్న పని కొనసాగించబోతూ అనుమతి కోసం చూశాడు అటెండరు. వయసు మళ్లిన తెల్లదుస్తుల పెద్దాయన చెయ్యెత్తి కన్నార్పి కాస్తంత ఆగమన్నట్టు చేసిన సంజ్ఞని సంకేతాలుగా అందుకున్నాడు. అలాగే ఆ గది బయటకు చూసిన చూపులోని భావాన్ని అందుకొని అటెండరు బయటకు నడిచాడు.

కొద్దిసేపటికి అటెండరు మరో ఇద్దరు హెల్పర్లతో ఇంకో ఆయాతో కలిసి మరో స్ట్రెచర్ని తోసుకుంటూ వచ్చాడు. బాల్స్‌పోయి వీల్స్ రోలవకపోవటంతో మొండి కేస్తున్నట్లు వికృతమైన శబ్దం ప్రతిధ్వనిస్తోంది. ఆ స్ట్రెచర్ మీద తెల్లని వస్త్రం కింద ఉన్న నడివయసామె ఆ గదిలోకి రానన్నట్టుగా గొంతెత్తి ఏడుస్తున్నట్టుగా ఉంది. బలవంతంగా తీసుకొస్తున్నట్టుగా ఆమెను బలంగా అమాంతం క్లాత్‌తో సహా ఎత్తి టేబుల్ మీద దించారు.

బట్టల్ని తొలగించాక ఏ అచ్ఛాదనాలేని ఆ స్త్రీ కాస్తంత ముడుచుకుపోయి ఉంది. సిగ్గుతో కాదు, ముందే ఆమె ఒళ్లు చచ్చిపోయింది. శరీరం బిగదీసుకుపోయి ఉంది.

అటెండరు లోపలి గదిలోకి పోయి మళ్లీ లిక్కరు సీసానెత్తి గొంతు తడుపుకున్నాడు. హెల్పర్లు గుటకలు వేస్తూ నిల్చున్నారు. ఒకటికి రెండు దఫాలు మిగిల్చింది తాగి, చెక్ చేసుకు మరీ ఇచ్చాడు. వాళ్లంతా తాగడం తెల్లచొక్కా గమనించినా అలవాటుగా పట్టించుకోలేదు.

ఆయమ్మ ఇవేమీ పట్టించుకోకుండా అవసరమైన పనిముట్లని శుభ్రపరచి ట్రేలో సర్ది బయటకు వెళ్లిపోయింది.

అప్పుడే ప్రవేశించిన జూనియర్ డాక్టర్లు ముగ్గురూ ఆలస్యమయినందుకేమో సారీ చెపుతూనే, తమ ఫ్రెండు చూస్తానని వచ్చాడని అలౌవ్ చేయమని రిక్వెస్టు చేశారు. వెనకాలే వచ్చిన పీజీ అసిస్టెంటు రికమండేషనుతో ఆ పెద్దాయన, ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ ఆమోదంగా తలాడించాడు. జూనియర్ డాక్టర్లలో ఒకామె వెళ్లి స్నేహితుణ్ణి లోపలకు తీసుకువచ్చింది. పరిచయాలూ, నమస్కారాల మధ్య పని ప్రారంభమయింది.

కొత్త కుర్రాడు ముక్కు మూసుకోబోతే 'స్పిరిట్' వినబడీ వినబడనట్లు అని, చూడమన్నట్టుగ చూసింది ఆ లేత డాక్టరు.

'మొదట ఎక్స్‌టర్నల్స్ చూస్తామన్నమాట...' పీజీ అసిస్టెంటు చెప్పుకుపోతున్నాడు. 'కట్స్, ఇంజ్యూరీస్ ఏమైనా ఉంటే...' చెపుతూ ఉంటే ఆ స్త్రీ దేహమంతా తప్పి... తరచి మరీ వెతికారు. అలా వెతుకుతుంటే ఏ అర్థంలోనో ఎందుకో మరి 'డిపార్టుమెంటుది' అన్నాడు ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్. పెద్దగా వెతకనక్కర్లేదు అన్నట్టు అశ్రద్ధగా ఉంది అతని మాట.

అదంతా రిపోర్టుకి సంబంధించింది... మీ ఇష్టం అన్నట్టుగా పీజీ అసిస్టెంటు తలాడిస్తూనే అబ్జర్వర్లకు విపులీకరిస్తున్నాడు.

హెల్పర్ ఎప్పుడూ ఉండే సోదేనన్నట్లుగా అదేమీ పట్టించుకోకుండా పాన్ నములుతూ రేజరు కత్తితో తల దగ్గరకొచ్చి కూర్చున్నాడు. దాదాపుగా కాలిపోయిన జుత్తు మాడి అట్టగట్టుకుపోయి ఉంది. కపాలానికి అంటుకుపోయి ఉంది. గొరుగుతూ ఉంటే మాడిన జుత్తు ఎండి పెలుసులు రాలింది. చర్మం కాస్తంత కాలి కమిలిందేమో పొరలు పొరలుగా ఊడొచ్చింది.

గుండు గీస్తున్నందుకు ఆమె సిగ్గుపడలేదు. నగ్నంగా ఉన్నందుకూ సిగ్గుపడలేదు. కాలిన తొడలూ పురజాలూ గుండెలూ గాయాల గుడ్డను కప్పుకొని ఉంది. కాలిన అరచేతులు రహస్యాన్ని దాచుకున్నట్టు పిడికిళ్లు బిగించి ఉన్నాయి. ఆమె ముఖం కడిగిన ముత్యంలా ఉంది.

'సిగ్గుతో అలా తల దించుకుంటే కడిగిన ముత్యాన్ని ఎలా చూసేది?' వరసైన ఆడవాళ్ల నవ్వులు.

సిగ్గుతోనేనా తల దించుకుందీ?

'మొగుడు దగ్గర సిగ్గుండొచ్చునుగాని భయముండకూడదు. ఏమిటే... పోలీసోడంటావా? ఏ మొగుడైనా పెళ్లానికి పోలీసోడే...' అమ్మమ్మ మనసు తెలుసుకుని చెప్పిన ధైర్యం... నిలుపుకోవడానికే నిరంతరమూ...

చూద్దామని మార్చురీ గదిలోకొచ్చిన కుర్రాడు చూడలేకపోతున్నాడు. కళ్లు మూసుకోవడానికి కాస్తంత సిగ్గుపడి చూపునే మరల్చుకున్నాడు. గోడ మీది పచ్చటి మైదానాన్ని చూస్తూ ఉన్నాడు.

ఆకుపచ్చ మైదానం... చిటికెన వేలంత గరికలతో ఎడారిలా విస్తరించి ఎకరాలకొద్దీ పాకి ఉంది. దూరంగా ఎక్కడో తప్ప ఆ మైదానం మధ్యలో చెట్లుగానీ భవంతులుగానీ లేవు. అలాగే నిలబడిపోయేదే... వందలకొద్దీ పోలీసుల కవాతు... బూట్ల చప్పుడు లయబద్ధంగా... పచ్చటి మైదానం తన రంగు కోల్పోతోందా... లేత గరికలు కొనలు విరిగిపోతూ అస్తిత్వం కోల్పోతూ... మైదానం మాసిన రంగు తేలుతూ...

అతనితో ఏడడుగులు దాటి అమ్మానాన్ననొదిలి ఊరునొదిలి కొత్త కాపురానికి కొత్తగా వేస్తున్న అడుగులు. దారి తెలీనట్టు తోవ తప్పిపోయినట్టు అతని అడుగులో అడుగు వేస్తూ... కొత్త ప్రపంచంలోకి...

'ధన్'మని తుపాకీ గుండెల్లోనే పేలింది... గుండె నేల పడిపోతుందేమోనన్నట్టు రెండు చేతులూ గుండె మీద వేసుకుంది... పొదివి పట్టుకొని తుప్పుతుప్పున నోటితో ఉమ్మునొదిలి ఆరిపోయిన గుండెను తడపబోయింది. అతను పగలబడి నవ్వాడు. రైఫిల్ షూటింగవుతోం దన్నాడు. అదిగో ఆ పెద్ద బిల్డింగే పోలీస్ కాలేజి. ఇక్కడ నుండి కనుచూపు మేర కనిపిస్తున్నదంతా ఎన్నో బెటాలియన్‌దో చెపుతున్నాడు. బెటాలియన్ కాంపౌండు సరిహద్దునానుకొని ఆవల ఉన్న వన్నీ పోలీసు క్వార్టర్లని చెపుతున్నాడు. ఇంకా అవతల తాను పనిచేసే స్టేషనరీ క్వార్టరు సదుపాయ ముందనీ ఏవేవో చెపుతున్నాడు. మొత్తం పోలీసు ఏరియా అని గర్వంగా చూపిస్తున్నాడు.

ఆమె దేహంలో కాలిన ఏరియాను చూపిస్తున్నాడు పీజీ అసిస్టెంటు. హెల్పర్ తన పని కానిచ్చి లేచి వెళ్లాడు. మరో హెల్పర్‌తో పాన్ నములుతూ ఏం చెప్పాడో అటెండరు... వాడి కర్థమయి నట్టే ఉంది. తలూపుకుంటూ వెళ్లాడు. అటెండరు ఉలి, సుత్తిని ఇందాకటి తల దగ్గర నుండి తీసుకొచ్చి ఈ తల దగ్గర పెట్టాడు.

'... ఇంకో నాలుగొచ్చినాయి...' ఇందాక వెళ్లిన హెల్పరు వెనక్కి వచ్చి లోపలికి ఒక కేక వేసి వెళ్లాడు.

'సీజన్‌లా ఉంది...చేతులు నొప్పెడుతున్నాయి...' అటెండరు మాటకు జూనియర్ డాక్టర్లు నవ్వుకున్నారు. అక్కడకు చేరిన వాళ్ల మిత్రుడు తప్ప...

అందరూ నవ్వుతున్నారు, తను తప్ప... వాళ్లంతో వయసులో ఉన్నవాళ్లు. కండలు తిరిగి బలిష్టంగా ఉన్నారు. గిన్నికొట్టిన కురచ జుత్తుతో అందరూ ఒకేలా ఉన్నారు. అమ్మమ్మ చెప్పినట్టు 'ఇతనాల పోతుల్లా' ఉన్నారు. బూతుజోకుల్తో అతన్ని ఆహ్లాదపరుస్తున్నారు. 'ఏడాది తిరగనీ... నీ చేత ఏడు చెరువుల నీళ్లు తాగించదూ...' ఎవరో ఆడవాళ్లే వకల్తా ఇస్తున్నారు. 'మీ అందరి విషయం లో అది నిజం' అంగీకరిస్తున్నారు మగవాళ్లు.

'వాల్ట్ ఓపెన్ చెయ్యి...'

ఉలి తీసుకొని నుదురు పై భాగానికి ఆనించి ఒడుపుగా కొట్టిన సుత్తిదెబ్బకు కపాలంపై ముందరి భాగం పెట్టెలా తెరుచుకుంది.

తలపై తగిలిన దెబ్బకు నొప్పి పుట్టలేదు. అలాంటి దెబ్బలు కనబడనివి ఆ తల చాలా తట్టుకుంది. ఆమె అందుకేనేమో అలవాటైన బాధలా కదల్లేదు, మెదల్లేదు, కిక్కురుమనలేదు.

రాకూడని చోటుకు వచ్చినట్టు తల పట్టుకున్నాడు 'మిత్రుడు.'

...రాకూడని చోటుకు వచ్చానా? వెనక్కి వెళ్లిపోగలనా? వెళ్లినా మునుపటిలా ఉండగలనా? ఆమె తల పట్టుకు కూర్చుంది. కళ్లు చీకట్లు కమ్ముతున్నాయి. లోకం కూడా చీకటి మాటునే... ఒత్తిగిల్లుతూ.

ఆ సాయంత్రం గోరింటాకు కోసమని క్వార్టర్సు చివరికంటా దాటి ముళ్లకంపలూ తుప్పలూ దాటి పక్కింటిపిల్లతో వెళ్లింది. శిథిలమైన భవనం. కాదు... పాత భవంతి సగం కూల్చి వదిలేసి నట్టు... ఒంటిగా... అటు చూస్తూ ఇటు గోరింటాకు ఏరుతోంది.

ఆకు తెంపి... రక్తం... అందా పిల్ల. ఎర్రగా బాగా పండుతుంది అన్చెప్పి చేతుల కంటిన ఎర్రదనాన్ని చూపించింది. గోరింటాకులు తెంచుతూ ఉంటే, 'అమ్మా... వద్దు... వద్దూ,' ఆకులు

అరచినట్టయి ఉలిక్కిపడింది. గుండెల మీద ఊసుకుంది. ఎడమకాలి ధూళి తీసి బొట్టు పెట్టుకుంది.

తొందరగా ఏరుకొని పోదామందా పిల్ల. ఆ కళ్లు చూస్తే ఏదో ఉన్నట్టే... సాక్ష్యంగా మూలుగులు వినిపిస్తున్నాయి. ఆ శిథిల భవనం నుంచే. ఏదో అలికిడి. తుప్పల మాటున దాక్కున్నారు. ఖాకీ దుస్తులు ధరించినవాళ్లు నడిచి వెళ్లిపోతున్నారు, దూరంగా ఆపిన జీపునెక్కి. ఆమె బెదిరిపోయింది. పిల్లని ఆసరాగా పట్టుకుంది. చూద్దామా? ఆ పిల్ల అడిగి, అడుగులు వేసింది. అనుమతి లేకుండానే అచేతనంగా ఆమె నడిచింది...

నిలువెల్లా గాయాలతో నెత్తురోడుతూ, 'దాహం... దాహం...' మాటరాని గొంతు గుసగుసమంటోంది. ఎవరో నరాల్ని పుటుక్కున తెంపినట్టయింది.

పీజీ అసిస్టెంటు నరాల్ని చూపిస్తూ అవి మెదడుతో కలిగి ఉన్న సంబంధాన్ని చూపిస్తున్నాడు. అంత సమయం లేనట్టు ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ వాటిని కట్ చేస్తూ...

తెంపుకుందామన్నా తెగని దృశ్యం... దాహంతో ఒంటినిండా గాయాలతో అర్రులు చాస్తున్న మనిషి. అవే అరుపులు... క్రమక్రమంగా తగ్గి మూలుగులు... ఆ ఒంటరి రాత్రుళ్లు... నిశ్శబ్దం... తలని బద్దలుచేస్తోంది. వినవచ్చే శబ్దాలూ బద్దలు చేస్తున్నాయి. ఏదో ఆర్తనాదం...

...విని నవ్వాడు. పోలీసుజ్జోగంలో చేరకముందు నేను నీకన్నా పిరికిసన్నాసిని... ఇప్పుడు పోలీసుని. ట్రైనింగూ- ఎక్సుపీరియన్స్... ఏవేవో చెప్పాడు. కొట్టక తిట్టకపోతే నేరం ఒప్పుకోరు... ఒప్పించాలంటే తప్పదు... అసలు కొట్టడం తిట్టడం పనిలో భాగం... వృత్తిలో భాగం అంటూ ఉద్యోగంలో ఇచ్చే తర్ఫీదుని గురించి చెప్పాడు. తాత్పర్యాన్ని చెప్పేడు. మందు వేసుకున్నాడు. భయంతో వణుకుతుంటే ఆమెకీ బలవంతంగా మందు పోసి తాగించాడు. దొరసానులు మందు లేనిదే ఉండలేరన్నాడు. మందు కొట్టిన ఆడది మగాడ్ని భలే సుఖపెడుతుందని మెచ్చుకున్నాడు... క్రీడకు దిగేడు. దిగమన్నాడు. 'బెదురుగొడ్డు' అని ముచ్చటగా తిట్టాడు. 'నా లంజికూతురా రాయే... నీయమ్మా'... ఆబగా వాటేసుకున్నాడు. తనూ పెరుగుతున్న భయంతోనూ... నీరసిస్తున్న వాంఛతోనూ అతన్ని కౌగలించుకుంది. గుండెల్ని తడిమి పిండి అలాగే చేతుల్ని కిందికి పోనిస్తూ, 'ఎలాంటి లంజికొడుకు పుడతాడో?' ఇష్టంగానే దగ్గరికి లాక్కున్నాడు. అయినా వాడికి చిన్నప్పటి నుంచి పోలీసు ట్రైనింగిచ్చేస్తానన్నాడు.

'బేవార్సు లంజికొడుకు ఎటుపోయాడో?' నిశ్శబ్దంగా ఉన్న మార్చురీ గదినిండా ఆ మాట వినిపించింది. ఉలి, సుత్తి అక్కడే పడేసి తలుపు తీసుకు అవతలకు వెళ్లాడు.

'వృత్తిపరమైన భాష,' పీజీ అసిస్టెంటు జూనియర్లతో ఆ మాటకు ఎంజాయి చేస్తూ నవ్వుతున్నాడు.

'ఎక్కడ దెం... కుంటున్నాడో...?!' ఉమ్మేసిన పాన్‌తో నోరు ఖాళీ అయి నాలుకతో పెదవులు తడుపుకుంటూ లోపలకు వచ్చాడు. పీజీ అసిస్టెంటు, 'నే తెప్పిస్తాను గదా పని చూడు,' అన్నాడు. ఆ మాటలో ఆదేశం కన్నా అభ్యర్థనే ఉంది.

కపాలం గుండ్రని పెట్టెలా పై భాగం ముందుకు తెరుచుకొని ఉంది. ఎక్స్‌పర్ట్ అందులో చేయి పెట్టి మెదడుతో కలసి ఉన్న నరాలను కట్ చేశాడు. ఐ బాల్స్ మాత్రం డైరెక్టుగా మెదడుకు కనెక్టయి ఉన్నాయి. అందుకని వాటిని విడదీసి మెదడుని ఒక ట్రేలోనూ కళ్లని మరో దాంట్లోనూ వేశాడు. కళ్లు మెదడుని చూస్తున్నాయి!

'నీకు మెదడు లేదు...'

'నా మెదడు నా మెదడు,' అని కళ్లు ఏడ్చాయి. కళ్లనీళ్లు ఎప్పుడో ఏడ్చి ఏడ్చి ఇంకిపోయాయి. చేజారిన కనుగుడ్లను అందుకోలేక రెప్పలు అలాగే ఉండి ఖాళీచేసిన ఇళ్లలా డొప్పలు వెలితిగా ఉన్నాయి.

"నీకు తలకాయుంది, అందులో మెదడు లేదు. నీకు కళ్లున్నాయి అందులో చూపులేదు...' అతడు తిడుతున్నాడు. ఈమె కొడుకుని పట్టుకొని వదలడం లేదు... 'నేను తీసుకెళ్తానన్నది పోలీసు స్టేషన్‌కి... అదేమీ యమలోకం కాదు, అది యమలోకమయితే నేను యమభటుణ్ణి... నాతో కాపురమెలగ చేశావ్? పిల్లాడ్ని మరెవరితో కన్నావే లక్ష్మీ...' బలవంతంగా పిల్లాడ్ని తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాడు. పంతం పట్టాడు. 'ఈ లాఠీ ఆ తూటాయే మనకు తిండి పెడుతోందని మర్చిపోకు,' అన్నాడు. మొత్తానికి పిల్లాణ్ణి తీసుకువెళ్లాడు. ఆ తర్వాత పిల్లాడే స్టేషనుకు పోయి వచ్చేవాడు. కాలం కొడుకై నడిచొచ్చింది.

క్యారేజీ పంపాలన్నా... లీవులెటరు ఇచ్చిరావాలన్నా... ఇంటికి రాలేదేమిటి డ్యూటీ సమాచారం తెలుసుకోవాలన్నా... వెళ్లి రావడం ఒక అవసరమయ్యింది. అనివార్యమయ్యింది. పిల్లాడి చలాకితనానికి కొలీగ్స్ అభినందనలూ అందేవి. వాళ్లూ చిన్నాచితకా పనులు చెప్పేవారు. అలా 'సెభాష్' అనిపించుకున్నాడు గనుకనే అందరి తలలో నాలుకయ్యేడు. ఇప్పుడు డిగ్రీ పూర్తయ్యింది... రేపు ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే రికమండ్ చేసి సహాయం చేస్తారు. పైగా క్వార్టర్సుకు దగ్గరగానే స్టేషనున్నూ...

ఇంట్లో ఉంటే... నీలాగే ఆలోచిస్తే... మెదడు లేకుండా అయిపోతాడు. అలా ఉంటే చెల్లుబాటయే కాలం సరి. మాయ తెలియాలి. మర్మం తెలియాలి. లోకం తెలియాలి. అసలు పోలీస్‌స్టేషన్లోనే లోకం నాడి తెలుస్తుంది... వేడి తెలుస్తుంది... ఒక్కసారయినా పోలీస్టేషనుకు పోకపోతే మనిషి జన్మ పరిపూర్ణం కాదు... అయినా పిల్లల్ని అబద్ధాల్తో అందంగా పెంచకూడదు. ఋతువు ఋతువుకీ తట్టుకోలేరు. వాస్తవంగా పెంచాలి. కఠోరసత్యాలు తెలిసిపోతే కలవరం లేకుండా బతికిపోతారు. లేకపోతే బతకరు... బతకనివ్వరు నీకులాగే...

మెదడు వాసననీ దాని లోలోపలి ప్రకంపనల్నీ గమనించకుండా భద్రపరిచారు. కపాలపు పైకప్పు మూతవేసి స్టిచ్చెస్ వేసి తెల్లని కాటన్‌తో తలకు కుట్టువేశారు. కళ్లనీ తీసి భద్రపరిచారు. అందులోని దృశ్యాలను గమనించకుండా, చూపుని పట్టించుకోకుండా, కళ్ల డొల్లల్లో దూదిపింజెలు రెండు ఉండలు చుట్టిపెట్టారు. రెప్పల్ని మూశారు. ప్రశాంతంగా కళ్లు మూసినట్లుందామె!

అంతా చీకటి...

ఆ చీకటిరాత్రి దుఃఖప్రవాహం. క్వార్టర్స్‌ని ఒరుసుకుంటూ. మరో ఆరునెల్లో రిటైరయి... మరో సంవత్సరంలో కూతురు పెళ్లికని నిశ్చయ తాంబూలాలు పుచ్చుకున్న హెడ్ కానిస్టేబుల్ గుండెలవిసేలా పొర్లిపొర్లి ఏడుస్తున్నాడు. కూతురు పెళ్లిపల్లకీ కాదు, పాడెక్కింది... మేళతాళాలు లేవని గుండెని డప్పుని చేసి బద్దలు కొట్టుకుంటున్నాడు.

బెటాలియన్ కుర్రపోలీసుల పంజాకి దొరికిపోయింది. మొత్తం అయిదారుగురు చీల్చి చెండాడారు. వంతులేసుకున్నారు. మానం తప్ప ప్రాణం ఎవరికీ చిక్కలేదు. రాత్రి చేసుకున్న పార్టీలోకి ఫలహారమయింది. తెల్లరేసరికి శవమయింది. శవం పక్కనే రోదిస్తున్న ముసలాడు.

ముసలాయన నోట్లో గుడ్డలు కుక్కి కాళ్లూ చేతులు విరిచికట్టి తెచ్చి ఖాళీక్వార్టర్స్‌లో పడేసి, ఆ అమ్మాయిని పొద్దు పొడవకముదే దహనం చేసినందుకు- ఆ... బెటాలియన్ పెద్దలూ- శాంతిభద్రతల్ని సమయోచితంగా కాపాడినందుకు- తండ్రిగా అలాంటి బిడ్డను కన్నందుకు- అతన్ని ఎంతగానో అభినందించారు.

'తప్పు చేసినవాళ్లని కాపాడ్డం ఇంకా పెద్ద తప్పు కాదా...?'

'నీ గొంతు పిసికెయ్యాలి...'

గొంతు పిసికేసిన జాడల కోసం కంఠం చుట్టూ చూశారు. ఎక్కడా ఏమీలేవు.

'హోమిసైడ్ కాదు, సూసైడ్.' పరీక్షలకు ముందే ఎక్స్‌పర్ట్ చూసి చెప్పేస్తున్నాడు.

'బెటాలియన్ పోలీసులూ, సివిల్ పోలీసులూ తన్నుకుంటే ఏమన్నా ఉందా? ప్రపంచ యుద్ధమైపోదూ? కలియుగం అంతమైపోదూ? పోలీసులంతా ఒక్కటే! ప్రపంచ పోలీసులారా ఏకం కండు...' పిలుపునిస్తున్నాడు. పోయినదాన్తో శాంతిభద్రతలు తగలబడిపోతే ఎలాగని నిలదీస్తున్నాడు. 'సమయానికి ఓ మంటతో మరో మంటను ఆర్పగలిగినందుకు మా ఆఫీసర్లంతా ఎంత మెచ్చుకున్నారో తెలుసా? అలాంటి కొడుకును కన్నందుకు గర్వపడు... ఆ ముసలాయన కూడా అమ్మాయి పరువు పోకుండా కాపాడగలిగినందుకు కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఎమ్మెల్యేగారూ, మంత్రిగారూ తమ వరకూ రానందుకు చాలా సంతోషించారు. ప్రపంచంలో దారి తప్పినదానిని నువ్వొకర్తివే... లేకపోతే ఈ ఆనందానికి నీ ఊపిరి సలిపేదా...?!'

టీత్ లేని నునుపు దేరిన హక్సాతో కంఠం దిగువ కోత మొదలయింది. చర్మం తెగుతున్నా రక్తం చిమ్మడం లేదు. అక్కడక్కడా గడ్డ కట్టుకుపోయిన రక్తపుబిళ్లలు... ఛాతీ భాగాన ఎక్కువ ఎడమ భాగానికి కాసింత కుడి భాగానికీ కోసి లంగ్స్... తిత్తుల్ని తీసేస్తూ...

...తీస్తే హృదయం మెత్తగా లేదు!? కాయగాసినట్టు ఉన్నది! కాలిపోవడం చేత అలా అయ్యిందా? ఆమె జీవితానుభవాల సెగకి అలా అయ్యిందా? కోసి తీసిన హృదయం జాగ్రత్త పరుస్తూ...

కాయగాసిన హృదయం లోలోపలి చిన్న కణత... పెరిగి పెరిగి... మొత్తం కాయగా... సున్నితత్వం చెరిగిపోతూ... బండగా రాటుదేల్తూ...

...'హాఁయ్,' అంటూ నాలుగేళ్ల పాపని గడ్డం పట్టి నోటుబుగ్గల్ని ముచ్చటగా లాగబోతే-బొటనవేలికి మధ్యవేలికీ మధ్య ఊడొచ్చిన రెండు పక్కల రెండు పళ్లు... నిజం... పసిదాని సున్నితత్వమేనా? వీడు నా కొడుకేనా? వీడే లాగాడా?

'వాడు నా కొడుకే,' అంటూ అతను యెంత పగలబడి నవ్వాడని...? ఒళ్లు బలిష్టంగా పెంచుకోవడానికి జిమ్ములూ సరదాకి కొనిపెట్టిన రమ్ములూ వయసుకు మించిన ఏపుని తెచ్చిపెట్టాయి. ఎక్సరసైజులని... చికెన్లూ మటన్లూ దాటి బీఫ్‌దాక... అదే పని... తినడం... ఎక్సరసైజులు చెయ్యడం... పాలూ, గుడ్లూ, చేపలూ, పౌష్టికాహారం... లేత చర్మం ఎంత బండబారిపోయిందీ... బండతనం కాదు, మృగత్వం... వేట కావాలి...

మందూ మటన్ కోసం ఎంత దూరమైనా. తండ్రీ ఉండక్కర్లేదు, అతని కొలీగ్స్‌తో... ఇంకా గ్రేహౌండ్స్ వాళ్లతో...

'తండ్రిలాగే నువ్వూ తాగబోతువవుతావా?'

తన స్నేహితుల ముందు హేళన చేసినందుకు, కల్చరు తెలీనందుకు, తండ్రినీ, తనని తిట్టి పోసినందుకు... ఎప్పుడూ మనశ్శాంతి లేకుండా చేసినందుకు చెంప పగలగొట్టాడు. కడుపున పుట్టినవాడితోనే కాయడం భరించలేను... నా వల్లకాదు... ఈ పాపపు కడుపునే కన్నాను... ఈ కడుపును చీల్చేయండి...

అబ్డామిన్ చల్లగా తెగిపోతూ చర్మపు తలుపులు తెరుచుకుంటోంది. మరోవైపు వెనుక నుండి ఛాతీవేపు నుండి కుట్టు వేసుకువస్తూ...

ఈ కడుపున కన్నానురా కొడుకా... నిన్ను కన్నందుకు ఈ కడుపుని చీల్చాల్సిందే... కోయాల్సిందే...

గుండెకోత కాదు కడుపుకోత కాదు, ఏమి వినిపించట్లేదు. జూనియర్ డాక్టర్లు తమ భవిష్యత్తుని గురిచి మాట్లాడుతున్నారు. విలేజెస్‌లో పనిచేయడం కష్టమని వాపోతున్నారు. అమెరికా పోవడం బిన్‌లాడెన్ వల్ల తగ్గిందని ఏవేవో మాట్లాడుకుంటున్నారు.

ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్ పేగులు తడిమి చూస్తున్నాడు.

తల్లిపేగు కదిలిందా?

ఆ తల్లి... పేగుల్లో ఎక్కడా ఏ క్లాట్సూ లేవు. అంతా సాఫీగా ఉంది. సజావుగా ఉంది. ఆరోగ్యంగానేఉంది?

పేగుల్లో చుట్టుకుపోయిన అనురాగం, మమకారం, ఆత్మీయతా ఏదీ అవుపడలేదా అన్నట్లు పేగులు తల్లడిల్లిపోయి ఎటు తిప్పితే అటు సోలిపోతున్నాయి. నిర్జీవంగా జారిపోతున్నాయి.

కడుపులో కుడిభాగంలో లివర్... కాలేయం... జీర్ణకోశం కోసి తీసేస్తూ- ఆమె కిమ్మనలేదు. ఎందుకంటే ఆమెకు చాలాకాలం చాలా జీర్ణం కాలేదు. జీర్ణం చేసుకోవటం అలవాటు చేసుకో లేకపోయింది. జీవితానుభవానికి లొంగలేదు.

'మీవాడు గట్టి పిండమేనోయ్ బావా...' మెచ్చుకోలు.

...నీళ్లున్న బకెట్లో కరెంటు వైర్లు వేసినాక వాడు ఉచ్చపోస్తూ అరుస్తుంటే మీవాడ్ని చూడాలీ... వాడు ఉచ్చ ఆపలేదు... లాసిక్స్ టేబ్లెట్స్ మింగున్నాడు కదా... వాడు ఉచ్చ ఆపడూ మీవాడు నవ్వు ఆపడు... నవ్వీ నవ్వీ చచ్చామనుకో...''

'అన్నా బీరుసీసా ట్రీట్‌మెంట్లో మీవాడు పులి...' అభినందన.

...ఖాళీ బీరుసీసా మీద కూర్చోబెడితే దాని కొస ముడ్లో దిగితే వాడేం చెప్పలే. మీవాడు కక్కించాడులే. సీసామూతి పగలకొట్టి ముడ్డిలో దిగేలా కూర్చోబెట్టి మనోళ్లతోపాటు మీవోడూ తొడలెక్కి ఆగాడనుకున్నావా? భుజాలెక్కి కూచున్నాడు. తొక్కి పారేశాడు...

చెవులు బద్దలయిపోయాయి. మావాడ్ని సరదాకైనా తీసుకెళ్లొద్దని చెప్పాలనుకుంది. లేవడానికి కాళ్లూ చేతులూ రాలే. మాట్లాడడానికి నోరు రాలే.

'అయినా నువ్వు తక్కువోడివా?' నవ్వులు.

మీవాడు ఫిజికల్లీ అయితే నువ్వు మెంటల్లీ... బూతులు తిట్టి ముఖాన ఉమ్మేయడం... మూత్రం తాగించడం... మలం తినిపించడం, ఒకడిదొకడికి గుడిపించడం... రేజర్లేకుండా ఈకలు పీకి షేవింగూ... పిల్లలకు పాలివ్వకుండా... ఆడామగని ఎదురెదురుగా నిలబెట్టి బట్టలు ఊడదీయించడం...

నవ్వులే నవ్వులు...

మీవాడ్ని పర్మినెంటుగా తీసుకుంటున్నారట గదా... పార్టీనో?

ఆ హింసలన్నీ తను తలకెత్తుకొని అనుభవిస్తున్నదా? తీవ్రమైన ఒత్తిడికి కిడ్నీలు పగిలిపోగల వనుకున్నారో ఏమో- రెండు కిడ్నీలనూ తీసేశారు.

చర్మాన్ని దుస్తులను చేసి కుడుతూ-

'ఉద్యోగంలో ఏదన్నాగా... ఇంట్లో కొడుకుగా మిగలరా,' అనే భావాన్ని అభ్యర్థననీ ఆమెకు ఎలా చెప్పాలో తెలియలేదు. చాలాసార్లు అనుకున్నా ఒక్కసారీ చెప్పలేకపోయింది. చెప్పినా ఏదో చెప్పిందా?

కడుపున పుట్టిన బిడ్డే అయినా కట్టుకున్న మొగుడు కంటే భయంకరంగా ఉన్నాడు. తండ్రిని మించిన తనయుడు.

అందరూ అభినందిస్తున్నారు. గొప్ప పనివాడని. తనే పనికిరానిదై అందుకోలేకపోతోంది. ఆశీర్వదించలేకపోతోంది.

... దీన్ని ఎక్కడో ఆపాలి... ఎలా?

మందు కొడితే మృగాలవుతున్నారు, మందు మాన్పించాలి. ఉద్యోగం చేసినా మృగాలవుతున్నారు, ఉద్యోగం మాన్పించాలి...

'నీయమ్మ మొగుడు ఎవడే నిన్ను పెంచి పోషిస్తాడు? కూలీనాలీ చేసుకు మనుషులుగా బతుకుదామా... దీనికేదో పిచ్చి పట్టింది. ఇరవై రెండేళ్లుగా నాతో ఎలాగ పడుకుందో... మెంటల్ గాడిదా... ఫో...'

మద్యం బాటిళ్లు పగలకొట్టిందామె.

వీపు పగులగొట్టాడు. వేడి చల్లబడలేదు. ఒకటికి రెండు బాటిళ్లు కొని తెచ్చి ఏకబిగిన వెక్కిరిస్తూ తాగుతున్నాడు. ఆమె వద్దని కాళ్లావేళ్లా పడింది. కటువుగా చచ్చిపోతానంది చివరికి! చావు అన్నాడు. నిజంగానే అంది. అంత ధైర్యముందా? ఎకసెక్కంగా అన్నాడు. పిరికిదాన్ని కాను మళ్లీ చెప్పింది. నాతో ఇన్నేళ్లు కాపురం చేశాక పిరికిదానివెట్లవుతావు అన్నాడు. అయితే చూడు అంది. అతను చూడలేదు.

అతను మద్యం పట్టు పట్టినట్లు తాగుతున్నాడు.

ఆమె కిరోసిను నెత్తిమీదుగా పోసుకుంటోంది. ఆయిల్లో స్నానమాడినట్టు బట్ట తడిచిపోయింది. మరొక్కసారి చెప్పింది.

అతను వెనక్కి తిరగలేదు, చూడలేదు.

అలాగే పక్కమీద వాలిపోయాడు. క్షణాల్లో నిద్ర పట్టేసిన గుర్తుగా గురక. ఆ శబ్దం ఆమెని మరింత వెక్కిరించి కుళ్లబొడుస్తోంది. అతని మాటలు ప్రోత్సాహపరుస్తూ ప్రతిధ్వనిస్తున్నాయి. గురక తాళం వేస్తోంది.

అతను హాయిగా నిద్రపోతున్నాడు.

ఆమె అతలాకుతలమయ్యింది. నిప్పంటించుకొని అగ్గిమంటయ్యింది. రాజుకున్న నిప్పు కణికయ్యింది. ఒళ్లు కాల్తుంటే మటుకు తట్టుకోలేక అటూ ఇటూ పరుగులేసింది. ఫ్యానుగాలికి అగ్గి రాజుకుంది. ఆకు కాలిపోతున్నట్టు అల్లల్లాడిపోయింది. ఒళ్లుడికిపోతుంటే పెదవి మాటున మాటను అదిమిపెట్టలేక, 'అమ్మా కాలిపోతున్నానే... కాపాడండీ... రక్షించండీ... ఏవండీ...' ఆమె రోదన అతని మత్తునిద్రని భంగం చేయలేకపోయింది.

అతని వారసుడొచ్చాడు. నా మీద రగ్గు కప్పాడు. మంటలార్పేడు. నా ఒంటిమంట లార్పేడు. నా చావులోని నిజాల్ని ఆర్పేడు...!?

'దీనికి బుర్రలేదు. మూర్ఖపు లమ్డీకూతురు. తాగని లంజకొడుకెవడు భూమ్మీద. తాగితే తప్పట. దీనికి అన్నీ తప్పే. తిక్క లంజకూతురు అనవసరంగా చచ్చిపోయింది.'

ఆ మాట కోపంలో కాదు, శాంతంలోనూ అన్నాడు. తండ్రి మనసుని అర్థం చేసుకున్నాడు. లోకరీతిలో మాట్లాడాడు. చచ్చేవాళ్లని తండ్రి కాదు, ఆ భగవంతుడు కూడా ఆపలేడన్నాడు.

ఇంకొక్క మాట కూడా మాట్లాడాడు. ఆ మాటతో పరువు నిలిపాడని ఆ కుర్రాణ్ణి అంతా మెచ్చుకున్నారు.

'మా అమ్మకు నెలనెలా (బహిష్టు) కడుపునొప్పి. అదొచ్చినప్పుడల్లా తట్టుకోలేక చచ్చిపోతానంటూ ఏడ్చేది. ఇవాళ అది నిజం చేసి పోయింది.'

అయినా పోస్టుమార్టం జరిపించమన్నాడు. ఈ మాటకి ఆఫీసర్లూ మెచ్చుకున్నారు.

'నిన్ను కన్నందుకు కడుపునొప్పయిపోయింది. ఆ నొప్పికి తాళ్లేకే చచ్చిపోయానురా.'

కళ్ల డొప్పల దగ్గర కళ్లు లేకపోయినా చెంప తడిగా చుక్కలుగా.

డ్రెస్సింగయిపోయింది.

బ్లడ్ శాంపిల్స్, ఫ్లూయిడ్స్ అన్నీ ప్రిజర్వ్ చేశారు.

"సార్... ఇది హత్యా... ఆత్మహత్యా..." ఎప్పటినుండో ఉగ్గపట్టుకున్న ప్రశ్నని దారితప్పి మార్చురీలోకి చొరబడిన డాక్టర్ల మిత్రుడడిగాడు.

"చూడక్కర్లేదు... సూసైడ్," ఎక్స్‌పర్ట్.

ఆమె తన అవయవాల్ని పరీక్షకు పెట్టగలిగిందే గానీ తన అనుభవాల్ని చెప్పలేకపోయింది. తన మరణవాగ్మూలం తానే ఇవ్వలేకపోయింది.

"మీకు భయం వేయదా?" మళ్లీ ఆ మిత్రుడే అడిగాడు.

ఎక్స్‌పర్ట్ నవ్వాడు.

"ప్రాణముంటే భయపడాలిగానీ..." అంతకన్నా ఎక్కువ మాట్లాడకుండా అటెండర్ని పాన్ అడ్డుకుంది.

"ఫస్టుటైం ఇంటర్లో కప్పని కోస్తే కళ్లు తిరిగాయి. ఇప్పుడు మనిషిని ముక్కలు ముక్కలుగా కోసినా ఏమనిపించదు," జూనియర్ డాక్టరొకరు.

"నీకు భయమేసినట్టుంది కదూ," మరో జూనియర్ డాక్టరడిగింది.

లేదన్నట్లు అడ్డంగా తలూపాడు. తలూపి ఇలా అన్నాడు మిత్రుడు.

"మొదట్లో కొద్దిగ కడుపులో దేవినట్టయింది. తర్వాత ఏమనిపించలేదు. అయినా రోజూ ఇన్నిన్ని చావులు చదువుతా చూస్తా ఎదురుపడతా ఉంటే భయం భయపడి పారిపోయింది."

అందరూ నవ్వుకున్నారు, సగం కాలిన దేహం తప్ప!

*అరుణతార*
*మే-జూన్ 2002*

## నేపథ్యం

### ఇంటింటా విస్తరిస్తున్న

# హింసపాదు

***విస్తరిస్తున్న విషానికి విత్తు ఒక్కటే! అది ఈ రాజ్యం నాటింది. ఇదేమి రాజ్యం? ఇదేమి రాజ్యం? పోలీసు రాజ్యం... తూటాల రాజ్యం. రాజ్యాన్ని ఏలేది హింస! హింసాయుధం! హింసలేని రాజ్యాన్ని ఊహించలేం!! రాజ్యం పెంచి పోషిస్తున్న హింస... ఉద్యోగాలలోంచి కుటుంబాలలోకి ఎలా జొరపడుతున్నదో మూల మేమిటో బోధపడ్డాక రాయాల్సిన కథకు వస్తువు దొలుచుకొచ్చింది. రాసేదాక నిలువ నియ్యలేదు.***

మా ఊరు వెళ్దామని ఎప్పుడు మా జిల్లాలో అడుగుపెట్టినా నాకు తెలియని భయం నన్ను వెంటాడేది. మా జిల్లాయే కాదు పక్కనున్న విజయనగరం జిల్లాలోకి అడుగు పెట్టినా... ఏ జిల్లాలోకి అడుగుపెట్టినా అదే భయం నన్ను వేటాడేది. పచ్చని మైదానాలు పసిరిక పాముల్లా నన్ను భయపెట్టేవి. విస్తారమైన మైదానాలు నాకు ఎడారి ప్రాంతాల్లా తోచేవి. రక్షకభటులు చిన్నప్పుడు అమ్మ చెప్పిన కథల్లోని యమ భటుల్లా భయపెట్టేవారు. కవాతు చేస్తూ ఎక్కుపెట్టిన తుపాకులన్నీ నా గుండెకే గురి పెట్టినట్టు భయం గొలిపేది. పోలీసు బెటాలియన్లు ప్రతి జిల్లాలోనూ పెట్టి విస్తరించుకుంటూ పోతుంటే తెలియని అభద్రతాభావమేదో అలజడేదో ఆందోళనేదో నాలోలోపల విస్తరించేది.

అలాంటి యమపురిలో కొలువులు... పోలీసు బెటాలియన్లలో ఉద్యోగాలు... ఉద్యోగాలు వచ్చాక పెళ్లిళ్లు... పెళ్లిళ్లు అయ్యాక పిల్లలు... పిల్లలూ పెద్దలూ తేడాల్లేని పోలీసులుగానే- తప్పితే మామూలు మనుషులుగా తోచేవాళ్లు కాదు. భయం వల్ల మాత్రమే కాదు, అనుభవం వల్ల కూడా. అందుకే అది బాల్యాన్ని దోచి యవ్వనం లోనూ- నాలోనూ- అందరిలోనూ-

'ఏ గూటి గువ్వ ఆ గూటి పలుకే పలుకుతుంది!' మనుషులైనా అంతే. పాఠం చెప్పే పంతులుగారి పిల్లలు పాఠాలు చెప్పేసేవాళ్లు. కుమ్మరోళ్ల పిల్లలు కుండలు చేసేసేవాళ్లు. కమ్మరి పిల్లలు సుత్తిదెబ్బతో కాల్చిన ఎర్రని ఇనుము మీద ఆటలాడితే, సంగీతం పాడే బాపనోలింట పిల్లలు పాటలు పాడేవాళ్లు. వడ్రంగి ఇంట పిల్లలు తండ్రికి తోడుగా చిత్రిక పట్టేవాళ్లు. పూజారి లేకపోతే పూజారి పిల్లలే మంత్రాలు చదివేసి పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి ప్రసాదం ఇచ్చేవాళు ్లు. కంద్రోళ్ల పిల్లలకు చిటికెలో చేపలు దొరికిపోయేవి. నెయ్యిలోలింట మురీలు దంచే పిల్లలు. షరాబులింట పొయ్యి రాజేసిన పిల్లలు. సాలీలింట పిల్లలు బట్టలు నేసేవాళ్లు. డ్రైవర్ షేర్ మహమ్మద్ పిల్లలు కాలందకపోయినా డ్రైవింగ్ చేసేసేవాళ్లు. గ్యాంగోళ్ల పిల్లలు తండ్రికి బాగోకపోతే పిల్లలే రైలు పట్టాలెక్కేసేవాళ్లు. ఉతకడంలోనూ, ఇస్త్రీ చెయ్యడంలోనూ కొత్త బట్టల్లే కళకళ్లాడిన చాకలిపిల్లలు. భయపడుతూనే పీక కాదు కదా ఈకేనని గడ్డం గీసేసే మంగలి పిల్లలు. బడ్డీకొట్టు మీద అమ్మా నాయిన్ని మించిపోయిన తెలివైన కోవిటిపిల్లలు. ఉడుపులూ కోతలూ నూర్పులు దంచడాలు ఎగరబోతలూ అన్నింటా వరి పచ్చికంకుల్లా పిల్లలు. తప్పించుకొనే పిల్లలు. ఆటవిడుపుగా చేసే పనిమంతులు పిల్లలు... తల్లి కుక్క అరిస్తే పిల్లకుక్క మూగదానిలా నోరు మూసుకు కూర్చోదు. ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా?

మరి పోలీసుల పిల్లలు, పిల్ల పోలీసులు కాకుండా ఉంటారా? పదిహేను పదహారేళ్లకే మా బావొకడు (మా మేనమామ పోలీసే), వాడ్ని చూస్తే నాకే కాదు ఎవరికయినా చెడ్డీ తడవాల్సిందే. ఒకరోజు వాడు నాలుగేళ్ల పాప బుగ్గలు తన చేతివేళ్లతో ప్రేమగా నొక్కితే పళ్లొచ్చేసాయి... రక్తం చిమ్ముతూ!

మరో మా చిన బావమర్ది (ఇప్పుడు వాడు సబ్ ఇన్స్‌పెక్టర్) గురించి అంతా గుసగుసగా వెనుక మాట్లాడుకుంటారు. అవును మరి... మా తాతయ్య చనిపోయాక, శవాన్ని కూర్చోబెడితే నోట్లోంచి రక్తపు ముద్దలు పడ్డాయి. 'ఏంలేదు,' అని మా మేనమావ నోరు తుడిచి జాగ్రత్తగా పడుకో బెట్టాడు. మా తాతయ్యని మా చిన బావమర్ది చెయ్యి చేసుకోవడం వల్లే చనిపోయాడని అంతా చాటుగా చెప్పుకుంటూ ఉంటారు.

నా మిత్రుని ఇంట మరో కథ. నిత్యం తాగే తండ్రి. వద్దని వారించే తల్లి. పిల్లలు పెద్దవాళ్ల వుతున్నారని, పిల్లల ముందు మంచిది కాదని నెత్తీనోరూ బాదుకుంది. అప్పటికే రెండో కొడుకు తాగుడు నేర్చేశాడు. మీసకట్టు నిండా వచ్చేసరికి నీ పిల్లడు నిన్ను మించిపోతాడని ఏడ్చి ఎద పోసు కుంది. తాగుడు ఆపకపోతే చస్తానని బెదిరించింది. తాగినోడు బెదిరింపులకు లొంగననేసరికి నిజంగానే కిరోసిన్ పోసుకు నిప్పు పెట్టుకుంది. తండ్రి తాగిన మత్తులో జోగి నిద్రపోతూ ఉంటే ఆ తల్లి కాలిన ముద్దయిపోయింది. అక్కడికి మూడ్రోజులకి మట్టిలో కలిపేశారు.

ముందు వెనుకలుగా మరో అనుభవం. మా వీధిలో మా వాసలో ఇల్లు. ఆ ఇంటి కోడలు కడుపునొప్పితో నూతిలోకి దూకి చనిపోయిందని విన్నాను. ఎక్కడా? ఎచ్చర్లలో. అక్కడో బెటాలియన్లో ఆమె మొగుడు పోలీసుజ్యోగం చేస్తున్నాడు. చక్కటి ఇద్దరు పిల్లలు. ఏమొచ్చిందని ఇంత పని చేసిం దని అమ్మలక్కలు కొంగులు నోటికి అడ్డు పెట్టుకున్నారు. అక్కడికి నాల్రోజులకి అంతా గుసగుస లాడుకున్నారు. 'చచ్చిపోలేదట! చంపేసినారట! మొగుడేనట! కొట్టి చంపేసినాడట! కుక్కని కొట్టి నట్టు కొట్టాలగాని దొంగని కొట్టినట్టు కొట్టి చంపీడమేటమ్మా...' గుట్టుగా ఏడ్చినారు ఆడోళ్లు. మా అమ్మ కొంగుచాటున నేనున్నా. అక్కడితో కత అయిపోలేదు. అసలు కతకి నాయకుడు చచ్చినదాని కొడుకు. ఇంటి గుట్టు బైటికి రాకుండా... చచ్చిందాయి చచ్చినా అందర్నీ

బతికించింది ఆ కొడుకే... తండ్రికీ కొడుక్కి మంచి స్నేహముందని, అందుకే తండ్రి తప్పుని ఒప్పునిజేసి ఆలయ్య ఉజ్జోగం కాపాడినాడు!' అని అందరూ ఆ అబ్బాయిని వేనోళ్ల పొగిడి నారు.ఆ పిల్లడు పోలీసు దొరలందరికీ గొప్ప సాయమట. ఇయ్యాలో రేపో పోలీసు ఉజ్జోగం, మా పిల్లని ఇస్తామంటే మా పిల్లనిస్తామని పోటీపడ్డారు. ఆడు మగాడన్నారు.

ఈ కతంతా బయటకు పొక్కలేదు. బయటకు పొక్కి పేపర్లకెక్కిన మరో కతుంది. ఆ కత మరుగున పడిపోయిన కత. జనం మరిచిపోయిన కత...

విజయనగరం ఫిఫ్త్ (fifth) బెటాలియన్‌లో జరిగింది. గ్రేహౌండ్స్ ఉద్యోగుల కాలనీ కథాస్థలం. హెడ్ కానిస్టేబుల్ కూతురు వయసుకొచ్చింది. పెళ్లి సంబంధాల కోసం తండ్రి వెతుకు తున్నాడు. కలిసి పనిచేసే కుర్ర కానిస్టేబుళ్లు కొందరు కలిసి ఆ అమ్మాయిని ఆల నాయిన పిలుస్తు న్నాడని పిలిచి బంధించింది చాలక ఉమ్మడిగా అత్యాచారం చేసి చంపేశారు. అప్పుడూ ఈ అసలు కథ పేపర్లో వచ్చేస్తే- పోలీసు దొరవార్లు, 'లేదు... లేదు పుకార్లు నమ్మొద్దన్నారు. కట్టుకథలు నమ్మొ ద్దన్నారు. పోలీసులు క్రమశిక్షణతో ఉన్నారని చెప్పారు. పెళ్లి ఆలస్యమయిందని ఆ పిల్లే ఆత్మహత్య చేసుకుందని కొత్త కథ చెప్పారు. ఆ కథా పేపర్లో వచ్చింది.

వేరు వేరు కతల్లా కనిపించినా ఆ కతల నేపథ్యం ఒకటే. విడివిడిగా జరుగుతున్న ఈ సంఘటనలు చూస్తే ఒకదాని కొకటి సంబంధమున్నట్టుగానే తోచాయి. విస్తరిస్తున్న విషానికి విత్తు ఒక్కటే! అది ఈ రాజ్యం నాటింది. ఇదేమి రాజ్యం? ఇదేమి రాజ్యం? పోలీసు రాజ్యం... తూటాల రాజ్యం. రాజ్యాన్ని ఏలేది హింస! హింసాయుధం! హింసలేని రాజ్యాన్ని ఊహించలేం!! రాజ్యం పెంచి పోషిస్తున్న హింస... ఉద్యోగాలలోంచి కుటుంబాలలోకి ఎలా జొరపడుతున్నదో మూల మేమిటో బోధపడ్డాక రాయాల్సిన కథకు వస్తువు దొలుచుకొచ్చింది. రాసేదాక నిలువ నియ్యలేదు.

ఈ కథని ఎలా చెప్పాలి? మగాడిగా చెప్పడం నచ్చలేదు. ప్రతి మగాడిలో అంతో ఇంతో పోలీసుంటాడు. పోలీసు వేపు నుంచి హింస కథ చెప్పడం సబబు కాదనిపించింది. మనుషుల్లో తొలి మనిషి ఆడది... అందుకే ఆమె నా కేంద్రబిందువయ్యింది.

ఎక్కడెక్కడో జరిగిన సంఘటనలూ నడిచిన పాత్రలూ ఒక్కచోట చేరాయి సరే- ఇంతటి హింసాత్మకతని కతగా చెప్పాలంటే- అలాంటి భీతవహమైన కథాస్థలి కావాలి. నాకు మార్చురీయే సరిపోయేలా అనిపించింది. పోస్టుమార్టం చేసుకుంటూ పోతేనో-? పోస్టుమార్టమ్‌కు సంబంధించిన సాంకేతికత నాకు తెలియదు. గోచ్చాపు జనార్ధన్ మిత్రుడు భార్యాభర్తలిద్దరూ డాక్టర్లయిన ఓ జంటని నా కోరిక మేరకు పరిచయం చేశాడు. పోస్టుమార్టం చూడాలంటే (పర్మిషన్ హెడ్‌కు చెప్పడం...) కష్టమన్నారు. నాకు మరీ కష్టం అనుకున్నాను. అడిగి శ్రద్ధగా విన్నాను. అంతే శ్రద్ధగా జాగ్రత్తగా ఆ సాంకేతికతను కతలోకి ఇమిడేలా చేశాను. నేను నడిపించలేదు, కథే నన్ను నడిపించింది. ఒక్క అక్షరం కొట్టకుండా దిద్దకుండా!

ఇంటింటా విస్తరిస్తున్న పాదే 'హింసపాదు' అని మీకు తెలుసు.


*26 జూన్ 2013*

*'హింసపాదు' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

25

# నాలుగుకాళ్ల మండపం

## మధురాంతకం నరేంద్ర



***మధురాంతకం నరేంద్ర*** 1957 జులై 16 న చిత్తూరు జిల్లాలో జన్మించారు. *మొదటి కథ చివరికి దొరికిన జవాబు* 1975లో ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి మేగజైన్‌లో అచ్చయ్యింది. మూడు కథా సంపుటాలు ప్రచురించారు. *కథావార్షిక*కు సహ సంపాదకులు. *తాత్త్విక కథలు* సంకలనానికి సంపాదకులు. తిరుపతి ఎస్.వి. యూనివర్సిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్.

**చిరునామా**

*15-54/1, శ్రీ పద్మావతీ నగర్,*
*తిరుపతి - 517 502*
*Ph.: 98662 43659*
*manarendra@gmail.com*

నగరం నుంచి ఇంగ్లీషు దినపత్రికల్ని మోసుకొచ్చిన పేపర్ వాన్ నాలుగుకాళ్ల మండపం దగ్గరికి రాగానే హారన్ మోగించడం మొదలెట్టింది. అక్కడి నుంచి ఆ పేపరు ఏజెంటు కార్యాలయం అర ఫర్లాంగు దూరంలో ఉంది. ఆ అరఫర్లాంగు దూరం పొడవునా హారన్ మోగిస్తూ వెళ్లడం ఆ వాన్ డ్రైవరు కలవాటు. నిద్రపోతున్న పేపర్ కుర్రాళ్లకు అదే మేలుకొలుపు.

నాలుగుకాళ్ల మండపం దగ్గర, పాత చావడి మొండిగోడల పక్కన పడుకున్న రంగమ్మ పేపరు వాన్ హారను వినిపించగానే విసుగ్గా ఒళ్లు విరుచుకుంటూ లేచి కూర్చుంది. కనురెప్పల్ని విడివడనివ్వకుండా అడ్డం పడుతున్న కంటి పుసుల్ని రెండు చేతుల్తోనూ తుడుచుకుంటూ, సగం కనురెప్పల్ని బలవంతంగా పైకి కదలి రోడ్డుకేసి చూపులు సారించింది.

ఆకాశం నుంచి నేలకు దిగిన నునులేత మంచు తెరల కవతల, నాలుగురోడ్ల కూడలిలో తీగలకు వేలాడుతున్న సోడియం వేపర్ లైటు చుట్టూ నాలుగైదు రెక్కల పురుగులు గిరికీలు కొడుతున్నాయి. షట్టర్లు దించిన అంగళ్ల పక్కన మూరెడు పొడవున్న సిమెంటు చప్టాల పైన కొన్ని మానవ శరీరాలు ముడుచుకుని పడుకుని గురకలు తీస్తున్నాయి. వాళ్ల మధ్య అక్కడొకటి అక్కడొ

కటిగా ఆవులు, దూడలు కొన్ని పడుకుని, మోరలు పైకెత్తుకుని, నెమరేసుకుంటూనే జోగుతున్నాయి. ఎడమ వైపున్న మురికికాలువ పక్కన పందిపిల్లలు రెండు బురదమట్టిని కెలుకుతున్నాయి. పాత చావడి గోడ చివర్లో నిలబెట్టిన రిక్షాలో రిక్షావాలా తూగుతున్నాడు.

రంగమ్మ తానంతవరకూ కప్పుకున్న బొంతలోంచి తన శరీరాన్ని ఈవలికి లాగి, తన పక్కన పడుకున్న శాల్తీనోసారి కుదిపి చూసింది. ఉవ్వెత్తుగా ఎగిసిపడుతున్న ఆ శరీరానికి పక్కన పొత్తిళ్లలో పడుకున్న పసికందు రొమ్ము నోట కరుచుకుని చీకుతూ నిద్రపోతోంది.

తన కడుపులో పేవులు అరుస్తున్న శబ్దం రంగమ్మకు స్పష్టంగా వినిపిస్తోంది. అరిచేతితో కడుపు పైన రుద్దుకుంటూ, 'టీ డేగ్సా దయాళింకా ఇంకా రాలేదు. టీ కడుపులో పడితేగానీ ఒంట్లోకి త్రాణరాదు,' అంటూ గొణుక్కుంది ఆమె.

గంట గణగణలాడించుకుంటూ రిక్షా ఒకటి రైల్వేస్టేషను వైపు పరుగులు తీస్తోంది. కిరోసిన్ వాసనల్ని విరజిమ్ముతూ ఆటో ఒకటి బస్టాండు వైపుకు ఉరకలు పెడుతోంది.

చుట్టూ నిద్రపోతున్న వ్యక్తులందరినీ పరకాయించి చూసింది రంగమ్మ. మందులషాపు షట్టరు పక్కన ముక్కు ముసలాయన నిద్రపోతున్నాడు. అతడెప్పుడొచ్చి పడుకున్నాడో గుర్తు రావడం లేదామెకు. అంటే, రాత్రి మలిజాము గడిచిన తర్వాత కాస్సేపు తాను ఆదమరచి నిద్రపోయి ఉండొచ్చునన్న విషయం మాత్రం ఆమెకప్పుడు స్ఫురించింది.

మందులషాపు పక్కన, నూనెబంకు ముంగిటిలో, రోడ్డు పైన, దుమ్ములోనే పడుకుని ఉన్నాడు ముసలాయన. ముక్కు ముసలాయన లాగే నామాలాయన కూడా దాదాపు నెలదినాల నుంచి అక్కడికే చేరుకుంటున్నాడని రంగమ్మకు తెలుసు.

నూనెబంకు పక్కనున్న ఫోటోస్టూడియో గ్రిల్స్ నానుకుని అయిదారుమంది మగవాళ్లు వరుసగా పడుకుని నిద్రపోతున్నారు. రోడ్డు కటువైపున టీ అంగడి తలుపుల పక్కన మరో అయిదారు శరీరాలు గురకపెడుతున్నాయి. కూడలికిటువైపున, చావడి పక్కనున్న అద్దాలంగడి మెట్లపైన బేల్దారీ బక్కాయన కుటుంబం నిద్రపోతోంది. రోడ్డు కటువైపున వరుసగా ఉన్న అంగళ్ల షట్టర్ల పక్కన ఒకరి వెంట ఒకరుగా వరుసగా కొంతమంది వ్యక్తులు పడుకుని ఉన్నారు. కూడలి నుంచి తూర్పువైపుకెళ్లే బండ్ల వీధిలో రెండువైపులా గుంపులు గుంపులుగా కొందరు ముసుగులు కప్పుకుని నిద్రపోతున్నారు. ఉత్తరపు దిశకెళ్లే మునిసిపల్ ఆఫీసు రోడ్డు కొకవైపున మురికికాలువ పొంగి ప్రవహిస్తోంది. ఇంకోవైపున రోడ్డులోకే చొచ్చుకొని వచ్చినట్టున్న హనుమంతుడి గుడి పక్కన ఎవరూ పడుకునే సాహసం చేయలేదు.

రంగమ్మ పడుకున్న చోటు నుంచి బండ్లవీధిని తప్పించి మిగిలిన మూడు వీధులూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. దాదాపు నిర్మానుష్యంగా ఉన్న వీధుల్లో చీకటిని లోనికి రానివ్వకుండా కాపలా కాస్తున్న సైనికుల్లా ట్యూబ్‌లైట్లు వెలుగుతున్నాయి.

నిద్రపోతున్న మనుషుల్ని చూస్తే రంగమ్మకు చాలా కోపంగా ఉంది. నిన్నటి రాత్రి రెండు పాలిథిన్ కవర్లు ఖాళీ చేసి ఉంటే, తాను కూడా మిగిలిన వాళ్లలాగే ఒళ్లు మరిచి నిద్రపోగలిగి ఉండే దాన్నన్న విషయం గుర్తుకు రాగానే ఆ కోపం రెండింతలయింది. చీర రొంటిలోని రూపాయి బిళ్ల తప్పితే మరో పైసా అయినా తన దగ్గర లేదన్న సంగతి జ్ఞాపకం రావడంతో ఆమెకు ఒళ్లు మండిపోయింది. తన పక్కన పడుకున్న వ్యక్తిని మరోసారి విసవిసా కుదుపుతూ, ''ఏయ్ రాజీ! తెల్లారిపోయింది. లై పైకి,'' అంటూ విసుక్కొంది.

ఇంతలో పెద్ద బాడీ ఉన్న లారీ ఒకటి కారుబారు చేసుకుంటూ కూడలి మధ్యలోకి వచ్చి నిల్చుంది. లారీలోంచి నిక్కరు తొడుక్కున్న క్లీనరు కుర్రాడు రోడ్డు పైకి దూకేశాడు. ఫోటో

స్టూడియో దగ్గర పడుకున్న గుంపు దగ్గరికెళ్లి అందరినీ లేపి కూచోబెట్టాడు. కాస్సేపు వాళ్ల మధ్య సంప్రదింపులు జరిగాయి. తరువాత వాళ్లందరూ లారీ పైకెక్కారు. లారీ పెద్దగా శబ్దం చేస్తూ వెళ్లిపోయింది.

పాత చావడిగోడ పక్కన రిక్షాలోనే పడుకుని తూగుతున్న రిక్షావాలా ఉలిక్కిపడి నిద్రలేచి, తలకు పాత టవలు చుట్టుకుని రిక్షాను రైల్వేస్టేషను వైపుకు కదిలించాడు.

"ఒసే నిద్రమొగమా, లెయ్యే పైకి... నాలుగుకాళ్ల మండపం కాడ తెల్లారిజాము బేరాలు మొదలైపోయినాయి..." అంటూ రంగమ్మ రాజీకి సుప్రభాతం పాడింది. రాజీ బలవంతంగా కళ్లు విప్పి, పాపాయి నోట్లోంచి రొమ్మును వేరు చేసింది. తరువాత దాని బుగ్గ మీద పెద్దగా శబ్దం చేస్తూ ముద్దు పెట్టుకొంది. ఓసారి చుట్టూ కలయజూసి, బిగ్గరగా ఆవులించి మళ్లీ కళ్లు మూసు కొంది.

రంగమ్మ రొంటిలోంచి చిన్న గుడ్డసంచిని ఈవలికి లాగి చేతిసందులోకి జొనిపి, పొగాకు కాడ నొకదాన్ని పైకి తీసింది. పడకపక్కన పెట్టుకున్న చెంబులోని నీళ్లతో నోరు పుక్కిలించి ఊసి, పొగాకు కాడను పళ్ల మధ్య ఇరికించింది.

దూరంగా రోడ్డుపైన వీధి దీపాల వెలుతుర్లో నీడని జాలువార్చుతూ ఓ ఆకారం నాలుగు కాళ్ల మండపం కేసి రావడం కనిపించింది. తదేకంగా అటే చూడసాగింది ఆమె. చావడి దగ్గరికొచ్చాక నాలుగురోడ్ల కూడలిలో నిల్చుని చుట్టూ కలయజూశాడతను.

అతడు ముఖం చుట్టూ చుట్టుకున్న నల్లరంగు మఫ్లరు శరీరపు రంగుతో కలిసిపోయింది. దుబ్బు మీసాలకు అగ్గి తగులుతుందేమోననిపించేలా బీడీ పెదవుల మధ్య రగులుతోంది.

"నువ్వా మునిరాంరెడ్డీ! ఈ పొద్దు ఎందురు గావాల్న?" అంటూ రంగమ్మ పలకరించింది.

మునిరాంరెడ్డి చావడికేసి నాలుగడుగులు వేసి, "నీ కంటబడిపొయినానా రంగమ్మత్తా! జుట్టంతా ముగ్గుబుట్ట మాదిరిగా తెల్లబడిపోయినా, నీ కంటిచూపు మాత్రం తగ్గలేదు," అంటూ బిగ్గరగా నవ్వేసి, "ఈ పొద్దు చానామంది పన్లేదులే! నలుగురు చాలు. అట్టాంటిట్లాంటోళ్లు లాభం లేదు. సరైన మనుషులు గావల్ల. నువ్వే చెప్పు, ఎవుర్ని లేపమంటావు?" అని ప్రశ్నించాడు.

రంగమ్మ వెనక్కు తిరిగి పొగాకు రసాన్ని చావడిగోడ పైన ఉమ్మేసి, గొంతు సవరించుకుని, "దిట్టమైన మనుషులు గావలిసినోడివి, బాగా తెల్లారినాంక రాగూడదా అల్లుడూ! నాకవుతే ఈడుండే వాళ్లల్లో తెలిసింది ఇద్దరు ముగ్గురే! ఆ ముక్కు ముసలాయనా, నామాలాయనా, బేల్దారీ బక్కాయిన కుటుంబమూ తప్పితే ఈడుండే మిగిల్నోల్లందరూ కొత్తోళ్లే గదా! ఈ సీకట్లో ఎవుడు బలంగా ఉండాడో, ఎవుడు ఊనాసోడో ఎవుడికి తెలిస్తింది?" అంది.

"ఆ సంగతి చెప్పేదానికేనా వక్కాకు బెట్టి పలకరించినావు?" మునిరాంరెడ్డి విసుగ్గా వెనుదిరగబోయాడు.

"ఉండుండు రెడ్డీ! ఒకమాట..." రంగమ్మ పైకి లేచి, కూడలిలోకెళ్లి మునిరాంరెడ్డికి దగ్గరగా నిల్చుంది.

బీడీ పీకను దూరంగా విసిరేసి, ఏమిటని ప్రశ్నిస్తున్నట్టుగా కళ్లెగరేశాడతను.

"జయలక్ష్మి ఎట్టుండాది?" అని అడిగింది ఆమె.

"నువ్వు సరైన పెద్దమనిషేలే రంగమ్మా! భలే గిరాకీని తగిలించినావు. పొమ్మంటే పోకుండా బంక మాదిరి తగులుకొనింది. నూటిరవై ఇచ్చేదాంకా నా ప్రాణం తీసేసింది..." చెబుతున్న ధోరణిని బట్టి అతడు కోపగించుకుంటున్నాడో లేక ఆనందిస్తున్నాడో తేల్చి చెప్పడం కష్టంగా కనిపిస్తోంది.

"అయితే, అదిప్పుడు నీతో లేదా? ఆ మాట చెప్పు ముందు. అది సరేగానీ, పన్లోకి ఆడ కూలోళ్లు వద్దా నీకు? అదో, నా కాడనే ఉందొక పిల్ల..."

"చాలు చాల్లే రంగమ్మా! నీతో లావాదేవీలు పెట్టుకునే ఓపరికం లేదు నాకు," విసుగ్గా ఆమె మాటలకు అడ్డు తగిలాడు మునిరాంరెడ్డి. "ఒకసారి రుచి జూసినాంక గూడా నాకు బుద్ధి రాలేదనుకుంటా ఉండావా నువ్వు! వస్తా తల్లీ! రంగంపేట కాన్నించి కడగాలరాళ్లు తోలుకొని రమ్మని పెద్దరెడ్డి చెప్పినాడు. పదికంతా రాళ్లతో ఇంటి ముందు కనబడకపోతే అగ్గయిపోతాడు. నా సంగతి నేను చూసుకుంటానుగానీ, నా ఎనక బడద్దు. ఆ జయలక్ష్మి ఉన్నన్నాళ్లూ నా పెండ్లాం నన్ను ఆ పొయిలో పెట్టి, ఈ పొయిలో తీసి చంపేసింది. నీ గిరాకీలు నాకొద్దు..."

"ఒటి బెదురుగొడ్డు మాదిరి మాట్లాడద్దు రెడ్డీ! ఒకసారి మనిషెట్లుండాదో సరిగ్గా జూసిపో. మల్లంక నన్ను నిష్టూరం చేస్తే లాభంలేదు?" అంటూ రంగమ్మ అతడిని ఊరించడానికి ప్రయత్నించింది.

అతను గిరుక్కున వెనుదిరిగి, బండ్లవీధి వైపు కెళ్లిపోయాడు.

ఒకటి రెండు నిమిషాల సేపు ముందుకెళ్లిపోతున్న అతడివైపే తదేకంగా చూసి, ఆ తరువాత బిగ్గరగా నిట్టూర్చి వెనుదిరిగింది రంగమ్మ. దుప్పటి కప్పుకుని తనకేమీ పట్టనట్టుగా నిద్రపోతున్న రాజీని చూడగానే ఆమెకు ఒళ్లు మండిపోయింది. కోపంతో పళ్లు పటపటలాడించి, "దొంగలంజ... బసివిముండ..." అని రెండు మూడు తిట్లు ప్రసారం చేసి, విసుగ్గా రాజీకేసి కాలు జాడించింది.

రాజీ ఉలిక్కిపడి నిద్ర మేలుకొంది. ముఖం పై నుంచి దుప్పటి తప్పించి, బిత్తరచూపులు సారించింది.

"ఇంత తూగుమూతితో ఎట్ల బతికి బట్టగడతావే పెద్దమ్మా! చాలనిదానికి తగువుగా ఒక బిడ్డను గూడా కనుక్కొని కూచోనుండావే! ఆ బయమైనా లేదుగదా నీకు!" అంటూ రంగమ్మ తన యథాస్థానంలో గొంతుక్కూచుంది.

తానేదో పెద్ద పొరబాటే చేసి ఉంటానన్న నమ్మకం కలగడంతో రాజీ బిక్కమొహం పెట్టుకుని లేచి కూర్చుంది. పొత్తిళ్లలోని బిడ్డ పైన గుడ్డను సవరించుతున్నట్టుగా నటిస్తూ రంగమ్మకేసి కొన చూపుల్ని సారించింది.

పొగాకు నవతలికి ఉమ్మేసి, రంగమ్మ గొంతు సవరించుకుంది. "నాలుగు దినాలుగా ఈడ మనం అగోరిస్తా ఉండామని తెలుసు. చేతిలో ఉన్న దుడ్డు నిన్న మాపిటేలతో అయిపోయిందని తెలుసు. ఈ పొద్దు పని దొరక్కపోతే మద్దానం ఏం తిందామనుకోనుండావు నువ్వు అని అడగతా ఉండాను. ఆ దిగులుంటే నీకు నిద్రెట్లా పడతాది? నీ కోసరమని నేను వచ్చేపొయ్యే వాళ్లనంతా కాపెట్టుకోనుంటే, నువ్వు బెల్లంకొట్టిన రాయి మాదిరిగా నిగడదీసుకొని పండుకుంటే జరిగేదెట్ల? మూతీ గీతీ కడుక్కోని కూచుంటే గదా, ఈడొక నపురుండాదని అందురికీ తెలిసేది? నేను చెప్పునప్పుడే లేచి రెడీగా ఉండుంటే మునిరాంరెడ్డి చూసుండును గదా! మునిరాంరెడ్డంటే ఎట్లాంటోడో తెలుసునా నీకు? తెలియదు. తెల్లారితే నూటా పదకొండు పనులు జరగతాయి వాని చేతల మీదుగా. ఏదో ఒకదాన్లో నిన్నిరికించేసుండును. అట్లాంటోన్ని నమ్ముకోనుంటే, ఈ బతుకు పచ్చగా జరిగిపొయ్యుండును గదా! మొన్నటికి మొన్న..." మునిరాంరెడ్డీ, జయలక్ష్ముల ఉదంతం జ్ఞాపకం రావడంతో రంగమ్మ తన ఉపన్యాసాన్ని ఆపేసింది.

బండ్లవీధి లోంచి నలుగురైదుగురు వ్యక్తుల్ని వెంటబెట్టుకుని, వాళ్ల ముందే నడుస్తూ రైల్వేస్టేషను వైపుకెళ్లిపోయాడు మునిరాంరెడ్డి.

మెడికల్ షాపు ముందు పడుకున్న వాళ్లల్లోంచి ఇద్దరు నిద్రలేచి బీడీలు వెలిగించుకుంటున్నారు. వాళ్లు మాట్లాడుకోవడం వినిపించి నిద్ర మేలుకున్న మరో ఇద్దరు పాత టైరుకు నిప్పంటించి చలి కాచుకుంటూ కూర్చున్నారు. గాంధీరోడ్డులోని మార్కెట్టు దగ్గర మెల్లమెల్లగా సవ్వడి మొదలయింది.

ఇనుపతీగల చట్రంలో బిగించిన టీ డేగిశాను రగులుతున్న కుంపటితోబాటు ఒక చేత పట్టుకుని, మరోచేత్తో నీళ్లబకెట్టు నెత్తుకుని ఒక వ్యక్తి నాలుగుకాళ్ల మండపం దగ్గరికొచ్చేశాడు.

"దయాళన్నా! నీ కోసరమే చూస్తా ఉండాను. నా ముఖానో టీ కొట్టు..." అంటూ ఆహ్వానించింది రంగమ్మ.

దయాళ్ టీ సరంజామాను నేలపైన పెట్టి, బకెట్‌లోని నీళ్లతో గాజుగ్లాసును కడుగుతూ, "ఈ పొద్దు జనమెందుకో తక్కువగా కనబడతా ఉండారు," అంటూ గొణిగాడు.

"ఇంకా మొబ్బు మొబ్బుగానే ఉండాది. తెల్లారీ తెల్లారక ముందే నీకోసరమని జనాన్నేడ నుంచి తెచ్చిపెట్టేది? ఎంతసేపులే! చూస్తా ఉండంగానే తెల్లారిపోతాది. ఇసికేస్తే రాలనట్టుగా మనుసులు కూడా వచ్చేస్తారు. చిటికెసేంత సేపులో టీ అంతా ఖర్చయిపోతాది," టీ గ్లాసు చేతికొచ్చాక మాట్లాడడం ఆపేసి, టీ నీళ్లు చప్పరించసాగింది రంగమ్మ.

దయాళ్ మరో టీ గ్లాసును రాజీవైపు చాపాడు.

రంగమ్మకు తన దగ్గర ఒకే ఒక రూపాయి మిగిలి ఉందన్న సంగతీ, రెండు టీ గ్లాసులకూ తానే డబ్బుల్ని చెల్లించాలన్న సమాచారమూ స్ఫురించాయి. అడగకుండానే రాజీకి కూడా టీ ఇచ్చిన దయాళ్‌పైన ఆమెకు చెప్పలేనంత కోపం వచ్చింది. కానీ, తన కోపాన్ని వెలిబుచ్చడానికది అదను కాదని మౌనంగా ఉండిపోయింది.

ఎప్పుడు నిద్రలేచాడో ఏమో నామాలాయన టీ కుంపటి దగ్గరకొచ్చి నేలపైనే గొంతుక్కూచుని, "నాక్కూడా టీ," అంటూ ఆర్డరిచ్చాడు. గువ్వ తొక్కిన కొబ్బరికాయలా పొట్టిగా, పీలగా, వక్రంగా వింతగా ఉన్నాడతను. "ఏం రంగమ్మా! రెండు మూడు దినాలుగా చూస్తా ఉండాను. ఎవురీ కొత్త పిల్ల? చుట్టమా?" అని వాకబు చేశాడు.

"చుట్టమూగాదు, సొంతమూగాదు. ఈ బాసాలి సంగతేమని చెప్పేదునులేన్నా! నాలుగు దినాల ముందు తెలిసినోళ్ల పిల్ల ఒకతి తీర్థమాడితే గవర్మెంటాసుపత్రికి పోయినాన్లే! ఆడ తగులుకున్న గాచ్చారం ఇది. అయినా, ఒకర్నని లాబం లేదన్నా! నన్ను నేను చడావుల్తో గొట్టుకోవాల్ల..." ఖాళీగ్లాసును నేలపైన పెట్టి, చివరి రూపాయిని దయాళ్ చేతిలోకి గిరవాటేసినట్టుగా విసిరికొట్టి మరోసారి నిట్టూర్చింది. "ఆ పిల్లకు కడుపులో బిడ్డ తిరక్కపోయిందని ఆపరేషను చేసినార్లే! చూసుకునేదానికి మనిషి లేదని వాళ్లు అంగలారిస్తే, పోతే పోనీ అని రెండు రాత్రుళ్లు ఆడనే అగోరించినా. ఊరికే కాదనుకో. అన్నంబెట్టి దినానికి పదిచ్చినారు. పోయిన బేస్తవారం, సరింగా రెండో ఆట ఇడిచిపెట్టే టయిం, గేటుకాడ కలాంబులాం అని గలాటా! ఏందబ్బా అని పొయి చూసినా. చేతుల్లో పసికందు నెత్తుకోని ఈ పిల్ల ఒక మొగమనిషితో పొరకలాడతా ఉంది. ఉన్న మాట ఉన్నట్టుగా చెప్పాలగదన్నా! వాడసలు మొగుడు గాదేమోనని నాకు అనుమానం. లేకపోతే అదంత గట్టిగా పట్టక మల్లాడ్సిన పనేముండాది? మొగుడయినోడు యాడికి పోతాడు? గూటానికి కట్టేసిన గొడ్డు మాదిరి తిరిగి తిరిగీ మళ్లా తావు చేరకపోతాడా? వాడసలు మొగుడేనా అని అడిగితే, ఈ పిల్ల జబాబు చెప్పనంటిందే?"

నామాలాయన రాజీకేసి చూశాడు. రంగమ్మ చెబుతున్న సంగతితో తనకేమీ సంబంధం లేదన్నట్టుగా ఆమె ఎటో చూస్తోంది.

"ఆ అర్ధరాత్రిపూట వాచ్‌మేన్‌కు ఒకటో రెండో చదివించి, దొంగతనంగా వార్డులోకొచ్చినాడంట వాడు. ఎందుకొచ్చినాడో ఏమో నాకు తెలవదు. వాడు పోతానంటే ఇది వదిలిపెడితే గదా! బిన్నాగా బయటికి పొమ్మని వాచ్‌మేనూ, తెల్లారితో మళ్లా వస్తానని ప్రమాణాలు చేస్తా వాడూ, చచ్చీ గీపెట్టినా వదలననీ, కావాలంటే అప్పటికప్పుడే వానితో వచ్చేస్తానని ఇదీ... ఎప్పుడుబడితే అప్పుడు బాలింతరాల్ని పంపించేస్తే డాక్టర్లు తంతారని వాచ్‌మెన్నూ... అదీ జగడం... వాచ్‌మేన్

ఇట్లా కాదురా అని వాని చేయి పట్టుకోని బరబరా లాక్కుంటూ పోయి గేటుకాపక్క తోసేసినాడు. అదే పోవాటం. ఆ మొగుడయినోడు మళ్లా ముఖం జూపించలేదు. ఈ బాసాలి కండ్లల్లో నీళ్లు పెట్టుకుని ప్రానాచారం చేస్తా కూచునింది. పోతే పోనీ మనమే ఒక దోవ చూపిద్దామని ఇట్ల తోడుక్కొచ్చినాను. మూడు దినాలుగా ఈడ్నే అంగలారస్తా ఉండాము. వృధాగా తిని తిరగలాడతా ఉండాం. మన దగ్గిరుండేది దాంచి పెట్టుకుంటే చూసేవాళ్ల కెట్ల తెలస్తాది? ఒళ్లు మిసమిసా మెరస్తా ఉండేటప్పుడు కొంచెం తెలివిగా బతికితే మళ్ల బయపడాల్సిన పని ఉండదు. జోరీగ మాదిరి దీని చెవుల్లో గీపెడతా ఉండాను. దీని చెవికెక్కటం లేదు...''

నామాలాయన ఖాళీచేసిన గ్లాసును చేతికి తీసుకుని, అతడందించిన చిల్లరడబ్బుల్ని భుజానికి వేలాడుతున్న పొడుగుదారాల నీలిరంగు సంచిలో వేసుకుని, టైరు కాలుతున్న వైపు కదలుతూ ఓసారి బిగ్గరగా, ''టీయ్,'' అంటూ కేకేశాడు దయాళ్.

''ఆ మాట నాకు ప్రత్యేకంగా చెప్పాల్నా రంగమ్మా! పుట్టి భూమ్మీద పడినప్పటి నుంచీ ఈ ఊర్లోనే పడి దొర్లాడినోడిని. నువ్విప్పుడు చూస్తా ఉండే సిన్మాకొటాయిల కాన్నించీ రైలుటేషనూ, బస్టాండులూ అన్నీ నా కండ్ల ముందర్నే కట్టినారు. అయినా, దినబత్తెం కోసమని ఇప్పటిమాదిరిగా అంగలార్చిందెప్పుడూ లేదనుకో. ఈడేమో తిరణాల జరగతా ఉన్నట్టు చుట్టుపక్కల పల్లెల నుంచి గుంపులు గుంపులుగా జనం ఒకటే రావటం. ఎంత వానలు పడకపోతే మాత్రం భూమీ బుఱ్ఱా పరిగిల దోలేసి, ఇట్లా మనమీద పడితే న్యాయమేనా? ఇక్కడ మాత్రం నీళ్లెక్కడుండాయి? ఈ మేస్త్రీలకూ, గుమాస్తాలకూ ఎవుడు ఈ ఊరోడో, ఎవడు పరాయోడో ఇరతం పరతం తెలస్తా ఉండాదా? వచ్చినోడంతా రాతికూసాల మాదిరి బలంగా ఉన్నవాళ్లనే తొడుక్కోని పోతా ఉంటే మిగిలినోళ్లేమైపొయ్యేదని? అట్లా చూడు, పెద్ద మిత్తవ మాదిరిగా గోయిందరాజుల గాలి గోపురం ఎగజూనుకొనే ఉండాది. ఈడేమో ధర్మగోవు ఒంటికాలి మీదే నడస్తా ఉండాది...'' తన గోడు వెళ్లబోసుకున్న తర్వాత నామాలాయన అక్కడినుంచి పైకి లేచి తన స్థానంవైపు వెళ్లిపోయాడు.

కూడలి దగ్గర చీకటి మెల్లమెల్లగా పలచబారుతోంది. ఎర్రని సోడియం వేపర్ దీపం క్షయరోగిలా పాలిపోయి కనిపిస్తోంది. దొంగల్లా అడుగుపెట్టిన ప్రభాత వాయువులు అప్పుడప్పుడు మెల్లగా కదులుతున్నాయి. గాలి వీచినప్పుడల్లా దీపం కింద రాలిన పురుగుల రెక్కలు పైకెగురు తున్నాయి. దూరంగా మార్కెట్టు ముందు ఆగిన లారీలోంచి కూలీలు బుట్టల్ని దింపుతున్నారు. నాలుగుకాళ్ల మండపం దగ్గరికి మెల్లమెల్లగా జనం చేరుకుంటున్నారు.

జానెడు పొడవున్న వేపపుల్లల కట్టలు రెండింటిని చేతబట్టుకుని అద్దాలాయన రంగమ్మ దగ్గరకొచ్చాడు. పాత కాషాయరంగు లుంగీ కట్టుకున్నాడతను. బట్టతల, పుల్లల్లా ముఖానికంటు కున్న వెంట్రుకలు. ఫ్రేము విరిగిన కళ్లజోడును దారంతో చెవులకు కట్టుకొని ఉన్నాడు. నరాలన్నీ పైకుబికిన కట్టె చేతులతో రెండు వేపపుల్లల్ని రంగమ్మవైపు చాపాడతను. ఒక పుల్లని రాజీకిస్తూ, ''చిల్లరలేదు పెద్దాయనా! రేపిస్తాన్లే,'' అంది రంగమ్మ. ఆమె సమాధానంతో సంబంధమేమీ లేనట్టుగా ముందుకు కదిలిపోయాడు అద్దాలాయన.

వేపపుల్లని కచకచా రెండుసార్లు నమిలి, పైకి లేచి కచేరీగోడల పక్కన ఉమ్మేసి, ''మని సంటే అద్దాలాయన మాదిరుండాల,'' అంది రంగమ్మ. ''ఇంత ముసిలోడయినా ఇంకో మనిషి ఋణంలో పొయ్యేదానికి ఆ ప్రాణం ఒప్పుకోదే! ఏడేడ తిరగతాడో, ఏడ పెరుక్కొస్తాడో ఏమో! తెల్లారేకాడికి ఇన్ని పళ్లుదోము పుల్లలు తెస్తాడు. దుడ్డిస్తే తీసుకుంటాడు. ఈయకపోయినా ఏమనడు. రెండుమూడు రూపాయలుంటే దినం గడిపేస్తాడు. ఏ పొద్దయినా ఎవుడి ముందరైనా చెయ్యి చాపున్నా?...'' రెండు దినాలుగా ఈ రాజీ తనమీదే ఆధారపడి ఉంది. కాబట్టి ఎంతగానో

రుణపడిపోయింది. ఆ విషయం ఆమెకింతకన్నా స్పష్టంగా ఎలా చెప్పాలో తోచక రంగమ్మ మౌనంగా ఉండిపోయింది.

కూడలిలోని నియాన్‌లైటు వెలగడం మానేసింది. వీధిదీపాలు కూడా ఆఫయిపోయాయి. చీకటి పూర్తిగా నిష్క్రమించడంతో భళ్లున తెల్లవారిపోయింది. తెరచిన టీకొట్టులో బైలరు ముందు ఎర్రటి బనీను తొడుక్కున్న పయిల్వానులాంటి వ్యక్తి గ్లాసులు కడుగుతున్నాడు. గుంపులు గుంపులుగా వస్తున్న జనానికి స్థలమివ్వడం కోసమన్నట్టుగా పశువులు పైకి లేచి ఎటో వెళ్తున్నాయి. మురికికాలవ దగ్గరి పందిపిల్లలెప్పుడు మాయమయ్యాయో తెలియడంలేదు. బొత్తాలూడిన చొక్కాలు, చినిగిన పంచలు, నలిగిన జుబ్బాలు, మాసిన గడ్డాలు, చెదిరిన జుట్లు, వెలిసిపోయిన చీరలు, జిడ్డోడుతున్న ముఖాలు, బీడీల పొగ, చుట్టలకంపు- నాలుగుకాళ్ల మండపం దగ్గర సంరంభం ప్రారంభమైపోయింది.

బాగా పొట్టిదైన పైజామా పైన తనదిగాని చొక్కాని తొడుక్కున్న లావుపాటి పొట్టి వ్యక్తి ఒకడు రోడ్డుపైన తచ్చాడుతూ రంగమ్మకు కనిపించాడు.

“మస్తానూ... ఇక్కడ... రా రా!” అంటూ అతడిని ఆహ్వానించింది ఆమె.

“ఈ పొద్దు నన్ను పిలిచినా గుణం లేదు రంగమ్మా! చిన్నాచితకా పనిగాదు. రోడ్డు పని. ముసిలీ ముతకా లాభంలేదు...” మాట్లాడుకుంటూ ముందుకొచ్చిన మస్తాను సాహెబు రంగమ్మ పక్కన మరో వ్యక్తి కనిపించడంతో ఆగిపోయి, ఆ వ్యక్తిని పరకాయించి చూడసాగాడు.

రంగమ్మ వంకరనవ్వుని వెదజల్లుతూ, “చూస్తే ఏమొస్తింది సాయిబన్నా! పని ఉంటే చెప్పు ఎన్ని దినాలయినా వొక్రం లేకుండా పనిచేసే పిల్ల,” అంది.

మస్తాను సాహెబు రాజీకేసి కళ్లారప్పకుండా చూస్తూ, “రోడ్డుపని... కావల్సింది ఆడకూలోళ్లే! ఒకరుగాదు, ఇద్దరుగాదు. ఆరుమంది. గుల్లకొట్టే పని. మా సుబ్బరామ చౌదరికి కాంట్రాక్టొచ్చింది. ఊర్లో నాలుగు రోడ్లు మనవే! లారీల్లో గుల్ల తెచ్చి తోలేసినాం... పదిరవైదినాల పని...” అంటూ ఓ నిమిషంసేపు ఆగిపోయి, “ఆ పక్కనుండే పసిబిడ్డెవురు?” అని ప్రశ్నించాడు.

అతడి ప్రశ్న వినగానే ఉలిక్కిపడి రాజీ బిడ్డ పైన గుడ్డ కప్పింది.

“బిడ్డతల్లని చూడద్దన్నా! ముక్కుమని మూలగనైనా మూలక్కుండా చీమిడి చీదినంత సుళువుగా బిడ్డను కని పక్కన పెట్టిన పిల్ల...”

“బాలింతరాల్ని నా ఎదాన తోలితే ఎట్ల రంగమ్మా! ఎండలో చెయ్యాల్సిన పని. కండ్లు తిరిగి పడిపొయ్యిందంటే ఆస్పత్రి చుట్టూ తిరిగేదానికి నావల్లకాదు. ఇంకో ఆరునెలలు పొయినా కయితే చెప్పు. బిడ్డ కొంచెం పెద్దయుంటుంది. తల్లి పనీపాటా చూసుకోవచ్చు. అప్పుడు పిలువు నన్ను. ఏదయినా ఒక పనిలో దూర్చేస్తాను. నీకు పని కావాలని అడిగితే, అది మాత్రం నావల్లగాదు. చిటికేసింతసేపు పనిచేస్తే గంటసేపు రెస్టు కావాలంటావు. పొయిన తడవ మోల్డింగు పని పెట్టుకున్నప్పుడు పోరంబోకు పనోళ్లని పిలచకపోయినావని మా పెద్దాయన కాసరబీసరమన్నాడు.”

రంగమ్మ పిలుస్తున్నా వినిపించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయాడు మస్తాను సాహెబు.

రాజీని మరోసారి శల్యపరీక్ష చేసి చూసింది రంగమ్మ. నేరేడుపండులా నిగనిగలాడుతున్న శరీరం, సన్నగా ఉన్నా దృఢంగా కనిపిస్తున్న ఆకారం, తీరైన నిమ్నోన్నతాలు- పుట్టినప్పటి నుంచీ కాయకష్టాలకూ పస్తులూ రగడలకూ లోనైన శరీరమే అయినా, వయసు రావడం చేత పక్వానికొచ్చిన పండులా పేట్రేగిపోతున్న పిల్ల. ఇప్పుడే గిరాకీ లేకపోతే ఇంకెప్పుడుంటుంది? రంగమ్మ కొక్కసారిగా కొండంత ధైర్యం కలిగింది. మూడురోజుల తన పెట్టుబడి వృధాగా పోదన్న నమ్మకం కలిగింది. “ఏయ్ రాజీ! ఎంతసేపని ఆ పుల్లను నమలతావు. ఆ పక్క బోరింగుకాడికి పోయి మూతి గడుక్కోని రా పో! నీ అసుంటిదానికి పని చూపించలేకపోతానా నేను? ఇన్ని

సమత్సరాలుగా ఎందురెందురికి దోవ చూపించలేదు. నీకేమీ బయమొద్దులే తల్లా! కొంచెం ఆ తల్లో దూబానె పెట్టు. కంటికి నాణ్ణెంగా కూర్చో. మిగిలిందంతా నేను చూసుకుంటాను,'' అంటూ రాజీకి భరోసా ఇచ్చింది.

కూడలి దగ్గర జనసమ్మర్దం పెరిగిపోయింది. పదిహైదిరవై ఏళ్ల నుంచీ యాభై అరవై ఏళ్ల వరకూ, రకరకాల వయసున్న రకరకాల వ్యక్తులక్కడ గుమిగూడిపోయారు. అక్కడక్కడా కొందరు ఆడవాళ్లు కూడా ఉన్నారు. నలగ్గొట్టిన తాటిపట్ట నొకదాన్ని పాత డబ్బాలో వేసుకుని, గోడలకు వెల్లవేసే వాళ్లు ఎక్కడబడితే అక్కడ కనిపిస్తున్నారు. కూలీలు కావల్సినవాళ్లు వచ్చి, చూసి, నచ్చిన శాల్తీలను ఎన్నిక చేసుకుని, బేరాలు కుదిరితే వెంటబెట్టుకుని వెళ్తున్నారు.

ముఖం కడుక్కున్నాక రాజీ తల దువ్వుకుంటూ కూర్చుంది.

మాసిన నాలీసు పంచలు కట్టుకున్న ఇద్దరు వ్యక్తులు అద్దాల అంగడి దగ్గరకొచ్చి నిల్చున్నారు. వాళ్ల ఒంటిపైన చొక్కాలు లేవు. భుజాల పైన తుండుగుడ్డలు మాత్రం ఉన్నాయి. మాసిపోయిన గడ్డాలు, జందెంపోగులు వేలాడుతోన్న బక్కచిక్కిన శరీరాలు.

''ఏం సామీ! ఈ పొద్దు మంచి దినమేనా?'' అని అడిగింది రంగమ్మ. ఆ ఇద్దరిలోనూ బాగా ముసలివాడుగా కనిపిస్తున్న వ్యక్తి చివాలున ఆమెవైపు తిరిగి, నీకిదే తగినశాస్తి అన్నట్టుగా, ''అష్టమి. వేలు పెడితే కష్టాలే,'' అన్నాడు.

రంగమ్మ ముఖం ముడుచుకుని ఇతలికి తిరిగి కూచుంది. బ్రాహ్మణులిద్దరూ మళ్లీ తమ లోకంలోకి వెళ్లిపోయారు.

''నిన్నెక్కడికెళ్లావు? కనిపించనేలేదు,'' అడుగుతున్నాడు ముసలాయన.

''భవానీనగర్లో తద్దినం. ఇంటికాడికే మనుషులొచ్చినారు,'' అన్నాడు పడుచువాడు.

''పోనీలే! నీకోసం చాలాసేపు చూశాన్నిన్న... బైరాగిపట్టెడలో తద్దినం... వస్తానన్న బ్రాహ్మణుడు ఎగ్గొడితే వెతుక్కుంటూ వచ్చినారు. గ్రాండ్‌గా జరిగిందిలే! యాభైదాకా గిట్టింది,'' అన్నాడు ముసలాయన.

నిన్నటి సంగతి సరేలే! ఈ పొద్దు సంగతి చూడండి. ఇంత పెద్ద ఊర్లో ఒకరిద్దరైనా గుంతకల్లుకు టికెట్లు కొన్లేదా? వ్రతాలూ, ముహూర్తాలు లేకపోతే పోనీ, తద్దినాలైనా దొరకవా అని ఆశ...'' అంటున్నాడు పడుచువాడు.

విన్నంతసేపూ విని, రాజీకి చేరువగా వచ్చి, రహస్యం చెబుతున్నట్టుగా స్వరాన్ని తగ్గించి, ''ఉపాతకం సాములు... శాస్త్రం సరిగ్గా చూసే విద్య ఉంటే ఈడికెందుకొస్తారు? పార్టీలు ఇంటికాడికే వచ్చి ఉండవా? కంత్రీలు... చూసేవాళ్లు ఏమారితే మూటలు మోసేదానికి గూడా రెడీ అయిపోతారు... నాలుగైదేండ్లుగా చూస్తా ఉండాన్లే వీళ్లని...'' అంటూ సాగదీసింది.

రోడ్డుపైన రాకపోకల సంరంభం బాగా ఎక్కువైపోయింది. సైకిళ్లూ రిక్షాలూ, వాన్లూ టౌను బస్సులూ రకరకాల శబ్దాలతో అక్కడ చేరిన జనఘోషకు సహకారాల్ని అందించసాగాయి. కూలీలందరూ పార్టీల కోసం ఎదురుచూస్తున్నారు. అయిదుమంది ఆడవాళ్లను సమీకరించుకుని మస్తాను సాహెబు సున్నపువీధి వైపు నడుస్తున్నాడు.

''ఆ మస్తాను సాయిబుకెంత ధీమాకో చూసినావా రాజీ! మనమిద్దరమూ పనికిరామంట. ఆ కొత్త నపుర్లు బాగుండాయంట. చేతిలో రెండు రూకలు గలగలమంటా ఉంటే మాత్రం మనషల కింత పెగ్గి పెరిగిపోవాల్నా? వీని బతుకెంతో నాకు తెలవదా? మొన్నటికి మొన్న ఆ కదిరిపక్క మొలకల చెరువుకాడి నుంచి గుడ్డ భుజానేసుకొని, పెళ్లాంబిడ్డలను తోలుకోని ఈ నాలుక్కాళ్ల మండపం కాడికొచ్చినోడే గదా వీడు కూడా! నువ్విప్పుడు కుచ్చేనుండే తావులోనే కూర్చోని గుక్కిళ్లు మింగతా ఉంటే ధయిర్నం చెప్పింది నేనే కదా! ఆ మునిరాంరెడ్డిగాడికి కూడా మనం

చెల్లని కాసులైపోయినామా? ఆ జమ్మలమడుగు పక్క కొత్తూరు నుంచి వచ్చి రిక్షా తొక్కుకుంటా బతికిన దినాలిప్పుడు గవనముండాయా వానికి? లోకమెట్లుండాదో బాగా కండ్లు తెరిసి చూసు కోయే రాజీ! వొయసులో ఉండేటప్పుడు ఏమారినావంటే నీ బతుకు గూడా నా మాదిరే తెల్లవారి తింది..." చెప్పడం ఆపి కాసేపు రాజీ ముఖంలోనే చూపును కేంద్రీకరించింది రంగమ్మ. కను రెప్పలు ఆడడం తప్పితే ఆమె ముఖంలో మరో రకమైన చలనమేదీ కనిపించలేదు. రంగమ్మ బతుకెలా తెల్లారిందో తెలుసుకోవాలన్న ఉత్సుకత సైతం ఆమెలో కనిపించకపోయేసరికి రంగమ్మకు ఒళ్లు మండిపోయింది. ఇక నీ ముఖం చూడనన్నట్టుగా పక్కకు తిరిగి కూచుంది.

ఎప్పుడొచ్చి కూర్చున్నాడో తెలియదుగానీ, ముక్కు ముసలాయన ఎదురుగా కనిపించా డామెకు. అతడు తింటున్న ఆహారాన్నంతా తానొక్కతే దోచుకుంటున్నట్టుగా అతడి ముక్కు వికృతంగా పెరిగి ఉంది. ముఖంలోని మిగిలిన అవయవాలన్నీ ముక్కును చూడలేక భయంతో ముడుచుకుపోయినట్టు కనిపిస్తున్నాయి. రంగమ్మ తనవైపు తిరగానే అతడు 'ఇహిహీ' అంటూ పళ్లికిలించి, "కొంచెం పొవ్వాక్కట్టె ఉంటె ఇస్తావా తల్లా?" అంటూ చేయి చాచాడు.

రంగమ్మ తన గుడ్డసంచిలోంచి చిన్న పొగాకు కట్టె తీసి అతనికిచ్చింది. పొగాకు రసం గొంతు దిగిన తరువాత ముసలాయన అర్ధనిమిలిత నేత్రుడై, "పొద్దింత పైకొచ్చింది. ఎండింకా రాలేదే! చూసేదానికి మొబ్బు పట్టినట్టుగా ఉండాది. ఈ పొద్దేమైనా వాన కురుసుద్దా?" అంటూ ప్రశ్నించాడు.

రంగమ్మ తూర్పువైపు తిరిగి ఆకాశంకేసి చూసింది. నల్లటి మేఘాల గుంపు ఆకాశమంతా కనిపిస్తోంది.

"ఈ పాపం చేసుకున్న కొంపలో పనుల్ని పోగొట్టే వానలు మాత్రం పడతానే ఉండాయి. ఏందో పెద్ద మేలు చేసేమాదిరి పొద్దున్నే రొండు చినుకుల్ని టపటపా రాల్చి, అందర్నీ బెదరగొట్టేసి, పనులాపేయించినాక, చక్కా ఎండ దిగొస్తుంది," అంటూ గొణుక్కున్న తర్వాత, అంతపనీ జరిగి వర్షం పడితే ఈరోజు గడపడమెలాగన్న ప్రశ్న స్ఫురించిందామెకు. ఇలాంటి సందేహాన్ని రేకెత్తించిన ముక్కు ముసలాయనకు పొగాకు కట్టెనిచ్చినందుకు తనను తానే తిట్టుకోసాగింది రంగమ్మ.

"ఏం రంగమ్మా! ఎవురీ కొత్తపిల్ల?"

ప్రశ్న వినిపించిన వైపుకు తిరిగి చూసిందామె.

గళ్లగళ్ల డ్రాయరు కనిపించేలా పంచె పైకెత్తి కట్టుకుంటూ కనిపించాడు మేస్త్రీ కుప్పస్వామి. జెండాకొయ్యలా సన్నగా ఉన్న అతని శరీరానికీ, లావుగా పొట్టిగా ఉన్న అతడి చేతివేళ్లకూ, కాలివేళ్లకూ సామ్యం కుదరడంలేదు.

రంగమ్మ దుమికినట్టుగా లేచి నిల్చుని, "రా కుప్పసామీ! పొద్దన్నించీ నీకోసరమనే కాసు కోని కుచ్చోనుండాను. రాత్రి రెండో ఆట ఇడిసిపెట్టేదాంకా రైలుటేషన్లో పండుకోనుంటిమి. నువ్వేడ చెయ్యి దొరక్కపోతావో అని, గుర్కా కట్టె కొట్టుకుంటా పొయినాక ఈ చావిడి దగ్గిరికొచ్చి పండు కొంటిమి..." అంది రంగమ్మ.

"నాకోసరమే చూస్తా ఉండేదాని మాదిరిగా మెరమెచ్చుల మాటలు చెప్పొద్దు. నీకు ఎవురైనా కొత్తోళ్లు తగిలినప్పుడు ముందుగా కనబడే మనుషులు వేరే ఉండారని నాకు తెలుసు. అందరూ వద్దన్నాక కడబడినోళ్లుంటే అప్పుడు కదా నేను నీకు కనబడేది," అన్నాడు కుప్పస్వామి.

"నువ్వెందుకట్ల మాట్లాడతా ఉండావో నాకు తెలుసులే కుప్పస్వామీ! ఆ రహమత్ బీని తొలిగా చూపించలేదనే నీకు కోపం. ఆకాడికీ నీకోసరమని మణిగాడి నుంచి మూడు దినాలు తప్పించుకొని తిరిగినాను. నువ్వెప్పుడైనా టయానికి కనబడితే గదా! అయినా, జరిగిపోయిన కతంతా ఇప్పుడెందుకు? ఇప్పుడు జరిగేదేమైనా ఉంటే చెప్పు..."

"చెప్పేదానికేముండాది? డీలక్స్ థియేటరుకాడ ప్లాట్లు కడతా ఉండాము. ఆరేడు నెలల పని. చానామంది కూలోళ్లు గావాల్ల. నువ్వేమో భారీ పనులకు పనికిరావు. ఇదేమో పసిబిడ్డ తల్లి..." అంటూ ముందు కడుగేసి, "ఈ పిల్లకేమైనా మూగా? మాటలు రావా? ఏం పిల్లా, నీ పేరేంది?" అని అడిగాడు అతను.

రంగమ్మ అతడికీ, రాజీకి మధ్యలోకొచ్చి నిల్చుంటూ, "బంగారంగా మాటలొచ్చు. ముందు పనిస్తావో లేదో అది తేల్చు," అంది.

కుప్పుస్వామి కళ్లెగరేసి అదోలా నవ్వుతూ, "ఆత్రం వద్దు. ముందు కొంచెం నదురుగా ఉండేటోళ్లని పనిలోకి చేర్చుకోనీ. సందుజూసి మిమ్మల్ని గూడా దూర్చేస్తాను. మల్లా వస్తాలే!" అంటూ వెళ్లి జనంలో కలిసిపోయాడు.

మేఘాన్ని చీల్చుకుని బయటపడ్డ మొదటి సూర్యకిరణం నాలుగుకాళ్ల మండపం దగ్గర తెరపలు తెరపలుగా ఎండని సరఫరా చేసింది. రోడ్డు పక్కనున్న అంగళ్లన్నీ తెరచేశారు. సాంబ్రాణి పళ్లెరాన్ని చేతబట్టుకున్న ఫకీరు అంగళ్లన్నీ పరామర్శించి వస్తున్నాడు. ఇంకా డ్యూటీ ఎక్కని ట్రాఫిక్ పోలీసు టీ కొట్టు ముందు నిలబడి సిగరెట్టు కాలుస్తున్నాడు.

నీలిరంగు స్కూటరొకటి ముక్కు ముసలాయన ముందుకొచ్చి ఆగింది. స్కూటర్ ఆఫ్ చేసి, అలాగే సీటుపైన కూర్చుని ఓ కాలు నేలపైన ఆనించి, తారుడ్రమ్ములాంటి ఆకారమున్న వ్యక్తి చుట్టూ నిల్చున్న మనుషుల్ని పరిశీలించి చూడసాగాడు.

"ఏం పని సార్?" అని అడిగాడు ముక్కు ముసలాయన.

ఆగంతకుడు అతనివైపుకైనా చూడకుండా, "నువ్వు పనికిరావులే," అని, అద్దాలంగడి ముందున్న బేల్దారీ బక్కాయనను ఇలా రమ్మంటూ కేకేశాడు.

"సున్నంగొట్టే పని. ఈ అద్దాలంగడి అంత ఇల్లు. రెండు అంతస్తులు. రెండు దినాల్లో పని ముగించెయ్యాల. ఇంకో మనిషిని కావాలంటే పిలుచుకో..."

"ఇతరా మనుషులొద్దు సార్. నేనూ, నా కొడుకూ, మా ఆడోళ్లూ వస్తాం. రెండు దినాల్లో ముగించేస్తాం..." అన్నాడు బక్కాయన.

"మీ సంసారాన్నంతా తోలుకొస్తే నేనొప్పుకోను. వాడేనా నీ కొడుకు? ఆ చేతులు జూడు పుల్లల మాదిరుండాయి. కాళ్లు జూడు, గొల్లభామ పురుగు మాదిరుండాడు. వాడేం పని చేస్తాడు? వేరే ఇంకెవురైనా బలంగా ఉండే మనిషిని తొడుక్కొని వచ్చేటట్టయితే రా! లేకపోతే వద్దు. అన్నం పెట్టి దినానికి ముప్ఫయ్యి ఇస్తాను. రాంనగర్ పోస్టాఫీసు పక్కనే ఇల్లు..."

"నలభై అయినా ఇయ్యండి సార్. సున్నంలో పని. ఒళ్లు తినేస్తాది..."

"అదే వద్దనింది. బేరం గీరం ఒప్పుకోను. కడా మాట, ముప్ఫయి అయిదు. ఇష్టమా? కష్టమా?..."

బేల్దారీ బక్కాయన పాత డబ్బానూ, తాటిపట్టనూ చేతి కెత్తుకుని, "పద సార్. వస్తా ఉండాం," అన్నాడు.

స్కూటర్ ముందుకు దౌడు తీసింది.

"ఈడనే కూర్చోనుండే రాజీ! ఆ కుప్పుసామెట్ల పొయినాడో చూసుకోనొస్తాను," అంటూ రంగమ్మ అక్కడి నుంచి బయల్దేరింది.

నాలుగు రోడ్లకూడలిలో ఎర్రరంగు రోడ్డు చేతబట్టుకుని ట్రాఫిక్ పోలీసు విన్యాసాలు ప్రారంభించేశాడు. బైరాగిపట్టెడలో ఇల్లు మోల్డింగ్ పనికోసం మేస్త్రీ ఒకతను కూలీలతో బేరం సాగిస్తున్నాడు. చూడగానే ఆఫీసరుకొడుకులా కనిపిస్తున్న యువకుడొకడు వాళ్లింటి చుట్టూ

అడవిలా పెరిగిన పిచ్చిమొక్కల్ని నరికి చదరం చేయగల భుజ బలశాలి కోసం వెతుకుతున్నాడు. డబ్బాలను, తాటిపట్టలను నేలపైన పెట్టి చుట్టూ కూర్చున్న అయిదారుమంది నడివయసు మగవాళ్లు బీడీ పొగలతో పార్టీల ఆగమనం కోసం ఆవాహన చేస్తున్నట్టు కనిపిస్తున్నారు. బాగా గడ్డం పెరిగిన బక్కపలచని వ్యక్తి స్మశానంలో గొయ్యి తవ్వే మనుషులెవరైనా దొరుకుతారా అని విచారిస్తున్నాడు. నోల్ల నిండా వక్కాకు దట్టించిన ఆడవాళ్ల గుంపు వెదురుబుట్టలనీ, పాత తలగుడ్డ లనీ సర్దుకుంటున్నారు. హనుమంతుడి గుడికి ఉత్తరవైపున వరుసగా నిల్చున్న మగవాళ్లు దారినపోయే వ్యక్తినల్లా పార్టీ ఏమోనని తరచి చూస్తున్నారు. బోరింగు పంపు దగ్గర ఖాళీ అయి పోయిన టీ గుండా అవీ కడుగుతున్నాడు దయాళ్.

బోరింగు పంపు కటువైపున కూలీలతో మంతనాలాడుతూ కనిపించాడు కుప్పుస్వామి. వాళ్ల దగ్గరినుంచి వైదొలగి రంగమ్మతో మాట్లాడడానికి అరగంట పట్టింది. అతడికి అనవసరపు విషయాలు మాట్లాడడానికి తీరిక లేదన్నట్టుగా, ''ఇప్పుడు చెప్పు, ఎవురా పిల్ల?'' అని ప్రశ్నించాడు కుప్పుస్వామి.

''చూసినావు గదా! మంచి వయసులో ఉండే పిల్ల. ఏడేడ కండపట్టి ఉంటే బాగుంటాదో దాన్ని చూసే తెలుసుకోవాల. వారందినాలు కొంచెం చూసీ చూడనట్టుగా ఉన్నావనుకో. మరింక దాని కష్టం పైనే బతికిపోతింది. ఇంకొకరి కష్టం పైన బతికే జన్మంగాదు...''

''ఆ సంగతులు కాదు. ఏ ఊరి నుంచి వచ్చింది? ఎందుకొచ్చింది? మొగుడుండాడా? ఎట్లాంటి కేసు? పోలీసోళ్లు ఎతుక్కుంటా వస్తే నా గతేమయ్యేట్టు?''

''అయ్యయ్యో! అట్లాంటి పిల్లను నీ దగ్గరికి తొడుక్కొస్తానా, నేను? ఈ రాజీ ఉండాదే, అది లోమనిషి. ఇట్లా అని నోరు విప్పి చెప్పలేదనుకో కానీ, నేను వొదిలిపెట్టకుండా కాళ్లావేళ్లాబడి కొన్ని సంగతులు తెలిసికుంటిని. వచ్చిందేమో పడమటి పక్క నుంచి. బురకాయలకోట పక్కనేదో ఊరు. వాళ్ల కుటుంబమంతా అందురిమాదిరే వానల్లేకుండా పైర్లెండబెట్టుకునే తావు నించే ఈ ఊరికొచ్చినారు. ఆడాఈడా పని చేసుకుంటూ ఉండంగానే ఆడెవుడో దీనికి తగిలినాడు. నమ్మింది. వానికంతకు ముందే పెండ్లీ పెటాకులూ జరిగినాయని తెలిసింది. తల్లీదండ్రీ తన్ని తరిమేశారు. ఇంకో దోవ లేక ఆ బొగోడినే నమ్ముకొనింది. తీరా తీర్థమాడినాక ఆస్పత్రిలో దొంగ ల్దోలేసి వాడు ఈ ఊరి నుంచే మకామెత్తేసినాడు. ఏదయినా ఒక దోవ చేపిస్తే పుణ్యమైనా వస్తాదని నేను పాకులాడతా ఉండాను.''

కుప్పుస్వామి ముందుకు నడుస్తూ, ''ఏమే రంగమ్మా! నీ మాటలు వింటాంటే అయ్యో పాపమనే ఉండాది. కానీ, నెలల తరబడీ బాలింతరాల్ని కుచ్చోబెట్టి పోషణ చేసే శక్తి నాకు లేదు,'' అన్నాడు.

ఇద్దరూ రాజీ కూర్చున్న చోటుకొచ్చారు.

కుప్పుస్వామి రాజీవైపుకైనా చూడకుండా బేల్దారీ బక్కాయన పెళ్లాన్ని కేకేసి, ''ఇల్లు కట్టే పని. ఒళ్లు దగ్గిర పెట్టుకోని బయింగా పనిచేస్తే నాలుగు నెలలు ఆడ్నే ఉండచ్చు...'' అని ముక్తసరిగా తన కొటేషను వివరించాడు.

నాసిరకం రబ్బరుబొమ్మలా కనిపిస్తున్న బక్కాయన పెళ్లాం తెచ్చిపెట్టుకున్న ఉత్సాహంతో, ''మా ఇంటాయన బేల్దారీ పనిలో పడి లేచినోడు. కొంచెం ముందు రాకపోతివి గదన్నా! ఎవురో సున్నం కొట్టేదానికి మనిషి కావాలని తొడుక్కొనిపాయినారు. ఇంటి పనంటే మాకొకరు చెప్పాల్సిన పనేలేదు. నాకూ, నా కొడుక్కూ ఆ పనంటేనే ప్రాణం లేచొస్తుంది...'' అంది.

''సరే పద. అందురూ రైల్వేస్టేషను గేటు ముందుకు చేరండి. చానా దినాల పని. కూలీ అట్నో ఇట్నో చూసుకొని ఇస్తాను...''

కుప్పుస్వామి ముందుకు పరిగెత్తుకొచ్చి, ''మా సంగతి అయిసా పయిసా తేల్చనేలేదు,'' అంది రంగమ్మ.

''ఉండు రంగమ్మా! లేడికి లేచిందే పరుగంటే ఎట్ల? నన్ను కొంచెం గుక్క తిప్పుకోనీ...'' అంటూ వెళ్లిపోయాడు కుప్పుస్వామి.

ఎండ బాగా ఎక్కువవడంతో కచేరీ ముందు మూరెడు పొడవు నీడ మాత్రమే మిగిలి ఉంది. ఆ నీడలోనే ముడుక్కుని కూర్చుంది రాజీ. ఆమె ఒడిలోని బిడ్డ పాలు తాగుతూనే ఉంది. ముఖం పైన పడుతున్న ఎండకడ్డంగా అరిచేయి అడ్డు పెట్టుకుని ముక్కు ముసలాయన కూర్చుని ఉన్నాడు. పార్టీలతో బేరాలు కుదిరించుకున్న కూలీలు తమ తమ గమ్యాలకేసి సాగిపో తున్నారు. టౌను బస్సుల కోసం ఎదురుచూసే మధ్యతరగతి మనుషుల సంరంభం పెరగసాగింది. అంగళ్లలో బేరసారాలు ఊపందుకున్నాయి. ఇస్త్రీ మడతలు నలగని బట్టలతో తిరిగే మనుషుల శాతం పెరగసాగింది. మధ్య మధ్య అక్కడక్కడా ఇంకా పనులకోసం ఎదురుచూస్తున్న కూలీలు ఎరువు అందని ప్రదేశాల్లో సక్రమంగా పెరగని పైరు మల్లే వెలవెలబోతూ కనిపిస్తున్నారు.

తానూ వెళ్లి, అద్దాల అంగడి పక్క మిగిలిన జానెడు నీడలో కుదించుకుని కూర్చున్న తర్వాత, ''ఉపాతం మొగోడు... గుక్క తిప్పుకోవాలంట. ఏంది వీడు ఆలోచన చేసేది? ముండ మోపి ముండాకొడుకు... మొగాన మీసాలుంటే సరా?'' అని నోటికొచ్చిన తిట్లు తిట్టసాగింది రంగమ్మ.

రాజీ ముఖమైనా ఆవిడకేసి తిప్పలేదు. ముక్కుముసలాయన కచేరీ పక్కన గోడకుర్చీ వేస్తున్నాడు.

ఎవరు వినకపోయినా పర్వాలేదన్నట్టుగా స్వగతంలో గొణుక్కోసాగింది రంగమ్మ. ''ఇవరా లనేవి ఈ ముచ్చుమొగానికి వక్కాకు పెట్టి చెప్పాల్నా? పుట్టిన ఊర్నీ, అయినోళ్లనూ వొదిలి పెట్టి వీడీ టౌను కెందుకొచ్చినాడో గవనంలో పెట్టుకున్నాడా అని? ఇనేదానికి రంజుగా ఉండేట్టుగా కానమ్మ కథో, శరాబందిరాజు కథో చెప్పాల్నా వీని మొగానికి? పైగుడ్డ భుజానేసుకోని, కడుపు చేత్తో పట్టుకోని ఊరుగాని ఊరికొచ్చి నోళ్లకు ఇవరాలెక్కడ నుంచి తెచ్చిపెట్టేది నేను? వానికి మాదిరిగా నాకు సరిగ్గా రాత రాయలేదు కాబట్టి, ఇట్లా నేను అగోరిస్తా ఉండానని చెప్పాల్నా? నా రాతా ఈ పిల్ల రాతా ఒకటేరా అంటే అర్థంగాదే ఎదవనాయాలుకు! సాక్షికం చెప్పేదానికి కట్టుకున్నోడ్నీ, కన్నవాళ్లనూ ఎక్కడినుంచి తెచ్చేది నేను?''

నాలుగుకాళ్ల మండపం దగ్గర మిగిలిన కూలీలు ఇక ఈరోజుకు కూలీపనులు దొరకవని నిర్ణయించేసుకున్నారు. పెన్నిధిలా దాచిపెట్టిన పాత గోతాల్ని భుజాల నేసుకుని కొందరు పాత కాగితాల కోసమూ, పాడైపోయిన ప్లాస్టిక్ వస్తువుల కోసమూ దిబ్బల్నీ, మురికికాలవలనీ గాలించుతూ ఊరిలోకెళ్లిపోయారు. ఇద్దరు ముగ్గురు ముసలి కూలీలు పాత ఇనపపెనాలతో మురికికాలవలలోని ఇసుకను గాలించి లోహాల్ని వెలికి తీయడం కోసం పయనమైపోయారు. ముక్కుముసలాయన జేబులోని చిల్లర డబ్బుల్ని లెక్కపెట్టుకున్న తర్వాత పాత చెప్పుల్ని కొంటానని ప్రకటించుకుంటూ బయల్దేరేశాడు. నామాలాయన కావడి భుజానికెత్తుకుని హరోంహరమని భిక్షాటనకు పూనుకున్నాడు.

ఇంతలో బేల్దారీ బక్కాయన పెళ్లాం, పనేదో మరచిపోయి వెళ్లినదానిమల్లే నాలుగుకాళ్ల మండపం దగ్గరికి వచ్చింది.

''ఏం వదినా? కుప్పుసామి నిన్ను గూడా దొంగల్లోలేసినాడా?'' అంది రంగమ్మ. బక్కాయన పెళ్లాం రంగమ్మకేమీ సమాధానం చెప్పకుండా రాజీ దగ్గరికెళ్లి పక్కనే కూర్చుంది. రంగమ్మ

కళ్లు పెద్దవి చేసుకుని సంగతేమో తెలుసుకోవడం కోసం చెవులు రిక్కించింది. బక్కాయన పెళ్లాం రాజీ చెవుల్లో గుసగుసలాడసాగింది.

ఏదో జరగబోతోందన్న విషయాన్ని రంగమ్మ పసిగట్టేసింది. పైకి లేచి, "ఒసే నా సవితీ! అక్కడ గుణగుణలేందే? చెప్పు ఆ మేస్త్రీగాడు ఏం చెప్పంపినాడు నీతో? ధయిర్నం ఉంటే నాతో చెప్పే ముందు?" అంటూ రొప్పసాగింది.

నీతో నాకు పనేమిలెమ్మన్నట్టుగా బక్కాయన పెళ్లాం తాపీగా తన హితబోధను పూర్తిగావించి పైకి లేచి నిల్చుంది.

రంగమ్మ కోపంగా బక్కాయన పెళ్లాం చేతులు గట్టిగా పట్టుకుని, "చెప్పే దొంగముఖం దానా! ఏం వర్తమానం మోసుకొచ్చినావే బేవర్సా?" అంటూ ఊపి పారేసింది.

బక్కాయన పెళ్లాం విసురుగా రంగమ్మనోసారి వెనక్కు తోసింది. మొదలు నరికిన మానులా రంగమ్మ వెనక్కు విరుచుకుపోయింది. "నీకు చెప్పేదానికి నాకు బయమేందే లంఖిణీ! నీ గుంతనక్క బుద్ధి నాకు తెలవదా? ఎట్లయినా ఈ బిడ్డను పనిలో పెట్టి, దాని ప్రాపకంలో ఆడుండే పుల్ల ఈడెయ్యకుండా బతకాలని నీ ఎత్తు. ఇంకో మనిషి కష్టంపైన బతకాలంటే ఎవుడొప్పుకుంటాడే బాడ్‌కోవ్. ఒంటిగా, నిన్ను దొంగల్దోలేసి, పనిలోకి వచ్చేటట్టయితే రమ్మనమని మేస్త్రీ రాజీకి చెప్పమన్నాడు. ఈ పిల్ల కొంగు పట్టుకోని నువ్వాపక్కకు అడుగు పెట్టినావంటే నీ మక్కెలిరిచేస్తానని నీకు చెప్పమన్నాడు. ఆ సంగతి గవనంలో బెట్టుకో నువ్వు," చెబుతూనే బక్కాయన పెళ్లాం రైల్వేస్టేషను వైపుకు పరుగే నడకగా దూసుకెళ్లిపోయింది.

రంగమ్మ పైకి లేచి, చేతులోసారి తిప్పి చూసుకుంది. మోచేతుల పైన రక్తపు డాగులు కనిపించాయి. "రాక్షసిముండ. ఎంత పనిచేసిందో చూసినావా రాజీ! మూడు దినాలుగా కన్నబిడ్డ మాదిరిగా కాపెట్టుకోనుండానే నిన్ను. మనిద్దరి మధ్యా కొరివి పెట్టాలని చూసిందే బక్కాయన పెండ్లాం. న్యాయమేనా? కాకిపిల్లకు పెట్టినట్టుగా నా తిండి నీకు పెట్టి కాపాడినానే నిన్ను. నువ్వా సంగతి మరిచిపోతావని మేస్త్రీ ముండాకొడుకనుకుంటా ఉండాడు. ఆ మాయదారిదాని మాట వినద్దు నువ్వు..." రాజీ ధోరణెలా ఉందో తెలుసుకోవడం కోసం రంగమ్మ ఆగింది. తాను మట్టిలో పడి దొర్లుతున్నా పట్టించుకోకుండా, రాయిలా కూర్చున్న రాజీ పైన చెప్పలేనంత కోపం వచ్చిం దామెకు. పళ్లు పటపటలాడిస్తూ కోపాన్ని అణుచుకుని, "నువ్వేమీ బయపడద్దు తల్లా," అంటూ మళ్లీ మొదలుపెట్టింది ఆమె. "ఆ పోరంబోకు మేస్త్రీగాడు కాదంటే మనకు పోయిందేమీ లేదు. అందురూ ఈమాదిరి మిడిమాళం మనుషులే ఉంటారా? నువ్వట్ల కుచ్చోనుండు. మిగిలిన కతంతా నేను చూసుకుంటాను. నన్ను నమ్మి చెడిన మనిషి ఈ ఇలాకాలో లేదు. మేలు చేసినోళ్లను మరవదు. దేవుడు నీకు మేలు చేస్తాడు."

పాపాయిని పాతగుడ్డలతో బాటు ఒళ్లో కెత్తుకుని, రాజీ పైకి లేచి రెండడుగులు ముందుకు వేసింది. రంగమ్మ కంగారుగా పైకి లేచి రాజీ భుజాన్ని గట్టిగా పట్టుకొంది. "ఆ పాపిష్టిముండ మాటలు నమ్మద్దు రాజీ! వాని సంగతి నీకు తెలియదు. చూసేదానికి అట్టా కనబడతాడుగానీ, వాడు పెద్ద కిలాడీ. వాని దెబ్బకు తాళలేక పెండ్లామే, ఎవుడితోనో లేచిపోయింది. వాన్ని నమ్ముకున్నోళ్లంతా అర్థాంతరంలోనే గంగలో కలిసిపోయినారు. ఆపక్కకు పోయినావంటే నిన్ను కాపెట్టుకోనుండే దిక్కుండదు. నేనాపక్కకు రాను. ఆ కసాయోడు చెప్పిన మాట ఇనలేదని కన్నతల్లినే నడుం విరిచేసినాడని అందరూ చెప్పుకుంటా ఉంటే ఇన్నాన్నేను..." కాస్సేపు మెల్లగా పెనుగులాడిన తరువాత, విసుగ్గా కుడిచేత్తో రంగమ్మను వెనక్కు తోసేసింది రాజీ. ఆమె కచేరీ గోడపైకి

విసురుకు పోయి పడింది. రాజీ తిరిగయినా చూడకుండా రైల్వేస్టేషను వైపు విసవిసా నడిచి పోసాగింది.

"పోపోయే కంంతిరీముండా! నా దుడ్డు తిని నాకే టోకరా ఇస్తే నిన్ను పైనుండే వాడు ఊరికే వొదిలిపెట్టడు. నా ఋణంలోనే పోతావు. ఆ మేస్త్రీ ముండాకొడుకు సున్నంలోకి ఎమిక లేకుండా ఇరిచి పారేస్తే అప్పుడు నెత్తినోరూ కొట్టుకో! నన్ను నట్టేట్లో ముంచేసిపోయినట్టు గాదు. నువ్వెట్ల బతికి బట్ట కడతావో అదీ చూస్తాను. ధూమొచ్చి నిన్నూ, నీ బిడ్డనూ ఎత్తుకోని పోకపోతే అప్పుడడుగు... నా ఉసురు ఊరికేపోదు."

కడుపులో రగులుతున్న ఆకలి ఒకవైపు, రాజీ వదిలిపెట్టి వెళ్లడంతో కలిగిన బాధ మరోవైపు ఆమెకు శరీరమంతా మండుతున్నట్టుగా తోచింది. కళ్లల్లో నీళ్లు తిరగసాగాయి. పెదవులు వణక సాగాయి.

నాలుగుకాళ్ల మండపం దగ్గర కూలీలెవరూ లేరు. రంగమ్మకు గోడు వినే నాథుడెవడూ కనిపించలేదు.

కూడలిలో ఎర్రబోర్డు పట్టుకుని నిల్చున్న పోలీసు ఆ క్షణంలో ఆపద్బాంధవుడిలా కనిపించా డామెకు. నాలుగువైపులా దూసుకెళ్తున్న వాహనాల మధ్యలోంచి పడుతూ లేస్తూ పోలీసు దగ్గరికి పరిగెత్తింది ఆమె. "చూడు సా! నా దుడ్డు తినేసి చక్కాపోతా ఉంది. నా దుడ్డు ఇచ్చేసి ఎట్లయినా పొమ్మను. నా దుడ్డు నాకిమ్మను సా!" అంటూ అతడి కాళ్లు రెండూ వాటేసుకుంది.

చేస్తున్న పనిని కాస్సేపు ఆపి, ఆమె చేతుల్లోంచి తన కాళ్లను దూరంగా లాక్కోవడానికి ప్రయత్నించాడు పోలీసు. అతను సిగ్నల్ చూపెట్టకపోవడంతో బస్సులూ కార్లూ కొంప మునిగి పోయినట్లుగా హారన్లు మోగించసాగాయి.

కోపంతో పోలీసు ఎర్రరంగు బోర్డుతో రంగమ్మ నెత్తి పైన రెండు తగిలించి రోడ్డు పైన్నుంచి ఒక తోపు తోశాడు.

ఆమె మురికికాలువ గట్టుపైన మూటలా పడింది. శరీరమంతా బురద గొట్టుకుపోయింది. తల దిమ్మ తిరిగిపోయింది. భయంతో వణికిపోతూ బైర్లు కమ్మడానికి సిద్ధంగా ఉన్న కళ్లతో చుట్టూ తిరిగి చూసింది.

కచేరీ ముందు కాలేజీ అమ్మాయిల గుంపు టౌనుబస్సు కోసం ఎదురుచూస్తోంది. ట్రాఫిక్ పోలీసు వినయంగా బోర్డు చూపెడుతుండగా ఎర్రరంగు మారుతికారు రీవిగా ముందుకు పరిగెడు తోంది. ఒకదానివెంట ఒకటిగా టౌను బస్సులు కవాతు చేస్తున్నాయి. ఆఫీసుకెళ్లే ఉద్యోగులతో రోడ్డు కిక్కిరిసిపోయి ఉంది.

మూడుగంటల క్రితం రంగు వెలిసిన నీటిరంగుల చిత్రంలా వెలవెలబోయిన ఆ దృశ్యం ఇప్పుడు ఆయిల్ పెయింటింగులా మెరిసిపోతోంది. ఆ వర్ణచిత్రంలో దిష్టిబొమ్మలాంటి తనకు స్థానంలేదని రంగమ్మకు అర్థమైపోయింది.

కాళ్లెక్కడికి తీసుకెళ్తున్నాయో తెలియకపోయినా, అసురుసురని గసలు బోసుకుంటూ నాలుగుకాళ్ల మండపం దగ్గిరి నుంచి వీలయినంత దూరంగా పారిపోవడం కోసం పడుతూ లేస్తూ పడుతూ లేస్తూ పరుగే నడకగా సాగిపోయింది రంగమ్మ.

*ఇండియా టుడే*
*6-20 ఏప్రిల్ 1993*

నేపథ్యం

బతుకు పోరాట నాటకం

# నాలుగుకాళ్ల మండపం

***ఇండ్లు కట్టాలి, బేల్దారీ పనివాళ్ళు కావాలి. ఇండ్లకు సున్నం గొట్టాలి. కూలీలు కావాలి. బరువులు మోయాలి. మనుషులు కావాలి. రకరకాల మనుషులు అవసరమైనప్పుడల్లా, తిరుపతిలో అన్నిచోట్లా అందరూ, 'నాలుగుకాళ్ళ మంటపందాకా వెళ్ళి రాకూడదూ?' అనుకొంటూ ఉంటారు. రైల్వేస్టేషన్ నుంచీ కపిలతీర్థం వెళ్ళే రోడ్డును గాంధీ రోడ్డు భేటీ వేసిన కేంద్రానికి నాలుగు కాళ్ళ మండపమని పేరు.***

తిరుపతి ఊరు చేరుకోవడానికి ముందే, పది పదిహేను కిలోమీటర్ల దూరం నుంచీ అందంగా ఆకర్షిస్తూ సాగే కొండలూ, ఎప్పుడూ ఉత్సాహంతో హుషారుగా విచ్చేసే యాత్రికులతో కిటకిటలాడే రైల్వేస్టేషన్లూ, బస్టాండులూ, హోటళ్ళూ, గుళ్ళూ, గోపురాలూ, రకరకాల వ్యాపారాలతో జీవనోత్సాహానికంతా కేంద్రాల్లా తళతళలాడే అంగళ్ళూ, బతుకంటే వినోదయాత్రే గదా- అన్నట్టుగా దేన్నీ సరకు చేయకుండా కులాసాగా తిరిగే కాలేజీ కుర్రాళ్ళూ, మానవుల పట్టుదలకూ, శక్తియుక్తులకూ ప్రత్యక్ష సాక్ష్యాలుగా కనిపించే పెద్ద పెద్ద కాలేజీ భవనాలూ, ఆస్పత్రులూ, ఆకాశాన్నందు కోవాలన్న ఆదర్శాన్ని నిజం చేసుకొన్నట్టుగా కనిపించే శేషాచలం కొండల కేన్వాసుపైన సుఖసంతోషాలూ, నాగరికతా సంస్కృతులూ, ఉత్సాహోల్లాసాలూ, ఆదర్శం అనే వెలుగులు విరజిమ్మే ఆయిల్ రంగులతో చిత్రించిన అత్యద్భుత చిత్రం తిరుపతి. అప్పుడే పూచిన పువ్వంత అందంగా, రిజర్వు బ్యాంకు నుంచి విడుదలైన కొత్తనోటులా దర్పంగా, ఎత్తయిన కొండపేట నుంచీ విరుచుకుపడే జలపాతంలా తెగువతో, దేన్నయినా సరకు చేయ నన్నంత ధీమాతో తిరుపతి జనాల్ని ఆకర్షిస్తూనే ఉంది.

చాలారోజుల క్రితం నేను పదవ తరగతి పాసవుతూనే కాలేజీకే ఊరికెళ్ళాలన్న ప్రశ్న తలెత్తింది. మా జిల్లాలో మాకు అందుబాటులో అప్పుడు చిత్తూరులోనూ,

తిరుపతి లోనూ మాత్రమే జూనియర్ కాలేజీలున్నాయి. రెండు చోట్లకూ అప్లయ్ చేశాను. కానీ చిత్తూరులో సీటొచ్చేస్తుందేమోనన్న భయమూ, తిరుపతిని చేరుకోలేకపోతానేమోనన్న ఆత్రుతా నన్ను ఆవరిం చాయి. చివరికి తిరుపతి కాలేజీలో చేరుతున్నప్పుడు ఎంతో సంబరపడిపోయాను.

గత పాతికేళ్ళలో తిరుపతి అయిదారింతలుగా పెరిగిపోయింది. జనసందోహాలూ, భవన సమూహాలూ, కోలాహలమూ పెరిగాయి. కానీ ఈ కోలాహలమనే తెర వెనుక, ఈ భవనాల పునాదుల్లో, ఈ రంగురంగుల తళుకుబెళుకుల కింద, భయంకరమైన బీభత్సమైన ప్రపంచమొకటి దాగుందని తెలుసుకోవడానికి చాలాకాలం పట్టలేదు. రైల్లో, బస్సో దిగి ఊళ్ళోకి వచ్చీరాక ముందే, గువ్వ తొక్కిన టెంకాయలా విచిత్రమైన ఆకారమున్న వ్యక్తి, గాజుకళ్ళతో శూన్యపు దృక్కుల్ని నిగుడిస్తూ, 'అమ్మాయిలుండారు సార్! కాలేజీ పిల్లలు. కావాల్నా?' అని అడుగుతాడు. చినిగిన గుడ్డలతో, విరిగిన కాలుతో, ఆస్పత్రి నుంచి తప్పించుకొచ్చిన రోగిలాంటి రిక్షావాలా పక్క వీధికి పాతిక రూపాయలు వసూలు చేస్తాడు. సినిమా థియేటర్ల ముందు చొక్కా నిక్కర్లయినా సరిగ్గా లేని పాలుగారు పసివాళ్ళు బ్లాకులో టికెట్లమ్ముతారు. రైల్వే షెడ్ల చుట్టూ, బస్టాండు గోడల చుట్టూ, పాడుబడ్డ భవనాల చుట్టూ, ఎక్కడపడితే అక్కడ అలగాజనం ఏం దొరుకుతుందా అని మిర్రి మిర్రి చూస్తుంటారు. డ్రైనేజీ కాలవల మాలిన్యాన్ని పెనాలతో దేవుతూ మట్టిగొట్టుకుపోయిన మనుషులు లోహాలకోసం గాలిస్తుంటారు. నొక్కులు పడ్డ సత్తుగిన్నెల్లాంటి వ్యక్తులు ఇండ్ల ముందు నిలబడి భిక్షం కోసం గొంతు చించుకొంటూ ఉంటారు. పాత సీసాలూ, విరిగిన ప్లాస్టిక్ డబ్బాలూ కొంటామంటూ కొందరు వీథుల్లో నీడల్లా నడయాడతారు. 'కక్కుసు కడగతాను సార్,' అంటూ చింపిరి జుట్టు పిల్లాడొకడు డబ్బాలు చేత బట్టుకొని ఆశగా చూపులు నిగుడిస్తాడు. నాగరికత అనే తెర తొలగ్గానే చీకటి అనే స్టేజీపైన బతుకు పోరాటం అనే నాటకం నిరంతరాయంగా సాగుతూ దర్శనమిస్తుంది.

ఈ సామాజిక దురాగతానికి నేపథ్యంగా మరో బీభత్సరస ప్రధానమైన తుపాను చెలరేగు తూనే ఉంటుంది. పలుకుబడి ఉండేవాళ్ళు చెరువుల్నీ శ్మశానాల్నీ సైతం ఆక్రమించుకొంటూ ఉంటారు. బలముండేవాళ్ళు బాహాటంగా దొమ్మీలూ, దోపిడీలూ జరుపుతూ ఉంటారు. కులం పేరుతో, మతం పేరుతో స్వాహాస్వాములు దొరికినదంతా దిగమింగుతూ ఉంటారు. ఆరునెలల కోసారి కాంట్రాక్టర్ల కోసమే పాడయ్యే రోడ్లకు మరమ్మత్తులు జరుగుతూనే ఉంటాయి. రాయచోటి లో, జమ్మలమడుగులో, కలిగిరిలో, పీలేరులో, చుట్టుపక్కల గ్రామాల్లోనంతా కరువులొస్తాయి. పంటలు పండవు. బక్కరైతులు పొట్ట చేతబట్టుకొని, శ్రమనైనా అమ్ముకొని బతుకుదామని టౌన్ల కెగబడతారు. పల్లెటూళ్ళు ఎడారులవుతాయి. నగరాలు కిటకిటలాడతాయి. ఊరనే చీరకు అంచుల్లా గుడిసెల స్లమ్స్ వ్యాపిస్తాయి. కొన్నేళ్ళ తర్వాత అక్కడగూడా భూముల్ని ధనవంతులు కొని భవనాలు కట్టేస్తారు. గుడిసెలు మరికాస్త దూరానికి పాకుతాయి. ఈ విస్తరణకు అంతం ఉండదు. నగరాలన్నీ శ్రామికులనే చీమలు పెట్టిన పుట్టలే! అందులో నివసించేది మాత్రం వాళ్ళు కాదు.

ఇండ్లు కట్టాలి, బేల్దారీ పనివాళ్ళు కావాలి. ఇండ్లకు సున్నం గొట్టాలి. కూలీలు కావాలి. బరువులు మోయాలి. మనుషులు కావాలి. రకరకాల మనుషులు అవసరమైనప్పుడల్లా, తిరుపతిలో అన్నిచోట్లా అందరూ, 'నాలుగుకాళ్ళ మంటపందాకా వెళ్ళి రాకూడదూ?' అనుకొంటూ ఉంటారు. రైల్వేస్టేషన్ నుంచీ కపిలతీర్థం వెళ్ళే రోడ్డును గాంధీ రోడ్డు భేటీ వేసిన కేంద్రానికి నాలుగు కాళ్ళ మండపమని పేరు. బహుశా అప్పుడెప్పుడో అక్కడొక మండపముండి ఉండొచ్చు. దానికి దగ్గర్లోనే ఒకప్పుడు కూరగాయల మార్కెట్టు కూడా ఉండేది. ఉదయాన్నే ప్రయాణాలు చేయవలసి

వచ్చినప్పుడూ, మార్కెట్టుకు తెల్లవారి సమయంలో వెళ్ళినప్పుడూ నాలుగుకాళ్ళ మండపం చాలాసార్లు చూశాను. కానీ మొదటిసారి చూసినప్పుడు కలిగిన అనుభవం మాత్రం మరచిపోలేను. ఓ ఉదయాన నిద్రకళ్ళతో ఆచోటి కెళ్ళినప్పుడు నాకక్కడ కనిపించిన దృశ్యం ఒక నిలువెత్తు జీవన పోరాట సంరంభం.

పాత రేకుల డబ్బాల్లో నలగ్గొట్టిన తాటిపట్టల బ్రష్‌లు వేసుకొని సున్నాలుగొట్టే పనుల కోసం ఎదురుచూసేవాళ్ళూ, బేల్దారీ కూలీలూ, రోడ్డు పనిచేసే మనుషులూ, ఆడామగా తేడా లేకుండా, చిన్నాపెద్దా తారతమ్యాలు లేకుండా శరీరంలోని శ్రమే పెట్టుబడిగా, తమ శ్రమల్ని తామే అమ్ముకొనే ఆరాటాల సమూహమది. అది శ్రమల బజారు. ఇక్కడ డిమాండు కంటే సప్లై ఎక్కువ. కాబట్టి కొనేవాళ్ళదే పైచేయి. గుడ్డా గూడూ లేనివాళ్ళు. తిండికోసం తమ దగ్గరుండే ఒకే ఒక వస్తువు- శ్రమను- అమ్ముకొంటారిక్కడ. శరీరాల బేరాలు జరుగుతాయక్కడ. తమకు తామే వాళ్ళు పోటీదార్లుగా తయారవుతారు. కొందరు గెలిచామనుకొంటారు. నిజానికి ఆ పోరాటంలో వాళ్ళెప్పుడూ పరాజితులే!

తర్వాత చాలాసార్లు నాలుగుకాళ్ళ మంటపం దగ్గరికి వెళ్ళవలసి వచ్చింది. వెళ్ళినప్పుడల్లా నాకు రకరకాల బేరసారాలు కనిపించాయి. తెల్లవారుజామున నాలుగైదు గంటల ప్రాంతంలో మొదలయ్యే ఈ శ్రమల మార్కెట్టు ఉదయం పదిగంటలదాకా సాగుతుంది. ఆ తరువాత సైతం శ్రమను అమ్ముకోవడానికి సిద్ధమయ్యే మనుషులుండనే ఉంటారు. కానీ పూర్తిరోజంతా ఉప యోగించుకోవలసిన శ్రమశక్తిని కొద్ది గంటలు తక్కువైనా కొనడానికి సిద్ధపడేవాళ్ళుండరు. అందరికీ కష్టమైన పనులకు తట్టుకోగలిగే బలమైన శ్రమల యంత్రాలే కావాలి. కానీ ఈ జనాల్లో రోగిష్టివాళ్ళూ, బలహీనులూ, పిల్లలూ, ఆడవాళ్ళూ, ముసలివాళ్ళూ ఎక్కువగా ఉంటారు. వుడుబోతుకాయల్లా, జల్లుగింజల్లా, కడబడిన దినుసుల్లా వాళ్ళెప్పుడూ దారితెలియక గుక్కిళ్ళు మింగుతూనే ఉంటారు.

ఓనాటి తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమై ఉదయం పదిగంటల వరకూ జరిగే ఈ బతుకు పోరాటం కథే నాలుగుకాళ్ళ మంటపం. మనిషి ఇంకా నాలుగు కాళ్ళ జంతువుగానే ఉన్నాడనడానికి నాలుగుకాళ్ళ మంటపమే సాక్ష్యం. ఇది తిరుపతి కథ మాత్రమే కాదు. కర్నూల్లో, విజయవాడలో, మదరాసు, బెంగుళూరుల్లో, బొంబాయీ, కలకత్తాల్లో, హైదరాబాద్, ఢిల్లీల్లో జరుగుతున్న కథ గూడా ఇదే! కొండారెడ్డి బురుజూ, అలంకార్ సెంటరూ, జగదాంబా జంక్షనూ, చావులమదుం, మెజిస్టిక్ సర్కిల్, బేసిన్ బ్రిడ్జి, గేట్వే ఆఫ్ ఇండియా, టౌను హాలూ, లక్డీ కా పూల్, మొగల్ సరాయీ, పేరేదైతేనేం? జరిగేదంతా బడుగు బతుకుల శ్రమశక్తిని చవగ్గా కొనడమే గదా! పేరుకు ప్రజాస్వామ్యమే! అందరికీ సమానమైన అవకాశాలూ, భోగభాగ్యాలూ, సుఖ సంతోషాలూ ఎక్కడున్నాయి?

ఓరోజు నాలుగుకాళ్ళ మండపం జనసందోహం మధ్య బక్కచిక్కిన బ్రాహ్మణులిద్దరు కనిపించారు. పెండిండ్లకూ, దివసాలకూ వాళ్ళూ కావాలి. మానవ జీవితంలో గతితాత్త్విక భౌతిక సిద్ధాంతాల ప్రాముఖ్యతను మరవలేం. మరైతే మతం సంగతేమిటి? అది మంచిదా, చెడ్డదా అన్నది కాదు ప్రశ్న. మెటాఫిజికల్‌ను కాదనడం సాధ్యమా? మానవ జీవితాన్ని శాసించే మతం సంగతేమిటి? ఆకాశానికెగజూసే గోవిందరాజుల గుడి ఛాయలో తను దగ్గరుండే శ్రమను అమ్ముకో జూస్తున్న బ్రాహ్మణుల అస్తిత్వానికి సమాధానమేమిటి?

జీవితానికీ, సాహిత్యానికీ మధ్య చిత్రమైన సంబంధముంటుంది. అవి అప్పుడప్పుడూ ఒకదాన్నొకటి ఛాలెంజ్ చేసుకొంటూ ఉంటాయి. సాహిత్యం ఊహించలేని నిజాల్ని ప్రదర్శిస్తూ

జీవితం తనదే పై చేయంటుంది. ఏ నియమానికీ లోబడని జీవితాన్ని తన ప్రక్రియల చట్రాల్లో ఇముడుస్తూ సాహిత్యం తన గొప్పదనాన్ని నిలుపుకొంటుంది. జీవితమూ సాహిత్యమూ అప్పు డప్పుడూ స్నేహితుల్లా చెట్టపట్టాలేసుకొంటూ నడుస్తాయి. చూడగలిగే ఓపికే ఉంటే జీవితం సాహిత్యకారుడికి కావలసిన ముడిసరుకునంతా రెడీమేడ్‌గా ఇస్తుంది. నాలుగు కాళ్ళ మంటపం లోని వాతావరణమూ, పాత్రలూ, సంఘటనలూ అన్నీ వాస్తవాలే! కల్పన కసలు చోటేలేదు. మొదటిసారిగా చూసినప్పుడు కలిగిన అనుభూతి తీవ్రతనూ, ప్రతిస్పందననూ, అలజడినీ కాగితం పైన వ్యక్తీకరించడమే రచయితగా నాకు మిగిలిన పని.

నాకు తెలిసిన వాతావరణంలో నేనెరిగిన పాత్రలను ప్రవేశపెట్టడం మాత్రమే నేను చేసిన పని. తరువాత నేనేం కలగజేసుకోలేదు. పాత్రలు వాటంతటవే తమ సంఘటనల్ని తయారు చేసుకొన్నాయి. సంఘటనలు తమంతట తాముగా పాత్రల్ని రూపు దిద్దుకొన్నాయి. దిక్కుతోచక తన పాలబడిన బాలింత శరీరాన్ని అమ్మడం తప్ప మరో దారిలేని ముసలావిడ రంగమ్మ కెదురైన పాత్రలూ, బేరాలూ, గొడవలూ, తమంత తాముగా కథలోకి ప్రవేశించాయి. బతుకు పోరాటమనే జూదంలో రంగమ్మ... ఘోరంగా ఓడిపోవడంతో కథ పూర్తవుతుంది. నాలుగు కాళ్ళ మంటపం పగటివేళకు దగ్గరయ్యేకొద్దీ కూలివాళ్ళ కక్కడ చోటు దొరకదు. కార్లూ, బస్సులూ, జరుగుబాటుండే మనుషులూ, ఉద్యోగులూ, ధనవంతులూ, ట్రాఫిక్ హడావుడీ- ఆ దృశ్యం క్రమంగా మారిపోతుంది. మూడు నాలుగు గంటల క్రితం రంగు వెలిసిన నీటి రంగుల చిత్రంలా వెలవెలబోయిన ఆ దృశ్యం ఇప్పుడు ఆయిల్ పెయింటింగ్‌లా మెరిసిపోతుంది.

కథ చివర్లో తన సొత్తు తిని, తనను కాదని వెళ్ళిపోయిన బాలింత దుర్మార్గాన్ని రంగమ్మ భరించలేకపోతుంది. ఎవరితో మొరబెట్టుకోవాలో తోచక తల్లడిల్లుతున్న ఆవిడకు రోడ్డు కూడలిలో నిలబడిన ట్రాఫిక్ పోలీసు ఆపద్బాంధవుడిలా కనిపిస్తాడు. ఆమె అతడి కాళ్ళకు చుట్టుకొని మొరబెట్టుకొంటుంది. ఖరీదైన కార్లకు వినయంగా దారి చూపుతున్న పోలీసుకు చెప్పరాని కోపమొచ్చి, చేతిలోని ఎర్రరంగు బోర్డుతో రంగమ్మ నెత్తి పైన రెండు తగిలిస్తాడు. మురికి కాలవగట్టు పైన మూటలా పడి, బురదగొట్టుకుపోయి, తల దిమ్మ తిరిగినప్పుడుగానీ, ఆ వర్ణచిత్రంలో దిష్టి బొమ్మలాంటి తనకు స్థానం లేదని రంగమ్మకు అర్థంగాదు.

రంగమ్మను పోలీసలా కొట్టి తరిమేస్తాడన్న విషయం చివరి వరకూ నాకూ తెలియదు. అతనలా కొట్టి తరమడంతో నాకొక విషయం అర్థమయింది. పోలీసు రాజ్యానికి ప్రతీక. రాజ్యం ధనవంతులనూ, బలమున్నవాళ్ళనూ, తెలివైన టక్కరివాళ్ళనూ కాపాడుతుంది. బలహీనులనూ, అమాయకులనూ, దరిద్రులనూ పట్టించుకోదు. చీకటిలోకాలూ, మాఫియాగ్యాంగులూ ఇండియా లోనే గాదు, లండన్, వెనిస్, న్యూయార్కుల్లోనూ, అన్ని ముఖ్య నగరాల్లోనూ ఇదే చరిత్ర పునరావృత్త మవుతూ ఉంటుంది. *నాలుగు కాళ్ళ మండపం* అనే ప్రశ్నకు అలా నాకు సమాధానం దొరికింది. అలా ఈ కథ వాస్తవిక పరిస్థితుల వేదికగా మాత్రమే కాకుండా సత్యాన్వేషణావాహికగా కూడా నాకు తోడ్పడింది.

*1 మార్చి 1998*

26

# గెట్ పబ్లిష్డ్

## మహమ్మద్ ఖదీర్‌బాబు

ఇంతకూ - ఈ రిపోర్ట్ పబ్లిష్ అవుతుందని ఏమిటి నీకంత నమ్మకం షకీలూ?...

*

నేను షకీల్‌ని. నాకు బాగు గుర్తు. ఆ రోజు శుక్రవారం. బహుశా ఆ సంవత్సరానికి అదే ఆఖరు శుక్రవారం అనుకుంటాను. ఆఫీసులో ఉన్నాను. బండి లేదు. మధ్యాహ్నపు నమాజ్ కోసం తొందరగా మసీదుకు చేరుకోవాలి. నాకు అర్థమైంది. అప్పటికే ఆలస్యమైపోయిందని... ఇది వరకే ఇచ్చిన అజాన్ దూరం నుంచి నా హృదయాన్ని తాకుతూ ఉందని.

అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్... అష్‌హదున్ లా ఇలాహ ఇల్లల్లా.

"ఆ...టో..."


"ఎక్కడికెళ్లాలి సాబ్?"

"బంజారా హిల్స్... బడీ మసీద్."

"ఎక్కడా?"

"అదేనయ్యా... టీవీ 9 పక్కన."

"మీటర్ లేదు సాబ్. నలభై రూపాయల్ అవుతది."



*మహమ్మద్ ఖదీర్‌బాబు 1972 ఏప్రిల్ 28న నెల్లూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ పుష్పగుచ్ఛం ఆంధ్ర జ్యోతి ఆదివారం అనుబంధంలో 1995లో అచ్చయింది. రెండు కథాసంపుటాలు, దర్గామిట్ట కథలు, పోలేరమ్మ బండ కథలు, పుప్పొజాన్ కథలు, బాలీవుడ్ క్లాసిక్స్, మన్‌చాహే గీత్, వంద తెలుగు కథలను పరిచయం చేస్తూ నూరేళ్ళ తెలుగుకథ పుస్తకాలు ప్రచురించారు. సాక్షి దినపత్రికలో సీనియర్ న్యూస్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు.*

**చిరునామా**

*502, మంజీరా స్మార్ట్ హోమ్స్,*
*కుత్బుల్లాపూర్, హైదరాబాద్*
*Ph.: 97053 48198*
*khadeerbabu@yahoo.com*

"తీస్."

"లేదు సాబ్."

"తీస్ చేస్కో."

"రాదు సాబ్."

"అరె... నేను కూడా ముసల్మాన్‌నేనయ్యా. అవతల నమాజ్‌కు టైమ్ అవుతోంది."

"ఆప్ వైసా నై దిక్ తే హై సాబ్. ఎక్కండి. తర్టీ ఫైవ్ ఫైనల్."

నిజానికి ఆ రోజు హైద్రాబాద్ వాతావరణం ఎలా ఉందో నేను పెద్దగా పట్టించుకోలేదు. అయితే అది ఒక కథకు అనువుగా ఉన్న వాతావరణమని ఆ తర్వాత నాకు అర్థమైంది. ఎందుకంటే ఆ వేళ నాకు ఒక కథ పరిచయమైంది. లేదంటే నేనే ఆ కథకు.

"మసీదు వచ్చేసింది సాబ్. దిగండి."

"షుక్రియా."

"రిటర్న్ కోసం ఆగమంటారా?"

"వద్దు."

"తీస్ ఇవ్వండి చాలు."

"వద్దు."

"పచ్చీస్?"

"వెళ్లు స్వామీ."

"సలామ్ అలైకుమ్ భాయ్‌సాబ్. రండి. చెప్పులు ఇటువైపు పెట్టండి. అరె ముష్టాక్. కొంచెం లే నాయనా. భాయ్‌సాబ్ విడిచిన చెప్పులు ఇటు తీసుకునిరా. మీరు వెళ్లండి సాబ్. ఇక బేఫికర్‌గా నమాజ్‌కు వెళ్లిరండి..."

*

నేను షకీల్‌ని. ముష్టాక్‌తో నా పరిచయం బ్రివిటీతో చెప్పే పరిచయంలాంటిది కాదు. అంతకంటే ఎక్కువ. నిజంగానే చాలా ఎక్కువ. ఒక పిట్టో, ఒక పచ్చటి ఆకో, వీధిలో నడుస్తూ ఉండగా హటాత్తుగా దొర్లిపడి వచ్చే బలంతో ఆకర్షించినట్టుగా వాడు నన్ను ఆకర్షించాడు. నాతో పెనవేసుకుపోయాడు. ఇది వాడి కథ. నన్ను ఆకర్షించిన ముష్టాక్ కథ.

ముష్టాక్ నల్లబంగారం. నల్లముత్యం. వాస్తవానికి వాణ్ణొక నల్లటి ముతక రబ్బరు బంతి అనాలి. చూడటానికి ముద్దుగా ఉంటాడు. పట్టుకోవడానికి కండగా ఉంటాడు. నడుస్తుంటే దొర్లినట్టుగా ఉంటాడు. కాళ్లకూ చేతులకూ మట్టి అంటుకొని, నిక్కరు చివర నుంచి మడమ దాకా చెమట చార ఏర్పడి, ఎప్పుడు చూసినా లెక్క లేనట్టుగా ఉంటాడు. కదిలిస్తే పొగరు. క్యా సాబ్... దో రుపయ్? అని దబాయిస్తాడు. పాంచ్ రుపయ్ ఇస్తే నవ్వి సలామ్ చేస్తాడు. అప్పుడు వాడి పళ్లు తెల్లగా మెరుస్తాయి. చిగుళ్లను కరుచుకొని చమక్కుమని నవ్వుతాయి. వాడి కళ్లల్లో కరెంటు ఉంటుంది. వొంట్లో తూనీగ ఎగురుతూ ఉంటుంది. కొత్తగా కడుతున్న మసీదుగది కోసం పోసిన గులకరాళ్లు వాడి పర్మినెంట్ మకామ్. అక్కడ నిలబడి ఒక్కో రాయి తీసి హుప్ అని బలంగా గాల్లోకి విసురుతుంటాడు. అది ఊహించినంత ఎత్తుకు ఎగరకపోతే వాడికి నిరాశ. మళ్లీ తీసి, బుగ్గలు పొంగించి హుప్ అని విసురుతాడు. ఈసారి సరిగ్గా విసిరితే గర్వంగా తలఎగరేస్తాడు. చేతులు సాచి పకపకా నవ్వుతూ గుండ్రంగా తిరుగుతాడు. అయితే నమాజ్‌కు ముందు ఇమామ్‌గారి హితబోధ పూర్తయ్యే వరకే వాడి అల్లరి. ఒక్కసారి నమాజ్ మొదలయ్యాక, మసీదులో నిశ్శబ్దం

అలుముకున్నాక చుప్‌చుప్‌గా వచ్చి నేరేడుచెట్టు కింద కూర్చుంటాడు. అక్కడ అమ్మీజాన్ సేకరించిన చెప్పుల జతలన్నీ లెక్కిస్తాడు. నమాజ్ అయ్యాక, దుఆ ముగిశాక వాటికి ఎన్ని డబ్బులు వస్తాయో వేలు మడిచి అంచనా వేస్తాడు. అమ్మీ పిచ్చిది అని వాడికి అనుమానం. ఎవరైనా చిల్లర లేదని డబ్బులు ఇవ్వకుండా వెళుతూ ఉంటే- వదలొద్దు అమ్మీ... డబ్బులు అడుగు అని వెంట బడతాడు. కాని- అమ్మీ సంపాదించే దానికంటే తాను సంపాదించేదే ఎక్కువ అని వాడికి అప్పు డప్పుడు నవ్వు.

*

క్లిప్పింగ్1: సెప్టెంబర్ 19, 2008, సౌత్ ఢిల్లీ, జామియానగర్ షూట్ అవుట్:

స్థానిక బాట్లా హౌస్ ఏరియాలో నివాసం ఉంటున్న ఇద్దరు ఉగ్రవాదులను పోలీసులు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. మృతులు యూనివర్సిటీ విద్యార్థుల ముసుగులో ఉన్న ఉగ్రవాదులని ఢిల్లీ పేలుళ్లకు సూత్రధారులని వారు ప్రకటించారు. ఇటీవల సంచలనం సృష్టించిన వరుస పేలుళ్ల కేసులో ఈ ఎన్‌కౌంటర్ ఒక కీలకమైన మలుపని కూడా వారు వెల్లడించారు. అయితే ఇది నూటికి నూరు శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని జామియానగర్ వాసులు నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు పథకం ప్రకారమే అమాయకులను పట్టుకుని కాల్చి చంపారని ఇది చాలా అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు జామియామిలియా యూనివర్సిటీలో నిరసనలు మిన్నంటాయి. నిరపరాధులైన తమ సహ విద్యార్థులని కాల్చి చంపడం పిరికితనమని దమ్ముంటే అసలు నేరస్తులను పట్టుకోవాలని యూనివర్సిటీకి చెందిన హిందూ-ముస్లిం విద్యార్థులు ఆందోళన చేశారు. రోడ్ల మీదకు వచ్చి పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు.

"ఊఁ ఈ క్లిప్పింగ్‌ని ఈ రిపోర్ట్‌లో ప్రస్తావించడంలో నీ ఉద్దేశం ఏమిటి షకీల్?"

*

నేను షకీల్‌ని. మసీదులో ఉన్నాను. నమాజు ముగించి దుఆ కోసం చేతులు సాచి ఉన్నాను.

దుఆ.

యాల్లా... మా తప్పులను మన్నించు. యాల్లా... మా పొరపాట్లను క్షమించు. యాల్లా... మాకు దక్కవలసిన రొట్టెను మాకు దక్కించు. యాల్లా... మా బతుకు తెరువులో బర్కత్ ఇవ్వు. మేము నిస్సహాయులం. నీవు తప్ప వేరే దిక్కులేనివాళ్లం. కనికరించు. మా ఇళ్లలో రోగాలతో పీడితులైనవారు ఎందరో ఉన్నారు. వాళ్లకు స్వస్థత చేకూర్చు. పనిలేని బేరోజ్‌గార్‌లు మరెందరో ఉన్నారు. వాళ్లకు పని ఇవ్వు. పెళ్లిళ్లు జరగక బండశిలల వలే తండ్రుల గుండెలపై కూర్చున్న ఆడపిల్లలు లెక్కకు మించి ఉన్నారు. వాళ్లపై దయ చూపు. యాల్లా... మాకు మర్యాదతో కూడిన జీవితం ఇవ్వు. నిర్భయంగా జీవించే బతుకు ఇవ్వు. యాల్లా... మాకు ప్రార్థించడం రాదు. అడగడం కూడా రాదు. ఈ ముక్కలచెక్కల దుఆను నువ్వే కుబూల్ చేయాలి పర్‌వర్‌దిగార్.

ఆమీన్.

*

అత్తర్ నయాబ్ అని రాశావు. షేక్ అని చూశాను. సయ్యద్ అని చూశాను. పఠాన్ అని కూడా చూశాను. మీ యింటి పేరు ఏంటి? మహమ్మదా? మరి ఈ అత్తరు గొడవేంటి షకీలూ?

*

అత్తర్ నయాబ్‌ని అందరూ అత్తర్ నయాబ్ అనే పిలుస్తారు. వేరే పేరు లేదు. వేరేలా పిలిస్తే గుర్తుపట్టేవారు కూడా లేరు. అత్తర్ నయాబ్‌కు అతడి జీవితమే ఇంటిపేరుగా మారిపోయిందా అని అతడి గురించి తెలిసినప్పుడు నాకు అనిపించింది. ఇది నయాబ్ కథ. నాకు తెలిసిన అత్తర్ నయాబ్ కథ.

నలభై ఏళ్ల అత్తర్ నయాబ్‌కు ఏదీ ఔననిగాని ఏదీ కాదనిగాని నిర్ధారించి చెప్పడం రక్తంలోనే లేదు. ఏం నయాబ్... వాన వస్తుందంటావా అని అడిగితే 'నై బోల్ సక్‌తే సాబ్' అనేవాడు. నై బోల్ సక్‌తే - చెప్పలేము అనేది అతడి ఊతపదం. బుగ్గలు లోపలికి పోయి పక్క పాపిడి దువ్వుకుని డొక్కలో నుంచి వొంగినట్టుగా కనిపించే నయాబ్‌ని అందరూ గతంలో డ్రైవర్ నయాబ్ అని పిలిచేవారు. ఇప్పుడు అత్తర్ నయాబ్ అని అంటున్నారు. ఒకప్పుడు నయాబ్ పాతబస్తీ నుంచి రోజూ సిటీకి వచ్చి పెద్ద పెద్ద ఇళ్లల్లో డ్రైవర్‌గా పని చేసి వెళ్లేవాడు. చిన్న బండ్లూ... పెద్ద బండ్లూ... అన్నింటినీ తల్లి వొడిలో బిడ్డల్లా చూసుకునేవాడు. ఉద్యోగంలో చేరిన ప్రతిచోటా యజమాని పిల్లల చేత నయాబ్ మామా అని తొందరగా పిలిపించుకోగలిగేంత కలుపుగోలు మనిషి. నయాబ్‌కు పిల్లలంటే ఇష్టం. ఏమాత్రం వీలుచిక్కినా వాళ్లను చేరదీసి కథలు చెప్పేవాడు. అయితే అవన్నీ సాధారణంగా దెయ్యాల కథలు అయి ఉండేవి. కథ జరిగినంతసేపూ ఆ దెయ్యాలు మనుషుల్ని పీడించుకు తినేవి. కాని చివరకొచ్చేసరికి ఒక తాయెత్తు తెచ్చి దానితో ఆ దెయ్యాల భరతం పట్టి ఆ కథలను ముగిస్తుండేవాడు. నయాబ్ జీవితంలో ఒక కష్టం వచ్చింది. ఆ కష్టం ఏ తాయెత్తుతోనూ పోయేది కాదు. సంగతి ఏమిటంటే అతడికి డ్రైవర్ పని పోయింది. చిత్రంగా- అతడు తినే అన్నమే అతడికి పని లేకుండా చేసింది. నయాబ్‌కు రోజూ అన్నంలోకి ముక్క కావాలి. కాని ఏసి బండ్లలో, పెద్ద పెద్ద కార్లలో అతడు బండి స్టార్ట్ చేసి అద్దాలన్నీ మూశాక యజమానులు ముక్కు దగ్గర చేయి అడ్డంగా విసురుకునేవారు. ఏం నయాబ్... నువ్వా గొడ్డు మాంసం తినడం యింకా మానేయలేదా... వాసన అదిరి పోతోందయ్యా అనేవారు. కాని ఏం చేయాలి? అతడు చిన్నప్పటి నుంచి ఆ మాంసం తినే పెరిగాడు. రోజూ అయిదు రూపాయలకు పది రూపాయలకు సలీసుగా దొరికే గొడ్డుమాంసం తునకల మీదే ఆధారపడి బతికాడు. ఆ మాంసం తింటే కొందరిలో వొంటి వాసన మారుతుందని అంటారు. నయాబ్ వాసన కూడా మారింది. ఆ వాసన చూసి ఏం నయాబ్... ఉద్యోగం కావాలా... గొడ్డుమాంసం కావాలా అని యజమానులు అడిగితే ఎప్పటిలాగే నై బోల్ సక్‌తే సాబ్ అని ఊరుకునేవాడు. క్రమంగా షాకు తగిలింది. రెండు మూడు ఉద్యోగాలు పోయాయి. ఆపైన ఎవరి దగ్గరకు వెళ్లినా రెండు మూడు రోజుల్లోనే సంగతి గ్రహించి పంపించేసేవారు. భయపడిపోయాడు నయాబ్. చాలా కలవరపడిపోయాడు. అప్పటి నుంచి అతడి జేబులో ఎప్పుడు చూసినా రెండు మూడు నాసిరకం అత్తరు సీసాలు కనిపించేవి. వాటిని చీటికి మాటికి తడుముకుంటూ ఉండేవాడు. బండి ఎక్కే ముందు చాటుకుపోయి దొంగలాగా గబగబా బట్టల నిండుగా పూసుకుని వస్తుండేవాడు. కాని యజమానులు మాత్రం నయాబ్... ఈ కంపు కంటే నీ చెమట కంపే నయమయ్యా అని ఇంటికి పంపించేసేవారు. కొంతకాలానికి నయాబ్ అద్దె బండికి ఆటోడ్రైవర్ అయ్యాడు. ఖరీదైన స్టీరింగులు పట్టిన చేతులతోనే సెవన్ సీటర్ కూడా నడిపి చూశాడు. కాని- అప్పటికి అతడి మెదడులో చెమటవాసన గాఢంగా పేరుకుని పోయింది. అనుక్షణం అది అతణ్ణి వేధిస్తూ ఉండేది. దాని నుంచి తప్పించుకోవడానికి నయాబ్ చాలా సతమతమైపోయేవాడు. పిచ్చిగా అత్తరు పూసుకుంటూ ఉండేవాడు. ఆఖరుకు సీట్ల మీద కూడా చల్లేవాడు. జనం ఇదంతా చూసి జడుసుకునేవారు. తప్పుకోవడానికి చూసేవారు. రెండు మూడేళ్లు గడిచిపోయాయి. ఇప్పుడు

నయాబ్‌కు పనిలేదు. సంపాదనా లేదు. అలాగని చెమట వాసన వస్తోందని భయపడాల్సిన అవసరం కూడా లేదు. అయినప్పటికీ నయాబ్ చీటికి మాటికి అత్తరు పూసుకుంటూనే తిరుగుతున్నాడు.

*

క్లిప్పింగ్ 2: Sydney, 30th August, 2008: The Sydney Morning Herald reported that the Australia Federal Police have finally confirmed they have cleared Dr Haneef as a suspect in the terrorism attack on Glasgow airport.

అచ్చుతప్పు చూసుకోలేదా షకీల్? Australian బదులు Australia అని కంపోజ్ అయ్యింది. పెన్ ఇవ్వు. కొంప ముంచేలా ఉన్నావ్. నాకు గుర్తుంది... నువ్వు బెంగుళూరుకు వెళ్లి చేసిన హంగామా అంతా గుర్తుంది. మన స్టాఫరొకడు అక్కడ ఉన్నాడయ్యా అన్నా వినకుండా పట్టుబట్టి వెళ్లి మరీ స్పెషల్ స్టోరీలు రాశావు. డాక్టర్ హనీఫ్ భార్యను ఇంటర్వ్యూ చేసి లోకమంతా గోలగోల చేశావు. హనీఫ్‌ను అన్యాయంగా అరెస్టు చేశారని రిపోర్ట్‌లు పంపావు. అదంతా చాలదా... ఇక్కడ కూడా ఇరికించావు. ఊ. ఈ అత్తర్ నయాబ్ భార్య ఫాతిమా సంగతేమిటి?

*

మాలిక్... అల్లా ఆప్ కా భలా కరేగా మాలిక్.

ధర్మం చేయి భాయీ... ధర్మం చేయి.

దో దాలో... దస్ దాలో... అల్లా మీకు పదింతలు ఇస్తాడు జోలీ మే దాలో.

సాబ్... మా మదర్సాలో ముప్ఫయిమంది ఎతీమ్ పిల్లలు ఉన్నారు...

మాసూమ్ పిల్లలు... నాదాన్ పిల్లలు... వాళ్లకు బియ్యం లేవు... బట్టలు లేవు... కడుపు నిండా తిండి లేదు. దానం చెయ్యండి సాబ్... మీకు పుణ్యం ఉంటుంది సాబ్...

నమాజ్ అయ్యాక మసీదులో నుంచి బయటకు రావడానికి మెట్ల మీద నుంచి కిందకు దిగుతూ ఉంటే వరుసగా కనిపించే యాచకులు వీళ్లు. పాడవాటి వస్త్రాలను అటొకరు ఇటొకరుగా పట్టుకొని జోలి పరిచే మదర్సాల ప్రతినిధులు వీళ్లు. వీళ్లకు కాస్త దూరంగానే ఫాతిమా మనకు కనిపిస్తుంది. నేరేడు చెట్టు నీడలో, చుట్టూ చెప్పులు పెట్టుకొని, నల్లటి కువ్వలాగా... ఇది ఆమె కథ.

ఫాతిమాని ఎవరైనా సరే ఒక ఆకారంగా గుర్తించడం కష్టం. ఆమె గొంతే ఆమె ఆకారం. ఆమె మాటే ఆమె ఉనికి. ప్రతి శుక్రవారం మసీదులోని తెల్లటి గోడల మధ్య నల్లటి చారికలా కనిపిస్తూ ఉంటుందామె. దుమ్ము రేగిన నల్లటి బురఖా ధరించి, కళ్లు మాత్రమే కనిపించేలా నఖాబ్ కట్టి, అక్కడ ఉన్న నేరేడు చెట్టు కాండంలో ఇంచుమించుగా ఇమిడిపోయి, నూతిలో వున్న మనిషిలాగా- సలామ్ అలైకుమ్ భాయ్‌సాబ్... రండి... చెప్పులు ఇటువైపు పెట్టండి అని పిలుస్తూ ఉంటుందామె. మసీదుకు వచ్చేవాళ్లు చెప్పులు ఆమె దగ్గర విడిస్తే తిరిగి తీసుకునేటప్పుడు ఏవైనా చిల్లర డబ్బులు పడేస్తే ఆమెకు బతుకు. ఆ చిల్లర కోసమని ప్రతి శుక్రవారం నాగా పెట్టకుండా పాతబస్తీ నుంచి ఇంత దూరం వస్తూ ఉంటుందామె. మధ్యాహ్నం నమాజ్ వేళ అయ్యేవరకూ కొడుకును ఆడుకోవడానికి వదిలి, మసీదులో నీళ్లు నింపి, కసువు ఊడ్చి, అందుకు ప్రతిఫలంగా ఆ నేరేడుచెట్టు కింద చెప్పులు సేకరించేందుకు కాసింత జాగాను సంపాదించుకుంటూ ఉంటుం దామె. చాలా రోజులుగా ఆమె జీవితానికి ఆ చెప్పులే రొట్టెలు. మాసిన చెప్పులు, తెగిన చెప్పులు, పాత చెప్పులు, ఖరీదైన చెప్పులు... వాటిని కోడిలా కాచుకుంటూ ఉంటుందామె. కాని- ఆ చెప్పుల మీద వచ్చే సంపాదన ఆమెకు ఏ విధంగానూ సరిపోదు. ఉంటున్న రేకుల గదికి

కిరాయి కట్టాలి. తినడానికి బియ్యం, ఉప్పు సమకూర్చుకోవాలి. మాసిన బట్టలు ఉతికి నడుముకు చుట్టుకోవడానికి అప్పుడప్పుడైనా సరే బట్టల సబ్బు కొనుక్కోవాలి. ఇవన్నీ కాకుండా మొగుడికి రోజూ అన్నంలోకి గొడ్డు తునకల కూర ఏర్పాటు చేయాలి. అందుకని ఫాతిమా దేవుణ్ణి నిందించే పని పెట్టుకోకుండా నిత్యం చీకటి పడ్డాక కొడుకును తీసుకొని చార్మినార్ చుట్టుపక్కలకు వస్తూ ఉంటుంది. అక్కడ గొంతును దీనంగా మార్చి, నలుగురి ఎదుటా చేతులు సాచి దుకాణాల దగ్గర, చుడీబజార్‌లో యాచిస్తూ కనిపిస్తుంది. ఆమె గొంతూ... చెమటతో తడిసి స్పష్టమైన రేఖలు తేలిన ఆమె అర చేతులూ చార్మినార్ చుట్టుపక్కల వారికి బాగా పరిచయం. వాళ్లే ఆమె పేరుకు ముందు ఫకీర్ అని చేర్చి ఆమెను ఫకీర్ ఫాతిమా చేశారు. ఫాతిమాకు లోకం తెలియదు. ఆ మాటకొస్తే మొగుడు, కొడుకు, యాచన తప్ప వేరే ఏమీ తెలియదు.

*

క్లిప్పింగ్ 3: నవంబర్ 14, 2008, హైద్రాబాద్: గౌరవనీయులైన రాష్ట్ర సమాచార శాఖా మంత్రి ఇలా తెలియచేస్తున్నారు... లుంబినీ పార్క్, గోకుల్ చాట్ పేలుళ్ల తర్వాత రాష్ట్ర పోలీసులు తమకొచ్చిన సమాచారాన్ని అనుసరించి అనేక అరెస్టులు చేశారు. సోదాలు నిర్వహించారు. అనుమానితులెందరినో అదుపులోకి తీసుకున్నారు. అయితే పోలీసులకు వచ్చిన సమాచారం ప్రతిసారీ కచ్చితంగా ఉండక పోవచ్చు. చేసిన అరెస్టులన్నీ సక్రమమే కాకపోవచ్చు. అందుకే- అన్ని విచారణలు పూర్తయ్యాక నిర్దోషులు అని తేలినవారిని వదిలేయడానికి నిశ్చయించుకున్నాం. ఇప్పటి వరకూ అరెస్టు చేసిన వారిలో మొత్తం 22 మందిని విడిచిపెట్టేస్తున్నాం. అంతేకాదు వాళ్ల పేర్లు ఎప్పటికీ ఏ రికార్డుల్లో ఉండకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఈ అరెస్టుల వల్ల వాళ్లు నష్టపోయి ఉండవచ్చు. వారికి మానసికవ్యథ కలిగి ఉండవచ్చు. టెర్రరిస్ట్‌లనే ముద్ర ఇకపై వారిని వెంటాడ వచ్చు. అరెస్టు చేయడానికి ముందు జీవితానికి, విడుదలైన తర్వాత జీవితానికి ఎటువంటి పోలికా కనిపించకపోవచ్చు. అందుకే మానవతా దృక్పథంతో వ్యవహరించదలిచాం. ప్రభుత్వం తరఫున వారిని అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రయత్నిస్తున్నాం.

మంత్రి మీవాడే కదయ్యా షకీలూ? నిన్ను పిలిచి ఎప్పుడూ యింత చాయ్ పోయలేదా తెగ రాసేశావ్? జర్నలిస్టులకి లౌక్యం ఉండాలయ్యా లౌక్యం. ఇంత వయసొచ్చినా బతకనేర్చినతనం రాకపోతే ఎలా?

*

ఇంటి నుంచి ఫోన్. నా భార్య.

"హలో..."

"చెప్పు."

"నమాజ్‌కు వెళ్లారా?"

"ఇప్పుడే."

"ఇవాళ బాక్స్ ఏమీ తీసుకెళ్లలేదుగా. ఏం తింటారు?"

"ఏదో ఒకటి."

"ఏదో ఒకటి అంటే?"

"మసీదు ఎదురుగానే బిరియానీ హౌస్ ఉంది. చూస్తాను."

"చూడొద్దు. వెళ్లి తినండి."

"అలాగే."

"అలాగే కాదు. నేను మళ్లీ ఫోన్ చేస్తాను. సరేనా?"

"సరే."

నేను షకీల్‌ని. మసీదులోనే ఉన్నాను. ఆకలికి ఏదో ఒకటి తింటే బాగుండు అనే ఆలోచనలో ఉన్నాను. కాని తినలేకపోతున్నాను. నా ఎదురుగా ముష్టాక్ ఉన్నాడు. నేరేడుచెట్టు కింద, ఆకులు కాస్త కదిలినా ఎండ సోకే నేరేడుచెట్టు కింద, చెమట పట్టి, చొక్కా తడిసి, రోగిలా, స్పృహ లేనివాడిలా నిద్రపోతూ ఉన్నాడు. వాడు ఇంతకు మునుపు ఇలా లేడు. బతకనేర్చినవాడిలా ఉండేవాడు. బతకనేర్వడంలో తీరిక లేనివాడిలా ఉండేవాడు. ఇది వాడి కథ. వాడు బతకనేర్చిన కథ.

ముష్టాక్ ఏదో మేజిక్‌లాంటిది చేస్తాడు. కనికట్టు లాంటిది ప్రదర్శిస్తాడు. అసలు వాడు తన తెలివితో తోటి యాచకులని కకావికలం చేసేస్తాడు. నమాజ్ ముగిసి, జనమంతా లేచి, అందరూ కిందకు దిగుతూ ఉండగానే వాడి డ్రామా మొదలై పోతుంది. వాడు గబగబా మెట్ల దగ్గరకు చేరి, అమ్మీతో ఏమాత్రం సంబంధంలేని వాడిలా ఎడంగా జరిగి, జేబులో నుంచి ఒక నలిగిపోయిన మందుల చీటీని తీసి, అందులో రాసిన మందులను అందరికీ కనిపించేలా పట్టుకొని నిలబడతాడు. పాతబస్తీలో ఇలాంటివారి కోసమే అలాంటి చీటీలు రాసిచ్చే దయామయులైన వైద్యుల పుణ్యాన ఇక వాడు నాటకంలోని మొదటి మాటను పెద్ద గొంతుతో మొదలు పెడతాడు. ఈమాన్ కలిగిన పెద్దలారా... దానం చేయండి... అది మిమ్మల్ని నరకలోక జ్వాలల నుంచి రక్షిస్తుంది. మెట్లు దిగి వెళుతున్న అయ్యలారా... ఖైరాత్ చేయండి... అది మిమ్మల్ని పుణ్యం సంపాదించే మెట్ల పైన నిలబెడుతుంది. సలామ్ అలైకుమ్ భాయియో... ఇటు చూడండి... మా అబ్బాజాన్ బీమార్‌గా ఉన్నాడు... మంచాన పడి ఉన్నాడు... ఈ చీటీలోని మందులు కావాలి... మీ ఎదుట చేయి చాపి అడుగు తున్నాను... మదత్ చేయండి... మా అబ్బాజాన్ ప్రాణాలు కాపాడి పుణ్యం కట్టుకోండి... అని చెవి కోసిన మేకలాగా అరుస్తూ ఉంటాడు. ఆ అరుపులో ఏదో రాగంలాంటిది ఉంటుంది. మూలుగులాంటిది ఉంటుంది. వశీకరణం చేసేవాడిలాగా, అర్ధరాత్రి ఎవరూ లేని వేళలో ఉగ్గపట్టి ఏడ్చే పిల్లాడిలాగా వాడు అందర్నీ ఆకర్షిస్తూ ఉంటాడు. వాణ్ణి చూస్తే- ఎవరికైనా సరే చేతులు జేబుల్లోకి వెళతాయి. వాడికి ఇచ్చాకే కాళ్లు ముందుకు కదులుతాయి. నమాజ్‌కు వచ్చేవాళ్లు ప్రతి శుక్రవారం వాణ్ణి చూస్తారు. ప్రతి శుక్రవారం వాడి మందుల చీటీని చూస్తారు. ప్రతి శుక్రవారం వాడి ఏడుపులాంటి దొంగ వేడుకోలును చూస్తారు. కాని, ప్రతి శుక్ర వారం తప్పనిసరిగా వాడికే ఇచ్చి వెళతారు.

*

గుల్బర్గా- ఒక అనుకోని ప్రధాన పాత్ర- అంతా కలిపి నాలుగైదు గంటల ప్రయాణం. హైద్రాబాద్ నుంచి వికారాబాద్... వికారాబాద్ నుంచి వాడీ... వాడీ నుంచి గుల్బర్గా. రోజూ చాలా మంది వెళుతూ ఉంటారు. స్నేహితులతో బంధువులతో కుటుంబాలతో అక్కడ ఉన్న ఖాజా బందే నవాజ్ దర్గాను సందర్శించడానికి గుంపులుగా సమూహాలుగా వెళుతూ ఉంటారు. అక్కడకు వెళితే, ఖాజాకు భక్తిగా ఒక పూల చాదర్‌ను సమర్పిస్తే, ఖర్జూరాలతో ఫాతెహా చదివిస్తే, అంతా మంచే జరుగుతుందని విశ్వసిస్తారు. దర్గా మీద కప్పిన గులాబీల నుంచి నాలుగు రెక్కలు తుంచి నోట్లో వేసుకుంటే వచ్చిన కష్టాలన్నీ తొలిగిపోతాయని గాఢంగా నమ్ముతారు. వందల ఏళ్లుగా వస్తున్న నమ్మకం ఇది. వందల ఏళ్లుగా కొనసాగుతున్న నమ్మకం. ఈ నమ్మకానికి కులం లేదు. భాష లేదు. ఆమాటకొస్తే కష్టం అనే మతం తప్ప మరే మతం ఎరగని వాళ్లంతా జోలె పట్టి ఖాజా బందే నవాబ్ దర్గాలో హాజరు అవుతూనే ఉంటారు. వాళ్లలో మనకు తెలిసినవాళ్లుకూడా ఉంటారు.

అత్తర్ నయాబ్‌లాంటి వాళ్లు, ఫలక్‌నామాలో లేత్ నడిపే ఆబెదుల్లాలాంటి వాళ్లు, తాడ్‌బన్ బేకరీ ఓనర్ ఇమ్రాన్ లాంటి వాళ్లు, బాబానగర్‌లో చాయ్ మాస్టర్ ఫైరోజ్‌లాంటి వాళ్లు... యింకా పాతబస్తీ చుట్టుపక్కల అనేక ప్రాంతాలవాళ్లు... ఏదో ఒక సమయంలో... ఏదో ఒక సందర్భంలో గుల్బర్గా వెళ్లి వస్తూనే ఉంటారు. ఎందుకంటే- గుల్బర్గా ఒక్క కర్ణాటకకు మాత్రమే కాదు, యావద్దేశానికీ పవిత్ర సూఫీక్షేత్రం. సామరస్యాన్ని బోధించే ఆకుపచ్చని జెండా.

*

"కూర్చో షకీల్. నిలబడకు. నాకు చిరాకు. నీకు తెలుసో తెలియదో, నా కెరీర్ ప్రారంభంలోనే బెంగుళూరులో నాలుగేళ్లు పని చేశాను. అప్పట్లోనే కర్ణాటక అంతా ఆ మూల నుంచి ఈ మూల దాకా తిరిగేశాను. అలాంటి నాకు నీ నోటి ద్వారా గుల్బర్గా గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందంటావా? పాయింటుకురా తమ్ముడూ."

*

పాయింట్ ఏమిటంటే గుల్బర్గా ఈ కథలో రెండుసార్లు వస్తుంది. రెండోసారి ఎప్పుడనేది తర్వాత చెబుతాను. ముందు మొదటిసారి కథ.

పెళ్లయ్యాక ఐదో శుక్రవారంనాడు అత్తామామలు బగారా అన్నం వొండి సాయంత్రం ఆకువక్కతో సాంగెం చేసి జేబులో నయాపైసా లేకపోయినా మాటవరస కోసం నయాబ్‌ని నాయనా... అల్లుడివి కదా... శుక్రవారం కానుకగా ఏమి ఇమ్మంటావు అని అడిగితే కొత్త నవారు మంచం మీద ఒరుసుకొని కూర్చుని ఉన్న ఫాతిమానే చూస్తూ నాకేం వద్దు... పిల్లలంటే నాకు చాలా ఇష్టము... మీ అమ్మాయిని తొందరగా ఒక బిడ్డను కనివ్వమనండి చాలు అన్నాడు నయాబ్. అయితే ఆ కోరిక మూడేళ్లైనా తీరలేదు. యింకొన్నేళ్లు గడిచినా తీరుతుందనిపించలేదు. దానికి కారణం ఒక మొటిమ. ఫాతిమాది కొంచెం చిత్రమైన కథ. చిత్రమైన మొటిమల కథ. ఆమెకు పెళ్ళికి ముందు మొటిమలు వచ్చేవి. అయితే అవి సామాన్యమైన మొటిమలు కాదు. చెట్టుకు కాసే పండ్లలా, కోతకు వచ్చిన గింజల్లా చెంపల మీద గుత్తులు గుత్తులుగా కాసేవి. అవి చూసి, అవి తేలిన ఎర్రటి చెంపల్ని చూసి- అయ్యో... ఈ పిల్లను ఎవరు చేసుకుంటారమ్మా... చేతికీ మూతికీ గుచ్చుకునేలా ఉన్నాయి మొటిమలు... అని ఎవరైనా ఇరుగు పొరుగువారు వంకలు పెడితే ఆ మాటలు విన్న ఫాతిమా చున్నీ ముఖాన కప్పుకుని వలవలా ఏడుస్తూ లోపలికి పరిగెత్తేది. పెరట్లో పుదీనా అకుల్ని పరపరా తెంపి చెంపల నిండా గబగబా రుద్దుకునేది. అంతటితో ఊరుకోక, అన్నం నీళ్లూ మాని యింకెందుకీ బతుకు అన్నట్టుగా ఏడుస్తూ కూర్చునేది. కొద్దిరోజుల పాటు ఇదంతా గమనించిన పక్కింటి ముసలమ్మ... బేటీ... బాధపడకు... పెళ్లి జరగనీ... అన్నీ పోతాయి అని ధైర్యం చెప్పేది. అనుకున్నట్టుగానే ఆమెకు నయాబ్‌తో పెళ్లి జరిగింది. ఆ వెంటనే మంత్రం వేసి నట్టుగా మొటిమల చెరా మాయమైంది. అయితే పోయిన మొటిమలు పోగా ఒక్కటి మాత్రం పగబట్టినట్టుగా ఫాతిమా నెలసరికి ముందు బయటపడేది. నెలసరి ఇంకో వారమో, నాలుగురోజులో ఉందనగా జడ దువ్వుకోవడానికి అద్దంలో చూసుకుంటున్నప్పుడో కాసిన్ని నీళ్లతో ముఖం కడుక్కుం టున్నప్పుడో నుదిటి మీద, ముక్కు మీద, లేదంటే చుబుకం చివర ఒక మొటిమ తొంగి చూసేది. మొటిమ కనిపించిందంటే నెలసరి రాబోతోందని అర్థం. నెలసరి రాబోతోందంటే నెల తప్పడం లేదని అర్థం. ఇక ఫాతిమా అద్దం పక్కన పడేసి ఏడ్వడానికి సిద్ధమయ్యేది. ఇంకా ఎప్పుడు... ఒడి నిండా బిడ్డను తీసుకొని ఊరంతా చూపించి మురిసిపోయేది ఎప్పుడు అని పెద్దపెద్దగా శోకండాలు పెట్టేది. ఇదంతా గమనించిన పక్కింటి ముసలామె... బేటీ... బాధపడకు... నువ్వూ నీ మొగుడూ

గుల్బర్గా వెళ్లిరండి... అక్కడ మూడు నిద్రలు చేసి రండి... తప్పకుండా మీకు పిల్లలు పుడతారు అని సలహా ఇచ్చింది. అలా ఆ మొగుడూ పెళ్లాలకు గుల్బర్గా దర్శనమైంది. అక్కడ మూడు నిద్రలు చేసే భాగ్యం దక్కింది. ఆ వెంటనే ఫాతిమాకు నెల తప్పింది. మరి తొమ్మిది నెలలకు ఎంతో అబ్బురంగా మరెంతో అపురూపంగా ఆమె పొత్తిళ్లలో ముష్టాక్ పసి కేరింత విని పించింది.

*

"దో మటన్ బిరియాని పార్శిల్. బిల్ కిత్తా హువా?"

"నాలుగు వందల యాభై రూపాయలు సార్."

"కిత్తా?"

"ఫోర్ ఫిఫ్టీ."

"అరె... నేను కూడా ముసల్మాన్‌నేనయ్యా. నువ్వు ఉర్దూలో చెప్పవచ్చు."

"మీరు అలా కనిపిస్త లేరు సాబ్. కిదర్ కే?"

"ఆంధ్రా."

"అలా చెప్పండి. అందుకే మీ జబాన్‌లో ఫరక్ ఉంది. ఇదిగోండి సాబ్ దో మటన్ బిరియానీ పార్శిల్."

నేను షకీల్‌ని. టక్ చేసుకొని ఉంటాను. షూ వేసుకొని ఉంటాను. నా కులం మతం ప్రాంతం ఆనవాలు తెలిపే ఏ చిహ్నమూ లేకుండా ఉంటాను. అయితే నా మెడలో ఒక ఐడెంటిటీ కార్డ్ ఉంటుంది. నేను ప్రెస్ అని తెలియచేసే ఐడెంటిటీ కార్డ్. అందుకే పోలీసులు- దారిలో ఎప్పుడైనా నా స్కూటర్‌ని ఆపితే వదిలేస్తారు. నా ఐడెంటిటీ చూసి పక్కకు తప్పుకుంటారు. కాని, ఈ దేశంలో అందరూ ఐడెంటిటీ చూపలేరు. అలాగని ఐడెంటిటీ లేనివారుగా కూడా బతకలేరు. అందుకే ఒక్కోసారి వాళ్ల ఐడెంటిటే వాళ్లకు ప్రమాదం తెచ్చి పెడుతూ ఉంటుంది. ఉదాహరణకు ఆ రోజు రాత్రి ఏం జరిగిందో నేను ప్రత్యక్షంగా చూడలేదు. ఫాతిమా చెప్పడమే. ఆ రాత్రి బాగా పొద్దుపోయింది. బస్తీలో అలికిడి సద్దుమణిగింది. నయాబ్, ముష్టాక్, ఫాతిమాలు కంచాలు ముందు పెట్టుకొని అన్నానికి కూర్చుని ఉన్నారు. అప్పుడు ఒకటి జరిగింది. బయట ఎవరిదో క్వాలిస్, దాటి పోతుందేమో అని చూశారు. దాటి పోలేదు. అక్కడే ఉండిపోయింది. ఇంజన్ ఆఫ్ చేయకుండా, చేయవలసిన పని ఏదో ఉన్నట్టుగా అలాగే ఉండిపోయింది. వాళ్లు భయపడ్డారు. ఎవరా అని అనుమానించారు. ఇంతలోనే అందులో నుంచి దిగిన నలుగురు వ్యక్తులు తలుపు నెట్టుకొని లోపలికి వచ్చినట్టుగా ఫాతిమా గ్రహించింది.

"కౌన్ హో తుమ్?"

నిశ్శబ్దం.

"బోలో భాయ్‌సాబ్... కౌన్ హో తుమ్?"

ఆమెను తోశారు.

"యాల్లా..."

"అమ్మీ... అమ్మీ... ఉరో అమ్మీ."

ముష్టాక్ భయపడ్డాడు.

"అరె... ఎవరు భాయ్ మీరు? ఇంత రాత్రివేళ వచ్చి ఎందుకు మమ్మల్ని పరేషాన్ చేస్తున్నారు?"

ఈసారి దెబ్బపడింది.

మూతి నుంచి రక్తం చిమ్మి షర్టంతా ఎరుపు.

"ఖూన్... ఖూన్... అబ్బాజాన్... ఖూన్..."

ఈసారి ముష్టాక్ భయంతో ఏడ్చాడు.

"యా ఖుదా... ఎవరయ్యా మీరు... మా ఆయన్ని ఎందుకు కొడుతున్నారు?"

మళ్లీ దెబ్బ పడింది.

"యా గౌస్."

ఆమె కింద పడిపోయింది.

ముష్టాక్ యిప్పుడు అలుపుగా, భయంగా, గొంతు రానట్టుగా ఏడ్చాడు.

"అమ్మీ... అమ్మీ... డర్ లగ్‌తా హై అమ్మీ..."

పెద్దగా ఏడ్చాడు.

కాసేపటికి వాడు- ఒళ్లంతా చెమటలు పడుతూ ఉండగా- మెత్తగా అయిపోయి- మూత్రం జారుతుండగా మంచం కిందకు దూరి- గట్టిగా కళ్లు మూసుకున్నాడు.

కాసేపు గడిచిపోయింది.

ఏం జరిగిందో తెలుసుకునేలోపల అంతా జరిగిపోయింది.

నయాబ్ లేడు.

తీసుకువెళ్లారు.

ఆమె నిద్ర నుంచి మేల్కొన్నదానిలా లేచి కూర్చుంది.

ఏం జరిగిందో అన్నట్టుగా చుట్టూ పరికించి చూసింది.

అన్నం చెల్లాచెదురుగా పడి ఉంది.

నయాబ్ తింటున్న కంచెంలోని తునకలు నేల మీదకు దొర్లి తడిగా మట్టి అంటుకుని కనిపించాయి.

దిమ్ము.

ఏమీ తోచనివ్వని దిమ్ము.

అంతలోనే ఆమె- ఏదో గుర్తొచ్చినదానిలా- వెర్రిగా అరుస్తూ- భయంగా కేకవేస్తూ బేటా... ముష్టాక్... అంది.

సమాధానం లేదు.

"బేటా... ముష్టాక్..."

మంచం కింద ఉన్న ముష్టాక్ ఆమె గొంతే వినలేదు.

"ఎక్కడ ఉన్నావు నాయనా... కన్నా..."

ఆమె మంచం కింద చూసింది.

ముష్టాక్ కనిపించాడు.

కళ్లు రెండూ మూసుకుని, చేతులు రెండూ గుండెల దగ్గర పెట్టుకొని, ముడుక్కుని ఉన్నాడు.

"ముష్టాక్ ముష్టాక్... భయపడకురా... నేనున్నాను కదమ్మా..."

ఆమె ఏడుస్తూ, జరుగుతూ, చేయి సాచి కొడుకును అందుకోబోయి మరు నిమిషంలో ఆ చేయి వదిలేసింది.

నిప్పు.

కాలిపోతూ ఉంది.

పిల్లవాడికి జ్వరం.
ఆనాటి నుండి ఈనాటి వరకూ దిగని జ్వరం.

*

"ఊ. నువ్వు ఈ స్టోరీలో మరీ పర్సనల్‌గా ఇన్‌వాల్వ్ అయినట్టు కనిపిస్తున్నావయ్యా షకీలూ. నీకెంతమంది పిల్లలు? ఒక్కడే కదూ. అందుకే ఇంత అటాచ్డ్‌గా ఉన్నావు. కాని- మన వృత్తిలో కొంచెం డిటాచ్డ్‌గా ఉండాలయ్యా. ఇలా అయితే ఎలా?"

*

నేను షకీల్‌ని. నాకు డిటాచ్డ్‌గా ఉండేవాళ్ల కథలు తెలియదు. కాని, ఈ కథ మాత్రం ఎంతో అటాచ్డ్‌గా ఉండే ఇద్దరు తండ్రీ కొడుకులది. నయాబ్, ముష్తాక్‌లది. వీళ్లను చూస్తే- వీళ్ల దగ్గరితనం చూస్తే- బతకడానికి ప్రేమ తప్ప మరే ఆదరవు లేని వారంతా ఇంతే అటాచ్డ్‌గా ఉంటారా అని అనిపించింది. ఇది వారి కథ. అపురూపమైన ఆ తండ్రీ కొడుకుల కథ.

ఆ తండ్రికి ఆ కొడుకుతోనే లోకం. ఆ కొడుకును ఆ తండ్రి అంటే ప్రాణం. నయాబ్ చెప్పులు వేసుకొని బయటకు వెళుతూ ఉంటే ఎక్కడకు వెళుతున్నావ్ అబ్బా అని అడిగేవాడు ముష్తాక్. నయాబ్ చెప్పులు వదిలి లోపలికి వస్తూ ఉంటే ఎక్కడి నుంచి వస్తున్నావ్ అబ్బా అని కావలించుకునేవాడు ముష్తాక్. తండ్రి రావడంతోటే పరిగెత్తుకుంటూ వెళ్లి లుంగీ తెచ్చిచ్చేవాడు. పరిగెత్తుకుంటూ వెళ్లి టవల్ తెచ్చిచ్చేవాడు. పరిగెత్తుకుంటూ వెళ్లి చాప పరిచి అన్నం పెట్టడంలో తల్లికి సాయం చేసేవాడు. తండ్రి ఇంట్లో ఉంటే వాడికి పండగ వచ్చినట్టు. అబ్బా... కథ చెప్పు అబ్బా అంటూ నయాబ్ వెంటపడేవాడు. వాడికి మూడు నాలుగేళ్ల వయసు ఉన్నప్పుడు యింటికి కారు తెచ్చేవాడు నయాబ్. అందులో కొడుకును కూర్చోబెట్టుకొని నవ్వుతూ బుగ్గలు పుణుకుతూ షికారుకు తిప్పేవాడు నయాబ్. ఆ సమయంలో ముష్తాక్ ఎంతో సంబరపడేవాడు. అద్దాల్లో నుంచి అటూ ఇటూ చూస్తూ తండ్రి దగ్గర గారాలు పోతూ అబ్బా... నువ్వు వదులు అబ్బా... నేను నడుపుతాగా అని స్టీరింగ్ పట్టుకొని హీరోలా తిప్పేవాడు. కాలక్రమంలో ఆ సంబరం అంతా పోయింది. ఇంటికి కారు రావడం పోయింది. నయాబ్‌కు పని లేకుండా పోయింది. అతడి ముఖాన నవ్వు లేకుండాపోయింది. అదంతా మౌనంగా గమనిస్తూ ఉండేవాడు ముష్తాక్. రోజూ ఉదయాన్నే అన్నం కట్టుకొని వెళ్లే అబ్బా, సంతోషంగా చేయి ఊపుతూ వీడ్కోలు పలికే అబ్బా, బయటకు వెళ్లకుండా ఇలా ఇంట్లోనే ఉండిపోతుంటే రహస్యంగా బెంగపడేవాడు ముష్తాక్. అప్పుడప్పుడు... తండ్రి దగ్గరకు వెళ్లి... నువ్వు ఫికర్ చేయకు అబ్బా... నేనున్నానుగా అని ధైర్యం చెప్పేవాడు ముష్తాక్. ఎప్పుడైనా తల్లి విసుగులో తండ్రిని ఒక మాట అంటే వాడికి ఇంత పొడుగు కోపం వచ్చేది. అమ్మీ... అబ్బాను ఏమీ అనకు అమ్మీ అంటూ తల్లి మీద కచ్చగా పిడిగుద్దులు విసిరేవాడు ముష్తాక్. తండ్రికి డబ్బులు అవసరమని వాడికి తెలుసు. అందుకే మసీదులోని యాచనలో సగం తల్లికి ఇచ్చి మిగిలిన సగం తండ్రికి ఇచ్చి ఈసారి ఇంకా ఇస్తాలే అబ్బా అని బుగ్గ మీద ముద్దు పెట్టేవాడు ముష్తాక్. అప్పుడు నయాబ్ ఎందుకనో చాలాసేపు ఏడ్చేవాడు. ముష్తాక్‌ను కావలించుకుని మౌనంగా ఉండిపోయే వాడు. పొద్దుపోయి, తండ్రి ఇంటికి వచ్చేదాకా అలాగే మేలుకొని ఉండటం ముష్తాక్ అలవాటు. తండ్రి వచ్చి, అన్నం తిని, కొడుకును కావలించుకుని నిద్రపోయే దాకా అలాగే మేలుకొని ఉండే వాడు. వాడికి రోజూ తండ్రి స్పర్శ తగలాలి. తండ్రి నుంచి వచ్చే గాఢమైన అత్తరు వాసన తగలాలి. ఆ వాసన పీలుస్తూ తండ్రి ఛాతీలో ముఖం దూర్చుకుని ఏవేవో మాటలు మాట్లాడు

కుంటూ నిద్రలోకి జారుకునేవాడు ముష్టాక్. నడి మధ్య మెలకువ వస్తే తండ్రి తల మీద చేయి వేసి నిద్ర పోయేవాడు ముష్టాక్.

*

"షుక్రియా భాయ్‌సాబ్... దేవుడు మిమ్మల్ని చల్లగా చూడాలి. కాని, మేం ఆ బిరియాని తినం. తీసుకెళ్లండి. అనవసరంగా తక్‌లీఫ్ చేశారు."

"అయ్యో... మీ కోసమే తెచ్చానమ్మా."

"వద్దు భాయ్‌సాబ్. మేము చికెన్ మటన్ తినం. మాకు అంత నసీబు లేదు. మేము గొడ్డు మాంసం తిని బతికేవాళ్లం. మాది గొడ్ల కన్నా హీనమైన రాత."

"అలా ఏడవకు అమ్మా."

"ఏడవక ఏం చేయమంటారు భాయ్‌సాబ్. యింకేం మిగిలిందని... చూడండి... మా ఆయన్ని చూడండి... బంగారంలాంటి నా బిడ్డని చూడండి... యా ఖుదా... మేమేం పాపం చేశామనయ్యా మాకీ ఖర్మ."

"ఏడవకు తల్లీ."

"భాయ్‌సాబ్. దయచేసి మాకు ఒక్క మదత్ చేయండి. మాకు ఇక్కడ ఉండాలని లేదు. ఈ పాపిష్టి నగరం నుంచి ఎవరికీ కనబడకుండా వెళ్లిపోవాలని ఉంది. ఎక్కడికైనా దూరంగా వెళ్లి బతకాలని ఉంది. అందుకు దయచేసి కొంచెం డబ్బు ఏర్పాటుచేయండి. మీకు సలాం చేస్తాను. ఆ ఒక్క సాయం చేసి పుణ్యం మూట గట్టుకోండి."

"అక్కర్లేదమ్మా. నేను పత్రికల్లో పని చేస్తాను. మనం గవర్నమెంట్ వాళ్లతో మాట్లాడవచ్చు. లోను ఏర్పాటు చేయవచ్చు. కావాలంటే ఇల్లు కూడ అడగవచ్చు."

"వద్దు భాయ్ సాబ్. మాకు ఇల్లూ వద్దూ ఏమీ వద్దు. నాకు అర్థమైపోయింది... ఈ ఊళ్లో ఉంటే మాలాంటి వాళ్లం భయం లేకుండా బతకలేమని అర్థమైపోయింది. పర్వాలేదు భాయ్‌సాబ్. అల్లామియా నాకు శక్తి ఇచ్చాడు. కాళ్లు చేతుల్లో ఇంకా దమ్ము ఇచ్చాడు. నేను వీళ్లను పోషించుకోగలను. ఏ మసీదో... దర్గాయో ఉన్న చోటుకు నా భర్తనూ బిడ్డనూ తీసుకొనిపోతాను. అక్కడే భీక్ ఎత్తి పోషించుకుంటాను..."

ఆమె ఏడుస్తూ ఉంది.

ఊరడింపుకు లొంగనిదానిలా ఏడుస్తూ ఉంది.

అయితే అలా ఏడవడానికి కూడా వీల్లేని మనిషి ఒకడు ఉన్నాడు నయాబ్. నిజానికి అతడు నాతో పెద్దగా మాట్లాడింది లేదు. నేను కూడా అతణ్ణి పెద్దగా కదిలించిందీ లేదు. కాని, అతడి కళ్లలోని భయమే నాకు కథంతా చెప్పింది. ఇది- ఆ రాత్రి జరిగిన కథ. అతణ్ణి తీసుకెళ్లాక మిగిలిన కథ-

వాళ్లు మొదట అతడి జేబుల్ని సోదా చేశారు. ఏం దొరకలేదు. కాని, జేబులో రెండు అత్తరు సీసాలు దొరికాయి. లంజకొడకా... నీకు అత్తరు కావల్సివచ్చిందారా అని పారేయడానికి క్వాలిస్ అద్దం కిందకు దించారు. అతడు హడలిపోయాడు. ఒంట్లో ఉన్న ఊపిరిపోతున్న వాడిలా పారేయ వద్దు సాబ్... అవి లేకుండా నేను బతకలేను. సాబ్... సాబ్... సాబ్... పారేశారు. అతడు ఏడవబోయాడు. దెబ్బలు పడ్డాయి. ఆ తర్వాత పెనుగులాడే శక్తి లేనివాడిలా అలాగే ఉండిపోయాడు. వాళ్లు అతడి కళ్లకు గంతలు కట్టారు. ఆ తర్వాత ఆడవాళ్లు తొడుక్కునే బురఖాని పూర్తిగా తొడిగారు. అతడికి ఏం అర్థం కాలేదు. ఈసరికి అన్నం తినాల్సిన మనిషి. కొడుకును కావలించుకుని ఒళ్లెరగక

నిద్రపోవాల్సిన మనిషి. యింత రాత్రివేళ... ఎవరో తెలియని మనుషుల మధ్య... ఎటెళుతున్నాడో... ఎందుకెళుతున్నాడో తెలియక... 'సాబ్... డర్ హో రహా హై సాబ్'... అన్నాడు. బదులు రాలేదు. క్వాలిస్ చాలాసేపు ప్రయాణించింది. ట్రాఫిక్‌లో ప్రయాణించింది. ట్రాఫిక్ లేని చోట ప్రయాణించింది. పక్కనే వేగంగా వెళుతున్న వాహనాలను అంతకంటే వేగంగా క్రాస్ చేస్తూ ప్రయాణించింది. 'సాబ్... ఎవరు సాబ్ మీరు... ముఝె క్యూ లేజారహై సాబ్?' అడిగిన ప్రతీసారీ అతడి వొంటి మీద దెబ్బపడింది. ఇక ఆ తర్వాత అతడు ఏడవకుండా, ప్రతిఘటించకుండా, గోతాం మూటలో పెట్టేశాక పూర్తిగా లొంగిపోయే మూగప్రాణిలా అలాగే ఉండిపోయాడు.

*

టైం సాయంత్రం నాలుగు.

మసీదు గోడల మీది వేడి నెమ్మదిగా చల్లబడుతూ ఉంది.

అంతదాకా బిగపట్టి ఉన్న గాలి నెమ్మదిగా రెక్కలు సవరించుకుంటూ ఉంది.

అది మెల్లగా వీస్తూ, వీచినప్పుడల్లా నేరేడు చెట్టును సున్నితంగా కదుపుతూ దానితో ఆటలాడుకునే ఖయాలులో ఉంది.

ముచ్చటైన దృశ్యం.

అయితే ఆ దృశ్యాన్ని తీసుకునేంత హాయి నాలో లేదు.

నేను యింకా ముష్టాక్‌తో మాట్లాడాల్సి ఉంది. ప్రతి శుక్రవారం నమాజ్‌కు వచ్చినప్పుడల్లా నేను వాడితో మాట్లాడతాను. కాసేపు కబుర్లు చెబుతాను. వాణ్ణి దగ్గరకు తీసుకొని పాపం పుణ్యం ఎరగని ఆ పసి చేతులతో కరచాలనం చేసి... ఇవాళ మాత్రం- ఎందుకు వదలాలి?

"ముష్టాక్. లేరా. లేచి ఆడుకో."

ఊహూ.

"లేరా. నీలాంటి బహదూర్ పిల్లలు ఇలా వుండవచ్చునా? లే."

"వద్దు సాబ్."

"పాంచ్ రుపాయ్ కావాల? అడుగుతావుగా. ఇదిగో, తీసుకో."

"నక్కో సాబ్."

"బిస్కెట్ తింటావా? ఫుల్ ప్యాకెట్."

"ఊహూ."

"ముష్టాక్. అలా ఉండకురా. ఏం కావాలి నీకు?"

"జ్వరం వస్తోంది సాబ్. రోజూ రాత్ అయితే జ్వరం. నా జ్వరం తగ్గించండి సాబ్. లేకపోతే నేను చచ్చిపోతాను సాబ్. నేను చచ్చిపోతే మా అబ్బా ఏడుస్తాడు సాబ్. మా అబ్బాను కూడా హాస్పతాల్‌లో చూపించండి సాబ్. మా కసమ్. ఇంకెప్పుడూ మా అబ్బాకు బాగా లేదని దొంగ చీటీ చూపించి భీక్ అడగను సాబ్. ఇప్పుడు మా అబ్బా నిజంగానే బీమార్ అయ్యాడు సాబ్. నాతో మాట్లాడడం లేదు. ఆడుకోవడం లేదు. కథలు చెప్పడం లేదు. అసలు నవ్వడమే లేదు. మా అబ్బాకు కొంచెం మందులు ఇప్పించండి సాబ్. మీకు పుణ్యం ఉంటుంది. దేవుడు మిమ్మల్ని చల్లగా చూస్తాడు. నేను చెప్తున్నానుగా. దేవుడు తప్పకుండా మిమ్మల్ని చల్లగా చూస్తాడు. అరె... ఎందుకు ఏడుస్తున్నారు సాబ్?"

*

విండో గ్లాస్ తోసిన చప్పుడయ్యింది.

స్మోక్ చేయాలనుకుంటున్నప్పుడల్లా ఆయన అలా కిటికీ దగ్గరకు వెళ్లి, విండో గ్లాస్ తోసి, ఏసి రూమ్‌లో స్మోక్ నిండకుండా పొగను బయటకు ఊదుతూ ఉంటాడు.

ఇప్పుడు కూడా అదే చేశాడు.

విండో తోశాడు.

సిగరెట్ ముట్టించాడు.

ఆ తర్వాత చాలాసేపు స్మోక్ చేస్తూ అలాగే ఉండిపోయాడు.

ఉన్నట్టుండి మధ్యలో ఒకసారి టేబుల్ దగ్గరకు వచ్చి, అక్కడ ఉన్న నా రిపోర్ట్ కాగితాలను విండో దగ్గరకు తీసుకువెళ్లి, అక్కడే నిలబడి, వాటిని తిరగేస్తూ ఉండి పోయాడు.

ఎందుకనో ఆయన- అంతకుముందులా లేడు.

వ్యంగ్యంతో మాట్లాడిన మనిషిలా లేడు.

కళ్ల కింది సంచుల్లో నీరు దాచుకున్నవాడిలా ఉన్నాడు.

"సారీ షకీల్. ఇందాకటి నుంచి కొంచెం నాన్ సీరియస్‌గా మాట్లాడినట్టున్నాను. ఈ కథను ఇలా అనుకోలేదు. ఇది ముంబై దాడుల దాకా చేరుతుందని ఊహించలేదు. పోయి పోయి నయాబ్ ఇందులో ఎలా ఇరుక్కున్నాడయ్యా."

*

నయాబ్ ఇందులో ఇరుక్కోలేదు. కాని, నయాబ్‌లాంటి వాళ్లు ఇరుక్కునేలా చుట్టూ గాలి వ్యాపించి ఉంది. వివరంగా చెబుతాను. అనుమతిస్తే మిమ్మల్ని ఆ సంఘటన జరిగిన తేదీకి తీసుకువెళతాను.

నవంబర్ 26, 2008, ముంబై తాజ్ హోటల్‌పై దాడి జరిగిన తేదీ: ఆరోజు దేశంలో చాలా మంది డ్యూటీలకు వెళ్లారు. చాలామంది పిల్లలు స్కూళ్లకు వెళ్లారు. చాలా ప్రాంతాలవాళ్లు ఎప్పటి లాగే వాళ్ల వాళ్ల పనులకు వెళ్లారు. చాలా మతాల వాళ్లు ప్రార్థనా మందిరాలకు వెళ్లారు. అయితే- ఆ రోజు అలా జరుగుతుందని తెలియక చాలామంది ప్రయాణాలు కూడా పెట్టుకున్నారు. అత్తర్ నయాబ్, ఫలక్‌నామాలో లేత్ నడిపే ఆబెదుల్లా, తాడ్‌బన్ బేకరీ ఓనర్ ఇమ్రాన్, బాబానగర్ చాయ్ మాస్టర్ ఫైరోజ్... ఆ నలుగురూ ఆ రోజు గుల్బర్గాలో ఉన్నారు. ఖాజా బందే నవాజ్‌ను దర్శించు కుందామని వాళ్లంతా ఆ రోజు గుల్బర్గా వచ్చారు. ఆబెదుల్లాకు దుబాయ్ వెళ్లడానికి వీసా వచ్చింది. చేస్తున్న పనిలో ఉపయోగం కనిపించక, తోబుట్టువుల పెళ్లిళ్లు చేయడంలో తండ్రికి సహాయపడలేక, దుబాయ్ వెళితే నాలుగు డబ్బులు వస్తాయని, అందుకు మార్గం సులభం కావాలని చాలాకాలం కిందటే అతడు ఖాజాకు మొక్కుకున్నాడు. ఆ మొక్కు ఫలించింది. వీసా చేతికి వచ్చింది. మరో వారంరోజుల్లోనే ప్రయాణం. వెళ్లే ముందు మొక్కు తీర్చుకుందామని, అలా చేస్తే మంచిదని, స్నేహితులతో కలిసి బయలుదేరి వెళుతూ వెళుతూ 'ఆవ్... మామూ' అని అత్తర్ నయాబ్‌ని కూడా వెంటబెట్టుకొని వెళ్లాడు ఆబెదుల్లా. ఒకప్పుడు కాలర్ కింద దస్తీ పెట్టి దర్జాగా కారు తోలుకుంటూ వెళ్లిన నయాబ్‌ను అతడు చూసి ఉన్నాడు. ఇప్పుడు పట్టించుకునే మనిషి లేక దిక్కులేనివాడిలా తిరుగుతున్న అత్తర్ నయాబ్‌ని కూడా చూస్తున్నాడు. ఖాజా దగ్గరకు నయాబ్‌ని తీసుకెళ్తే అతడి బతుకు బాగుపడుతుందేమోనని డ్రైవర్ ఉన్నా కాదని నయాబ్‌ని తీసుకెళ్లాడు. వాళ్లు దర్గాలో ఉండగానే ముంబై తాజ్ హోటల్‌లో పొగలు టీవీల్లో కనిపించాయి. ఆ తర్వాత మంటలు చెల రేగాయి. ఆ తర్వాత పేలుళ్ల శబ్దాలు వాళ్ల గుండెలను దడదడలాడించాయి. వాళ్లు కంగారుపడ్డారు. ఇలా జరిగింది ఏమిటా అని భయపడ్డారు. ఆ భయంతో, ఆ ఆందోళనతో, ఇలాంటి సమయంలో

తిరుగుప్రయాణం మంచిది కాదని రెండు రోజులపాటు అక్కడే ఉండిపోయారు. మూడో రోజు సద్దుమణిగినట్టు అనిపించాక, మరేం భయంలేదని బయలుదేరి అదేరోజు ఇళ్లకు చేరుకున్నారు. ఆరోజు సాయంత్రం గడిచింది. ఆరోజు రాత్రి గడిచింది. మరుసటి రోజు పగలు గడిచింది. సాయంత్రం గడిచింది. రాత్రి అత్తర్ నయాబ్ యింటి తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. ఆ రోజు రాత్రి వాళ్లు- వాళ్లెవరో నయాబ్‌కి ఇప్పటికీ తెలియదు- బహుశా పోలీసులు అయి ఉండవచ్చని భయం భయంగా అంటాడు- తీసుకెళ్లారు.

*

ఆయన కాసేపటి వరకూ ఏమీ మాట్లాడలేదు.

రిపోర్టు కాగితాల మీద పేపర్ వెయిట్ తిప్పుతూ అడుగుదామా వద్దా అడుగుదామా వద్దా అన్నట్టుగా చూశాడు.

ఆ తర్వాత అడిగాడు.

"దీనంతటి నుంచి నయాబ్ ఎప్పుడు బయటపడ్డాడయ్యా?"

*

నయాబ్ ఎవరు? అసలు దీనంతటిలో చిక్కుకున్నది ముష్టాక్. ఇది ముష్టాక్ పడిన హింస. ఇది ముష్టాక్ అనుభవించిన బాధ. ఇది ముష్టాక్‌కు జరిగిన హాని. ముష్టాక్‌కు జ్వరం వచ్చింది. అది- అబ్బాను చూడనందుకు వచ్చిన జ్వరం. అబ్బాను ఎవరో వచ్చి హఠాత్తుగా తీసుకెళ్లినందుకు వచ్చిన జ్వరం. అబ్బాను కావలించుకుని పడుకోవాల్సిన రాత్రి అబ్బా రక్తాన్ని కళ్ల చూసినందుకు వచ్చిన జ్వరం. ఏదో జరిగింది... అబ్బాకు ఏదో జరిగింది... అని అబ్బా... అబ్బా... అంటూ ఆ రాత్రంతా ఏడుస్తూనే ఉన్నాడు ముష్టాక్. వాడి ఒళ్లు కాలిపోతోంది. కళ్లు మూతలు పడుతున్నాయి. మగతగా ఉంది. అయినా మధ్య మధ్యలో ఉలిక్కిపడుతున్నాడు. ఉలిక్కి పడినప్పుడల్లా అబ్బా... అబ్బా అంటున్నాడు. ఏడేళ్ల పసివాడు. అన్నెం పున్నెం ఎరగనివాడు. అబ్బా... అబ్బా... అని ప్రేలా పిస్తున్నాడు. ఆ తర్వాత ఆ పిల్లవాడికి శ్వాస కష్టమైంది. ఊపిరి పీల్చడానికి గుండెలు ఎగరేసే పరిస్థితి వచ్చింది. అది చూసి ఫాతిమా వెర్రిదైంది. బోరుబోరున ఏడ్చింది. తెల్లవారగానే పిల్లవాణ్ణి భుజాన వేసుకొని గోలగోలగా దవాఖానాకు పరుగులెత్తింది. డాక్టర్లు చూశారు. జ్వరం, ఉబ్బసం... రెండూ షాక్ వల్లే అన్నారు. ఏం పర్లేదు... తగ్గిపోతాయని మందులు కూడా ఇచ్చి పంపారు. కాని- ముష్టాక్‌కు జ్వరం తగ్గలేదు. కాసేపు తగ్గినట్టుగా అనిపించేది. మళ్లీ అంతలోనే ఒళ్లు కాలిపోయినట్టు అనిపించేది. రోజులు గడిచేకొద్దీ వాడి ముఖం ఆరిపోయింది. వాడి కళ్లలో వెలుగు తగ్గిపోయింది. వాడి శరీరం వేలాడబడిపోయింది. నోటిలో నుంచి వేడి సెగలు వస్తూ ఉండగా అబ్బా అనేమాట తప్ప మరొక మాటే మాట్లాడేవాడు కాదు. బిడ్డ అవస్థ చూసి, బిడ్డ బాధ చూసి, వేలాడబడిన వాడి లేత దేహం చూసి, ఫాతిమా ఖాజాకు మొక్కుకుంది. దీని నుంచి ఎలాగైనా బయటపడేయి గుల్బర్గా దేవరా... అని నెత్తి బాదుకుంది. ఏడిస్తే పిల్లాడు ఇంకా బెంబేలెత్తుతాడేమోనని ఏడవడానికి కూడా భయపడింది. ముష్టాక్ కట్టెపుల్లలా తయారయ్యాడు. మళ్లీ కోలుకోలేనంతగా తయార య్యాడు. రోజులు గడుస్తున్నాయి. ఒకరోజు... రెండు రోజులు... మూడు రోజులు... నాలుగు రోజులు... మొత్తం పదహారు రోజుల తర్వాత నయాబ్ ఇంటికి వచ్చాడు. కొడుకు కోసమే బతికి వచ్చాడా అన్నట్టుగా వచ్చాడు. ముష్టాక్‌ను ఒక్కసారి చూసి చచ్చిపోదామా అన్నట్టుగా వచ్చాడు. రావడం రావడమే మూల్గుతున్నట్టుగా... ఏడుస్తున్నట్టుగా వచ్చి బిడ్డను చేరుకున్నాడు. ముష్టాక్ కళ్లు తెరిచాడు. బలవంతంగా కళ్లు తెరిచి తండ్రిని చూశాడు. ఆ తర్వాత తండ్రిని గుర్తుపట్టలేనట్టుగా

ఉండిపోయాడు. కాని, తండ్రి చేయి వాడి మీద పడగానే ఆ వచ్చింది తన జన్మకు కారకుడే అన్నట్టుగా వాడి శరీరంలో రక్తం దౌడు తీసింది. లేచి తండ్రిని ఒక్క ఉదుటున కరుచుకుపోయాడు.

*

టైం అయిదైంది.

అల్లాహు అక్బర్... అల్లాహు అక్బర్... అష్‌హదూన్ లా ఇలాహా ఇల్లల్లా...

“భాయ్‌సాబ్. ఇంకా ఎందుకు ఇక్కడ ఉండి వక్త్ బర్‌బాద్ చేసుకుంటారు. అసర్ కీ నమాజ్ కోసం అజాన్ కూడా ఇస్తున్నారు. వెళ్లిరండి భాయ్‌సాబ్. వెళ్లిరండి.”

“నేను చెప్పేది వినమ్మా. మనం గవర్నమెంట్‌తో మాట్లాడదాము. మీకు మేలు జరుగుతుంది. డబ్బు కూడా ఇస్తారు.”

“వద్దు భాయ్‌సాబ్. మీరు ఆ పని చేయవద్దు. లానత్ హై ఉన్ పైసోంకా. ఆ డబ్బును తాకడం కూడా హరాం. ఏం సాబ్. మేము పడ్డ కష్టానికి కాసింత డబ్బు ఇస్తే బరాబర్ అయిపోతుందా? ఇన్‌సాఫ్ అయిపోతుందా? ఏం తప్పు చేశామని మేము? నలుగురు ముసల్‌మాన్‌లు కలిసి ఎక్కడికైనా వెళ్లడం నేరమా? గునా హై క్యా? ఇంత అనుమానం అయితే ఎలా సాబ్ మా మీద? దాని వల్ల మేము పడ్డ బాధ? ఎంత డబ్బు ఇస్తే బరాబర్ అవుతుంది? చెప్పండి సాబ్... డబ్బుతో పోయేదా మా బాధ?”

*

ఫాతిమా నాతో మాట్లాడిన ఆఖరు మాట అది.

ఆ తర్వాత నేను మసీదులో లేను.

ఆఫీసులో కూడా లేను.

ఇంటికి వచ్చేశాను.

ఆ రాత్రంతా నాకు నిద్ర లేదు. వాళ్ల కథ నన్ను క్షణం కూడా నిద్రపోనివ్వలేదు. నయాబ్‌తో పాటు పట్టుకెళ్లిన మిగిలిన ముగ్గురి కథ ఏమై ఉంటుందా అని ఆలోచించాను. వాళ్ల కలలు... వాళ్ల కన్నీళ్లు... కాని ముందు నయాబ్ కథ చెప్పాలి. ఎలాగైనా సరే ఈ కథ లోకానికి తెలియచేయాలి. పబ్లిష్ అయ్యేలా చూడగలగాలి. అలా అనుకొని తెల్లవారుతుండగా అదంతా కూర్చుని రాసేశాను. మధ్య మధ్య గతంలో జరిగిన ఇలాంటి సంఘటనల క్లిప్పింగ్స్‌ను జత చేసి రిపోర్ట్‌ను పూర్తి చేశాను.

తెల్లవారింది.

మసీదులో గడిపిన సరిగ్గా ఇరవై నాలుగు గంటల తర్వాత నేను మా ఆఫీసులో నా హెడ్ ముందు ఉన్నాను.

ఇప్పటి వరకూ నాతో నా హెడ్ మాట్లాడిన మాటలు విన్నారు.

ఆ తర్వాత జరిగిన మాటలు ఇవి-

“ఊ. ఇదంతా పబ్లిష్ అవుతుందనే అనుకుంటున్నావా షకీలూ?”

నేను మాట్లాడలేదు.

“చెప్పు. పబ్లిష్ అవుతుందనే అనుకుంటున్నావా?”

నేను మాట్లాడలేదు.

“తెలుగు సంగతి పక్కన పెట్టు, కనీసం ఇంగ్లీష్ మెయిన్‌స్ట్రీమ్ పత్రికల్లో అయినా ఇలాంటివి పబ్లిష్ అవడం ఎప్పుడైనా చూశావా నువ్వు?”

నేను మాట్లాడలేదు.

"చెప్పవయ్యా. రాయమంటే రాస్తావా?"

"మీరేమనుకుంటున్నారు సార్?"

"నువ్వు చెప్పు."

"అవుతుందనే అనుకుంటున్నాను సార్."

"ఏమిటి? నీకంత నమ్మకం షకీలూ?"

"మీ మీద నమ్మకం సార్."

"నా మీదా?"

"అవున్సార్. మీ మీదే కాదు, అప్పుడప్పుడైనా సరే అరచేతులు అడ్డుపెట్టి ఆత్మను కాపాడుకుంటున్న మన పత్రికల మీద నమ్మకం. సత్యం వైపు నిలబడగిలిగిన ధీరోదాత్తులు గుప్పెడు మందైనా ఉండకపోతారా అని నమ్మకం."

"చూడబోతే నీకు మన న్యాయవ్యవస్థ మీద అంత నమ్మకం ఉన్నట్టు కనిపించడం లేదయ్యా..."

"మసీదులో పడి ఉన్న ఆ ముగ్గురినీ చూస్తే మీరు ఆ మాట అనరు సార్."

"అంటే?"

"నయాబ్‌ను పట్టుకెళ్లాక బస్తీలో అతడి ఇంటి చుట్టుపక్కల వాళ్లు భయపడి వాళ్లను తరిమేశారు. వాళ్లకిప్పుడు ఉండటానికి ఇల్లు లేదు. తినడానికి తిండి లేదు. ధైర్యం చెప్పడానికి కాస్తంత ఆసరా లేదు. ఆడుతూ పాడుతూ మసీదులో రాళ్లను ఎగరేస్తూ ఉండే ఆ ఏడేళ్ల పసివాడు ముష్టాక్ ఇవాళ రాళ్ల దెబ్బ తిన్న పక్షికూనలా పడి ఉన్నాడు. వాడి నుంచి వాడి నవ్వు మాయమైంది. వాడి ధిక్కారం మాయమైంది. వాడి ఆత్మవిశ్వాసం మాయమైంది. అసలు వాడి నుంచి వాడి బాల్యమే మాయమైంది. ఒక పిల్లవాడు- ఎలాగైనా సరే అమ్మానాన్నలను పోషించుకోగలను అని కళకళ లాడుతూ నవ్వుతూ తిరిగే ఒక పసివాడు- వాడు కూడా వాడికి లేకుండాపోయాడు. ఇక నయాబ్. అతడు ఇక మీదట ఎటువంటి కలా కనలేడు. ఎందుకంటే అతణ్ణి పట్టుకున్నన్ని రోజులు నిద్ర నుంచి దూరం చేశారు. రెప్ప మూసినప్పుడల్లా శబ్దాలు చేసి భయపెట్టారు. నిద్రంటేనే భయపడేలా చేశారు. అతడి అంగం పనికి రాదు. దానికి కరెంట్ పెట్టారు. అతడి ఆనస్ రప్చర్ అయ్యింది. అందులో లాఠీలు గుచ్చారు. అతణ్ణి అన్నిరోజులూ తలకిందులుగా వేలాడదీశారు కనుక మామూలుగా నిలబడటానికి జంకుతున్నాడు. అతడి మీద బూటుకాళ్లతో రోజూ ఒక మనిషి నడిచేవాడు కనుక చుట్టుపక్కల అడుగుల చప్పుడు వింటేనే ఉలిక్కిపడుతున్నాడు. అతడికి టెర్రరిస్ట్ అంటే తెలియదు. ఎక్స్‌ప్లోజివ్స్ అంటే తెలియదు. ప్లాట్ అంటే తెలియదు. లింక్ అంటే తెలియదు. కాని, ఇప్పుడలాంటి మాటలు వినబడితే చాలు ప్యాంట్‌లో తెలియకుండానే మూత్రం జారపోసుకుంటున్నాడు. మీరు న్యాయవ్యవస్థను ప్రస్తావించారు. నాకు మన న్యాయవ్యవస్థ మీద నమ్మకం ఉంది సార్. పూర్తిగా నమ్మకం ఉంది. వంద మంది దోషులు తప్పించుకున్నా పర్వాలేదు... ఒక్క నిర్దోషికి కూడా శిక్ష పడకూడదని మన న్యాయవ్యవస్థ అంటూ ఉంటుంది. కాని సార్- నయాబ్‌ను చూశాక, ముష్టాక్‌ను చూశాక, ఫాతిమాను చూశాక ఒకటే అనిపించింది. ఒక్క దోషికి శిక్ష పడకపోయినా పర్వాలేదు... కాని వందమంది నిర్దోషులు తప్పించుకోవాలి. వేయిమంది. వీలైతే లక్ష మంది. వాళ్లంతా హాయిగా గుండెల మీద చేయి వేసుకొని పడుకోవాలి. నాక్కూడా ఒక కొడుకు ఉన్నాడు. రేపు ఉత్తిపుణ్యానికి నన్ను కూడా ఎత్తుకొనిపోతే మూడేళ్ల మా అబ్బాయి తట్టుకోలేడు.

వాడికి జ్వరం వస్తుంది. అలాంటి పసివాళ్లు ఎన్ని ఇళ్లలో ఎంతమంది ఉన్నారో తెలియదు. వాళ్ల కోసమైనా మీరు ఈ రిపోర్టు అచ్చు వేసి తీరాలి సార్.''

ఆయన ఏమీ మాట్లాడలేదు.

రిపోర్ట్ వైపే చూస్తూ ఉండిపోయాడు.

కాసేపటి తర్వాత హఠాత్తుగా సీట్‌లో నుంచి లేచాడు.

``ఎక్కడికి సార్.''

``పద.''

``ఎక్కడికి సార్.''

``రాశావుగా. మనసు ఊరుకుంటుందా? మసీదుకి. నేను వాళ్లను కలవాలి.''

కారు స్టార్ట్ అయ్యింది.

ఆఫీసు నుంచి బయటికొచ్చి నెమ్మదిగా రోడ్డు మీద ఉన్న వాహనాల్లో కలిసి పోయింది.

ఆయన అన్నాడు.

``ఈ లోకం ఇంకా గొడ్డుపోలేదయ్యా షకీలూ. నేను మన పైవాళ్లతో మాట్లాడతాను. మన మేనేజ్‌మెంట్‌తో మాట్లాడతాను. ఆ కుటుంబాన్ని మన సంస్థ తరపున దత్తత తీసుకోవచ్చేమో ట్రై చేద్దాం. కుదిరితే మంచిది. కుదరకపోయినా పర్వాలేదు. ఇలాంటి వారిని ఆదుకునే ఇన్‌స్టిట్యూషన్స్ దృష్టికి తీసుకువెళదాం. మనం చెప్తే కాదనే ప్రసక్తి ఉండదు. నయాబ్‌కు బెస్ట్ ఆఫ్ ది హాస్పిటల్స్‌లో ట్రీట్‌మెంట్ చేయిద్దాం. ఏం కాదు. అతడు బాగైపోతాడు. ముష్టాక్... నాకు ఆ బుజ్జిగాణ్ణి చూడాలని ఉందయ్యా. నువ్వు రాశావే... బంగారం. ప్రతి పిల్లాడూ బంగారమేనయ్యా. నాకూ మనవడు ఉన్నాడు. వాడికి అలాంటి కష్టం వస్తే నేను ఏమవుతానో నాకు తెలుసు. ఇవాళ డేట్ ఎంత? న్యూ ఇయర్ ఇంకా ఎన్ని రోజులు ఉంది? దగ్గర. చెప్తున్నాను చూడు. కొత్త సంవత్సరంలో వాళ్లకు కొత్త జీవితం వచ్చేలా చేద్దాం. మళ్లీ ఆ కుటుంబం నవ్వుతూ మొక్కు తీర్చుకోవడానికి ఖాజా దగ్గరకు గుల్బర్గా వెళ్లేలా చూద్దాం. ప్రామిస్.''

నేను ఆయనవైపే చూశాను.

``ఇదేమైనా ఈ సమస్యకు సొల్యూషనా సార్?''

``కాకపోవచ్చు. కాని, కనీసం అది మనం చేయదగ్గ ప్రయత్నం.''

``మరి నా రిపోర్ట్ సంగతి? అది కూడా మనం కనీసం చేయదగ్గ ప్రయత్నమే కదా సార్?''

*

సంవత్సరం గడిచిపోయింది.

మళ్లీ నవంబర్ 26 వచ్చింది.

ముంబై దాడుల పాత ఫొటోలు, క్లిప్పింగ్‌లు బయటకు తీసి, ఆ సంఘటన జరిగి సంవత్సరం అయిన సందర్భంగా స్టోరీ ఫైల్ చేస్తూ ఉంటే నాకెందుకో నయాబ్ గుర్తుకొచ్చాడు.

అత్తర్ నయాబ్... ఫాతిమా... ముష్టాక్...

ఆ తర్వాత వాళ్లు ఏమయ్యారో నాకు తెలియదు.

మా ఉదారత్వాన్ని కృతజ్ఞతలతో తిరస్కరించాక వాళ్లు మళ్లెప్పుడూ నాకు మసీదులో కనిపించలేదు.

వాళ్ల గురించి ఎవరూ ప్రస్తావించలేదు.
నేను మాత్రం ఇప్పుడు కూడా ప్రతి శుక్రవారం నమాజుకు వెళుతూ ఉన్నాను.
చేతులు సాచి దుఆ చేస్తూనే ఉన్నాను.
మెట్లు దిగి కిందకు వస్తున్న ప్రతిసారీ నాకు ముష్టాక్ గుర్తుకు వస్తాడు.
క్యా సాబ్... దో రుపయ్? అనే వాడి దబాయింపు గుర్తుకు వస్తుంది.
పాంచ్ రుపాయ్ ఇస్తే కృతజ్ఞతగా నవ్వే వాడి పసిబంగారపు నవ్వు కూడా.

*హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ, 2010*

ఇప్పుడో... ఇంకాసేపట్లోనో...

# గెట్ పబ్లిష్డ్

***ఎక్కడో కొడితే ఎవరి పళ్లో రాలిపోయాయన్నట్టు అన్ని పరిణామాలకూ భారతదేశంలోని ముస్లింలు అవసరంగా జవాబుదారీ కావడం... గిల్ట్‌తో నిలబడటం... దారిన పోతుంటే చూశారా మీవాళ్లు... చూశారా మీ సద్దాము... చూశారా మీ ముషర్రఫ్... చూశారా మీ... సానియా మిర్జా వాడెవణ్ణో చేసుకుంటే కూడా చూశారా మీ దేశభక్తి? ఇలా నిలదీసేది ఎవర్నీ?***

మా అన్న కావలి నుంచి ఎప్పుడైనా హైద్రాబాద్ వస్తే ఇల్లు కదల్డు. ఒకరోజున్నా, రెండ్రోజులున్నా, వారమున్నా సరే టీవీ ముందర కూచుని చానెల్స్ మార్చుకుంటా ఉండిపోతాడు. అట్లా బయటకు పోయి ఊరు చూడ్రాదా... అంటే పోడు. భయం. పోతే... పోలీసులు పట్టుకుంటే?! అంటాడు. పోలీసులు వీణ్ణెందుకు పట్టుకుంటారు? మా ఊళ్లో వీడో ఎలక్ట్రీషియన్. ఎనిమిది వరకూ చదువుకున్నాడు. రోజుకు వందో రెండొందలో మహా అయితే మూడొందలో సంపాదిస్తాడు. ఇద్దరు పిల్లలు, మా వొదినె. మా నాన్న కట్టించిన పాతకాలం ఇల్లు. వీడి పనేదో వీడి లోకమేదో. నలభై అయిదేళ్లొచ్చినా అందులో అంగుళం మార్పులేదు. మరి పోలీసులు వీణ్ణెందుకు పట్టుకుంటారు? టి.వి. చూస్తుంటాను. ఫలానా గణేష్ నిమజ్జనం రోజు ఫలానా ఆగస్టు 15న, ఫలానా జనవరి ఇరవయ్యారో తేదీ దేశమంతా రెడ్ అలెర్ట్ అంటారు. అంటే ఏమిటి? నాంపల్లి, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్స్‌లో పడి భారీ సోదాలు. గడ్డాలు, మీసాలు, నెత్తి మీద తెల్లటోపీ, లాల్చీపైజామా... పొట్టకూటి కోసం ట్రైను దిగి వెర్రిచూపులో, పిచ్చిచూపులో చూస్తూ పోలీసులు కనబడగానే అకారణంగా భయపడే ముస్లిమ్ కుర్రాళ్లని గొడ్లను ఈడ్చుకెళ్లినట్టు ఈడ్చుకెళుతుంటారు, వాళ్ల పాత సంచులనూ పిచ్చి బ్యాగులనూ పట్టుకొని లాగుతూ. వీళ్ల దగ్గర ఏం ఐడెంటిటి ఉంటుంది... మేం ఫలానా అని చెప్పడానికి? వీళ్లకు ఏం పలుకుబడి ఉంటుంది... మేం ఫలానావారి తాలూకు

అని చెప్పడానికి? అసలు వీళ్లకు ఏదైనా ఒక ఐడెంటిటీగాని ఒక పలుకుబడిగానీ మిగిల్చారా? ఎక్కడో ఏదో గలాటా అవుతుంది... ఒక ఇరవైమందిని లిఫ్ట్ చేస్తారు. ఎక్కడో ఏదో గృహదహనాలు... రాళ్లదాడి... ఇంకో ఇరవైమందిని లిఫ్ట్ చేస్తారు. ఆ తర్వాత వాళ్ల గతి దేవుడికెరుక. అదంతా భయం. నాలాంటివాడికీ... మా అన్నలాంటి వాడికీ సమస్త ముస్లింలకూ భయం. పోలీసులు పట్టుకుంటే?!

నేనూ, ఖాదర్‌గారూ, డానీగారూ, ఇంకా యాకూబ్‌పాషా, వేంపల్లి షరీఫ్‌లాంటి కుర్రాళ్లం నలుగురైదుగురం కలిసి గుల్బర్గా వెళ్లామనుకోండి. దర్గా చూసుకొని సరదాగా తిరిగొద్దామనుకున్నా మనుకోండి. అక్కడి లాడ్జిలో మమ్మల్ని రాత్రికి రాత్రి అరెస్టు చేసి, ఉగ్రవాదులకు శిక్షణ ఇవ్వడానికో ఇంటలెక్చువల్ డిస్‌కోర్స్ చేయడానికో ఏదైనా లింక్ కోసం ట్రై చేయడానికో వీళ్లు హైద్రాబాద్ నుంచి వచ్చారని, పైకి జర్నలిస్టులుగా పనిచేస్తున్నా వీళ్లంతా స్లీపర్‌సెల్స్‌గా పనిచేస్తున్నారని అక్కడి ఎస్.పి. ప్రెస్‌మీట్ పెట్టి మమ్మల్ని మీడియా ఎదుట ప్రెజెంట్ చేసి చెప్పాడనుకోండి... ఏమవు తుంది? మాకే పాపం తెలీదు అంటే ఒక్కరూ నమ్మరు. వాళ్లో వీళ్లో ఎందుకు గత పదిహేనిరవై సంవత్సరాలుగా మేము తెలిసిన ఈ సంకలనం సంపాదకులు కూడా ఆ వార్త చూసి, 'ఏమోనండీ చాలా ఆశ్చర్యంగా ఉంది... చెప్పలేం...' అని తమ వంతు ఓటేసి వాళ్ల పనుల్లో వాళ్లు సీరియస్‌గా మునిగిపోతారు. కిటికీలో నుంచి గంజాయి పడేసి పోలీసులు అరెస్టు చేసే అమాయకులకైనా అప్పీలుంటుంది. మాకు అదీ ఉండదు. ఎందుకంటే మేము అదే. అదే. అదే. అది తప్ప వేరేది కావడానికి వీలులేదు.

ఆడవాళ్లని క్యాప్చర్ చేసి వాళ్లను సంకెళ్లతో కట్టేయడమే ఒక ఘోరం. అంతటితో ఆగక వాళ్ల మీద అత్యాచారం చేయడం ఇంకా హీనం. ఇవన్నీ చేస్తూ కూడా ఆడవాళ్ల ఆగడాలను భరించలేకపోతున్నాం సుమా అన్నట్టుగా ఉంటుంది ముస్లింల పట్ల ఈ దేశంలోని మెజారిటీల సంగతి. ముస్లింలను తన్ని, తిట్టి, మూలకు నెట్టి, వాళ్లను పేదవాళ్లుగా మిగిల్చి, వాళ్ల మసీదు కూలగొట్టి, ప్రభుత్వ ఆధ్వర్యంలో వేలాదిమందిని చంపి, వాళ్లు కూడా మామూలు మనుషులే ఈ సంఘంలో వాళ్లకూ సమానమైన అవకాశాలు దక్కాలి అనే మాటే ఎత్తనీకుండా చేసి ఉల్టా వాళ్లు దొంగలు... ఖూనీకోర్లు... ఉగ్రవాదులు అని చావతన్నే పరిస్థితి ఈ దేశంలో స్థిరపడటానికి సరిగ్గా ఇరవై ఏళ్లు పట్టింది. ఈ ప్రచారం కొనసాగేలా చేయడానికి పకడ్బందీ వ్యవస్థ తయారైంది. బుద్ధి జ్ఞానం, చదువు సంస్కారం ఉన్నవాళ్లు కూడా ఒక విద్వేషం నింపుకునేలా చేయడానికి ప్రపంచ మంతా, అంటే అమెరికా ఆశించే ప్రపంచమంతా... లేదా అమెరికాను ఆదర్శంగా తీసుకునే/ఆరాధించే ప్రపంచమంతా కట్టుదిట్టంగా ప్రయత్నించింది. మనదేశంలో పై నుంచి కింద వరకూ అలాంటి ప్రపంచమే తయారయ్యింది. ఎక్కడో కొడితే ఎవరి పళ్లో రాలిపోయాయన్నట్టు అన్ని పరిణామాలకూ భారతదేశంలోని ముస్లింలు అవసరంగా జవాబుదారీ కావడం... గిల్ట్‌తో నిల బడటం... దారిన పోతుంటే చూశారా మీవాళ్లు... చూశారా మీ సద్దాము... చూశారా మీ ముషర్రఫ్... చూశారా మీ... సానియా మిర్జా వాడెవణ్నో చేసుకుంటే కూడా చూశారా మీ దేశభక్తి? ఇలా నిలదీసేది ఎవర్నీ? ఈ దేశంలో తోపుడుబండ్ల మీద బిస్కెట్లు అమ్ముకునే ముస్లింలనీ, మాంసం కొట్టువాణ్ణీ, దర్జీని, పిల్లల్ని స్కూలు దాకా తీసుకెళ్లి వదులుదామనుకుంటున్న ఒక మధ్య తరగతి ముస్లిం తండ్రిని... వీళ్లా వీటన్నింటికీ కారణం?

ఇరాక్‌లోని ముస్లింలందరినీ వాళ్లతో పాటు షకీలాని చంపేయదల్చుకున్నాం అని అమెరికా ఆర్మీ చీఫ్ అంటే ముస్లింలు సరే షకీలా ఏం పాపం చేసిందని జోక్ నెట్‌లో ప్రచారం అయ్యింది. కొంచెం కుడి ఎడమలుగా భారతదేశంలోని ముస్లింల పరిస్థితి పీడన విషయంలో ఇంతే. వాళ్లను పీడిస్తే ఎందుకు అని అడిగే గొంతే లేదు. అది లేదు కనుక వాళ్లను ఎవరైనా లిఫ్ట్ చేస్తారు... ఎప్పుడైనా... ఎక్కడైనా...

గెట్ పబ్లిష్డ్ రాయడం వెనుక ఇదంతా ఉంది. ఒక అక్రమ అరెస్ట్... అరెస్ట్ అంటే ఏమిటి? అరెస్టయ్యి లోపలికి వెళ్లినవాళ్లనే చూస్తున్నారు అందరూ... వాణ్ణి కొట్టారనో కొట్టలేదనో వాడికి బెయిల్ వచ్చిందనో... రాలేదనో... కాని నా కథ అది కానేకాదు. అరెస్టయ్యి లోపలికి వెళ్లి బయటకు వచ్చే లోపల చాలా కథ జరుగుతుంది. సొసైటీ ఆ కుటుంబాన్ని ఏం చేస్తుంది? ఆ కుటుంబసభ్యులు ఎలా విలవిలలాడతారు? అరెస్టయినవాడితో అటాచ్‌మెంట్ ఎక్కువగా ఉన్నవాళ్లు ఎలా సఫర్ అవుతారు? నిరపరాధిగా బయటకు వచ్చేశాడు కదా... అనుకునే లోపల జరిగే డ్యామేజ్... ఒక జీవితకాలం పడుతుంది సరిచేసుకోవడానికి.

ఒకరోజు ఆఫీసులో ఏపి/ఏఎఫ్‌పి చూస్తున్నాను. ఏపి/ఏఎఫ్‌పి అంటే మీడియా సంస్థలకు ప్రపంచవ్యాప్త ఘటనల ఫోటోలను పంపే ఏజెన్సీలు. ఒకచోట ఒక ఫోటో కనిపించింది. జపాన్‌ది. టోక్యో హాస్పిటల్‌లో హై ఫీవర్ నుంచి కోలుకుంటున్న ఏడేళ్ల పిల్లవాడు అని ఫోటో ఇచ్చారు. ఇరాక్ నుంచి వచ్చిన ఒక కుర్దు గడువు ముగిశాక కూడా ఇంకా ఆ దేశంలో ఉంటున్నందున ఆ పిల్లవాడి ఎదుటే అరెస్ట్ చేసి తీసుకెళ్లారట. తండ్రిని అలా అరెస్ట్ చేయడం చూసి అతడితో ఎక్కువ అటాచ్‌మెంట్ ఉన్న ఆ పిల్లవాడికి హైఫీవర్ వచ్చింది. అసలే ఇరాక్‌లో బాగాలేదని ఆ తండ్రి కుటుంబంతో సహా పారిపోయి వస్తే ఇక్కడ ఇదీ పరిస్థితి. నాకెందుకో ఆ పిల్లవాణ్ణి చూస్తే చాలా ఏడుపొచ్చింది. గెట్ పబ్లిష్డ్‌కు బీజం అక్కడే పడింది.

అప్పుడే నేను నసీరుద్దీన్ షా 'వెడ్‌నెస్ డే' చూశాను. డివిడి వస్తే ఒక ఆదివారం ప్లే చేసి సినిమా అయిన వెంటనే మళ్లీ ప్లే చేసి ఒక వారంలో మూడుసార్లు చూశాను దాన్ని. ఆ నెరేషన్ నన్ను చాలా ఎగ్జయిట్ చేసింది. కథను కూడా ఇలా రేసీగా ఎందుకు చెప్పకూడదు... బ్లాక్స్ బ్లాక్స్‌గా. పైగా సర్క్యులర్ నెరేషన్. ప్రారంభంలో మొదటి బిందువు దగ్గర మొదలయ్యి చుట్టూ తిరిగి క్లైమాక్స్ అనే చివరి బిందువుతో వృత్తాన్ని ముగిస్తే తప్ప కథ అర్థంకాదు. ఇది కొత్త. కాని కథంతా అంతరంగంలో తయారుచేసుకొని స్పష్టత వచ్చాక రాసుకుంటూ పోతే పాఠకుడికి ఇది అందుతుంది అనిపించింది. ఈ వస్తువుకు ఇదే జోడి అనుకున్నాను. నేపథ్యంగా నాకు పరిచయం ఉన్న బంజారా హిల్స్ పెద్ద మసీదు ఉంది. అక్కడి మెట్ల మీద కనిపించే బిచ్చగాళ్ల పాత్రలు ఉన్నాయి. ఎడిటర్‌గా కొంత పతంజలి, రిపోర్టర్‌గా నాబోటివాడు, నాయబ్‌గా పదిహేనేళ్ల క్రితం టోలిచౌకీలో నేను చూసిన యూసుఫ్ అనే ఒక అమాయకుడు. ఆర్నెల్లు పట్టింది కథ ముగియడానికి.

కాని ఈ కథ రాస్తున్నంత కాలం నన్ను దిగులు పెట్టిన విషయం వేరే ఉంది. అది మీడియాలో పెరిగిపోతున్న యాంటీ ముస్లింశక్తుల సంఖ్య. ఒకప్పుడు మీడియాలో ఎక్కడచూసినా లెఫ్ట్‌పార్టీల వాళ్లో ఆ భావజాలం ఉన్నవాళ్లో ఉండేవాళ్లు. మేలు చేయకపోయినా కీడు జరక్కుండా అడ్డుపడే వాళ్లు. ఇవాళ వాళ్లు అంతరించిపోయారు. మిగిలినవాళ్ల నోరు కుట్టేశారు. ఒకళ్లిద్దరి నోళ్లు ఉన్నా... వాళ్ల దగ్గరకు వాళ్లూ వీళ్లూ చేరి... అదేదో తప్పయినట్టు... మీరెందుకండీ ముస్లింలను వెనకేసుకొస్తారు అనవసరంగా... అని అంటూ ఉండేసరికి- కచ్చితంగా చూశాను... పై ఏం మాట్లాడినా తమ అంతరంగాల్లో- ముస్లింలు దుర్మార్గులు- అనుకునే స్థితికి ఘనత వహించిన ఆలోచనాపరులు చాలా మంది వచ్చేశారు- ముస్లింలతో స్నేహాలు కూడా వదులుకునే స్థాయిలో.

రోజులేం బాగోలేవు. ముస్లింల గురించి పెద్దగా ఏం బయటకు వచ్చే అవకాశం లేదు. వ్యతిరేకంగా తప్ప వారి మర్యాద కాపాడే ఒక్క వాక్యం కనిపించే వాతావరణం లేదు.

ఈ జాతి బాగుపడుతుందన్న నమ్మకం నాకు లేదు. ఈ కాలు కుళ్లిపోతుంది. ఒక కాలుతోనే ఈ దేశం భవిష్యత్తులో కుంటుతూ ముందుకు పోతుంది.

*16 జనవరి 2013*

*'గెట్ పబ్లిష్డ్' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

27

# ముసలమ్మ మరణం

## మహేంద్ర



*మహేంద్ర పేరుతో కథలు రాసిన మధురాంతకం మహేంద్ర 1959 జులై 16న చిత్తూరు జిల్లాలో జన్మించారు. 1978లో తొలి కథ కనిపించని కోయిల డిసెంబర్ 1979-జనవరి 1980 భారతి మాసపత్రికలలో అచ్చయ్యింది. స్వర్ణసీమకు స్వాగతం అనే నవల రాశారు. జూన్ 1995 ఇండియా టుడేలో తన చివరి కథ వ్రతం అచ్చయ్యింది. ఎస్.వి. గ్రామీణ బ్యాంకులో మానేజర్‌గా ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో 1998 జూన్ 12న మరణించారు. 14 కథలు మాత్రమే రాసిన వీరి ఆఖరి రచన ఈ కథానేపథ్యం.*

చీకల సుబ్బమ్మ చెరువుకట్ట పైనుంచి టవునుకు పోతున్న తారురోడ్డు చిమ్మచీకటిగా ఉంది. ఎండిపోయి, బీటలువారి, తుప్పలు, కంపలుగా ఉన్న చెరువుకట్ట మీది నుంచి ఈదురుగాలి ఆరంభమయింది. చెరువుకట్ట మీద ఒక ఎద్దులబండి పెద్ద డ్రమ్ములో నీళ్లు నింపుకుని టవును వైపుగా సాగుతోంది.

దీపాల జాతరలా ఉన్న పట్టణం నుంచి పారిపోయి వస్తున్నట్టుగా ఇనుముతో తయారుచేసిన ఖడ్గమృగం లాంటి మోటారు సైకిలొకటి తారురోడ్డుమీద దూసుకు వచ్చింది.

''అన్నా, దేశిరెడ్డిగారి ముసల్ది కాలమయిపోయింది,'' అన్నాడు ఎద్దులబండిని తోలుతున్న సూరి. మోటారుసైకిలును ఆపుజేసి ఒక్కసారిగి చేష్టలుడిపోయినట్టుగా నిలిచిపోయాడు పిచ్చిరెడ్డి. ఎడతెరపి లేని వ్యాపార లావాదేవీలవల్ల దినానికి నాలుగైదుసార్లయినా టవునుకూ, పల్లెకూ తిరగక తప్పని పిచ్చిరెడ్డికి రోడ్డుమీద ముసలామె ఎదురుకాని సమయాలు తక్కువ. చీకలమ్మ గుడి నుంచి మునిసిపల్ బస్టాండ్ దాకా జనం పిచ్చిరెడ్డి బుల్లెట్టును సింగాన్ని జూసినట్టుగా జూసి తొలగిపోతుండగా, దేశిరెడ్డి గారి ముసల్ది మాత్రం కడదాకా లెక్కపెట్టింది కాదు. ఇంత

బదుకూ బదికి చివరికి ఒక ముసల్దాన్ని సాధించలేకపోతున్నాననే ఉక్రోషం అతనిలో రోజురోజుకూ ప్రణంగా పెరిగి సలపరించింది. చివరికామె కట్టె ఎప్పుడు కడతేరిపోతుందా అని ఎదురు చూస్తున్నాడు పిచ్చిరెడ్డి. అదీ జరిగిపోయింది. నమ్మశక్యం గాకుండా నిలబడిపోయిన పిచ్చిరెడ్డి వెనుక వస్తున్న లారీ హారన్ కొట్టడంతో బండి కదిలించాడు.

మోటారు సైకిల్ వేగం పుంజుకుంది. పిచ్చిరెడ్డి మెదడులో ఆలోచనలు చుట్టలు విప్పుకుని లేస్తున్నాయి. అతడు చదివింది నాటు చదువే అయినా, ఇంజనీర్లకే ఎస్టిమేట్లు చెప్పగలడు. డబ్బు దగ్గర అతడి జాగ్రత్తను జూసి మార్కెట్టు చౌకులో మార్వాడీలు కూడా నివ్వెరపోవటం కద్దు. పాము తలమీద ఉన్న మణిని కూడా సాధించగల అష్ట తెలువులూ, తన దగ్గరున్న గులకరాయిని కూడా వెలలేని వజ్రంగా చెలామణీ చేయగల సకల మాయోపాయాలు కలిపి అతడు అనేక వ్యాపారాలు చేస్తున్నాడు. ఈ క్రమంలోనే చెరువుకింద పల్లె నుంచి మునిసిపల్ లిమిట్ దాకా గల భూముల్నంతా అతడు అంచెలంచెలుగా ఆక్రమించుకున్నాడు. దీనికి ఆఖరి అడ్డంకిగా ఉండిన ముసల్ది కూడా ఈ దినం కాలమయిపోయింది. అతడి మనసు ఎకరాలుగా పడివున్న బీడుభూముల్ని క్షణాల మీద అంకణాల్లోకి, అడుగుల్లోకి మార్చి మదింపులు వేస్తోంది. ఊరు సమీపిస్తుండగా అతడికి తక్షణ కర్తవ్యం గుర్తుకు వచ్చింది. అతడు ముఖాన్ని నల్లగా జేసుకున్నాడు. ముసల్దాన్ని సాధించలేకపోవటం వల్ల తాను పొందిన విషాదానికి అంత్యక్రియలు చేయదలచుకున్నట్టుగా అతడు కార్యరంగంలోకి ప్రవేశించాడు.

చెరువు కింద పల్లెలో విద్యుద్దీపాలు లోవోల్టేజీ వల్ల లాంతర్లలా వెలుగుతున్నాయి. ఊర్లోని జనం దేశిరెడ్డిగారి ఇంటి ముందు గుమికూడుతున్నారు. అప్పుడొకరు అప్పుడొకరుగా వెళ్లి ముసలామె కాయాన్ని జూసి వస్తున్నారు. పక్కింటి నాగులు భార్య సులోచన ముక్కు చీదుకుంటూ ఇంట్లోకీ వీధిలోకీ తిరుగుతోంది.

"ఏ టయింలో పాణం పోయుంటుంది?" వివరాలు సేకరిస్తున్నాడు పిచ్చిరెడ్డి.

"ఏ యరవకని జెప్పటం? వారం దినాలు ముందు కూడా బాగా తిరగతా ఉండినామె గదా. అయితే, నాలుగు దినాల నుంచి ఆయమ్మకు ఏడలేని జరం కాసేసింది. నిన్నటి నుంచి ఒళ్లు సోదీనం తప్పి పడిపోయింది. అప్పటికీ మా బావతో చెప్పి పేట నుంచి జరం మాత్రలు తెప్పించి తాపించినా, ఈ పొద్దు పయిటాళ నాలుగ్గంటల సమయంలో కొడవలి కోసం నేను ఇంట్లోకి వచ్చినప్పుడు గూడా గోరాస్తా ఉండింది. ఆ పయిన మళ్లొక గంటకు నేనొక గళాసు పాలు తీసుక పొయ్యి తాపించనుబోతే మనిషి నడుము నిలవకుండా జారిపొయ్యింది. కడాకు నల్లనీల్లు కూడా మింగుడు పడలా, నాకు కాళ్లూ సేతులూ ఆడలే - దిక్కులే తెల్లే," గొంతు జీరపోయి ఏడవసాగింది సులోచన.

"ఎంత బదుకు బదికిన మనిసి! ఎందరికి పెట్టి పోసాపణ చేసిన పుణ్ణాత్తురాలు! ముగ్గురు కొడుకులూ, ముగ్గురు కోడాండ్లూ, మనవళ్లూ, మనవరాండ్లూ, సంబందుగులూ, సుట్టాలూ - ఇంతమందీ కలిగి కడాకు దిక్కులేని సావు సచ్చింది గద," జనం ఇంటి ముందర దిన్నెలమీదా, వీధిలో వాల్చిన మంచాలమీదా కూర్చొని వగచసాగారు.

"ఏం జేస్తాం? కొడుకుల్నని ఏమి పుణ్ణెం? ఈ ముసల్ది కూడా తక్కువయింది గాదు. మహా మకురుబట్టిన మనిసి. అదేం మతమో సావనైనా సచ్చిందిగానీ పట్టినపట్టు వొదిలింది గాదు. అసలు సేద్దాలు జేసి ఈమెగానీ, సచ్చి మన్నుకింద పడుకోనున్న ఈమె అబ్బ దేశిరెడ్డిగానీ కొడుకులకు, మనవళ్లకు ఏమి వరగబెట్టినారో జెప్పు? కడాకు ఈమె కొడుకులు కడుపాత్తరం కోసి రాజ్యమంతా

తిరిగి బిడ్డా పాపల్ని సాక్కుంటూ ఉండారు. చీకల చెరువు బొట్టునీళ్లు లేకుండా ఎండి ఈనటికి ఏడు ఎనిమిదేండ్లు అవతా ఉండాది. చెరువు కింద బావులు బొక్కినోళ్లు తెరుచుకోనుండాయి. మళ్లన్నీ బీళ్లయిపోయి కడాకు తాగను మంచినీళ్లు దొరకని అగసాట్లు వొచ్చిపడినా, ఈ ముసల్దినేలను అమ్మనిచ్చుందిగాదు. అదీ టవునుకు కాసంత అందుగడిలో ఉంది కాబట్టి మన నేలలూ ఒక రేటు పలకతా ఉండాయి. ఉండే బీడును అమ్మేసి వచ్చింది. ముగ్గురు కొడుకులకూ తలా నలభైయో, ఏభైయో వేలు ఇచ్చేసుంటే- ఏ కొడుకు ఇంటికాడ పడుండినా వాళ్లు ఈమెను సాకేసుందురుగద. ఈ ముసల్ది చచ్చేంతదాకా ఈ మాటను చెవిలో వేసుకోలే. అయితే ఈ పొద్దు జనమంతా కన్నతల్లిని కండ్లజూల్లేదని కొడుకుల్ని అగుడు జేసేవాళ్లే గదా....'' అన్నాడు పిచ్చిరెడ్డి.

''అదంతా మనకు ఎందుకలేన్నా, ముందు జరిగే పని జూడండి. సత్యవేడులో మునిరత్నమన్నకు చెప్పేదానికి గురవయ్యను పంపినాము. రాజారెడ్డి అత్తగారింటికి పోయినాడని చెప్పుతా ఉండారు. నిన్నటికే రావాల్సిందంట. వస్తాడో, రాడో - అక్కడికీ ఒక మనిషిని పంపాం. శంకరన్నకు చెప్పేదానికి రేణిగుంటకు ఒకరు పోయిరాండీ,'' అంటూ జరగవలసిన తతంగాన్ని గుర్తు చేశాడొక పెద్దమనిషి. అప్పటికప్పుడు లారీలో, లాస్ట్ బస్సులో పట్టుకుని బయల్దేరటం కోసం మనుషుల్ని కూడబలుక్కున్నారు. సద్దు మణిగింది.

ముసలామె బదికుండగా ప్రతి శుక్రవారం చీకలమ్మ గుడిలో పొద్దుపోగానే విధిగా దీపం వెలుగుతుండేది. ఆ రోజు మొదటిసారిగా ఆ కార్యక్రమానికి ఆటంకం వాటిల్లింది.

ఆ దీపం ఇప్పుడు సుబ్బమ్మవ్వ తలవాకిట వెలుగుతూ వుంది.

*

తెల్లవారింది. ఊరు ముందర బస్సులు దిగి అప్పుడొకరు అప్పుడొకరు రావాల్సిన కొడుకులు, కోడాండ్లు, దూరపు చుట్టాలు వచ్చినారు. చుట్టుపక్కల నాలుగైదు మైళ్లలో వున్న పల్లెల నుంచి జనం పుంతదారుల గుండా, మడిగట్లమీదా వరుసగా వస్తుండటం మధ్యాహ్నందాకా కొనసాగింది. పిచ్చిరెడ్డి ధారాళంగా ఖర్చుపెట్టడం ప్రారంభించాడు. ఇంటిముందర పెద్ద షామియానా వెయ్యించాడు. వచ్చిన జనం కూర్చోను బెంచీలు, మంచాలు వేయించినాడు. చిన్నబిడ్డలకు తన ఇంట్లోనే కాఫీలు, టిఫిన్లు చేయించినాడు.

సుబ్బమ్మ పుట్టిందీ, పెరిగిందీ, చివరకు కడతేరిపోయిందీ కూడా ఆ ఊర్లోనే. సుబ్బమ్మ భర్త చిన్నబ్బరెడ్డి వచ్చింది ఇల్లటం. దేశిరెడ్డికి సుబ్బమ్మ ఒక్కతే కూతురు. పెండ్లయినాక సుబ్బమ్మకు ముగ్గురు కుమారులు కలిగినారు. దాదాపు ఆమెకు నలభై ఏండ్లు వచ్చేదాకా ఆమె హయాంలో జరిగిన సేద్యాన్ని చుట్టుపక్కల పది పన్నెండు ఊర్ల జనం ఇంకా కతలుగా చెప్పుకుంటారు. అంతబదుకు బతికే దానికి మానవ మాత్రులతరంగాదనీ, వారి పూర్వీకురాలై పేరంటాలైన చీకలమ్మ అంశతో జన్మించిందనీ, అందుకే ఆమె వాక్కు మొక్కబోకుండా బదుకు సుఖోజయంగా జరగతా ఉండాదనీ అనుకునేవాళ్లు.

చెరువుకింద పల్లెలో మొదటిల్లు చీకలోళ్లదేనని, తొట్టతొలీగ వాళ్లు ఈ గడ్డ మీద అడుగు బెట్టినప్పుడు ఆ పాయకట్టంతా తొండలు గుడ్లు పెట్టుకునే బంజరు బూవిగా ఉండేదని అంటారు. ఒట్టి వెలి సేద్యాల మీద బతకలేక సమ్మత్సరం పండి, సమ్మత్సరం ఎండగ్గా ఉండిందట. అప్పుడు చీకలోళ్ల ఇంటి పెద్దాయన ఒకడు ఒకనాడు పొద్దుగూకదాకా చింతలొంగలో ఇసుకగొడ్డమీద కూసోని యోచించినాడంట. 'ఈ వొంగ సమ్మత్సరంలో ఎనిమిది నెలలు నీటిసుక్క లేకుండా ఇసుక బోసుకోనుండినా వర్సాకాలం ఎగవనుండే రాగిమాను కనమలో వాన్లు బడితే చాలు-

మనిషిని దాటనీకుండా ఎఱ్ఱనీళ్లతో ఒరుసుకొని పోతా ఉండాది. దీనికి సరైన చోట చెరువు కడితే మళ్లీ ఈ పాయకట్టకు వరుసగా ఏడేండ్లు వానలు లేకపోయినా బావుల్లో నీళ్లు తగ్గవు' అనుకున్నాడంట.

ఆ చెరువు కట్టేదానికి ఆయన పడిన బాధలు ఇన్నీ అన్నీ కావంట. అప్పుడుండే పాళెగాణ్ణి ఒప్పించేదానికి రెడ్డి సత్రసాము జేసినాడంట. కడాకు రెడ్డి ఒనరికనూ, తాపత్రయాన్నీ జూసి పాళెగాడే చెరువుకట్ట, కాలువ కాపాడుకోవలసిందిగా ఎనిమిదెకరాల భూమి మాన్యంగా ఇచ్చేసినాడంట. చెరువు కట్టేదానికి మొదట ఊర్లోని జనమంతా మునపడినా ఖర్చు కాను కాను మిగతా అందరూ వెనకడుగు వేసినారంట. కడాకు ఆ చెరువుకట్టను రెడ్డి సొంత ఇంట్లో నగలన్నీ ధారబోసుకున్నాడంట. అంతజేసీ చెరువుకట్ట పూర్తయినాక తొలిసారీగా వొచ్చిన పెద్ద వొంకకు కట్ట గండిపడిపోయింది. అది మొదలు ఎన్నిసార్లు కట్టపోసినా చెరువు నిలవక పొయ్యేసరికి దేశిరెడ్డికి దిగులు ఎత్తుకునింది. ఒకదినం రాత్రి ఆయనకు కల్లో ఒక దేవతామూర్తి కనబడి రెడ్డితో సొంత కూతుర్ని బలి ఇస్తేగానీ కట్ట నిలవదని చెప్పిందంట. ఆ అర్ధరాత్రి రెడ్డి, ఆయన భార్య లేసి కూసోని ఈ సంగతి చెప్పి ఏడ్చుకున్నారు. ఈ సంగతి ఆయన కూతురు ఎట్ట ఇనిందో గాని - తెల్లారేసరికి ఆయమ్మ చెరువు గండి దగ్గరే పడి పాణం ఇడిచేసిందంట. ఆ సమ్మత్సరం చెరువు నిండి మొరవపోయిందని, అప్పటినుంచి చీకలమ్మకు గుడికట్టి ఏడాదీ కొలువు జరిపిస్తా ఉండారని చెప్పుకుంటారు.

*

సుబ్బమ్మ బాల్యమంతా ఆ చెరువుగట్టు మీదనే గడిచిపోయింది. తోటి సావాసగాపుల్తో చెరువులో ఈతలు కొట్టటమూ, చింతచెట్లకు ఊయలలు గట్టి ఊగటమూ, కట్టమీదనే పశువుల్ని మేపుకోవటమూ ఆమె నిత్యకృత్యాలుగా ఉండేవి. సమ్మత్సరం ఆరు నెలలకు తక్కువ గాకుండా ఆ చెరువు మొరవ తొండంతో పోసినట్టుగా పారుతా ఉండేది. కాలవల నీళ్లు ఆ పల్లెను దాటుకుని ఎనిమిది పల్లెలకు పారేవి. చెరువు కిందనున్న బావుల్లో నీళ్లు నేలమట్టానికుండి- ఎండ వేళలా ఎన్నెల వేళలా అవి ఆకాశాన్ని, పక్షుల్ని, చెట్లకొమ్మల్ని గుండ్రటి అద్దాల్లా ప్రతిఫలిస్తుండేవి. వేసవి కాను కాను చెరువులో నీళ్లు తగ్గుతూ వచ్చేవి. చెరువు నీళ్లు తగ్గి అక్కడక్కడ పచ్చిక భూములు తయారై సాయంసంజె వేళల్లో అవి పసిడికాంతులీనేవి. చెరువునీళ్లు తగ్గి, మొరవ పారడం తగ్గిన దినాల్లో రైతులు బావుల్లో నీళ్లు తోడటానికి కబిళ్లు కట్టేవారు. తెల్లవారింది మొదలు వాళ్ల యాల పాటలతో ఆ పట్టు అంతా నిండిపోతూ ఉండేది. ఎండలు బలిసి వాన చినుకుల కోసం బూమి, కొండలు, ఆకులు రాల్చేసిన చెట్లు తపించిపోతుండగా, తొలకరి చినుకులు రాలేవి. తొలి ముంగారి వానలకు మట్టివాసన పొంగి, కొత్త చివుళ్లతో నేల కళకళలాడేది. తర్వాత వారం పది రోజులు విడవకుండా జడివానలు పట్టుకునేవి. వాన కురిసిందంటే చింతలొంక జలజలా పొంగి వచ్చేసేది. కట్టు కాలువలు సరిజేసి నీళ్లు తిప్పటం తడవు, చెరువు నిండి మొరవ ఎత్తుకునేది. వాన కురిసినన్నాళ్లు చెరువంతా కప్పల బెకబెకలతో హోరెత్తిపోయేది.

సుబ్బమ్మ కూతురుగా పుట్టినా కొడుకుగానే పెరిగింది. సేద్యంలో నాద్యంలో ఆమెకు తెలియని పనిలేదు. ఎద్దుల్ని గట్టి మడక దున్నటం, బండి తోలటం, అండ చెక్కటం, కలుపు తీయటం మొదలుకుని అన్ని పనులూ ఆమె అలాగ్గా చేసుకొని పోయేది. పదిమంది కూలోళ్లకు వండటం ఆమెకు ఎప్పుడూ ఒక లెక్కలో ఉండేది కాదు. బిచ్చంవేళ వొట్టి జోలెల్తో, ఆకలివేళ వొట్టి కడుపుల్తో ఎవరూ ఆమె గడప దాటుకుని పొయ్యేటోళ్లు గాదు. మంచి ప్రాయంలో ఆమె ఒక్కతే ఉన్నచోట కూడా పదిమంది ఉండేంత సందడిగా ఉండేది. కూలోడు నాలోడు, సుట్టమూ

పక్కమూ, ఇరుగూ పొరుగూ అని లేకుండా ఊర్లో ఒకర్నీ వొదలకుండా ఆమె మంచీ చెడ్డా విచారిస్తూ ఉండేది. ఏ పండుగ్గైనా మొదట ఆమె లోగిట్లోనే అడుగుపెట్టేది. జాతర్లకు, తిరణాలకు ఆమెకు ఎక్కడలేని ఉత్సాహం పొంగుకొచ్చేది. వెన్నెలకుప్పల్లాడ్డంలోనూ, కోలాటాలు వేయటంలోనూ ఆమెకు అలుపూ సొలుపూ ఉండేది గాదు. సమ్మత్సరానికి ఒకసారి జరిగే చీకలమ్మ తిరణాలలో పట్టు పావడా కట్టి ఆమె చెంగున తిరుగుతూ ఉంటే - చుట్టుపక్కల ఊర్లోళ్లు ఎదపడి చూసేవారని చెప్పుకుంటారు.

సుబ్బమ్మకు పెండ్లయినాక చిన్నబ్బరెడ్డి ఇల్లటం వచ్చినాడు. ఇల్లటం మొగుడు ఊర్లో సిన్నంగా సూడబడరాదని సుబ్బమ్మ ఆడపనీ, మొగపనీ అంతా నెత్తినేసుకోని మాంతమైన ముదిగారంతో మొగుడ్ని కొడుకుల్తో సమంగా సాకింది. ముగ్గురు కుమారులు కలిగి, వాళ్లు అయిదో తరగతి దాటి హయిస్కూలు కోసం టవునుకు పోను మొదలుబెట్టే వరకూ- ఆమె రాచరికం జరిగింది. ఆ పైన్నే కూడబలుక్కున్నట్టు కష్టాలు ఒకదానిమీద ఒకటి వచ్చిపడినాయి.

వరుసగా నాలుగయిదేండ్లు వానలు పడకపోవటంతో చెరువు నీళ్లు హరించుకుపోయాయి. అయిదేండ్ల తర్వాత ఒకే ఒక రాత్రి అప్పటికప్పుడు మొబ్బులెక్కి జడివాన కురిసి తెల్లారే లోపల మనుషుల్ని దాటనీకుండా పెద్ద వొంక వొచ్చేసింది. రెండు పగళ్లూ, రెండు రాత్రుల్లో చెరువు నిండి పోయింది. 'అయిదేండ్ల కరువూ అయిద్దినాల్లో తీరిపోయింది గదన్నా, బగమంతుడు కన్ను తెరిస్తే ఎంతసేపు,' అనుకున్నారు రైతులు. నిండు పాలకుండకు చిల్లు పడ్డట్టుగా ఆరోనాటి రాత్రి చెరువుకు గండి పడిపోయింది. అంత చెరువు కరువులో కాపాడిన పైర్లమీద పారిపోయి రైతుల కడుపుమంట పోసుకునింది. 'ఎప్పుడు ఏసినకట్టో- ఏ ఓబికాలంలో కట్టిన చెరువో! గండిని నిలేసి కట్టను బలం జెయ్యాల,' అన్నారు కొందరు.

చెరువు కిందనే బూములున్న రాజపురం నాయుళ్లు తమ బూముల్లో జవుకు లెత్తుకుని ఏ పైర్లు సక్రమంగా కాకపోవడం వల్ల - సేద్దగాళ్లతో జెప్పికావాలనే కట్టను తెంపించేసినారని చెరువు కింద పల్లెలో కొందరు రెడ్లు అనుకోబట్టారు. అయిదునాళ్లలో నిండిన చెరువు అంతంత మాత్రంగా మిగిలి ఆరు నెలల్లో ఎగబీల్చుకపొయ్యింది.

దేశిరెడ్డిగారి సుబ్బమ్మకు చెరువు మేరగా సంక్రమించిన పట్టెడలకు చెరువునీళ్లు పారక పోయినా, వాళ్లవి చెరువుపైన మొదటి కయ్యాలే అవటం వల్ల బావుల్లో ఎప్పుడూ నీటి శాంబరం తగ్గేదిగాదు. చెరువు ఎండినాక అన్ని బావుల్లో లాగే క్రమంగా ఆ బావుల్లో కూడా నీళ్లు అడుగంటాయి. రాను రానునీళ్లు చాలక సగం పైర్లయిన తర్వాత గూడా పైర్లను పశువులతో మేపుకోవలసి వచ్చింది. నాలుగైదు ఏండ్లు మారేసరికి ఎండల కాలం బావుల అడుగుల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి.

సుబ్బమ్మ కొడుకులకు టవున్లో చదువులు ఎక్కకపోయినా సినిమాలు చూడడమూ, సిగరెట్లు తాగడమూ, హోటళ్లలో తినడమూ అబ్బింది. పెద్దకొడుకు శంకరరెడ్డి తొమ్మిదో తరగతి దాటకుండానే బడికి పోవటం మానుకున్నాడు. ఎన్నిసార్లు రాసినా చిన్నకొడుకు రాజారెడ్డికి ఎస్సెస్సెల్సీలో ఏదో ఒక పరీక్ష మిగిలిపోతూ ఉండింది. రెండోకొడుకు మునిరత్నం రెడ్డికి మాత్రం కొంత చదువు అబ్బింది. అయితే, అతడూ హైస్కూలు చదువుతోనే ఉద్యోగ ప్రయత్నాల్లో పడ్డాడు. కొడుకులు ఇట్లా చదువులకూ చెడి - అట్లా సేద్యాలకీ తరంగాక పొయ్యేటప్పటికి సుబ్బమ్మకు మనోవేదన పట్టుకుంది. గాదుల్లో వొడ్లు తగ్గి తిండి గింజలకు కూడా అప్పు సొప్పులు కావాల్సి వచ్చింది. పెద్ద సంసారం చేస్తుండిన సుబ్బమ్మకు చేతులు కట్టిపడవేసినట్టు అయిపోయింది. పెండ్లాం అలుసుతో చిన్నబ్బరెడ్డి చీట్లాడడానికీ, ఇంట్లోనే దొంగతనాలు చేయడానికీ మరిగినాడు.

కడాకు నాలుగైదు ఏండ్లకు చస్తాడనంగా మితిమించిన తాగుడు అలవాటు అయింది. బదికే దోవ చూడమని కొడుకుల్తోనూ మొగునితోనూ సతపోరీ పోరీ సుబ్బమ్మకు సందేళకు గొంతు రాసుక పొయ్యేది. ఇంటి పనీ, బైట పనీ సాకిరీతో సుబ్బమ్మ నలభై ఏండ్లకే ఎనభై ఏండ్లు వచ్చినట్టుగా ఉడిగిపొయ్యింది. మొగుడి సావూ, దినాలూ- కొడుకులకు పెండ్లిండ్లూ, కాన్పులూ, దేవర్లూ- అన్ని కరువు కాలంలోనే వొచ్చిపడినాయి. పైర్లు పండక, అప్పులు దొరక్క సుబ్బమ్మ బక్కచిక్కి కేవలం కట్టెగా మిగిలింది. అత్తగారి ప్రాపకంతో పెద్దకొడుకు శంకరరెడ్డికి రేణిగుంట కాడ మిషనాసు పత్రిలో అటెండరుగా ఉద్యోగమొచ్చింది. మునిరత్నంరెడ్డికి తాలుకాఫీసులో క్లర్కుగా సత్యవేడులో ఉద్యోగం అయింది. చిన్నకొడుకు సైకిలు మీద టవునుకు పాలు అమ్ముతూ పెండ్లయ్యేదాకా తల్లితోనే ఉండినాడు. కాపురం వచ్చిన ఏడాదికే చిన్నకోడలు అత్తను కన్నమాటలూ అడిగి అలిగి మొగున్తో కూడా టవున్లోనే కాపురం పెట్టింది. ప్రాయంలో పదిమందికీ పెట్టి సాకి సంతరించిన సుబ్బమ్మకు అవసానకాలంలో ఓరిమిత్తిగా ఇంట్లో తానే వొండుకొని తానే తినుకోవాల్సిన గతి వచ్చి పడింది.

గాలికాలం చింతచెట్లకింద కాయలు ఏరుకోవడమూ, మిగిలిన ఒకటో రెండో బక్కగొడ్లను చెరువు కట్టమీద మేపుకోవడమూ, మిట్టపైర్లు జేసేదానికి లేని మల్లగుల్లాలు పడడంతో ముసలామె చివరికాలం ప్రారంభమయింది. ఎండి, బీటలు వారి రాగిమాను కనుమదాకా నిరామయంగా, నిర్జీవంగా పడి ఉన్న చెరువును జూసినప్పుడు ఆమెకు తరచు చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుకొచ్చేవి. గొడ్లు మేపుకుంటూ తన దగ్గరకొచ్చే పిల్లలకు ఆమె చెరువు నిండటమూ, పైర్లు పండటమూ, జనం సంతోషంగా ఉండటం గురించి నోరు నొచ్చేటట్టుగా చెబుతూ ఉండింది. గండిపడి చెరువు పూర్తిగా ఎండిపోవడం వల్లే ఇంత కరువూ వొచ్చిందనీ - చెరువు నిండితే మళ్లీ నాలుగైదేండ్లు కరువు వొచ్చినా భయం ఉండదనీ ఆమె ఊర్లో తన మాటవిన్న ప్రతి పెద్దమనిషికి నెత్తిన నోరు బెట్టుకొని చెప్పింది. తన కాలం చెల్లిపోయేలోగా చెరువు నిండాలన్నదీ, చీకలమ్మకు మళ్లీ కొలువు జరిపించాలన్నదీ ఆమె చివరి కోరికగా మిగిలిపోయింది.

సుబ్బమ్మ ఎండలు మండిపొయ్యే మద్యానాల్లో కట్టమీద చింతచెట్ల కింద కూచొని చీకలమ్మ గుడిని, చెరువును చూచి దినాల తరబడి వగచుకుంది. కట్టను మరమ్మతు చేసుకుందామని విన్నవాళ్ల కందరికీ నోరు నొప్పి పుట్టేట్టు చెప్పింది. ఊర్లో ఎవరికీ లేకపోయినా చీకలమ్మ మాన్యం అనుభవిస్తున్నందుకు తామైనా ఆ పనికి పూనుకోక తప్పదని ఆమె నమ్మకం. చీకలమ్మ తమ ఇంటి ఆడబిడ్డ. తమ ఇంటి దేవత. ఆమెను అనాదరం చేసినందువల్లే తమ కుటుంబానికిన్ని అగసాట్లు- ఈ ఊరికిన్ని పడుపాట్లు. తన పుచ్చిమీదక నూనె లేకపోయినా అరువుదెచ్చిన నూనెతోనైనా ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా ఆమె చీకలమ్మ గుడిలో దీపం పెట్టింది.

చివరకు చెరువుకట్ట కట్టే పనికి కాంట్రాక్టు కుదిరింది. కట్ట కడుతుండగా సుబ్బమ్మ దినం తప్పకుండా పని జరుగుతున్న తావుకు వెళ్లేది. కాంట్రాక్టర్లకూ, కూలీలకు ఆమె వండిపెట్టింది. చెరువు పారంబోకునూ, పూడిపోయిన కాలువలనూ గుర్తించడం కోసం కరణాలు, తాశీల్దార్లు వచ్చినప్పుడు వాళ్లకు కోళ్లు కోసిపెట్టింది. కట్ల పని పూర్తయినా, కట్టు కాలువల్లో పూడిక తీయడం ఆగిపోయింది. మొదటి సంవత్సరం వానలు పడి చింతలొంక దొర్లి - కట్టు కాలవల్లో నీళ్లు రాక, చెరువు నిండక పోయినప్పుడు ఆమె సొంత ఇంట్లో పెళ్లి ఆగిపోయినట్లు బాధపడింది. కాలవలు సరిగ్గా తిప్పేటప్పటికి చెరువు నిండీ నిండకుండానే కంట్రాక్టర్ల అరకొర పనివల్ల కట్ట మళ్లీ

తెగిపోయింది. కాంట్రాక్టు తనకు రాకపోవడం వల్ల పిచ్చిరెడ్డే ఈ పని చేయించినడని కొంతమంది అనుకున్నారు. నలుగురికీ పంటలు పండి ఊరు బాగుపడితే తన వడ్డీ వ్యాపారం దెబ్బతింటుందని రత్నంనాయుడే ఈ పని చేయించినాడని మరికొంతమంది అనుకున్నారు.

సేద్యాలు మూలబడ్డంతో రైతులు వారి వారికి చేతనయిన కూలిపనికో, వ్యాపారానికో పోయి బతుకు తెరువు చూసుకోసాగారు. మునిసిపల్ లిమిట్ దాటుకుని రెండు మూడు ఫర్లాంగుల మేరా చెరువుకింద పల్లె రోడ్డు పక్కల ఇండ్ల ప్లాట్లు వేశారు. ఇంకొన్ని రోజుల్లో చెరువులో కూడా ఇండ్లు కట్టిస్తారనీ, చెరువుకింద పల్లె కూడా టవున్లో కలిసిపోతుందనీ చెప్పుకోసాగారు. మంచి రేటు వస్తాదనే ఉద్దేశంతో భూమిని అమ్మేయాలని నిర్ణయించుకున్నాక సుబ్బమ్మ కొడుకులు తల్లిని ఒప్పించేదానికి శతవిధాల సతపోరినారు. తగవులాడుకున్నారు. మద్దిస్తాలు చేసుకున్నారు. శంకరరెడ్డి ఒకనాడు తల్లిమీద చెయ్యి కూడా చేసుకున్నాడు. గజినీ మహమ్మదులా పిచ్చిరెడ్డి, కొడుకుల్ని ముగ్గుర్నీ సుబ్బమ్మ మీదకు పద్దెనిమిదిసార్లయినా ఎగతోలాడు. ముసలామెను ఒప్పించడానికి ఎవరి తరమూ కాలేదు. తాను బదికుండగా చీకలమ్మ మాన్యాన్ని అమ్మనీయనని సుబ్బమ్మ తెగేసి చెప్పింది. ఆ యాష్టతోనే చివరకు కన్నకొడుకూ, కోడలూ అలిగి టవున్లో అత్తగారిల్లు చేరినారు. అంతమంది ఉండి ముసలామె చివరకు దిక్కులేనిదయింది.

నాలుగయిదు నెలలుగా ముసలమ్మకు ఒళ్లు ఒకసారి ఉన్నట్టు ఒకసారి ఉండటం లేదు. సేద్యం జరిగినన్నాళ్లు ఆమె ఒళ్లు గుల్లజేసుకుని పాటుపడింది. సేద్యం మూలబడినా కరువు కాలం జూసి నరకయాతన పడింది. అనారోగ్యానికీ వార్ధక్యానికీ మనోవేదన తోడై ముసలమ్మ కాలం జేసింది. ఆ ఊరికంతా మొదటి ఇల్లయిన దేశిరెడ్డిగారి ఇల్లు మూతబడిపోతూ ఉంది.

ఇంటిముందు షామియానా కింద జనసమ్మర్దం పెరిగింది. పిచ్చిరెడ్డి టవున్నుంచి శివ్వలు తెప్పించాడు. పలకలు గొట్టే వాళ్లకు కడుపునిండా కల్లూ, సారాయీ తాగించినాడు. వచ్చిన మనుషులందర్నీ పేరుపేరునా గమనించినాడు. రాజపురం నాయుళ్లందరూ ఇంటికొక్కరు మొక్కబోకుండా వచ్చినారు. మన్నూరు, మాలేపాళెం, చింతలగుంట, చీపులపల్లి, కొత్తమిట్టూరు- చుట్టుపక్కల ఇరవై పల్లెల నుండి జనం వచ్చినారు.

ఇంటిముందర వేసిన మంటలో పలకలు, డప్పులు కాగాయి. అవి దరువులు మార్చి మార్చి మోగాయి. నీరుగట్టి సుబ్బయ్య గొంతు సవరించుకుని కీచుగొంతూ, బొంగురుగొంతూ కలగలిపి పాట పాడాడు - "ఏలినావు గదా, ఈ పాయకట్టంతా మొనగాడివై వో పరదేశిరెడ్డీ- మిట్ట మద్యానం పదిమంది నీ ఇంటికొస్తే మళ్లా నీ ఇంట్లో ఎసురు పెట్టాల్సిన పనిలేదుగదా - నీ కాలమంతా చెరువు నిండి తొండం లావుతో మొరవబోయింది గదా - బావుల్లో నీళ్లు నాలుగడ్డేళ్లు తగ్గలేదు గదా మధ్య మధ్యలో పలకలు మోగుతుండగా మళ్లీ పాడసాగాడు సుబ్బయ్య "పరదేశిరెడ్డీ, దేశిరెడ్డీ, చిన్నబ్బరెడ్డీ - "నీ కట్టె జరిగినన్నాళ్లు ఒంటిచేతిమీద ఏడూర్లకూ వొండివారిస్తివి గదా, ఊరంతా కలిసినా నీ పట్టు ఇడిపించలేక పోయిరి గదా - పుణ్ణాత్తురాలా, సుబ్బమ్మా, సుబ్బారెడ్డీ".

పొద్దు గూట్లో పడేవేళకు దహనం పూర్తయింది. అంత జనానికి కావల్సిన నీళ్ల కోసం పిచ్చిరెడ్డి ఎద్దులబండిలో రాత్రి పదకొండు గంటలదాకా డ్రమ్ములు తోలించినాడు.

*

దహనం పూర్తయిన పదకొండు రోజులకు దినాలు పెట్టుకున్నారు. ముగ్గురు అన్నదమ్ములూ ఒకచోట మళ్లీ కూడటం కష్టం. కాబట్టి దినాలు తీరిన మరునాడే రిజిస్ట్రేషను పెట్టుకోమనీ ఊదరగొట్టాడు పిచ్చిరెడ్డి. ఈ పదిరోజులూ పొద్దుగూకులూ భూమి అమ్మకం బేరాలు ముమ్మరంగా

జరిగాయి. చివరకు నేలను తనకే అమ్మకతప్పని పరిస్థితిని కల్పించాడు పిచ్చిరెడ్డి. పెద్దవాళ్లిద్దరికీ ఉద్యోగాలకు పెట్టుకున్న సెలవు అయిపోవడంతో రేటును తొందర తొందరగా నిర్ణయించుకోవాల్సి వచ్చింది. అన్నదమ్ములు ముగ్గురికీ తలా అరవై వేలు ఇచ్చేట్టు వెల ఒప్పందం కుదిరింది. అయితే, రిజిస్ట్రేషనుకు ఒక గంట ముందుగా తలా నలభై వేలు మాత్రం ఇచ్చి మిగిలిన ఇరవై వేలు మూడు నెలల లోపల ఇచ్చేటట్టు పత్రం రాసిచ్చాడు పిచ్చిరెడ్డి. చివరి వరకూ ఈ తిరగాసు అర్థంకాని అన్నదమ్ములు ఆఖరి గడియలో హతాశులయ్యారు. భూమి అమ్మకం పూర్తయిన మరుసటి దినం దేశిరెడ్డిగారి ఇల్లు మూతబడింది.

ఆ తరువాత పిచ్చిరెడ్డి దగ్గరకు అలుపూ, సొలుపూ లేకుండా అరవైసార్లు తిరిగి ఇద్దరు అన్నదమ్ములు మాత్రం భూమి అమ్మకం బాపత్తు ఇరవై వేలూ అప్పుడు కొంచెం, అప్పుడు కొంచెం రాబట్టుకున్నారు. ఎక్కడో మారుమూల ఊర్లో ఉన్న కారణంగా మునిరత్నం రెడ్డికి రావాల్సిన ఇరవై వేలూ ఇంకా అందలేదు. అగ్రిమెంటు గడువు కూడా పూర్తయి కేవలం కొన్నవారి కనికరం మీద ఆధారపడవలసిన అగత్యం ఏర్పడింది. పెట్టిన గడువులు చెల్లిపోయాయి. జాబులకు దేనికీ బదులు లేదు. చివరికి ఒకటి రెండు రోజులు సెలవుపెట్టి ఒక శనివారం సాయంకాలం ఆరుగంటల ప్రాంతంలో టవునుకు వచ్చిపడ్డాడు మునిరత్నం రెడ్డి.

బస్సు దిగినప్పటి నుంచి అతడు టవునంతా చెడ తిరిగాడు. అన్ని మండీలు, బ్రాందీ షాపులూ గాలించాడు. చెత్తా చెదారంతో దుమ్ముకొట్టుకుపోయిన వీధులలో తిరగడం వల్ల అతడి బట్టలు మాసిపోయాయి. గొంతులో తడారి నీరసం ముంచుకు వచ్చింది. కూల్‌డ్రింకులనబడే రంగునీళ్ళు తాగడంవల్ల నాలుక చవి చెడిపోయిందిగానీ దప్పిక తీరలేదు. హోటళ్లలో నీళ్లు ఉప్ప గానూ, చప్పగానూ, మురికి మురికిగానూ ఉండి ఇంపితం కాలేదు. ప్రతి వీధిలోనూ బోరింగుల దగ్గర, నీటి కొళాయిల దగ్గర ఆడవాళ్లు తోడేళ్లలా కీచులాడుకుంటున్నారు. చివరకు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఒక వీధి మలుపులో మునిరత్నంరెడ్డి ఆపద్బాంధవుడిలా తారసపడ్డాడు సూరి. అతడు ఇప్పుడు పిచ్చిరెడ్డి ట్రాక్టరుకు డ్రైవరుగా ఉంటూ, ట్యాంకులో టవునుకు నీటిని తోలు తున్నాడు. అప్పటికే అతడి కార్యక్రమం పూర్తయి, ఇంటి ముఖం పడుతున్నాడు.

మునిరత్నంరెడ్డి సూరితో తన గోడునంతా వెళ్లబోసుకుని పిచ్చిరెడ్డిని ఎలా అయినా చూపించ వలసిందిగా ప్రాధేయపడ్డాడు.

ట్రాక్టరు టవును శివార్లు సమీపిస్తున్నా రోడ్డుపక్కనున్న షెడ్లు, వర్క్‌షాపులు, బంకులు తరగడం లేదు. టవును దినదినానికి పెరిగిపోతూ ఉంది. సుబ్బమ్మ కొడుకులకు సొమ్ము పూర్తిగా ఇవ్వకముందే ఆ నేలను ఎవరో మద్రాసు వారికి అమ్మేశాడు పిచ్చిరెడ్డి. వారికి ప్రభుత్వం వద్ద గొప్ప పరపతి ఉంది. వాళ్లు భూమిని ఆక్రమించుకున్నంత త్వరగా, నేలను చదునుచేసి పెద్ద డిస్టిలరీస్ కడుతున్నారు. పనులు చకచక జరిగిపోతున్నాయి. చెరువుకింద పల్లె గల్లీ రూపం ధరిస్తూ ఉంది. పిచ్చిరెడ్డి దగ్గర్నుంచి తనకు రావాల్సిన సొమ్మును రాబట్టుకోవడం ఎంత కష్టమో అవగతం అయ్యే టప్పటికి మునిరత్నంరెడ్డికి నవనాడులూ కుంగిపోయాయి.

“అయితే, ఈ పిచ్చిరెడ్డిని నేను ఎట్లా సాధించేది? నేనుండేది ఆ మారుమూల కొంపలో. ఇంత దూరంలో ఉన్న ఈ టవునుకూ, ఎంతమాత్రం అందుగడిలో లేని ఈ పల్లెకూ వేళగాని వేళలో ఎట్ల తిరిగి వచ్చేది?” వగచసాగాడు మునిరత్నంరెడ్డి.

“దానికేమీ బయంలేదు మునిరత్నమన్నా. మనూరికి ఇప్పుడు రాత్రి పదిగంటలదాకా టవును బస్సులుండాయి. అయితే, చెరువుకింద పల్లె అని బోర్డు ఉండదు. సీకేపల్లి అని ఉంటాది.

రూపాయిస్తే నిన్ను చీకలమ్మ గుడికాడ దించేస్తాడు. అసలు ఇంకొన్ని దినాలకు ఇక్కడ ఒక చెరువు ఉన్నట్టు ఆడియాలం ఉండదు. పుణ్యపురుషులు మీ తాతోళ్లు, పుణ్ణాత్తురాలు మీ అమ్మా ఈ ఊరికి ఆదరువుగా ఈ చెరువును కట్టించి, దానికోసమే ఒళ్లు గుల్ల చేసుకోని సచ్చిన్నమయిరి. వాళ్లెవురూ టెండర్లేసుకోని పదిమంది సొత్తునూ అప్పనంగా జవురుకోని పోలేదు. టాంకుల్లో, డ్రమ్ముల్లో నీళ్లు అమ్ముకోలే. సల్లపూట ఇంకా కడుపుమండే ఈ మాటలెందుకు? రాత్రికి మా ఇంట్లో మాకు కలిగింది తిని పడుకో. తెల్లవారే లేసి చీకలమ్మకు దణ్ణం పెట్టుకోని నీ ఊరికి బయల్దేరు. నీ సొత్తు గట్టిదయితే ఏదో ఒకనాటికి నీకాడికే నడిచివొస్తాది. ఎందుకైనా మంచిది-ఒకసారి చెరువు కల్లజూసి ఫో. ఈసారి నువ్వొచ్చే సమయానికి దాని ఆనవాలు కూడా ఉండదు. 'చీకల సుబ్బమ్మ చెరువు' అనే పేరు ఇంక పాత రెవెన్యూ లెక్కల్లో తప్పించి ఇంక ఎక్కడ కన్పిస్తాదిలే,'' అన్నాడు సూరి.

ట్రాక్టరు చీకలమ్మ గుడి దగ్గర ఊర్లోకి మలుపు తిరిగింది. గుడిచుట్టూ ఉండిన పొగడ చెట్ల నుంచి వస్తూ ఉండిన పాత పరిమళం ఒకటి మునిరత్నం రెడ్డి మదిలో పొరాడింది. పొగడ చెట్లు ఎండిపోయాయి. ఇప్పుడు ఆవైపు నుంచి టైర్లు కాలిన వాసన ఒకటి వెగటు పుట్టిస్తూ వస్తోంది.

*చిరస్మరణీయుడు కట్టమంచి రామలింగారెడ్డిగారికి అంకితం*

*ఇండియా టుడే పక్షపత్రిక*
*జూలై 21-5, ఆగస్టు 1992.*

నేపథ్యం

ఒంటరి ప్రతిఘటన

# ముసలమ్మ మరణం

***కథ సిద్ధాంతవ్యాసం కాదు, సామాజిక మూలాలు, అధ్యయన లోపం వల్ల కథ డైల్యూట్ అయ్యే ప్రమాదం ఉందిగానీ, అన్ని వివరాలు, గణాంకాలు గుప్పించడం వల్ల కథ డాక్యుమెంటరీగా మారి సాహిత్య ప్రతిపత్తిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది.***

వ్యవసాయ ప్రధానమైన గ్రామసీమల్లో చెరువుల సంరక్షణావశ్యకతను గుర్తించిన కావ్యం కట్టమంచివారి *ముసలమ్మ మరణం.* వర్షాకాలం నీళ్ళను వృధాగా పారబోసుకుని వట్టి ఎడారి ఇసకమేటగా మిగిలిపోయే పెన్నాతీర కష్టజీవుల బతుకుపాట విశ్వంగారి *పెన్నేటిపాట.* ఇల్లూ, ఒళ్ళూ గుల్ల చేసుకుని కష్టాల కరువులో అలమటించి పాతాళానికి బావిని తవ్విన అభాగ్యుడైన రైతు కన్నీటి కథ సభాగారి *పాతాళగంగ.*

జీవనదులు అంతగా లేని రాయలసీమలో జలవనర్ల వ్యవస్థ అంతా పరిమిత కాలం ప్రవహించే చిన్నవాగులూ, చిన్న నదులూ- ఆ నీటిని మరింతకాలం నిలువచేసే చిన్నవీ, పెద్దవీ అయిన చెరువులూ- చెరువులోని నిలువ నీటివల్ల మరింతకాలం పొలాలకు నీళ్ళు ఇవ్వగల బావుల మీద ఆధారపడి ఉంది. వీటిలో చెరువులకు గల ప్రాముఖ్యత ఎంతో విశిష్టమైనది. 'కంట్రిబ్యూషన్ టు ది ఇండియన్ సోషియాలజీ' లో డా॥ ఉమాశంకరిగారు రాసిన 'మేజర్ ప్రాబ్లెమ్స్ ఇన్ మైనర్ ఇరిగేషన్: సోషల్ ఛేంజ్ అండ్ టాంక్ ఇరిగేషన్ ఇన్ చిత్తూరు డిస్ట్రిక్ట్' అనే వ్యాసంలో ఇలా రాశారు.

'Of these (rivers, tanks and wells), tanks are of critical importance. Since the Streams are rainfed, they remain dry for the most of the year. Tanks on the other hand, store rain water for future use. Wells get recharged most effectively when there is standing wanter in the tanks.'

అంతేగాక ఈనాడు మనం ఉపయోగిస్తున్న చెరువుల్లో చాలా కొన్ని శతాబ్దాల నాటివని, చెరువుల ప్రాధాన్యత గురించిన ప్రస్తావనలు క్రీ.శ. 4వ శతాబ్దం నాటి సంగం లిటరేచర్‌లో కూడా వస్తాయని ఉమాశంకరిగారు పై వ్యాసంలో పేర్కొన్నారు. రాయలకాలంలో అనేకమంది ప్రభువులు, రాజాధికార్లు చెరువుల నిర్మాణంలోనూ, వినియోగపరచడంలోనూ ఇచ్చిన ప్రాముఖ్యాన్ని ఈనాడు మనం మరింతగా గుర్తు చేసుకుంటున్నాము (చరిత్రలో రాయలసీమ- భూమన్). 1820 ప్రాంతంలో మద్రాసు గవర్నరుగా ఉండిన థామస్ మన్రో, 'ఈ ప్రాంతాల్లో కొత్త చెరువులు కట్టాలని ప్రయత్నించడం వ్యర్థం. అనువైన ప్రతి స్థలంలోనూ పూర్వమే చెరువులు కట్టారు,' అన్నాడు.

జలవనర్ల వ్యవస్థలో చెరువులకు గల ప్రాముఖ్యతను రాయలసీమలో చాలా పూర్వకాలం నుంచే గుర్తించారనడానికి నిఖరమైన ఆధారాలున్నాయి. చెరువులు తవ్వించిన వారికి ప్రోత్సాహకరంగా ప్రభుత్వం నుంచి శిస్తు రాయితీలు లభించేవి. చెరువులకు అవసరమయ్యే మరమ్మత్తులు చేసి కాపాడేవారికి మాన్యాలు, దశబంధ ఇనాములు అనే పారితోషికాలు ఉండేవి. ప్రత్యేకించి చెరువుల భద్రత, వినియోగం గ్రామ సమిష్టి బాధ్యతగా- మాన్యందారులూ, నీరుగట్టివాళ్ళు, వినియోగదార్లయిన రైతులూ మొదలైన వారితో వ్యవస్థీకృతంగా ఉండేది.

భారత ఆర్థికవ్యవస్థ (1600-1947) అనే గ్రంథంలో కె.ఎస్. గిల్ స్వయం సమృద్ధ గ్రామ సమాజాల గురించి ఇలా రాశారు- 'గ్రామ సమాజపు స్వయం సమృద్ధ, స్వపాలక నిర్మాణం రాజకీయ గందరగోళం మధ్య జీవితమూ సాంప్రదాయమూ అవిచ్ఛిన్నతంగా కొనసాగేట్టు చేసి, సామాజిక సుస్థిరత్వాన్ని నిలబెట్టింది. శిస్తులు సక్రమంగా చెల్లించబడుతున్న కాలం ప్రధాన పాలకులకు గ్రామవ్యవహారాల్లో తలదూర్చవలసిన అవసరం ఉండేది కాదు.

అయితే బ్రిటిష్ వలసవాదులు బాహాటంగానూ, వ్యూహాత్మకంగానూ దేశ వనర్లనూ, శ్రమను దోచుకున్న క్రమంలో పై వ్యవస్థకు తీరని నష్టం సంభవించింది. ఇనామ్ అబాలిషన్ యాక్టులూ, శిస్తులు వసూలు చెయ్యడంలో బ్రిటిష్ ప్రభుత్వం చేసిన అనేక మార్పులూ, రైత్వారీ సంబంధాల్లో వచ్చిన మార్పులూ గ్రామ ప్రజలకు చెరువుల వినియోగంలో గల స్వయం పాలనాత్మకమైన పాత్రను తగ్గించాయి. నీటి వినియోగదార్లైన రైతుల ప్రతిపత్తి, ప్రమేయం తగ్గిపోవడం వలనా, పాలకుల అలక్ష్యం, అవినీతి, దోపిడీ ఎక్కువ కావడం వలనా చెరువులు విపరీతంగా దెబ్బతిన్నాయి.

బ్రిటిష్ వలస పరిపాలన నుంచి సంక్రమించిన విధానాలనే స్వాతంత్ర్యానంతర ప్రభుత్వాలు కూడా స్వల్పమార్పులతో అనుకరిస్తున్నాయి. శతాబ్దాల నాటి ఈ జలవనర్ల వ్యవస్థకు, సాంప్రదాయానికీ జరిగిన ముప్పు స్వాతంత్ర్యానంతరం మరింత విషాదకరమైన ఫలితాలను బయట పెట్టింది. గవర్నమెంట్ వారి గణాంక వివరాల మేరకు 1955-56, 1984-85 మధ్యకాలంలోనే చెరువులు సగానికి సగం దెబ్బతిన్న విషయం విచారాన్ని కల్గిస్తున్నది. రాజకీయ నాయకులూ, అధికార్లూ, కాంట్రాక్టర్లు మొదలైన వారందరితోనూ ముడిపడడం వల్ల ఉన్న పరిమిత ప్రయోజనాలు కల్గిన శాసనాలు కూడా సజావైన రీతిలో అమలుజరగడం లేదు.

అయినా రాయలసీమ గ్రామీణ సమాజంలో నేటికీ చెరువుల పట్ల గల శ్రద్ధ, జలాశయాల పట్లగల పూజ్యభావం అనేక సాంఘికాచారాల రూపంలోనూ, మత విశ్వాసాల్లోనూ ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. చరిత్ర, విశ్వాసాలూ, సాంఘికశక్తుల సంఘర్షణ ప్రకృతి వైపరీత్యాలతో పోరాటం- ఏ గ్రామ చరిత్రలోనైనా విడదీయలేనంతగా పెనవేసుకుని ఉంటాయి.

*

నేను రాసిన ముసలమ్మ మరణం కథ మొదట ఇండియా టుడేలో అచ్చై, తర్వాత కథ 92 సంకలనంలో ప్రచురించబడింది. ఒక స్త్రీ తన ఊరి బాగు కోసం, తమ ఊరి చెరువు నిండి, నిండైన పంటలతో ఊరిలోని జనమంతా సుఖసంతోషాలతో జీవించడం కోసం- వ్యక్తిగతమైన కష్టనష్టాలనూ, కుటుంబపరమైన ఆటుపోట్లను, సామాజికమైన వత్తిడులను ఓర్చి గుండె నిబ్బరంతో చేసిన ఒంటరి ప్రతిఘటన ముసలమ్మ మరణం కథానికలోని ఇతివృత్తం.

చెరువు క్రింద పల్లెకూ, ఆపేరుకు కారణమైన చీకల సుబ్బమ్మ చెరువుకూ పెద్ద చరిత్రే వుంది. ఎన్నో తరాల క్రితం చీకల వంశస్థుడైన ఒక కాపాయన తన జీవిత సర్వస్వాన్నీ ఒడ్డి, ఒక పాలెగాని సహాయంతో నిర్మించిన చెరువు అది. చెరువు గండి ఊడడానికి తన్ను తాను బలి చేసుకున్న ఆ వంశస్థురాలైన ఆడపడుచు పేరు మీద ఆ చెరువుకట్ట మీద ఒక గుడిసె వెలసి సంవత్సరమూ అక్కడ జాతర జరగడం ఆనవాయితీగా మారింది.

చెరువు నిండి బావుల్లో నీళ్ళు పుంజిగా ఉండే కాలాల్లో బంగారు పంటలు పండి ఊరు సుభిక్షంగా ఉండేది. వరుస కరువుల వల్ల రైతులు చతికిలబడ్డారు. చెరువుల నిర్వహణలో రైతుల సమిష్టి బాధ్యత తప్పడం వల్ల కట్టుకాలువలు పూడిపోయాయి. చెరువుకట్టలు బలహీనమై గండ్లు పడి- వర్షాలు పడ్డా చెరువుల్లో నీళ్ళు నిలవని పరిస్థితులు ఏర్పడ్డాయి. బావుల్లో నీటి ఊట హరించుకునిపోయి పంటలు ఎండిపోయాయి. వడ్డీ వ్యాపారుల క్రౌర్యానికీ, కాంట్రాక్టర్ల స్వార్థానికి లోనై రైతులు చితికిపోయారు.

సుబ్బమ్మ ఎండలు మండిపోయే మధ్యాహ్నాల్లో చెరువుకట్ట మీద చింతచెట్ల క్రింద కూచొని చీకలమ్మ గుడిని, చెరువును చూచి దినాల తరబడి వగచింది. కట్టను మరమ్మత్తు చేసుకోవలని విన్నవాళ్ళందరికీ నోరు నొప్పి పుట్టేటట్టు చెప్పింది. తాను చీకలవారి ఇంటి ఆడబిడ్డ, చీకలమ్మ తన ఊరి దేవత, ఆమెను అనాదరం చేసినందువల్లే తమ కుటుంబానికిన్ని అగసాట్లు. ఈ ఊరికిన్ని పడుబాట్లు. తన పుట్టి మీదకు నూనె లేకపోయినా, అరువుదెచ్చిన నూనెతోనైనా ప్రతి శుక్రవారం క్రమం తప్పకుండా ఆమె చీకలకమ్మ గుడిలో దీపం పెట్టింది.

చెరువుకట్టను మరమ్మత్తు చేసే పనికి కాంట్రాక్ట్ కుదిరి పని జరుగుతుండగా సుబ్బమ్మ దినం తప్పకుండా అక్కడకు వెళ్ళింది. కాంట్రాక్టర్లకూ, కూలీలకు ఆమె అన్నం వండి పెట్టింది. చెరువు పోరంబోకునూ, ఊడిపోయిన కాలువలను గుర్తించడానికి సర్వేయర్లూ, తాశిల్దార్లూ వచ్చి నప్పుడు ఆమె వాళ్ళకు కోళ్ళు కోసి పెట్టింది. చివరకు వానలు పడి చింతలొంకలో నీళ్ళు దొర్లి కట్టుకాలువల్లో నీళ్ళు పారక చెరువు నిండకుండా పోయినప్పుడు ఆమె తన సొంత ఇంట్లో పెళ్ళి ఆగిపోయినట్లుగా బాధపడింది. పట్టణం పల్లెవైపు విస్తరిస్తుండడంతో మధ్యనున్న సుబ్బమ్మ భూముల్ని కొనేసి చెరువునేలను దురాక్రమించుకుని ఇండ్ల ప్లాట్లు చేసి రియల్ ఎస్టేట్ బిజినెస్సులో వీలైనంతగా దోచేయాలన్నది కంట్రాక్టరు పిచ్చిరెడ్డి తాపత్రయం. సుబ్బమ్మకొడుకులు ముగ్గురూ సేద్యాలు మానుకొని చిన్నాచితక బతుకుతెరువుల్లో పడిపోయి ఎంతోకొంతకు భూముల్ని తెగనమ్మే యడానికే సిద్ధపడ్డారు. బేరసారాలతో దళారులు సుబ్బమ్మను వీలైనంతగా విసిగించారు. కొడుకులు తల్లితో తగవుపడి అలిగి వెళ్ళిపోయారు. బ్రతుకు గడవని బీదరికంలోనూ, భారమైపోయిన ముసలి తనంలోనూ సుబ్బమ్మ చివరి రోజుల్ని భారంగా వెళ్ళదీయాల్సిన పరిస్థితి వచ్చిపడింది. అయినా బతుకు చివరిక్షణం వరకు చెరువును ఉద్ధరించడానికి తాపత్రయపడుతూనే సుబ్బమ్మ మరణిం చింది. ఆమె మరణానంతరము చెరువు మాన్యంగా సంక్రమించిన సుబ్బమ్మ భూములన్నీ పిచ్చిరెడ్డి చేతి క్రిందికి వెళ్ళిపోయాయి. చెరువు పూడ్చబడి అందులో డిస్టిలరీస్ కట్టడం ప్రారంభమయింది.

చెరువు క్రింద పల్లె సికేపల్లెగా మారి పట్టణానికి చివరి స్లమ్ ఏరియా రూపాన్ని సంతరించుకుంది. చెరువు ఖిలమై బావుల్లో నీళ్ళు తగ్గి పల్లెలో సేద్యాలు మూలబడ్డాయి. విచ్చలవిడి నగరీకరణం వల్ల భూగర్భజలాలు తగ్గి పట్టణంలో త్రాగునీటికి కరువు వచ్చిపడింది. పిచ్చిరెడ్డిలాంటి కంట్రాక్టర్లు ట్రాక్టర్లతో నీళ్ళు తోలుకొచ్చి టవున్లో బిందెల చొప్పున అమ్ముకుంటున్నారు. భారతదేశపు గ్రామీణ సంస్కృతికీ, పైరు జీవనానికీ ప్రతీక అయినా ఒకానొక రైతు స్త్రీ జీవిత నేపథ్యంగా ఇదంతా కొన్ని దశాబ్దాలుగా జనజీవనంలో సంభవిస్తున్న పరిణామక్రమం.

*

ఈ వ్యాసం మొదట కథకు నేపథ్యమైన సమాజపు చారిత్రక భౌతికస్థితి గురించి చెప్పాను. తర్వాత కథాంతర్గత పాత్రల మధ్యనున్న సామాజిక సంబంధాలు ఆధారంగా ఇతివృత్తాన్ని వివరించాను. అనుభవమూ, అధ్యయనమూ ద్వారా బోధపడిన ఒకానొక సారాంశం సాహిత్య ప్రతిపత్తిని పొందే పరిణామం గురించి ఇప్పుడిక సహజంగానే మీమాంస మొదలవుతున్నది.

నేను ఈ కథ రాసేనాటికి చిత్తూరు జిల్లాలోని కుప్పం, సత్యవేడు, బంగారు పాళ్యం, పుంగనూరు, చంద్రగిరి తదితర ప్రాంతాల్లో గ్రామీణ స్థితిగతులను మరీ సమీపంగా చూడగలిగే అవకాశం కలిగింది. పట్టణాభివృద్ధి పోరాటాల్ని నిర్వహిస్తున్న స్థానిక కమ్యూనిస్ట్ నాయకులు వెంకటరత్నంగారి నుంచీ, వారి అత్తగారు కీ.శే. తాయారమ్మగారి నుంచీ పట్టణాల నీటిసమస్యను గురించి విలువైన సమాచారం లభించింది. అపర భగీరథుల్లాంటి రైతులు నీటికోసం వాగులూ, వంకలూ, చెరువులూ, బావులూ, బోర్ల ద్వారా చేస్తున్న నిరంతర యాతనామయమైన పోరాటం మీద కొంత అవగాహన కలిగింది. కథ అచ్చయిన కొంతకాలానికి కథలోని ఇతివృత్తం మీద వచ్చిన, వ్యాసం మొదట్లో నేను ఉదహరించిన డా॥ ఉమాశంకరిగారి సిద్ధాంత వ్యాసం చదివాను. సిద్ధాంత వ్యాసంలోని అనేక సూక్ష్మ అంశాలను కథ సక్రమంగానే చిత్రించి ఉన్నట్లు గమనించి సారాంశాన్ని సజావుగానే గ్రహించానని భావించాను.

అయితే కథ సిద్ధాంతవ్యాసం కాదు, సామాజిక మూలాలు, అధ్యయన లోపం వల్ల కథ డైల్యూట్ అయ్యే ప్రమాదం ఉందిగానీ, అన్ని వివరాలు, గణాంకాలు గుప్పించడం వల్ల కథ డాక్యుమెంటరీగా మారి సాహిత్య ప్రతిపత్తిని కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుంది. సాధారణ జీవితానుభవం- సాహిత్య రూపంగా మారే క్రమంలో ఏది చెప్పాలి (సెలక్షన్), ఎంత చెప్పాలి (ప్రపోర్షన్స్), ఎక్కడ కుదించి దేన్ని విస్తరించాలి (అప్రూవల్స్)- అనేవి రచయిత తనను తాను సాధన ద్వారా పొందిన పరిణతికి, లేదా గుర్రైన పరిమితికి గుర్తుగా రచన మిగులుతుందని నాకన్పిస్తుంది.

అనుభూతి సౌరభాల లౌల్యంలో పడి సారాంశాన్ని విస్మరించడమూ, కేవల సారాంశం కోసం జీవనగంధాల్ని తిరస్కరించడమూ గాక- ప్రతి రచయితా (చెప్పదల్చుకున్న విషయానికీ, చెప్పే పద్ధతికీ) వస్తువుకీ-శిల్పానికీ మధ్య తనదైన సమన్వయాన్ని సాధించవలసి ఉంటుంది. సామాజిక శాస్త్రవేత్త, సాంకేతిక నిపుణుడు, పెట్టుబడిదారూ, శ్రామికుడూ- చివరకు వినియోగదారుల్లో తాను కూడా ఒకడు అయిన రచయిత చేసే సృజనాత్మక శ్రమగా ప్రతి రచన రూపొందుతున్నది. ఇదంతా చాలామట్టుకు భూమి మీది నుంచి అమాంతంగా ఆకాశంలోకి లేచే గోపుర నిర్మాణాల్లాగాక, సహజ సిద్ధ పర్వతాలను తొలచి ఏర్పడ్డ అజంతా గుహాలయాల్లా- ఉన్నదాని నుంచీ కొంత పరిహరించడం వల్ల (making the space empty) ఏర్పడుతున్న కళారూపాల్లా అన్పిస్తుంది.

ఇది కథారచనకు సంబంధించి నా ఆంతరంగిక భావ నేపథ్యం. ఏ కృతి అయినా దానికదే భాష్యం అంటాడు బైరాగి. భాష్యకారుని జోక్యానికి పరిమితులున్నప్పుడు- రచయితే భాష్యకారుడుగా మారడం మరింత అనుచితమని నేను భావిస్తున్నాను. అంతర్లీనమూ, స్వాభావికమూ అయిన విలువల ఆధారంగా ఏ సాహిత్య ప్రక్రియనైనా పరిగణించడమో, లేక తృణీకరించడమో- అదంతా పాఠకుల, విమర్శకుల ఇష్టాయిష్టాలను బట్టి ఉంటుంది. దానిని వారికి ఒదిలిపెట్టి నిత్యదిన పత్రికల పాఠకులమైన మనలో చాలామంది మరిచిపోతున్న, లేదా అంతగా పట్టించుకోని కొన్ని వార్తాంశాల్ని ప్రస్తావించడం మట్టుకు నా బాధ్యతగా భావిస్తాను.

'తిరుపతి పట్టణంలో అవిలాల చెరువు పూడ్చి రాజకీయ ప్లీనరీ సమావేశాలు ఏర్పాటు చేశారు. చిత్తూరు సమీపంలోని కట్టమంచి చెరువును పూడ్చి బస్టాండ్‌ను కట్టారు. పైనున్న చెరువు కట్టలు తెగి మదనపల్లి వీధుల్లో ప్రవహించిన వరదనీటిలో అనూహ్యంగా ప్రాణనష్టం సంభవించింది. అలక్ష్యానికీ, దురాక్రమణకు గురై పట్టణాల్లోని వాగులూ, చెరువులూ మురికివాడలకు నిలయాలై అకస్మాత్తుగా వచ్చిపడే వర్షపు నీటివల్ల ముంపుకు గురి అవుతున్నాయి. సేద్యపు నీరు చాలక పల్లెలు చతికిలపడ్డాయి. ప్రతి వేసవిలోనూ త్రాగునీరు కరువై జనం మంచినీళ్ళను కొనుక్కుంటున్నారు.

చిత్తూరుజిల్లాలో క్షామం సంభవించే ఎండాకాలాల్లో అనేక గ్రామాల్లో మహాభారత ఉత్సవాలు జరిగే సాంప్రదాయం ఉంది.

మహాభారతంలోని ఈ పద్యం నీటివనర్ల పరిరక్షణ గురించి వివరిస్తున్నది-

*నుత జల పూరితంబులగు నూతులు నూరిటికంటే సూనృత*
*వ్రత యొక బావి మేలు- మరి బావులు నూరిటి కంటే నొక్క స*
*త్క్రతువది మేలు- తత్క్రతుశతంబున కంటె సుతుండు మేలు త*
*త్సుత శతకంబు కంటే నొక సూనృతవాక్యము మేలు చూడగన్*

మంచిని కలుగజెయ్యడానికి, సత్యాన్ని తెలియజెయ్యడానికి ప్రయత్నించేది సత్సాహిత్యంగా మిగులుతుందని ఈ దేశవాసిగా నేను కూడా నమ్ముతున్నాను.

*21 జూన్ 1998*

28

# మోహనా! మోహనా!

## డా॥ వి. చంద్రశేఖరరావు




*డా॥ వి. చంద్రవేఖరరావు 1959 ఏప్రిల్ 13న ప్రకాశం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ నైట్ డ్యూటీ 1990లో ఆంధ్రజ్యోతి వారపత్రికలో అచ్చయింది. ఐదు కథాసంపుటాలు, మూడు నవలలు ప్రచురించారు. ఐదు హంసలు నవలకి ఆటా పురస్కారం లభించింది. కొన్ని కథలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. రైల్వేలో ఫైనాన్స్ విభాగంలో ఉద్యోగం.*

**చిరునామా**

*చైతన్యపురి, 3వ లైను, కొరిటపాడు,*
*గుంటూరు - 522 007*
*Ph.: 94412 78189*
*vcsrao@gmail.com*


“నేను ప్రలోభాలకు లొంగిపోయానని అనడానికి ఎంత ధైర్యం వీళ్ళకు?” అని తనలో తాను గొణుక్కున్నాడు మోహనరావు.

“ఉప్పెనలాగా లేచిన దళిత ఉద్యమాన్ని నీరుగార్చాడు అని కూడా అన్నారు వాళ్ళు. ‘అవును నిజమేనేమో?’ అని క్షణంపాటు మోహనరావు తనలో తాను మధనపడడం కూడా నిజమే!

కానీ అంతలోనే అతనిలోంచి వింత ఆవేశం పొంగుకొచ్చింది. భారతదేశంలోని దళితజాతి మొత్తాన్ని ఉద్ధరించే మంత్రదండం ఏదో అతని చేతిలో ఉన్నట్టు అనిపించింది. తానో అవతార పురుషుడిననే భావం కలిగింది. తన ఆలోచనల్ని అప్పటికప్పుడు కాగితంపై పెట్టాలనుకున్నాడు. గుజరాత్‌లోనూ, మహారాష్ట్రలోనూ ఉన్న దళిత ఉద్యమనేతలతో సంబంధాలు ఏర్పరచుకోవాలని నిర్ణయించుకున్నాడు. స్థానిక దినపత్రికల విలేకరులను పిలిచి, రాబోయే అయిదేళ్ళలో తన రాజకీయవ్యూహాల గురించి, ఉద్యమ భవిష్యత్తును గురించి చర్చించాలనుకున్నాడు. ‘హిందూ’లో ఓపెన్ పేజీకి, ‘ఎక్స్‌ప్రెస్’లో సండే స్పెషల్‌కి వ్యాసాలు పంపాలని నిర్ణయించుకున్నాడు.

ఎలక్షన్లు అయిపోయిన నాలుగు నెలల తరువాత, వేసవి ఎండల మధ్యాహ్నం అది. గుంటూరు, దళిత సంగ్రామ పార్టీ కార్యాలయం. అందులో ఇప్పుడు మోహనరావు ఒక్కడే వుంటున్నాడు. దుమ్ము, ధూళీ పట్టిన బానర్లు, కటౌట్లు, పోస్టర్లు ఒక మూలన గుట్టలు గుట్టలుగా పడి ఉన్నాయి. టేబుల్‌పై మైక్ సిస్టమ్‌లన్నీ దిగాలుగా చూస్తున్నాయి. సమావేశపు గదిలో మధ్యన విశాలమైన పరుపులు, దిండ్లు దుమ్ముపట్టి అసహ్యంగా ఉన్నాయి. వాటి మధ్యన కాళ్ళు గోడకు తన్నిపట్టి పడుకున్నాడు మోహనరావు.

అతని మెదడులో వింత వింత శబ్దాలు. వేలాదిగా జనం జైజై అంటున్న శబ్దం. 'ఇన్ని లక్షల మందిని సామూహికంగా హత్య చేసిన నీకు...' ఉలిక్కిపడ్డాడు మోహనరావు. ఎప్పటివో సంఘ టనలు ఒకదానికొకటి కలగాపులగం అయిపోయి ఏది ఊహో, ఏది వాస్తవమో పోల్చుకోలేక పోతున్నాడు. మూతికి ఫట్‌మంటూ తగిలిన దెబ్బ. బొటబొటమంటూ కారిన రక్తం. "ఎక్కడ దాచావు రా డబ్బు! ఏ లంజకిచ్చి...' కేకలు, అరుపులు, కాలుతున్న శవం తాలూకు చిటపటలు, 'అన్నా! చచ్చిపోతానన్నా వదిలేయండి.' పిడిబాకు తళత్తళలు. 'చావరా లంజకొడకా!' పొట్టలోపలికి దిగబడిన కత్తి, కత్తి అంచుపై జిగట జిగటగా రక్తం, కురుస్తున్న పూలవర్షాలు, జయజయధ్వానాలు, దేశ్‌కి నేత మోహనరావు! దిక్కులు పిక్కటిల్లేలా కోరస్. 'దేశ్‌కి నేతా మోహనరావు!' స్వగతంలో గొణుక్కో బోయి పైకే అనేశాడు. విశాలమైన భవనపు నిశ్శబ్దంలో ఆ మాటలు రీసౌండింగ్‌గా వినబడ్డాయి.

విసురుగా లేచి, ఖాళీ భవనంలో అటూ ఇటూ తిరిగాడు. గోడపైన అద్దంలోంచి అతని ప్రతిమ సమ్మోహనంగా కనిపించింది. కొంచెం కొంచెం నెరుస్తున్న గడ్డం, నుదుటి మధ్య వెండి తీగలు మొలకెత్తినట్లుగా అక్కడొకటి, ఇక్కడొకటి తెల్ల వెంట్రుకలు. హుందాతనం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. లాల్చీ చేతుల్ని భుజాలపైకి జరుపుకొని పిడికిలి బిగించి, చెయ్యి పైకెత్తి - అతని ఆ భంగిమ అంటే అతనికెంతో ఇష్టం. లక్షలాది అనుచరులకు, మార్చ్ ఫార్వర్డ్ అనే కమాండ్ లాంటిది. అట్లా అద్దంలో చాలాసేపు చూసుకున్నాక, కొత్త ఉత్సాహం తెరలు తెరలుగా అతనిలోకి ఉబికి వచ్చింది.

టేబుల్‌పై కూర్చుని, క్రింద డ్రాయర్లో రహస్యంగా దాచిపెట్టిన రెండు బౌండు నోటు పుస్తకాలు బయటకు తీశాడు. అవి, అతను ఈమధ్యనే మొదలుపెట్టిన రెండు జీవితకథలు. అవే సంఘటనలతో, ఒకే వ్యక్తులతో రాస్తున్న రెండు జీవితకథలు. ఒకటి మేధావుల కోసం, గాంధీ యిజం, నెహ్రూయిజం, అంబేద్కరిజం మొదలైన సీరియస్ ఆలోచనా ధోరణులను సవివరంగా చర్చిస్తూ సాగిపోయే జీవితచరిత్ర. రెండోది మామూలు పాఠకుడి కోసం. కథాకథన శైలి, కొంచెం సస్పెన్సు మేళవించి రాస్తున్నది.

ఒకదానితో ఒకటి ఓవర్‌లాప్ అయి అంతా గందరగోళంగా ఉంది.

ఉదాహరణకు ది. 9.9.93, గుంటూరు గుంట గ్రౌండ్‌లో జరిగిన బహిరంగసభలో విషయాల్ని గురించి ఇట్లా రాసుకున్నాడు. "మొట్టమొదటి హత్య మనువే చేశాడు, అంటూ చొక్కా విప్పి శరీరం పొడవునా వున్న కత్తిపోటు గుర్తుల్ని జనం ముందు ప్రదర్శించాను. హత్య, హత్య అంటూ జనం గొల్లుమన్నారు. ఒక్కొక్క గుర్తునే వేలుపెట్టి చూపిస్తూ ఇది కలిచేడు. 'ఇది నీరుకొండ, ఇది పదిరికుప్పం,' అన్నాడు. 'హత్య హత్య' అంటూ జనం గొల్లుమన్నారు. 'రక్షించండి, రక్షించండి' అంటూ జనం భోరుమన్నారు. 'ఇదుగో రక్షకుడు మన మధ్యనే ఉన్నాడు.' అంటూ ఒక కార్యకర్త ప్రకటించాడు. ఓ...ఓ... గొప్ప శబ్ద తరంగాన్ని చీల్చుతూ నేను మాట్లాడాను," అంటూ ఒక జీవిత చరిత్రలో రాసుకున్నాడు.

“దు:ఖం! మహాజనులారా! దు:ఖం, మన మానసికమైన మరణావస్థకు గుర్తు. సామాజికంగా, మానసికంగా, మనం మృతులం. అయితే మనలో ఈ అవస్థ నుండి బయటపడి అజేయులనిపించుకొన్న వాళ్ళు ఉన్నారు. వాళ్ళలాగా మనందరం అజేయులం కావాలి.” సభ మొత్తం ఒక్క సారిగా జయజయ ధ్వానాలతో మార్మోగింది,” అంటూ ఇంకో జీవితకథలో రాసుకున్నాడు.

ముందున్న కాగితాల బొత్తిలోంచి కొన్ని ఖాళీ కాగితాల్ని బయటకు తీసి సీరియస్‌గా రాయటం మొదలుపెట్టాడు మోహనరావు.

‘అధ్యాయం ముప్పయి ఏడు’ అంటూ పైన రాసుకున్నాడు. (నిజానికి అతను రాసింది ఒకే అధ్యాయం, ఇది రెండోది). ‘పందొమ్మిది వందల తొంభైలో, భారతదేశంలో, ముఖ్యంగా ఆంధ్రదేశంలో దళితుల (హరిజనులు కాదు) పరిస్థితి’ - అంటూ రాసి హైఫన్ మార్కు పెట్టాడు. ‘నక్సలిజం-అంబేద్కరిజం ప్రభావం’ అంటూ సబ్-హెడ్డింగ్ పెట్టాడు. ఆ తరువాత అరపేజీ ఖాళీ వదిలిపెట్టి, ఆ ప్రదేశంలో ఇంటూ మార్కు పెట్టి పేజీ క్రింద, ‘సుమారు రెండు వందల పేజీలకు సరిపడే సిద్ధాంత చర్చ యిది. ఉత్సాహవంతులు అనుబంధం-37లో చదువుకోవచ్చు,’ అంటూ రాశాడు.

ఆ తరువాతి పేరాలో, “ఒక మధ్య తరగతి బూర్జువా కుటుంబంలో పుట్టి, జీవితమంతా దళితజనోద్ధరణ అనే ఫాంటసీలో గడిపి, చరిత్రలో గుర్తుండిపోయే నూట ఇరవైరోజుల దళిత ఉద్యమాన్ని నిర్మించిన మోహనరావు, తనలోనికి తాను తొంగి చూసుకొని చేసుకుంటున్న ఆత్మావలోకనం ఈ కథ.”

“అనుచరుల్ని మోసం చేశాడు. ఉద్యమాన్ని నీరుగార్చాడు. అమృతం పంచుతానని ఆశలు చూపి విషపాత్రల్ని ముందుంచాడు అని అతనిపై అభియోగాలు.”

“ఇంకా... ఇంక చాలు, ఈ అధ్యాయం పొడవునా ఈ అభియోగాల గురించి చర్చ ఉంటుంది. వీటి గురించి నా సమాధానమే సుదీర్ఘమైన ఈ అధ్యాయం. రెండు రకాల జీవితకథలకు ఇది కామన్ అధ్యాయం.”

“అవును. నిజం! నేను సందర్భాన్ని బట్టి నా అనుచరులకు నాయకుడిని, ప్రతి నాయకుడిని కూడా. నా మొదటి భార్యకు (రెండవది భార్య కాదు, ప్రియురాలు) నేను ఇంపోటెంటు భర్తను. ఈ దేశానికి నేనో అంటరాని పౌరుణ్ణి (అన్‌టచ్‌బుల్ సిటిజన్). నా ఉద్యమ నేస్తాలకు నేనో అహంకారిని. నాకు నేను పోగొట్టుకుంటున్న ఆత్మ కోసం వెతుకుతున్న దేహాన్ని.”

అంతవరకూ రాసి తృప్తిగా నిట్టూర్చి వాటిని మళ్ళీ రేపర్ల మధ్య భద్రంగా చుట్టి, క్రింద అరలోకి తోసి లేచి నిలబడ్డాడు. అటూ ఇటూ కాసేపు తిరిగి, చివరకు ఒక కుర్చీలో కూలబడి, కాళ్ళు పైకి టేబుల్‌పైన పెట్టుకొని... ‘ఇట్లా జీవితాన్ని తవ్వుకోవటంలోనూ గొప్ప సుఖం ఉంది,’ అంటూ గొణుక్కున్నాడు.

‘యోసేబు (జోసఫ్ అనే ఇంగ్లీషు మాటకు అర్థరహితమైన అనువాదం) నా పేద తండ్రీ! ఇప్పుడు నిన్ను గురించి జ్ఞాపకాల్తో కాసేపు గడుపుతాను,’ అని మనసులో అనుకున్నాడు.

“జోసఫ్! నీ జీవితం అంతా కాదు. ఆ ఒక్క సన్నివేశాన్ని మాత్రం నేను గుర్తు చేసుకుంటాను. ఇప్పటికి పదివేలా నూట ఇరవైసార్లు గుర్తు చేసుకొన్నాను. ఇది పదివేలా నూట ఇరవై ఒకటోసారి.”

“అది పందొమ్మిది వందల అరవై ఒకటి. అపుడు మా వూరికి కరెంటు లేదు. వీధి దీపాలు ఉండేవి. గ్రామ చావడి దగ్గర, దేవాలయం దగ్గర, కరణం ఇంటి మలుపు దగ్గరా, ఇంకో అయిదో,

ఆరో నాకు గుర్తులేని చోట్ల ఉండేవి. నిచ్చెన వేసుకొని, పైకి ఎగబాకి ప్రతిరోజూ సాయంకాలం పూట అందులో కిరసనాయిలు పొయ్యాలి. గాజు చిమ్నీని శుభ్రంగా తుడవాలి."

"ఆరోజు పంతొమ్మిది వందల అరవై ఒకటి జనవరి ఆరు. ఆవేళ కూడా కిరసనాయిలు డబ్బాతో, భుజాన నిచ్చెనతో దీపాన్ని వెలిగించడానికి బయల్దేరావు! నేనూ, నీ భార్య (మా అమ్మే!) దూరంగా, వెనకనే నడిచి వస్తున్నాం. నా జేబులో శనక్కాయలు, బెల్లం. ఇంకా తినటం మొదలు పెట్టలేదు. కిరసనాయిల్ పోసి, దీపం వెలిగించి, నిచ్చెనపై ఒక కాలు, గ్రామ చావడి అరుగుపై ఒక కాలు పెట్టి, చిమ్నీ తుడుస్తుండగా, జోసఫ్! అప్పుడే కదా! 'ఎవడ్రా లం... కొడుకు! చావడి అరుగుపై కాలు పెట్టింది' అంటూ పెనుకేక వినిపించింది. నువ్వు ఉలిక్కిపడి, భయపడి, కిరస నాయిలు నిండిన దీపానికి నీ చెయ్యి తగిలి, కిరసనాయిలు, ఆపైన నిప్పు నీ పైకి పాకి... అయ్యో జోసఫ్!... 'అన్నా! నా పెనిమిటన్నా! మంటలార్పండయ్యా, దండమెడతాను!' అమ్మ రోదనగా వేడు కొంటున్నా ఎవరూ ముందుకు రాలేదు. ఎందుకో తెలుసా! నువ్వు అంటరానివాడివి కదా! జోసఫ్! జోసఫ్!"

కాసేపు దీర్ఘంగా నిట్టూర్చి, కళ్ళు చికిలించి, 'ఇప్పుడు నేను నా దాంపత్య యుద్ధాల గురించి గుర్తు చేసుకుంటాను,' (జస్ట్ ఫర్ ఏ ఛేంజ్!) అనుకొన్నాడు మోహనరావు.

"కమలతో నా జీవితాన్ని, మళ్ళీ నూతనంగా మొదలుపెట్టాను. జ్ఞాపకాలన్నీ తుడిచివేశాను. ఒక ఎమ్మే (హిస్టరీ) డిగ్రీ, మారుమూల పల్లెటూళ్లో బడిపంతులుద్యోగం (గొప్ప కాంట్రాస్ట్), పాతికేళ్ల బిగుతైన కండల, నునుపైన చర్మపు సౌందర్యం, యూనివర్సిటీల్లో, సాహిత్య పుస్తకాల్లో అలవాటు పడ్డ అందమైన భాష (బ్రాహ్మడనుకొన్నాం), ఊళ్ళోనే కుమ్మరిపేటలో ఒక అద్దె యిల్లు. హరిజనులు (అప్పటికింకా దళితులనే మాట వాడుకలో లేదు.) సామాజిక దోపిడీ అనే విషయం గురించి కమలతో గంటలు గంటలు చర్చలు. కమలకు చరిత్ర పాఠాలు చెబుతూ, రొమిల్లా థాపర్, ఆర్.ఎస్.శర్మ, ఇర్ఫాన్ హబీబ్‌ల పరిశోధనల గురించి వివరిస్తూ (అబ్బా, ఇంక చాల్లెద్దురూ! ఎప్పుడూ ఆ సోదేనా?)..." హఠాత్తుగా మోహనరావు బిగుసుకుపోయాడు. అతని లోపల బ్రహ్మాండమైన విస్ఫోటనం ఏదో జరుగుతున్నట్లు - అతను ముక్కలు ముక్కలుగా చీలిపోతున్నట్లుగా అనిపించింది.

"కళ్ళముందో దృశ్యం. చిరపరిచితమైన వీధి. మోహనరావు రోదిస్తున్నాడు. అక్కడ కమల తగలబడుతోంది. సిగ్గుతో, అవమానంతో, ఒంటిపైన నూలుపోగైనా లేని శరీరంతో, పెను రోదనతో, పదేపదే దాడి జరుపబడుతున్న శరీరంతో, ఎదురుగా నిలువుగుడ్లతో, నిస్సహాయంగా చూస్తున్న మొగుడితో (నోట్లో గుడ్డలు కుక్కారు), ఆమె తగలబడుతోంది. ఆమె ఏడుపు, వెక్కిళ్ళు, 'అన్నా! వదిలేయన్నా, చచ్చిపోతానన్నా!' అని వేడుకోళ్ళు, ఎడతెరిపి లేకుండా నల్లగా కురుస్తున్న చీకటిలో మంటలేని నిప్పుతో ఆమె తగలబడుతూనే ఉంది."

"విప్పండిరా వాడి కట్లు. నోట్లో గుడ్డ కూడా పీకండి!"

"ఏరా!... నా కొడకా! ఇప్పుడు చెప్పమంటావా క్షమాపణ. పొద్దున పెద్ద పోటుగాడిలా నీలిగావే. పేడకళ్ళు ఎత్తుకునే లం... కొడుకువి నీకే యింత నీలుగుడు ఉంటే, వందెకరాల ఆసామిని, ఈ ఊరి సర్పంచిని నాకెంత ఉండాలి? ఆ కూలి నా కొడుకులతో సమ్మె, నువ్వేమో లీడరివా?"

"ఇంకో రెండు గంటల్లో తెల్లారుతుంది. దీన్ని ఇట్లాగే బట్టలు లేకుండా చావడి దాకా ఈడ్చు కెళ్ళి, తప్పయిపోయింది, రాత్రి దీనితో పడుకున్నానని చెప్పమంటావా? పలకవేమిరా గాడ్డికొడకా!"

"మోహనరావు! మోహనరావు! నీ ఎమ్మే డిగ్రీ, నీ విద్యార్థి ఉద్యమాలు, నీ అంబేద్కరిజం, అయ్యో ఏదీ ఆ క్షణాన నీ రక్షణకు రాలేదే! వాడు నిన్ను అమాంతం ఎదురు రొమ్ములో తన్నితే, లోపల సున్నితమైన భాగాలేవో చిట్లిపోయి, ముఖం నిండా, ఒంటినిండా, పాతికేళ్ళ నీ యవ్వన శరీరం నిండా రక్తం బాధగా గడ్డకట్టితే, వాడట్లాగే నీ జీవితాన్ని, నీ దాంపత్యాన్ని, నీ భవిష్యత్తుని నిర్దాక్షిణ్యంగా తొక్కుకుంటూ వెళ్ళిపోతే..."

మోహనరావు మౌనంగా కుర్చీలోంచి లేచి, పాలిపోయిన ముఖాన్ని నీళ్ళతో కడుక్కొని, కిటికీ తెరిచి, వడగాల్పులు ముఖానికి తగులుతుండగా...'దొంగ లంజకొడుకులసలే మెసలే ధూర్తలోకం,' అంటూ శ్రీశ్రీ పద్యపు చరణాన్ని పదేపదే గొణుక్కున్నాడు.

"కమలా! నాకు దు:ఖం వస్తోంది. నిన్ను పోగొట్టుకొన్నందుకు దు:ఖం వస్తోంది. నిన్ను పోగొట్టు కొన్న తీరుకు దు:ఖం వస్తోంది. నువ్వు నా ముఖంపై ఊసి, చెప్పుతో కొట్టి 'కొజ్జా వెధవా! నీకు పెళ్ళాం ఎందుకురా!' అంటూ తిట్టి వెళ్ళిపోవడానికి బదులు, 'ఇంత జరిగాక మీతో ఎలా కలిసి ఉండను,' అంటూ వెళ్ళిపోయినందుకు దు:ఖం. వెళ్ళిపోయి తిరిగి రానందుకు దు:ఖం. నిన్ను తిరిగి ఆహ్వానించలేకపోయినందుకు దు:ఖం. సంవత్సరం తిరక్కుండానే మరో స్త్రీతో గడపవలసి (పడుకోవలసి) వచ్చినందుకు దు:ఖం. ప్రభువా! దు:ఖమే మా ఆశయం! దు:ఖమే మా ఓదార్పు! ఆమెన్!"

మోహనరావు రెండు మూడుసార్లు గట్టిగా నిట్టూర్చి, మరోసారి అద్దంలో చూసుకొని, మెల్లగా బయటకు వచ్చాడు. తలుపులు వేసి 'అధ్యక్షుడు బయటకు వెళ్ళారు' అనే బోర్డు తగిలించి నిప్పుల కుంపటిలాంటి రోడ్డుపైకి నడిచాడు.

## 2

"ఇవి రోడ్లా, ఉష్ణకాసారాలా?" అనుకున్నాడు మోహనరావు, ఎండతీవ్రత తట్టుకోలేక. నడక వేగాన్ని పెంచాడు. షాపులు, బజార్లు, వేగంగా వెళ్ళే రిక్షాలు, స్కూటర్లు దాటుకుని పాత గుంటూరు దాకా వచ్చాడు. నిజానికి అతను వెళ్ళాలనుకుంది ఏదో హోటల్‌కు. తిండి తిని, ఇద్దరు, ముగ్గురు దళిత నాయకుల్ని కలిసి 'ఉద్యమాన్ని మళ్ళీ నిర్మిద్దాం రండి!' అని ఆహ్వానించాలనే ప్రయత్నంతో బయలుదేరాడు. అయితే ఇప్పుడు వెళుతోంది కేశవదాసు ఇంటికి. ప్రతిరోజూ ఇట్లాగే జరుగుతుంది. ఎక్కడికనో బయలుదేరి, చివరకు కేశవదాసు ఇంటికే వెళతాడు. అదో చిన్న పూరి కొంప. ఆ ఇంట్లో ఆ సమయానికి దాసు తల్లి ఒక్కతే ఉంటుంది. ఆమె కూడా మోహనరావు కోసం ఎదురు చూస్తు న్నట్లుగా అతన్ని చూడగానే, 'అయ్యా మోహనరావా! నా బిడ్డ నన్ను అన్యాయం చేసి పొయ్యా డయ్యా!' అంటూ రోదిస్తుంది. ఆమె ఏడుపుతో ఒక్కసారిగా బిగుసుకు పోతాడు మోహనరావు. మోహనరావు ముక్కుపుటాలకు చావు వాసన వేస్తుంది. వెచ్చటి రక్తపు వాసన వేస్తుంది. "దొంగ లంజాకొడుకులు! దొంగ లంజాకొడుకులు!" అంటూ పదేపదే గొణుక్కుంటాడు.

దు:ఖ తీవ్రత తగ్గాక "కాస్త అన్నం తిను నాయనా" అంటూ అతన్ని ఆహ్వానిస్తుంది ఆమె. పెద్దగా మొహమాట పడకుండా రెండు మూడు మెతుకులు తింటాడు. ఆ ఇల్లంతా అసహనంగా చాలాసేపు తిరుగుతాడు. 'దాసుతో నా మొదటి పరిచయం ఎప్పుడు?' అని దీర్ఘంగా ఆలోచిస్తాడు. ఊహు! గుర్తు రాదు. అంతగా మమేకమయ్యాడు నా జీవితంలో అనుకుంటాడు. దాసు తాలూకు పుస్తకాలు, వస్తువులు ఉన్న టేబుల్ దగ్గరకు వస్తాడు. ఆ పుస్తకాల మధ్య దాసు రాసుకొన్న ఎర్ర డైరీ కోసం వెతుకుతాడు. దాన్ని తీసుకొని బయట ఉన్న కుక్కి మంచంలో కూలబడి సీరియస్‌గా చదవటం మొదలుపెడతాడు. అది దాసు డైరీ మాత్రమే కాకుండా తన ఆత్మకథ మూడో వెర్షన్‌గా అతనికి అనిపిస్తుంది. అది చదువుతూ, చదువుతూ 'అయ్యో' అంటూ నుదుటిపై కొట్టుకుంటాడు.

క్షణంసేపు పుస్తకం మూసివేసి 'దాసూ! దాసూ!' అని బాధగా రోదిస్తాడు. కళ్ళు నలుముకొని, రెప్పల చాటున వెచ్చగా తగిలిన కన్నీటిబొట్లను తుడుచుకుంటాడు. మళ్ళీ డైరీ తెరుస్తాడు. అతనికిష్టమైన అధ్యాయాన్ని మరోసారి, మరోసారి అనుకుంటూ చదువుతాడు. అటూ ఇటూ చూసి, ఆ డైరీలో తనకు ముఖ్యమనిపించిన పేజీల్ని చించుకొని లాల్చీజేబులో కుక్కుకుంటాడు. డైరీని మళ్ళీ టేబుల్ పైన పెట్టి, దాసు తల్లి దగ్గర సెలవు తీసుకొని రోడ్డు పైకి వస్తాడు.

ఈరోజు కూడా దాసు డైరీలోంచి కొన్ని పేజీల్ని చింపుకొని చదువుకోవడం మొదలుపెట్టాడు.

**సెప్టెంబరు 5-11**

కొన్ని కొన్ని అనుభవాలు ఎంత బలంగా ఉంటాయంటే, ఆ అనుభవానికి ముందూ, తరువాతా అని జీవితాన్ని క్లాసిఫై చేసుకోవాలనిపిస్తుంది. మోహనరావుతో నా పరిచయం అట్లాంటిదే. మోహనరావుకు ముందు నా జీవితం వెలిసిపోయిన కాగితం. రోగిష్టి మనిషిలా కునారిల్లే మారుమూల గ్రామం. మూడొందల గడప వున్న గ్రామంలో ఎవరో బలిమిన ఒక తాపు తన్నినట్లుగా అటొక మైలు, ఇటొక మైలు దూరంలో ఉన్న మాలపల్లి. ఊరికీ, పల్లెకీ మధ్య భౌతికమైన దూరం ఈ మైలే అయినా, మానసికమైన దూరం కొలవలేనంతగా వుంది. 'ఇప్పుడు నయం కదూ!' అనే మాట పదే పదే వినే వాణ్ణి. ఏమి నయమో నాకిప్పటికీ అర్థం కాదు. పంచాయతీ ఆఫీసు అరుగుపై కూర్చోవటమంటే మాకో ఎడ్వెంచరులాంటిది. లోపల రీడింగ్ రూమ్‌లో కూర్చొని పేపరు చదివి వచ్చేడంటే వాడో హీరో మాకు. మారుతున్న ఆర్థిక, సామాజిక సంబంధాల్ని మేము గుర్తించకపోలేదు. ఈ కాస్త మార్పు వెనకే ఎన్ని ఘర్షణలు! ఎంత రక్తపాతం! ఎన్ని కలిచేడు దురంతాలు జరిగాయో (కలిచేడు హత్యల తరువాత అక్కడ నుండి పారిపోయి వచ్చి పట్టణాల్లో తల దాచుకుంటున్న కుటుంబాల్లో మాదీ ఒకటి) .

కలిచేడును అందరూ మరిచిపోయారనుకుంటున్న సమయానికి ఎన్నికల సందడి వచ్చింది. మోహనరావు కలిచేడు గొడవను బయటకు లాగాడు. ఎఫ్.ఐ.ఆర్.లెక్కడ? నిందితులెక్కడ? కలిచేడు లో మీరు పెడతామన్న స్పెషల్ కోర్టులెక్కడ? బాధితులకు ఇస్తామన్న ఇండ్ల స్థలాలెక్కడ? మృతుల కుటుంబాలకు ఇస్తామన్న ఎకరా పొలాలెక్కడ? ఇది ప్రభుత్వమా? అరాచకమా?" అంటూ గొడవ చేశాడు.

మోహనరావు ధర్మాగ్రహానికి ప్రభుత్వంవైపు నుండి పెద్దగా ప్రతిస్పందన రాలేదు. అదుగో అప్పుడు పేల్చాడు బాంబులాంటి వార్త. 'దళిత సంగ్రామ్ పార్టీ'ని ఏర్పాటు చేస్తున్నట్లుగా. ఎక్కడ నుంచి వచ్చాయోగాని కుప్పలు కుప్పలుగా వచ్చాయి పార్టీ ఫండ్‌కు నిధులు. పార్టీ కార్యాలయం, కటౌట్లు, బ్యానర్లు, వాడవాడలా బహిరంగ సభలు-

అట్లాంటి ఒక సభలో (పొన్నూరులో) మోహనరావు నాకు పరిచయం అయ్యాడు. గద్దర్ బాణిలో 'జజ్జనకరె జనారే' అంటూ సభకు ముందు పాటలు పాడిన నన్ను మీటింగ్ తరువాత ట్రావెలర్స్ బంగళాకు పిలిపించుకొన్నాడు.

"నీ పేరేమిటోయ్?"

"కేశవదాసు!"

"ఇవాళ నుంచి నువ్వు నాతో ఉండు. నా మీటింగ్‌లన్నింటిలోనూ నీ పాటలు ఉండాలి. గొప్ప కంఠం నీది. జనాన్ని వెర్రెక్కించి, ఊపెక్కించే స్వరం నీది! కలిచేడు తెలుసుగా నీకు. మూడేళ్ళ క్రితం కలిచేడులో జరిగిన ఘోరకృత్యాన్ని పాటలుగా రాశాడు మన జాన్ కవి. వాటిని నువ్వు

పాడాలి. పాడటమంటే మామూలుగా కాదు. గుండెల్లోకి జొరబడాలి. కళ్ళముందు కలిచేడు కన బడాలి. తలలుగా మొండాలుగా నరకబడ్డ శవాలు ఇక్కడ వేదిక మీదకు వచ్చాయా అన్నట్లుగా పాట పాడాలి. తిండి బట్టలు కాక నెలకు మూడువేలిస్తాను!"

డబ్బు మాట ఎత్తినపుడు నా మనసు చివుక్కుమన్నా, అంతటి మనిషి నన్ను మెచ్చుకోవడం తో నా మనసుకు పట్టపగ్గాల్లేవు. హఠాత్తుగా నా నెత్తిన కిరీటం, భుజాలకు రెక్కలు వచ్చినట్లుగా అనిపించింది.

**సెప్టెంబరు 12-18**

ఈ మోహనరావు చెప్పేదంతా బూటకం అనిపిస్తుంది. 'దళితుడి చేతిలో రాజ్యాధికారం' అంటాడు. వింటానికిదో పెద్ద ఉటోపియన్ డ్రీమ్‌లాగా తోస్తుంది. దీని వెనుక ఎన్ని లొసుగులు. మోహనరావు చెప్పే దళితుడెవడు? మా పల్లెల్లో ఎప్పుడూ చూడని వింతజీవి యితను. వైట్‌కాలర్ దళితుడు. ఇతనికి మురికి అంటే అయిష్టం. దుర్గంధమంటే అయిష్టం. సొక్కిపోయిన దేహాలన్నా, వాటికి చిరిగిన ధోవతులతో కప్పుకున్న బీదరికం అన్నా అయిష్టం. ఎంత జుగుప్సగా ఉందీ వాతా వరణం. 'ఇట్లా బజార్లలో పశువుల్ని కోసుకు తినడం, ఈ మురికిలో పొర్లటం, ఈ తాగటం, ఈ పరమ చండాలం ఇట్లా ఉంటే ఏ సభ్య సమాజం మనల్ని రానిస్తుంది?' ఇది మోహనరావు అభి ప్రాయమే కాదు. ఈ వైట్‌కాలర్ దళితులందరి భావాలు కూడా. బంగళాల్లో స్కాచ్ విస్కీలు, స్టార్ హోటళ్ళలో చికెన్ మంచూరియాలు మాత్రమే నాగరికత అనుకునే వీళ్ళ మానసిక స్థాయిపై నాకెన్నో అపనమ్మకాలు. అయినా ఒక ఆశ. గుడ్డి కన్నా మెల్ల నయం కదా అని. అతని బలహీనతలకు అతీతంగా మోహనరావుపై ఆశలు పెట్టుకొన్నాను. ఆశయం బలమైంది అయితే, అది వ్యక్తిలోని మానసిక దౌర్బల్యానికి, అంతరంగపు మరుగుజ్జుతనానికి అతీతంగా ఎదుగుతుంది అనేది మనకు చరిత్ర చెప్పిన పాఠం. మోహనరావు గురించి నా ఆశా అదే.

**సెప్టెంబరు 19-25**

తెనాలి, నర్సరావుపేటల్లో జరిగిన మీటింగులు గొప్ప సంచలనాన్ని కలిగించాయి. పశు వుల్ని, మేకల్ని మందలు, మందలుగా తోలినట్లుగా జనాన్ని తోలే మీటింగుల యుగంలో స్వచ్ఛం దంగా అన్ని వేలమంది రావటం ఒక వింత. మోహనరావు గొప్ప వక్త. అక్కడొక ముక్క, ఇక్కడొక ముక్కా ముక్కున కరచుకుని, ఆ సమయానికి గొప్ప మేధావిలా ప్రత్యక్షం అవుతాడు. కాసేపు ఉపనిషత్తులంటాడు. కాసేపు దాస్ కాపిటల్ అంటాడు. శ్రీశ్రీని ధారాళంగా కోట్ చేస్తాడు. జాషువా పద్యాల్ని అలవోకగా పాడతాడు. సంఘటనలను రంగు రుచి కల పదార్థాలుగా మార్చగల కథాకథన శైలి. గుండెల్ని తాకే వ్యంగ్యం. మోహనరావు ఉపన్యాసం గొప్ప యుఫోరియాను ఇస్తుంది. ఈ మీటింగుల్లో ముందుగా కలిచేడు హత్యల్ని ప్రస్తావించేవాడు.

"వాళ్ళు దాన్ని యుద్ధం అంటున్నారు. రెండు కులాల మధ్య యుద్ధం! యుద్ధం అనేది పెద్ద మాట అనిపిస్తే దొమ్మీ అనండి అంటున్నారు. కానీ అది దాడి. నిదురిస్తున్న కనుపాపలపై పరపరమంటూ చీల్చుకుంటూ వెళ్ళినవి కత్తులూ, గొడ్డళ్ళే. అక్కడ తెగింది శిరస్సులూ, మొండాలే," అంటూ మొదలుపెడతాడు. కలిచేడు దురంతాల్ని తనదైన శైలిలో వివరిస్తాడు. అయ్యో అయ్యో అనే సానుభూతి, దు:ఖం, అరెరే, అనే ఆవేశం సభికుల్లో కలుగుతుంది. అదో హిప్నాటిక్ ట్రాన్స్. అదుగో అప్పుడు బయటపెడతాడు తన ప్రణాళికను. జనాభాలో మనదెంత శాతం అని లెక్కలు వేస్తాడు. ముస్లిం సోదరుల్ని కలుపుకొన్నామనుకో, మన బి.సి. సోదరుల్ని కూడా కలుపుకొన్నామనుకో, అప్పుడు లెక్కలేస్తే అంటాడు. అంతా కలిపి తొంభై శాతం అని తేల్చుతాడు. తొంభై శాతం ఉన్న

మనం అల్ప సంఖ్యాకులుగా, పీడితులుగా ఎందుకుండాలి అంటాడు. అప్పుడు ప్రవక్తలా ముఖం పెడతాడు. అధికారమే మన చేతిలోకి వస్తే అనే స్వప్నాన్ని ఆవిష్కరిస్తాడు. కళ్ళు మూస్తేనే తప్ప కనబడని కలల పావురాల్ని మనముందు ఎగరేస్తాడు. ఇదంతా గొప్ప ఐంద్రజాలిక విద్య అనిపిస్తుంది. అయినా ఏదో ఆశ. ఈ ఆశ, నా జాతి మొత్తపు బలహీనతేమో?

**సెప్టెంబరు 26 - అక్టోబరు 2**

తెనాలి మీటింగు తర్వాత, 'భారత రాజకీయచరిత్రలో కొత్త శకం రానుందా?' అంటూ పేపర్లలో పతాక శీర్షికలు వచ్చాయి. 'రాష్ట్ర రాజకీయ వర్గాల్లో అలజడి' అంటూ సంపాదకీయాలు వచ్చాయి. ఆ తరువాత రెండు రోజులకు ప్రకాశం అనే రిటైర్డు ఐ.ఎ.యస్. ఆఫీసరు మోహనరావును కలవడానికొచ్చాడు. 'ముస్సోరీలో చదును చెయ్యబడ్డ సారవంతమైన మేధ నాది,' అన్నాడు. 'నన్ను చెయ్యి కలపనివ్వండి, ముందుకుపోయే చోదకశక్తి మీది, వెనుక వ్యూహం నాది,' అన్నాడు. ఇద్దరూ కౌగలించుకుంటున్న దృశ్యాల్ని పేపర్లో పటం కట్టి ప్రచురించాయి. చూస్తుండగానే మోహనరావు డాక్టర్లు, లాయర్లు, సివిల్ సర్వెంట్లూ ఛోటా కవులు, మాజీ ఉద్యమకారులు మొత్తంగా యాభై అరవై మంది మేధావుల్ని వెంట తిప్పుకోగల నాయకుడయ్యాడు.

మోహనరావు బడా నాయకుడయ్యాడు. ఆయనకో పి.ఎ., బాడీగార్డులు మొదలైన హంగులు వచ్చాయి. 'కేశవదాసు నాకు బాడీగార్డుగా ఉంటాడు,' అంటూ నలుగురితో చెప్పేడు. ఆ మాటలకు నేను నిజంగా సంబరపడ్డాను. నాకు అటువైపునో ఐ.ఎ.యస్. ఆఫీసరు, ఇటువైపునో డాక్టరు, వాళ్ళతో సమానంగా నేను నడవటం, అదేదో సినిమాలో పాటలాగా 'దొరుకునా ఇటువంటి సేవ?'

**అక్టోబర్ 3-9**

వినుకొండలో ఆరోజు రాత్రి బహిరంగసభ అయిపోయేసరికి పదకొండుగంటలైంది. గెస్ట్ హౌస్‌కెళ్ళి భోజనం చేసేసరికి పన్నెండు అయ్యింది. బయట వరండాలో పచార్లు చేస్తూ కొన్ని గద్దర్ పాటల్ని ప్రాక్టీస్ చేస్తుండగా "దాసు!" అంటూ మోహనరావు గొంతు వినబడింది. తలుపు తెరుచుకొని ఆయన గదిలోకి వెళితే వింత దృశ్యం కనిపించింది. ఎదురుగా టీపాయ్ మీద విస్కీ సీసా, సోడాల గ్లాసులు ఉన్నాయి. రక్తం చిమ్మే గాయాల్లా ఉన్నాయి ఆయన కళ్ళు. "రా తమ్ముడూ! రా! ఇందా ఈ గ్లాసు తీసుకో! ఒక పెగ్గు వేసుకో!"

"అలవాటు లేదన్నా!"

"నాకు మాత్రం అలవాటుందా? ఈ మందే వేసుకోకపోతే గుండెల్లో రగిలే ఈ బాధలో నేనేమయ్యేవాడినో? తమ్ముడూ! మనదీ ఒక బతుకేనా? తప్పు చేసినవాళ్ళలా, మన ఉనికిని మనం చెప్పుకోడానికే భయంగా... తమ్ముడూ! కలిచేడు హత్యలు గురించి నువ్వు పాడుతుంటే గుండె చలించిపోయింది! నేను హంతకుణ్ని ఎందుకు కాలేకపొయ్యానా అని బాధపడ్డాను. తమ్ముడూ! కసి తీర్చుకుందాము రా! ఇంతకింతా! నువ్వు కానివ్వు. ఒక పెగ్గు వేసుకో! వేసుకొని ఇట్లా వచ్చి నా పక్కన కూర్చో... పర్లేదులే, రా!"

మోహనరావు నన్ను లాగి పక్కన కూర్చోపెట్టుకున్నాడు. బలవంతంగా గ్లాసు చేతికిచ్చి గుటక వెయ్యమన్నాడు. తప్పించుకోవడం కుదిరింది కాదు. గుటక వెయ్యగానే గొంతు అగ్గినిప్పు అయింది. కడుపులోపలి నుంచి ఏదో తోసుకువచ్చి భళ్ళున నేలపై పడింది. అక్కడ నేలపై సోఫాపై. మోహనరావు బట్టలపై జిగటజిగటగా పులిసిన వాసనతో... నన్ను మంచంపై పడుకోబెట్టి నాకు సపర్యలు చెయ్యటం నాకు గుర్తుంది. ఈ వినుకొండ సభ నా జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు. ఒకటి నేను మోహనరావుకు దగ్గరయ్యాను. రెండోది నేను మొదటిసారిగా మందు రుచి చూశాను. ఇరవై యేళ్ళ నా శరీరానికి విస్కీ చుక్కలు వింతైన హాయిని, మొరటుదనాన్ని అలవాటు చేశాయి.

**అక్టోబరు 10-16**

ఒక్కొక్క మీటింగుకు మోహనరావు చుట్టూ ఏర్పడ్డ 'ఆరా' విస్తృతం కావటం మొదలు పెట్టింది. "చూశావా తమ్ముడూ! ఇన్ని వేలమంది నన్ను తనవాడు అంటూ నెత్తిన పెట్టుకుంటు న్నారు. వీళ్ళకేదయినా చెయ్యటంలో నా ప్రాణాల్ని సైతం పోగొట్టుకొంటే ఏం?" అన్నాడు ఒకరోజు. ఆ మాటలు నన్ను ఉద్దేశించి కాదు. ఒకానొక మూడ్‌లోంచి అసంకల్పితంగా వచ్చిన మాటలవి. చుట్టూ ఉన్న జనం వినమ్రంగా ప్రవచనాన్ని వింటున్నట్లుగా చూశారు. ఆరాధనాపూర్వకమైన ఆ చూపులు మోహనరావుకు ఇష్టం. ఒకనొక 'మెస్సయా'లా తాను ప్రపంచానికి పరిచయం కావాలని ఆయన ఆరాటం. 'మెస్సయా'లు ఒక్కసారిగా ఆకాశం నుండి ఊడిపడరు. వాళ్ళ వెనుక నిరంతర సాధన, త్యాగం, సత్యాన్వేషణ ఉంటాయి. మోహనరావు గత జీవితంలో యివన్నీ ఉన్నాయంటే నమ్మబుద్ధి కావటం లేదు. ప్రస్తుత జీవితంలో మాత్రం మోహనరావు మెస్సయా అవతారానికి దగ్గరగానే ప్రవర్తిస్తున్నాడు. (మందు పుచ్చుకోవటం మినహా.)

అర్ధరాత్రి మోహనరావు గొంతు నుంచి మెస్సయా మార్కు మృదు వచనాలు కాక విలన్ల తాలుకు కరుకు కంఠోక్తుల్ని విని ఉలిక్కిపడి లేచాను. కిటికీలోంచి చూస్తే, భయానకదృశ్యం. కోటేసు అనే కుర్రవాణ్ణి స్తంభానికి కట్టివేసి, చెయిన్లతో బాదుతున్నారు. "ఛస్తావురా! లంజకొడకా! చెప్పరా చెప్పు!" అంటూ అరుస్తున్నాడు మోహనరావు. రక్తమోడుతున్న గాయాలుకానీ, ఆ హింసగానీ వాణ్ణి పెద్దగా కదిలించినట్టు లేదు. నోటివెంట మాట పెగలటం లేదు.

"వీణ్ణి తీసుకువెళ్ళి వెనకగదిలో కట్టివేసి ఉంచండి! చెప్పేదాకా పచ్చి మంచినీళ్ళు కూడా ఇవ్వకండి! అంతంత దెబ్బలకు కూడా లొంగటం లేదే వీడు?" అంటూ మోహనరావు బెడ్‌రూమ్‌వైపు వెళ్ళిపోయాడు. కోటేసును ఈడ్చుకుంటూ లోపలికి తీసుకెళ్ళారు. ఆ రాత్రి మరి నాకు నిద్రపట్టలేదు. కోటేసు శరీరంపై గాయాలే కళ్ళ ముందు కదలాడుతున్నాయి. అంతకన్నా జకిల్ అండ్ మిస్టర్ హైడ్‌లాగా మోహనరావు ఈ రెండో అవతారం నన్ను వింత భయార్ణవంలోకి విసిరివేసింది.

మోహనరావు అంతరంగిక సిబ్బంది చాలా పెద్దది. మంత్రాంగం జరిపే జాను కవి. (ప్రకాశం, ఐ.ఎ.యస్., అంతరంగికుడి కిందకు రాడు.) ఇద్దరు మధ్య వయసున్న డాక్టర్లు, స్నేహితుల్లాంటి సలహాదారులు. అంగరక్షకుల పేరుతో ఒక ఐదుగురు ఉన్నారు. (ఈ అంగరక్షకుల కేటగిరీలోకి నేను రాను). వీళ్ళు కాక అంతగా చదువురానివాళ్ళు, సేవకుల్లాంటివాళ్ళు ఒక పదిమందిదాకా ఉంటారు. కోటేసు వాళ్ళలో ఒకడు. నిన్న మధ్యాహ్నం పార్టీకి విరాళంగా వచ్చిన లక్ష రూపాయల డబ్బు బాంక్‌లో వేయమని కోటేసు కిచ్చారట. అందులో లక్షలేవు. తొంభైవేలే ఉన్నాయని వాడు తిరిగి వచ్చాడట. అదుగో అప్పణ్ణుంచి వాణ్ణి చిత్రహింసల పాలు చేస్తున్నారు. డబ్బు కాజేసేవాడినైతే ఆ లక్షా తీసుకొని పారిపోయేవాడిని కదా అని వాడి వాదం.

ఈ రాత్రి కూడా (అక్టోబరు 11) నిన్నటి సంఘటనల కొనసాగింపులా సాగింది. నడిజాము వేళలో 'అమ్మా!' అంటూ ఒక పెనుకేక పెరటిలోంచి వినబడింది. అది భయ విహ్వలతతో శరీరం లోంచి ప్రాణం విడిచిపోయే క్షణాల్లో వేసే కేకలా ఉంది. లోపల హడావుడిగా జనం అటూ ఇటూ పరుగెత్తడం నేను గమనిస్తూనే ఉన్నాను. మోహనరావు స్నేహితుడు డాక్టరు విజయకుమార్ రావటం కూడా గమనించాను.

"ఏమిటీ దారుణం! ఎట్లా జరిగింది? ఇంత భయానకమైన చిత్రహింస? ఎలా జరిగింది?"

"వీడు ప్రజల డబ్బు కాజేశాడు. చెప్పరా చెప్పు," అంటూ మోహనరావు గొంతు కంగారుగా వుంది.

“మీరేనా! మోహనరావుగారూ, మీరేనా? కలిచేడులోను, నీరుకొండలోను మనవాళ్ళను అతి భయంకరంగా చంపుతున్నారని సభల్లో వాపోయే మీరేనా? మోహనరావుగారూ ఏమిటిది?”

“డాక్టరు విజయ్! అయామ్ సారీ! ఇట్లా అవుతుందనుకోలేదు. ఒక అన్నగానే వాణ్ణి కోప్పడ్డాను. ఎలాగైనా వాణ్ణి కాపాడండి... లేనిపోని లంపటం...”

“అన్నగా కోప్పడటమంటే... చెయిన్లతో కొట్టడం, కాల్చి వాతలు పెట్టటం, మైగాడ్ ఎంత భయంకరమైన టార్చర్! ఎంత గొప్పగా ఊహించుకొన్నాను మీ గురించి, మా మధ్యన మరో అంబేద్కర్ పుట్టాడనుకొన్నామే...”

“ప్లీజ్ విజయ్! నా నిజాయితీని శంకించకండి! నా వాళ్ళను దొంగలుగా చూడలేని ఆవేదనలో...”

“చాలించండి మీ డైలాగులు... వాడికేమైనా అయ్యిందంటే మీ బ్రతుకును బజారు కీడుస్తాను,” అంటూ కోటేసును వెంట తీసుకువెళ్ళాడు డాక్టర్ విజయ్.

కోటేసుకేమయిందో ఈరోజుకు కూడా (అక్టోబరు 12) తెలియలేదు. వాడు తేరుకునే వుంటాడనుకొంటున్నాను. డాక్టరు విజయ్‌కుమార్ మాత్రం ఆ తరువాత మోహనరావు అనుచరవర్గంలో మళ్ళీ కనబడలేదు.

మోహనరావు వ్యక్తిత్వం గురించిన సందేహాలు నన్ను కలవరపెడుతున్నాయి. మోహనరావు అంటే ఏమిటి? అతను కూడా ఒక మామూలు రాజకీయ నాయకుడేనా? లేక తన వాళ్ళ స్థితికి చలించి వాళ్ళకోసం పాటుపడుతున్న మెస్సయానా? తేల్చుకోలేకపోతున్నాను. ఈ మోహనరావు త్యాగాలు కూడా తక్కువగా అంచనా వెయ్యలేము. ఉద్యోగాన్ని వదిలేశాడు. కుటుంబాన్ని పోగొట్టుకొన్నాడు. ఇప్పుడంటే ఇలా అనుచరవర్గం, అంగరక్షకులు ఉన్నారు కానీ ఒకప్పుడు అతని ప్రాణాల్ని తీయాలనే ప్రయత్నాలు జరిగాయి.

పోనీ మోహనరావు చెడ్డవాడే అనుకుంటే ఇన్ని వేలమంది ఇంతగా ఆరాధిస్తుంటే, ఆ స్పందనకు ఎంతటి కరడుకట్టిన స్వార్థపరుడైనా మారిపోతాడే, మోహనరావులో సైతం ఆ మార్పు కలగక ఉంటుందా?

డైరీలోని ఆ కాగితాలు చదివిన తరువాత హఠాత్తుగా మోహనరావుకు ఆ కుర్రవాడిపై కోపం వచ్చింది. ఇది డైరీనా? నాపై ఛార్జిషీటా అని పళ్ళు కొరుక్కున్నాడు. ఆ డైరీ పేజీల్ని ముక్కలు ముక్కలుగా చించి, పక్కనున్న మురికి కాలువలోకి విసిరివేశాడు. తనకు వ్యతిరేకంగా ఉన్న చివరి సాక్ష్యాన్ని నాశనం చేసినట్లుగా తృప్తి చెందాడు.

తానిక మళ్ళీ ఉద్యమాన్ని నిర్మించవచ్చు. మళ్ళీ జనాన్ని సమీకరించాలి. వీలయితే మళ్ళీ ఇంకోసారి కలిచేడు వెళ్ళాలి అనుకున్నాడు. ‘ఈసారి నా కార్యరంగం కలిచేడే. కలిచేడే నా ఆత్మ గృహం!’ అనుకున్నాడు. ‘నాకేమిటి ఈ దేశంలో ఏ దళిత నాయకుడికైనా కలిచేడు సందేశాన్నిచ్చే దేవాలయమే,’ అని కూడా మనసులో అనున్నాడు.

పబ్లిక్ ఫోన్ దగ్గరకు వెళ్ళి కలిచేడుకు ఉదయాన్నే ఎన్ని గంటలకు బస్సు ఉందో చెప్పమని ఫోన్ చేశాడు. టైమ్ నోట్ చేసుకొని మళ్ళీ దళిత సంగ్రామ్ పార్టీ కార్యాలయం వైపు బయలుదేరాడు.

## 3

ఉదయం పదిగంటల వేళ, దళిత సంగ్రామ పార్టీ ఆఫీసు. డెస్క్‌పై కూర్చుని ఉత్తరాలు రాసే కార్యక్రమాన్ని మొదలుపెట్టాడు మోహనరావు. లోక్‌సభలోని దళిత, బి.సి., మైనారిటీల ఎం.పీ.లందరికీ పేరు పేరునా రాస్తున్న ఉత్తరాలు. రాస్తూ... రాస్తూనే ఉన్నాడు. ప్రస్తుతానికి

తనొక్కడే. (గొప్ప ఉద్యమాలన్నీ ఒక్కడితోనే మొదలవుతాయి.) నిన్నా మొన్నటిది ప్రాంతీయ స్థాయిలో జరిగింది. ఇప్పుడిక జాతీయస్థాయిలో ఉద్యమాన్ని ఏర్పరచాలి అనుకొన్నాడు.

"ఆంధ్రదేశానికి చెందిన ప్రముఖ దళిత నాయకుడు మోహనరావు శుభాకాంక్షలతో వ్రాయు ఉత్తరము. మీకు గుర్తు ఉండే ఉంటుంది. ఐదారు నెలల క్రితం ఆంధ్రదేశాన్ని ఉగ్రూతలూగించి అధికార పార్టీ చేత నీళ్ళు తాగించిన గొప్ప దళిత ఉద్యమానికి సంస్థాపక అధ్యక్షుణ్ణి నేను..." అట్లా తనను గురించి తాను గొప్పగా రాసుకోవటం ఎందుకో నచ్చలేదు మోహనరావుకు. కానీ తప్పదు. వాళ్ళకి తెలియాలి కదా! తనలోని అనంత జ్ఞానసంపద.

"జరిగిన విషయాలు కూడా చెప్పాలి. ఇంతటి మహా ఉద్యమం ఎందుకు నీరు కారి పోయిందో తెలుసుకోవాలని మీరనుకోవడం సహజమే! నిజానికి నా సమకాలీనులలో 'హోవర్డు ఫాస్ట్'లాంటి నవలాకారుడుంటే 'స్పార్టకస్'లాంటి గొప్ప నవలకు కావలసినంత గొప్ప ఉద్వేగ భరితమైన సంఘటన ఈ ఉద్యమం. ఆనాడు స్పార్టకస్ ఓడిపొయ్యాడు. ఇవ్వాళ మోహనరావు కూడా, అదీ పోలిక. అయితే అప్పుడు స్పార్టకస్ చచ్చిపోయాడు. కానీ నేనింకా బ్రతికే ఉన్నాను. అందుకే మరో గొప్ప ఉద్యమాన్ని నిర్మించుకోగలననే నమ్మకం నాకుంది. ముందు అసలప్పుడేం జరిగిందీ మీకు వివరిస్తాను.

"వెలుగుపాలెం బడిపంతులు ఉద్యోగం మానివేసి గుంటూరు చేరాను. (నేను భార్య చేత వదిలివేయబడ్డ వాణ్ణి. వివరాలు అప్రస్తుతం.) గుంటూరు నా స్పిరిట్యువల్ హోమ్. సుమారు ఆరునెలలపాటు దళితులతో (హరిజనులు అని రిఫర్ చెయ్యటం నాకిష్టం లేదు) చర్చించాను. అంబేద్కరు తరువాత మళ్ళీ అంత గొప్ప నాయకుడు మనలో ఎందుకు ఉదయించలేదు? ఆఫ్రికన్ దేశాల్లో, లాటిన్ అమెరికన్ దేశాల్లో అణగారిన ఆర్తులందరూ పోరాటాన్ని చేస్తుంటే మనం ఎందుకు ఈ బానిసత్వాన్నీ, సామాజికహింసనీ ఇలాగే భరిస్తున్నాము? అని ప్రశ్న వేశాను. నేను కలుసుకున్న వాళ్ళలో టీచర్లు, ప్రొఫెసర్లు, డాక్టర్లు, సివిల్ సర్వెంట్లు, ఒకరేమిటి అన్ని రంగాలకు చెందిన నిష్ణాతులున్నారు. పరిస్థితులింకా పక్వం కాలేదన్నారు. జీవఫలం కాస్త వగరుగా మారిందేమో కానీ చేదుగా మారలేదన్నారు. మనవాళ్ళు మానసికంగా సిద్ధంగా లేరన్నారు.

"మనలో ఐకమత్యం ఎక్కడేడ్చింది అని ఇంకొందరు అన్నారు. ఒక ఎమ్.ఎల్.ఎ.ని కలిశాను. 'అయినా మనకిప్పుడేమైంది. మనకిప్పుడు రిజర్వేషన్లు ఉన్నాయి. స్కీములున్నాయి. యోజనలు న్నాయి. దుఃఖం ఉన్నచోటే కదా పోరాటం,' అన్నాడు.

"అయితే ఆరోజే విజయవాడ ఇంజనీరింగ్ కాలేజీలో ఒక దళిత విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు, కులం పేరుతో జరిగిన మానసిక హింసను తట్టుకోలేక.

"మిత్రుడా! ఈ సోకాల్డ్ మేధావులందర్నీ కాలితో ఓ తన్నుతన్ని, ఆరోజే నా పోరాటం మొదలు పెట్టాను. యాభైమంది కుర్రవాళ్ళతో విజయవాడ వీధుల్లో జరిపిన ఆ పోరాటమే, ఆంధ్రదేశంలో గొప్ప ఉద్యమానికి నాంది పలికింది.

"ఉత్తేజం, అధ్యయనం, ఏకీకరణ నా మూలసూత్రాలు. నా ఆశలన్నీ కుర్రవాళ్ళ మీదే. వాళ్ళే మన సంపద, మన ఆయుధాలు.

"ఆ మరుసటి రోజు విజయవాడలో ట్రైన్‌లో వెళుతున్న నన్ను కిందకు లాగి కొట్టి, స్పృహలేని స్థితిలో ఫుట్‌పాత్‌పై విసిరేశారు వాళ్ళు. ఎవరు? ఇంకెవరు మన శత్రువులు. మన శత్రువులు పోలీసుల్లో ఉన్నారు. అగ్రకుల మేధావుల్లో ఉన్నారు. (చిత్రంగా వాళ్ళెవరూ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన వాళ్ళు కాదు.)

"విజయవాడలో ఆ మరుసటిరోజు బంద్ జరిగింది. ముందు బంద్ నెవరూ లక్ష్యపెట్టలేదు. ఒక షాపును పగలగొట్టమన్నాను. ఒక బస్సును తగలబెట్టమన్నాను. అప్పుడు రెస్పాన్సు చెప్ప మన్నాను. ఎక్కడ షాపులక్కడ ధన్‌ధన్‌మని మూసివేశారు. అప్పుడు నాలోపలి నేత్రం తెరుచుకుంది. ఒక సమాధానం దొరికింది. హింసకు సమాధానం హింసేనని.

"ఆ తరువాత నేను పాదయాత్రలు చేశాను. పల్లెపల్లెకీ తిరిగాను. కులపెద్దల్ని కలిశాను. ఫాదరీల్ని కలిశాను. బడిపంతుళ్ళని కలిశాను. వాళ్లందరిలో ఒక సామాన్య లక్షణం నాకు కనిపించింది.

"ఆత్మగౌరవాన్ని పోగొట్టుకోవటం! స్పష్టమైన అవగాహన లేకపోవటం!

"మనం కొద్దికొద్దిగా చనిపోతూ, ఆ చావునే జీవితం అనుకుంటున్నాం. (ఈ పోలిక బాగా లేకపోతే) మన జీవితాలు కక్కసుదొడ్లలా ఉన్నాయి. ఈ కక్కసుదొడ్డిలోకి పోవటం రావటమే జీవితం అనుకుంటున్నాం. మన జీవితాలకు మరో పేరు డెత్... డయేరియా...

అంతవరకూ రాసి మోహనరావు తృప్తిగా నవ్వుకున్నాడు. 'ఎంత గొప్ప సిమిలీ! ప్రపంచంలోని గొప్ప గొప్ప నాయకులంతా కవులేనట. మావో కవి! లెనిన్ కవి! అంబేద్కర్‌లో కవితాంశ ఉంది. నాలో కూడా!' అని అనుకున్నాడు మోహనరావు.

ఉత్తరాన్ని అక్కడితో ఆపివేశాడు. ఇవి ఉత్తరాలు కావు. చరిత్రాత్మకమైన డాక్యుమెంట్లు. వీటిని శ్రద్ధగా రోజుల తరబడి రాయాలి అనుకున్నాడు. మోహనరావుకు తృప్తిగా ఉంది. 'గొప్ప కార్యరంగాన్ని సిద్ధపరిచాను,' అని అనిపించింది.

హఠాత్తుగా అతనికి కాస్త విస్కీ తాగితే బాగుండు అనిపించింది. రాణీదేవిని ముద్దు పెట్టుకోవాలనిపించింది. విస్కీ కాదు కానీ రాణీని కలుసుకోవాలి. ముద్దుకాదు కానీ ఆమె శాశ్వతంగా నాతో జీవిస్తుందేమో అడగాలి అనుకున్నాడు. అలా అనుకొని విసురుగా లేచి, చెప్పులు వేసుకొని రోడ్డుపైకి ఉరికాడు.

వేగంగా, ఉద్ధృతంగా, ఒకానొక ఉన్మాదంలాగా నడుస్తున్నాడు.

ఆరోజుల్లో (ఎంత, అయిదునెలలు కూడా కాలేదు) ఇద్దరూ కలిసి ఒక గదిలోనే ఉండే వాళ్ళు. కటౌట్లు, బ్యానర్లు, పోస్టర్లు ఉన్న ఇరుకుగదిలోనే ఇద్దరూ గడిపేవాళ్ళు. రాత్రి పొడవునా ఆమె శరీరం అతనికి వింత ఉత్సాహాన్ని, నిషానీ ఇస్తూనే ఉండేది. అలాంటి పారవశ్యపు క్షణాల్లోనే ఆమె కళ్ళ నుండి దు:ఖం, కోపం, పాపభీతి బొట్లు బొట్లుగా రాలి, అతని నగ్న శరీరాన్ని తడిపేవి (ఆమెకో భర్తా, ఏడేళ్ళ పిల్లవాడు ఉన్నారు). ఉదయం అవుతూనే ఆమెతో ఈ అనుబంధం ముగిసి పోతుంది. మంగళసూత్రం, నుదుటిపై బొట్టు, ఒంటి చుట్టూ కప్పుకున్న చీర చెంగు, ఆమె గౌరవ నీయమైన మహిళా కార్యకర్తగా రూపాంతరం చెందుతుంది. ప్రెస్ రిపోర్టులు, పబ్లిక్ రిలేషన్లు అంటూ వేరే జీవితంలోకి వెళ్ళిపోతుంది.

"టిఫిను చేసి వెళ్ళొచ్చు కదా!" అంటాడు.

"లేదు సర్! ఆలస్యం అవుతుంది. అవతల విలేకర్లు వస్తారు," అంటుంది.

ఆమెకీ ఉద్యమం గురించి గొప్ప ఆశలున్నాయి. ఆమె కనురెప్పల్ని కెలికితే, అన్నీ కలలే. మోహనరావు మంత్రిగా, తను అతని పి.ఎ.గా లేదా మోహనరావు ముఖ్యమంత్రిగా, తను డిప్యూటీ మంత్రిగా... ఆమె చరచరా వెళ్ళిపోయింది కలలపై నడుచుకుంటూ.

మోహనరావు రాణి గురించిన ఆలోచనల్లో పడి ఎదురుగా వస్తున్న ఆటోని గుద్దుకున్నాడు. మోకాలి చిప్ప 'ఫట్'మంది. అబ్బా అనుకొన్నాడు.

ఒకరోజు ఏం జరిగిందీ...

"హెల్ప్ మి!" అంటూ రాణి వచ్చింది.

"ఏం జరిగింది?"

"అతను నన్ను చితకబాదాడు?" ఏడుస్తోంది. "చూడు!" అంటూ వెనక్కి తిరిగింది. వీపు నిండా బెల్టు వాతలు.

"కాసేపు రెస్ట్ తీసుకో!"

"మనం పెళ్ళి చేసుకుందాం!" రాణి తీవ్ర స్వరంతో.

"ఇప్పుడు కాదు..." అదే తీవ్రతతో మోహనరావు.

"ముందు ఎలక్షన్లు కానివ్వు..."

"ఈలోగా అతను నన్ను చంపేస్తాడు.." రాణి ముఖాన్ని చేతుల్తో కప్పుకొని పెద్దగా ఏడుస్తోంది. "నా పాపాలకు నేను అనుభవిస్తున్న శిక్ష యిది..." మధ్య మధ్యలో స్వగతాలు.

రోడ్డుపై నడుస్తున్న మోహనరావు ఈ జ్ఞాపకాల్ని, ఇక్కడితో హఠాత్తుగా ఆపివేశాడు. రాణి గురించి అతని జ్ఞాపకాలన్నీ సరిగ్గా ఈ సంఘటన దగ్గరే ఆగిపోవాలని అతని కోరిక. కనీసం, తన జ్ఞాపకాల గుట్టల్లోంచి ఆ తరువాత జరిగిన సంఘటనలన్నీ పెరికివేయాలని అతని ప్రయత్నం.

'రాణి ఉరిపోసుకొని చనిపోయింది...' ఈ వార్తను వినకుండా ఉండాలనీ, విననట్లు ఉండాలనీ....

బ్రాడీపేట ఆరోలైను వచ్చింది. ఎనిమిదవ ఇల్లు. పెచ్చులూడిన గోడలు. పెంకులు కప్పిన వరండా. అడ్డదిడ్డంగా వేసిన చెక్కకుర్చీలు. ఏమని అడగాలి? నీ భార్య ఏదని అడగాలా? అక్కడే ఆ పంచలో పడుకోబెట్టారు. పూలమాల కూడా వేశాడు తను.

'ద్రోహం! దగా!' లోలోపల గొణుక్కున్నాడు మోహనరావు.

"ఎవరది?" లోపల నుంచి ఎవరిదో కంఠం.

పారిపోతున్నట్లుగా గబగబా బయటకు నడిచాడు.

అంత ఎండలోనూ రోడ్డుపై పిల్లలెవరో ఆడుకుంటున్నారు. దూరంగా చర్చిలో నుంచి ఠంగ్ ఠంగ్ మని గంటలు వినిపిస్తున్నాయి. పాలప్యాకెట్ల కోసం బూత్ ముందర క్యూ పెరిగిపోతోంది. కుష్టువాళ్ళ గుంపు ఒకటి, 'ధర్మం చెయ్యండి,' అనే బ్యానర్ని ముందు పెట్టుకొని రోడ్డుపైకి చొచ్చుకొని వస్తోంది.

"నా ప్రియమైన రాణీ! నీ ఆత్మకు శాంతి కలుగుగాక!"

"నీ కరకుబారిన, కొంచెం వయసు మళ్ళిన (ముప్పయి ఆరేళ్ళ) పెదవుల్ని ముద్దు పెట్టుకోవాలని నేను వస్తే, నువ్వేమో మృత్యువునే ముద్దు పెట్టుకొన్నావు"

"ఇప్పుడు నువ్వుంటే ఎంత బాగుండేది? ఈ ఉత్తరాలు, ఈ కాంటాక్ట్లు, ఈ ప్రణాళికలు, ఈ పురిటి నొప్పుల కృత్యాద్యవస్థను నీ చేతిలో పెట్టేవాణ్ణి గదా!"

"దేవుడు అంటే స్పందనలు తెలియని ఒకనొక దృగ్విషయం (ఫినోమినా)."

అట్లా తనలో తాను సంభాషించుకుంటూ మళ్లీ తన బొరియలోకి, దళిత సంగ్రామ్ పార్టీ కార్యాలయంలోకి పునఃప్రయాణించాడు మోహనరావు.

## 4

టెలిఫోన్ మోగింది. నాలుగు నెలల పదిహేను రోజుల తరువాత మోగుతోందా టెలిఫోను. నాలుగు నెలలుగా బిల్లులు కట్టటం లేదు. కనెక్షన్ పీకేసి ఉంటారనుకున్నాడు మోహనరావు. కానీ ఈవేళ అది మోగుతోంది. ట్రింగ్... ట్రింగ్... ఒక్కొక్క ట్రింగ్ ట్రింగ్‌కీ అతనిలోని ఎడ్రినలీన్

పెరుగు తోంది. విసుగ్గా, అసహనంగా ఫోన్ ఎత్తగానే మాలతి గొంతు వినబడింది. ఆహ్లాదకరమైన స్వరం. జీవితంపై గొప్ప ఆశను కలిగించే స్వరం. టెలిఫోన్ వైర్లలోంచి, అతని చెవుల్లోకి ప్రయాణిస్తున్న విద్యుత్తేజంలా మాలతి స్వరం. దళితవాద, స్త్రీవాద, తీవ్రవాద - పాతికేళ్ళయినా లేని, సెంటిమెంట్లు బొత్తిగా లేని మాలతి.

"హలో మోహనరావుగారా? 363486 నెంబరేనా?"

"ఇది దళిత సంగ్రామ పార్టీ ఆఫీసు."

"మీరేనా! ఎట్లా ఉన్నారు?"

"దళిత సంగ్రామ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుణ్ణి మాట్లాడుతున్నాను."

"ఆరోగ్యం ఎలా ఉంది? ఎప్పుడు డిశ్చార్జి చేశారు?"

"నేనేం జబ్బు పడలేదే?"

"ఆ మధ్య మిమ్మల్ని సైకియాట్రిస్టు దగ్గర చూశామని, స్నేహితులు చెప్పారు. ఇప్పుడు కోలుకున్నట్లేనా?

"నేను కాదు! మరో మోహనరావు ఏమో?"

'ఏమిటీమె ఉద్దేశం. మోహనరావు దళితుల్ని వెన్నుపోటు పొడిచాడని ఆవాళ నామీద కత్తి కట్టింది. ఇప్పుడేమో మోహనరావు పిచ్చివాడయ్యాడంటూ ప్రచారం చేస్తోంది. ఈ లేడీ గోబెల్స్ ప్రచారాన్ని ఖండించాలి. ఈవిడికే కాదు, నాకూ నా దళిత సోదరులపై అవ్యాజమైన అనురాగం ఉందని ఖచ్చితంగా చెప్పాలి. పోరాటం ఈవిడ ఒక్కతె సొత్తు కాదని కూడా తెలియజెయ్యాలి,' అనుకున్నాడు మోహనరావు.

"మోహనరావుగారూ..."

"వింటున్నాను. మీ తరహా రాజకీయాలు కానీ, మీ తరహా దుష్ప్రచారాలు గానీ నాకు నచ్చ లేదని ఖండితంగా చెబుతున్నాను. మీకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదు. నాకు మీమీద నమ్మకం లేదు. దట్సాల్!"

"కొన్నాళ్ళు ఎవరైనా బంధువుల ఇళ్ళకు వెళ్ళి..."

"మీరు నన్ను అవమానిస్తున్నారు. వాస్తవాల నుండి పారిపొమ్మని నాకు సలహా ఇస్తున్నారా?"

"మీరు ఒక్కళ్లే ఉండడం, ఈ నిరాశ, ఈ అనారోగ్యం వీటి నుంచి మీరు బయటపడాలి. మీరు మళ్ళీ జనం మధ్యకు వచ్చి ఉద్యమానికి ఆసరాగా ఉంటారని నా ఆశ."

'నేను చాలా ఇంప్రూవ్ అయ్యాను. 'లార్గాక్ టైల్' టాబ్లెట్లు ఇప్పుడు మూడేసుకుంటున్నాను. వచ్చే వారం నుంచి రెండే చాలన్నాడు డాక్టరు. ఆపై నెల రోజులకొక్కటి. ఆ తరువాతి నెల ఫ్రీ... ఫ్రీడం... స్వేచ్ఛ,' అని ఆమెకు చెప్పాలనించింది మోహనరావుకు. కానీ చెప్పలేదు. చెప్పకూడదు అనుకున్నాడు.

"వింటున్నారా?" మాలతి అడుగుతోంది.

"ఆ..."

"పోనీ మీ భార్య దగ్గరకు వెళ్ళి కొన్నాళ్ళు..."

నాన్సెన్స్! నా గురించి మీకెందుకింత ఆదుర్దా అని పెద్దగా అరవబోయి, "అసలు జైల్లో ఉండవల్సిన దానివి బయట ఎట్లా ఉన్నావు..." అంటూ ప్రశ్నించాడు.

"పెరోల్ పై బయటికి వచ్చాం."

"మీ హత్యారాజకీయాల్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఇలాంటి తీవ్రవాదం వల్లనే ఉవ్వెత్తున లేచిన దళిత ఉద్యమం చప్పున చల్లారిపోయింది. మీరు ఉద్యమ ద్రోహులు."

"ఈ పోస్టుమార్టం కార్యక్రమం ఇప్పుడు కాదు. మీ ఆరోగ్యం చక్కబడ్డాక అప్పుడు చర్చించుకుందాం!"

"టైము అయిపోయింది! ఇక ఫోన్ పెట్టేస్తాను. రాయవలసిన ఉత్తరాలు చాలా ఉన్నాయి. జీవితకథల రచన అట్లాగే ఉంది. ముప్పయి ఏడవ అధ్యాయం పూర్తి కానేలేదు. మీరు మనసు మార్చుకొని ప్రజాస్వామ్య పద్ధతులలోకి వస్తే నాకు కబురు చేయండి. మా పార్టీలోకి మిమ్మల్ని హృదయపూర్వకంగా ఆహ్వానిస్తాను," అంటూ ఫోన్ పెట్టేశాడు మోహనరావు.

కామ్రేడ్ మాలతి! 'దళితులపై అత్యాచారాలు- ఒక నివేదిక' అనే నీ పుస్తకం చదివేను. గొప్ప విశ్లేషణ. నీ పరిశోధనల్లో నిజం ఉంది. ఆర్థిక స్థితిగతులు మారాలన్నావు. భూమిపై హక్కు రావాలన్నావు. దళితుల్లో పెరుగుతున్న ఆత్మ విశ్వాసం సహించలేకే అగ్రకులాలు ఈ దాడుల్ని చేస్తున్నాయన్నావు. అవన్నీ ఒప్పుకుంటున్నాను. కానీ దళిత ఉద్యమం, దళిత విముక్తి అనేవి తాత్కాలిక ఉద్యమాలు అనే వాదం మాత్రం నేను అంగీకరించను. ఒక అంతిమ పోరాటంలో కలియవలసిన చిన్న ప్రవాహం అనే వాదాన్ని నేను ఒప్పుకోను.

'కానీ, అదిసరే, జీవితాన్ని ఇలా జైలుపాలు చేసుకున్నావే? త్యాగమూర్తి అనిపించుకోవాలనా? చదువుని, తల్లిదండ్రుల్ని, కలలు పూసే పాతికేళ్ళను కాలదన్నుకొని... చూడమ్మాయి! ఎందుకో నువ్వంటే నాకు గౌరవం కలుగుతోంది,' అని మనసులో అనుకున్నాడు మోహనరావు.

హఠాత్తుగా ఏదో గుర్తు కొచ్చినవాడిలా లేచి ఆఫీసుకు తాళం వేసి కేశవదాసు ఇంటివైపు బయల్దేరాడు. దాసు తండ్రి ఇంటిలోనే ఉన్నాడు. ఏమిటిలా వచ్చావు అన్నట్టుగా చూశాడాయన.

"ఎట్లా ఉన్నారో చూసిపోదామని వచ్చాను," అన్నాడు మోహనరావు.

"లోపలికిరా! మధ్యాహ్నం అన్నమేదయినా తిన్నావా?" అని లోపలున్న భార్యను పిలిచాడు. "మేరీ! ఆయనొచ్చాడు. అన్నం తింటాడేమో అడుగు!" అని చెప్పి బయటకు వెళ్ళాడు.

అటూ ఇటూ కలియచూశాడు మోహనరావు. ఎర్రడైరీ కనిపించింది. దాన్ని తీసుకొని బయటకు వచ్చాడు. మాలతి గురించి పేజీల కోసం వెతికాడు. రెండుమూడు చోట్ల కనిపించింది. వాటిని పర్రుమని చింపబోయి, దాసు వాళ్ళ అమ్మ రావటం చూసి ఆగిపోయాడు. "రాయ్యా! కాస్త అన్నం తిందువుగానీ..." అంటూ లోపలికి పిలిచింది.

"ఇప్పుడు కాదులే, ముఖ్యమైన ఉత్తరాలు కొన్ని రాయాలి," అంటూ ఎర్రడైరీ పట్టుకొని అలాగే రోడ్డుపైకి వచ్చాడు. ఆత్రుతగా డైరీ తెరిచి, మాలతి గురించి రాసిన పేజీల్ని చదవటం మొదలుపెట్టాడు.

**నవంబరు 7-13**

ఆరోజు ఉదయం 'ది అర్ఫన్స్ ఆఫ్ కలిచేడు ఆన్ ది మార్చ్' అంటూ ఇంగ్లీషు పేపర్లో వచ్చిన వార్త మోహనరావును బాగా కలవరపెట్టింది. పదిమంది పిల్లలు, అంతా ఆరేళ్ళ నుండి పదేళ్ళదాకా ఉన్నవాళ్ళు. గుంటూరు కలెక్టరాఫీసు ముందు నిరాహారదీక్ష శిబిరాన్ని ఏర్పాటు చెయ్యటం గురించిన వార్త అది. మాలతి అనే సోషల్ వర్కర్‌ను పోలీసులు అరెస్టు చెయ్యడంపై నిరసనగా ఈ పిల్లలు కలెక్టరాఫీసు ముందు బైఠాయించారు. వీళ్ళకు మద్దతుగా కలిచేడు దళితులు కొందరు, మరికొందరు పౌరహక్కుల సంఘం వాళ్ళు కూడా అక్కడ చేరారు. మేం అక్కడకు వెళ్ళేసరికి వాతావరణం చాలా ఉద్రిక్తంగా ఉంది.

లాఠీలు పదును చూసుకుంటూ పోలీసులు. లాఠీఛార్జీ చేస్తే దాని ప్రభావమెట్లా ఉంటుందనే ఆలోచనతో సబ్-కలెక్టరు (సరిత ఆనందన్) ఉన్నారు. రోడ్డంతా నినాదాల హోరు. యుద్ధం మధ్యలోకి గీతాచార్యుడిలా మోహనరావు ప్రవేశించాడు. పాలుగారే చెక్కిళ్ళు దీనవదనాల్తో శిబిరంలో పిల్లల్ని చూస్తే కళ్ళలో నీళ్ళు తిరిగాయి. వాళ్ళ ముఖాలు ఉద్వేగరహితంగా, నిర్మలంగా

ఉన్నాయి. పొలాల మధ్యన చీడపట్టి పూలు పూయటం ఆగిపోయిన మొక్కలు కొన్ని ఉంటాయి. అట్లా ఉన్నాయా పిల్లల ముఖాలు.

"ముందా పిల్లలతో దీక్ష విరమింపజేయండి! తరువాత విషయాన్ని సావధానంగా చర్చించుకుందాం!" సబ్-కలెక్టరు ఇంగ్లీషులో అభ్యర్థిస్తోంది. ఆ మాటలకు ప్రతిస్పందనగా, "అనాధ పిల్లలపై పోలీసుల జులుం నశించాలి!" అంటూ పెద్దగా నినాదం ఒకటి కెరటంలా లేచింది.

"ప్లీజ్! నా మాట వినండి. పంతాలకు పోకండి! ఉదయం నుండి నిరాహారంగా ఉన్నారా పిల్లలు. వాళ్ళకేమయినా అయితే మనం అందరం సిగ్గుతో తలదించుకోవాల్సి వస్తుంది," సబ్-కలెక్టరు ముఖంలో నిజాయితీ.

"అందుకే ఆ పిల్లల తల్లిని వాళ్లకు అప్పజెప్పండి!" అంటూ జనం అరిచారు.

"ఇది దేశమా? వల్లకాడా? అనాధ పిల్లల్ని ఆదుకొని, వాళ్ళకోసం సర్వం త్యాగం చేసే వాళ్ళను, 'టాడా' కిందా, యాంటీ గుండా ఆక్టు కిందా అరెస్టు చేసే దేశం, మనం బోస్నియా గురించో, మరో దేశం గురించో, అక్కడ పౌరహక్కులు లేవని వాపోవటం ఎంత హాస్యాస్పదం? మీ పోలీసులకు సోషల్ వర్కర్లంటే పడదు. నాన్ గవర్నమెంట్ ఆర్గనైజేషన్లంటే పడదు. ఆఖరికి ఉచితంగా పల్లెల్లో వైద్యం చేసే డాక్టర్లపైనా అనుమానమే. ఎవడు ప్రజల గురించి మంచిగా స్పందించినా వాడో ఉగ్రవాది. కాస్తంత కరుణా, మానవత్వం ఉన్నవాళ్ళని చంపివేసి, ఆ తరువాత మిగిలిన శ్మశానాన్ని తలాకాస్త పీక్కు తినండి!" కసిగా, ఆవేదనగా మాట్లాడేడు ఒక నలభైయేళ్ళ మనిషి. (ఆయన పౌరహక్కుల సంఘపు సెక్రటరీ అని తరువాత తెలిసింది.)

అప్పటివరకు విషయం అంతుపట్టక అటూ ఇటూ తిరుగుతున్న మోహనరావు రంగంలోకి వచ్చాడు. దీక్షా శిబిరంలోకి వెళ్ళి పిల్లల వద్ద కాసేపు కూర్చున్నాడు. చూస్తుండగానే మోహనరావు ముఖంలో దు:ఖం పొంగుకొచ్చింది. వాళ్ళలో ఒక పిల్లవాణ్ణి దగ్గరకు తీసుకొని, గుండెలకు హత్తుకొని, పొగిలిపొగిలి ఏడ్చాడు. నాకెందుకో ఆ దృశ్యం కృతకంగా, నాటకీయంగా అనిపించింది. అటు పక్కన కూర్చున్న కలిచేడు ఆడవాళ్ళు మాత్రం చలించిపోయారు. వాళ్ళు చీర చెంగులతో కళ్ళు వత్తుకోవటం ప్రారంభించారు.

"నన్ను మోహనరావు అంటారు. దళిత సంగ్రామ పార్టీ అధ్యక్షుణ్ణి. చెప్పండి! మాలతమ్మను ఎందుకు అరెస్టు చేశారు. అసలు మీ ఉద్దేశం ఏమిటో చెప్పండి? మీ అధికారం, మీ తుపాకులు, మీ మూర్ఖబలాన్ని ఉపయోగించి, మమ్మల్ని హతమార్చడమేనా మీ ఉద్దేశం? సరే అయితే కానివ్వండి. మీ పోలీసుల్ని ట్రిగ్గర్ నొక్కమనండి. ముందు నాతో మొదలుపెట్టండి. ఆపైన పాలుగారే పసిపిల్లలు, వాళ్ళను కూడా చంపండి! మొత్తం దళితులందర్నీ చంపి పారెయ్యండి. వాడవాడలా ఒక జలియన్‌వాలాబాగ్‌లా చెయ్యండి. ఆ తరువాత దీన్ని దళితరహిత దేశంగా, బ్రాహ్మణవాద దేశంగా ప్రకటించుకోండి," అంటూ వెనుకనున్న కలిచేడు ఆడవాళ్ళు దగ్గరకు వెళ్ళి, "అమ్మలారా! దినదినం చచ్చే కంటే ఒక్కసారే చద్దాం. అందరూ ముందుకు రండి! ఇవాళ పోతే రేపటికి రెండు," మెల్లగా మొదలుపెట్టి క్రమంగా శ్రుతి పెంచి, చివరకు వచ్చేసరికి పెనుగర్జనలా ఉరిమాడు మోహనరావు.

సబ్-కలెక్టరుకిది ఊహించని దాడి. బిక్క చచ్చిపోయింది. "ప్లీజ్! డోంట్ క్రియేట్ లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్! ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఈ సమస్యను పరిష్కరిద్దాం. నా గదికి రండి. ఎస్.పి.ని కూడా రమ్మంటాను," అంది సబ్ కలెక్టర్.

"మేడమ్! చర్చలు, శాంతి విధానాలపై మన పోలీసులకు ఏనాడో నమ్మకం పోయింది. సమస్యల్ని చర్చల ద్వారా పరిష్కరించుకునే రోజుల్ని దాటి చాలా ముందుకొచ్చాము! ఈ చర్చలేవో

మీరే కానివ్వండి! గంట టైమిస్తున్నాను. గంటలోపల మాలతి బయటకు రాకపోతే, పిల్లల నిరాహార దీక్ష అలా ఉంచండి. నేను సజీవంగా ఆత్మాహుతి చేసుకుంటాను,'' అంటూ మౌనంగా పిల్లలున్న శిబిరంవైపు వెళ్లి వాళ్ళమధ్యన బోధిసత్వుడిలా కూర్చున్నాడు. అక్కడున్న పౌరసంఘాల వాళ్ళు, విద్యార్థి సంఘాలవాళ్ళు ఒక్కసారిగా మ్రాన్పడిపోయారు. సబ్ కలెక్టరు హడావుడిగా లోపలికి వెళ్ళింది.

మోహనరావు నావైపు తిరిగి, ''తమ్ముడూ! ఒకపాట అందుకో!'' అన్నాడు. నాకెందుకో గొంతు పెగల్లేదు. హఠాత్తుగా, నాటకీయంగా ఒక పాట పాడటం అది కథల్లోనో, సినిమాల్లోనో సాధ్యం కానీ, ఇలా ఇంతమంది ముందు, ఎలా పాడగలను. అయినా అన్న ఆజ్ఞ. 'వినుడి వినుడీ! కలిచేడు దళితుల గాథ!' అంటూ మెల్లగా పాట ఎత్తుకున్నాను. వందలసార్లు పాడిన పాట. అన్నిసార్లూ కనబడని విషాదమేదో నా కళ్ళలో నీళ్ళు తెప్పించి, నన్ను వివశుణ్ణి చేయటం నాకిప్పటికీ వింతే!

మాలతిని విడుదల చెయ్యడానికి ఒప్పుకున్నట్లు సబ్-కలెక్టరు కబురు పంపింది. నినాదాల మధ్య మోహనరావు మరోసారి తన ఉపన్యాసపు ఇంద్రజాలాన్ని జనంపై ప్రదర్శించటం మొదలు పెట్టాడు. మోహనరావు పదును మాటల్ని చీల్చుకుంటూ కళ్ళముందు సాక్షాత్కరించిన స్త్రీమూర్తి రూపం నన్ను వివశుణ్ణి చేసింది. ఆమె ముఖంలో ఎంత శాంతి! ఎంత దయ! ఎంతటి అమ్మతనం. అకల్మషమైన జలాశయంలా అనిపించింది ఆమె.

తన సర్వస్వాన్ని వదులుకొని వచ్చి, కలిచేడులో నివాసం ఏర్పరచుకొని, తల్లులు, తండ్రులు చనిపోయిన పిల్లల కోసం 'ఆశ' అనే అభయధామాన్ని ఏర్పాటుచేసి, ప్రభుత్వం యిచ్చిన ఆర్థిక సహాయాన్ని 'ఛీ పో!' అనిపించి ఆడవాళ్ళతో కుటీర పరిశ్రమల్ని ఏర్పాటుచేయించి... ఇంతా చేసి ఈ మాలతి వయస్సు పాతికేళ్ళే.

చుట్టూ మూగిన పిల్లల్ని ప్రేమగా దగ్గరకు తీసుకుంటూ, వాళ్ళలో మరీ చిన్నపిల్లను ఎత్తుకొని ముద్దాడి, ఆడవాళ్ళతో, ''చాలా హడావుడి చేశారక్కా!'' అంటూ ప్రేమగా కృతజ్ఞతలు చెప్పి, పౌర హక్కుల నాయకులతో, ''ఇంత త్వరగా విడుదల చేస్తారనుకోలేదు,'' అంటూ ముచ్చటిస్తుండగా, మోహనరావు ముందుకు వచ్చాడు. ''నన్ను మోహనరావు అంటారు!'' అంటూ పరిచయం చేసుకున్నాడు.

''చాలా థాంక్సు! మీ గురించి రోజూ పేపర్లలో చదువుతున్నాను. మీ రాజకీయాలు, విధానాలు నాకు అంతగా అర్థంకాలేదు కానీ, దళితులందర్నీ ఒకటిగా సమీకరిస్తున్న మీ ప్రయత్నాన్ని మాత్రం హర్షిస్తాను. సెలవు!'' అంటూ అక్కడనుండి వెళ్ళిపోయింది మాలతి, తన వ్యక్తితపు వింత పరిమళాన్ని అక్కడ మిగిల్చి. ఎందుచేతనో మోహనరావు ముఖంలో విజయం తాలూకు తృప్తి కనబడలేదు.

**నవంబరు 14-20**

ప్రదేశాలు మారినా మళ్ళీ అవే దృశ్యాలు. మళ్ళీ మళ్ళీ పునరావృతం. మనుషులు వాళ్ళే, వాళ్ళ కళ్ళలోని ఆశలు అవే. ఎంత అమాయకంగా, ఎంత అనాలోచితంగా జైజై ధ్వానాలు పలుకుతున్నారు. ఆశలు మిలమిలలాడేవాళ్ళ కళ్ళ లోతుల్ని కెలికితే అక్కడంతా రక్తపుమరకలే, కన్నీటి చుక్కలే.

దళితులంటే ఓటు పేపరుగా మాత్రమే తెలిసిప ప్రపంచానికి, అధికారపు నిచ్చెనగా మాత్రమే కనబడే లోకంలో, ఎవరికి కావాలి వాళ్ళ దు:ఖగాథలు? దళితులంటే అనారోగ్యం. అనాకారం గుర్తుకొచ్చే లోకంలో, దళితులంటే రిజర్వేషన్లు, 'కోటా నాకొడుకులు'గా మాత్రమే గుర్తుండే దేశంలో వీళ్ళ కథలు గాథలు ఎవరు వింటారు?

"ఈ పల్లెలకి రండి. కళ్ళతో కాదు హృదయంతో చూడండి. చిరకాలంగా వింటున్న 'ఆర్కిటైప్' లతోనూ 'ప్రిజుడిస్'లతో కాక మనిషితనంలోంచి వినండి. మీరు ఆహా ఓహో అని పొగిడే అద్భుతమైన కథాసాహిత్య రత్నాలకు దీటైన కథలు ఇక్కడ మీకు దొరకుతాయి. అయితే ఇవన్నీ ఫక్తు ట్రాజిడీ కథలు. సత్యజిత్ రాయ్ మార్కు సినిమాల్లో కనబడే కథలు. ఈ కథలన్నిటిలోనూ ఒకే ఏకరూపత. ఆకలి, అజ్ఞానం, దు:ఖం, వీటన్నిటినీ మించి ప్రేమించే గుణం. ఒక గొప్ప మార్పు కోసం ఎదురుచూసేతనం. ఈ దుర్భర జీవితాన్ని గురించి పిసరంత ఆశ నివ్వండి. ఆ పిడికెడు ఆశకోసం ప్రాణాలైనా ఇస్తారు."

గుండెల్ని చీల్చుకొని, లోపలికి ప్రవేశించే మృదుభాషణం మాలతిది. వెయ్యికి పైగా ఉన్న దళితుల సమూహాన్ని ఉద్దేశించి మాట్లాడుతోంది.

"ఎందరెందరో నేతలు దళితులను ఉద్ధరిస్తామంటూ ఫోజు పెడతారు. వాళ్ళ ఆశల తుట్టను కదిలించి, కాస్త కాస్త కలల సుఖాన్ని కళ్ళ ముందు విదిల్చి వాళ్ళ పనులు చేసుకుపోతారు. ఇవాళ మనందరి మీద లాఠీఛార్జీ చేయించినవాడు. మన రక్తాన్ని కళ్ళజూసినవాడు, ఈ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దళితుడే. ఈ పల్లెల్లో పుట్టినవాడే. ఈ అవమానాల రహదారుల్లో తిరిగినవాడే. మీకోసం అది చేస్తాను, ఇది చేస్తాను, ఆకాశం నుండి స్వర్గాన్ని క్రిందకు దించుతాను అని చెప్పినవాడే. వీళ్ళకూ, వేశ్యలకూ అట్టే తేడా ఉండదు. క్షణాల్లో అంతులేని ప్రేమను కురిపిస్తారు. అవసరం తీరగానే తీరగానే ఇప్పుడిలా.

"కలిచేడు విషాదానికి అప్పుడే మూడేళ్ళు నిండాయి. కేసులు, కోర్టులు అలా ఉంచండి. పునరావాసాన్ని గురించి కూడా ఆలోచించేవాళ్లు లేరు. కలిచేడు సరిహద్దులో మళ్ళీ జీవితాల్ని గడిపే ఆలోచనే లేదు. మాకు దూరంగా స్థలాల్ని కేటాయించమనే అతి చిన్న కోరికకు కూడా లాఠీఛార్జీలు, అరెస్టులు."

"ఈ ఐ.ఎ.యస్.లను వదిలివేయండి. వాళ్ళకు గ్రామాల గురించి, దళితుల దుస్థితి గురించీ బొత్తిగా తెలియదు. కానీ ఈ సాంఘిక సంక్షేమ మంత్రికి కొత్తకాదే. వీళ్ళ హయాంలో దళితులపై ఇది మూడోసారి దాడి జరగటం. బంగళాలు, కార్లు, అధికారపు సుఖం మధ్య వీళ్ళకు కలిచేడులూ కనబడవు, అక్కడ పారే రక్తపుటేరులూ కనబడవు.

"ఇవాల్టికివాళ ఇందరము రోడ్డుపై, ఎండలో ఉదయం నుంచి ఈసురోమంటూ కూర్చుంటే అతనికి మాట్లాడడానికి తీరిక దొరకలేదు. పైగా ఇదో న్యూసెన్సులా ఉందట. లాఠీఛార్జీ చేసి అయినా రోడ్లు ఖాళీ చేయమని మంత్రి ఉత్తర్వు. మొత్తం ఇరవైమంది తీవ్రగాయాల్తో హాస్పటల్‌లో వున్నారు. రోడ్డుపైని రక్తపుమరకల్ని తొక్కుకుంటూ అతగాడు తన అధికారపు రథాన్ని నడిపించుకు వెళ్ళాడు.

"వీడు, ఈ మంత్రి, రాజకీయ మృగాలకు ఒక నమూనా. మనిషి రక్తాన్ని మరిగిన పులుల జాతి వీళ్ళది. క్షతగాత్రులైన దళిత సోదరుల సాక్షిగా ఈ రాజకీయమృగాలపై పోరాటం చేద్దాం. లాఠీఛార్జీ జరిగిన ప్రదేశంలో అందరమూ ఆమరణ నిరాహార దీక్ష చేద్దాం. మన పల్లెల్లోకి ఈ రాజకీయమృగాలు రాకుండా జాగ్రత్త పడదాము. అధికార పక్షానికి చెందిన దళిత నాయకులందరినీ మనం మన నుంచి బహిష్కరిద్దాం."

గుంటూరు చాలా ఉద్రిక్తంగా ఉంది. లాఠీఛార్జీకి నిరసనగా బంద్ పిలుపునిచ్చారు. మాలతితో సహా సుమారు వెయ్యిమంది సామూహిక నిరాహారదీక్షలో కూర్చున్నారు. వాళ్ళ చుట్టూ వందలాదిగా పోలీసులు ఖాకీ వలయాన్ని ఏర్పాటు చేశారు. 144 సెక్షన్ కూడా ప్రకటించారు.

ఇంత ఉద్రిక్తత వాతావరణంలో నాకు దిగ్భ్రాంతిని కలిగించింది మోహనరావు ప్రవర్తనే. వార్త వినగానే మోహనరావు ముఖంలో జాక్‌పాట్ కొట్టినవాడి ముఖంలా పరమోత్సాహం కనిపించి నేను దిమ్మెరపోయాను. 'రక్తం చిందించిన సంఘటనకు ప్రతిస్పందనగా కసో, కోపమో రగలాలి కానీ, ఇట్లా పరమోత్సాహాన్ని ఎలా పొందగలిగాడా,' అని విస్తుపోయాను. పొలోమంటూ అనుచరులతో గుంటూరు చేరాడు. మేము వెళ్ళేసరికి అక్కడంతా బీభత్సంగా వుంది. రోడ్డు పొడవునా రక్తపు మరకలు. అక్కడక్కడా మిగిలిపోయిన ఒంటరి చెప్పులు. పీలికలైన చొక్కాలు, పంచెలు. రోడ్డు నైరూప్య చిత్రంలా ఉంది. మాలతికి కూడా దెబ్బలు తగిలాయి. చుట్టూ వందమందికి పైగా యువకులు. ఎంతో ఆవేశంతో, కానీ సంయమనంతో వాళ్ళ నుద్దేశించి మాట్లాడుతున్న మాలతిని చూడగానే నాలో ఏదో ఉద్వేగం. ఏదో ఓదార్పు, ఆమెతో నాకు పరిచయం లేకపోయినా, 'ఆమె' అనే ఊహను నేను రొమాంటిసైజ్ చేస్తున్నానేమో అని క్షణంపాటు ఉలిక్కిపడ్డాను. కొద్దిసేపు ఆమె మాటల్ని, అక్కడి వాతావరణం చూసినాక, ఆమె గురించిన నా స్పందనలు సరైనవే అనిపించాయి. ఆమెకు మోహనరావు మార్కు రాజకీయాలు, అభినయాలు తెలియవు.

మరోవైపు మోహనరావు దృశ్యానికి అనుగుణంగా తన ఆహార్యాన్ని, ముఖ కవళికల్ని, టోన్‌ని మార్చుకునే ప్రయత్నంలో ఉన్నాడు. హఠాత్తుగా ఉగ్రనరసింహంలా గర్జించాలనే తన కోర్కెను బలవంతంగా ఆపుకున్నాడు. అక్కడిప్పుడో ఉపన్యాసానికి అవసరమైన వాతావరణం కనబడలేదు. మంత్రి రాజీనామా చేయాలని, పోలీసు అధికార్లను శిక్షించాలని అక్కడక్కడా బ్యానర్లు ఉన్నాయి. వాటితోపాటు కలిచేడు దురంతాల గురించి లిఖిత పోస్టర్లు అంతటా అంటించి వున్నాయి. 'మూడేళ్లుగా కొనసాగుతున్న హత్యలు' అంటూ మూడేళ్ళుగా కలిచేడులో జరుగుతున్న సంఘటనల్ని కర పత్రాలుగా ప్రకటించి, అంతటా పంచిపెట్టారు. అక్కడా ఇక్కడా విలేకర్లు మూగి వివరాలు సేకరి స్తున్నారు.

మోహనరావు మౌనంగా వచ్చి దీక్షాశిబిరంలో మాలతి పక్కన కూర్చుని, "నీది ఒంటరి పోరాటం కాదు తల్లీ! మేమంతా ఉన్నాము," అంటూ తన సహజ ధోరణిలో అన్నాడు. సన్నని చిరునవ్వు మినహా మాలతిలో వేరే స్పందన లేదు.

నిజానికి అది ఎలక్షన్ల సీజనని మందు కాస్త ఎక్కువగా పుచ్చుకొన్న సంక్షేమ మంత్రికి గుర్తు రాలేదు. శ్రీవారి ఆజ్ఞల్ని తు.చ తప్పకుండా పాటించిన ఖాకీ దొరలకూ గుర్తు రాలేదు. కానీ అధికార పార్టీ ఉలిక్కిపడింది. వెంటనే పదిమంది (దళిత) ఎమ్.ఎల్.ఏలను, కాస్త మాట్లాడటం తెలిసిన ఇద్దరు (దళిత) మంత్రుల్ని హడావుడిగా గుంటూరు పంపింది. వాళ్ళు వస్తూనే సంతాప సందేశాలు, పోలీసుల వైఖరి ఖండనలతో వచ్చారు. 'చర్చలకు రండి,' అంటూ కబురు పంపారు.

"చర్చలకు అంగీకరించేది లేదు. ఇది మదర్ ఆఫ్ ఆల్ బేటిల్స్" అంటూ అరిచేడు మోహనరావు.

"మోహనరావుగారూ! ప్రజాస్వామ్యబద్ధమైన ప్రతి మార్గాన్ని అంగీకరిద్దాం! చర్చలకు వెళ్దాం రండి!" అంది మాలతి అభ్యర్థనగా. "మాలతీ! నీ గురించి చెప్పుకునేదంతా 'మిత్' ఏమో అనిపిస్తుంది. చర్చలంటూ అధికార్లతో రాజీపడే నీ ధోరణిని చూస్తే ఎందుకో నీ సిన్సియారిటీపై అనుమానాలు కలుగుతున్నాయి," అన్నాడు. ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాము అందరం.

"మీ సందేహాలతో, శంకలతో నాకు పనిలేదు. నేను వెళుతున్నాను," అంటూ ముందుకు కదిలింది మాలతి.

"చూశారా! ఇది దళిత ఉద్యమం పరిస్థితి. ముందు నుంచి ఒకళ్ళు లాగితే, వెనక నుంచి ఇంకొకళ్ళు లాగటం. అందుకే ఎక్కడ వేసిన గొంగళిలా అక్కడే ఉన్నాము." లోపలికి వెళ్ళిపోగా

మిగిలిన యాభై, అరవై మంది శ్రోతల ముందు తన ఉపన్యాసపు మోళీని బయటకు తీశాడు మోహనరావు. దళిత ఉద్యమం మాలతిలాంటి తెలిసీ తెలియని వాళ్ళ చేతుల్లో బడి నాశనం అవు తోందని, చర్చలు, దయాభిక్షలు మనకు అనవసరం అనీ, ఎన్నికలే మన ఆయుధమనీ, అంతిమ పోరాటం రాజ్యాధికారం కోసమేననీ ఉపన్యాసం చేశాడు మోహనావు.

డైరీ చదవటం పూర్తి చేశాక మోహనరావులో మాలతిపై వింత ద్వేషం, కసి కలిగాయి. మాలతి గురించిన రిఫరెన్సు ఉన్న డైరీ పేజీల్ని ముక్కలు ముక్కలుగా చింపివేశాడు. కొద్దిగా ఆవేశం చల్లారి, ఆకలి గుర్తుకొచ్చి ఒక హోటల్‌లోకి దూరాడు.

## 5

'సాయంత్రం ఆరుగంటల సమయంలో ఈ గుంటూరు రోడ్లపై నేను ...' స్వగతంలా అనుకున్నాడు మోహనరావు.

'ఎందుకో విరక్తిగా ఉంది! ఎందుకో దిగులుగా ఉంది!'

'యుద్ధరంగం నుండి పారిపోతున్న సైనికుడిలా, అటువైపుకు, ఇటువైపుకు కాలపు సరి హద్దుల్ని, సంఘటనల్ని, తొక్కుకుంటూ పారిపోతున్నాను నేను.'

పారిపోయి, పారిపోయి ప్రపంచం నుండి దాక్కొని... దాక్కొని...

'ఉద్వేగభరితమైన రాజకీయ జీవితాన్ని గడిపిన తరువాత, ఇప్పుడు హఠాత్తుగా ఏమీలేని తనంలోకి కూరుకుపోయి, నాలో నేనే మాట్లాడుకుంటూ, నాలో నేనే చర్చించుకుంటూ, నాలో నేనే పోట్లాడుకుంటూ జీవిస్తున్నాను.'

ఇప్పుడు నా పరిస్థితి ఏమిటి? ఇది దు:ఖమూ కాదు. అట్లా అని ఆనందమూ కాదు. ఇది విరక్తీ కాదు, కోరిక లేకపోవటమూ కాదు. ఇది బ్రతకటమూ కాదు, పోనీ చనిపోవటమూ కాదు.

'ఎందుకో విరక్తిగా ఉంది! ఎందుకో దిగులుగా ఉంది!'

మోహనరావులో వింత అంతర్మథనం జరుగుతోంది. ఇవన్నీ అతని ఆలోచనలు. స్వగతాలు. అయితే అతనికి తెలియకుండానే పైకి మాట్లాడేస్తున్నాడు. ఎంత పెద్దగా అంటే చుట్టుపక్కల వాళ్ళు ఉలిక్కిపడి అతని వైపు చూస్తున్నారు. 'పిచ్చివాడు కాదు కదా!' అనే వింత సందేహం వాళ్ళ ముఖాల్లో కనిపిస్తోంది. అయితే మోహనరావు ఇవేమీ పట్టించుకోవడంలేదు.

రోడ్లన్నీ కోలాహలంగా ఉన్నాయి. మనుషులు, వాహనాలు అదేదో పరుగుపందెంలో పాల్గొంటున్నట్లుగా.

మోహనరావుకు హఠాత్తుగా ఒక సంఘటన, సంభాషణా గుర్తుకొచ్చాయి. పదిహేను రోజుల క్రితం ముచ్చట ఇది.

మోహనరావు : "నాకు మీ సలహా కావాలి!"

డాక్టరు : ఎట్లాంటి సలహా?

మో: చెప్తాను! చెప్తాను! కాకుంటే మీరు డాక్టరు కదా! మీకీ విషయాలతో పరిచయం ఉంటుందో, లేదో అని జంకుతున్నాను. నేను రాజకీయాలకు చెందినవాణ్ణి. దానికి సంబంధించిన విషయంపై మీ సలహా కావాలి.

డా॥ ఫరవాలేదు చెప్పండి! నాకు కొద్దిగా రాజకీయాల్తో పరిచయం ఉంది!

మో: ఊహించాను. రాజకీయాలేమీ తెలియనివాళ్ళు సైకియాట్రిస్టులు కాలేరు. బహుశ మీరు నా గురించి కూడా విని ఉంటారు. గొప్ప దళిత ఉద్యమాన్ని నిర్మించిన దళిత నాయకుణ్ణి. మోహనరావు నా పేరు. నాపైన అసూయతో నన్ను కొట్టి, హింసించి, ఉద్యమంలోంచి విసిరేశారు. నా గురించి చాలా దుష్ప్రచారం జరుగుతోంది. నేను డబ్బు కాజేశాననీ, డబ్బు కోసం ఉద్యమానికి

వెన్నుపోటు పొడిచాననీ, మహిళా కార్యకర్తలతో నాకు సంబంధాలున్నవనీ, ఇంకా ఏవేవో ప్రచారం చేస్తున్నారు. నేను మానసికంగా బాగా కృంగిపోయి ఉన్నాను.

డా: అంతేనా?

మో: ఇంకా ఉంది! నాకెందుకో హఠాత్తుగా దిగులు వేస్తుంది. దు:ఖం వస్తుంది. ప్రపంచంపై కోపం వస్తుంది. ప్రపంచాన్ని శాసిస్తూ ఒక సోక్రటీస్‌లాగానో, ఒక హెమ్మింగ్‌వే లాగానో ఆత్మహత్య చేసుకోవాలనిపిస్తుంది. అయితే యిప్పుడు కాదు. ప్రస్తుతం కూలిపోయిన ఉద్యమాన్ని పునర్నిర్మించే ప్రయత్నంలో ఉన్నాను. పెద్ద పెద్ద నాయకులతో కరస్పాండెన్సు చేస్తున్నాను. ఈ ఉద్యమానికి ఒక రూపం కల్పించి, తథాగతుడిలాగా నేనీ ప్రపంచం నుంచి నిష్క్రమిస్తాను. ఇంతకూ నాకు కావలసిన సలహా ఏమిటంటే దళిత ఉద్యమంలోకి, సానుభూతిపరులైన అగ్రకులాల వాళ్ళను ఆహ్వానించ వచ్చా లేదా? అని...

డా: అన్నట్టు మీ వివరాలు చెప్పలేదు.

మో: నా పేరు మోహనరావు. దళిత సంగ్రామ పార్టీకి సంస్థాపక అధ్యక్షుణ్ణి.

డా: మీకు పెళ్ళయిందా?

మో: నా భార్య నన్ను వదిలి వెళ్ళింది. అదంతా ఫ్లాష్‌బాక్. ప్రస్తుతం ఆ విషయాన్ని గురించి మాట్లాడటం నాకిష్టం లేదు.

డా: మీకు బంధువులెవరైనా ఉన్నారా?

మో: దేశవ్యాప్తంగా ఉన్న దళితులందరూ నా బంధువులే.

డా: ఎప్పుడైనా మీతోటి మీరే మాట్లాడుకుంటారా?

మో: నాకు పిచ్చిపట్టలేదు. ఖచ్చితంగా చెబుతున్నాను. ఆ విషయమై మీరు భరోసాగా వుండొచ్చు. నేను ట్రీట్‌మెంటు కోసం రాలేదు.

డా: అఫ్‌కోర్సు! మిమ్మల్ని నేను పేషంటు అనుకోవటం లేదు. స్నేహితుడిగానే భావిస్తున్నాను. స్నేహితుల మధ్య రహస్యాలుండకూడదు కదా! అందుకే మీ గురించి విషయాలన్నీ చెప్పండి. మీకు జీవితంపై విరక్తీ, దు:ఖం కలుగుతుందన్నారు కదా! ఎందుకో చెబుతారా?

మో: నేను ఉద్యమానికి ద్రోహం చేశానని అంటున్నారు. లక్షలాది ప్రజల ఆశల్ని వమ్ము చేశానంటున్నారు. లక్షల కొద్దీ డబ్బు కాజేశానంటున్నారు. నైతికంగా పతనమైనానని అంటున్నారు.

'దేశ్‌కీ నేతా మోహనరావు' అంటూ నన్ను పొగిడినవాళ్ళే, 'అన్నా! నీకోసం ప్రాణాలిస్తా!' అన్న వాళ్ళే. (హఠాత్తుగా మోహనరావు తన చొక్కా పైకెత్తి) ఈ స్కార్ చూడండి! ఇది మీకు కథంతా చెబుతుంది. (నోరు తెరిచి పై దవడలో పన్ను విరగగా ఏర్పడ్డ ఖాళీని చూపిస్తూ) ఈ పై దవడ చూడండి! ఊడిపోయిన పన్ను, నేనెన్ని చిత్రహింసల్ని అనుభవించానో చెబుతుంది.

డా: నిద్ర బాగా పడుతుందా?

మో: "నేను నిద్రపోయి అయిదు నెలలవుతుంది. నిద్రపోవటం దాదాపు అసాధ్యంగా వుంది. కళ్ళు మూసుకుంటే లోపలి నుండి దెయ్యాలో భూతాలో నాపైకి దాడికి వస్తున్నట్లుగా ఉంటుంది. కళ్ళు తెరుచుకునే ఉంటే కాలం నడవదు. కుంటుతుంది. నాలోపల రెండు ప్రపంచాలున్నట్లు గానూ, అవి నిరంతరం పోట్లాడుకుంటున్నట్లుగానూ ఉంటుంది. నాకు జరిగిన అవమానాలకు ప్రతీకారంగా నా ప్రాణాల్ని తీసుకోవటం ద్వారా ప్రపంచాన్ని శిక్షించాలని ఒకవైపు, అన్నిటినీ సహించి మళ్ళీ ఉద్యమాన్ని నడపాలి అని రెండోవైపు. ఇదొక నిరంతర అంతర్మథనం అయింది.

"ఇంకో విషయం! అప్పుడప్పుడూ నాకేమయినా పిచ్చి పడుతుందేమో అని అనుమానంగా ఉంటుంది. అట్లా అనిపించినప్పుడు నాపై నాకే నమ్మకం కలగటం కోసం, జీవితచరిత్రనో, ఉత్తరాలో రాసుకుంటూ ఉంటాను.

“నాలుగు నెలల క్రితం జరిగిన సంగతి మీకు చెప్పాలి. చెప్పడానికి సిగ్గుగా ఉంది. కానీ చెప్పాలి. పదిగంటల మధ్యాహ్నం పూట దళితపార్టీ నాయకులమంటూ పదిమంది మా పార్టీ కార్యా లయానికి వచ్చారు. వాళ్ళు నాతో పెద్దగా మాట్లాడలేదు. ‘నీ మీద క్రిమినల్ కేసు పెట్టాం! పోలీసులు తీసుకెళ్ళి నిన్ను ఖైమా ఖైమా చెయ్యకముందే ఆ డబ్బు గురించి మాకు చెప్పు!’ అంటూ లోపలికి వచ్చారు. నేనేం మాట్లాడలేదు. వాళ్ళలో ఒకడు హఠాత్తుగా నా కాలరు పట్టుకొని కిందకు లాగాడు. కుర్చీతో సహా కిందకు పడ్డాను. అట్లాగే రోడ్డు దాకా ఈడ్చుకెళ్ళాడు వాడు. ‘పొట్టకు ఆపరేషను అయింది. గాయం యింకా నయం కాలేదు. నొప్పిగా ఉంది,’ అని అరవాలనుకున్నాను. అరవలేక పోయాను. ఎదురుచూడని దాడిలా ఫెడేల్ ఫెడేల్‌మని వంటిపై పిడిగుద్దులు. ‘ఏమైందిరా డబ్బంతా? ఏ లంజకిచ్చావో చెప్పు! ఎక్కడ దాచిపెట్టమని పంపావో చెప్పు!’ అంటూ నా జుట్టు పట్టుకొని లాగి నా ముఖాన్ని రోడ్డుపైన కరెంటు స్తంభానికి గుద్దాడు. (అట్లా చెబుతూ నోరు తెరిచి ఊడిన పన్ను తాలూకు ఖాళీని చూపించాడు మోహనరావు). అట్లాగే నా చొక్కా కాలరు పట్టుకుని రోడ్డుపైన ఈడుస్తూ - జనమంతా నోళ్ళు తెరుచుకొని మూగదెయ్యల్లా చూశారేగానీ ఒక్కడూ ఆ రాక్షసాన్ని ఆపలేదు.

“అసలు బాధలన్నీ పోలీసుస్టేషన్‌లోనే పడ్డాను. ఉచ్చకంపు కొట్టే చోట, కక్కసులాగా గలీజు గలీజుగా ఉండే చోట, నాపైన కాట్లకుక్కల్లా పడ్డారు పోలీసులు. కొరివి దెయ్యాల్లాగా రెండు రోజుల పాటు నన్ను కాల్చుకుతిన్నారు. నా మర్మావయంపై వాతలు పెట్టి... నా గుదంలో... దేవుడా! నేను చెప్పలేను. ఈ ప్రపంచంలో మరే మనిషికీ అట్లాంటి చిత్రహింసలు వద్దు అనిపిస్తుంది. నేను ప్రాణమున్న మనిషిని అని, ఒక పౌరుణ్ణని, కాస్తో కూస్తో రాజకీయపరిజ్ఞానం కల నాయకుడిననీ ఏదీ చూడలేదు. నోట్లో మూత్రం పోయడం, పొట్ట మీద ఎలుకల్ని పరిగెట్టించటం, ఎన్నని చెప్పేది (అంటూ పెద్ద పెట్టున ఏడ్చాడు మోహనరావు). (కాసేపు ఆగి) నా మెదడు నిండా చీకటి మరకలు. రక్తం మరకలు. మెదడు పొడవునా గాయాలే. ఈ గాయాల నొప్పితో మెదడు ఆలోచించటాన్ని మరిచిపోతుంది. ఎవరి తోటి కలవలేను. ఎవరి ముఖంలోకీ చూడలేను. నలుగురు కలిసి నవ్వు కుంటూ కనిపిస్తే నాకు ఆశ్చర్యం వేస్తుంది. ఈ ప్రపంచంలో నవ్వు యింకా మిగిలి ఉందా అని? నేనింక ఎప్పటికీ నవ్వలేనేమోనని నా అనుమానం. నేను నా నవ్వుని పోగొట్టుకొన్నాను. ఇంటినీ, భార్యనీ సర్వస్వాన్నీ పోగొట్టుకొన్నాను. ఇదంతా కేవలం నేను దళితుణ్ణి కావటం వల్లనా? లేకపోతే నేను మోహనరావుని కావటం వల్లనా? అని ఇప్పటికీ నేను తర్కించుకుంటూ ఉంటాను.”

పై సంభాషణంతా గుర్తుకొచ్చింది మోహనరావుకు. ఆరోజు డాక్టరు (రాజశేఖర్ అతని పేరు) అతనికి మందులు రాసిచ్చాడు. “మీకు జబ్బేం లేదు. నిద్రపట్టడానికి రాసిస్తున్నానీ మాత్రలు,” అని చెప్పాడు. “పదిహేను రోజులైన తరువాత మళ్ళీ కనిపించు. ఈ పదిహేను రోజులూ ఈ డైరీ దగ్గర పెట్టుకొని, నిద్రపట్టిందీ లేనిదీ, ఆలోచనలు ఎలా ఉందీ, అన్నీ వివరంగా రాసుకొని రా!” అంటూ పంపించాడు.

ఇవాళ ఆ పదిహేనవ రోజు. డాక్టరు దగ్గరకు వెళ్ళాల్సిన రోజు. ఆయన రాయమన్న డైరీ లాంటిదేమీ రాయలేదు. రోడ్డు వార ఒక ఎలక్ట్రిక్ స్థంభం దగ్గర ఆగి, ఒక కాగితాన్ని తీసుకొని అప్పటికప్పుడు రాయటం మొదలుపెట్టాడు.

మే 6 : దుర్భరమైన ఎండలు, వడగాల్పులు, ఈరోజు కూడా నిద్రపట్టలేదు. కేశవదాసు బ్రతికి వచ్చినట్లు (అసలు చనిపోలేదేమోనని నా అనుమానం). రాత్రి పొడవునా కిటికీలో కూర్చుని నావైపు చూస్తున్నట్లు, నేను కళ్ళు మూయటం అంటూ జరిగితే, నాపైకి దూకి నా పీక నులిమేస్తాడేమో

అనే భయంతో నాకు నిద్రపట్టలేదు. బయట నీలాకాశం. మబ్బులు లేవు. అట్లా అని ఆకాశంలో చుక్కలు కూడా లేవు. రాణిని ముద్దు పెట్టుకోవాలని ఎంతగానో అనిపించింది.

మే 7: కొన్ని ఆశలు చిగురించాయి.

మే 8 : మొత్తం పదమూడు ఉత్తరాలు రాయటం మొదలుపెట్టాను. గత జనవరిలో నాపై కొందరు వీధి రౌడీలు, పోలీసులు కలిసి చేసిన అత్యంత కిరాతకమైన దాడిపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయవిచారణ జరిపించాలని రాష్ట్రపతికి, ఎస్.సి., ఎస్.టి. కమీషన్‌కు ఉత్తరం రాశాను. ఈ రాత్రి నిద్ర పట్టలేదు. ఈరోజు రాత్రి కిటికీలో రాణి  కూర్చొని ఉంది. శరీరంపై  అంతా అనాచ్ఛాదంగా ఉంది. (ఆపైన విశేషాలు ఇక్కడ రాయతగ్గవి కాదు.)

మే 9: చిన్న పిసరు నిద్ర పట్టింది. జీవితచరిత్ర లోని అత్యంత ముఖ్యమైన ముప్పయి తొమ్మిదవ అధ్యాయం ఇవాళ పూర్తి చేశాను. మాలతిని పోలీసులు చంపివేసినట్లు కల వచ్చింది.

మే 13: ఈ రాత్రి మళ్లీ నిద్రపట్టలేదు. రాత్రంతా పార్టీ కార్యాలయంపై రాళ్లు పడుతున్నట్లుగా, ఎవరో పడగొట్టడానికి ప్రయత్నిస్తున్నట్లుగా అనిపించింది.

మే 14: డాక్టరు దగ్గరకు వెళ్ళాలని బయల్దేరాను. కానీ జిన్నా టవర్ సెంటరు దగ్గర సుమారు రెండు గంటలసేపు నిలబడ్డాను. పరుగెత్తే మనుషులు, కార్లు, రిక్షాలు చాలా హుషారుగా ఉంది.

మే 15 : రంగారావు అనే యువకుడు కలిశాడు. విశాఖపట్టణం దగ్గరలో పది గ్రామాల్లో ఉన్న హరిజనులకు రకరకాల స్కీముల ద్వారా సాయం చేసే పథకం గురించి గంటసేపు వివరించాడు. ప్రస్తుతం ఒక యాభై కుట్టుమిషన్లు, వంద పాడి ఆవులు ఇచ్చే ప్రయత్నంలో ఉన్నట్లు చెప్పాడు. కలెక్టరు దగ్గర డేట్ కూడా తీసుకున్నట్లుగా చెప్పేడు. అంతా చెప్పి, చివర్న రెండు లక్షల విరాళం యివ్వండి అన్నాడు. 'నా దగ్గర ఎక్కడివి?' అన్నాను! 'చస్తూ మూట గట్టుకు వెళతావా?' అంటూ కోపంగా చూశాడు. 'నిజం ఒట్టు!' అన్నాను. రెండు నిమిషాలు సీరియస్‌గా చూసి, 'కనీసం రెండు వందలన్నా ఇవ్వండి! ఛార్జీలకు కూడా లేవు!'' అంటూ ప్రాధేయపడ్డాడు.  చాలాసేపు బతిమలాడి, చివరకు 'లంజా కొడకా!' అంటూ నా ముఖం మీద ఊసి చరచరా వెళ్ళిపోయాడు.

మే 16 : ఈరోజు మళ్లీ నిద్రపట్టలేదు. కిటికీలో వందమందికి పైగా కర్రలతోటి, చెయిన్లతోటి నిలబడి ఉన్నారు. నిద్రపోయి ఉంటే నన్ను చంపి ఉండేవాళ్లు.

మే 17: కేశవదాసుకు నా జేజేలు. వాడు అమరజీవి. నా పొట్ట మీద ఉన్న స్కార్ సాక్షిగా వాడు మహానుభావుల కోవలోకి చెందినవాడు. ఇవాళ దాసు వాళ్ళ ఇంటికి వెళ్ళాను. డైరీలో పేజీలు దొంగతనం చేశాను.

మే 18: మాలతి ఫోన్ చేసింది. మాలతిని 'అమ్మా' అని పిలవాలని ఉంటుంది నాకు. నా భార్య దగ్గరకు వెళ్ళమని సలహా యిచ్చింది. ఈ దేశంలో మగవాళ్ళు ఒకసారి జైలుకు వెళితే, మళ్ళీ భార్యల దగ్గరకు వెళ్ళే అవసరం రాకుండా పోలీసులు జాగ్రత్తపడతారు. (ఎర్రగా వాతలు తేలిన నా మర్మావయవం గుర్తుకొచ్చి పెద్ద పెట్టున దు:ఖించాను).

మే 19: సాయంకాలం ఆరుగంటల సమయంలో గుంటూరు రోడ్డుపై డాక్టర్ని వెతుక్కుంటూ వెళుతున్నాను.

కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకొని గబగబా 'వివేక మానస' క్లినిక్ వైపు నడిచాడు. ఖరీదైన బంగళా. అందమైన వెయిటింగు రూము. నేలంతా మొజాయిక్ టైల్స్ వేసి ఉంది. (అందమైన స్త్రీ శరీరంలా నునుపుగా ఉంది అని మోహనరావు మనసులో అనుకొని, స్టుపిడ్! అని అనుకుంటూ తనలో తాను తిట్టుకున్నాడు.)

నల్లగా ఉన్నా ఆకర్షణ కలిగిన ముఖంతో ఒక నర్సు అక్కడ కూర్చుని ఉంది. మోహనరావుకో టోకెన్ యిచ్చి 'కాసేపు వెయిట్ చెయ్యండి!' అని కుర్చీ చూపింది. ఎదురుగా గోడ గడియారం (సెకనుకో మాటు కన్నుగొట్టే వేశ్యలాగుందీ గడియారం అని అనుకొని, సమ్‌థింగ్ ఈజ్ రాంగ్ విత్ మి అని తన్నుతాను విసుక్కున్నాడు మోహనరావు). జేబులోని కాగితాన్ని బయటకు తీసి, కొద్దిసేపటి క్రితం రాసిన డైరీని సెన్సార్ చెయ్యటం మొదలుపెట్టాడు. పక్కన కూర్చున్న పేషంట్ల వైపు చూశాడు (పాపం మతికీ, మతి తప్పిన స్థితికీ మధ్యన నిస్సహాయంగా వేళ్ళాడుతున్నారు వీళ్ళు అని వాళ్ళపై జాలిపడ్డాడు). 'చూడు ఎట్లా, భయంగా, దిగులుగా, విరక్తిగా చూస్తున్నారో? 'పాపం! ప్రపంచాన్ని పోగొట్టుకొన్నవాళ్ళు!', 'పాపం! ప్రపంచం పోగొట్టుకున్నవాళ్లు!' అంటూ కాసేపు గొణుక్కున్నాడు. ఒక్కో పేషంటు దగ్గర చాలాసేపు గడపటం మోహనరావుకు ఎందుకో విసుగ్గా ఉంది.

సుమారు గంట గడిచింది. ఇంకా ఇద్దరే ఉన్నారు పేషంట్లు. అప్పుడా నర్సు (నల్లగా ఉన్నా ఆకర్షణగా ఉన్న అమ్మాయి) అతని దగ్గరకు వచ్చి "ఫిఫ్టీ రూపీస్ ఇవ్వండి!" అంది.

"ఎందుకు?" అన్నాడు మోహనరావు.

"ఫీజు ముందే యివ్వాలి! ఇక్కడే తీసుకుంటాము!" అంది.

"నేను పిచ్చివాడిలాగా కనిపిస్తున్నానా? డాక్టరుగారి దగ్గర ఒక సలహా తీసుకుందామని వచ్చాను," అన్నాడు ఖిలాసాగా?

"దానికైనా యాభై యివ్వాల్సిందే!" అందా నల్ల నర్సు మంకుగా.

మోహనరావుకు కోపం వచ్చింది. చివాల్న లేచాడు. "మీ డాక్టర్లని, మీ మందుల ప్రపంచాన్ని, డబ్బులు మేసే కొండచిలువల్లాంటి మీ ఆసుపత్రులనూ నేను బహిష్కరిస్తున్నాను!" అని పెద్దగా అరవాలనుకొని, అరవలేకపోయి ముఖం గంటు పెట్టుకొని, హాస్పటల్ నుండి బయటకు వచ్చాడు.

బయటకు వచ్చాడుగానీ, లోలోపల ఎందుకో డాక్టర్ని ఒకసారి చూస్తే బాగుండునని మనసులో పీకుతోంది. గేటు దగ్గర అట్లాగే చాలాసేపు నిలబడ్డాడు.

డాక్టర్ కేసులు ముగించుకొని బయటకు వచ్చాడు. మారుతీ కారు గేటు దగ్గర పార్కు చేసి ఉంది. కారు వైపు వెళుతూ అన్నా తనను చూస్తాడేమో అని ఆశగా ఉంది మోహనరావుకు. డాక్టరు పెద్దగా గమనించలేదు. కారు ఎక్కేటప్పుడు డాక్టర్ తన బొజ్జతో సహా కారులో ఎక్కడానికి పడిన పాట్లను చూసి చాలాసేపు నవ్వుకున్నాడు మోహనరావు. 'వెర్రి వెధవ! వీడు నాకు సలహా యిచ్చేదేమిటి? అంతలా బొజ్జ పెంచిన వీడికి వైద్యం ఏం తెలుసు?' అనుకుంటూ జేబులోని కాగితాన్ని పరపరా చించి దుమ్ము రేపుకుంటూ వెళ్ళిన మారుతీ కారువైపు విసిరేశాడు.

రోడ్డుపైకి వచ్చి పెనుకోపంతో రోడ్డుపై అసహనంగా అటూ ఇటూ తిరిగాడు. అట్లా తిరుగుతుంటే కాస్త కోపం తగ్గినట్లు అనిపించింది. అట్లా నడుచుకుంటూ వెళుతూనే ఉన్నాడు. బ్రిడ్జీ దాటుకొని, జిన్నాటవరు దాటుకుని, పాత గుంటూరు దాటుకొని బస్టాండు దాకా వచ్చాడు.

కాళ్ళు నొప్పులు అనిపించి, పక్కనున్న పేవ్‌మెంటుపైన కూర్చున్నాడు. అతనికి నాలుగడుగుల దూరంలో ఒక ముసలి తాత చెప్పులు కుట్టుకుంటూ కనిపించాడు. పురాతనమైన గొడుగు అతని తలపై మిలమిలలాడుతోంది. గొడుగు బాగా వెలిసిపోయి ఉంది. కర్ర చెదలుపట్టి, చువ్వలు విరిగి అనాకారంగా ఉన్నా, ఆ రాత్రిపూట వెలుగు చీకటుల మధ్య గొప్ప రాజసంతో వెలిగిపోతోందా గొడుగు. తాతకు అరవైదాకా వయసు ఉంటుంది. చర్మాన్ని చీల్చుకొని లోపలి ఎముకలు బయటకు కనిపిస్తున్నాయి. మొలపై చిన్న పంచ తప్ప పైన ఆచ్ఛాదనం ఏమీ లేదు. "చీకటిబడింది! ఇంకా కూర్చున్నావు. ఇంటికి పోవా?" అంటూ పలకరించాడు మోహనరావు.

“చీకటైతే ఏందంట? అదేమన్నా కరుస్తుందా?” అన్నాడు వంచిన తల ఎత్తకుండా దీక్షగా తెగిన చొప్పునొకదాన్ని కుట్టుకుంటూ.

చాలాసేపు అతనివైపే రెప్ప వేయకుండా చూసి “ఇట్లా బతకాల్సి వచ్చినందుకు నీకెప్పుడూ బతుకుపై విరక్తి పుట్టలేదా?” అని అడిగాడు మోహనరావు.

ఆ ముసిలోడికి మోహనరావు ధోరణి అర్థం కాలేదు. అర్థమైనంతలో తన పేదరికాన్ని గురించి అడుగుతున్నాడనుకొని “ఛత్! ఏం మాటయ్యా అది. ఏ బతుకైతే ఏమిటి? ఎవుడి కాళ్ళ సందున దూరకుండ స్వతంత్రంగా బతికే బతుకు ఏదయితే ఏమి? ఎవణ్ణీ ముంచకుండా బతికేది బతుకు. ఈ పని గాకపోతే దీని తాత. నాయాల్ది! మనిషి పుట్టక పుట్టినాక తొడగొట్టి సైయని బతకాలి!” అంటూ తనదైన ధోరణిలో ముసిలాడు తన జీవన తాత్వికతను వివరించాడు.

మోహనరావుకు ఆ ముసిలోడి ధైర్యం, ఆత్మ స్థైర్యం చూసి ఆశ్చర్యం వేసింది. రాత్రి తొమ్మిది దాకా వాడి పక్కనే కూర్చున్నాడు. ముసిలాడు ఏవేవో ముచ్చటలు చెబుతున్నాడు. ఆ కబుర్లు అంతటా వాడికి జీవితంపై ఉన్న నమ్మకాన్ని గురించి తెలియజేసేవే.

దాదాపు తొమ్మిదిన్నరకు ముసిలాడు అన్నీ సర్దుకొని ఇంటికి పోడానికి లేచాడు. “అట్లా కాకా హోటల్ దాకా పోయి టీ తాగి వద్దాం రా!” అంటూ పిలిచేడు మోహనరావు.

“అన్నాలు తినేవేళలో టీ ఏందయ్యా!” సందేహించాడు ముసిలోడు.

“కాదులే” అంటూ బలవంతం చేశాడు మోహనరావు.

పది రూపాయలు అతని చేతిలో కుక్కి, “ఉంచుకో!” అని చెప్పి గబగబా అక్కడ నుంచి నడిచి వచ్చాడు. ముసిలాడు విసుక్కుంటూ అన్న మాటలు అతని చెవిలో పడలేదు.

‘ఈ ముసిలాడే నా సైకియాట్రిస్ట్! ధైర్యంగా తొడకొట్టి బతకమని సలహా యిచ్చాడు. (బొజ్జ వేసుకొని) కార్లలో తిరిగే ఆ డాక్టర్ కన్న వెయ్యిరెట్లు గొప్ప వేదాంతి ఈ ముసిలోడు,’ అనుకున్నాడు మోహనరావు.

సాయంకాలం పూట ఉన్న దిగులు, దు:ఖం ఇప్పుడు ఎగిరిపోయాయి. హుషారుగా ఈల వేసుకుంటూ, తన బొరియలోకి ప్రయాణించాడు మోహనరావు.

## 6

ఉదయం ఎప్పటిలాగే మెలకువలాంటి నిద్రలోంచి మేలుకున్నాడు మోహనరావు. మందు బిళ్లలు రాత్రి ఏ పదిగంటలప్పుడో వేసుకున్నాడు. పొరగా, పొరగా నాలుగు గంటలకు కాబోలు నిద్రపట్టింది. నిద్ర పొడవునా ధన్, ధన్ మంటూ గునపాలతో గుండెలను తవ్వుతున్నట్లుగా కల. నిద్ర లేచినాక అర్థమైంది. ఆ ధన్ ధన్ చప్పుళ్ళు నిజమైనవే అని. రోడ్డు చివర్న ఎవరో గోతులు తవ్వుతున్నారు.

ఏడు ఎనిమిది గంటలకు రోడ్డుపై ఒక టెంటు ప్రత్యక్షమైంది. మోహనరావు ఆశ్చర్యంగా చూస్తున్నంతలో పదిమంది జనం మూగారు. ఆ తరువాత ఒక మైకు సిస్టం కూడా వచ్చింది. మైకువాడు ‘రడీ వన్, టూ’ అంటూ మైక్ టెస్ట్ కూడా చేశాడు. ఉన్నట్టుండి మైకులోంచి ‘దళిత సంగ్రామ పార్టీ (బి.జె) వర్ధిల్లాలి’ ‘వెన్నుపోటు మోహనరావు నశించాలి!’ అంటూ అరుపులు వినబడి ఉలిక్కిపడ్డాడు మోహనరావు.

అది మొదలుకొని సుమారు రెండు గంటలపాటు బజారునంతా నినాదాలతో హోరెత్తించారు.

ఒక కుర్రవాడు దురుసుగా పార్టీ కార్యాలయంలోకి వచ్చి ఒక కట్ట కరపత్రాన్ని వెదజల్లాడు. కరపత్రాన్ని తీసి చూశాడు మోహనరావు.

"దళితుల ఐక్యత వర్థిల్లాలి!"

"దళిత సంగ్రామ పార్టీ (బి.జె) వర్థిల్లాలి!"

"ప్రకాశం (ఐ.ఎ.యస్)గారి నాయకత్వం వర్థిల్లాలి!"

అంటూ పెద్ద పెద్ద అక్షరాల్లో హెడ్డింగ్ రాసి ఉంది. కరపత్రం తీసి చదివాడు మోహనరావు.

"ఈ భూగోళంలో మనిషి మనిషిగా బతకలేని దేశం ఉందంటే అది భారతదేశమే. స్వాతంత్రం వచ్చిన నలభై ఏడు యేళ్ళ తరువాత కూడా ఈ దేశంలో దళితుడు అంటే, పనిచేసే పనిముట్టు గాను, అవమానాలతో, ఆకలీ, రోగాలతో బాధపడే రెండో తరగతి పౌరుడిలా పరిగణించబడు తున్నాడు.

పొలం పండాలంటే దళితుడు కావాలి. ఫ్యాక్టరీ నడవాలంటే దళితుడు కావాలి. ఎలక్షన్లలో గెలవాలంటే దళితుడే కావాలి! కట్టుబానిసలా అతను అందరికీ సేవలు చెయ్యాలి. అతనికి మాత్రం బతుకంటే దినదిన నరకం.

ఎన్ని కలిచేడు దురంతాలు జరిగినా ప్రభుత్వానికి చీమకుట్టినట్లైనా లేదు. ఈ దేశంలో ప్రతిరోజూ ఏదో ఒక మూల దళితుడిపై అత్యాచారం జరుగుతూనే ఉంది. ప్రభుత్వం మొసలి కన్నీరు కారుస్తుందే కానీ, ఈ అమానుషత్వాన్ని ఆపే ప్రయత్నాలు చేయదు.

అందుకే దళితుల్లో జాగరణ రావాలి. వాళ్ళ హక్కులు వాళ్ళకు తెలియాలి. తెలుసుకొని ఐక్యంగా పోరాడాలి. ఆ లక్ష్యంతోటే దళిత సంగ్రామ పార్టీని స్థాపించాము.

ఏ గొప్ప ప్రయత్నానికైనా బాలారిష్టాలు సహజమే కదా! అందునా ఎన్నో కళ్ళు మనవైపు అయిష్టంగా చూస్తున్న రోజుల్లో నాయకుడనుకొన్నవాడు హఠాత్తుగా శత్రువుల మనిషైపోయి, రథం దిగి వెళ్లిపోయాడు. లక్షలమంది దళిత సోదరుల కళ్ళలోని ఆశల్ని చంపివేసిన కిరాతకుడు మోహనరావును పార్టీ నుంచి బహిష్కరిస్తూ మళ్ళీ పార్టీని పునర్నిర్మించే ప్రయత్నం జరిగింది.

దళిత సంగ్రామ పార్టీ (బి.జె)ని స్థాపించి దానికి అడ్‌హాక్ అధ్యక్షుడిగా శ్రీ ప్రకాశం (ఐ.ఎ.యస్) గారిని అధ్యక్షులుగా ఉండమని అభ్యర్థించాము.

దళిత సంగ్రామ పార్టీకి పట్టుగొమ్మలు మన యువకులు. వాళ్ళ సాయంతోటే మళ్ళీ పార్టీని పునర్నిర్మించుకోవాలి. తేది 20-12-94న దళిత సంగ్రామ పార్టీ (బి.జె) ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ముందు ధర్నా ఏర్పాటు చేయబడింది. మోహనరావు దిగజారుడు రాజకీయాల్ని నిరసిస్తూ, అతని ఆధీనంలో ఉన్న పార్టీ కార్యాలయాన్ని నిధుల్ని స్వాధీనం చేసుకోవడానికి నిర్ణయించాము.

వేలాదిగా దళిత సంగ్రామ పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా కోరు తున్నాము.

ధర్నా తరువాత, నూతన అధ్యక్షుడు ప్రకాశంగారికి పురవీధుల్లో ఊరేగింపు ఉంటుంది.

ఆ తరువాత అంబేద్కరు సెంటరులో గొప్ప బహిరంగ సభ ఉంటుంది.

దళిత సంగ్రామ పార్టీ (బి.జె) కరపత్రం చదివినప్పటి నుంచి, మోహనరావు కెందుకో భయంగా ఉంది. పీడకలలాంటి సంఘటనలు పునరావృత్తం అవుతాయేమో అని భయపడ్డాడు.

హడావుడిగా లేచి, తన డైరీలు, ఉత్తరాలు రాసిన లెటర్‌పాడ్‌లన్నింటినీ అల్మైరాలో పెట్టి తాళం వేశాడు. కిటికీలు, తలుపులు వేసి లోపలి నుంచి గడియపెట్టాడు.

అట్లా తలుపులు వేశాడో లేదో టప్‌మంటూ లావుపాటి రాయి ఇంటిపై పడింది. కాసేపటికి మరొకటి పడింది. రెండు నిముషాల వ్యవధి తరువాత, ఈసారి ఆగకుండా రాళ్ళు పడడం మొదలు పెట్టాయి. ఆ రాళ్ళు సూటిగా గుండెల్ని తగులుతున్నట్లుగా మెలికలు తిరిగిపొయ్యాడు మోహనరావు.

"మోహనరావు డౌన్‌డౌన్!" అంటూ నినాదాలు రోడ్డుపై హోరెత్తాయి. తలుపుల్ని విరగగొట్టే ప్రయత్నంగా తలుపుల్ని బాదుతున్న శబ్దం. కిటికీల పైనున్న అద్దాలు భళ్ళుమనటం, మూగగా అంతా చూస్తున్నాడు మోహనరావు. తలుపు కొక్కెంతో సహా ఊడి వచ్చింది. వందమందికి పైగా కుర్రవాళ్ళు లోపలికి దూసుకు వచ్చారు.

అట్టే వయసులేని కుర్రవాడు మోహనరావును ఒక తోపు తోసి, "నడువు బయటకు లంజా కొడకా!" అంటూ పెద్దగా అరిచాడు.

ఒకడు బల్లపై గట్టిగా గుద్దాడు. ఒకడు కుర్చీని ఎత్తి అదాటున నేలకేసి విసిరాడు. ఒకడు టెలిఫోన్‌ను బలంగా గోడకేసి కొట్టాడు. చిల్లి ఓడలోకి నీళ్ళు ప్రవేశించినట్లుగా వాళ్ళు క్రమంగా గదులన్నిటిలోకి వెళ్ళారు. పగలడానికి వీలుగా ఉండే వస్తువులన్నీ పగలగొట్టారు. (అందులో అంబేద్కర్ చిత్రపటం కూడా ఉంది). సమావేశపు గదిలో ఉన్న పరుపుల్ని చీల్చి దూదిని గదంతా వెదజల్లారు. కటౌట్లు, బ్యానర్లు ఉన్న రూముకు వెళ్ళి మోహనరావు పోలికలున్న కటౌటు బయటకు తీశారు. శవాన్ని మోసినట్లు నలుగురు దాన్ని భుజాలకు ఎత్తుకొని, "ముదనష్టపు మోహనరావు పోయాడు తల్లో!" "పోతే పొయ్యేడుగానీ డబ్బు లెక్కడ పెట్టేడో చెప్పలేదు తల్లో!" అంటూ ఏడుపు అభినయిస్తూ కటౌట్‌ని బయటకు మోసుకెళ్ళారు. రోడ్డుపై పడుకోబెట్టి, కాగితాలు, గడ్డి కప్పి దానికి నిప్పు అంటించారు. ఆ నిప్పుల చుట్టూ డాన్స్ చేస్తూ, 'మోహనరావు మరగయా,' అంటూ పాటలు పాడడం మొదలుపెట్టారు.

ఈ హడావుడి మధ్యలో పెద్దగా శబ్దం చేసుకుంటూ ఒక జీపు వచ్చి ఆగింది.అందులోంచి ప్రకాశం దిగాడు. ఒక్కసారిగా జిందాబాద్‌ల శబ్దాలు ఆకాశానికి ఎగిశాయి. ప్రకాశం అభిమాన పూర్వకంగా అందరికీ చేతులు జోడించి ప్రేమగా చేతులు ఊపుతూ జీపు దిగాడు. వచ్చీ రావటంతోటే జరిగిన విషయాల మీద రిపోర్టు ఇచ్చారు అతనికి. "మన ఆఫీసు అది. మనమే పగలగొట్టుకుంటే ఎట్లా?" అంటూ మృదువుగా మందలించాడు వాళ్ళని. 'మోహనరావును కూడా చర్చలకు పిలవండి!' అంటూ కొందరు సీనియర్ కార్యకర్తలు సలహా ఇచ్చారు. ఇద్దరు వృద్ధనాయకుల్ని అతన్ని పిలుచుకురావడానికి పంపారు.

తుఫాను గాలికి వణికిపోయే చెట్టులా ఉన్నాడు మోహనరావు. ఏం మాట్లాడలేని పరిస్థితి. భయంగా కలలోంచి నడిచి వస్తున్నట్లుగా నడిచి వచ్చాడు. కళ్ళనిండా అంతులేని భయం. పెదాలు వణుకుతున్నాయి. భయం అనే భూతం ఆవహించిన వాడిలా ఉన్నాడు.

"రండి! కూర్చోండి! మీరు ఒప్పుకుంటే ఈ ధర్నా అవీ లేకుండా పార్టీ కార్యాలయంలోనే ఇ.సి. మీటింగు పెట్టుకుందాం అనుకున్నాము. ఏదీ, మీ వైఖరే మారిపోయింది. ఇన్ని వేలమందిని ఒక్కతాటిపై నడిపించిన మోహనరావేనా అనిపిస్తోంది.

"ఇ.సి. మీటింగులో గత ఎన్నికలకు ముందు జరిగిన సంఘటనలకు, ఎన్నికల్లో మనకు జరిగిన ఘోర పరాజయానికి మిమ్మల్ని బాధ్యులుగా నిర్ణయిస్తూ, మీ ప్రవర్తనను గర్హిస్తూ, మిమ్మల్ని పార్టీ అధ్యక్షుడిగా, ఇంకా ప్రాథమిక సభ్యత్వం నుంచి కూడా శాశ్వతంగా తొలగించాము. ఇదుగో తీర్మానం. మీ ఆధీనంలో ఉన్న పార్టీ ఆస్తులు, నిధులు వగైరా పార్టీకి తిరిగి అప్పగించవలసిందిగా మిమ్మల్ని కోరుతున్నాం"

ప్రకాశం మాట్లాడుతుండగానే మోహనరావులో వింతైన తెగింపు ఏదో తోసుకు వచ్చింది. భయం స్థానంలో మొండితనం అతనిలో చొరబడింది. "ఏదీ మీ ఇ.సి మెంబర్లను నా ముందుకు రమ్మను. నోట్లో నాలుకలేని ఎదవలంతా ఇ.సి మెంబర్లా? దళిత సంగ్రామ పార్టీ నాది. దీనికి అధ్యక్షుణ్ణి, ఎగ్జిక్యూటివ్ కమిటీని అన్నీ నేనే. నా కాళ్ళను నాకే కుక్కలంతా, ఎంగిలి మెతుకులు ఏరుకునే లోభి నా కొడుకులంతా ఇవాళ ఇ.సి మెంబర్లయ్యారా? మీరెవరు నన్ను బహిష్కరించ డానికి? నేను బతికినంత కాలం పార్టీ నాతోనే ఉంటుంది. నేను ఛస్తే నాతో పాటు చస్తుంది. మీటింగులకనీ, పబ్లిసిటీకని నా దగ్గర లక్షలు లక్షలు దొబ్బారే, ముందు వాటికి లెక్కలు చెప్పండి! ప్రకాశం ! నీ సంగతేమిటి? కలిచేడు మీటింగుకు ముందు నీ చేతికి నేను మూడు లక్షలిచ్చాను. వాటికి లెక్కలు ఎక్కడ? రసీదులెక్కడ? ముందు మీ ముడ్డిపై మురికిని కడుక్కొని, తరువాత నా దగ్గరకు రండి!"

అంతవరకూ మాట్లాడిన మోహనరావు, ఇది నేనేనా అని క్షణంపాటు విస్తుబొయ్యాడు. చివరికంటా తరిమితే పిల్లి కూడా ఎగబడుద్ది అని సమాధానం చెప్పుకొన్నాడు. మెల్లగా జనాన్ని దాటు కొని పార్టీ కార్యాలయం వైపు నడిచాడు.

ఫట్‌మంటూ తగిలిందొక రాయి నెత్తిపై. అబ్బా! అంటూ నెత్తిని పట్టుకొన్నాడు. ఇంకొకటి. ఇంకొకటి. ఒకటి వీపుని, ఒకటి భుజాన్ని తగిలాయి. భయంకరమైన బాధ. 'ముస్లిం దేశాల్లో రాళ్ళతో కొట్టి చంపే శిక్ష ఉందట, అట్లా వీళ్ళు ఈరోజు నన్ను చంపడానికి నిర్ణయించుకొన్నారు కాబోలు అనుకొన్నాడు. నుదిటిపైన దెబ్బకు రక్తం కారటం మొదలుపెట్టింది. "తన్నండి! విరగదన్నండి! లంజా కొడుకును చంపండి!" కసితో కూడిన అరుపులు వినిపిస్తున్నాయి.

నడుస్తూ నడుస్తూ రాయి తట్టుకొని దబ్‌మని నేలపై పడ్డాడు. 'మోహనరావు డౌన్ డౌన్!' 'మోహనరావు ముర్దాబాద్!' 'మోహనరావు చోర్! చోర్!' 'గల్లీ గల్లీ మే షోర్ హై! మోహనరావు చోర్ హై!' వీధి మొత్తం ఒక్కసారిగా శబ్ద సముద్రం అయినట్లుగా అనిపించింది. నేలపై పడిన మోహనరావు వెంటనే లేవలేకపొయ్యాడు. అది భయంతోనో, దెబ్బల తాలుకు తీవ్రతతోనో, చాలాసేపు నేలపై అట్లాగే పడి ఉన్నాడు. వయసులో కాస్త పెద్దగా ఉన్న కార్యకర్తలు అతని పరిస్థితికి జాలిపడ్డారు. కుర్రకారు హుషారుకు బ్రేకులు వేసి,

"ఇంక ఆపండి! ఆ మనిషి ఉన్నాడో పోయాడో ముందు చూడండి!" అంటూ వాళ్ళను శాంతపరిచారు.

ఇద్దరు కుర్రవాళ్ళు వచ్చి మోహనరావు ముక్కు దగ్గర వేలు పెట్టి "బతికే ఉన్నాడ్రోయ్," అంటూ అరిచారు.

"నాలుగు తన్ని డబ్బులు ఎక్కడున్నాయో అడగండి!" అని ఇంకెవరో అరిచారు. "ఇప్పుడు కాదు. నాలుగు రోజులు ఆగుదాం! మెంటల్‌గా బాగా దెబ్బతిన్నాడీ మనిషి. కొద్దిరోజులు పోతే వాడే అన్నీ బయట పెడతాడు. అదేమన్నా వాడి బాబుగాడి ముల్లా? చెమ్డాలొలిచి బయటకు కక్కిద్దాం!" అంటూ ఒక సీనియర్ కార్యకర్త సలహా ఇచ్చిన మీదట, కుర్రవాళ్ళు మోహనరావును హింసించటం మానివేశారు.

ఒక హింసాత్మక ఘట్టాన్ని ఊహించుకొన్న యువకులకు నిరుత్సాహం ఎదురైంది. ప్రకాశాన్ని జీపుపై ఎక్కించుకొని ఊరేగింపుగా వెళ్ళిపోయారు వాళ్ళు.

అవయవాల నన్నింటినీ స్వాధీనంలోకి తెచ్చుకొని మెల్లగా లేచి లోపలికి వెళ్ళాడు. ముఖంపైన, బట్టలపైన అంటుకొన్న రక్తాన్ని కడుక్కొని, హడావుడిగా చెప్పులు వేసుకొని బ్యాంక్ వైపు వెళ్ళాడు.

ఫిక్సెడ్ డిపాజిట్లలోనూ, సేవింగ్స్ ఖాతాల్లోనూ ఉన్న డబ్బులు మొత్తాన్ని విత్ డ్రా చేశాడు. మొత్తం లెక్క చూస్తే పదిహేడు లక్షల అరవై నాలుగు వేలు ఉంది.

ఒకచోట కూర్చుని రకరకాల లెక్కలు వేశాడు. తనలో తానే చర్చించుకొని మొత్తం డబ్బుని డి.డి.లుగా మార్చాడు.

అందులోంచి పదిహేను లక్షల్ని 'ఆశా' పేరుతో డి.డి. తీసుకొన్నాడు. కేరాఫ్ మాలతి, కలిచేడు అంటూ కవర్‌పై స్పష్టంగా రాశాడు. ఈ పదిహేను లక్షలు కలిచేడు బాధితుల కోసం ఖర్చు పెట్టటమే న్యాయం అనుకున్నాడు. ఈ డబ్బును చూసి చలించని ఒకే వ్యక్తి మాలతి అని మనసుకు నచ్చ జెప్పుకొన్నాడు.

రెండు లక్షలకు తన పేరు మీదే డి.డి తీసుకొన్నాడు. దళిత సంగ్రామ పార్టీ మళ్ళీ పునరుజ్జీ వించితే అప్పుడు అవసరమవుతాయి అని సంజాయిషీ చెప్పుకొన్నాడు. దాన్ని మోహనరావు, సంస్థాపక అధ్యక్షుడు, ద.స.పా., బ్రాడీపేట, గుంటూరు అని అడ్రసు రాసిన కవర్లో పెట్టి పోస్టు చేశాడు.

మిగిలిన వాటితో ఇంటి అద్దె, ఇతరత్రా బాకీలు తీర్చడానికి, తను చేయబోయే సుదీర్ఘమైన భారత యాత్రకు (పాదయాత్రకు) అవసరమైన దారి ఖర్చులకు ఒక ఇరవైవేలు విడివిడిగా పెట్టాడు.

మిగిలిన డబ్బును కేశవదాసు తండ్రి పేరు మీద డి.డి తీసుకొని వాళ్ళ అడ్రసుకు పోస్టు చేశాడు.

## 7

గుంటూరు రాజకీయంగా చవుడునేల అయింది. ఇక ఇక్కడ ఉండటం వృధా అను కున్నాడు మోహనరావు. యుద్ధ ప్రాతిపదిక మీద ఆ యింటిని ఖాళీ చెయ్యటం మొదలుపెట్టాడు. రేపర్‌లో చుట్టిన జీవితకథల్ని, సగం సగం రాసిన ఉత్తరాల్ని, పేపరు కటింగ్‌లు ఉన్న ఫైలు, అంబేద్కరు రచనల సంపుటాలు మొత్తం ఒక సంచిలో కుక్కుకున్నాడు. ఇంటి యజమానికి కబురు చేశాడు. ఇవ్వవలసిన అద్దెపై మరో రెండు వందలు ఎక్కువ వేసి యిచ్చాడు. ఆ రెండు వందలు లోపల ఉన్న కటౌట్లు, బ్యానర్లు మొదలైన వాటికనీ, వాటిని మరో అయిదు నెలల పాటు జాగ్రత్తగా దాచి ఉంచమనీ, ఆ తరువాత దేశం పట్టలేనంత దళిత ఉద్యమం రాబోతోందనీ,అప్పుడు వీటి అవసరం ఉంటుందనీ వివరించాడు.

ముందు కలిచేడుకు వెళ్ళాలి అనుకున్నాడు. బస్సులో కూర్చున్న తరువాత తాను మరీ ఇంపల్సివ్‌గా ప్రవర్తించటం లేదు కదా అనుకున్నాడు. లేదు. లేదు. నిర్దేశితమైన మార్గంలోనే వెళు తున్నాను అని నచ్చజెప్పుకున్నాడు. క్రమంగా గుంటూరు దూరమౌతోంది. 'గుంటూరు నా ప్రేయసి,' అనుకున్నాడు. అంతలోనే, 'గుంటూరు పొగరుబోతు రాక్షసి,' అని కూడా అనుకొని సన్నగా నవ్వు కున్నాడు.

'డబ్బు సంచి ఎక్కడ దాచావురా! ఏ బాంకులో పెట్టావో చెప్పు! ఏ లంజకిచ్చి పారిపొమ్మని చెప్పావో చెప్పరా!' మూతి మీద ఫెడేల్మని ఏదో తగిలినట్లనిపించి ఉలిక్కిపడ్డాడు. అసంకల్పితంగా చేతితో పెదవుల దగ్గర తుడుచుకున్నాడు. రక్తం కారిందేమోనని చూసుకున్నాడు. ఇది ఫ్లాష్‌బాక్‌లో ముచ్చట కదా అని నచ్చజెప్పుకున్నాడు. పై దవడలో కుడిపక్క నుంచి నాలుగవ పన్ను విరిగిపోగా ఏర్పడ్డ ఖాళీని వేలుతో ఒకసారి తడుముకున్నాడు.

కలిచేడులో బస్సు దిగి చకచకా మాలపల్లె వైపు నడవటం మొదలుపెట్టాడు. అందరూ తన వైపు అనుమానంగా, సందేహంగా చూస్తున్నట్లు అనిపించింది. చొక్కా నలిగిపోయి ఉంది. మురికి తోలులా ఉంది. ఫాంటుపై తెల్లని ఉప్పుచారలు. పెరిగిన గడ్డం, పిడచగట్టిన జుట్టు, మండు తున్న చితుకుల్లాంటి కళ్లు. ఊరంతా దిగ్భ్రాంతితో చూస్తోంది. లక్ష గొంతుకలు ఒక్కసారి,

'మోహన రావు జిందాబాద్!' అంటూ చేసిన నినాదాలు యింకా ఊర్లో మార్మోగుతున్నాయి. చుట్టుపక్కల చూడకుండా ఏకదీక్షగా నడుస్తున్నాడు మోహనరావు.

ఊరికీ మాలపల్లెకీ మధ్యనున్న బహిరంగ స్థలంలో ఆగాడు. ఆ చివర నుండి ఈ చివరకు నాలుగైదుసార్లు తిరిగాడు. 'సాక్ష్యాలన్నీ చెరిగిపోయాయి,' అని లోలోపల గొణుక్కున్నాడు. హఠాత్తుగా లాల్చీపైకి లాక్కొని, బొడ్డుకు కుడివైపున ఉన్న వెడల్పాటి 'స్కార్'ను తడుముకున్నాడు. 'ఈ సాక్ష్యాన్ని ...' అని పెద్దగా అరిచాడు. ఒక ప్రదేశం దగ్గర ఆగి, 'ఇక్కడే... ఇక్కడే,' అనుకున్నాడు. 'ఇక్కడే జరిగింది సీజర్ హత్య. మొదటి కత్తీ, చివరి కత్తీ బ్రూటసే పొడిచాడు... యూ టూ బ్రూటస్! నువ్వు కూడానా కేశవదాసూ... దాసూ! దాసూ! అంటూ బతిమిలాడాను. నన్ను నమ్ము దాసూ అంటూ వేడుకొన్నాను.' 'ఇన్ని లక్షల మందిని సామూహికంగా హత్య చేసిన నీకిది చాలా తక్కువ శిక్షరా! చావరా లంజాకొడకా!' ఆ మాటలు దాసువే. కత్తిని సర్రుమని తన పొట్టలో దించింది దాసే. వంగి ఆ నేలపై కూలబడి, మట్టిని కెలుక్కోవటం మొదలు పెట్టాడు. ఈ నేలపై నా రక్తం మరకలింకా అంటుకునే ఉన్నాయి అనుకొన్నాడు. 'లంజాకొడుకుని నరకండి...' మోహనరావు జిందాబాద్ అన్న జనమే, 'లక్షలు, కోట్లు కాజేశాడు. ఎక్కడ పెట్టాడో చెప్పమనండి!' 'అన్నా! నీకోసం ప్రాణాలైనా ఇస్తా,'మన్న జనమే, 'వీడికో లంజ ఉండాలి. డబ్బు దాని దగ్గర దాచి ఉంటాడు,' ఫెడేల్మని మూతి పై ఒక దెబ్బ. పొట్టలో ఒక దెబ్బ. తలపై కర్రదెబ్బ ఫట్‌మంటూ... ఇక్కడే ఈ నేలపై నిర్జీవంగా పడి ఉన్నాడు కొన్ని గంటలపాటు. అక్కడ మట్టిని చేతుల్లోకి తీసుకొని, పైకెత్తి నెత్తిపైన, ముఖంపైనా పోసుకున్నాడు. ఒక్కసారిగా దు:ఖం తోసుకొచ్చి పొగిలి పొగిలి ఏడ్చాడు. చాలాసేపు ఏడ్చినాక కొంత ఉపశమనం కలిగింది. లేచి మాలపల్లెవైపు నడిచాడు.

మైకులో పెద్ద పెద్దగా కేకలు వినిపిస్తున్నాయి. అవి కేకలు కావు. నాయకుడిదెవరిదో ఉప న్యాసం. వద్దనుకున్నా చెవుల్లో జొరబడుతోంది. "సరిగ్గా ఒక తెలుగు వాక్యాన్ని కూడా ఉచ్చరించటం రాని వెధవ! వీడా నాయకుడు. వీడిదా ఉపన్యాసం" అనుకున్నాడు. 'జనరంజకంగా ఉపన్యాసాలు ఎలా చెయ్యాలి,' అనే విషయంపై వీళ్లందరికీ క్లాసులు నడపాలి! అనుకున్నాడు మోహనరావు.

ఉపన్యాసకుడి వయసు యాభై పైనే ఉంటుంది. చిరకాలం సుఖాల్తో మునిగితేలిన ఛాయలేవో అతని ముఖంలో కనిపిస్తున్నాయి. కొంచెం గర్వం, కొంచెం జల్సారాయుడితనం ఆ ముఖంలో కనిపిస్తాయి. మృదుత్వం, మేధావితనం ఉట్టిపడేలా ముఖాన్ని పెట్టాడు. వేశ్యలు చౌక బారు క్రీములు, పౌడర్లు పూసుకొని కృత్రిమమైన అందాల్ని రాత్రి వెలుగుల మధ్య తళుక్కుమని పించినట్లుగా ఈ నాయకుడు మంచితనం, మేధావితనం ముఖంపై కనబరుస్తున్నాడు. ఏళ్ళ తరబడి ప్రయత్నించి ముఖంపై మొలిపించుకొన్న మేకప్ ఇది. చూడగానే ఈయనెంత మంచివాడు అనిపిస్తాడు.

"మహాజనులారా! నేను దళితుణ్ణి గాదు. మీరు ద్వేషించే అగ్రకులంలోని వాణ్ణి. అవకాశం దొరికితే నన్ను కత్తికో కండగా నరకగల ద్వేషం మాపైన మీకుందని తెలిసి మరీ వచ్చాను. అన్నట్టు ఇది ఎన్నికల సీజనూ కాదు. అయినా వచ్చాను. ఎందుకు? ఈ కులవైషమ్యాలకు ఒక ముగింపు చెబుతామని మిమ్మల్ని అర్థించడానికి వచ్చాను.

"కలిచేడులో ఇవాళ ఎక్కడి పనులక్కడ ఆగిపోయాయి. పొలాలు బీడుబడ్డాయి. భూస్వాములు చాలామంది పొలాల్ని అమ్ముకుని పట్నాలకు వెళ్ళారు. మీరు మాత్రం ఎన్నాళ్ళిలా పస్తులుంటారు. నేనేదో రాజకీయ లబ్ధి కోసం ఇలా మాట్లాడటం లేదు. పల్లెలన్నీ నక్సలైటు

కాంపులుగా మారిపోతున్నాయి. ఊళ్ళన్నీ యుద్ధభూముల్లా ఉన్నాయి. నేను మీ మాలతిని తప్పు పట్టటం లేదు. మొన్న రాఘవరావును నరికివేశారు. ఊరిని మొత్తం తగలబెట్టారు. ఏమైంది. పోలీసులు మీ పిల్లకాయల్ని చావగొట్టి జైళ్ళలో వేశారు. ఆ మాలతో ఎవరో ఆ పిల్లనీ హత్య కేసంటూ కోర్టులో నిలబెట్టారు? అటు ఊరు, ఇటు పల్లె భయం గుప్పిట్లో బతుకుతున్నాము. ఈ పరిస్థితి ఎన్నాళ్ళు? మనలో మనం రాజీ చేసుకుందాము. నా గురించి మీకు తెలుసు. ఊరికి నేనెంత చేసేనో మీకు తెలుసు. అందుకే ఈ ఊరిని దేశపటంలో కనపడకుండా పోయేలా చెయ్యవద్దని అర్థించడానికి వచ్చాను.

"మనలో మనం ఏదో అనుకొన్నాము. కత్తులు, గొడ్డళ్ళు తీసుకొని ఎగబడ్డాము. ప్రాణాలు పోయాయి. పొరపాటు మావైపు నుంచే ఉంది. కుర్రవాళ్లు ఆవేశపడ్డారు. మీ కుర్రవాళ్ళు కాస్త ఉద్రేకపడ్డారు. పెద్దవాళ్ళం మనం చెబితే వినిపించుకునే పరిస్థితి కాదు వాళ్ళది. అయినా మనం ఏదో ఒకటి చెయ్యాలి.

"పాతికేళ్ళ క్రితం మనం ఎట్లా కలిసి ఉండేవాళ్ళం. ఈ పంచాయితీలు, గవర్నమెంటు పథకాలు రాని రోజుల్లో మా నాయన అటు మాలపల్లికీ, ఇటు మాదిగపల్లికీ రెండు మంచినీటి బావులు తవ్వించాడు. ఇక్కడున్న ముసిలోళ్ళు మీరు చెప్పండి. ఈ బావులు తవ్వించింది మా నాయనా, కాదా?

"ఊళ్ళో సమితి స్కూలు ఉంటే, దానికి పల్లెల్లో పిల్లోళ్ళు రావడానికి భయపడుతున్నారని నా హయాంలో నేనో ప్రైవేటు ఎయిడెడ్ స్కూలు పెట్టించాను. అందులో మీవాళ్ళనే, మీ హరిజన టీచర్లనే పంతుళ్ళుగా పెట్టాను."

ఆయన ఉపన్యాసాన్ని ఆపుతూ కుర్రవాళ్ళు కేకలు వేశారు. "పల్లెల పక్కనే ఉన్న మీ పొలా లకు నీళ్ళకోసం బావుల్ని తవ్వించారు. గవర్నమెంటు దగ్గర డబ్బు దొబ్బుదామని స్కూలు పెట్టావు!" అంటూ అరిచారు.

నాయకుడి ముఖం క్షణంపాటు నల్లగా మారింది. అంతలోనే తేరుకొని, "నేనేదో గొప్పలు చేశానని చెప్పుకోవటం లేదు. మనమంతా అన్నదమ్ముల్లా కలిసి ఉన్నామని గుర్తు చెయ్యడానికి వచ్చాను. మనలో మనకు సమస్యలుంటే మాట్లాడుకొని తేల్చుకుందాం. బయటవాళ్ళ జోక్యం ఎందుకు. మళ్ళీ పనులకు రండి! ఇదుగో ఇంత రేటని చెప్పండి. అంతా యిస్తాము. ఇప్పుడా రాఘవరావూ పోయేడు. ఇంకా ఆ గొడవలు మర్చిపోదాం! మీవైపు నుంచీ, మావైపు నుంచీ కేసుల్ని ఎత్తి వేసుకుందాం! ముందు ఈ బయటవాళ్ళను ఊరులోంచి పంపిద్దాం! ఈ మాలతో, ఎవరో ఆ అమ్మాయి మంచిదే కావచ్చు. ఆమె రాజకీయాలు మంచివి కావు. కత్తులు, బాంబులు అంటూ మిమ్మల్ని రెచ్చగొడుతుంది. నరుక్కొని, చంపుకొని ఎల్లకాలమూ ఇదే పనా? మీరే ఆలోచించు కోండి...పైగా..."

జనం వెనక నిలబడి, ఆ ఉపన్యాసాన్ని వింటున్న మోహనరావుకు, హఠాత్తుగా మెదడు లోపల ఏదో తలుపు తెరుచుకుంది. ఒక జ్ఞాపకం తళుక్కుమంది. అవునదే. ఆ కంఠమే! ఆ కంఠంలోని మొరటుదనం తనకు చిరపరిచితమైనదే... ఎప్పుడు, ఎక్కడ? లోపలి టేప్ రికార్డర్‌ని రివైండు చేసి...వాడే వాడే మాటలు నేర్చిన జంతువు. వెలుగుపాలెం సర్పంచ్.

జన సమూహాన్ని చీల్చుకుంటూ వేదికవైపు పరిగెత్తాడు మోహనరావు. ఒక్క ఉరుకుతో వేదికపైకి ఎక్కి మాట్లాడే వాడి చొక్కా పట్టుకుని, ముందుకు లాగి పొట్టమీదా, ముఖంమీదా పటపటమని కొట్టాడు. జనం ఈ హఠాత్తు పరిణామాన్ని అర్థం చేసుకునే లోపల, నాయకుడి అనుచరుడు బాణాకర్రతో ఫట్‌మంటూ మోహనరావు తలపై కొట్టాడు. ఆ వెంటనే మరొకటి,

మరొకటి. బొటబొట మంటూ రక్తం. ముక్కుల్లోంచి, నోట్లోంచి ధారగా వస్తోంది. లోపల రక్తనాళాలేవో తెగినట్లున్నాయి. ఆయువుపట్లన్నీ దుర్భరమైన బాధతో మూలుగుతున్నాయి.

"మోహనరావు! మోహనరావు!" అంటూ జనంలో గుసగుసలు. పరిస్థితి అర్థమైన నలుగురు కుర్రవాళ్ళు వేదికవైపు పరిగెత్తుకొచ్చారు. ఆపాటికే మోహనరావు వేదికపై కుప్పకూలిపోయాడు. "ఎవరితను? ఎవరితను?" పరిస్థితి అర్థంకాని వక్త ఆశ్చర్యంతో అడుగుతున్నాడు. మోహనరావును పైకి లేవనెత్తి, తమ భుజాల ఆసరాగా కిందకు తీసుకొచ్చారు.

ప్రాణం పోలేదుగానీ, స్పృహ మాత్రం లేదు. బాగా రక్తస్రావం అయింది. కారిన రక్తం శరీరం పొడవునా ధారలు కట్టింది. చిరిగి పీలికలైన బట్టలు, వాటిపైన రక్తంమరకలు భీతావహంగా వున్నాడు.

'అన్నా' అంటూ వాళ్ళు అభిమానించి, ఆరాధించిన మనిషి, ఒక గొప్ప ఉద్యమాన్ని రచించిన మనిషి, రక్తం ముద్దలాగా అక్కడ పడి ఉంటే, జనం భయంగా, దిగులుగా, పశ్చాత్తాపంగా చుట్టూ మూగారు.

నిజానికి ఆ మాట్లాడే మనిషి మోహనరావు అనుకున్నట్లు వెలుగుపాలెం సర్పంచ్ కాదు, కలిచేడుకు చెందిన భూస్వామి. విచలితమైన అతని మనస్సు అటూ ఇటూ ఊగుతూ హఠాత్తుగా ఒక ఉన్మాదం ఉప్పెనలా లేచి అతన్ని డిస్ట్రబ్ చేస్తుంది.

వింతజీవి ఈ మోహనరావు! తనును తాను హత్య చేసుకుంటూ ఆ మరణించే ప్రక్రియని ఆనందిస్తున్న నార్సిసిస్టు.

## 8

మోహనరావుకు మెలుకువ వచ్చేసరికి తనో కొత్త ప్రదేశంలో ఉన్నట్లు అర్థమైంది. ఆత్రుతగా చూస్తున్న ముఖాల్లో పోలికలు గుర్తు పట్టడానికి ప్రయత్నిస్తున్నాడు. మాలతి, అవును మాలతే. పక్కనే కూర్చుని సేవలు చేస్తూ మాలతే. పదిమంది దాకా చిన్న చిన్న పిల్లలు. కలిచేడు అనాధలు అయి ఉంటారు.

"ఎట్లా ఉంది? రెండురోజుల పాటు ఎంతగా కంగారుపడ్డామో. ఎందుకిట్లా మృత్యువుతో దోస్తీ లాంటి జీవితాన్ని గడుపుతున్నారు. ఆరోగ్యం కుదుటపడే వరకూ ఎవరిదగ్గరైనా ఉండమని చెప్పాను కదా!"

మోహనరావు ఏం మాట్లాడలేదు. బాధ తీవ్రతో, దు:ఖపు తీవ్రతో మెదడు లోపలి ఆలోచనా భాగాలు ఎందుకో పరిస్థితులకు స్పందిస్తున్నట్లుగా లేదు. మాలతికి కృతజ్ఞతలు చెప్పాలని ఉంది కానీ మనసు సహకరించటం లేదు. మెల్లగా ఒక్కొక్కటిగా జరిగిన విషయాల్ని గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఊహు... అంతా గందరగోళంగా ఉంది. ఒకదానికొకటి ఓవర్‌లాప్ అయిపోయి ముందు వెనుకల ఏం జరిగిందో తెలియని సంఘటనల శకలాలు గుర్తులోకి వస్తున్నాయి.

"రెస్టు తీసుకో! డాక్టరు సాయంత్రం వస్తానన్నాడు. పిల్లలిద్దర్ని ఇక్కడే ఉంచుతున్నాను. ఏదైనా అవసరముంటే వాళ్ళని అడుగు," అంటూ మాలతి వెళ్ళిపోయింది.

మౌనంగా కళ్ళు మూసుకున్నాడు. అతనికి విశ్రాంతి నివ్వాలని ఇద్దరు పిల్లలూ బయటకు వచ్చారు. ఒంటరిగా గదిలో మోహనరావు. కిటికీలోంచి చూస్తే చిరపరిచితమైన కొండలు. నేలపై పొడవాటి నీడల్ని పరిచే చింతచెట్ల తోపు. తల చుట్టూ బరువైన బాండేజి చుట్టినట్లున్నారు. లేవాలని ప్రయత్నించాడు. సాధ్యం కాలేదు. ఈ ప్రదేశాన్ని నేను చూశాను అనుకున్నాడు. 'ఆశ' అవును.

'ఆశే.' మాలతి నడిపే అనాథ పిల్లల హాస్టలు 'ఆశ'. వినపడీ వినబడనట్లుగా ఎక్కడి నుంచో పిల్లల అరుపులు, అల్లరి చెవిన పడుతున్నాయి.

'లేవాలి! లేచి ఇక్కడ నుండి పారిపోవాలి! అనే వింత సంచలనము మనసులో రేగింది. శరీరం సహకరించను ఫో అంటోంది. ఏ భాగాన్ని కదిపినా భరింపలేనంత బాధ. కళ్లు మూసుకుని మళ్ళీ ఒకసారి జరిగిన సంఘటల్ని గుర్తు చేసుకోడానికి ప్రయత్నించాడు. ఏమీ గుర్తు రావటంలేదు. సమీప జ్ఞాపకాల వేట మానివేసి పాత జ్ఞాపకాల్ని తవ్వుకోవటం మొదలుపెట్టాడు.

'నేను సైతం దళిత ఉద్యమానికి సమిధనై, ఊహు నేను సైతం దళిత ఉద్యమానికి సజీవ ప్రతీకనై, బ్రాహ్మణవాద రీతినీ, నీతినీ ఎదిరించి, ఒక ఉద్యమాన్ని రచించిన, నిర్మించిన మోహన రావును. క్రీ.శ. 1994 భారత చరిత్రలో ముఖ్యమైన సంఘటన మోహనరావు. మోహనరావు జిందాబాద్! మోహనరావు జిందాబాద్! ఎంత గొప్ప పోరాటం చేశాను నేను. దళిత చరిత్రలో ఆనాడు అంబేద్కర్, ఈనాడు నేను, ఎంత చరిత్రాత్మకమైన జీవితం నాది.'

హఠాత్తుగా అతని జ్ఞాపకాలన్నీ మిక్స్ అయిపోయి అటూ ఇటూ కలగూరగంపలా మారి పోయాయి. చిన్న చిన్న ఖండాలుగా బయటకు రావటం మొదలుపెట్టాయి. కాలుతున్న తండ్రి, భార్య నగ్న శరీరం. వందలు వేలుగా జనంతో నిండిన సభలు, ఒంటరి రాత్రులు. నాలుకపై ఆవిరై పోతున్న ఆల్కహాలు చుక్కలు, కురుస్తున్న పూలవానలు, జయజయ ధ్వానాలు, 'లంజకొడకా! ఎక్కడ దాచి పెట్టావురా డబ్బు!' చీకటిలో, చెమటలో కక్కుర్తిగా రాణితో గడిపిన సెక్సీ రాత్రులు, అగ్నికణంలా జ్వలించే మాలతి, పిడిబాకు తళతళలు, కత్తి అంచుపై జిగటజిగటగా రక్తం.

"సంఘటనలన్నీ పోగుపడ్డ స్టోర్‌హౌస్‌లా ఉంది మనసు. ఈ రక్తపు వాసనలకు, ఈ వెంటాడే నినాదాలకు, ఈ సంఘటనల శవాలకు నిప్పు పెట్టాలి. మొత్తాన్ని తగలబెట్టి, మళ్ళీ కొత్తగా, ఫ్రెష్‌గా జ్ఞాపకాల్ని నాటుకోవాలి.

నిప్పు పెట్టాలి అనే మాట చాలాసేపు అబ్సెషన్‌లా అతన్ని వెంటాడటం మొదలుపెట్టింది. నిప్పు పెట్టాలి, నిప్పు పెట్టాలి అనే మాట పదేపదే గొణుక్కున్నాడు. భయంకరమైన బాధను సైతం తట్టుకొని లేచి కూర్చున్నాడు. సంచి కోసం వెతుక్కున్నాడు. దూరంగా టేబుల్‌పై ఉంది. శరీరాన్ని ఈడ్చుకుంటూ టేబుల్‌దాకా తీసుకెళ్ళి, ఆత్రంగా అందులోంచి దాసు ఇంటిదగ్గర దొంగలించిన ఎర్ర డైరీని బయటకు తీశాడు. అతని పెదవులపై వింతయిన శాడిస్టిక్ చిరునవ్వు. తగలబెట్టాలి. దీన్ని తగలబెట్టాలి. అనుకొన్నాడు. సినిమాల్లో విలన్లలా పెద్దగా హాహ్హా అని నవ్వుకోవాలనిపించింది. జేబులోంచి సిగరెట్ లైటర్ బయటకు తీశాడు. 'గుడ్‌బై మోహనరావు! గుడ్‌బై!' కసిగా గొణిగాడు.

డైరీని మొత్తంగా తగలబెట్టడమా, అందులో పేజీలుగా పరుచుకొన్న సంఘటనల్ని తగల బెట్టడమా అని కాసేపు మథనపడ్డాడు. చివరకు సంఘటనలనే తగలబెట్టడానికి నిర్ణయించు కున్నాడు.

అట్లా నిర్ణయించుకొన్నాక డైరీని తెరిచాడు. 'కె. కేశవదాసు, బి.కాం.' అన్న పేరు మొదటి పేజీలో రాసి ఉంది. 'దొంగ వెధవా!' కసిగా తిట్టుకొన్నాడు. మరోపేజీ తిప్పాడు.

"నిరుద్యోగం, ఆకలి, కులం పేరుతో దుర్భరమైన మానసిక హింస, వీటి మధ్య పెరిగాను. దళిత మిలిటెన్సీపై నాకు గొప్ప ఆశలు ఉన్నాయి. సామూహిక ప్రతిఘటన నాకు ప్రియమైన ఫాంటసీ! ఇవి మినహా మిగతా జీవితమంతా నిరుత్సాహంగా, దుర్భరంగా ఉంది. షోకైన గెటప్‌తో రోడ్డుపై షికార్లు చెయ్యటం, అమ్మాయిలతో లైంగిక సాహసాలు, సినిమాలు, ఉద్యోగాలకు అప్లికేషన్లు దాఖలు చెయ్యటం ఈ రొటీనంతా విసుగ్గా ఉంది.

"ఈ బోర్‌డమ్ ఒక సంధియుగపు లక్షణంగా భావిస్తున్నాను. ఒక్క కొత్తమలుపుకు మొదలుగా నమ్ముతున్నాను. ఈ ఒంటరితనం, బోర్‌డమ్‌తో విసిగిపోయాను. నా ఆత్మకో తీవ్ర సంచలనం కావాలి. ఈ సంచలనం కోసం వెతుకులాటలో నాకు తటస్థపడ్డ జలాశయం మోహనరావు."

ఆ వాక్యాలు చదువుతూనే మోహనరావు ఉలిక్కిపడ్డాడు. క్షణంసేపు ముఖం ఆనందంతో వెలిగిపోయింది. అంతలోనే, 'ఇదంతా బోగస్, నేను నమ్మను,' అనుకొన్నాడు. వరుసగా పేజీలు తిప్పటం మొదలుపెట్టాడు. డైరీ నిండా చింపివేసిన పేజీల తాలూకు ఖాళీలు. కొంటెగా నవ్వుకున్నాడు. పోగా...పోగా, పేజీలు తిప్పగా తిప్పగా, 'మళ్ళీ కలిచేడు...' అన్నమాటలు కంటబడ్డాయి. ఆ పేజీల్ని చూస్తేనే మోహనరావు ఉగ్రుడయ్యాడు. ముఖం ఎర్రగా అయింది. కోపంతో పెదవి కొరుక్కున్నాడు. ఇరవైకి పైగా ఉన్న పేజీలన్నీ విసురుగా డైరీలోంచి చించివేశాడు. లైటర్ తీసి వెలిగించి 'యూ బ్రూటస్...' కసిగా తిట్టుకున్నాడు. ఒక్కొక్క పేజీనే చదువుతూ తగలబెట్టడం మొదలుపెట్టాడు.

**నవంబరు 21-27**

మళ్లీ కలిచేడు వెళ్ళాల్సి వస్తుందనుకోలేదు. పొలిమేరలో అడుగుపెడుతూనే శిరస్సుపై రక్తదాహపు కత్తి ఏదో వేలాడుతున్నట్లుగా అనిపించింది. కింద నా పాదాలకు తడిగా, మెత్తగా తగులు తున్నది. భూమి కాదు, నిర్జీవంగా పడి ఉన్న మానవ శరీరాలనిపిస్తోంది. కనిపించే ప్రతి పొదా, చెట్టూ శిరస్సు భూమిలోకి పాతి, శరీరాన్ని పైకి వేలాడదీసిన మనషుల్లాగా అనిపిస్తున్నాయి. మూడేళ్ళుగా ఖననం కోసం ఎదురుచూస్తున్న శవంలాగా ఉంది కలిచేడు.

"ఓడిపోయిన ప్రదేశంలోనే మళ్ళీ యుద్ధం మొదలుపెడదాం! మనల్ని శిరస్సులుగా, మొండాలుగా, ఆ వైపునో చెయ్యి, ఈ వైపునో కాలుగా నరికివేసిన హత్యాస్థలం నుండి మన ప్రతి ఘటనని మొదలుపెడదాం. కలిచేడు హత్యలు జరిగి మూడేళ్ళు అవుతున్న సందర్భంగా, కలిచేడులో మనమో బ్రహ్మాండమైన సభను ఏర్పాటు చేసుకుందాం! అది సంతాపసభ మాత్రమే కాదు. దళితు లందర్నీ ఒకచోట చేర్చే సంఘీభావ సభ కావాలి. 'చలో కలిచేడు' అనే నినాదాన్ని వాడవాడలా చాటండి. కలిచేడు బహిరంగ సభ అపూర్వంగా జరగాలి. ఈ సభలో మనమేమిటో, మన బల మేమిటో దేశం మొత్తానికీ తెలియాలి. మనవాళ్ళంతా రెండు రోజులు ముందే కలిచేడుకు వెళ్ళి అవసరమైన ఏర్పాటు చెయ్యండి!" అంటూ ఈ ఊరికి పంపాడు మోహనరావు.

నేలకంటిన రక్తపుమరకల్ని తుడిచి వేయడానికి ప్రభుత్వం చాలా జాగ్రత్తలు తీసుకుంది. మాలపల్లెలో వందకు పైగా పక్కా ఇళ్లను కట్టింది. (మాలతి మాకా ఇళ్ళు అక్కర్లేదు అంటుంది. కలిచేడుకు పదిమైళ్ళ అవతల ఉన్న ఖాళీ స్థలాల్లో ఇళ్ళు కట్టించి యిమ్మని డిమాండ్ చేస్తుంది.) ఊరిని, మెయిన్ రోడ్డును కలిపే ఎప్రోచ్ రోడ్డును మాలపల్లె దాకా పొడిగించారు. పల్లెలో రెండు మూడు బోరింగ్ పంపులు కూడా వేశారు. డి.ఆర్.డి.ఎ. వాళ్ళు వద్దన్నా, కాదు కూడదంటూ లోన్లు చేతుల్లో పెడుతున్నారు. (నాలుగింట ఒక వంతు సబ్సిడీ ఉంటుంది). ఈ సదుపాయాలన్నీ కన్నీ రొలికే జ్ఞాపకాలపై కట్టిన చిన్న చిన్న సమాధుల్లాగా తోస్తున్నాయి. ఈ రాకాసి గడ్డపై మళ్ళీ అడుగు పెట్టడమా అంటూ మొండికెత్తిన జనం, మెల్లమెల్లగా ఆ విషాదంతో రాజీ పడుతున్నారు. (ఒక్క మాలతి మాత్రం విసుగులేని పోరాటాన్ని ఇంకా చేస్తూనే ఉంది).

నాకైతే ఇంకా కాలి నిప్పులుగా, బూడిదగా మిగిలిన కొంపలే కళ్ళలో కదలాడుతున్నాయి. ప్రాణ భయంతో పరిగెడుతున్న జనం హాహాకారాలే వినబడుతున్నాయి. గొడ్డలివేటుకు సగం తల తెగి చిమ్మిన రక్తపుధారలే కన్పిస్తున్నాయి. ఆ రక్తపుధారల్లోంచి ఎగిసివచ్చే చావువాసన కన్నీళ్ల

కన్నీళ్ళుగా వెంటాడుతుండగా, దుబ్బుల్లో, పొదల్లో దాక్కొని ప్రాణభయంతో పారిపోయిన క్షణాలు నాకింకా గుర్తే.

మూడేళ్ళు పెద్ద వ్యవధేం కాదు.

"దాసూ! ఇదేన్రా రావటం!" పెద్దక్క కాంత. నన్ను చేతుల్లోకి తీసుకొని బావురుమంది. నా వక్షంపై తల ఆన్చుకొని 'దాసూ!దాసూ!' అంటూ పొగిలి పొగిలి ఏడ్చింది. నా కళ్ళలోనూ నీళ్ళు తిరిగాయి. ఈ కన్నీళ్ళు గొప్ప సుఖాన్నిస్తాయి. లోపలి బాధనంతా కడిగివేసి మనసును తేలిక పరుస్తాయి.

"ఎట్లా ఉన్నావక్కా! బావా, పిల్లలూ బాగున్నారా?"

"ఏం బాగురా! చావలేక, బతకలేక, పొలాల్లోకి పోయి పని చెయ్యాలంటే కడుపులో దేవి నట్లుగా ఉంది. తప్పేదేముంది? బిడ్డల కడుపులు మాడ్చలేం గదా! అప్పటికీ ఆ మాలతమ్మ పుణ్యమా అని గవర్నమెంటోళ్ళు గేదెలకనీ, వాటికనీ వీటికని లోన్లు యిస్తానే ఉన్నారు. ఆళ్ళిచ్చే డబ్బు ఉప్పుకీ, కారానికీ సరిపోదు."

ఆ పోలీసులు వస్తారు. పోతారు. ఒక్క నా బట్టనీ అరెస్టు చెయ్యరు. ఆళ్ళందరూ నడిరోడ్డుపై బోరవిరుచుకొని నడుస్తున్నారు. సిగ్గూ, శరమూ వదిలేసి వాళ్ళ పొలాల్లోకే పనులకు పోతున్నాము మేము."

అక్క బాధ అర్థమైంది. మోహనరావు అంటుండేవాడు. 'బతకటమా? పోరాడటమా? తేల్చు కోవాలి. బతకాలంటే రాజీపడాలి. ఈ అవమానాలన్నీ భరించాలి. పోరాడావా? ఇవాళ నువ్వు పోయినా రేపు నీ బిడ్డలైనా తలెత్తుకొని బ్రతుకుతా,'రని.

"మా ప్రాణాలకు ఈ ఎలక్షన్లొకటి. ఆ మంత్రని ఈ మంత్రని రోజూ ఒకటే నస. మీ మోహన రావు సార్ కూడా నిలబడుతున్నాడటగా!"

"నిలబడటమేమిటి? ఊరూ వాడా ఆయన పేరు మారుమోగుతుంటే. ఆయన గెలిచి తీరతాడనే పేపర్లలో కూడా రాస్తున్నారు."

"మరే అంత పూసుకోకురా! లేనిపోని గొడవలు" అక్క మాట్లాడుతుండగానే బావ వచ్చాడు. "గడపలో ముచ్చట్లు పెట్టావు. వాణ్ణి లోపలికి రానివ్వు" బావ చిరునవ్వుతో లోపలికి ఆహ్వానించగా, నాలో మాత్రం ఆయన గురించిన అయిష్టం చెరిగిపోనేలేదు. కలిచేడు గొడవల తరువాత గవర్న మెంటు ఇచ్చే డబ్బును కానీ, మరింకే సహాయాన్ని తీసుకోకూడదని కుర్రవాళ్ళందరం ఒక మాట అనుకున్నాము. ఈయన మాత్రం పరుగు పరుగున పోయి 'నష్టపరిహారం' వగైరా పేర్లతో వాళు ్ళ పారేసే నోట్లకట్టలను అందిపుచ్చుకున్నాడు. ఆయన పేరును, మా నాయన పేరును ఇళ్ళస్థలాల పేర్లలో ఇరికించాడు. ఊరంతా పుట్టెడు దు:ఖంలో ఉంటే ఈ మనిషి మాత్రం (ఇలాంటి వాళు ్ళ ఇంకా చాలామంది ఉన్నారు.) రెవిన్యూ ఆఫీసుల చుట్టూ, డి.ఆర్.డి.ఎ. ఆఫీసర్ల చుట్టూ, ఎస్.సి, ఎస్.టి. కార్పొరేషన్ల చుట్టూ తిరిగి కలిచేడు దళితుల పేరు చెప్పి డబ్బు బాగా దండుకున్నాడు.

కలెక్టరొక మీటింగు పెట్టి కలిచేడు దళితులు, రాజీపడ్డారని కలిచేడులో ఉండడానికి ఒప్పుకున్నారని పెద్ద పెట్టున ప్రచారం చేసి, పక్కా ఇళ్ళకు అవసరమైన పట్టాలు వగైరా పంచి పెడు తున్నాడు. వాళ్ళు చదువుతున్న పేర్లలో బావ తరువాత నా పేరు, నాయన పేరు వినబడి కడుపు మండిపోయింది. చరచరా డయాస్ దగ్గరకు వెళ్ళి కలెక్టరు ముందే ఆ కాగితాల్ని పరపరా చించి వేశాను. దాంతో మీటింగులో గొడవలయ్యాయి. కుర్రవాళ్ళందరూ పట్టాలు లాక్కుని అక్కడే ముక్కలు ముక్కలుగా చించివేశారు. బావ ముఖంలో నెత్తురు చుక్కలేదు. 'ఈ లంజా కొడుకులికి

బతకటం చేతకాదు. చూస్తా ఉండు మట్టిగొట్టుకు పోతాడు. ఎందుకింత నీలుగుడు వీడికి? వాడబ్బ ముల్లె ఏదన్నా ఉందా? ఆడి కాళ్ళు, ఈడి కాళ్ళు పట్టుకొని ఇంత పని చేసుకొస్తే, ఈ గోరోజనం గాళ్ళు ఇట్లా చేసేరు', అంటూ బావ మండిపడ్డాడు.

"ఈ ముసలోడు మాత్రం కొడుక్కి నచ్చజెప్పుకోవచ్చు కదా! ఇట్లా పరాయోళ్ళ కొంపల్లో పడి ఉండకపోతే, ఆ పట్టా ఏదో తీసుకుంటే సొంత కొంప ఏర్పడుతుంది కదా!"

బావ నాయనపై కూడా విసుక్కోవటం మొదలుపెట్టిన తరువాత ఇక ఈ ఇంట్లో ఉండటం భావ్యం కాదనిపించింది. "ఈ గొడవలు, ఈ కాష్టం ఇక్కడెందుకు! గుంటూరు పోదాం పద," అంటూ నాయన గుంటూరుకు మకాం మార్పించాడు.

"ఏమిరా! ఇంకా కోపం తగ్గనే లేదా? నీకు బొత్తిగా లోకం తెలియటం లేదురా. నీ మంచికే ఏమైనా చెబితే నీకు బాధగా ఉంటది. సరే నీకే తెలిసొస్తాది. మూడేళ్ళుగా ఉద్యోగం లేదు. సద్యోగం లేదు. ఆ మోహనరావు ఒకడు దొరికేడు. వాడితో బాటు డప్పు వాయించుకుంటా తిరిగితే కడుపు నిండుద్దా చెప్పు. మీరన్నట్లు వీడు రేపు ఎలక్షన్లలో గెలిచినా మీకు తొంటి చెయ్యే చూపిస్తాడు. ఎవుడొచ్చినా మన కొరగేది ఏం లేదు. ఈ మట్టీ, మశానంలోనే మనం బతకాలి. ఆణ్ణీ, వీణ్ణీ అయ్యా, అబ్బా అని బతిమలాడుకొనే బతకాలి. మీరు ఎక్కువ తక్కువగా మాట్లాడితే జైళ్ళలో నూకుతారు. తుపాకులు బెట్టి కాలుస్తారు. ఆ యమ్మి, ఆ మాలతమ్మ రెండేళ్ళ నుంచి పాకులాడుతోంది. ఏమైంది? రెండుసార్లు బొక్కలో యేశారు. ఆడకూతురని కూడా చూడకుండా వాయగొట్టారు. తిక్క మనిషి కాబట్టి ఆ యమ్మి ఇక్కణ్ణించి పోయేది లేదంటూ మొండికిక్కూర్చుంది. నా మాట వినుకొని ఈ తిరుగుళ్ళు మాను. ఎవుడొచ్చినా మన బతుకులు మారేది లేదు. కాలంతో పాటే పోవాలి మనం."

బావ పెద్ద క్లాసే తీశాడు. బావే కాదు, బావ వయసున్న వాళ్ళందరి ఆలోచనలు ఇట్లాగే ఉన్నాయి. వాళ్ళకు సంఘర్షణ అంటే ఇష్టం ఉండదు. జీవితం ఎంత దుర్భరంగా, నికృష్టంగా వున్నా భరిస్తారు కానీ, దీని నుంచి బయట పడడానికి వీసమెత్తు కష్టం కూడా పడరు. 'దుర్భరమైన అవ మానం కంటే చావు నయం కదా,' అంటే 'వెర్రివాడా! నీకేం తెలుసురా బతుకంటే?' అని నిరుత్సాహ పరుస్తారు. బావ తరహా మనుషుల్ని చూస్తే నాకు గొప్ప ఆశ్చర్యం. మొత్తం మానవజాతే సిగ్గుతో తలవంచుకోవాల్సిన సంఘటన జరిగిన చోట, ఒక మహా విస్ఫోటనంలా భగ్గుమనడానికి బదులు ఈ మనుషులు ఇంత మామూలుగా, సాధారణంగా ఎలా ఉండగలుగుతారని?

**డిసెంబరు - 5**

ప్రభుత్వం కొత్తగా కట్టిన ఇళ్ళకు, పాతపల్లెకు మధ్యన అయిదెకరాల ఖాళీ స్థలం ఉంది. దాంట్లోనే సభ పెట్టాలని నిర్ణయించాము. మొత్తం వందమందిదాకా వచ్చారు కార్యకర్తలు. వేదిక ఏర్పాటుచేసే టీమ్ ఒకటి, కరపత్రాలు బ్యానర్లు చూసే టీమ్ ఒకటి, రిసెప్షన్ కమిటీ అంటూ అందరమూ తలా ఒక పనిలో నిమగ్నమైనాము.

మృతవీరుల (హత్యలతో చనిపోయినవాళ్ళ) కటౌట్లు పెట్టాలనే ప్రతిపాదన వచ్చింది. దాంతోపాటు మోహనరావు కటౌటు ఒకటి (పెద్దది సుమారు పదడుగులు) పెట్టాలని కుర్ర వాళ్ళు పట్టుపట్టారు. ఉద్యమం కన్నా పెద్దవాడవుతున్నాడా మోహనరావు అనిపించింది.

'మోహనరావు కటౌట్ పెట్టుకునే సందర్భం కాదిది,' అంటూ వాళ్ళకు నచ్చజెప్పాను. ఊహు. వినలేదు. 'మోహనరావు అంటే ఎవరు? మనందరి ఆవేశాలు ఒకచోట కలిసిన మూర్తి కదా!' అంటూ కొటేషను వదిలాడో పిల్లకవి. నా ప్రతిపాదన వీగిపోయింది. బ్రహ్మాండమైన కటౌట్ తయా రయ్యే ప్రయత్నం మొదలైంది.

'దాసన్నా! వీధుల్ని రంగు కాగితాల్తో అలంకరించవచ్చా,' అంటూ ఓ తమ్ముడు కేకేశాడు.

"రంగు కాగితాల్తో కాదు. ఉరితాళ్లతో అలంకరిద్దాం. ఈ ఎన్నికలు అయిపోయాక మీ 'మోహనరావు మనకు మిగిల్చేది అవే,' ఉలిక్కిపడి చూశాను. మాలతి. ఆమెనక్కడ హఠాత్తుగా చూడటంతో గుండెల్లో క్షణకాలం వింత సంచలనం రేగింది.

"బాగున్నావా అక్కా!" కుర్రవాళ్ళందరూ ఆమె చుట్టూ మూగారు.

"ఈ కోలాహలం ఎందుకో తెలుసుకోవచ్చా?"

"మృతవీరుల వర్ధంతిని జరుపుతున్నాం అక్కా!"

"తగలేసిన శవాల్ని మళ్ళీ మళ్ళీ తగలేయటమంటే యిదేనేమో! గుండెలు బాదుకొని గొల్లుమనాల్సిన క్షణాల్ని యింత రొమాంటిక్‌గా అలంకరిస్తున్నారే! ఇది మృతవీరుల వర్ధంతి కాదు. మోహనరావు రాజకీయ జీవితపు పుట్టినరోజు. అందుకే ఈ కటౌట్లు! ఈ హంగామా!

"తమ్ముడూ! కరుగ్గా అంటున్నానని ఏం అనుకోవద్దు! మీ తల్లుల్ని విధవల్ని చేసి, మీ చెల్లెళ్ళని పట్టపగలు చెరిచిన సంఘటన, ఇట్లా మైకులు పెట్టి, టెంటులు వేసి కోలాహలంగా గుర్తు చేసుకోవాల్సిన సంఘటనా? మూడేళ్ళయింది. ఇంతవరకు కేసు ఎఫ్.ఐ.ఆర్. దశను దాటలేదు. ఈ కేసు కోర్టుదాకా వెళుతుందనే ఆశలేదు. మీ ఉద్రేకం, ఆవేశం ఏమైంది? చివరకు మోహనరావుకు సైకోఫాంట్లయే స్థాయికొచ్చారా?" అంటూ చరచరా వెళ్ళిపోయింది. మా ముఖాల్లో నెత్తురు చుక్క లేదు.

"అందుకే కదా మోహనరావన్న ఎలక్షన్లలో నిలబడటం, అధికారం మనచేతిలోకి వస్తేగాని..." యూనివర్సిటీలో ఎమ్.ఎ. చేస్తున్న సునీల్ కుమార్ ఆవేశపడ్డాడు. 'డైలాగులు ఆపవోయి,' అంటూ వాడివైపు చూశాం అందరం.

ఆ సాయంకాలం 'ఆశా' పునరావాస కేంద్రానికి వెళ్ళాను. ముప్పయిమంది ఉన్నారు పిల్లలక్కడ. కలిచేడు హత్యల్లో తల్లిదండ్రుల్ని కోల్పోయిన పిల్లలు పదిమంది దాకా ఉన్నారు వాళ్ళలో. విశాలమైన ప్రదేశంలో కట్టిన తాటాకు ఇళ్ళ సముదాయం అది. వెదురు బొంగులు, తాటాకుల్తో పల్లెలో జనమే కట్టిన ఇళ్ళవి. పిల్లలకు స్కూలు, హాస్టలే కాకుండా, నేత పని కోసం కొన్ని మగ్గాలు, వడ్రంగి పనులకు అవసరమైన పనిముట్లు, ఇంకా బుట్టల అల్లకాలు, బొమ్మలు చేయటం, వీట న్నిటికి బస్తీల్లో అమ్మడానికి అవసరమైన మార్కెటింగ్ సదుపాయాలు. 'ఒకే వ్యక్తి ఇంత విశాలమైన ప్రపంచాన్ని నిర్మించిందా,' అని ఆశ్చర్యం వేస్తుంది. కలిచేడు మాలపల్లి జనం ఈనాటికీ పొలం పనులకు (మా బావలాంటి కొందర్ని మినహాయిస్తే) వెళ్లనవసరం లేకుండా వాళ్ళకు స్వయం పోషణ నేర్పి మూడేళ్ళపాటు వాళ్ళకి అన్నదాత అయింది 'ఆశా' మాలతక్క.

నేను వెళ్ళేసరికి పిల్లలను ఆటలాడిస్తూ మైదానంలో అటూ ఇటూ తిరుగుతూ కనిపించింది మాలతి. "రా! రా! ఏమిటిలా దారితప్పి వచ్చావు?" అంటూ పలకరించింది.

"ఒక్కసారి నిన్ను చూసిపోదామని వచ్చానక్కా!"

"రా! లోపలికి పోయి మాట్లాడుకుందాం!" అంటూ లోపలికి తీసుకెళ్ళింది.

"ఏమంటున్నాడు మీ మోహనరావు? ఢిల్లీ దర్బారులోనే పాగా వేస్తాననంటున్నాడా?"

"మోహనరావు అంతగా కొట్టి పారేయాల్సినవాడా? ఎన్నో యేళ్ళ తరువాత దళితులందర్నీ ఒక తాటిపైన నిలపగలుగుతున్నాడు. ఆయనంటే మీకెందుకంత చిన్నచూపు?"

నా ముఖంలోని సీరియస్‌నెస్‌కి ఉలిక్కిపడింది మాలతి. "దళితులను ఒకటిగా చేసే ఈ ఉద్యమాన్ని గురించి కాదు, ఈ మోహనరావు మార్కు రాజకీయాలంటే నాకు చిన్నచూపు."

“ఒక సామాజిక విషాదాన్ని, అణిచివేతని, ఒక రక్తమోడ్చే గాయాన్ని అతను ఎక్స్‌ప్లాయిట్ చేస్తున్నాడు. దళిత ఉద్యమాన్ని ఎన్నికలకు ఉపనాటకంగా తయారుచేస్తున్నాడు. మిగిలిన రాజకీయ నాయకుల్లా అతను కూడా మనల్ని బ్యాలెట్ పత్రాల్లాగా చూస్తున్నాడు. కుర్రవాళ్ళలోని కసి, క్రోధాల్ని తన ప్రచారాలకు అనువైన వస్తువులుగా వాడుకుంటున్నాడు.

“ఈ మోహనరావు ఎక్కడున్నాడు నిన్న మొన్నటిదాకా, వీధుల్లో నిరుద్యోగిలాగా తిరిగిన వాడు. ఇవాళ కార్లలో తప్ప తిరగటం లేదు. అతనికిప్పుడు బాడీగార్డులు, అనుచరులు. ఇవాళ కలిచేడు విషాదం మరుగుపడిపోయింది. మరుగుజ్జు స్థాయి నుండి బడానాయకుడి స్థానానికి ఎదిగాడు మోహనరావు. ‘వేయి పడగల హైందవ సర్పాన్ని ఖండఖండాలుగా నరకాలి,’ అంటూ పదినిముషాలు ఉపన్యాసం ఇవ్వటంతోటే మీకు ఎక్కడలేని హుషారు. మోహనరావు ఉప న్యాసాలు, ఆల్కహాలు కన్నా ప్రమాదకరమైన మత్తు పదార్థాలు.

“దళిత ఉద్యమం అనే కాన్సెప్ట్ మన రాష్ట్రంలో ఇదివరకు లేదు. మహారాష్ట్రలో ఇలాంటి ఉద్యమం ఉండేది. చాలా బలంగానే పనిచేసింది. చివరకు అధికార పార్టీకి గొడుగులా మారింది. ఇక్కడా అదే పరిస్థితి వస్తుందేమో అని నా భయం.

“ఈ మోహనరావు గురించి మనం ఇంకా అంచనా వేయాల్సి ఉంది. ఇతను కడదాకా నిలిచేవాడా? మధ్యలో జారిపోయేవాడా? తేల్చుకోవాల్సి ఉంది. నాకైతే ఇతనిపై పెద్దగా ఆశలు లేవు.

“నాలుగు రహదార్ల కూడలిలో ఉన్నాడు, ఇవాల్టి దళిత సోదరుడు... ఎవరు మిత్రులో? ఏది శాశ్వతమైన మార్గమో తేల్చుకోవాల్సి ఉంది.”

మాలతి (అక్క) ముఖంలో ఏ మాత్రం ఉద్రేకం లేదు. (ఇదే మోహనరావు అయితే ఈ కాసిని మాటల్ని చెప్పేసరికి విస్ఫులింగాలు విరజిమ్మే అగ్నినేత్రం అయ్యేవాడు).

ఆ రాత్రి అక్కడే పిల్లలతో కలిసి భోజనం చేశాను. నాకు వీడ్కోలు చెబుతూ, “మోహన రావును డబ్బుతోనో, మరో ప్రలోభంతోనో కొనివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికార పార్టీకి మోహనరావు ఒక సింహ స్వప్నమే అయ్యాడు. అతన్ని జారిపోనీకుండా కుర్రవాళ్ళు కాస్త హుషారుగా ఉండండి,” అంటూ పిడుగుపాటులాంటి వార్త చెప్పింది.

**డిసెంబరు - 6**

మోహనరావు ఊళ్ళోకి రాగానే, పరదేశం వెళ్ళివచ్చిన తండ్రికి ఎదురొచ్చే పిల్లల్లా, పల్లెలోని జనమంతా ఎదురేగి స్వాగతం యిచ్చారు. ముతక ఖద్దరు లాల్చీ, పైజమా, భుజాన సంచీ, ముఖం చుట్టూ దట్టంగా అల్లుకుపోయిన గడ్డం, ఆ ముఖంలో అనునయం ఉంది. లాలింపు ఉంది. మోహనరావు స్త్రీ అయితే ‘అమ్మా’ అంటూ ఆయన్ను చుట్టుకోవాలనిపిస్తుంది. అంత మృదువైన వ్యక్తీ వేదిక ఎక్కేసరికి ఎర్రగా రగిలిపోయే అగ్నికణంలా మారిపోతాడు. అప్పుడాయన దగ్గరకు వెళ్ళాలంటేనే భయం.

“నాయనా మోహనరావా! ఈ ముసలిదాన్ని చూట్టానికి వచ్చావా? ఒక్కగానొక్క కొడుకుని పొట్టనబెట్టుకున్నారు. మా బతుకుల్ని గుల్ల చేశారు. ఆళ్ళకు జైలేసేదెప్పుడు? ఉరేసేదెప్పుడు? ఆ నా బట్టల దగ్గరకే ముంత పట్టుకొని అడుక్కోడానికి వెళ్ళాల్సిన పని తెచ్చేవే? మీరింతమంది వున్నారు? ఏం లాభం? ఈ గడ్డపై నా బిడ్డ నెత్తురింకా ఆవిరి కాలేదు. నువ్వొస్తావని, ఏదో చేత్తావని ఎదురు చూస్తున్నామే...” ముసలి నారమ్మ శోకండాలు పెట్టి ఏడుస్తోంది.

మోహనరావు కళ్ళలో నీళ్లు. మనిషి ఒక్కసారిగా కదిలిపోయాడు. నారమ్మను కౌగలించుకొని “పెద్దమ్మా! నువ్వు పైకి ఏడుస్తున్నావు. నేను లోపలే ఏడ్చుకుంటున్నాను. ఏం చెయ్యమంటావు?

రాజ్యం వాళ్ళది. కాదంటే కొడతారు. జైళ్ళలో పెడతారు. అడవుల్లోకి తీసుకెళ్ళి కాల్చి చంపుతారు. అధికారం మన చేతుల్లోకి రావాలి పెద్దమ్మా! అధికారం! అప్పుడు ఒక్కొక్కళ్ళని కొరత వేయిస్తాను. అందుకే ఎలక్షన్లంటూ ఇందులోకి దిగాను. ఇన్నాళ్ళు మనం ఓట్లు వేస్తే వాళ్ళు నెగ్గారు. ఇప్పుడు మన ఓట్లతో మనమే నెగ్గుదాము?'' ఆయన మాటలు పూర్తి కాకుండానే, ''మోహనరావు జిందాబాద్,'' అంటూ తమ్ముళ్ళు అలవాటు కొద్దీ స్లోగన్సు ఇచ్చారు. మోహనరావు విసుగ్గా, కోపంగా వాళ్ళవైపు చూశాడు.

మోహనరావు ఒక గంటపాటు ఇళ్ళన్నీ తిరిగాడు. అందర్నీ పలకరించాడు. రాములమ్మ ఇంట్లో సంకటి పెట్టించుకు తిన్నాడు. పిల్లల్ని ఒళ్ళో ఎక్కించుకున్నాడు. పల్లెలో పెద్దవాళ్ళను పిలిచి కేసు వివరాలు కనుక్కొన్నాడు. ఇరవైమంది దాకా అరెస్టు అయ్యారుగానీ వాళ్ళలో అసలు నేరస్థులు లేరని చెప్పారు వాళ్ళు. ఈ హత్యలకు మూల కారకుడు, అందరికీ మందు పోయించి ట్రాక్టర్లలో ఎక్కించి పల్లెపై దాడి చేసిన రాఘవరావుపై ఇంతవరకు కేసు పెట్టలేదని చెప్పారు. 'అదేమంటే రాఘవరావు పరారీలో ఉన్నాడు. మనిషే అయిపు లేడు. ఇంకెలా అరెస్టు చేయ్యాలి,' అంటారు పోలీసులు. రోజుకి ముప్పొద్దుల మూడుసార్లు రాఘవరావు ఇక్కడే తిరుగుతుంటాడు. 'మనందరికీ కనిపిస్తాడుగానీ పోలీసులకు మాత్రం కనపడడు,' అంటూ చెప్పేరు మనవాళ్ళు. 'వాడెక్కడికి తప్పించుకుపోతాడు,' అంటూ వాళ్ళకి భరోసా ఇచ్చాడు మోహనరావు.

''మాలతమ్మని చూసివద్దాం!'' అంటూ 'ఆశా' వైపు బయల్దేరాడు మోహనరావు.

పెరట్లోని కూరగాయల మొక్కలకు పిల్లలతో కలిసి నీళ్ళు పోస్తోంది మాలతి. మేం వెళ్ళే సమయానికి. ''బాగున్నావా అమ్మా!'' అంటూ పలకరించాడు.

''లోపలికి రండి!'' అంటూ ఆహ్వానించింది. కాఫీ అందిస్తున్న మాలతితో ''అక్కడంతా కోలాహలంగా ఉంటే నీకు చీమ కుట్టినట్లయినా లేదే! ఈ సభ మోహనరావు సభ కాదు. దళితు లందరి సభ. నీ సిద్ధాంతాలు నీకుండొచ్చు. అందరం కలిసి మంచిపనికి పాటుపడితే తప్పేముంది?'' అన్నాడు బాధగా ముఖంపెట్టి.

''మంచి పనంటే నిన్ను ఎలక్షన్లలో గెలిపించటమేనా?'' ఉలిక్కిపడ్డాడు మాలతి మాటలకు. ఏం మాట్లాడలేకపొయ్యాడు. ''మోహనరావుగారూ! మీరు కన్యాశుల్కం నాటకం చదివారా?'' అంది మళ్ళీ. ''బ్రాహ్మణ సాహిత్యాన్ని నేను చదవను'' అన్నాడు స్థిరంగా.

''అందులో గిరీశం అనే పాత్ర ఉంది. మిమ్మల్ని చూస్తే పదేపదే ఆ గిరీశమే గుర్తుకొస్తు న్నాడు,'' అంది. మోహనరావు ముఖం ఎర్రగా అయింది. ''మోహన్రావుగారూ! మీ మార్గం నిజాయితీ గలదైతే మీతో చేయి కలపడానికి నేనెప్పుడూ సిద్ధమే. ఇప్పుడేకాదు, ఈ మీ ఎన్నికల నాటకం అయిపోయాక, మీకు పశ్చాత్తాపం లాంటిదేమయినా కలిగితే, అప్పుడు కూడా మీతో కలిసి పని చేయడానికి నేను సిద్ధమే,'' కోపాన్ని దిగమింగుకొని మెల్లగా అక్కడ నుంచి బయటికొచ్చాడు మోహనరావు.

మధ్యాహ్నానికి బళ్ళలో, లారీల్లో జనం రావటం మొదలుపెట్టారు. కలిచేడు రోడ్లన్నీ మహా నదులుగా మారాయి. బహిరంగసభ స్థలం మానవ సముద్రమే అయింది. మోహనరావు దగ్గరుండి వేదిక ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నాడు. వెంట రాబోయిన అనుచరుల్ని బాడీగార్డుల్ని వద్దని తిరస్కరిం చాడు. ''ఇది నా తల్లి గర్భమంతటి సురక్షితమైన చోటు...'' అంటూ ఒక్కడే జనం మధ్య తిరిగాడు.

దాదాపు అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు వచ్చారు. ప్రకాశం (ఐ.ఎ.యస్), డాక్టర్ కుమార్ లాంటి కార్యవర్గ ప్రముఖులు కూడా వచ్చారు. ఇక ఎన్నికలట్టే దూరం లేవు. ఈ సభలోనే ఎన్నికల్లో

పోటీ చెయ్యబోయే అభ్యర్థుల పేర్లు ఖరారవుతాయనే పుకారు ఒకటి వచ్చింది. కాస్తో కూస్తో డబ్బు దాచుకున్న దళిత సేట్‌జీలు, మాజీ రాజకీయ (దళిత) నేతలు కూడా వచ్చారు.

వందకు పైగా కార్లు కూడా వచ్చాయి. కార్ల నుండి పూలమాలలు, శాలువలు దిగుతున్నాయి. వాతావరణంలో ఎక్కడా దు:ఖంకానీ, ఒకానొక విషాద సంఘటనని గుర్తు చేసుకునేటప్పుడు ఉండాల్సిన మౌనవేదన కానీ లేదు. పూలూ, జెండాలు, జైజై నినాదాలూ, జిందాబాదులూ. ఒక పండుగ వేడుకలా ఉంది. కలిచేడు విషాదం మరుగున పడిపోయిందంటూ మాలతి ఆక్రోశించటం లో ఆశ్చర్యమేముంది!

సాయంత్రం నాలుగు నుండి మోహనరావు విడిది గృహంలో రాజకీయ చర్చలు జరగటం మొదలైంది. బహుశా అభ్యర్థుల ఖరారు తతంగమేమో?

సభా ప్రాంగణంలో ఆరు నుంచి సందడి మొదలైంది. తెలంగాణ నుండి వచ్చిన దళిత మిత్రుడు ఉద్యమ గీతాలు పాడటం మొదలుపెట్టాడు. నాజర్ శిష్యులు (అమరావతి) కొంతమంది అద్భుతమైన బుర్రకథను వినిపించారు.

రాజమండ్రి కుర్రాళ్ళు కోలాటాన్ని ప్రదర్శించారు. క్రమంగా వాతావరణం గొప్ప ఉద్వేగ భరితంగా మారింది. పది నిముషాల పాటు నేనూ వేదికపై గడిపాను. నేను పాడిన నాలుగు పాటల్ని జనం గొప్పగా రిసీవ్ చేసుకున్నారు.

సుమారు ఏడుగంటల వేళ 'ఆశా' కుర్రవాడు నన్ను పిలిచాడు. 'మాలతక్క పిలుస్తోంది,' రమ్మని.

''దాసూ! నా అనుమానం నిజమైంది. వాళ్ళు మోహనరావును కొనేశారు. ఇద్దరు ఎం.ఎల్.ఏలు, ఒక మంత్రి ఉదయం నుంచీ ఇక్కడే తిరుగుతున్నారు. నా ఊహ నిజమైతే దళిత సంగ్రామ పార్టీని, ఈ మీటింగులోనే అధికార పార్టీలో విలీనం చెయ్యచ్చు. ఇంకో విషాదవార్త. రాఘవరావుకు అధికార పార్టీ తరపున పోటీ చెయ్యడానికి సీటు ఇచ్చారు.''

కొండమీది నుండి కిందకు తోసివేయబడ్డట్టు, కాళ్ళు అందని పాతాళంలోకి ఎక్కడికో వెళు తున్నట్లూ అనిపించింది.

నేను మళ్ళీ సభా ప్రాంగణంలోకి అడుగుపెట్టేసరికి మీటింగు మొదలుపెట్టారు. పుల్లయ్య (ఐ.ఎ.యస్) ప్రారంభ ఉపన్యాసం యిస్తున్నాడు. వేదికపైన మోహనరావు ఎప్పటిలాగే మీటింగ్‌కు అవసరమైన ఆహార్యంతో ఉన్నాడు. ఎర్రబడ్డ ముఖం. నిప్పులు కురిపించే కళ్ళు.

వరుసగా దళిత ప్రముఖులందరూ మాట్లాడుతున్నారు. కలిచేడు విషయాలకన్నా దళిత సంగ్రామ పార్టీ విషయాలే ఎక్కువగా మాట్లాడుతున్నారు. తాము అధికారంలోకి వస్తే ఏవేం చేస్తామో చెబుతున్నారు. విరక్తిలాంటి నవ్వు వచ్చింది నాకు. ఇంకొద్ది క్షణాల్లో నిముషాల్లో మరణించబోయే పార్టీ గురించి ఎన్నెన్ని గొప్ప వాగ్దానాలు!

మోహనరావు మాట్లాడే సమయం వచ్చింది. నాటకీయమైన ధోరణిలో మొదలుపెట్టాడు ఉపన్యాసం.

''మీ పాదాల కింద ఉన్న నేలను అటూ ఇటూ కెలకండి. అక్కడ తడి ఆరని రక్తపుబొట్లు కనిపిస్తాయి. అవి మన తల్లులవి, తండ్రులవి, అన్నలవి, చెల్లెళ్ళవి... మూడేళ్ళపాటు మనం ఏడ్చాము. చరిత్రలోనే ఇది సుదీర్ఘమైన సంతాపం. ఇక కన్నీళ్ళకు సెలవు యిద్దాం!

''కళ్ళు తుడుచుకొని ధైర్యాన్ని చిక్కబట్టుకొని, ఇంక యుద్ధాన్ని మొదలుపెడదాం.

"మీకు స్పార్టకస్ కథ చెబుతాను. వేల యేళ్ళ క్రితం మనలాగే దుర్భర జీవితాన్ని గడుపుతున్న బానిసల్లో ఎలాంటి విప్లవం తెచ్చాడో చెబుతాను ఆ రోజుల్లో..."

మోహనరావు ఉపన్యాసం కొనసాగుతుండగానే వేదికకు అల్లంత దూరంలో కారు ఒకటి వచ్చి ఆగింది. మంత్రి, అధికార పార్టీకి చెందిన హరిజన మంత్రి, చుట్టూ పోలీసు బందోబస్తు. హడావుడి ఉన్నాయి. మంత్రి నేరుగా వేదికపైకి వచ్చాడు. మోహనరావు ఉపన్యాసం ఆపి ఆయనవైపు ఆహ్వానపూర్వకంగా చూశాడు. మంత్రి హడావుడిగా మైకు దగ్గరకు వచ్చాడు.

"నేను మంత్రి హోదాలో మీ ముందుకు రాలేదు. ఒక హరిజనుడిగా, ఈ పల్లెల్లో పుట్టి, ఇక్కడే ఎదిగినవాడుగా మీ ముందుకు వచ్చాను. హరిజనులందర్నీ ఒక్క తాటిపైకి తెచ్చిన మన మహా నాయకుడు మోహనరావును అభినందించడానికి వచ్చాను.

"నేను ఎక్కువగా మాట్లాడను. ఇది ఎంతగానో దు:ఖించాల్సిన దినం. కలిచేడు దురంతానికి గురయిన సోదరీ సోదరులందరికీ నా సంతాపాలు తెలియజేసుకుంటున్నాను. అయితే మనం ఈ కలిచేడుకు ఒక విధంగా ఋణపడి ఉన్నాము. అంబేద్కర్‌కు దీటైన నాయకుణ్ణి మనకు అందించింది. మోహనరావూ, మీ దళిత సంగ్రామ పార్టీ వర్థిల్లాలని నేను హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.

"అయితే ఒక్కమాట! మోహనరావు సాధించిన విజయం మామూలు విజయం కాదు. ఇవాళ దళిత సంగ్రామ పార్టీ జయజయ నాదాలు ఢిల్లీ పీఠాన్ని సైతం కదిలించాయి. మోహనరావు, మీరూ ఒప్పుకుంటే మోహనరావును ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా నియమించడానికి అధిష్టాన వర్గం ఒప్పుకుంది.

"ఈ సభను నేను రాజకీయం చెయ్యాలని రాలేదు. ఎటూ వచ్చాను కదా అని, పార్టీ నిర్ణయాన్ని మీకు తెలియజేశాను. జై భీమ్!" అంటూ మంత్రి హడావుడిగా వేదిక దిగి వెళ్ళిపోయాడు.

ఒక్కసారిగా ఈడ్చి చెంపపై కొట్టినట్లుగా అనిపించింది. ఎక్కడ నుండి వచ్చాయోగానీ, మోహనరావుకు దండలపై దండలు వేస్తున్నారు. జనంలో వింత అయోమయం!

జరిగిన ద్రోహం తలుచుకుంటే దు:ఖం వస్తోంది. దు:ఖం నుంచీ, ఏదో తెలియనిరాని భయం నుంచీ, కసిలాంటిదేదో లేస్తోంది. 'ఛా! కొడకా!' అంటూ ఎవర్నైనా తిట్టాలనిపిస్తోంది. 'ఒరేయ్,' అంటూ తుప్పున ఉమ్మి వెయ్యాలనిపిస్తోంది. హఠాత్తుగా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అవి ఆగకుండా అలలు అలలుగా కారుతూనే ఉన్నాయి.

చూస్తుండగానే నాలో వింతైన మార్పు. ఇప్పుడు నాలో పొర్లుకొచ్చేది దు:ఖం కాదు. కన్నీళ్ళు కాదు. బహుశా కసి! బహుశా ద్వేషం! మమ్మల్నీ, మా పల్లెల్నీ, మా జాతినీ, మా ఉద్యమాల్నీ, మా చైతన్యాల్నీ మొత్తంగా నాశనం చెయ్యడానికి పూనుకొన్న కొత్త దేవుళ్ళపై నిరసన లాంటి, క్రోధం లాంటి, విద్వేషంలాంటిదేదో భావన. నన్ను నేను మంటగా మార్చుకొని 'అశ్శరభ, అశ్శరభ' అనుకుంటూ అతణ్ణి దగ్ధం చెయ్యాలనే వాంఛ.

నాకంత పెనుసత్తువ ఎక్కడ నుంచి వచ్చిందో తెలియదు. మొలలో దాచుకున్న పిడిబాకును బయటకు లాగి మోహనరావు వైపుకు ఉరికాను. కత్తిని సర్రుమంటూ పొట్టలోకి దించాను. "లంజకొడకా! ఇన్ని లక్షలమందిని సామూహికంగా హత్య చేశావు కదరా! ఇది నీకు తక్కువ శిక్షరా! చావరా లంజకొడకా!" రక్తం జలలాగా చుట్టుపక్కల అంతా చిమ్మింది. నా చేతుల నిండా రక్తం. శరీరం నిండా రక్తం. నా ఇరవైయేళ్ల వయసు నిండా రక్తం మరకలే.

లిప్తపాటులో జరిగిన ఈ సంఘటనకు జనం దిమ్మెరపోయారు. ఇద్దరు ముగ్గురు కార్యకర్తలు నన్ను వెనక్కులాగారు. నేను వాళ్లను విదిలించుకొని, మైకు దగ్గరకు వెళ్లి, "ఈ

లంజకొడుకుని నేను దేవుళ్లా భావించుకొని నెత్తిన పెట్టుకొన్నాను. వీడు 'ఊ' అంటే ప్రాణాలు ఇవ్వడానికి కూడా సిద్ధపడ్డాను." ఆపైన మాట్లాడలేకపొయ్యాను. శరీరం వణికిపోతోంది. ఆగకుండా ఏడుపు వస్తోంది.

'మంత్రి దగ్గర యాభై లక్షలు తిన్నాడ'ంటూ వెనక నుంచి అరిచారు. చూస్తుండగానే ఉన్మాదం లాంటి కోపం జనంలో ఎగిసింది. కత్తిపోటుకు గిలగిలలాడుతున్న మోహనరావు పైకి ఎగబడ్డారు. పైకెత్తి, 'లంజా కొడకా డబ్బు ఎక్కడ దాచావురా!' అంటూ ఫెడేల్మని కొట్టాడు ఒక కార్యకర్త. దెబ్బపైన దెబ్బ స్పృహ తప్పేదాకా కొడుతూనే ఉన్నారు.

'వీణ్ణి తన్ని ఏం లాభం! దీనికంతా మూలం ఆ రాఘవరావుగాడే. ఆడింట్లోనే ఈ కుట్రంతా జరిగింది,'' ఆ ఒక్క మాటతో జనం భగ్గుమన్న అగ్ని సముద్రం అయ్యారు. మహోద్వేగంతో, కార్చిచ్చులా ఉరికారు. రాఘవరావు ఇంటిని వందలకొద్దీ జనం అన్ని వైపుల నుండి చుట్టుముట్టారు.

నేను వాళ్ళతో వెళ్ళలేకపోయ్యాను. అరుపులు, కేకలు వినిపిస్తూనే ఉన్నాయి. పెద్ద పెట్టున మంటలు లేవటం కూడా చూశాను. అప్పటికి బాగా చీకట్లుపడ్డాయి. ఎక్కడో తీతువు కూసినట్లనిపించింది. ఏదో అపశృతి దొర్లినట్లనిపించింది.

అర్థగంట గడిచిందో లేదో, కలిచేడుకు నాలుగువైపుల నుండి డమడమ శబ్దం చేస్తూ పోలీసు జీపులు, వ్యానులు రావటం కనిపించింది. ఏదో చెప్పలేని భయం శరీరమంతా పాకింది. గుండెలు అదిరాయి. ఒక మహా ప్రళయం మొదలైందనిపించింది. పారిపోటానికి కూడా వీలులేనట్లుగా అన్ని వైపుల నుండి పోలీసులు చొచ్చుకు వచ్చారు. వందలు వేలుగా లెక్కకు వీలుకానంత మందిగా ఉన్నారు పోలీసులు. ఎటు చూసినా వాళ్ళే.

ముందుగా ఫట్‌ఫట్‌మన్న చప్పుడు వినిపించింది. 'అమ్మో... అమ్మో...' అనే అరుపులు వినబడ్డాయి. అన్నివైపుల నుండి లాఠీఛార్జీ చేసుకుంటూ వస్తున్నారు. పారిపోగలిగిన వాళ్ళు పారిపో తున్నారు. ముసలివాళ్ళు, ఆడవాళ్ళు, పిల్లలు వాళ్ళ బారిన పడుతున్నారు.

'రాఘవరావును పొలిమేరల దగ్గర నరికివేశారట!' అంటూ దూరంగా ఎవరో పెద్దగా అరిచేరు. ఆ వార్త దావాలనంలా పాకింది. పారిపోతున్న జనం క్షణం పాటు ఆగిపోయారు.

''ముసలివాళ్ళు, ఆడవాళ్ళు 'ఆశ' వైపు పరిగెత్తండి,'' మాలతి కంఠం అది.

'దాసు డైరీ ఇక్కడితో ఆగిపోయింది. దాసు డైరీయేనా దాసు జీవితం కూడా,' మోహనరావు అప్పటి విషయాన్ని గుర్తు తెచ్చుకున్నాడు.

ఆ క్షణం పాటు ఆగటమే ప్రాణాలపైకి తెచ్చింది. 'ధన్, ధన్' గుండెలదిరే చప్పుళ్ళు, మిరుమిట్లు గొలిపే కాంతి. పోలీసులు కాల్పులు మొదలుపెట్టారు. పెను మృత్యువులా నాలుగు వైపుల నుంచి బుల్లెట్లు. వామ్మో! ఓ నాయనో! అయ్యో! ఓ దేవుడా! ఎటు చూసిన అరుపులే. కాళ్ళ కిందపడి ఉన్న శవాల్ని తొక్కుకుంటూ, ప్రాణభీతితో అటూ ఇటూ పరిగెత్తుతూ జనం. ఎన్ని రౌండ్లు కాల్చారో లెక్క కూడా లేదు.

అందరూ పొలాలవైపు గట్లవైపు పరిగెత్తుతుంటే దాసు ఒక్కడే విరక్తిగా, జీవితంపై ఆశ చచ్చిన వాడిలా, నిప్పుల గుండంలోకి నడిచివెళుతున్న వాడిలా పోలీసుల మధ్యకు నడిచాడు. వాళ్లు కర్రలతో విరగబాది, బాయెనెట్లతో కుళ్ళబొడిచినా ప్రవక్తలాగా నిలబడ్డాడు దాసు. గాలిలోకి వెళ్ళవలసిన తుపాకీ గుండు దారి మళ్లి అతని శరీరంలోకి దూసుకెళ్లింది. దాసును వాళ్ళు చంపలేదు. తనను తానే చంపుకున్నాడు.

మోహనరావు మానసిక ప్రపంచంలో వింత ప్రతిస్పందనలు ఎగిశాయి. హఠాత్తుగా దు:ఖం వేసింది. దు:ఖపు పొంగు బయటకు రాకుండా అడ్డుగా ఉన్న హృదయకవాటం ఏదో మెల్లగా

తెరుచుకోవటం మొదలుపెట్టినట్లనిపించింది. కళ్ళలో తడి, 'ఈ తడి కళ్ళదా? మనసుదా?' అని తనలో తాను ప్రశ్నించుకున్నాడు.

బయట ఎండ చండ ప్రచండంగా ఉంది. పిల్లలందరూ నీడ పట్టుకు వెళ్ళినట్లున్నారు. ఎక్కడా అలజడి లేదు. కిటికీల్లోంచి వెచ్చగా వడగాలి.

'దాసూ! దాసూ!' మోహనరావు ఆక్రోశించాడు. లోపలి కవాటాలు పూర్తిగా తెరుచుకున్నాయి. దు:ఖం వరదలైంది. అతనికి దాసు రూపం కళ్ళముందు కదలాడింది. ఇంకా పసితనం వీడని ముఖం. ఎప్పుడూ ఏదో దీర్ఘమైన ఆలోచనల్లో మునిగినట్లుండేవాడు. నిర్మలమైన ఆ కళ్ళు. ఎవరి దు:ఖానికైనా ఇట్టే చలించిపోయే కళ్ళు. ఏవైనా దుర్మార్గాన్ని చూస్తే ఎర్రగా రగిలే కళ్ళు. కంఠం విప్పితే సెలయేటి ప్రవాహంలా ఉండేది. ఉద్రేకాల్ని ఆత్మ నుండి ఆత్మకు రవాణా చేసే శక్తి ఏదో ఆ కంఠంలో యిమిడి ఉందనిపిస్తుంది. 'అయ్యో! దాసూ!' మరోసారి పెద్దగా ఏడ్చాడు.

'ఇన్ని లక్షల మందిని సామూహికంగా హత్య చేశావు కదా! చావరా లంజకొడకా!' ఉలిక్కి పడ్డాడు మోహనరావు. అవి దాసు మాటలు. ఎన్నో నెలల క్రితం అన్నమాటలు. ఇంకా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. 'దాసూ! నన్ను పొడిచినందుకు కాదు. నన్ను అర్థం చేసుకోలేకపోయినందుకు దు:ఖం వేస్తోంది. లంజకొడకా! ఎక్కడ దాచావురా! అంటూ నన్ను కొట్టినందుకు కాదు. డబ్బు దాచాననే అపవాదు నాపై వేసినందుకు దు:ఖం వస్తోంది.'

మోహనరావు దు:ఖిస్తూనే ఉన్నాడు.

"నిజం...నిజం... కావాలి. రహస్యంగా దాచిన నిజం. లోపలి గదుల్లో ఎక్కడో దాచిన నిజం... బయటకి తియ్యి! మోహనా! నిజాలను బంధవిముక్తి చెయ్యి!"

మోహనరావు దు:ఖిస్తూనే ఉన్నాడు.

"మోహనా! మోహనా! గుర్తుందా నీకు...ఆవేళ సాయంకాలం నీ గదిలో నువ్వు సాయంకాలం మీటింగు కోసం ఉపన్యాసం తయారుచేసుకుంటుండగా... గుర్తుంది కదా... పాములాగా నీ గదిలోకి జొరబడిన వాడు... గుర్తుందా... తెల్లని దుస్తుల్లో, తెల్లని నాగుబాములా... మఫ్టీలో ఉన్న పోలీసు అధికారి..."

"వాడేమన్నాడూ?"

"నమస్కారం సార్! బాగా బిజీగా ఉన్నట్లున్నారు. సారీ సర్! క్షమించాలి. మిమ్మల్ని డిస్టర్బ్ చేశాను. సోషల్ వెల్ఫేరు మినిష్టరు దాలయ్యగారు, ఇంకా మనవాళ్ళే ఎమ్మెల్యేలు మీకోసం ఎదురు చూస్తున్నారు సార్!"

"వాళ్ళతో నాకేమిటి పని..."

"నేనేం చెబుతాను సార్! కోన్‌కిస్కాగాణ్ణి. కానీ సార్! మీరు మాత్రం రాక తప్పదు."

మోహనరావు ఇంకా దు:ఖిస్తూనే ఉన్నాడు. ఒక్కొక్క సంఘటనే కళ్ళ ముందు కదలాడు తుంటే పెనుకోపంతో దు:ఖిస్తున్నాడు.

సీజర్ హత్యకు రంగం సిద్ధమైంది. లెజిస్లేటివ్ మెంబర్లు, మంత్రీ, కత్తులతో సహా సిద్ధంగా ఉన్నారు.

మొదటి పోటు పోలీసువాడే పొడిచాడు.

"రాణి అని గుంటూరులో ఒక ఫ్యామిలీ లేడీ ఉండేది. సార్‌కి తెలిసే ఉంటది. కొన్నాళు ళ్ళ మీ పార్టీల్లో పని కూడా చేసింది. దొంగముండ అది చచ్చేది చావకుండా, ఉత్తరం రాసి మరీ

చచ్చింది. చచ్చినవాళ్ళని తిట్టకూడదుగానీ అది పెద్దలంజ సార్! 'మోహన్రావుగారు నాకు కడుపు చేశాడు. పెళ్ళి చేసుకో అంటే జావోరే అన్నాడు. నేను చావడానికి ఆయనే కారణం,' అంటూ రాసి మరీ చచ్చింది. దాని మొగుడో బేవార్సుగాడు. ఆ ఉత్తరాన్ని కాస్తా మావాళ్ళకిచ్చాడు. నేను అప్పటికీ మావాళ్ళతో చెప్పాను. 'సార్ కత్తిలాంటివాడు. ఇలాంటి ముండలెంతమంది వచ్చినా డోంట్ కేర్ అంటాడు. ఆ ఉత్తరాన్ని చింపి అవతల పారేయండి,' అని. వాళ్ళు ఆ, ఊ అన్నారు గానీ ఆ మొగుడు ఊరుకోలేదు. కేసు రిజిస్టరు చేశాడు. ఇలాంటి టైములో దాన్ని బయటకుదీస్తే ఎంత అల్లరో చెప్పండి!''

రెండో పోటు మినిస్టర్ దాలయ్యే పొడిచాడు.

''మోహనరావుగారూ! ఇవాళ రాష్ట్రం మొత్తం మీద గొప్ప పలుకుబడి ఉన్న నాయకుడు మీరే. హరిజనులంతా మీరు ఊ అంటే చాలు నిప్పుల్లో దూకే లాగున్నారు. మీ దెబ్బకు ఢిల్లీ పీఠం కూడా అదిరింది. ఏదో ఒకటి చెయ్యమని నన్ను, మనవాళ్ళని నలుగుర్ని పంపించారు. ఇదుగో ఇటు పక్క డబ్బులున్న సూట్కేసు. దానిపక్కనే మీకు మంత్రి పదవి గ్యారంటీ అంటూ పెద్దాయన యిచ్చిన హామీ. ఇక ఏం చేస్తారో అంతా మీ యిష్టం.''

ఆ రెండు పోట్లకు దిమ్మెరపోయావు కదా! మోహనరావు! అప్పుడు నువ్వేమన్నావు? నీ సహజధోరణిలో, ఉపన్యాసం యిస్తున్నట్లుగా, ''నన్ను ఉద్యమానికి వెన్నుపోటు పొడవమంటారా? ఇంత ఉద్యమం, ఇంత హడావుడి ఇదంతా డబ్బుకోసమేనా? ఈ సభలు, ఈ ప్రభంజనాలు, ఈ నినాదాలు, ఆశలు పెట్టుకొన్న జనం, వీళ్ళకు నేను ద్రోహం చెయ్యలేను. ఇంత క్రూరంగా, ఇంత నిర్లజ్జగా, ఇంత హృదయవిదారకంగా ఇన్ని లక్షలమందిని నేను హత్య చెయ్యలేను,'' అని అన్నావు.

''వాడేమన్నాడూ?''

''అరే, ఆపవయ్యా సోది? ఈ డైలాగులు మీటింగులో జెప్పు. నా దగ్గర కాదు. బొత్తిగా లోక జ్ఞానం లేని ఎర్రి ముఖంలాగా ఉన్నావే? ఎక్కువ తక్కువలు లేకుండా చెప్పినట్లు చెయ్యి. లేకపోతే దాన్నెవతినో రేప్ చేసి చంపావని కేసు బెట్టిస్తాను. ఎక్కువసేపు బతిమాలించుకోమాకు!''

అదే చివరిపోటు!

మోహనరావు ఇంకా దు:ఖిస్తూనే ఉన్నాడు. ఒక్కొక్కటిగా సంగతులన్నీ వెలికి వస్తుంటే, తన పిరికితనాన్ని, తన తెలివి తక్కువతనాన్ని, తను వంచింపబడ్డ తీరును గుర్తు చేసుకొని దు:ఖిస్తున్నాడు.

చాలాసేపు ఏడ్చినాక మోహనరావు ఒక నిశ్చిత నిశ్చితానికి వచ్చాడు.

సంచిలో రేపర్ల మధ్య భద్రంగా చుట్టిన జీవితకథల్ని, దళిత ప్రముఖులకూ, ఎం.పి.లకూ, ఎం.ఎల్.ఏలకూ రాసిన ఉత్తరాల్ని అన్నింటినీ ఒకచోట గుట్టగా వేశాడు. దానిపైన కేశవదాసు డైరీని కూడా వేశాడు.

లైటరు వెలిగించి వాటన్నిటికీ నిప్పు పెట్టాడు. మంటలేచి ఎర్రని జ్వాలలు పైకి లేస్తుంటే వింత ఆనందం అతనిలో ఉప్పొంగింది. క్రమంగా దు:ఖం ఉపశమించింది.

అక్కణ్ణుంచి లేచి, ఎదురుగా ఉన్న మేజాబల్ల దగ్గరకు వెళ్ళి, కాగితం, కలం తీసుకొని, తన జీవితంలో కల్లా అత్యంత ముఖ్యమైన ఉత్తరాన్ని రాయటం మొదలుపెట్టాడు.

''దైవ సమానమైన బాబాసాహెబ్ అంబేద్కర్కు!

“నా మనసులో జరుగుతున్న సంఘర్షణ నీవు చూస్తూనే ఉండి ఉంటావు. నేను ఉద్యమానికి ద్రోహం చేశాను. దళిత చరిత్రలో ఒక బ్రూటస్‌గా నిలిచిపోయాను. నేనిప్పుడు సంజాయిషీలు చెప్పబోవటం లేదు. ఇతరేతర శక్తులేవో నన్ను వెనక్కు లాగాయని మాత్రం విన్నవించుకుంటు న్నాను. అవి కాస్మిక్ శక్తులా, మానసిక శక్తులా, రాజకీయ, సామాజిక శక్తులా అనే మీమాంస ఇప్పుడ నవసరం.

“నన్ను క్షమించు! నాకు ఆలోచన నిచ్చావు. జిజ్ఞాస నిచ్చావు. అద్భుతమైన వాగ్ధాటినిచ్చావు. పోరాటపు బాట నిచ్చావు. నేను మాత్రం నమ్మకద్రోహం చేశాను. నన్నూ, నా జాతినీ, మొత్తం మానవ అస్థిత్వాన్నే వంచించాను.

“ఇప్పుడు కోర్టు మార్షల్ చేస్తున్నాను. నేను జడ్జినై నా నేరాలను నేనే విచారిస్తున్నాను. ఈ న్యాయబద్ధమైన విచారణకు నువ్వే సాక్షి.

“నమ్మకద్రోహం, వంచన ముద్దాయి మోహనరావుపై ఆరోపణలు.

“సాక్ష్యాలు అక్కడ తగలబడుతున్న కేశవదాసు డైరీ, ముద్దాయి పొట్టపై నున్న రెండంగుళాల స్కార్ (కత్తి పోటు గుర్తు)

“విచారణ ముగిసింది. నాకు నేనే మరణశిక్ష విధించుకుంటున్నాను.

“నాకు దు:ఖం వేస్తోంది. కళ్ళవెంట నీళ్ళు వస్తున్నాయి. అయినా సరే శిక్ష అమలు జరిగి తీరుతుంది.

“పోగొట్టుకొన్న జీవితాన్ని మొత్తం మళ్లీ మొదటినుంచీ జీవించాలని ఉంది. కానీ ఆలస్యమై పోయింది.

“శిక్ష అమలు జరిగి తీరాలి.

“భవిష్యత్తులో మరో మోహనరావు, తన వ్యక్తిగత బలహీనతల, పిరికితనాల కారణంగా ఉద్యమాన్ని నీరుగార్చకుండా ఉండడానికి, శిక్ష అమలు జరిగే తీరాలి.

“జైభీమ్!

మోహనరావు. పి”

ఉత్తరాన్ని కవర్లో పెట్టి అతికించి, అడ్రసు కోసం చాలాసేపు ఆలోచించి ఏదో స్ఫురించి నట్లుగా ఉత్తరాన్ని తన చొక్కా జేబులోనే పెట్టుకొన్నాడు.

హాలు మధ్యలో తగలబడుతున్న మంట క్రమంగా చల్లారటం మొదలుపెట్టింది. ఆ మంట లోకి తన సంచిని, అందులోని తన బట్టలను వేశాడు. మంట మళ్లీ ఉజ్వలంగా లేచింది.

లేచి వెళ్ళి తలుపులు గడియవేశాడు. కిటికీలన్నీ మూసివేశాడు.

వంటగదిలోకి వెళ్ళి కిరసనాయలు డబ్బా తెచ్చుకున్నాడు. శరీరం పొడవునా వంపుకోవటం మొదలుపెట్టాడు. ‘జోసఫ్! ఆవేళ కూడా ఇలాగే కదా, ఈ కిరసనాయిలు ఒలికింది. ఇట్లాగే, ఇట్లాగే. కాకుంటే ప్రమాదవశాత్తూ!’ అని అనుకుంటూ మంటవైపు నడిచాడు.

‘జోసఫ్! ఆవేళ కూడా ఇంతే కదా! మంట అధాటున నిన్ను తగులుకొని, క్షణాల్లో శరీర మంతా పాకి... ఇప్పుడు కూడా! ఇప్పుడు కూడా అంతే!’ అనుకుంటూ మంటలోకి దూకేడు.

మంటలు శరీరంపైకి పాకి, భరించలేని బాధతో పెనుకేక వేశాడు. దుర్భరమైన బాధతో అట్లాగే కేకలు వేస్తూనే ఉన్నాడు.

## 9

"There is always a part of man that refers love:

It is the part that wants to die,
It is the part which needs to be forgiven"

మాలతి చెప్పుకుపోతోంది తుప్పు పట్టి బిగుసుకుపోయిన ద్వారాల్ని తెరుస్తున్న ప్రయత్నం. మోహనరావు వింటున్నాడో లేదో అని గమనించటం లేదు మాలతి. తనను తాను కాల్చుకొని వేధించే జ్ఞాపకాల నుండి పారిపోవాలని మోహనరావు చేసిన ప్రయత్నం తరువాత సరిగ్గా పదిహేను రోజుల తరువాత. అదే వేసవి. నిప్పుల గుండంలా ఆకాశం. నిప్పుల్ని తొక్కుకుంటూ నడిచి వస్తున్న సూర్యుడు.

కాలిన శరీర భాగాలకు మందు పూస్తున్నారు ఇద్దరు పిల్లలు. పంకా విసురుతోందో పాప. అతనికి అల్లంతదూరంలో నేలపై కూర్చుని అతని హృదయపు పొరల్లోకి చొరబడాలని మాలతి ఆ ఉదయం నుండీ ప్రయత్నిస్తున్నది.

"అక్కా! అటు చూడు పొగ," అంటూ ఆ రోజు మోజస్ ముందుగా గుర్తుపట్టి, అందర్నీ ఎలర్ట్ చేశాడు. 'ఆశా' పిల్లలందరు భయంతో కేకలు వేస్తూ ఇంటివైపు పరిగెత్తేసరికి, లోపల నుండి మోహనరావు హృదయవిదారకంగా కేకలు వేస్తున్నాడు. తలుపులు, కిటికీలు వేసున్నాయి. తాటాకులతో కప్పిన ఇల్లు. ఏమాత్రం ఆలస్యమయినా బూడిదగా మిగిలేవాడే మోహనరావు. అప్పటికే మాలపల్లి నుండి జనం వచ్చారు. బలిమిన తలుపుల్ని విరగగొట్టి, లోపలికి వెళితే, అక్కడ తగలబడుతున్న కాగితాలు, పుస్తకాల నడుమ, బట్టలకు నిప్పంటుకొని, నిలువెత్తు మంటల్లో కాలిపోతూ మోహనరావు. అతనిపై ఇసుక చల్లి, నీళ్ళు చల్లి, గోనెపట్టాను చుట్టి ఎట్లాగయితేనేం మంటల్ని ఆర్పగలిగేరు. ముఖం, కాళ్ళు, చేతులు కాలి, బొబ్బలెక్కి వికృతంగా ఉన్నాడు. బండిలో వేసుకొని అప్పటికప్పుడు గుంటూరు తీసుకెళ్లారు.

కాలిన గాయాలకు చికిత్స అయిపోయినాక అతన్ని సైకియాట్రిస్టుకు చూపించింది మాలతి. అయిదు ఎలక్ట్రిక్ షాక్‌లు (ఇ.సి.టి) యిచ్చి, నెలరోజులకు అవసరమైన మందులు రాసిచ్చాడాయన. మళ్ళీ కలిచేడుకు 'ఆశా'కు తీసుకువచ్చారు.

అతన్ని ఎలాగైనా జీవితంలోకి తిరిగి తీసుకురావాలనే ప్రయత్నం మాలతిది.

"ఈ పిల్లల్ని చూడు. తల్లులు, తండ్రులు కళ్ళముందే పాశవికంగా చంపబడ్డారు. వాళ్ళ కళ్ళముందే తలలుగా, మొండాలుగా నరకబడ్డారు. వీళ్ళకన్నా గొప్పదా నీ దు:ఖం? ఎంత దు:ఖం, ఎన్ని కన్నీళ్ళు, మనసు పట్టనంత విషాదం ఎన్నున్నా, మళ్ళీ చిగర్చటం జీవ లక్షణం.

"మనందరిలో కాసిని లోపాలు, మరికాసిని సుగుణాలు, ఎంతో స్వార్థం, కించిత్ త్యాగం ఉంటాయి. అన్నిటి కలబోతే మనిషి. దేనికి దాన్ని విడివిడిగా చూసుకొని 'అయ్యో ఇంత స్వార్థం, ఇంత కుత్సితం ఉందే నాలో,' అని కించపడటం సరికాదు. మనం జీసస్ క్రైస్ట్‌లాగో, గౌతముబుద్ధుడి లాగో లేమని దు:ఖపడి ప్రాణత్యాగం చేసుకుంటే ఎలా? ఒక కాన్సెప్ట్ లాగానో, ఒక ఉటోపియా లాగానో జీవితం ఎలా ఉంటుంది? జీవితానికి దాని పరిమితులు, హద్దులు ఉన్నాయి. వేలయేళ్ల అణచివేత, పుట్టుకతోటి ఒక స్టిగ్మాని వెంట తెచ్చుకొన్న మనకు ఈ పరిమితులు మరీ ఎక్కువ.

"మనపై అణచివేత సామాజికమైనదే కాదు. మానసికమైంది కూడా. మానసికంగా మనల్ని దుర్బలుల్ని చేసే అణచివేత. మనల్ని మనం తప్పు పట్టుకుంటూ, మనల్ని మనం నిందించుకుంటూ, మనల్ని మనం కోర్ట్ మార్షల్ చేసుకొంటూ, చివరకు మనల్ని మనమే చంపుకుంటూ ఇదంతా ఒక విషవలయం. మనదికాని ఒక పరాయి సంస్కృతిని మనకు అంటగట్టి వాడిలాగో, వీడిలాగో

ఉండాలని శాసించే ఈ ప్రక్రియను మనం ఎదిరించాలి. మనదంటూ ఓ సంస్కృతి, మనదంటూ ఓ వ్యక్తిత్వం ఆవిష్కరింపబడాలి.

"ఇవాళ మనం చేసే ఉద్యమాలు, ఒక్కసారిగా దళితుడి కోసం స్వర్గాన్ని కిందకు దించుతామని కాదు. మానసికమైన హింస నుండి, అణిచివేత నుండీ బయటపడి ఒక జాగృతిని, ఒక స్థిర చిత్తాన్ని దళితుడిలో ఏర్పరచటం, ఈ ఉద్యమాల ద్వారా సాధ్యమవుతుంది. తనను అణచివేస్తున్న శక్తుల్లో యాభైశాతం తన మనసులోనే పుట్టాయన్న నిజాన్ని, సగటు దళితుడికి అర్థం అయ్యేలా చెప్పగలిగితే మన పోరాటాల లక్ష్యం నెరవేరినట్లే.

"ఇన్ని తెలిసీ, ఇంత అధ్యయనం చేసీ నువ్వు కూడా ఈ ఉచ్చులో పడిపోవటం ఎంత విషాదం!

"సరే, జరిగిందేమో జరిగిపోయింది. నీలో మళ్ళీ ఒక పునర్నిర్మాణం జరగాలి. మనసును తవ్వి అస్థిపంజరాల్ని బయటకు తీసే కార్యక్రమం కాదు నువ్వు చెయ్యాల్సింది. నాలుగు ఆశయాల విత్తనాలు చల్లి, మళ్ళీ మనసునో పూలతోటను చేసుకో!"

మోహనరావు శ్రద్ధగా ఆ మాటల్ని వింటున్నాడు. అవి మెదడులోకి ప్రవేశిస్తున్నాయి గానీ, నిర్ణయాలు తీసుకునే లోపలి భాగాల్లోకి చొరబడగలుగుతున్నాయా అని సందేహంగా ఉందతనికి. అతని ఆలోచనల చుట్టూ దట్టమైన మంచుపొర ఏదో కమ్మినట్లుగా ఉంది.

బయట తీవ్రమైన ఎండ. నిప్పులేని మంట. ప్రపంచాన్ని భస్మీపటలం చేసే ఒక క్రోధనేత్రం.

ఈ పిల్లలూ, ఈ మాలతి ఈ చిన్న చిన్న ఒయాసిస్సులే పాటి? వీళ్ళను దాటుకొని అలా ఎండలోకి వెళ్ళగలిగితే, నిప్పుల కత్తులు  శరీరాన్ని తూట్లు  పొడుస్తాయేమో? భయంభయంగా ఉంది. మళ్లీ తను జీవితంలోకి, నాలుగు రోడ్ల చౌరస్తాల్లోకి, మనుషుల్లోకి వెళ్ళగలడా?

'మనం క్రీస్తులాగో, బుద్ధుడిలాగో కాక మామూలు మనుషుల్లా  ఉందాం,' అంటుంది మాలతి. ఎవరి తప్పులకో ఆయన శిలువ ఎక్కాడు. మరి నా తప్పులకు ఎవరు శిలువ ఎక్కుతారు? మాలతినా? అవును మాలతే. ప్రస్తుతం శిలువ మీదే ఉంది. జైళ్ళలో, కుట్రకేసుల్లో, కోర్టుల్లో, విచారణల్లో... అవును మాలతే నా క్రీస్తు!

మోహన్రావు హఠాత్తుగా లేచి, మంచం దిగి, మాలతివైపు నడిచి రెప్పపాటులో కిందకి వంగి ఆమె పాదాలకు నమస్కరించాడు.

"నాకు మళ్ళీ జీవించాలని ఉంది. నా పాపాలను నువ్వు స్వీకరిస్తావా?" అన్నాడు దీనంగా ముఖం పెట్టి.

కొంచెం కంగారుపడినా, వెంటనే తేరుకొని, "మానవుడే మన దేవుడు. మనిషే మన రక్షకుడు. వాళ్ళకే నీ పాపాలు నివేదించుకో!" అంది.

చాలాసేపు అట్లాగే ఆమె పాదాల దగ్గర గడిపాడు మోహనరావు. అతనిలోపల ఒక తుఫాను చెలరేగుతున్నట్లు అర్థమైంది మాలతికి. అతని ఉన్మాదం, అతని వ్యాధి కొట్టుకుపోయే తుఫాను యిది. ఈ సంచలనం కాస్త ఇబ్బందికరమే అయినా అతని మానసిక ఆరోగ్యానికిదో పాజిటివ్ సైన్ అనుకుంది మాలతి.

"నాకు కాసిన్ని కాగితాలు, కలం కావాలి!" అన్నాడు మోహనరావు.

"కొన్నాళ్లు పోనీ, కుడిచెయ్యి చాలా భాగం కాలిపోయింది. ఆ గాయం తగ్గేవరకూ రాయటం సాధ్యం కాదు."

"సరే!" అంటూ నిట్టూర్చి మళ్ళీ మంచం దగ్గరకు వెళ్ళాడు. ఆ పూటకు వెయ్యాల్సిన బిళ్ళలు వేసి, అన్నం తినిపించి నిద్రపోయేవరకూ అక్కడే ఉంది. నిద్రపోయాక అతనిపై పల్చటి దుప్పటి కప్పి, ఇద్దరు పిల్లల్ని అక్కడే ఉండమని చెప్పి వెళ్ళిపోయింది.

చాలారోజుల తరువాత సుఖమైన నిద్ర కలిగింది మోహనరావుకు. నిద్రలో అందమైన కలలు వచ్చాయి. పూలతోటలు, తెల్లని కొంగలు, సన్నని వానతుంపరలు, గుట్టలు గుట్టలుగా పరిచిన చామంతి పూలు, పాలు ప్రవహించే పిల్ల కాలువలు, ధాన్యపు కల్లాలు పరిచిన ఆకాశం, రెక్కలు మొలిచిన మానవుడు, ఉరితాళ్ళకు వేలాడుతున్న పాములు, పెద్దపులులు, సింహాలు, పాలరాతితో కట్టిన దేవాలయాలు, దేవాలయంలో విగ్రహం బదులు మాలతి కూర్చోవటం నిద్రలేచిన తరువాత కూడా ఆ కలలన్నీ అతనికి గుర్తు వస్తున్నాయి.

చాలా రోజుల తరువాత, అతనికెంతో హాయిగా, సుఖంగా ఉంది. ఈ ఆనందాన్ని సుఖాన్ని గురించి ఎవరికైనా చెప్పాలనిపించింది.

సాయంకాలం ఆరు దాటినట్లుంది. చల్లగా హాయిగా వీస్తోంది గాలి. ఇంట్లోంచి బయటకు వచ్చి గడపపై కూర్చుంటే సాయంకాలపు వాతావరణం, గొప్ప పెయింటింగ్‌లా ఉంది. దూరంగా ఆడుకుంటూ అల్లరి చేస్తున్న పిల్లలు. పొలాల నుండి తిరిగి వస్తున్న కూలీలు. చెట్ల గుబుర్లలోకి తిరిగి వస్తున్న పక్షులు. గుయ్, గుయ్ మంటూ ఆ పక్షుల అరుపులు. ఒక సామూహిక కేరింతలా ఉంది. ఆనందం చిప్పిలజేసే బృందగానంలా ఉంది. ఆకాశం నిర్మలంగా, అందంగా గొప్ప కవితను రాయడానికి ముందు కవి హృదయంలా ఉంది.

ఆ సాయంకాలం మోహనరావుకు గొప్ప పరవశాన్ని కలిగించింది.

"నాకు స్నానం చెయ్యాలని ఉంది," అంటూ పక్కనున్న పాపను అడిగేడు.

"ఈ కట్టు, వీటితో సాన్నం చెయ్యటం సాధ్యం కాదు. వేడినీళ్ళతో ఒళ్ళు తుడవనా?" ఆ పాప అడిగింది.

తడిగుడ్డతో ఆ పాప ఒళ్లు తుడుస్తుంటే గొప్ప ఓదార్పుగా ఉంది మోహనరావుకు. "నిన్ను 'అమ్మా' అని పిలవనా?" అడిగాడు ఆ పాపను.

ఆ పాప సన్నగా నవ్వి "నన్ను 'మేరీ' అని పిలవండి," అంది.

"మేరీ అన్నా అమ్మే కదా! నిన్ను అమ్మా అని పిలుస్తాను," అన్నాడు స్థిరంగా. "అమ్మా! సంచిలోంచి మంచి బట్టల జత ఒకటి తెచ్చి పెట్టు," అన్నాడు.

కొత్త బట్టలు వేసుకొని, క్రాఫ్ దువ్వుకొని, సహకరించని శరీరానికి ఊతంగా ఒక కర్రను ఆధారంగా ఉంచుకొని, "రా అమ్మా! అట్లా పల్లెదాకా వెళ్ళి వద్దాం!" అన్నాడు.

సాయంకాలం, కొద్దికొద్దిగా చీకట్లు పడుతున్న వేళ, వీధి దీపాలు వెలిగి, వీధి పొడవునా కాంతి వెదజల్లబడి వీధిలోని మనుషులు మిలమిలా మెరుస్తున్నారు.

సాయంకాలం పనుల నుండి తిరిగి వచ్చి, స్నానాలు చేసి ఆటవిడుపు కోసం అట్లా రోడ్డు మీదకు వచ్చారు జనం. టీస్టాల్ ముందు ఓ పదిమందీ అటువైపు రచ్చబండ లాంటి ఖాళీ ప్రదేశంలో మరో పదిమందీ కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వీధి మధ్యలోనే పిల్లలందరూ మూగి ఆటలు ఆడుతున్నారు. ఇళ్ళలో తల్లులకు వంటలో సాయం చేస్తున్న ఆడపిల్లలు, అప్పుడప్పుడు బయటకు వచ్చి, ఆడుకునే పిల్లల వైపు అసూయగా చూస్తున్నారు.

'నేను ఊహించిన దు:ఖం, విషాదం ఇక్కడ కనబడటం లేదే,' అని మోహనరావు విస్తుబోయాడు.

'సంఘటనల శవాల్ని ఎదురుగా పెట్టుకొని రోజుల తరబడి రోదించం. సంఘటనలను ఖననం చేసి మళ్లీ జీవితపు ప్రవాహంలోకి దూకుతాం! అదే జీవిత ధర్మం!' మాలతి మాటలు మరో సారి గుండెల్లో మారుమోగాయి.

రచ్చబండ దగ్గర పది పదిహేనుమంది కూర్చుని ఉన్నారు. కాస్త చదువుకున్న కుర్రవాడొకడు వాళ్ళకు పేపరు చదివి వినిపిస్తున్నాడు. మోహనరావును చూడగానే అక్కడ కాసేపు నిశ్శబ్దం ఏర్పడింది. ఈ మోహనరావు వాళ్ళు ఇదివరకు చూసిన మోహనరావు కాదు. శరీరమంతా కాలి వికృతంగా ఉన్నాడు. (వాళ్ళు కాస్త శ్రద్ధగా గమనిస్తే మోహనరావు ముఖంలో ఇదివరకు లేని తేజస్సు, ప్రశాంతత కనపడి ఉండేవి) .

వీధిలో అక్కడా ఇక్కడా నిలబడి ఉన్న జనం మెల్లగా మోహనరావు నిలబడ్డ వైపుకు వచ్చారు. వాళ్ళకింకా రెండు వారాల క్రితం జరిగిన సంఘటనే మనసులో కదలాడుతోంది. నెత్తురు చిమ్ముకుంటూ నేలపై కూలిపోయిన మోహనరావు రూపం కళ్ళలో కదలాడింది. జాలిగా, సాను భూతిగా ఆయనవైపు కదిలారు. ఇళ్ళలో ఉన్న ఆడవాళ్ళూ, పిల్లలూ మెల్లగా అక్కడికి కదిలి వచ్చారు.

మోహనరావు వాళ్ళవైపు చిరునవ్వు నవ్వి, "చిన్న మీటింగు పెట్టుకోవటం సాధ్యమవు తుందా? ఎక్కువసేపు పట్టదు. ఒక్క పది నిముషాలు చాలు!" అన్నాడు అభ్యర్థనగా.

ఎవ్వరూ ఏం మాట్లాడలేదు. మెల్లమెల్లగా అక్కడో చిన్న సమూహం ఏర్పడింది. దాదాపు వందకుపైనే ఉన్నారు వాళ్ళు. పక్కనే ఉన్న అరుగులాంటి ప్రదేశాన్ని ఎక్కి, అందరివైపు సాలోచనగా చూసి రెండు చేతులు జోడించి నమస్కరించాడు.

"మిమ్మల్ని అమ్మా అనో, నాయనా అనో పిలవాలనుంది. నా ఈడువాళ్ళను అన్నా అనో, అక్కా అనో వరసలు కలుపుకొని ఆత్మీయంగా పలకరించాలని ఉంది. అందరికీ వినబడాలని ఇట్లా అరుగు ఎక్కి మాట్లాడుతున్నానుగానీ, నిజానికి మీ దగ్గరకు వచ్చి, మీ చేతుల్ని దగ్గరకు తీసుకొని, కళ్ళనీళ్ళతో ఓ అమ్మకో, అయ్యకో బిడ్డ తన బాధనంతా చెప్పుకున్నట్లు, మీకు నా మనసులో ఉన్నదంతా చెప్పాలని నా ఆశ," జనం ఆశ్చర్యంగా, విస్మయంగా వినడం మొదలుపెట్టారు.

"మీ ముందు దీనంగా చేతులు జోడించి మీకు నా పాపాల్ని, తప్పుల్ని తెలియజేసు కుంటున్నాను. 'తప్పుడు నా కొడకా!' అంటూ నన్ను కొట్టి శిక్షిస్తారో, అయిపోయిందేదో అయిపో యిందని నన్ను క్షమించి మీలోకి చేర్చుకుంటారో, అంతా మీకే వదిలేస్తున్నాను.

"చర్చిల్లో ఫాదరీల దగ్గర మన బాధల్ని, సంగతుల్ని చెప్పుకుంటామే అట్లా ఇవాళ నా సంగతు లన్నీ మీ ముందుంచుతున్నాను. ఫాదరీలు మీరే, జడ్జీలు మీరే.

"ఇట్లాంటి పల్లెలోనే ముప్ఫయి ఏడేళ్ళ క్రితం నేను పుట్టాను. మీ అందరిలాగే ఈ అంటరాని బతుకు తాలూకు బాధల్ని అనుభవించాను. మా నాయన నా చిన్నతనంలోనే చనిపోయాడు. నిప్పుల్లో తగలబడుతుంటే, 'వాడినెట్టా అంటుకుంటాం!' అంటూ మా నాయన నిలువునా తగలబడుతుంటే నిలువుగుడ్లతో చూసి ఆనందించారు ఆసాములు. మా యమ్మ, నేనూ గుండెలు బాదుకుంటూ ఏడ్చినాము. చావంటే తెలియని వయసులో అట్లా నిలువునా తగలబడి చావటాన్ని చూశాను. నిన్న మొన్నటి దాకా నా కలల్లో తగలబడుతున్న శవాలే కనబడేయి.

"నన్ను వెట్టికి కుదరమని మా యమ్మ పోరింది. నాకు చదువుకోవాలని బెమగా ఉండేది. 'చదువుకుంటూ కూర్చుంటే ఎట్టాగయ్యా! జరుగుబాటు ఎట్టా కుదిరిద్ది,' అనేది మాయమ్మ. 'మీరు

చదువకోవాల్రా! చదువుకుని పైకి రావాలి. చదువుకుంటేనే ప్రపంచం తెలిసేది. ఇట్లా చదువుకోబట్టే అంబేద్కరు అంత గొప్పవాడయ్యాడు. నువ్వు తెగించి ఊ అంటే మిగతాది నేను చూసుకుంటా!' అని జేమ్సు అనే ఫాదరీ నన్ను గుంటూరు తీసుకెళ్ళాడు. పది దాకా ఆయనే చదువు చెప్పించాడు.

"కాలేజీలోకి చేరినాక కొత్త విషయాలెన్నో తెలిశాయి. హరిజనులనే మాట అక్కడే విన్నాను. రిజర్వేషన్ల సంగతి, స్కాలర్‌షిప్పుల సంగతి అక్కడే తెలిసింది. 'కోటా నా కొడుకుల్రోయి!' అంటూ అవమానిస్తారనే సంగతి కూడా అక్కడే తెలిసింది. అక్కడే అంబేద్కర్ని గురించి చదువుకున్నాను. ఆ మహానుభావుడు ఎన్ని పోరాటాలు చేశాడో చదువుకున్నాను.

"వెలుగుపాలెంలో టీచరుగా ఉద్యోగంలో చేరాను. కాస్త చదువుకొని, ఆలోచించే పిల్లను చూసుకొని పెళ్ళి కూడా చేసుకున్నాను. పల్లెలకు పోయి, అది చెయ్యాలి ఇది చెయ్యాలనే ఉబలాటం ఉండేది.

"పిల్లల్ని చదివించండయ్యా! చదువుకుంటే గాని మన బతుకులు బాగుపడవయ్యా అంటూ పల్లెలకు పోయి మన జనాలకు చెప్పేవాణ్ణి. మళ్ళీ అదే ప్రశ్న! పాతికేళ్ళనాడు మా అమ్మ వేసిన ప్రశ్నే! చదువులంటూ కూర్చుంటే జరుగుబాటు ఎట్లా? అని. ఇంటి దగ్గర చిన్న పిల్లల్ని సాకేదెవురు? పొలాల్లో ఆ పనికని, ఈ పనికని చేతికింద అదరువుగా ఉండెదెవురు? అంటూ ప్రశ్నించేవాళ్ళు. సాయంకాలాలు చదువు చెప్పటం మొదలుపెట్టాను. పల్లెలో కొత్త వాతావరణం. సొసైటీలని, సంఘాలనీ పెట్టుకున్నాము. కనీసం కూలిరేట్ల గురించి, గవర్నమెంటు చేసిన చట్టాల్ని గురించి చెప్పాను. కూలీరేట్లు పెంచమని హడావుడి చేశాము.

"అప్పుడే ఆ వూరి ప్రెసిడెంటుతో గొడవైంది. 'ఈ లంజాకొడుకు వచ్చినాకే ఊరిట్లా నాశనమైందం'టూ లేచి నా పైకి ఉరికాడు. అందరి ముందు నన్ను ఫెడేల్ ఫెడేల్‌మని కొట్టాడు. ఆ మరుసటి రోజు మనవాళ్ళు పనుల్లోకి వెళ్ళలేదు. వరికోతల సమయం. రేట్లు పెంచమని, నాకు క్షమాపణ చెప్పమని డిమాండ్ చేశారు. రేట్లయితే పెంచారు. కానీ ఆ రాత్రి సర్పంచ్ లంజాకొడుకు, పదిమంది గూండాల్ని ఏసుకొని నా యింటిపైకి వచ్చాడు. నా భార్యను బలిమిన చెరిచాడు.

"అక్కడే నేను మొదటి పొరపాటు చేశాను. ఎదురుతిరిగి తాడోపేడో తేల్చుకొని ఉండాల్సింది. పిరికోడిలా ఊరు విడిచి పారిపొయ్యాను. ధైర్యంగా ఎదిరించి ఉంటే కథ మరోలా ఉండేది.

"నమ్ముకున్న ఆడది పుట్టెడు దు:ఖంతో, వాళ్ళ అబ్బా అమ్మా దగ్గరకు పోయింది. ఆ యమ్మి తప్పేమీ లేదు. ధైర్యం చేసి, 'జరిగిందేదో జరిగిపోయింది. రా! మళ్ళీ కలిసి ఉందాం,' అని ఆ మనిషిని వెనక్కు తెచ్చుకోలేకపోయాను.

"అంతటితో ఆ వూరు ముచ్చట అయిపోయింది. ఎట్లాగైనా ఈ జనాల్ని ఒక దగ్గరకు తీసుకు రావాలని తిరిగాను. డాక్టర్లు, ఇంజనీర్లు, కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, ఒక్కళ్ళేమిటి మనలో కాస్త చదువు సంధ్యలు ఉన్నాయనుకున్న వాళ్ళందరి దగ్గరకు వెళ్ళాను. ఎపుడు చూసినా, 'ఇప్పుడు టైం కాదు. మనోళ్ళలో ఇంకా చైతన్యం రాలేదు,' అంటూ మొండి చెయ్యి చూపించేవాళ్ళే."

"ఇట్లా కాదనుకున్నాను. కుర్రోళ్ళని కదిలించాను. వాళ్ళు అగ్గిఫోర్సులా భగభగమంటున్నారు. సరైన నాయకుడు దొరికితే మొత్తం లోకాన్ని తగలబెట్టే లాగున్నారు. విజయవాడలో ఇంజినీరింగ్ కుర్రవాడు, మనవాడే ఆత్మహత్య చేసుకొన్నాడు. దానిమీదనే మొదటిసారిగా ఉద్యమాన్ని చేశాను. నా చుట్టూ జనం పెరిగారు. ఏ మీటింగు పెట్టినా వేలల్లో జనం రావటం మొదలుపెట్టారు. మీటింగులపై మీటింగులు. నా చుట్టూ మందీ మార్బలం?

"ఈ జనాన్ని చూసి, నేను వెర్రెక్కిపోయాను. అవమానాల చరిత్రలన్నీ మర్చిపొయ్యాను. గొప్ప శక్తులేవో ఉన్నవాడిలా భావించుకోవటం మొదలుపెట్టాను.

"కలిచేడు కిరాతకంతో పల్లెలన్నీ భగ్గుమంటున్నాయి. ఆ సెంటిమెంటును పట్టుకొని మీటింగులన్నిటిలో ఆ విషయం మీదే మాట్లాడేవాణ్ణి.

"ఇంతలో ఎలక్షన్లు వచ్చాయి. నా మీటింగులకు వచ్చే జనమంతా రెపరెపలాడే బ్యాలెట్ పేపర్లలా కనబడటం మొదలుపెట్టారు.

"ఆదర్శాలు గంగలో కలిశాయి. పదవి, అధికారం తాలూకు మత్తు కళ్ళచుట్టూ మందపు పొరల్లాగా పేరుకుపోయింది. జనం చేత పొగిడించుకోవటంలో సుఖం అలవాటయింది. కార్యకర్తల్లో ఆడవాళ్ళను బలిమిన పక్కల్లోకి లాక్కునే నీచపు పనులెన్నో చేశాను. అన్నింటికంటే డబ్బు, డబ్బుల గలగలలు నన్ను పిచ్చిలోకి, వ్యామోహంలోకి పడవేశాయి. కోటేసు అనే కుర్రవాణ్ణి డబ్బు కాజేశాడనే అనుమానంతో చిత్రహింసలు చేస్తే వాడు ప్రాణాలు పోయే స్థితిదాకా వచ్చాడు.

"నేనింకా చాలా పాపాలు చేశాను. డబ్బు, అధికారం తెచ్చిపెట్టే చాలా జబ్బులు యివని ఇప్పుడర్థమవుతోంది. డబ్బు రావటం మొదలుపెడితే కులాల హద్దులన్నీ చెరిగిపోయి సరికొత్త 'డబ్బు' కులం అనేది వస్తుందని నాకిప్పుడు తెలిసి వచ్చింది.

"కలిచేడు మీటింగును ఎలక్షన్లలో డ్రామాలాగానే ఏర్పాటుచేశాను. అయితే అధికారంలో ఉన్నవాడు ఈ డ్రామాలన్నీ చూస్తూ ఉండాడనే విషయాన్ని మర్చిపోయేను. రాజకీయపు ఆటలు ఎన్నో ఆడినవాళ్ళకి మోహనరావు ఒక లెక్కా! నా చరిత్ర అంతా బయటకు తీశారు. నేను పాడు చేసిన ఆడవాళ్ళ సంగతి బయటకు తీసేసరికి నేనే బెంబేలెత్తాను."

"నేను బెదిరిపోయిన ఒక్కక్షణం చాలు. ఆ తరువాత డ్రామా అంతా వాడే నడిపించాడు.

"అయితే నేను ముందే చెప్పినట్లు మన కుర్రాళ్ళే మనకు నిజమైన నాయకులు. 'లంజా కొడకా! జనాన్ని ముంచుతావురా,' అంటూ దాసు నన్ను పొడిచి పారేశాడు.

"ఇంత జరిగినాక కూడా నేనింకా బతికి ఉండటమే వింత! నా పాపాలకు శిక్ష అన్నట్లుగా మనసు చెదిరిపోయి పిచ్చివాణ్ణయ్యాను. అదిగో ఆ మహాతల్లి, వయసు చిన్నదైనా చెయ్యెత్తి దండం పెట్టుకోవాలి. మాలతమ్మ పూనుకొని, నన్ను మళ్ళీ మనుషుల్లోకి తెచ్చింది.

"మాలతిలాంటివాళ్ళు మనకు ఆశ. వందలాది మోహనరావులకన్నా ఒక్క మాలతి గొప్ప!"

అక్కడిదాకా చెప్పి, ఆగేడు మోహనరావు. ఇంకా చెప్పడానికేం లేనట్లు అరుగు దిగాడు. మోహనరావు ఈ చివరి ఘట్టాన్ని గురించి చాలా ఊహించుకున్నాడు. చిట్టచివరికొచ్చేసరికి తనలో దు:ఖం పొంగుకొస్తుందని, వాళ్ళముందు దీనాతిదీనంగా ఏడవాల్సి వస్తుందని అనుకున్నాడు.

చిత్రంగా అతనికి దు:ఖంలాంటిదేమీ కనబడలేదు. పైగా ఒక వింతయిన తేలికదనం మనసునంతా నింపింది. క్రమంగా అది ఉల్లాసంగా ప్రశాంతంగా మారింది.

*సుప్రభాతం పక్షపత్రిక*
*ఆగస్టు 5 - డిసెంబర్ 20, 1997*

నేపథ్యం

*దళిత అస్తిత్వ పోరాటం*

## మోహనా! మోహనా!

***కథలోని భౌతిక నేపథ్యంతో పాఠకుడు ఐడెంటిఫై కాగలిగితేనే ఒక వాస్తవికమైన చిత్తరువును సృష్టించగలం! అట్లాగే కథలోని దుఃఖాన్ని, ఆర్తిని పాఠకుడు అనుభవించి పలవరించినపుడే అది ఇంపాక్ట్ కలిగించే డాక్యుమెంటు అవుతుంది. కథ వాతావరణానికి, పాత్రలకు పాఠకుడితో దగ్గరితనం పెరగాలి! ఆ దగ్గరితనంలోంచి గాఢత వస్తుంది.***

సు దీర్ఘకాలంగా అనుభవంలో ఉన్న బాధలోంచి రూపుదిద్దుకొంది మోహనా! మోహనా! కలిచేడు అనే ఇమాజినరీ ప్లేస్‌లో దళితులపై జరిగిన కౄరమైన దాడి ఈ కథకు కేంద్ర బిందువు.

ఈ కథ విస్తృతమైనదే కాక తనను తాను రిపీట్ చేసుకొనే ఒక బాధాస్వప్నం. కథాంశం, సంఘటనలు, పాత్రలు కూడా ఈ రిపిటీషన్‌కు గురి అవుతాయి. కథ పొడవునా మోహనరావు అనే దళిత ఉద్యమ నాయకుడు తటస్థపడతాడు. అతని దుఃఖం, అతని అవమానం, అతని పోరాటం, అతని మానసిక మరణం, అతని జ్ఞాపకాల శవం పదేపదే కథలో ఎదురవుతాయి. కేశవదాసు డైరీ అనే ఒక మృతుడి వీలునామా 'ఘోస్ట్' లాగా పాఠకుణ్ణి వెంటాడుతుంది. మాలతి అనే అమ్మాయి, ఆమె ఫిలాసఫీ- ఓవర్ రొమాంటిసైజ్ చేయబడి జానపద కథల్లో నాయికలాగా తటస్థపడు తుంది కథలో.

ఈ రిపిటీషన్ తప్పనిసరి అవసరంగా నేను సమర్థించుకొన్నాను. ఈ పునరా వృత్త దోషం- చరిత్రదీ, మనుషులదీ, మానవ సంబంధాలదీ కూడా! ఒక అనాగరిక, ఆటవిక సామాజిక హింస పునరావృత్తం అవుతున్నంతకాలం అనుభవాల సామాన్యీ కరణం తప్పనిసరి! ఒక 'డి-జావూ' ఫీలింగ్ క్రియేట్ చెయ్యక తప్పదు. కథ ప్రోగ్రెస్

అవుతున్నట్లే ఉంటుంది కానీ, మొదటి పేరా వందోసారో, వెయ్యోసారో ఎదురవుతూనే ఉంటుంది కథలో.

కథల్లో నేను వాస్తవ వాదాన్ని ఇష్టపడతాను. అయితే ఒక గాయాన్ని, అవమానాన్ని, ఒక పశ్చాత్తాప గాథను చెప్పవలసి వచ్చినపుడు పూర్తి డాక్యుమెంటేషన్ కాక- రవంత 'సర్రియల్ టచ్' కూడా అవసరమవుతుంది.

మోహనరావు మానసిక ఛిద్రం అనేది ఒక సర్రియల్ ట్రాప్. మోహనరావు పొడవాటి 'అనకొండ.' ఒక శిరస్సు నరికి వేసినా రెండో వైపు నుండి ప్రాకగలడు. తెగిన శిరస్సును అంతటా ప్రదర్శించి, ఒక మార్టైర్‌లాగా ఫోజు పెట్టగలడు. ఈ మోహనరావు, అతని మాస్క్ కోసం రచనలోని శైలి, శిల్పం వినియోగింపబడ్డాయి. కథకు అవసరంలేని కాంప్లెక్సిటీ ఏర్పాటు చెయ్యబడింది. మోహనరావు ఒక నిజం. చాలా యేళ్ళుగా మనల్ని, మన ఉద్యమాల్ని అంటిపెట్టుకొన్న మిస్టిక్ ఫోర్స్ ఈ మోహనరావు. వీళ్ళను ఎక్స్‌పోజ్ చెయ్యాలనే కథ పొడవునా నేను తపనపడ్డాను. ఇంతా చేస్తే కథ చివర్లో మోహనరావు మరణశిక్ష తప్పించుకొన్నాడు. సంస్కరణవాదపు కొత్త చర్మాన్ని కప్పుకొని మళ్ళీ మనవైపు ప్రయాణిస్తున్నాడు.

కథలోని భౌతిక నేపథ్యంతో పాఠకుడు ఐడెంటిఫై కాగలిగితేనే ఒక వాస్తవికమైన చిత్తరువును సృష్టించగలం! అట్లాగే కథలోని దుఃఖాన్ని, ఆర్తిని పాఠకుడు అనుభవించి పలవరించినపుడే అది ఇంపాక్ట్ కలిగించే డాక్యుమెంటు అవుతుంది. కథ వాతావరణానికి, పాత్రలకు పాఠకుడితో దగ్గరితనం పెరగాలి! ఆ దగ్గరితనంలోంచి గాఢత వస్తుంది. సులువుగా పోలికలు గుర్తుపట్టగలిగే మోహనరావు పాత్రను అందుకే ఎంచుకొన్నాను. ప్రదేశాలు, సంఘటనలు కూడా తెలిసినవే! పాఠకుడు కథను ఫోర్‌కాస్ట్ చెయ్యడానికి ప్రయత్నిస్తాడు. ఈ ఫార్వర్డ్ ట్రాప్ ద్వారానే పాఠకుడు కథలోకి అబ్జార్బ్ అవుతాడు. నిజానికి మోహనరావు ఒకడు కాదు. మిక్స్‌డ్ బ్రీడ్! పాలిజెన్! అతన్ని గుర్తుపట్టడం అనే పజిల్ ద్వారా పాఠకుణ్ణి ఎట్రాక్ట్ చేసి, అతని బహురూపతను, చావులేనితనాన్ని తెలియ జేయటమే కథలోని ప్రధాన లక్ష్యం.

*మోహనా! మోహనా!* గురించి గుడిపాటి, ప్రతాపరెడ్డి అనే విమర్శకులు వార్తలో చిన్న సమీక్ష చేశారు. అందులో కథలోని శైలి, శిల్పం వీపు నిమురుతూనే, థీమ్‌లోని భావజాలాన్ని నిరసించారు. మాలతి అనే అమ్మాయి వైపుకు కథను, పాత్రలను, దళిత ఉద్యమాన్ని నడిపించానని వాళ్ళ ఆరోపణ!

కథలపైనా, సమీక్షలపైనా చివరి తీర్పునిచ్చేది పాఠకులు, కాలం. కాబట్టి ఆ సమీక్ష గురించి ప్రస్తావించను! కానీ ఈ మాలతి గురించి కొంచెం వివరంగా చెబుతాను.

నాకో మాలతి తెలుసు! ఉద్యమాలు ముమ్మరంగా ఉన్న రోజులవి. అప్పటికి పోస్ట్-మోడర్‌నిజం (తెలుగులో) పుట్టలేదు.

నువ్వు, నేనూ, మనం
దళిత జీవనంలోని దుఃఖపు పాటనే
పాడాల్సి ఉంటుంది-
అతణ్ణి తెలుసుకోడానికే కాదు
నిన్ను నీవు తెలుసుకోడానికి కూడా-

అని స్థిరంగా నమ్మే ఈ మాలతి, ఒక లా స్టూడెంటు. చీరాల దగ్గర కారంచేడులో దళితుల పై జరిగిన నరమేధం జాతిని, రాజకీయాల్ని, కళాకారుల్ని- ఎంతగానో డిస్టర్బ్ చేసింది. దళిత

యువతీయువకుల్లో, చైతన్యపు విద్యుత్ ప్రసారం జరిగింది ఆ సమయంలో. ఫుల్‌టైమ్ వర్కర్లుగా చీరాల పరిసరాల్లో నెలల తరబడి పనిచేశారు. అట్లాంటి కార్యకర్త మాలతి. భారత సమాజంలో కులాల ఇంపాక్ట్‌ని అంతగా విశ్లేషించుకోని కాలం అది. మాలతి సమాజాన్ని రెండు వర్గాలుగానే విభజించుకొనేది. అయితే దళిత చైతన్యాన్ని కూడా గాఢంగా విశ్వసించే అమ్మాయి. అందుకనే నాకు తెలిసిన ఈ మాలతిని కథలోని మాలతికి నమూనాగా తీసుకొన్నాను.

సంవత్సర కాలపు కారంచేడు విషాదం- తరువాత, అదేరోజున జరిగిన సంస్మరణ సభకు, అక్కడ జరిగిన పెయింటింగ్ ఎగ్జిబిషన్‌కు నేను వెళ్ళాను. ఆ ఎగ్జిబిషన్ నన్ను ఎంతగానో డిస్టర్బ్ చేసింది. ఒక్కొక్క బొమ్మ, ఒక రక్తమోడ్చే గాయం! కన్నీటి కథ! ఒక ఆక్రోశం! బొమ్మల్లోంచి మనుషులు బయటకు వచ్చి అవాల్టి నెత్తుటిగాథను వినిపించినట్టుగా తోచింది.

*మోహనా! మోహనా!* కథను చెప్పడానికి ఈ ఎగ్జిబిషన్‌లోని పెయింటింగ్ టెక్నిక్‌నే నేను ఎంచుకొన్నాను. 'సంఘటనల ఎగ్జిబిషన్'లా కథ రూపొందాలని నా ఆలోచన. అయితే నేను కథ రాసిన కాలం 95-96ల మధ్య. అప్పటికి దళిత ఉద్యమం మొలకలెత్తుతున్న కాలం. బహు జన ఉద్యమాలు దేశమంతా విస్తృతమవుతున్న కాలం. రాజకీయాల్లో దళిత శక్తిగా బలంగా, సమాంతరంగా ఎదుగుతున్న కాలం. ఈ ఉద్యమం గొడుగు కింద 'రీహెబిలిటేషన్' పొందాలని ఎంతోమంది మాజీలు, అవకాశవాదులు ప్రయత్నిస్తున్న కాలం. ఈ అవకాశవాదుల గురించి బహు పరాక్ చెప్పాల్సిన అవసరం ఉంది. అందుకే ఈ కథ '95లో ఎలక్షన్లు అయిపోయిన సమయంలో మొదలై వెనక్కు నడుస్తుంది. పైన చెప్పిన 'సంఘటనల ఎగ్జిబిషన్'లాగా కాక 'ఉద్వేగాల పెరేడ్'గా కథను మార్చవలసి వచ్చింది.

మళ్ళీ మాలతి గురించి మాట్లాడుకొందాం. గుడిపాటి మిత్రులు ఊహించినట్లే, ఈ మాలతి ఉద్యమానికి చెందిన అమ్మాయి! అయితే ఆ అమ్మాయి పాత్రను కేవలం 'దళిత మిలిటెంటు'గానే స్వీకరించాను.

నేనెరిగిన మాలతి, ఒకసారి తీవ్రమైన అనారోగ్యంతో ఉండి వైద్యం కోసం నా దగ్గరికి వచ్చింది. అప్పుడే ఆమె డైరీని చదివే అవకాశం కలిగింది. ఈ మాలతి చిన్న చిన్న కవితలు, కథలు రాసేది. ఆమె డైరీలోని ఒక వాక్యం నన్ను ఎంతగానో విస్మయపరిచింది.

'రాజకీయ సిద్ధాంత చర్చ కన్నా కవిత్వం రాయడంలోనే నాకు పరిపూర్ణ స్వేచ్ఛానుభవం కలుగుతుంది,' అని. ఆ మాటలే ఆ డైరీని పూర్తిగా చదవడానికి ఇన్‌స్పైర్ చేశాయి.

మోహనరావు పాత్రకు పోలికలు ఆ డైరీలోనే దొరికాయి. అయితే ఈ మోహనరావు ఒకడు కాదు. చాలామంది వ్యక్తుల కలబోత. రకరకాల పేర్లతో, వివరణలతో మాలతి డైరీలో పొందు పరచిన మూర్తులన్నిటిని ఒకటిగా కుదించి- దానికి కథాకాలపు రాజకీయ పోకడల రంగులద్ది- తీర్చిదిద్దిన పాత్ర ఈ మోహనరావు.

మాలతి డైరీలోనే ఒకచోట ఒక ప్రముఖ దళిత నాయకుడి గురించి రాసుకొన్న మాటలు- "అతను పెరిగిన వాతావరణం అతనిపై ద్వేషాన్ని, విషాన్ని చూపింది. అతని మానసికావస్థ నిలకడ గా ఉండదు! అతనిలో వైరుధ్యాలు ఎక్కువ! చాలా అపశృతులున్న పాటలా- అతని అవకాశ వాదం, అతను చెప్పే సరికొత్త ఈస్థటిక్స్, అతని కనపడని ఆశలు, స్వార్థం- ఇట్లాంటి ధోరణుల్ని ద్వేషించాలా, సంస్కరించాలా లేదా పూర్తిగా ఖండించాలా అనేది ప్రధానమైన చర్చ మాలో..." (ఇంగ్లీషు నుంచి అనువాదం).

ఈ వాక్యాలే మోహనరావు పాత్రను రూపొందించడానికి నాకు ఆధారమైంది.

"నేను దళిత ఉద్యమానికి ద్రోహం చేశానని అనడానికి ఎంత ధైర్యం వీళ్ళకు..." అనే మాటలతో కథ మొదలవుతుంది. కథకుడు వాతావరణాన్ని చెప్పే పద్ధతిని విడనాడాను. ముందు చెప్పినట్టు ఈ కథ ఒక రిపిటీషన్. పాఠకులకు తెలిసిన సంఘటనలను మళ్ళీ చెబుతున్నాను. అందుకే వాతావరణాన్ని పెయింట్ చెయ్యకుండా కథను మొదలుపెట్టాను. మోహనరావు డిస్టర్బ్‌డ్ మైండ్‌లోంచి కథను చెప్పాను. అతని ఉద్వేగ-ఉద్రేకాలు, ఆశ-నిరాశలు, అతని దుఃఖం, క్రోధం, వాంఛలు- అతని స్వరంలోంచి చెప్పించాలని ప్రయత్నం. ఒక సైకోస్టడీలోకి పాఠకుణ్ణి ప్రవేశపెట్టాలని నా ప్రయత్నం. అట్లా కాకపోతే, నేను రాసింది వ్యాసంలాగో, వార్తాకథనంలాగో తోచే ప్రమాదం ఉంది.

"నేను దళిత ఉద్యమానికి ద్రోహం..." అంటూ స్వగతంలో తర్కించుకొంటున్న మోహనరావుకు, తనలోని వైరుధ్యాలు, తన 'హాలోనెస్' తెలుసు. అయితే తగలబడ్డ రంగస్థలంపై మళ్ళీ రిహార్సల్ చేస్తానంటున్న నటుడు ఈ మోహనరావు. గతాన్ని మరిచినట్టే ప్రవర్తిస్తాడు. కాని దాదాపుగా గతంలోనే జీవిస్తాడు. ఒక ఎనస్థీషియా లాంటి సూడో బాధానివారణిని ఎడాప్ట్ చేసుకొంటాడు. గతాన్ని మళ్ళీ రిక్రియేట్ చెయ్యాలనే తపన ఈ ఎనస్థీషియా. అతను మానసిక ఛిద్రంలోకి ప్రయాణిస్తూ మధ్యమధ్యలో జ్ఞాపకాల మబ్బులు కమ్మినప్పుడు, ఒక దుఃఖం, ఒక ఆవేశం ఎగిసి రావడం, ఒక చిరపరిచితమైన ఆశ్చర్యం- ప్రదర్శించడం అంతా ఒక స్కిల్ గేమ్!

మోహనరావు బాల్యం, తండ్రి దుర్మరణం, వివాహం, భార్యపై సామూహిక అత్యాచారం, గుంటూరు రావడం, పాదయాత్రలు, విజయవాడ ఇంజనీరింగ్ విద్యార్థి మరణంపై ఉద్యమం- అతను హీరోగా ప్రొజెక్టు అయ్యే ఒక ప్రమాదం రాకుండా కూడా ఈ మోనోలాగ్, మానసిక స్థితి నుంచి కథను చెప్పటం అనే టెక్నిక్ ఉపకరించింది.

ఇమాజినరీ గ్రామం కలిచేడు. అందులోకి మోహనరావు పునఃప్రయాణం. కథ మొదటి నుండీ ఈ కలిచేడు మాట వినబడుతుంది. అది క్రమంగా గ్రామంగా కాకుండా 'ఎమోషనల్ ఎంబాడిమెంట్'కు గుర్తుగా మిగిలిపోతుంది. ఈ కలిచేడు రక్తమోడ్చే గాయంగానే కాకుండా దళిత పోరాటాలకు ఈ మెటాఫర్‌గా చెప్పాలని ప్రయత్నం. ఈ కలిచేడుకు ఒక వ్యక్తిత్వం కల్పించాలని ప్రయత్నం. చాలాసార్లు దానిని తన దేవాలయంగా చెప్పుకుంటాడు మోహనరావు.

ఈ కథకు ప్రొటగనిస్ట్ కేశవదాసు. ఈ పాత్రకు ఎక్కడా మోడల్ లేదు. కారంచేడు సంఘటనల తరువాత, నాలో పొంగిన ఉద్వేగాల నుండి రూపు తీసుకొందీ పాత్ర.

అయితే విచిత్రంగా ఈ కథ సీరియల్‌గా వస్తున్న రోజుల్లో గుంటూరులో ఒక యువకుడు నన్ను కలిశాడు. "కథలోని కేశవదాసు నేనే. మీరు చెప్పే మోహనరావు పాత్ర కూడా నాకు తెలుసు. అతన్ని ఆరాధించిన ఆవేశపు క్షణాలు, అతని ఆక్రోశం, దుఃఖం, అతని నమ్మకద్రోహం అతి దగ్గరగా చూసినవాణ్ణి! కథలోలాగా అతన్ని నరికివేద్దామని ప్రయత్నం చేసినవాడిని కూడా," అంటూ అతను చెబుతుంటే ఆశ్చర్యపోయాను.

కథ చివరలో మోహనరావు తనపైకి కిరోసిన్ చల్లుకొని, తగులబెట్టుకొని చనిపోవడానికి ప్రయత్నిస్తాడు. అయితే కథ అక్కడితో ముగియలేదు. అట్లా ఆ పాత్రను అక్కడితో చంపివేయనందుకు నాతో చాలాసేపు పోట్లాడాడు ఆ యువకుడు.

ఈ పోలికలు నాకు మొదట్లో ఆశ్చర్యమనిపించినా, తరువాత తరువాత అందులో పెద్ద ఆశ్చర్యం లేదనిపించింది.

ఒకానొక సోషల్‌టైమ్‌లో- ఒకే సామాజిక ఉద్వేగానికి లోనైన ఒకే ఏజ్ గ్రూప్ మనుషుల్లోని ప్రవర్తన, దాదాపు ఒకలాగే ఉంటుంది!

కేశవదాసు కథంతా డైరీ రూపంలో పాఠకుడికి పరిచయం అవుతుంది. ఈ డైరీ టెక్నిక్ చాలా రిస్కీ టెక్నిక్. కథలోంచి డైరీలోకి, డైరీలోంచి కథలోకి ప్రయాణించడం. పాఠకుడికి టీజింగ్ లాగా ఉంటుంది. నెరేటివ్ స్పీడ్ తగ్గుతుంది. డైరీలోని పాత్రలకు వివరణలు ఉండవు. కలల్లోని పాత్రల్లా ఇట్లా వచ్చి అట్లా వెళ్ళిపోతాయి.

అయితే ఈ టెక్నిక్ ద్వారా నేను సాధించదల్చుకొన్నది- ఒకటి ఒక దుఃఖాన్ని పాఠకుడికి రిపిటీటివ్‌గా ఇంజక్ట్ చెయ్యటం, రెండు- చిరపరిచితమైన సంఘటనని, అందులో ఇన్వాల్వ్ అయిన వ్యక్తుల ద్వారా చెప్పిస్తున్నాననే భ్రాంతిని కలిగించటం, మూడోది- కథకుడి ఇంటర్‌ఫియరెన్స్‌ని చాలావరకు తగ్గిస్తున్నాననే భ్రమను పాఠకుడికి కలిగిస్తూ ప్రొటగనిస్ట్‌ని ప్రాజెక్టు చెయ్యటం, నాలుగోది- కథ నిడివిని తగ్గించటము.

మాలతి, మోహనరావు, కేశవదాసు అనే మూడు పాత్రల్ని సృష్టించుకొని కథను మొదలు పెట్టిన తరువాత- కేశవదాసు నాకు తెలియకుండానే నా ఆత్మకు దగ్గరైనాడు. పాత్రలపై కథకుడు మోజు పెంచుకొంటూ పోతే, కథ వన్ సైడెడ్‌గా మారిపోయే ప్రమాదం ఉంది. అందుకే తప్పనిసరిగా మరో పాత్రను కథలోకి తీసుకురావాల్సి వచ్చింది. ఆ పాత్ర కలిచేడు. ఒక ఇనానిమేట్ పాత్ర! ఒక స్థలం! గ్రామం! ఈ ప్రయత్నంలో కథ ముందు నుంచీ ఆ ఊరికి రక్తమాంసాలు, ఉద్వేగాలు ఉన్నట్లుగా ఒక ఎమోషనల్ టచ్ ఇవ్వాల్సి వచ్చింది. క్రమంగా పాత్రలు, సంఘటనలు కలిచేడు చేరతాయి. కథ మొదలు, ముగింపు కలిచేడులోనే జరుగుతుంది. కలిచేడుకు ఒక ఫ్లాష్‌బ్యాక్ ఉంది. కథ కొనసాగింపు కూడా అక్కడే జరుగుతుంది.

కలిచేడు ఒక మెటాఫర్- ఇవాల్టి దళిత ఉద్యమాలకు ప్రతీక. వందలాది కేశవదాసుల రక్తంతో ఎర్రనైన ఉద్వేగభూమి! మాలతి, మోహనరావులు భిన్న ధోరణులకు ప్రతినిధులు! దళిత ఉద్యమం ప్రయాణం ఇప్పుడే మొదలైందన్న సూచనతో కథ ముగించాను. 'అనుసరించాల్సిన వ్యూహాలు, సిద్ధాంత రచనలు కాలానికి వదిలివేద్దాము!' అనే 'లో అర్థం' కూడా ఉంది.

అట్లాగే ఉద్యమాలకు ద్రోహం చేసి, ఉద్యమాల నిచ్చెనలతో అధికారం కలలు కనే మోహనరావులను శిక్షించాల్సింది, లేదా క్షమించాల్సింది కలిచేడేనని (దళిత ఉద్యమమేనని) సూచనగా చెప్పాను.

సంస్కరణవాదంపై నాకు పెద్దగా భ్రమలు లేవు. నిజానికి నా గుడిపాటి మిత్రులలాగే, నాకూ మోహనరావును చంపాలనే కసి ఉంది. అట్లా చేస్తే రచయితగా నేను ఇంటర్‌ఫియర్ అయినట్లే!

అందుకే అతని శిక్షా, సంస్కరణలకు ఇమాజినరీ తాత్త్విక భూమి అయిన కలిచేడుకే వదిలేశాను.

*12 ఏప్రిల్ 1998*

29

# హోమం

## డా॥ వి.ఆర్. రాసాని



**డా॥ వి.ఆర్. రాసాని** 1957 ఏప్రిల్ 19న చిత్తూరు జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ మధురక్షణం 1977లో సాహితీకల్పన కథాసంకలనంలో అచ్చయ్యింది. ఆరు నవలలు, మూడు నాటకాలు, రెండు పరిశోధనా గ్రంథాలు, ఒక కథాసంపుటి ప్రచురించారు. రంగస్థల నటుడిగా మంచి గుర్తింపు పొందిన రాసాని అధ్యాపక వృత్తిలో ఉన్నారు.

**చిరునామా**

16-ఇ/17, 5బి, బాలాజీ రెసిడెన్సీ,
మునిరెడ్డి నగర్, తిరుపతి-517 502
Ph: 98484 43610

చీకటి తెరల్ని చీల్చుకుని, తూర్పు కొండల్ని ఎర్రబరుస్తూ, చిదిమిన టమోటా పండులా, ఆకాశంలోకి ఎగబ్రాకుతూ ఎర్రగా పుట్టుకొస్తున్నాడు సూర్యుడు. ఆ రవి కిరణాలకు దీటుగా... అక్కడి ప్రజల గుండె మంటలతో పోటీపడుతూ నడివీధిలో, నింగికెగసిన ఎర్రటి మంటలు...

అక్కడ ఉరుముతూ యువకుల డప్పుల శబ్దం...

దానికి శ్రుతి కలుపుతూ... దిక్కులు పిక్కటిల్లేలా కొమ్ముల గర్జన! అక్కడ... డప్పులు పగిలిపోయేలా అదే పనిగా వాయిస్తూ కొందరు...

వాళ్ల మధ్యన నిలబడి కొమ్ముల్ని ఆకాశానికి గురిపెట్టి వాయిస్తూ మరికొందరు! అక్కడ యువకుల ఆవేశం... ఆ ఆవేశంలో ఎగురుతున్న అడుగుల చప్పుడు!

మామూలుగా ప్రారంభమైన ఆ శబ్దం క్రమంగా పెరిగింది. దిక్కులు పిక్కటిల్లేలా హోరెత్తిపోసాగింది.

"ఇంక ఆపండ్రా!" గట్టిగా అరిచాడు సిన్నాయుడు. ఆ మాటతో నిశ్శబ్దం!

గాలీ వానా వెలిసినంత ప్రశాంతత!

వాయిద్యాలు వాయించడం ఆపేసినవాళ్లు ఆయా సంతో రొప్పుతున్నారు. చుట్టూ మూగి ఉన్న జనాలు ఆ దృశ్యాన్నే చూస్తున్నారు.

''ఒరేయ్! మీ మీ పలకలు, డుములులు, కొమ్ములు అన్నీ వరసగా ఈ అగ్గిలో ఏసెయ్యండ్రా కాలిపోనీ, కాలిపోయి మాడి మశానమైపోనీ... యేసెయ్యండి.''

తన చేతిలోని డప్పును విసిరి మంటల్లో గిరాటువేసి మరీ అన్నాడు సిన్రాయుడు.

''ఏసెయ్యండ్రా! ఒగటి కూడా మిగలకుండా ఏసెయ్యండి,'' తన డప్పునూ మంటల కాహుతి సేస్తూ ఆవేశంగా అన్నాడు నల్లన్న.

''ఏం చేసినా మన రెక్కల కష్టం పోదు. ఈ విద్యలు మనకొద్దు. కాల్చేయండి!'' తన డుములును మంటల్లో వేసి అన్నాడు బద్దె గురవయ్య.

అందరి హృదయాల్లోనూ ఏదో బాధ! కసాయివాడి కత్తిలా కోస్తోంది.

''అవున్రా! ఈట్ని వాయించేదాంట్లో మనం మొనగోల్లే కావచ్చు. కానీ ఏం లాభం? ఇవి లేకపోయినా మనం బతకొచ్చు.''

మంటల్లో పడి చిటపటమని శబ్దం చేసుకుంటూ కాలిపోతున్న వాద్యాల్ని చూసి గంభీరంగా అన్నాడు మరో వ్యక్తి బాలయ్య.

వాటిని చూస్తుంటే... కొన్ని వేల సంవత్సరాల నుంచీ వంశానుగతంగా సంక్రమిస్తున్న గుప్తనిధి ఏదో మంటల్లో పడి కాలిపోతున్నట్టు వాళ్ల హృదయాలు బాధతో మూలుగుతున్నాయి.

వాళ్లకి దేశంలోని కులాలు, అంటరానితనాలు, అంతరాలు, అన్ని రోజుల తమ అవమానాలు, అవహేళనలు అన్నీ ఆ అగ్గిలోనే పడి కాలి బూడిదైపోతున్నట్టు అనిపించసాగింది.

*

''పెద్ద చెరువు కోలుపోయిందిరా సిన్రాయుడూ, నువ్వింకా ఈడనే కూసున్నావా?'' వగర్చు కుంటూ వచ్చి ఆత్రంగా చెప్పాడు బాలయ్య.

ఆ వార్త ఆశనిపాతంలా వినిపించింది సిన్రాయుడికి.

''ఒరే పెద్ద చెరువు కోలుపోయిందంట!''

ఇద్దరు పిల్లలు అదే మాటలు పలుసార్లు అరచి అరచి చెప్పుకుంటూ వీధిలో పరిగెత్తారు.

ఆ వార్త మొరవ పల్లెలోని గడప గడపను తాకింది. గుండె గుండెను స్పృశించింది. ఆ వార్తతో పల్లె ప్రతిధ్వనించింది. పల్లె ప్రజలంతా నడివీధిలో చేరిపోయారు.

పెద్ద చెరువు!!

వాళ్ల తాపం తీర్చే చెరువు! వాళ్ల దప్పిక తీర్చే చెరువు!! అది అలసిన వాళ్ల గుండెల్ని చల్లబరిచే చెరువు! ఎన్నో తరాల నుంచి ఆ పల్లెను ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్న చెరువు.

ఆ చెరువు కొల్లబోయిన మరునాటి నుంచి వాళ్లకి నీటికి కరువే. చేసుకునే కూలీనాలీ వదిలేసి రెండు మూడు మైళ్లు వెళ్లి నీళ్లు తెచ్చుకోవడంతోనే సరిపోతుంది. చుట్టుప్రక్కల ఎన్ని సేద్యపు బావులున్నా రైతులు వాటిలో నీళ్లు తీసుకుపోనియ్యరు. కడుపునిండా నీళ్లు తాగితే ఆ రోజు వాళ్లకు పండుగే. మరి అలాటి స్థితిలో చెరువు కొల్లబోయిందంటే, మరి వాళ్ల దప్పిక తీరేదెలా?

అందుకే వాళ్ల గుండెల్లో ఏదో తెలియని బాధ. ఏదో మహా సంగ్రామంలో క్షతగాత్రులై మిగిలిపోయిన సైనికుల్లా నిస్సహాయస్థితిలో వాళ్లు...

ఆరోజు ఏ పనులూ లేనట్లుంది. అందరూ ఇళ్ల దగ్గరే ఉన్నారు. ''ఒరే! రండ్రా, సెరువు కాడికి పోదాం.''

పైకి లేచి పై గుడ్డ విదిలించి భుజాన వేసుకుంటూ అన్నాడు సిన్రాయుడు.

''ఈ యేళకే అంతా అయిపూడిసింటుంది. ఇంక మనం బొయ్యి ఏం జేస్తాంరా?'' అనుమానం వ్యక్తం చేశాడు నల్లన్న.

“జేసేదేమీ లేకపోయినా యిదేమని అడగదాం!”

“అవున్రా మనం ఇన్ని దినాలూ అట్ల అడక్కనే ఇట్లయినాం. అది మిట్టూరోళ్లకేమీ పట్టాకాదు. ఆఁ”

“సరే, పదండి పోదాం. నిగ్గదీసి అడగదాం.”

ఆ ఊరి యువకులంతా అలా మాట్లాడుకుని ఒక నిర్ణయానికి వచ్చారు. పెద్ద చెరువు వైపు దారితీశారు.

ఆ ఊరి పేరు మొరవపల్లె అయినా దాన్ని ఆ పేరుతో ఎవ్వరూ పిలవడం లేదు.

అగ్రకులాల వాళ్లు నివసిస్తున్న ‘మిట్టూరు’ను బట్టి, దాన్ని మిట్టూరు దళితవాడగానే పిలుస్తున్నారు. ఆ దళితవాడ సుమారు యాభై జనవాసాలు కలిగిన పల్లె. మిట్టూరోళ్లు కాళ్లతో చెప్పిన ప్రతి పనినీ తలతో చేసి పెట్టేదీవాడ జనాల అలవాటు. మిట్టూరు రైతులకు చెప్పులు, కపిలబానలు కుట్టిచ్చేదీ సేద్యపు పనులు చేసేదీ అన్నీ వీళ్లే. దళితవాడలో పొయ్యి రాజుకోవాలంటే మిట్టూరోళ్లకు కూలిపనులు చేసిపెట్టాల్సిందే, లేకుంటే పస్తులే.

ఆ ఊరికింత వరకూ కరెంటే కాదు, తాగడానికి నీళ్లబావి కూడా లేదు. వచ్చిన ప్రతి మంత్రికీ, రాజకీయ నాయకుడికీ విన్నవించుకుంటూనే ఉన్నారు. ఎందరో అధికారులకీ, అనధి కారులకీ అర్జీలు పెట్టుకుంటూనే ఉన్నారు. కానీ ప్రయోజనం లేకపోయింది. స్వయంగా బావి తవ్వించుకోవడానికీ, లేదా బోరింగ్ వేసుకోవడానికీ వాళ్లకి స్తోమత లేదు. అందరివీ అందీ అందని బతుకులే. చాలీచాలని జీవనాలే. కూటికే జరగనప్పుడు ఇక బావినెలా తవ్వుకుంటారు?

వాళ్లకి వేరే మార్గమే తోచలేదు. వాళ్లకి చెరువే గతయింది. పోనీ అందులోనైనా, సంవత్సరం పొడుగునా నీళ్లుంటాయా అంటే అదీలేదు.

ఈ గడ్డపైకి పిలవకనే వచ్చే ముఖ్యఅతిథి కరువే. తలవకనే వచ్చిపడేవి కక్షలు, కార్పణ్యాలే.

ఎప్పుడయినా వర్షం పడి పొరబాటున ఆ చెరువులోకి ఆరునెలలకు సరిపడే నీళ్లొస్తే, ఆ పైన ఆరేండ్లు వర్షపుచినుకే రాలదు. ఆ నీళ్లయినా కడవరకూ ఉంటాయా అంటే బెల్లంముక్కను చీమలు పీకిపీకి తిన్నట్లు దానిమీద పడి రైతులు మళ్లకు నీళ్లను తిప్పి తిప్పి అయిపేస్తారు.

ఎన్నో ఏండ్లుగా ఈ నీటి అవస్థ పడీపడీ వాళ్ల నెమ్ములిరిగిపోయాయి. వాళ్ల మనసులు అలసిపోయాయి.

అందుకే పెద్ద చెరువు కొల్లబోయిందంటే, మొరవపల్లెకు బాధ, మిట్టూరుకు మాత్రం ఆనందం.

నిజానికి వాళ్లు ఇంకా రెండు నెలల వరకూ ఆగవచ్చు. అంతమాత్రాన ఆ చెరువులోని చేపలకెలాంటి నష్టమూ లేదు. కానీ ముందుగానే చెరువులోకి దిగేశారు.

మామూలుగానే, ఆ చెరువు పోరంబోకు. సర్పంచయిన కొండ్రెడ్డి ఆధీనంలోనే ఉంది. ఆ చెరువులో చేపలు పట్టుకోవాలన్నా, నీళ్లు వాడుకోవాలన్నా అతని అనుమతి ఉండాల్సిందే. దాని మంచి సెబ్బరలు అతనే చేస్తున్నాడు.

ప్రెసిడెంట్ ఓబం కింద తిరిపెంగా వచ్చే చేపల కోసం జీతగాళ్లతో, ఆ మూడు రోజులూ అక్కడే ఉంటున్నాడు. అతన్ని కలుసుకోవాలని మొరవపల్లె వాళ్లు పెద్ద చెరువు వైపు బయలు దేరారు. కొద్ది క్షణాల్లోనే వాళ్లు అక్కడికి చేరుకున్నారు.

అక్కడ... అంతా కోలాహలంగా ఉంది. మిట్టూరోళ్లేగాక, చుట్టుప్రక్కలున్న వాళ్లు వచ్చేశారు. చేపల వేటలో మునిగిపోయారు. చెరువంతా రద్దీగా తిరుగుతున్నారు. వయోభేదం లేకుండా,

అందరూ చెరువులో దిగి చేపలు పడుతున్నారు. ఆడవాళ్లు తమ చీరల్ని, పావడాల్ని గోచీలుగా చెక్కి రంగంలోకి దిగారు. కొందరు పిల్లలు చెడ్డీలతోనే పొర్లాడుతున్నారు. వాళ్లు, ఆవేళ బురదలో పొర్లాడుతున్న వింత జంతువులే అయ్యారు. కొడిమెలు, తడికెలు, సింగితాలు, వలలు, వెదురు బుట్టలు, తట్టలు నీళ్లలో మునిగి తేలుతున్నాయి. ఊదులు చెరువంతా నడుస్తూ కొరదల వేటలో పడ్డాయి. అన్ని పరికరాలతో పట్టిపట్టి చేపల్ని గట్టున పోస్తున్నారు. గట్టు పైనున్న వాళ్లు వాటిని ఏరి ఏరి తమ పాత్రల్లో తట్టల్లో భద్రపరచుకుంటున్నారు.

కొరమేన్లు, కొరదలు, ఎల్లికొరదలు, ఇసక దంతులు, గెండెలు, పక్కెలు, జెల్లలు, తేలు చేపలు, ఉలసలు, సొరచేపలు- ఒకటేమిటి దొరికిన వాటిని దొరికినట్లు పట్టేస్తున్నారు. విచ్చలవిడిగా, బహు స్వేచ్ఛగా పట్టేస్తున్నారు. కసి కసిగా, పట్టుదలగా తొక్కి తొక్కి పట్టేస్తున్నారు.

చెరువునీళ్లు వాళ్ల అడుగుల తొక్కిళ్లతో బురద బురదగా తయారై, ఆ బురదతో నీళ్లు చిక్కబడుతున్నాయి. అలా చిక్కబడే కొద్దీ చేపలు పట్టడం సులభమవుతోంది. వాళ్ల కాళ్లు మోకాటి వరకు బురదలో కూరుకుపోయి కనిపిస్తున్నాయి.

గట్టు నున్న చెట్ల మీద కాకులు, గుడ్డి కొంగలు, బెల్లబాయిలు చేపల కోసం కాచుకుని కూచున్నాయి. చేపలవేటలో మనుషులతో పోటీ పడలేక ఆత్రంగా, మౌనంగా చూస్తున్నాయి.

ఆ చెరువును చూస్తుంటే మొరవపల్లె వాళ్లకు ఆవేళ తమ కోసం నిండుగా వడ్డించుకోగా, ఉన్నట్టుండి ఊరకుక్కలు జొరబడి చీల్చి చిందరవందర చేస్తున్న అన్నపు విస్తరిలా అనిపించ సాగింది.

''అమ్మా! అన్ని పక్కిలియ్యి తల్లీ!''

''సామే! వొగపూటకు పులుసుకన్నా రెండు ఉలసపిల్లలియ్యి దేవరా!''

''మా నాలికా అట్లకారం చేయండి సాములూ, మీ పేరు సెప్పుకోని తింటాం.''

మొరవపల్లె నుంచి వచ్చిన కొందరు స్త్రీలు, పిల్లలు దూరం నుంచే చేపల్ని అడుక్కుంటు న్నారు.

''ఓయ్! దూరంగా పోండి, పోండి,'' అంటూ అగ్రకులాలవాళ్లు కొందరు గదమాయిస్తు న్నారు.

చెరువుకట్ట పైన కొండ్రెడ్డి, ఒక రాతిపైన కూర్చుని, సిగరెట్టు దమ్ము లాగుతూ చెరువును చూస్తున్నారు. అతని ప్రక్కనే రెండు వెదురు తట్టలు తిరిపెం చేపలతో నిండుతున్నాయి. కొండ్రెడ్డి జీతగాడు వెంకటముని అక్కడే నిలబడి చేపల్లిన పట్టేవాళ్లను హెచ్చరిస్తున్నాడు.

అక్కడికి వెళ్లి నిలబడ్డారు సిన్రాయుడు, అతని అనుయాయులు. సిన్రాయుడి ముఖం చూడగానే కొండ్రెడ్డికి మనసు అట్టుడికినట్టు ఉడికిపోయింది. సిన్రాయుడన్నా, ఆ పల్లెవాళ్లన్నా కొండ్రెడ్డికి మంట... వారిపైన అతనికి పీకల దాకా పగ ఉంది.

దానికి కారణం సిన్రాయుడు. జరిగిన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ఆ వార్డు మెంబరుగా గెలవడమే... తమ నీటి సమస్యను తీర్చుకోవడానికి. ఆ ఊరి యువకుల ప్రోద్బలంతో గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేశాడు సిన్రాయుడు.

ఆ గ్రామ పంచాయతీ పరిధిలో మిట్టూరు ఒక వార్డు. అందులో రెండు కుటుంబాలను మొరవపల్లెతో చేర్చి మరో వార్డు చేశారు. ఆ రెండు కుటుంబాలవారూ అగ్రకులాలవాళ్లే. ఆ వార్డులో తొంభై శాతం ఓట్లు మొరవపల్లెలోనే ఉన్నాయి. కానీ ఆ వార్డు మెంబరుగా ఎప్పుడూ ఆ రెండు కుటుంబాల వారే ఏకగ్రీవంగా ఎన్నుకోబడుతున్నారు.

పూర్వం నుంచి ఆ గ్రామానికి ప్రెసిడెంట్, సర్పంచ్ పదవుల్ని మిట్టూరు భూస్వామి కొండ్రెడ్డి వంశీకులే నిర్వహించారు. ఆ ఏడు కూడా అంతే. సర్పంచ్‌గా కొండ్రెడ్డే గెలిచాడు. ఆయనే మొరవ

పల్లె వార్డుకు తమ కులానికి చెందినవాణ్ణే మెంబరుగా నిలబెట్టాడు. తనేం చేసినా ఆ పల్లెలోనే కాదు, ఆ చుట్టుపక్కల గ్రామాల్లో ఎదురుచెప్పే వాళ్లే లేరనకున్నాడు. ఇంతకాలం అలాగే సాగింది కూడా. కానీ, ఆ వార్డుకు ఈసారి పోటీగా సిన్రాయుడు నిలబడ్డాడు. అది సహించరాని విషయంగా భావించాడు కొండ్రెడ్డి. ఆ వార్డు మెంబరు గెలుపును ప్రతిష్టాకరంగా తీసుకున్నాడు. మంచినీళ్ల ప్రాయంగా డబ్బులు ఖర్చు పెట్టించాడు. సారా పొట్లాలు పంచాడు. కానీ ఓట్లు ఎక్కువభాగం మొరవపల్లెలోనే ఉండిపోవడంతో మిట్టూరు వ్యక్తి ఓడిపోక తప్పింది కాదు. అలా సిన్రాయుడు కేవలం తమ నీటిసమస్యను తీర్చుకోవడం కోసమే ఆ గ్రామ పంచాయితీలో స్థానం కల్పించు కున్నాడు. అయినా ప్రయోజనం లేకపోయింది. అక్కడా అతన్ని అంటరానివానిగానే చూశారు. అతను కోరిన ఏ చిన్న పనీ కొండ్రెడ్డి కానీయకుండా చేస్తూ వచ్చాడు. సిన్రాయుడి గెలుపుతో తమ కులం పరువు ప్రతిష్ఠ మంటగలిసిపోయినట్లు భావించాడు కొండ్రెడ్డి. ఎన్నో సంవత్సరాల నుంచి సురక్షితంగా కాపాడుకుంటూ వస్తున్న తమ సామ్రాజ్యపు కోట ఏదో బీటలు వారినట్లు భావించాడు.

"ఇట్టే ఒదిలేస్తే... ఈ నా కొడుకులు తెలివి మీరిపోయి రేపు ప్రెసిడెంట్ పదవిక్కూడా పోటీ చేసేస్తారు. మొగ్గలోనే తుంచేయాల. లేకుంటే... ఇది మంచిదికాదు, ఇంకా తాత్సారంచేస్తే మన గౌరవం యేంగావాల..." అంటూ తన ఊరివాళ్లను రెచ్చగొట్టాడు. దాంతో మిట్టూరోళ్లు తగిన సమయం కోసం వేచి చూస్తున్నారు.

కొండ్రెడ్డి గ్రామ రాజకీయాలలో తల పండినవాడు. కడుపులో కత్తులు పెట్టుకుని నవ్వుతూ ఎదుటివాడిని కౌగలించుకునే రకం. ఎంత శత్రువైనా ఎదుటపడినప్పుడు నవ్వుతూ చమత్కారంగా మాట్లాడ్డం అతని టెక్నిక్. హృదయం నిండా విషం నింపుకుని, పెదాలతో పంచదార రాల్చడం అతని రాజకీయం. తడిగుడ్డల్తో గొంతులు కోస్తాడు. అందుకే... వాళ్లని చూడగానే తన మనసులోని ద్వేషాన్నీ, కోపాన్నీ పైకి కనబడనీయకుండా పలకరించాడు.

"ఏమిరా సిన్రాయుడూ... ఈ పక్కేమయినా ఇంకో సెరువును సూసుకున్నార్రా శ్యాపలు పట్టేదానికి... ఇట్టొచ్చినారు?"

అతని మాటల్లో వెటకారం ధ్వనించింది.

"నీకోసమే వచ్చినామన్నా!" ముక్తసరిగా జవాబిచ్చాడు సిన్రాయుడు.

"ఏం పనీ?" సీరియస్‌గా సిగరెట్ పొగ గాల్లోకి వదల్తూ అడిగాడు.

"మాకింకా రెండు నెలల వరకు సెరువులో తాగేదానికి నీళ్లుండాయి. అప్పుడే శ్యాపలు పట్టించేసినావే!"

"అబ్బే! నాదేం లేదురా రాయుడూ. అందరూ, ఇంకా నీళ్లయిపోతే శ్యాపల్ని కొంగలేరేస్తాయి, సెరువులో దిగేద్దాం అంటే సరేలే అన్నా అంతే!"

కొండ్రెడ్డి కావాలనే ఆ పని చేయించినాడని వారికి అప్పుడుగానీ తెలియలేదు. పైగా అతను మాటలకు దొరికే రకం కాదని తెలుసు సిన్రాయుడికి. తెలిసినా అడగలేకుండా ఉండలేక పోయాడు.

"సరే మేమూ శ్యాపలు పట్టుకుంటాం. అది అడిగేదానికే వచ్చినాం," వచ్చిన పని చెప్పాడు నల్లన్న.

"అదెట్ల కుదరతాది. మేం పట్టుకున్న తర్వాత మూడు దినాలకు గదా మీరు పట్టుకోవాల."

"అప్పుడేముంటాయి పట్టుకునేదానికి తల కప్పలు తప్ప," ఆ గుంపులో నుంచే అన్నాడు ఎర్రన్న.

“ఏమిరా! బలే మిడిమేళంగా మాట్లాడతా ఉండావు,” కాస్త హెచ్చరింపుగా అన్నాడు కొండ్రెడ్డి జీతగాడు వెంకటముని.

“మిడిమేళం మాదిగాదు... మీదే,” ఆవేశంగా అన్నాడు నల్లన్న.

“ఒరే!... ఊరికే ఉండండ్రా... మనమొచ్చింది కొట్లాటకు కాదు,” వాళ్ల ఆవేశాన్ని అదుపు చేస్తూ అన్నాడు సిన్రాయుడు.

“ఇంతకూ ఏమంటారూ అంట!”

చివరి దమ్ము లాగి కాలిన సిగరెట్టు ముక్కను విసిరివేస్తూ నిర్లిప్తంగా అన్నాడు కొండ్రెడ్డి.

“మేమూ శ్యాపలు పట్టుకుంటాం!” తమ నిర్ణయం చెప్పాడు సిన్రాయుడు.

“అదెట్లా? మూడోరోజు పట్టుకోండి... అది పెద్దోళ్ల నిర్ణయం...” నిక్కచ్చిగా చెప్పాడు కొండ్రెడ్డి.

“అదే వద్దంటున్నాము...”

“అది పూర్వం నుంచి వచ్చే ఆచారం గదా...”

“ఆ ఆశారం మాకొద్దు... మేమూ మడుసులమే.”

ఎదురుతిరిగారు మొరవపల్లెవాళ్లు.

ఈ రభస విని అంతవరకూ చేపలు పట్టుకుంటున్న మాధవనాయుడు, మరికొందరు అక్కడికి చేరుకున్నారు.

“ఏమిరా ఈ అంటరాని నా కొడుకులకు పోయేకాలం. ఇన్ని రోజులూ లేంది ఇప్పుడడ్డ మొచ్చినారు?”

అక్కడికి వచ్చిన మాధవనాయుడన్నాడు- అతనూ మిట్టూర్లో ఒక మోస్తరు భూస్వామి.

“దీంట్లో శ్యాపలు పట్టే హక్కు మాకూ ఉంది,” అన్నాడు అంతవరకూ మౌనంగా ఉన్న బద్ది గురవయ్య.

ఇంకా ఓర్చుకోలేకపోయాడు కొండ్రెడ్డి.

“అంతవరకూ వచ్చిందా యవ్వారం? ఆ మాటకొస్తే ఈ సెరువు మాదిరా. దీనిపైన మీకేం హక్కుంది?”

“ఇదేం మీ పట్టాగాదు... పోరంబోకు... అంటే సర్కారోళ్లది,” అన్నాడు సిన్రాయుడు.

“ఆహా! సర్కారోళ్లదంతా మీదయి పూడుస్తుందా?” అన్నాడు మాధవనాయుడు.

“అట్లగాదు మాధవనాయుడన్నా... నీ బాయిలో నీళ్లు నీవు తాగతా ఉండావు. ఆ నీళ్లతో పంట పెడతా ఉండావు. ఆ బాయి నీదయింది. ఈ సర్పంచీ వాళ్ల బావుల్లో నీళ్లతో సేద్యం చేయిస్తాడు. ఆ నీళ్లే వాళ్లూ తాగుతారు. అవీ వాళ్లవే అయినాయి. అట్లే... మీ రైతులు వాళ్ల, వాళ్ల బావుల్లో నీళ్లు వాడుకుంటా ఉండారు కాబట్టి... ఆ బావులన్నీ వాళ్లవవుతా ఉండాయి. వీట్లో శానా బావులు వోళ్లు తవ్వించుకున్నవి కావు. అందులో కొన్ని పోరంబోకువీ ఉండాయి. అవన్నీ మీవి అయినప్పుడు ఈ సెరువులో నీల్లు తాగేది మేము. మరి ఈ సెరువు మాకు చెందిందే... మరి మీదెట్లవుతాది?”

లా పాయింట్ లాగినట్టుగా అడిగాడు సిన్రాయుడు.

“ఏమిరా రాయుడూ బలే సట్టాలు మాట్లాడతా ఉండావు... మెంబరై పూడిసినంత మాత్రాన... పెద్దంతరం సిన్నంతరం లేకుండా మాట్లాడతా ఉండావే,” అన్నాడు మరో అగ్రకులానికి చెందిన వ్యక్తి.

"ఉండేదంతే గదా!" అన్నాడు సిన్రాయుడు.

"అదిసరే... మీరు సెరువులో దిగితే... శ్యాపలు మైలైపోతాయి గదా!" పరోక్షంగా రెచ్చ గొడుతూ అన్నాడు కొండ్రెడ్డి.

"అదిగాదన్నా! మీ పొలాలు దున్ని పంటలు పండించేదీ, మీకు నీళ్లు తెచ్చిచ్చి, పాలు పిండిచ్చేది మేమే... అబ్బుడు లేని మైల ఇబ్బుడెట్లొచ్చింది?" ఆవేశంగా అన్నాడు యర్రన్న.

"ఈ సెరువులో మేము నీళ్లు దాగి... కాళ్లూ చేతులు కడుక్కున్నప్పుడు శ్యాపలకు మైలంటుకోలేదా?" నల్లన్న అందుకున్నాడు.

"మేం పీల్చి వదిలేసిన గాలే మీరూ పీలస్తా వుండారు. మరి ఆ గాలి మీ నెత్తుర్తో కలిసి పోయి... మీ నెత్తురు మైల కాలేదా?" వస్తున్న ఆవేశాన్ని అణుచుకుంటూ అన్నాడు సిన్రాయుడు. దాంతో ఇంకా రెచ్చిపోయారు మిట్టూరోళ్లు.

"పలకలు వాయించుకోని, కొమ్ములూదుకునే నా కొడుకుల్లారా... ఊరికే ఉన్నండ్రా. ఎక్కువ మాట్లాడద్దండి," అన్నాడు మాధవనాయుడు.

"ఏమ్మాట్లాడితే?" సమాధానంగా అడ్డు తగిలాడు యర్రన్న.

"నోరుముయ్యండ్రా పెద్దింటి నా కొడుకుల్లారా! ఎక్కువ మాట్లాడితే మరేదుండదు..."

"మీరూ అట్లే ఉండండి. ఆఁ..."

"వొరే మేము కాదంటే... సావులకీ, సభలకీ కొమ్ములూదీ, పలకలు కొట్టి బతకాల్సిందేరా మీరు..." అశ్లీలంగా తిడుతూ పెద్ద రభస చేయసాగారు అగ్రకులాల వాళ్లు.

దాంతో ఇరువర్గాల వారికి మాటా మాటా పెరిగింది.

"ఓర్నాయినో! కాలమట్టయి పూడిసిందిరా. ఆ ముండ గవర్నమెంటోడు అన్ని సవుకర్యాలు వోళ్లకే జేశా. ఊరికే ఇండ్లు గట్టించె. ఊరికే సదువు జెప్పించి, ఉద్యోగాలిప్పించె. లోన్లు ఇప్పించె. అందుకే వోళ్ల కండ్లు నెత్తికొచ్చిండేది?"

"రెండు తన్నండ్రా... నెత్తి నుండే కండ్లు నేలకొస్తాయి."

"ఈ నా కొడుకులు ఇట్ల సెబితే ఇంద్రుగానీ... కొట్టండ్రా మెట్లతో..." రెచ్చిపోయి రగడకు దిగారు అగ్రకులాల వాళ్లు.

"వాళ్లంతా భూములున్న వాళ్లు. కాస్తో కూస్తో ధనం ఉన్నవాళ్లు. తామేమో కూటికి గతిలేని వాళ్లు. పైగా కొద్దిమందే కాబట్టి నిగ్రహించుకోవడమే మంచిద,"ని సిన్రాయుడు తనవాళ్లకు సర్ది చెప్పసాగాడు.

మొరవపల్లె వాళ్లను ఇక పైకి లెయ్యకుండా దెబ్బ కొట్టడానికి ఇదే మంచి సమయం అనుకున్నాడు కొండ్రెడ్డి.

"వొరే! ఈ కొడుకులు ఇట్ల ఇనరు. నిండా మునిగినాకా సలేముందిగానీ, ఇంక నుంచీ వీళ్లకు మనం సహకరించకూడదు. మన పనులకు రానీయకూడదు. అసలు మన పొలాల్లో మనూర్లో వాళ్లను అడుగు పెట్టనియ్యగూడదు. మన నుంచీ మొరవపల్లోళ్లను యెలేసేద్దాం. మాడి సస్తారు నా కొడుకులు," ఎంతో నేర్పుగా ఆర్డరేశాడు కొండ్రెడ్డి.

అతని మాటే ఆ గ్రామంలో తిరుగులేని శాసనం. దాంతో ఇక ఏమీ చేయలేక అవమాన భారంతో, మండే గుండెలతో పల్లెకు చేరుకున్నారు మొరవపల్లె వాళ్లు.

అదే సమయంలో మిట్టూర్లో ఎవరో చనిపోయారు. ఆ చనిపోయిన వ్యక్తికి దహన సంస్కారాలు చేయాలంటే... డప్పులు, కొమ్ములు అవసరం. వాటి కోసం మనిషి వచ్చాడు. 'మేం రాంపో,' అన్నారు సిన్రాయుడు వాళ్లు.

"రాకపోతే మీకింక డప్పులూ, కొమ్ములూ ఉండేదెందుకు? రాకపోయారో... వాట్ని పగల కొట్టేస్తాం. మీ వాద్యాలు కాల్చిపారేస్తాం జాగ్రత్త," అని చెప్పి ఆ వ్యక్తి వెళ్లిపోయాడు. దాంతో ఆ రాత్రి... సిన్రాయుడి ఆధ్వర్యంలో పంచాయతీ చేశారు.

"వాళ్లు మనలను వెలివేసినట్లే... మనమూ వాళ్లను వెలేసేద్దాం. కుక్కతలకాయంతటిది ఎబ్బుడో ఒగబ్బుడు పనికొస్తుందంటారు. మనం దానికంటే గొప్పే. ఆ మాటకొస్తే ఈ లోకంలో శానామంది కంటే మనమే గొప్ప. మనతో కూడా వాళ్లకు ఎన్నో పన్లుంటాయి. మంచికీ, చెడుకీ మనం పోయి వాళ్లకు సాయం చేయాల్సిందేగానీ... మనకు మాత్రం వోళ్లు సాయపడరు... అందుకే... వాళ్లను మనమూ యెలేస్తున్నాం. అంతే!"

ఆ పంచాయతీలో... అందరి ముందూ చెప్పాడు సిన్రాయుడు.

ఆవేళ అతను... అర్జునునికి గీతోపదేశం చేస్తున్న కృష్ణుడిలా అనిపించాడు. అతని మాట వేదవాక్కులా అనిపించింది. అతను చెప్పుకుపోతూనే ఉన్నాడు.

"మనం ఇంకెవురికీ డప్పులు కొట్టను పోవాల్సిన పనిలేదు. కొమ్ములూదాల్సిన అవసరమూ లేదు. మన కులాలను గుర్తుకు తెచ్చే ఈ వాద్యాలు మనం వదిలేస్తున్నాం... అందుకే... మీ వాద్యాలన్నీ తీసుకురండి... కాల్చేద్దాం..."

అతని మాటను ఆ ఊరివాళ్లు తు.చ. తప్పకుండా పాటించసాగారు.

*

అవే మంటలు, వాద్యాలు కాలుతున్న మంటలు.

"ప్రతి నిత్యం మనల్ని అంటరానోళ్లుగా గుర్తుకు తెచ్చే వాద్యాలు ఇవి. ఈ సమాజం నుంచి మనల్ని వేరేచేసే విద్యలు... మనకొద్దు... కులాలను గుర్తుపట్టించే ఈ విద్యలు వద్దేవద్దు. వేసెయ్యండి."

"మిట్టూరులో బిడ్డ పుడితే మన డప్పులు వినిపించాం. వాళ్లకు పండగ జరిగినా పబ్బం జరిగినా మన పలకలు, కొమ్ములు వాయించాల్సిందే. మన వాద్యాలు లేనిదే వాళ్ల దేవుడయినా కదలడు. వోళ్లింట్లో ఆడకూతురు పెద్దమనిషయినా మన పలకలు మోగాల. కొమ్ములు ఊదాల. కడాకు వాళ్లూరులో శవం బడితే వాద్యాలు లేకుంటే పైకి లెయ్యదు. కాటికి కదల్దు. అయినా మనకు మిగిలింది అంటరానోల్లు పలకలు కొట్టి బతికేవోళ్లు అనే పేర్లు మాత్రమే."

"మాటిమాటికీ మన కులాల పేర్లతో మనల్ను అగుమానంగా అంటా ఉంటే, మరి ఈ వాయిద్యాలు మనకెందుకు? యేసెయ్యండి. వొగటి కూడా మిగలకుండా కాల్చేయండ్రా..."

ఆవేశంగా అరుస్తూనే ఉన్నాడు సిన్రాయుడు.

ఆ నడివీధిలో వాళ్ల వాద్యాలన్నీ అంటుకుని మంటలు నింగికెగిశాయి. అది వాద్య హోమం. దానికి సిన్రాయుడే కులగురువు. వాద్యాలను మంటల్లో వేస్తున్న ఎర్రన్న, నల్లన్న, గురవయ్య లాంటి యువకులే ఋత్విక్కులు.

అది ఒక యజ్ఞంలా సాగిపోతూనే ఉంది.

మంటలు రేగుతూనే ఉన్నాయి. ఆ మంటల్లో నుంచి లేస్తున్న దట్టమైన పొగ ఆకాశమంతా పరుచుకుంటూ కనిపించసాగింది.

*ఆంధ్రప్రభ వారపత్రిక*
*28 మే 1993*

నేపథ్యం

కులనిర్మూలనా పోరాటం

# హోమం

***పిలవకనే వచ్చే కరువులు, అప్పులతో, నిత్య దారిద్ర్యంతో అల్లాడే రైతాంగం... ఎడనెడ ఆకలిచావులు, ఆత్మహత్యలు... సరైన తిండయినా లేక బక్కచిక్కిన మనుషులు, పశువులు... రకరకాల గ్రామ రాజకీయాలతో, కక్షలు కార్పణ్యాలతో ఏరోజు ఎవడికి మూడుతుందోనని నిత్యం భయం భయంగా... దినదినగండం నూరేళ్ళ ఆయుష్షులా సాగిపోయే బతుకులు...***

హిందువుల ఇండ్లల్లో ఓ బిడ్డ పుట్టింది. పండుగ జరుపుకోవాల. లేదా ఓ ఆడ కూతురు సమర్తాడింది. అయిదు రోజులు... గుడిసె వేసి, బయటపెట్టి... అయిదో రోజు స్నానంచేసి, నలుగులు, కొత్తబట్టలు పెట్టి సాంగెం చేయాల. దళితులు రావాల్సిందే, డప్పులు కొట్టాల్సిందే. ఇంట్లో ఓ కుర్రాడికో, ఓ ఆడబిడ్డకో పెండ్లి జరగాల... లేదా ఓ గురివిదేవర చేసి కుర్రాడ్ని పెండ్లికొడుకును చేయాల. ఇంటి ముందరికి దళితులు రావాల్సిందే, డప్పులు వాయించాల్సిందే.

ఓ జాతరలో అమ్మవారికి ఆగాలు పాడాల... నిదర లేపాల. ఊరేగింపు సాగింపు సాగాల... చివరన అమ్మవారికి మంగళారతులు పాడి నిద్రపుచ్చాల... దళితులు రావాల్సిందే. పంబలు, దాంతోబాటు పలకలు, కొమ్ములు తేవాల్సిందే మ్రోగించాల్సిందే...

ముస్లిములు మొహరంనాడు అగ్నిగుండం తొక్కినా, ఓ వివాహం జరుపుకొన్నా దళితులు రావాల్సిందే, పలకలు కొట్టాల్సిందే...

ఇలా ఎన్నో సందర్భాలు, ఎన్నెన్నో సంఘటనలు, తతంగాలు... దళితులు మమేకమై తమ వాద్యాలను నేర్పుగా మ్రోగించే ఘట్టాలు. చివరికి మనిషి చచ్చినా...

కాటికి శవం తరలి వెళ్ళాలన్నా దళితులు లేకుంటే పని జరగదు. వాళ్ళు రావాల్సిందే డప్పులు కొట్టి కొమ్ములూదాల్సిందే...

ఇలా హిందువుల జీవితాలతో దళితులు, దళితుల వాద్యాలు సంబంధ బాంధవ్యాలు నెరపుకొన్న సమాజం మనది.

సమాజంలో ఇంతటి ప్రముఖ పాత్ర వహిస్తున్న దళితులు మాత్రం సమాజంలో అంటరాని వాళ్ళుగానే భావింపబడుతున్నారు.

కొన్నివేల సంవత్సరాల నుంచీ సమాజం వాళ్ళను విద్యకు, విజ్ఞానానికే కాదు సమాజ గౌరవానికీ ఆమడదూరం కాదు యోజన దూరంలోనే ఉంచేసింది. కంప్యూటర్లు రాజ్యమేలుతున్న ఈ అణుయుగంలోను వాళ్ళ స్థితిగతుల్లో అంతగా మార్పు రాకపోవడం శోచనీయం.

ఇక నేను పుట్టి పెరిగిన రాయలసీమ పల్లెలు...

నిసర్గ మనోహరమైన ప్రకృతి దృశ్యాలతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో పల్లెసీమలు పరవశింపజేస్తుంటాయని కవులు, రచయితలు రాస్తుంటారు. అది చాలావరకు నిజమే కావచ్చు. కానీ రాయలసీమ పల్లెల విషయానికొస్తే... అది కేవలం పగటికలగానే మిగిలిపోతుంది.

పిలవకనే వచ్చే కరువులు, అప్పులతో, నిత్య దారిద్ర్యంతో అల్లాడే రైతాంగం... ఎడనెడ ఆకలిచావులు, ఆత్మహత్యలు... సరైన తిండయినా లేక బక్కచిక్కిన మనుషులు, పశువులు... రకరకాల గ్రామ రాజకీయాలతో, కక్షలు కార్పణ్యాలతో ఏరోజు ఎవడికి మూడుతుందోనని నిత్యం భయం భయంగా... దినదినగండం నూరేళ్ళ ఆయుష్షులా సాగిపోయే బతుకులు... తాగడానికి ఎండాకాలంలో కుండనీళ్ళ కోసం బుర్రలు పగలగొట్టుకోవడాలు... బిందెడు నీళ్ళు దొరికితేనే ఆ పూటకు కడుపునిండా భోజనం చేసినట్టు సంబరపడిపోయే జనాలతో నిండిన పల్లెలెన్నో... ఎప్పుడో మూడు నాలుగేండ్ల కొకసారి పడే వర్షంతో కాసిన్ని నీళ్ళకు సైతం ఎగబ్రాకే జీవితాలు... మండలానికో చోటన్నా కనిపించే దృశ్యాలు. కాడి పసుల దగ్గరో, కాలువ నీళ్ళ దగ్గరో, చేని గనిము దగ్గరో కొట్లాడుకోని కుటుంబాలు అరుదే. ఇదీ రాయలసీమ ఉరఫ్ రాళ్ళసీమ జీవనచిత్రిక.

నేను చెప్పబోయేది దాదాపు ఇరవయ్యేళ్ళ కిందటి మాట. అప్పటికి నాది చాలా చిన్న వయసు.

మా ఊరికి కొంత దూరంలో 'బాల్చెరువు' అనే ఒక చిన్న చెరువు ఉంది. అది నిండితే సాగే మంచి ఆయకట్టు మళ్ళు... దాదాపు పదెకరాల మాగాణి... అది అగ్రకులాల వాళ్ళ సొంతం. దాని మొరవ వైపునున్న మిట్టపైన దాదాపు యాభై కుటుంబాల వాళ్ళున్న ఒక చిన్న హరిజనవాడ... దాని కానుకొని అగ్ర కులస్తులున్న కొంపలు... ఓ యాభై... దిగువనున్న హరిజనులు పూర్తిగా ఎగువనున్న అగ్ర కులస్తుల వ్యవసాయపు పనులు చేస్తూ జీవించేవాళ్ళే... ఎగువనున్న రైతులకు తాగునీటి బావి ఉందిగానీ, దిగువనున్న హరిజనులకు నీటి ఆదరువు లేదు. నీళ్ళకు తమ బావి దరిదాపుల క్కూడా హరిజనుల్ని అగ్ర కులస్థులు రానిచ్చేవాళ్ళు కాదు. అందుకని హరిజనులు వ్యవసాయ బావుల నాశ్రయించేవాళ్ళు. అవి ఆ ఊరికి కిలోమీటరు దూరంలో ఉన్నాయి. వాటిలో నైనా రైతులు దళితుల్ని దిగనిచ్చేవాళ్ళు కాదు. నీళ్ళు చేదుకోనిచ్చేవాళ్ళూ కాదు. ఆ రైతుల్ని ఎలాగో ఓలాగు బతిమాలో, బామాలో అడుక్కొని నీళ్ళు తెచ్చుకొనేవాళ్ళు. ఆ చెరువు కింద మళ్ళు సాగాయో... ఇక అటువైపు వీళ్ళని అడుగు కూడా పెట్టనిచ్చేవాళ్ళు కాదు. అలా అనుమతిస్తే... ముందే సన్నగా ఉండే మడి గనిములు పాడైపోయి మళ్ళలో నీళ్ళు నిలవవని రైతుల భావన. ఆ యాతన పడలేకనే ఆ చెరువులోకి ఏమాత్రం నీళ్ళొచ్చినా బాల్చెరువునే ఆశ్రయించేవాళ్ళు.

అదీ ఎలాంటి చెరువంటే- ఆ పల్లెవాళ్ళలో సగంమందికి ఆ చెరువే బహిర్భూమి. మరి ఆ చెరువు నీళ్ళు ఎంత అపరిశుభ్రంగా ఉంటాయో చెప్పాల్సిన పనిలేదు. అయినా దళితులకు వేరే గత్యంతరం లేదు. ఆ నీళ్ళే తాగేవారు. ఇది ఇలా ఉంటే... అక్కడి రైతులకూ, దళితులకు దేని కోసరమో కొట్లాట జరిగింది. దాంతో చెరువులో నీళ్ళు ఇంకా సగం ఉండంగానే చెరువులో దిగి అగ్రకులాల వాళ్ళు చేపలు పట్టేశారు. దానిపైన పెద్ద రభస జరిగింది. రైతులు దళితుల్ని తమ వ్యవసాయ పనులకు పిలవకుండా కట్టుదిట్టం చేశారు. దళితుల్ని దేనికీ పిలవకూడదనుకొన్నారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లోనే ఎగువవైపున్న రైతుల ఇంట్లో ఓ శవం పడింది. శవ ఊరేగింపుకు డప్పులవసరమై దిగువనున్న హరిజనవాడకు వచ్చి డప్పులు కొట్టే ఇద్దర్ని డప్పులెత్తుక రమ్మని పిలిచారు. వాళ్ళు రామని తిరగ బడ్డారు. దాంతో రెచ్చిపోయిన అగ్రకులస్తులు రాకుంటే మీ డప్పులు పగల కొట్టేస్తాం... మీ గుడిసె లకు అగ్గి పెట్టేస్తాం అంటూ పెద్ద వీరంగం చేశారు. బెదిరించారు. దానికి నిరసనగా ఆ వ్యక్తులు నడివీధిలో మంటపెట్టి, తమ డప్పుల్ని అందులో వేసి కాల్చేశారు.

ఈ సంఘటన ఆ రోజుల్లో చుట్టుపక్కల ఆ పల్లెల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. అది నా మనసులో చెరగని ముద్ర వేసింది. ఏండ్లు గడిచినా ఆ సంఘటన గుర్తుకు వచ్చి అప్పుడప్పుడు మనసును యాతన పెట్టేది. దీనిపైన కథ రాయాలనుకొన్నాను.

మామూలుగా చెరువులు ఇంకిపోయే రోజుల్లో... రకరకాల పనిముట్లతో, పరికరాలతో వాటిలో దిగి రైతులు చేపలు పట్టడం రాయలసీమ పల్లెల్లో తరచూ కనిపించే దృశ్యం.

పల్లెలోని పిల్లాజెల్లా ముసలీ ముతకా, ఆడామగా అందరూ... ఆ చేపల కోసం, గుడ్డి కొంగలు, కాకులు, బెల్లబాయిలు, చెరువుకట్ట పైనున్న కానగచెట్ల పైన వాలి పొంచి చూడడం, వాటితోబాటు దగ్గర్లో ఉండే దళిత స్త్రీలు, పిల్లలు వాళ్ళ దగ్గర చేపలు అడుక్కోవడం... ఈ ప్రాంతంలో వర్షంపడి చెరువులు నిండిన ప్రతి ఏడూ కనిపించే దృశ్యాలు.

పై అంశాలన్నింటినీ దృష్టిలో పెట్టుకొని బాల్చెరువు దళితుల సంఘటనని జతచేసి డప్పులు కాల్చేయడాన్ని ఓ యజ్ఞంలాగా సాగించినట్టు సింబలైజ్ చేసి కథ రాస్తే బాగుంటుందని పించింది. దానికి నేటి రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్ని చొప్పించాలి... ఇతివృత్తం స్ఫురించినంత మాత్రాన, దానికి ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్ని జత చేయగానే కథ అయిపోదుగదా! దానికో సామాజిక ప్రయోజనం, దానికి మించి ఓ తాత్త్విక దృక్పథం ఉండి తీరాలి. కాబట్టి యావద్భారత దేశంలోని దళితుల స్థితిగతుల్ని దృష్టిలో పెట్టుకొని కథ రాయడానికి పూనుకొన్నాను. అలా ఆలోచించి రాసిన కథ హోమం. ఇది 1993లో ఆంధ్రప్రభ వారపత్రిక వారు నిర్వహించిన కథల పోటీలో ప్రత్యేక బహుమతిని అందుకొన్న కథ. ఇది ఆ పత్రికలో 28 మే 1993వ సంచికలో ముద్రింప బడింది.

ఇక కథలో ఇతివృత్తం మాటకొస్తే...

ఆ పల్లె నడివీధిలో డప్పులు లయబద్ధంగా మ్రోగుతుంటాయి. కొమ్ములు వాటితో శృతి కలుపుతుంటాయి. అక్కడే... ఒకచోట ఒక పెద్ద మంట మండుతుంటుంది. ఆ మంట చుట్టూ ఆ ఊరి యువకులు ఆవేశంతో ఊగిపోతూ వాద్యాలు వాయిస్తుంటారు. ఊరిజనాలు ఆ దృశ్యాన్ని చూస్తుంటారు. వాళ్ళ నాయకుడు సిన్రాయుడి సూచనతో అందరూ వాద్యాలు వాయించడం ఆపి, తమ డప్పులన్నింటినీ ఆ మంటల్లో వేసి కాల్చేస్తుంటారు. మంటల్లో డప్పులు చిటపటమని శబ్దం చేస్తూ కాలిపోతుంటాయి. అలా వారు తమ డప్పుల్ని కాల్చేయడానికి కారణం కులం, అంటరానితనం...

ఇక్కడి నుంచీ కథ ఫ్లాష్‌బాక్‌లో నడుస్తుంది.

తన ఇంటి ముందుర కూర్చుని ఉన్న సిన్రాయుడికి వాళ్ళ తాగునీటి చెరువు 'పెద్ద చెరువు' కొల్లబొయ్యి రైతులంతా చేపలు పట్టేస్తున్నట్టు వార్త తెలిసి ఓ పదిమంది యువకుల్ని వెంట తీసుకొని చెరువుకాడికి పోతాడు. అక్కడ ఆ ఊరి సర్పంచ్ కొండ్రెడ్డి ఆధ్వర్యంలో చేపల్ని పట్టేస్తుం టారు. ఇంకా తాగే నీళ్ళుండాయి గదా అప్పుడే చెరువులో చేపలు పట్టేస్తే ఎలా అని ప్రశ్నిస్తాడు సిన్రాయుడు. కొండ్రెడ్డి తడిగుడ్డల్తో గొంతులు కోసే రకం కాబట్టి అందకుండా పొందకుండా జవాబు చెబుతాడు. దాంతో ఆ ఊరి రైతులకు దళితులకు మధ్య పెద్ద రభస జరుగుతుంది. కొండ్రెడ్డి వాళ్ళను వెలేసేస్తాడు. అతను అలా చెయ్యడానికి సిన్రాయుడు సర్పంచ్ ఎన్నికల్లో దళితులెక్కువగా ఉన్న తమ వార్డులో మెంబర్‌గా గెలిచి తమ నీటిసమస్య గురించి పంచాయతీ సభల్లో ప్రశ్నించడమే...

ఇలాంటి పరిస్థితిలో అగ్రకులాల వాళ్ళున్న వీధిలో ఓ ముసలాయన చనిపోవడం, కొందరు వచ్చి దళితుల్ని డప్పులు కొట్టడానికి పిలవడం, దళితులు అందుకు ఒప్పుకోకపోవడం, దానికి రెచ్చిపోయిన అగ్రవర్ణస్తులు మీ డప్పుల్ని కాల్చేస్తామనడం... యధాలాపంగా జరిగిపోయే కథ.

ఆరోజు రాత్రి సిన్రాయుడు ఊర్లో మద్దెస్తం సాగించి, 'మన కులాన్ని గుర్తుకు తెచ్చే ఈ వాద్యాలు మనం వదిలేస్తున్నాం... అందుకే మీ వాద్యాలు తీసుకురండి కాల్చేద్దాం...' అంటూ వాద్యహోమం సాగిస్తాడు... ఆవేళ సిన్రాయుడే కులగురువుగా, ఆ ఊరి యువకులే ఋత్విక్కులుగా ఆ హోమం సాగిపోతుంది.

స్థూలంగా ఇదీ హోమం కథలోని సారాంశం.

భార్గవీరావుగారి *ఇంకానా! ఇకపై సాగదు* అన్న కథల సంపుటిలో చోటు చేసుకొంది.

*19 ఏప్రిల్ 1998*

30



**వేలూరి వేంకటేశ్వరరావు** *1938 అక్టోబర్ లో పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి లో జన్మించారు. ఏలూరు, విశాఖ పట్నంలలో విద్యాభ్యాసం అనంతరం అమెరికా వెళ్లి సైంటిస్ట్‌గా పనిచేశారు. మొదటి కథ మనవాళ్ల పేర్లు 1971లో అచ్చయ్యింది. రెండు కథా సంపుటాలు ప్రచురించారు. 1980ల్లో తెలుగు వెలుగు పత్రికను అమెరికా నుంచి నిర్వహించారు. కొంతకాలం ఈమాట అంతర్జాల పత్రికకు పత్రికకు సంపా దకులు. ఉద్యోగ విరమణ అనంతరం అట్లాంటాలో ఉంటున్నారు.*

email: vrveluri@gmail.com

# గోమెజ్ ఎప్పుడొస్తాడో?

## వేలూరి వేంకటేశ్వరరావు

ఇవాళ ఆదివారం.

గోమెజ్ ఇవాళా రాలేదు. పోయిన శనివారమే రావాల్సినవాడు.

పదిహేను రోజులకోసారి, శనివారం పొద్దున్నే వచ్చి లాన్ చెయ్యమని ఎన్నిసార్లు చెప్పినా వాడికి అర్థం కాదు. ప్రతీసారీ 'యస్ యస్, సీ సీ,' అంటూ నవ్వుతూ తలకాయ ఊపుతాడు. అంతే. వాడికి తీరికైనప్పుడే వస్తాడు. వచ్చి నప్పుడు ప్రతిసారీ శ్రద్ధగా గడ్డికోసి, ఇంటి ముందు, వెనకా పెరిగిన పొదలన్నింటినీ అందంగా కత్తిరిస్తాడు. అదేం ఖర్మమో మరి! ఎప్పుడూ మధ్యాన్నం ఒంటిగంటకి వస్తాడు. కనీసం రెండు గంటలు మండుటెండలో పని చేస్తాడు. రోడ్డు మీద ఎవరిని చూసినా చెయ్యి ఊపుతూ నవ్వుతూనే ఉంటాడు. అందుకనే కాబోలు, వాడు రావలసిన రోజున టైముకి రాలేదని సుజాత ఎంత చిరాకుపడినా గోమెజ్ చేతే లాన్ పనులన్నీ దగ్గిర ఉండి చేయిస్తుంది. తను మంచి నీళ్లు తాగుతూ వాడికి కోక్ బాటిల్ ఇస్తుంది.

గోమెజ్‌కి ఇంగ్లీషు రాదు, యస్... యస్ అనడం తప్ప! ఇంగ్లీషు నేర్చుకుందామన్న కుతూహలం కూడా ఉన్నట్టు కనిపించదు. సుజాతకి స్పానిష్ రాదు. నేర్చు కుందామని అనుకోవడమే కాని, పని కట్టుకొని ఈ వయస్సులో కొత్తభాష నేర్చుకోవడానికి కావలసిన ఓపికా

లేదు. అయితేనేం, వాళ్ళిద్దరూ చేతులతో సైగలు చేస్తూ సంభాషణ చెయ్యడం మూకీ సినిమాలని మరిపిస్తుంది. నిజం చెప్పొద్దూ! వీళ్ళ ముందు మార్సెల్ మార్సో ఎందుకూ పనికి రాడనిపిస్తుంది. గుబురుగా పెరిగిన పొదలు ఎంత ఎత్తు ఉంచాలో, ఎంత కిందకి కత్తిరించాలో, ఏ పూలమొక్కలు ఎప్పుడు ఎక్కడ తిరిగి పాతాలో, ఈ వివరాలన్నీ సుజాత చేతులు తిప్పుకుంటూ సైగలు చేస్తూ చెప్పడం, వాడు యస్, యస్! అని తలకాయ ఊపడం చూడముచ్చటగా ఉంటుంది. ఈ రెండేళ్ళన్నరలో వాడు సుజాతతో మాట్లాడుతూ నేర్చుకున్న తెలుగు మాటలు ముత్యంగా మూడు- ఆగు, ఇలారా, కాదు. సుజాత నానాయాతనా పడి వాడితో మాట్లాడుతూ నేర్చుకున్న స్పానిష్ మాటలు- అమీగో, సబాదో, దొమింగో.

రెండున్నర సంవత్సరాల పైనే అయ్యింది సుజాత, మోహన్‌లు ఆ వీధిలో ఒక పెద్ద పాత ఇల్లు కొనుక్కొని. ఇంటి ముందు, వెనక ఖాళీస్థలం అరెకరం పైనే ఉంటుంది. ముందు పెద్ద లాను, రకరకాల పూలపొదలు. వెనక అటూ ఇటూ రెండు వీపింగ్ విల్లో చెట్లు ఉన్నాయి. వెనకాల సరిహద్దులో పెద్ద బర్మ్. దాని కింద ఆరడుగులెత్తున హెడ్జింగ్ పొదలూ ఉన్నాయి. వాళ్ళు కొత్త ఇంట్లోకి చేరిన రోజునే ఎదురింట్లోకి కేథరీన్, ఫ్రాంక్ కూడా వచ్చారు. ఇద్దరికీ సంసార బాధ్యతలు, ఇతర బాదరబందీలు ఏవీలేవు. దానికి తోడు ఒకే వయసు వాళ్ళవడంతో సుజాతకి, కేథరీన్‌కీ ఇట్టే స్నేహం కుదిరింది. రోజూ పొద్దున్నే లేచి సబ్ డివిజన్‌లో వీధులన్నీ కొలుచుకుంటూ మెల్లిగా నడవడం, అమ్మకానికున్న ప్రతి ఇంటి మీదా కామెంట్లు చెయ్యడం, సాయంత్రంపూట ఎవరి డ్రైవ్ వేలో వాళ్ళు నిలబడి గంటల తరబడి పిచ్చాపాటీ చెయ్యడం అలవాటయ్యింది. సుజాత అమెరికా వచ్చి ముప్పై ఏళ్ళయ్యింది. ఇన్ని ఏళ్ళున్నా ఫలానా తెల్లవాళ్ళు స్నేహితులు అని చెప్పుకోవటానికి ఎవరూ ఉన్నట్టులేదు. అలాగని నల్లవాళ్ళూ కూడా లేరు. ఇంతకుముందు వాళ్ళున్న ఇంటి సంగతి సరేసరి! తను పెరట్లోకి వెళ్ళితే చాలు, తను చెయ్యి ఊపుతూ పలకరిద్దామనుకున్నా ఆ వెనకింటి ఆవిడ హాయ్ అని కూడా అనేది కాదు! ఈ సబ్ డివిజన్‌లోకి రావడం, వచ్చిన రోజే కేథరీన్‌తో స్నేహం కుదరడం కలిసివచ్చింది.

ఒక శనివారం సాయంత్రం సుజాత, కేథరీన్ కబుర్లు చెప్పుకుంటూ ఉండగా ట్రక్ నిండా పైన్ స్ట్రా బేళ్ళు పెట్టుకొని ఒక పాతికేళ్ళ కుర్రాడు వచ్చాడు. ఒక కట్ట పైన్ స్ట్రా చేత్తో పట్టుకొని, ఇంటి ముందు చెట్లకుదుళ్ళకి స్ట్రా వేస్తానని సైగ చేస్తూ స్పానిష్‌లో వటవట వాగడం మొదలెట్టాడు. కేథరీన్ మాట్లాడద్దని తర్జని తన పెదాలపై పెట్టుకొని సైగ చేస్తూ, 'హౌ మచ్?' అని అడిగింది. వాడు మూడు వేళ్ళు చూపించాడు. అంతే! కేథరీన్ ఇంటి ముందు, సుజాత ఇంటి ముందూ చెట్లకి, పొదలకీ ఓపిగ్గా కుదుళ్ళుచేసి పైన్‌స్ట్రా వేశాడు. బహుశా ఒక్కొక్క ఇంటికి పాతికబేళ్ళు పట్టి ఉంటాయి. అంటే డెబ్భై ఐదు డాలర్లు! ఏ హోమ్ డిపోలోనో పైన్ స్ట్రా కొంటే నూటపాతిక పైనే అవుతుంది. దానికితోడు, అది తెచ్చి వేసినందుకు కూలి కనీసం మరో పాతిక డాలర్లు. చులాగ్గా ఒక్కొక్కళ్ళకీ నూట యాభై డాలర్లు ఖర్చు. సుజాత, కేథరీన్‌లిద్దరికీ కలిపి నూటయభై డాలర్లతో ఇంటి ముందు అన్ని చెట్లకీ, పొదలకీ పైన్ స్ట్రా చవగ్గా దొరికింది.

సుజాత, కేథరీన్ ఇద్దరూ ఒకేసారి వాడిని, 'గడ్డి కూడా కోస్తావా?' అని సైగ చేశారు, లాన్ చూపిస్తూ! వాడు యస్, యస్ అన్నాడు. కేథరీన్‌కి సుజాతకన్నా ఓ నాలుగు స్పానిష్ మాటలు ఎక్కువవచ్చు. ఇంగ్లీషు, స్పానిష్ కలిపి మాట్లాడేస్తుంది. వాడిని, 'లాన్ మోవర్ ఉన్నదా?' అని అడిగింది, వచ్చీరాని స్పాంగ్లిష్లో! వాడు, 'సీ, సీ' అన్నాడు చిరునవ్వు నవ్వుతూ! లాన్ చెయ్యడానికి ఎంత కావాలి, అని కూడా అడగలేదు. అడగడం ఎల్లాగో తెలిస్తేగా! ఆ రోజు నుంచీ సుజాతకీ, కేథరీన్‌కీ గోమెజ్ తోటమాలి. ఇద్దరూ కూడబలుక్కొని చెరో ముప్పై డాలర్లు ఇద్దామనుకున్నారు, అంతే.

ఆ నెల వర్షాలు బాగా పడ్డాయో ఏమో, రెండు వారాలు తిరక్కుండా ఇంటి ముందు గడ్డి కనీసం అరడుగుపైగా పెరిగింది. వెనక బర్మ్ మీద డాండెలియాన్ కలుపుమొక్కలు పెరుగుతున్నాయి. గడ్డి కొసన సన్నగా మట్టిరంగు పూలు కూడా పూస్తున్నాయి.

వారం నుంచీ సుజాత గోమెజ్‌కి ప్రతిరోజూ టెలిఫోన్ చేస్తూనే ఉన్నది. గోమెజ్ దగ్గిర నుంచి సమాధానం లేదు.

అప్పటికి రెండు నెలల కిందట వీధి చివర కార్నర్‌లో ఉన్న పెద్ద ఇంట్లోకి కొత్తగా గుజరాతీ వాళ్ళు దిగారు, రెండు హోండాలు, ముగ్గురు పిల్లలతో సహా! ఈ ఇల్లు ఏడాది నుంచీ అమ్మకాని కుంది. కార్నర్‌లో ఉన్న ఇళ్ళు తొందరగా అమ్ముడు పోవు కాబోలు! కారణం, మిగితా ఇళ్ళకన్నా ఖాళీస్థలం భారీగా ఉంటుంది. అందులోనూ, ఈ ఇల్లు కొండమీద ఉన్నట్టే ఉంటుంది. మూడు పక్కలా స్థలం కూడా సుజాత ఇంటికన్నా బాగా పెద్దది. రెండు లాట్లు కలిపి కట్టిన ఇల్లు. ఇల్లు ఫోర్‌క్లోజర్ లోకి పోయింది కాబట్టి బాగా చవగ్గానే దొరికి ఉండాలి గుజరాతీ ఫేమిలీకి. వాళ్ళు ఇంట్లోకి దిగిన రెండో రోజున సుజాత, కేథరీన్, ఇద్దరూ ఒక క్రోటన్ మొక్క తీసుకొని 'వెల్కమ్ టు నైబర్ హుడ్' అని చెప్పటానికి వాళ్ళ ఇంటికి వెళ్ళారు. ఆవిడ ఇచ్చిన టీ తాగుతూ వచ్చీరాని హిందీలో వాళ్ళ భోగట్టా కనుక్కుంది సుజాత. ఆవిడ పేరు మాలిని; ఆయన పేరు జాయ్. అతనికి ఏదో ట్రక్కింగు కంపెనీ ఉందిట. ఆవిడ పిల్లలని బళ్ళో దింపిన తరువాత స్వామినారాయణ్ గుడిలో వాలంటీర్ పనికి పోతుందిట. వాళ్ళ గురించి ఇంత సొద ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, సుజాత రికమండేషన్‌తో, గోమెజ్ వాళ్ళకి ఒకే ఒక్కసారి లాన్ కూడా చేశాడు, అందుకని!

సుజాత గోమెజ్ జాడ గురించి కేథరీన్‌ని అడిగింది. ఆ సాయంత్రం మాలిని ఇంటి ముందు ఆగి ఆవిడని కూడా అడిగింది. ఆవిడ ఏదో గుజరాతీలోనో, హిందీలోనో గొణిగింది. సుజాతకి ఒక్క మాట కూడా అర్థం కాలేదు. కేథరీన్ కూడా రోజూ టెలిఫోన్ చేస్తూనే ఉన్నది. కాని, ఫలితం శూన్యం.

గోమెజ్ శనివారం, ఆదివారం మాత్రమే లాన్ పని చేస్తాడు. మిగిలిన ఐదు రోజులూ వంద మైళ్ళ దూరంగా ఏదో పూలమొక్కల కంపెనీలో పని చేస్తాడు. వీడితో పాటు నలుగురు అమీగోలు రోజూ పొద్దున్నే ఆ కంపెనీకి వెళ్ళి రాత్రి పదిగంటలదాకా తిరిగి రారని కేథరీన్ భోగట్టా. అందుకనే కాబోలు, ఎవరు ఎన్నిసార్లు ఫోను చేసినా సమాధానం ఇవ్వడు.

'కాస్త నమ్మకంగా, ఖచ్చితంగా రెండువారాల కొకసారి వచ్చి లాన్ చేసేవాడిని, మరొకణ్ణి చూసుకోవాలి,' అని ఇద్దరూ అనుకుంటారు, గోమెజ్ రానప్పుడల్లా! గోమెజ్ రాగానే ఇద్దరూ ఆ విషయం మరిచిపోతారు! కారణం, వచ్చినప్పుడు లాన్ పని బాగా చేస్తాడు. పై పై పనులెన్ని చెయ్యమని చెప్పినా విసుక్కోడు; అందుకుగాను పైకం అడగడు; టిప్ ఎంత ఇస్తే అంతే తీసుకుంటాడు. నవ్వుతూ యస్ యస్ అంటాడు. అంతే!

గోమెజ్ వస్తాడని చూసిచూసి చివరకి విసుగెత్తి, సోమవారంనాడు పొద్దున్నే యెల్లో పేజీల్లో చూసి ఏదో సర్వీసు కంపెనీని పిలిచింది, కేథరీన్. ఆ విషయం సుజాతకి చెప్పింది. ఆ కంపెనీ వాళ్ళు యూనిఫారాలు వేసుకొని, పెద్ద ట్రక్‌లో వచ్చారు, మధ్యాన్నానికల్లా! మొత్తం ముగ్గురొచ్చారు. రెండు ఇళ్ళ ముందూ వెనకా లానులు పరీక్షగా చూశారు. ఒకడు టేపుతో కొలతలు కూడా తీసుకున్నాడు. మొట్టమొదటిసారి గడ్డి కోసి బుష్షులన్నీ కత్తిరించి పూలమొక్కలన్నింటికీ కుదుళ్ళు తవ్వి శుభ్రం చెయ్యడానికి ఒక్కొక్కళ్ళకీ నూటైయభై డాలర్లు అవుతుందని అంచనా ఇచ్చారు. వారానికొకసారి లాను పని చేయించుకుంటామని కాంట్రాక్ట్ రాస్తే, ప్రతివారం అరవై ఐదు డాలర్లకి లాన్ చేస్తామని, పూలపొదలు బుష్షులూ కత్తిరించడానికి వేరే నెలకి నలభై డాలర్లు అని చెప్పి రిబేట్ కాయితాలు, కాంట్రాక్ట్ కాయితాలూ అన్నీ కేథరీన్‌కి, సుజాతకీ ఇచ్చి రెండురోజుల్లో పిలిచి

ఏ విషయం చెప్పండని వెళ్ళిపోయారు. వీళ్ళిద్దరికీ గుండె ఆగినంత పని అయ్యింది. 'ఇది నిలువు దోపిడీ,' అని సుజాత, 'హైవే రాబరీ,' అని కేథరీన్ ఒకేసారి అనేశారు. వస్తానని చెప్పి, మాట నిలబెట్టు కోకండా మోసం చేసి ఎగగొట్టినందుకు, గోమెజ్‌ని నానా తిట్లూ తిట్టుకున్నారు: సుజాత తెలుగులోను, కేథరీన్ ఇంగ్లీష్‌లోనూ!

అయినా తప్పదు కదా!

ఈ దేశంలో, ఎవడి ఇల్లు వాడు లోపల ఎంత చెత్తగా పెట్టుకున్నా పరవాలేదు. శానిటరీ డంప్‌లా వున్నా నష్టం లేదు. 'నా ఇల్లు. నా సొంతం' అని దబాయించవచ్చు. ఇండివిడ్యువల్ ఫ్రీడం! కానీ, ఏ ఇంటి ముందు, వెనకా ఖాళీస్థలంలో గడ్డి ముత్యంగా మూడంగుళాలకన్నా ఎత్తుగా పెంచకూడదు. ఏ ఇంటి ముందన్నా కాస్త గడ్డి గాదర దుబ్బుగా పెరిగితే, ఇంటి ధరలు అమాంతం పడిపోతాయని బెంబేలు పడిపోతారు, ఇక్కడి జనం! ఇరుగుపొరుగు వాళ్ళు టౌన్‌హాలుకి పిలిచి రిపోర్ట్ చేస్తారు కూడాను! టౌన్‌హాల్ వాళ్ళే గనక మీ ఇంటి ముందు గడ్డి కోయిస్తే తడిసి మోపెడవు తుంది. అంతేకాదు; అది అప్రతిష్ట కూడాను! పెద్ద న్యూసెన్స్! అందుకైనా గడ్డి కోయించి తీరాలి.

ఆ రోజు బుధవారం.

పొద్దున్నే సబ్ డివిజన్‌లో నడుస్తూ, కేథరీనూ, సుజాతా ఇవాళ సర్వీసు కంపెనీని పిలుద్దా మని ఒప్పందం చేసుకున్నారు. మిట్టమధ్యాన్నం. జులై ఎండ మాడ్చే స్తూన్నది. కాసేపు కునుకు తీద్దామని సోఫాలో వాలింది, సుజాత.

అరగంట కూడా పట్టలేదు ఉలిక్కిపడి లేచింది, బయట లాన్ మోవర్ చప్పుడుకి! తలుపు తీసి చూసింది. అదేమీ మామూలు లాన్ మోవర్ కాదు. చక్కగా సీటు మీద కూర్చొని గడ్డి చేసుకునే మోవర్. కావిరంగు హోండా రైడింగ్ మోవర్. వెనక పెద్ద గోనె సంచీ; పక్కన మరో మనిషి నిలబడ టానికి చిన్న ఇనప మెట్టు కూడా ఉన్నట్టున్నది. గోమెజ్ బండి నడుపుతున్నాడు; పక్కనే మరో అమీగో హుషారుగా చేతులూపుతున్నాడు. సుజాతని చూడగానే గోమెజ్ ఎడమచెయ్యి ఊపుతూ హాయ్ అని సైగ చేసి మోవర్ ఆపాడు. వాడి స్నేహితుడిని గుమ్మం దగ్గిరకి తీసుకొని వచ్చాడు. సుజాత సైగ చెయ్యకముందే, వాడికేసి చూపుడు వేలు చూపిస్తూ 'మార్సెలీనో' అని చెప్పాడు. చూస్తే వీడికి పదిహేను పదహారు ఏళ్ళకన్నా ఎక్కువ వయస్సుండదు. మార్సెలీనోని 'ఇంగ్లీషు అర్థం అవుతుందా?' అని అడిగింది, సుజాత. వాడు వెంటనే 'లిటిల్..., లిటిల్...' అని సమాధానం చెప్పాడు. వీడే నయం. ఆ గుజరాతీ ఆవిడయితే 'థోడా థోడా' అనేది. ఇంతలో ఎదురింటి కేథరీన్ కూడా బయటికొచ్చింది. చెప్పద్దూ! కేథరీన్‌కీ, సుజాతకీ మొహాలు విప్పారిపోయాయి.

గోమెజ్ మోవర్ ఎక్కి గడ్డి చెయ్యడం మొదలుపెట్టాడు; కేథరీను మార్సెలీనోతో మాట్లాడటం మొదలెట్టింది. రకరకాల ఆరాలు తీసింది. రైడింగ్ మోవర్, వాళ్ళు పని చేసే పూలకంపెనీ ఓనర్‌ది. రోజుకి ముప్పై డాలర్లకి అద్దెకి తీసుకున్నారట! ఒక్క రోజులో అధమ పక్షం అరడజను లానులు చెయ్యచ్చు. ఒక్క గంటలో రెండు లాన్లూ కత్తిరించేశారు. పాత తోపుడు బండి మోవర్ అయితే కనీసం రెండు గంటలు పట్టేది. మార్సెలీనో గడ్డి ప్లాస్టిక్ బస్తాల్లోకి పట్టి ట్రక్ వెనకాల పడేశాడు. డబ్బులిస్తూ కేథరీన్ 'ఇప్పుడు కచ్చితంగా రెండు వారాలకొకసారి రావాలి,' అని మార్సెలీనోతో చెప్పింది. వాడు, సీ సీ కి బదులు 'షూర్... షూర్...' అన్నాడు. సుజాత చెరొకడికీ లీటర్ కోకు సీసాలిచ్చింది. మంచి ఎండగా ఉన్నదేమో, మార్సెలీనో సీసా మొత్తం ఒక్క గుక్కలో ఖాళీ చేశాడు.

ఇప్పుడు గోమెజ్ ఠంచనుగానే వస్తున్నాడు. అనుకున్నట్టుగానే రెండు వారాల కొకసారి శనివారమో, వీలు కుదరకపోతే ఆదివారమో గోమెజ్, మార్సిలీనో, ఇద్దరూ కొత్త మోవర్ని టొయోటా ట్రక్కులో కెత్తుకొని వచ్చేవాళ్ళు. ఒక గంటలో రెండు ఇళ్ళ ముందూ వెనకా గడ్డి కత్తిరించేసి పోయే వాళ్ళు. ఆరోజు ఇంట్లో ఎవరూ లేకపోతే, డబ్బులకోసం మార్సిలీనో సోమవారమో, మంగళవారమో సాయంత్రం బాగా చీకటి పడింతర్వాత వచ్చేవాడు.

ఆరోజు శనివారం.

సెప్టెంబర్ నెలాఖరయ్యింది. ఎండలు బాగా తగ్గాయి. బయట కాస్త చల్లబడుతూన్నది. తొందరగా చీకటి పడుతూన్నది కూడాను. సాయంత్రం గోమెజ్, మార్సిలీనో గుజరాతీ వాళ్ళ ఇంటి ముందు గడ్డి చేస్తున్నారు. మార్సిలీనో మోవర్ తోలుతున్నాడు, గోమెజ్ మోవర్‌కి ఎడమ పక్కన మోవర్ని తప్పుకుంటున్నట్టుగా నటిస్తూ చకచక మోవర్ పక్కనే నడుస్తున్నాడు. మార్సిలీనో మోవర్ని ఎడమ పక్కకి, కుడి పక్కకీ వెంటవెంటనే అదొక ఆటలా తిప్పటం మొదలెట్టాడు. గోమెజ్ మోవర్ని తప్పించుకోవటం; మార్సిలీనో గోమెజ్‌ని మోవర్‌తో తరమటం మొదలెట్టారు. కుర్రతనం చేష్టలు.

అప్పుడే సుజాత కారు ఎడమపక్కకి తిప్పుతూ కుడిచేతి వైపున ఉన్న మాలిని ఇంటికేసి చూసింది. గోమెజ్‌ని, మార్సిలీనోని చూసింది. ఒక్కక్షణం, అంతే! మోవర్ ఎత్తు నుంచి పల్లంలోకి వస్తోందో ఏమో, మార్సిలోనోకి బేలెన్స్ దొరకలేదు. మోవర్ ఎడమపక్కకి పల్టీ కొట్టింది. పక్కనే ఉన్న గోమెజ్ కుడికాలి మీద పడింది. గోమెజ్ కిందపడ్డాడు. మోవర్ స్టీరింగ్ వాడి తలకి కొట్టుకుంది. మార్సిలీనో కుడిపక్కకి దూకాడేమో, వాడు నిలబడే ఉన్నాడు. ఇదంతా ఒక్కక్షణంలో జరిగింది. గోమెజ్ మార్సిలీనోని ఏదో తిడుతూ ఏడుస్తున్నాడు. మార్సిలీనో అతికష్టం మీద మోవర్ని లేపి నిలబెట్టాడు. అదృష్టం బాగుండి, ఇంజన్ ఆగిపోయింది.

సుజాత కారు ఆపి గోమెజ్ దగ్గరకి పరిగెత్తుకొని వచ్చింది. వాడు కుడికాలు మణిమ పట్టుకొని ఏడుస్తున్నాడు. మార్సిలీనో కళ్ళనిండా నీళ్ళు నిండాయి. గోమెజ్ తలకి దెబ్బ తగిలింది. నుదురు నుంచి రక్తం కూడా వస్తోంది. రక్తాన్ని ఎడం చేత్తో తుడుస్తూంటే సుజాత వాడిని వారించి, తన కారులోంచి టిష్యూ పేపర్ తెచ్చి తుడిచింది. రక్తం ఎక్కువగా లేదుకాని, నుదురు మీద పెద్ద బొప్పి బాగా కనిపిస్తోంది. కుడికాలు నేల మీద అదిమిపట్టి ఎడమచెయ్యి ఒత్తు పెట్టుకొని లేవడానికి ప్రయత్నిస్తున్నాడు. విపరీతమైన నెప్పి కాబోలు; లేవటం కష్టం అయ్యింది. మార్సిలీనో చెయ్యి ఊతగా పట్టుకొని అతికష్టం మీద లేచి నిలబడ్డాడు. సుజాత వాడిని తన కారులో కెక్కించింది, మార్సిలీనో సాయంతో. మార్సిలీనోని వెనక ట్రక్‌లో రమ్మంది. యస్ యస్ అన్నాడు మార్సిలీనో.

"హాస్పటల్ ఎమర్జెన్సీకి తీసికెళ్ళాలి," అంది.

"హాస్పటల్? నో! నో హాస్పటల్ మామ్! నో! నో!" అంటున్నాడు గోమెజ్.

సుజాత వాడి మాట ఖాతరు చెయ్యలేదు. మెడికల్ సెంటర్ ఎమర్జెన్సీకి తీసికెళ్ళింది. అరడజను కాగితాలిచ్చింది అక్కడి రిసెప్షనిస్ట్. వివరాలన్నీ పూర్తిచేసిన తరువాత డాక్టర్ చూస్తాడని చెప్పింది. మార్సిలీనో రావడంతో కాస్త ఇబ్బంది తప్పింది. పూర్తి పేరు, అడ్రెస్, వయస్సు, వగైరా వగైరా వాడే పూర్తిచేశాడు. ఈ తతంగం అవుతున్నంత సేపూ, గోమెజ్ నో నో హాస్పటల్ అని అరుస్తూనే ఉన్నాడు. ఆ కాగితాలు రిసెప్షనిస్ట్ తీసుకుంటూ ఇన్స్యూరెన్స్ భోగట్టా అడిగింది. గోమెజ్‌కి ఇన్స్యూరెన్స్ లేదు. ఈలోగా మార్సిలీనో మాయమయ్యాడు. హాస్పటల్‌కి ఎవరో ఒకరు హామీ ఇవ్వాలని రిసెప్షనిస్ట్ చెప్పింది, ఆ కాగితాలని సుజాత ముందుకి నెడుతూ. సుజాత హామీ పత్రం మీద సంతకం పెట్టింది, మోహన్‌తో చివాట్లు తినాలని అనుకుంటూ!

గోమెజ్‌ని డాక్టర్ ఒక ఐదు నిమిషాలు పరీక్ష చేసాడు. తలమీద బొప్పి చూశాడు. కాలు చివర పట్టుకొని గట్టిగా లాగాడు. గోమెజ్ బాధగా ఉన్నా అరవలేకపోయాడు. కాలికి ఎక్స్-రే తీయాలని చెప్పాడు. తలమీద దెబ్బ తగిలింది కాబట్టి గోమెజ్ సోమవారం వరకూ హాస్పటల్లో ఉండవలసి వస్తుందని చెప్పి ఏవో కాగితాలు పూర్తి చేసి, నెప్పికి మందు రాసి వెళ్ళిపోయాడు. నర్స్ గోమెజ్‌ని కుర్చీలో కూర్చోబెట్టి వార్డ్‌లోకి తీసుకెళ్ళింది. నర్స్‌తో పాటు సుజాత కూడా గోమెజ్ బెడ్‌దాకా వెళ్ళింది. ఎక్కడి నుంచి ఊడిపడ్డాడో మార్సిలీనో తన వెనకాలే వచ్చాడు.

మార్సిలీనోతో సుజాత చెప్పింది, "రేపు వచ్చి చూస్తానని గోమెజ్‌కి చెప్పు. రాత్రికి మందు వేసుకొని పడుకోమను. సరేనా?" మార్సిలీనో యస్ యస్ అని తలకాయ ఊపాడు. ఈలోగా సుజాత కేథరీన్‌ని పిలిచింది. అన్ని విషయాలూ పూసగుచ్చినట్టు చెప్పింది. గోమెజ్ విపరీతమైన నెప్పితో బాధపడుతూ కూడా, "మి పే, మి పే, మామ్... మి పే, యస్ యస్, మి పే," అని కలవరిస్తున్నట్టు చెపుతున్నాడు. వాడు ఏమంటున్నదీ సుజాతకి బోధపడలేదు. ఏమిటీ? అన్నట్టు మార్సిలీనో కేసి చూసింది. మార్సిలీనో చెప్పాడు హాస్పటల్ ఖర్చు తను ఇస్తానని అంటున్నాడు, అని.

ఆదివారం మూడు గంటలకి సుజాత, కేథరీన్ హాస్పటల్‌కి వచ్చారు. తిన్నగా గోమెజ్ గదికి వెళ్ళారు. గోమెజ్ గదిలో లేడు. అక్కడ ఉన్న నర్స్ స్టేషన్ కెళ్ళి గోమెజ్ గురించి అడిగింది. వాళ్ళు తమకేమీ తెలియదని చెప్పారు. ముందు ఆఫీస్‌లో అడగమని సలహా ఇచ్చారు. పొద్దున్నే గోమెజ్ గదిలో నుంచి వెళ్ళిపోయాడని చెప్పాడు, పక్కనున్న పేషెంట్. ముందు ఆఫీస్‌కెళ్ళి అడిగింది కేథరీన్. గోమెజ్ రిలీజ్ చెయ్యక ముందే ఎవరికీ చెప్పాచెయ్యకండా పారిపోయాడని చెప్పింది. పోలీస్ రిపోర్ట్ ఇచ్చామని చెప్పింది కూడాను. కేథరీన్‌కి బోధపడింది; గోమెజ్ భయపడి పారిపోయాడని! 'పోలీస్ రిపోర్ట్ చెప్పకుండా హాస్పటల్ నుంచి పారిపోయినందుకు చేశారా? మరెందుకైనా రిపోర్ట్ చేశారా?' అని అడుగుదామనుకున్నది కానీ, ఏ కళలో ఉన్నదో ఆ ప్రశ్నలు మాత్రం అడగలేదు, కేథరీన్.

తిరిగి వస్తూ సుజాత గోమెజ్‌కి ఫోన్ చేసింది. సమధానం లేదు. గోమెజ్ పోలీసులకి భయపడి పారిపోయాడేమో అన్న అనుమానం ఇద్దరికీ వచ్చింది. అయినా ఇంటికొచ్చే వరకూ ఇద్దరూ ఆ విషయం ఎత్తలేదు. మర్నాడు సాయంత్రం, గోమెజ్ ఇచ్చిన ఎడ్రస్ పట్టుకొని ఇద్దరూ ఆ ఇంటి కెళ్ళారు. తలుపు కొట్టారు. ఇద్దరు లాటినో కుర్రాళ్లు తలుపు తీశారు. ఇద్దరూ టీనేజర్స్! గోమెజ్ గురించి, మార్సిలీనో గురించీ అడిగింది, కేథరీన్. వాళ్ళు స్కూల్ కెళ్ళే పిల్లలు కాబోలు; ఇంగ్లీషులో అడిగితే, ఇంగ్లీషులోనే సమాధానం చెప్పారు; గోమెజ్, మార్సిలీనో ఇక్కడ లేరు, అని.

"గోమెజ్ ఎవరో మాకు తెలియదు," అన్నాడు ఒకడు. "ప్లీజ్! గో," అని తలుపు మూశాడు రెండోవాడు.

గోమెజ్, మార్సిలీనో ఇద్దరూ ఇల్లీగల్స్ అయి ఉండాలి, అని నచ్చచెప్పుకున్నారు, సుజాత, కేథరీన్. వచ్చే మే నెలదాకా గడ్డి చెయ్యవలసిన అవసరం అంతగా ఉండదుగా! అప్పుడెవరినో చూసుకోవచ్చులే అన్నది, కేథరీన్. గోమెజ్ తిరిగి వస్తాడని గట్టి నమ్మకం ఉన్నది, సుజాతకి. అలాగని కేథరీన్‌తో అనలేదు, నవ్వుతుందేమోనని!

ఆ రోజు సోమవారం.

డిసెంబర్‌లో హాస్పటల్ నుంచి వెయ్యి అరవై డాలర్లకి బిల్లు వచ్చింది. సుజాత గుండె గుభేలుమన్నది. కేథరీన్‌తో చెప్పింది.

"గోమెజ్‌కి జరిగిన యాక్సిడెంట్ ఆ కార్నర్ ఇంటిముందే కదా?" అన్నది కేథరీన్.

"యస్."

"ఆ ఇంటి ఆవరణలోనే యాక్సిడెంట్ అయ్యిందా?"

"యస్," చెప్పింది సుజాత. "నేను గోమెజ్‌ని వాళ్ళ లాన్‌లో నుంచే లేవదీసి నా కారులో హాస్పటల్‌కి తీసికెళ్ళాను."

"మరయితే, ఈ మెడికల్ బిల్ వాళ్ళ బాధ్యత కాదూ?"

"యస్."

"అయితే, వెళ్ళి ఆవిడతో మాట్లాడు."

"నువ్వు కూడా వస్తావా?" అని అడిగింది, సుజాత.

"వత్తాసు కోసం వస్తాను, కానీ నేను యాక్సిడెంట్ చూడలేదుగా? అందుకని ఆవిడని నిలదీసి అడగలేను," అన్నది, కేథరీన్.

నయమే! కనీసం వస్తానన్నది, రాను పో అనలేదు, అని సంతృప్తిపడింది సుజాత.

మర్నాడు సాయంత్రం ఇద్దరూ మాలిని ఇంటికెళ్ళారు. మాలిని గుడి నించి తెచ్చిన ప్రసాదం పెట్టింది. మసాలా టీ ఇచ్చింది. సుజాత జరిగిన విషయం పూసగుచ్చినట్టు చెప్పింది.

"యాక్సిడెంట్ అయిన రోజునే నీకు చెప్పి ఉండాల్సింది. కానీ," వాక్యం పూర్తి కాకముందే మాలిని గబగబ హిందీ, ఇంగ్లీషు కలిపి మొదలెట్టింది.

"నేను గడ్డి చెయ్యమని అడగలేదే? అసలు ఆరోజు ఎందుకొచ్చాడు? అడగకండా పెట్టకండా మా లాన్ ఎందుకు చేశాడు? నేను వాడితో కచ్చితంగా చెప్పాను. నేను పిలిచినప్పుడే వచ్చి మా లాన్ చెయ్యాలీ అని!"

ఈవిడగారు తప్పుకొని పోతున్నదని తెలిసిపోయింది. కేథరీన్, సుజాత తిరుగుముఖం పట్టారు మళ్ళీ మాట్లాడకండా! ఇచ్చిన టీ అక్కడే వదిలిపెట్టి. బయటికి వస్తూ, "గోమెజ్‌ని పిలిచి మాలిని ఏ భాషలో చెప్పిందో?" అని నవ్వింది, సుజాత. కేథరీన్ వంతపాడింది.

ఒక వారంరోజులు పోయిన తరువాత, హాస్పటల్‌కి వెళ్ళారు, కేథరీన్, సుజాతానూ! ఒక వంద డాలర్లు ఇచ్చి సరిపెట్టుకుందామని. హాస్పటల్ ఎడ్మినిస్ట్రేటర్‌తో అరగంట బేరం ఆడారు. మొత్తానికి బేరమాడి, మూడువందల అరవైకి ఒప్పించారు. "మీరు మంచి పనిచేసి ఆపదలో ఉన్న వాడికి సాయం చేశారు కాబట్టి బిల్లు తగ్గిస్తున్నాను," అని చెప్పి ఏదో నీతిబోధ చెయ్యడం మొదలెట్టాడు. వంద డాలర్లు కేథరీన్ ఇస్తానన్నది. సుజాత భాగం రెండువందల అరవై.

"చావు తప్పి కన్ను లొట్టపోయిందిరా భగవంతుడా!" అని పైకి అనేసింది సుజాత, "వాట్! వాట్?" అంటూ గుడ్లు మిటకరిస్తున్న కేథరీన్ కేసి చూడకుండా.

"నొ'ఏడేస్ బీయింగ్ ఎ గుడ్ సమారిటన్... ఈజ్ నాట్ గుడ్ ఎట్ ఆల్," అన్నది కేథరీన్. ఇద్దరూ పకపక నవ్వుకున్నారు.

"ఐ థింక్... వుయ్ ఓ మోర్ టు గోమెజ్ ఫర్ హిజ్ సర్వీసెస్..." అని సరిపెట్టుకుంది సుజాత.

ఇవాళ శనివారం.

ఏప్రిల్లో కూడా ఇంకా చలిచలిగానే ఉన్నది. సుజాత, మోహన్లు రెండు వారాలపాటు ఫ్లోరిడాలో మకాం చేసి తిరిగొచ్చారు, నెలాఖరుకి.

సుజాత రెండు వారాల మెయిల్ చూస్తున్నది. చాలా భాగం జంక్ మెయిల్. తట్టెడు బిల్లులు. రాఫిల్లో ఐదు మిలియన్లు నెగ్గటానికి చదవాల్సిన ఉత్తరాలు ఐదు; మోహన్ పేరున మూడు, తన పేరున రెండు! అంతా కలిపి ఓ రెండు పౌండ్ల బరువుంటాయి. అన్నీ పక్కకు బొత్తిగా పెడుతుంటే కనిపించింది ఒకే ఒక్క మాసిపోయిన కవరు. ఈ ఉత్తరం చాంద్రాయణం చేసి వచ్చినట్టుంది. ఉత్తరం చింపి చూసింది. తెల్లకాయితం మడతలో నలిగిపోయిన ఐదు డాలర్ల బిల్లులు మూడో నాలుగో. పైనున్న బిల్లు వాటర్ మార్క్ మీద పాడి పాడి ఇంగ్లీషు అక్షరాలు.

"థాంక్స్ మామ్." ఎడ్రస్ లేదు; ఎల్ పాసో పోస్టు ముద్ర తప్ప.

'మి పే! మి పే!' అని హాస్పటల్‌లో కలవరిస్తున్న గోమెజ్ గుర్తుకొచ్చాడు. సుజాత కళ్ళనిండా నీళ్ళు తిరిగాయి. ఒక్క చుక్క కూడా ఐదు డాలర్ల బిల్లు మీద పడలేదు.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*జనవరి 2012*

## నేపథ్యం

### వలసజీవితాల వ్యథ

# గోమేజ్ ఎప్పడొస్తాడో?

***'గోమెజ్ ఎప్పుడొస్తాడో?' కథ, ఒక గోమెజ్ కథకాదు;***
***పదకొండు మిలియన్ల గోమెజ్‌ల కథ. అనుమతి పత్రాలు లేకండా***
***అమెరికాలో పదకొండు మిలియన్ల గోమెజ్లు ఉన్నారని అంచనా.***
***గోమెజ్‌లాంటివాళ్ళు అమెరికాకి అష్టకష్టాలూపడి, ప్రాణాలకి తెగించి***
***కూడ ఎందుకు వలసకి వస్తారో, అమెరికాకి వలసకొచ్చిన మధ్యతరగతి***
***జనానికి తేలికగా బోధపడదు.***

ఈ కథ 2012లో ఈమాటలో అచ్చులోకి వచ్చినా, ఈ కథ వెనుక చరిత్ర చాలా పాతది.

ఈ కథకి ముఖ్య ధమని అమెరికా వలసవిధానం.

నలభై ఏళ్ల క్రితం కొన్ని 'షాకింగ్' అనుభవాలు, విన్నవీ, కన్నవీ ఈ కథకి నాంది పలికాయి.

కథావస్తువు అమెరికన్ వలసచట్టాలు. ఈ వలసచట్టాలు అమలుపెట్టడంలో ఉన్న లుకలుకలూ, వాటి వెనుక రాజకీయాలు పాఠకులకి గుర్తుచేస్తే, సహృదయత, సానుభూతీ పెరుగుతాయని ఆశ.

1965 వరకూ అమెరికాలో అమలులో ఉన్న వలసచట్టాలకి రంగుభేదం; తెలుపు-నలుపు మాత్రమే! చట్టం అమలులో ఏ విధమైన సమస్యా లేదు. అప్పటివరకూ, అమెరికాకి వలసకి రావటానికి ప్రాతినిధ్యం, అనుమతి జర్మనులకి, బ్రిటీషువాళ్ళకీ, ఇతర ఉత్తర యూరోపియనులకి మాత్రమే పరిమితం. 1965లో ఈ చట్టం కొంచెం సడలించడం జరగ్గానే, దక్షిణ యూరోపియనులు, ఆసియనులూ, మూకుమ్మడిగా అమెరికాకి రావటం మొదలయ్యింది.

ముఖ్యంగా ఆసియాఖండం (ఆరోజుల్లో, ఫిలిప్పీనులు, భారతీయులు,

చైనావాళ్ళు, వగైరా అందరినీ ఆసియా పౌరులుగానే లెక్కబెట్టేవారు) నుంచి వలసకొచ్చే జనం పెరగటం, యూరోపియన్ దేశాల నుంచి వలసకి రావటం తగ్గటంతో, రంగుభేదం చాయా భేదంగా మారి, రాజకీయ రభస పెరగటం మొదలయ్యింది. యూరోపియన్ దేశాల నుంచి వలసకి రావటం బాగా తగ్గటంతో, ఈ చాయాభేదం మరింత గట్టిపడింది.

1970, ఆ తరువాతా, ఆసియాఖండం నుంచి సాంకేతిక రంగాలలో నిపుణులు, గుంపులు గుంపులుగా వైద్యులూ పడవలెక్కి అమెరికా రావటం మొదలయ్యింది. ఈ వలస, ఇక్కడికి ఎప్పుడో వలసకొచ్చిన తెల్లవారికి కన్నెర్ర చేసింది.

1973 సెప్టెంబర్16న, లెస్లీ వెస్టాఫ్ (Leslie Aldridge Westoff), న్యూయార్క్ టైమ్స్ (The New York Times)లో రాసిన 'Should we pull up the gangplank?' అన్న వ్యాసం నుంచి ఈ క్రింది వాక్యాలు చూడండి:

"Lying on a hospital examining table in New York a few years ago, I felt cheated to have a recently arrived foreign physician treating me. Foreign medical schools simply are not as good as ours. Generally, the doctors who study at them have great difficulty passing our exams."

ఈ వాక్యాలు ఆసియా నుంచి వలస వచ్చిన డాక్టర్లను ఉద్దేశించి రాసింది. భారతదేశం నుంచి వచ్చిన డాక్టర్లు అని ప్రత్యేకంగా రాయలేదు, అని మనం సంతోషించవచ్చు. కాని, అది నిజం కాదు. ఏది ఏమయినా న్యూయార్క్ టైమ్స్‌లో వచ్చిన వ్యాసం కదా! మధ్యతరగతి అభ్యుదయ వాదులకి రుచికరంగా ఉండటానికా అన్నట్లు, వెనుకపడిన దేశాల మీద, అభివృద్ధిలోకి వస్తున్న దేశాల మీదా, 'brain drain' మిషతో రాసిన సానుభూతి వాక్యాలు ఈ వ్యాసంలో బాగానే దొరుకు తాయి. అప్పట్లో, ఈ వ్యాసం నన్ను చాలా కలవరపరిచింది. అమెరికన్ వలస రాజకీయాల అసలు రంగు స్పష్టంగా కనిపించటం మొదలయ్యింది.

అప్పట్లో భారతీయులంటే, ఇక్కడి నల్లవాళ్ళకి అసూయ; తెల్లవారికి అలుసు, అసూయా కూడాను.

"Fast Forward 25 years":

21 వ శతాబ్దం మొదలవగానే వలస రాజకీయాల కథ మరొకదారి పట్టింది. వలసచట్టాన్ని ఉల్లంఘించి బ్రతుకుతెరువు కోసం, అమెరికా వచ్చిన, వస్తున్న మెక్సికనుల (అప్పట్లో తూర్పు దేశాల వాళ్ళని ఆసియనులు అని అన్నట్టే, దక్షిణ అమెరికనులందరినీ మూకుమ్మడిగా మెక్సికనులు అనటం పరిపాటి) పై వ్యతిరేకత పెరిగింది. వీళ్ళంతా దొంగలని, కొకైన్, మారివానా వగైరా మత్తు మందులు దొంగతనంగా అమ్ముకునే గూండాలని, హంతకులనీ, ఒకటేమిటి, రకరకాల ప్రచారాలు మొదలయ్యాయి. వీళ్ళందరినీ మెక్సికో పంపించెయ్యమని, ఈ అలగాజనం రాకండా- యూదులు జెరూసలెంలో గోడ కట్టినట్టు అమెరికా మెక్సికోల సరిహద్దు రెండువేల మైళ్ళపొడుగునా ఇరవై ఐదు అడుగుల ఎత్తుగోడ కట్టమని కొందరు అవకాశవాదులు, రాజకీయ నాయకులూ ప్రచారం చేస్తున్నారు. అయితే, ఈ మెక్సికనులే లేకపోతే నారింజతోటల్లోను, యాపిల్‌తోటల్లోనూ ఒళ్ళు వంచి పనిచేసి పళ్ళు బళ్ళకెత్తటానికి, ఇళ్ళ ముందు గడ్డికొయ్యడానికి, ఇళ్ళు కట్టడానికీ, చవగ్గా కూలిజనం దొరకరని అమెరికనులందరికీ తెలుసు.

ఇక గోమెజ్ కథ గురించి:

'గోమెజ్ ఎప్పుడొస్తాడో?' కథ, ఒక గోమెజ్ కథకాదు; -పదకొండు మిలియన్ల గోమెజ్‌ల కథ. అనుమతి పత్రాలు లేకండా అమెరికాలో పదకొండు మిలియన్ల గోమెజ్లు ఉన్నారని అంచనా.

నాకథలో గోమెజ్ నిజం; మారుపేర్లతో సుజాత, కేథరీన్లు నిజం. గుజరాతీ ఆవిడ కథ కోసం కల్పించిన పాత్ర. దైవభక్తికి, సానుభూతికి ఏ విధమైన సంబంధం లేదనిచెప్పడానికి కల్పించిన పాత్ర. అటువంటి వాళ్ళు ఉంటారని (వాళ్ళు గుజరాతీవాళ్ళే కానక్కరలేదు సుమా!) చెప్పక్కరలేదను కుంటా!

నిరుడు, మా స్నేహితురాలు, ఫిజికల్ మెడిసిన్ డాక్టరు, మాటల సందర్భంలో చెప్పింది: 'హెయ్! సుజాతా! గోమెజ్ గుర్తున్నాడా? మీ గోమెజ్ నాకు పోస్ట్‌లో ఐదు డాలర్లు పంపించాడు, హాస్పటల్ ఎడ్రసుకి!' అని నవ్వుతూ చెప్పినప్పుడు, సుజాత నిజంగా ఏడ్చింది. అప్పుడు, నాకు మా గోమెజ్ కథ తప్పకండా రాయాలనిపించింది.

కథలో గోమెజ్ సుజాతకి కొద్దిపాటి డాలర్లు పంపించినట్టు రాశాను.

గోమెజ్ ఎవరికీ చెప్పాచెయ్యకండా హాస్పటల్ నుంచి వెళ్ళిపోవడం కాకతాళీయం కాదు. పోలీసులని చూసి భయపడే పారిపోయాడు. ఆ తరువాత సుజాత పోలీసువాళ్ళతో పడ్డ యాతన కథకి అనవసరం అనిపించి, కథ పొడిగించి, విసిగించదలచుకోలేదు.

గోమెజ్‌కి సుజాత నివాసం ఉంటున్న వీధిలో లాన్ చేస్తుంటే కాలు విరగటం, సుజాత గోమెజ్‌ని హాస్పటల్‌కి తీసికెళ్ళి వైద్యం చేయించటం నిజంగా జరిగిన విషయాలు. పరిచయస్తు రాలైన డాక్టరు ఉండటం సుజాత అదృష్టం.

నాకు తెలిసి, ఈ కథలో ఏ విధమైన సందేశమూ లేదు. నాకు తెలియని సందేశం ఏదన్నా ఉంటే, అందుకు నేను బాధ్యుణ్ణి కాదు. మా గోమెజ్ చాలా మంచివాడు. నిజాయితీపరుడు. అందరు గోమెజ్లూ మంచివాళ్ళు కారు; అలాగే అందరు గోమెజ్లూ చెడ్డవాళ్ళూ కారు.

గోమెజ్‌లాంటివాళ్ళు అమెరికాకి అష్టకష్టాలూపడి, ప్రాణాలకి తెగించి కూడ ఎందుకు వలసకి వస్తారో, అమెరికాకి వలసకొచ్చిన మధ్యతరగతి జనానికి తేలికగా బోధపడదు. స్టీరియోటైప్ చెయ్యటానికి అది ఒక కారణం కావచ్చు.

"ఈ పదకొండు మిలియన్ల మందికీ వీసాలిచ్చి, కాలక్రమేణా అమెరికన్ పౌరులుగా అయ్యే అవకాశం ఇవ్వచ్చుగా," అని పొరపాటున నేను అంటే, వెంటనే ఒక తెలుగు-అమెరికన్ రాజకీయ వేత్త అన్నాడు- "అప్పుడు మనవాళ్ళకి వీసాలు తగ్గిపోయే ప్రమాదం ఉంది. మనవాళ్లు, వాళ్ల ఫ్యామిలీ లని అమెరికాకి తీసుకొనివచ్చే వీసాలు తగ్గిపోతాయి." ఆ విషయం గురించి రాజకీయాలు నాకు బాగా తెలియవు. కానీ, అది నిజం కాదని అనుకుంటున్నాను.

ఒకటి మాత్రం నిజం.

ఈ తరహా వాదం వింటే ఇండియాలో మూడోతరగతి రైలుపెట్టె అనుభవం గుర్తుకువస్తుంది. తను నానాయాతనా పడి, రైలుపెట్టెలోకి ఎక్కగానే, ఆపై నింకెవరూ ఎక్కకండా తలుపులు మూసెయ్యడం లాంటిది, ఈ వాదం.


పదకొండు మిలియన్ల గోమెజ్‌ల సాంఘికస్థితికి నా కథ ప్రతిబింబం అని అనుకుంటున్నాను. కథలు, కవితలూ సాంఘికసమస్యలని పరిష్కరించవని నా అభిప్రాయం. కథలు సాంఘికవ్యవస్థకి అద్దంపడతాయి. అద్దం విరిగితే, ప్రతిబింబం వికృతంగా కనిపిస్తుంది.

ఈ కథ చదివిన పాఠకులు గోమెజ్‌లని సానుభూతితో చూడగలిగితే, అదే పదివేలు. 'అయ్యో! పాపం!!' అని జాలిపడితే, నేను కథ సరిగా చెప్పలేదనే అనుకుంటాను. ఎందుకంటే జాలి, పరమ నిరుపయోగం; Stefan Zweig నవల 'Beware of Pity'లో అన్నట్టు; 'useless pity!'

*20 నవంబర్ 2013*

*'గోమెజ్ ఎప్పుడొస్తాడో?' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

31



**రమణజీవి** 1956 జనవరి 9న అనంతపురం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ 'శిలా పుష్పం' ఉదయం వీక్లీలో 1986లో అచ్చయింది. ఒక కవితా సంపుటి, రెండు కథాసంపుటాలు ప్రచురించారు. చిత్రకారుడు, డిజైనర్. హైదరాబాద్‌లో ఆర్ట్ స్కూలును నడుపుతున్నారు.

**చిరునామా**
403, భరణి టవర్స్,
సెంట్రల్ ఎక్సైజ్ కాలనీ,
బాగ్ అంబర్‌పేట్,
హైదరాబాద్ - 500 013
Ph.: 98490 46104
ramanajeevi@rediffmail.com

# చివరిమనిషి

## రమణజీవి

జమై ఉస్మానియా.

మిట్ట మధ్యాహ్నపు ఎండ కరకరలాడుతోంది. స్కూల్ కాంపౌండ్ గోడమీద నలుగురు పిల్లలు నిలబడి- ఇద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలు - వచ్చే పొయ్యే వాళ్లను,

"అంకుల్... ప్లీజ్... బాల్... బాల్ అంకుల్..." అని అడుగుతున్నారు.

ఎత్తుగా వున్న ఆ గోడ మీదినించి దూకి బాల్ తీసుకోవచ్చుగానీ మళ్లీ ఎక్కడం సాధ్యం కాదు. సుమారు ఫర్లాంగు చుట్టూ తిరిగి గేట్లోంచి లోపలికి పోవాల్సి వుంటుంది. అందుకే వాళ్లు పట్టువదలకుండా అరుస్తూనే వున్నారు.

చాలామందే నడుస్తున్నారు రోడ్డు వెంబడి. కానీ ఆ పిల్లల అరుపులు కొందరి చెవుల్లో దూరడమే లేదు. కొందరికి వినిపించినా పట్టించుకునే స్థిమితమూ, తీరికా లేదు. కొందరికి బిడియం! కొందరిలో తమపిల్లలు కాదు గదా అనే నిర్లక్ష్యభావన.

రోడ్డు పక్కన పడివుంది బాల్ ఒంటరిగా!

మొదట్లో అభ్యర్థనపూర్వకంగా ప్రారంభమైన పిల్లల గొంతు పట్టుదలగా మారింది. కింద మాడుతున్న

అరి కాళ్లు. పైన సెగలుపొగలుగా కురుస్తున్న ఎండ. కాసేపటికి వాళ్ల కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూసుకున్నారు.

కిందికి దూకి బాల్‌ని తెచ్చుకుందామనే ఆలోచనని అందరూ ఒకేసారి ఎవరికివాళ్లే ఉప సంహరించుకున్నారు. ఎందుకివ్వరు? పట్టుదల ఇంకా ఇంకా చిక్కబడింది. వాళ్ల మనసుల్లోంచి చర్మంలోకి ఏదో పాకుతున్నట్టు అనిపించింది.

అది చర్మాన్ని కూడా దాటి విస్తరించేలా వుంది!

పిల్లలు ఎవరో స్టాచ్యూ చెప్పినట్టు కదలకుండా నిల్చుండిపోయారు.

మాడిపోతున్న పిల్లల్లోంచి ఎండమావుల్లా అలలు అలలుగా కదులుతూ ఆవిరిలాంటిది ప్రపంచమంతా విస్తరించడం ప్రారంభించింది, కాంతి వేగంతో.

*

వాషింగ్‌టన్.

రాత్రి ఒంటిగంట.

వైట్‌హౌస్ నుంచి అరుస్తున్న సైరన్‌తో ప్రెసిడెంట్ కాన్వాయ్ బయలుదేరింది. ఎక్కడి ట్రాఫిక్ అక్కడే కాన్వాయ్‌కి దారిస్తూ పక్కకి పొర్లి, స్తంభించి పోయింది.

పెయిన్‌కిల్లర్స్‌కి కూడా లొంగని కడుపునెప్పితో లుంగలు తిరుగుతున్న ప్రెసిడెంట్. హాస్పిటల్ ఆవరణలో హడావిడిగా ఆగింది వాన్. స్ట్రెచర్‌ని మోస్తున్న అటెండర్లలో ఒకడు కడుపు పట్టుకుని కింద కూచుండిపోయాడు. బాడీగార్డ్స్ వచ్చి స్ట్రెచర్‌ని మోసుకుంటూ స్పెషల్‌వార్డులోకి తీసుకెళ్లారు.

అప్పటికే ఓ పదహారుమంది స్పెషలిస్టులు వైట్‌హౌస్‌లో తీసిన శాంపుల్స్ రిజల్ట్స్‌ని చూస్తున్నారు. అన్నీ నార్మల్!

"బెటర్. వొక్కసారి స్పెర్మ్ టెస్ట్ చెయ్యాలి" అన్నాడు డాక్టర్ ఇర్వింగ్.

ఉరుకుల పరుగుల మీద స్పెర్మ్ కలక్షన్ మొదలయింది.

కడుపునెప్పి కేసులు నాలుగువందల దాకా ఆ హాస్పిటల్‌కి వచ్చాయని తెలిసి అందరూ ఆశ్చర్యంలో మునిగిపోయారు.

"సమ్ వైరల్ ఇన్‌ఫెక్షన్ ప్రాబబిలీ..."

"నగరాన్ని ఏదో కబళిస్తున్నట్టుంది..."

"ఆల్‌ఖైదా పనయితే కాదుకదా..."

"జీవరసాయన ఆయుధాలు..."

ఇట్లా రకరకాలుగా మాట్లాడుకుంటూ ప్రెసిడెంట్ స్పెర్మ్ రిజల్ట్ కోసం ఎదురుచూస్తూ కూచున్నారు. అందులో కొందరు కూచున్నవాళ్లు కూచున్నట్టే కడుపులు పట్టుకుని మెలికలు తిరిగిపోసాగారు.

రిపోర్ట్ వచ్చింది!

వీర్యకణాలు మొత్తం ఒకేసారి మరణించినట్టు ధృవీకరించబడింది.

అప్పటికే ప్రపంచంలో నలభైశాతం మంది పురుషులు కడుపునెప్పితో బాధపడుతూన్నట్టు బి.బి.సి ప్రకటించింది. వార్తల మధ్యలోనే ఫ్లాష్‌న్యూస్ అని మరో ముప్పయిశాతం కూడా కడుపునెప్పి వాతపడినట్టు చెబుతూ చెబుతూనే కడుపు పట్టుకుని లుంగలు తిరిగి పడిపోయాడు న్యూస్‌రీడర్.

పది గంటలపాటు మాత్రమే వేధించింది ఆ కడుపునెప్పి.

ఎక్కడ చూసినా దీన్ని గురించే చర్చ. ఇరాక్‌లో, ఆఫ్రికాలో, ఇండియాలో, అమెరికాలో, ఆస్ట్రేలియాలో... చివరికి దుర్గమారణ్యాలలోని ఆదిమజాతుల మధ్య కూడా.

వీర్యకణాలు ఎందుకు ఉన్న ఫళంగా మరణించాయో ఎవ్వరికీ అంతుబట్టలేదు. జీవ రసాయన శాస్త్రవేత్తలంతా తమ సర్వశక్తుల్నీ కేంద్రీకరించి ఈ రహస్యాన్ని ఛేదించే కార్యక్రమంలో మునిగిపోయారు.

*

వరల్డ్ సెంటర్ ఫర్ బయోసైన్సెస్.

డేనిస్ చకచకా నడుచుకుంటూ వస్తున్నాడు. అతడి రాక అంతవరకు అయోమయంలో నిండివున్న వాతావరణాన్ని కాసింత ధైర్యంతో నింపింది. అక్కడున్న సైంటిస్టులంతా డేనిస్ గౌరవార్ధం లేచి నిల్చున్నారు. డోర్ దగ్గర్నించే మాట్లాడుతూ వాళ్ల మధ్య నుంచి తన ఛాంబర్‌లోకి ప్రవేశించాడు.

"నో...నో... నో ఫార్మాలిటీస్... ప్లీజ్!"

అందరూ అతణ్ణి అనుసరించారు ఆదుర్దాగా.

"సీ వెరీబాడ్. కొత్తగా తయారవుతున్న వీర్యంలో కూడా డెడ్‌సెల్సే ప్రేసవుతున్నాయి. ఫ్రెష్ టీనేజ్ పిల్లల్లోనూ సేమ్ కండిషన్. ఇంకో వింతల్లో వింతైన విషయం చెప్పనా..." అందరివేపు చూశాడు డేనిస్.

అందరూ ఆతురతగా చూశారు.

"...మనుషులకంటే ఏదో జబ్బుచేసి ఇట్లా అయ్యిందనుకోవచ్చు. కోల్డ్ స్టోర్స్‌లో స్పెర్మ్ కూడా డెడ్. అంటే ఏదో సంథింగ్ మనిషి స్పెర్మ్ మీద దాడిచేస్తోంది. సంథింగ్ ఇంపాజిబుల్... హేపనింగ్ దిస్ మీన్స్..."

శాస్త్రవేత్తలంతా నోళ్లు వెళ్లబెట్టారు.

"...దిస్ మీన్స్ ఇక కొత్తగా మనుషులు ఈ భూమ్మీద పుట్టరు. ఇప్పుడు గర్భవతులుగా వున్న స్త్రీలే చిట్టచివరి తల్లులు. వాళ్లకు పుట్టే పిల్లలే చిట్టచివరి మానవులు."

రెండు అరచేతుల్నీ టేబుల్ మీద శబ్దమయ్యేలా చరిచాడు డేనిస్.

*

ఈ విచిత్రమైన జబ్బుకు ఎయిర్స్ అని నామకరణం చేశారు.

భూమ్మీద మొదటిసారి అన్ని దేశాల నాయకులూ కలిసి సమావేశమయ్యారు. తమ మధ్య వున్న నిజమైన లేక ప్రజల్ని మోసం చెయ్యడానికి ఏర్పరచుకున్న అన్ని విభేదాల్నీ పక్కనబెట్టి నిజాయితీ గా చర్చించారు. మానవాళిని సవాలుచేస్తూ నిలువెత్తు మృత్యువులా నిలుచున్న ఎయిర్స్‌తో పోరాటానికి అందరూ కలసికట్టుగా నిలవాలని నిర్ణయించుకున్నారు.

డేనిస్ నాయకత్వంలో 'ఆపరేషన్ ఎయిర్స్'కు శ్రీకారం చుట్టారు. తమ సంపదల్ని ఇతర దేశాలకు పంచిపెట్టడానికి ప్రతిదేశమూ అయాచితంగానే ముందుకొచ్చింది.

ట్రాన్స్‌ప్లాన్టేషన్ వంటి అత్యంత ఆధునిక పద్ధతులతో పాటు కుకున్, స్పాట్రస్, నయిచిమ్, బండాల్లీ, ఆక్యుపంచర్, కకుబా వంటి అత్యంత పురాతన వైద్యవిధానాల్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు శాస్త్రవేత్తలు.

ప్రభుత్వాల్లో ఉదారత పెరుగుతోంది రోజురోజుకూ.

*

రాజంపేట

పార్వతమ్మ జీవితంలోని అపారమైన దు:ఖాన్నంతా ఎయిర్స్ చెరిపేసింది. ఎయిర్స్‌కు రెండు సంవత్సరాలకు ముందు ఆత్మహత్య చేసుకున్న రైతుల్లో ఆమె భర్త శంకరయ్య ఒకడు. ఆమెకు మొగుణ్ణి తల్చుకుని ఏడవడానికి కూడా తీరికలేకపోయేది. పిల్లల ఆకలిని తీర్చడమెలా అనేదే

ఆమె ప్రధాన సమస్యగా వుండేది. వొకపక్క గంజినీళ్లకు కూడా మొకం వాచి చస్తూంటే మరోపక్క చేబదుళ్లు ఇచ్చినవాళ్లు ఇంటిమీద పడేవాళ్లు.

'ఒక్క రెండేళ్లు ఓపికపట్టగుడ్డా అయ్యా' అనుకుంటుంది శంకరయ్య గురించి. ఈ జబ్బొచ్చిన ఆర్నెల్లకు శాశ్వత గంజి కేంద్రాలు వెలిశాయి. ఎవరో మహానుభావులు బీదోళ్లకు డబ్బు పంపుతున్నారని చెప్పుకున్నారు అంతా.

నిజానికి రెండు పూట్ల అన్నం, ఒకపూట గంజికని డబ్బులు పంపిస్తే, మధ్యలోవాళ్లు తినేసి మూడుపూట్లా గంజే పోస్తున్నారని కూడా చెప్పుకునేవాళ్లు. అయితే ఆ తర్వాత ఫండ్స్ బాగా ఎక్కువయి పోయాక అందరికీ ఉచితంగా బియ్యమూ, బట్టలూ, సబ్బులూ, నూనెలూ వంటి అన్ని నిత్యావసర వస్తువుల్ని పంచడం ప్రారంభమైంది. చాలామంది పేదవాళ్లు, మధ్యతరగతి వాళ్లు మూటలు మూటలు బియ్యమూ, పప్పు, సబ్బులూ దాచుకున్నారు మొదట్లో. తరవాత్తరవాత స్థలం చాలక ఆ పని మానేశారు.

ప్రపంచంలోని పెద్దపెద్ద ధాన్యాగారాల్ని, ఉత్పత్తి కేంద్రాల్ని పంచితే ప్రపంచంలో అన్ని ఇళ్లనీ కనీసం ఓ నలభై ఏడు వేలసార్లు నింపొచ్చని సామాజిక శాస్త్రవేత్తలు అంచనా వేశారు.

అయితే ఆ రోజు తెలిసిన ఒకవార్త పార్వతమ్మని కలవరపరచింది. అందుకే ఎంగట సుబ్బులికి కబురుపెట్టి ఎదురుచూస్తూ కూచుంది.

ఎంగటసుబ్బులు కొండను కూడా సునాయాసంగా ఢీకొట్టగలదు. కడపలో డ్వాక్రాలీడర్గా కూడా చేసింది కొంతకాలం.

బుగ్గనిండా వక్కాకుతో వచ్చి పార్వతమ్మ ఎదురుగా కూచుంది, మోకాళ్ల మీద రెండు చేతుల్నీ బారచాపుకుంటూ. మూతిమీది రెండువేళ్ల మధ్యనుంచి అంతదూరం పడేలా తుపుక్కున వుమ్మేసి పార్వతమ్మ వైపు చూసి తల ఎగరేసింది.

"కాదే. ఈ ఎయిరుసుకేదో మందు కనిపెట్టినాడంట కదా అమెరికావోడు," దిగులుగా అడిగింది పార్వతమ్మ.

"ఎవురే నీకు జెప్పింది. మద్దిలేసుగాడేనా. ఆ నా బట్టకు పనా పంగా. ఇట్టాంటియి ఏంటికిమ్మే నమ్మతావు. అయినా అమెరికావోడు నాకు జెప్పకుండా ఎట్ట గనుక్కుంటాడే మందు. ఎన్ని గుండెకాయలు?" అంది నవ్వుతూ బుగ్గలోపలి వక్కాకును వేలుతో సర్దుకుంటూ ఎంగటసుబ్బులు.

"నీకంతా కుశాలేనే. సచ్చే బయమేసింది తల్లే. మన పిల్లోల్లకు పిల్లోల్లు పుట్టకపోతే ఏమంట. అడక్కతినేదానికా! మన వొంసెం ఏడన్నా నిరువొంసెమైతాదని బయమా. అసలుకు వొంసెం ఏంటి కిమ్మే. నాకనా! ఆయిగా వుండాల్తల్లో. ఏంది గావాలంటే అద్దినొచ్చు. ఏంది గావాలంటే అది గట్టుకోవుచ్చు," పార్వతమ్మ తల వొంచుకుని రెండు చేతుల్ని పైకెత్తి అడ్డంగా ఊపుతూ అంది.

ఆమె గొంతులో భయం కంటే ఉత్సాహమే ఎక్కువగా ఉంది.

దానికి ఏకైక కారణం గారపట్టిన పళ్లతో ఎంత వికారంగా వున్నా, ఎంగటసుబ్బులు జీవ వంతమైన నవ్వే.

"చూడమ్మే పారవతీ! బయపడేదానికి ఏముండాదిమ్మే. బతికినంత కాలమూ బతుకుతాము. కాలము తీరిపోతే సస్తాము. బయమేంటికే నా సయితీ. అయినా ఎయిరుసేమన్నా సామాన్యరోగమా. ఇంగయిపోయింది. ఇట్ట బోవాల్సిందే లోకము. బెమ్మంగారు ఎప్పుడో చెప్పిండ్లా," అంది ఎంగట సుబ్బులు ఆకాశంకేసి చూస్తూ.

*

పదిహేనేళ్లు గడిచిపోయాయి!

ఎన్నో శాంతులు, పూజలూ ప్రపంచవ్యాప్తంగా జరుగుతూనే వున్నాయి, పరిశోధనలతో బాటు.

లక్షల ఏళ్లుగా ప్రకృతిశక్తులతో కోట్లకోట్ల పోరాటాలు చేసి, ఎన్నో వైపరీత్యాలకు ఎదురొడ్డి నిలబడి ఇంత గొప్పస్థాయికి పరిణమించిన మానవజాతి హఠాత్తుగా అంతమైపోవడాన్ని ఎవ్వరూ జీర్ణించుకోలేకపోతున్నారు.

గ్రహాంతరవాసుల కోసం లేక ఎప్పుడయినా మనిషి కానీ లేక మనిషిలాంటి వాడుగానీ ఈ నేల మీద ఉద్భవిస్తే వాళ్లకోసం మానవచరిత్రను, ముఖ్యమైన సైంటిఫిక్ ఫార్ములాల్ని, భాషను డీకోడ్ చేసుకోడానికి వుపకరించే సింబల్స్‌తో సహా నిక్షిప్తంచేసే ప్రయత్నాలు మొదలయ్యాయి.

*

హళ్లిన దిడి.

ఇరవై ఏళ్లుగా సాగిన పరిశోధనలు ఏమాత్రమూ ఆశావహంగా లేవు. ఎయిర్సనేది జీవభౌతిక, జీవరసాయనిక స్థితుల్నించి కాకుండా ఏదో అపరిచిత ఉనికినించి ఉద్భవించిందని మాత్రమే కనుక్కో గలిగారు.

సెల్వమణి, శైలూలు ఇంట్లోవాళ్లకి టాటా చెప్పేసి కార్లో బయలుదేరారు. ఆకాశం నిండా కారుమబ్బులతో చల్లచల్లగా వుంది వాతావరణం.

ఎయిర్‌పోర్టు పార్కింగ్‌లో కారు ఉంచేసి, బుకింగ్ దగ్గరికి వచ్చారు.

"ఎక్స్‌క్యూజ్‌మీ కాలిఫోర్నియాకి వెళ్లాలి. ఎన్ని గంటలకు ఫ్లయిట్. ఖాళీలేమన్నా వున్నాయా?" అడిగాడు.

"ఒక్కటైతే ఉంది. లేదూ ఇంకో రెండు గంటల్లో ఇంకో ఫ్లయిట్ ఉంది. మీ పేర్లు చెప్పండి," అన్నాడు బుకింగ్‌లో వ్యక్తి.

"ఇందుకే ఫోన్‌లో బుక్ చేద్దామంటే వినిపించుకుని చావవు," అంది శైలూ.

"నో... న్నో... న్నో... అయ్ హేట్ ఫోన్స్..." పొంగిపోతున్న ఉషారులోంచి సీరియస్ మొహంతో అన్నాడు సెల్వమణి భుజాల్ని ఎగరేస్తూ.

శైలూ ముసిముసిగా నవ్వుకుంటూ, "కోతి చేష్టలు... కోతికూతలు," గొణుక్కొంది.

పేర్లు రాయించేసి కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ మెయిన్ రోడ్డు చేరుకున్నారు ఇద్దరూ.

"రెండు గంటలు ఏం చేద్దాం," అడిగాడు.

"నాకయితే ఎప్పుడెప్పుడు కాలిఫోర్నియాలో పడదామాని వుంది."

"చూద్దువులే. ఎందుకంత హర్రీ. మూవీకి టైం చాల్దు. మూ... పోనీ లైట్‌గా బీరేమన్నా లాగిద్దామా!"

"లాగిద్దామా... ఇదొకటా పైగా... వొద్దు. వొద్దు. ఆ తర్వాత నీ వాగుడు నేను భరించలేను బాబూ," అంటూ పేవ్‌మెంటు మీద పడి ఉన్న వందరూపాయల నోట్లని చూసి, "దీసీజ్ టూమచ్ మణీ. ఇట్లా తొక్కేచోట పడెయ్యొచ్చా," అని ఆ నోట్లని జాగ్రత్తగా తీసి డస్ట్‌బిన్‌లో పడేసింది శైలూ.

ఇద్దరూ బార్‌లో కూచుని అంతులేని ముచ్చట్లలో మునిగిపోయారు.

సర్వ్ చేస్తున్న వ్యక్తి వచ్చి బీర్ వొంపుతూ-

"సర్. నాకు సినిమాకు టైమయింది. మీకు సర్వ్ చెయ్యడానికి వీలవుతుందా," అడిగాడు. సెల్వమణి తలూపాడు.

"నీతో ఇదే ప్రాబ్లెమ్. ఒళ్లు తెలీదు. ఇక గంటే టైముంది ఫ్లయిట్‌కి. ఈ గంటలో ఎవరూ దొరక్కపోతే ఇక్కడే వుండిపోవాలిగా సర్వ్ చేసుకుంటూ. మళ్లీ నెక్స్ట్ ఫ్లయిట్ ఎప్పుడో," అంది విసుగ్గా శైలూ.

"ఆ! ఏంగాదు. నీకెందుకు. ఎవరో ఒకర్ని రోడ్డుమీద పొయ్యేవాళ్లనన్నా రిక్వెస్ట్ చేస్తాగా," అన్నాడు సెల్వమణి. తరవాత ఇద్దరూ అందరికీ సర్వ్ చేస్తూ, మరోపక్క సరదాగా గడిపేసి, అరగంట తర్వాత అక్కడున్న ఇంకో యువకుడికి తమ సర్వింగ్ బాధ్యతల్ని అప్పగించి బయటపడ్డారు.

బుకింగ్‌క్లర్క్ దగ్గర తమపేర్లు రాసిన స్లిప్ తీసుకుని విమానం డోర్ దగ్గరతనికి చూపించి లోపలికి ఎక్కేశారు.

*

అర్జెంటీనా.

ఎయిర్స్ సోకి నలభైఏళ్లు గడిచాయి. ఇప్పుడు ప్రపంచంలో అందరూ నలభై ఏళ్ల పైబడినవాళ్లే.

చిన్నపిల్లలు కేవలం జ్ఞాపకాలకే పరిమితమయిపోయారు.

బడ్‌స్కిన్ పేరుతో పురిటివాసన పెర్‌ఫ్యూం- బేబీజాస్మిన్, లిటిల్‌మూన్ లాంటి పేర్లతో పిల్లల మొహం దగ్గర వచ్చే వాసన పెర్‌ఫ్యూమ్ టిన్స్ అప్పటికే తయారయ్యాయి. బడ్‌స్కిన్ ఒకసారి తల్లులై మళ్లీ కావాలని కాలేకపోయిన స్త్రీల కోసం. పిల్లల పెర్‌ఫ్యూమ్ పిల్లలడాల్స్ మీద వేసుకోడానికి.

అచ్చం పిల్లల్లా నడుస్తూ మాట్లాడే బొమ్మలు మార్కెట్ నిండా వచ్చేశాయి. పిల్లల ప్రతి రూపాల్తో సర్దుకోవాల్సిన స్థితి వచ్చింది ప్రపంచానికి.

ఇప్పుడు బాల్యం దొరికేచోట్లు కేవలం టీవీలు, సినిమా థియేటర్స్. అంతే!

జంతువుల పిల్లల్ని చేరదీయడమూ మొదలైంది. పులికూనల దగ్గర్నించి హైనా పిల్లలు... దూడలు... చివరికి పందిపిల్లలక్కూడా విపరీతమైన గిరాకీ పెరిగింది.

*

బ్రేవ్రాన్.

ఆ విశాలమైన ఆకుపచ్చ మైదానంలో దూరంగా వున్న పచ్చటి కలిక్రో కొండ మీద కదులుతున్న నల్లటి మరక అంతకు ముందెప్పుడూ లేదు. పైగా ముందు ముందుకొస్తోంది.

దగ్గరకొచ్చేసింది ఉధృతమైన శబ్దాలతో...!

ఒకదాని మీద ఒకటి దొర్లుతూ వస్తున్న చెక్క అల్మారాలు... నరికేసిన చెట్లు... చెక్క ఇళ్లు... ప్రాణం వున్నట్టు పరుగులు తీస్తున్నాయి.

కొయ్యల ప్రవాహం! వూళ్లోకి వచ్చేసింది.

పెద్ద శబ్దానికి ఉలిక్కిపడి లేచింది మార్గరెట్ భయంతో.

మూసి ఉన్న తలుపు ఎవరో లాగి విసిరేసినట్టు- ఊడి బయటికి ఎగిరిపోయింది. చెక్క కిటికీలు గోడల్ని పెళ్లగించుకుని రివ్వున బయట సాగిపోతున్న కొయ్యల ప్రవాహంలో కలిసిపో తున్నాయి. టీపాయ్‌లూ... డైనింగ్ టేబుల్... చివరికి తను పడుకున్న మంచం కూడా గాల్లోకి లేచింది.

సిమెంటు పెళ్లలు విసురుగా వచ్చిపడ్డాయి మార్గరెట్ మీద.

"రూసో... రూసో..." భయంతో కేకలు వేసింది. ఉలిక్కిపడి లేచి మార్గరెట్‌ని రెండు చేతుల్తో ఊపాడు రూసో. కళ్లు తెరిచింది మార్గరెట్.

"ఏమయింది మాగి?"

ఒక నిమిషం జరిగిందేమిటి అర్థం చేసుకోడానికి ఆగింది, గట్టిగా వూపిరి తీసుకుంటూ మార్గరెట్.

"ఏదో పీడకల," నిట్టూర్చింది.

మరునాడు ఉదయం.

తళతళలాడుతున్న లేత ఎండ! ఆకుపచ్చ కొలనులా చల్లటి లాన్.

కెటిల్‌లోంచి టీ వొంపుతూ రూసోతో అంది మార్గరెట్.

"రూసో. ఎంత విచిత్రం రూసో. ఎయిర్స్ రాకముందు ఎట్లా వుండేదో గుర్తుంది కదా!"

రూసో మార్గరెట్ వేపు చూశాడు. వయసు మీద పడుతున్నా ఆకర్షణ ఏమాత్రం తగ్గలేదు. దవడలు కాస్త వదులయ్యాయి అంతే!

రూసోకి మార్గరెట్ ఒక్కలా కనిపించదు. అనేక కాలాలకి చెందిన అయిదారు మార్గరెట్లుగా విడిపోయి అతడి మనసులో స్థిరపడిపోయింది. అయితే ఈ విభజనలో సౌందర్య దృష్టిదే సింహభాగం.

"జరిగిపోయిందాన్ని తల్చుకోక. జీవితమంటే ఈ టీ రుచి వుంది చూడు. ఇంతే... ఇప్పుడే... ఇదే..." వెచ్చటి టీ చప్పరించాడు రూసో.

"అయితే ఒక్కటి రూసో. ఎయిర్స్ వచ్చాక ప్రపంచం మారిన తీరు నాకు ఎంతో ముచ్చట గొలుపుతుందంటే నువ్వు నమ్మి తీరాలి. అయితే ఇదే పరిస్థితి ఇంత దురదృష్టం వల్ల కాకుండా మామూలుగా వచ్చివుంటే ఇంకెంత బావుండేదో కదా!"

నవ్వేడు రూసో.

"మనం ఎంత పిచ్చివాళ్లమంటే మనం పోయాక కూడా మన తాలూకు ఏదో అంశం ఇంకా ఈ లోకంలో మిగిలే వుంటుందని భ్రమపడతాం. పిల్లల రూపంలోనో, మన ఆస్తులరూపంలోనో లేక మన ప్రతిభ రూపంలోనో. చచ్చాక కూడా మన జ్ఞాపకాల్ని ఎవరో మోస్తూ వుండాలని ఆశిస్తాం. నిజానికి అట్లాటిది ఏదైనా వుందా! నువ్వెప్పుడన్నా నీ ముత్తాతను తల్చుకుంటావా? అసలు అతగాడి రూపమైనా గుర్తుందా!?... సరేపోనీ తల్చుకుంటావే అనుకుందాం. అది చనిపోయిన మీ ముత్తాతకు ఏవిధంగా సంతోషాన్నిస్తుంది?"

మార్గరెట్ లేచి కాకలిస్‌చెట్టు బెరడును పీలర్‌తో గిల్లెయ్యడం ప్రారంభించింది మౌనంగా.

"ఈమాత్రపు దానికి ఎంత తాపత్రయం మనిషికి. తన తదనంతరం కూడా కొనసాగాలనే అసాధ్యమైన దురాశతో..." కొనసాగించాడు రూసో.

"అలాగనే ఎందుకనుకోవడం? ఇప్పుడు ఈ కాకలిస్ పళ్లు కాసేటప్పటికి నేను ఎలాగూ వుండను. మరి ఎందుకు దీనికి సెర్వ్ చేస్తున్నానంటావ్?"

"ఈ చెట్టుకు సేవ చెయ్యడంలోని నీ ఆనందం వల్ల జరిగే నష్టమేమీ లేదు. అయితే ఆస్తుల్ని కూడబెట్టడంలో ఆనందం చాలామంది కడుపుల్ని మాడ్చేస్తుంది. కళ్ల ముందు ఏడుస్తున్నవాళ్లని నిర్లక్ష్యం చేసి ఎప్పుడో నా మునిమనవడు గురించి ఆలోచించడం ఎంత అన్యాయం...!"

"ఇదేకాకుండా మన తోటివారి కంటే ఉన్నతంగా వుండాలి అనే చిన్ని అనుభూతి కోసం మరింత కఠినులుగా మారిపోవడం లేదూ మనం... పిల్లికి కూడా బిచ్చం పెట్టకుండా... అసలు పెద్ద విషాదం ఇదే అనుకుంటా," పొడిగించింది మార్గరెట్ పెదవి విరుస్తూ.

"మనిషి ప్రాథమికంగా ఏ విషయంలోనూ సీరియస్ కాదు. ఏదీ పరిపూర్ణంగా, లోతుగా వుండదు. ఏడుస్తూ ఏడుస్తూ కూడా టీ తాగగలడు. తనకు మతిమరుపు అనేది ఒకటుందనీ, తను గడిచిపోతుంటాడనే విషయమూ గుర్తుండదు," కాకలిస్ మీది గూట్లోంచి అరుస్తున్న టినీల ఎర్రటి నోళ్లను చూస్తూ అన్నాడు రూసో.

"అసలు నేను అన్నదానికీ నువ్వు చెప్పిందానికీ ఏమన్నా సంబంధం వుందా," అంది మార్గరెట్. రూసో నవ్వేడు కొంటెగా.

ఆ రోజు పడుకోబోయేముందు-

"రూసో! నీకు ఎప్పట్నించో ఒక విషయం చెబుదామని... మళ్లీ ఏదో ఇబ్బంది వల్ల చెప్పలేక పోవడం..."

రూసో మార్గరెట్ కళ్లల్లోకి చూశాడు లోతుగా.

"నాకు తెలుసు. బలియో గురించేనా," అన్నాడు చిటికెవేసి.

ఆశ్చర్యంగా చూసింది మార్గరెట్. చిన్నగా నవ్వాడు రూసో.

"రేపు నువ్వెళుతోంది బలియో రిసార్ట్‌కే కదూ నాతో అబద్ధం చెప్పి," రూసో ఇదే మాటని నవ్వుతూ చెప్పకపోయుంటే చాలా ఆందోళనకి గురయ్యేదే మార్గరెట్. అయినా చిట్లిపోయిన మొహంతో చూసింది.

"మాగీ నీకు బలియోకి వున్న ఎఫైర్ ఎప్పుడో తెలుసు. నేను స్త్రీ అయి వుంటే బలియోతో ఒక్కసారన్నా గడపాలనుకుంటా. అంత ఆకర్షణ బలియోది... పైగా అతడి పాటలు... ఇందులో నీ తప్పుందని అనుకోను. పైగా నిన్ను తప్పుపట్టే అర్హత కూడా లేదనుకుంటా నాకు."

తనకు వూహొచ్చినప్పటినుంచి స్థిరపడిన విలువలన్నీ నశించి, కొత్తగా విచ్చుకుంటున్న విశాలత్వం రూసోకే ఆశ్చర్యంగా అనిపించింది.

*

క్రేవిన్ నగరం.

అప్పటికి సూర్యుడు కనిపించి వారంరోజులు దాటిపోయింది. తొంభై నాలుగేళ్ల కుప్రిన్ వులెన్‌కోట్లో, తెల్లగడ్డంతో మూర్తీభవించిన నిర్లిప్తతలా కూచుని వున్నాడు, సమొవార్ ముందు అరచేతుల్ని వెచ్చచేసుకుంటూ.

మందమైన అరిచేతుల ఆ ఆజానుబాహుడు ఎయిడ్స్ సోకిన తొమ్మిదినెలల తర్వాత పుట్టిన బిడ్డల్లో ఒకడు.

రూం హీటర్స్, ఫైర్‌ప్లేస్ వున్నా తమింట్లో వుండే పురాతన సమొవార్‌ని చాలా ఇబ్బంది పడి వెలిగించుకున్నాడు ఆరోజు పొద్దున్నే. ఎందుకో గతించిన అనుభూతులు అతణ్ణి చుట్టుముట్టేస్తు న్నాయి. చాలాసేపు కంప్యూటర్‌లో పాత ఫోటోల్ని చూస్తూ కూచున్నాడు. ఆ ఫోటోలన్నీ వేరే లోకానికి సంబంధించినవిగా అనిపించింది కుప్రిన్‌కు. అందులో బతికున్నవాళ్లు ఒక్కరూ లేరు. తన చిన్నప్పటి ఫోటోలు కూడా మృత చిత్రాల్లాగే అనిపించాయి.

తల్లిదండ్రుల ప్రేమ ఇంకా ఆ ఇంటిని అంటిపెట్టుకుని వున్నట్టే వుంది.

అతడి తల్లిదండ్రులు తమ కొడుకు చివరిరోజు వరకు సంతోషంగా వుండడానికి వీలయిన అన్ని ఏర్పాట్లు చేశారు. దేశవిదేశాల్లో వున్న తమ బంధువులు, స్నేహితుల చిరునామాలూ, ఫోన్ నంబర్లూ అన్నీ భద్రం చేశారు. ఎప్పుడెప్పటి సంబంధాల్నో పునరుద్ధరించారు. తన ఈడువాళ్లతో పరిచయాన్ని పెంచుకునేలా కుప్రిన్‌ని ప్రోత్సహించారు.

తమ బిడ్డ చివరి మానవుడు కాకూడదని వాళ్లు భగవంతుణ్ణి ఎంతగానో ప్రార్థించారు. అంత్య క్రియలక్కూడా నోచుకోని రాతను వాడి మొహాన రాయొద్దని కన్నీళ్లతో వేడుకున్నారు.

కుప్రిన్ తాత్వికుడిగా జీవించాలని వివాహం చేసుకోలేదు. తల్లిదండ్రులు గతించాక పూర్తిగా స్నేహితులే లోకంగా బతికాడు.

నగరపు మరణాన్ని దాదాపు కళ్లారా చూశాడు తను.

విశాలమైన ఇండికేటర్ బోర్డు నిశ్శబ్దంగా వుంది.. ఎరుపు, ఆకుపచ్చ లైట్లతో.

ఆకుపచ్చ లైట్లు కుప్రిన్ గ్రూపులోని స్నేహితులవి. ఎనిమిది లైట్లు మాత్రమే వెలుగు తున్నాయి పద్దెనిమిది లైట్లలో అంటే పదిమంది చనిపోయారు. వొక్కొక్క ఎర్రలైటంటే వొక్కొక్క

ఇతర గ్రూపన్న మాట. రెండు ఎర్రలైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. అంటే రెండు ఇతర గ్రూపులు మాత్రమే సజీవంగా వున్నాయి. కొన్ని వేల ఎర్రలైట్లు కుప్రిన్ కళ్లముందే ఆరిపోయాయి. వాటి కింద రాసివున్న పేర్లు గోరీలమీది రాతల్లా అనిపించాయి కుప్రిన్‌కు. ఇంత పాపిష్టివాడిగా బతకమనా నన్ను పుట్టించింది దేవుడా!

టోపీ గ్లాస్ తొడుక్కుని, పిస్తోల్ జేబులో వేసుకున్నాడు. మెడవరకూ కోటు గుండీల్ని పెట్టుకుని రోరిచ్ ఇంటికి బయలుదేరబోతూ ఇండికేటర్ బోర్డు మీద రోరిచ్ అని రాసివున్న బజర్‌ని నొక్కాడు వూరికే. స్పీకర్ ఆన్ అయింది కానీ జవాబు లేదు. కాసేపాగి మళ్లీ నొక్కాడు. వూహూ! మిగతా ఏడుమంది బజర్లని నొక్కుతూనే వున్నాడు వెన్యూ ఏమన్నా మారిందేమోనని. కానీ ఒక్కళ్లూ మాట్లాడ్డం లేదు. ఏమయ్యుంటుంది? కుప్రిన్ కాళ్లు వణికాయి. సోఫాలో కూలబడ్డాడు.

తాము ఎనిమిదిమంది ఇక్కడే కలిసున్నారు గత ఆరురోజులుగా. మొన్నటి రోజే తామంతా రోరిచ్ ఇంటికి వెళ్లాల్సి వుండింది. కానీ తనకెందుకో ఒంటరిగా గడుపుదామనిపించి రెండ్రోజుల్లో వస్తానని వాగ్దానం చేసి వాళ్లను పంపించేశాడు. ఈ రెండ్రోజుల్లోనే ఏం జరగగలదు?

వుడెన్ పార్టిషన్ మీద మరచిపోయి, వేలాడుతున్న రోరిచ్ కోటువంక చూశాడు. ఏదో చెబుదామని ప్రయత్నిస్తున్న మూగవాడిలా కదులుతోంది మెల్లిగా గాలికి.

బజర్ ఏదన్నా ప్రాబ్లమేమో అని రోరిచ్ సెల్‌కి ఫోన్ చేశాడు. నిస్సహాయంగా రింగవుతోంది అంతే! రోరిచ్... రోరిచ్...

ఏదన్నా జరిగుంటే తనకి బజర్ ఇచ్చేవాళ్లే. ఏమయ్యారు అందరూ?

రెండు ఎర్రలైట్లూ నొక్కి చూశాడు. వూహూ!? ఆశ్చర్యమూ, ఆందోళనతో కుప్రిన్ శరీరం కంపించింది. తాము ఏడు, మిగతావాళ్లు కనీసం ముప్పయిమందన్నా వుంటారు. ఇందరు ఒకేసారి ఏమయ్యారు?

ఏమవడానికి అవకాశముందో ఆలోచించసాగాడు.

పులులు, గ్రేబర్స్ అరుపుల్ని దూరంనించి విన్నామని నార్త్‌బ్రిజ్ గ్రూపు వాళ్లు చెప్పారు పదిహేను రోజుల కింద. అయినా ఇంతమందిని ఒకేసారి చంపడం అసాధ్యం. మరేమై ఉంటుంది? ఆరోగ్య సమస్యలు అందరికీ ఒకేసారి రావుగా.

కుప్రిన్ మనసులో మిగిలిపోయిన చిట్టచివరి మిస్టరీ!

అందరికీ ఒకేసారి ఏదైనా జరగడానికి వీల్లేదు! దృఢంగా అనుకున్నాడు.

దేనికి వీలుందో, దేనికి వీల్లేదో కనుక్కోడం అనే అవివేకపుపనికి పాల్పడుతున్నాడా తను ఇంకా?...

ఇంకా...!?

దూరంగా వున్న డ్రెస్సింగ్‌టేబిల్ అద్దంలో మరింత దూరంగా పొగచూరి అస్పష్టంగా కనిపిస్తున్న తన ప్రతిబింబంవేపు విషాదంగా చూశాడు.

'ఎవరెవరు వున్నారో ఎవరెవరు పోయారో ఖచ్చితంగా కనుక్కునే తీరాలా కుప్రిన్,' తన ప్రతిబింబాన్ని మర్యాదపూర్వకంగా ప్రశ్నించాడు.

హఠాత్తుగా పక్కనున్న ఫ్లవర్‌వేజ్‌ని వేగంగా అద్దం మీదికి విసిరాడు. అయితే అది గురి తప్పింది.

బహుశా తను ఈ నగరంలో చివరిమనిషి!

కానీ... నిజానికి అతడు ప్రపంచంలోనే చివరిమనిషి!

దేశవిదేశాల్లో వున్న స్నేహితులకు, పరిచయస్థులకు ఫోన్లు చేశాడు సాయంత్రం దాకా, కనీసం మనిషి గొంతన్నా విందామని. ఎవ్వరూ ఎత్తడం లేదు! మొత్తానికి మానవజాతికి చివరి రోజులు వచ్చేసినట్టున్నాయి అనుకున్నాడు.

మెల్లిగా నడుస్తూ వెళ్లి తన ప్రాణమిత్రుడు రోరిచ్ కోటును చేత్తో తాకాడు. తరవాత కోటును మొహానికి వొత్తుకున్నాడు. ఇంకా వదలని రోరిచ్ చెమట వాసన! వలవలా ఏడ్చేశాడు. మనుషులు... మనుషులు కావాలి. లేదూ వాళ్లకు సంబంధించిన ఏవైనా పర్వాలేదు.

గబగబా డ్రెస్సింగ్ టేబుల్ మీద వెతికాడు. వాళ్లు తల దువ్వుకుంటున్నప్పుడు ఏమయినా వెంట్రుకలు రాలాయేమోనని. లేవు! తరవాత టాయిలెట్‌లో కెళ్లి చూశాడు. అంతా ఫ్లష్ చేయబడి వుంది. బహుశా తనే చేసివుండొచ్చు. అయ్యో! ఎంత అవివేకం... ఎంత దురదృష్టం!

కిచెన్‌లో కెళ్లాడు. సగం కేకు ట్రేలో. బెత్నకొవ్ బర్త్‌డేకి మూడ్రోజుల ముందు తామంతా కలిసి తయారుచేసింది. బెత్నకొవే అందరి నోళ్లల్లో పెట్టాడు. ఆ కేకులోకి వేళ్లని ముంచాడు, బెత్నకొవ్ చేతి స్పర్శ కోసం.

సాటి మనుషుల విలువ ఇంత గొప్పదా. దేవుడా నువ్వు కూడా వద్దు. ఒక్క మనిషిని పంపించు. ప్లీజ్...

కాసేపు మళ్లీ ఆకుపచ్చ స్విచ్చిల్ని నొక్కేడు. తరవాత ఎర్ర స్విచ్‌ల్ని. ఆ తర్వాత మరణించిన వాళ్ల స్విచ్చిల్ని కూడా చాలాసేపు నొక్కుతూ కూచున్నాడు పరధ్యానంగా ఎందుకో తెలీకుండానే.

ఖాళీ ఇళ్ల తలుపుల్ని తడుతున్నాడా తను?

లేచి అల్మారా తెరిచి ఓ బాటిల్ బయటికి తీశాడు. ఎనిమిదేళ్ల కిందట సిటీ మేయర్ తాత్య కోవ్ క్రెవిన్‌లో వున్న అందరికీ అనురాగంతో పంచిన డ్రగ్!

జీవితం మరీ కష్టంగా అనిపిస్తే తాగమని రాసి వుంది దానిమీద.

సునాయాసంగా ఆత్మహత్య చేసుకోవడం కోసం వుద్దేశించింది.

జొబరా వచ్చి కాలును నాకుతోంది, పాలకోసం ఎగబడుతున్న పిల్లని పక్కకి తోసేస్తూ. జొబరా అంటే జింక. వంగి దాని మెడ నిమిరాడు. జొబరా ఎందుకో ఇంతకు ముందుకంటె తనతో ఎక్కువ ప్రేమగా వుంటోంది.

ఆ బాటిల్‌ని తిరిగి అల్మారాలో దాచేస్తూ అనుకున్నాడు కుప్రిన్.

'ప్రపంచంలో ఏ మూలనించైనా తనకు ఫోన్ రావొచ్చు. బజర్ మోగొచ్చు. తన ఇంటినించి నిశ్శబ్దం జవాబుగా వెళ్లడానికి వీల్లేదు!'

వోడ్కా తీసి గ్లాసులో వొంపుకున్నాడు, వొణికే చేతుల్తో.

కిటికీ కర్టెన్ని నెమ్మదిగా పక్కకి తొలగించి బయటికి చూశాడు.

రోడ్ల పక్కన వరసగా పార్క్‌చేసిన కార్లు మౌనంగా. వాటిమీద మరింత మౌనంగా కురుస్తున్న మంచు, శుభ్రపరిచేవాళ్లు లేక గుట్టలు గుట్టలుగా పేరుకుపోతూ!

అయిదురోజుల క్రిందట తన మిత్రుడు పావెల్‌తో కలిసి ఈ రోడ్డు మీద నడవడమే చివరిసారి. కలిసి అంటే పావెల్ అంతిమయాత్రలో పాల్గొనడం! సుమారు పద్దెనిమిది మంది వృద్ధులు వచ్చారు ఆ రోజు, సైరన్ విని.

పరమసుందరమైన క్రెవిన్‌నగరం దాదాపు నిర్మానుష్యం అయిపోయిందనుకున్నాడు. ఈ అద్భుతమైన శిల్పసంపదలు, అనూహ్యమైన కట్టడాలు... డావిన్సీ... షేక్స్‌పియర్... డాస్టవస్కీ... వ్యాంగో... పికాసో... అందరూ మరణించబోతున్నారా తనతోబాటే?

తను ఇక ఒక్కరోజైనా బ్రతకడం అవసరమా?

అవసరమేమీ కనిపించలేదు.

ఏ అవసరమూ కనిపించకపోయినా బ్రతకాలనిపించింది కుప్రిన్‌కు. మరుసటిరోజు కోసం గడ్డకట్టిన మాంసాన్ని ఫ్రిజ్‌లోంచి తీసి సమొవార్ పైన వున్న వేడి అరలో వుంచాడు. 'రేపు సూర్యుడు తప్పక కనిపిస్తాడు' గొణుక్కున్నాడు. నీరెండలోనన్నా వెచ్చటిమాంసం తినాలని ఆశించాడు.

రెండో పెగ్గు తాగేశాడు. కిటికీ బయట ధగధగమని వెలుగుతున్న దీపాలు!

ఇంకో పన్నెండేళ్లపాటు రాత్రింబవళ్లు దీపాలు వెలిగేలా ఇన్‌వెర్టర్స్ ద్వారా ఏర్పాట్లు చేయబడ్డాయి. చిన్నచిన్న సర్జరీ డెమోన్‌తో సహా సెల్ఫ్ క్లినిక్స్... ఫిల్డ్ ఫ్యూయల్ స్టేషన్స్... రక్షణకోసం ఆయుధాలు... ఇంకా ఎన్నో ఏర్పాట్లు! ప్రపంచంలో ఏ మనిషీ చివరిరోజుల్లో ఇబ్బంది పడకుండా అపరిమితమైన ప్రేమతో లేక ఇహలోకంలో కొనసాగింపులేని నిస్సహాయత నుండి పరలోకం పట్ల కొత్తగా పుట్టుకొచ్చిన గౌరవంతో చేసిన ఏర్పాట్లు!

రాత్రి పరదాని జిగేల్మని మెరిపిస్తున్న ఫ్లోరసెంట్ కాంతిపుంజాల నడుమ దేవతల ఆశీర్వాదాల్లా కురుస్తోంది మంచు. తన వూహ తెలిసినప్పట్నించీ కురుస్తోంది. ఇంకా కురుస్తూనే వుంటుంది. జలపాతాలు దూకుతూనే వుంటాయి. గాలి వీస్తూనే ఉంటుంది. మంచు ఎలుగులు స్వేచ్ఛగా ఇదే ఇంట్లో ఆహారం కోసం పోట్లాడుకుంటాయి. ఒక్క మానవులు మాత్రం ఎందుకు ఉండకుండా పోతున్నారు?

కళ్ల నిండా చలమల్లోలా నీళ్లు వూరాయి.

అయినా భగవంతుడి నిర్ణయాన్ని ప్రశ్నిస్తున్నాడా తను?!

మునివేళ్లతో రెండు కళ్లనీ మూసుకున్నాడు.

'తప్పు కుప్రిన్ తప్పు...' నొచ్చుకుంటూ తనకు తనే చెప్పుకున్నాడు.

తను మరో తప్పు చేయబోవట్లేదు. అంటే ప్రశ్నించబోవట్లేదు.

తను జీవితమంతా దేవుణ్ణి నమ్ముతూనే వున్నాడు. భగవంతుడు చెప్పిన మార్గంలో అయితే నడవలేకపోయాడు. త్వరలో అతడికి ఎదురుపడబోతున్నాడు. ఎలా క్షమాపణల్ని చెప్పుకోవాలో... ఏఏ కారణాలు చూపాలో... ఆలోచిస్తూ రోరిచ్ కోటుని మొహాన వేసుకుని నిద్రపోయాడు కుప్రిన్.

అతడు ఇక మళ్లీ లేవలేదు.

కోట్ల సంవత్సరాల క్రిందట ఈ లోకంలో పసిపాపగా పుట్టి, కాలక్రమంలో తన సహవాసులైన జంతువులు, వృక్షాలు, నదులు, ఎడారులు, పర్వతాల మీదే కాకుండా విద్యుచ్ఛక్తి, గాలి, వేడి వంటి కొన్ని ప్రకృతి శక్తుల మీద- చివరికి మతం, దేశం, భాష, కులం, వర్గం, రంగు, జ్ఞానం, జెండర్, సిద్ధాంతాలు, దేవుళ్లు వంటి సాకులతో సాటిమనుషుల మీద కూడా బలంతో, తెలివితో ఆధిపత్యాన్ని సాధించి, యథేచ్ఛగా ఈ భూమిని పాలించానని, అసలీ భూమి తన వొక్కరి సొత్తేనని భ్రమించిన మానవజాతి అంతరించిపోయింది.

*

అయితే-

గోడమీది పిల్లల్లో కదలికలు! వాళ్లని ఎయిర్స్‌గానీ, కాలం కానీ తాకలేదు. కిందికి దూకారు. దుమ్ములో కూరుకుపోయి తొంభైనాలుగేళ్లుగా పిల్లలస్పర్శ కోసం ఎదురుచూస్తున్న బంతికేసి అడుగులేశారు.

కనీసం ఈసారన్నా దయాపూరితమైన మానవజాతి వుద్భవిస్తుందని ఆశిద్దాం!?

*నవ్య వీక్లీ*
*18 ఆగస్టు 2004*

నేపథ్యం

మానవజాతి అంతమైపోతే...

# చివరి మనిషి

***కథంతా దృశ్యరూపంలో సాగుతుంది. పాత్రల మనోవిశ్లేషణలు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఏం జరిగిందో చెప్పేశాను తప్ప తీర్పుల జోలికి పోలేదు. చదువరులే అంతిమ నిర్ణేతలు. నాకంటే తెలివైన నిశితమైన పాఠకులు వుంటారని తెలిసినప్పటికీ ఏదో చెప్పాలనే లౌల్యాన్ని మాత్రం నిగ్రహించుకోలేకపోయాను.***

ఎప్పుడొచ్చినా 'మన సేనలు పరాజయం పాలై విజయవంతంగా తిరిగి వచ్చుచున్నవి,' అనే కవి సీతారాం, 'రోడ్డు మీద వెళ్లే వాళ్లను బాల్ అందించమని అడిగే పిల్లల మీద కథ రాయొచ్చు కదా,' అన్నారు వొకనాడు. ఆ అనడంలో వున్న సీరియస్‌నెస్ నన్ను గట్టిగానే తాకింది. సీతారాంకి పిల్లల పట్ల వుండే ప్రత్యేక శ్రద్ధ ఎప్పట్నించో తెలుసు. సీతారాం వెళ్లిపోయినా ఆ ఆలోచన మాత్రం నా గదిలోనే వుండిపోయింది.

ఏది తోస్తే అది రాసుకుంటూ పోయే నా స్వభావానికి ఇట్లా ఒక విషయం మీద రాయడమెలాగో చాలారోజులు తోచలేదు. అయినా అప్పుడప్పుడూ ఈ విషయం గుర్తొస్తూ వుండేది. ఆ క్రమంలో కథకి కొంత అస్పష్టరూపం కూడా ఏర్పడింది. నిజానికి ఇలా ముందే ఒక రూపం ఏర్పడ్డం కూడా నా సహజ పద్ధతికి వ్యతిరేకమే. రచయితకైనా రాయబోయేది ముందే తెలిసిపోతే థ్రిల్లేముంటుంది? అడుగడుగునా కనిపెడుతూ పోవాలి కదా! అన్నది నా నిశ్చిత అభిప్రాయం.

ఒకసారి కర్నూలు ప్రయాణంలో వుబుసుపోకకి ఓ డాక్టరు మిత్రుడికి ఈ కథ చెప్పి కొన్ని సందేహాలు కూడా అడిగాను వైద్యపరమైనవి. వీర్యకణాలు మరణించడం... ప్రపంచం అంతమైపోవడం... ఇదంతా ఏదో గందరగోళంలా వుంది కదా అని పెదవి విరిచాడు. అయినా సరే దీన్ని కథగా రాసి చూద్దామనిపించింది. మొత్తానికి 'కథల

కోరిక' కలిగిన ఓ రోజున దీన్ని ఆరంభించాను. నేను రాసిన ఏ కథా సింగిల్ సిట్టింగ్‌లో అయిపో వాల్సిందే. తరువాత సిట్టింగ్ దాకా ఆ ఆసక్తిని నిలబెట్టుకోడం చాలా కష్టం.

ఈ కథ మాత్రం రెండు సిట్టింగుల్లో పూర్తయింది. మెరుగులు పెట్టడానికి మాత్రం నాలు గయిదు రోజులు తీసుకున్నాను. మెరుగులంటే చాలాసార్లు కథలోని వ్యర్థపదాల్ని, పునరుక్తుల్ని తీసెయ్యడమే.

అప్పట్లో ఇంటర్‌నెట్ ఇంత అందుబాటులో లేదు. ఏదో దేశంలో ఓ కొండ పేరు రాయాలి. ఎలా తెలుస్తుంది? కలిక్రో కొండ అని ఒక పదం నేనే పెట్టేశాను. మన మాస్టర్‌పీస్ 'మాయాబజార్' మనసులో మెదిలింది అలా పెట్టేటప్పుడు. ఇదేమీ ఎవరికీ రెఫరెన్స్ కాదు ఫిక్షనే కదా. అసలు ఈ కథే నిజం కాదు. ఇక ప్రాంతాలూ, వైద్యవిధానాలు, జంతువుల పేర్లు మాత్రం నిజం కాకపోతే ఏమవుతుంది అని కొంత తర్జనభర్జన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నాను. దాని ఫలితమే నయిచిమ్, కకుబా, బండాల్లీ వంటి పదాలు.

ఈ కథ ప్రపంచ వినాశనానికి చెందింది కాబట్టి వొకే ప్రాంతంలో జరిగితే బావుండదనిపించి రకరకాల ప్రాంతాల్లో జరిగినట్టు రాశాను- అనేక ప్రాంతాల్లో, అనేక కాలాల్లో జరిగే కథల్లో చిక్కదనం పోతుందనే అభిప్రాయం వున్నప్పటికీ. ఒక్కసారి మాత్రమే కనిపించి మాయమయ్యే పాత్రల పట్ల, స్థలాల పట్ల పాఠకులకు ఒక జ్ఞాపకానుభూతి, ఒక పోగొట్టుకున్న అనుభూతి మిగులుతుందేమో అనిపించింది చిక్కదనం పోయినా. అయితే ఆ తాత్కాలిక పాత్రల్ని ఆ కొంచెం పరిచయంలోనే పాఠకులకు దగ్గర చెయ్యడానికి తీవ్ర ప్రయత్నమే చేశాను. హాలీవుడ్ సినిమాలు చూసిన అనుభవం ఈ విషయంలో బాగా వుపయోగపడింది.

ఈ కథ రాసేటప్పుడు ఇంత నేపథ్యం లేదు. అంతా బుద్ధికి తోచినట్టు జరిగిందిలా వుంది. కానీ ఇప్పుడు - విశ్లేషిస్తున్నప్పుడు ఇవన్నీ వ్యూహాల సైజులో కనిపిస్తున్నాయి. రూసో మార్గరెట్ సంభాషణల్లో కొన్నిచోట్ల జిడ్డు కృష్ణమూర్తి మాటలు యధాతథంగా వచ్చేశాయి. దాన్ని కాపీ అనా లంటే మనసు ఒప్పుకోడం లేదు. ప్రభావం అంటే సరిపోతుందేమో. లేక ఆ సందర్భానికి అతికాయి కాబట్టి వాడుకున్నానంటే సరిపోతుందేమో. మొత్తానికి విశ్లేషణే అంత సులభంగా అనిపించడం లేదు. అసలు నేను అన్నదే అనేక ప్రభావాల సమ్మిళితం అని అనుకుంటాను కాబట్టి ఇక గొడవే లేదు.

కథంతా దృశ్యరూపంలో సాగుతుంది. పాత్రల మనోవిశ్లేషణలు చాలా అరుదుగా కనిపిస్తాయి. ఏం జరిగిందో చెప్పేశాను తప్ప తీర్పుల జోలికి పోలేదు. చదువరులే అంతిమ నిర్ణేతలు. నాకంటే తెలివైన నిశితమైన పాఠకులు వుంటారని తెలిసినప్పటికీ ఏదో చెప్పాలనే లౌల్యాన్ని మాత్రం నిగ్రహించుకోలేకపోయాను అక్కడక్కడా. నేను చెప్పలేకపోతున్న నేపథ్యం తెర వెనకాల అంద కుండా ఇప్పటికీ మిగిలే వుంది. బహుశా ఎప్పటికీ వుంటుంది.

ఈ కథకి మొదట అనుకున్న పేరు 'ఒక వీర్యగాథ'. కొంచెం జుగుప్సగా అనిపించింది. వస్తువుల పట్ల మన ప్రెజుడిసెస్ అలా వున్నాయి. మాంసం తిన్నప్పటికీ ఎముకలెందుకు మెళ్లో వేసుకోడమని చివరి మనిషి అని మార్చాను చివరికి. పూర్తయ్యాక నాలుగయిదుసార్లు చదివాను. తృప్తిగా అనిపించలేదు. ఎందుకంటే పాఠకుణ్ణి తెలియని ప్రాంతంలో వొదిలేయడం నాకు ఇష్టం. కారణం నేను బాగా ప్రభావితుణ్ణయింది విపుల మాసపత్రికలో అనువాద కథలు చదివి. ఆ కథలు నన్ను అబ్బురంలో ముంచెత్తి, సుదీర్ఘమైన ఆలోచనాతీరాల్లో వదిలేసేవి. వాటిలోని అసం పూర్ణత నా లోపలి పొరల్ని పాయలు పాయలుగా విడదీసేది. పూరించుకోడానికి కొత్త కొత్త చేతుల్ని

మొలిపించేది. ఇది అలా లేదే అని నా బాధ. చివరికి దీన్ని చెత్తబుట్టలో పడేద్దామనే (ట్రాష్) నిర్ణయానికి వచ్చిన సమయంలోనే ఒక కవిమిత్రుడు మా ఆఫీస్‌కు రావడం ఈ కథని చదవడం జరిగింది. అతను కూడా పెదవి విరిచి ఇది నీ స్టయిల్లో లేదు. యండమూరో మల్లాదో రాసినట్టుంది అన్నాడు.

నా స్టయిల్ సంగతి ఏమోగానీ మల్లాది వెంకటకృష్ణమూర్తి నా అభిమాన రచయిత. అలా వుందా అని నేను వుబ్బితబ్బిబ్బయి మరునాడే నవ్య వారపత్రికకు పంపాను. శ్రీరమణగారు భారీ డిస్‌ప్లేతో ఈ కథని అచ్చేశారు. అదే అడిగితే అవునండీ కథను బట్టే డిస్‌ప్లే అన్నారు. నాకు సంతోషమూ, ఆశ్చర్యమూ ఒకేసారి కలిగాయి. తరవాత ఇది *కథ 2004*లోనూ, అమెరికా నుంచి వెలువడే తెలుగునాడిలోనూ, *కథావార్షిక*లోనూ వచ్చి నన్ను మరింత విస్మయపరిచింది. ఆ సంకల నాల్లో కొన్ని పద్ధతులకు అనుగుణంగా రాసినవాళ్లకు, కొన్ని ప్రత్యేకతలు కలిగినవాళ్లకు మాత్రమే చోటుంటుందని అనుకునేవాణ్ణి.

అయితే ఈ కథ తర్వాత నా ఇష్టాలకు పాఠకుల ఇష్టాలకూ తేడా తెలిసొచ్చింది. సమన్వయం కుదరక అప్పట్నించి నాలుగు సంవత్సరాలు కథలే రాయలేదు. ఎందుకంటే నా ఇష్టంలో పాఠకులు కూడా వున్నారు.

*26 ఫిబ్రవరి 2012*

*'చివరి మనిషి' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

32

# చనుబాలు

## సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి




*సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి 1963 ఫిబ్రవరి 16న కడప జిల్లాలో జన్మించారు. మొదటి కథ కడితి వేట 1987లో ఆంధ్ర పత్రికలో అచ్చుయింది. 50 కథలు రాశారు. మూడు కథా సంపుటాలు, ఐదు నవలలు ప్రచురించారు. కవిత్వం రాస్తుంటారు. కాడి నవలకు ఆటా పురస్కారం లభించింది. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు.*

**చిరునామా**

*బాలరాజుపల్లె, నరసాపురం పోస్ట్*
*కాశినాయన మండలం,*
*కడప జిల్లా - 516 217*
*Ph.: 94412 87865*


చీకటి చిక్కబడింది.

బలహీనంగా వెలిగే వీధిలైట్ల కాంతిలో వేపచెట్టు కింది అరుగు మీద మరింత దట్టమైన చీకట్లో నా చుట్టూ ఐదారు బీడీముక్కలు మినుకు మినుకుమంటున్నాయి.

వాటి నిప్పు, వెలుగు అరుగు ముందు నిల్చున్న నాలుగైదు జతల కనుపాపల మీద ప్రతిఫలిస్తోంది.

"మాదా కవలం తల్లీ! సందాకవలమమ్మా!" అంటూ భిక్షగత్తెలు ఇల్లిల్లూ తిరిగి గొంతెత్తే వేడికోళ్లు ఇక్కడిదాకా పాకుతున్నాయి.

తెగులు చూపిన కోళ్లను అగ్గవగా ఎదరకపోతున్న బేరగాళ్లు వాటి కాళ్లకు తాళ్లు గట్టి సైకిలు మీద వేలాడేసుకు వెళ్తోంటే- అవి అరిచే అరుపులు వీధంతా ప్రతిధ్వనిస్తున్నాయి.

"ఇంగరారాదబ్బీ! పొద్దుబోలే?" ఎదురుగా పంచలోంచి మా అమ్మ పిలుపు.

"ఆ... వస్తాండలే..." చెప్పాను.

"ఏం ఏసేబూ! మీరు మీరు ఏదోకటి మాట్లాడుకొని చెప్పండి మరి," అరుగు ముందు నిల్చుని ఉన్న కొత్త మాలోల్ల నాయకుని కేసి చూస్తూ అన్నాను.

"అట్టనేబ్బా! అందరం కల్సి మాట్టాడుకొని ఎట్టనో కట్ట సద్దుకొంటంలే మరి. ఏమ్మాట పొద్దున్నే వొచ్చి నీతో

సెపుతలే రెడ్డే... వస్చం సోమీ,'' అంటూ మెల్లగా అక్కణ్ణించి కదిలాడు ఏసేబు. అతనితోటి మిగిలిన మాలలు కూడా అనుసరించారు. వాళ్లటు వెళ్లగానే అంతవరకు జరిగిన చర్చ మీద మావాళ్లు సమీక్ష మొదలెట్టారు.

''యీ మాలోల్ల పనే బాగుంది. అందరికీ మిద్దెలోస్చాండయి. తిన్నే తినకున్నే సల్లగా పండుండొచ్చు. మనమే... గుడిసెకు ఎక్కవా, కొట్టానికి తక్కవా అయి సచ్చేది,'' వేళ్లు చురక్కి మనేదాకా పీల్చిన బీడీముక్కను విసరేస్తూ అన్నాడు గురన్న.

''గవర్నమెంటు ఇస్తాంది. వాల్లు తీసుకుంటాంద్రు మామా!'' చెప్పాను.

''ఏం గవన్మెంటబ్బీ! ఓట్లకు అమ్ముడుబొయ్యేది,'' కేకరించి ఉమ్మాడు పులి సుబ్బన్న. ''వాల్ల కన్నా హీనంగా బతికెటోల్లు మనోల్లలో లేరంటావా. ఏటా దోవ దప్పకుండా వచ్చే ఈ కరువుల్తో నెత్తి నిండా అప్పుల మోత ఎక్కవై మన బతుకులు రోజు రోజుకూ ఇగిరిపోతాండయి. వాల్లకేం కూలి మారాజులు. రొంద్రూపాల బియ్యమొచ్చినానికె ఒక్కరోజు కూలికిబోతే సాలు మూడ్రోజులు గోడ కింద కూకున్నే జరిగిపోద్ది. వాల్ల కంటే మన బతుకులేడ బాగుండాయబ్బీ! ఈ గవన్మెంటోల్లకు బుద్ధిలేదుగాని,'' అన్నాడు, ఆవేదన తోటి ఆవేశం మిళితమైన స్వరంతో.

''నిజమే నిజమే. సుగంగా బతకాలంటే ఇట్లా కూలికెన్నా బోవాల, అట్లా ఉజ్జోగమన్నా సూసుకోవాల,'' పక్కనే ఉన్న ఎంగన్న అందుకొన్నాడు.

''ఏమన్నాగానీ, మనకన్నా వాల్లే బాగా బతుకుతాన్రు,'' సిద్ధయ్య సిద్ధాంతీకరించాడు.

''మనమెంత ఈనంగా బతికినా అదో అట్లా బొచ్చె దీస్కోని ఇండ్లమ్మటి బోలెం గదా!'' రంగమ్మ అనటంతో అందరి కళ్లూ అటుకేసి తిరిగాయి.

సత్తు పళ్లేన్ని చంకన బెట్టుకొని వీధిలైటు వెలుగులో పై వీధికెల్తూ కన్పించింది మాల పొట్టక్క.

''యాడికో ఈదెక్కి పోతాంది. ఊరంతా దిరిగినా పెసిడెంటు ఇంటికాన్నే గాదూ దానికింత పిడ్స బుట్టేది,'' గురన్న అన్నాడు.

''ఈల్లింటికి దానికి అంత లంకె ఉంది మరి. ఈల్లమ్మ తన పాల మిగిలిచ్చెయినా ఆ పొట్టిదానికి పెడ్తది.''

నాకు వినబుద్ధి గాలేదు.

ఆ సంభాషణ పొడిగింపు భరించరానిదిగా ఉంది.

వాళ్ల మాటల్లో దాగున్న వ్యంగ్యం నాలో తగలరాని చోట తగిలి చురక్కిమనిపిస్తోంది.

ప్రెసిడెంటును అయినంత మాత్రాన నేను వాళ్ల ఎగతాళికి అందనంత ఎత్తులో ఏమీ లేను. నిన్న మొన్నటిదాకా నిరుద్యోగిగా ఉండి ఈరోజు ప్రెసిడెంటు అయినవాణ్ణి.

నేనూ వాళ్లల్లో ఒకణ్ణే.

కాదంటే- నా తండ్రి అహోరాత్రుల శ్రమ ఫలంగా అంతో ఇంతో వాళ్ల కన్నా మంచి ఆర్థికస్థితి కలవాణ్ణి.

వరసైన వాళ్ల ఎగతాళి భరించటం బరువే.

అందులోనూ పొట్టక్కతోటి మా కుటుంబానికున్న సంబంధాన్ని గురించిన ఎగతాళికి నేనసలు తట్టుకోలేను.

చిన్నప్పటిలా బహిరంగంగా గేలిచేయకున్నా, నర్మగర్భంగా వాళ్లు చేసే ఎగతాళి నా మర్మాల్లో నాటుకొంటోంది.

అక్కడికీ నేను హుందాగా ప్రవర్తించటంతో అంతగా పేలటం లేదు.

పొట్టక్క సంగతి దాటవేసేందుకు రాబోయే ఎం.పి. ఎలక్షన్ల సవాలెత్తాను.

దాని మీద చర్చ చాలాసేపు సాగంది.

అంతలో పొట్టక్క ఊరంతా చుట్టి మా ఇంటి వద్దకు రావటం, ఆమె కోసమే కనిపెట్టు కున్నట్లు మా అమ్మ పప్పుబువ్వ పళ్లెంలో వేయటం, పొట్టక్క పంచదిగి అరుగు ముందు నించే వెళ్లటం జరిగింది.

"నేజెప్పలే..." గురన్న మళ్లీ ఎత్తబోతున్నాడు ఆ విషయం.

"ఏమబ్బీ! ఇంగరా నాయనా," మా అమ్మ పిలుపు.

నాకొంత ఊపిరి పీల్చుకున్నట్లయింది.

"బువ్వ దిని రాపోండి," చెప్పాను అరుగు దిగుతూ, చర్చ కొనసాగకుండా ఆపుతూ.

పై పంచెలు దలుపుకొంటూ నాతోబాటు కొందరు కదిలారు.

మెల్లిగా ఇంట్లోకెళ్లాను.

అమ్మ మీద అసహనంగా ఉంది.

భార్య మీద కోపంగా ఉంది.

మౌనంగా స్నానం చేసి భోజనం అయిందనిపించాను.

తల్లితో చెబితే ఉపయోగం కన్పించేట్టు లేదు.

అసలు- నాదొక సమస్యగా ఆమె అర్థం చేసుకొనేట్లు చిత్రించలేనేమోనని నా అనుమానం.

నాకు మాత్రం ఇదొక సమస్యగా ఈమధ్య కాలంలోనే గదా విస్తృతమైంది.

రెండు మూడుసార్లు ఇందిరకు చూచాయగా చెప్పి చూశాను.

దీన్నంత తీవ్రమైన సమస్యగా ఆమె తీసుకొన్నట్టు లేదు.

అందుకే ఆమె మీద కోపం.

లేచి అలవాటుగా అరుగు వద్ద కెల్తోంటే మంచమ్మీంచి నాన్న అన్నాడు, "రొవ్వొంతసేపు పురాణం సదివి చెబితేమబ్బీ!- ఆ పొలుబొందులేని మాటల్తో పొద్దుబుచ్చుకుంటే," అని.

నేను విన్పించుకోనట్టుగా వెళ్లి అరుగుమీద కూర్చున్నాను.

పంచాయతీ ప్రెసిడెంటును అయింతర్వాత రాత్రి పొద్దుబోయిందాకా అరుగు మీద యవ్వారం తప్పనిసరి బాధ్యత అయింది.

రాత్రి చర్చ సొంతం మాలోల్లకు రాబోతోన్న బిల్డింగుల గురించే సాగింది.

వాళ్లతోబాటు తమకు కూడా బిల్డింగులొచ్చే అవకాశమేదైనా ఉందేమోననని రైతుల వెదుకులాట.

తమకు బిల్డింగులొచ్చే అవకాశం లేదని తెలిసేసరికి మాలోల్ల మీద కొంత ఈర్ష్యలాంటిది వ్యక్తం చేశారు ఒకరిద్దరు రైతులు.

యవ్వారం ముగించి ఇంట్లోకెళ్లి మంచినీళ్లు తాగి దొడ్లోకి నడిచేసరికి మంచమ్మీద కనుగూరికి ఉంది ఇందిర.

నా స్పర్శ సోకగానే మెల్లిగా ఒకపక్కకు సర్దుకొంది.

"ఏం యవ్వారమబ్బా! సగిరబొద్దు దాకా. నాకీ దొడ్లో ఒక్కదాన్ని పండుకోవాలంటే ఎట్లనో ఉంటది. బిన్నే వస్తేనేం?" అంది.

ఇప్పటిదాకా నిద్ర బట్టలేదు కాబోలు.

నేను వెల్లకిలా పడుకొని మౌనంగా నక్షత్రాల కేసి చూస్తున్నాను.

ఆమెను మందలించేందుకు లోలోపల అసహనపడుతున్నాను.

పొట్టక్కను గురించి హెచ్చరించేందుకు ఆవేశపడుతున్నాను.

ఆమె చేయి మెల్లగా నా ఎదల మీద కొచ్చింది.

దానితోటే తల కూడా వచ్చి కుదురుగా సర్దుకొంది.

నేనా అనుభూతికి ఓవైపు బలంగా ఆకర్షింపబడుతోన్నా, రాయిలా ఉండేందుకు విశ్వ ప్రయత్నం చేయసాగాను.

కొద్ది క్షణాల్లో పూర్తి కరిగిపోవటం ఖాయమనే సంగతి అర్థమై వెంటనే నోరు విప్పాఉ.

"రేపట్నుంచి ఆ పొట్టక్కను ఇంటికాడికి రానీగాకండ్రి," చెప్పాను.

మోచేతుల్ని ఆపుగా నా ఎదల మీద తలపైకి లేపింది ఇందిర.

"అదేం కూలికి నాలికి వచ్చేదా? కావిలి గంతలుండేదా? రోజూ కూడుబెట్టి సాకుతాండ్రు," కోపంగా అన్నాను.

ఆమె కండ్లలోని ఆశ్చర్యం నా కళ్ల మీద తళుక్కున మెరిసింది. పొట్టక్కను అట్లా సంబోధించటం నాలో సైతం ఒక మూల అపరాధభావంగా రగులుతోంది.

ఆమె మీది అసహనాన్ని నా నాలుక అంతకన్నా సున్నితంగా వెలగక్కలేకపోయింది మరి.

"మా అమ్మకు నువ్వయినా చెప్పి ఆమె పీడ ఎట్లనో వదిలించు," చెప్పాను.

ఉపోద్ఘాతం అర్థంకాని విద్యార్థినిలా నాకేసి చూసింది ఇందిర.

"మన పెళ్లయిన కొత్తలో నువ్వే సెబితివి. పొట్టక్కను రొవ్వొంత బాగా సూసుకోమని. ఇంటికాడి కొస్తే లేదనకుండా పంపమని?" ప్రశ్నార్థకంగా ఆగింది.

సమాధానం కోసం చాలాసేపు నేను గుండె తడువుకోవలసి వచ్చింది. అంతలో ఆమె తల నా ఎద మీద సున్నితంగా వాలింది.

*

చిన్నంబలి పొద్దయింది.

నోట్లో వేపపుల్ల ఆడిస్తూ తోట వద్ద నుంచి తిరిగి వస్తున్నాను. జ్యోతివాగులో దిగేసరికి ఏసేబు ఎదురయ్యాడు, 'నీకోసమే వస్తాండ సామీ!' అంటూ.

"మాట్లాడుకొన్నేరా?" అడిగాను.

"కుదర్లేదయ్యా!" వెనకే నడుస్తూ చెప్పాడు.

"ఏం?"

"ఆ నా కొడుకులు తావు సాల్దంటాండ్రు."

"నిజంగా చాల్దా."

"బిల్డింగులకు సరిపోద్ది. గొడ్డు గోదా కట్టేసుకోవాలంటేనే బరువు."

కొద్దిసేపు మౌనం. తర్వాత చెప్పాను. "నేను కనుక్కొంటాలే," అని.

ఏసేబు ఆగి మిరపచేల కేసి సాగాడు, గొర్రెపిల్లలకు ఆముదపు ఆకు కావాలంటూ.

వాస్తవానికి ఏసేబు మా ఊరివాడు కాదు.

మా మాలోల్ల చుట్టం.

అతనిలాంటి వాళ్లు పదిమంది దాకా వచ్చి ఇక్కడ స్థిరపడ్డారు. కూలి నాలి చేసుకుంటూ, విస్తారంగా వ్యాపించి ఉన్న బరకభూముల్లో కొర్రో, అరికో పండించుకొంటూ బతుకుతున్నారు. నాలాంటి పనిచేయలేని వాళ్ల భూముల్ని కోరుకు గుత్తకు చేసుకొంటున్నారు.

ఇప్పుడు బిల్డింగులొచ్చేసరికి వాళ్లకు ఊర్లో స్థలాలు తక్కువయ్యాయి. ఇంతదాకా తమ తావుల్లో గుడిసెలేసికోనిచ్చిన బంధువులు ఇప్పుడు లేచి పొమ్మంటున్నారు.

ఈ తకరార్ల మధ్య వచ్చిన బిల్డింగుల్ని వదిలేసుకొంటారేమోనని నాక్కొంత ఆందోళన కలిగింది.

వాళ్లకు నా హయంలోనే పక్కాగృహాలు కట్టించాననే తృప్తికన్నా, రాజకీయంగా వాళ్లెప్పుడూ నావైపే ఉండిపోతారనే నమ్మకం నాకెక్కువ ఆనందాన్ని కలిగిస్తూ ఉండేది.

అదిప్పుడు బీటలు వారటం పట్ల బాధగా ఉంది.

ఇంటికెళ్లి ముఖం కడుక్కొని కడుపులో ఇంత పిడచ వేసికొని పంచలోకొచ్చేసరికి, "ఓయ్ దొరా!" అంటూ వచ్చాడు గురన్న.

అని వెనక పులి సుబ్బన్న, ఎంగన్న, తిరిపేలయ్యలు ఉన్నారు.

అందరూ మంచాల మీద కూచున్న తర్వాత, "ఇంతకూ మిద్దెలు ఖాయమేనా ఓహోయ్?" అని అడిగాడు గురన్న.

"ఆ... ఖాయమే," చెప్పాను.

"ఎన్ని?"

"నలభైదాకా."

"ఇరవై ఇండ్లోల్లే గదబ్బీ ఈల్లంతా?" పులి సుబ్బన్న అడిగాడు ఆశ్చర్యంగా.

"పెద్ద కుటుంబాలున్నాయి గదా! ఏరుబొయ్యేవాళ్లకు కావొద్దా!" చెప్పాను.

"అవున్లే, పుట్టిన పిల్లోడంతా యేరుబొయ్యేవోడే," ఎంగన్న అన్నాడు.

"మనమిప్పుడేమీ అనుకోవాల్సిన పన్లే. మన పూర్వీకులకు బుద్ధి లేదు," బీడీ ముట్టించుకొంటూ అన్నాడు పులి సుబ్బన్న.

"ఏమీ?"

"బుద్ధున్నోల్లయితే మాలిండ్ల ప్రక్కన ఊరు గట్టకొంటరూ?" గయమన్నాడు. నాకు నవ్వొచ్చింది.

"ముందు మనోల్లే వూరు గట్టారేమో?" అన్నాను.

"అట్లయితే మాలోల్లను ఊర్లో ఇండ్లేసుకోనిస్తరు," అన్నాడు కోపంగా.

నిజమే.

ప్రతి ఊరికి మాలవాడ దూరంగా ఉంటుంది.

మా ఊర్లోనే కలిసి ఉంది.

పూర్వం మా బరుగొడ్ల కొట్టం హద్దుగా పడమటి వీధంతా మాలిండ్లేనట. నలభై యాభై ఇళ్లదాకా ఉండేవట. వాళ్లంటే జంకుతూ ఉండేవాళ్లట వూర్లోని గొల్లలు, కాపులంతా.

గత అర్ధ శతాబ్దంలో ఇక్కడి కరువు పరిస్థితులకు తట్టుకోలేక భద్రావతి మొదలైన ప్రాంతాలకు వలస పోయారట మాలోల్లంతా.

వాళ్ల ఇంటి స్థలాల్లో రెండొంతుల దాకా గొల్లలు, కాపులు ఆక్రమించుకొని ఇండ్లేసుకొన్నారు. ఇప్పటి మాలిండ్లకు ఊరికి అసలు తేడా లేకుండా పోయింది.

"ఈ నించి జూస్తే నీకేమనిపిస్పాందోయ్?" గురన్న అడిగాడు.

నేను పంచలోంచే మాలిండ్ల కేసి చూపులెత్తాను.

ప్రతిరోజూ అప్రయత్నంగా కొన్ని వందలసార్లు చూస్తుంటాను.

నాకేమీ అన్పించట్లేదు.

"ఆ గుడిసెలూ, ఆ కొట్టాలూ, ఆ పడిపోయిన గోడలూ... మాలోల్లకూ రైతులకూ ఏమన్నా వారా కనిపిస్నాందే?"

నిజమే. ఏమీ తేడా లేదు.

"ఆ మాలిండ్లన్నీ మిద్దెలయినాయనుకో... ఎట్టుండదో ఒకసారి ఊహ చేసి సెప్పు."

కొత్త చమత్కారమే.

'ఆ మాలిండ్ల మధ్య వెలవెలబోయే రైతుల గుడిసెలు," అంటూ చెప్పవలసి వస్తుంది.

"ఎవుడన్నా సరైన కాపోడు ఊర్లోకొచ్చి సూస్చే మానం బోద్దోయ్ మొగోడా!"

అయోమయంగా అతనికేసి చూశాను.

అతని ఉద్దేశ్యమేమిటో నాకర్థం కాలేదు.

"వాల్లంతా మిద్దెల్లో. మనోల్లంతా బోదకొట్టాల్లో... పొద్దున్లేసినాన్నుంచీ సూస్చా ఉండాలంటే బాగుండదబ్బీ!" తిరిపేలయ్య.

వాళ్ల ఉద్దేశ్యం నాకర్థమైంది.

"బిల్డింగులు శాంక్షనయినయ్. మనమేం చెయ్యలేం," చెప్పాను.

"రాకుండా జెయ్యొద్దు. ఊర్లో కట్టకుండా జెయ్యి సాలు," ఎంగన్న.

"కొత్త మాలోల్లకు ఈల్లెట్టా తావియ్యరు గదా! వాళ్లను గాదని యిల్లు సొంతంగా కట్టుకోలేరు. అందర్నీ కలిపి పలుగురాళ్ల మిట్టన కట్టుకోమని సెప్పు," గురన్న సలహా.

ఆలోచిస్తూ ఉండిపోయాను.

*

మధ్యాహ్నం దొడ్లో మందారచెట్టు కింద వాలుకుర్చీలో కూచుని కళాపూర్ణోదయం చదువుతున్నాను.

కథ నడిపిన తీరు నన్నెంతో ముగ్ధుణ్ణి చేస్తోంది.

ఊహించని మలుపులు, మలుపు మలుపుకూ ఒళ్లంతటికీ గగుర్పాటును అంటించే కుదుపులు.

పుస్తకాన్ని ఒళ్లో పెట్టుకొని అందులోని దృశ్యాల్ని సజీవంగా మనోఫలకం మీద గీసికొనేందుకు ప్రయత్నిస్తూ కళ్లు మూసికొని వెనక్కి వాలాను.

ఇంట్లో అమ్మ, ఇందిరా మాట్లాడుకొనే మాటలు అస్పష్టంగా వచ్చి నా చెవుల సోకేందుకు ప్రయత్నిస్తున్నాయి.

వాటిని నేను పట్టించుకోదల్చలేదుగాని, పొట్టక్క గురించిన మాట విన్పించేసరికి ఆసక్తిగా చెవులు రిక్కించాను.

"వాని మొగంలే. పెసిడెంటు అయినానికె వాని బుద్ధులు గూడా మారిపోతాండయి," అమ్మ అంటోంది.

రాత్రి నేను చెప్పిన మాట ఆమె చెవినేసింది కాబోలు ఇందిర.

"ఆ పొట్టదీ నేనూ సిన్నప్పట్నించీ సావాసగత్తెలం. ఇద్దరం కల్సి బరుగొడ్లకు పోతాంటిమి. అప్పుడు గూడా యింత లావు పొట్టేసుకుని తిరుగుతాండె. వాల్లమ్మ బెట్టిన సొగం ముద్ద సద్ది సంగటి దాని కడుపులో ఏ మూలకూ సాల్దు. నా సంగటి గూడా గుంజక తింటాండె. నేనెప్పుడన్నా మాయమ్మ మీంద అలిగి సంగటి తీసప్పోకుంటే దాని సొగం ముద్దలనే ఇద్దరం సర్దకపోతాంటిమి.

కంపసెట్లల్లో దూరి దోదోర రేగ్గాయలు పీక్క తింటది. బచ్చటాయి గడ్డలు తొవ్వక తింటది. ఇంటికొచ్చేదాకా ఏదోకటి తింటానే వుంటది.''

చిన్నప్పుడు తెలిసో తెలియకో చేసిన పనుల్ని ఆమె గొప్పగా చెప్పుకోవటం నాకు సహించ కుండా వుంది.

కోడలు- తన మేనగోడలే కాబట్టి సరిపోయింది గాని, ఎవరైనా పరాయిపిల్లయి ఉంటే మాలోల్ల సంగటి తిన్నందుకు ఆమెను ఎంతగా అసహ్యించుకొని ఉండేదో!

''అది లేకుంటే యీడేడ ఉండాడనీ! ఈడు పుట్టడం ఆకలితోనే పుట్టిండు. బూమ్మీద పన్నేల ముంచీ ఒకటే ఏడుపు. నాకాడ పాల్లేవు. బరుగొడ్లు పాలు వొంటలే. ఆడికీ ఆవును పట్టకొచ్చిండు మీ మామ. అయ్యా కుదర్లే. ఇప్పుడేల అప్పుడేం పాలపొడి డబ్బాలున్నెయా? పొడా?... ఆయమ్మను యీయమ్మను ఎన్రోజులని బంగపడాల. యీని ఏడుపు ఆపాలంటే నా సేతగాలే. ఆ కాలానికి దేవతాల యీ పొట్టదే అడ్డపడింది. వాల్ల పిల్లోనికి సంగటో సారకో పెట్టుకొని యీనికి పాలచ్చింది... యీడు యింతోడయ్యేదాకా పొట్టక్కను సూస్చే సాలు ఎగురుకుంటూ పొయ్యి వొల్లో పడేవోడు.''

తర్వాత నాకు వినబుద్ధి గాలేదు.

ఏ విషయాన్ని గురించయితే నేను మథన పడుతున్నానో, దాన్నే ఆమె కెలికి కంపు జేస్తోంది.

రాజకీయంగా ఎదిగి, సంఘంలో గుర్తింపు పొందింతర్వాత, ఆర్థికంగా అంత గొప్ప స్థితిలో లేకున్నా నా చదువును చూసో, పదవిని చూసో పదిమంది పెద్ద రెడ్ల సరసన నాకూ స్థానం కేటాయించిన తరువాత-

నా బాల్యం నన్ను వెంటాడే దయ్యమైంది.

నాకీ సమస్య చిన్నప్పటి నుంచీ ఉంది.

అప్పుడింత మేధోపరంగా ఉండేది కాదు.

గిరిలో ఉన్న బొంగరాన్ని గురిజూసి కాలెత్తి నా బొంగరంలో గుమ్మగొడితే రెండుగా విచ్చి గిరికి అటుఇటు చెక్కలయ్యేది తోటిపిల్లలంతా సంతోషంతో చప్పట్లు కొట్టేవాళ్లేగాని, బొంగరం పోగొట్టుకొన్నవాడు మాత్రం గుర్రుగా, ''యీడేం మన పాల్దాగిండా? మాలోల్ల పాల్దాగిందాన అంత బలం,'' అనేవాడు.

దాంతో పిల్లల చప్పట్ల మధ్య వాడి మీద నేను కలబడటం, ఇంటికొచ్చి మా నాన్న చేత దెబ్బల్దినటం మామూలైంది.

బడిలో తోటిపిల్లల్ని కొట్టినప్పుడు సైతం ఇదే మాట.

ఒకసారి తోటకాడ మడవ కోసం గలాభా జరిగి అవతల వాళ్లు ఇద్దరూ కలిసి ముల్లుగర్రల్తో మా నాన్న మీద దాడిజేసిన సమయంలో నేను ఒడుపుగా ఒకని చేతిలో కర్ర లాక్కుని ఇద్దర్నీ చావబాదినప్పుడు వాళ్ల ఆడాళ్ల నోళ్లల్లోంచి కూడా ఇవే మాటలు.

అమ్మ సైతం అదే మాట, 'పొట్టక్క పాలు తాగి పెరిగినా,'వని.

ఒక్కోసారి అన్పిస్తుంది, 'నాకీ పెరుగుదల లేకున్నా బావుండే,'దని.

పై చదువుల కోసం ఊరు విడిచింతర్వాత సమస్య చాలావరకు మాసిపోయినట్లే అన్పించింది. ఊరివాళ్లతో మునుపటిలా గాఢంగా కలవకపోవటం వల్ల ఆ విషయం ఎదుటికి వచ్చేది కాదు.

చదువైనాక ఉద్యోగానికి ప్రయత్నించటం, ఆ ప్రయత్నాలు బెడిసికొట్టి అనుకోకుండా వచ్చిన పెళ్లి ప్రయత్నం ఫలించటం, మేనమామ కూతురే నా పెళ్లాం కావటం, నా నిరుద్యోగానికి కొంత పని కల్పించినట్లయింది.

నేను ఊర్లో మొదటి గ్రాడ్యుయేట్‌ననే అహం వల్లనయితేనేం, ధనవంతుడైన మామ దొరికాడనే గర్వం వల్లనయితేనేం, కోరుకు గుత్తకు ఇచ్చి కూచున్నా కుటుంబపోషణకు ఇబ్బంది కలిగించని భూములున్నాయనే తృప్తి వల్లనయితేనేం- ఊర్లో మనుషుల్లో పెద్దగా ఊసుకు తిరగను కాబట్టి ఆమధ్య కాలంలో పొట్టక్క సమస్య నన్ను స్పృశించలేదు.

పొలం పనులు చేయలేక, ఇంటికాడ ఊరకే ఉండబుద్ధిగాక రాజకీయాల్లోకి దిగిం తర్వాత మనుషుల్తో కలిసిపోక తప్పలేదు.

అదో- అప్పుడు దిరగదోడడం మొదలైంది ఈ సమస్య.

ఎన్నికలయ్యేదాకా వాళ్ల ఎగతాళిని నేను చిరునవ్వుతో స్వీకరించేందుకే ప్రయత్నించాను గాని, పంచాయితీ ప్రెసిడెంటును అయింతర్వాత భరించలేకపోతున్నాను.

అయితే వాళ్లు కూడా నా చిన్నప్పటిలా సూటిగా గేలి చేయటం లేదుగాని, పొట్టక్క కన్పించినపుడు మాత్రం వరసైన వాళ్లు చలస్తున్నారు. నా హుందాతనాన్ని సైతం దాటుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

నోటితో అనకున్నా వాళ్ల కళ్లల్లోని పరిహాసకిరణాలు నా ఒళ్లంతా గొంగళిపురుగులై ఉల ఉలమంటాయి.

నా గెలుపుకోసం తన పరిధిలో అహర్నిశలూ శ్రమించిన పొట్టక్క కృషిని గుర్తుచేయటంలో కూడా వ్యంగ్యమే.

అందుకే ఈమధ్యకాలంలో ఆమెను చూస్తే చాలు- నిండా రొచ్చులో మునిగిన నా ఆకారం నాకు మదికొస్తుంది.

చిలుమెక్కిన ఒళ్లు, చింపిరి తల, చిరుగుల చీరతో అసహ్యంగా ఉన్న ఆమె ఒడిలో నా బాల్యం గడవటం నాకు భరించరాని స్మృతిగా ఉంది.

చెమటతో తడిసి, ఉప్పర్లి, చారికలు కట్టిన ఆమె రవికను చూడటంతోనే నా ఒళ్లు జలద రిస్తుంది. నా ముఖం నిండా చెమట కంపు దట్టించినట్లుగా అన్పించి ఊపిరాడక ఉక్కిరిబిక్కిరి అవుతాను.

ఆమె నా కళ్ల ముందు కన్పిస్తూ ఉంటే నాకీ అగచాట్లు తప్పవు.

ఆలోచించసాగాను.

ఉదయం పులి సుబ్బన్న బృందం చేసిన ప్రతిపాదన గుర్తొచ్చింది.

ఆలోచించేకొద్దీ నా సమస్యకు పరిష్కారం అందులోనే దొరుకుతోన్నట్లుగా గోచరించింది.

అవును... ఆమె నాకు దూరమైతే చాలు.

మాలిండ్లన్నీ మిట్ట మీదకు మారితే ఆమె నీడ కూడా ఇక్కడ సోగదు గదా!

హుషారుగా లేచి పుస్తకాన్ని గూట్లో పెడుతోంటే అమ్మ అంది. ''ఏమబ్బీ! గడ్డి వామేయించవా? కల్లానికి కంపేయకుండా అట్లనే బెడ్తవా?'' అని.

'రెండు మూడురోజుల్లో అయిపిస్తాలే,'' చెబుతూ బైటకొచ్చాను.

మధ్యాహ్నం కాబట్టి పులిజూదం, బారాకట్టలతో అరుగు మోగిపోతోంది. పులిజూదం వద్ద నున్న పులి సుబ్బన్నను పక్కకు పిలిచి విషయం చెప్పాను. ఆయన అటు వెళ్లగానే నేను పులిజూదం వద్దకు నడిచాను.

*

పొద్దుగూకే సమయాన పులి సుబ్బన్న నా వద్దకొచ్చాడు గురప్పను వెంటేసుకొని.

"కుదరదంటాంద్రబ్బీ! మిట్టకు బొయ్యేందుకు కొత్త మాలోల్లు ఎప్పుడెప్పుడా అని సంకలు ఎగస్సంద్రుగాని, పాతోల్లు ఒప్పుకోడంలే. రైతుల్నిడ్సి పెడ్తే మేమెట్టా బతకాల? అంటాంద్రు. 'ఉప్పో, పప్పో, సద్ది సంగటో, ఊరిమిండో అడక్కొచ్చుకొని బతికేటోల్లం. మేము సచ్చినా ఊరిడ్సం,' అంటాంద్రు," చెప్పాడు.

నా ఆశలు తుస్సున జారాయి.

సమస్య మళ్లీ జటిలమైంది.

పొట్టక్క బాధ నన్నొదిలేట్టు లేదు.

రాత్రి ఏసేబు అరుగు వద్ద కొచ్చాడు.

"కుదరదంటాంద్రా వాల్లు. మీరే ఎట్టనోకట్ట బతిమాలుకోగూడదంద్రా!" గురన్న చెప్పాడు.

"యినడం లేదయ్యా!" బాధపడ్డాడు ఏసేబు. "తోటి మాలోల్లం, ఊరిడ్సి వొచ్చిన్లోం. రొవ్వొంతన్నా మా మీంద కనికెరం లేదయ్యా నా కొడకలకు," అన్నాడు.

"వాల్లకు తెలిసిరాలేదు గాని- మిట్టమీంద మీకు శాన సుగంగా ఉంటదిరా!" గురన్న అందుకొన్నాడు. "యీడ బారెడు బారెడు గుడిసెల్లో, రొచ్చు బురదల్లో పొల్లేడే దానికన్నా మిట్టమీంద కావలసినంత తావుంది. హాయిగా బతకొచ్చు. నెలరోజులు జడిబట్టినా కాలికి బురదంటదు. బస్సు మార్గం దగ్గెర. నన్నడుగుతే ఇది నరకం అది సొర్గం రా!"

"నిజమేగదూ మరి!" ఏసేబు తలూపాడు.

"అయ్యన్నీ ఎట్టన్నాయే. రైతులిండ్లల్లో మాలోల్లం కలిసుండాలంటే యాడయిద్దెబ్బా? యీల్లు బుద్ధిలేక ఉండారుగాని, మీరు దోవన వస్పాంటరు, పోతాంటరు. మేం మంచాల మీంద నీలుక్కోని కూకుంటే బాగుంటదే? అట్టని మాటిమాటికి లెయ్యాలంటే మా పొగుర్నాకొడకలకు వొల్లొంగుతదే? అందుకే, మీకు దూరంగుంటే గౌరవముంటది. అయ్యా అన్నే, ఒరే అన్నే తగినట్టుంటది," చెప్పాడు ఏసేబు.

అతని మాట మావాళ్లందరికీ నచ్చినట్లుంది.

"అవ్ అవ్... నీ నడతకూ వాల్ల నడతకూ యాడ సమ్మందం. తొలీత నుంచీ సూస్పానే ఉండాం. నీకతే యేరు. నీ తెలివి వాల్లకేడ వస్పది," ఎంగన్న మెచ్చుకోలు.

"నేను పెద్ద రెడ్ల కాడ మెలిగినోన్నయ్యా! లోకం సూసినోన్ని. యీనా కొడకలకేం దెల్సు," ఏసేబు వివరణ.

ఏసేబు మాటల్లోని నిజాన్ని గురించి నాకు అనుమానమే.

అక్కడి రెడ్ల చేత దెబ్బల్తిని చెల్లకనే ఇక్కడికొచ్చాడని జనుల వాడుక.

తమకు స్థలాలివ్వని పాత మాలోల్ల మీద రైతులకు చెడు అభిప్రాయాన్ని కలిగించేందుకు అతను ప్రయత్నిస్తూ ఉన్నట్లుంది.

నేనేమీ కలుగజేసికోలేదు.

రాత్రి అమ్మకు చెప్పాను, వామేసేందుకు ముగ్గురు కూలోల్లను పిలవమని. ఉదయమే లేచి కూలోల్లను ఎంటేసుకొని కళ్లంలో కెళ్లాను.

పొట్టక్క కొడుకుతోటి ఇద్దరు కాపోల్లు ఉన్నారు పనికొచ్చిన వాళ్లలో. లావుపాటి గుంద్రాళ్ల మీద పండె కొయ్యల్ని పేర్చి రెండు బండ్ల జొన్నచొప్ప వొడ్డేసరికి అంబలి పొద్దయింది.

పైటేలకంతా వామి బాగా ఎత్తుకు లేచింది.

మంచి హుషారు మీద వచ్చేస్తున్నారు కూలీలు.

పొట్టక్క కొడుకు వామ్మీద ఉన్నాడు.

మనిషి బక్కగా టి.బి. పేషెంట్‌లా ఉన్నా- వాడు మంచి ఏటుగాడు.

పొట్టక్క మీది స్మృతులకు తావివ్వకుండా, కోపు యాస లేకుండా వామి పెరిగేందుకు కింద నుంచి సూచనలిస్తూ పన్జేయించుకొంటున్నాను.

వామి పెరిగేకొద్దీ దగ్గరున్న ఎండుగడ్డి అయిపోయి కుప్పలు దూరమయ్యాయి.

మోపుల్ని ఎగేసేందుకు కూడా బరువై చిలక్కట్టె ఉపయోగించాల్సి వచ్చింది.

మోపు గట్టటం, మోయటం ఇద్దరి చేతుల్నిండా పనవటంతో, తలకు గుడ్డ చుట్టి చిలక్కట్టె అందుకొని ఎగేయటం ప్రారంభించాను.

బరిగె, రాగి, కొఱ్ఱ, ఆరికె చెత్తల్తో బాటు సెనక్కట్టె కూడా కలిసి పొరలు పొరలుగా పేరుకొని వామిగా రూపెత్తుతోంది.

ఎండ పొడ సోకకుండా ఉన్న చింతకొమ్మల నీడ కింద మేము హుషారుగా పన్జేస్తున్న సమయంలో సింగరప్ప వచ్చాడు ప్రకాశాన్ని తోడేసుకొని-

"నేనెగేస్ప్తేబ్బా!" అంటూ ప్రకాశం నా చేతిలోని చిలక్కట్టె అందుకొన్నాడు.

తలకు చుట్టుకొన్న టవల్ విప్పి వొళ్లు విదిల్చికొని, కడవలో నీళ్లొంచుకుని తాగి ఒక రాతి మీద కూచున్న నావద్దకొచ్చాడు సింగరప్ప.

"ఏంది కత?" నవ్వుతూ అడిగాను.

"ఏముంది సోమీ! ఎట్టనోకట్ట ఆ మిద్దెలొచ్చేట్టు సూడు. బీద నా కొడకలం," దీనంగా అన్నాడు.

"మీకు బిల్డింగులు కట్టించాలనే నేనింత ప్రయత్నం చేసేదీ," చెప్పాను. "వాల్లకు మీరు తావియ్యకపోతిరి. వాల్లతోబాటు వూరిడ్సి మిట్టకు పోమంటిరి. మధ్యన నేనేం జెయ్యాల?"

నా ఎదురుగా గొంతుక్కూచున్నాడు అతను.

"మిమ్మల్నిడ్సిపెట్టి మేమేడ బతకాల? మిట్టమీంద యిండ్లేసుకొంటే మానా కొడుకులు పనికొస్చరా రెడ్డీ! అదిలిచ్చే వాల్లులేక, పనీబాటల్జెయ్యకుండా పెండ్లాల కూలిగింజల్తో సారాయి తాగి తాగి నాశినమైపోరూ! యీడ వూర్లో వుండబట్టీ, పొద్దన్లేసినాన్నుంచీ మీ మొగాలు సూడబట్టీ కూటికి గుడ్డకు యిబ్బంది లేకుండాంగాని వూరిడిస్చే బతుకుతమా సోమీ! సుట్టుపక్కల మాల మాదిగోల్ల బతుకు సూస్చాండం గదా! అబ్బబ్బ... వూరిడ్సే మాట ఎత్తగాకు రెడ్డీ!" అన్నాడు.

తదేకంగా అతనికేసి చూశాను నేను.

నిజమే... ఊర్లో ఉండటం గుండా చుట్టుపక్కల మాలమాదిగల్లాగా వీళ్లు సోమరిపోతుల య్యేందుకు వీల్లేకపోయింది. వీళ్లు గోడ కింద కూచోబోయినా రైతులు కూచోనివ్వరు. రెక్క బట్టుకు పొలాల్లోకి లాక్కుపోతారు.

"మరి... కొత్త మాలోల్ల సంగతేందోయ్? వాల్లు మిమ్మల్నే నమ్ముకొన్నేరు గదా!" అన్నాను.

"వాల్లకూ మాకూ ఏమి లంకె రెడ్డే?"

నాకాశ్చర్యమేసింది.

"మీవాళ్లే గదా!" అన్నాను.

గట్టిగా వూపిరి పీల్చి వదిలాడు సింగరప్ప.

"ఆ నా కొడుకులకేం? యియ్యాల యీడుంటరు. రేపు యంగోసోటికి బోతరు. ఆ ఏసేబు గాడయితే యిప్పటికి రొండూర్లు మారిండు. రొండూర్ల కాడ వానికి గవన్నమెంటోల్లు మిద్దెలు గట్టిచ్చిన్రు. బూమిలిచ్చిన్రు. బోర్లేయించిన్రు. ఎద్దుల్చిన్రు," గట్టిగా చెప్పాడు.

"అవన్నీ ఎక్కడికెళ్లాయ్?" వింతగా ఉంది నాకు.

"కడుపులోకే..." అభినయిస్తూ చెప్పాడు.

"అవ్ రెడ్డే! ఎద్దల్ను కోసక తిన్నెరు. బండ్లమ్ముకొన్నెరు. బోరులో మోటారమ్ముకని లోపల పడిపోయిందని ఆఫీసర్లకు జెప్పిన్రు. వూరిడ్సింనాంక మిద్దె దంతెలు, వాకిండ్లు గూడా పీకి అమ్ముకొన్నెరు. యీడ గూడా అదే పని బట్టాలని సూస్తాన్రు.

ఆ కఠోరసత్యం నన్ను కొంతసేపు కుదిపింది.

"వాడెప్పుడూ ఎవుని ఎంగలి దిని బతుకుదామా అనే సోమీ," సింగరప్ప అన్నాడు.

ఎంగిలి అనేసరికి నాకు వామ్మీది ఏటుగాడు గుర్తొచ్చాడు.

పుట్టగోచి బెట్టి వామ్మీద హుషారుగా కదల్తున్నాడు.

ఒల్లంతా మట్టి పేరుకొని పుళ్ల శరీరంతో, అస్థిపంజరంలా వున్న పొట్టక్క కొడుకును చూస్తోంటే వాడి ఎంగిలి పాలు తాగి పెరిగాననే విషయం నా వెన్నెముక వెంట అసహ్యపు జలదరింపై పాకుతోంది.

రాజకీయపు హోదా, చదువిచ్చిన విజ్ఞానం, సంఘంలో గౌరవం అన్నీ కలిసి ఉచ్ఛస్థితిలో వున్న నేను, వాని దృష్టిలో ఎంత తక్కువ స్థాయిలో ఉంటానో ఊహించుకొనేసరికి అక్కడ నిలబడ బుద్ధి గాలేదు.

నా సమస్త దశలు ఎంగిలి అయినట్లు సిగ్గేస్తోంది.

సింగరప్పతో కలిసి ఊర్లోకి నడిచాను.

చీకటి పడేసరికి వామేసి ఎంట్లు గట్టి వచ్చారు కూలీలు.

రాత్రి ఏసేబు అరుగు వద్ద కలిశాడు.

సింగరప్ప ఆరోపణల గురించి ఆరా తీశాను.

"అవ్ రెడ్డీ! ఆ బూముల్లో తుమ్మ కట్టెల్దప్ప ఏమీ పెరగవు. పాపిష్టి సవుటి బూములు... మిద్దెలిచ్చిన్రు. తుమ్మకట్టెలు గాల్చి బొగ్గుల్జేసి అమ్ముకొని ఆ మిద్దెల్లో యింత గంజి గాసుకొని బతుకుతాంటిమి... అంతలోకే సవిటి బూములకు పట్టాలిచ్చిరి. బోర్లిచ్చిరి. ఎద్దులిచ్చిరి. బండ్లిచ్చిరి. దాంతో మేమూ రైతులమని సంకలు గుద్దుకొంటిమి. కట్టెలు గొట్టడం మాని బూములు సాగు జెయ్యబోతిమి. సవిట్లో ఏం బండుతాయ్? మొల్చిన మొలకంతా ఎర్రబడి సావబట్టె. బోర్లు, బండ్లు, ఎద్దుల్జూసి అప్పులిచ్చిన మారాజులొచ్చి మెడల మీంద కూకుండ్రి. ఇంగేజెయ్యాల సోమీ! ఎద్దులమ్మినం, బండ్లమ్మినం, బోర్లమ్మినం... ఆ వూర్లిడ్సినం..." చెప్పాడు.

"లెక్క శానా మిగిలిండాల్నే మరి?" ఎంగన్న ప్రశ్న.

"యాడుందెయ్యా? మాకెవురిస్చరు? ఎద్దులు బండి ఎరువుల బాకీకి సెల్లుబడె. ముప్పయేలమ్మే మోటారు దొంగెదనీ, అదెనీ యిదెనీ ఒక పెద్ద రెడ్డి ఐదేలు సేతబెట్టె. అది తిండి గింజలకూ, గుడ్డల బాకీకి సెల్లుబాయె. ఇంగ మిగలిందేంది సోమీ?" అన్నాడు.

వాళ్ల సమస్యకు ఏంజేసేందుకు నాకు అర్థంకాలేదు.

నలభై మిద్దెలూ వూర్లోకనే శాంక్షనయ్యాయి.

వీళ్లిట్లే కొట్లాడ్తూ వుంటే కాన్సిలవుతాయి.

మిట్ట మీద కొన్నీ ఇక్కడ కొన్నిగా విడగొట్టాలంటే ఎమ్మెల్యే దగ్గరకు వెళ్లక తప్పదు.

అందుకు రైతుల నించి వ్యతిరేకత ఎదురవుతోంది.

ఇంకొన్ని రోజులు గడిస్తే వాళ్లే ఏదోకటి పరిష్కరించుకోకపోరు.

మా వూరి మాలల స్థితిగతుల్ని గురించీ, వూర్లో వాళ్ల స్థానాన్ని గురించీ, రైతులకూ వాళ్లకూ మధ్య నున్న సంబంధాల్ని గురించీ- దళితుల జీవన విధానంపై అధ్యయనం చేస్తున్న నా హైదరాబాదు మిత్రుడికి రాసిన లేఖకు సమాధానం వచ్చింది.

మంచి విశ్లేషణతో చక్కగా వుంది ఉత్తరం.

మొదటి లైనులోనే రాశాడు, 'వాళ్లెట్టి పరిస్థితిలోనూ ఊరు విడవర,'ని.

వాళ్లు సాంఘికంగా సమానత్వం కోసం చూస్తున్నారంట.

ఇప్పటికే వూర్లో ముక్కాలు భాగం కాపులకు, గొల్లలకు - వాళ్లు మంచాలు దిగి - చూపే గౌరవం మాసిపోయింది కాబట్టి 'ఒరే తరే' అనే పిలుపుల్లో చాలావరకు పేర్లు చోటు చేసికొన్నాయి కాబట్టి.

అందరి పిల్లలూ ఒకేచోట చదువుకోవటంతో వాళ్ల మధ్య తిట్టుకోవడాలూ, కొట్టుకోవడాలూ, ఆటలూ, పిలుపులూ కులాల కతీతంగా జరుగుతున్నాయి కాబట్టి.

అన్నిటికంటే ముఖ్యమైంది-

'అవి మాలిండ్లని' వేలెత్తి చూపే అవకాశం లేదు కాబట్టి.

తమ పూజారులయినా, పురోహితులయినా బ్రాహ్మణులకు ఈనాటి రెడ్లు ఏమాత్రం గౌరవమిస్తున్నారో చూస్తున్నారు కాబట్టి.

తొందరలో తాము గ్రామంలోని మిగతా కులాల తోటి కలిసిపోతామనే నమ్మకముంది కాబట్టి వాళ్లు ఊరు వదలి మిట్ట మీదకు వెళ్లరని రాశాడు.

ఇందులో నిజమెన్ని పాల్లో నేను తర్కించదలచుకోలేదుగాని, నా సమస్యకు పరిష్కారాన్ని గురించి మధన పడుతున్నాను.

సింగరప్పను పిల్చి అడిగాను చివరగా- "వూరు విడిచే ఆలోచనలు ఏమైనా ఉన్నాయా?" అని.

"మిట్టమీంద అయితేనే మిద్దెలొస్చాయనే మాత్తరమయితే మాకా మిద్దెలొద్దు, ఏమొద్దు. కొత్తమాలోల్లకే యియ్యండి. మిమ్మల్నిడ్సి మేం పోలేము," అన్నాడు.

నా సమస్య తిరిగి మొదటికొచ్చింది.

పొట్టక్కను ఇంటికాడికి రానీకుండా ఉండటమే తాత్కాలిక పరిష్కారంగా తోస్తోంది.

ఇందిరకు మళ్లీ చెప్పాను.

అమ్మతో గట్టిగా మాట్లాడమని కూడా వేడుకొన్నాను.

మధ్యాహ్నం దొడ్లో ఉన్న నా వద్దకు అమ్మ విసురుగా వచ్చింది. "ఎవురోరే నిన్ను ఎగతాళి జేసే నాబట్టలు," అంటూ.

నేను బిత్తరపోయాను ఆమె తీవ్రత చూసి.

"మాల్లయితేనేం? అది మనిసిగాదూ! ఆర్సుకోని ఆర్సుకోని బరుగొడ్డు పాల్దాగుతరే. అంతకన్నా యీనమైందా అది? ఎవురో సెవుల్దెగిన్నాబట్టలు యేందో అంటాండరని నువ్వు బాదపడ్తే ఎట్టా?" అంది.

"అదిగాదు మా..." వివరించబోయాను.

"కొడుకును కంటానే అమ్మయిద్దే? పాలిచ్చి బతికిచ్చుకొంటే అమ్మయిద్దిగాని. ఆ పొట్టది లేకుంటే నేను అమ్మనుగాను. ఆడదాన్ని గూడా కాదొరే. నాకున్నె వొంకర దానిగుండా తీర్సుకొన్నె. నిన్ను బతికిచ్చుకొన్నె. అది నాపాలి దేవతరా!" అంటూ ఇంట్లోకెళ్లింది.

ఏదో ఆవేశం పూనినట్లు రావటం, పోవటం.

పొట్టక్కను దూరం చేసేది లేదని భయంగా సూచించటం.

ఆమె హృదయం నాకర్థమైంది.

నేను కాదనటం లేదు.

కాలాలు మారాయి గదా!

ఇప్పుడు జీవితాలకు మేధోపరమైన ప్రాధాన్యత ప్రధానమైంది. సున్నితమైన వ్యంగ్యాన్ని కూడా భరించలేని స్థితిలో ఉంది. అనవసర త్యాగాలకూ, జీవితాంతం రుణపడి ఉండే బంధాలకూ మనస్సు కట్టుబడి ఉండటం ఇప్పుడు అనాగరీకమైంది.

ఆమె చేసిన సహాయానికి అమ్మానాన్నలు ధనరూపంలోనో, వస్తురూపంలోనో రుణం చెల్లేసి ఉండొచ్చు కదా!

నేనిట్లా ఎంతకాలమని మానసికక్షోభ అనుభవించాలి?

ఆలోచిస్తూ ఉండిపోయాను.

'అమ్మానాన్నలు చేయలేని పని నేనే చేస్తే?'

మెదడులో మొలకెత్తిన ఆలోచన క్రమంగా బలంగా పుంజుకోసాగింది.

మెదడులో మొలకెత్తిన ఆలోచన క్రమంగా బలం పుంజుకోసాగింది. కొంత మూల్యం చెల్లించయినా పొట్టక్కను ఇంటి వద్దకు రానీకుండా చేయాలనుకొన్నాను.

మూడుగంటల ప్రాంతంలో లేచి మా కళ్లంలోకి వెళ్లాను.

కంప అతలే పొట్టక్క ఇల్లు.

ఈ సమయంలో ఆమె కొడుకు, కోడలు కూలిపనికి వెళ్లుంటారు. పిలుద్దామనుకొనేసరికి ఏవో మాటలు విన్పించి ఆగిపోయాను.

ఏవేవో పొద్దులోని కబుర్లు చెప్పుకుంటున్నారు వాళ్లు.

అవతలి మనిషి వెళ్లిపోతుందేమోనని నిరీక్షించసాగాను.

కొంతసేపటికి వాళ్ల మాటల్లో విషయం మారింది.

నాకు ఆసక్తిగా అన్పించింది.

"యాడ జూపియ్యాలక్కా! ఏ డాకటేరు కాడికి పొయ్యినా సేటెడు సేటెడు మందులు రాయిస్చరు. వాటెకు లెక్కేడ దేవాల?" పొట్టక్క గొంతు.

"డాకటేరు కాడికెందుకూ? వానికేందో గాలి సోకింది. మూడు ఆదివారాలు అంకాలమ్మ కాడికి తీసప్పో," అవతలి గొంతు సలహా.

"గాలి గాదు దూలిగాదులే. సిన్నప్పట్నించీ వాని బతుకంతే. యాడాది లోపల పిల్లోనెప్పుడే పాలియ్యకుండా ఎండగట్టి సంగటిబెట్టినా అప్పట్నుచి పురెక్కలే."

"నీ కాడ పాలున్నెయేమోనే?"

"ఉన్నయ్... మా సెన్నమ్మ తల్లికాడ పాల్లేక, పిల్లోడు సావుబతుకుల్లో వుంటే... ఆయనకిచ్చి సాకినా."

"ఎవరూ? మన పెసిలెంటుకేనా?" అవతలి గొంతులో ఆశ్చర్యం.

"ఆ..."

"నీ కొడుకును ఎండగట్టే?"

"ఆ... సెన్నమ్మా నేను సిన్నప్పట్నుంచీ పానానికి పానంగా వున్నేం. ఆమెకాడ సాల్లేక, పసరపు పాలొంటక, పాలిచ్చే వోల్లు దొరక్క పిల్లోడు ఆకల్తో గొంతు బూడిపోయేదాకా ఏడుస్చాండె. ఆమె

మొగునికి ఏం జేసేదానికి దిక్కుదెలక ఆమెను గొనగబట్టె. నా కండ్ల ముందరే ఆమె సంసారానికి ముప్పొచ్చె. నా పిల్లోని పక్కా జూస్చి. పాల్లేకున్నే సంగద్దిని పానాలు నిలబెట్టుకొనే కాడుండె. అందుకే... యీని ఎండగట్టి ఆయన్ను బతికిచ్చుకొన్నె.

నా కపాలంలో ఏదో పెఠీల్మని పగిలినట్టుగా అన్పించింది.

చింతచెట్టు మొదలుకి నేనో చింతమొద్దులా ఆనుకొని నిల్చుండిపోయాను.

నన్ను చూడగానే పొట్టక్క కళ్లలోంచి జాలువారే అంతులేని వాత్సల్యధార గుర్తుకొచ్చింది.

ఆమె కడుపుపట్ల మా అమ్మ చూపే ఆదరణ జ్ఞప్తికొచ్చింది.

నా ఉన్నతి పట్ల వాళ్లిద్దరూ పడే ఆతృత మదికొచ్చింది.

ఆలోచించేకొద్దీ నా యీ హోదాకూ, జ్ఞానానికి మూలాలు నేననుకొంటోన్నవేమీ కావేమో అని కూడా అన్పిస్తోంది.

అప్పుడప్పుడై అమ్మానాన్నలు పశ్చాత్తాప పడుతున్నట్లుగా చెప్పే మాటల్ని బట్టి నేను పెరిగేందుకు ఆమె చనుబాలే కాకుండా వాళ్లల్లోంచి మరేదో స్వీకరించినట్టుగా కూడా అర్థమవు తోంది.

మా నాన్న హయామంతా పొట్టక్క కుటుంబం మా యింటి మాలోల్లుగా రెక్కలు ముక్కలు చేసుకోవటం.

నేను ఆరు చదివేందుకు నర్సాపురం ప్రయాణమైతే, నాతోటి ఐదు చదివిన పొట్టక్క కొడుకు మా యింట్లో బరుగొడ్ల కాపరిగా చేరటం.

నా చదువైపోయి ఇంటికొచ్చేదాకా మా నాన్నతో కలిసి వాడు అహర్నిశలూ మా పొలాల్లో శ్రమించటం.

అన్నీ గుర్తుకొచ్చేసరికి నా విజ్ఞానపు పరిధి కూడా తెలిసి వస్తోంది.

రైతుల్తోబాటు మాలోల్లకు కూడా బరకో, మెరకో కొంత భూమి ఉంది.

స్వల్పంగా ఉన్న వాళ్ల భూములు సాగుజేయబడకుండా రైతుల భూములే ఎందుకు పండించబడుతున్నాయో?

నాలుగేళ్లు కరువొచ్చేసరికి కేవలం మాలలే వూరిడిచి వలస పోవలసిన పరిస్థితి ఎందు కొచ్చిందో?

నాకిప్పుడు బాగా అర్థమవుతోంది.

చనుబాలు తాగినందుకే సిగ్గుబడుతోన్నవాణ్ణి- వాళ్ల జీవనమూలాల్లోంచి అస్తిత్వాన్ని పొంది నందుకు నేనింక ఎంత ఖేదపడాలి?

చనుబాలకు ప్రతిఫలంగా ఆమెకు డబ్బునో, వస్తువులనో ఇవ్వగలను కాని-

వాళ్ల శ్రమను చనుబాలుగా తాగి పెంచుకొన్న నా చదువుకూ, విజ్ఞానానికి, రాజకీయపు హోదాకు, ఆస్తులకూ ప్రతిఫలంగా ఆ కుటుంబానికి నేనిమ్విగలను?

ఎగతాళి చేసే వాళ్లకు ఈ విషయం తెలిస్తే తమ వ్యంగ్యానికి ఇంత పెద్ద రాశుల్లో వస్తువు దొరికినందుకు ఎగిరి గంతేస్తారు కాబోలు.

అయినా- నా అమాయికత్వంగానీ, ఏ అగ్రకులస్థుడు మాత్రం వాళ్ల చనుబాలు తాగకుండా ఇప్పుడుండే స్థాయికి ఎదిగాడని!

*సాహిత్యనేత్రం*
*ఏప్రిల్-జూన్, 1996*

నేపథ్యం

## అమృతనాన్ని పంచే
# చనుబాలు

***రచయిత కూడా తన చుట్టూ ఉన్న సమాజంలోంచి పుట్టుకొచ్చినవాడే. అతడేం అవతార పురుషుడు కాడు. తరతరాలుగా తన చుట్టూ పేరుకుపోయిన పొరలను ఒక్కొక్కదాన్ని వదల్చుకొంటున్నవాడు. సమాజాన్ని తాను పూర్తిగా మార్చగలనని ఏ రచయితా అనుకోడు. అట్లా భావించి ఎవరూ రచనలు చేయరు. అలాంటి భావాలున్నాయంటే అతను ఎప్పుడో 'బాబా'గా మారిపోయుంటాడు.***

మా నాన్న తన జ్ఞాపకాన్నొకదాన్ని చెప్పాడు. ఆయనకు పెళ్లయిన ఏడాదిలోపు జరిగిన సంఘటనకు సంబంధించింది అది. మా తాతగారింట ఇల్లరికపుటల్లునిగా స్థిరపడుతోన్న సమయం. ఊరు మచ్చికవుతూ ఉంది. మనస్తత్వాలు అర్థమవుతున్నాయి. చేతుల కింద బరక సేద్యం లొంగుతూ ఉంది. సేద్యగానిగా నిల్దొక్కుకొంటున్నాడు. అప్పుడే ఒకానొక వానాకాలపు రొంపి సమయాన హఠాత్తుగా ఆయనకు విరేచనాలు మొదలయ్యాయి. చెంబు పట్టుకొని ఊరి బైటికి ఇంటికి పదిసార్లన్నా తిరిగి ఉంటాడు. బలమైన వ్యక్తి కాబట్టి అంతదాకా తట్టుకోగలిగాడు. తర్వాత గొడ్ల కొట్టం వెనక దిబ్బను ఆశ్రయించాడు. అటు తర్వాత మంచమ్మీంచి లేకలేకపోయాడు.

ఊర్లోనే పురుషోత్తం అనే పేరున్న నాటువైద్యుడున్నాడు... వచ్చాడు.. ఏవేవో మూలికలు ఇచ్చాడు. చిట్కావైద్యాలు చేశాడు. బేదులు కట్టుకోలేదు. రాత్రికి కూడా స్వస్థత చేకూరలేదు. విరేచనాలతోనే తెల్లారింది. సొమ్మసిల్లిపోయాడు నాన్న. తేలగండ్లు వేశాడు. వైద్యుడు కూడా పెదవి విరిచాడు. ఇంట్లో వాళ్లంతా గూబేమంటున్నారు. మగ దిక్కుగా ఇంటికొచ్చి పెద్దదిక్కుగా మారుతోన్న మనిషికి ఉన్నట్టుండి ఆ పరిస్థితి రావటాన్ని భరించలేకపోయారు.

నాన్న ఆరోగ్యాన్ని గురించి అడిగినవాళ్లందరికీ సమాధానంగా చేయి వతికెల

వేస్తూ ఇంటిదాకా వెళ్లిన పురుషోత్తం, ఏదో పనున్నట్లు బిరబిర వెనక్కి వచ్చి, "చను బాలు తాపితే బేదులు నిలబడతాయని వినికిడి... నేనెప్పుడూ ఎవురికీ తాపి చూల్లే... సూస్తే తప్పేమి?" అన్నాడుట.

దింపుడుకళ్లం ఆశ. ఆరోజుల్లో వాంతులు, బేదులు కట్టుకోలేదంటే మనిషి పోయినట్టే లెఖ్క. దీన్ని 'కలరా' అంటారు. ఊరు ఊరంతా వల్లకాడయ్యే పరిస్థితి.

వైద్యం ఫలిస్తుందో లేదో తెలీదుగాని, ఆచరణ అసాధ్యంగా తోచింది. అంతటి భారీ మనిషికి తాపేన్ని చనుబాలు ఎవరి వద్ద ఉంటాయి? కళ్లల్లో ఏదో ఆశ మినుకు మినుకు మంటోన్నా, సాధన ఎట్లా? దిక్కుతెలీని పరిస్థితుల్లో ఇంటి ఆడమాసులు గోడుగోడుమంటున్నారు.

ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగిన మనిషి ఇక్కడ మట్టిపాలుకావటం గ్రామస్తులందరికీ బాధగానే ఉంది. వైద్యం తెలుస్తూ ఉన్నా ఆచరించలేని పరిస్థితి. అందరికేసీ దీనంగా చూసే ఇంట్లో వాళ్ల చూపులు గుండెల్ని కరిగిస్తున్నాయి. ఆ వేదన నేపథ్యంలోంచి ఓ సన్నబిడ్డ తల్లి ముందుకొచ్చింది. ఉగ్గగిన్నె నిండా చనుబాలు పిండి ఇచ్చింది. వాటిని తెచ్చి మెల్లగా నాన్న చెక్కిళు చీల్చి గొంతులో పోశారు. ఇంకో తల్లి పాలు పిండింది... చేలకాడికి పోతూ ఉన్న తల్లులంతా గంపలు నేల మీదేసి చనుబాలు పిండి ఇచ్చారు. ఇళ్ల వద్ద ఉన్న తల్లులు కూడా అక్కడికి వచ్చారు, మనిషిని బతికిం చేందుకు.

అందరు తల్లుల ప్రాణం ఆయన ఊపిరిని నిలిపింది. పొద్దువాటాలే సమయానికి విరే చనాలు ఆగిపోయాయి. మనిషి బతికి బట్టకట్టాడు.

ఈ సంగతి జీవితాంతం చెప్పుకొంటూ చనుబాల మహత్మ్యాన్ని ప్రస్తుతిస్తూ ఉండేవాడు నాన్న.

❖

నాక్కూడా చనుబాలతో ఓ జ్ఞాపకముంది. నాకుగా ఆ అనుభవం గుర్తులేదు. గుర్తుంచు కొనే వయస్సు కాదు. నేను పుట్టి అప్పటికి మూడు నాలుగు నెలలే. మా అమ్మ చెబితే దాన్ని జ్ఞాపకంగా మలచుకొన్నాను.

అప్పుడు... నా కడుపు నింపేన్ని చనుబాలు మా అమ్మ వద్ద లేవుట. బర్రెపాలు నాకు వంటలేదుట. సంగటో సారకో పెట్టి కడుపు నింపే వయస్సు కాదు. ఆకలితో ఒకటే ఏడుపుట. ఎవరోక తల్లిని బంగపడి కాసేపు వాళ్ల రొమ్ముకు కరిపిద్దామనుకొంటే ఒకపూట రెండు పూటలు కాదుగదా! నెలల కాలాలపాటు తమ బిడ్డల్ని ఎండగట్టుకొని ఏ తల్లి మాత్రం పాలిస్తుంది? పాపిస్టి కరువుల్లో తిండిగింజలు దొరక్క ఆకో అలమో తిని బతికే కాలం. ఎవరి వద్ద సమృద్ధిగా పాలుం టాయనీ! ఒకపక్క కుడిపితేనే బిడ్డ కడుపు నిండేన్ని పాలు ఏ తల్లికాడా లేవు. నా ఏడుపు చూసి అమ్మ కుమిలిపోతూ ఉంది. ఏం చేయాలో తెలీని పరిస్థితిలో న్నా అసహనానికి గురవుతున్నాడు.

ఆ సమయంలో మా అమ్మ సావాసగత్తె మాల పొట్టక్క ధైర్యం చేసింది. ఆమె అసలు పేరేమిటో అందరూ మర్చిపోయారు. పొట్టక్క అనే పిలుస్తారు. నా ఏడుపు చూసింది. అమ్మ కనుగుడ్ల నీళ్లు చూసింది. నన్ను దగ్గరకు తీసుకొని పక్కలో వేసికొంది. అమ్మ అభ్యంతరం చెప్పలేదు. నాన్న చూసీ చూడనట్లు వెళ్లిపోయాడు. నా కడుపు నిండి మొహంలో కళ వచ్చింది. 'మా పిల్లోనికి సంగటో సారకో పెట్టినా తింటాడులే...' అంటూ తనకు తాను సమాధానం చెప్పుకొని, నాకు ఏడెనిమిది నెలల వయసొచ్చేదాకా ఓ పూట పాలిస్తూ వచ్చిందట ఆ తల్లి.

అట్లా చనుబాల గురించి నాదొక జ్ఞాపకం. ఎప్పుడో సందర్భాన్ని బట్టి అమ్మ చెబితే నాకది జ్ఞాపకమయింది తప్ప, అది అత్యంత సహజంగానే అన్పించింది తప్ప మరో భావన లేదు. పాలు చాలని బిడ్డను పాలున్న తల్లి పక్కలోకి తీసుకోవటం పల్లెల్లో సాధారణమే. నా విషయం కూడా

అందులో భాగమే తప్ప ప్రత్యేకమైంది కాదనే అనుకొన్నాను. పాలకు కులం లేదనుకున్నాను. కానీ ఇదే అనుభవమున్న నా మిత్రుని జ్ఞాపకం విన్న తర్వాత నేను కొంత ఆశ్చర్యానికి గురికాక తప్పలేదు.

❖

నా మిత్రుడు రామచంద్రారెడ్డికి కూడా చనుబాలకు సంబంధించిన ఓ జ్ఞాపకముంది. అది కొంత వింతయింది. నాకులాగా సహజంగా లేనిది.

మేం క్లాస్‌మేట్స్‌మి కాదుగాని రూమ్మేట్స్‌మి. అతను లా స్టూడెంట్, నేను డిగ్రీ స్టూడెంట్‌ని. ఇద్దరం నెల్లూరు వి.ఆర్. కళాశాల విద్యార్థులం. ఒకే జిల్లాకు చెందినవాళ్లం. మాది రైతు కుటుంబం. వాళ్లది రెడ్ల కుటుంబం. బాగా స్థితిమంతులు. అతని తండ్రి గ్రామ రాజకీయాల్ని ఒంటిచేత్తో నడిపే వాడు.

అతనికి కూడా చిన్నతనాన మాదిగతల్లి పాలిచ్చిందట. సందర్భానుసారం ఆ విషయాన్ని గురించి నాకు చెబుతున్నపుడు అతని స్వరం మారిపోయేది. అందులో ఏదో ఆత్మన్యూనత, మరేదో నొప్పితో కూడిన వ్యక్తీకరణ. నాకు అనుభవానికి రాని వింత భావం ఒకటి అతని మాటల్నిండా అలుముకొని నన్ను ఆశ్చర్యానికి గురిచేసేది. మాదిగతల్లి చనుబాలు తాగిన జ్ఞాపకం అతన్ని ముల్లులతో గుచ్చినట్లు విలవిల్లాడేవాడు. చిన్నప్పట్నించీ అది అతన్ని క్రూరంగా వెంటాడుతూనే ఉందిట. వరసైన వాళ్లు ఎగతాళి చేయటానికీ సరిపోనివాళ్లు ఎత్తిపొడవడానికీ అదో వస్తువైందిట. అతని ఒంట్లో మాదిగల జీవశక్తి ఏదో ప్రవహిస్తున్నట్లుగా, తక్కువ కులానికి చెందిన మొరటుదనం అతని నిండా ఉప్పొంగుతున్నట్లుగా చూసేవాళ్లుట చుట్టుపక్కలవాళ్లు. మా ఇద్దరిదీ ఒకటే జ్ఞాపకమైనా అతని చుట్టూ ఉన్న సమాజం దాన్ని మరో దృష్టితో చూడటం నాకయితే వింతగా అన్పించింది. అది అతన్ని ముల్లుగర్రలా పొడవటం కొత్తగా అన్పించింది. దానికి కారణాల్ని ఊహిస్తే- అతను నాలా మృదుస్వభావి కాదు. ఇంట్లో ఒక్కక్షణం ఉండేవాడు కాదుట. ఎప్పుడూ పిల్లలతో కలిసి వీధుల్లోనే. పోట్లాడటం... తిట్టటం... ఆధిపత్యభావాన్ని ప్రదర్శిం చటం... తులువ పనుల్ని చేయటం... తోటిపిల్లలకు అతన్ని ఎదిరించటం కష్టమై... దెబ్బల్తిని ఇంటికిపోతే... 'వాని జోలికి పోగాకండి నాయినా! వాడేం మన పాల్దాగి పెరిగిండా! మాదిగోల్ల పాల్దాగి పెరిగిందాన గదూ ఆ మొప్పె చేస్టాలు...' అని తల్లిదండ్రులు బుద్ధి చెప్పటంతో, పిల్లలు ఆ విషయాన్నే ఆయుధంగా చేసికొని అతన్ని ఎదిరించటం... అతను కూడా చనుబాల జ్ఞాపకాన్ని తన లోపంగానే భావించటంతో ఆత్మ న్యూనతకు గురికావటం... కబడ్డీలోనో, బొంగరాల ఆటల్లోనో, గోలిగుండు, పుట్టచెండులాంటి ఆటల్లోనో అతని మొరటుశక్తి ధాటికి అవతలి వర్గం ఎప్పుడూ ఓడిపోవలసిందే. అతని శక్తికి కారణం అతని ఒంట్లోని మాదిగల చనుబాలేనని చాటుమాటుగా కసిగా అనవలసిందే. పెద్దయిన తర్వాత కూడా ఆ విషయాన్ని కెలికి అతన్ని బాధపెట్టటం మానలేదుట. చనుబాల జ్ఞాపకం వల్ల అతను ఎంతగా అసహనానికి గురయ్యేవాడంటే- తనకు పాలిచ్చిన మాదిగతల్లిని అసహ్యించుకొనేదాకా!

❖

నా చిన్నతనాన ప్రతి రైతుకూ ఒక ఇంటి మాదిగ ఉండేవాడు. సన్నరైతులయితే నలుగు రైదుగురికి కలిసి ఒకే మాదిగ. పొలంపని ఉంటే పనికి పలకటం, పని లేకుంటే కట్టెలు కొట్టో, పేడా కసువు ఎత్తేసో, గింజలు దంజో, రాగులు విసరో... ముద్ద సంగటి పెట్టించుకొని, మగాళ్లయితే అక్కడే తిని, ఆడాళ్లయితే కొంత మిగుల్చుకొని పిల్లలకు తీసికెళ్లటం... తెగిన చెప్పులు కుట్టటం, రైతుకు ఎప్పుడూ అందుబాటులో ఉండటం... వ్యవసాయపనులకు వచ్చినపుడు కూలిగింజలు ఇస్తారు. సంవత్సరమంతా పనికి పలికినందుకూ, తెగిన చెప్పులు ముడేసినందుకూ కళ్లంలో మేర గింజలు ఇస్తారు.

పనున్న రోజు ఆలుమగలిద్దరూ వచ్చి పన్జేస్తారు. కలుపులకు, నాట్లకు, కోతలకు కూలి మాసుల్ని పిల్చుకొస్తారు. పనిలేని రోజు కూడా ఆలుమగలు ఊర్లోకొస్తారు. తోలుసంచిలో కత్తి, ఆలె, తోలు ముక్కలతో మొగుడు ఏదొక గోడనీడన కూచుంటే, పెండ్లాం ఆయమ్మనో, ఈ అమ్మనో వక్కాకు అడుక్కొని, తలనూనె అడుక్కొని, చిన్నచిన్న ఇంటిపనులు చేసి కడుపు బూడ్చుకొని పోతారు.

సంక్రాంతి దాటిందంటే పొలం పనులుండేవి కావు. శివరాత్రి వచ్చేలోపల వాములేసి, కళ్లాలకు కంప బిగిస్తే, తొలకరింపుల దాకా అరుగుల మీద బారాకట్టలు ఆడుతూ కూచోవటమే. ఆ కాలం మాలమాదిగలకు కొంత దుర్భరమైందే. పొద్దున్నే వచ్చి అంబలి పొద్దుదాకా వీధుల్లో తిరుగుతూనే ఉంటారు, రైతులు ఏదొక పని చెప్పకపోతారా, సద్దినీల్లు దొరక్కపోతాయా అని. ఏదొక రైతు ఇంట ముద్ద దొరికేది. కొందరయితే జొరబడి పన్జేసి, చనువుగా ముద్ద పెట్టించుకొని తిని పోయేవారు. వాళ్ల శ్రమ సోకకుండా, వాళ్ల చమటతో తడవకుండా ఆనాటి వ్యవసాయం ముందుకు సాగేదికాదు.

చదువులు పల్లెల్లో ప్రవేశించిన తర్వాత, రైతులు తమ పిల్లల్ని శారీరక శ్రమ నించి తప్పించి బడులకు పంపించటం మొదలైంతర్వాత మాలమాదిగల తోడ్పాటు మరింతగా అవసరమైంది వ్యవసాయానికి. ఆలుమగలు పిల్లలతో సహా అందరూ రైతుల చేతుల కిందికి వచ్చారు. వాళ్ల పిల్లల శ్రమను కూడా రైతులు వాడుకొన్నారు. తన ఇంట్లోని శ్రమించే చేతులు అక్షరాల స్పర్శకోసం శ్రమకు దూరమయినపుడు, ఆ ఖాళీని మాలమాదిగల అదనపు శ్రమతో భర్తీ చేసికొన్నాడు రైతు. తమ పిల్లల్ని కాడికింద వంచి రైతుల పిల్లలకు చదువుకొనే అవకాశం కల్పించింది ఆనాటి దళిత మహిళ.

మా ఇంట్లో కూడా అదే చరిత్ర. అక్కలు ముగ్గురికీ పెళ్లయి అత్తగారింటికి పోతే, నన్ను చదువుకు పంపిన మా నాన్న వ్యవసాయం సాగటానికి మాదిగ యువకుణ్ణొకడ్ని జీతగానిగా కుదుర్చు కున్నాడు.

'చనుబాలు' కథ రాసేనాటికి ఇవన్నీ నాలో ఎక్కడో అణగిమణగి ఉన్న జ్ఞాపకాలు. ఇవి నాలో ఉన్నాయనీ, వాటిలో అవసరమొస్తుందనగనే స్పృహకూడా నాలో లేదు. మా ఊర్లో జరుగుతూ ఉన్న ఒకానొక తంతును చూసి కథగా రాయాలని ఎప్పుడయితే అనుకొన్నానో, నాలోకి నేను తవ్వు కుంటూ పోతున్నానో, తొమ్మిదిమట్లు తవ్వింతర్వాత బావిలో బుగ్గబడి నీరు ఉబికినట్లు, జ్ఞాపకాలన్నీ వచ్చి నన్ను చుట్టుకొన్నాయి. కథలో భాగమయ్యేందుకు ముందుకొచ్చాయి.

❖

చనుబాలు తాగటమొక్కటే కాదు- మాలలకు సంబంధించిన మరెన్నో జ్ఞాపకాలున్నాయి నాకు. గొల్లలకు, కాపులకు తగ్గకుండా ముప్ఫయి నలభై ఇళ్లదాకా ఉన్న మాలలు, నేను పుట్టక ముందే బతుకుదెరువు వెదుక్కొంటూ ఎక్కడికో వెళ్లిపోయారు. పాపిష్టి కరువులు వాళ్లను మాత్రమే ఊరి నుంచి ఎందుకు తరిమేశాయో అర్థం చేసుకొనే జ్ఞాపకం... మరో పాతిక సంవత్సరాలకు ఇతర ప్రాంతాల్లోని చవిటి భూముల్లో బతకలేక ఐదారు మాల కుటుంబాలు మా ఊరికి వలస రావటం కొత్త జ్ఞాపకం... కొత్త మాలలకు ఇది కూడా స్థిరమైన కుదురు అవుతుందనే నమ్మకం లేదనీ, ఇప్పటికే రెండు మూడు ఊర్ల వద్ద ప్రభుత్వ పథకాల్ని దుర్వినియోగం చేసి వచ్చారనీ, ఇక్కడ కూడా అదే ప్రయత్నం చేస్తారనీ పుకారు. వాళ్లు వలస వచ్చింది ఊప కూడా మొలవని చవిటి నేలల్లోంచి. ప్రభుత్వం వాళ్లకు బిల్డింగులిచ్చింది. భూములకు పట్టాలిచ్చింది. బోర్లేయించింది. మోటార్లు బిగించింది. ఎద్దులు, బండ్లు ఇచ్చింది. రెండు మూడేళ్లకే అన్నీ అమ్ముకొని ఊరు

వదలి వచ్చారని ఇక్కడి మాలల గుసగుసలు. వీటన్నిటికీ కారణాల్ని అన్వేషించటం కూడా కథలో భాగమయింది.

మా ఊరి మాలలకు 1980ల్లో ఒకసారి బిల్డింగులు శాంక్షనయ్యాయి. పునాదులు కట్టుకొనేందుక్కూడా శక్తిలేక వాటిని వదిలేశారు. 1990ల్లో మరోసారి వచ్చాయి. అప్పటికి ఇతర ప్రాంతాల నుంచి వలస వచ్చిన కొత్త మాలలు ఊర్లో ఉన్నారు. ఎప్పుడూ పక్కూరి రెడ్ల అడుగుల్లో నడుస్తూ రాజకీయం చేస్తోన్న మా ఊరి జనాల్లోంచి ఓ రైతు రెడ్డిగా మారాడు. చెరువు కాంట్రాక్టు వల్ల కొంత డబ్బు మిగలటంతో ఖద్దరు చొక్కా తొడిగి రాజకీయాలు తలకెత్తుకున్నాడు. పక్క ఊరిలో రెండు వర్గాలు ఆధిపత్యం కోసం గొడవ పడుతోంటే దాన్ని ఆసరా చేసికొని అధిష్టానాన్ని ఒప్పించి ఎన్నికల్లో నిలబడి గ్రామ సర్పంచ్ అయ్యాడు. బరక నేలల్లోంచి వచ్చిన ఓ రైతు, ఓటమి ఎరుగని పాతకాలపు వటవృక్షాల్లాంటి రెడ్లను నేలబడగొట్టటం వల్ల అన్నేళ్లపాటు వాళ్లు సంపాదించుకొన్న కీర్తిప్రతిష్టలు ఇతన్ని వరించాయి.

అదిగో ఆ సమయంలోనే మాలలకు బిల్డింగులొచ్చాయి. మాలలంతా మిద్దెలు కట్టుకొని వాటిల్లో దర్జాగా బతకబోవటం, ఎక్కువమంది రైతులు ఇంకా బోదకొట్టాల్లోనే జీవనం నడుపుతూండటం తల్చుకొంటే రెడ్లకు అరిగి రాలేదు. వారిని ఊరికి దూరంగా తరిమితేనన్నా వాళ్ల వైభవం కళ్లబడకుండా ఉంటుందని అనుకొన్నారు. రెడ్లంతా ప్రెసిడెంటును చేసి గుసగుసలు పోయారు. మాలల్ని ఊరి నుంచి బైటకు గెంటేందుకు ఎన్నెన్నో ఉపాయాలు పురుడు పోసుకున్నాయి. చివరకు అవేమీ ఫలించలేదు. ఊరిబైట విశాలమైన స్థలంలో ఇల్లు కట్టుకొని సుఖంగా బతకక ఇక్కడి ఇరుకిరుకు సందుల్లోనే మాలలు ఎందుకు ఉండాలనుకొంటున్నారో కారణాల్ని విశ్లేషించుకోవలసిన అవసరం వచ్చింది... అట్లా ఆలోచిస్తున్నపుడు నాలోకి నేను తొంగి చూసుకొని, పనికిరాని భావా లెన్నిట్నో తుడిచేసికొనే అవకాశం కూడా వచ్చింది. "గవన్మెంటోల్లకు బుద్ధిలేదు. మా యట్లాంటి రైతులకు సాయంజేస్తే అంతకంతకు రెట్టింపు ఫలితం సూపించమా? ఈ మాల మాదిగ నాకొడకలకు ఏమిచ్చి ఏం లాభం? బిల్డింగులిచ్చే వాకిండ్లు, కిటికీలు, దంతెలు అమ్మక తింటరు. గొడ్లనిచ్చే కోసక తింటరు. బండిని, మోటార్లనూ అమ్మి తాగి తందనాలాడ్తారు..." అనే రెడ్ల మనస్తత్వాన్ని గుర్తు పట్టుకోవటం కూడా జరిగింది. కొత్త మాలల్ని కదిలించినపుడు వాళు చెప్పిన సమాధానాల్ని విని ఒళ్లు జలదరించింది. అదంతా కథగా రావలసిందేగదా! చివరకు నాకనిపించింది- ఎన్నో తరాలుగా రైతు కోసం, వ్యవసాయంకోసం తమ జీవితాల్ని అర్పించిన మాల మాదిగలకు పక్కా గృహాలు రావటాన్ని రైతులు జీర్ణించుకోలేకపోవటం ఏం వైపరీత్యం? అని.

ఈ కథంతా రాశాను. మాలలు బిల్డింగులు కట్టుకొంటే, ఇంకా కొట్టాలు, గుడిసెలున్న తమకు అవమానంగా ఉంటుందని కాపులు, గొల్లలు గ్రామ సర్పంచ్‌లకి విన్నవించుకోవటం, కనీసం వాటిని ఊరి బైటికన్నా పంపించమని వేడుకోవటం, అతను ఎన్నెన్ని ఉపాయాలు పన్నినా మాలలు ఊరిడిచి వెళ్లకపోవటం అనే విషయాన్ని కథగా మలిచాను. ఓ వారం తర్వాత నా కథ నేనే చదువుకొంటే, అందులో ఏదో ఫీలింగ్ జారిపోయినట్లుగా అనిపించింది. కథయితే ఉంది. ఒడ్డున కూచుని రాసినట్టుంది. ఎవరో ఎవర్ని గురించో చెబుతున్నట్లుంది తప్ప ఇన్ని తరాల దళితుల, రైతుల సంబంధాల్ని వాళ్లల్లోంచి వచ్చిన మనిషి చెబుతున్నట్టు లేదు. నేనది చెప్పాలనుకొన్నాను. ఈ కథకాదు. మళ్లీ ఆలోచనల్లో పడ్డాను. దళితుని పరంగా కథ చెబితే ఖచ్చితత్వం ఉంటుంది. కానీ నేను దళితుడ్ని కాను. అట్లా నటించలేను కూడా.

నేను నేనుగా కథ చెప్పాలి.

ఈ భావన తర్వాత నన్ను నేను తవ్వుకొని చూసుకోసాగాను. నా ముందు తరాల్ని గునపాలతో కెళ్లగించి చూశాను. ఎక్కడో సూత్రం దొరికింది. నా మిత్రుడు రామచంద్రారెడ్డి అనుభవాలు నా అనుభవాలయ్యాయి. గ్రామ సర్పంచ్ మనస్తత్వాలు నా పాత్రకు జోడించాను. నేనంటే ఇక్కడ నేను కాదు. బి.సి.లకు అగ్రవర్ణాలకు ప్రతినిధిని. నాకున్న చనుబాల జ్ఞాపకం నా కథకు సూత్ర మయ్యింది. నా మిత్రుని వేదనామయ జ్ఞాపకం కథకు ప్రాణమయ్యింది. మరి ఊరి సంఘటన రక్తమాంసాల రూపమయ్యింది.

కథ చదివే పాఠకుడికి అందులోని సంఘటనలన్నీ ఒకే ప్రాంతంలో, ఒక వ్యక్తికి ఎదుర యినవి. అనుభూతికి రావొచ్చుగాని అవన్నీ ఏకకాలంలో ఒకే వేదిక మీద జరిగినవి కాదు. కథ చెప్పే పాత్ర ఒకటే కావొచ్చుగాని వాటి అనుభవాలు వివిధ పరిస్థితుల నుంచి వచ్చిన వివిధ పాత్రలవి కావొచ్చు- అయితే ఏకసూత్రత ఉంటుంది. వాతావరణాన్ని మా ఊరి నుంచి తీసుకొన్నా అది అన్ని పల్లెలకూ నమూనా అయి ఉంటుందని నా భావన. వివిధ కాలాల్లో, వివిధ ప్రదేశాల్లో, వివిధ పాత్రల మధ్య వివిధ సంఘటనలుగా జరిగిన విషయాల్ని ఒకేచోట, ఒకే కాలంలో జరిగినట్లుగా చిత్రించి ఉండొచ్చు. వాటిని ఒక సూత్రానికి కూర్చుకొనే నేర్పు రచయితకు ఉ ండాలి.

రచయిత కూడా తన చుట్టూ ఉన్న సమాజంలోంచి పుట్టుకొచ్చినవాడే. అతడేం అవతార పురుషుడు కాడు. తరతరాలుగా తన చుట్టూ పేరుకుపోయిన పొరలను ఒక్కొక్కదాన్ని వదల్చు కొంటున్నవాడు. సమాజాన్ని తాను పూర్తిగా మార్చగలనని ఏ రచయితా అనుకోడు. అట్లా భావించి ఎవరూ రచనలు చేయరు. అలాంటి భావాలున్నాయంటే అతను ఎప్పుడో 'బాబా'గా మారిపోయుం టాడు. నేను చదువుకొన్న సాహిత్యం, నేనిప్పుడు సృష్టిస్తోన్న సాహిత్యం మొదట నన్ను సంస్కరిస్తూ ఉంది. నేను రాసే ప్రతి కథా నన్ను పుటం పెట్టి కాల్చి ప్రక్షాళన చేస్తూ ఉంది. కర్షకులు, కార్మికుల, దళితుల, స్త్రీల, కులమతాల విషయంలో నా రక్తంలో జీర్ణమై ఉన్న పాత వాసనలెన్నింటినో నేను సాహిత్యసృష్టి చేసే తరుణంలో కొంతలో కొంతయినా వదల్చుకొంటున్నాను. ఉదాహరణకు- దళితుల విషయంలో తరతరాలుగా అనువంశికంగా వస్తోన్న కుల అహంకార అవలక్షణాలు నాలోనూ ఉన్నాయి. వాటి ఉనికిని గురించిన స్పృహ సాహిత్యమే నాకిచ్చింది. నన్ను నేను సంస్క రించుకొనే క్రమంలోనే నా చుట్టూ ఉన్న సమాజంలోని దళితులకు సంబంధించిన ఎన్నో సంఘ టనలు అర్థమై అవి కథలుగా తయారయ్యాయి.

ఆ క్రమంలోనే ఈ 'చనుబాలు' కథ కూడా.

❖

చివరగా ముక్తాయింపు ఏమిటంటే-

నా పిల్లలకు కూడా సరిపడేన్ని చనుబాలు తల్లి దగ్గర లేవు.

అయితే- అప్పటికి డబ్బాపాలు వచ్చాయి.


'చనుబాలు'కు సంబంధించి అంత లావు సెంటిమెంట్‌తో కథ రాసుకోవలసిన వస్తువు వాళ్ల అనుభవానికి రాలేదు.

దళితులు, రైతులకు మధ్య కూడా శ్రమ సంబంధాలు దూరమయ్యాయి. కేవలం కూలి సంబంధాలు మాత్రమే మిగిలాయి. దళితులు ఎప్పుడయితే రైతుకు దూరమయ్యారో అప్పటి నుంచే వ్యవసాయం ఒంటరిదయింది. అశోకవనంలో సీతలా శోకిస్తూ ఉంది.

*16 సెప్టెంబర్ 2013*

*'చనుబాలు' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

33



*స్వామిగా పరిచయమున్న **బండి నారాయణస్వామి** 1952 జూన్ 3న అనంతపురం జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ పరుగు 1987లో ఆంధ్రప్రభ వారపత్రికలో అచ్చయింది. అప్పట్నుంచి సుమారు ముప్పై కథలు, మూడు నవలలు రాశారు. ఒక కథల సంపుటం వెలువడింది. వివిధ పత్రికల్లో కథలకి, నవలలకి బహుమతులు వచ్చాయి. కొన్ని కథలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు.*

**చిరునామా**

*6-4-276, 4వ క్రాస్, అనంతపురం*

*Ph.: 80198 58599*

# సావుకూడు

## స్వామి

పైటాల పొద్దు.

ముద్దు పొద్దు.

ఎండ అగ్గి కురుస్తోంది.

గాలి తోలదు.

ఆకు అల్లాడదు.

ఉడుకు ఉడుకు...

ఉమ్మరిస్తోంది.

ఇప్పటిదంకా ఒక మోడం లేదు. వాన సినుకు లేదు. యాడ జూసినా ఒక గెడ్డిపోస లేదు.

ఎట్లో బతుకుతారు మనుషులు- ఇంత గంజి తాగో, కలబంద గడ్డలు తవ్వకుని తినో...! పశులూ...? పశులు ఎట్ల బతుకుతాయి- కిరికేదానికి గెడ్డి లేకపోతే?

కరువు కరువు...

గెడ్డికి కరువు.

గింజలకు కరువు.

ఎండ ఎండ...

బలిసిన ఎండ!

సెగ సెగ...

ఇంటా బయటా సెగ!

కంపసెట్లలో గుమ్మని అంటాండే కీసారుల్లు.

నెత్తి మీద రెక్కలు ఇప్పి ఎగురుతాండే గద్దలు.

కొక్కులు బొక్కలు పెట్టి సెరువంతా పాడైపాయ.

మనసులకి పన్లు లేవు.

సంగట్లోకి నూకల్లేవు.

ఆకలికి ఈల గరుసుకొని ఎల్లమ్మ కట్టమింద పులీ-మేక ఆడతాండారు.

పిల్లోల్లకి-అంగీ ఉంటే నిక్కర లేదు, నిక్కర ఉంటే అంగీ లేదు.

రెవికలు- సంకల్లో సినిగినా, రొమ్ముల మీద సినిగినా, ఆడోల్లకి సిగ్గులేదు. ఆకులూ వక్కలకూ, గడ్డిమోపుకూ మానం అమ్ముకునే ఊర్లో ఎవరికీ కడుపు నిండదు.

వానల్లేక రెండేండ్లాయ.

పంటల్లేక మూడేండ్లాయ.

ఎదిగిన కూతుర్లకి పెండ్లిండ్లు సెయ్యక మూడేండ్లాయ.

ఎండ ఎండ!

సెగ సెగ!

కాలతాండే బీడీలు నలుగుతాండే వక్కాకు.

అంతకంటే ఏం సేయల్లా మల్ల?

పనిపాటలు లేవు.

ఎట్లోగల్ల పొద్దు గడిపి సావల్ల? సెట్లకిందా, బండి వొగల మీదా, యాడబడితే ఆడ డొక్క ల్లోకి మోకాల్లు ముడుసుకుండిన నిద్దర్లు.

సావు! పానం పోకా, ఉండకా పదిదినాల నుంచి కొట్టుకులాడిన ముసిలోని సావు! గెడ్డి మింద పరిచిన యూరియా గోనపట్ట సంచుల మీద పండుకొని, పదిదినాల నుంచీ కాఫీనీల్లే తాగి పానం పట్టుకున్న ముసిలోడు సచ్చిపాయ.

"పెద్దప్పయ్య సచ్చిపోయినా తండ్రా!" అరుగులు దిగీ పైబట్ట వదిలించుకొని ఒక్కరొక్కరే పీనుగుల మాదిరి కదిలి మూగుతాండే మనుసులు.

సావు!

సావు ఎవరికైనా వస్తుంది. ముసిలోనికీ వచ్చింది. ఈ కష్టకాలంలో బతికే దానికంటె, సచ్చిపోయేవాల్లే పున్నాత్ములు!

రెండ్రూపాయలు పెడితే శేరు రాగులు రావు. రెండున్నర పెట్టినా శేరు జొన్నలు రావు. కేజీ ఒట్టి మిరపకాయలు అరవై రూపాయలు. అయ్యో వానెమ్మ. ఏం లోకము?

రూపాయి నోటు ఇస్తే రెండు శేర్లు ఉప్పు రావద్దా?

ఓరి నీ పాసుగాలా ఏం కాలము!

ఇల్లు కొల్లబోతాంటే ఇంక బతక్కపోతేనేమి? ముందు ముందుకి ఇంకా ఎన్ని కష్టాలుం డాయో అవన్నీ ఈ కండ్లతో సూడకుండా సచ్చిపోయినోల్లే పున్నాత్ములు! సచ్చిపోతే సచ్చిపోయినాడు గానీ పాపము, కడసారి కోరిక తీరకుండానే సచ్చిపోయినాడు ముసిలోడు.

బతుకంతా ఎద్దు మాదిరి కష్టపడినోడు ముసిలోడు! కడుపుకు కలో గంజో తాగి, ముగ్గురు కొడుకుల్ని సాగి సంరచ్చించి, వాల్లకు పెండ్లిల్లు చేసి, వాల్లు ఏరు కాపురాలు పొయ్యేటప్పటికి ఎవరికిగాని పైసా అప్పు లేకుండా చేసి, పదిమందితో ఔననిపించుకున్నోడు. పాపము, కడసారి కోరిక తీరకుండా సచ్చిపోయినాడు.

కొడుకులు లేరా?... అంటే ఉండారు. వెనుకాముందూ బందుగుల్లేరా... అంటే ఉండారు. కాని, ఎవరుంటే మాత్రము ఏం చేస్తారు? ఎవరి బతుకు వాల్లది! ఎవురి దారి వాల్లది! పాపము, కడసారి కోరిక తీరుకుండానే సచ్చిపోయినాడు ముసిలోడు.

ఇప్పటికి నెలదినాల కిందట- ముద్ద పెట్టి సాకే సిన్నకొడుకు ఇంట్లో మంచమెక్కె ముసిలోడు. అప్పుడు పెద్దకొడుకు మారిప్ప నాయనను చూసి మాట్లాడించి పోదామని వచ్చె. "ఎట్లుంది నాయనా పానానికి?" అని అడిగె.

"ఇంక ఎక్కువనాల్లు బతకన్రా నేను," అనె ముసిలోడు.

"అవేం మాటలు నాయనా?" అంటూ మనసు నొచ్చుకునే కొడుకు.

"నిజ్జం నాయనా! నా శరీరం బాధ నాకు తెలుసు," అంటా కంట తడి పెట్టుకుని.

రొవంత సుస్తీ సేసి పైనురుకు లేస్తే అమెరికాకి పొయ్యేవాల్లు ఉండారు. పానం మీదికి వస్తే పక్క ఊరికి బస్సెక్కి పోయి ఒక సూది ఏయించుకునేదానికి దుడ్లు లేవు. వయసు పానమైతే, 'ఎట్లబ్బా రోగమొచ్చింది. మందులకు దుడ్లు లేవు,' అని సింత చెయ్యొచ్చు.

ముసిలి పానములే, ఈ పొద్దు కాకపోతే రేపన్నా పొయ్యేది.

అట్లాంటి ముసిలిపానానికి మందులూ, సూదులూ, టానిక్కులూ... అన్నీ యాలలే! ఇంట్లో అందరూ పస్తులు పండుకుంటాంటే మందులు కొని, మింగి పానం కాపాడుకోడానికి ఎవునికి సయిస్తుందిలే?

కొంచెంసేపు అయినాక ముసిలోడు మెల్లగా అడిగె. "కల్లు తాగి సానానాల్లు అయిందిరా పెద్దోడా! ఒక తూరి తాగల్ల అనిపిస్తోంది. నాల్రూపాయలుంటే ఇచ్చి పోరా."

పెద్దకొడుకు మాట్లాడలే. నాలుగు రూపాయిలుంటే మూడు దినాలకి ఉప్పు, మిరపకాయ లొస్తాయి. నాలుగు రూపాయిలుంటే ఒక దినం బత్తెం గడిసిపోతుంది.

పెద్దకొడుకు గమ్మున ఉండిపోయేసరికి ముసిలోనికి గొంతులో రాయి పడినట్లాయ.

"ఇంక సానా నాల్లు బతకనురా పెద్దోడా... సచ్చే ముందు ఒక తూరి కల్లు తాగి సచ్చి పోతాన్రా. నిన్ను మల్లా మల్లా దుడ్లు అడిగేదానికి నేను సానానాల్లు బతకనులేరా! బతికేదానికే కష్టమైతాంటే ఇంక సుకం యాడుందిరా? అందుకే సచ్చే ముందున్నా ఒక తూరి తాగి సుకపడి సచ్చిపోదామనిపిస్తోంది."

తండ్రి 'సస్తాను' 'సస్తాను' అని పదేపదే అంటాండేటప్పటికి కొడుకుకి ఎదలో నెర్లు పొగి నట్టాయ. ఫుల్ బనీను జేబులోంచి నాలుగు రూపాయిలు తీసిచ్చె. "ఇదిగో నాయనా," అనె.

మొగుడు వాల్ల నాయనకు నాలుగు రూపాయిలు ఇచ్చినాడని ఇని మొగుని మిందా, మామ మిందా ఇంతెత్తుకు ఎగిరిపడె మారెప్ప పెండ్లాము.

"ముసిలోల్లని సాకుతానని అందుకుగాను అయిదు ఎకరాల సేను ఎక్కువ రాయించు కుండె కదా అయప్ప సిన్నకొడుకు. మల్ల ఆ సిన్నకొడుకు దగ్గరే పోయి అడుక్కోవల్ల, 'కల్లు తాగబుద్ధి పుడతాందిరా, దుడ్లు ఈయరా,' అని! మల్లీ మన ఇంటి మిందికి వచ్చేది యాల? ఆ అయిదు ఎకరాలు మనకే రాసిస్తే మనం సాకకపోదుమా, ముసిలోల్లని. లేదులే... మీ అమ్మకూ, నాయనకూ మన మీద నెర్లూ లేదు, వాల్లని మనం సాకుతామనే నమ్మకమూ లేదు. లేకపోతే పాయలే... అంత నమ్మకం లేనోల్లని మల్లీ ఈ పొద్దు యా ముగం పెట్టుకుని అడిగె మీ నాయన- కల్లుకు దుడ్లు ఈయరా అని. మీ నాయనకు సిగ్గు లేకపోతే నీకన్నా ఉండొద్దా బుద్ధి?" అంటా కూతలేసె. మొగున్ని చడామడా తిట్టె. ముసిలోని మింద రంకెలేసె. చిన్నమరిది సంసారం మింద దుమ్మెత్తి పోసె. అరిసి అరిసి కడాకు గోవురుమంటా ఏడ్చె చేతుల్తో పిల్లోల్లని పట్టుకొని.

‘‘సంపెయ్ సామీ! నన్నూ నా పిల్లోల్లనీ కూడు పెట్టకుండా సంపెయ్. దానకర్ణునివి దిగి వొచ్చినావు పాపమూ! పెండ్లాం పిల్లలు అడక్కతింటారో, సస్తారో... నీకేం పట్టె? మానుబావుడా! మా గుడ్డలు సూడు, మా కడుపులు సూడు, మా బఱ్రెముకలు సూడు. ఒక పూట తిననీ, ఒక పూట తినకా పస్తులు పడి ఎండగాలతాండాయే! నీ కంటికి మేము ఆనలేదా సామీ? ఇల్లంతా ఇట్లా కడగావాల్లకు దోసి పెడతాంటే ఇంకెట్ల దేముడా- నేను నా పిల్లోల్లకు ఇంత ముద్ద పెట్టి బతికించుకుండేదీ?’’ పొద్దు మునిగినా ఆయమ్మకు ఎక్కిల్లు తగ్గలే!

ఈ పొద్దో రేపో సచ్చిపోతాడనుకున్న ముసిలోడు కడుపులో కల్లు పడేటప్పటికీ లేచి కూర్చుండె.

‘‘బోలె గట్టి పానమబ్బా ముసిలోనిది! మనం సావల్సిందేగాని ముసిలోడు సావడు,’’ అని ఊర్లో అంతా నవ్వుకుండిరి!

‘ముసిలోడు నిజ్జంగా సచ్చిపోతాడనుకుని ఊరకే నాలుగు రూపాయలు ఇస్తినే? బుద్ధిలేని నా కొడుకుని. ఎనకా ముందూ ఆలోసించకుండా తొందరపడితి,’ అనుగుండె పెద్దకొడుకు మారెప్ప.

వారందినాలు గడిసినంక రోగం తిరగబెట్టి మల్లీ మంచంలో పడె ముసిలోడు.

చూసి పోయేదానికి రెండో కొడుకు నాగన్న వచ్చె.

‘‘ఎట్లుంది నాయనా పైలో?’’ అని అడిగె మంచంకోడు దగ్గర కూర్చొని.

‘‘ఇంక నా పని అయిపోయిందప్పా,’’ అని మూలిగె తండ్రి పెద్దప్పయ్య.

తండ్రి కొడుకులు మంచీచెడ్డ విషయాలు మాట్లాడుకుంటూ కూచుండిరి కొంచెంసేపు.

కోరిక. ముసిలోని మనసులో, కోరిక కలయదిరుగుతాండె. కోరికను బైట పెట్టల్లంటే బెరుకు. ఆ కోరిక తీర్చే స్తోమత రెండో కొడుకుకు లేదని తెలుసు. కాని, ఏమూలో ఆశ- అప్పో సప్పో చేసి తండ్రి కడసారి కోరిక తీర్చడా అని.

‘‘ఒరే నడిపాడా!’’ అని పిల్చె.

‘‘ఏం నాయనా!’’ అని కొడుకు తండ్రి దగ్గరికి జరిగె.

ముసిలోడు మాట్లాడలే. ‘‘ఏం నాయనా?’’ అని మల్లీ అడిగె కొడుకు.

‘‘ఏం లేదులే అప్పా,’’ అని రాయదుర్గం సాంతాడంత నిట్టూర్పు ఇడిసిపెట్టె ముసిలోడు. రెండో కొడుకు పరిస్థితి తలుచుకుంటే గొంతులోని మాట గొంతులోనే ఇరుక్కుపోతాండాది ముసిలోనికి.

ముసిలోడు కొడుకులకు సంపాదించి ఇచ్చింది- తలా అయిదు ఎకరాలు సేను. దాంట్లోనే సేద్యం చేసుకోవల్ల. పిల్లోల్లు, పెద్దోల్లు అంతా సెరువుకట్ట కింద మల్లల్లోకి కూలికి పోయి పొట్ట పోసుకోవల్ల. కాని మూడేండ్ల నుంచీ వానల్లేవు! భూమిలో ఏసిండే ఇత్తనం కూడా ఇంటికి చేరలే. సెరువు నిండలే. సెరువు కింద మల్లల్లో పన్లు దొరకలే. అందుకని నిరుడు పనుల కోసమని ఊరు ఇడిసిపెట్టి బల్లారికి పోయిరి అంతా- పత్తిసేన్లలో కూల్లు దొరకుతాంటే.

పాపము అప్పుడే రెండోవాని భార్య ఎవడో మాయం మాటలు చెపితే నమ్మి వాని ఎంట ఎల్లిపోయె. ఆయమ్మ తప్పు కూడ ఏముందిలే పాపము? ఆయమ్మకు ఎప్పుడు సూసినా కడుపు నొప్పి వస్తాండె. డాకటరు దగ్గరికి పోదామంటే మొగుడూ సెవిలో ఏసుకోకపాయ, దుడ్లు లేవని. వాడెవడో...! ‘దుడ్లు ఎంతైనా సరే కర్చుపెట్టి బల్లారిలో మంచి డాకటరుకు సూపిస్తాను, నా ఎంటరా,’ అని ఆశ పెడితే ఈయమ్మ పానం మింద తీపితో వానెంట ఎల్లిపాయె- మొగున్నీ, పిల్లోల్లనీ ఇడిసిపెట్టి. ఇప్పుడు పెద్ద కూతురే ఇంత ముద్ద కెలికి పెడతాండాది వాళ్ల అమ్మ బదులు ఇంట్లో. మంచం మీద నుంచి లేచి నిలబడె రెండో కొడుకు నాగన్న.

''పాయొస్తా నాయనా, ఎద్దులకు నీల్లు తాపల్ల,'' అనె, టవ్వాలు భుజం మీద ఏసుకొని.

'కోరిక, కోరిక. కడసారి కోరిక. తీరుస్తాడో తీర్చడో... ఒక మాట అడిగి చూస్తే నేమిలే,' అనుకుండె ఆశతో ముసిలోడు.

''ఒరే నడిపోడా,'' అని పిల్చె.

''ఏం నాయనా?'' అని కొడుకు బదులిచ్చె.

''సియ్యా బువ్వ తినబుద్ధి అయితాందిరా,'' అని కడసారి కోర్కెను బైటపెట్టె.

''సియ్య! మనకు యాడ దొరుకుతుంది నాయనా సియ్య!'' అని కొడుకు ఆశ్చర్యపాయ.

''అప్పుడు మారెమ్మ పండగకి యాటలు నరికి కుప్పలేసి అమ్మిండే... కడసారి! మల్లీ ఈ ఆరునెలల్లో ఎప్పుడన్నా మన చుట్టుపక్కల ఊర్లలో యాట కొట్టినారా? కురాకు చేసుకుని తిన్నారా? మనకు యాడ దొరుకుతుంది నాయనా సియ్య? కోల్లని పేటకు పాయ్ అమ్ముకొని వస్తిమి. ఊరంతా బుటకలాడినా ఇప్పుడు ఒక గుడ్డు దొరకదు. ఇంక మనము పేటకు పాయ్ కూర కొనేటట్లుండామా?'' అని ముసిలోని మొగంలోకి సూడబుద్ధి పుట్టక తలొంచుకొని అదే పోత పాయ.

వయసులో ఉన్నప్పుడు మంచి తిండిపుష్టి కల శరీరం పెద్దప్పయ్యది. కొత్తగా పెండ్లయి భార్య కాపురానికి వచ్చిండె. మొదటి దినము- మొగునికి రెండు ముద్దలు, నాకు ఒక ముద్ద అనుకొని మూడు ముద్దలు గెలికె. పెద్దప్పయ్య మొగానికి నీల్లు సల్లుకుని తుడుసుకుంటా కూర్చుండె. పెండ్లాము మూకిట్లో ఒక ముద్ద పెట్టి వూరిబిండి ఏసె. తినె. ఇంకొక ముద్ద పెట్టె. తినె. ఇంక చేయి కడుక్కొని లేస్తాడేమో అనుకుండెప కాని లెయ్యలే. ఇంకొక ముద్ద కూడా పెట్టి ఆ పూటకు పస్తు పండుకొండె.

రెండో దినము- మొగునికి మూడు ముద్దలూ, నాకు ఒక ముద్ద అనుకొని నాలుగు ముద్దలు గెలికె. మొగుడు మూడు ముద్దలు తినె. నాలుగో ముద్ద పెట్టేదానికి పాయ. వద్దు అని చేయి అడ్డం పెడతాడులే అనుకుండె. పెద్దప్పయ్య వద్దనలే. ఆ ముద్దను కూడా తిని పెండ్లామును పస్తు పండుకోబెట్టె.

పెండ్లానికి కడుపులో మంట పుట్టె. మూడోదినము- ఆరు ముద్దలు గెలికె. ముద్ద ఎంబడి ముద్ద... అయిదు ముద్దల్ని మూకిట్లోకి ఇసిరేసినట్ల వడ్డించె. పెద్దప్పయ్య గూడా అంతే బిరిబిరింగ మింగేసె. ఆరో ముద్దని కూడా కొండబాయ. 'కడుపు బర్తీ అయిపోడిసింది. ఇంక ఒల్ల అంటే ఒల్ల,' అని మొగుడు మూకిడు ముందు నుంచీ ఒక్క ఎగురు ఎగిరి లేచి పోతడనుకుండె. కాని పెద్దప్పయ్య లెయ్యలే. ఒల్ల అనలే. పెండ్లాము మొగములోనికి ఒకసారి సిగ్గుపడతా సూచి ఆ ముద్ద కూడా మింగె.

అంతే! పెద్దప్పయ్య పెండ్లాము పుట్టింటికి ముక్కు సీదుతా పరుగెత్తె. ఇంట్లో తల్లిని కావిలించుకొని బావురుమంటా ఏడ్చె. ''నన్ను ఎట్లా వానికి ముండ మోపిస్తిరి తల్లో! బాన కడుపోనికి ఇచ్చి చేస్తిరి కదా నాయనో! కూడు ఎయ్యని మొగునితో కాపురం ఎట్ల సేసేది తల్లో,'' అని వలవలా ఏడ్చె.

పెద్దమనుసులు పెద్దప్పయ్యను పంచాయితీకి పిలిపించి, ''ఏమిరా? పెండ్లానికి కూడెయ్యవంట,'' అని నిలదీసి అడిగిరి. పెద్దప్పయ్యకు ముందుగా ఇసయం బోధపడలే.

''నాకేం తెలుసు? అదే వండె, అదే పెట్టె. 'దాన్ని తినొద్దు' అనలే నేను,'' అని గుడ్లు ఎల్లబెట్టి చెప్పె.

"నన్నేమీ తినొద్దు అనలేగాని మూకిట్లోకి ఎంత పెడితే అంతా తింటాంటే నేనెట్ల సచ్చేది?" అని పెండ్లాం అక్కసు ఎల్లబోసుకుండె.

అప్పుడు పెద్దమనుసుల్లో ఒక మనిసి కలగజేసుకొని, "లే! పెద్దప్పయ్యా! తినే ముందు కుండలో ఎన్ని ముద్దలుండాయో సూసుకోవద్దేంరా? ఇంక ముద్ద లేదు అని పెండ్లాము నోరు ఇడిసి చెప్పేదంకా మూకిడు ముందు కూసుంటే ఎట్ల?" అంటా లౌక్యం బోధించె.

"కరువులో పుట్టినోల్లమి. ఎంత తింటే నిండుతాయిరా మన కడుపులు? కడుపు నిండా తినేదానికి మనం ఏమన్నా కుబేర్లమబ్బా? కడుపు ఎండగట్టలేనోడివి పెండ్లాన్ని ఎట్ల సాకుతావు. పిల్లోల్లు పుడితే వాల్లని ఎట్ల సాకుతావు?" అని కూడా ఉపదేశము చేసె.

అంత తిండిపుష్టి కలిగినోడు పెద్దప్పయ్య. పొద్దున్నే కడుపులో కాఫీనీల్లు పడితేగాని పనికి ఎల్లబారని వాల్లని సూస్తే కడుపులో ఎవరో సేయి పెట్టి దేవినట్లుంటాది పెద్దప్పయ్యకి.

'మాంసం తినబుద్ధి పుడతాందిరా,' అని చూసి చూసి పెద్దకొడుకును అడగలేడు. అడిగితే పెద్దకోడలు ఊరుకుంటుందా? కల్లుకు నాలుగు రూపాయిలు ఇచ్చిందానికే, మొగునితో రగడ ఏసుకుని మూడుదినాలు మూతి ముడుసుగుండె. రెండో కొడుకును అడిగి లేదనిపించుకుంది. ఇంక మూడో కొడుకు... మూడో కొడుకుకు ఆరుమంది ఆడపిల్లలు. అంతా చిన్నచిన్న పిల్లోల్లు. ఆలూమగడూ కష్టపడి కూలి తెస్తే ముసిలోల్లతో పాటు ఎనిమిదిమంది ఇంట్లో కూచ్చొని తినల్ల. పెద్ద సంసారం. తినే జనం జాస్తి. అంతమంది పిల్లోల్లని ఎట్ల సాక్కుంటాడు. ఎట్ల పెల్లిల్లు చేస్తాడు అనిగదా- వానికి అయిదు ఎకరాలు ఎక్కువ బూమి రాసిచ్చింది! ఉండే ఒక ఇల్లూ వానికే రాసిచ్చి, పెద్ద కొడుకుల దగ్గర నిష్టురమాయిరి ముసిలోల్లు.

రెండో కొడుకుకు స్తోమత ఉంటే ముసిలోనికి ఆస్పత్రి మందు ఇప్పించేవాడు కాడా? ఆస్పత్రిలోనే చేర్చి తండ్రిని సూపెట్టుకునేవాడు కాడా? 'రోగమొస్తే ఒక గులిగి ఇప్పించేదానికి దుడ్లు లేనోడు, కూర వొండి పెట్టిస్తాడా?' అనుకొని గమ్మున ఉండిపోయె ముసిలోడు.

పెద్దప్పయ్యకి మాంసం మీద బ్రమ పీడిస్తాండె. సెవి గూగుల్ని పచ్చిపచ్చిగా కాల్చుకుని తింటే ఉప్పుప్పగా ఎంత బాగుంటాయి. దొమ్మను కాల్చుకొని ఉప్పురాయి అద్దకొని తింటే ఎంత రుసిగా ఉంటుందో అని సారి సారికీ అనుకుంటాంది.

"ముసిలోని పానం దినాల మీద ఉంది. ఒకసారి సూసి పలకరించి పోదాము,' అనుకుని వచ్చిన వాల్లతో మాంసం రుసిని గురించి మాట్లాడబట్టె.

"కుందేలా? కుందేలు కూర సెప్పొద్దు. వాయి చేస్తుంది కదా అది. ఉడుంకూర శ్రేట్టం. తింటే పై నొప్పులుండవు. ఎర్రెలకలు బాగుంటాయి గాని, రొంత నీసువాసన తగుల్తుంది," ఇట్లా మాట్లాడతానే ఉండె అలుపు లేకుండా!

"మిందికి సావు వొచ్చి పడతాన్నా కూర మీద బెమ్మెత్తి పాలే ముసిలోనికి," అని సాటుగా నవ్వుకుంటాండిరి జనమంతా.

పాయ 'కూర కూర' అని కలవరించిన ముసిలోడు సచ్చిపాయ. కొడుకులూ, కోడల్లూ, మనుమలూ అంతా వచ్చిరి. బందుగులొచ్చిరి. జనమంతా మూగిరి. ఆడోల్లు ఏడవబట్టిరి. ముగ్గురు కొడుకులూ తండ్రిని సాగనంపేదానికి ఏర్పాట్లు సేయల్లని పూనుకుండిరి.

కుంకుమ కావల్ల, పసుపు కావల్ల. ఊదుకడ్డీలు కావల్ల. సాంబ్రాని కావల్ల. పాడె కట్టేదానికి డొగులూ, కట్లూ కావల్ల. ఏది లేకపోయినా సంసారం జరుగుతుందిగాని సావు ఏర్పాట్లు జరుగు తాయా?

"అన్నా ఊదుకడ్డీలు తెప్పిస్తివా?"

"ఒలే నాగన్నా? అంగడింటికి పోయి సాంబాని తీసుకురాగూడదేంరా?"

"ఒలే సన్నాడో! ఓబులేసుగా! పసుపూ కుంకుమ తెమ్మంటినే, తెస్తివా!"

"అరిజెంటుగా ఆకులు తెప్పియల్లంట అన్నా!"

అంతా తెప్పించమనేవాళ్లే. తెచ్చేవాళ్లు లేరు. జేబులోంచి ఉన్న దుడ్లు కూడా బైటికి తీసేవాళ్లే లేరు. కుంకుమ రాదు. సంబ్రాని రాదు. ఆకులూ వక్కలూ రావు. ఏ వొస్తువు రాదు. పొద్దు గడుస్తోంది.

అన్న తెస్తాడులే అని తమ్ముల్లూ, తమ్ములు తెప్పిస్తారులే అని అన్నా... అందరూ ఒకరి నుండి ఒకరు తప్పించుకొని తిరుగుతాండిరి. కర్చు తప్పించుకునేదానికి.

సంగతి గ్రహించుకున్న పెద్దోల్లు, ముగ్గురు కొడుకుల్ని పిలిసిరి. "ఒరే! మీలో ఒకరు కావల్సిన వస్తువులన్నీ తెప్పించి కర్చు పద్దు రాయండి. దినాలూ గినాలూ ముగించి మొత్తము కర్చు తేల్చండి. దాన్ని ముగ్గురూ సమానంగా బరించకోండి," అని చెప్పిరి.

కర్చు పెట్టి లెక్క రాసేదానికి పెద్దకొడుకు ఒప్పుకుంటె, అప్పు ఇచ్చేదానికి శెట్టి ఊకొట్టె. పనులు ఆగమేగాల మింద జరిగిపొయ.

తప్పిడు కొట్టేదానికి మనుసులను పిల్చిరి. వాల్లు నలభై రూపాయలు అడిగిరి. ఈల్లు ఇరవై ఇస్తామనిరి. కడాకు 'ముప్పయి రూపాయిలిస్తే వస్తాము. లేకపోతే లా,' అని పట్టుబట్టిరి.

"తప్పిడికి ముప్పయి రూపాయిలా? తప్పిడి లేకపోతేనేమి?" అని కడుపులో అగ్గి పడినట్లు అరిసె సన్నోడు.

"ముగ్గురు కొడుకులుండారు. తండ్రి సచ్చిపోతే తప్పిడి కొట్టిచ్చలేరు. ఛూ! ఏ గతిలేని నా కొడుకుల్లారా! పెద్దప్పయ్యకు పుట్టినారా ఇంకా ఎవురికన్నా పుట్టినారా మీరు?" అని కేకరిచ్చి మూపొడారు. చేసేది లేక తప్పిడి కొట్టిచ్చేదానికి ఒప్పుకుండిరి. తప్పెడులు జోరుగా మోగబట్టె.

పీనిగ బూడ్సేడానికి గుంత తవ్వాల్ల. మనుసుల్ని పిల్చిరి. వాల్లు యాభై రూపాయలు అడిగిరి.

"వంక సెగురులో గుంత తోగేదానికి యాభై రూపాయలా? గెట్టినేల కూడా కాదు. ఇరవై రూపాయిలు ఇస్తాం చూడు," అని ఈల్లు బేరమాడిరి. వాల్లు నలభైకి దిగిరి. మల్లీ ముప్పై అయిదు రూపాయలకు దిగిరి. ఇంక అంతకంటె సచ్చినా దిగమనిరి.

గుంత తోగేదానికి ముప్పై అయిదు రూపాయలు పెద్దోనికి సగం సగం తాగి ఆర్పి చెవిలో పెట్టుకునే గనేస్ బీడీలు నెలకు సరిపోయే. అన్ని కనపడె. రెండోవానికి కడుపునొప్పికి మందులూ, మాత్రలూ ఇప్పించకపోతే ఎవునితోనో లేసిపోయిన పెండ్లాము కనపడె. మూడోవానికి పైమీద బట్ట లేకుండా ఉత్తబిత్తల తిరుగుతాండిన కడగొట్టు బిడ్డ కనపడె.

సీకటి పడేయాలకి పీనిగని తాపం చేసి ఇంటిదోవ పట్టి, వచ్చే ముందు ఆంజనేయస్వామి గుడిలో కూర్చొని పూజారి దగ్గర పంచాంగం ఇని, పదోదినము అష్టమి అవుతుంది కాబట్టి, దినాలను పదకొండో దినము జరిపితే బాగుంటుందని మాట్లాడుకొనిరి.

పెద్దకొడుకు మారెప్ప మందలోకి పోయి ఒక గొర్రెని పట్టుకొచ్చె. అది న్యాతది కాదు. ముసల్ది. అది బడబడగా నుండె. ఊరికే అల్ల కూకితే కింద పడేట్ల బక్కబక్కగా నుండె. నడిసెటప్పుడు సారం లేకుండా ఊగులాడుతాండె. అది ముసిలోడు సన్నప్పయ్య ఉన్నట్లే ఉండె.

బాగా మేసి కొవ్వు పట్టిండే గొర్రిని పట్టుకోవల్లంటే అయిదారు నూర్లు కావల్ల. యాడుండాయి అన్ని దుడ్లు?

పదో దినము అర్ధరేతిరి దాటిపోయినంక కోసిరి దాన్ని. నెత్తరంతా గిన్నిలోకి పట్టిరి. తలకాయ బుట్ట మెడ నుంచి తప్పించి పొయ్యిలోకి ఏసి కాల్సిరి. సెవి గూగులు తెగ్గోసి నోట్లో ఏసుకుని నమిలిరి. గొర్రిబొచ్చు కాలే ఆ కమురు వాసనకి నోట్లో నీల్లూరుతాండె తినవోల్లకి.

నాలుగు కాల్లు తెగ్గొట్టి పొయిలోకి ఏసిరి. సెర్మం ఒలిసిరి. బర్రెముకల కాడ నించి కడుపు కిందికి కోసి పొట్ట పేగులు బైటికి తీసిరి. గొర్రి పెంటికిలు తీసిపారేసి పేగుల్లోకి నీల్లు పోసి కడిగి ఒక పక్కనబెట్టిరి. ఇంటి దూలానికి తలకిందుల యాలాడగట్టి, గొర్రి తొడల నుంచే ఎర్రగా ముదిరిపోయుండే కండల్ని కోసి కుప్పగా ఏసిరి. దొమ్మ కోసి నిప్పులో కాల్చుకొని ఉప్పురాయి నంజుకుంటా తినిరి.

కూర పొయ్యి మిందికి ఎక్కించిరి. ఆ మసాల వాసనకి నోట్లో నీల్లూరుతాండె. పిల్లోల్లూ, పెద్దోల్లూ అంతా పొయ్యి సుట్టూరా తిరగతాండిరి. ఆ ఊర్లో కూర మొగం సూసి ఆర్నెల్లాయ మల్ల.

నీల్లు లేని ఏటిగట్టుకు పొయి సాంబ్రాని పొగ వేసి పిండం పెట్టిరి. ముసిల్దానికి బొట్టు పెట్టి తుడిపేసి, ముండమోపిని చేసిరి. కొడుకులూ, అన్నదమ్ముల వరుసైన బందుగులు గెడ్డాలు గీకించుకుండిరి.

యాడుండే బందుగులంతా ఒకసోట కలుసుకున్నదానికి కువ్వాడమాడుకుంటూ నవ్వుకో బట్టిరి.

"నేను మా పెద్దమ్మ సచ్చిపోతే రెండు యాటలు కొట్టి దినాలు చేస్తాలే."

"మా చిన్నాయన సస్తే నేను మూడు యాటలు కొడతా."

"నేను నాలుగు యాటలు నరుకుతాలేయ్, ఏమనుకుండారో. మీ అందరికంటె మా తాత దినాలని గనంగా జరుపుతా. సుట్టుపక్కన ఊర్లలో గొప్పగా సెప్పుకుండేటట్లు," అని పరాసికా లాడుత గుండ్లు గొరిగించుకున్నోల్లు, గడ్డం గీకించుకున్నోల్లూ అంతా అదే సుబ్రమనెం బాయిలో మునిగి తానాలు చేసి ఇంటికొచ్చిరి.

ఆనంక చూస్కో నా సామిరంగా వరి అన్నం తిని ఎన్ని నాల్లాయెనో! ఎముకలు కొరికి ఎన్ని నాల్లాయెనో? నమిల్తే ఆలస్యమైతుందని దవడలు కూడా కదిలీకుండా వడ్డించింది వడ్డించి నట్లే మింగబట్టిరి. పచ్చి పరంకాయ, టెంకాయ సిప్పా ఏసినా ఉడకని ముసిలి గొర్రి మాంసాన్ని రబ్బరును నమిలినట్టు నములుతా గస పోసుకుండిరి. సెమట్లు కక్కుకుంటా తినబట్టిరి. తిని తిని మొల్తాడు బిర్రాయ. అడ్డపంచెలు ఊడిపాయ.

ఎవరి బిడ్డల్ని వాలు దగ్గర గూసో పెట్టుకుని తినబెట్టిరి. పిల్లోల్లు ఇంక సాలు మొర్రో అని లేయబోతే నాలుగు గుద్దులు గుద్ది కూర్చోబెట్టి వాల్ల ఏడ్పు నోల్లల్లోకి దురికి దురికి తినిపించిరి.

"ఈడ సరిగరా తినకపొయ్యేది. ఇంటికి పోతేనే 'ఆకలి మా' అంటూ ఏడ్చేది. ఈడ వరి అన్నమూ, మాంసం కూరా ఉద్దరగా దొరుకుతాంటే తినేదానికి దొబ్బులా మల్ల ఈ పోరల్లకి?" అని పెద్దోల్ల బాధ. ఈడ కడుపునిండా తినిపోతే రాత్రికి ఇంట్లో పొయ్యి మీద ఎసరు ఎక్కించే కర్సు ఉండదని వాల్ల ఆశ.

బాపనయ్య వారిని పిలిపిచ్చిరి (మంత్రం) నీల్లు సలిచ్చుకుండేదానికి బియ్యం పెట్టిరి. బేల్లు పెట్టిరి. బెల్లం పెట్టిరి. నూగులు పెట్టిరి. అన్ని మద్దుల్లో కొత్తగా కొనుక్కొచ్చిండేది. టీలుది కలశం చెంబు పెట్టిరి.

సామి మంత్రాలు సదవబట్టె. బంగారు ఇమ్మనె, వస్తరాలు ఇమ్మనె, గోవులు దానం సేయమనె. ఇంకా ఏమేమో దానం సెయ్యమనె. పుట్టగోసి పెట్టుకుండేకి ఏగితి లేనోల్లని! అన్నీ ఉత్తుత్త దానం చేసినట్లు అచ్చింతలు ఏసిరి. సామి దచ్చిన పెట్టమనె, నిజం దచ్చిన!!

"మా పెద్దాయన కూర తినల్లని బెమ్మెతిపడి తినకనే సచ్చిపోయినాడు సామీ? బూమి మింద ఆశ తీరక ఇంకా కింద కిందనే తిరుగుతాంటాడు. నువ్వు మంత్రాలు బాగా సదివి ముసిలోని ఆత్మని పంపిచ్చల్ల సామి," అని సేతులెత్తి దండం పెట్టి అడిగె- సెర్మం అమ్ముకుని సారాయి తాగొచ్చిన బందుగు.

పెద్ద కొడుకు మారెప్ప దచ్చిన పది రూపాయలు పెట్టె. సామి దచ్చిన పక్క సూసె. పైకి తలెత్తి సూసె. మల్లా కిందికి దచ్చిన పక్క సూసె. మల్లా పైకి తలెత్తి సూసె. "జీవుడు ఇంకా మద్దెలో ఉండాడు. పైకి పోయేదానికి దచ్చిన సాలదు," అని నవ్వి, "సివరి కోరిక తీరకుండా సచ్చిపోయి నాడు పాపము. దచ్చిన ఇంకొక అయిదు రూపాయలు పెడితే పున్నెం కదా," అనె.

"పెట్టన్నా! దచ్చిన ఇంకో అయిదు రూపాయలు పెట్టు. సామి మంత్రాలు సదివి నీల్లు సల్లితే- సావు మైల, తినిన మైల అన్నీ దెబ్బకు ఎగిరిపోవల్ల," అని ఉరత్వంతో మాట్లాడె గొర్రి సెర్మం అమ్ముకుని తాగొచ్చినోడు. లోలోపల ముక్కుకుంటూ, మూలుగుకుంటూ మారెప్ప దచ్చిన ఇంకొక అయిదు రూపాయలు పెట్టె.

కలశం చెంబులో మామిడాకులు అద్ది సామి ఇంట్లో గోడలకు నీల్లు సల్లె.

"నా మింద పడలే సామి, నా మింద పడలే. నా కొడుకు మింద పడలే సామీ. నా బిడ్డ మింద పడలే అని అంతా ఆత్రపడుతూ నీల్లు సల్లుకుండిరి. మల్లా ఇంకోసారి ఆ అయిదు పైసలూ, పది పైసలూ దచ్చినలు ఏసి సామి కాల్లకు మొక్కుకుండిరి.

సామి నవ్వుకుంటూ ఎల్లబారిపాయ బస్సు శార్జికి కూడా దుడ్లు ఇప్పించుకొని, పండగ బువ్వ తిన్నట్లు మొగాలు కలకలలాడతాంటే ఆడ ఇండ్లకు జారుకుండిరి. పున్నెం దుత్త దించిన మూడో దినము ముసిల్ది ఏడ్సబట్టె.

"నట్టింట్లో ఎందుకు ఏడుస్తావే ముండమోపిదానా? పోయినోల్లు రమ్మంటే వస్తారా? ఆయప్పకు పిలుపు వచ్చె, పాయ. మాగినపండు సెట్టు మీద ఎంతకాలముంటుంది," అని కూతలేసె కొడుకు, ముసిల్ది ముసిలోడు గ్యాపకం ఏడస్తాండాది అనుకొని.

"లే సన్న నా కొడకా! మూడునూర్లు పెట్టి గొర్రిని కోస్తిరి. ఊరోల్లు అంతా వచ్చి తిని పాయిరి. ఎవురెవురికి పుట్టిన నా కొడుకులో వచ్చి గొంతు వరకూ సించుకొని పాయిరి. నా ఇస్తరాకు లోకి మాత్రము నాలుగు తునకలు కూడా ఎయ్యకపోతిరి కదరా మీ కడుపులు దొక్కా! ముండలు మొయ్యా! మీరు తునకలు తిని నా మొగానికి నీల్లు కలిపిన పులుసు పోస్తిరి. మీ యమ్మ కడుపుకాలా," అని కటినంగా మాట్లాడతా శాపనార్తాలు పెట్టుకుంటా ఏడ్సబట్టె ముసల్ది.

*ఆంధ్రప్రభ వారపత్రిక*
*19 అక్టోబర్ 1989*

## నేపథ్యం

కరువు కథ

# సావుకూడు

***ఒక కథ రాసేదానికి ముఖ్యంగా కావల్సింది అంతో ఇంతో జీవితానుభవం! ఈ జీవితానుభవంలోనే కథా వస్తువు పుడుతుంది. కథ పుడుతుంది. పాత్రలు పుడతాయి. సన్నివేశాలూ, సంభాషణలూ పుడతాయి. కథలకు కాణాచి జీవితమే! అనుభవమే!!***

అభౌతికమైన ఈశ్వరుడు ఆదిమధ్యాంతరహితుడు కావచ్చు. కానీ మట్టి పిసుక్కొని బతికే ఒక రచయిత రాసిన కథకు ఆదిమధ్యంతాలు తప్పనిసరి. కానీ ఈ సృష్టిలో మనం దేన్ని 'ఆది' అనుకుంటామో అది నిజంగా ఆది కాకపోవచ్చు. దేన్ని 'అంతం' అనుకుంటామో అది నిజానికి అంతం కాకపోవచ్చు. ఆద్యంతాల బిందువులు మారినప్పుడు, ఏది మధ్యస్తం అనుకుంటామో అది నిజానికి మధ్యస్తం కాకపోనూ వచ్చు. జీవితానుభవాల ఆదిమధ్యాంతాలు కథలోకి వచ్చేటప్పటికి, అవి కూడా అంతే!

కథ ఒక ముగింపు సన్నివేశంతో అంతమైపోతుంది. కానీ ఆ ముగింపు సన్నివేశం నుంచే రచయిత మెదడులో కథా నిర్మాణం మొదలుకావచ్చు. సావుకూడు అట్లాంటి కథ. ఆ కథలోని ముగింపు సంఘటనే ఆ కథ రచనా ప్రయత్నానికీ నాంది పలికింది. కాగితమ్మీద చట్రబద్ధమైన కథకూ, చట్రంలోకి ఇంకా ఒదిగి రాకుండా రచయిత మనసులో నలిగే అనుభవాల పరంపరకూ ఆదిమధ్యాంతాల విషయంలో అంత తేడా ఉంటుంది. చట్రం రచయిత కోసం కాదు, పాఠకుడి కోసం. చట్రం రచయిత అనుభూతి కోసం కాదు, రచయిత చేసే అనుభూతి వ్యక్తీకరణ కోసం. ఈ చట్రం కోసమే, రచయిత వ్యక్తిగత అనుభూతికి సంబంధించిన ఆదిమధ్యాంతాలు రచనలో తారుమారు అయిపోతాయి. ఆ తారుమారు కావడం వెనక ఒక పథకముం

టుంది. ఒక ప్రక్రియ ఉంటుంది. ఒక కథను ఎట్లా రాసినానో చెప్పడమంటే ఆ రచన వెనక ఉన్న పథకాన్ని గురించి విశ్లేషించడమే అనుకుంటాను.

దీనికి ముందుగా పాఠకులకు కథను పరిచయం చేయాల్సిన అవసరముంది. కథలోని రక్తమాంసాల్ని మినహాయించి కేవలం అస్థిపంజరాన్ని పరిచయం చేయడంలో నాకు ఉత్సాహం లేదు. కానీ సందర్భానుసారం తప్పదు కదా!

ఒక ఊర్లో ఒక ముసిలోడుంటాడు. ఆ ముసిలోని పేరు పెద్దప్పయ్య. ఆ పెద్దప్పయ్య చిన్నప్పటి నుంచీ మంచి తిండిపుష్టి కలిగినోడు. పెళ్ళి చేసుకొంటాడు. భార్య కాపరానికి వస్తుంది. తన తిండిపుష్టితో భార్యను కూడా పస్తులు పడుకోబెట్టినవాడు పెద్దప్పయ్య.

పెద్దప్పయ్యకు ముగ్గురుకొడుకులు. ఆ కొడుకుల్ని పెంచి పెద్ద చేసేదానికి జీవిత మంతా కడుపు కట్టుకొని బతికినవాడు పెద్దప్పయ్య. అట్లాంటి పెద్దప్పయ్య ముసిలోడు అయిపోతాడు. ఇంక రేపో మరునాడో చచ్చిపోతాడు. అప్పుడు ఆ ముసిలోడు పెద్దప్పయ్యకు కల్లు తాగల్లని కోర్కె పుడుతుంది. అది ఒక చిన్న కోర్కె. కానీ అప్పుడు ఊర్లో దుర్భరమైన కరువు తాండవిస్తూ ఉంది. కూటికి జరిగేదే గగనమైన ఆ కష్టకాలంలో కల్లు తాగల్ల అనేది చానా పెద్ద కోర్కె.

పెద్ద కొడుకు వస్తాడు. కల్లుకు డబ్బులడుగుతాడు ముసిలోడు. ఇవ్వలా వద్దా అని కొంచెంసేపు తర్జనభర్జన పడి చివరికి పెద్దమనసు చేసుకొని డబ్బులిస్తాడు పెద్ద కొడుకు. సచ్చిపోయే ముసిలోడు కడుపులో కల్లు పడగానే లేచి కూర్చుంటాడు. కల్లుకు డబ్బులిచ్చిన పెద్ద కొడుకు తన పెండ్లాంతో మాటలు పడతాడు.

ఆ తరువాత ముసిలోడు మళ్ళీ మంచంలో పడతాడు. ఈసారి ముసిలోనికి సియ్య (మాంసం) తినల్ల అని కోర్కె పుడుతుంది. కల్లుకు దుడ్లు ఇచ్చినాడు కాబట్టి పెద్ద కొడుకు వంతు అయిపోయింది. చిన్నకొడుకుది గంపెడు సంసారం కాబట్టి కూర (మాంసం) తినబుద్ధి అవుతాంది అని అడిగేదానికి నోరు రాదు. ఇంక మిగిలింది నడిపి కొడుకు. ఆ నడిపి కొడుకును అడిగి చూసినాడు ముసిలోడు. కరువుదెబ్బకు తట్టుకోలేక కడుపునొప్పి పెండ్లాం మరెవరితోనో లేచిపోతే, ఆ పెండ్లాం విడిచిపెట్టి పోయిన పిల్లలతో ఎట్లో జీవితం నెగ్గుకొస్తున్నవాడు ఆ నడిపోడు. తండ్రి మాంసం తినబుద్ధి అవుతాంది అని అడగ్గానే ముందు ఆశ్చర్యపోయి ఆ తరువాత తలొంచుకొని వెళ్ళిపోతాడు.

జీవిత పర్యంతమూ పిల్లల కోసం బతికిన ముసిలోడు, సచ్చేముందన్నా కొంత సుఖపడి సచ్చిపోదామనుకుంటాడు. కానీ చివరి కోరిక తీరకుండానే సచ్చిపోతాడు. మాంసం మాంసం అని అలమటించి ముసిలోడు సచ్చిపోతే, ఆ ముసిలోని దినాల కార్యక్రమం కోసం యాట కోసుకొని తిని అంతా పండగ చేసుకొంటారు.

దినాల తరువాత మూడోదినం పున్నెం దుత్త దింపుతారు. ఆరోజు ముసిలోని పెండ్లాం ఎక్కిళ్ళు పెట్టి ఏడుస్తుంటుంది. ఆయమ్మ చచ్చిపోయిన మొగుని కోసమే ఏడుస్తాంది అనుకొని ఆయమ్మ చిన్నకొడుకు ప్రేమగా మందలించేదానికి పోతాడు. అప్పుడు ముసల్ది ఏమంటుంది-

''దినాల కోసం యాట కొట్టి, మీరు తునకలు తిని నా మొగానికి నీళ్ళు కలిపిన పులుసు పోస్తిరి కదరా!'' అని వలవలా ఏడుస్తుంది. కథ అయిపోతుంది.

1982-87 మధ్య నేను గుడిపల్లి గ్రామంలో ఏకోపాధ్యాయునిగా పనిచేసినాను. ఆ అయిదేండ్లూ ఆ గ్రామంలో సరిగా వానల్లేవు. పంటల్లేవు. గొడ్డు కరువు! ఈ కరువు గురించి కథ రాయాలని ఒక సంవత్సరం పాటు అనుకొన్నాను. అనుకోవడమే తడవుగా కవిత్వం మొదలుపెట్టవచ్చేమో

కానీ, కథ ప్రారంభించలేమని నాకు స్వానుభవం ద్వారా తెలుసు. కవిత రాసేదానికి మూడ్ కావల్ల. కథ రాసేదానికి మూడ్‌కి మించి మరేదో కావల్ల. అది ఏది? ఇక్కడి తెలుగుదేశంలో సోమాలియా కరువు గురించి కవులు కవిత్వం రాయగలరు కానీ, కథకులు కథ రాయలేరు. ఎందుకు రాయ లేరు అన్న ప్రశ్నకు జవాబు వెతుక్కోవడంలోనే, కథకుడికి ఉండాల్సిన ముఖ్య లక్షణం తెలిసిపో తుందనుకుంటాను. స్థూలంగా చెప్పాలంటే, ఒక కథ రాసేదానికి ముఖ్యంగా కావల్సింది అంతో ఇంతో జీవితానుభవం! ఈ జీవితానుభవంలోనే కథా వస్తువు పుడుతుంది. కథ పుడుతుంది. పాత్రలు పుడతాయి. సన్నివేశాలూ, సంభాషణలూ పుడతాయి. కథలకు కాణాచి జీవితమే! అనుభవమే!! అంతేగానీ సోమాలియా కరువు గురించి ఎంత భావోద్వేగం చెందినా, అక్కడి జీవితపు అనుభవం లేకుండా ఇక్కడ కథలు రాయడం కుదరదు.

సావుకూడులో కొన్ని యదార్థ జీవితానుభవాలు ఉన్నాయి. కానీ ఆ జీవితాను భవాల స్థల కాలాలు వేరు వేరు. మొగుడు చచ్చిపోతే, తట్టలోకి తునక లేయలేదని ఏడ్చిన ముసల్ది మా పెద్దవ్వ. ఆ అనుభవం అనంతపురంలోది. ఎన్ని సంగటి ముద్దలు చేస్తే అన్ని సంగటి ముద్దలూ తిని పెండ్లాన్ని పస్తులు పడుకోబెట్టిన పెద్దప్పయ్య నాకేమీ కాడు. ఆ ముసిలోని కథ గోళ్ళ గ్రామం (నా భార్య పుట్టినిల్లు)లోది. ఆ పెద్దప్పయ్య కడసారి కోర్కె తీర్చలేని ముగ్గురు కొడుకులూ నేను పనిచేసే గుడిపల్లి గ్రామస్తులు. ఈ విధంగా సావుకూడు కథలోని ముసిలోడూ- ముసల్దీ- ముగ్గురు కొడుకులూ నిజజీవితంలో ఒకరికి ఒకరు ఏమీకారు. వారు జీవించిన కాలం వేరు, స్థలం వేరు. జీవన సందర్భాలు వేరు.కానీ వారి వ్యక్తిత్వాలను నమూనాలుగా స్వీకరించి, ఒక కథా వాతావరణం లోకి సమీకరించుకున్నప్పుడు, ఆ ముసల్దీ, ముసిలోడూ, ముగ్గురు కొడుకులూ పరస్పర సంబం ధీకులు అయినారు. ఇదీ కథలోని కల్పన! ఈ కల్పన యదార్థ జీవితానికి భిన్నమైంది కావచ్చు. కానీ సామాజిక వాస్తవికతకు భిన్నమైంది కాదు. ఈ కల్పన ఇంకొక విధంగా కూడా ఉంటుంది.

ఒక పాత్రకు సమాజంలోని ఏ ఒక వ్యక్తి మాత్రమే నమూనాగా ఉండాల్సిన పరిమితి లేదు. ఇద్దరు ముగ్గురు వ్యక్తుల్ని కలిపి ఒక పాత్రగా మలచవచ్చు. కానీ ఆ ఇద్దరు ముగ్గురు వ్యక్తుల భౌతిక మూలాలలో, సామాజిక స్వభావంలో ఒక ఏకత ఉండాల్సిన అవసరముంది.

ముగ్గురు భిన్నమైన వ్యక్తులుంటారు. వారికి ఆడపిల్లలు పుడితే, ఆ ముగ్గురికీ ఆడపిల్లల తండ్రులుగా ఒక సామాజిక స్వభావముంటుంది. తమ కూతుర్లకు పెళ్ళిళ్ళు చేసి అల్లుళ్ళను తెచ్చుకొన్న తరువాత జీవితంలో మామ పాత్ర ధరించినవారిగా ఆ ముగ్గురు వ్యక్తులకూ ఒక సామాజిక స్వభావముంటుంది. ఈ సామాజిక స్వభావపు ఏకతా ప్రాతిపదిక మీద, ఆ ముగ్గురు వ్యక్తులకూ చెందని స్వభావాల్నీ, సంఘటనల్నీ సంయోగం చేసి, ఒక పాత్రగా రూపొందించవచ్చు. అప్పుడు ఆ పాత్ర ఏ ఒక్క వ్యక్తినో ప్రతిబింబించేదిగా ఉండదు. అట్లాంటి ఎందరెందరో వ్యక్తుల సామాజిక స్వభావానికి ప్రాతినిధ్యం వహించే పాత్రగా ఉంటుంది. నేను మా అమ్మ గురించి కథ రాస్తే, ఆ పాత్ర- కాయకష్టం చేసుకు బతికే ఇంకెంతోమంది శూద్రకులాల తల్లుల సామాజిక స్వభావాన్ని పట్టిచ్చేదిగా ఉండాలని కోరుకొంటాను. ఈ విధంగా వ్యక్తిగత అనుభవాన్ని సాధారణీ కరించే కళాప్రయత్నం ఏ రచయితకైనా అవసరమే అని భావిస్తాను. సావుకూడు లోని ముసిలోడు పెద్దప్పయ్య పాత్ర నిర్మాణం వెనుక కూడా ఈ పథకమే ఉంది.

ఈ విధంగా జీవితంలోని వివిధ స్థలాల్నీ, కాలాల్నీ, వ్యక్తుల్నీ ఏక స్థల కాల పాత్రలలోకి ఐక్యం చేయడం ద్వారా ఒకానొక సామాజిక వాస్తవికతను యదార్థ జీవితమంత బలంగా చిత్రించ వచ్చు అన్పిస్తుంది.

అనంతపురంలో మా పెద్దవ్వ తునకల కోసం ఏడ్చిన సంఘటన జరిగిం తరువాతే సావుకూడు కథకు ప్రేరణ వచ్చింది. ఆ సంఘటనను ప్రధానంగా తీసుకొని ఒక కథానిక రాయొచ్చు. కానీ నా కందులో తృప్తి లేదు. ముసిలోన్ని ప్రధానపాత్రగా మలుచుకోకపోతే ఆ పాత్రకూ, ముగ్గురు కొడుకులకూ మధ్య ఇంటరాక్షన్‌కు ఆ కథానికలో అవకాశం ఉండదు. పాత్రల మధ్య బలమైన ఇంటరాక్షన్‌కు అవకాశం లేకపోతే, కథలోని వాస్తవికతే జడప్రాయంగా కన్పిస్తుంది. కానీ, సచేతనంగా కన్పించదు. అందుకని కథకు ప్రేరణనిచ్చిన అనుభవాన్ని కథకు ముగింపుగా మాత్రమే మలుచుకొన్నాను.

సావుకూడులోని ఇతర పాత్రలకు కూడా ఏ పాత్రకు ఆ పాత్రనే ప్రధానంగా తీసుకొని వేరువేరు కథలు రాసే ప్రయత్నం చేయొచ్చు. ఆ కథల్లో చివర చమత్కారమైన ముగింపులూ ఉండొచ్చు. కానీ కొన్ని పాత్రలకు సంబంధించిన 'కథల్ని' ఒకే కథలోకి క్రోడీకరించి, ఆ అన్ని పాత్రలకూ, వాటి 'కథ'లకూ ఉండే ఏకైక భౌతిక మూలాన్ని ఆవిష్కరించే ప్రయత్నం ఒక మంచి కథ అవుతుందనుకొంటాను. అట్లాంటి కథలకుండే లోతూ, సౌష్టవమూ ప్రత్యేకమైనవి.

ప్రథమ పురుషలో నడిచే కథల్లో, 'కథ చెప్పేవాడు,' ఒక పాత్ర కాదని అందరికీ తెలుసు. కానీ, పాత్రలు అనుభవించే జీవితంలో, 'కథ చెప్పేవాని'కి కూడా కొంత అనుభవముందని పాఠకులకు నమ్మకం కలిగించడం నాకిష్టం. అందుకోసం- నేను పాత్రలకు నమూనాలు వెదుక్కొన్నట్టే కథకుడి గొంతు కోసం కూడా నమూనాలు వెదుక్కొనే ప్రయత్నం చేసినాను కొన్నిసార్లు. నేను మొట్టమొదట అట్లాంటి ప్రయత్నం చేసింది సావుకూడు కథలోనే! ఆ ప్రయత్నంలోనే వక్కాకు నోటితో, బీడి పొగ ఊదుతూ నాకు కథలు చెప్పిన చిత్తయ్య గొంతు గుర్తుకు వచ్చింది. భూతకాలపు క్రియల్లో ప్రత్యక్ష వ్యాఖ్యానంలా సాగే, అతడు కథ చెప్పే పద్ధతిని దాదాపుగా నాపై ఆవహింపజేసుకొన్నాను. దీనివల్ల నాకు తెలియకుండానే సావుకూడు కథ మౌఖిక మార్గంలోకి వెళ్ళిపోయింది. కాబట్టి సావుకూడు కథనంలో రచయిత వ్యక్తిత్వానికి చెందిన భాష, వ్యక్తీకరణలు మృగ్యమనుకొంటాను.

సంభాషణలు రాసేటప్పుడు నాకు తెలిసిన నమూనా వ్యక్తుల్ని కథా సందర్భంలో ప్రవేశపెడతాను. వారితో మాట్లాడించి వారి గొంతులు వింటూ మాత్రమే సంభాషణలు రాస్తాను. కథా స్వభావాన్ని బట్టి, సంభాషణలూ, కథనం- ఈ రెండిటి నిష్పత్తి మారుతుంటుంది. పాత్రల సంభాషణల్లో రావలసిందాన్ని కథనంలోకి రానిచ్చినా కథనంలో ఉండాల్సిన విషయాన్ని పాత్రల సంభాషణల్లో ఇరికించినా పాత్రలు బలహీనమవుతాయి. లేక అనౌచిత్య దోషానికి లోనవుతాయి. ఆ కథాశిల్పం దెబ్బ తినడానికి కథనమూ, సంభాషణల నిష్పత్తి ఒక కారణమైపోయినా ఆశ్చర్యం లేదు. సావుకూడు కథలో ఉన్న నాటకీయతే ఈ కథనమూ, సంభాషణల నిష్పత్తిని శాసించిందనుకొంటాను.

సావుకూడు కథ ముసిలోని చావుతో మొదలవుతుంది. ముసిలోని చావు నుంచీ కథ కొంచెం వెనక్కు నడుస్తుంది. ఆ తరువాత ముసిలోని చావు నుంచి కథ ముందుకు నడుస్తుంది. ఒక సరళరేఖలో మాత్రం కథ నడవదు.

బతికి ఉన్న మనిషి గురించి వినడం కంటే, చచ్చిపోయిన మనిషి గురించి వినడానికే శ్రోతలు ఎక్కువ ఆసక్తి ప్రదర్శిస్తారు. అందుకే అనుకొంటాను- ముందుగా ముసిలోడు చచ్చిపోయినట్లు చిత్రించి, ఆ తరువాత అతని జీవిత నేపథ్యాన్ని చెప్పడం మొదలుపెట్టినాను. ఈ

విధంగా జీవితంలోని సంఘటనలను కథనంలో తారుమారు చెయ్యడం వెనుక అనుభూతిస్ఫోరక మైన ఒక సోపాన క్రమముంటుందనుకొంటాను.

సావుకూడు కథ ముసిలోనికి సంబంధించిన కథ కాదు. కరువుకు సంబంధించిన కథ. అందుకని ముసిలోడు చచ్చిపోయిం తరువాత కూడా కథ సాగుతుంది. ముసిలోని బతుకును వెంటాడిన కరువు, అతని శవాన్నీ, అంత్యక్రియల్నీ కూడా వెంటాడటం చిత్రించ దల్చుకొన్నాను. ఆ అంత్యక్రియల తతంగాన్ని నా వ్యక్తిగత జీవితంలో ఎంతో దగ్గరగా అనుభవించి ఉండడం వల్ల ముసిలోని చావు తరువాత నడిచిన కథాభాగం మీద నాకు పట్టుపోలేదు.

కథా రచన అంటేనే మెమరీ? కథకు ప్రేరణ వచ్చిన తరువాత నా జ్ఞాపకాల్లోంచి వివిధ వ్యక్తుల్నీ, సంఘటనల్నీ, అనుభవాల్నీ గని కార్మికుడిలా తవ్వుకోవడం మొదలుపెట్టినాను. మా అమ్మ దినాలప్పుడు వచ్చిన బాపనయ్య వారిని నమూనాగా తీసుకొనే, ముసిలోని దినాలప్పుడు మంత్రం నీళ్ళు చల్లి దక్షిణ దండుకుపోయిన బాపనయ్య పాత్రను చిత్రించినాను. తండ్రి చావుకు తప్పిడి కొట్టించలేదని తిట్టేవాళ్ళూ, శవాన్ని పక్కన పెట్టుకొని గుంత తొగేవాళ్ళతోటే బేరాలేడే వాళ్లు, పీనిగని తాపం చేసి వచ్చేటప్పుడు ఆంజనేయస్వామి గుళ్ళో కూర్చుని దినాల తేదీ నిర్ణయించడం, మా అమ్మ దినాలప్పుడు ఇంట్లో యాటలు కోసి, వాటిని తలకిందుల వేలాడగట్టి, చర్మం ఒలిచి పొట్ట చీల్చి, వాటిని భాగాలుగా కోసిన దృశ్యం, దినాలప్పుడు గీకించుకొన్న గడ్డాలూ, బోడిగుండ్లూ, వారి పరాచికాలూ, కడుపులోకి కల్లు పడగానే మంచంలోంచి లేచి కూర్చున్న మా పెద్ద తాతా, బంతిలో కూర్చుని అన్నం తినని పిల్లోల్లని పిడిగుద్దులు గుద్దే తల్లులూ... ఈ విధంగా నా మెదడు నుంచి బైటపడిన జీవితదృశ్యాల చిత్రణలతో నింపి సావుకూడు కథకు ఒక సాంస్కృతిక వాతావరణం నిర్మించే ప్రయత్నం చేసినాను. శూద్ర సంస్కృతీ వాతావరణం!! ఒక మొక్కను మట్టి నుంచి పీకితే, ఆ మొక్క వేర్లకు అంటుకొని పైకి లేచి వచ్చే మట్టిపెల్లలు మాదిరి, పాత్రల నుంచీ కథా వాతావరణం విడదీయరానిది.


రచయిత బయట భౌతిక ప్రపంచముంటుంది. అదే రచయిత లోపల అనుభవ ప్రపంచ ముంటుంది. ఈ రెండు ప్రపంచాల మధ్యా రచయిత లోలకంలా ఊగుతాడు. అదృశ్య దారాలతో ఈ రెండు ప్రపంచాలనూ కలుపుతాడు. ఈ బాహ్యాభ్యంతర ప్రపంచాల మధ్య జరిగే పరపరాగ సంపర్కం నుంచే, రచయితలోని సృజనాత్మకత ఫలదీకరణం చెందుతుందనుకొంటాను.

*23 నవంబర్ 1997*

34

# సామికుంబుడు

## సి. రామచంద్రరావు



*సి.* ***రామచంద్రరావు*** *1931 సెప్టెంబర్ 17న తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. 1948 నుంచి 1951 వరకు జగన్నాథ్ పేరుతో కొన్ని కథలు రాశారు. ఆ తరువాత ఫ్యాన్సీడ్రెస్ పార్టీ ఆంధ్ర పత్రికలో 1958లో అచ్చయ్యింది. అప్పట్నుంచి రాసిన పది కథలతో వేలుపిల్లై కథాసంపుటి ప్రచురించారు. 30 ఏళ్లు టీ ఎస్టేట్స్‌లో ఉన్నత హోదాలో పనిచేశారు.*


**చిరునామా**

*బి-1, ఆనందషీల్ ఎన్‌క్లేవ్, నంది నగర్, రోడ్ నెం. 14, బంజారాహిల్స్*
*హైదరాబాద్-500 034*
*Ph: 98491 65578*
*crr1931@yahoo.com*


"దొరల్ని చూడ్డానికి అరుళ్‌దాస్ కండక్టర్ వచ్చాడు," అన్నాడు బెల్లా చేతిలోని ట్రేని పక్కబల్ల మీద పెడుతూ.

"ఎందుకో కనుక్కున్నావా?" అడిగాడు సంపత్ దొర, సీఫోర్త్ మేనేజరు.

"గూడలూరు మలై డివిజన్‌లో లేచిన గొడవల గురించే అనుకుంటా," అన్నాడు బెల్లా గొణుక్కుంటున్నట్లుగా. సంపత్ వైపు తిరగలేదు. దించిన కళ్లు పైకెత్తలేదు. ట్రేలో బియర్ బాటిల్స్‌ని, మగ్స్‌నీ సవరిస్తూ, కాలాయాపన చేస్తున్నాడు. చెయ్యవలసిన పని తొందరగా ముగించి వైదొలగిపోవడమే ఉత్తమ బట్లర్ వృత్తికి ప్రతీక అన్న పాఠాన్ని అధ్యయనం చేసినవాడు అలా అక్కడే తచ్చాడుతున్నా డంటే పెద్ద కీడే శంకిస్తున్నాడన్నమాట అని గ్రహించాడు సంపత్.

"సరే, ఉండమను," అన్నాడు.

బెల్లా అక్కణ్ణించి కదలలేదు. భుజం మీద వేసుకొన్న గ్లాసులు తుడిచే గుడ్డని చేతిలోకి తీసుకొని బియర్ మగ్స్‌ని పరాగ్గా పాలిష్ చేస్తూ నుంచున్నాడు.

"తుడిచింది చాల్లేకానీ, త్వరగా బియర్ పోసి ఇయ్యి," ఆజ్ఞాపించాడు సంపత్.

మగ్స్‌ని ఒంపుగా పక్కకి వొంచి, నురగ పొర్లకుండా రెండింటి నిండా బియర్ నింపాడు బెల్లా. సంపత్ పక్కన కూచున్న రాజారాం చేతికి ఒక మగ్ ఇచ్చి, అతని పక్కన చిన్న బల్ల మీద అది పెట్టుకోడానికి కోస్టర్ పెట్టాడు. రెండో మగ్ సంపత్ చేతికి అందివ్వలేదు. అతని పక్కనున్న ఇంకొక చిన్న బల్ల మీద కోస్టర్ పెట్టి దాని మీద ఉంచాడు.

"దొర్లు కబుర్లలో పడి మర్చిపోకముందే అరుళ్‌దాస్‌ని పంపించేస్తే బాగుంటుందేమో," అణకువగా సలహా ఇచ్చాడు బెల్లా.

వచ్చిన పని గురించి అరుళ్‌దాస్ బెల్లాతో చర్చించాడన్న సంగతి, అది వాళ్లకి చాలా అవసరమైందిగా తోచిన సంగతి సంపత్ పసిగట్టాడు. 'అయితే, గూడలూరు మలై ఎస్టేటులో గొడవ ఎక్కువ యిందన్నమాట,' అనుకున్నాడు.

"సరే, పోర్టికోలోకి రమ్మను," అన్నాడు సంపత్.

ఒక్క ఉదుటులో అక్కణ్ణుంచి మాయమై, ఇంకొక నిమిషంలో తిరిగివచ్చాడు బెల్లా. "పోర్టికోలో దొర్ల కోసం అరుళ్‌దాస్ కాచుకుని ఉన్నాడు," అన్నాడు.

"ఎక్స్‌క్యూజ్‌మి, ఇప్పుడే వొచ్చేస్తాను," అని రాజారాంతో చెప్పి సోఫాలో నుంచి లేచి పోర్టికోలోకి వెళ్లాడు సంపత్.

*

"సలాం," నడుం నుంచి ముందుకి వొంగి, చెయ్యి పైకెత్తి వేళ్లని నుదుటికి తాకిస్తూ అన్నాడు అరుళ్‌దాస్.

"సలాం," గంభీరంగా మాట తుంచేస్తున్నట్టుగా అందుకుని అన్నాడు సంపత్.

"ఎందుకీ వేళప్పుడు బంగళాకొచ్చేవ్?"

"గూడలూరు మలై సమాచారం దొర్లకి చెప్పిపోదామని," బెదురుగా నసిగాడు అరుళ్‌దాస్.

"మధ్యాన్నం ఆఫీసుకొచ్చి చెప్పొచ్చు కదా," మందలించినట్టుగా అన్నాడు సంపత్.

"దొరగారింటికి బంధువులొచ్చినట్టుగా విన్నాను. ఒకవేళ మధ్యాన్నం ఆఫీసుకి రావడం పడకపోతే, గూడలూరు మలై ఎస్టేటులో ప్రూనింగ్ పనివాళ్లు చేస్తున్న గోస్లో ఈవాళతో మూడు రోజులు పూర్తవుతుందని మనవి చేసుకోవడం మంచిదనుకొని వచ్చాను."

"ఈరోజు కూడా పని సరిగ్గా చేయడం లేదా?"

"పన్నెండు గంటల వరకూ మనిషికి ఇరవై చెట్ల వరకూ నరికారు. మధ్యాన్నం ఐదో, పదో చెయ్యొచ్చు."

"నువ్వేం చేస్తున్నావ్? వాళ్లు పని సరిగ్గా చెయ్యడం లేదని నాకు రిపోర్టు ఇవ్వడంతో నీ పని అయిపోయిందనుకుంటున్నావా?" అరిచాడు సంపత్.

"లేదు దొరా, వాళ్లని దార్లోకి తీసుకురావడానికి అన్నివిధాలా ప్రయత్నించాను. నావల్ల కాలేదు. ఇక తమరే పూనుకుని వాళ్లకి బుద్ధి చెప్పాలి. తమరు తలుచుకుంటే ఇది ఏపాటి."

దొరగార్ని ఎలా ప్రసన్నం చేసుకోవాలో అరుళ్‌దాస్‌కి అనుభవం మీద తెలుసు. ఇప్పుడు సంపత్‌కి కోపం తగ్గి, సందేహం పీడించడం మొదలుపెట్టింది.

"అరుళ్‌దాస్, వీళ్లెందుకు ఇంత మొండిగా ప్రవర్తిస్తున్నారంటావ్?"

"బుద్ధిలేక దొరా."

"దీని వెనకాల ఎవరి ప్రోద్బలమో ఉండి ఉంటుంది," స్వగతంలా అన్నాడు సంపత్.

"లేదు దొరా, అందరూ కలిసికట్టుగా చేస్తున్నారీ పని... లేకపోతే ఈపాటికి వాళ్లల్లో వాళ్లకి దెబ్బలాటలు రేపి దీని అంతు చూడకుండా మీ దగ్గరికి పరుగెత్తుకుంటూ వస్తానా?"

"అలా అయితే మనం చేస్తున్నదే సరయిన పని అనిపిస్తుంది. ఇప్పటికి రెండు షోకాజ్ నోటీసులు ఇచ్చాంగదా. ఈరోజు గోస్లో గురించి మూడోది ఇచ్చి, ఆ మీద సస్పెన్షన్ ఆర్డరిద్దాం."

"దొర్లు కోప్పడనంటే ఒక్క మనవి," అర్థించాడు అరుళ్‌దాస్. ఈ గొడవ ఇంకా ఎక్కువై ఎస్టేటులో తక్కిన పనివాళ్లందరికీ పాకకముందే ఒక కొలిక్కి తీసుకురావడం చాలా అవసరం అని సంపత్‌కి తెలుసు. అందుకే తనకింద పనిచేస్తున్న కండక్టర్ సూచనలయినా వినడానికి సిద్ధంగా ఉన్నాడు.

'ఏవిటి?" కనుబొమలెగరేశాడు సంపత్. "వాళ్ల డిమాండ్స్ అన్నీ ఒప్పేసుకోమంటావా? అప్పుడు నీ పని తేలిక అయిపోతుంది."

"ఎందుకంటాను దొరా, అలా అయితే ఇన్ని ఎస్టేట్లు ఎలా నడపగలం?"

"మరేమిటి నీ అమూల్యమైన సూచన?" ఎగతాళిగా అన్నాడు సంపత్.

"మూడో షోకాజ్ నోటీస్ ఇచ్చే ముందు దొరగారు ప్రూనింగ్ ఫీల్డ్‌కి వచ్చి పనివాళ్లతో స్వయంగా మాట్లాడితే వాళ్లకి బుద్ధి రావచ్చని నాకనిపిస్తోంది."

"ఏం, నేనే మాట్లాడాలా? నువ్వు మాట్లాడేవు, అసిస్టెంట్ మేనేజర్ మాట్లాడాడు. మీరందరూ నా తరపున నా మాటే కదా చెప్పింది," అన్నాడు సంపత్.

"మాట ఒకటే అయినా, మాట్లాడిన వారి అంతస్తులు వేరే కదా దొరా? శంఖంలో పోస్తే కాని తీర్థం కాదుగదా!"

"ఇంతవరకూ వచ్చాక నా మాట వింటారంటావా?" వినరన్న సందేహం, వినవచ్చేమోనన్న ఆశ సంపత్‌లో పెనుగులాడుతున్నాయి.

"వినకపోతే వాళ్ల ఖర్మ. ఫలితం అనుభవిస్తారు," అన్నాడు అరుళ్‌దాస్.

అది తను వెళ్లి సరిచేయగలిగినంత తేలిక పని కాదని సంపత్‌కి తెలుసు. పని జనం, తనూ సమస్యని తెగేవరకూ లాగారు. ఇద్దర్లో ఏ ఒక్కరో వెనుకంజ వేయకుండా అది తేలే పరిస్థితిలో లేదు. అయినా ప్రయత్నించాలి.

"సరే, నాలుగ్గంటలకి నేనే ప్రూనింగ్ ఫీల్డుకి వస్తాను. నువ్వు అక్కడే ఉండు," అని వెంటనే మళ్లీ, "వాళ్లకి లొంగిపోవడానికి కాదు సుమా నేను వచ్చేది, బుద్ధి చెప్పడానికి."

"నాకు తెలియదా దొరా!" అన్నాడు అరుళ్‌దాస్.

"ముందు నువ్వు ఆఫీసుకి వెళ్లి, సూపరెంటెండెంట్‌కి మూడో షోకాజ్ నోటీస్ తయారుచేసి పెట్టమని చెప్పు. ఎన్ని చెట్లు నరికేరో మనకి సాయంత్రానికి తెలుస్తుంది కదా. అప్పుడు నోటీసులో ఇరికించవచ్చు. నేను ఫీల్డుకి వచ్చేముందు పనివాళ్లతో నువ్వు మళ్లీ మాట్లాడి చూడు. మూడో గోస్లో నోటీసు రేప్పొద్దున్న వస్తున్నదనీ, దాని తరువాత సస్పెన్షన్లూ, డిస్మిసులూ తప్పవనీ కూడా చెప్పి బాగా జడిపించు," అన్నాడు సంపత్.

ఇంకొకసారి సలాం చెప్పి అరుళ్‌దాస్ వెళ్లిపొయ్యాడు.

పోర్టికోలో నుంచి డ్రాయింగ్ రూమ్‌లోకి వస్తూనే, "కొంచెం ఎక్కువ టైం తీసుకున్నట్టున్నాను సారీ," అన్నాడు సంపత్ తన మిత్రుడు రాజారాంని ఉద్దేశించి.

"ఫరవాలేదు. నీ చిల్డ్ బియర్‌ని ఆస్వాదిస్తూ కూర్చున్నాన్లే," అన్నాడు రాజారాం. తన బియర్ మగ్గుని రాజారాం వైపు ఎత్తి చూపించి, మౌనంగానే ఛీర్స్ చెప్పి గటగటా తాగేశాడు సంపత్. అంతవరకు జాడలేని బెల్లా సాక్షాత్కరించినట్టు వచ్చి ఇద్దరు మిత్రుల మగ్గుల్నీ మళ్లీ బియర్‌తో నింపి మాయమయ్యాడు. తన మగ్గుని తాగడానికి ఎత్తుకుంటూ రాజారాం అన్నాడు సంపత్‌తో, "ఇప్పుడు చెప్పు, ఏవిటీ రభస?"

“ఏం పెద్ద గొడవ కాదులే,” స్నేహితుడికి చెప్పడానికి సంకోచించాడు సంపత్. నవ్వుతాడేమోనని.

“ఏం లేకుండానే ఎత్తిన మగ్గు దించకుండా ఒక్క గుటకలో బియర్ ఖాళీ చేసేశావా?” నవ్వేడు రాజారాం.

“సరే, వినాలని ఉంటే చెప్తాను. భోజనానికి పిలిచి తన గోడు చెప్పుకుంటూ నన్నూదర గొట్టేశాడని మాత్రం ప్రచారం చెయ్యకు,” అన్నాడు సంపత్.

అంత త్వరగా చెప్పడానికి పూనుకున్నాడంటే సంపత్ గుండె బరువు దింపుకోడానికి తహ తహలాడుతున్నాడని రాజారాం గ్రహించి, “సరే కానియ్యి,” అన్నాడు.

“ప్రూనింగ్ ఫీల్డులో గొడవ,” అన్నాడు సంపత్.

“ఏమయింది?”

“గోస్లో. ఎప్పుడూ చేసే పనిలో నాలుగోవంతే చేస్తున్నారు.”

“ఎందుకు?”

“మనం పెంచిన భారీ జీతాలు వాళ్లకి సరిపోవట.”

“ఎలా అంటారు? ఈమధ్యనే కదా అన్ని లేబర్ యూనియన్లతోనూ సమిష్టిగా జీతాల ఒప్పందం కుదుర్చుకున్నది.”

“ఆ ఒప్పందం జీతాల మట్టుకేనట. తక్కినవెన్నో ఉన్నాయంటున్నారు.”

“ఇంకేమిటి?”

“మీ ఎస్టేటు పనివాళ్లు అమాయకుల్లా ఉన్నారు. ఇంకే గొడవా లేవతీయనట్టుంది. మా వాళ్లు చాలా గడుసు. అవ్వా కావాలి, బువ్వా కావాలి వాళ్లకి.”

“నువ్వు చాలా కోపంగా ఉన్నట్టున్నావు. ఏం జరిగిందో కాస్త విడమర్చి నాకు అర్థమయ్యేలా చెప్పు. మా ఎస్టేట్ దాకా అది పాకకుండా కాపాడుకోవాలి,” అన్నాడు రాజారాం.

“మీ ఎస్టేటులో ఇంకా ప్రూనింగ్ పని మొదలుపెట్టలేదా?”

“ఇంకా వారం పదిరోజుల టైం ఉంది గదా దానికి.”

సంపత్కిది తెలియంది కాదు. సాధారణంగా వేసవికాలం చివరలో పడే వర్షపుజల్లులు అయిదారంగుళాల మేరకు చేరుకోగానే టీ ఎస్టేట్లలో ప్రూనింగ్ పని మొదలుపెడతారు. అప్పుడు టీ చెట్లు మెత్తబడి కొమ్మలు నరకడానికి అనువుగా ఉంటాయి. అయితే ఆ వర్షాలింకా రాలేదు. అంచేత ఈ పనికి ఇంకా టైం ఉంది.

“అది నిజమే కాని, కావాలనే ఈ ఏడాది ఒక చిన్న ఫీల్డులో ప్రూనింగ్ పని ఒక వారం ముందే ప్రారంభించాను,” అన్నాడు సంపత్.

“ఎందుకు?”

“ఈ వారంరోజుల్లో పనివాళ్లకి ఒక మంచి గుణపాఠం నేర్పించేస్తే భారీ పనులు మొదలు పెట్టేటప్పటికి జీతాల పెంపకంలో గెలిచిన మిడిసిపాటు దిగి ఎప్పటిలాగా అణకువగా పని చేస్తారని,” అన్నాడు సంపత్.

“ఏం పాఠం?”

“హక్కులంటూ మనల్ని దోచుకుని వాళ్లు విర్రవీగుతుంటే చూస్తూ చేతకాని దద్దమ్మలాగ మనం చేతులు ముడుచుకుని కూర్చేబోమని తెలియజెప్పడం,” ఒక్కొక్క మాట నొక్కి నొక్కి చెప్పాడు సంపత్.

"ఎలా చెప్పదల్చుకున్నావ్?" కుతూహలంగా అడిగాడు రాజారాం.

"ప్రస్తుతానికి ప్రూనింగ్ పనివాళ్లకి ఏటా ఇచ్చే సామికుంబుడు బక్షీష్‌ని కట్ చేసేశాను."

"అంచేత పనివాళ్లు గోస్లోకి పూనుకున్నారా?"

"అవును."

"ఇంత చిన్న ఖర్చుని ఆదా చెయ్యడానికి అంత పెద్ద సమస్య నెత్తినేసుకోవాలా?" అన్నాడు రాజారాం.

"ఖర్చు కాదు ఇక్కడ ముఖ్యం. బక్షీషుల మీద వాళ్లకి హక్కులేదని నిరూపించాలి. మొన్న కుదుర్చుకున్న జీతాల ఒప్పందంలో దీని ప్రస్తావన లేదు. ఒప్పందంలో లేని ఖర్చు మనం పెట్టనక్క ర్లేదు. అది వాళ్లకి బాగా తెలిసేలా చెయ్యాలి."

ఆ తరువాత వాళ్ల మధ్య సంభాషణ సాగలేదు.

"ఇంకొక బియర్ తెమ్మంటావా?" అని అడిగాడు సంపత్.

"ఒద్దులే, భోజనానికి లేద్దాం," అన్నాడు రాజారాం.

*

సామికుంబుడు అంటే దేవుడి పూజ. తమిళం. అయితే తమిళ పనివాళ్లు మాత్రమే చేసుకునే పూజ కాదు. మలయాళీలు, కన్నడిగులు, తుళు ప్రజలు, కోయంబత్తూరు ప్రాంతాల నుంచి వచ్చిన తెలుగువాళ్లు, అందరూ సమిష్టిగా జరుపుకునే సంబరం. కులమత భేదాలు లేవు. హిందువులు, ముస్లిములు, క్రిస్టియన్లు కలిసి పాల్గొంటారు. స్వంత కోరికలు ఫలించాలనో, కష్టాలు అధిగ మించాలనో చేసేది కాదు. ఎస్టేటు శ్రేయస్సు కాంక్షించి ప్రూనింగ్ పని సంతృప్తికరంగా పూర్తి అవ్వాలని ఆశిస్తూ ప్రూనింగ్ గ్యాంగులు చేసుకునే పూజ.

ప్రతి ఇరవై అయిదు, ముప్ఫై ఎకరాల ప్రూనింగ్ ఫీల్డుకీ ఎకరానికి ఒక మనిషి చొప్పున ప్రూనింగ్ గ్యాంగులు ఏర్పాటవుతాయి. అన్నీ ఒకే రోజున పని మొదలుపెట్టడం కుదరకపోవచ్చు. రెండు మూడు రోజుల తేడాలో ప్రారంభించినా ప్రూనింగ్ పనికీ, సామికుంబుడుకీ తిథి, వార నక్షత్రాలు అంటవు. ఏ రోజు ఏ గ్యాంగు పని మొదలుపెడితే ఆరోజే దానికి సుముహూర్తం. సామికుంబుడు సంబరం.

టీ ఎస్టేట్లలో ఏటా చేసే అతి ముఖ్యమైన పని ఎస్టేట్ విస్తీర్ణంలో నాలుగో వంతో, అయిదో వంతో భాగాన్ని ప్రూనింగ్ చెయ్యడం. టీ చెట్లు ఇరవై అయిదు, ముప్ఫై అడుగుల ఎత్తు వరకూ ఎదగగలవు. కాని, ఎస్టేట్లలో వాటిని మూడున్నర అడుగులకు మించి పెరగనివ్వరు. దానికి రెండు కారణాలున్నాయి. మొదటిది- భూమి మీద నుంచుని పనిచేసే మనుషులు తెంపడానికి టీ ఆకులు అందుబాటులో ఉండాలి. రెండు- ముదిరిపోయిన ఆకులు టీ తయారీకి పనికిరావు. నవనవలాడే రెండు ఆకులు, ఒక మొగ్గా అయితే ఉత్తమం. మూడాకుల వరకూ మొగ్గ లేక పోయినా ఫరవాలేదు. పనికి వస్తాయి. ఇటువంటి ముడిసరుకు సమకూరాలంటే, చెట్లని ప్రతి నాలుగూ, కాకపోతే అయిదేళ్ల కొకసారి సుమారు రెండు అడుగులు లేదా రెండు అడుగుల నాలుగు అంగుళాల ఎత్తుకి కుదించి నరకవలసి ఉంటుంది. దానినే ప్రూనింగ్ అంటారు.

వచ్చే నాలుగైదేళ్ల పంటా ఇప్పుడు చేసిన ప్రూనింగ్ నైపుణ్యం మీదే చాలామటుకు ఆధారపడి ఉంటుంది. ప్రూనింగ్‌లో ఏదైనా పొరపాటు దొర్లితే దాని ఫలితం మళ్లీ నాలుగైదేళ్లకి చేసే ప్రూనింగ్ పని వరకూ అనుభవించాలి. అందుకే దీనికంత ప్రత్యేకత. ప్రూనింగ్ పని ఏడాదికి సుమారు ముప్ఫై రోజులే అయినా, దాంట్లో నిష్ణాతులైన వారికి ఎస్టేటులో పెద్ద పీట. వాళ్లకి జీతాలు, ప్రత్యేక

సదుపాయాలు ఉంటాయి. ప్రూనింగ్ పనిలేని సమయంలో వీళ్లు తక్కినవాళ్ల లాగే పనిచెయ్యాలి. కాని ప్రూనింగ్ టైమ్‌లో మాత్రం రోజుకు ఎనిమిది గంటలు పని చెయ్యనక్కరలేదు. మస్టర్‌కి పోనక్కరలేదు. తిన్నగా ప్రూనింగ్ ఫీల్డుకే వెళ్లి, నిర్దేశించిన చెట్లు నరికి ఇంటికి పోవచ్చు. సాధారణంగా పొద్దు పొడవడంతోటే ప్రూనింగ్ పనిలోకి పోయి, పదిగంటల లోపున పని పూర్తిచేసేసి ఇంటికి వెళ్లిపోతారు. వాళ్ల పనితీరు మీద కండక్టరు నిఘా చాలా తక్కువ. తప్పులు చెయ్యరన్న ధీమా. ఎప్పుడైనా పొరపాట్లు దొర్లినట్లు కండక్టరు కనిపెడితే అది చిన్నతనంగా భావిస్తారు. పని పూర్తిచేసి ప్రూనింగ్ గాంగంతా అప్పటికి ఇంటికి పోయినా తిరిగి వచ్చి దాన్ని సరిచేసి వెళ్లిపోతారు.

ఈ ముఖ్యమైన పని సజావుగా జరగాలనే సామికుంబుడు చేస్తారు. అది చెయ్యకుండా పనిముట్లు ముట్టరు. ఈ పూజ కయ్యే ఖర్చు మేనేజ్‌మెంట్ సంతోషంగా బక్షీష్ రూపంగా భరిస్తుంది. రెండు వందల నుంచి మూడు వందల వరకూ, సుమారు మనిషికి పది రూపాయలు. వెనుకటి కాలంలో ఇంకా తక్కువ ఉండేది. జీతాలు పెరిగే కొద్దీ, ఈ బక్షీస్ మొత్తం కూడా పెరగడం మొదలుపెట్టింది. పనివాళ్ల జీతాలు ఇప్పుడు బాగా పెరగడంతో ఈ పదిరూపాయల బక్షీష్ లెక్కలోకి రాదనే చెప్పాలి.

అయినా దాని ప్రత్యేకత దానిదే. పూజ జరగవలసిందే. దానికి కండక్టరుతో పాటు అసిస్టెంటు మేనేజరు కూడా తప్పకుండా హాజరవ్వాలి. ప్రూనింగ్ ఫీల్డులో ఒక చెట్టు కింద సమావేశం. రెండు దీపపు సెమ్మెలు, వాటిలో చమురు పోసి నాలుగు ఒత్తులతో ఆరాధన. ప్రార్థనా గీతాలు కానీ భజనలు కానీ ఉండవు. ఒక పండిన పుచ్చకాయ తీసుకొస్తారు. దాని మీద విప్పి పరిచిన ఎర్రటి కుంకుమ పొట్లం, కత్తితో పుచ్చకాయని అసిస్టెంట్ మేనేజరు ఒక్క వేటులో రెండు చెక్కలు చెయ్యాలి. ఆ వేటుకి పుచ్చకాయ నుంచి చిందే నీరు కుంకుమతో కలిసి ఎర్రగా పైకి ఎగజిమ్మాలి. అది శుభసూచన. ప్రతి అసిస్టెంటు మేనేజరూ పుచ్చకాయని ఒక్క వేటులో చెక్కలు చెయ్య లేడేమోనన్న అనుమానం కూడా కద్దు. అప్పుడు గాంగ్‌లో రాటుతేలిన ఏ ఒక్కడో అలవోకగా అసిస్టెంట్ మేనేజర్ చేతికి ఆసరా ఇచ్చి పని జరిపిస్తాడు. అప్పుడు చప్పట్లు. తరువాత ప్రసాదం పంచిపెట్టడం. కొబ్బరిముక్కలూ, అరటిపళ్లూ, బిస్కట్లూ, వేయించిన వేరుశనగ పప్పులు, చివరన టీ. పెద్ద అట్టహాసంతో ప్రూనింగ్ మొదలు.

ఈ సంవత్సరం సామికుంబుడికి మేనేజ్‌మెంట్ బక్షీష్ ఇవ్వడం ఆపెయ్యడంతో ప్రూనింగ్ ఉత్సాహం నీరుకారిపోయింది. పనివాళ్లు నిరసనగా గోస్లో మొదలుపెట్టారు. జరిమానాగా కంపెనీ ప్రూనింగ్ గాంగ్‌కి కల్పించే సదుపాయాల్ని నిలిపివేసింది. ఇప్పుడు ప్రూనింగ్ గాంగ్ కూడా తక్కిన పనివాళ్లలాగే పొద్దున్న ఎనిమిది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకూ పని చెయ్యాలి. ఎంత సంకటంగా ఉన్నా ప్రూనింగ్ గాంగ్ దానికి తల ఒగ్గారు. కాని నాలుగ్గంటల్లో ముగించగలిగిన పనిని ఎనిమిది గంటల్లో కూడా చెయ్యకపోగా దాంట్లో నాలుగో వంతు మాత్రమే చేస్తున్నారు. ఎస్టేటు కండక్టర్‌కి ఏమి చెయ్యడానికీ పాలుపోలేదు. సామికుంబుడు బక్షీష్ రెండు వందలూ తన జేబులో నుంచి తీసి ఇచ్చి గోస్లో మాన్పించడానికి సిద్ధంగా ఉన్నాడు. ఆ ఖర్చును ఎస్టేటు జమలో ఎలా సర్దుబాటు చేసుకోవాలో తనకి కొట్టిన పిండి. కాని మేనేజర్ సంపత్‌కి తెలిసినప్పుడు ఎదురయ్యే ప్రళయానికి జడిసి అలా చెయ్యలేదు. పైగా, పనివాళ్లు కూడా కండక్టరు నుంచి ఈ బక్షీష్ తీసుకోవడానికి సుముఖంగా లేరు. కంపెనీయే ఇవ్వాలని పట్టు.

దీనికొక నేపథ్యం ఉంది.

అన్ని ధరలూ విపరీతంగా పెరిగిపోయి బతకడం దుర్లభం అవుతోంది. గనుక పనివాళ్ల జీతాలు తక్షణమే పెంచాలని లేబర్ యూనియన్లు మేనేజ్‌మెంట్ మీద రెండు నెలలుగా భారీ ఒత్తిడి తీసుకువచ్చాయి. ఎస్టేట్లు నడపడం ఎంతో క్లిష్టంగా తయారయ్యి వాటిని మూసేసే పరిస్థితి వచ్చినా, పనివాళ్ల సంక్షేమం దృష్టిలో పెట్టుకుని ఎలాగో నెట్టుకొస్తున్నామనీ, ఈ పరిస్థితుల్లో జీతాల పెంపకానికి ఏమాత్రం అవకాశం లేదనీ మేనేజ్‌మెంట్ల జవాబు.

కొన్ని నిరసన వ్రతాలు, గోస్లోలు, సమ్మెల అనంతరం ఇరుపక్షాల మధ్యా సంప్రదింపులు లేకుండా సమస్య తేలదని తేటతెల్లమైపోయింది.

ఆ కారణంగా లేబర్ యూనియన్లు, మేనేజ్‌మెంట్ల మధ్య ఒక సమావేశం ఏర్పాటైంది. నీలగిరి, ఆనమలై, షెవరాయ్స్, హైవేవీస్, సింగంపట్టి ఎస్టేట్లకి సుమారు సమదూరంలో ఉండేలా కోయంబత్తూరు కమ్యూనిటీ హాల్లో, చిన్నా పెద్దా లేబర్ యూనియన్లకి ఒకటీ రెండు చొప్పున లీడర్ ప్రతినిధులు పదిమంది, వారికి సహాయం అందిస్తూ వెనక కుర్చీల్లో సూచనలివ్వడానికి ఇరవయ్యో ఇరవై అయిదుగురో చిల్లర లీడర్లు. వీళ్లతో తలపడ్డానికి ఎస్టేట్ మేనేజ్‌మెంట్ల నుంచి తమిళనాడు ప్లాంటర్స్ అసోసియేషన్ ఎన్నుకున్న ఐదుగురు హేమాహేమీలు. అందులో సంపత్ ఒకడు.

ప్రారంభంలోనే సంపత్ ముఖ్యమైన అభ్యంతరం లేవదీశాడు. "పోయిన జీతాల పెంపకం ఒప్పందం కుదుర్చుకుని మూడేళ్లే అయింది. దాని గడువు అయిదేళ్లు. అంటే, ఇంకా రెండేళ్ల వరకూ యూనియన్లు ఈ మాటెత్తడానికి వీల్లేదు," అన్నాడు.

"అదే మేనేజ్‌మెంట్ నిర్ణయం అయితే ఈ సమావేశాలు ఎందుకు పెట్టినట్టు? టైమూ, డబ్బు దండగ చేయడానికి కాకపోతే. మేం లేచి వెళ్లిపోతాం," అని కుర్చీల్లోంచి లేచి పోబోయారు అ యూనియన్ లీడర్లు. మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్, మరికొంతమంది మెంబర్లు కలగజేసుకుని లేబర్ యూనియన్లని సమాధారపరచడానికి ప్రయత్నించారు. వేరేగా చర్చించుకోవడానికి తమకి పది నిమిషాలు టైం అడిగి మేనేజ్‌మెంట్ కమిటీ పక్కనున్న గదిలోకి మారింది. సంపత్ ధోరణిలో మార్పులేదు. అతని వాదనతో పూర్తిగా ఏకీభవిస్తున్నప్పటికీ, ఇప్పటి పరిణామాల దృష్ట్యా కొంత ఇచ్చిపుచ్చుకోవడాలు తప్పనిసరి అని తక్కిన మెంబర్లు సూచించారు. దానికి సంపత్ సుతరామూ ఒప్పుకోలేదు. చేసేదిలేక నాలుగూ ఒకటి మెజారిటీతో జీతాల పెంపకం గరించి లేబర్ యూనియన్ల తో మంతనాలు జరపడానికి మేనేజ్‌మెంట్ కమిటీ సిద్ధపడింది. ఎంత తక్కువ ఇవ్వగలిగితే అంత మంచిది.

లేబర్ యూనియన్ల ఆశలు ఇంకా ఆకాశాన్నంటే ఉన్నాయి. ఏమాత్రం పెంచలేమన్న స్థాయి నుంచి ఏదో కొంత ఇవ్వవలసిన అవసరం ఉందని మేనేజ్‌మెంట్ ఒప్పుకుంది. అయితే, పని వాళ్లు అడుగుతున్న దాంట్లో నాలుగోవంతు కంటే ఎక్కువ ఇవ్వడం కుదరదన్నారు. ఒక్క పైసా కూడా తగ్గించలేమని లేబర్ యూనియన్లు మంకుపట్టు పట్టాయి. మధ్యాహ్నం భోజనాల వేళ వరకూ ఇరుపక్షాలు ఒకళ్లనొకళ్లు మింగేసేలా చూసుకున్నప్పటికీ భోజనాల దగ్గర కలుసుకున్నప్పుడు ఎంతో సామరస్యం. తర్వాత మళ్లీ పోరాటం ఆరంభం. అలా మూడు రోజులు గడిచిపోయాయి. ఎంత మంచి హోటళ్లలో బస చేస్తున్నా, ఎంత రుచికరమైన భోజనాలు చేస్తున్నా, చాలామందికి అప్పటికే ఇంటి మీద ధ్యాస మళ్లింది. ఏదో విధంగా పనికానిచ్చి ఊళ్లకి వెళ్లిపోవడానికి ఆతృతగా ఉన్నారు.

మెజారిటీ కమిటీ మెంబర్ల సహకారంతో మేనేజ్‌మెంట్ కమిటీ ఛైర్మన్ ఒక ప్రతిపాదన చేశాడు. "మీరడుగుతున్న దానికీ, మేమిస్తామన్న దానికీ పొత్తులేదు. మీరు సగం దిగిరండి. మేం సగం పైకి వస్తాం."

ఇటువంటి అదును కోసమే నిరీక్షిస్తున్నట్టు వెంటనే అన్ని యూనియన్ వాళ్లు ఆమోదంతో చప్పట్లు చరిచారు. నిమిషాల్లో ఒప్పందం కుదిరిపోయింది.

తమిళనాడులో ఉండే అన్ని ఎస్టేట్లలాగే సంపత్ ఎస్టేటు కూడా దీనికి కట్టుబడి పనివాళ్ల జీతాలు పెంచక తప్పలేదు.

అప్పుడే సంపత్ ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఇప్పుడు పనివాళ్లూ, మేనేజ్‌మెంటూ సమ ఉజ్జీ. మేనేజ్‌మెంట్‌ని బెదిరించి పనివాళ్లు బలవంతంగా ఎంత గుంజుకోగలిగితే అంత గుంజుకుంటున్నారు. అందుచేత మేనేజ్‌మెంట్ కూడా ప్రతి విషయంలోనూ రూలు ప్రకారమే పోవాలి. ఒప్పందాల్లో లేని సదుపాయాలు ఇవ్వనక్కర్లేదు. ఇంతకుముందు ఇస్తుంటే అవి నిలిపివెయ్యాలి.

ఇప్పటివరకూ పనివాళ్లు చేసే ఎన్నో అవకతవకల్ని మేనేజ్‌మెంట్ చూసీ చూడనట్టు ఊరుకునేది. సెలవులకు ఇంటికి పోయిన పనివాళ్లు తిరిగి రావలసిన టైముకి రాకపోతే రూలు ప్రకారం వాళ్లని పనిలోంచి తీసేయవచ్చు. కాని చాలామటుకు వాళ్లు చెప్పే కారణాలని మన్నించడం జరిగేది. పనివాళ్లకి కల్పించవలసిన వైద్య సదుపాయాలకి పరిమితులు ఉన్నాయి. వాటిని సడలించవలసిన అవసరం లేదు. కాని కొన్ని సందర్భాల్లో మేనేజ్‌మెంట్ వాటిని సడలించేవారు. ఇది ఆపేయాలి. ఎస్టేటు పనివాళ్లకి ఇచ్చిన ఇళ్లల్లో బంధువుల్ని ఉంచుకోవడానికి వీల్లేదు. అయినా చాలామంది దగ్గర వాళ్లని ఊరి నుంచి తీసుకొచ్చి పెట్టుకోవడమే కాకుండా ఇంటి వసారాని చెక్కలతో మూసేసి దాన్ని వాళ్లకి గదిగా ఏర్పాటుచేస్తారు. ఇది పెద్ద నేరం. ఇప్పటివరకూ ఎక్కువగా పట్టించుకోలేదు. ఇక సహించకూడదు. ఎస్టేటులో కొత్తవాళ్లని పనిలోకి తీసుకునేటప్పుడు- ప్రస్తుతం పనిచేస్తున్న వాళ్ల పిల్లలందరికీ పని ఇచ్చిన తరువాత మిగిలుంటేనే బయటవాళ్లని తీసుకోవాలన్న నిర్బంధం లేదు. అయినా ఆ సౌకర్యం కల్పిస్తూనే ఉన్నారు. దీన్నీ ఆపేయాలి. క్లిష్ట సమయాల్లో పనివాళ్లకి అప్పుపెట్టి, తీరికగా వాయిదాల పద్ధతిలో తిరిగి తీసుకోవడం అనే పద్ధతి ఉంది. దాన్ని వెంటనే అరికట్టెయ్యాలి. ఇలాగే ఎన్నో.

ఈ కొత్త పద్ధతులు అమలుపర్చడంలో సంపత్‌కి తటస్థపడ్డ మొదటి అవకాశం సామి కుంబుడు బక్షీస్. జీతాల ఒప్పందం కుదిరిన వారంరోజుల్లోనే దొరికింది. ఈ ఏడాది బక్షీస్ మీద కంపెనీ ఖర్చు చెయ్యడం లేదని సంపత్ నిర్ధారణ చేసినప్పుడు ఎస్టేటు కండక్టర్ నిరుత్తరుడై పోయాడు. సామికుంబుడు లేని ప్రూనింగ్ ఎలా సాధ్యం? పనివాళ్లని ఎలా సమాధానపరచగలడు? ఇంత చిన్న ఖర్చు చెయ్యడం వల్ల కంపెనీ ఎంత పెద్ద లాభం పొందగలదో మేనేజర్‌కి సుతిమెత్తగా చెప్పాడు. బక్షీస్ నిలిపివేయడం వల్ల కలిగే అనర్థాన్ని ధైర్యం చేసి నమ్రతగా సూచించాడు. సంపత్ కొంచెం కూడా తొణకలేదు. ఈ ఖర్చు లేబర్ యూనియన్లతో మేనేజ్‌మెంట్లు కుదుర్చు కున్న జీతాల సంప్రదింపుల్లో భాగం కాదని, అందువల్ల తను ఇవ్వదలచుకోలేదని మళ్లీ తెగేసి చెప్పేశాడు. దాని ఫలితమే పనివాళ్ల గోసో రోజుకు నూరుచెట్లు నరకవలసినది ఇరవై, ఇరవై అయిదుకి పడిపోయింది. ఇటువంటి పరిణామం ఎదురవ్వొచ్చునన్న సందేహం వల్లనే సంపత్ ప్రూనింగ్ పని వారంరోజులు ముందుగానే ప్రారంభించాడు. మొదట్లో కొంత అలజడి రేగినా ఒకటి రెండ్రోజుల్లో సర్దుకుపోతుందని అతని అంచనా. అందుకే విసిరేసినట్టు దూరంగా ఉన్న ప్రూనింగ్ ఫీల్డులో పని మొదలుపెట్టాడు. అది చిన్న ఫీల్డు. తక్కిన ఎస్టేటుకి అయిదు మైళ్ల దూరంలో ఉంది. ఏ అల్లరి జరిగినా మిగతా చోట్లకు పాకడానికి కొంత టైమ్ పడుతుంది. ఈలోపున పరిస్థితి చక్కబరుచుకోవచ్చు.

కాని అనుకున్నట్లు జరగడంలేదు. మూడు రోజులుగా నడుస్తున్న గోస్లో తగ్గుముఖం పట్టక పోగా, ఉధృతమయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇక కాలయాపన పనికిరాదు. పనివాళ్లతో ముఖాముఖి తేల్చుకోడానికే పూనుకున్నాడు సంపత్.

*

సంపత్ కారుని రోడ్డు మీద ఒక పక్కగా ఆపి కొండవాలు కింద పనిచేస్తున్న ప్రూనర్ల వైపు చూశాడు. అందరూ పనిలో పూర్తిగా నిమగ్నమై ఉన్నట్లే కనిపించారు. అదే నిజమైతే నరకవలసిన చెట్లలో పాతిక భాగమే పూర్తి చెయ్యడానికి కారణం కనిపించలేదు. దగ్గరికి వెళితే తెలిసిపోతుంది. ప్రూనింగ్ ఫీల్డుని చేరుకునే ముందే పళనిసామి మేస్త్రీ ఎదురొచ్చి నమ్రతగా ఒంగి సలాం చేశాడు.

"దొర్లే చూద్దురుగాని," అని చెప్పి పళనిసామి సంపత్‌ని ఫీల్డు మధ్యలోకి దారి చూపిస్తూ తీఃసుకెళ్లాడు. ఈలోపున ఇంకొక చివర పనిచూస్తున్న అరుళ్‌దాస్ కూడా అక్కడకు చేరి సంపత్‌కి సలాం చేశాడు.

"అరుళ్‌దాస్, ప్రూనింగ్ పని బాగానే ఉన్నట్టు కనిపిస్తోంది," అన్నాడు సంపత్.

"పని బాగానే ఉంది కాని, చెయ్యవలసినన్ని చెట్లు చెయ్యడం లేదు," అన్నాడు అరుళ్‌దాస్.

"అవునా?" అని పళనిసామి మేస్త్రీని అడిగాడు సంపత్, సంగతి తెలిసి కూడా.

"ఇంకా వర్షాలు పడలేదు కదా, చెట్లని నరకడం కష్టం అవుతూంది," అన్నాడు పళనిసామి.

"సాకులు చెప్పకు. చెయ్యదలుచుకుంటే దీనికి అయిదురెట్లు చెయ్యగలరు," అని అడ్డు తగిలాడు అరుళ్‌దాస్.

"అరుళ్‌దాస్ అయ్య అలాగే మాట్లాడతాడు దొరా, మీరు న్యాయం చెప్పండి," అని పళని సామి ఒక టీ చెట్టు దగ్గర చేరి చేతిలో కత్తితో నరకడం ప్రారంభించి, ఎంత కష్టంగా ఉందో అభినయించి చూపించాడు. అది నిజం కాదని సంపత్‌కీ, అరుళ్‌దాస్‌కీ బాగా తెలుసు. వర్షాలు రాలేదన్నమాట నిజమే. అందుచేత పని కొంచెం మందకొడిగా జరగడం కూడా సబబే. దానివల్ల నాలుగోవంతో, అయిదోవంతో పనిచెయ్యడం మాత్రమే సాధ్యమవుతుందన్నమాట అబద్ధం. కావాలని తక్కువ పని చేస్తున్నారు.

"ఎందుకు మేస్త్రీ పొద్దుణ్ణుంచి సాయంకాలం దాకా ఇలా ఎండలో మగ్గడం? ఎప్పటిలాగే తొమ్మిదీ, పదీ గంటలలోపున పని పూర్తిచేసి చల్లగా ఇంట్లో కూర్చోవచ్చు గదా," అన్నాడు సంపత్.

"మాకూ అలా చేద్దామనే ఉంది దొరా, కాని పని తెమలడం లేదు. ఈ ఏడాది చెట్లు కూడా ముదిరిపోయి ఉన్నాయి. దానికితోడు వర్షాలులేవు. ఏం చెయ్యాలి?" అన్నాడు పళనిసామి.

"నువ్వు మందలించావంటే, మీ పనివాళ్లు చకచకా చేసుకుపోరా?" అన్నాడు సంపత్.

తనవల్ల కాని పని అని ఒప్పుకోవడం చిన్నతనం అనిపించినా, పరిస్థితులకి తల ఒగ్గి అన్నాడు పళనిసామి. "ఏమాత్రం వీలున్నా పని చేయించకుండా మీచేత మాట పడతానా దొరా. ఈ కష్టాలకి తోడు దేవుడికి కూడా మామీద కినుకు, సామికుంబుడు చెయ్యలేదని."

పళనిసామి నెమ్మదిగా విషయాన్ని సామికుంబుడు వలయంలోకి దింపడానికి ప్రయత్నిస్తు న్నాడని మాట తప్పించే ప్రయత్నం చేశాడు సంపత్.

"మేస్త్రీ, ఇప్పటికి మూడురోజులు పని బకాయి పెట్టారు. దాన్ని ఎప్పుడు భర్తీ చేస్తారు?" అడిగాడు.

"భర్తీ చేసినట్టే ఉంది! రోజురోజుకీ బకాయి ఎక్కువైపోవడమే కాని తరగడం ఉండదను కుంటాను," అన్నాడు పళనిసామి.

"అలా అయితే మేం తీసుకోవల్సిన చర్య ఏమిటో తెలియదా?" అన్నాడు సంపత్.

"మొదలుపెట్టారు గదా దొరా," అన్నాడు పళనిసామి మేస్త్రీ. "గోస్లో అని రెండు నోటీసులు పంపించారు. రేపోమాపో ఇంకొకటి ఇస్తారు. తరువాత తతంగం ఉండనే ఉంది."

"అన్నీ తెలిసి కూడా ఇంత మూర్ఖంగా ఎందుకు ప్రవర్తిస్తున్నారు?" రెట్టించాడు సంపత్.

"మా చేతుల్లో ఏముంది దొరా, టీ చెట్లు ఎప్పుడూ లేనంత ముదురుగా తయారయ్యాయి. వర్షాలు లేవు. పోనీ దేవుడి సాయం కోరుకుందామన్నా అది కూడా లేకుండా చేసేశారు మీరు."

"డొంకతిరుగుడు మానేసి తిన్నగా చెప్పు. సామికుంబుడుకి డబ్బులివ్వలేదని చేస్తున్న పని ఇది. అవునా కాదా?"

"రామ రామ," అన్నాడు పళనిసామి.

"మీ గోస్లో వల్ల టీ తోటకి ఎంత నష్టం వస్తుందో తెలుసుగా?"

"తోటకి నష్టం రానిస్తామా దొరా? మా కడుపులు నింపే తల్లి."

"మరిప్పుడు మీరు చేస్తున్న పనేమిటి?"

"ఏం తప్పు చేశాం దొరా. మీరే చూసి మెచ్చుకున్నారు కదా మా ప్రూనింగ్ పని. ఎందుకు కష్టపడి అంత శుభ్రంగా చేయించేననుకున్నారూ? పని చెడిపితే ముందు నాలుగయిదేళ్ల ఫలసాయం గతుక్కుమంటుందని మాకు తెలియదా? దానివల్ల నష్టపోయేది మా పనివాళ్ల బోనసులే కదా!"

"అంత తెలివైనవాడివి చెయ్యవలసిన దాంట్లో నాలుగోవంతు పనే చేయడం వల్ల కంపెనీకి వచ్చే నష్టం గురించి నీకు తెలియదా?" అరిచినంత పనిచేశాడు సంపత్.

"ఇదెంత నష్టం దొరా, దేవుడి దయ ఉంటే ఈ మూడురోజుల్లో తక్కువ చేసిన చెట్లని క్షణాల్లో భర్తీ చెయ్యలేకపోతామా?"

"నువ్వు మళ్లీ మొదటికొస్తున్నావు. సామికుంబుడుకి కంపెనీ బక్షీస్ ఇవ్వడం కుదరదు."

"మా తాతల రోజుల నుంచీ వస్తున్న ఆనవాయితీ దొరా, బక్షీస్ ఎలా అవుతుంది?"

"చూడు మేస్త్రీ, మీ తాతల రోజుల్లో మీరు మేనేజ్‌మెంట్‌తో దెబ్బలాడి జీతాలు కుదుర్చుకోలేదు. మేనేజ్‌మెంటు ఇచ్చిందాంతోటే తృప్తిపడ్డారు. అంచేత అడపాదడపా బక్షీస్ పేరిట ఏదో కొంత ముట్టజెప్పేవాళ్లం. ఇప్పుడంతా తారుమారయింది. పకడ్బందీగా రాతపూర్వకంగా తయారయిన హక్కులు. వాటిని మించి కంపెనీ ఖర్చు పెట్టనక్కరలేదు. పెట్టదు."

"ఏమో దొరా, సామికుంబుడే కాపాడాలి," అన్నాడు పళనిసామి.

"మంత్రాలకి చింతకాయలు రాలవు కానీ పని సక్రమంగా చెయ్యించు. లేకపోతే రేపు మూడో నోటీసు రావడం ఖాయం," అని చెప్పి సంపత్ ప్రూనింగ్ ఫీల్డు వదిలి తన కారు దగ్గరికి బయల్దేరాడు.

"సలాం దొరా," అని సగం భూమిదాకా వంగి వీడ్కోలు చెప్పాడు పళనిసామి. ప్రూనింగ్ ఫీల్డులో కొందరు పనివాళ్లు కూడా మేస్త్రీతో శృతి కలిపారు.

*

సంపత్ వెళ్లిన కొద్దిసేపటికి ప్రూనింగ్ గుసగుసలకి అంతరాయం కలిగింది. పైన రోడ్డుమీద సంపత్ దొర తన కారుతో పెనుగులాడుతున్నట్టనిపించింది. అందరూ అటువైపు చూశారు. రోడ్డు పక్కన తీసిపెట్టిన చిన్న కాలవలోకి దొరకారు జారి పైకి రావడానికి విఫల ప్రయత్నం చేస్తూంది. రొద చెయ్యడమే కాని కొంచెం కూడా కదలడం లేదు. అప్రయత్నంగా ప్రూనింగ్ పనివాళ్లందరూ

ఒక్కుమ్మడిగా కొండవాలు మీద నుంచి కారు దగ్గరికి పరిగెత్తారు. రొప్పుతూ ఏమయిందేమయిందని ఆత్రంగా తమలో తామే ప్రశ్నించుకోవడం మొదలుపెట్టారు.

పళనిసామి సంపత్‌ని ఉద్దేశించి సలాం కొట్టి అడిగాడు, "ఏమయింది దొరా?"

"ఈ కాలవ చూసుకోలేదు మేస్త్రీ. కారు కొంచెం దిగబడింది. పైకి రావడం లేదు," అన్నాడు సంపత్.

"మేం పైకి ఎత్తి రోడ్డు మీద పెడతాం దొరా."

మరుక్షణంలోనే పనివాళ్లు కారుని పైకి లేపి రోడ్డు మీద పెట్టారు. ఇప్పుడు సంపత్‌కి ఇంకొక ఆటంకం ఎదురైంది. కాలవలో నుంచి కారుని పైకి తీసే ప్రయత్నంలో క్లచ్చిని అదేపనిగా మరీ గట్టిగా తొక్కెయ్యడంతో అది చెడిపోయింది. కారు నడపడానికి లేదు. ఇంటికి నడిచి వెళ్లడానికి సిద్ధమయ్యాడు సంపత్.

"ఎక్కడికి దొరా?" అడిగాడు పళనిసామి.

"మేస్త్రీ, ఈ కారు ఇప్పుడు కదలదు. ఇక్కడే వదిలి రేపు మన డ్రైవర్ల నెవరినైనా లారీలో పంపుతాను. తాడు కట్టి దీన్ని లాక్కుపోవచ్చు."

"దొరా, ఇక్కడ కారు వదిలి వెళ్లడం మంచిదికాదు. ఈ రోడ్డులో జనసంచారం లేకపోయినా, గొడ్లు కాసుకునే కుర్రాళ్లు తిరుగుతారు. సరదాకి అద్దాలు పగలగొట్టడమో, టైర్లు కోసెయ్యడమో చెయ్యగలరు. కారు ఇంటికి తీసుకుపోవడమే మంచిది."

"అప్పుడే అయిదవుతూంది. మన డ్రైవర్లు ఇళ్లకి పోయి ఉంటారు. వాళ్లని వెతికి పట్టుకోవడం కష్టం."

"వాళ్లెందుకు దొరా, మేం లేమా ఇంతమందిమి. కారుని ఇంటికి తోసుకుపోతాం. మీరు లోపల కూర్చోండి."

వెంటనే పనివాళ్లందరూ రంగంలోకి దూకారు. వాళ్ల సాయం తీసుకోడానికి సంపత్ సంకోచించాడు.

"ఫరవాలేదు మేస్త్రీ ఏమీ అవదు. కారు ఇక్కడే ఉండనీ. నేను నడిచిపోతాను."

"దొరల్ని ఎలా నడిచివెళ్లనివ్వగలం. అయిదు మైళ్ల దూరం."

"మేస్త్రీ మైళ్లకి మైళ్లు ఎస్టేటులో నడవడం నాకు అలవాటే కదా. వెళతాను."

"దొరా, పని చూసుకుంటూ నడవడం, ఇలా ఈసురోమని నడుచుకుంటూ పోవడం ఒకటేనా, మీరు కార్లో కూచోండి," పళనిసామి సంపత్‌ని కారులోపలికి నెట్టినంత పనిచేశాడు.

సంపత్ కారు స్టీరింగ్ ముందు కూచుని అద్దాలు దించి పళనిసామిని పిలిచి చెప్పాడు, "రోడ్డులో బెండ్స్ వొచ్చినపుడు కొంచెం జాగ్రత్తగా తొయ్యాలి."

"సరే దొరా," అని అందరూ తొయ్యడానికి పూనుకున్నారు.

ఇరవైమంది పనివాళ్లు, వాళ్లని అదుపులో పెడుతూ అరుళ్‌దాస్, పళనిసామి.

"ఇంతమందెందుకు, నలుగురైదుగురు చాలరా?" అని కిటికీలోంచి తల బయటికి పెట్టి అరుళ్‌దాస్‌ని అడిగాడు సంపత్.

"ఏమంటావ్ మేస్త్రీ," అని పళనిసామి వైపు తిరిగి అడిగాడు అరుళ్‌దాస్.

"అయిదుమైళ్లు పైన తొయ్యాలి. అంతా కొండ ఎదురే. నలుగురైదుగురు చొప్పున మైలుకో అర్ధమైలుకో మార్పిడి అవుతూ పోవాలి. ఉండనీ," అన్నాడు పళనిసామి.

అప్పటి నుంచీ అజమాయిషీ అంతా పళనిసామిదే. అరుళ్‌దాస్ కూడా ఆదేశాలిస్తున్నాడు. కొందరు పనివాళ్లని పురమాయించి కొంచెం పెద్దసైజు రాళ్లని రోడ్డు పక్కల నుంచి ఏరి తెప్పించాడు.

పైకి తోసిన కారు వెనక్కి జారిపోకుండా చక్రాలకి అడ్డుపెట్టడానికి. ఇరవైమంది ప్రూనింగ్ పనివాళ్లని నాలుగు భాగాలు చేసి ఎవరు ఎంత దూరం తొయ్యాలో, ఎవరు సేద తీర్చుకొని మార్పిడికి తయారుగా ఉండాలో నిర్ణయించి అయిదు మైళ్లూ అవలీలగా లాగించేశాడు.

కారు పోర్టికోలో ఆగేటప్పటికి పనివాళ్లూ, పళనిసామి మేస్త్రీ తనకి ఆప్తులై పోయినట్టని పించింది సంపత్‌కి.

బట్లర్‌ని పిలిచి అందరికీ టీ, బిస్కెట్లు ఇమ్మని పురమాయించాడు. పనివాళ్లు కొండని పిండి కొట్టినంత కోలాహలంగా ఒక అరగంటసేపు గడిపారు. వెళ్లిపోతూ సలాం చెప్పడానికి వచ్చిన పళనిసామితో సంపత్ అన్నాడు.

"అందర్నీ ఇక్కడికి రమ్మను."

వెంటనే పనివాళ్లంతా గుంపుగా మేస్త్రీ వెనక నిలబడ్డారు.

సంపత్ జేబులో నుంచి రెండు వందల రూపాయలు తీసి పళనిసామి మేస్త్రీకి ఇవ్వజూపాడు.

"మేస్త్రీ మీరందరూ మజా చేసుకోండి."

"ఎందుకు దొరా వద్దు," అన్నాడు పళనిసామి.

"ఎందుకు వొద్దు. ఇంత కష్టపడ్డారు కదా!"

"మా దొర కోసం మేం చేసింది కష్టమెలా అవుతుంది?" అన్నాడు పళనిసామి.

సంపత్ మనసు కరిగిపోయింది. లాలనగా మేస్త్రీనీ, పనివాళ్లనీ డబ్బు తీసుకోవడానికి ఒప్పించాడు.

పళనిసామి, పనివాళ్లూ ముక్తకంఠంతో సలాం చెప్పి వెళ్లిపోయారు. వాళ్ల వెనకే అరుళ్‌దాస్ కూడా సలాం చేసి వెళ్లాడు.

*

మర్నాడు మధ్యాహ్నం సంపత్ ఇంటికి వచ్చేటప్పటికి అరుళ్‌దాస్ వెనక వంటగది దగ్గర తనకోసం నిరీక్షిస్తూ కనిపించాడు. ఇంట్లోకి అడుగుపెడుతూనే బట్లర్‌ని పిలిచి అరుళ్‌దాస్‌ని పోర్టికోలోకి రమ్మని చెప్పమన్నాడు.

అరుళ్‌దాస్ ఒంగి సలాం చేశాడు.

"అరుళ్, ఏమిటీ ఈవేళ అంత కులాసాగా కనిపిస్తున్నావ్?" అన్నాడు.

ఎప్పుడూ అరుళ్‌దాస్‌ని అంత చనువుగా సంపత్ పిలవలేదు.

ఎస్టేటు పనివాళ్లు ప్రత్యర్థులనుకోవడం పొరపాటు. తనకి కావలసిన మనుషులే అని నిన్న కలిగిన నమ్మకం వలన సంపత్ గుండె ఆర్ద్రమైపోయి అన్నీ సంతృప్తికరంగా కనిపించడం మొదలైంది. మేనేజర్ సంపత్‌కీ, కండక్టరు అరుళ్‌దాస్‌కీ మధ్య దూరం తాత్కాలికంగా సన్నగిల్లింది.

"నేను కాదు, మీరే తొందరపడి కులాసాగా కులుకుతున్నారు," అన్నాడు అరుళ్‌దాస్ అలవాటయిన దొరా అన్న సంబోధనను తెలియకుండానే విస్మరించి.

మాట్లాడింది అరుళ్‌దాసేనా? సంపత్ నమ్మలేకపోయాడు. ఏదో ఉపద్రవం ముంచు కొచ్చింది.

"ఏమయింది అరుళ్‌దాస్?" అనునయంగానే అడిగాడు సంపత్.

"ప్రూనింగ్ పనివాళ్లు ఈరోజు పన్నెండు గంటలవరకూ నరికిన చెట్లు సరిగ్గా పోయిన మూడు రోజులలాగా ఇరవయ్యే," అన్నాడు అరుళ్‌దాస్.

"నిన్న అంత విధేయంగా ఉన్నవాళ్లు ఏవిటి ఈరోజు ఇలా తయారయ్యారు," మనసులో అనుకుంటున్న మాటే పైకి అనేశాడు సంపత్.

తన ప్రమేయం దాంట్లో ఉన్నా లేకపోయినా, తప్పనిసరి బాధ్యతగా ఇటువంటి చేదు కబురు సంపత్‌కి చేరవేయవలసి వచ్చినప్పుడు అతను విని పేట్రేగిపోకుండా ఉండడం అరుళ్‌దాస్‌కి కొత్త అనుభవం. కొంత ధైర్యం పుంజుకుంది.

"దేవుడి చలవలేనిదే పని ముందుకి జరగదంటున్నారు," అన్నాడు.

"ఊహూఁ" అని సంపత్ ఆలోచనల్లో పడి మూగబోయాడు.

ఈ మౌనం అరుళ్‌దాస్‌ని దిగ్భ్రాంతుణ్ణి చేసింది. మూడు రోజులుగా అతి ప్రయత్నం మీద మనసులో అణిచి పెట్టుకుంటూ వస్తున్న అసహనం అదుపు తప్పి, కట్టలు తెంచుకుని పొర్లి వచ్చేసింది. సంపత్‌ని ఉద్దేశించి అన్నాడు అరుళ్‌దాస్.

"సామికుంబుడు ఇచ్చేసెయ్."

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*4 సెప్టెంబర్ 2011*

## నేపథ్యం

*సమాజకేంద్రక వర్గపోరాట కథ*

# సామికుంబుడు

***టీ ఎస్టేట్‌లో పనివాళ్లకీ, మేనేజ్‌మెంట్‌కీ మధ్య చెలరేగిన ఘర్షణ చుట్టూ అల్లిన కథ కదా అని దీన్ని వర్గపోరాట కథ అని మభ్యపెట్ట చూసినా, నేను చెప్పదలుచుకున్న ముఖ్యాంశం ఏమిటో ఇక్కడ చెప్పవలసి ఉంది.***

**2002**లో ఒక ఆదివారం పొద్దున్న. ఎప్పటిలాగే గాల్ఫ్ ఆడడానికి తయారవుతూ ఉండగా ఫోన్ మోగింది, నా స్నేహితుడు సదాశివరావు దగ్గిర నుంచి. నూరేళ్ల తెలుగు కథకి నివాళిగా 'తెలుగుకథ 1910-2000' అని అత్యుతమమైన 108 కథల్ని ఏరి విశాలాంధ్రవారు ప్రచురించారన్న వార్త. అంతవరకూ ఆ పుస్తకాన్ని నేను చూడలేదు. అందుచేత, దాంట్లో నా కథ ఏది వేశారో తెలుసుకోవాలన్న ఆత్రుత. నా కథ లేదని సదా చెప్పింది విని నిరుత్సాహపడ్డాను. 108 కథల్లో నా కథకి చోటులేదు!

అయితే, ఆ అహం నుంచి త్వరగానే కోలుకోగలిగాను. నా కథ తప్పనిసరిగా వెయ్యవలసిన అవసరం ఏముంది? తమకు నచ్చిన కథల్ని ఎంచుకునే హక్కు సంపాదకులకి ఉంది కదా. వందేళ్ల తెలుగుకథల్ని సమీక్షిస్తూ వచ్చిన ఎన్నో సంక లనాల్లో నా కథ లేకుండాపోయింది. నాకేఁవీ అనిపించలేదే! ఇప్పుడెందుకింత రభస? దానికి రెండు కారణాలున్నాయి. మొదటిది- ఈ సంకలనానికి ప్రధాన సంపాదకుడు ఆరితేరిన కేతు విశ్వనాథరెడ్డి. ఆయనకి నా కథల మీద మక్కువ అని నా అభిప్రాయం. ఆయన సంపాదకత్వంలో వచ్చిన 'తానా' కథల సంపుటిలో నా కథని కూడా చేర్చారు. ఇక రెండవది- ఇప్పటికే రెండుసార్లు నా పుస్తకం 'వేలుపిల్లై'ని ప్రచురించిన సుప్రసిద్ధ సంస్థ విశాలాంధ్రే 'తెలుగుకథ 1910-2000'ని కూడా

ప్రచురించింది. కాబట్టి, ఎందు కిలా జరిగిందో అన్న కుతూహలం అణుచుకోలేక కేతు ఇంటికి వెళ్లి అడిగాను. ఆయన చెప్పింది నాకెంతో సబబుగా తోచింది. 108 కథలూ 'సమాజకేంద్రక దృష్టిని ప్రధానంగా ఉంచుకుని కూర్చిన కథలు.' 'వైయక్తికమైన మానసిక ప్రపంచ చిత్రణ' ఉన్న కథల్ని మినహాయించడం జరిగింది. అందువల్ల నా కథల్ని ఈ సంకలనంలో చేర్చడానికి పరిశీలించలేకపోయారు.

మానసిక ప్రపంచం సమాజ కేంద్రానికి ఎందుకు భిన్నమైనదో నాకు అంతుబట్టలేదు. పోనీ, ఎవరి అభిప్రాయాలు వాళ్లవే లెమ్మని సరిపెట్టుకున్నాను. పుస్తకం ముందుమాటల్లో సారం, కేతు నాతో అన్న వాటిల్లో సూక్ష్మం గ్రహించి నేను అర్థం చేసుకున్నదేమంటే- వర్గపోరాట కథాంశాలు మాత్రమే తెలుగుకథకి ప్రామాణికంగా వారు గుర్తించారు. దానిలో తప్పేమీ నాకు కనిపించలేదు. 'రెడ్డి కథలు', 'కాపు కథలు', 'కళింగ కథలు', 'తెలంగాణ కథలు', 'దళిత కథలు' వంటి సంపుటులు ఎన్నో ఇప్పటికే వచ్చాయి. 'తెలుగులో వర్గపోరాట కథలు 1910-2000' అని ఒక సంపుటి ఎందుకు రాకూడదు? అయితే, అవి 1910-2000 మధ్యకాలంలో వచ్చిన అత్యుత్తమ తెలుగు కథలకి మచ్చుతునకలని నమ్మించబూనడం సాహసం అనక తప్పదు. 'తెలుగులో 1910 నుంచి 2000 వరకూ వచ్చిన వర్గపోరాట కథల్లో ఉత్తమమైనవని మాకు తోచినది,' అని వేసి ఉండాల్సింది. 'తెలుగుకథ 1910-2000' అని కాదు. ముందుమాటలో చెప్పినట్టు, 'ముందు సంకలనాల్లో వచ్చిన కథల్ని మినహాయించి,' అన్న ఉపశీర్షిక కూడా పెడితే సంకలనానికి మరింత నిండుదనం, నిజాయితీ చేకూరేవి అనిపించింది.

ఈ తికమక నుంచి బయటపడడానికి నాకొక మార్గం తోచింది. నేను కూడా వర్గపోరాట కథ నొకదాన్ని రాసి ఇటువంటి సుప్రసిద్ధ సంపాదకుల దృష్టిలో పడకూడదా అని. అలా పుట్టిందే 'సామికుంబుడు' కథ. ఈ ప్రయత్నం కొంతవరకూ ఫలించిందనే చెప్పాలి. ఎందుకంటే! పై సంపాదకుల కోవకే చెందినవాడని నేననుకుంటున్న మధురాంతకం నరేంద్ర తన 'కథావార్షిక- 2011'లో 'సామికుంబుడు' కథని చేర్చారు.

టీ ఎస్టేట్‌లో పనివాళ్లకీ, మేనేజ్‌మెంట్‌కీ మధ్య చెలరేగిన ఘర్షణ చుట్టూ అల్లిన కథ కదా అని దీన్ని వర్గపోరాట కథ అని మభ్యపెట్ట చూపినా, నేను చెప్పదలుచుకున్న ముఖ్యాంశం ఏమిటో ఇక్కడ చెప్పవలసి ఉంది.

కండక్టర్ అరుళ్‌దాస్ ఉద్యోగరీత్యా తప్పనిసరిగా మేనేజ్‌మెంట్ తొత్తు. మనసు ఎంత వ్యతిరేకించినా ఎదురుచెప్పగల ఆలోచన కలలోకి కూడా రానివ్వలేని నిస్సహాయత. అటువంటి దశ నుంచి, పరిస్థితుల ప్రకంపనల వల్ల అంచెలంచెలుగా ధీరోదాత్తుడుగా ఎదిగి, చండశాసనుడని భయపడిన మేనేజర్‌కి ఏది తప్పో, ఏది కాదో చెప్పగలిగిన ధైర్యాన్ని పుంజుకున్నాడు.

ఇది సమాజకేంద్రక దృష్టిలోకి వస్తుందా?

*9 డిసెంబర్ 2013*

*'సామికుంబుడు' కథానేపథ్యం ఈ సంకలనం కోసం ప్రత్యేకంగా రాసినది.*

# కథానేపథ్యం-1లోని కథలు, నేపథ్యాలు


| | | | |
|---|---|---|---|
| 1. | **సతి** | ... | అబ్బూరి ఛాయాదేవి |
| 2. | **చీకటి** | ... | అల్లం శేషగిరిరావు |
| 3. | **ముసల్దాని ముల్లె** | ... | ఆడెపు లక్ష్మీపతి |
| 4. | **అమృతుడు** | ... | ఆర్.యస్. సుదర్శనం |
| 5. | **జీవధార** | ... | కాళీపట్నం రామారావు |
| 6. | **నమ్ముకున్న నేల** | ... | కేతు విశ్వనాథరెడ్డి |
| 7. | **కాలేరా** | ... | కొలకలూరి ఇనాక్ |
| 8. | **డైనింగ్ టేబుల్** | ... | డి. వెంకట్రామయ్య |
| 9. | **నిప్పురవ్వలు** | ... | నవీన్ |
| 10. | **పెళ్లి ప్రయాణం** | ... | పి. సత్యవతి |
| 11. | **గూడు కోసం గువ్వలు** | ... | పులికంటి కృష్ణారెడ్డి |
| 12. | **ఏస్ రన్నర్** | ... | పెద్దిభొట్ల సుబ్బరామయ్య |
| 13. | **ముంగిస కథ** | ... | బలివాడ కాంతారావు |
| 14. | **మెరుగు** | ... | బి.యస్. రాములు |
| 15. | **డబ్బు** | ... | బీనాదేవి |
| 16. | **చీమలు** | ... | బోయ జంగయ్య |
| 17. | **సర్కస్ డేరా** | ... | మధురాంతకం రాజారాం |
| 18. | **వారాల పిల్లాడు** | ... | మునిపల్లె రాజు |
| 19. | **రానున్న శిశిరం** | ... | వల్లంపాటి వెంకటసుబ్బయ్య |
| 20. | **కలిసి బతకటం** | ... | వి. రాజారామమోహన రావు |
| 21. | **స్పర్శ** | ... | వివినమూర్తి |
| 22. | **అస్థిపంజరం** | ... | శీలా వీర్రాజు |
| 23. | **మంచుపల్లకి** | ... | శ్రీపతి |
| 24. | **ధనలక్ష్మి** | ... | శ్రీరమణ |
| 25. | **అడుసు** | ... | సింగమనేని నారాయణ |

# KATHA NEPATHYAM

## VOLUME - 2



అజయ్‌ప్రసాద్
అట్టాడ అప్పల్నాయుడు
అల్లం రాజయ్య
ఆరి సీతారామయ్య
ఆర్. వసుంధరాదేవి
ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు
ఓల్గా
కన్నెగంటి చంద్ర
కాట్రగడ్డ దయానంద్
కాలువ మల్లయ్య
కుప్పిలి పద్మ
కె. వరలక్ష్మి
గీతాంజలి
గొరుసు జగదీశ్వరరెడ్డి
గంటేడ గౌరునాయుడు
చిలుకూరి దేవపుత్ర
చంద్రలత
చంద్రశేఖర ఆజాద్
తుమ్మేటి రఘోత్తమరెడ్డి
తోలేటి జగన్మోహనరావు
దాసరి అమరేంద్ర
పాపినేని శివశంకర్
పెద్దింటి అశోక్‌కుమార్
బమ్మిడి జగదీశ్వరరావు
మధురాంతకం నరేంద్ర
మహమ్మద్ ఖదీర్‌బాబు
మహేంద్ర
డా॥ వి. చంద్రశేఖరరావు
డా॥ వి.ఆర్. రాసాని
వేలూరి వేంకటేశ్వరరావు
రమణజీవి
సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి
స్వామి
సి. రామచంద్రరావు

₹350 $25

TANA PUBLICATIONS